
Sree Sai Satcharita

(TELUGU)

OVI TO OVI

The Life & Teachings of Shirdi Sai Baba





HEMADPANT
(Govind R. Dabholkar – Annasaheb)
(The Author of the original Sree Sai Satcharita in Marathi)

He, by Baba's grace, had the privilege to compose, in Marathi, Sree Sai Samartha Satcharita, a Gita for Sai devotees



Shri Sai Satcharitra Telugu

(Ovi to Ovi)

Translated by

Miss M. Mani (M.A.L.L.M.)

Sadguru Shri Saibaba Mandir

Kishanbagh, Hyderabad - 64

(Adapted from the Original Marathi Book of
Late : Govind Raghunath Dhabholkar Alias 'Hemadpant')

Publisher
Shri. Jayant M. Sasane
Chairman

Shri Sai Baba Sansthan Trust, Shirdi
Post - Shirdi - 423 109
Talika - Rahata
Dist. Ahmednagar (M.S.)

web site : URL:http//w.w.w.shrisaibabasansthan.org

First Edition : 2005

5,000 copies

Price Rs. 70-00

Printed by
Cherry Offset Printing and
Packaging Ind. Pvt. Ltd.
A-75, Chincholi, MIDC,
Tq. : Mohol, Dist. Solapur - 413255

Copyrights reserved with the Shri Sai Baba Sansthan Trust, Shirdi.

This Book is available for sale at the following places

1) Shri. Saibaba Sansthan Trust, Shirdi
P.O. Shirdi, Dist. - Ahmednagar

2) Shri. Saibaba Sansthan Trust, Shirdi
"Sai Niketan" 804-B, Dr. Ambedkar Road,
Dadar, Mumbai - 400 014

A brief about the translator

Ms.Mani Amma is aged around 78 years, and she has first visited Shirdi in the year 1940 and has been visiting Shirdi regularly since then. Her longest stay in Shirdi was from 1973 to 1978 and during this time she has spent her time by serving Baba in the Samadhi Mandir, Dwaraka Mai, Gurusthan and Chavadi. She used to stay where ever possible, if she did not find place, she used to sleep near the Gurusthan. During her stay she started doing the parayan of Satcharitra and was complety fell in love with the Satcharitra and was impressed so much that she thought, if the Devotees in Telugu could enjoy the beauty of Satcharitra and then started translating the Satcharitra by learning Marathi and also taking help from the various devotees who used to visit Shirdi or reside in Shirdi. She could able to complete about 9 Chapters in Shirdi and then she came back to Hyderabad and completed another 20 chapters by 1983. Then she got immersed in constructing a Babas temple at Kishan Bagh, and completely forgot the translation work. Then the editors of Sai Vani a monthy Magazine came to her and requested her to contribute some articles to the Magazine and a thought arose in Mani Amma, why not publish the Satcharitra in the Magazine, so the publication of the Satcharitra in the Magazine started and then she started to complete the remaining chapters and the translation work was completed in 1991. She then published the book and it was a huge sell out, and then 2 more editions have been printed, The Sansthan took up the publication work in 2005. We are thankful to Sai Baba who inspired Ms.Mani Amma to translate the work in Telugu.

OM SAI SRI SAI JAI JAI SAI

ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మ విద్యా సంప్రదాయ కర్తృభ్యో వంశ ఋషిభ్యో మహద్భ్యో నమో గురుభ్యః
ఓం నమో గురుభ్యో గురుపాదు కాభ్యో, ఓం నమః పరేభ్య పరపాదుకాభ్యో:!!



ఆచార్య సిద్దేశ్వర పాదుకాభ్యో, నమోనమః శ్రీ గురుపాదుకాభ్యః!!
కామాది సర్పవ్రజగారుడాభ్యాం, వివేక వైరాగ్యనిధి ప్రదాభ్యాం!!
బోధ ప్రదాభ్యాం ధృతమోక్షదాభ్యాం! నమోనమః శ్రీ గురుపాదుకాభ్యాం!!
అనంత సంసార సముద్రతార నౌకాయితాభ్యాం స్థిరభక్తిదాభ్యాం!!
జాడ్యాబ్ధి సంశోషణవాడవాభ్యాం! నమో నమః శ్రీ గురుపాదుకాభ్యాం!!



యంబ్రహ్మా వరుణేంద్ర రుద్ర మరుతస్తున్వన్తి దివ్యైస్తవై! వేదైసాంగ పద క్రమోప నిషదై ర్గాయంతియం స్సామగాః!!
ధ్యానావస్థిత తద్గతేనమనసా, పశ్యంతి యం యోగినో! యస్యాంతం నవిదుః సురాసురగణా దేవాయ తస్మైనమః!!
పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం! ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే!!

ధర్మ సంస్థాపన కొరకు, మరియు తాపత్రయాలతో తపించుకుని పోతున్న మానవాళినుద్దరించటానికి, నిర్గుణ నిరాకార పరబ్రహ్మ మరల మరో మానవ రూపంలో శిరిడీ క్షేత్రంలో అవతరించారు. ఆ సగుణసాకార మూర్తియే శ్రీ సాయిబాబ. వారు పార్థివ శరీరంతో నుండగా అసంఖ్యాకమైన, అద్భుతమైన, అమరలీలా విలాసాలను ప్రదర్శించారు. భక్తులు బాబాలో అమోఘం, అగ్రాహ్యం, అనూహ్యమైన పరమాత్మ శక్తులను ప్రత్యక్షంగా సందర్శించారు. ఆ మహత్తర శక్తుల సంకలనమే శ్రీసాయిసచ్చరిత యనే దివ్యకావ్య కల్పద్రుమం. శ్రీ సాయిబాబా యొక్క అనుమతిని తీసుకునే శ్రీ హేమాడ్ పంతు, మరాఠీలో ఈ గ్రంథాన్ని వ్రాశారు. దీనిని సంక్షిప్తం చేసి శ్రీ గుణాజి ఆంగ్ల భాషలోనికి అనువాదం చేశారు. ఈ ఇంగ్లీషు పుస్తకాన్ని అనేక మంది అనేక భాషలలోనికి అనువదించారు. శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర అను పేరుతో శ్రీ ప్రత్తి నారాయణరావు తెలుగుభాషలోనికి కూడా తర్జుమా చేశారు. కాని మరాఠీలో

వ్రాసిన మూల గ్రంథాన్ని ఇంతవరకూ ఎవరూ తెలుగులో అనువదించి పుస్తకరూపంలో ప్రచురించలేదు. ప్రాసాదిక గ్రంథమని ప్రసిద్ధి చెందిన ఈ గ్రంథాన్ని యథాతథంగా తెలుగువారికందించాలనే ఉద్దేశంతో శ్రీ సాయిబాబా అనుగ్రహంతో తెనిగించడమైంది. సాయి యొక్క పరతత్త్వం, భక్తులకు అందుబాటులో ఉండేలా శ్రీ సాయిసచ్చరిత రూపంలో సాక్షాత్కరించి, ధర్మార్థ కామ మోక్షాలననుగ్రహిస్తూ ఉంది. అందువల్ల ఈ గ్రంథ ప్రాశస్త్యాన్ని ముందుగా తెలుసుకోవాలి.

శ్రీమద్రామాయణంలో శ్రీ రామచంద్రుని శౌర్యపరాక్రమాలను ఔదార్యాన్ని, ఔన్నత్యాన్నికని ఆనందిస్తాం. శ్రీ మహాభాగవతంలో శ్రీ కృష్ణపరమాత్మ యొక్క మహిమాన్వితమైన అనేక దివ్యలీలలను తిలకిస్తాం. శ్రీభగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుని ఆధ్యాత్మిక జ్ఞాన ప్రబోధను అవగాహన చేసుకుంటాం. అదే విధంగా శ్రీ సాయిసచ్చరితలో శ్రీ సాయి యొక్క సుగుణ సంపదను, వారి ఉదార స్వభావాన్ని, అపార కరుణారసాన్ని, దిగ్భ్రమను కల్గించే వారి చమత్కారాలను, వారి దివ్యానుగ్రహాన్ని గమనిస్తాం. వారి మనోహర రూప లావణ్యం యొక్క వర్ణనను శ్రవణం చేస్తాం, వారి మధుర వచనామృతాన్ని చవిచూస్తాం.

శ్రీ కృష్ణ పరమాత్మ అర్జునుని కేవలం నిమిత్తమాత్రునిగా నిలబెట్టి భగవద్గీతలోని అష్టాదశ అధ్యాయాలలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రబోధించారు. శ్రీసాయి దయామయుడు హేమాడ్ పంతుని కేవలం నిమిత్తమాత్రునిగా చేసి తమ విచిత్ర చరిత్రను, దివ్యలీలలను, అమూల్యమైన ఉపదేశాలను శ్రీ సాయిసచ్చరిత తరణిలో పొందుపరచారు. భక్తులను తరింపచేయటానికి దీనిని, తామే స్వయం నిర్మాణం చేశారు. "నీవు కేవలం నిమిత్తమాత్రుడవే. నా కథ నేనే వ్రాసుకుంటా. నా చరిత్రము శ్రవణం మననం, సంకీర్తనం చేస్తే అవిద్యాదోషం నిరసిస్తుంది, అజ్ఞానం తొలగిపోతుంది" అని శ్రీ సాయి స్వయంగా అన్నారు. శ్రీ సాయి నాథుని ఆరాధించటం శ్రీ సాయిసచ్చరితను అధ్యయనం చేయటం, రెండూ ఒక్కటే. శ్రీ సాయిసచ్చరిత ఎక్కడుంటే అక్కడ గోదావరితీరం, శిరిడీ క్షేత్రం, ద్వారకామాయి, ధుని, సాయి సాన్నిత్తు ఉన్నట్లే. (అ.35) సాయి వేరు సాయిచరిత వేరూ కాదు. శ్రీ సాయి యొక్క మరోరూపం శ్రీ సాయిసచ్చరిత. శ్రీ సాయి యొక్క మరో పేరు శ్రీ సాయిసచ్చరిత. ఇది కేవలం శ్రీ సాయి యొక్క చరిత్ర మాత్రమే కాదు.

ఒకప్పుడుండి మరొకప్పుడు మాయమైపోయే నశ్వర మాయా ప్రపంచంవలె కాక, సర్వత్ర సర్వకాల సర్వావస్థలలోనూ, నిత్యం నిలచి ఉండే సద్వస్తువు చరిత్ర. సత్‌చిత్ ఆనందం ఈ మూడూ మిళితమై ఉన్న తత్త్వమే పరతత్త్వం. సద్వస్తువున్న చోట జ్ఞానానందాలు తప్పకుండా ఉంటాయి. అందుచేత శ్రీ సాయిసచ్చరిత సచ్చిదానందాలను ప్రసాదించే సత్యదేవుని చరిత్ర. సచ్చిదానంద పరబ్రహ్మ శ్రీ సాయి రూపంలో అవతరిస్తే శ్రీ సాయి పరమాత్మ తత్త్వం, శ్రీ సాయిసచ్చరిత రూపంలో వెలసింది. సద్గురువు తమ మహాసమాధ్యనంతరం కూడా తమ దివ్యవాణిలో అమరులై ఉంటారు. అందువల్ల సద్గురువు యొక్క వాణిని వారి సజీవ శరీరంగా భావిస్తారు. అందుచేత సద్గురువు యొక్క దివ్యవచనామృత గ్రంథం, వారి ప్రతీకయై వెలసి సద్గురుమూర్తి వలెనే పూజార్చనలు హారతి నివేదనలు మొదలగు షోడశోపచారాలను స్వీకరించే అర్హతను కల్గి ఉంటుంది. సిఖ్ఖు మతస్థులు గురునానక్ వాణియైన గురుగ్రంథ సాహేబుకు పూజహారతి నివేదనాది ఉపచారాలను చేస్తారు. అట్లే శ్రీ సాయి యొక్క దివ్యవాణియైన శ్రీ సాయిసచ్చరిత పూజనీయం. కారణం, ఇది శ్రీ సాయిబాబా యొక్క దివ్యవాక్కు నుండి దొర్లిన ఆణిముత్యాలరాశి, అంతేకాదు భక్తి జ్ఞానరత్నాలతో నిండి ఉన్న అగాధసాగరం. దేవతలు సాగర మథనం చేసి అమృతభాండాన్ని తెచ్చుకుని దానిని సేవించి అమరులయ్యారు. శ్రీ సాయి సచ్చరిత సాగరాన్ని నిత్యం అధ్యయనం, శ్రవణం, మననం, నిధి, ధ్యాసలతో మథనం చేస్తే, జ్ఞానామృతభాండం బయటికి వస్తుంది. ఆ దివ్యజ్ఞానాన్ని పొంది అమరులవుదాం. తాతముత్తాతలు తమ తరాల వారికి ఆర్జించి పెట్టే స్థిరాస్తివలె, మన సాయి తాతయ్య తరతరాల వారికి ఉపయోగపడేలా, ఆచంద్రార్కం తరగిపోని అక్షయ జ్ఞాననిధిని శ్రీ సాయిసచ్చరితలో నిక్షిప్తం చేసి ఉంచారు. "నా వద్ద అక్షయ నిధి ఉంది, బండ్లు తెచ్చుకుని గునపాలతో త్రవ్వి దానిని తీసుకుని వెళ్లండని అంటే నా కొడుకు ఎవడూ రాడేంరా" అని సాయి స్వయం అనే వారు. (అ.32)

మల విక్షేప ఆవరణాలు అంటే మనోమాలిన్యం, చిత్త చాంచల్యం, అజ్ఞానావరణం ఈ మూడూ ముక్తిమార్గంలో అవరోధాలు. నిష్కామకర్మ ద్వారా మనసును నిర్మలం చేసుకోవాలని మహాత్ములు చెప్పారు. ఏదో ఒక కోరిక లేకుండా ఏ కర్మా చేయని

మానవులకది సాధ్యం కాదు. అనునిత్యం నియమంగా శ్రీ సాయిసచ్చరితను అధ్యయనం గాని పారాయణగాని శ్రవణంగాని చేస్తే మలక్షాళనమౌతుందని శ్రీ సాయిసచ్చరితలోని అనేక అధ్యాయాలలో పదే పదే చెప్పబడి ఉంది. చిత్తచాంచల్యాన్ని తొలగించుకోవటానికి, దైవోపాసన, అంటే నిష్ఠగా దైవసన్నిధిలో, ఆసనం వేసుకుని కూర్చుని, జపతపాది అనుష్ఠానాచరించమని ఆధ్యాత్మిక గ్రంథాలు ఘోషిస్తున్నాయి. కాని కుదురుగా కూర్చుని, కూడు తివటానికి కూడా తీరికలేని ఈ విషయ ప్రపంచంలో, భగవంతుని సమీపంలో, శారీరికంగానైనా కూడా కొంత సమయం గడపటానికి తీరిక లేని వారి మనసులు, దైవోపాసనలో స్థిరంగా ఉండగలవా? అన్నవరతం ఇంద్రియాల వెంట బయట బయటే తిరుగుళ్ళకలవాటు పడిన మనసు, దైవసన్నిధిలో ఉండదు. కాని అంతఃకరణానికి ఆకర్షణీయంగా సాయిలీలా విలాసాలతో సాయికి ప్రతీకయై వెలసిన శ్రీ సాయిసచ్చరిత పారాయణలోనో, శ్రవణంలోనో, మనసు ఏకాగ్రమై, దైవోపాసనలో విమగ్నమై పోవటం వలన, చిత్తచాంచల్యం తొలగి పోతుంది. ఏ సాధనను అవలంబించినా అది అంతఃకరణ శుద్ధి కొరకే. చిత్తశుద్ధి లేనిదే ఆత్మసాక్షాత్కారం అసంభవం. ఇక మూడవది- అజ్ఞాన ఆవరణం. ఇది అడ్డుగోడలాటి గడ్డు సమస్య. ఇది పూర్తిగా తొలగిపోతేనే గాని మాయాబంధం నుండి విముక్తి లేదు, ఆత్మసాక్షాత్కారం కాదు. అజ్ఞానం వల్లనే అహం. అంటే నేను నేనని భ్రిరవీగటం. సూర్యోదయంతో చీకటి తొలగిపోయేలా అజ్ఞానాంధకారం తొలగిపోతే అహంభావం కూడా తొలగిపోతుంది. 'మన మధ్య నున్న ఈ అడ్డుగోడమ తొలగిస్తే మనం పరస్పరం ముఖాముఖీగా కలుసుకుంటాము'ని సాయిబాబా స్వయం చెప్పారు. విషయ వాసనలన్నీ భస్మమైపోయి, శరీరం కుష్కించి పోయిన విరాగిలో కూడా అహం బాగా బలంగా ఉంటుంది. హఠయోగ ప్రయోగాలతో ప్రాణాన్ని ఆరికట్టి ఆరునై గంటల వరకు గాలి చొరబడని గాజు పెట్టలలో కూర్చోగలిగిన కర్మయోగులలో అహం మరింత దృఢంగా ఉంటుంది. ఆసనం ప్రాణాయామాది అష్టాంగ యోగాభ్యాసాలతో సమాధ్యవస్థను చేరుకున్న రాజయోగులలో, కూడ అహం చావదు. పంచాగ్నుల మధ్యవో లేక ఇతర ఘోరమైన సాధనాలతోనో తపస్సు చేసే తపోనిష్ఠులు తమ తపోశక్తితో, శాపాలతో, క్రోధాగ్నితో ఎదుటివారి వెవరినైనా దహించి వేయగలరేమొ కాని తమ అహాన్ని భస్మం చేసుకునే శక్తి సామర్థ్యాలు

వారికుండవు. అట్లే మంత్రతంత్ర ప్రయోగాలు చేసే వారు యజ్ఞయాగాలు, జపాలు హోమాలు చేసే వారు కూడా తమ అహాన్ని అణిచి వేయలేరు; అదుపులోనూ పెట్టుకోలేరు. వేదాలను వల్లె వేసేవారు, వేదాంతాన్ని ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రాలను బాగా అధ్యయనం చేసి, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధపడిన జ్ఞానులమని అనుకునే వారి మస్తిష్కం నుండి అహం ఒక మెట్టైనా దిగదు. సద్గురుని శరణుజొచ్చి, ఏమెరుగని పామరులు ముక్తిని పొందగలరు. కాని గ్రంథాలలోని జ్ఞానాన్ని ఆర్జించి తమకంతా తెలుసుననుకునే పండితమ్మన్యులకది సాధ్యం కాదు. కారణం, గ్రంథ పఠనంతో బుద్ధి వికసిస్తుంది; అంతేకాని అది అనుభవజన్యమైన అపరోక్షానుభూతిని కలుగచేయదు; నిరవధిక సుఖాన్ని, అక్షయానందాన్నివ్వదు. అతి సూక్ష్మాతి సూక్ష్మమైన అహాన్ని గురువనుగ్రహం లేకుండా రూపుమాపటం అసాధ్యం. అందువలన అహంభావానికి కారణభూతమైన అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి శ్రీ సాయిసచ్చరితను శ్రవణం చేయండి. సకల చరాచర జగత్తునకు సృష్టిస్థితిలయకర్త భగవంతుడేయని, సూర్యచంద్రాదులు గ్రహనక్షత్రాలు మొదలుకొని క్రిమికీటకాదుల వరకు భగవత్సంకల్పం ప్రకారమే నడుచుకుంటున్నాయని భక్తుడు భావిస్తూ, మంచిచెడు ఏది జరిగినా అది దైవ నిర్ణయంగానే తలచి, ఏ కార్యానికైనా తాను కర్తగా భావించడు. అందుచేత అతని అంతఃకరణంలో అహం ఊపిరి ఉండీ లేనట్లుంటుంది. అందుకే సాయిబాబ భక్తికే ప్రాధాన్యమిచ్చారు. జ్ఞానం రామఫలం వంటిది. దీనిని చెట్టుపైన పండిన తర్వాతే కోసుకోవాలి. పండిపోయిన పండు క్రిందపడి పోవటానికి అవకాశముంది. అంటే జ్ఞాని తనకంతా తెలుసునన్న అహంభావంతో పతనం కావచ్చు. కాని భక్తి సీతాఫలంలా మృదుమధురమైనది. గట్టికాయలనే కోసి క్రిందపండ వేస్తారు కనుక భక్తిలో పతనానికి అస్కారం లేదు అని బాబ అనేవారు. (అ.19) వారు నవవిధ భక్తిని ప్రోత్సాహించారు. చిత్తైకాగ్రతకు సులభసాధనమైన శ్రవణానికి చాలా ప్రాముఖ్యాన్నిచ్చారు. శిరిడీలోని దీక్షితువాడాలో, ప్రతినిత్యం, ఉదయం సాయంత్రం రామాయణం భాగవతం మొదలగు పురాణ శ్రవణం జరగేదని, సాయిబాబ స్వయం సప్తాహాలను చేయించే వారని, వారి మహాసమాధికి ముందు, వజె అను భక్తునిచే రామవిజయమను గ్రంథమును ముమ్మారు పారాయణ చేయించారని శ్రీ సాయిసచ్చరితలో ఉంది. (అ.31) అజ్ఞానం కాని అహంకాని పరమాత్మ స్వరూపుడైన సద్గురుని అనుగ్రహంతో తొలగిపోవాలే కాని ఇతర సాధనాలతో పోగొట్టుకోవటం అసంభవం.

సూర్యోదయం కానిదే, ఎంతో ప్రకాశవంతమైన దీపాల వెలుతురున్నా, సూర్యుని చూడలేం కదా! ప్రకాశ స్వరూపుడైన సూర్య భగవానుని దర్శించుకోవటానికి ఏ జ్యోతి ప్రకాశమూ పనికి రాదు. సూర్యుడు తాను స్వయంగా ప్రకటమైనప్పుడే, అతని ప్రకాశంతోనే అతన్ని చూడగలగటం. అట్లే పరంజ్యోతి స్వరూపమూ, స్వయం ప్రకాశమూ, జ్ఞాన స్వరూపమూ అయిన పరమాత్మ, పరిశుద్ధాంతఃకరణంలో స్వయం ప్రకటమైనప్పుడు, ఆ పరమాత్మ ప్రకాశంతోనే, ఆ పరమాత్మను సందర్శించుకోవటం. ఆ పరమాత్మ జ్ఞానంతోనే ఆ పరమాత్మను తెలుసుకోవటం. అందుకే ఆత్మసాక్షాత్కారానికి, జ్ఞానస్వరూపమైన 'గురుకృపాహి కేవలం' అని అంటారు. అంటే సద్గురువు యొక్క అనుగ్రహమే ముక్తికి మూలసాధనం. కనుక గురుకృపా రసఝరియైన శ్రీసాయిసచ్చరితలో మునకలు వేసి శ్రీ సాయిసద్గురువు యొక్క అనుగ్రహాన్ని సంపాదించుకుందాం. శ్రీ సాయి సద్గురువు మన చరమసాధ్యం. ఆసాధ్యాన్ని సులభసాధ్యంగా లభ్యం చేసుకునే సాధనోపాయాలను సూచించేది శ్రీ సాయిసచ్చరిత. సాయి సర్వజ్ఞుడు మన చివరి జ్ఞేయం. ఆ జ్ఞేయాన్ని తెలుసుకునే జ్ఞానాన్ని అందించేది శ్రీ సాయిసచ్చరిత. సాయి పరమాత్మలో మన ఆత్మను విలీనం చేయటం మన జీవిత ధ్యేయం. ఆ ధ్యేయాన్ని సాధించటానికి ధ్యానధారణాది ఉపాయాలను బోధించేది శ్రీసాయిసచ్చరిత. సాయి పరబ్రహ్మలో ఐక్యమై పోవటం మన అంతిమ గమ్యం. ఆ గమ్యాన్ని చేరుకోవటానికి సుగమమైన మార్గాలను సూచించే మార్గదర్శి శ్రీ సాయిసచ్చరిత.

శ్రీ సాయినాథుడే మనకు సృష్టికర్త బ్రహ్మ. శ్రీ సాయి విరించి సృష్టించినది ఏదైనా కాదనక ప్రసాదించే కామధేనువు, కోరిన ఫలాలనిచ్చే కల్పతరువు శ్రీ సాయిసచ్చరిత. సాయి యొక్క వాణి సకల ధర్మశాస్త్రాల శారద, శ్రీ సాయిసచ్చరిత రూపంలో విరాజిల్లుతూంది. సరస్వతీ మాత కటాక్షం కావాలంటే జ్ఞానసరస్వతియైన శ్రీ సాయిసచ్చరిత నాశ్రయించండి. సకల జీవుల స్థితిగతులను చూచే ఆదివిష్ణువు మన సాయినారాయణుడు. అష్టైశ్వర్యాలను అనుగ్రహించే ఆదిలక్ష్మికి అష్టలక్ష్ములకు ఆలయం శ్రీ సాయిసచ్చరిత. ధనకనక వస్తువాహనాలను, సకల భోగభాగ్యాలను, సంపత్తిని, సంతానాన్ని, దేనిని కోరుకున్నా ప్రసాదిస్తుంది. ప్రళయాకారకుడైన పరమేశ్వరుడే మన సాయి సర్వేశ్వరుడు. దుష్టశక్తులను, దుష్టగ్రహాలను, దుర్గుణాలను దునుమాడే దుర్గ భద్రకాళీలకు నిలయం శ్రీ సాయిసచ్చరిత. ఉమామహేశ్వరులు అభిన్నంగా అర్ధనారీశ్వరుని రూపంలో ఉంటారు కదా! అట్లే

సాఈశ్వరునికి అభిన్నంగా ఉన్న సాయి అర్థాంగి సాయిసచ్చరిత. శివుడు శక్తి అభిన్నంగా ఉన్నట్లే పురుషుడు ప్రకృతి అభిన్నం. కారణం ఊర్ణనాభిలా (సాలె పురుగు) పరబ్రహ్మ తన సంకల్పంతో తనే అల్లుకున్న మాయాజాలమే ప్రకృతి కనుక. అట్లే సాయి (హేమాడ్ పంతును నిమిత్తమాత్రునిగా చేసి) స్వయం తామే అల్లుకున్నది, వివిధ పరిమళాలను వెదజల్లే దివ్యలీలాకుసుమాల మాల శ్రీ సాయిసచ్చరిత, సాయికంటే వేరు కాదు. త్రిమూర్తులైన బ్రహ్మవిష్ణుమహేశ్వరుల అవతారమైన దత్తాత్రేయ భగవానుడు మన సాయిబాబ. వారి సంకల్పశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి యొక్క పవిత్ర త్రివేణీ సంగమం శ్రీసాయిసచ్చరిత. సాయి యొక్క అపార అనుగ్రహం, హేమాడ్ పంతు కలం ద్వారా ప్రవహించిన పవిత్రగంగ శ్రీ సాయిసచ్చరిత. గంగాస్నానం మానవులను పావనం చేసినట్లుగా శ్రీ సాయిసచ్చరిత శ్రవణం భక్తులను పునీతులను చేస్తుందని, శ్రీ సాయిసచ్చరితలో అనేకసార్లు వక్కాణింపబడింది. సాయి దయామయి మన మాతృమూర్తి. ఆ ప్రేమమయి యొక్క వెచ్చని ఒడి శ్రీసాయిసచ్చరిత. భక్తవత్సలుడైన బాబ మన పితృదేవుడు. ఆ తండ్రి యొక్క వాత్సల్యరసపాత్ర శ్రీ సాయిసచ్చరిత.

సూర్యుడు సూర్యుని కిరణాలు వేరు వేరు కావు కదా! సకల లోకాలకు వెలుగునిచ్చే సాయి భాస్కరుని కరుణ కిరణాల ప్రకాశమే శ్రీ సాయిసచ్చరిత. చంద్రుడు వేరు చంద్రుని కిరణాలు వేరుకావు. ఓషధీనాథుడైన సాయిచంద్రుని చల్లని వున్నమి వెన్నెల శ్రీ సాయిసచ్చరిత. అగ్ని దాని తేజం వేరువేరుగా ఉండగలవా? సర్వభక్షకుడైన అగ్నిహోత్రుడు సాయిదేవుడు. మన జన్మజన్మల కర్మ వాసనలను భస్మం చేసే యజ్ఞకుండం శ్రీ సాయిసచ్చరిత. సాయిబాబ యజ్ఞభగవానుడు. అహోరాత్రులు నిర్విరామంగా ప్రజ్వరిల్లే వారి పవిత్ర ధునివలెనే, శ్రీ సాయిసచ్చరిత మన సంస్కార సమిధలను దహించి వేస్తుంది. సాయి యొక్క అసమానమైన విభూతి ప్రసాదం వలెనే, సాయి యొక్క ప్రాసాదిక గ్రంథం శ్రీ సాయి సచ్చరిత అనుపమానం. పూవు దాని తావి విడివీడిగా ఉంటాయా? మధుర పదార్థాన్ని దాన్ని మాధుర్యాన్ని వేరు పరచగలమా? సాయిబాబ మధుర మనోహరమూర్తి. వారి మధుర మోహన రూపాన్ని, మధుర మందహాస వదనాన్ని, మధుర దరహాసాన్ని, మృదు మధుర ప్రవచనాలను మధురోపదేశాలను, మధుర బోధనా పద్ధతిని, మధుర సంభాషణా విధానాన్ని, మధుర హాస్యవినోదాలను, మధుర ప్రేమామృతాన్ని ప్రవహింపచేసే మధురమయి శ్రీ సాయిసచ్చరిత. సాయి

యొక్క స్థూల శరీరాన్ని మనమిప్పుడు చర్మచక్షువులతో చూడలేం. కాని వారి ఆకర్షణీయమైన రూపాన్ని, వారికి ప్రతిరూపమై వెలసిన శ్రీ సాయి సచ్చరితలో జ్ఞాననేత్రాలతో చూడగలం. సాయి ప్రదర్శించిన వింతలను, విశేషాలను, విచిత్ర లీలలను, మన తనివి తీరా చూచుకునే దర్పణం శ్రీసాయి సచ్చరిత. అంతేకాదు ఆధి వ్యాధి బాధలను నివారించే చికిత్సాలయం, భవరోగానికి ఔషధం, ఐహిక ఆముష్మికాలకు ఆలవాలం శ్రీ సాయిసచ్చరిత. వేదోపనిషత్తుల సారం, పరమార్థ సాధనకు అత్యుత్తమ సాధనం.

సూర్యకిరణాల తాపాన్ని వర్షధారల పాతాన్ని తప్పించుకోవటానికి గొడుగు క్రింద తలదాచుకుంటాం. తాపత్రయ బాధల నుండి తప్పించుకోవాలనుకునే వారు సాయి అనుగ్రహ ఛత్రమైన శ్రీ సాయిసచ్చరితను ఆశ్రయించండి. అగ్ని సంపర్కంలో ఉన్న కఱ్ఱ అగ్నిలా మారిపోయే విధంగా, నిత్యం శ్రీ సాయిసచ్చరిత శ్రవణమనన నిధిధ్యాసలు చేసే వారు దివ్యస్వరూపులైపోతారు. జగమంతా వారికి సాయిమయమౌతుంది. శ్రీ సాయినాథుని అద్భుత మహిమలను సాంగోపాంగంగా వర్ణించడం సహస్ర శిరస్సులు సహస్ర జిహ్వాలుగల ఆదిశేషునకు కూడా అసాధ్యం. అట్లే శ్రీ సాయిసచ్చరిత మహిమను వివరించటం చతుర్ముఖ బ్రహ్మతరం కూడా కాదు. మరాఠీలో వ్రాసిన ఈ ప్రాసాదిక పవిత్ర గ్రంథాన్ని యథాతథంగా ఆంధ్రభాషలోకి నాచే అనువదింపచేసిన అనుగ్రహ మూర్తియైన సాయి సద్గురువుకు ఈ సాయిసచ్చరితను అత్యంత భక్తి ప్రపత్తులతో అంకితం చేస్తున్నాను. ఈ గ్రంథంలో ఏమైనా లోపాలు లోటులుంటే చదువరులు సహృదయంతో సవరించుకోవలెనని ప్రార్థన. ఈ గ్రంధ సవరణలో అత్యధికంగా శ్రమించి సహకరించిన శ్రీమతి విమలా శర్మగారికి, శ్రీ నరసింహారావు గారికి, చి॥ అశోక్‌కుమార్ మరియు సురేశ్‌లకు కృతజ్ఞతాపూర్వకంగా ధన్యవాదాలను సమర్పిస్తున్నాను.

మూకాం కరోతివాచాలం, పంగుంలంఘయతే గిరిం! యత్కృపా తమహం వందే పరమానంద మాధవం

సర్వేజనాః సుఖినోభవంతు॥ సమస్త సన్మంగళాని భవంతు॥

తేది : 21-3-2004

మణి

సద్గురు శ్రీ సాయిబాబా మందిరం

కిషన్‌బాగ్, హైదరభాద్-500 064



శ్రీ సాయి సచ్చరిత

శ్రీ గణేశాయనమః శ్రీ సరస్వత్యైనమః శ్రీ సద్గురుభ్యోనమః

గురుఃబ్రహ్మ గురుఃవిష్ణుః గురుదేవో మహేశ్వరః గురు సాక్షాత్ పరబ్రహ్మ, తస్మై శ్రీ గురవేనమః
బ్రహ్మానందం పరమ సుఖదం, కేవలంజ్ఞానమూర్తిం ద్వంద్వాతీతం, గగన సదృశం, తత్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం, విమల మచలం, సర్వధీ సాక్షిభూతం, భావాతీతం, త్రిగుణరహితం, సద్గురుం తంనమామి.

ఉపోద్ఘాతం

శ్రీ సాయినాథ్ మహారాజు సుమారు యాభై సంవత్సరాలకు పూర్వం శిర్డీకి ప్రథమంగావచ్చారు. వారు అసలు ఎక్కడివారు, వారి తల్లిదండ్రులెవరు అన్న వివరాలు లభించలేదు. వారికి మొగలాయీ ప్రదేశాలతో సంబంధం ఉండి ఉండాలని మాత్రం అనిపిస్తుంది. మహారాజు తమ మాటలలో సేలు జాల్నా మన్‌వద్ పాథరి పరభణి, నౌరంగాబాద్, బీడ్, బిదర్, ఈ మొగలాయీ ఊళ్లపేర్లను తరుచూ ఉచ్చరించేవారు. ఒకసారి ఒక గృహస్థు పాథరీ గ్రామంనుండి దర్శనానికి రాగా, మహారాజు అతనిని పాథరి గురించిన విషయాలను అడిగి అక్కడి అనేక మంది గృహస్థుల పేర్లు చెప్పి వారి వివరాలన్ను తెలుసుకున్నారు. దీన్ని బట్టి మహారాజుకు పాథరి గురించి బాగా తెలుసు అని అనుకోవచ్చు, కాని అక్కడే జన్మించి ఉండవచ్చు అని చెప్పటానికి ఆధారం లేదు. అట్లేవారు అసలు బ్రాహ్మణులా లేక జన్మతః ముసల్మానా అని నిశ్చయంగా చెప్పటానికి వీలులేదు. అయినప్పటికీ అనేకులు నమ్ముతున్నట్లుగా వారు అయోని సంభవులని చెప్పటానికి వీలుకాదు. మహారాజును అయోనిజులు అని అనటం భక్తులు కాని వారికి అసంభవమని అనిసిస్తుంది. కాని ప్రస్తుత రచయితకు అలా అనిపించదు, మహారాజు స్వయంగా ఈ రచయితతో ఒకసారి "ఇకమేం వెళ్లిపోతాం ఎనిమిది సంవత్సరాల వయసు అయ్యాక వస్తాం" అని అన్నారు. శ్రీ కృష్ణుడు దేవకి వద్ద ప్రకటమైనప్పుడు అతనికి 8 సం॥ వయసు అని పురాణాలలో వర్ణించబడి ఉంది. మహారాజు

యొక్క అనేక మంది భక్తులు వారిని సాధనలో సిద్ధి పొందినట్లుగా కాక వారు ప్రత్యక్ష అవతార పురుషులని విశ్వసిస్తారు. వారి లీలలు వారి అద్భుత శక్తి చూచి వారు శ్రీ కృష్ణుని అవతారమని చాలా మంది నమ్ముతారు, మహారాజు మాత్రం తాము స్వయంగా ఏ అధికారాన్ని స్వీకరించలేదు, వారు నేను పరమేశ్వరుని సేవకుణ్ణి అని చెప్పుకునేవారు. తమ గురువు ఆశీస్సులు తమకు పూర్తిగా ఉన్నందు వలన గురువు అనుగ్రహంతోనే భక్తుల కష్టాలు తొలగి వారికి శుభం కలుగుతుంది అని చేప్పేవారు. భక్తులకు ఆశీర్వాదాన్నిచ్చేటప్పుడు వారు సాధారణంగా "అల్లా భలా కరేగా" అని ఇదే పదాన్ని పలికేవారు. ఏగొప్పతనాన్ని తమ పై ఆపాదించుకునేవారు కాదు. ఎప్పుడూ 'అనల్‌హక్' అంటే నేనే పరమేశ్వరుణ్ణి అని అనేవారు కాదు; యాదే హక్ అంటే నేను పరమేశ్వరుని స్మరించేవాణ్ణి అని అనేవారు.

మహారాజు శిరిడీకి ఒక ముసల్మాను గృహస్థుని ఇంటి పెళ్లి వారితోపాటు వచ్చారు. అతనిపేరు చాందుభాయీ. అతడు ధూప్ ఖేడె అన్న ఊరి పటేలు, ఒక రోజు అతని గుఱ్ఱం తప్పి పోగా దానిని వెతకటానికి అతడు అడవిలో తిరగసాగాడు. అక్కడ అతనికి ఒక చెట్టు క్రింద మహారాజు కూర్చుని ఉండటం కనిపించింది. అతడు మహారాజును మునుపెన్నడూ చూడలేదు. మహారాజు అతనిని పిలిచి చిలుంపీల్చి వెళ్ళు అని చెప్పారు. అతడు నాగుఱ్ఱం తప్పిపోయింది నేను దానిని వెతకటానికి బయలు దేరానని అనగా, దానికోసం ఎంతో దూరం వెళ్లే అవసరం లేదు, ఆవెనుక ఉన్న కంచె ప్రక్కన ఉంది అని వారు చెప్పారు. చాందు భాయి వారు చెప్పిన చోటికి వెళ్లాడు. అక్కడ నిజంగానే అతని గుఱ్ఱం మేస్తూ కనిపించింది. అతడు గుఱ్ఱాన్ని తీసుకుని మహారాజు వద్దకు వచ్చాడు. వారు అతనికి చిలుం త్రాగించాక అతడు వారిని తన ఇంటికి రమ్మని బలవంతం చేశాడు. మహారాజు "నేను రేపు వస్తాను" అని అన్నారు అలాగే వారు రెండవ రోజు అతని ఇంటికి వెళ్లారు. చాందు భాయికి చిలుంత్రాగించారు కదా మరి అక్కడ అడవిలో నిప్పు ఎక్కడిది? మహారాజు తమ చేతిలో ఉన్న పటకారను నేలపై కొట్టి నిప్పును ఉత్పన్నం చేసి తమ కార్యాన్ని సాధించుకున్నారు.

మహారాజు చాందుభాయి ఇంట్లో కొంతకాలం ఉన్నారు. చాంద్‌భాయి మేనల్లునికి శిరిడీలోని ఒక అమ్మాయితో సంబంధం కుదిరింది, ఆపెళ్ళికి పెళ్లివారితో పాటు మహారాజు శిర్డీకి వచ్చారు. పెళ్ళివారు. ఊరిబయట ఖండోబా దేవాలయం సమీపంలో ఒక మడి వద్ద దిగారు. మహారాజు ఖండోబా గుళ్లోకి వెళ్లారు అక్కడ మహల్సాపతి అనే గృహస్థు కలిశాడు. ఇతడు శిర్డీ నివాసి, కంసాలి జాతీయుడు, ఖండోజా భక్తుడు. వీరి కుటుంబీకులు ఎన్నోతరాలనుండి ఖండే రాయుని యాత్రీకులు. మహారాజు ఖండోబా దేవాలయంలోకి వెళ్లినప్పుడు

వారు శరీరంపైన పంచె కఫని టోపి ఉన్నాయి. వారిని అలా చూడగానే మహాల్సాపతి "రండి పాయి బాబా" అన్న పదాలతో వారికి స్వాగతం పలికాడు. పాయిబాబా అన్న ఆపేరును మహారాజు చివరవరకు ఉంచుకున్నారు. అనేక మంది భక్తులు వారిని సాయిబాబా లేక బాబా అని అంటారు. ఒకసారి ఒక విషయంపై కమీషను వేశారు అప్పుడు మహారాజును పేరు అడగగావారు నన్ను సాయిబాబా అని అంటారు అని జవాబు చెప్పారు. మహాల్సాపతి మహారాజును ఊళ్లోకి తీసుకుని వచ్చి తన స్నేహితులైన కాశీరాం దర్జి అప్పా మరియు జోగ్‌లతో పరిచయం చేశాడు. ఈ ముగ్గురు ఊళ్లోకి వచ్చే సాధువుల సత్పురుషుల బైరాగుల ఫకీరుల సేవ తమ శక్త్యాను సారం చేసి వారి అవసరాలను తీర్చేవారు. శిర్డీ గ్రామం రహదారిలో ఉండటంవలన ఇళ్ళకిడికి ఇటువంటి వారు తరుచూ వచ్చేవారు. వారికి ఈ ముగ్గురు తమ శక్తికొలది సంభావన ఇచ్చేవారు. ఈ ముగ్గురూ మహారాజుకు పూర్ణభక్తులయ్యారు. వీరిలో కాశీరాం, అప్పా కొన్ని ఏళ్లకు ముందే మరణించారు. కాశీరాం ముందుగా శరీరాన్ని వదిలాడు. అతని తరువాత కొన్ని ఏళ్లకు అప్పా చనిపాయాడు. ఈ ఇద్దరికీ మరణం ఏ కాదశినాడు లభించింది. హరిభక్తుల మరణం హరియొక్క రోజున సంభవిస్తుంది అట్లే ఈ ఇద్దరికీ జరిగింది. కాశీరాం, మహారాజు సేవ అత్యుత్తమంగా అంటే తనువు మనసు ధనంతో చేశాడు. మహారాజు యొక్క కఫని మొదట్లో కాషాయం లేదా తెల్లటి రంగులో ఉండేది. కాశీరాం మహారాజుకు ఆకుపచ్చని కఫని అదే రంగులో టోపిని కుట్టించి ఇచ్చాడు. సాధారణంగా మహారాజు తెల్లని కఫని తొడుక్కుని తలకు తెల్లటి బట్టను కట్టుకునేవారు. వారికి చిలుంకు పొగాకు ధునికి కట్టలు, మరియు వారికి అవసరమైనప్పుడు డబ్బు సంచి మహారాజు వద్ద ఉంచి మీకు ఇష్టమున్నంత తీసుకొండి అని వారిని ప్రార్థించేవాడు. మొదట్లో మహారాజు దక్షిణను తీసుకోనేవారు కాదు. అయినా కాశీవద్ద నుండి పైసానో రెండు పైసలో తరుచూ తీసుకునేవారు. మహారాజు తన దగ్గరనుండి దక్షిణను తీసుకోవాలని కాశీరాంకు త్రీవ్రమైన కోరిక ఉండేది. మహారాజు ఒక్కోరోజు దక్షిణను తీసుకోకపోతే అతనికి చాలా బాధ కలిగి కళ్లనుండి నీరు కారేది. ఇలా బాధపడటం కూడా పరమార్థంలో మంచిది కాదు. కారణం అందులో నాకు ఇచ్చే శక్తి ఉంది అన్న అహంభావం ప్రవేశిస్తుంది. అందువల్ల భక్తుని పరమార్థానికి ఘాతుకమైన విషయాన్ని పెరికి పారవేయటం దేవుని నిత్య సంకల్పం. కావున కాశీరాంకు కూడా అట్లే జరిగింది. కొంత కాలానికి అతనికి డబ్బుకు సంబంధించిన కష్టం ఏర్పడింది. అప్పుడు దెబ్బమీద దెబ్బలా మహారాజు అతని వద్దనుండి దక్షిణను అడుగుతుండేవారు. డబ్బు అయిపోయిందని అతడు చాలా బాధగా చెప్పసాగాడు, వ్యాపారిని అడిగి నాకు తెచ్చివ్వు అని మహారాజు

అనేక సార్లు అంటే కొన్ని రోజులు వ్యాపారి వద్ద నుండి తీసుకుని రావటం జరిగింది. తరువాత వ్యాపారులు కూడా డబ్బు ఇవ్వ లేదు. అంటే ఈ లీలంతా కాశీరాం యొక్క అహంభావాన్ని తొలగించటానికే. తనకు ఇచ్చే శక్తి లేదు. అని అతనికి బాగా అర్థమవటానికి. ఆ తరువాత అతని ఆర్థికస్థితి బాగుపడింది. అతడుమునవటిపలే సుఖంగా ఉండసాగాడు. మహారాజు రోజు తన వద్దనుండి దక్షిణ తీసుకోవాలి అన్న అతని తపన తొలగిపోయింది. కాశీరాం బట్టలమ్ముకునే వ్యాపారం చేసేవాడు. అందువల్ల అనేక ఊళ్లలో సంత జరిగే రోజు అంగడి పెట్టుకునేవాడు. ఒక్కసారి సాపుర్ సంతనుండి తిరిగి వచ్చేటప్పుడు దోపిడీ దొంగల ముఠా తటస్థ పడ్డారు. కాశీరాం గుట్టంపైన ఉన్నాడు. దోచుకునేవారు మొదట అతనిని ఏంచేయలేదు, కాని అతనివెంట దారిలోనడిచే వారిని వారు అడ్డంగించారు. తరువాత కాశీరాం వైపు చూడగానే, దొంగలు కాశీరాంనుదోచుకునే ప్రయత్నం చేసి, కొంత సామాను కూడా తీసుకున్నారు, కాశీరాం వారిని అడ్డగించలేదు. తరువాత దొంగలు అతని వద్ద ఉన్న ఒక చిన్న మూటను తీసుకోవాలని ప్రయత్నం చేశారు. అందులోనే ధనం ఉండవచ్చు అని దొంగలకు అనిపించింది. కాని నిజంగా అందులో కేవలం పిండి పంచదార ఉంది. కాశీరాంకు జానకీదాస్ బాబా అన్న పేరుగల సత్పురుషుడు, చీమలకు పంచదార వేయాలని బోధించినప్పటినుండి కాశీరాం తరచూ పంచదారను దగ్గరుంచుకునేవాడు. ఆ చిన్నమూట అతనికి అత్యంత ప్రియమైనది. ఏమైనా కాని తన మూటను ఇవ్వకూడదు అని అతడు నిశ్చయించుకున్నాడు. ఇంతలో ఆ దొంగలు ముఠాలోని ఒకరి కత్తిపై కాశీరాం దృష్టిపడింది, వెంటనే అతడు దానిని తీసుకొని ఆ దొంగల ముఠాలోని ఇద్దటిని చంపేశాడు. అప్పుడు మూడవ దొంగ వెనుక నుంచి వచ్చి గొడ్డలితో కాశీరాం తలపై కొట్టాడు. దాంతో కాశీరాం తెలివి తప్పి శవంలా పడిపోయాడు. మిగిలిన దొంగలు కాశీరాం చచ్చిపోయాడని తలచి అతన్ని అక్కడే వదలి వెళ్ళిపోయారు. కాని నిజంగా అతనికి ప్రాణం పోలేదు. ఎంతో సేపటికి తెలివి వచ్చింది. ఎన్నో రోజుల' తరువాత బాగయ్యాడు అతనికి మహారాజుపై పూర్తి భక్తి శ్రద్ధలున్నందువలన అతడు ఆసుపత్రికి పోనని తనను శిరిడీకి తీసుకెళ్ళమని మొండి పట్టు పట్టాడు. అట్లే అతనిని శిరిడీకి తీసుకొని వచ్చి మహారాజుకు చెప్పగా అక్కడే మాధవరావు దేశపాండే వద్ద ఔషధోపచారాలను చేయించారు. అంటే మహారాజు కృపతో కాశీరాం ఆరోగ్యం బాగుపడింది. ఈ వీర కృత్యానికి ముంబై ప్రభుత్వం కాశీరాంకు ఒక కరవాలాన్ని బహూకరించారు. కాశీరాం దొంగలతో కలబడి పోట్లాడుతున్నప్పుడు, ఇక్కడ శిరిడీలో మహారాజు ఒక్కటే కేకలు, బొబ్బలు తిట్లుశాపాలు వగైరాలతో గొడవ చేశారు. దగ్గరున్న జన సమూహం, ఎవరో ప్రియమైన భక్తునిపై పెద్ద కష్టమొచ్చి పడి

ఉండవచ్చు. అందుకనే ఆభక్తుని కష్టం నుండి రక్షించటానికే ఈ గొడవంతా అని గ్రహించారు. అదే విధంగా జరిగింది. ఆయుధాలతో చాలామంది దొంగలు ఉన్నారు. వారి తాకిడి నుండి కాశీరాం వలె బ్రతికి బయట పడటం వేరే ఎవరికీ సాధ్యమయ్యేది కాదు. కాని రక్షించే వారి ముందు సంహరించే వారిదేం సాగుతుంది? ఈ ఘటన తరువాత కాశీరాం కొన్నేళ్ళు బ్రతికి శ. సం॥ 1830 చైత్రశుద్ధ ఏకాదశి రోజున మరణించాడు. సైన పేర్కొన ముగ్గురిలో మహల్సాపతి చాలా ఏళ్ళు జీవించాడు. అతడు శ.సం॥ 1844 భాద్రపద మాసంలో మరణించాడు. అతనికి మహారాజుకు చాలా దగ్గర సంబంధం ఉండేది. మహారాజు మసీదులోనే కూర్చునే వారు. ఒక రాత్రి మసీదులో ఒక రాత్రి చావడిలో పడుకోవటం వారు మసీదులో పడుకునే రాత్రి మహల్సాపతి వారివద్దకుడి ప్రక్కన కూర్చొని ఉండేవాడు. మధ్య మధ్య ఇద్దఱూ అత్యంత ప్రేమగా ముచ్చటించుకునేవారు మహల్సాపతి మరణించే వరకూ ఒక రోజు విడచి ఒకరోజు మసీదులో రాత్రంతా కూర్చొనే ఉండేవాడు. ఇతడు మంచి యోగ్యుడు ఏమీ అపేక్షించేవాడు కాదు. ఇతని నుండి భక్తులకు ఎప్పుడూ మంచి బోధ ఆనందం లభించేది. ఆయితే మహారాజు తరువాత వారి భక్తులకు ఇది ఒక విశ్రామస్థానమె అయింది. మహారాజు ఇక్కడికి వచ్చినప్పటి నండి ఇక్కడి మసీదులో నివసించసాగారు. ఈ మసీదు అప్పుడు చాలా శిదిలావస్థలో ఉండేది. వారు పగలు ఇక్కడా అక్కడా వెళ్ళేవారు కాని రాత్రి మసీదులో ఉండేవారు.ఎవరైనా భోజనానికి తీసుకొని వెళ్ళితే వెళ్ళేవారు. ప్రజలకు ఔషధాలను ఇచ్చేవారు, అనుపానాలను చేప్పేవారు. కాని వాటికోసం డబ్బు పుచ్చుకునేవారు కాదు. రోగులకు సరియైన శుశ్రూష సరిగ్గా లేకపోతే వారు స్వయం వెళ్ళి శుశ్రూష చేసేవారు. ఈ విధంగా వారితో ఔషదోపచారాలను శుశ్రూషలు అందుకున్న అనేక మంది ఇంకా ఇక్కడ ఉన్నారు. తరువాత వారు మందులను ఇవ్వటం మానేసి విభూదిని మాత్రమే ఇవ్వసాగారు. ముందు ఊది ఇచ్చేవారు దాంతో ప్రజలకు గుణమయ్యేది. కాకా! నేను పూర్వం ప్రజలకు మందులను ఇచ్చేవాణ్ణి తరువాత మందులనివ్వటం మానేసి హరి హరి అని జపం చేయసాగాను అలా హరి అని జపించగా హరిలభించాడు. అని మహారాజు ఒకసారి ఈ రచయితతో చెప్పారు. వారు ఇక్కడికి మొదట వచ్చినప్పుడు ఇక్కడ దేవీదాసు అన్న పేరుతో ఒక సాధువు ఉండేవాడు. అతని వద్దకు అనేక సమాయాలలో అనేక రకాల సాధువులు వచ్చేవారు. అట్లే రామేశ్వరం, పండరీపురం మరియు దక్షిణంలో ఉన్న ఇతర క్షేత్రాలకు పాదచారులుగా వెళ్ళే యాత్రికులకు ఇదిదారి కావటం వలన చాలామంది సత్పురుషుల చరణాలు ఇక్కడ అప్పుడప్పుడూ పడుతుండేవి. వారిలో జానకీదాసు అన్న సాధువు ఇక్కడ చాలా రోజులున్నాడు. అతడు

మంచి యోగ్యతకలవాడు అని అంటారు. అతడు మరియు మహారాజు కలిసి అనేక సార్లు ముచ్చటించకునేవారు. అట్లే సుప్రసిద్ధ గంగగీర్‌బాబా కూడా ఇక్కడికి వచ్చాడు. గంగగీర్ ఇక్కడికి మొదట వచ్చినప్పుడు బాబా రెండు చేతులతో రెండు మట్టికుండల నిండా బావి నుండి నీరు తెస్తున్నారు. వారిని చూచి గంగగీరుబాబా అక్కడున్న ఊరివారితో ఈ మూర్తి ఇక్కడికి ఎప్పుడు వచ్చారు? వీరు ఒక అమూల్య రత్నం, వీరు చాలాగొప్ప యోగ్యత కలవారు. ఈ గ్రామం చాలా భాగ్యం కలది. కనుకనే ఈ రత్నం మీకు లభించింది. అని అన్నాడు. తరువాత గంగగీరుబాబా మహారాజు దర్శనానికి వెళ్ళారు. ఇద్దఱూ చాలా ప్రేమతో ముచ్చటించుకున్నారు. ఇట్లే ఉద్గార మహారాజూ విషయంలో అక్కల్‌కోట ఆనందనాథ్ మహారాజు అన్నారు. వీరు అక్కల్ కోటలోని సుప్రసిద్ధ స్వామికి శిష్యులు. వీరు యవలా వద్ద సావర్‌గాంకు ఒకసారి వెళ్ళినప్పుడు శిరిడీలోని మాధవరావు బసంత్ దేశ్‌పాండే దగడూ, గాయకే నందరాం శివరాం మార్వాడి వారి దర్శనానికి వెళ్లారు. దర్శనమయ్యాక వీరంతా శిరిడీ రావటానికి బయలుదేరారు. అప్పుడు ఆనందనాథ మహారాజు అకస్మాత్తుగా పరుగున వచ్చి వారి బండిలో కూర్చుని నేనుకూడా మీ వెంట వస్తాను అని అన్నాడు. నెవర్ మరియు యవలా గ్రామ ప్రజలు వారిని అడ్డగించాలని ప్రయత్నం చేశారు. కాని అది వ్యర్థమై పోయింది. ఆనందనాథ్ మహారాజు ఇక్కడికి వచ్చినప్పుడు అన్న మాటలు ఇవి "వీరు రత్నం, వీరి నిజమైన వెల వీరు ఎఱుగరు, మీరు వెంటకుప్ప వద్ద ఉన్నా వీరు ప్రత్యక్ష రత్నం' దీనిని బాగా గుర్తించుకోండి" అప్పుడు మహారాజు ప్రసిద్ధికి రాలేదు. ఊరివారు వారిని ఒక సాధారణమైన పిచ్చి ఫకీరని తలచేవారు. అప్పుడు వారి స్థితి చిరిగిపోయిన పాత బట్టలను ధరిస్తాడు. మనసుకు నచ్చిన చోట ఉంటాడు. పిచ్చివాని వలె కనిపిస్తాడు అయినా బ్రహ్మాండ మంతటా ఉంటాడు. అన్నట్లుండేది. మహారాజు ఒకప్పుడు కాలువ వద్ద వెళ్ళి కూర్చుంటారు. ఒక్కోసారి ఊరి చివర శివారు వద్ద ఉన్న ఒక వేప చెట్టు క్రింద కూర్చునేవారు. మరోకప్పుడు వెళ్ళి ఎవరి పొలం మడిలో నైనా కూర్చొనేవారు. వారి శరీరం పై చిరిగిన బట్టలుండేవి. ఒక్కొక్కప్పుడు ఉగ్రరూపాన్ని ధరించేవారు. ఇలా ప్రవర్తించటం వలన సామాన్య మానవులకు వారు పిచ్చివారిగానే కనిపించేవారు. కాని త్వరలోనే లోకుల భ్రమ తొలగిపోయింది. వారి మహిమ శిరిడీ ప్రజలకు తెలిసి వచ్చింది.

మహారాజుకు మసీదులో మరియు దేవాలయాలలో కూడా అనేక దీపాలను వెలిగించటం ఇష్టం - అంటే 'ఇష్టం' అని వ్యవహారిక దృష్టితో చెప్పటం కాని వాస్తవానికి వారి చర్య ఏదో కోరికను తీర్చుకోవాటానికి కాదు. వారికి కోరిక అంటూ అసలు లేనేలేదు. మరి ఏదో

ఇతర కారణం అంటే అది ప్రజల శ్రేయస్సుకైనా ఉండాలి? దీపాలకోసం, వారు నూనె వర్తకుల వద్ద నూనెను అడుక్కుని తెచ్చేవారు. కొన్ని రోజులు వారికి వ్యాపారులు నూనె ఇచ్చారు. ఆ వ్యవహారిక మనుష్యులు అలా ఎన్ని రోజులు నూనెను ఇస్తారు? వారు ఒకరోజు మహారాజుతో నూనె లేదని చెప్పారు. దాని వలన వారి నిత్య కార్యక్రమంలో లోటు ఉంటుందా! మహారాజు ప్రమిదలలో నూనెకు బదులుగా నీరును పోసి వత్తులను వేసి రోజూలాగే వానిని వెలిగించారు. మహారాజు ఈ ప్రయత్నం చేస్తుండగా ప్రజలకు వారి పిచ్చి విషయం నిజమేననిపించసాగింది. కాని వారు అగ్గిపుల్ల గీసి దీపాలను వెలిగించటం, అవి రాత్రంతా వెలుగుతుండటం చూచి ప్రజలు నిశ్చేష్టులయ్యారు. వారు మహారాజుకు శరణుజొచ్చారు. వారిని అవహేళన చేసినందుకు క్షమాపణ కోరారు. అనేక మంది మహారాజును రకరకాలుగా మోసగించారు. వారు చాలా భయపడ్డారు. కాని మహారాజు పూర్ణదయాళువు. అపకారం చేసిన వారిని కూడా ఉపేక్షించకుండా ఉపకారమే చేయటం వారి వ్రతం. అందువలన ఎవరు కూడా భీతి చెందనవసరం లేదు. వారు ప్రజలందరిని తమ సంతానం వలె ప్రేమతో సంరక్షిస్తారు. ఊరిపైకి ఏ కష్టం మచ్చినా మహారాజు దాని గురించి ముందుగానే సూచించే వారు. వారు చెప్పిన విధంగా నడుచుకున్నవారు నిర్భయంగా ఉండేవారు.

మహారాజుయందు ఊరివారందరికీ శ్రద్ధ ఉన్నా వారితో సన్నిహిత సంబంధమున్నవారు చాలా తక్కువే. మహారాజు యొక్క క్రోధవృత్తి కారణంగా వారితో సన్నిహితంగా ఉండగల ధైర్యం ఎవరికీ ఉండేదికాదు. జనులరాక పోకలు మసీదులోకి చాలా తక్కువగా ఉండేవి ఆ రోజులలో అక్కడి దేశపాండే కుటుంబానికి చెందిన మాధవరావు రాకపోకలు ఎక్కువగా సాగాయి. మసీదు ఆవరణను ఆనుకొని ఒక చిన్న ఇల్లు ఉండేది. అక్కడ ఆకాలంలో మరాఠి పాఠశాల ఉండేది. ఆ పాఠశాలలో మాధవరావు మాస్టారుగా ఉండేవాడు. అతడు అప్పుడుప్పుడూ పాఠశాల నుండి మసీదుకు వెళ్ళేవాడు. అక్కడ చిలుం నింపి తనూ పీల్చి మహారాజుకు పీల్చడానికి ఇచ్చేవాడు. ఏ కారణమైతేనేమి మాధవరావుకు మహారాజుతో సంబంధం ఏర్పడింది. అలా మహారాజు అతని మనసును ఆకర్షించుకున్నారు. కొన్ని సం॥ల తరువాత మాధవరావు అన్ని పనులూ మానుకొని కేవలం మహారాజు సేవ మరియు వారి వద్దకు వచ్చే భక్తుల సేవ మాత్రమే చేసేవాడు. ఈ సేవకు బదులుగా మాధవరావు ఎప్పుడూ దేనిని కోరలేదు. ఇప్పుడు కూడా అతనికి మహారాజు యొక్క భక్తులతో సన్నిహిత సంబంధముంది. ఎంతో మంది భక్తులు మాధవరావు సలహాలేకుండా అడుగు ముందుకు వేయరు. మహారాజు శిరిడీ విడిచి చాలావరకు ఎక్కడకీ వేళ్ళేవారు కాదు. నింగాంలో బాబాసాహేబు డేంగలె అన్న భక్తుడుండేవాడు అక్కడికి వెళ్ళేవారు. ఒకప్పుడు చంద్రభాన్

సేటు మార్వాడి వద్దకు వెళ్ళేవాడు. చంద్రభాన్ సేట్ మరణించినాక అతని అంగడిలోని వ్యవహారాన్ని ఖుశాల్ చంద్ సేటు చూచేవాడు. ఖుశాల్ చంద్ సేటును మహారాజు తరచూ పిలువనంపేవారు. మరియు ఎవరైనా రహతా నుండి వస్తే వారిని ఖుశాల్ చందు కలిశాడా అని అడిగేవారు. నింగాం బాబాసాహేబు డేంగలే బంధువునానాసాహేబు డేంగలె జాలి నింగాలో ఉండేవారు. అతనికి పుత్రుడు లేడు. మొదటి భార్యకు మగ బిడ్డ కలగలేదని రెండో భార్యను చేసుకున్నాడు. అయినా కూడా లాభం లేకపోయింది. తరువాత నానాసాహేబు డేంగలె వారి దర్శనానికి వచ్చాడు. అప్పుడు వారు పుత్రుడు కలుగుతాడని ఆశీర్వదించారు. ఆ ఆశీర్వాదంతో ఒక శుభ సమయాన, అతనికి పుత్రుడు కలిగాడు. అందువలన నానా సాహేబుకు వారిపై శ్రద్ధ కుదిరి, అతడు వారి వద్దకు తరచు రాసాగాడు. అతనికి ప్రభుత్వ కార్యాలయంలో బాగా పలుకుబడి ఉండటం వలన అతడు సహజంగానే వారి గుణాలను, అక్కడ పనిచేసేవారి వద్దగానం చేశాడు. దాంతో వెంటనే కలెక్టరు సెక్రెటరీ చిదంబర కేశవ్ (అణ్ణాసాహేబు గాడిగిల్) కొంతమందితో మహారాజు దర్శనానికి వచ్చాడు. అణ్ణాసాహేబు గాడ్‌గిల్‌కు వారిపై శ్రద్ధ అభివృద్ధి అయి ఆతడు వారికి పరిపూర్ణ భక్తుడయ్యాడు. మహారాజు ఏ మసీదులో నివసించేవారో అది పూర్తిగా శిధిలమైపోయి క్రిందనేల బాగాలేక పై నుండి కూడా మట్టి పడే స్థితిలో ఉండటం వలన, నానాసాహేబు డేంగలె మహారాజు పడుకోవటానికని ఒక చెక్కపలకను తెచ్చి ఇచ్చాడు. మహారాజు ఒట్టినేలపై పడుకోకుండా ఆ పలకను క్రింద వేసి దానిపై పడుకోవాలనివారు ఆ చెక్కపలకను శయనించటానికి ఉపయోగించారు, కాని ఆ పలకను నేలపై వేయకుండా దానిని మసీదు చూరుకు విచిత్రంగా పాత గుడ్డ పీలికతో కట్టి వ్రేలాడదీసి దానిపై నిద్రించేవారు. ఆ గుడ్డ పీలికలను చూస్తే అవి చెక్కపలక బరువును కూడా మోయ గలిగేలాలేవు. కాని మహారాజు ప్రభావం వలన అవి ఆ చెక్క పలకనేకాక మహారాజు శరీర బరువును కూడా మోయగలిగేవి. దానిపై నిద్రించేటప్పుడు మహారాజు నలువైపులూ వెలుగుతున్న ప్రమిధలను ఉంచేవారు. ఆ పలకపైన మహారాజును చూడటం చాలా ఉత్సాహంగా అనిపించేది. అనేకమంది దూరాన నుంచుని ఆ కౌతుకాన్ని చూచేవారు. అయితే మహారాజు చెక్కపైకి ఎక్కేటప్పుడు గాని లేదా దిగేటప్పుడుగాని ఎవరూ చూడలేదు. చాలాసార్లు జనులు ఆవింతను చూడటానికి నిగావేసి ఉండేవారు. కాని మహారాజు ఎక్కడం దిగటం ఎవరికీ కనిపించటేదు. ఆ విచిత్రాన్ని చూడటానికి చాలా జనం గుమి కూడగా, ఈ గొడవను తొలగించటానికి ఆ పలకను మహారాజు ఒకరోజు విరగొట్టేశారు.

నానాసాహేబు డేంగలె మొదట దేనికోసం మహారాజు దర్శనానికి వచ్చాడో దానికోసమే ముల్కి సర్కిలు ఇన్స్పెక్టరు గోపాలరావు

గుండు కూడా వారి దర్శనానికి వచ్చాడు. ఇతనికి ముగ్గురు భార్యలున్నా పుత్ర సంతానం లేదు. ఇతనికి కూడా వారి ఆశీర్వాదంతో అబ్బాయి కలగగా ఇతడు కూడా వారికి పూర్తిగా భక్తుడయ్యాడు. శిదిలమైపోయిన మసీదును మరల నిర్మించాలని అతనికి అనిపించి, ఆ పనికోసం బాగా రాళ్ళు సేకరించాడు. కాని మహారాజు అతనికి మసీదు నిర్మాణానికి అనుమతినివ్వలేదు. ఈ పనిని మరో భక్తునితో చేయించవలసి ఉండింది. గోపాలరావు పోగు చేసిన రాళ్ళను మహారాజు ఆజ్ఞతో ఇక్కడి శని, మరియు ఇతర దేవాలయాల జీర్ణోద్ధరణకు ఉపయోగించారు. మహారాజుకు అన్ని దేవాలయాలపై దృష్టి ఉండేది. ఇక్కడి మారుతీ మందిరాన్ని కూడా వారు జీర్ణోద్ధరణ చేయించి, దానిని విస్తారంగా కూడా చేయించారు. గ్రామంలోని దేవాలయాలపై దృష్టి ఉన్నట్లే, ఇక్కడి పీరుల సమాధులపై కూడా వారి దృష్టి ఉండేది. ఊరి శివారు వద్ద వేప చెట్టు క్రింద అప్పుడప్పుడు కూర్చునేవారని సైన చెప్పాను కదా అక్కడే ఒక పీరు సమాధి ఉంది. అని వారు ఒకసారి అన్నారు. మరియు అక్కడ త్రవ్వి చూడగా అక్కడ నిజంగానే సమాధి కనిపించింది. తరువాత ఆరోజు జనం వారిని వాద్యాలతో ఊరేగించారు. ఈ సమాధి గురించి వారు ఈ రచయితతో, ఇది మా తండ్రిగారి స్థానం. ఇక్కడ ప్రతిగురు, శుక్రవారాలు అగరువత్తులు వెలిగిస్తే, మనకు శుభప్రదం అని చెప్పారు. ఒకసారి గోపాలగుండు మనసులో ఇక్కడ (శిరిడీ) మహారాజు ప్రీత్యర్థం వార్షికోత్సవం లేదా ఉరుసు జరింపంచాలని సంకల్పం కలిగింది. దానిని అతడు గ్రామంలోని తాత్యాపాటిల్, దాదా కోతెపాటీలు, మాధవరావు దేశ్‌పాండే, మొదలగు భక్తులకు తెలియజేయగా వారికి అది నచ్చి వారు దాని కొఱకు ఏర్పాటు చేయాలని నిశ్చయించుకున్నారు. కాని అప్పుడు అక్కడున్న కులకర్ణి అడ్డుతగలగా, పరిణామంగా కలెక్టరు జాతర జరపరాదని ఆజ్ఞజారి చేశాడు. అయితే జాతర జరపటానికి మహారాజు పూర్తి ఆశీర్వాదం ఉండటంవలన, జనం మరల కలెక్టరు వద్ద అర్జీ దాఖలు చేసి మొదటి ఆజ్ఞను రద్దు చేయించి, జాతర జరపటానికి అనుమతిని తెచ్చుకున్నారు. ఆ జాతర మహారాజు ఆజ్ఞతో రామనవమికి జరపటానికి నిశ్చయమైంది. అప్పటి నుండి అది ప్రారంభమై ఇప్పటికి కూడా ప్రతి రామనవమికి జాతర జరుగుతుంది ఆ జాతర పనులు శిరిడీలోని తాత్యాగణపతి పాటీలుకోతే చూచుకునేవాడు. అతనిపై మహారాజుకు అత్యంత ప్రేమ. ఇతడు వారిని మామా అని అనేవాడు. ఇతని తల్లి సౌ॥ బాయజాబాయి వారి సేవ చాలా బాగా చేసింది. గ్రామంలోని అనేకులు వారిని పిచ్చివాడని అన్నప్పుడు ఆమె సేవ చేసింది. మహారాజు మునుపు రోజుకు నాలుగైదు సార్లు ఊళ్ళోకి భిక్షకు వెళ్ళేవారు అయినా సౌ॥బాయిజాబాయి వారిని ఎప్పుడూ విముఖులను చేయలేదు. అంటే ఈ సేవా ఫలితం బాయజాబాయికి

లభించటమేకాక ఆమె కుటుంబానికి విశేషంగా తాత్యాకు లభించింది. తాత్యాకు మహారాజు డబ్బు ఇచ్చేవారు. అంతేకాదు అతనిని అన్ని విధాలా గారాబం చేసేవారు. సాయంకాలం రోజూ తాత్యా వారి వద్దకు వెళ్ళేవాడు. అప్పుడు ఆమామా అల్లుళ్ల ప్రేమ కన్నుల పండుగ వలె చూడముచ్చటగా వారి ప్రేమ సంభాషణ విన పొంపుగా ఉండేది. అట్లే మసీదులో మరియు చావడిలోని అన్ని పనులూ తాత్యాయే చూచుకునేవాడు. తాత్యా మహారాజు చేయిపట్టుకుని తీసుకొని వచ్చి వారికి ఆసనం వేసి దానిపై వారిని కూర్చోబెట్టేవాడు. చిలుం కూడా తాత్యానే నింపి ఇచ్చేవాడు. రామనవమి జాతరకు అంటే రామనవమి రోజునే రెండు పెద్ద పతాకాలు ఊరేగింపుగా బయలుదేరి మసీదుకు వచ్చేవి. అక్కడ ఈ రెండు పతాకాలు, కట్టబడేవి. వానిలో ఒకటి శంకర్‌రావు రఘునాథ్ దేశపాండే (నానాసాహెబు నిమోంకర్) వద్ద నుండి, రెండవది నగర్‌లోని దామూసేఠ్ కాసార్ వద్ద నుండి వచ్చేవి. నానాసాహెబు నిమోంకరు నిమోను గ్రామానికి దేశ్‌పాండే, నిమానుగ్రామం సంగమనేరు తాలుకాలో ఉంది. నానాసాహేబు నిమోంకరు తాలుకాలోని పుడారి గృహస్థులలో ఉండగా ప్రభుత్వం అతనిని హనరరి మెజిస్ట్రేటుగా నియమించారు. ఈ పనిని అతడు చాలా సంవత్సరాలు చేశాడు. చివరకు వయసు మళ్ళిందని అతడు దానిని మానేశాడు. అతని చిన్నాన్న ఇక్కడ ఉండేవాడు కనుక అప్పుడుప్పుడూ అతడు ఇక్కడికి వస్తుండేవాడు. చిన్నాన్న చెప్పగా మహారాజు దర్శనానికి వచ్చేవాడు. క్రమేణా అతనికి మహారాజు పై శ్రద్ధ అభివృద్ధి అయి, చివరి 3 సంవత్సరాలు అతడు వారి అఖండ సేవలోనే ఉన్నాడు. స్నాన సంధ్యాది నిత్య కర్మలు ముంగించుకోవటానికి మాత్రం ఇంటికి వెళ్ళి మిగతా సమయమంతా మహారాజు సేవలో తత్పరుడై గడిపాడు. సేవ చేయటంలో పోమరితనంగాని విశ్రమించాలనే కోరికగాని ఎప్పుడు అతని దరి చేరలేదు. మహారాజు అతనిని కాకా అని పిలిచేవారు. వారి తరువాత అతడు చాలా రోజులుండలేదు. అతి త్వరలోనే వారు తమ పాదాల చెంతకు తీసుకెళ్ళారు. వారి కృపతో అతని అవసానం బాగా జరిగింది. అతని చివరి మూడు రోజులూ, అతనికి అంతటా సాయి మహారాజే కనిపించేవారు, మరియు ఎవరు దగ్గరికి వచ్చినా సాయిబాబా అనేవాడు తన భార్యను కూడా సాయిబాబా అని అనేవాడు అతడు పొరపాటు పడ్డాడు అని అతని భార్యకు అనిపించింది. నేను బాబాను కాదు. నేనుమీ భార్యను అనిచెప్పితే అతడు నీలో బాబాయే ఉన్నారు. నువ్వు బాబావే అని అనేవాడు. ఆ విధంగా మహారాజు యొక్క అఖండ స్మరణలో అతడు మరణించాడు.

రామనవమికి రెండవ పతాకం దామూసేఠ్‌ది అని పైన చెప్పాను కదా, అతనికి ఇద్దఱు భార్యలున్నా పుత్ర సంతానం లేదు.

అందువలన అతడు చాలా దుఃఖ పడేవాడు. ఒకసారి మాదవరావు దేశ్‌పాండే మామ రావు। గోవిందరావు సావ్‌కర్ అతనికి శిర్డీకి వచ్చి మహారాజు ఆశీర్వాదాన్ని తీసుకొమ్మని సూచించాడు. అట్లే అతడు వచ్చాడు. వారు అతనిని ఆశీర్వదించారు. తరువాత ఆ ఆశీర్వాదంతో అతనికి పుత్రుడు కలిగాడు. అలా అతనికి మహారాజుపై నిష్ఠ కుదిరింది.అప్పటినుండి రామనవమికి ఒక క్రొత్త పతాకాన్ని తీసుకొని వచ్చేవాడు. మరియు ఆరోజు ఇక్కడ గుమి గూడిన వారికందరికీ భోజనం పెట్టేవాడు. ఆ నియమం ఇప్పటికీ సాగుతూనే ఉంది.

రామనవమి జాతర ప్రారంభం కావటానికి కొన్ని సంవత్సరాల పూర్వం మహారాజు ఏ కోరికలూలేని ఒక భక్తుని తమ వద్దకు లాక్కున్నారు. అతడు రా। నారాయణ గోవింద (నానాసాహెబు చందోర్కరు) ఇతడు కల్యాణ్‌లో ఉండేవాడైనా అప్పుడు నగర్ కలెక్టరు వద్ద సెక్రెటరిగా ఉండేవాడు. ఒక రోజు అక్కడి కులకర్ణి రా।కేశవ్ అనంత్ (అప్పా) అతనితో మిమ్మల్ని మహారాజు పిలువనంపారు అని చెప్పాడు. ఈ మాట నానాసాహెబుకు మొదట నిజమనిపించలేదు. అందువలన ఊరికెనే వారి పేరు ఎందుకు చెప్పుతావు నీకు నాతో ఏమైనా పని ఉంటే స్పష్టంగా చెప్పని అన్నాడు. అప్పుడు అప్పా నిజంగానే వారు నిన్ను పిలిచారు. అని గట్టిగా చెప్పగా నానా వారి దర్శనానికి వచ్చాడు. త్వరలోనే అతనికి వారిపై శ్రద్ధ కుదిరింది. తరువాత అతడు అక్కడికి తరుచూవస్తూ వారి బోధామృతాన్ని ఆస్వాదించేవాడు. మహారాజు అతడు గంటలు గంటలు సమావేశమయ్యేవారు. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ఈ భగవదుక్తి వలెనే నానాసాహెబు ప్రణిపాత పరిప్రశ్న మరియు సేవ ఉండేవి. మహారాజు అతనికి బోధించేవారు. ఒకసారి ఇదేశ్లోకానికి వారు సుమారు ఒక గంటసేపు వ్యాఖ్యానించారు. ఆ ప్రవచనంతో సాయిబాబాకు సంస్కృతం చక్కగా తెలుసునని నానాసాహెబుకు బాగా నిశ్చయమైంది. నానాసాహెబు మహారాజు సేవ అత్యంత ఉత్తమంగా చేశాడు. విశేషంగా రెండు విషయాలు భక్తులకు చిరస్మరణీయంగా ఉంటాయి. ఒక్కటి పాత మసీదు పునరుద్ధరణ, మరియు విస్తీర్ణంగా చేయించటం. నానాసాహెబు ఈ పనిని స్వయంగా చేయించే అవకాశంలేక, నానానిమోంకరు విన్నపంపై ఇక్కడే ఉండి స్వయంగా చూస్తూ ఆ పనిని చక్కగా నిర్వర్తించాడు. మసీదు మరమ్మత్తు చేయించటానికి మహల్సాపతి ద్వారా మహారాజు అనుమతిని తీసుకున్నాడు. కాని ఆ పని జరుగుతుండగా మహారాజు అప్పుడుప్పుడూ పనిని చెడగొట్టేవారు. మరియు పెద్ద పెద్ద రాళ్ళను తమ చేత్తో దూరంగా పారవేసేవారు. దాంతో ఆ పనిని మరల చేయాల్సి వచ్చేది. ఇది ఇతరులకు చమత్కారంగా ఉండవచ్చు కాని అందులోని వాస్తవమైన ఉద్దేశం తెలిసిన వారికి వారి చర్య క్రొత్తగా అనిపించదు.చివరకు మసీదు పని పూర్తి అయింది.

ఆ రోజు మహారాజు నింగాకు వెళ్ళగా, వారిని అక్కడి నుండి వాద్యాలతో తీసుకొనివచ్చి మసీదులో కూర్చుండబెట్టారు. ఈ మసీదు పని చేయటంలో ఇక్కడి సుతార్ కొండాజి గవాజి మరియు తుకారాం ఈ ముగ్గురు సోదరులు చాలా ఉపయోగపడ్డారు. మహారాజు శరీరావసానం వరకు మసీదు చిమ్మటం, వారి గిన్నెలను తోమటం వారికి మొహం కడుక్కోవటానికి నీరు కాచటం మొదలగు పనులన్నీ తుకారామే చేసేవాడు మహారాజు ఈ పనిని వేరే ఎవరినీ చేయనిచ్చేవారు కాదు. ఇప్పటికీ రామనవమికి పతాకాల ఊరేగింపు ఈ సుతార ఇంటివద్ద సిద్ధమై అక్కడి నుండే బయలుదేరుతాయి.

నానాసాహెబు యొక్క రెండవ గొప్పకార్యం, మహారాజు కీర్తిని వ్యాపింపచేసి ప్రజలకు వారి ఆశీర్వాదలాభాన్ని కలిగించటం ఇతడు ముందు మామలేదారు. తరువాత డిప్యూటీ కలెక్టరు. కావటం వలన ఎక్కువగా తిరగవలసి వచ్చేది. అలా అతడు వెళ్ళే ప్రదేశాలలో ప్రజలకు మహారాజు గుణాల వర్ణన చేసి వారికి దర్శనోత్సుకత కలిగించేవాడు. ఈ రచయితకు మహారాజు యొక్క దర్శన లాభానికి కారణం నానాసాహేబ్. ముంబై మరియు థాణె జిల్లాలలోని వేలజనం మహారాజు దర్శనం చేసుకొని ఆనందలాభాన్ని పొందారు.. దీనికి కారణం కూడా నానాసాహెబే. మహారాజు ముంబై ప్రజల మనసులను ఆకట్టుకోవటానికి నానాసాహెబే కాక మరో ఇద్దరు వ్యక్తులు విశేష కారణభూతులయ్యారు. వారిలో ఒకరు రావు గణేశ్ దత్తాత్రేయ సహస్రబుద్ధి అంటే దాసగుణు. ఇతడు ముందు పోలీసు ఉద్యోగిగాఉండేవాడు. ఇతనికి నాటక ప్రదర్శనాలలో చాలా ప్రీతి. నానాసాహెబు వలన ఇతడు మహారాజు దర్శనానికి వచ్చాడు. తర్వాత అతని మనసుపై మహారాజు ప్రభావం ఎంతగా పడింది అంటే ఇతడు ఉద్యోగాన్ని వదిలేసి సత్పురుషుల చరిత్రలను హరికథల రూపంలో మరియు గ్రంథరూపంలో వ్రాసి ప్రజలలో ప్రచారం చేయ ప్రారంభించాడు. ఇది ఇంకా సాగుతూనే ఉంది. ఇతడు ఆర్వాచీన భక్తలీలామృతం, సంత్‌కథామృతం, భక్తిసారామృతం అన్న సత్పురుషుల చరిత్రాత్మక గ్రంధాలను వ్రాశాడు. అవేకాక ఈశావాస్యోపనిషత్తు మరియు శ్రీ జ్ఞానేశ్వర మహారాజు యొక్క అమృతానుభవం-ఈ రెండు గ్రంధాలకు మరాఠీలో సరళమూ మరియు సుబోధమైన టీక వ్రాశాడు. ఇని కాక మరి ఇతర గ్రంధాలు కూడా ఉన్నాయి. నానాసాహేబు చందోర్కరు ఇతనిని ముంబైకి తీసుకుని వెళ్ళి ఇతని భక్తిరసపూరిత హరికథల ద్వారా మహారాజు యొక్క గుణాలను శ్రవణం చేసే లాభాన్ని ముంబై వారికి కలిగించాడు. ఇతని కీర్తనల వలన ముంబై మరియు ముంబై సమీపంలోని చాలా మంది సాయి దర్శనం చేసుకోవాలన్ని ఆతురతో వారి దర్శనానికి వెళ్ళారు. ఇక పైన చెప్పిన రెండవ వ్యక్తి ఈ

రచయిత అంటే (నేనే). ఇతడు మహారాజు పాదాలవద్ద చాలాకాలం ఉండటం వలన ముంబై ప్రజలతో ఇతనికి మంచి పలుకుబడి ఉండటంవలన అక్కడి ప్రజలు సాయి దర్శనానికి బాగావచ్చేవారు. అలా 1910 నుండి మహారాజు దర్శనానికి వచ్చేవారి సంఖ్య బాగా పెరగసాగింది. నానా చందోర్కరు వచ్చినప్పుడు ఇక్కడికి బాబా దర్శనానికి వచ్చేవారు. బస చేయటానికి ఒక వసతి గృహమైనా లేదు. కాని ఈ లోటును మహారాజు త్వరలోనే తీర్చారు. ఈ జిల్లాలో రావుబహదుర్ హరివినాయక్ సాఠే డిప్యూటీ కలెక్టరుగా ఉండేవాడు. అతని మొదటి భార్య చనిపోయి చాలాకాలమైనా మరల పెళ్ళి చేసుకునే కోరిక అతనికి లేదు. అతనికి పుత్రసంతానం లేనందువలన మరల పెళ్ళి చేసుకొమ్మని అతనిని బలవంత పెట్టారు. చివర మహారాజు దర్శనానికి వెళ్ళి వారు చెప్పినట్లు చేయాలని నిశ్చయించుకున్నాడు.. మహారాజు అతనికి వివాహం చేసుకోమని అనుమతినిచ్చారు. మరియు అతనికి అబ్బాయి కలుగుతాడని ఆశీర్వాదమిచ్చారు. రావు బహదుర్‌కు నచ్చిన అమ్మాయిని చూచుకుని ఆమెను మహారాజుకు చూపించాలని అతని తండ్రి గణేశ్ దామోదర్ కేలెకర్‌కు చెప్పాడు. అట్లే అమ్మాయిని తీసుకుని వెళ్ళగా మహారాజు ఆమె ఒడిలో ఒక ఖర్జుర పండును వేసి ఆమెకు కుంకమ బొట్టు పెట్టారు. శుభసమయంలో పెళ్ళి జరిగి తరువాత త్వరలోనే మహారాజు సూచించిన ప్రకారం అతడు వేపచెట్టు చుట్టు ముట్టూ ఉన్న స్థలాన్ని కొని అక్కడ ఒక భవనాన్ని కట్టించాడు. దాని వలన దర్శనానికి వచ్చేజనానికి బస చేయటానికి సౌకర్యం ఏర్పడింది. తరువాత మూడు సంవత్సరాలకు మహారాజు ఈ రచయిత ద్వారా ఒక భవనాన్ని నిర్మింపచేశారు. తరువాత నాగపూర్ భాగ్యవంతుడు గోపాలరావు (బాపూ సాహెబు బుట్టి) ద్వారా ఒక భవనాన్ని నిర్మింపచేశారు. ఈ భవనం చాలా పెద్దది పైగా మొత్తం రాళ్ళతో నిర్మింపబడి చాలా గట్టిగా ఉంది. దీనికి బాగా ఖర్చు కూడా అయింది. శిర్డీ సమీపాన గాని మొత్తం తాలూకాలోగాని ఇటువంటి భవనం ఉన్నట్లు లేదు. ఈ భవవంలోనే మహారాజుగారి సమాధి ఉంది.

శిర్డీ త్వరలోనే ఒక సంస్థానంగా రూపుదిద్దు కోసాగింది. మహారాజుకు హారతులు జరగసాగాయి మరియు మహారాజుకు హారితివేళ వింజామరలు, ఛత్రచామరలు వీచసాగారు. వారు చావడీకి వెళ్ళేటప్పుడు వాద్యాల ఘోషతో గుఱ్ఱం వల్లకి, పతాకంతో దండధారులు, భజన చేసేవారు వెంట వేళ్ళేవారు. చావడి అద్దాలతోను రకరకాల వస్తువులతో అలంకరింప బడి శోభిల్లేది. మసీదులోను చావడిలోనూ నేలను చదునుగా చేయబడింది. ఇన్ని హంగులకు కారకురాలు చాలావరకు కీ.శే. సుందరీబాయి క్షీరసాగర్ లేదా రాధాకృష్ణమ్మ. ఈ

ప్రేమమయి, భక్తిలో నిష్ణాతురాలు అని చెప్పటంలో అడ్డులేదు. ఈమెవద్ద ధనంలేదు కాని తన తనువు మనసులను మహారాజుకు సమర్పించి వారి భక్తుల నుండి అనేకరకాల వస్తువులను తెప్పించి శిరిడీ సంస్థానాన్ని ఉత్తమంగా తయారు చేసింది. దుర్దైవం కారణంగా ఆమె త్వరగానే అంటే తన 35వ సంవత్సరంలో అవతారాన్ని చాలించింది. ఆమె ఇక్కడ 8 లేదా 9 ఏళ్ళు మాత్రమే ఉంది. కాని ఆ సమయంలోనే ఆమె చేసినదాన్ని ఇతరులు 25 ఏళ్ళలో కూడా చేయగలరో లేదో అని సందేహం. ఈమె కారణంగానే మహారాజుకు చావడిలో రాత్రి శేజారతి మరియు తెల్లవారు ఝాము కాకడ హారతి ప్రారంభమయ్యాయి. మహారాజు ముందు తమ పూజను చేయనిచ్చేవారు కాదు. ప్రథమ పూజను మహల్సాపతితో స్వీకరించారు. తరువాత కొన్ని రోజులయాక నింగాం ఊరి సీతారాండేంగలే పూజను చేయటానికి రాగా మహారాజు అతని పై కోపగించారు కాని చివరకు అతనిని పూజ చేయనిచ్చారు. తరువాత కొన్ని రోజులకు నానాసాహెబు చిన్న కొడుకు మహదేవ్(బాపూ)ను పూజ చేయనిచ్చారు. ఆ తరువాత అందరికీ పూజ చేయటానికి అనుమతి లభించింది. కాని అప్పుడు మహారాజు తమ హారతిని చేయనిచ్చేవారు కాదు. కొంతకాలానికి ప్రథమంగా హారతిని ఇచ్చిన గౌరవం లక్ష్మణకృష్ణ లేదా తాత్యాసాహెబు నూల్కరుకు లభించింది. ఇతడు పండరిపురంలో మునసబుగా ఉండి జబ్బుపడటం వలన సెలవుపై ఇక్కడికి వచ్చాడు. కాని మనసులో ఉద్దేశం ఉద్యోగం మానేసి. శేష జీవితాన్ని మహారాజు చరణాల వద్ద గడపాలని, చివరకు అట్లే జరిగింది.

రాధాకృష్ణమ్మ అన్నిరకాల పనులు తాను స్వయం చేసేది. రోజూ రెండుసార్లు మహారాజు వెళ్ళే మార్గాన్ని చిమ్మి శుభ్రపరచేది. అంటే దారిలో పడి ఉన్న చెత్తనంతా స్వయంతానే తీసేది. ఈ పద్ధతిని ఆమెకు ముందు బాలాజీ పటేలు నేవాస్కరు ప్రారంభించాడు. ఇతడు పూర్తిగా విరక్తి చెందిన భక్తుడు. సంసార గొడవలన్నింటినీ వదిలేసి ఇక్కడికి వచ్చి ఉండేవాడు. ఇతనికి నచ్చచెప్పి తీసుకుని వెళ్ళాలని చాలామంది వచ్చారు. కాని ఇతడు వెళ్లలేదు. ఇతడు ఎప్పుడూ దారులను చిమ్మటం, మసీదును అలకటం వగైరా పనులను చేసేవాడు. మహారాజును దూరంనుండే దర్శించుకునేవాడు వారి దగ్గరకు వెళ్ళేవాడుకాడు. ఇతడు మహారాజు చరణతీర్థాన్ని లేదా వారు స్నాం చేసేటప్పుడు వారి శరీరంపై నుండి పడే నీరును లేదా వారి ఉచ్ఛిష్ట నీటినే త్రాగేవాడు. పొలంలో పండిన ధాన్యాన్నంతా మహారాజు వద్దకు తెచ్చి అందులోనుండి మహారాజు ఇచ్చినంతనే తీసుకెళ్ళేవాడు. చాలావరకు మహారాజు మొత్తం ధాన్యాన్ని తిరిగి ఇచ్చేసేవారు. రెండేళ్ళు ఇక్కడున్న తరువాత మహారాజు బాలాజీ పాటిలును ఇంటికి వెళ్లమని ఆజ్ఞాపించారు. అందువల్ల అతడు వెళ్లాడుకాని తరచూసాయి

దర్శనానికి వచ్చేవాడు. తన పంటనంతా మహరాజుకు అర్పించేవాడు. తరువాత కొంతకాలనికి చనిపోయాడు. రాధాకృష్ణమ్మ అన్నిరకాల పనులూ, స్వయంగా చేసేది. ఇంతేకాదు, మహరాజు యొక్క అనేక భక్తులతో వారి సేవను చేయించేది. ఆమె ఎన్నెన్నోరకాల పనులు చేస్తూ అందటినీ, ప్రోత్సాహపరిచేది. అందఱూ ప్రేమగా ఉత్సాహంగా పని చేసేవారు. వారిలో అన్నితరగతుల వారూ స్త్రీలు కూడా ఉండేవారు. మట్టి, రాళ్ళు మోయటం మట్టి తడపటం. గుంతలు త్రవ్వటం, మరల మూయటం, మొక్కలునాటటం, కట్టెలు కొట్టటం కుండలు వగైరా సామానులను శుభ్రపరచటం, మసీదు కడగటం ముగ్గులు వేయటం, కాగితపు పూలను తయారుచేయటం, వింజామరలను పతాకాలను కుట్టటం మొదలగు అన్ని రకాల పనులు పెద్ద పెద్ద వారి పెద్దింటి కులస్త్రీలు కూడా చేసేవారు మరియు తమకు సేవ చేసేఅవకాశం లభించిందని ఆనందపడేవారు.

మహరాజు నిత్య కార్యక్రమం చాలా నియమంగా ఉండేది. వారు తెల్లవారుఝామునే ధుని వద్ద కూర్చునేవారు. కాసేపయాక కాలకృత్యాలు తీర్చుకునేవారు. తరువాత కాసేపు ఊరికెనే కూర్చునేవారు. ఆ సమయాన భాగోజి శిండె అన్న గృహస్థు వచ్చి మహరాజు కుడిచేతికి ఉన్న పట్టివిప్పి చేతిని మర్దించేవాడు. వారి వళ్ళంతా పట్టేవాడు. తరువాత చిలుంనింపి వెలిగించి మహరాజుకు పీల్చటానికి ఇచ్చేవాడు. మహరాజు తాము పీల్చి, బాగోజీకి పీల్చటానికి ఇచ్చేవారు. ఇలా అయిదు ఆరు సార్లు పీల్చాక బాగోజి వెళ్లేవాడు. ఈ భాగోజికి కుష్ఠువ్యాధి ఉండేది. అయినా మహరాజు ఎప్పుడూ కూడా అతనిపై విసుక్కునేవారు కారు. అతనికి సంబంధించిన తమనిత్య కార్యక్రమాన్ని ఏం మార్పు చేయలేదు. భాగోజి వెళ్లిపోయిన తర్వాత కాసేపు కూర్చునేవారు. ఆ సమయాన నియమంగావచ్చే కొందఱు భక్తులు వారికి సేవ చేసేవారు. తరువాత మొహం కడుక్కోవటానికి లేచేవారు. వారు తమ ముఖాన్ని కడుక్కోవటం చూడతగినదిగా ఉండేది. చేతులపైన కాళ్ళపైన మొహంపైన చెవులపైన నీరు బాగాపోసి ఈ భాగాలను చక్కగా శుభ్ర పరచేవారు, దీనిని వారు అత్యంత నాజూకుగా చేసేవారు. వారి స్నానం యొక్క సమయం కూడా ఇట్లే ఉండేది. మొహం కడుక్కున్న తర్వాత భిక్షకోసం ఊళ్లోకి వెళ్లేవారు. భిక్షకోసం నియమంగా అయిదు చోట్లకు వెళ్ళి ఒక స్తలంలో నుంచునే వారు. రొట్టి మరియు, కూర ఏదో వేసిన దానిని తీసుకుని మసీదుకు వచ్చి కొంచెం తినేవారు. తిన్న తరువాత కొంతసేపు భక్తులతో సమావేశమయ్యేవారు. అప్పుడు భక్తులు బాగా చేరేవారు, వారు గోష్టిరూపంలో బోధించేవారు. ఇదేసమావేశవప్పుడు ఒక్కోసారి అరటి, జామ, మామిడి పళ్లను కొని భక్తులకు పంచేవారు. తాము స్వయంగా పెట్టేవారు, అంటే అరటి

పండును తమ చేత్తో ఒలిచి ఇచ్చేవారు. జామపండును తమ చేత్తో ముక్కలు కోసి ఇచ్చేవారు. ఇక మామిడి పండును స్వయంగా నలిపి ఇచ్చేవారు. ఈ సమావేశమయ్యాక వారు లెండీకి వెళ్ళేవారు. అక్కడ ఒక గంట ఉండేవారు. లెండీనుండి తిరిగి వచ్చాక మధ్యాహ్నం రెండు గంటలవరకు మసీదులో ఉండేవారు. ఆ సమయంలో భక్తులు వారికి పూజార్చనలు హారతి వగైరాలు చేసేవారు. తరువాత భోజనమయాక వారు మరల లెండీకి వెళ్లేవారు. సుమారు ముప్పావుగంట తరువాత అక్కడి నుండి తిరిగి వచ్చేవారు. తరువాత సాయంకాలం వరకు మసీదులోనే కూర్చునేవారు. సంధ్యా సమయాన కాసేపు బయటికి వెళ్ళి వెంటనే మసీదుకు వచ్చి కూర్చునేవారు. సాధారణంగా రోజులో ముమ్మారు సమావేశమయ్యేవారు. ఒకటి ఉదయం ఫలహారమయ్యాక, రెండోసారి లెండీ నుండి తిరిగి వచ్చాక మూడోసారి సుమారు సాయంకాలం 5 గంటలప్పుడు. మూడు సమావేశాలలోనూ గోష్ఠి రూపంలో బోధచేసేవారు. వారుమాటలలో అనేక రకాల భక్తుల మనసులలోని అనేక విషయాలు వివరంగా అర్థమయేవి. మహారాజు కఠినమైన వేదాంత విషయాలను విడమర్చి వివరించేవారుకాదు. ఉపనిషత్తుల పైన ప్రవచనాలు చేసేవారు కాదు. వారి ఉపదేశాలు ముఖ్యంగా నైతికంగా ఉండేవి. శిష్యులను పరిశుద్ధ పరచి వారి మనసులలో జ్ఞాన బీజాలు నాటటం సద్గురు యొక్క శాస్త్రోక్త పద్ధతి. మహారాజు కూడా అట్లే చేసేవారు. అందువలన వారి ఉపదేశాలు సర్వసాధారణంగా నీతి తత్వానికి చెంది ఉండేవి. కాని స్పష్టమైన మాటలతో బోధించటంకంటే అసంఖ్యాకమైన అమూల్యమైన అనుభవాల రూపంలో ఉండేవి. అందువలన వారి వద్దకు శ్రద్ధతో వచ్చే భక్తులకు అత్యంత శుభప్రదమైన అనుభవాలు కలిగేవి. వారి వద్దకు వచ్చేవారిలో కోరికలతో వచ్చేవారే చాలామంది. అయినా వారి కోరికలను తీర్చి వారి మనసులను వారికి తెలీకుండానే మంచివైపుకు మళ్లించేవారు. వారి అవతారం ప్రజలను ఉద్ధరించటానికే, కనుక వారు అందరికీ మంచినే చేశారు. చేస్తారు ఇందులో ఏమాత్రం సందేహం లేదు. వారి లీలలను గుణాలను యథార్థంగా వర్ణించటం అశక్యం. అయినా మహారాజు లీలలను శక్త్యానుసారం సంగ్రహ పరుస్తే అందరికీ మంచి కలుగుతుందని నా పూర్తి విశ్వాసం. ఇటువంటి లీలల సంగ్రహాన్ని గౌరవనీయుడు, నా మిత్రుడు గోవిందరావు అణ్ణాసాహేబు దాబోల్కరు సంగ్రహపరచి ఓవీలలో కుదించారు. ఓవీ ఛందస్సులో వ్రాసిన ఈ గ్రంథం మహారాజు శరీర ధారులై ఉండగా వారి ప్రత్యక్ష అనుమతితో ప్రారంభించబడింది. 35 అధ్యాయాలు వ్రాసి సిద్ధంగా ఉన్నాయి. గ్రంధం చాలా భక్తితో హృదయంగమంగా వ్రాయబడి, మహారాజు భక్తులకే కాక ఇతర పాఠకులకు కూడా శుభ ప్రదమౌతుంది. ఇందులో సందేహం లేదు. ఇందులోని ఓవీలు ఏకనాథ మహారాజు ఓవీల వలె గ్రంధాన్ని

పఠించేటప్పుడు ఏకనాథమహారాజు వాణి తరచు గుర్తుకు వస్తుంది. సారాంశం ఈ గ్రంథం శ్రీ సాయినాథ్ మహారాజు యొక్క ప్రసాదఫలమని అనుక్షణమూ సాక్ష్యం.

చివరగా ఈ గ్రంథం ద్వారా మహారాజు భక్తులకు మరియు ఇతర భావికులైన పాఠకులకు ఆనందం మరియు జ్ఞానం ప్రాప్తించుగాక. దాంతో వారికి మహారాజు వద్ద అధికాధిక శ్రద్ధ పెరుగుగాక అని మహారాజును ప్రార్థించి ఈ ఉపోద్ఘాతాన్ని సమాప్తి చేస్తాను.

బాబా బాలుడు హరిసీతారాం దీక్షితు.

శ్రీసాయి సచ్చరిత - విషయసూచిక

ఉపోద్ఘాతం -	కీ.శే. శ్రీ హరి సీతారాం దీక్షిత్	1
ప్రస్తావన -	కీ.శే. శ్రీ బాలకృష్ణ విశ్వనాథ్ దేవ్	18
రెండుమాటలు -	కీ.శే. శ్రీనాగేశ్ ఆత్మారాం సావంత్ (గోవిందరఘునాథ్ దాభోల్కరు యొక్క చరిత్ర మరియు భక్తులకు సూచన)	27

అధ్యాయాలు		పేజీ నెం.
1.	మంగళాచరణం.	1
2.	గ్రంథ కర్తకు హేమాడుపంతు అనుపేరు పెట్టటం.	13
3.	గ్రంథ రచనకు ఆజ్ఞ, రోహిల్లా వృత్తాంతం.	30
4.	శ్రీ సాయిబాబా శిరిడీకి ప్రథమాగమనం.	46
5.	శ్రీ సాయి శిరిడీలో నివాసం.	62
6.	శ్రీ రామనవమి ఉత్సవ ప్రారంభం.	76
7.	శ్రీ సాయిబాబా గారి యోగసాధన, వారు హిందువా ముసల్మానా? వారి దుస్తులు, ప్రవర్తన, నిత్యక్రమం, చమత్కారం, కుష్ఠురోగితోసేవ, ఖాపర్డె పుత్రుని ప్లేగు నుండి కాపాడటం, ప్లేగు గడ్డలు వారి శరీరంపై కనిపించటం.	89
8.	భిక్షాక్రమం, తాత్యా, మహల్సాపతి, ఖుశాల్‌చందు.	101

9. ఒక యూరోపియను శ్రీవారిని ఆజ్ఞను ధిక్కరించి దుఃఖితుడవటం, బాబాసాహేబు తర్ఖడ్ మరియు అతని పూజ, శ్వానసూకరాలు మరియు రొట్టె ముక్కలు, వంకాయల కూరపచ్చడి, సూతకంలో ఉన్న వానితో పేడా పంపటం. 114
10. జానెడు చెక్కపలకపై శయనించటం, వైశాచవృత్తి, ఆసనం, ధ్యానం, సామర్థ్యం, మహిమ. 128
11. డాక్టరు పండితుని పూజ, హాజీ సిద్దిక్ ఫాల్కె, మేఘాలపైన అగ్నిజ్వాలపైన సత్తా. 142
12. మహాజని, ధుమాల్, నిమోంన్‌కర్, ముళే వగైరా. 155
13. బాలా అనే దర్జి చలిజ్వరం, బుట్టి సాహబుకు ప్లేగు, భీమాజిపటేలుకు క్షయరోగం. 171
14. నాందేడు పార్సిరతన్‌జి, నాందేడు మౌలిసాహేబు మూడు రూపాయల, పదునాల్గు అణాలు. 187
15. దాసగణుకు నారదీయ కీర్తనపద్ధతిని ఉపదేశం, చోళ్కరు, బల్లి పలకటానికి అర్థం. 205
16. ఒక గృహస్తునికి బ్రహ్మజ్ఞాన ప్రాప్తి కోరిక. 215
17. లోకానికి బ్రహ్మకు అఖండ వైరం. 230
18. సాఠె గురుచరిత్ర కథ, రాధాబాయి యొక్క ఉపదేశ వృత్తాంతం. 245
19. హేమాడు పంతు యొక్క అనుగ్రహ కథ. 259
20. దాసగణు యొక్క ఈశావాస్యోపనిషత్తులోని సందేహాన్ని దీక్షితు పనిపిల్ల, నివారించటం. 281
21. ప్రాంతాధికారి పాఠంకరు మరియు ఒక వకీలు కథ. 293
22. ద్వారకామాయి, మిరికరు మరియు బుట్టీల పాముకాటు నివారణ గురించి. 304
23. మాధవరావుకు పాముకాటు బాధానివారణ, ధుని, దీక్షితుకు గుర్వాజ్ఞ. 323

24. శెనగపప్పు ద్వారా శిక్షణ, అణ్ణాబావరె, మౌశీబాయి. 340
25. దాము అణ్ణాకాసార్. 352
26. పితళెకు అక్కల్‌కోట స్వామి ఇచ్చిన రూపాయిలను గుర్తు చేయటం. 363
27. మాధవరావు మరియు విష్ణుసహస్రనామ పుస్తకం. 376
28. స్వప్నంలో దర్శనం ద్వారా బోధ. 393
29. రఘునాథరావు టెండుల్కరు, డాక్టరు హాటె. 411
30. సప్తశృంగీ దేవి ఉపాసకుడు కాకాజి, ఖుశాల్ చందు, రాంలాల్ పంజాబి. 427
31. మద్రాసి సన్యాసి విజయానందు, బాలారాంమాన్కరు. 438
32. బాబా ఒక విషయాన్ని చెప్పటం, గోఖలెబాయి. 452
33. తేలు కుట్టటం, చాందోర్కరు కుమార్తె ప్రసవం, బాలబువా, విభూతిచమత్కారం. 467
34. విభూతి చమత్కారం. 487
35. నిర్గుణోపాసకులు సగుణోపాసకులు, ధరంసిజేఠాబాయి, సోలిసిటరు మరియు
గింజలు లేని ద్రాక్షపళ్లు, విభూతి అనుభవం. 501
36. ఇద్దరు గోవా గృహస్థులు, ఔరంగాబాదు సభారాం. 521
37. చావడి వర్ణన. 536
38. వంటపాత్ర. 556

39. తద్విద్ధి ప్రణిపాతేన, గూర్చి శ్రీవారు స్వయంగా వివరించటం, నానాసాహేబు చాందోర్కరు యొక్క సంస్కృత భాషాభిమానం తొలగటం, శ్రీబుట్టీకి మందిర నిర్మాణానికి ఆజ్ఞ. 571
40. దహాణులో బాలా సాహేబుదేవు యొక్క బ్రాహ్మణభోజన ఆహ్వానాన్ని స్వీకరించటం. 586
41. బాలాసాహేబు దేవుకు జ్ఞానేశ్వరిని అధ్యయనం చేయమని ఆజ్ఞ. 600
42. శ్రీ సాయి యొక్క శరీర విసర్జనవృత్తాంతం. 614
43. శ్రీ సాయి యొక్క నిర్వాణం. 627
44. శ్రీవారి సమాధి. 643
45. ఆనందరావు పాఖడె యొక్క స్వప్నం వ్రగైరా. 659
46. మాధవరావు యొక్క గయాయాత్ర మేకల పూర్వజన్మ కథ. 671
47. పాము మరియు కప్పల పూర్వ జన్మల గురించి. 683
48. శెవడె మరియు సపట్‌ణేకరుల కథలు. 699
49. హరికన్‌భా మరియు సోమదేవస్వామి. 714
50. 'తద్విద్ధి ప్రణిపాతేన' గూర్చి విస్మృతార్థం. 731
51. దీక్షిత్, బాతారాం, నాందేడు, పుండలీకరావు వకీలు కథలు. 751
52. గ్రంథం - సింహావలోకనం. 773
53. బాలా సాహేబుదేవు రచించిన అవతరణిక. 782

శ్రీ దత్త చిత్తసాయి గురుభ్యోనమః

శ్రీసాయి సచ్చరిత్ర - ప్రస్తావన

1. మన ఈ ఆర్యావర్తమందు సద్గురు కృపలేకుండా మోక్షం కలగదని దృఢభావం, దృఢవిశ్వాసం, దృఢసిద్ధాంతం ఉంది, ఈ సిద్ధాంతం ఈ నాటిది కాదు, చాలా పురాతనమైనది, వేదకాలం నుండి ఉంది. దీనికి వేదశాస్త్రంలో ఆధారముంది. సద్గురువు ఏజాతి వాడైనా ఏధర్మానికి చెందినవాడైనా, ఏవయసువాడైనా ప్రత్యక్షరూపంలో ఉన్నాలేక గ్రంథరూపంలో ఉన్నా, పురుషుడైనా స్త్రీ అయినా సాధువైనా, సత్పురుషుడైనా, దేవుడైనా తల్లితండ్రిఅయినా, బంధువైనా భగినైనా, మిత్రుడోసఖుడో అయినా, భర్త అయినా, భార్య అయినా, ప్రకటంగా ఉన్నా, అజ్ఞాతంగా ఉన్నా ఎలా ఉన్నా సద్గురు సేవ నెలా చేయాలి వారి కృప ఎప్పుడు కలుగుతుంది? వారు ఎప్పుడు ఉపదేశ మిస్తారు? జ్ఞానప్రాప్తి ఎప్పుడు? జ్ఞానం కలిగిన తరువాత మనో వృత్తి ఎలా ఉంటుంది? అన్న విషయాలను భగవాన్ శ్రీ సమర్థ సద్గురు జ్ఞానేశ్వరమహారాజు తమశ్రీ భగవద్గీతా భాష్యంలో సర్వోత్కృష్టంగా వర్ణించారు.

గురుసేవకు మార్గాలు, సాధనలు, అంగాలు అనంతంగా ఉన్నాయి. అద్వితీయ రాచకారణ పురుషులు రాజ్య సంస్థాపకులు, పరాక్రమ వీరులు, అలౌకిక శాస్త్ర కారులు, చరిత్రకారులు, నటులు, విశాలబుద్దిగల ఉపాధ్యాయులు, భాష్యకారులు, రచయితలు మొదలుగు గొప్ప పురుషులను మన వ్యవహారిక గురువులనుగా భావించి, వారి చరిత్రలను వ్రాయటం గురుసేవ ప్రజాసేవ, కాని ఈ సేవ ఐహికం కావటం వలన ఇది కాలమానాను రూపమై ఉంటుంది. దీని మహత్వంగాని ఫలితంగాని శాశ్వతంగా ఉండవు, ఇది దేశకాలాలకు సీమితమై ఉంటుంది. దీనిలో ప్రజాశిక్షణ పరోపకారం బాగా ఉన్నా స్వార్థమూలకం అవటం వలన ఇది పరమార్థ ఫలదాయకం కాదు.

2.అనేక సాధుసత్పురుషుల చరిత్రలు వ్రాయటం ఒక రకమైన గురుసేవ. ఇది పరమార్థ ఫలదాయకంకూడాను ఇది మరియు పైన తెలిపినవి రెండూఏకదేశీయం ఏకాంగికం. కేవలం ఈ రచనల నుండి పారమార్థిక అంతిమ ధ్యేయప్రాప్తి కఠినం, లేదా లేదని కూడా చెప్పవచ్చు.

3. నా అల్పబుద్ధికి రచనాసేవ లన్నింటిలో ఉత్తమమైనది, ఖచ్చితంగా మోక్ష ఫలాన్నిచ్చే శ్రేష్ఠమైన సేవ గురువు ఆజ్ఞతో లేదా తమ అంతఃకరణస్ఫూర్తితో తమ సద్గురువు చరిత్రను రచించి దానిని తాను స్వయంగా నిత్యం నియమంగా అధ్యయనం చేస్తూ దేశకాల ప్రకృతుల అనుకూలానుసారం, దృఢ నిశ్చయంతో శుద్ధాంతఃకరణంతో ఉత్కృష్టమైన శ్రద్ధతో అత్యంత ప్రేమతో, అవ్యభిచారీ భక్తి భావంతో వందలసార్లు పారాయణ మరియు సప్తాహాలను చేయటం, ఇతర సద్భక్తులతో చేయించటం ఇది సేవ. ఈ సేవ శరీర వాఙ్మనాత్మకం. ఇది కుటుంబపోషణా మార్గంలోగాని లేక ఐశ్వర్యానికి గాని అడ్డు రాదు.

4.చరిత్ర రచనలలో రెండు భేదాలు - 'సంక్షిప్తం లేక విస్తృతం; గద్యం లేక పద్యం, అధ్యయనం పఠనం పారాయణం లేక సప్తాహం చేయటానికి విస్తృతము లేక పద్య చరిత్రలే యోగ్యమైనవి. గద్య చరిత్ర పారాయణ లేదా సప్తాహం చేసే పద్ధతి అలవాటులో లేదు. గద్యం కంఠస్థం చేయటం కష్టం, పద్యం త్వరగా సులభంగా కంఠస్థంమౌతుంది, స్మరణలో ఉంటుంది, సమయానికి గుర్తుకువస్తుంది. మన ప్రాచీన సంస్కృతవాఙ్మయం చాలావరకు పద్యాలలోనే ఉంది. దీనికి ఇదే కారణమై ఉంటుంది. పద్యాలలో విస్తృతంగా ఉన్న గురు చరిత్ర అధ్యయనం పఠనం పారాయణం మరియు సప్తాహాలద్వారా గురుసేవ ఉత్తమంగా జరుగుతుంది. ఇది అంతటా అనుభవం.

5.పారాయణం మరియు సప్తాహాలు చేసే పద్ధతి చాలా ప్రాచీనమైనది. ఇది వేద కాలం నుండి ఉంది. వేదాలు భాగవత రామాయణాలు యోగవాశిష్ఠ వగైరా గీర్వాణ గ్రంథరాజాల పారాయణం సప్తాహాలు నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతుండటం మనం చూస్తాం, వింటాం.

6.అట్లే శ్రీ జ్ఞానేశ్వరీ శ్రీనాథ భాగవతం, శ్రీదాసబోధ మొదలగు మరాఠీలోని విశ్వవంద్య గ్రంథరాజాల పారాయణ సప్తాహాలు నిత్యం జరుగుతుంటాయి. ఈ పద్ధతి కూడా పురాతనమైనదే. ఇవి చరిత్ర గ్రంథాలే కాక ఐహిక మరియు పారమార్థికజ్ఞాన గ్రంథాలు. వీనిని లేదా ఈ గ్రంథ కర్తలను తమ గురువులుగా భావించి వారి గ్రంథాలను అధ్యయనం, పఠనా పారాయణ సప్తహాలు చేసేవారికి నిస్సంశయంగా సర్వోత్కృష్టమైన అనుపమానమైన, మోక్షఫల దాయకమైన గురుసేవ లభిస్తుంది.

7.గురు చరిత్ర అంటే గురువుయొక్క అవతారం బాల్యం తారుణ్యం వృద్ధాప్యం, వారు చేసిన అద్భుత లీలలు, వారు చూపించిన అమోఘమైన చమత్కారాలు, వారి అవతార కార్యాలు, వగైరా విషయాలను వ్రాసిన విశ్వసనీయమైన వాస్తవ గ్రంథం.

8.కేవలం జ్ఞాన గ్రంథాలు మరియు గురు చరిత్ర గ్రంథాలు రెండు విధాలుగా మాత్రమే ఉపయోగపడతాయి. (1) కామ్యదృష్టి

కలవారికి - (2) నిష్కామ బుద్ధి కలవారికి. మొదటి వారికి ఐహికాలకోసం, ఐశ్వర్యాని అనుభవించటానికి, లేదా చింత ఆపద, కష్టాలు రోగాలుయాతనలు, బాధలనివారణకు రెండవ వారికి - సంసార విమృత్తికి లేదా జనన మరణాల నుండి ముక్తులవటానికి, నిష్కామ గురుసేవేశ్రేష్ఠం.

9.గురు చరిత్ర రచనాసేవ గురించి నారద పురాణంలో ఉంది దీన్ని బట్టి ఇది చాలా ప్రాచీనమైనది. ఇందులో ఏం సందేహంరలేదు.

10. మన ఈ భరతభూమిలో అవతరించిన సాధు సత్పురుషుల చరిత్రలు, ప్రఖ్యాతి చెందిన శ్రీ మహీపతి కవి, మరాఠీలో ఓవీ ప్రబంధంలో జగత్ ప్రసిద్ధి చెందిన శ్రీ భక్తలీలామృతం మరియు శ్రీ సంతలీలామృతం అను ఈ రెండు గ్రంధాలలోవ్రాసి ఉంచారు.

11. వారి తరువాత సుప్రసిద్ధ దాసగణు మహారాజు మహారాష్ట్రలోని అనేక అర్వాచీన సాధువుల సంక్షిప్త చరిత్రలను ప్రఖ్యాతమైన తమ శ్రీ భక్త లీలామృతం, శ్రీ సంత లీలామృతం మరియు శ్రీ భక్తి సారామృతం అను మూడు మరాఠీ గ్రంథాలలో ఓవీఛందస్సులో వ్రాసి ఉంచారు.

12. పైన పేర్కొన్న ఉభయ కవివర్యులు వ్రాసిన ప్రత్యేక గ్రంథాన్ని పారాయణ లేక సప్తాహంచేయవచ్చు. కాని వీని లోని ఒక్కోసత్పురుషుని చరిత్ర, రెండు మూడు పేజీలలో మాత్రమే ఉండి విస్తృతంగా లేనందు వలన ఇవి విడిగా పారాయణకు గాని సప్తాహానికిగాని ఉపయోగ పడవు.

13. విస్తృతంగా పద్యరచన లోనున్ను గురు చరిత్రను అధ్యయనం, పారయణలేక సప్తాహాలు చేస్తే ఆరచయితకు గురు సేవకలుగుతుంది. ఇతర భక్తులు కూడా ఆ చరిత్రను అధ్యయనం, పఠనం, పారాయణం మరియు సప్తాహం చేస్తే రచయితకు మానవులలో మాధవుని సేవలభిస్తుంది. భక్తుల జన్మలు కూడా సార్థకమౌతాయి

14. సద్గురువు తమ భక్తుల నుండి గ్రంధరూపంలో రెండు రకాల సేవను గ్రహిస్తారు, ఒకటి - శ్రీ జ్ఞానేశ్వరి, శ్రీనాథభాగవతం, శ్రీ దాసబోధవంటి మహాగ్రంథాలను తాము స్వయంగా తయారు చేయటం, రెండవది - తమ చరిత్రను తమ భక్తులతో రచియింప చేసి, ఆరచయిత ద్వారా మరియు భక్త సమూహంద్వారా అధ్యయనం, పఠనం, పారాయణ సప్తాహాలను చేయించి ఆసేవలను స్వీకరించటం.

15. అనేక సద్భక్తులు తమ ఇచ్ఛానుసారం ఇష్టానుసారం, ఈనాటివరకు అనేకరకాల ప్రసంగాలను అనేక భాషలలో తమతమ

గురువుల చరిత్రలను గద్యంలోపద్యంలో వ్రాసి జగత్తువారికి ఋణపడేలా చేశారు. అయినా పారాయణ సప్తాహం చేయతగినవి విస్తృతంగా పద్యరూపంలో నర్వాంగ పరిపూర్ణంగా ఉండి ప్రఖ్యాతి చెందినది మన మహారాష్ట్రలో చాలా పురాతనమూ మధుర రసపూరితమూ స్వాదిష్టమూ అయిన ప్రాసాదిక గ్రంథం, శ్రీ సరస్వతీ గంగాధర్ వ్రాసిన ఔదుంబరు, శ్రీవాడి, శ్రీగాణగా పురక్షేత్రనివాసి శ్రీ సమర్థ సద్గురు నరసింహ సరస్వతీ మహారాజు చరిత్ర. ఇది (పెద్ద) బృహత్ గురు చరిత్ర అని ప్రసిద్ధి చెంది, ఆ బాలవృద్ధులకు బాగా పరిచయం వేల ప్రదేశాలలో నియమంగా రోజూదీని అధ్యయనం పఠనం మరియు, పారాయణ సప్తాహాలు జరుగుతాయి. రెండవది ఈ మధ్య, మధురమూ, రసపూరితం ఉద్బోదకం, ప్రసాద జన్యం కీ.శే. భక్త శ్రేష్ముడు శ్రీ గోవింద రఘునాథ అణ్ణాసాహేబు దాభోల్కరు వ్రాసిన, అహమ్మదునగర్ జిల్లాలో కోపర్‌గాంతాలూంకాలోని శిరిడీ (శీలధి) శ్రీక్షేత్ర నివాసి, ఆధునిక సత్పురుష చూడామణి శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు సాయినాథ మహారాజుగారి చరిత్ర. ఇది శ్రీ సాయి సచ్చరిత అన్న పేరుతో శ్రీ సాయిలీల పత్రికలో ఆరు సంవత్సరాలు ప్రత్యేక సంచికలో ఒక్కో అధ్యాయంరూపంలో ప్రసిద్ధిచెంది ఏడవ సం॥ 5-6-7-8 సంచికలలో అవతరణిక అధ్యాయంతో సహాపూర్తి అయింది. దీని గురించే ఈ ప్రస్తావన వ్రాయబడింది. ఈ రెండు గురు చరిత్రలవలె ఇంత విస్తారంగావ్రాసిన మూడవ గురుచరిత్ర కనిపించదు.

16. శ్రీ సమర్థ సద్గురు టెంబెస్వామి (వాసుదేవానంద సరస్వతి స్వామి) ఒక విస్తారమైన విద్వత్తాపూర్ణమైన వివిధ వృత్తాలతో శబ్దాలంకారాలతో, అలంకారాలతో సుభాషితాలతో వ్రాసి అచ్చు అయిన గురు చరిత్ర చాలా సం॥లకు పూర్వం నేను చుచూచినట్లు గుర్తు.

17. శ్రీ సమర్థ సద్గురు బాళెకుంది శ్రీ క్షేత్రనివాసి దత్తమహారాజు గారు కూడా ఒక గురుచరిత్ర వ్రాశారని విన్నాం. కాని ఇది అచ్చుఅయి ప్రసిద్ధి చెందినట్లు కనిపించదు.

18. శ్రీ సమర్థ సద్గురు వాసుదేవానంద సరస్వతీ మహారాజు వ్రాసిన గురు చరిత్ర బాగా ప్రసిద్ధి చెందినట్లు కనిపించదు. అయినా మహారాజు భక్తులు దీనిని అధ్యయనం, పఠనం, పారాయణ సప్తాహాలు శ్రీ పుణ్య మహానది నర్మదాతీరాన గాయక వాడిలో చాందోద కర్మాళినుండి, బాగా దూరంలో ఉన్న శ్రీ గరుడేశ్వర క్షేత్రంలో మహారాజు సమాధి మందిరంలో జరుగుతుండవచ్చు, కాని ఈ విషయం

ఖచ్చితంగా తెలీయదు. ఈ చరిత్రను స్వయంగా వ్రాసిన కారణంగా దీనిని శ్రీ సరస్వతీ గంగాధర్ మరియు అణ్ణాసాహేబు దాభోల్కరు వ్రాసిన గురు చరిత్ర రచనలతో గణించటానికి వీలుకాదు.

19. శ్రీ సమర్థ సద్గురు సాయిబాబా కృపకు పాత్రుడై, ఆధునిక కవి శ్రేష్ఠులో ప్రముఖంగా గణింప బడే శ్రీ దాసగణు మహారాజు, మనాచెశ్లోక్ జలదదూత కావ్యం, నాటక ఖండం, లావణ్య పవాడె, గ్రామగీతాలు, అర్వాచీన భక్తలీలామృతం, సంతలీలామృతం, భక్తిసారామృతం, ఈశావాస్య భావర్థమంజరి అమృతానుభవటీకా, గోదామహాత్మ్యం, స్తోత్రాలు, అష్టకాలు, సుభాషితాలు, హరికథలు, చక్రీభజన, స్ఫుట కవిత, మొదలగు చిన్నవి పెద్దవి, చాలాగ్రంధాలు వ్రాశారు. వీరు అందరికీ పరిచయం, వీరు శ్రీ బాబాగారి రెండు చరిత్రలు ఒకటి తమ భక్తి లీలామృతం, రెండవది భక్తి సారామృతంలో వరుసగా 31, 32, 33 మరియు 52, 53 అధ్యాయాలలో వ్రాశారు. మొదటి దానిలో 12 పేజీలు, 509 ఓవీలు - రెండవదానిలో 12 పేజీలు 497 ఓవీలు ఉన్నాయి.

20. ఈ రెండు గ్రంథాలలోని చరిత్రలు సర్వోత్కృష్టం హృదయంగమం, రసపూరితం, ప్రాసాదికం. ఇందులో ఏం సందేహంలేదు. ఇవి అధ్యయనం, పఠనం పారాయణ సప్తాహాలు చేయటానికి యోగ్యమైనవి, అయితే ఇవి చాలా చిన్నవి అంతే. వీనిలోని కథలు శ్రీ సాయి సచ్చరిత్రలోని కథలు చాలా వరకు ఒక్కటీ మన దేశపుహీనస్థితి, దీనికి కారణాన్ని తెలిపేవి హృదయాన్ని తాకే అందమైన చిత్రాలను, ఇతర గ్రంథాలలో వలె శ్రీ దాసగణు ఈ లఘు చరిత్రలలో కూడా వేయించారు. అణ్ణాసాహెబు ఇలా చేయలేదు.

21. శ్రీవాడీక్షేత్రంలోని శ్రీ దత్తస్తవరాజ అన్న చిన్న పుస్తకంలో ఉన్న దాన్ని బట్టి శ్రీ సరస్వతీ గంగాధర్ వ్రాసిన బృహద్ గురు చరిత్ర కాక కేవలం 707 శ్లోకాలలో లఘుగురు చరిత్ర అన్న పేరు గల గ్రంథం ఒకటి వాడిలోఉంది. అది బృహద్ (పెద్ద) గురు చరిత్రకంటే చాలా పురాతనమైనదిగా కనిపిస్తుంది. కాని ఈ చరిత్ర ఎవరు ఎప్పుడు వ్రాశారు అని తెలుసుకునే వీలులేదు ఇందులోని నాయకులు, పెద్ద గురు చరిత్ర నాయకులు శ్రీ సమర్థ సద్గురు నరసింహ సరస్వతీ మహారాజు, వీరి సమాధి కాలం శక సం॥ 1140 అని లఘు గురు చరిత్రలో 705, 706, 707 ఓవీలలో కనిపిస్తుంది.

22. శ్రీ సరస్వతీ గంగాధర్ ఉపనామం సాఖరె. ఈ సాఖరె కులంలోని శ్రీ సాయందేవు మొదట శ్రీ సమర్థసద్గురు నరసింహ సరస్వతి మహారాజు కృపకు పాత్రుడయ్యాడు. ఆ తర్వాత సద్గురు అనుగ్రహం కలిగి నీవంశజుల వద్ద నుండి మానిరంతర సేవ

జరుగుతుంటుంది అని అతనికి వరం ప్రసాదించ బడింది. శ్రీ సాయందేవునుండి అయిదవ పురుషుడు ఈ సరస్వతీ గంగాధరుడు ఇతనికి ప్రస్తుతం ప్రసిద్ధిలోఉన్న బృహద్గురు చరిత్ర వ్రాయటానికి, శ్రీ సమర్థ సద్గురు శ్రీ నరసింహ సరస్వతి మహరాజు ఆజ్ఞాఇచ్చారని ఆ చరిత్రలో వ్రాసిఉంది. దీన్ని బట్టి కూడా ఇది చాలా ప్రాచీనమైనదిగా కనిపిస్తుంది. చరిత్రలో చరిత్ర రచనా కాలంగాని చరిత్ర రచయిత కాలంగాని ఇవ్వలేదు.

23. ఈ శ్రీ సమర్థ సద్గురు నరసింహ సరస్వతి మహరాజు అవతరించి, మరల ఆళందిలో శకసం॥ 1807లో సమాధి స్థులైనట్లుగా శ్రీ దాసగణుమహరాజు శ్రీ భక్తలీలామృతంలో 30వ అధ్యాయంలో 12వ మరియు 103 ఓవీలలో వ్రాశారు. దీన్ని బట్టి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న పెద్ద గురు చరిత్ర శకసం॥1807 తరువాత వ్రాసింది కాక, లఘుగురు చరిత్ర అంతగా పాతదికాక పోయినా తప్పక శకసం॥ 1807 కంటె చాలా పూర్వమే వ్రాసి ఉండవచ్చు. దీనిలో ఏ సందేహంలేదు.

24. గురుసేవ చేయాలి, తమ శక్త్యానుసారం ప్రజలకు మంచి జరగాలి, మాతృభాషావాఙ్మయ సేవ జరగాలి అన్న ఉదాత్తమైన ఉద్దేశంతో మరియు శ్రీసమర్థ సద్గురు సాయిబాబా మహరాజు గారి ఆజ్ఞాతో, శ్రీ అణ్ణాసాహేబు, ఉద్యోగం నుండి విరమించాక ఈ గురుచరిత్రను వ్రాశారు.

25. శ్రీ సరస్వతీ గంగాధరుని గురుచరిత్రవలెనే ఈ సాయిసచ్చరితలో అవతరణిక అధ్యాయం తోసహా 53 అధ్యాయాలున్నాయి. మొదటి దానిలో 7300 ఓవీలు, ఇందులో 9,450 ఓవీలున్నాయి.

26. సంస్కృతంలోని అనుష్టుప్‌ఛందస్సువలె మరాఠీలో ఓవీఛందస్సు, ఇది గొప్ప కవిత్వ రచనలకు యోగ్యంగా ఉంటుంది. చరిత్ర గ్రంధాలలో ఓవీఛందస్సు సుగమం. అందుకే మరాఠీలో అనేక గొప్ప గొప్ప విశ్వవంద్య పద్య గ్రంధాలు ఓవీఛందస్సులోనే కనిపిస్తాయి. ఈ కారణంవలననే శ్రీ సాయీ సచ్చరితను కూడా ఓవీఛందస్సులో వ్రాశారు.

27. శ్రీ సరస్వతీ గంగాధరుని గురుచరిత్రలోని కథలు విశ్వసనీయం, అనుభవజన్యం. అయితే అవి శ్రీ సరస్వతీ గంగాధరుని ప్రత్యక్ష అనుభవాలు, లేదా ఇతరుల ద్వారాలభించినవి లేక ఎవరి కథలు వ్రాశారో వారు వారికి ప్రత్యక్షంగానో లేక వ్రాతమూలకంగానో తెలిపారా అన్నవి తెలుసు కోవటానికి మనవద్ద ఏ ఆధారాలు లేవు. ఆ గ్రంథంలో దీనికి సంబంధించిన వివరాలు లేవు.

28. శ్రీ సాయి సచ్చరితలో వర్ణించిన అనేక కథలు లీలలు అణ్ణాసాహెబు స్వయంగా తనకళ్లతో చూచినవి. మిగతావి భక్తులకు బాబా ప్రత్యక్షంగానో లేక కలలోనో కలిగించిన అనుభవాలను వారు తాముఅర్థం చేసుకున్నట్లుగా ఉన్నది ఉన్నట్లుగా అణ్ణాసాహేబుకు నోటితోనో, వ్రాసోమనని చేసుకున్నవి. ఇటువంటి వారు. ఇప్పటికీ అనేకులు బ్రతికి ఉన్నారు. ఆలీలలను, అనుభవాలను అణ్ణాసాహేబు తమరసపూరితమైన ప్రాసాదిక వాణితో కథా స్వరూపాలలో మలచి పద్యమయము ఆకర్షణీయము, అందమూ అయిన తొడుగుతో శ్రీ సాయి సచ్చరితలో హృదయంగమంగా వర్ణించారు.

29. ప్రతి అధ్యాయంలో మొదట వేదాంతం, గురుస్తవనం, గురుగౌరవం, తరువాత కథలు ఇలా 50 అధ్యాయాలు వ్రాశారు 52వ అధ్యాయంలో సింహావలోకనం చేసి అవతరణికతో గ్రంథాన్ని సమాప్తి చేస్తానని మొదటే ఒక ఓవీలో వ్రాశారు. కాని 52వ అధ్యాయంలో సింహావలోకనం, మరియు అవతరణిక కూడా కనిపించవు, సద్గురు మహాత్మ్యం శ్రీ సాయిసచ్చరిత్ర ఫలశ్రుతి, గ్రంథకర్తప్రసాద యాచనం, ప్రార్థన ఈ విషయాలే ఉన్నాయి. "51వ అధ్యాం ప్రసిద్ధి చెందినది. ఇప్పుడు కేవలం 52వ అధ్యాయం ఈ సంచికలో ప్రసిద్ధమై శ్రీ సాయి సచ్చరిత గ్రంథం సంపూర్ణమైంది" అని అణ్ణాసాహెబు స్వయంగా చెప్పినమాటలు, శ్రీ సాయిలీలా పత్రిక 6వసం॥ 3వ సంచికలో 880వ పేజీలో అచ్చు చేయబడింది. దీనిబట్టి అవతరణిక మరియు సింహావలోకనం వ్రాసిన కాగితపుముక్కలు ఎక్కడైనా ఉండిపోయి ఉండవచ్చు అని అనిపిస్తుంది. అలవాటు ప్రకారం అణ్ణాసాహేబు 52వ అధ్యాయం కూడా చిన్న కాగితపు ముక్కలపైన వ్రాశారు. అవి నా వద్దకు సరిచూడటానికి వచ్చాయి. వానిలో ఓవీల సంఖ్యలేదు. కాగితాల సంఖ్య 20కి పైగా ఉన్నాయి. దీన్ని బట్టి సింహావలోకనం మరియు అవతరణికల ఓవీలు ఎక్కడో ఉండి ఉండవచ్చు లేదా, తమారు చేయటం మరచిపోయి ఉండవచ్చు అని అనిపిస్తుంది. క్రొత్తగా అవతరణిక అధ్యాయాన్ని తయారు చేసి 53వ అధ్యాయం అని గ్రంధానికి జోడించడం జరిగింది. ఈ విధంగా ఈ సాయి సచ్చరిత లేక గురుచరిత్ర రచన జరిగింది.

30. శ్రీ సాయిబాబా శిరిడీక్షేత్రానికి ప్రథమాగమనం, తిరోగమనం, మరల ప్రకటమవటం, వారి అద్భుతలీలలు, అసమాన చమత్కారాలు అనుగ్రహం, భక్తుల అనుభవాలు, గ్రంధ పఠన గ్రంథరచన, పాదుకాపూజ, ఇష్టదేవతాపూజా, ఈశ్వరభజన జప తప నామస్మరణ, ఆసనం ఉపాసన ధనసుతదారా దానం, సంకట నివారణం, వ్యాధి నివారణం, యోగైశ్వర్యం మసీదుమాత వైభవం, ఊదీ

మాత ప్రభావం, ధునిమాత ప్రతాపం, బాబా పరాక్రమము, నిత్యకార్యమం, ఆహారవిహారాలు, శయనం, చిలుం, పాదరక్షలు, దుస్తులు, సత్పురుష అవతరణ, శంకానిరసనం, పంచమహాయజ్ఞాలు, సామర్థ్యం, ధర్మశిక్షణ, వ్యవహార శిక్షణ, పరమార్థ బోధ సర్వవ్యాపకత్వం, సర్వజ్ఞత, మనోగతకథనం, పూర్వకథనం, పూర్వజన కథనం, భవిష్యకథనం, వంటపాత్ర చావడి, భిక్ష, భిక్షాధికారం, మందిరం, లేండీబాగ్, ఉత్సవం, పంచతత్వ ప్రభుత్వం, పరస్పర మనోమయ చిచ్ఛక్తి సందేశం, ఔదార్యం, భక్తి జ్ఞానవైరాగ్యాలు, దయక్షమ, శాంతి, నిర్వాణం, వగైరా విషయాలు సుమారు 150 నుండి 175 వరకు కథలు ఉపకథలు, పిట్టకథలు ఈ శ్రీసాయిసచ్చరితలో వర్ణింపబడి ఉన్నాయి.

31. అనేకచోట్ల ఒక్కో అధ్యాయంలో, 2,3,4,5 వరకు కథలున్నాయి కొన్ని చోట్ల ఒకే కథ రెండు మూడు అధ్యాయాలలో వర్ణింపబడిఉంది.

32. గ్రంధాలు మూడు రకాలుగా ఉంటాయి. సైసర్గిక ప్రాసాదికం, కృత్రిమం. కృతిమ. కవిత కేవలం పాండిత్యం మేధాశక్తితో రచించేవి. ఇవి గొప్పగా ఉంటాయి కాని శాశ్వతంగా ఉండవు. వీనిలో ప్రతిభ అనుగ్రహప్రసాదం ఉండవు. గురుకృప లేకుండా ఎంతపాండిత్యమున్నా, ఈ శ్రీసాయి సచ్చరిత్ర వంటి గ్రంథనిర్మాణం కఠినం. ఏ పారమార్థిక గ్రంధంలో నైనా పైమూడు గుణాలు లేకపోతే ముముక్షువులైన పాఠకులపై దాని ప్రభావం పడదు. పైగా వారికి దానిపై శ్రద్ధా విశ్వాసాలుండవు, శ్రీ సాయి సచ్చరిత ప్రాసాదిక గ్రంధం. కనుకనే ఇది ఏముముక్షువు భక్తునికైనా ప్రీతికరము దీనిని నిత్యం అధ్యయనం పఠనం చేస్తూ, ఎన్నో వందల పారాయణ సప్తహాలు చేయకుండా ఉండరు.

33. అణ్ణాసాహేబు గృహంలో మొదటి నుండి గురుభక్తి ఉండినదా లేదా అని తెలుసుకోవాటానికి మనకు ఏదారి లేదు కాని అణ్ణాసాహేబు తమకు సంబంధించిన విషయంలో 3వ అధ్యాయంలో వ్రాసిన వాస్తవాన్ని బట్టి చూస్తే అణ్ణాసాహేబుకు మొదట గురు భక్తి ప్రేమలు, అసలు లేవు అట్లే గురువును ఆశ్రయించటం నాటకమని అనిపించటం వలన వారు గురువును ఆశ్రయించే అవసరంలేదని ప్రతిపాదన చేసేవారు. వారికి స్వకర్తుత్వం పైనే చాలా అభిమానముండేది. కాని శ్రీసాయిబాబాతో దృష్టాదృష్టి కలగగానే మనసును కదిలించే ఏవోమాటల అనంతరం అతని అభిమానం కరిగిపోయింది. పైగా సద్గురుపు లేక తరుణోపాయం లేదని వారికి పూర్తిగా తెలిసివచ్చింది. తురువాత వారికి బాబా అనుగ్రహం కూడా కలిగింది వారి యొక్క కృపాఫలమే శ్రీసాయి సచ్చరిత రచన. అణ్ణాసాహేబు

విశ్వవంద్యులైన అనేక సాధుసత్పురుషుల యొక్క ప్రపంచ గౌరవాన్ని, పొందిన కావ్యాలను చదవటం వలన, శ్రీ సాయి సచ్చరితపై శ్రీ సమర్థ సద్గురు నాథమహారాజు యొక్క శ్రీ ఏకనాథ భాగవత ప్రభావం పడినట్లుగా కనపడుతుంది.

34. శ్రీసాయి సచ్చరిత గురించి ఆధునిక విద్వాను శ్రీ చింతామణిరావు వినాయక్ (నానాసాహెబు వైద్య) తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ అణ్ణాసాహేబుకు 'మహీపతి' అని పదవీ ప్రదానం చేసి వారిని వారి గ్రంథాన్ని గౌరవించారు (శ్రీసాయిలీల, 2వసం॥ 9వ సంచిక 182 పేజీ) దీన్ని బట్టి ఈ శ్రీసాయి సచ్చరిత గురు చరిత్రయే కాక, ఒక ఉత్కృష్టమైన రసాత్మక కావ్యం.

35. శ్రీ సాయి సచ్చరితలో భగవాన్ శ్రీ జ్ఞానేశ్వర మహారాజు వ్రాసినవిధంగా అణ్ణాసాహేబు యొక్క వాణి మరియు రచన సార్థకమయ్యాయి. ఈ గ్రంధంలో దృష్టాంతాలు ఉపమాలంకారాలు, రసపోషణ పరిపూర్ణంగా ఉన్నాయి.

36. శ్రీ సరస్వతీ రంగాధర్ వ్రాసిన గురుచరిత్రవలేనే ఈ శ్రీసాయి సచ్చరితను నిత్యం అధ్యయనం పఠనం, మరియు వందల పారాయణాలు సప్తాహాలు జరగాలని గ్రంధ కర్తకు చాలా కోరిక. వారి కోరిక ఫలరూపాన్ని పొందిన శుభపర్వదినాలను చూడటానికి వారు జీవించి లేరు. ఇది దైవ ఘటన.

37. ఈ గ్రంధం ముముక్షు భక్తులకు ఒకరకంగా మధురమైన పరమార్థఫలం. అణ్ణాసాహెబు సంకల్పానికి గౌరవాన్నిచ్చి, ముముక్షు భక్తులు ఈ ఫలాన్ని శ్రద్ధతో అంతఃకరణ పూర్వకంగా కంఠంవరకు సేవించి, ఇతర భక్తులకు కూడా అందించి అలా జ్ఞానయజ్ఞం ద్వారా శ్రీ సాయి పరమాత్మను సంతుష్ట పరచితే, శరీరావసాన సమయాన షడ్గుణైశ్వర్యులైన శ్రీ సాయి పరమాత్మతో ఏకరూపలౌతారు. ఇందులో ఏమాత్రం సందేహంలేదు.

చివర కర్తుం అకర్తుం అన్యథాకర్తుం శక్తి యుతులు, సర్వజ్ఞ సర్వసాక్షి శ్రీ సమర్థ సద్గురు సాయి పరమాత్మయొక్క పుణ్య చరణ కమలాలయందు అనన్యభక్తి భావంతో, నమ్రతాపూర్వకంగా మస్తకాన్నుంచి విస్మృతమైన ఈ ప్రస్తావనను సమాప్తి చేస్తాను.

ఠాణె
తా 20.11.1930

బాబాబాలుడు
కె. బాలకృష్ణ విశ్వనాథ్ దేవ్

రెండు మాటలు

గ్రంథకర్త కీ.శే.గోవిందరావు రఘునాథ దాభోల్కరు (అణ్ణాసాహేబు) యొక్క సంక్షిప్త చరిత్ర మరియు భక్తులకు సూచన.

మహారాష్ట్ర మహాభాగ్యం వలన ప్రతి తరంలోనూ ఎవరో ఒక మహాపురుషుడు జన్మించి జడజీవులను ఉద్ధరిస్తున్నారు. సుమారు 95 సం॥ పూర్వం నగర జిల్లా యొక్క ధార్మిక పరిస్థితి చాలా కఠినంగాఉండింది. ఇతర జిల్లాల కంటే ఈ జిల్లాలో దుష్కాల పరిస్థితిని అవకాశంగా తీసుకుని అక్కడి పేద ప్రజలకు ధర్మదీక్షనిచ్చేపని ప్రారంభమైంది. అటువంటి సమయంలో 15-16 సం॥ వయసులో శ్రీ సాయిబాబా శిర్డీకి వచ్చారు. వారి అద్భుత లీల మరియు ఉపదేశాలను కీ.శే. గోవిందరావు (అణ్ణాసాహేబు రఘునాథ్ దాభోల్కరు) ఈ గ్రంథంలో సంగ్రహపరచి, సాయి భక్తులకు అత్యంత ఉపకారాన్ని చేశారు. కొందరు ఈ ప్రాసాదిక గ్రంథాన్ని ఏడు రోజులలో పారాయణ చేస్తారు మరి కొందరు ప్రతి రోజూ ఒక అధ్యాయం లేదా కొన్ని ఓవీలను పఠిస్తుంటారు.

కీ.శే. అణ్ణాసాహేబు దాభోల్కరు (కీ.శ. 1856సం॥మార్గశీర శుద్ధ పంచమిరోజు థాణె జిల్లాలో (కుడాల దేశస్థులు) గౌడ బ్రహ్మణ జాతిలో జన్మించారు. వారి తండ్రి శివభక్తుడు. వారి ఇల్లు అత్యంత నిరుపేద స్థితిలో ఉండేది పైగా వారి బాల్యంలోనే వారి తండ్రి మరణించటం వలన, వారు చాలా శ్రమపడి చదువుకోవలసి వచ్చింది. ఇంగ్లీషు అయిదవ తరగతి ప్యాసు కాగానే ఆతరువాతి చదువును వదిలేసి ఇంట్లో ఉండిపోవాల్సి వచ్చింది. ఇంటి పరిస్థితి పేదరికంలో ఉన్నా వారి స్వభావం చిన్నప్పటి నుండి చాలా ఉదారంగా ఉండేది. పేదరికం వలన మరియు ఉదరపోషణకు వేరే సదుపాయం లేనందువలన వారికి ప్రారంభంలోనే 8రూ॥లకు బడి పంతులు ఉద్యోగం చేయాల్సివచ్చింది. ఆఉద్యోగాన్ని కొంతకాలం చక్కగా చేశాక వారి తెలివి తేటలు ప్రేమమయ స్వభావం వలన వారికి కీ.శే. సాబాజి చింతామణి సెక్రటరీ (థాణె జిల్లాలోని డిప్యూటి కలెక్టరు) సహాయంతో గ్రామ మునసబు పని లభించింది. మనసు ఆనందంగా ఉండి వారికి దీనుల పేదల యోగ క్షేమాలను తెలుసుకోవటంలో వారికి చాలా ఉత్సాహం ఉండేది వారి శ్రమపడేస్వభావం మరియు ఆఫీసు పని

విషయంలో చాలా కర్తవ్యదక్షత ఉండటంవలన వారిపై కలెక్టరుకు రోజురోజుకూ అభిమానం పెరిగి కొన్ని రోజులలోనే వారు రెవెన్యూ ఖాతాపరీక్ష ప్యాసు అయాక వారిని మహాడ్ వద్ద మొదటి గుమస్తాగా నియమించడం జరిగింది. తరువాత వారికి ఫారెస్టు సెటల్‌మెంటు ఉద్యోగిగా ప్రామోషను లభించి, కొద్ది రోజుల్లోనే భడోచ్ వద్ద కరువు పనిలోనియమింపబడ్డారు.

ఆహోర పంపిణి చక్కగా జరిగినందుకు అక్కడి ప్రజలకు వారిపై చాలా ప్రేమ కుదిరింది. ఈ నిష్కామ భగవత్సేవ వలన వారికి కీ.శ1901సం॥ పర్మినెంటు మామలెదారు ఉద్యోగం వచ్చింది. ఆ తరువాత 1903 నుండి 1907 వరకు వాంద్రా వద్ద ఫస్టుక్లాసు రెసిడెంటు మాజిస్ట్రేటుగా పనిచేశారు కీ.శ. 1907సం॥ వారికి ఖేడా జిల్లాకు బదిలీ అయింది. క్రీ.శ 1910వసం॥ వారు మరల వాంద్రాలో రెసిడెంటు మెజిస్ట్రేటుగా నియమింపబడ్డారు ఆ పోస్టులో క్రీ.శ1916మార్చి నెలాఖరు వరకు ఉండి ఆ సేవనుండి విరమించుకున్నారు.

కీ.శే. అణ్ణాసాహేబు క్రీ.శ1903 నుండి 1907 సం॥లలో వాంద్రాలోఉండగా వారికి, సోలిసిటరు కీ.శే. హరి సీతారాం దీక్షితుతో మంచి స్నేహమేర్పడింది. వారిద్దరూ శ్రీ భగవద్గీత పఠించేవారు. ఇద్దరిలో ఎవరికైనా ఒక మహాత్ముడు తటస్థపడితే వారిగురించి ఒకరికి ఒకరు తెలియ చేసుకునేవారు. దీక్షితుకు క్రీ.శ.1909వ సం॥ కీ.శే. నానాసాహేబు చాందోర్కరు ద్వారా శిర్డీక్షేత్రంలోని శ్రీసద్గురు సాయిబాబా యొక్క ప్రథమ దర్శనమైంది. ఇటువంటి అలౌకిక మహాత్ముని దర్శనం కీ.శే. అణ్ణాసాహేబుకు కలగాలని, వారు రెసిడెంటు మెజిస్ట్రేటుగా ఆనంద్‌లో ఉన్నప్పుడు తమ దర్శనంలోని విశేషాన్ని వారికి తెలియ చేశాడు. దానిని చదివి అణ్ణాసాహేబు శ్రీ సాయినాథుని దర్శించుకోవాలని అత్యంత ఉత్సుకత వారు ఒక నెల సెలవు కోసం కమీషనరుకు దరఖాస్తు పెట్టుకోగా, సెలవు మంజూరు కాలేదు. కొన్ని రోజులకు కమీషనరు ఆనంద్‌కు వచ్చాడు అణ్ణాసాహేబు అతనిని ప్రత్యక్షంగా కలుసుకుని తనను వాంద్రాకైనా బదిలీ చేయమని విన్నవించుకున్నాడు. కాని కమిషనరు నిరాకరించాడు. కారణం వాంద్రాలో రెండు సార్లు వారు మెజిస్ట్రేటుగా పనిచేశారు. మరల అదే ప్రదేశంలో నియమించటం మంచిది కాదనిపించింది. వారికి మాత్రం సాయిబాబాను దర్శించుకోవాలని చాలాకోరిక అందువలన శ్రీ గురుమాత అంతః కరణం కరిగిపోయింది వారు అఘటితమైన సంఘటనను కల్పించారు. కమిషనరు మకాం హఠాత్తుగా 8 రోజులలో ఆనంద్‌నుండి థాణాకు మారింది. ఇంతలో ఒక అసిస్టెంటు కలెక్టరు అకస్మాత్తుగా మరణించటంవల్ల వాంద్రాలో స్థలం మరలఖాళీ అయింది. అందువలననే

వెంటనే కమిషనరు అణ్ణాసాహేబును వాంద్రాలోని రెసిడెంటు, మేజిస్ట్రేటుగా నియమించారు. అక్కడ చార్జితీసుకోగానే వారు 10 రోజులు సెలవుతీసుకుని వెంటనే తమ మొత్తం కుటుంబంతో సహా శ్రీ సద్గురు సాయిబాబాను ప్రథమంగా దర్శించుకున్నారు. అప్పుడు ఆ కలయికలోని వారి ఆనందాన్ని ఎలావర్ణించను? సద్గురుమాత సూచన ప్రాయంగా వారి గతాన్ని గురించి చెప్పారు అది విని వారు చకితులయ్యారు తరువాత సద్గురువుకు వారిపై అపార(ప్రేమ కలిగి వారు వారికి హేమాడుపంతు అన్న బిరుదునిచ్చారు మరియు తమ తదనంతరం వారితో శ్రీ సాయిసచ్చరిత లోని 52 అధ్యాయాలను వ్రాయించుకున్నారు ఇది శ్రీ సాయిలీలా మాసపత్రికలో ప్రసిద్ధిచెందినది. చివరి 52వ అధ్యాయం తమ మరణానికి రెండు రోజుల ముందు ముద్రించటానికి పంపారు. అది తమ చివరి అధ్యాయమని స్నేహితులతోను బంధువులతోను రెండుమూడు రోజుల ముందుగా తెలియచేశారు. వారు. 1916సం॥ పెన్షను పుచ్చుకున్న తర్వాత తమ ఆయువును పరమార్థానికి పరోపకారానికి వినియోగించారు. వారి భగవత్సేవ ప్రతిరోజూ చాలా నియమంగా ఉండేది స్నానసంధ్యలు ముగించుకుని శ్రీ గురుచరిత్రను శ్రీ విష్ణు సహస్రనామాన్ని పఠించేవారు. చివర, సుమారు ఒకనెల వారు ప్రతిరోజూ శ్రీ ఏకనాథభాగవతంలోని శ్రీ కృష్ణనిధనమనే 20వ అధ్యాయాన్ని చాలా ప్రేమతో చదివేవారు. ఈ నియమాలన్నీ పాటిస్తూ, శిర్డీ సంస్థానం, శ్రీ సాయిలీలా మాసిక మొదలగు పనులన్నీ చేస్తూ, తమ పనులను రోజూడయిరీలో వ్రాసి ఉంచేవారు ఎవరైనా శ్రీ మంతులైనా పేదవారైనా కలుసుకోవటానికి వస్తే తమ సమయాన్ని వెచ్చించి వారితో ప్రేమగా మాట్లాడేవారు. వారి మనోవృత్తి ఎల్లప్పుడూ ఆనందంగా ఉండేది. వారికి కథాకీర్తనల యందు ప్రీతి అందువల్ల ఆహ్వానం కోసం ఎదురు చూడకుండా వినటానికి వేళ్లే వారు. పేద విద్యార్థుల చదువు కోసం. వారు చాలా సహాయం చేసేవారు. ఎవరైనా ఏదైనా అడిగితే వారు ఎప్పుడూ లేదనేవారుకాదు. వారు పేదరికం నుండి పైకి రావటంవలన, పేదల కష్టాలను తెలుసుకుని సహాయం చేసేవారు. ఎవరైనా వస్తే వారికి తినటానికి పెట్టకపోతే వారికి తోచేదికాదు. వారికి అన్ని కులాలలోనూ స్నేహితులుండేవారు. ఈ విధంగా అణ్ణాసాహేబు ప్రాపంచికంగా ఉంటూనే పరమార్థాన్ని కూడా చక్కగా సాధించారు. వారి మరణం క్రీ.శ. 1929వసం॥ జూలై 15వతా॥ న మధ్యాహ్నం తమ స్వంత బంగళాలో ఏయోగికో సంభవించే విధంగాలభించింది.

శ్రీ సాయినాథుని కృపతో అణ్ణాసాహేబు ఈ గ్రంథం రూపంలో అమూల్యమైన అమూల్యమైన వరప్రదానం చేశారు. దీనిని

పాఠకులు తప్పక ఉపయోగించుకోవాలి. చివరి అధ్యాయంలో 182 నుండి 194 ఓవీలలో సూచించిన విధంగా ఈ గ్రంథాన్ని పారాయణ మరియు సప్తాహాలను చేసి సాయి భక్తులు అనుభవాలను తెలుసుకొండి.

శ్రీ సాయి మహరాజు భక్తులు కీ.శే. హరి సీతారాం దీక్షితు ఈ గ్రంథంలోని 35 అధ్యాయాలు పూర్తి అయాక ఒక ఉపోద్ఘాతాన్ని వ్రాశారు. అట్లే గ్రంథం పూర్తి అయాక సాయి భక్తుడు బాలకృష్ణ విశ్వనాథ్ దేవు ప్రస్తావన వ్రాశారు. శ్రీ సాయినాథ మహరాజు వద్దకు వచ్చే వేలమంది భక్తులలో అణ్ణాసాహేబు దాభోల్కరు ఒక భక్త శ్రేష్ఠుడు. వీరి ద్వారా ఈ ప్రాసాదిక గ్రంథం యొక్క 52 అధ్యాయాలు పూర్తి అయాక 53వ అధ్యాయం అంటే అవతరణికను తయారు చేశారు. కాని వారు ఈ ప్రపంచాన్ని వదిలి బాబా చరణాలలో విలీనులైనందున అవతరణిక కాగితాలు లభించలేదు. కీ.శే. దేవ్ (బాబా బాలుడు)ఈ అవతరణికను పూర్తి చేశారు. ఉపోద్ఘాతం మరియు ప్రస్తావన రెండు వ్యాసాలు ఈ గ్రంథంలో ఉన్నా బాలాసాహేబుదేవు ప్రస్తావనలో గ్రంథం పఠనంలోని మహత్యం మరియు గురుచరిత్రను ఈ నాటివరకు ఎవరెవరు వ్రాశారన్న విషయాలను చక్కగా తెలియచేశారు.

ఇప్పుడు ముంబై, పుణె, గుజరాత్, కలకత్తా, మద్రాసు మొదలగు శిర్డీనుండి చాలా దూరంగా ఉన్న ప్రదేశాలలో శ్రీ సాయి మహరాజు యొక్క ఉత్సవాలను శోభాయమానంగా జరుపుతారు అట్లే అనేక ప్రాంతాల నుండి అసంఖ్యాకంగా ప్రజలు సాయిబాబా సమాధిని దర్శించుకోవటానికి ప్రతిరోజు శిర్డీకివస్తారు. ఆసమయంలోప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తగా ఉండాలని సూచన ఇవ్వాలనిపిస్తుంది. "నేను శ్రీవారి శిష్యుణ్ణి బాబానాతో ప్రత్యక్షంగా మాట్లాడుతారు. మీకోసం ఫలానా సందేశాన్నిచ్చారు. మీ మాటలు నేను బాబాతో చెప్తాను మీ పని త్వరగా అవుతుంది మొదలగు పెత్తనందారి (దాదాగిరి) మాటలు అక్కడక్కడా చెలరేగుతున్నట్లు కనిపిస్తుంది. అంతేకాదు. ప్రత్యక్షంగా శిర్డీలో కూడా అటువంటి వారున్నారు "శ్రీవారిని ప్రార్థిస్తే ప్రతిరోజూవారు నాతో మాట్లాడుతారు. ఇటువంటి ప్రచారం శిర్డీకి మొదటి సారిగా వచ్చిన గృహస్థులకు శీర్డీ గురించి విశేషంగా తెలియక పోవటంవలన ఇటువంటి పెత్తనందారుల మాటలలో చిక్కుకోవటం సంభవిస్తుంది. శ్రీ సాయిబాబా ప్రత్యక్ష పరమేశ్వరులు కనుక మనసుతో ప్రార్థన చేస్తే అది వారికి అందుతుంది. దానికోసం మధ్య వర్తుల అవసరంలేదు శ్రీ సాయిబాబా యొక్క వేలమంది భక్తులకు ఇదిఅనుభవం. వారి సమాధి దర్శనం వారిస్మరణ, మననం ధ్యానం వగైరా

చేస్తే ఈ అనుభవం ఖచ్చితంగా కలుగుతుంది శ్రీ సాయిబాబా కాలంలో కూడా ఇటువంటి మోసగాళ్లు అక్కడికి వచ్చి బాగా అవమానపడి వెను తిరిగి వెళ్లేవారు. కీ.శే. ముక్తారాం శ్రీ సాయిబాబా కాలంలో శిర్డీలో ఉన్నాడు. శ్రీ సాయినాథులు శరీరాన్ని విడిచాక రెండు రోజులు ఈ గృహస్థుడు అక్కడి ప్రజలతో శ్రీ సాయిబాబా తమ స్థలంలోద్వారకామాయిలో నన్నే కూర్చోమని ఆజ్ఞాపించారు. నేనే వారి వారసుణ్ణి కీ.శే. తాత్యాకోతె పాటీలు శ్రీరామచంద్ర పాటీలు మొదలగువారు అతనికి అలా చేయకూడదని నచ్చచెప్పారు. కాని అతడు ఎవరిమాటావినక వారిని విదిలించుకుని బాబాకూర్చునే చోట వెళ్లి కూర్చున్నాడు. కాసేపటికీ అతనికి క్రింద నుండి సూదులు గ్రుచ్చుకొని రక్తం కారసాగింది. చివరకు 7-8 రోజులలోనే భయంకరమైన స్థితిలో అతడు శ్రీవారిని క్షమా భిక్షను వేడుకుని ప్రాణం విడిచాడు. ఇతని సమాధి లేండీ బాగ్‌లో ఉంది. ఇట్లే అధికారాన్ని చాటు కోనేవారు మరో ముగ్గురు నలుగురు గృహస్థులు అప్పుడుండేవారు కాని పైన చెప్పినది జరిగిన దానిని చూచి వేరే చోటికి వెళ్లిపోయారు. ఇలా ఎవరైనా తాను ఏదోగొప్ప మహరాజు అని అనుకుని పెత్తనం చలాయించబోతే నా సమానంగా ప్రవర్తించాలని చూస్తావా? అని శ్రీసాయి హెచ్చరించేవారు అయినా ఈనాడు బాబా ద్వారకామాయిలో మరియు సమాధి మందిరంలో కూడా కొందరు శ్రీ బాబాయే నాలో అవతరించారు అని ప్రజలను మోసపుచ్చి తమ పాదాల పైపడేలా చేస్తారు సద్గురువుతో సమానంగా ఉండాలన్న సాహసం చేసిన వారి పరిస్థితి చివర ఏమౌతుందో పైన చెప్పిన విషయాన్ని బట్టి తెలుస్తుంది. ఇటువంటి పనులను ఉత్సాహ పరచేవారు చాలావరకు బాగా చదువుకుని సమాజంలోనే ఉంటూ ఇటువంటి మహరాజుల, బాగా ప్రచారంకూడా చేస్తారు ప్రపంచంలో సాధువులున్నట్లే మోసగాళ్లూ ఉంటారు పరమార్థంలో వీరు ఎక్కువగా ఉంటారు. కారణం పరమార్థం బుద్ధికి అతీతమైన విషయం కనుక దానిలో అత్యంత శ్రద్ధ లేకుండా అడుగు పడటం అశక్యం. చెల్లని నాణేలు ఉంటాయని పారిపోగలరా? మనం చక్కగా చూచి తీసుకునేలా సాధువులను కూడా బాగా పరీక్షించుకోవాలి బాబా "నాసమాధిలో నుండి నా ఎముకలు మాట్లాడుతాయి ప్రజలు చీమల్లాగా వస్తారు నావాళ్లను నేను పిచ్చుక కుదారం కట్టి లాగేలా నా వద్దకు తీసుకునివస్తాను " అని అనేవారు. ఈ మాటలు ఇప్పుడు అనుభవానికి వస్తున్నాయి. నిజమైన సాధువుల యొక్క అంతఃకరణం మానవజీవుల మంచి కోసం తపన పడుతుంది ఈ పని ఇతర జనుల ప్రచార కార్యాల వలన జరగదు. ప్రచారం చేసే వారికి కూడా సద్గురువు యొక్క ఆదేశం ఆశీర్వాదం అవసరం. చాలావరకు

మొదట మనుష్యుడు తన కార్యాన్ని సాధించుకునే కోరికతో ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తాడు పుణ్యక్షేత్రాలకు లేదా సత్పురుషుల దర్శనానికి వెళ్తాడు. ఇప్పుడు వేల ప్రజలకు శ్రీ బాబాయొక్క అనుభవాలు కలుగుతున్నాయి.నకిలీ వాళ్లు కూడా తమ స్థలంలో అభివృద్ధి చెతుంటారు. శ్రీ సాయి మహారాజు జన్మతః మహా సిద్ధ పురుషులు. సాధకులు ధ్యేయ ప్రాప్తికి ప్రయత్నం చేయాలి కాని ఒట్టి ప్రయత్నంతో కీర్తిలభించదు. ఆ ప్రయత్నంలో కీర్తి లభించటానికి ఈశ్వరుని కృప సహాయం అవసరం, పరమార్థ సాధకుల విషయం కూడా ఇంతే. సాధకుల ప్రయత్నానికి కీర్తిలభించాలంటే గురుకృప అవసరం, గురు కృప లేకుండా పరమార్థంలో యోగ్యమైన స్థానం లభించదు. గురుకృపతోబాటు ఈశ్వరుని కృపకూడా ఉండాలి. ఈశ్వరుని కృపలేకుండా సద్గురువు లభించటం అశక్యం అని యోగవాశిష్ఠంలో చెప్పబడి ఉంది. తల్లి తండ్రి లభించటం కూడా దైవం మీదేఆదారపడి ఉంది.

శ్రీసాయిబాబా యొక్క గురు తాళం చెవి విశేషమైనది. తాబేలు తన పిల్లలను ఏంపెట్టకుండానే తనదృష్టితో పోషిస్తుంది అదే విధంగా మన సద్గురువు ఎవరికైనా ఉపదేశం, లేదా మంత్రం ఇవ్వకుండా తమ కృపతోనే అనేక విచిత్ర సందర్భాలలో భక్తుల యోగ్యతలను బట్టి వారికి బ్రహ్మానందాన్ని ప్రసాదించారు. శ్రీ హరి భక్తపరాయణుడు దాసగణు మహారాజుకు పండరీ పురానికి వెళ్లాలని చాలా కోరికగా ఉంటే, తామే ఆ శ్రీపాండురంగడు, పండరికి వెళ్లే అవసరం లేదని తెలపటానికి సాయి శీర్డిలోని ద్వారకామాయి లోనే స్వయంపాండురంగడై దర్శనమిచ్చారు. కీ.శే బావూ సాహేబు జోగ్ శ్రీ సద్గురు అక్కల్‌కోట స్వామిని దర్శించు కోవాలన్న కోరికను తెలిపాడు. మొండి పట్టుదలతో హారతికి కూడా రాలేదు. హారతి సమయంలో అప్పుడు శ్రీ సాయిబాబా రెండు సార్లు పిలువనంపగా వచ్చాడు. హారతి అయాక బాబా ఎదుట నమస్కరిస్తుండగా అప్పుడు అక్కడున్నవారందరికీ శ్రీసాయినాథులు అక్కల్‌కోటస్వామి రూపంలో దర్శనమిచ్చారు. ఇటువంటి మహాత్మ్యం ఉన్నవారి కృప పొందటానికి మధ్యవర్తులు అవసరమా? శ్రీ పాండురంగడు, కృష్ణ భగవానుడు రామచంద్ర ప్రభు మొదలగు దేవతలకు, శిష్యులు ఎలా ఉండరో అట్లే సద్గురు శ్రీ సాయినాథునికి వారి సమయంలో ఏ ఒక్కరూ వారికి శిష్యులు కాలేదు. ఇప్పుడూ లేరు. ఇకముందూ ఉండరు మనమంతా వారి భక్తులం. ప్రేమతో మన ఈ దేవుణ్ణి ప్రసన్నుణ్ణిచేసుకోవచ్చు. ఇది ఈ గ్రంథంలోని అనుభవాల ద్వారా తెలుస్తుంది. ఇప్పుడు. కూడా ఇటువంటి అనుభవాలు ప్రతి ఒక్కరికీ కలుగుతాయి. శ్రీ సాయినాథుని వలననే శిర్డీ

గ్రామానికి మహత్వం వచ్చింది. అంతే కాదు పండరిపురం, గాణగాపురం, నాసిక్ రామేశ్వర్, బదరీనారాయణ, ప్రయాగ కాశీల వలే శిర్డీ పుణ్యక్షేత్రమవటం వలన ఇది జాగృతస్థానం. అందువలన శ్రీసాయిబాబాను సత్పురుషులుగురువు దైవమని విశ్వసించేవారికి మరల సూచించటం. శ్రీవారి చరణాలవద్ద ఏదైనావేడు కోవాలనుకుంటే, శిర్డీలో లేదా ప్రపంచంలో ఎక్కడున్నా భక్తి భావంతో విశ్వాసంతో వేడుకోవాలి. ఓపికగా ఉండాలి, మీకోరిక నెరవేరుతుంది. అంతే కాని ఏం తెలియని బూటకపు స్వాముల ఎరలో పడిచిక్కుకొనకండి.

శ్రీ సాయిబాబా పరమభక్తుడు కీ.శే. హరిసీతారాం దీక్షితు వారి గురించి ఈ గ్రంథంలో చాలా చోట్ల వ్రాయబడి ఉంది. వారు శ్రీ బాబా యొక్కమహాభక్తుడు. దక్షిణ భారతంలో ఒకరిద్దరు భక్తులు ప్రచురించిన పుస్తకాలలో శ్రీ సాయిబాబా ముసాల్మానని, హైదరాబాదులోని ఒక ఊరిలో జన్మించారని వ్రాశారు. ఈ విషయంలో కీ.శే. దీక్షితు 25 ఏళ్లకూ పూర్వం శ్రీసాయిలీలలో ప్రచురించిన ఉపొద్ఘాతంలో మొదట్లోనే తెలియచేశారు. బాబా పేరు 'సాయిబాబా' అని ఎవరో పెట్టింది, బాబా వద్దకు వచ్చే గృహస్థులు ఆనాటి పరిస్థితి మొదలగు విషయాలను వివరంగా వ్రాసిన ఈ ఉపొద్ఘాతం ఈ గ్రంధానికి మొదట్లో ఉంది. శ్రీ వారి చెవులు కుట్టి ఉండేవి అని శ్రీ వారి సాన్నిధ్యంలో ఉన్న వారు ప్రస్తుతం జీవించి ఉన్నవారు శ్రీరామచంద్రదాదా పాటిలు, సగుణమేరునాయక్ బాపాజి రత్నపారఖి, దగడు కంపాలి, మొదలగు శిర్డీలోని గృహస్థులు చెప్పు తీరు, బాబా హిందువా లేక ముసల్మానా అని పరిశోధనకు కారణం కనిపించదు. ఈ విషయాన్ని ఏడవ అధ్యాయంలో హేమాడుపంతు వ్రాశారు. శ్రీబాబా అన్ని ధర్మాలకు చెందినవారు. వృక్షం ఎంత పెద్దదిగా ఉన్నా సరే, దానిని ఎవరునాటారు? దానికి ఎన్ని పళ్లున్నాయి అన్నవి పట్టించుకోకుండా దానికి ఉన్న మధుర ఫలాలు ఎలా లభిస్తాయి అని ఆలోచించక సాధు సత్పురుషుల జాతి మతధర్మాలను చూడటం సహించతగింది కాదు.

మనధర్మంలో మానవుడు తమ దైనందిన జీవితాన్ని ఎలా గడపాలి అన్న విషయంగురించి చాలా నియమాలున్నాయి. వానిలో ప్రార్థన కూడా ఉంది. ప్రపంచంలో ఉంటూ నిర్వికల్ప ప్రార్థన చేస్తే ముక్తి లభించగలదు. దీనిని సత్పురుషులైన తుకారాం ఏకనాథ్ మహారాజులు చూపించారు. ప్రార్థనలో నామ స్మరణం కీర్తనం మననం వగైరాలుంటాయి. ధార్మిక గ్రంథాలను పఠించటం కూడా ఒక భాగం. ప్రార్ధన గురించి కీ.శే. దేవుగారి ప్రస్తావనలో కనిసిస్తుంది. ప్రతి రోజుకూ ఉన్న 24గం॥లలో కనీసం 24నిముషాలైనా ఏకాగ్ర

మనసుతో ప్రార్థనకోసం వినియోగిస్తే మనసు శాంతిస్తుంది. ప్రార్థనలోని శక్తిని వర్ణించతరంకాదు. పూర్వ సంచిత కర్మానుసారం ఐహిక సుఖాలను దుఃఖాలను మనుషులు అనుభవించి తీరాలి కనుక విధివ్రాత ఏదైనా తప్పించుకోలేం. అయినప్పటికీ. ఈ జన్మలోని సేవ మరియు సత్కర్మలు తరువాతి జన్మకు సంచితంగా ఉంటాయి. ప్రార్థన వ్యక్తిగతంగానో లేక సాముదాయకంగా ఉండవచ్చు సాధకులు గాని లేక ముముక్షువులుగాని ఎవరైనా సరే వారు తమ గురువు పట్ల నిజమైన ప్రేమతో స్వతంత్ర బుద్ధితో ఆలోచిస్తూ అభ్యాసం మరియు నిదిధ్యాసలు చేస్తే వారివారి యోగ్యతలను బట్టి గురుకృప లభిస్తుంది. ఇది నిజం.

గురుపౌర్ణిమతా। 18-7-1951

శిర్డి

నాగేశ్ ఆత్మారాం సావంత్



శ్రీ సాయి సచ్చరిత ప్రారంభం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః;
శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ప్రారంభించిన కార్యం నిర్విఘ్నంగా పరిసమాప్తి కావాలని విద్వజ్జనులు, తమ ఇష్ట దేవతల అనుగ్రహప్రాప్తికొఅకు ముందుగా మంగళా చరణాన్ని ఆచరిస్తారు.1. కారణం, మంగళాచరణ వలన కలిగే ప్రయోజనం సర్వవిఘ్న నివారణం, ఇష్టార్థసిద్ధి మరియు అందరికీ అభివందనం జరుగుతుంది.2.మొదట తొలిపూజితుడైన వక్రతుండ హేరంబమూర్తి, చతుర్దశ విద్యలకు అధిపతి, మంగళరూపుడగు గజాననుడైన గణపతికి నమస్కారం.3.నీ ఉదరం చతుర్దశ భువనాలకు ఆలవాలం. అందుకే నిన్ను లంబోదరుడని అంటారు. భక్తుల విఘ్నాలను తొలగించటానికి నీహస్తమందు పదునైన పరశువును ధరించావు.4. విఘ్నాలనే విభూతాలను తొలగించే గణనాథా! గజాననా ! నా ఈ వచనాలను ప్రసాదికంగా అనుగ్రహించు. నీకు నేను సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. 5. నీవు భక్తులకు సహాయకారివి. నీ కాలి అందె క్రింద విఘ్నాలు నశిస్తాయి. నీ కృపా కటాక్షంతో దారిద్ర్యం దూరంగా పారిపోతుంది.6.నీవు భవార్ణవాన్ని దాటించే నౌకవు. అజ్ఞానాంధకారాన్ని తొలగించే జ్ఞానజ్యోతివి. నీవు బుద్ధి సిద్ధుల సహితంగా నన్ను ప్రసన్నంగా చూడు.7.జయజయ మూషికవాహనా! విఘ్నకానలను నరికివేసే గిరిజానందనా ! మంగళవదనా ! నీకు నా అభివందనములు.8.కార్యం నిర్విఘ్నంగా పరిపూర్తి కావటానికి, మంగళప్రాప్తికి, ఇష్టదేవతలకు నమస్కరించే శిష్టాచారాన్ని నేను పాటిస్తున్నాను.9.ఈ సాయి యే గజాననుడైన గణపతి.

ఈ సాయియే పరశువును చేత బట్టుకుని విఘ్నాలను తొలగించేవారు. వీరే స్వయంగా తమ లీలలను వర్ణిస్తారు.10.సాయియే బాలచంద్ర గజాననుడు. ఏక దంత గజకర్ణుడు వీరే. విరిగిపోయిన దంతంతో విఘ్నుకానలను విచ్ఛేదం చేసే వారు వీరే.11.ఓ సర్వమంగళ మాంగల్యా! లంబోదరా! గణాధీశా! అభేదరూపా! సాయిదయామయా! మమ్ము ఆత్మానంద నిలయానికి తీసుకొని వెళ్ళండి.12.ఇప్పుడు బ్రహ్మకుమారి, చాతుర్యలహరియైన సరస్వతికి నమస్కారం. ఈమె నా జిహ్వాను హంసగా చేసుకుని దానిపై ఆరూఢురాలగుగాక.13. బ్రహ్మవీణను చేత పట్టుకుని నొసట ఎఱ్ఱటి కుంకుమ రేఖతో ధవళ వస్త్రాలను ధరించిన హంసవాహినీ నన్ను కరుణించు.14.జగన్మాతయైన ఈ వాగ్దేవత యొక్క అనుగ్రహం లేకపోతే ఈ సారస్వత కథారచన నాకు సాధ్యమా?15.జగజ్జననీ! వేదమాతా! విద్యా విభవ గుణసరితా! సాయి సమర్థుని చరితా మృతాన్ని నా ద్వారా అందరికీ పానం చేయించు.16.సాయియే భగవతి సాయియే సరస్వతి. భక్తులను ఉద్ధరించటానికి, ఓంకార వీణను చేత ధరించి తమ చరితాన్ని తామేగానం చేస్తున్నారు.17.సృష్టిస్థితిలయ కారకులు, సత్త్వ రజస్తమోగుణాకారులు, బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు నమస్కారములు.18.ఓ సాయినాథా! స్వప్రకాశా! మీరే మాగణాధీశులు.మీరు మాకు సావిత్రీ పతి రమాపతి ఉమాపతి కూడా.19.మీరే మా సద్గురువు. భక్తులను భవనదిని దాటించి తీరానికి తీసుకువెళ్ళే నౌక మీరే.20.పూర్వ జన్మల పుణ్యమేదో లేనిదే మాకు మీ పాదాల వద్ద ఆశ్రయం లభిస్తుందా?21.సకల జనుల దుఃఖాలను తొలగించే క్షీరసాగర నివాసి, మా కులదైవమైన ఆదినారాయణునకు నమస్కారం.22. పరశురాముడు సాగరాన్ని వెట్టిన కారణంగా నిర్మాణమైన నూతన భూభాగానికి కొంకణమని పేరు. అక్కడ నారాయణుడు ప్రకటమయ్యాడు.23.సకలజీవులలో అంతర్యామిగా ఉంటూ తన కృపాదృష్టితో, నియమంగా వారి సంరక్షణ చేస్తున్నాడు. నేను వారి ప్రేరణకు ఆధీనుణ్ణి.24.అట్లే

భార్గవుడు యజ్ఞ సమాప్తికొఅకు తీసుకు వచ్చిన గౌడదేశీయ మహామునియైన మూలపురుషునికి అత్యాదరంగా నమస్కరిస్తున్నాను. 25. ఇప్పుడు పూర్వజులైన గోత్ర స్వామి భరద్వాజ ఋషీశ్వరునికి, ఋగ్వేదశాకల శాఖకు చెందిన ఆది గౌడ బ్రాహ్మణులకు వందనం చేస్తాను. 26. తరువాత భూమిపైన పరబ్రహ్మావతారులైన బ్రాహ్మణులకు, యాజ్ఞవల్క్య భృగుపరాశర నారదాది మునీంద్రులకు నమస్కారం. 27. పరాశర సుతుడైన వేదవ్యాసునకు, సనకసనందన సనత్ కుమారులకు, శుకునకు, సూత్ర కారకుడైన శౌనకునకు, విశ్వామిత్ర వసిష్ఠులకు, 28. వాల్మీకి వామదేవ జైమిని వైశంపాయనాది నవయోగీంద్రుల చరణాలకు సాష్టాంగ ప్రణామాలు. 29. ఇక నివృత్తి జ్ఞానేశ్వర ముక్తాబాయి, సోపాన ఏకనాథ జనార్దన స్వామి, తుకారాం, కాన్హోబా, నరహరి మొదలగు సాధుసజ్జనులకు నమస్కారం. 30. ఈ గ్రంథంలో అందరినీ పేర్కొనుటకు అవకాశం లేదు కనుక, అందరికీ ప్రణామం చేసి, నేను వారి ఆశీస్సులను వేడుకుంటున్నాను. 31. ఇక ప్రపంచం నిరర్థకమని తెలుసుకుని బదరీకేదార్‌లో స్థిరపడిన పుణ్యాత్ముడు నాపితామహుడైన సదాశివునకు నమస్కారం. 32. తరువాత, కంఠమందు రుద్రాక్షలు ధరించి ఆరాధ్య దైవమైన సదాశివుని సదా ఆరాధించిన నా పితృదేవునికి నమస్కారం. 33. నాకీ జన్మను ఇచ్చి అహోరాత్రులు కష్టపడి నన్ను పోషించిన నా కన్నతల్లికి వందనం. ఆమె ఉపకారాన్ని ఎంతగా స్మరించను? 34. చిన్నతనంలోనే కన్నతల్లి నన్ను వదిలిపోగా, నన్ను మా పిన్ని కష్టపడి పెంచింది. ఆమె అనుదినం హరిస్మరణలో ఉండేది. ఆమె చరణాలకు నమస్కారం .35. అందరిలో పెద్దవాడు అనుపమానమైన సోదర ప్రేమతో నా కొఅకు ప్రాణాలను సహితం ఇవ్వగలిగిన మా పెద్దన్నయ్య పాదాలపై శిరస్సు వంచుతున్నాను. 36. ఇక శ్రోతలకు నమస్కారం చేసి ఏకాగ్ర మనసుతో ఉండాలని ప్రార్థిస్తున్నాను. మీరు పరధ్యానంగా ఉంటే నాకు శాంతి ఎక్కడిది? 37. శ్రోతలు గుణవంతులు చతురులై ఉండి

కథా శ్రవణమందు ఆతురతతో ఉంటే వక్తకు ఉత్సాహం సంతోషం కలుగుతాయి.38.శ్రోతలు సావధానంగా లేకపోతే ఈ కథకు ఏం ప్రయోజనం? అందుచేత ప్రసన్న చిత్తంతో శ్రవణంచేయండని మీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను.39.నాకు పాండిత్యంలేదు. నేను గ్రంథ పారాయణంగాని సత్కథా శ్రవణంగాని చేయలేదు. ఇది మీకు బాగా తెలుసు.40.నా అవగుణాలు నా లోపాలు నాకు పూర్తిగా తెలుసు.అయినా గురువు యొక్క వచనాన్ని పాటించటానికి నా ఈ గ్రంథరచనా ప్రయత్నం.41.మీ ముందు నేను తృణ సమానుణ్ణని నా మనసుకు తెలుసు. అయినా నన్ను కరుణించి మీ అక్కున చేర్చుకొండి.42.ఇక బుద్దిని స్ఫురింపచేసే సద్గురుని స్మరించి, త్రికరణ శుద్ధిగా వారి శరణు జొచ్చి భక్తితో వారి చరణాలకు నమస్కరిస్తున్నాను.43.భోజన సమయంలో మధుర పదార్థాన్ని చివర వడ్డించే విధంగా గురువందనంతో వందనుమర్పణ నుమాప్తి చేస్తాను.44.ఓంనమో సద్గురు దేవా! చరాచరాలకు విశ్రామధామం మీరే. దయామయా విశ్వమంతటికీ అధిస్థానం మీరొక్కరే. 45.సప్తద్వీపాలతో నవ ఖండాలుగా ఉన్న పృథ్విని, మరియు సప్త స్వర్గాలను, సప్త పాతాళాలను ఉద్భవింప జేసిన హిరణ్య గర్భాండమే బ్రహ్మాండమని ప్రసిద్ధి.46.ఈ బ్రహ్మాండానికి జన్మనిచ్చిన దానిని అవ్యక్తము లేక మాయ అని అంటారు. సద్గురు స్థానం ఆ మాయకు అతీతంగా ఉంటుంది.47.వారి మహిమను వర్ణించలేక వేద శాస్త్రాలు మౌనం వహించాయి. యుక్తిప్రయుక్తులు ప్రమాణాలు వారి వద్ద చెల్లవు.48.సద్గురూ! మిమ్ము దేనితో పోల్చాలన్నా అంతటా మీరే. దృష్టికి ఏవి కనిపించినా అవన్నీ మీరు స్వయంగా నటించే మీ రూపాలే. 49. ఇటువంటి సమర్థ సద్గురు శ్రీ సాయినాథా! కరుణాసాగరా! స్వసంవేద్యా ! సర్వాతీతా! అనాద్యనంతా! మీకు వందనం.50.నిత్యానందా! పూర్ణకామా! స్వప్రకాశా! సర్వోత్తమా ! మంగళధామా! ఆత్మారామా! గురువర్యా ! మీకు నా ప్రణామాలు.51.మీ స్తవనం

చేయలేక వేదాలు, శ్రుతులు మౌనం వహించగా మీ గురించి తెలుసుకోవటానికి నా జ్ఞానం ఏపాటిది? 52. జయ జయ సద్గురు కరుణాసాగరా! జయజయ గోదావరీ తీర విహారా ! జయ జయ బ్రహ్మ విష్ణు మహేశ్వరా ! దత్తావతారా ! మీకు నమస్కారం. 53. సద్గురువు లేకుండా బ్రహ్మకు బ్రహ్మత్వం లేదు. అట్టి సద్గురువుకు ప్రేమగా అనన్య శరణు జొచ్చి పంచ ప్రాణాలను సమర్పించాలి. 54. శిరస్సుతో పాదాలకు వందనం హస్తాలతో చరణ సంవాహనం, నయనాలతో ముఖావలోకనం, నాసికతో వారి చరణతీర్థాన్ని ఆఘ్రాణం చేయాలి. 55. శ్రవణాలతో సాయి గుణగణాల శ్రవణం, మనస్సుతో వారి ధ్యానం, చిత్తంతో అనవరతం వారి చింతన చేస్తే ప్రాపంచిక బంధనం తొలగిపోతుంది. 56. భక్తి శ్రద్ధలతో తనువు మనస్సు ధనం సద్గురు చరణాలకు సమర్పించి, సద్గురు సేవలో ఆజన్మాంతం ఆయువును వెచ్చించాలి. 57. గురునామం, గురువు యొక్క సహవాసం, గురుకృప మరియు గురుచరణ పాయసం, గురు మంత్రం మరియు గురుగృహనివాసం ఇవి అత్యంత ప్రయాసతో లభిస్తాయి. 58. వీనిలో ప్రచండ శక్తి ఉంది. ఇవి భక్తులను పరీక్షించి వారికి తెలియకుండానే మోక్ష ద్వారం వరకు నెట్టుకుంటూ తీసుకొని పోతాయి. 59. గురు సాంగత్యం గంగా జలం వలె మనో మాలిన్యాన్ని ప్రక్షాళనం చేసి నిర్మలం చేస్తుంది. మనస్సు వంటి చంచలమైనది మరొకటి ఉంటుందా? అటువంటి దానిని కూడా హరి చరణాలయందు నిశ్చలంగా స్థిరపరుస్తుంది. 60. సద్గురు చరణసేవయే మనకు వేద శాస్త్ర పురాణాలు. సద్గురు చరణాలయందు సాష్టాంగ వందనం మనకు యోగ యాగ తపస్సాధనలు. 61. శ్రీ సద్గురువు యొక్క పవిత్ర నామం మనకు వేద శాస్త్రం. 'సాయి సమర్థ' ఇదే మన మంత్రం. యంత్రం, తంత్రం కూడా ఇది ఒక్కటే. 62. జగత్తు ఒట్టి మిథ్య అన్న జ్ఞానం మరియు బ్రహ్మ మాత్రమే సత్యం అన్న అనుభవ జ్ఞానం కలిగించే పరమార్థ ప్రాప్తి స్థితిని సాయి తమ భక్తులకు

ప్రసాదిస్తారు.63.పరమాత్మ సుఖం, పరమాత్మ ప్రాప్తి, బ్రహ్మానంద స్వరూప స్థితి, ఇత్యాది శబ్ద జాలపు చిక్కుల్లో పడకుండా చిత్త వృత్తి ఆనంద మయం కావాలి. 64.ఎవరి చిత్త వృత్తి సర్వదా ఇట్టి ఆనంద స్థితిలో ఉంటుందో వారి మనస్సు ఎప్పుడూ సుఖంగా, శాంతంగా ఉంటుంది. ఇదే పరమ పద ప్రాప్తి.65.సాయి ఆనంద వృత్తికి గని. సదా సాగరంలా పరిపూర్ణంగా ఉండే సాయి వద్ద భాగ్యవంతులైన భక్తులకు పరమానందానికి కొఱత లేదు. 66.శివుడు – శక్తి , పురుషుడు – ప్రకృతి, ప్రాణం – గతి, దీపం – దీప్తి ఇవి శుద్ధ బ్రహ్మ చైతన్యం యొక్క వికృతులు. ఇవి ఒక్కటే ఐనా ద్వైత భావాన్ని కలిగిస్తాయి. 67.ఏకాకి రమించలేడని శ్రుతి వచనం. అందువలన ఇతరుల సాంగత్యాన్ని కోరి 'బహుశ్యాం' అనేకంగా మారుతానని పరబ్రహ్మ అనేకంగా మారి మరల ఏకత్వంలో మిళితమై పోవటం జరుగుతుంది. 68.శుద్ధబ్రహ్మస్థితి యందు పురుషుడు లేడు, ప్రకృతి లేదు. సూర్యుడు ఉన్న చోట పగలు, రాత్రి ఎలా ఉంటాయి? 69.గుణాతీతమైన మూల నిర్గుణ బ్రహ్మతత్త్వం భక్తుల శ్రేయస్సు కొఱకు సత్త్వగుణ శోభితుడై, సగుణ సాకార రూపంలో అవతరించిన సాయికి శరణు శరణు.70.వారికి అనన్య శరణు జొచ్చినవారి కష్టాలు తొలగిపోయాయి.అందువల్ల నా స్వార్థం కోసం వారి చరణాలయందు నా శిరసును ఉంచుతున్నాను. 71.వాస్తవానికి సాయి నిర్గుణ నిరాకారులే ఐనా, భక్తులు భక్తిలోని ఆనందాన్ని అనుభవించటానికి భగవంతుడు భక్తుడు అన్న లీలను ప్రదర్శించారు.ఆ ప్రేమ స్వరూపునకు నా సాష్టాంగ ప్రణామం.72.సకలజీవుల లోని జ్ఞానశక్తికి అధిష్ఠానమై చరాచరాలలో చైతన్యంగా ఉన్న ఆ ప్రేమమయునకు ప్రణామాలు.73.గురుదేవా! మీరు మూర్తీభవించిన ఆనందం,మా ఆర్తుల కష్టాలను తీర్చేది మీరే.మా పరమగతి మా విశ్రామధామం మీరే.74.ఈ వందన సమర్పణ చివర సర్వభూతాలలోనున్న సర్వజీవులకు వందనం చేసి వారు నన్ను తమ అక్కున చేర్చుకోవాలని ప్రార్థిస్తాను. 75.

సర్వజీవులకు వందనం చేయటం వలన, ఈ జగత్తు లోపలా బయటా ఒకే ఆత్మగా అభేదరూపంగా వ్యాపించి, విశ్వాన్ని పోషించే విశ్వంభరుడు ఆనందిస్తాడు.76.ఇక్కడితో వందన సమర్పణ పరిపూర్ణమైంది. ప్రారంభించిన పని చక్కగా జరగటానికి ఇది సాధనం.ఇదే ఈ గ్రంథం యొక్క మంగళా చరణం. ఇక ఈ గ్రంథం యొక్క ప్రయోజనాన్ని మనవి చేస్తాను.77.సాయిబాబా నన్ను అనుగ్రహించినప్పటి నుండి నేను అహర్నిశలూ వారినే ధ్యానిస్తున్నాను. దానివల్ల భవభీతి నశిస్తుంది.78.నాకు వేరే జపతపాలులేవు. సాయి యొక్క శుద్ధ సగుణ స్వరూపాన్ని అవలోకించటం ఒక్కటే. 79.వారి సుందరవదనాన్ని చూస్తుంటే ఆకలి దప్పులు హరించుకుని పోతాయి. ప్రపంచంలోని దుఃఖాలను మరిపించగల ఆ ఆనందం ముందు ఇతర సుఖాలు తుచ్ఛమైనవి. 80.బాబా యొక్క నయనాలను చూస్తుంటే తమ్ముతాము మరచిపోతారు. హృదయం నుండి ప్రేమ ఉప్పొంగి మనోవృత్తి ఆనందంలో విలీన మౌతుంది. 81.కర్మధర్మ శాస్త్ర పురాణాలు, యోగయాగానుష్ఠానాలు, తీర్థయాత్రా పర్యటనలు, తపస్సు మొదలగు ఆచరణలన్నీ నాకు ఒక్క సాయి చరణాలే. 82.గురువు యొక్క ఉపదేశానుసారం ప్రవర్తిస్తూ అనవరతం చిత్తవృత్తిని ప్రగాఢమైన శ్రద్ధాస్థితి యందు దృఢపరుస్తే మనసుకు నిశ్చలమైన పరమ శాంతి ప్రాప్తిస్తుంది. 83.ఇదే కర్మ యొక్క అనుబంధ స్థితి. ఫలితంగా నాకు సాయి చరణాలయందు ఆసక్తి కలిగింది. దాని పరిణామంగా వారి అతర్క్యశక్తి అనుభవమైంది. నేను దానిని ఎంతని వర్ణించను?84.భక్తిని ఉత్పన్నం చేసే ఈ శక్తి సమర్థసాయి చరణాలయందు ప్రీతిని పెంపొందిస్తుంది. మరియు ప్రపంచంలో ఉంటూనే ప్రపంచం నుండి నివృత్తిని కలిగించి ఆనందాన్ని అనుభవింప చేస్తుంది. 85.భక్తిని అనేకులు అనేక రకాలుగా నిర్వచించారు. వాని లక్షణాలను నా శక్త్యానుసారం సంక్షిప్తంగా మనవి చేస్తాను. 86. స్వస్వరూపానుసంధానం, భక్తి యొక్క ముఖ్య లక్షణమని వేద

శాస్త్ర నిపుణులు జ్ఞాన సంపన్నులైన ఆచార్యులన్నారు.87.పూజాదులతో ప్రేమను వ్యక్తం చేయడం అర్చన భక్తి యొక్క లక్షణమని పరాశరుని పుత్రుడైన వ్యాస మహర్షి అన్నారు. 88.అదొక రకమైన భక్తి. గురు ప్రీత్యర్థం ఉపవనాలనుండి పారిజాతాది పుష్పాలను తీసుకుని వచ్చి, గురువు గారి గృహప్రాంగణాన్ని శుభ్రపరచి గోమయంతో అలకాలి.89.తాము ముందుగా స్నాన సంధ్యాదులు ముగించుకొని గురుదేవుల కొఅకు గంధం తీసి, పంచాభిషేకానంతరం ధూపదీపార్చనలుచేసి.90.తరువాత నైవేద్యం సమర్పించి హారతి నీరాజనాలివ్వటం మొదలగు వానిని భక్తి శ్రద్ధలతో ప్రేమ పూర్వకంగా చేయటాన్ని అర్చనా భక్తి అని అంటారు. 91.తమ హృదయంలోని నిర్మలమైన శుద్ధజ్ఞాన స్వరూపమైన చైతన్యాన్ని ప్రతిమా మూర్తియందు ఆమంత్రించి పూజించాలి.92.అర్చనాదుల అనంతరం ఆ చైతన్యాన్ని మరల తము హృదయంలోని పూర్వస్థితి యందు స్థాపించాలి.93.గర్గాచార్యుల మతానుసారం మనస్సు హరి యొక్క గుణగణాలను సంకీర్తనలలో తల్లీనత చెంది హరియందు వినీలమై పోవటం మరొక భక్తి లక్షణం. 94.అఖండ ఆత్మాను సంధానంతో విహితా చరణ కలిగి కధా సంకీర్తనలలో పాల్గొనటం భక్తి లక్షణమని 'శాండిల్యుని' వచనం.95.స్వహితాన్ని సాధించ దలచిన వారు వేద విహిత కర్మలను ఆచరిస్తారు. తమ శ్రేయానికి చెడు కలిగించే అవిహిత, నిషిద్ధ కర్మలను త్యజిస్తారు.96.ఏదైనా క్రియకూ ఫలానికీ కర్తను కాని,భోక్తను కాని నేను నిజంగా కాను అన్న నిరహంకార భావం మనసున ఉద్భవించటం బ్రహ్మార్పణ యోగం.97.ఈ విధంగా కర్మలను ఆచరిస్తే సహజంగా నైష్కర్మ్యత సిద్ధిస్తుంది. కర్మ యొక్క కర్తృత్వాన్ని త్యాగం చేయవచ్చు. కాని కర్మ త్యాగం ఎప్పుడూ సంభవం కాదు.98.ముల్లును ముల్లుతో తీసే విధంగా కర్మను కర్మతోనే తొలగించాలి. ఆత్మను తెలుసుకున్న వెంటనే కర్మ పూర్తిగా నశించి పోతుంది.99.ఫలాపేక్ష పూర్తిగా లేకుండా ఉండటమే కోరికలను

త్యజించడంలోని మర్మం. నిత్యనైమిత్తిక కర్మలను ఆచరించటం శుద్ధ స్వధర్మమన బడుతుంది.100.సర్వకర్మలను భగవంతునికి సమర్పించి, సర్వం మరచిపోయి ఒక్క క్షణమైనా నిశ్చలమైన మనసుతో ఉండటం నారదుడు వర్ణించిన మరొక రకమైన భక్తి లక్షణం.101. ఈ విధంగా ఒకటి కంటే మరొకటి విలక్షణమైన అనేక భక్తి లక్షణాలుండగా మనం కేవలం గురుకథా స్మరణతో భవసాగరాన్ని అవలీలగా కాళ్లకు తడి అంటకుండా దాటగలం.102.గురు కథా శ్రవణమందు ఆసక్తి కలిగి నేను దానిలో తల్లీనుణ్ణయ్యాను. అనుభవ సిద్ధమైన కథా ప్రబంధాన్ని స్వయంగా రచించాలనిపించింది. 103.నేను శిరిడీలో ఉండగా ఒకసారి బాబా దర్శనానికి మసీదుకు వెళ్ళినప్పుడు అక్కడ బాబా గోధుమలను విసరటం చూచి నాకు అత్యంత ఆశ్చర్యం కలిగింది.104.ముందుగా ఆ కథను వివరిస్తాను. శ్రద్ధగా శ్రవణం చేయండి. ఈ సాయి సచ్చరిత దానిలో నుండి ఎలా ఉద్భవించిందో వినండి. 105.ఉత్తమమైన కీర్తి గలవారి గుణాలను వర్ణించడం మరియు ప్రేమ పూరితమైన వారి కథలను చర్చించుకోవడం వలన చిత్తశుద్ధి కలిగి బుద్ధి వికాస వంతమవుతుంది.106.వారి కథలను, వారి గుణాలను వర్ణించి,వారి లీలలను శ్రవణం చేస్తే భగవంతుడు ప్రసన్నుడై తాపత్రయ బాధలను తొలగించి దుఃఖాలను నివారిస్తాడు.107.అధి భౌతిక, ఆధ్యాత్మిక, అధి దైవికమను త్రితాపాలతో బాధ పడేవారు, తమ ఆత్మ హితాన్ని ఆత్మానందాన్ని కోరుకునే వారు సాయి చరణాలను ప్రేమతో ఆశ్రయిస్తే ఆత్మ సాక్షాత్కారానుభూతిని పొందగలరు.108.బాబా యొక్క దయా గుణాన్ని తెలియపరచే అత్యంత ఆశ్చర్యకరమైన మధుర వృత్తాంతాన్ని సావధాన చిత్తులై ఆలకించండి.109.ఒకరోజు ఉదయం బాబా దంతధావనం, ముఖప్రక్షాళనం చేసుకొని విసరటానికి ఉపక్రమించారు. 110.మొదట ఒక చేట చేతపుచ్చుకొని, గోధుమలున్న గోనె సంచి వద్దకు వెళ్ళారు. డబ్బాతో గోధుమలను చేటలోనికి పోసుకున్నారు.111.ఒక ఖాళీ గోనె సంచిని నేలపై

పరచి దానిపై తిరగలిని ఉంచారు. విసిరేటప్పుడు దాని పిడి వదులై ఊడిపోకుండా గట్టిగా బిగించారు. 112. తరువాత చేతిపైని చొక్కాను పైకి లాక్కొని తిరగలి ముందు కాలు చాపుకొని కూర్చున్నారు. 113. నాకు అత్యంత ఆశ్చర్యం కలిగింది. ఇలా విసరటంలో వీరిఉద్దేశం? ఎప్పుడూ, ఏమీ సంగ్రహించని ఆశించని వారికి ఈ బాధ ఎందుకు అని? 114. తిరగలి పిడిని చేతపట్టుకుని మెడను క్రిందకు వంచి కూర్చొని తమ చేతులతో స్వయంగా తిరగలిని త్రిప్పుతూ గోధుమలను విసర సాగారు. 115. సాధువులను అనేకులను చూచాను. కానీ ఇలా తిరగలితో పిండి విసిరే వారు వీరొక్కరే. గోధుమలను విసరటంలోని సుఖమేమిటో ఆ కౌశలం వారికే తెలియాలి. 116. ఆశ్చర్య చకితులై జనం ఆ వింతను చూస్తున్నారే కాని ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. ఊరిలో వారికి ఈ విషయం తెలిసిన వెంటనే స్త్రీలు పురుషులు అంతా వచ్చారు. 117. పరుగు పరుగున వచ్చిన స్త్రీలు అలసిపోయారు. నలుగురు స్త్రీలు బాబా యొక్క చేతిని వదిలించి తిరగలి పిడిని లాక్కొన్నారు. 118. బాబా వారితో దెబ్బలాడారు. అయినా వారు బాబా లీలలను వర్ణించే గీతాలను గానం చేస్తూ విసర సాగారు. 119. ఆ స్త్రీల యొక్క ప్రేమను గని అరువు తెచ్చుకొన్న కపట కోపం చల్లబడి బాబా ప్రేమగా వారిని చూచి నవ్వసాగారు. 120. స్త్రీలు 4 సేర్ల గోధుమలను విసిరారు. చేటలు ఖాళీ అయ్యాయి. ఆ స్త్రీల మనసులో ఆలోచనాతరంగాలు నిరాటంకంగా నాట్యం చేయసాగాయి. 121. బిక్షావృత్తితో జీవించే బాబా స్వయంగా రొట్టెలు చేసుకోరు; ఈ పిండిని ఏం చేస్తారు? 122. వారికి ఇల్లు ,వాకిలి, సంసారం, భార్యా, పిల్లలూ లేరు. వారు ఒక్కరే ఒక్కరు. వారికి ఇంత పిండి ఎందుకు అని స్త్రీలు తమ మనసులో తలపోయ సాగారు. 123. బాబా పరమ కృపాళువు. వారి లీల మనలను సంతోష పెట్టడానికి ఇప్పుడు ఈ పిండిని అంతా మనకు ఇస్తారు అని ఒక స్త్రీ అన్నది. 124. నాలుగు

భాగాలుగా చేసి ఒక్కొక్కరికి ఒక్కో భాగం చేసి మనకే ఇచ్చేస్తారని వారంతా మనసులో అనుకున్నారు.125. కాని బాబా లీలలు బాబాకే తెలుసు. అవి ఎవ్వరికి అంతు పట్టవు. బాబాను దోచుకోవాలని స్త్రీలకు లోభ బుద్ధి పుట్టింది. 126.గోధుమలు అయిపోయి పిండి తయారైంది. స్త్రీలు తిరగలిని గోడకు ఆనించి పెట్టారు. చేటలలో పిండిని నింపుకుని ఇళ్ళకు పట్టుకొని వెళ్ళటానికి సిద్ధమయ్యారు.127.అంతవఱకు బాబా ఏం మాట్లాడలేదు. కానీ ఆ నలుగురు స్త్రీలు పిండిని పంచుకున్నాక వారు.128.'మీ బాబు సొమ్ములాగా పిండిని ఎక్కడికి తీసుకొని వెళ్లుతున్నారు? దీనిని పట్టుకుని పోయి గ్రామ సరిహద్దులలో చల్లి వేయండి.129.తేరగా దొరికింది కదా, తిందామని పరుగు పరుగున వచ్చారు. ఇలా నన్ను దోచుకోవాలనుకుంటున్నారు. నేనేం మీకు గోధుమలు బాకీ పడి ఉన్నానా? పిండిని పట్టుకు వెళ్ళాలను కుంటున్నారు' అని అన్నారు.130.తమ లోభ ప్రవర్తనకు స్త్రీలు తమలో లజ్జితులయ్యారు. వెంటనే గ్రామ సరిహద్దుకు వెళ్ళిపోయారు.131.బాబా యొక్క చర్యకు కారణం మొదట ఎవరికీ అర్థం కాలేదు.కాని, సహనంతో ఉంటే బాబా లీల యొక్క పరిణామం అర్థమౌతుంది.132.బాబా ఎందుకిలా చేసారని నేను జనులను ప్రశ్నించగా వారు బాబా అలా చేసి మహమ్మారి కలరా రోగాన్ని పూర్తిగా తొలగించారు. 133.అవి గోధుమలు కావు.మహమ్మారి కలరాను బాబా పిండిగా విసిరి, దానిని గ్రామసరిహద్దులో చల్లించారు. 134.ఆ విధంగా పిండిని కాలువ గట్టున చల్లినప్పటి నుండి కలరా వ్యాధి వెను తిరిగి చెడు రోజులు వెంటనే పోయాయి. ఇది బాబా యొక్క కౌశలం.135.ఊరిలో కలరా వ్యాధి ప్రబలి ఉండటం వలన సాయిబాబా ఈ ఉపాయం చేశారు.దానితో కలరా వ్యాధి పోయి ఊరిలో ప్రశాంతత నెలకొంది.136.పిండి విసిరిన దృశ్యాన్ని చూచి నాకు కుతూహలం కలిగింది. ఈ చర్యకు దాని పరిణామానికి గల కార్యకారణ సంబంధం ఏమిటి? దానిని

ఎలా సమన్వయ పరచాలి. 137. గోధుమలకు కలరాకు ఏమి సంబంధం? అంతు పట్టని ఆ చర్యను కని ప్రబంధాన్ని వ్రాయాలనే సంకల్పం కలిగింది. 138. క్షీరసాగరం పైన లేచే తరంగాల వలె నా అంతఃకరణంలో ప్రేమ తరంగాలు ఉప్పొంగాయి. బాబా యొక్క మధుర గాధను మనసారా గానం చేయాలని కోరిక కలిగింది. 139. మంగళాచరణం ముగిసింది. ఆప్తులకు, మిత్రులకు, సాధుసత్పురుషులకు, సద్గురువులకు వందన సమర్పణ జరిగింది. 140. హేమాడ్, సాయికి శరణుజొచ్చి తరువాతి అధ్యాయంలో గ్రంథ రచనకు ప్రయోజనం, గ్రంథ కర్త యొక్క యోగ్యత, మరియు అనుబంధం గురించి తన బుద్ధికి స్ఫురించిన విధంగా తెలియ చేస్తాడు. శ్రోతలు నిశ్చల మనస్సుతో ఆలకించండి. 141. శ్రోతలకు, వక్తకు శ్రేయస్సును కలిగించే ఈ సాయి సచ్చరిత రచయిత హేమాడు పంత్ ఎవరు అన్న విషయం తరువాత విదితమౌతుంది. 142. స్వస్తి శ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో మంగళాచరణమను ప్రథమోధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయిసచ్చరిత - 2వ అధ్యాయం

శ్రీ గణేశాయనమః; శ్రీ సరస్వత్యైనమః; శ్రీ గురుభ్యోనమః; శ్రీకులదేవతాయైనమః
శ్రీ సీతారామ చంద్రాభ్యాం నమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయంలో మంగళాచరణం, దేవతలకు కులదేవతలకు గురువులకు వందన సమర్పణ మరియు శ్రీ సాయి సచ్చరితకు అంకురార్పణ జరిగి ంది. ఇప్పుడు ఈ గ్రంథ ప్రయోజనాన్ని చెప్ప నారంభిస్తాను.1. గ్రంథ కర్త యొక్క అర్హత మరియు గ్రంథం యొక్క విషయానికి గల అనుబంధాన్ని క్లుప్తంగా తెలియజేస్తాను. దీని వలన శ్రోతలు సునాయాసంగా గ్రంథాన్ని అవగాహన చేసుకోగలరు.2. ప్రథమాధ్యాయంలో గోధుమలను విసరి మహామ్మారి యైన కలరాను ఉపశమింప చేయటం గ్రామస్థులకు పరమాశ్చర్యాన్ని కలిగించింది.3. ఇటువంటి సాయి యొక్క అగాధలీలను విని నాకు ఆనందం కలిగింది. ఆ లీలయే నాలో ప్రేమగా ఉప్పొంగి ఈ కావ్య రూపంలో ప్రకటిత మైంది.4. కనుక సాయికి నా ధన్యవాదాలు. వారి లీలలను నా బుద్ధికి తోచినట్లు యథామతి విశదంగా తెలియజేస్తే, అది భక్తులకు సుబోధప్రదమై వారి పాపాలను నశింప చేస్తుందని నాకనిపించింది.5. అందుకే ఇహపర సుఖాలను ప్రసాదించే అతి పవిత్రమైన ఈ సాయి చరిత్ర కథను వ్రాయ నారంభించాను.6. సన్మార్గదర్శకమైన సత్పురుషుల చరిత్ర, న్యాయశాస్త్రంగాని, తర్కశాస్త్రంగాని కాదు. అయినా సత్పురుషుల అనుగ్రహానికి పాత్రులైన వారికి అసంభవమైనది ఏదీలేదు.7. ఈ ఆనందాన్ని ఆస్వాదించడంలో శ్రోతలు కూడా భాగస్వాములు కావలెనని ప్రార్థన. అనవరతం సత్సంగాలలోనూ, సత్కథాశ్రవణంలోనూ నిమగ్నులైన వారు ధన్యభాగ్యులు.8. అహోరాత్రులు

నా సహవాసంలో ఉన్న చిరపరిచితుడైన ప్రాణమిత్రుని గూర్చి కించిత్తైనా రచించలేని నేను, సత్పురుషుని చరిత్రను ఎలా వ్రాయగలను?9. నా అంతరంగమే నాకు పూర్తిగా తెలియనప్పుడు సత్పురుషుని మనోతరంగాలను దోషరహితంగా ఎలా వర్ణించగలను?10.ఆత్మ స్వరూపాన్ని నిర్ధారణ చేయలేక నాలుగు వేదాలు మౌనం వహించగా, అటువంటి మీ రూపాన్ని నేను నిశ్చయంగా ఎలా తెలుసుకోగలను?11.ముందు స్వయం సాధువైన తరువాత సాధువులను తెలుసుకోవాలి. అటువంటప్పుడు నేను సాధువులను ఎలా వర్ణించగలను? నా అసమర్థత నాకు ముందుగానే తెలుసు.12.సప్తసాగరాల జలాన్ని కొలువవచ్చు. ఆకాశాన్ని కప్పివుచ్చవచ్చు. కాని సత్పురుషులు బుద్ధికి అంతు పట్టరు.13.నేనొక పామరుడనని నాకు తెలుసు. అయినా సాయిబాబా యొక్క అత్యంత మహాత్మ్యాన్ని చూచి వారి సుగుణాలను గానం చేయాలని అణచుకోలేనంత ఉత్సాహం కలిగింది.14.జయ జయ సాయి నాథా! దీనదళితుల విశ్రామధామమా! అగాధమైన మీ మాయను వర్ణించ సాధ్యం కాదు. కనుక ఈ దాసుని కరుణించండి.15.ఈ ఇతిహాసాన్ని రచించాలన్న నా ఈ సాహసం చిన్న నోటికి పెద్ద ముద్దవలె ఉంది.బాబా! నన్ను అపహాస్యాలపాలు కానివ్వకండి.16.సత్పురుషుల చరిత్రలను రచించేవారిపై భగవంతునికి ప్రీతి అని జ్ఞానేశ్వర మహారాజు అన్నారు. నేనెందుకు భయపడాలి?17. నేను స్వయంగా జడుణ్ణి. మూఢమతిని. అయినా నా మనసుకు స్ఫూర్తినిచ్చి నన్ను మేలుకొలిపి ప్రేరేపించినది భగవంతుడే కనుక తమ కార్యాన్ని పూర్తి కావించుకోవటం వారికే తెలుసు.18. భక్తులు సంకల్పించిన సేవాకార్యాలను సత్పురుషులు స్వయంగా భక్తులకు స్ఫూర్తినిచ్చి తామే పూర్తి చేయించుకుంటారు. భక్తులు కేవలం నిమిత్త మాత్రులే.19.సారాంశం, సాయి తమ చరిత్రను తామే స్వయంగా ఈ మూర్ఖుని ద్వారా రచియింప చేస్తారు. అందువలననే భక్తిగౌరవాలను కలిగించే ఈ చరిత్రకు ఇంతటి ఘనత.20.సత్పురుషులుగాని, శ్రీ నారాయణుడుగాని

ఎవరి చేతినైనా పట్టుకొని వారి శిరసుపై తను వరదహస్తాన్ని ఉంచి తను చరిత్రలను తానే వ్రాయించుకుంటారు.21.శ.క. సం॥ 1700లో సాధుపుంగవులు మహీపతికి ప్రేరణ కలిగించి అతని ద్వారా తమ చరిత్రలను వ్రాయించి అతని సేవను స్వీకరించారు.22.శ.క. సం॥ 1800లో అట్టి సేవనే దాసగణుని ద్వారా సాధువుల చరిత్రలను వ్రాయించి అందరినీ పావనం చేశారు.23.మహీపతి రచించిన భక్త విజయం, సంతవిజయం, భక్త లీలామృతం, సంతలీలామృతం ఈ నాలుగు గ్రంథాల వలెనే దాసగణు రెండు గ్రంథాలను రచించారు.24. ఒకటి భక్తలీలామృతం, రెండవది సంతకథామృతం.ఈ రెండు గ్రంథాలలో అర్వాచీన భక్తుల మరియు సత్పురుషుల లీలలు వర్ణింపబడి ఉన్నాయి.25.భక్తలీలామృతం అను గ్రంథంలో శ్రీ సాయిబాబా యొక్క మధుర చరిత్ర మూడు అధ్యాయాలలో రచింపబడి ఉంది. దీనిని శ్రోతలు పఠించండి .26.అట్లే సంత కథామృతం అన్న గ్రంథంలో 57వ అధ్యాయంలో సాయిబాబా ఒక భక్తునికి తెలిపిన మధురమైన జ్ఞానబోధ కథను చదవండి.27.ఇవికాక భజనమాల అను పుస్తకంలో రఘునాథ మరియు సావిత్రి అనుభవ పూర్వకమైన సాయి యొక్క అలౌకిక లీలలను అభంగ పదాలలో ప్రజలకోసం గానం చేశారు.28.వీనిలో ఒక బాబా బిడ్డడు దాహంతో ఉన్న చకోరాల కోసం ప్రేమతో కురిపించిన ప్రేమపూరితమైన కథామృతాన్ని శ్రోతలు శ్రద్ధగా వినండి.29.అత్యంత రసభరితమైన దాసగణుని స్ఫుట కవిత్వం మరియు సాయిలీలలు కూడా శ్రోతల మనసులకు ఆనందాన్ని కలిగిస్తాయి.30.అట్లే గుజరాతీ ప్రజల కొఅకు అమీదాను భవానీ మెహతా అను భక్తుడు బాబా యొక్క ఎన్నో చమత్కార కథలను అత్యంత ప్రేమతో వ్రాశాడు.31.ఇవికాక కొందఱు భక్త శిరోమణులు 'సాయి ప్రభ' అను పేరుతో పూనా నుండి బాబాయొక్క కథా పరంపరలను ప్రచురించి ప్రసిద్ధికి తెచ్చారు.32.ఇటువంటివి ఎన్నెన్నో కథలుండగా ఈ గ్రంథం యొక్క ఆవశ్యకత

ఏముందని శ్రోతలకు సంశయం కలుగుతుంది. మీ సందేహాన్ని తీర్చుతాను వినండి.33.సాయి చరిత్ర మహా సాగరం వలె అనంతం, అపారం. అనేక రత్నాలకు గని. దీనిని పిచ్చుక వంటి నేను ఖాళీ చేయటం ఎలా సంభవం?34.అత్యంత గహనమైన సాయి చరిత్రను సంపూర్ణంగా వర్ణించటం అశక్యం. నాశక్తి కొలది చెప్తాను దాంతో తృప్తి పడండి.35.అపారమైన సాయి యొక్క అపూర్వ కథలు ప్రాపంచిక దుఃఖాలతో బాధ పడేవారికి శాంతిని ప్రసాదిస్తాయి. శ్రోతలకు శ్రవణంలో ఉత్సాహాన్ని మరియు భక్తులకు చిత్తస్థైర్యాన్ని కలిగిస్తాయి.36.బాబా, వ్యావహారికమైన అనేక రకాల ఉపదేశాలతో కథలను చెప్పారు. అట్లే భక్తుల అనుభవాలను వారి వారి కర్మలలోని మర్మాలను తెలియజేశారు.37. అపౌరుషేయమని ప్రసిద్ధి చెందిన శ్రుతులలోని అసంఖ్యాకమైన కథల వలె మధుర రస భరితమైన అనేక కథలను బాబా చెప్పేవారు.38. వానిని శ్రద్ధగా వింటే ఆకలి దప్పులను మరచి పోయి ఇతర సుఖాలు తృణసమానమని అనిపిస్తాయి. అంతరంగంలో శాంతి ఏర్పడుతుంది.39.అష్టాంగ యోగ ప్రావీణ్యాన్ని, సమాధి సుఖంలోని ఆనందాన్ని, బ్రహ్మ సాయుజ్యాన్ని కోరుకునే వారు ఈ సాయి కథలను వింటే వారి కోరిక తీరుతుంది.40.ఈ కథలను శ్రవణం చేసే వారి కర్మ పాశాన్ని త్రుంచి వేసి, బుద్ధిని ప్రకాశవంతం చేసి, వారికి నిర్విశేష సుఖాన్ని కలిగిస్తాయి.41.అందువల్ల ఇటువంటి అనేక రకాల కథలను సేకరించి మాలగా గ్రుచ్చాలని ,ఇదే మంచి ఉపాసన అని నాకు అనిపించింది.42.ఈ కథలలోని నాలుగు అక్షరాలు చెవులలో పడిన వెంటనే జీవుల చెడురోజులు తొలగిపోతాయి. ఇక భక్తి భావంతో శ్రద్ధగా సంపూర్ణ కథను విన్న భక్తులు భవసాగర తీరాన్ని చేరుకోగలరు.43.బాబా నన్ను తన లేఖినిగా చేసుకొని నా చేతిని పట్టుకొని త్రిప్పుతూ అక్షరాలను వారే వ్రాయిస్తున్నారు.నేను కేవలం నిమిత్తమాత్రుణ్ణి.44.అనేక సంవత్సరాలు బాబా లీలలను చూచి, భావికులైన బాబా

భక్తుల కొఱకు వారి ప్రవచనాలను సేకరించాలని నాకు సంకల్పం కలిగింది.45.బాబా యొక్క ప్రత్యక్షదర్శనంతో తమ నయనాలను పావనం చేసుకోలేనివారు వారి మహిమలను శ్రవణం చేసిన పుణ్యంతో పునీతులు కాగలరు.46.వీనిని పఠించాలన్న కోరిక కలిగిన భాగ్యవంతులకు పరమానందం పరమ శాంతి కలుగుతాయి.47.ఈ భావం నా మనసులో కలగగానే ఈ మాటను మాధవరావు చెవిన వేశాను.కాని ఈ రచన నాకు సాధ్యమేనా అని మనసులో సంశయం.48.నావయసు అరవై సంవత్సరాలు దాటాయి.బుద్ధి వ్యర్థమైనవాటి వైపు మళ్ళుతుంది.శరీరంలోని శక్తి సన్నగిల్లింది.నోటి ప్రేలాపనే మిగిలింది.49.ఇతర విషయాలలో నిరర్థకంగా వ్యర్థమయ్యేశక్తిని సాయిబాబా ప్రీత్యర్థం పరమార్థం సాధించుకోవటానికి వినియోగించాలని నా ఈ ప్రయత్నం.50. అహర్నిశలూ భక్తులు అనుభవించిన వృత్తాంతాలను రచించాలని కోరిక కలిగింది.వానిని మననం చేసుకోవటం వలన మనసుకు విశ్రాంతి,ఆత్మకు శాంతి లభిస్తాయి.51.స్వానుభవాల పైన ఆధారపడి ఆత్మతృప్తిని కలిగించే వచనాలను బాబా అనేక సార్లు ఎంతో సహజంగా చెప్పారు. వానిని శ్రోతలకు సాదరంగా తెలియ చేస్తాను.52.బాబా ఎన్నెన్నో జ్ఞానకథలను చెప్పి అనేకులను భక్తిమార్గంలో ప్రవేశ పెట్టారు.వానిని సేకరిస్తే బాబా యొక్క చరిత్ర అవుతుంది.53.ఆ కథలను చెప్పేవారికి, శ్రద్ధతో శ్రవణం చేసేవారికి ఉభయుల మనసులకు విశ్రాంతి సంపూర్ణ శాంతి లభిస్తాయి.54. శ్రీవారి నోటినుండి వెలువడిన కథలను వింటే భక్తులు శరీర వ్యథలను మరచిపోతారు.అంతే కాదు, వారిని ధ్యానం మననం చేస్తే భవబంధాలనుండి విముక్తి సహజంగా లభిస్తుంది.55.శ్రీ సాయి ముఖంనుండి జాలువారిన వచనాలు అమృతసమానం,రసభరితం.వానిని వింటే పరమానందం కలుగుతుంది.వాని మాధుర్యాన్ని నేనెలా వర్ణించగలను?56.ఈ కథలను నిరహంకార భావంతో వర్ణిస్తూ గానం చేసినా,వారి చరణధూళిలోపొర్లినా, ముక్తి హస్తగతమౌతుందని నాకనిపిస్తుంది.57.బాబా యొక్క

కథలు చెప్పటంలోని అలౌకికమైన నేర్పు, పదాలకూర్పును గని శ్రోతలు తల్లీనులై సంపూర్ణ సుఖాన్ని పొందుతారు.58.బాబా మాటలు వినటానికి చెవులు,వారి దర్శనానికి నయనాలు ఉత్సుకతతో ఉంటాయి.అట్లు మనసు ఉన్మని స్థితిని పొంది సహజంగా ధ్యానమగ్నమై పోతుంది.59.నా జనని, గురుమాత ప్రజలకు తెలియ చేసిన కథలను, ఇతరులు ఆనోట ఆనోట చెప్పిన కథలను విన్న వానిని శ్రద్ధగా చెవులలో నింపుకుందాం.60.వానిని మరల మరల తలపోసుకుంటూ ధ్యానించుకుంటూ ప్రేమబంధనంతో పదిల పరచుకొని పరస్పరం పంచుకుందాం.61.ఈ రచన సాయినాథుని ప్రేరణే. ఇందులో నాదేం లేదు. వారు ఏది చెప్పిస్తే నేనది చెప్పుతాను.62.నేను చెప్తాననటం అహంకారం. సాయియే స్వయం సూత్రధారి. నా వాక్కును నడిపించేది వారే అయినపుడు చెప్పేవాణ్ణి నేనెవరిని?63.అహంకారాన్ని వారి చరణాల యందు సమర్పించితే అపారమైన సుఖం కలుగుతుంది. అహంభావం తొలగిపోతే సకలప్రపంచం సుఖమయమౌతుంది.64.ఈ రచనా సంకల్పం నాకు కలిగినా, అనుమతినిమ్మని బాబాను అడిగే ధైర్యం నాకు లేదు. అందువల్ల ఈ విషయాన్ని మసీదు మెట్ల వద్దకు వచ్చిన మాధవరావు చెవిన వేశాను.65.అతడు బాబా వద్ద వేరెవరూ లేని సమయం చూచుకొని బాబాను అడిగాడు.66.'బాబా మీ అనుమతి ఉంటే మీ చరిత్ర యథాశక్తి వ్రాయాలన్న కోరిక ఉందని ఈ అణ్ణాసాహేబు అంటున్నాడు.67.నేను కేవలం ఒక ఫకీరును. భిక్ష కోసం ఇంటింటికి తిరుగుతూ రొట్టెలను కూర ఉన్నా లేకున్నా తిని కాలం గడుపుతాను.68.ఇలాంటి నాకథను వ్రాయటం ఎందుకు? అది అపహాస్యం పాలవుతుందని అనవద్దు.ఈ జాతిరత్నాన్ని బంగారంలో పొదగాలి.69.మీ అనుజ్ఞ మీ సహాయం ఉంటే ఇతడు వ్రాస్తాడు లేదా అన్ని విఘ్నాలను దూరం చేసి మీరే వ్రాయిస్తారు.70.సత్పురుషుల ఆశీర్వచనాలతోనే గ్రంథరచన ప్రారంభమౌతుంది. మీ

కరుణాకటాక్షం లేకపోతే రచన నిర్విఘ్నంగా సాగదు' అని అన్నాడు.71.నా మనోభీష్టాన్ని తెలుసుకున్న సాయి సమర్థులు కరుణతో నీ సంకల్పం సిద్ధిస్తుంది' అని చెప్పారు.నేను వెంటనే వారి చరణాలపై శిరసునుంచాను72. సకలధర్మ విశారదుడు, భవబంధాలను త్రెంచివేసే సాయి తమ వరద హస్తాన్ని నా శిరసున ఉంచి నాకు విభూతి ప్రసాదాన్ని ఇచ్చారు.73.మాధవరావు ప్రార్థనను ఆలకించిన సాయికి నాపై దయ కలిగింది. అధైర్యంగా ఉన్న నాకు ధైర్యాన్నిచ్చి నా మనసుకు ఊరట కలిగించారు.74.అలా నా మనసులోని భావాన్ని గ్రహించి నాకు అనుమతిని ప్రసాదిస్తూ వాస్తవమైన కథలు, సంఘటనలు,అనుభవాలు మొదలగు వానిని సేకరించి ఉంచాలి.75.కథలను సంగ్రహించటం మంచిది. అతనికి నా సంపూర్ణ సహాయం ఉంటుంది.అతడు కేవలం నిమిత్తమాత్రుడు. నా కథను నేనే వ్రాసుకుంటాను.76.నా కథను నేనే చెప్పి భక్తుల కోరికలను తీరుస్తాను.అతడు తన అహంభావాన్ని త్యజించి దానిని నా చరణాలకు సమర్పించాలి.77.ఈ విధంగా వ్యవహరిస్తూ ప్రవర్తించే వారికి నేను సంపూర్ణ సహాయం చేస్తాను. ఈ కథా రచనలోనేనా ఏమిటి? వారి ఇంట అన్ని విధాలా శ్రమిస్తాను.78.అహంభావం కించిత్తైన లేకుండా తొలిగిపోయినప్పుడు అతనిలో నేనే సంచరిస్తూ నా చేత్తో నేను వ్రాస్తాను.79.ఇలాంటి బుద్ధితో శ్రవణం మననం రచనవంటి కర్మలను ప్రారంభిస్తే ఎవరి పనులను వారే సాధించుకుంటారు.రచయిత నిమిత్త మాత్రుడు.80.ఈ విషయాలను తప్పక సేకరించాలి.ఇంటా బయటా ఎక్కడున్నా నన్ను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటే శాంతి లభిస్తుంది.81.నా కథలను శ్రవణం చేస్తే,గానం చేస్తే,మననం చేస్తే నా యందు భక్తి జనిస్తుంది.అజ్ఞానం వెంటనే నశిస్తుంది.82.శ్రద్ధాభక్తులున్న వారికి నేను ఎల్లప్పుడూ అంకితుణ్ణి.
ఇతరత్ర నేను లభించను. ఇందులో ఏమాత్రం సందేహంలేదు.83.భక్తి భావంతో ఈ కథలను ఆలకిస్తే శ్రోతల

మనసులలో శ్రద్ధ నిష్ఠ జాగ్రతమై సహజంగా స్వానుభవం కలిగి,స్వానంద సుఖావస్థ కలుగుతుంది.84.అంటే ఆత్మ స్వరూప జ్ఞానం కలుగుతుంది. జీవునికి మరియు శివునికి కళ్లకు కనిపించని నిర్గుణ చైతన్యం కనిపిస్తుంది.85.ఇది నాకథలలోని విశిష్టత. ఇంతకంటే ఇంకా ఏం కావాలి? శ్రుతుల యొక్క ధ్యేయం కూడా ఇదే.ఈ ధ్యేయం భక్తులకు సంపూర్ణంగా సిద్ధిస్తుంది.86.వాదవివాదాలలో తత్పరులైన వారి వద్ద మాయ అంటే అజ్ఞానం సమృద్ధిగా ఉంటుంది. అంతే కాక దుర్బుద్ధి కుతర్కం కూడా ఎప్పుడూ ఉంటాయి. కాని తమ మంచిని సాధించుకునే నిర్మలస్వభావం ఉండదు.87.వారు ఆత్మ జ్ఞానానికి పాత్రులు కారు.వారిని అజ్ఞానం పెనవేసుకొని ఉంటుంది. వారికి ఇహం లేదు, పరం లేదు.సర్వదా దుఃఖమే.88.స్వపక్ష స్థాపన వద్దు, పర పక్ష నిరాకరణ వద్దు, ఉభయపక్షాల వివరణ కూడా వద్దు. నిష్కారణమైన ఈ శ్రమ ఎందుకు?89.ఉభయపక్షాల వివరణ వద్దు అన్న మాట వినగానే పూర్వం శ్రోతలకు ఇచ్చిన మాట గుర్తుకు వచ్చింది.90. ప్రథమాధ్యాయం ముగించే ముందుగా హేమాడ్ నామకరణ కథను తెలియచేస్తానని శ్రోతలకు చెప్పాను.91.కథ మధ్యలో ఈ ఉపకథను వింటే దీని యుక్తాయుక్తత తెలుస్తుంది. శ్రోతలకు జిజ్ఞాస తీరుతుంది. ఇది కూడా సాయి యొక్క ప్రేరణే .92.దీని తరువాత సాయి చరిత్ర కథ చెప్పబడుతుంది.కనుక శ్రోతలు శ్రద్ధగాఈ కథను శ్రవణం చేయండి.93.ఈ సాయి లీలల గ్రంథంలోని ప్రతి అధ్యాయాంతంలో భక్త హేమాడ్ పంతు విరచితమని ఉంది కదా మరి ఈ హేమాడ్ పంత్ ఎవరు.94.అని శ్రోతల మనసులలో ఒక ప్రశ్న జనించడం సహజం.ఆ జిజ్ఞాస తీరటానికి ఈ నామకరణం ఎలా ఆరంభమైంది అన్న విషయాన్నిశ్రద్ధగా శ్రవణం చేయండి.95. జన్మించినది మొదలు మరణించే వరకు శరీరానికి సంబంధించిన షోడశ సంస్కారాలలో నామకరణ విధి ఒకటి.96. దీనికి సంబంధించిన చిన్న కథే హేమాడ్ పంత్ నామకరణ కథ. సందర్భానుసారంగా ఉన్న ఈ

కథను శ్రోతలు శ్రద్ధగా వినండి.97.ఈ రచయిత అసలే ఆకతాయి. అల్లే వాచాలుడు కూడా.ఇతరులను నిందించే బుద్ధి కలిగి జ్ఞానగంధం లేనివాడు.98. సద్గురు మహిమ తెలియదు. దుష్టబుద్ధి మరియు కుతర్కాల ప్రతిమామూర్తి. ఎప్పుడూ తన తెలివియొక్క గొప్పదనాన్ని చాటుకుంటూ ఉండే వాదవివాదాలలో తత్పరుడు.99. అయినా కేవలం అదృష్టవశాత్తు ప్రబలమైన ప్రారబ్ధ కర్మ కారణంగా సాయి యొక్క చరణ కమలాల దర్శనం అయింది.100. భక్త శ్రేష్ఠులైన కాకాసాహేబు దీక్షితు, నానా సాహేబు చందోర్కర్లతో ఋణానుబంధం లేకపోతే నేను శిరిడీ వెళ్ళగలిగి ఉండే వాణ్ణా?101. కాకా సాహేబు బలవంతంపై నా శిరిడీ ప్రయాణం నిశ్చయమైంది. కాని వెళ్ళవలసిన రోజున అకస్మాత్తుగా నామనసు మారిపోయింది.102.నా యొక్క ఒక పరమ మిత్రుడు గురువు యొక్క అనుగ్రహాన్ని పొందిన గురుపుత్రుడు, భార్యతో లోనావలాలో ఉండగా ఒక విచిత్ర సంఘటన జరిగింది.103.అతని ఏకైక పుత్రుడు బలమైన శరీరంతో ఉన్న గుణవంతుడు పరిశుద్ధ వాతావరణంలో ఉండి కూడా జ్వర పీడితుడయ్యాడు.104.సకలోపాయాలు, దృష్టిదోషాలు, దేవతల మొక్కుబడులు మొదలైన మానవుల ప్రయత్నాలన్నీ అయ్యాయి. గురువును తీసుకుని వచ్చి ఆ బాలుని సమీపంలో కూర్చుండబెట్టారు. అయినా చివరకు ఆ బాలుడు చనిపోయాడు.105.ఇలాంటి దుర్ఘటన నుండి మరియు దుర్భర సంకటం నుండి తప్పించుకోవటానికి గురువును బాలుని వద్ద ఉంచినా అంతా వ్యర్థమైంది.106. ఈ ప్రపంచం మహా విచిత్రమైనది. ఎవరి పుత్రుడు? ఎవరి భార్య? అందరూ కర్మ తంత్రానికి బద్ధులు. విధిని ఎవరూ తప్పించుకోలేరు.107.ఈ బాలుని మరణవార్త చెవిన పడగానే నా మనసుకు అత్యంత దుఃఖం కలిగింది. ఏకైక పుత్రుని రక్షించలేని గురువు యొక్క ప్రయోజనం ఇదేనా?108.ప్రారబ్ధకర్మ యొక్క ప్రాబల్యాన్ని చూచి సాయి దర్శనానికి వెళ్లాలన్న నా నిశ్చయం

మారిపోయింది.109.అసలు శిరిడీ ఎందుకు వెళ్ళాలి? నా స్నేహితుని పరిస్థితి ఏమయింది. గురుసాంగత్యం వల్ల ఏం లాభం? మన కర్మకు గురువు ఏం చేయగలడు?110.నొసట వ్రాసినట్లే జరుగనున్నప్పుడు గురువు లేకపోతే మాత్రం ఆగిపోయేది ఏముంది? అన్న ఆలోచనలతో నా శిరిడీ ప్రయాణం ఆగిపోయింది.111.మన స్థానాన్ని వదిలి గురువు వెంట పరిగెత్తడం ఎందుకు? సుఖంగా ఉన్న ప్రాణాన్ని కష్టపెట్టటం ఎందుకు? ఏం అర్థం కాలేదు.112.యాదృచ్ఛికంగా ప్రాప్తించిన సుఖదుఃఖాలను అనుభవించాల్సిందే. జరుగనున్న దాన్ని ఎవరూ తప్పించ లేనప్పుడు గురువు వద్దకు వెళ్లితే ఏమవుతుంది?113.అని శిరిడీ వెళ్ళటం మానుకున్నాను. కాని కర్మార్జితం వద్దనుకున్నా వెంట పడుతుంది. అదృష్టాన్ని ఎవరూ ఆపలేరు. అదే నన్ను శిరిడీకి లాక్కొని వెళ్ళింది.114.నానాసాహేబు చందోర్కరు ఠాణా ప్రాంతాధికారి. పని మీద వసైకి వెళ్లుతూ ఠాణా నుండి దాదరు వచ్చి కొంతసేపు ఆగారు115.వసైకి వెళ్లే రైలుకు ఒక గంట వ్యవధి ఉంది. ఆ సమయాన్ని సదుపయోగం చేయాలని అతనికి ప్రేరణ కలిగింది.116.వెంటనే కేవలం బాంద్రా వరకు వెళ్లే రైలు బండిలో కూర్చున్నారు.117.బండి బాంద్రాకు చేరగానే నాకు కబురు పెట్టారు. నేను వారిని కలుసుకున్న తక్షణమే శిరిడీ కథ మొదలయింది. 118. సాయి దర్శనానికి ఎప్పుడు బయలుదేరుతారు? ఎందుకు బద్దకిస్తున్నారు? ఎందుకు ఇంకా కాలయాపన చేస్తున్నారు? మనసులో ఇంకా నిశ్చయం చేసుకోలేదేం అని ప్రశ్నించారు.119.అతని ఆతురతను గమనించి నేను మనసులో లజ్జితుణ్ణయ్యాను. అయినా అతనితో వినయంగా నా మనోచాంచల్యాన్ని స్పష్టంగా సంపూర్ణంగా మనవి చేశాను.120. నానా యొక్క తపన, ప్రేమ పూర్వకమైన బోధ విన్న నాకు శిరిడీ వెళ్లాలన్న కోరిక అత్యంత ఆనందదాయకం అయింది.121.వెంటనే బయలుదేరుతానని నా వద్ద మాట తీసుకుని నానా పయనమయ్యాడు.నేను తిరిగి వచ్చి నా శిరిడీ ప్రయాణానికి ముహూర్తం

నిశ్చయించుకున్నాను.122.తరువాత సామానులన్నీ సర్దుకొని అదే రోజు సాయంత్రం శిరిడీ బయలుదేరాను.123.సాయంకాలపు మెయిలు బండి దాదరులో ఆగుతుందని అనుకొని దాదరు వరకు డబ్బు కట్టి టికట్టు తీసుకున్నాను.124.కాని నేను బండిలో కూర్చుని ఉండగా బాంద్రా స్టేషనులో బండి బయలు దేరుతుండగా ఒక మహమ్మదీయుడు గబగబా లోపలికి వచ్చాడు.125.మొదటి ముద్దలోనే ఈగపడ్డట్లు, ప్రథమగ్రాసేమక్షికాపాతమన్నట్లు, నేను దాదరు వరకు టికట్టు తీసుకోవటమే మొదట కార్యంలో విఘాతమైంది.126. నా సామాను చూచి మహమ్మదీయుడు ఎక్కడి వరకు ప్రయాణమని ప్రశ్నించాడు. దాదరు వెళ్లి మన్‌మాడు మెయిలును అందుకోవాలని నేను జవాబు ఇచ్చాను.127.దాదరులో దిగకండి.మెయిలు అక్కడ ఆగదు.బోరి బందరు వెళ్ళండని అతడు సలహా ఇచ్చాడు.128.ఆ సమయానికి సరిగ్గా అతడు అలా సూచించక పోతే దాదరులో మెయిలు దొరకక నా చంచల మనసులో ఏ ఆలోచనలు చెలరేగేవో,129.కాని ఆ రోజు నాకు ప్రయాణ యోగం ఉండటం వలన తలవని తలంపుగా ఈ సంఘటన జరిగింది.130.మరునాడు ఉదయం 9–10గం॥ల మధ్య నేను శిరిడీ చేరాను.అక్కడ బాపుసాహేబు దీక్షితు ఎదురు చూస్తున్నారు.131.క్రీ.శ.1910 వ సం॥ జరిగిన విషయమిది. అప్పుడు యాత్రికులు బస చేయడానికి సాతెవాడా మాత్రమే ఉండేది.132. టాంగా బండి దిగగానే సాయి దర్శనానికి ఉత్సుకత కలిగింది. ఎప్పుడెప్పుడు సాయి చరణాలపై శిరస్సు వంచి వందనం చేద్దునా అన్న ఆనంద తరంగాలు నా అంత రంగంలో పొంగాయి.133.ఇంతలో ప్రసిద్ధుడు సాయి యొక్క పరమభక్తుడు, తాత్యాసాహేబు నూల్కర్ మసీదునుండి వచ్చి త్వరగా దర్శనం చేసుకోండి అని అన్నాడు.134. 'బాబా భక్తమండలితో సహా వాడా చివర ఉన్నారు. త్వరగా వెళ్ళి ధూళి దర్శనం చేసుకోండి. తరువాత బాబా

లెండికి బయలుదేరుతారు.135.స్నానం అది ముగిసిన తరువాత బాబా లెండి తోటనుండి తిరిగి వచ్చాక మసిదుకు వెళ్ళి మరల వారిని తీరికగా దర్శనం చేసుకోవచ్చు' అని అన్నాడు.136.ఆ మాటవిని నేను త్వరత్వరగా బాబా ఉన్న స్థలానికి పరుగుతీసి ధూళితో వారి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాను. నాకు పట్టలేనంత ఆనందం కలిగింది.137.నానాసాహేబు చెప్పిన దానికంటె అధికంగా ప్రత్యక్షంగా సాయిబాబాను చూచి వారి దర్శనంతో నేను ధన్యుణ్ణయ్యాను. నా నయనాలు సజలమయ్యాయి.138.ఎన్నడూ కనివిని ఎరుగనట్టి మూర్తిని చూసి దృష్టి నిశ్చలమైంది. నా ఆకలి దప్పులు హరించిపోయాయి. ఇంద్రియాలు నిశ్చలమయ్యాయి.139.సాయి యొక్క చరణ స్పర్శ, వారితో సంభాషణ ఇవే ఈ జీవితానికి పరిపూర్ణత. అప్పటి నుండి నూతన జీవితం.140.ఎవరి కారణంగా ఇటువంటి సత్సంగ ప్రాప్తి, అంగప్రత్యంగ సుఖానుభూతి లభించాయో వారి ఉపకారానికి నేను నిరంతరం ఋణపడి ఉంటాను.141.ఎవరి ద్వారా పరమార్థం లభిస్తుందో వారే వాస్తవమైన ఆప్తులు, బంధువులు. వారికంటె దగ్గరి బంధువులు లేరని, మనసులో అనుకున్నాను.142.మహత్తరమైన వారి ఉపకారానికి ప్రత్యుపకారం చేయలేను. అందువల్ల కేవలం చేతులు జోడించి వారి పాదాలపైన నా శిరసును ఉంచుతున్నాను.143.సాయి దర్శన లాభంతో నా మనో సంశయం తొలగిపోయింది. అంతేకాదు సాయి యొక్క సమాగమంతో పరమానందం వెల్లివిరిసింది.144.సాయి యొక్క దర్శన మాత్రంతో చిత్త వృత్తి మారిపోతుంది. పూర్వ కర్మలు నశింపబడతాయి. క్రమక్రమంగా విషయసుఖాలపై విరక్తి కలుగుతుంది. ఇది వారి దర్శనంలోని విశిష్టత.145.వారి కృపావలోకనంతో నా పూర్వజన్మల పాప సంచితం నశించిపోయింది. వారి చరణాలు అక్షయమైన ఆనందాన్ని ప్రసాదిస్తాయని నాలో ఆశ జనించింది.146.నా భాగ్యం కారణంగా కాకి వంటి నేను సాయి చరణ మానస సరోవరంలో హంసనై

పోయాను. సాయి మహాత్ములు. సాధువులలో శ్రేష్ములు. పరమయోగి, పరమహంస.147.పాప తాప దైన్యాలను నశింప జేసే ఈ పుణ్యరాశి దర్శనంతో మరియు వారి సమాగమంతో నేను నేడు అత్యంత పునీతుణ్ణయ్యాను.148.నా అనేక పూర్వజన్మల పుణ్య సంగ్రహంవల్ల ఈ సాయి మహరాజు కలిశారు. ఈ సాయి ఒక్కరు మనసులోకి ప్రవేశిస్తే, సకల సృష్టి సాయిమయమనిపిస్తుంది.149.నేను శిరిడిలో ప్రవేశించిన మొదటిరోజే బాలాసాహేబు భాటేతో వాదవివాదాలు ప్రారంభమయ్యాయి. అసలు గురువు యొక్క అవసరమేమిటి?150.మన స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకొని పారతంత్రాన్ని తలపై వేసుకోవటం ఎందుకు? కార్య నిర్వహణలో కర్తవ్య దక్షత ఉన్నవారికి గురువు అవసరమా?151.ఎవరి సాధన వారే చేసుకోవాలి. ఏమీ చేయలేని వాణ్ణి గురువు ఏం ఉద్ధరించగలరు? కాళ్ళు చేతులు కదల్చని వారికి ఎవరైనా ఏమివ్వగలరు?152. ఇది నా సరళమైన ప్రతిపాదన. దీనికి విరుద్ధంగా ఉంది ప్రతిపక్షాల వారి అభిప్రాయం. దురాగ్రహమనే తక్కెడలో వాదవివాదాలు తూగుతున్నాయి.153.వాదవివాదాలు పుట్టటానికి భయంకరమైన శరీరాభిమానమే కారణం.ఇది అహంభావానికి గుర్తు.ఇది లేకపోతే జగాన వాదవివాదాలుండవు.154.ఎంతటి వేదపారంగతుడైనా పండితుడైనా సరే గురువు యొక్క అనుగ్రహం లేకపోతే అతడు కేవలం పుస్తక జ్ఞానంలో ముక్తుడు అని ప్రతిపక్షం వారి నిశ్చితమతం.155.విధి బలీయమైనదా లేక స్వయం కృషి గొప్పదా అన్న భయంకరమైన సంవాదన జరిగింది.కేవలం దైవంపై భారం వేస్తే ఏంకాగలదు అని నేనన్నాను.156.దీనికి ప్రతిపక్షం వారు జరిగేదానిని అడ్డుకోలేం. జరగబోయే దానిని ఆపలేం.నేను నేనన్న వారంతా అలసిపోయారు.157.విధిని ఎవరు ఢీ కొనగలరు. ఒకటి చేయబోతే వేరొకటి అవుతుంది. మీ చాతుర్యం ఇక్కడ పనికిరాదు అని అన్నారు. నా అభిమానం ఊరికే ఉండలేక పోయింది.158. ఏమిటి మీరంటున్నది?

చేసుకున్నవారికే ఫలితం, ఏంచేయకుండా సోమరిలా కూర్చుంటే దైవం సహించునా?159. 'ఉద్ధరేదాత్మనాత్మానం' తనను తాను ఉద్ధరించుకోవాలి అని స్మృతి వచనం గర్జిస్తుంటే, దాన్ని అనాదరం చేస్తే తరించడం అశక్యం.160.ఎవరి సాధన వారే చేసుకోవాలి కదా! మరి గురువు వెంట పడటమెందుకు? మనలో జాగృతి లేకుండా గురువు ఉండి ఏం ప్రయోజనం?161.మన సదసద్విచార బుద్ధి, చిత్తశుద్ధి కోసం చేసే మన సాధన, వీనిని వదిలి వేసే దుర్బుద్ధికి గురువు సిద్ధిని ఎలా ప్రసాదించగలడు అని నేనన్నాను.162.అంతమంటూ లేని ఈ వాదాల వలన ఏ ఫలితమూ లభించలేదు సరికదా మనశ్శాంతిని పోగొట్టుకున్నాను. అదే నేను గడించింది.163.ఇలా వాదవివాదాలతో కించిత్తైనా అలసి పోకుండా రెండుగంటలు గడిచాక వాదాలు ముగిశాయి.164.తరువాత భక్తమండలితో కలిసి మేము మసీదుకు వెళ్లాము. బాబా కాకాసాహేబును ఏం అడిగారో వినండి.165.'వాడాలో ఏం జరిగింది? దేనిగురించి వాదం? పోట్లాట ఎందుకు' అని ప్రశ్నించారు. నావైపు చూస్తూ ఈ హేమాడ్‌పంతు ఏమంటున్నాడు అని అడిగారు.166.వాడా నుండి మసీదుకు చాలా దూరం ఉంది. మరి వాడాలోని వృత్తాంతం బాబాకు ఎలా తెలిసిందబ్బా అని నేను మనసులో ఆశ్చర్యచకితుణ్ణయాను.167.ఇలా వాగ్బాణ హతుణ్ణయి నిశ్శబ్దంగా లజ్జతో క్రుంగిపోయాను. ప్రథమ సమాగమంలోనే నా ప్రవర్తన అనుచితమూ, అయోగ్యమూ అయింది.168.నాకు హేమాడ్ అనే నామకరణం ఉదయం జరిగిన వాదవివాదాల కారణంగానే;అందుకే బాబాకు హేమాడ్ గుర్తుకు రావడం అని నాకు బాగా అర్థమైంది.169.దేవగిరి యాదవ రాజులే దౌలతాబాదు జాదవులు. వారు మహారాష్ట్ర గౌరవాన్ని, రాజ్య వైభవాన్ని 13వ శతాబ్దంలో పెంపొందించారు.170.వీరిలో మహదేవ అను పేరుగల ప్రౌఢ ప్రతాపచక్రవర్తి ఉండేవాడు. అతని సోదరుని కొడుకు పరాక్రమంలో ప్రఖ్యాతి చెందాడు పుణ్యకీర్తిని పొందాడు.171.యదు వంశానికి చూడామణి

రాజులలో అగ్రగణ్యుడైన రామరాజు. ఈ ఉభయులకు బహు గుణవంతుడు సర్వలక్షణ శోభితుడైన హేమాద్రిపంతు మంత్రి.172.ఇతడు ధర్మశాస్త్ర గ్రంథకర్త.ఆచార వ్యవహారాలను బాగా ఎఱిగిన వాడు. బ్రాహ్మణులను ఉదారంగా సన్మానించేవాడు.173. వ్రతాలు, దానాలు, తీర్థాలు, మోక్షం గురించిన విషయాలను విస్తారంగా తెలియజేసే చతుర్వర్గ చింతామణి' అనే గ్రంథాన్ని రచించి చాలా ప్రసిద్ధి చెందినవాడు.174.సంస్కృత భాషలో హేమాద్రి పంతు, ప్రాకృత భాషలో హేమాడ్ పంతు. ఆకాలంలో అతడు రాజనీతి విశారదుడని ప్రసిద్ధి చెంది ఉన్నాడు.175.అతడు వత్సగోత్రానికి చెందినవాడు, నాది భరద్వాజ గోత్రం. అతడు పంచప్రవరి. నేను త్రిప్రవరిని. అతడు యజుర్వేది. నేను ఋగ్వేదిని.అతడు ధర్మ శాస్త్రజ్ఞుడు, నేను మూఢుణ్ణి.176.అతడు మాధ్యందినుడు, నేను శాకల శాఖకు చెందినవాణ్ణి. అతడు ధర్మశాస్త్రాల జ్ఞానం కలిగినవాడు, నేను వాచాలుణ్ణి. అతడు పండితుడు. నేను బుద్ధిహీనుణ్ణి, మూర్ఖుణ్ణి.ఎందుకు నాకీ వ్యర్థమైన బిరుదు?.177.అతడు రాజకార్య ధురంధరుడు, చతురుడు అయితే నేను అల్పమతిని మంద బుద్ధిని. అతని 'రాజ్యప్రశస్తి' ప్రసిద్ధి చెందిన సంస్కృత కావ్యం. నేను ఒక పద్యమైనా వ్రాయలేని వాణ్ణి.178.అతడు కళాభిజ్ఞుడు, గ్రంథకారుడు. నేను ఏ తెలివిలేని వాణ్ణి. అతడు ధర్మశాస్త్ర విశారదుడు, జ్ఞాని. నేను అల్పజ్ఞుణ్ణి.179.అతని గ్రంథం లేఖన కల్పతరువు అనేక చిత్ర కావ్యాల సంగ్రహం.అయితే నేను పద్య రచన చేయలేని వాణ్ణి.బాబా బిడ్డను.180.గోరా, చోఖా, సావతమాలి, నివృత్తి నాథ్ జ్ఞానదేవ్, నామదేవ్ మొదలగు భాగవత ధర్మప్రవర్తక మండలి ఉదయించిన ఆ కాలంలో,181.పండిత బోపదేవ అను విద్వాంసుడు మణిలా ప్రకాశిస్తున్న దర్బారులో అక్కడే హేమాద్రిపంతు రాచకార్యాలలో సుగుణాలతో సుప్రసిద్ధి చెంది ఉన్నాడు.182.ఉత్తరంనుండి యవనుల సైన్యం ఈ దేశంలో ప్రవేశించారు. ఆకారణంగా దక్షిణదేశపు రాజ్యసత్తా

అస్తమించిపోయింది.183. నా చాతుర్యానికి సన్మానంలా, నాకు ఈ పదవీ ప్రదానం ఊరకనే కాదు. వాదవివాదాలలోని నా అభిమానం తొలగిపోవడానికి బాబా నాపై విసరిన వాగ్బాణం.184.ఏ జ్ఞానం, ఏ అర్హత లేకుండా వ్యర్థంగా వాదించే నాకు సమయానికి సరిగ్గా కళ్ళలో అంజనం వేసి బాబా నాకళ్ళను తెరిపించారు.185.ఇంతకు ముందు చెప్పిన లక్షణాలున్నా సాయి నోటి నుండి వెలువడిన విలక్షణము మరియు సందర్భానికి సరిపోయిన సార్థక నామకరణాన్ని నేను భూషణంగా స్వీకరించాను.186.అశుభము, హానికారకము, చెడు లక్షణాలైన వాద వివాదాలు ఒక్కక్షణమైనా నన్ను తాకకుండా ఉండాలని నాకు మంచి గుణపాఠం.187.వాదవివాదాల లోని నా అభిమానం కరిగిపోయి నేను ఆమరణం నిరభిమానంగా ఉండాలని గుర్తుండడానికే ఈ నామకరణం.188.దశరథరాముడు భగవంతుని అవతారం. పూర్ణజ్ఞానులను, తనను నమ్ముకున్న భక్తులను తరింపచేసే దేవుడు. ఋషుల మనసులలో విహరించేవాడు. గురువైన వశిష్ఠులవారి చరణాలను ఆశ్రయించాడు.189.పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడు కూడా గురువును ఆశ్రయించ వలసి వచ్చింది.గురువైన సాందీపుని గృహంలో కట్టెలు మోసి కష్టాలు పడ్డాడు.190.అలాంటప్పుడు నేనెంతటి వాణ్ణి? గురువు వినా జ్ఞానం గాని పరమార్థం గాని లభించవు అన్న శాస్త్రవచనాలు దృఢమయ్యాయి.191.వ్యర్థమైన వాదవివాదాలు మంచివికావు. వాదవివాదాలు ఎందుకు చేయాలి? ఎవరితోనూ పోల్చుకోకూడదు. శ్రద్ధ మరియు సహనం లేకపోతే పరమార్థం కించిత్తైనా సాధించలేం.192.ఇది తరువాత అనుభవమైంది.ఈ రీతిగా గౌరవంగా, వచ్చిన నామాన్ని నేను ప్రేమ పూర్వకంగా సద్భావంతో స్వీకరించాను.193.ఇప్పుడు తన పక్షం, ఇతరుల పక్షం అన్న భావాన్ని తొలగించే వాద ప్రతివాదాలను అడ్డగించేది మరియు అందరికీబోధప్రధమైన కథను ఇక్కడ ఆపి.194.ఈ గ్రంథం యొక్క ప్రయోజనాన్ని, అధికారి మరియు అనుబంధాన్ని తెలియ చేస్తాను. గ్రంథకారుని

నామకరణ వర్ణన విన్నారు.195.ఇక్కడికి ఈ అధ్యాయ విస్తారం చాలు.తరువాత క్రమానుసారంగా సవిస్తరమైన కథను హేమాడ్ సాయి చరణాల యందు సాదరంగా మనవి చేస్తాడు.శ్రోతలు శ్రవణ తత్పరులుకండి.196.సాయియే మన సుఖ సంపత్తి.సాయియే మన సుఖ సంవిత్తి.సాయియే మన పరమ నివృత్తి.అంతిమ గతి కూడా శ్రీసాయియే.197.సాయి కృపాకారణంగా శ్రీసాయి చరిత్ర శ్రవణం చేయటం వలన దుస్తరమైన భవభయాన్ని తరించటం మరియు కలియుగంలోని మలినం నిర్మూలనమవటం. 198.స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో కథా ప్రయోజనం, నామకరణం అను రెండవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత - 3వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయై నమః;
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఇప్పుడు పూర్వకథ,సాయిబాబా నాకు పూర్తి ధైర్యానిచ్చి''నా చరిత్రను వర్ణించటానికి నా సంపూర్ణ అనుమతి ఉంది.1. నీవు నీ పనిని చేయి.మనసులో ఏ మాత్రం భయపడకు.నా మాటలందు పూర్తి విశ్వాసముంచు. నీ మనసును దృఢపరుచుకో.2.నా లీలలను రచిస్తే అజ్ఞాన దోషం తొలగిపోతుంది. వానిని భక్తిభావంతో శ్రవణం చేస్తే ప్రపంచంపై ధ్యాస మాయమౌతుంది.3. శ్రవణమనే సాగరాన భక్తి ప్రేమామృతమనే అలలు లేస్తాయి.వానిలో మరల మరల మునకలు వేస్తే జ్ఞాన రత్నాలు లభిస్తాయి' అని చెప్పారు.4. ఈ మాటలు వినగానే నా మనసులోని సంశయాలు దూరమయ్యాయి. సాయి పాదాలకు ప్రణమిల్లి నాకు స్ఫురించినట్లు చరిత్రను వ్రాయ నారంభించాను.5. బాబా పెదవులనుండి వచ్చిన మాటలు శుభశకునమని భావించి నా కార్యం తప్పక జరిగితీరుతుందని దృఢపరుచుకున్నాను.6. అగమ్యమైన హరిలీలలు ఆ హరికే తప్ప అన్యులకు అర్థం కావు.అవి ఎవరికీ అంతు పట్టవు. వానిని వర్ణించలేక వేదాలు,శ్రుతులు,శాస్త్రాలు మూగపోయాయి.7.శాస్త్రవిశారదులు, వేద విదులు, పండితులు,ప్రజ్ఞావంతులు ఘటపటాది శబ్దాలతో వాదవివాదాలు చేసే వారు;వారి జోలికి పోకండి.8. శ్రీహరి తన భక్తుల చేతులలో కీలుబొమ్మ. అమాయక భక్తులకోసం తహతహ లాడుతాడు. ప్రేమ కోసం భక్తుల అధీనంలో ఉంటాడు. కాని ధాంభికులకు సదా దూరంగా ఉంటాడు.9.'నీకు ఇదే శుభప్రదమైనది. ఇది నా ఈ అవతార

కార్య సార్థకత. ఇదే నేను పదేపదే చెప్పేది. దీనిని గురించే నా చింత.10. శామా ! మరో మాట చెబుతాను. ప్రేమతో నా నామాన్ని స్మరించే వారి సకల కార్యాలను పూర్తిచేసి వారి ప్రేమను పెంచుతాను.11.నా చరిత్రను, నా మహిమలను ప్రేమతో గానం చేసే వారి ముందు వెనక నలుదిక్కుల నిలచి ఉంటాను.12.నా కొఅకు మనో ప్రాణాలు అంకితం చేసే భక్తులకు ఈ కథా శ్రవణంలో ఆనందం కలగటం సహజం.13.నా కథా సంకీర్తనలు చేసే వారెవరైనా సరే, వారికి ఎల్లప్పుడు ఆనందాన్ని సుఖశాంతులను ప్రసాదిస్తాను. ఇది నా సత్యవచనమని నమ్ము.14.నా అనన్య శరణు జొచ్చి విశ్వాసంతో నా భజన, నా ధ్యానం, నా స్మరణ చేసే వారిని నేను ఉద్ధరిస్తాను. ఇది నా ప్రతిజ్ఞ.15.నా యందు భక్తితో నా నామాన్ని జపిస్తూ, నా లీలలను గానంచేస్తూ, నిరంతరం మనసులో నా ధ్యానం చేసేవారికి విషయసుఖాలు ఎలా గుర్తుకు వస్తాయి.16.నేను నా భక్తులను మృత్యుముఖం నుండి లాగేస్తాను. నా ఈ కథను శ్రవణం చేసినంత మాత్రాన రోగ నివారణ మౌతుంది.17.శ్రద్ధగా శ్రవణం చేసిన తరువాత మననం మరియు నిదిధ్యాసనం చేస్తే శాంతి లభిస్తుంది.18.అంతేకాదు అహంసోహం మాయమైపోతాయి. అనన్యమైన పరిపూర్ణ శ్రద్ధగల శ్రోతలు ఉన్మని స్థితిని పొందుతారు.వారి చిత్తం చైతన్యఘనమౌతుంది.19. 'సాయీ సాయీ' అనే నామస్మరణ కలియుగంలోని సకల దోషాలను దహించి వేస్తుంది.సాయికి ఒక సాష్టాంగ ప్రణామం చేస్తే వాక్కుతో పలికిన పాపాలు చెవులతో విన్న పాపాలు నశించిపోతాయి' అని చెప్పారు.20.రచనాకార్యం సామాన్యమయినది కాదు. అయినా వారి ఆజ్ఞను శిరసావహించాను. బాబా వంటి ఉదారులైన దాత అండ ఉండగా నేను దైన్యాన్ని ఎందుకు ఆపాదించుకోవాలి.21.వారు ఒకరి ద్వారా మందిరాన్ని నిర్మాణం చేయించారు. మరొకరిని హరికథా కీర్తనాదులలో నివుగ్నులను చేశారు.ఇంకొకరిని తీర్థయాత్రలకు పంపారు.నన్ను వ్రాయటానికి

కూర్చోబెట్టారు. 22. నేను అందరికంటే పామరుణ్ణి. నాలో ఏ గుణాలను చూసి ఆ కరుణాసాగరులు నాపై కృపాదృష్టిని కురిపించారో నేను ఏమాత్రం ఎరుగను. 23. గురుకృపలోని విశిష్టత ఇదే. అది ఏమాత్రం తడిలేకుండానే ఎండి మోడుబారిన చెట్టును కూడా ఏ ప్రయాస లేకనే పుష్పింపచేసి బాగా ఫలాలు లభించేలా చేస్తుంది. 24. ఒకరు ఆశ్రమాన్ని మఠాన్ని నిర్మిస్తారు. మరొకరు దేవాలయాలను స్నాన ఘట్టాలను నిర్మిస్తారు. నేను సులువైన సాయి చరిత్ర పఠనా మార్గాన్ని అవలంబిస్తాను. 25. ఒకరు సత్కారపూర్వకంగా అర్చన, మరొకరు పాదసంవాహన సేవ చేయగా నా మనసు సాయి గుణసంకీర్తన చేయాలని ఉబలాట పడుతుంది. 26. కృతయుగంలో ధ్యానంతో, త్రేతాయుగంలో యజ్ఞయాగాదులతో, ద్వాపరయుగంలో అర్చనల ద్వారా లభించేవన్నీ కలియుగంలో గురుభజనలతో, నామ సంకీర్తనలతో ప్రాప్తిస్తాయి. 27. నేను ఏ యోగ్యతా లేనివాణ్ణి, అనర్హుణ్ణి. చింకి గుడ్డలు బోలెడున్నా సరియైన వస్త్రం ఒక్కటైనా లేనివాణ్ణి. అంటే పరిపూర్ణ జ్ఞానం లేనివాణ్ణి. ఇటువంటి కఠిన కార్యాన్ని ఎలా స్వీకరించాలి? 28. ఏ ప్రయత్నం చేయకుండా ఊరికే కూర్చుందామంటే ఆజ్ఞాభంగం చేసిన పాతకుణ్ణవుతాను. పోనీ ఆజ్ఞాపాలన చేద్దామంటే ఇది ఎలా సాధ్యం? 29. సాయిసమర్థుని నిజస్వరూపాన్ని యథార్థంగా వర్ణించే శక్తి ఎవరికి ఉంది? వారు స్వయంగా భక్తులను కరుణించ దలచినప్పుడు వారికి వారే స్వయం తెలియ జేస్తారు. 30. వాణికి అతీతమైన విషయాలను చెప్పాలని నేనెందుకు ఆశించాను అని ఎవరైనా అనటానికి ఆస్కారంలేదు. 31. చేతిలో కలం తీసుకోగానే బాబా నా అహంభావాన్ని హరించివేసి, తమ కథలను తామే వ్రాసుకున్నారు. అందువల్ల ఇందులోని ఘనత వారిదే. 32. ఇది సత్పురుషుని చరిత్ర రచన. వారు తప్ప దీనిని ఎవరు రచించగలరు? బుద్ధికి అంతుపట్టని బాబా గుణాలను, మహిమలను అవగాహన చేసుకోవటం గగనాలింగనం వంటిది. 33. ఊహకందని వారి మహిమలను మతిహీనుడనైన

నేనెలా వర్ణించను? ఈ కార్యభారాన్ని వారే వహించి వచన నిర్ముక్తులవ్వాలి. 34. బాబా నేను జన్మతహా బ్రాహ్మణుడనే కాని, శ్రుతిస్మృతులనే కళ్ళులేనివాణ్ణి. ఇది నా ఈ జన్మకు దోషమే అయినా మీ వలన నాకు శోభ .35.వేదాలు, పురాణాలు బ్రాహ్మణులకు కళ్ళు. ఒకటి లేకపోతే మెల్లకన్ను. రెండూ లేకపోతే అంధుడే. నేను అట్లే హీనుణ్ణి, దీనుణ్ణి.36.ఈ అంధునికి ఊతకర్రలా మీరు తోడు ఉండగా ఇక మరి నాకేం కష్టం? మీ వెంట సులువైన మార్గాన నడుస్తాను.37.ఇకముందు ఏం చేయాలన్నది పామరుణ్ణైన నాకు తెలియదు. నాకు బుద్ధిని ప్రసాదించి మీ కార్యాన్ని మీరే సాధించు కోండి.38.బుద్ధికి అతీతమైన ఎవరి అపూర్వ శక్తితో కుంటివాడు మేరుపర్వతాన్ని దాటగలడో, మూగవాడు బృహస్పతి వలె మాట్లాడగలడో అట్టి శక్తి గలవారి యుక్తి వారికే తెలుస్తుంది.39.నేను కేవలం మీ పాదదాసుణ్ణి. నన్ను నిరుత్సాహ పరచకండి. ఈ శరీరంలో శ్వాస ఉన్నంత వరకు మీ కార్యాన్ని సాధింప చేసుకోండి.40. ఇప్పుడు శ్రోతలు ఈ గ్రంథ ప్రయోజనాన్ని తెలుసుకున్నారు కదూ. భక్తుల శ్రేయస్సు కొరకు సాయియే దీనిని స్వయంగా వ్రాసేవారు, వ్రాయించే వారు.41.మురళికి మరియు హార్మోనియానికి రెంటికి ఎలా మ్రోగాలిఅన్న చింత ఉండదు. ఆ ప్రతిభ వాయించే వారిదే కదా. మరి నేను ఎందుకు శ్రమపడాలి? 42.చంద్రకాంతమణి స్రవింపజేసే అమృతం దాని పొట్టలోనిదా? కాదు, అది చంద్రోదయాన చంద్రుని అద్భుతచర్య. 43.చంద్రుని కిరణాల ప్రభావం వల్ల సాగరంలో అలలు ఉప్పొంగటానికి చంద్రోదయమే కారణంగాని సాగరం యొక్క ఘనత కాదు.44. సముద్రంలో ఓడలు సుడిగుండాలలో చిక్కుకొని పోకుండా పెద్ద రాతిబండలకు కొట్టుకోకుండా నిరాటంకంగా సాగిపోవటానికి అపాయాలను సూచించే ఎత్తైన దీపస్తంభాలను నిర్మిస్తారు.45.అట్లే సాయినాథుని మధురమైన కథలు అమృతం సహితం సిగ్గు పడేలా దుస్తరమైన భవసాగర మార్గాన్ని అతి సులువుగా

దాటింపజేస్తాయి.46.వారి కథలు ధన్యం. ఇవి శ్రవణాల ద్వారా హృదయంలోకి ప్రవేశించి శరీరాభిమానాన్ని బయటికి నెట్టేస్తాయి. సుఖదుఃఖాలనే ద్వంద్వాలు ఉండవు.47. వీనిని హృదయంలో భద్రపరుచుకుంటే మనుషులోని వికల్పాలు నలుదిక్కులా పారిపోతాయి. అంతేకాదు జ్ఞానం బాగాపోగై, అహంభావం నశించిపోతుంది.48. బాబా యొక్క నిర్మలమైన యశస్సును వర్ణిస్తే ప్రేమతో శ్రవణం చేస్తే భక్తుల కల్మషాలు దహించుకుపోతాయి. ఇది పరమార్థానికి సులభ సాధనం.49.మాయాతీత బ్రహ్మ అంటే ఏమిటి? మాయను తరించే ఉపాయం ఏది? ధర్మాచరణలో ఏయే కర్మలను చేస్తే శ్రీహరి ప్రసన్నుడౌతాడు?50.అత్యంత క్షేమకరమైనది ఏది? భక్తి ముక్తి విరక్తి అంటే ఏవి? నాలుగు వర్ణాలకు, నాలుగు ఆశ్రమాలకు ఉన్న నియమాలు ఏవి? సద్ వస్తువు అంటే ఏమి? అద్వైతానికి అర్థమేమిటి? ఇత్యాది విషయాలు అత్యంత గూఢమైనవి.51. వీనిని తెలుసుకోవాలన్న కోరిక కలవారు జ్ఞానేశ్వర ఏకనాథులు రచించిన వివిధ గ్రంథాలను పఠించి ఆనందించ గలరు.52 కృతయుగంలో శమదమాదులు, త్రేతాయుగంలో యజ్ఞయాగాదులు, ద్వాపరంలో పూజార్చనాదులు, కలియుగంలో పరమార్థానికి సులువైన సాధనం నామస్మరణం, కథాకీర్తనలు.53. బ్రాహ్మణాది నాలుగు వర్ణాలకు గురుకథా శ్రవణం సాధనం. స్త్రీలు గాని, శూద్రులుగాని, నిమ్న జాతులకు గాని, అందరికీ ఇది ఒక్కటే సాధన.54. పుణ్యసంచయమున్నవారే ఈ కథలను శ్రవణం చేస్తారు. శ్రవణంలో ఎవరికైనా నిద్రముంచుకొని వస్తే శ్రీహరి వారిని మేలు కొలుపుతాడు.55. అనవరతం విషయభోగాలను అనుభవించాలని కోరుకునే వారిని, విషయసుఖాలు లభించక దీనంగా దుఃఖించే వారిని కూడా ఈ సత్పురుషుని కథామృతం విషయాలనుండి విముక్తులను చేస్తుంది. 56. యోగాసనాలు, యాగాలు, ధ్యాన ధారణలు మొదలగు సాధనలు చేయటానికి నానాప్రయాసపడాలి. కాని ఈ కథా శ్రవణంలో ఏకాగ్రత తప్ప

మరి ఏ శ్రమాలేదు.57.ఇటువంటి సాయి యొక్క పావన చరిత్ర సజ్జనులైన శ్రోతలు భక్తితో వింటే వారి ప్రబలమైన పంచమహాపాతకాలు దహింపబడి నశించుకుని పోతాయి. 58.మనం ప్రపంచ బంధనాలలో బాగా పెనవేసుకుపోయి ఉన్నాం. అందువల్ల మన నిజస్వరూపం మరుగున పడింది. ఈ బంధనాలు కథా శ్రవణంతో వదులై విడిపోతాయి. అప్పుడు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. 59. ఈ కథలను జీవితాంతం స్మరించుకుంటూఉండాలి.వానిని నిత్యం పారాయణం చేసే జీవులు భవబంధనాల నుండి విముక్తులై శాంతిని పొందాలి.60.ఈ కథలను భక్తి భావంతో చదువుతున్నా, వింటున్నా సాయిపై ధ్యానం సహజంగా కుదిరి, దానితో వారి సాకార సగుణ రూపం కళ్లలో కనిపించి, చిత్తం వారి యందు దృఢంగా నిలచిపోవాలి. 61.అప్పుడు సద్గురువు యందు భక్తి కలిగి సంసారమందు ప్రపంచమందు విరక్తి కలిగి, గురుస్మరణ యందు ప్రీతి కలిగి, మనసు నిర్మలంగా ఉంటుంది.62.ఈ ఉద్దేశంతోనే సాయిబాబా కరుణతో నన్ను నిమిత్త మాత్రునిగా చేసి స్వయంగా ఈ రచనా కార్యాన్ని చేశారు.63.ఆవు పొదుగునిండా బాగా సమృద్ధిగా పాలు ఉన్నా దూడ లేకుండా పాలు చేపదు. ఇది ఆవు యొక్క నైజం.సాయి యొక్క ప్రేమ కూడ ఇట్టిదే. 64.సాయి దయామయి చాతక పక్షివంటి నా కోరికను మన్నించి నాపై ఆనందవృష్టిని కురిపించి నాచిన్న కోరికను తీర్చి భక్తులకు కూడా ఆనందాన్ని కలగచేసారు.65. భక్తి ప్రేమల కౌశలం ఎంత విచిత్రం.బిడ్డ ఆకలి తల్లికి తెలుస్తుంది.అందుకే బిడ్డ నోరు తెరవకముందే బిడ్డ నోటికి తన స్తన్యాన్ని అందిస్తుంది. 66.ఆమె బాధ ఎవరికి అర్థమౌతుంది? బిడ్డకది తెలియదు.అడగకుండానే తల్లి తప్ప అన్యులెవరు స్తన్యమివ్వగలరు? 67.బిడ్డను నగలతో అలంకరించి తల్లి ఆనందిస్తుంది. కాని అందులోని మాధుర్యాన్ని బిడ్డ ఎరుగడు. ఆ కౌశలం ఒక్క తల్లికే తెలుస్తుంది.సద్గురువు పద్ధతి కూడా ఇదే.68.నా బిడ్డ యొక్క అవసరాలను ఎవరు తీరుస్తారు అన్న తపన తల్లికి

తప్ప ఎవరికి ఉంటుంది? అలాంటి వాత్సల్యం అరుదు. 69. మంచి తల్లి కడుపున పుట్టడం దేవుడు అనుగ్రహించిన మహా భాగ్యం. ఎంతో బాధను సహించి జన్మనిచ్చిన తల్లి కష్టం బిడ్డలు ఎఱుగరు. 70. ఈ విషయంలో బాబా చెప్పిన ఒక మాటను వినిపిస్తాను. సజ్జనులైన శ్రోతలు శ్రద్ధగా వినండి. 71. క్రీ.శ. 1916 సంవత్సరంలో ప్రభుత్వంలోని నా ఉద్యోగం ముగిసింది. నా అర్హతననుసరించి నా పింఛను నిర్ణయమైంది. అప్పుడు శిరిడీ ప్రయాణానికి సమయం వచ్చింది. 72. అది గురుపౌర్ణమి రోజు గురుపూజకు భక్తులు సమావేశమయ్యారు. అణ్ణా చించణీకర్ తనంతట తానే బాబాతో నాగురించి సిఫారసు చేయటం వినండి. 73. అణ్ణాకు నాపై చాలా చింత. బాబాతో 'ఇతనిది పెరుగుతున్న సంసారం. అందువల్ల ఇతనిపై కృప చూపండి. 74. ఇతనికి వచ్చే పింఛను ఏం సరిపోతుంది? అన్నాసాహేబును వేరే ఉద్యోగంలో ఉంచి ఇతని చింతను దూరం చేయండి' అని ప్రార్థించాడు. 75. బాబా ఇలా జవాబిచ్చారు. 'ఇతనికి ఏదో ఒక ఉద్యోగం లభిస్తుంది. ఇప్పుడు నా సేవ చేయనీ. ప్రపంచం సుఖమయమౌతుంది. 76. ఇతని పళ్ళాలు ఎప్పుడూ నిండి ఉంటాయి. యావజ్జీవం అవి ఖాళీ కావు. భక్తితో నావాడైవుంటే ఇతని ఆపదలను హరించి వేస్తాను. 77. ఎలా ప్రవర్తిస్తే మాత్రం చెడిపోయేదేముంది అని అనేవారు మూర్ఖులు. ధర్మాచరణను త్యజించిన వారి సహవాసాన్ని విడిచి పెట్టాలి. 78. అలాంటి వారిని భయంకరులుగా తలచి వారు ఎదురు పడితే పక్కకు తొలగిపోవాలి. వారినీడలోనైనా ఉండ కూడదు. కష్టాలను సహించాలి. 79. ఆచార హీనులు శీలభ్రష్టులు, బుద్ధిహీనులు, మంచి చెడుతారతమ్యం తెలియని వారు, తమ మనోభీష్టాలను ఎలా పొందుతారు? 80. ఏ ఋణాను బంధం లేకుండా ఎవరూ మన వద్దకురారు. శ్వాన సూకరాలైనా దోమలైనా అంతే. కనుక ఛీ, ఛీ పో ఫొమ్మని ఎవరినీ తరిమి వెయ్యకండి. 81. ఇకపై ప్రేమతో భక్తిభావంతో నా సేవ చేస్తే దేవాదిదేవునికి కరుణ కలిగి అక్షయమైన

నిధి ప్రాప్తిస్తుంది.82.మరి ఈ పూజ ఎట్లా చేయాలి?నేనెవరినో నిశ్చయంగా ఎలా తెలుసుకోవాలి?సాయి యొక్క శరీరం నశించిపోయేది.అవినాశి అయిన బ్రహ్మ పూజింపతగినవారు.83.నేను అష్టధా ప్రకృతి రూపంలో నలుదిశలా వ్యాపించి ఉన్నానని శ్రీకృష్ణుడు అర్జునునికి గీతా వాఖ్యానమందు చెప్పాడు.84. స్థావర జంగమాత్మక జగత్తులో వివిధ నామరూపాలన్నిటిలో నేనే అష్టధా ప్రకృతిగా నటిస్తున్నాను.ఇది నా చమత్కారమే.85.ఓం ప్రణవం నా వాచకం. దాని వాచ్యం నేనే. విశ్వంలో అనేక వస్తువులలో నేనే నిండి ఉన్నాను.86. ఆత్మ భిన్న వస్తువు కాదు. దశదిశలలోనూ అన్ని ప్రదేశాలలోనూ నేనే నిండి వున్నాను.ఇక దేనిని కోరటం.87. ఇలా అంతటా నేనే సంపూర్ణంగా ఉన్నాననన్న భావంతో, నేను నాది అన్న భేదభావం తొలగిపోగా అప్పుడింక కోరేదేమి ఉంటుంది.88.కోరిక బుద్ధిలో జనిస్తుంది. దీనికి ఆత్మతో సంబంధం లేదు' అని చెప్పారు. సాయి మహారాజు మూర్తీభవించిన మన ఆత్మయే. అక్కడ కోరిక ఎలా స్ఫురించగలదు?89.కోరికలు అనేక రకాలు.నేను ఎవరు అని నిశ్చయంగా తెలుసుకోగానే సూర్యుని కిరణాలకు కరిగిపోయే మంచులా అవి కరిగిపోతాయి.90.నేను మనసు, బుద్ధి, ఇంద్రియాలతో కూడిన 'విరాట్' స్థూల శరీరాన్ని కాను. అగోచరమైన హిరణ్యగర్భ సూక్ష్మశరీరాన్ని కాను. నేను అనాదియైన సనాతన సాక్షిని.91.ఇలా గుణాలకు, ఇంద్రియాలకు అతీతంగా ఉన్న నాకు విషయాలయందు ఆసక్తి లేదు. నేను లేని చోటే లేదు. నేను చేసే వాణ్ణి కాను. చేయించేవాణ్ణి కాను.92.మనస్సు, బుద్ధి ఇవన్నీ ఇంద్రియాలు. ఇవి జడం అని గ్రహించిన వెంటనే విషయ సుఖాలయందు విరక్తి కలిగి జ్ఞానాన్ని కప్పుకున్న ఆవరణ తొలగిపోతుంది.93.తన స్వరూపమైన ఆత్మను మరచి పోవటమే మాయా ప్రాదుర్భావం. నేను చైతన్య ఘన స్వరూపమని గుర్తు ఉంటే శుద్ధమైన పూర్ణానందం కలుగుతుంది.94.ఆ నా స్వరూపం వైపు మనోవృత్తిని మళ్ళించటమే నా సేవ. అదే నా భక్తి. నేను చిదానందుణ్ణి

అని ప్రత్యక్ష అనుభవం కలిగినప్పుడు ప్రాప్తించిన శుద్ధ స్థితి జ్ఞానం.95. 'అయమాత్మాబ్రహ్మ' 'ప్రజ్ఞానం ఆనందం బ్రహ్మ' అని అంటారు. జగత్తు వాస్తవం కాదు. మిథ్య. అందుకే అది భ్రమింప జేస్తుంది. వాస్తవమైన బ్రహ్మాను నేనే.96.నిత్య, శుద్ధ, బుద్ధ , ముక్త, సత్యమైన వాసుదేవుణ్ణి నేను. ఇలాంటి నన్ను శ్రద్ధా భక్తులతో పూజ చేస్తే స్వహితం కలుగుతుంది.97.ఇలా నేను ఎవరు అని తెలుసుకొని నా యదార్థమైన పూజను చేసి, అనన్య శరణుజొచ్చి నాలో ఐక్యమైపోవాలి.98.నది సముద్రుని శరణు జొచ్చి మరల వెనుకకు తిరిగి రాగలదా?సముద్రుని ఆలింగనం చేసుకున్న నది నదిలా భిన్నంగా ఉండగలదా?99.నూనెలో తడిసిన దూది వత్తి దీపపు జ్యోతిని కలిసి స్వయం దీపమై ప్రకాశిస్తుంది. అట్లే సత్పురుషుల చరణాలను శరణు జొచ్చిన వారి స్థితికూడా.100. చైతన్య ఘనుడైన అల్లామాలిక్ తప్ప వేరే ఏ ధ్యానం లేనివారు శాంత చిత్తులు. ఏమీ అపేక్షించనివారికి,సమభావం కలవారికి అహంభావం ఎలా ఉంటుంది?101.నిరహంభావం, మమకారం, ద్వంద్వాలకు అతీతం, అపరిగ్రహం అనే నాలుగు గుణాలున్న చోట నేననే అహంభావం ఎందుకుంటుంది?102. దీని తాత్పర్యం, ఈ ఎనిమిది గుణాలు సాయి యందు సంపూర్ణంగా ఉన్నప్పుడు ఇక అక్కడ అహంభావానికి తావెక్కడిది? అటువంటి సాయిని నేను అహంభావంతో ఎలా సేవించగలను?103.విశ్వమంతా నిండియున్న వారి అహంభావం యొక్క చిన్న అంశమే నాలోని అహం. దీనిని సాయి చరణాలయందు సమర్పించటమే నా సంపూర్ణ సేవ.104. అనన్యంగా శరణుజొచ్చి నా సేవ, నాభజన చేసేవారు నారూపాన్ని పొందుతారు అని శ్రీకృష్ణ భగవానుడు భాగవతంలో చెప్పాడు.105.భ్రమరాన్ని ధ్యానించే కీటకం భ్రమరమై పోయేలా గురువును ఆరాధించే శిష్యులు గురుసమానులై పోతారు.106.సమానం అన్న పదంలో ఉన్న భేదభావాన్ని గురువు ఒక్క క్షణమైనా సహించలేరు. శిష్యుడు లేక గురువుకు గురుత్వం లేదు.అట్లే శిష్యత్వం

గురుత్వం కంటే భిన్నంకాదు.107.ఎవరి పూజను చేయాలని ఆజ్ఞాపించారో ఆ నేను ఎవరన్న విషయాన్ని వ్యాఖ్యానించాను. దీనిని దృఢపరచటానికి ఒక విషయం గుర్తుకు వచ్చింది. దానిని చెబుతాను. 108.ఒక రోహిల్లా శిరిడీకి వచ్చి చాలా రోజులున్నాడు. బాబా గుణాలకు ఆకర్షింపబడి బాబాను ప్రేమించసాగాడు. 109.ఎనుబోతువంటి శరీరంతో బాగా పుష్టిగా ఉండేవాడు. స్వేచ్ఛగా తిరుగుతూ ఎవరినీ ఖాతరు చేసేవాడు కాదు.శరీరానికి చీలమండల దాకా ఉండే కఫనీని ధరించి మసీదుకు వచ్చి ఉన్నాడు. 110.పగలైనా రాత్రైనా మసీదులో ఉన్నా చావడిలో ఉన్నా అత్యంత ఆవేశంతో గట్టిగా స్వేచ్ఛగా కల్మాను పఠించేవాడు.111.సాయి మహారాజు శాంత మూర్తి. కాని గ్రామస్థులు చాలా విసిగిపోయారు. అర్ధరాత్రి కూడా అతని కేకలు వారికి నిద్రాభంగం కలిగించేవి.112.పగలల్లా ఎండలో పొలాల్లోను, అడవుల్లోను శ్రమించి రాత్రి ప్రశాంతంగా నిద్ర పోలేకపోతున్నందుకు వారు చాలా బాధ పడ్డారు.113.బాబాకు ఏ బాధ లేదు. కాని ప్రజలకు చాలా బాధాకరమైంది. రాత్రి సుఖంగా నిద్రలేనందువల్ల వారికి రోహిల్లా పై క్రోధం కలిగింది.114.అటు నుయ్యి ఇటు గొయ్యిలా అయింది వారి పరిస్థితి. ఎంతవరకు సహనంగా ఉండగలరు? అహోరాత్రాలు అరుపులు గొడవ. ఏం చేయాలి అని వారికి పెద్ద చింత పట్టుకుంది. 115.అసలే రోహిల్లా తలతిక్క మనిషి. పైగా అతనికి బాబా మద్దతు. దాంతో అతడు అదుపు లేకుండా మరింత రెచ్చిపోయాడు. 116. గర్వంగా ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకో సాగాడు. హద్దుమీరి ప్రవర్తించడంతో ఊరుకూడా అతనిపై తిరగబడింది.117.సాయిమాత అత్యంత కరుణామయి. శరణాగతులను అక్కున చేర్చుకుంటుందని ఊరివారంతా బాబా వద్దమొరపెట్టుకోవాలని వెళ్ళారు.118.కాని బాబా వారి మాటలను లక్ష్య పెట్టలేదు. పైగా, వారికి వ్యతిరేకంగా 'రోహిల్లాను బాధ పెట్టకండి. నాకతడు అత్యంత ప్రియుడు.

119. రోహిల్లా భార్య పతితురాలు. అతనితో పొత్తుకుదరక అతనిని తప్పించుకొని ఆ దెయ్యం నా వద్దకు రావాలని ఉబలాట పడుతుంది. 120. దానికి పరదా పద్దతి ఏం లేవు. సిగ్గు బిడియాలను వదిలేసింది. దానిని బయటికి తరిమేసినా బలవంతంగా లోపలికి జొరబడుతుంది. 121. అతడి కేకలు ఆగిపోతే ఆ సందు చూసుకొని ఆ దుర్బుద్ధి జొరబడాలని చూస్తుంది. అతడు గట్టిగా అరుస్తుంటే అది తప్పక పారిపోతుంది. అందువలననే నాకు అత్యంత సుఖం. 122. అందువల్ల అతని జోలికి ఎవరూపోకండి. అతనిని ఇష్టమొచ్చినట్లు కేకలు వేయనీయండి. అతడు లేకపోతే నాకురాత్రిగడవదుఅతనికేకలునాకెంతో సుఖాన్నిస్తాయి. 123. అతడలా అరవటం నాకు చాలా మంచిది. పరోపకారం చేసే ఆ రోహిల్లా నాకు చాలా సుఖాన్ని కలిగిస్తాడు. 124. అందుచేత అతన్ని యథేచ్ఛగా కేకలు వేయనీయండి. నాకదే ఇష్టం. లేకపోతే దుష్టురాలైన అతని భార్య నాకు చాలా కష్టాన్ని కలగజేస్తుంది. 125. అతడు అలసిపోయినప్పుడు తనంత తానే ఊరుకుండి పోతాడు. మీ కార్యం సిద్ధిస్తుంది. ఆమె నన్ను బాధపెట్టదు' 126. అని సాయి మహారాజు చెప్పగా బాబా మనస్సులో ఏ బాధా లేదు కదా ఇక మనకేం పనిఅని అక్కడితో ఆ సమస్య ఆగిపోయింది. 127. అసలే రోహిల్లా ఎంతో ఉత్సాహంగా ఉండేవాడు. ఆపైగా కరువులో అధిక మాసంలా బాబా సమర్దించటంతో హుషారుతో కంఠ శోష వచ్చేలా అరిచేవాడు. 128. బాబా ఎంతటి క్షమాసంపన్నులు, తలబ్రద్దలయ్యే కేకలలో తల్లీనులవుతారు అని జనమంతా ఆశ్చర్యపడేవారు. 129. ఎంతటి భయంకరమైన కేకలు! ఎంత అరచినా అతని గొంతు ఎండేది కాదు. అయినా బాబా ఒకటే మాట. 'అతనిని భయపెట్టకండి' అని .130. రోహిల్లా పిచ్చి ఫకీరులా కనిపించినా అతనికి బాబాపై అత్యంత గౌరవాదరాలు. తమ మతానుసారంగా కల్మాను చాలా సంతోషంగా చదివేవాడు. 131. మంజులస్వరమా, కర్కశ స్వరమా అన్న

ఆలోచన ఏవరికి ఉంటుంది. స్ఫురించిన వెంటనే హరినామాన్ని కీర్తించటం.132.రోహిల్లా ప్రకృతి దత్తమైన తన కర్కశ కంఠంతో 'అల్లాహో అక్బర్' అని గట్టిగా పలికేవాడు. అతడు నిత్యం ఎప్పుడూ ఆనందంగా కల్మా పలికేవాడు. 133.హరినామాన్ని వినటానికి ఇష్టపడని వారిని బాబా తమ దరి చేరనిచ్చేవారు కాదు. అందుకే నిరంతరం నామాన్ని పలికే రోహిల్లాను ఊరికే ఎందుకు తరిమి కొడతారు?134. 'మద్భక్తాయత్ర గాయంతి' ఎక్కడ నా భక్తులు భజన చేస్తారో అక్కడనేను ఉన్నిద్రస్థితిలో ఉంటాను అన్న భగవంతుని వచనాన్ని నిరూపించటానికి బాబా ఈ విధంగా అనుభవాన్ని చూపించారు.135.చద్దన్నమో, లేక ఎండిపోయిన రొట్టెనో అడుక్కు తినటం లేదా ఉపవాసముండే రోహిల్లాకు భార్య ఎక్కడిది?అది బాబా వద్దకు వెళ్ళటం ఏమిటి? 136.రోహిల్లా భికారి. పైసాకు కొఅగాని వాడు. అతనికి ఎక్కడి వివాహం?ఎక్కడి భార్య? ఇక బాబా బాలబ్రహ్మచారి. ఈ కథంతా మాయ. 137.రోహిల్లా కంఠశోషతో అరచినా సరే బాబా కల్మాను ఆనందంగా అహర్నిశలూ వింటారు. వారికి నిద్ర విష సమానం. 138. కల్మా యొక్క ప్రబోధవాణి ఎక్కడ? గ్రామస్థుల వ్యర్థమైన ఫిర్యాదు ఎక్కడ? వారిని దారిలో పెట్టటానికి బాబా ఇలా ప్రదర్శించారు.139.ఈ విధంగా నామస్మరణ యందు ప్రీతిగల రోహిల్లా సాంగత్యం నాకిష్టం అంటే నాకు నామస్మరణ ప్రీతి అన్న తమ అభిప్రాయాన్ని తెలియ చేశారు.140. దృశ్యం, ద్రష్ట దర్శనం ఇవి మూడు చైతన్యఘనమని భావించే వారికి బ్రాహ్మణుడైనా పఠాను అయినా ఉభయులూ సమానమే.141.ఒకరోజు మధ్యాహ్న హారతియైన తరువాత భక్తులు తమ వసతులకు బయలుదేరుతుండగా బాబా నోటి నుండి వెలువడిన మధుర వచనాలను వినండి.142. 'మీరెక్కడున్నా ఏం చేస్తున్నా మీ చర్యలన్నీ ఎప్పుడూ నాకు తెలుస్తూనే ఉంటాయని సదా గుర్తుంచుకోండి.143. ఇలా తెలియజేసిన నేను సర్వాంతర్యామిగా అందరి హృదయాల్లో ఉండేవాణ్ణి. అంతటా

చరించే వాణ్ణి. ఇలా నేను అందరికీ స్వామిని.144.లోపల బయట,నేను చరాచర సృష్టిలో అన్ని ప్రాణులలో నిండి మిగిలి ఉన్నాను. ఇదంతా పరమేశ్వరునిచే నియమింప బడినది. దీనిని నడిపించే సూత్రధారిని నేను.145.నేను సకల ప్రాణులకు తల్లిని. త్రిగుణాల సామ్యావస్థను. సకల ఇంద్రియాలను నడిపించే వాణ్ణి నేనే. సృష్టిస్థితిలయ కారకుణ్ణి నేనే.146.నాయందు శ్రద్ధ ఉన్నవారికి ఏ కష్టాలు ఉండవు. నన్ను మరచిపోయిన వారిని మాయ కొరడాతో కొడుతుంది.147.ఈ దృశ్య జగత్తు నా స్వరూపం. అంటే చీమ, దోమ, క్రిమికీటకం, రాజు పేద, స్థావరజంగమాలు ఈ జగత్తంతా సాయి యొక్క స్వరూపం.148.ఎంతటి గొప్ప సూచన.సాధువులకీ, పరమేశ్వరుడికీ భేదంలేదు. అభేద రూపంలో ఈచరాచర విశ్వాన్ని ఉద్ధరించడానికి వారు అవతరిస్తారు.149.గురు చరణాలలో లీనమవ్వాలంటే గురువు యొక్క గుణాలను గానం చేయాలి. లేదా గురుకథా కీర్తనలనుచేయాలి.లేదా భక్తితో శ్రవణం చేయాలి.150.సాధకులు వినే విషయంలో లీనమై పోయేలా శ్రవణం చేస్తే మనసనేది మాయమై చైతన్య ఘనుడు ప్రకటమౌతాడు.151.ప్రపంచంలో ఉంటున్నా సత్పురుషుల కథ చెవిన పడితే కించిత్తైనా ప్రయత్నం చేయకుండానే సహజంగా శుభం కలుగుతుంది.152.ఇక భక్తి భావంతో శ్రవణం చేస్తే ఎంత శ్రేయస్సు కలుగుతుందో శ్రోతలు తమ మంచి కోసం ఆలోచించాలి.153.శ్రవణంవల్ల గురుచరణాలలో ప్రేమ కలిగి క్రమంగా అత్యంత శ్రేష్ఠమైన సుఖం కలుగుతుంది. వేరే నిష్టానియమాలు లేకుండానే పరమ శ్రేయస్సు ప్రాప్తిస్తుంది.154.అందుకని మనసును ఇలా శ్రవణమనే నిర్బంధంలో ఉంచితే కథా శ్రవణంలో శ్రద్ధ అధికమౌతుంది. విషయబంధనాలు వాటంతట అవే విడిపోయి పరమానందం కలుగుతుంది.155.బాబా యొక్క మధురవాణిని విని ఇక ఇప్పటినుండి నరుల సేవను మాని గురుసేవలో ఉండాలని మనసులో నిర్ధారణ చేసుకున్నాను.156.కాని మనసులో తపన, అతనికి ఏదో

ఉద్యోగం లభిస్తుందన్న బాబా మాటజరుగుతుందా అని.157.బాబా మాట వ్యర్థమవటం ఎప్పుడూ జరగదు. మానవులకు సంబంధించిన సేవ లభించినా దాని వల్ల నాకు మంచి జరగదు.158.అణ్ణా తనంతటతాను నాగురించి బాబాను ప్రశ్నించాడు. నిజమే కాని అది నా కోరిక కాదు అనటానికి లేదు. అది ప్రారబ్ద భోగేచ్ఛకాదు.159.నా మనసులో కూడా సంసారం నిర్వహించటానికి సౌకర్యంగా ఒక ఉద్యోగం కావాలని ఉంది. సాయిబాబా వ్రేలితో బెల్లాన్ని చూపించి ఔషధాన్ని త్రాగించారు.160.నా భాగ్యం కొద్దీ బెల్లం ఆశతో ఆ ఔషధాన్ని త్రాగేశాను. అనుకోకుండానే ఉద్యోగం లభించింది. నేను ద్రవ్యాభిలాషతో దానిని స్వీకరించాను.161.బెల్లం మధురమే అయినా తినగా తినగా చివరకు మొహంమొత్తుతుంది.బాబా యొక్క ఉపదేశాలను ఆస్వాదించగా బాగా రుచిగా అనిపించాయి.162.ఉద్యోగం చిరస్థాయిగా ఉండేది కాదు. వచ్చిన దారే వెళ్ళిపోయింది. దాంతో శాశ్వత ఆనందాన్ని అనుభవించటానికి నన్ను బాబా అక్కడే కూర్చోబెట్టారు.163.ఈ చరాచరాలతో ఉన్న విశ్వం సాక్షాత్తు భగవత్స్వరూపమే. కాని, భగవంతుడు విశ్వానికి అతీతంగా ఉండే పరాత్పర పరమాత్మ.164. పరమేశ్వరుడు ప్రపంచం కంటే భిన్నుడు కాడు.కాని ప్రపంచం పరమేశ్వరునికంటే భిన్నం. జగత్తు ఉత్పన్నమైనప్పటి నుండి అందులో చేతనాచేతన వస్తువులున్నాయి.వాటన్నింటికి అధిష్టానం పరమేశ్వరుడు.165. భగవంతుని పూజాస్థానాలు ప్రతిమ స్థండిలాది ఎనిమిది రకాలు.అన్నిటి కంటే గురువు శ్రేష్ఠం,166.శ్రీకృష్ణుడు స్వయం పూర్ణబ్రహ్మ. అయినా కూడా గురువు సాందీపుల చరణాలను పట్టుకున్నాడు. 'సద్గురువును స్మరిస్తే నారాయణుడవైన నేను ప్రసన్నుడనౌతాను.167. నాకంటే సద్గురు స్తవనం నాకు వేయిరెట్లు ఇష్టం' అని అన్నారు. ఇలాంటి సద్గురువు యొక్క విశిష్టత, మహిమ గొప్పవి.168.గురుభజన యందు ఆసక్తిలేని వాడు నిజంగా అభాగ్యుడు, పాపి. జననమరణాలనే రాకపోకల కష్టాలను

అనుభవిస్తూ తన శ్రేయస్సును నాశనం చేసుకుంటాడు.169.జనన మరణాలు ఒకటి వెనుక ఒకటి మరల మరల ఎప్పుడూ తిరుగుతుంటాయి. కనుక ఈ కథాశ్రవణం చేసి మనలను ఉద్ధరించుకుందాం.170.సత్పురుషుని నోటి నుండి సహజంగా వచ్చిన విషయాలు అజ్ఞానాన్ని తొలగిస్తాయి.అవి అనేక కష్టాలనుండి దాటిస్తాయి.అందువల్ల వానిని భద్రంగా హృదయంలో సేకరించుకుందాం.171.ఎప్పుడు ఎటువంటి సమయం వస్తుందో, ఏమి సంభవిస్తుందో ఇదంతా అల్లామియా లీల. ప్రేమికులైన భక్తులు ప్రేక్షకులు.172.ఏ ప్రజ్ఞాబలం లేకుండానే సమర్థులైన సాయి సద్గురుని పొందటం దైవబలం అనుకోవాలా? ఇది కూడా వారి లీలే.173.ఈ గ్రంథం యొక్క ప్రయోజనాన్ని మరియు నాకు బాబా ధైర్య ప్రదానాన్ని చేయటం గురించి మనవి చేశాను.బాబా తెలియజేసిన అహంబ్రహ్మ గురించి మరియు తమ పూజను ఎలా చేయాలి అన్న విషయాన్ని గురించి సూచించటమయింది.174.ఇప్పుడు శ్రోతలు తరువాతి అధ్యాయంలో శిరిడీలో సమర్థసాయినాథుని అవతరణ ఎలా జరిగింది అన్న విషయాన్ని శ్రవణం చేయండి.175.అమాయకులు భావికులైన చిన్నా పెద్దా మీరంతా ఒక్క క్షణం ప్రపంచం నుండి బయటపడి అసాధారణమైన సాయి చరిత్రను వినండి.176.సాయి స్వయంగా ఏ వికారాలు లేని నిర్వికారిఅయినా అనేక పాత్రలనునటించిన అవతారి. మాయాకార్యాన్ని అనుసరించి ప్రాపంచికులవలె వ్యవహరిస్తారు.177. 'సమర్థసాయి' అన్న చిన్న మంత్రంతో వారి పవిత్ర పాదాలను ధ్యానం చేసే భక్తులను భవంనుండి విముక్తులను చేసే ఆ సూత్రధారి చరిత్ర పావనమైనది.178.ఇటువంటి పావనమైన సాయిచరిత్రను పఠించే వారి నోరు, వినేవారి చెవులు వారి అంతరంగం పవిత్రమౌతాయి.179.ప్రేమగా కథాశ్రవణం చేస్తే ప్రపంచ దుఃఖం హరించుకుని పోతుంది. సాయి కృపాఘనులు సంపూర్ణమైన శుద్ధజ్ఞానబోధను కురిపిస్తారు.180.బద్ధకం చంచల మనసు వాసనలు రసాస్వాదం ఇవి

శ్రవణంలోని అపాయాలు. ఈ అంతరాయాలను తొలగించుకుంటే శ్రవణం సుఖదాయకమౌతుంది.181. వ్రతాలు, ఉద్యాపనలు అవసరం లేదు. శరీరాలను శుష్కింపజేసే ఉపవాసాలు అవసరం లేదు. తీర్థయాత్రా పర్యటనలు అవసరం లేదు. చరిత్ర శ్రవణం ఒకటి చాలు.182. నిష్కపటమైన నిర్మలమైన ప్రేమ ఉండాలి. భక్తిలో ఉన్న మర్మాన్ని తెలుసుకోవాలి. అజ్ఞానం, భేదభావం నశించి పరమార్థం సహజంగా సిద్ధిస్తుంది.183. ఇతర సాధనలతో శ్రమపడనవసరం లేదు. ఈ సాయి చరిత్ర శ్రవణం చేసి, సంచితం మరియు క్రియమాణ కర్మలను ఏ మాత్రం మిగలకుండా చేసుకుందాం.184. కృపణుడు ఏ ఊళ్లో తిరుగుతున్నా అహర్నిశలూ అతని మనసులో దాచుకున్న ధనం కనిపించేలా సాయిబాబా మన మనసుల్లో ఎప్పుడూ ఉండాలి.185. స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో గ్రంథప్రయోజనం అనుజ్ఞాపనమను మూడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత - 4వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గత రెండు అధ్యాయాలలో, మంగళా చరణం మరియు ఈ గ్రంథ ప్రయోజనాన్ని గురించి చెప్పాను. గ్రంథకర్త ఖ్యాతి, గ్రంథానికి విషయానికి గల సంబంధాన్ని గూర్చి స్పష్టంగా వివరించడమైనది1. ఇప్పుడు ఈ సాయి సత్పురుషులు పృథ్విపై ఎందు నిమిత్తం అవతరించారు? ఏ కఠిన కార్యాన్ని సాధించటానికి ఈ భూలోకానికి వచ్చారు? 2. శ్రోతమహాశయులారా, మీ చరణధూళినైన నన్ను కరుణించి సావధానంగా వినండి అని మిమ్మల్ని వేడుకోవడంలో నాకు బిడియం లేదు.3.సత్పురుషుల చరిత్రలు ఎంతో మధురం. వానిలో ఈ సాయి కథామృతం మరింత మధురం. దీనిని సాయి యొక్క అనన్య భక్తులు సేవించి ఆనందభరితులవుతారు.4. బ్రాహ్మణులు ఆశ్రమ ధర్మాలను తమ వర్ణానికి సంబంధించిన నియమాలను అలక్ష్యం చేసినప్పుడు, శూద్రులు బ్రాహ్మణులై పోవాలనుకున్నప్పుడు, ధర్మాచారులను అపహాళన చేసి వారిని శిక్షించాలని అనుకున్నప్పుడు.5. ధర్మవచనాలను ఎవరూ పాటించనప్పుడు ఇంటింటా అందఱూ పండితులమని అనుకుంటునప్పుడు ఒకరిపై ఒకరు పెద్దరికాన్ని చెలాయిస్తున్నప్పుడు, ఒకరి మాట ఒకరు లక్ష్య పెట్టనప్పుడు,6.తిన తగనివానిని తింటూ, సేవించ తగనివానిని సేవిస్తూ, ఆచారవిచారాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తునప్పుడు, బ్రాహ్మణులు బహిరంగంగా మద్య మాంసాదులను ప్రత్యక్షంగా సేవిస్తున్నప్పుడు,7. ధర్మం ముసుగులో లోలోపల అత్యాచారాలను చేస్తున్నప్పుడు,

వీని కారణంగా ధార్మిక సాంప్రదాయాలలో ద్వేషం పెరిగిపోయి ప్రజలు కష్టాలతో బాధపడుతున్నప్పుడు,8. బ్రాహ్మణులకు స్నాన సంధ్యల యందు శ్రద్ధ లేనప్పుడు,కర్మనిష్ఠలు అనుష్ఠానాలను విసుక్కుంటున్నప్పుడు, యోగులకు జపతపధ్యానాదులపై అయిష్టత కలిగినప్పుడు సత్పురుషులు అవతరిస్తారు.9. జనులు ఐశ్వర్యం గౌరవం భార్యా పుత్రులు వీనినే సకల సుఖాలకు సాధనాలని తలచి పరమార్థచింతనకు విముఖులైనప్పుడు సత్పురుషులు అవతరిస్తారు.10.ధర్మానికి గ్లాని వాటిల్లి ప్రజలు శాశ్వతమైన శ్రేయప్రాప్తిని పోగొట్టుకొన్నప్పుడు ధర్మాన్ని జాగృతం చేయటానికి సత్పురుషులు సాకారులై వస్తారు.11.ప్రజలు ఆయురారోగ్య ఐశ్వర్యాలను పోగొట్టుకొని శిశ్నోదర పరాయణులై నీతి భ్రష్టులై తమ ఉద్ధరణను లక్ష్య పెట్టనప్పుడు సత్పురుషులు అవతరిస్తారు.12. వర్ణాశ్రమ ధర్మాలను రక్షించడానికి అధర్మాన్ని నశింప చేయటానికి దీనులను దుర్బలులను పేదలను సంరక్షించటానికి సత్పురుషులు అవనిపై అవతరిస్తారు.13.సత్పురుషులు సదా ముక్తులు. దీనోద్ధరణ యందే ఎల్లప్పుడూ ఉద్యుక్తులై ఉంటారు. వారి అవతరణ పరులకోసమే కాని తమ స్వార్థం కోసం కాదు.14. వారు ప్రవృత్తి ప్రవాహంలో కొట్టుకునే ప్రాపంచికులకు నివృత్తి అనే పునాదిపై పరమార్థ మందిరాన్ని నిర్మించి తమ సహజ గతితో భక్తులను ఉద్ధరిస్తారు.15. ధర్మ జాగృతిని, ధర్మ కార్యాలను చేసి, తమ అవతార కార్యాన్ని సాధిస్తారు. అది పరిపూర్తి కాగానే తమ అవతారాన్ని చాలిస్తారు.16. సకలజగదానందకరుడైన ప్రత్యగాత్మయే పరమేశ్వరుడు. ఆపరమేశ్వరుడే గురువు. అతడే సుఖకరుడైన శంకరుడు.17.అతడే నిరతిశయ ప్రేమాస్పదుడు. నిరంతరం అభేద స్వరూపుడు, దేశకాల వస్తు భేదాల నెరుగని వాడు, పరిచ్ఛేదాతీతుడు.18.పరాపశ్యంతి మధ్యమ వైఖరియను నాలుగు రకాల వాణి అతనిని వర్ణించలేక అలసిపోయింది. వేదాల చాతుర్యం ఇక్కడ పనికి రాదు. నేతి నేతి అంటూ అవి ఓడిపోయాయి.19.షడ్ శాస్త్రాలు,

షడ్ దర్శనాలు సిగ్గుపడిపోయాయి. పురాణాలు, హరికథలు అలసిపోయాయి. చివరకు కాయావాచా మనసా నమస్కారం చేసే సాధనే మిగిలింది.20.అత్యంత విచిత్రమైన లీలలుగల ఇటువంటి సాయి సత్పురుషుని పవిత్ర చరిత్రను విని చెవులు పావనమవుతాయి.21.సకలేంద్రియాలను నడిపించేది వారే. ఈ గ్రంథ రచనకు బుద్దిని ప్రసాదిస్తూ, అనాయాసంగా కథను క్రమబద్దంగా సూచించేది వారే.22.వారు అందరిలోని అంతర్యామి. బాహ్యాభ్యంతర సర్వగామి. వ్యర్థంగా నేనెందుకు చింతించాలి.23.వారి ఒక్కొక్క సుగుణాన్ని తలచుకొంటే మనోవృత్తి స్తంభించిపోతుంది. మాటలు ఎలా వర్ణించగలవు? వారిని వర్ణించటానికి దృఢ మౌనమే మేలు.24. పువ్వుల సువాసనను ముక్కుతో గ్రహిస్తాం. శీతోష్ణ స్పర్శలను చర్మంతో అనుభవిస్తాం. సౌందర్యాన్ని నయనాలతో తిలకిస్తాం. ఇంద్రియాలు వాని సుఖాలను అవే అనుభవిస్తాయి.25.జిహ్వ పంచదార యొక్క మాధుర్యాన్ని ఆస్వాదించగలదు గాని ఆ అనుభవాన్ని వర్ణించలేదు. అట్లే సాయి యొక్క గుణాలను వ్యాఖ్యానించటం నాకు అశక్యం.26.కాని సద్గురువు తలచుకొన్నప్పుడు వారే ప్రేరణ కలిగించి భక్తులద్వారా అనిర్వచనీయమైన దానిని నిర్వచించేలా చేస్తారు.27.ఇది కేవలం శిష్టాచారంకోసం చెప్పిన మాట కాదు. మనసులో నుండి వెడలినమాట. అందువల్ల శ్రద్దగా ఆలకించండని ప్రార్థిస్తున్నాను.28.గాణగాపురం, నరసింహవాడి, ఔదుంబర్, భిల్లవడి వలనే పవిత్ర గోదావరీ తీరాన ప్రసిద్ధమైన శిరిడీ క్షేత్రంఉంది.29.గోదావరి యొక్క పవిత్ర తీరం, గోదావరి యొక్క పవిత్రమైన నీరు, గోదావరి యొక్క పవిత్రమైన శీతల సమీరాలు, ఇవి భవతిమిరనాశకాలు.30. అఖిల జగత్తులో గోదావరి మహాత్మ్యం ప్రఖ్యాతి చెందినది.ఒకరి కంటే ఒకరు ఘనులైన సాధుసత్పురుష శ్రేష్ఠులు ఇక్కడ ప్రకటమయ్యారు.31.ఈ గోమతీ తీరంలో అనేక తీర్థాలున్నాయి. వానిలోని జలాలు పాపాలను నశింపచేస్తాయి.

గోదావరి నీటిలో స్నానం చేసినా, ఆ నీరు పానం చేసినా భవరోగాలు తొలగిపోతాయని పురాణాలలో వర్ణింపబడి ఉంది.32.ఈ గోదావరి అహమ్మద్ నగర్ జిల్లాలో కోపర్ గాం తాలుకాలో కోపర్‌గాం సమీపాన శిరిడీ మార్గాన్ని సూచిస్తుంది.33.గోదావరిని దాటాక, అవతలి తీరాన సుమారు మూడుకోసుల దూరాన నీమ్‌గాం అనే ఊరిలోనికి టాంగా ప్రవేశించగానే మన ఎదుట శిరిడి ప్రత్యక్షమవుతుంది.34.నివృత్తి, జ్ఞానదేవ్, ముక్తాబాయి, నామదేవు, జనాబాయి, గోరాగోణాఈ, తుకారం, నరహరి, నరసీభాయి,సజ్జనకసాయి,సావతమాలి.35. మొదలగు సత్పురుషులెందరో పూర్వం ఉన్నారు. ఇప్పుడు కూడా అనేక మంది ఉన్నారు. వీరంతా వసుధైవ కుటుంబం. జగత్తంతా మనదే అని తలచేవారు. ప్రపంచ బాధలలో దుఃఖ పడేవారికి వీరే ఆధారం.36. సాధువులలో శ్రేష్ఠుడైన రామదాసు గోదావరీ తీరాన్ని వదిలి జగదోద్ధారణార్థం కృష్ణానదీ తీరాన ప్రకటమయ్యారు.37. అట్లే శిరిడీ యొక్క మహా పుణ్యం కొద్దీ శ్రీ సాయి యోగీశ్వరులు జగాన్ని ఉద్ధరించటానికి గోదావరీ సమీపాన అవతరించారు.38. పరశువేది ఇనుమును బంగారంగా మారుస్తుంది.సాధువులను పరశువేదితో పోలుస్తారు.కాని సాధువులు భక్తులకు తమ రూపాన్నే ప్రసాదిస్తారు. అలా సత్పురుషులు అలౌకికమైన కృత్యాలను చేస్తారు.39.భేదభావాలను విడచి స్థిరచరాలన్నింటిలో బ్రహ్మాస్వరూపమే మనలో కూడా కనిపించే ఈ విశ్వంయొక్క అఖండ వైభవం బ్రహ్మదే,40. అని ఇలా విశ్వమంతటా కేవలం నేనే ఉన్నాను అన్న యదార్థమైన జ్ఞానం కలిగితే ఆ మధురమైన సుఖాన్ని ఎలా వర్ణించగలం?సాధకులు పరమానందాన్ని పొందుతారు.41.విశ్వమంతటా నేనే అన్న జ్ఞానం కలిగాక ఎవరితో వైరం పెట్టుకోగలం? నాకంటే అన్యులు అసలుఎవరూ లేరని తెలిశాకఎవరి గురించిఅయినా ఎందుకు భయపడతాము?42.మంగళవేడలో దామాజీ, సజ్జనగడ్‌లో సమర్థరామదాసు, నరసింహావాడిలో

నరసింహసరస్వతివలె శిరిడీలో సాయినాథుడు వెలిసారు.43. వీరు పరమ దుష్కరము, దుస్తరమైన మాయా ప్రపంచాన్ని జయించిన వారు. మూర్తీభవించిన జ్ఞానభండారం. శాంతి వారి భూషణం.44. వైష్ణవులకు వారు పుట్టినిల్లు. ఉదారులలో ఉదారులు. పరమార్థ వితరణలో దాన కర్ణుని అవతారం. సారాలలో సారం ఈ సాయి.45.నశ్వరమైన వానియందు వారికి ప్రీతిలేదు.వారి మనోవృత్తి ఆత్మ స్వరూపంలో విలీనమై ఉంటుంది. పరమప్రాప్తి యందే వారి లక్ష్యం. అట్టి వారి స్థితిని ఎలా వర్ణించగలం?.46. ఐహికవిషయాలలో ఉత్కర్షాపకర్షలు లేక పరలోక విషయాలలో హర్షశోకాలకు చలించక వారి అంతఃకరణం అద్దంవలె నిర్మలంగా ఉంటుంది. వారి వాక్కునుండి ఎల్లప్పుడూ అమృతం వర్షిస్తుంది.47.ధనికులూ పేదలూ, దీనులు, బలహీనులు అందరి పట్లా వారి దృష్టి సమానం.వారు మానావమానాలకు అతీతులు.సర్వజీవులలోను నిండి ఉన్న భగవత్ స్వరూపులు.48.వారు జనులతో తిరుగుతారు, మాట్లాడుతారు. దేవదాసీల నాట్యాన్ని అవలోకిస్తారు. గజల్ గానం వింటూ ఊగుతుంటారు. కాని వారి సమాధ్యవస్థ కించిత్తైనా భంగం కాదు.49.అల్లా నామం వారి ముద్ర. ప్రపంచం మేలుకొన్నప్పుడు వారు నిద్రిస్తారు. ప్రపంచం నిద్రపోతున్నప్పుడు వారు మేలుకొని ఉంటారు. వారి అంతఃకరణం శాంత సముద్రం వంటిది.50.వారు ఏ ఆశ్రమానికి చెందినవారో నిశ్చయంగా తెలియదు. ఆచారవ్యవహారాల నియమాలను పాటించరు. కూర్చున్న చోటునుండి చాలావరకు కదలకపోయినా వారికి జరుగుతున్న వ్యవహారాలన్నీ తెలుస్తాయి.51.దర్బారులో వారు పైకి ఆర్భాటంగా కనిపిస్తూ అనేక విషయాల గురించి మాట్లాడటం నిత్యం జరిగేదే అయినా మౌనాన్ని వదలరు.52. మసీదులో గోడకు ఆనుకొని నిలబడతారు. ఉదయం, మధ్యాహ్నం లెండీ తోటకో, లేదా చావడికో వెళ్లుతారు. కాని వారు అఖండ ఆత్మస్థితియందే ఉంటారు.53.నేను ఏ జన్మలో ఏ సమయంలో ఏ సందర్భంలో ఏ తపం చేశానో

ఎఱుగను. సాయిబాబా నన్ను తమ ఒడిలోనికి తీసుకున్నారు. 54. ఇది నా తపోఫలమని అనుకుందామా అంటే, నేను జన్మతః దుర్మార్గుణ్ణి. అయినా సాయి దీనవత్సలుడు. ఇది వారి తరగని కృప. 55. వారు సిద్దకోటిలోని వారైనా సాధకునివలె ప్రవర్తించే వారు. నిరభిమానంగా అత్యంత వినయంతో అందరి మనసులను రంజింపచేసేవారు. 56. ఏకనాథ్ పైఠనుని జ్ఞానదేవ్ ఆళందిని పావనం చేసినట్లుగా సాయిబాబా శిరిడీ క్షేత్రాన్ని మహిమా సంపన్నం చేశారు. 57. అనుదినం అనాయాసంగా బాబా యొక్క పాదాలను ముద్దుపెట్టుకొని వారి పాదధూళిని మస్తకంపై ధరించిన శిరిడీలోని తృణపాషాణాలు ధన్యం. 58. ఆ శిరిడీయే మన పండరీపురం. శిరిడీయే పూరీ జగన్నాథం మరియు ద్వారకానగరం. శిరిడీయే గయ, కాశీ విశ్వేశ్వరుని వారణాసి. రామేశ్వరం కూడా శిరిడీయే. 59. శిరిడీయే మన బదరీ కేదారం, నాసిక్ లోని త్రయంబకం. శిరిడీయే మహాకాళేశ్వరుని ఉజ్జయిని మరియు మహాబలేశ్వరుని గోకర్ణం. 60. శిరిడీలో సాయితో సమాగమమే మనకు ఆగమనిగమాలు. ప్రపంచంలోని బాధలన్నిటినీ ఉపశమింపచేసేది శిరిడీయే. పరమార్థానికి అత్యంత సుగమమైనది శిరిడీయే. 61. సాయి సమర్థుని దర్శనమే మనకు యోగసాధనం. వారితో సంభాషణ మన పాపప్రక్షాళనం. 62. వారి చరణసంవాహనే మనకు త్రివేణి సంగమ స్నానం. వారి చరణ తీర్థసేవనమే విషయవాసనల నిర్మూలనం. 63. వారి ఆజ్ఞ మనకు వేద వచనం. వారి విభూతి ప్రసాదాల సేవనం అన్ని విధాలా పుణ్యపావనం. 64. సాయియే మనకు పరబ్రహ్మ. సాయియే మనకు పరమ పరమార్థం. సాయియే శ్రీకృష్ణుడు, సాయియే శ్రీరాముడు. మన శాశ్వత ఆశ్రయం కూడా శ్రీసాయియే. 65. సాయి స్వయంగా ద్వంద్వాతీతం. సదాబ్రహ్మ అయి సుఖంలో పొంగిపోక దుఃఖంలో క్రుంగిపోకుండా వారు ఎల్లప్పుడూ స్వస్వరూపంలో స్థితులై ఉంటారు. 66. శిరిడీ కేవలం కేంద్రస్థానంగా ఉన్నా, పంజాబు, కలకత్తా, హిందూస్థానం, గుజరాత్, డక్కన్,

కర్ణాటకలతో బాబా యొక్క క్షేత్రం అతివిస్తీర్ణం.67.శిరిడీలోని సమాధియే సాధువులందరికి కూడలి. అక్కడికి చేరుకునే మార్గంలో అడుగు అడుగున జీవుల గ్రంథులు విడిపోతాయి.68.సమాధి దర్శనం చేసుకున్నంత మాత్రాన జన్మ సార్థకమవుతుంది.ఇక వారి సేవలో జీవితాన్ని గడిపిన వారి భాగ్యాన్ని ఎంతని వర్ణించను?.69.మసీదుపైన చావడిపైన అందమైన పతాకాలు భక్తులను చేతులతో ఆహ్వానిస్తున్నట్లుగా ఆకాశాన ఎగురుతుంటాయి.70.బాబా మహాత్ములని వారి కీర్తి ప్రతిష్ఠలు ఊరూరా వ్యాపించాయి. కొందఱు నిజమైన శ్రద్ధతో వారికి మ్రొక్కుకుంటారు. కొందఱు దర్శనంతో సంతుష్టులవుతారు.71.ఎవరి మనసు ఎలా ఉన్నా సరే నిర్మలంగా గాని కుటిల బుద్ధిగాని వారి దర్శన మాత్రంతో మనసు శాంతిస్తుంది. అందుచేత జనులు ఆశ్చర్యపోతారు.72.పండరిపురంలో విఠల రఖుమాబాయి దర్శనంలోని ఆనందానుభవాన్ని,ఆ విఠల దర్శనాన్ని సాయిబాబా శిరిడీలో ప్రసాదిస్తారు.73. ఇది ఎవరికైనా అతిశయోక్తి అని అనిపిస్తే, విఠలునియందు దృఢమైన భక్తి కలిగిన గౌలిబువా మాటను వింటే మీ సందేహం తీరుతుంది.74. బువా పండరీపురానికి వెళ్ళే యాత్రికుడు ప్రతి సంవత్సరం నియమంగా పండరీపురానికి వెళ్ళేటప్పుడు శిరిడీకి కూడా వచ్చేవాడు. అతనికి బాబాపై అమితమైన ప్రేమ.75.అతని వెంట తోడుగా ఒక శిష్యుడు, ఒక గాడిద ఉండేవి. అతని జిహ్వ ఎప్పుడూ రామకృష్ణ హరి అని నామాన్ని పలికేది.76.అతని వయస్సు 95 సంవత్సరాలు. గంగాతీరంలో చాతుర్మాసాలు ఉండి మిగతా ఎనిమిది నెలలు పండరీపురంలో ఉండేవాడు. ప్రతి ఏడు బాబాను దర్శించే వాడు. 77. బాబా వైపు తదేకంగా చూస్తూ సాక్షాత్ కరుణాళువు, అనాథనాథుడైన పండరీనాథుడు ఇతడే అని వినయంగా అనేవాడు.78.జరీ అంచు ధోవతి కట్టుకోగానే ఎవరైనా సాధువులై పోగలరా? బాగా శ్రమపడి ఎముకలు పూసలుగా, రక్తం నీరుగా మారేలా కష్టపడాలి.79.ఏ ప్రయాసా లేకుండా దేవుడై పోగలరా?

పిరే ప్రత్యక్షపండరీనాథుడు. ప్రపంచం పిచ్చిది. ఈ దృఢమైన భావంతో దైవత్వాన్ని గ్రహించండి.80.పండరీనాథుని యందు భక్తి ఉన్న భగవత్ భక్తుడు ఇలా చెప్పగా ఇక పామరుణ్ణయిన నా అనుభవ మెంతటిది? శ్రోతలు తమ అనుభవాలతో గ్రహించాలి.81.సాయిబాబాకు నామస్మరణ యందు మిక్కిలి ప్రీతి. అనవరతం 'అల్లామాలిక్' అని అంటుండేవారు. రాత్రింబవళ్లూ తమ సముఖంలో నామసప్తాహాలను చేయించేవారు.82.ఒకసారి దాసగణుకు నామసప్తాహం చేయమని ఆజ్ఞాపించారు. దాసగణు వారితో, చేస్తాను గాని విఠలుడు సాక్షాత్కరించాలి మరి అని అన్నాడు.83.అప్పుడు బాబా తమ చేతిని గుండెపై వేసుకొని దాసగణుతో భక్తి భావం ఉంటే విఠలుడు తప్పక ప్రకటమౌతాడు.84.డాకురునాథుని ఢంకపురి, విఠలుని పండరీపురం, శ్రీకృష్ణుని ద్వారకా నగరం ఇదే. చూడటానికి ఎక్కడో దూరానికి వెళ్ళే అవసరం లేదు.85.విఠలుడు ఎక్కడో వేరే ఏకాంతస్థలం నుండి లేచి రావాలా! భక్తి ప్రేమలు ఆతురత ఉంటే ఇక్కడే ప్రకటమౌతాడు.86.పుండలీకుడు తల్లిదండ్రుల సేవ చేసి దేవాది దేవుణ్ణి మోహితుణ్ణి చేసి వశపరచుకున్నాడు. అతని భక్తి భావానికి భగవంతుడు ఇటుకపైన నిలుచుండి పోయాడు అని అన్నారు.87.నామసప్తాహం సమాప్తి కాగానే దాసగణునకు శిరిడీలో విఠలుని దర్శనమైందని అంటారు. బాబా వచనాలు అనుభవంలోకి వచ్చాయి.88.ఒకసారి కాకాసాహేబు దీక్షితు ప్రాతఃకాలం తన నియమానుసారం స్నానం అయ్యాక ఆసనంలో ధ్యాన మగ్నుడై ఉండగా అతనికి విఠలుని దర్శనమైంది. 89. తరువాత బాబా దర్శనానికి వెళ్ళగా బాబా 'విఠల్ పటేలు వచ్చాడుకదా అతనిని కలిశావా' అని విచిత్రంగా ప్రశ్నించారు.90.ఆ విఠలుడు పారుబోతు. ఒక్క క్షణమైనా అలక్ష్యం చేసి, దృష్టిని మరలిస్తే పారిపోతాడు. గట్టిగా మేకు కొట్టి అతనిని కదలకుండా ఉంచు అని అన్నారు'.91.ఇది ప్రాతఃకాలం జరిగింది. మధ్యాహ్నం మరో అనుభవం విఠలుని దర్శనవైభవం.92.ఎవరో

వేరే ఊరివారు పండరీపుర పాతిక విఠలుని చిత్రపటాలు అమ్ముకోవాలని వచ్చారు.93. దీక్షితుకు ఉదయం ధ్యానంలో కనిపించినటు వంటి ఫోటోలు.పూర్తిగా అదే రూపం. వాటిని చూచి అతడు ఆశ్చర్యపోయాడు.బాబా మాటలు గుర్తుకు తెచ్చుకున్నాడు.94.అమ్ముకునే వానికి డబ్బిచ్చి ఎంతో ప్రేమతో ఒక పటాన్ని కొనుక్కుని భక్తిగా పూజలో పెట్టుకున్నాడు.95.విఠలుని పూజయందు సాయికి గల ఆదరణను కనబరచే శ్రవణమనోహరమైన మరొక అందమైన కథను ఆనందంగా వినండి.96.భగవంతరావ్ క్షీరసాగర్ యొక్క తండ్రి విఠలుని భక్త శ్రేష్ఠుడు. పంఢరీపురయాత్ర తరచూ చేసేవాడు.97.వారి ఇంట్లో విఠలుని విగ్రహాముంది. తండ్రి స్వర్గస్తుడవగానే పూజార్చనలు నైవేద్య సమర్పణలు ఆగిపోయాయి. శ్రాద్ధం కూడా ఆగిపోయింది.98.పంఢరి యాత్రగురించి మాటే లేదు. ఈ భగవంతరావు శిరిడీకి వచ్చినప్పుడు బాబా అతని తండ్రికి గుర్తు చేస్తూ' ఇతని తండ్రి నా స్నేహితుడు.99. ఆనా స్నేహితుని కుమారుడే ఇతడు. అందువల్లనే నేనితనిని ఇక్కడకు లాక్కుని వచ్చాను. ఇతడు ఎప్పుడూ నైవేద్యం పెట్టకుండా నన్ను పస్తులుంచుతున్నాడు.100.విఠలుని కూడా పస్తులుంచాడు. అందుకే ఇతనిని శిరిడీకి తీసుకుని వచ్చాను. ఇప్పుడు ఇతనికి గుర్తు తెచ్చి మరల ఇతడు పూజ ప్రారంభించేలా చేస్తాను' అని చెప్పారు. 101.ఒకసారి ఒక విశేషమైన పర్వదినాన దాసగణుకు ప్రయాగతీర్థంలో స్నానం చేయాలన్న కోరిక కలిగింది. బాబా అనుమతి కోసం వారి వద్దకు వచ్చాడు.102.అతనితో బాబా దానికోసం అంత దూరం వెళ్ళవలసిన అవసరం లేదు. ఇదే మన ప్రయాగ తీర్థం.నీ మనసులో దృఢమైన విశ్వాసముంచు అని చెప్పారు.103. నిజంగా ఎంతటి ఆశ్చర్యకరమైన విషయం. దాసగణు బాబా చరణాలపై శిరసునుంచగానే వారి రెండు బొటన వేళ్ళనుండి గంగా యమునల నీరు ప్రవహించింది.104.ఆ చమత్కారాన్ని చూచి, దాసగణు గగుర్పాటు చెందాడు.బాబా యొక్క

అనుగ్రహానికి అతని కళ్ళనుండి అశ్రుధారలు కారాయి.105. వైఖరికి స్ఫురణ వచ్చింది. అతనిలో ప్రేమ ఉప్పొంగి బాబా యొక్క అఘటితలీలను, అగాధశక్తిని వర్ణించి తృప్తి చెందాడు 106. దాసగణుని ఈ మధుర రచనలోని ప్రాసాదిక పదాలకూర్పును శ్రోతలకు తెలియజేసి వారి కుతూహలాన్ని తీరుస్తాను. 107. పదం–సద్గురుదేవా ! మీ యొక్క శక్తి అగాధం. మీ లీల అమోఘం. దయామయా! మీరు అజ్ఞానులైన జీవులను భవబంధాల నుండి తరింపజేసే నౌక. వేణుమాధవుడవై మీ చరణ ద్వయాలను ప్రయాగ చేసి ఉభయ అంగుష్ఠాల నుండి గంగా యమునల ప్రవాహాన్ని చూపారు.1. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల త్రిగుణాత్మక మూర్తిఅయిన మీరు, సాయి సమర్థులై భూమిపై విహరిస్తున్నారు.2. ఒకప్పుడు బ్రహ్మవలె జ్ఞానాన్ని బోధిస్తారు. ఒక్కొక్కప్పుడు తమోగుణంతో రుద్రరూపం ధరిస్తారు.3. మరొకప్పుడు శ్రీకృష్ణునివలె బాల లీలలను ప్రదర్శిస్తారు. అప్పుడప్పుడు భక్తుల మనసు అనే సరోవరంలో హంసవలె విహరిస్తారు.4. మిమ్ము యవనులని అందునా మీకు చందనమంటే ప్రీతి. హిందువులని అందునా మీరెప్పుడూ మసీదులో సుఖంగా ఉంటారు.5. శ్రీ మంతులని అందునా! భిక్షాటన చేస్తారు. పోనీ ఫకీరు అని అందునా, దానంలో కుబేరుణ్ణి లజ్జితుణ్ణి చేస్తారు.6. మీ నివాసం మసీదులో. అక్కడ భక్తులకు విభూతి ప్రసాదించటానికై ధునిలో అహర్నిశలూ, అగ్ని ప్రజ్వరిల్లుతుంటుంది.7. భక్తులు ఉదయం నుండి మీ పూజలు చేస్తారు. మధ్యాహ్నం సూర్యుడు తలపైకి వచ్చినప్పుడు మీకు హారతి ఇస్తారు.8. భక్తులు పార్షదగణం వలె నలువైపులా నిలబడి మీకు వీవనలు వింజామరలు వీస్తారు.9. సన్నాయి, ఢోలు ఘంట బాగా మ్రోగుతాయి. దండధరులు పట్టీని ధరించి ద్వారం వద్ద

జయజయ ధ్వనులు పలుకుతారు.10.హారతి సమయంలో దివ్యాసనంలో మీరు శ్రీవిష్ణువులా కనిపిస్తారు. సాయంకాలం ధుని ఎదుట కూర్చొని మదనాంతకుడైన పరమ శివునిలా కనిపిస్తారు.11. ఈ విధంగా ప్రతిరోజూ మీవద్ద మాకు త్రిమూర్తుల లీలలు అనుభవమౌతున్నాయి.12. అయినా ఈ మనసు ఇంకా విచ్చలవిడిగా తిరుగుతుంది. దీనిని స్థిరంగా ఉంచమని వేడుకుంటున్నాను.13. నేను అధమాధముణ్ణి. మహా పాతకుణ్ణి మీ చరణాల వద్దకు శరణుజొచ్చి వచ్చాను. గురుదేవా! ఈ దాసగణుని త్రితాపాలను నివారించండి.14. భయంకరమైన తమ పాప ప్రక్షాళనకై ప్రజలు గంగవద్దకు వెళ్లుతారు. అయితే తన పాపాలను తొలగించుకోవటానికి గంగ సత్పురుషుల చరణాలను ఆశ్రయించ వలసి ఉంటుంది.108. అందు వలన ఈ సాయి సత్పురుషుని పవిత్ర చరణాలను వదలి గంగా గోదావరి తీర్థయాత్రలకు వెళ్ళవలసిన అవసరం లేదు. సాయి యొక్క మధుర చరిత్రను వారి స్తోత్రాన్ని భక్తిగా వినండి.109. భాగ్యవశాత్తు భీమారథి నదిలో గోణాయికి నామదేవు, భాగీరథీ నదిలో ముత్యపు చిప్పలో తమాలుకు కబీరు లభించారు.110. అట్లే శ్రీ సాయిబాబా పదహారు ఏళ్ళ తరుణ వయసులో, మొదట శిరిడీ గ్రామంలోని వేపచెట్టు క్రింద భక్తుల కొరకు ప్రకటమయ్యారు.111. అప్పటికే వారు బ్రహ్మజ్ఞాని. వారికి స్వప్న మందైనా విషయవాసనలు లేవు. వారు మాయను తన్ని తరిమేశారు. ముక్తి వారి చరణాలలో విలీనమైపోయింది. 112. వారు ఏ దేశంలో ఏ పవిత్ర వంశంలో ఏ తల్లిదండ్రుల గర్భాన జన్మించారో ఎవ్వరికీ తెలియదు.113. వారి పూర్వచరిత్రను కూడా ఎవరూ ఎఱుగరు. వారి తల్లిదండ్రులు ఎవరు అని అడిగి అడిగి అంతా అలసి పోయారే కాని వారి వివరాలు ఎవరికీ తెలియలేదు.114. వారు తల్లిదండ్రులను, ఆప్తులను సకల సంసారాన్ని జాతిమతాలను, ప్రపంచ వ్యవహారాలను త్యజించి ప్రజల హితార్థం శిరిడీలో ప్రకటమయ్యారు. 115. శిరిడీలోని

ఒక వృద్ధ నారి నానా చోపదార్ యొక్క తల్లి సాయిబాబా చరిత్రలోని విశేషాన్ని చెప్పింది.116.వారు ప్రథమంగా అత్యంత అందమైన బాలునిగా వేపచెట్టు క్రింద స్థిరాసనంలో కనిపించారు.117.ఆ బాలుని సుందర రూపం చూచి ప్రజలు అత్యంత ఆశ్చర్యపడ్డారు. కోమలమైన చిన్న వయస్సులో ఎండను చలిని సమానంగా సహించగల కఠిన తపస్సులో ఉన్నారు.118.వారి బాల్య స్థితిని చూచి గ్రామస్థులంతా ఆశ్చర్యపోయారు. ఆ బాలుని దర్శనార్థం జనం ఎక్కడెక్కడి నుండో వచ్చేవారు.119.అతనికి పగలు ఎవరి సాంగత్యం లేదు. రాత్రి ఎవరి భయం లేదు. ఈ బాలమూర్తి ఎక్కడినుండి వచ్చాడా అని అందరికీ ఆశ్చర్యం. 120.అత్యంత ఆకర్షణీయమైన అతని రూపు రేఖలను చూస్తుంటే హృదయంలో ప్రేమ ఉప్పొంగేది. అహర్నిశలు వేప చెట్టువద్దే గాని ఎవరి ఇల్లు వాకిలి ఎఱుగరు. 121. మనోహరమైన రూపంలో ఉన్న ఆ పసిబాలుడు పగలు రాత్రి ఆరు బయట ఎలా ఉండగలుగుతున్నాడా అని అందరికీ ఆశ్చర్యం.122. పైకి బాలుని వలె కనిపించినా అతని చర్యలు అందరికీ ఆశ్చర్యం కలిగించేలా గొప్ప వారికంటే కూడా గొప్పగా ఉండేవి. అతడు మూర్తీభవించిన వైరాగ్యం యొక్క పూర్ణావతారం.123. ఒకరోజు ఒక విచిత్రం జరిగింది. ఇద్దరి ముగ్గురికి ఖండోబా ఆవేశమై వారు ఊగుతుంటే జనం వారిని ఇలా అడిగారు. 124. 'దేవా! ఖండోబా! ఇతడు ఏ భాగ్యవంతుల బిడ్డ? ఎక్కడినుండి ఇక్కడికి వచ్చాడు? నువ్వైనా శోధించి తెలియజెయ్యి' అని ప్రశ్నించారు.125. ఖండోబాదేవుడు, 'వెళ్ళి గునపం తెచ్చి నేను చూపించిన స్థలంలో త్రవ్వండి. ఈ బాలుని వివరాలు తెలుస్తాయి' అని చెప్పాడు.126. అప్పుడు ఆ గ్రామ శివారులలో వేపచెట్టు క్రింద గునపంతో త్రవ్వగా అక్కడ ఇటుకలు కనిపించాయి.127. ఆ ఇటుకల వరసను తొలగించాక రాతిబండ కనిపించింది. దానిని ప్రక్కకు జరపగా ఒక సొరంగం దాని లోపల వెలుగుతున్న నాలుగు ప్రమిదలు కనిపించాయి.128.సున్నం

గచ్చుతో నిర్మించిన ఆ భూగృహంలో గోముఖం, పీట, అందమైన మాలలు ఉన్నాయి. ఈ స్థలంలో ఈ బాలుడు పండ్రెండు సంవత్సరాలు తపస్సు చేశాడని ఖండోబా దేవుడు చెప్పాడు.129.జనమంతా ఆశ్చర్యపోయి ఆ బాలుని గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నించారు. కాని ఆ బాలుడు సంబంధం లేని కథనే చెప్పాడు.130.'ఇది మా గురువు యొక్క స్థానం. అతి పవిత్రమైన నా ప్రదేశం.నా మాటవిని దీనిని ఇట్లే భద్రపరచండి'అని చెప్పాడు.131.అలా బాబా చెప్పిన దాన్ని వారు విన్నారు. బాబా సంబంధం లేని కథను చెప్పారు అని నా నాలుక ఎలా అంటుంది? 132. నాకు ఆశ్చర్యం కలిగింది. బాబా విషయంలో ఇలాంటి అవగాహన ఏమిటి? కాని ఇప్పుడు నాకు అర్థమైంది, అది వినోదం అయి ఉంటుంది అని.133.మొదటినుండి బాబా వినోద ప్రియులు. ఈ భూగృహం వారి ఆలయమే అయి ఉండవచ్చు. అయినా గురువుదని చెప్పితే పోయేదేముంది? తన మహత్మ్యం ఏం తగ్గిపోతుంది అని అలా చెప్పి ఉంటారు.134. తరువాత బాబా ఆజ్ఞానుసారం అది బాబా గురుస్థానమని మునుపటివలనే ఇటుకలను పేర్చి ఆ భూగృహాన్ని, సారంగాన్ని మూసివేశారు.135.బాబాకు అశ్వత్థ, ఔదుంబర వృక్షాలవలె ఆ వేపచెట్టుపై అత్యంత ప్రీతి అత్యంత గౌరవం కూడాను.136.శిరిడీ గ్రామంలోని మహల్సాపతి మొదలైన వృద్ధులు బాబాయొక్క గురువుగారి సమాధి స్థానమని అక్కడ వందనం చేసేవారు.137.ఆ సమాధి సన్నిధిలో బాబా పండ్రెండు సంవత్సరాలు మౌనంగా తపస్సు చేశారన్న వార్త ప్రజలలో ప్రసిద్ధి చెందింది.138.ఇక్కడ వేపచెట్టుతో సహా సమాధికి నలువైపులా ఉన్న స్థలాన్ని బాబా భక్తుడు సాతే కొని భవనాన్ని నిర్మించాడు.139.ఈ భవనం ఒక్కటే వచ్చేపోయే యాత్రికులకు అక్కడ ఉన్న వసతి గృహం.140. సాతే వేపచెట్టు చుట్టూ అరుగూ, దక్షిణోత్తరంగా భవనాన్నీ నిర్మించాడు. ఉత్తరాన మెట్లు కట్టుతుండగా ఈ భూగృహం కనిపించింది.141.మెట్ల క్రింద దక్షిణాభిముఖాన ఒక చక్కటి గూడు ఉంది.

దాని ఎదుట అరుగు మీద భక్తులు ఉత్తరాభి ముఖంగా కూర్చుంటారు.142. గురువారాలు శుక్రవారాలు సూర్యుడు అస్తమించే సమయంలో అక్కడ అలికి శుభ్రం చేసి సాంబ్రాణి ధూపంవేస్తే శ్రీహరి సుఖాలను ప్రసాదిస్తాడు. .143. ఇది నిజమేనా అతిశయోక్తి కాదు కదా అని శ్రోతల మనసులలో సంశయం కలుగుతుంది. ఇవి సాయి నోటి నుండి వచ్చిన మాటలు. ఇవి నా చెవులతో విన్న మాటలు,144. ఇవి నేను కల్పించినవి కావు. అందుచేత అణుమాత్రమైనా సందేహించకండి. ఈ మాటలను ప్రత్యక్షంగా విన్నవారు ఈ నాటికీ ఉన్నారు.145. అటు తరువాత దీక్షితు భవనం నిర్మాణమైంది. దానివలన భక్తులు బస చేయటానికి ప్రశస్తమైన సదుపాయం కలిగింది. తరువాత అతి తక్కువ వ్యవధిలోనే అక్కడ ఒక రాతి భవనం కూడా నిర్మాణమైంది.146. భక్తి శ్రద్ధలు మూర్తీభవించినట్లుగా దీక్షితు మొదటి నుండి పుణ్య కార్యాలలో కీర్తి గడించినవాడు. ఇంగ్లాండుకు ప్రయాణమై వెళ్ళినప్పుడు అక్కడ పారమార్థిక బీజంనాటుకున్నాడు.147. దీనిని విన్న శ్రోతలకు సంశయం కలగటం సహజం. మధుర, కాశీ, ద్వారక వంటి పుణ్యక్షేత్రాలుకాక ధర్మ బాహ్యమైన ఆంగ్లేయుల భూమి పరమార్థదాయకం ఎలా అయింది?148. అని శ్రోతలకు సంశయం కలగటం సహజం. దాన్ని పోగొట్టుకుంటే కౌతుకం కలుగుతుంది ఇక్కడ కొంచెం విషయం మారుతుంది. అందరూ క్షమించాలి.149. కాశీ, ప్రయాగ, బదరీ కేదార్, మధురా బృందావనం, ద్వారక మొదలగు యాత్రలు చేసిన పుణ్యం దీక్షితుకు ముందే ఉంది.150. అంతేకాక తల్లిదండ్రుల పుణ్యం వలన అమితమైన భాగ్యం కొద్దీ, పూర్వార్జిత పుణ్యఫలం కారణంగా సాయి దర్శనం కలిగింది.151. ఈ దర్శనానికి మొదటి కారణం ప్రారబ్ధం వలన కలిగిన కుంటి తనం. ఇంగ్లాండులో ఉండగా కాలు జారి పడ్డాడు.152. ఇది పైకి అశుభం వలె అనిపించినా నిజానికి పరిణామం శుభప్రదమైంది. అలా గురువు సన్నిధికి చేరుకోగల యోగం సంభవించి దాని

వల్ల, పుణ్య కర్మల ఫలితంగా దుర్లభమైన సాయి యొక్క సాన్నిధ్యం లభించింది.153.నానా చందోర్కరుతో కలవటంతో సాయిబాబా కీర్తి చెవులలో పడింది. అతనితో చందోర్కరు సాయి దర్శనంలోని విశిష్టతను చూడు. నీకుంటితనం వెంటనే పోతుంది' అని చెప్పాడు.154.కాని దీక్షితు తన కాలి కుంటితనాన్ని ఒక లోపంగా భావించలేదు. మనసులోని నిజమైన కుంటితనాన్ని పోగొట్టమని సాయిబాబాను కోరాడు.155.చర్మం ఎముకలు రక్తమాంసాల సముదాయమైన మానవ శరీరం ప్రపంచంలో క్షణభంగురం. కాలి కుంటితనం ఉంటే ఏం నష్టం?156. క్రీ.శ. 1909 వసం॥ నవంబరు రెండవ తారీఖున దీక్షితుకు మొదటిసారిగా పుణ్యపావనమైన సాయినాథుని దర్శనం లభించింది.157. తరువాత అదే సంవత్సరం అతడు డిసెంబరు నెలలో మరల శ్రీవారి పునర్దర్శనానికి శిరిడీ వెళ్ళాడు. అప్పుడు అతని మనసులో అక్కడే ఉండిపోవాలని కోరిక కలిగింది.158. 25 షేర్లు అమ్మి యాత్రీకుల సదుపాయానికి ఒక రేకుల షెడ్డును కట్టించాలని అతనికి ముందు అనిపించింది.159.కాని తరువాత ఒక భవనం నిర్మించాలని నిశ్చయించుకున్నాడు. తరువాతి సంవత్సరం ఒక శుభ ముహూర్తాన రాళ్ళతో పునాది వేశారు.160.డిసెంబరు తొమ్మిదవ తారీఖున, బాబా అనుమతిని తీసుకొని అదే సుముహూర్తమని పునాది పని చేశారు.161.ఆహ్వానించినా రాని దీక్షితుని సోదరుడు కూడా ముందుగానే వచ్చి ఆ సుమూహుర్తానికి అక్కడే ఉన్నాడు.162.దాదాసాహేబు ఖాపర్డే అంతకు ముందే అక్కడ ఉన్నాడు. ఇంటికి తిరిగి వెళ్ళటానికి బాబాను అనుమతిని కోరటం అతనికి కష్టమైంది.163.డిసెంబరు పదవ తారీఖున ఖాపర్డేకు ఇంటికి వెళ్ళటానికి, దీక్షితు భవనానికి పునాది వేయటానికి బాబా ఆజ్ఞ అయింది.164.ఈ రోజు యొక్క మరో గొప్ప విషయం. ఈ రోజు నుండే చావడిలో పరమ భక్తి శ్రద్ధలతో శేజారతి ప్రారంభమైంది.165 తరువాత కీ॥శ॥ 1911వ సంవత్సరం శ్రీరామనవమి సుముహూర్తాన గృహప్రవేశ శుభకార్యం, విధిపురస్సరంగా జరిగింది.166. తరువాత శ్రీమంతుడైన

బుట్టీ అమితమైన డబ్బు వెచ్చించి భవనాన్ని నిర్మించాడు. సాయిబాబా యొక్క శరీరం అక్కడ విశ్రమించడం వలన అతని ధనం సదుపయోగమై సార్థకమైంది.167.ఈ విధంగా ఒక్కటైనా లేని చోట మూడు భవనాలు తయారయ్యాయి. మొదట సాతేగారి భవనమే అందరికీ చాలా ఉపయోగకరంగా ఉండేది.168.ఈ వాడాకు మరో ఘనత. మొదట ఈ స్థలంలోనే బాబా స్వయంగా తమ హస్తాలతో నిర్మించిన పూలతోట ఉండేది.169.ఈ తోటను గూర్చిన చిన్న కథను తరువాతి అధ్యాయంలో వర్ణిస్తాను. హేమాడ్ శ్రోతల సమేతంగా సాయి చరణాల యందు మస్తకాన్నుంచుతున్నాడు.170.వామన తాత్యా కుండలివ్వగా సాయి సమర్థులు బంజరు భూమిలో మొక్కలు నాటి, నీరు పెట్టి తోటను తయారుచేశారు. తరువాత గుప్తమయ్యారు.171.ఆ తరువాత వారికి ఔరంగాబాదు వద్ద చాందుపాటీలు కలిశాడు. అతని ఇంటి పెళ్ళివారితో బాబా మరల శిరిడీ వచ్చారు.172.అక్కడ దేవీదాసుని కలుసుకోవటం, జానకీదాసుతో స్నేహబంధం, బాబా గంగాఘరు ఒకరినొకరు చూచుకోవటం, ఈ ముగ్గురు శిరిడీలో కలవటం.173.మొహిద్దీనుతో కుస్తీ పట్టినప్పటినుండి బాబా మసీదులో నివసించటం.వారికి డేంగలేపై ప్రీతి కలగటం, బాబా వద్ద భక్తులు గుమిగూడటం,174.మొదలగు కథలను తరువాతి అధ్యాయంలో శ్రవణం చేయండి.ఇప్పుడు హేమాడ్ సాయికి అనన్య శరణుజొచ్చి సాష్టాంగ నమస్కారం చేస్తున్నాడు.175.స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్‌పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలోసాయి సమర్థావతరణమను నాలుగవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీసాయి సచ్చరిత - 5వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీకులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఇప్పుడు పూర్వకథానుసంధానం. బాబా శిరిడీలో గుప్తమై చాందుపాటీలుతో మరల శిరిడీకి వచ్చిన కథను వినండి.1. బాబా స్వయంగా నీరుమోసి తోటను పెంచడం, గంగాఘీరాది సాధువుల సమ్మేళనం మొదలగు పావన కథలలోని విశేషాలను వినండి.2.కొంత కాలం వరకు గుప్తంగా ఉన్న రత్నం వలె బాబా మహమ్మదీయుల పెళ్ళివారితో పాటు మరల శిరిడీలో ప్రవేశించారు.3.వారి రాకకు ముందే దేవీదాసు అక్కడుండే వాడు. తరువాత జానకీదాసు బైరాగి కూడా అక్కడ ఉండడానికి వచ్చాడు.4. ఇదంతా ఎలా సంభవించిందీ సవిస్తరంగా చెబుతాను. శ్రోతలు సావధానులై శ్రద్ధగా వినండి.5. ఔరంగాబాదు జిల్లాలోని ధూప్ అనే చిన్న గ్రామంలో చాందుపాటీలు అనే మహమ్మదీయ భాగ్యశాలి ఉండేవాడు.6.అతడు ఔరంగాబాదులో పర్యటిస్తుండగా అతని గుఱ్ఱమొకటి తప్పిపోయింది. రెండు నెలలు దాని జాడ తెలియలేదు. ఇక ఏం లభిస్తుంది?7.అని పాటీలు పూర్తిగా నిరాశ చెందాడు. గుఱ్ఱం గురించి చాలా దుఃఖించాడు. గుఱ్ఱపు జీనును భుజాన వేసుకొని తిరుగుదారి పట్టాడు. 8. ఔరంగాబాదు నుండి నాలుగున్నర కోసుల దూరం ముందుకు వెళ్ళగా అక్కడ మామిడి చెట్ల క్రింద ఈ రత్నం కనిపించారు.9.వారి తలపై టోపి, శరీరం పైన కఫినీ, చంకలో సటకా ఉన్నాయి. వారు పొగాకు నలిపి గొట్టంలో నింపి చిలుము తయారు చేసారు. అక్కడ ఆశ్చర్యకరమైన విచిత్రం జరిగింది. .10.చాందుపాటీలు దారిన

వెళ్లుతుండగా ఆ ఫకీరు అతనిని పిలిచినట్లు విన్నాడు. ఒరే బాబూ! నిడలో కూర్చుని చిలుం పిల్చి ముందుకు వెళ్ళు అని అన్నారు.11.ఆ ఫకీరు ఈ జీను ఎక్కడిది అని ప్రశ్నించారు. ఇది తప్పిపోయిన నా గుఱ్ఱానిది అని పటేలు చెప్పాడు. వెళ్ళి ఆ కాలవదగ్గర వెతుకు అని ఫకీరు చెప్పారు. వెంటనే అక్కడ గుఱ్ఱం దొరికింది.12.చాందుపాటీలు ఆశ్చర్యపోయాడు.అవలియా లభించారు.వీరి చర్యలకు అంతులేదు. వీరిని మానవులని అనలేం అని పాటీలు మనసులో అనుకున్నాడు.13.తరువాత అతడు గుఱ్ఱాన్ని తీసుకొని తిరిగి ఫకీరు ఉన్న చోటికి వచ్చాడు.ఫకీరు అతనిని తన వద్ద కూర్చోబెట్టుకుని చిమ్మును చేతిలోకి తీసుకొన్నాడు.14.అక్కడే మట్టిలో గుచ్చాడు.లోపలి నుండి మండుతున్న నిప్పును తీసికొని చిలిం గొట్టంపై ఉంచి సటకా తీసుకున్నాడు.15. ఆ సమీపంలో గుడ్డముక్క తడపటానికి నీరు ఎక్కడా లేదు. సటకా చేతిలోకి తీసుకొని నేలపై కొట్టగా వెంటనే నీరు పైకి వచ్చింది.16.దానితో గుడ్డను తడిపి నీటిని పిండేసి, చిలుం గొట్టానికి చుట్టాడు. తను పీల్చి పటేలుక్కూడా ఇచ్చాడు. పటేలుకు మతిపోయింది.17.నాతో వచ్చి మా గృహాన్ని పావనం చేయండని ప్రార్థించాడు. లీలా విగ్రహాధారులైన బాబా పటేలును అనుగ్రహించారు.18.ఆ మరునాడు పటేలు గ్రామానికి వెళ్ళి అతని ఇంట కొంత కాలం బస చేసి తరువాత శిరిడీకి మరల వచ్చారు.19.ఈ చాంద్ పాటీలు ధూప్ గ్రామానికి అధికారి. అతని భార్య యొక్క మేనల్లునికి శిరిడీలో సంబంధం కుదిరింది.20.యుక్త వయసు రావడం వలన చాంద్‌భాయి పాటీలు భార్య మేనల్లునికి శిరిడీలోని వధువుతో లగ్నం నిశ్చయమైంది.21.గుఱ్ఱపు బండ్ల వెంట పెండ్లి వారు శిరిడీకి బయలుదేరారు. చాంద్‌భాయి పైన ప్రేమతో బాబా కూడా పెళ్ళి వారిలో కలిశారు.22.లగ్నం అయిపోయింది. పెళ్ళి వారు వెనక్కు వెళ్ళిపోయారు. కాని బాబా ఒక్కరే శిరిడీలో ఉండిపోయారు. ఆ ఉండటం ఉండటం

అక్కడే ఉండిపోయారు. అలా శిరిడీ భాగ్యం ఉదయించింది.23.సాయి సనాతనులు అవినాశి. వారు హిందువు కాదు, ముసల్మాను కాదు. జాతిమతాలు కులగోత్రాలు లేని రూపం. ఆత్మజ్ఞానం వారి స్వరూపం.24.'సాయి సాయి' అని ప్రజలు అంటారు. అయితే అది వారి పేరా?' 'రండి సాయీ' అని వారిని బహుమానపురస్సరంగా సంబోధించినదే అది.25. ఖండోబా దేవాలయం వద్ద, మహల్సాపతి పాలంలో పెళ్ళివారితో మొదట బాబా దిగిన రోజే ఈ పేరు వచ్చింది.26. అది మొదట మహల్సాపతికి చెందిన పాలం.తరువాత అది అమీన్‌భాయిది అయింది. పెళ్ళివారు ఇక్కడే మఱ్ఱి వృక్షం క్రింద దిగారు.27.ఖండోబా దేవాలయ ప్రాంగణంలో బళ్ళనన్నిటిని పాలంలో విప్పగా అక్కడ పెళ్ళివారితో పాటు బాబా కూడా దిగారు.28.ఈ బాల ఫకీరు బండినుండి దిగగానే మొట్టమొదట మహల్సాపతి దృష్టిలో పడగా 'రండి సాయి' అని వారి ఎదుటకు వెళ్ళాడు. అప్పటినుండి వారికి ఆ పేరు ఉండిపోయింది.29.అలా అప్పటి నుండి జనులు వారిని 'సాయీ సాయీ' అని పిలవటం మొదలుపెట్టారు.వారికి నామకరణం అలా జరిగింది.30.అక్కడ వారు చిలుం త్రాగారు. మసీదులో ఉండసాగారు.దేవీదాసు సహవాసంతో శిరిడీలో ఆనందంగా ఉన్నారు.31.ఒకప్పుడు చావడిలో కూర్చునేవారు. మరొకప్పుడు దేవీదాసు సాంగత్యంతో మరొకప్పుడు మారుతీ దేవాలయంలోనో స్వేచ్ఛగా ఉండేవారు.32.ఈ దేవీదాసు శిరిడీ గ్రామంలో బాబాకంటే ముందుగానే వచ్చి ఉన్నారు. ఆ తరువాత శిరిడీకి , మహానుభావుడైన జానకీదాసు గోసావి వచ్చాడు.33.ఈ జానకీదాసు వద్దకు సాయిమహారాజు వెళ్ళి మాట్లాడుకుంటూ కూర్చునేవారు. లేదా సాయి మహారాజు ఉన్న చోటికి జానకీదాసు వచ్చి కూర్చునేవాడు.34.ఆ ఉభయులలో చాలా ప్రేమ ఉండేది. వారు నిత్యం నియమంగా సమావేశమయ్యేవారు. అలా వారి సమాగమం అందరికీ పరమానందంగా ఉండేది.35.అట్లే

మరో ప్రసిద్ధి చెందిన వైష్ణవ భక్తుడు, గృహస్తు పుణతాంబే నివాసి, గంగాధరు శిరిడికి తరచూ వచ్చేవాడు. 36.సాయి రెండు చేతులతోను మట్టికుండను పట్టుకొని బావినుంచి నీరు మోసుకొని రావటం చూచి మొదట గంగాధరు ఆశ్చర్యపోయాడు.37. అలా సాయిని ముఖాముఖి చూసి 'ఈ అమూల్యరత్నాన్ని పొందిన శిరిడీ ప్రజలు భాగ్యవంతులు. వారు ధన్యులు' అని స్పష్టంగా చెప్పాడు. 38.ఈ రోజు ఇతడు భుజాన నీరు మోస్తున్నాడు. కాని ఇతడు సామాన్యుడు కాదు.ఈ క్షేత్రం యొక్క పుణ్యం ఏదో ఉండబట్టే ఈ స్థలంలో లభ్యమయ్యాడు' అని చెప్పాడు.39.అలాగే ఆనందనాథ్ అనే పేరుతో ప్రఖ్యాతి చెందిన మరొక సాధువు కూడా సాయి అద్భుతమైన కృత్యాలు చేస్తారని భవిష్యాన్ని తెలియ చేశాడు.40.బాగా ప్రసిద్ధి చెందిన ఇతడు యవలా గ్రామంలో మఠాన్ని స్థాపించాడు. ఒకసారి కొంతమంది శిరిడీ వాస్తవ్యుల వెంట శిరిడీ వచ్చాడు.41.ఆనందనాథ్ అక్కల్‌కోట మహారాజు శిష్యుడు. సాయిని చూచి 'ఈతడు ప్రత్యక్ష వజ్రం.42.ఈరోజు ఇక్కడ పెంటకుప్పమీద ఉన్నా ఇతడు రాయి కాదు రత్నం' అని ఆనందనాథ్ పలికిన మాటలు బాబాయొక్క కౌమార అవస్థలో చెప్పినవి.43.'ఈ నా మాటలను గుర్తుంచుకోండి. ఇవిమీకు తరువాత గుర్తుకు వస్తాయి'అని భవిష్యాన్ని చెప్పి అతడు యవలాకు వెళ్ళిపోయాడు.44.తరుణ వయసులో సాయి తలవెంట్రుకలను పెంచుకునేవారు. ఎప్పుడూ ముండనం చేసుకునే వారు కాదు. ఫహిల్వాను వలె దుస్తులను ధరించేవారు.45.రహాతాకు వెళ్ళినప్పుడు బంతి మరియు జువ్వి మొక్కలను తెచ్చి బంజరుభూమిలో స్వహస్తాలతో నాటి, వానికి నియమంగా నీరు కూడా పోసేవారు.46.వారి భక్తుడు వామన తాత్యా ప్రతిరోజూ వారికోసం రెండు పచ్చికుండల నివ్వగా బాబా తమ చేతులతో నీరు పోసేవారు.47.ఆ కుండలతో బావి నుండి నీరు తమ భుజంపై మోసుకొని వచ్చి మొక్కలకు పోసి సూర్యుడు అస్తమించాక కుండలను తీసుకుని

వెళ్లి వేప చెట్టుక్రింద ఉంచేవారు. 48.అవి పచ్చివి అవటం చేత క్రింద పెట్టిన వెంటనే అక్కడికక్కడే పగిలిపోయేవి. మరునాడు తాత్యా మరో రెండు క్రొత్తకుండల నిచ్చేవాడు. 49.కాలినకుండ కొన్నాళ్ళ పాటు నిలువ ఉంటుంది. కాని బాబాకు పచ్చివే కావాలి కుమ్మరివానికి శ్రమ లేకుండా కాలని కుండలనే తీసుకుని వాని విలువను ముందుగానే చెల్లించేవారు. 50.ఈ విధంగా మూడు సంవత్సరాలు శ్రమపడగా ఎందుకూ పనికిరాని ఆ స్థలంలో ఉద్యానవనం తయారయింది. ఆ స్థలానికి మంచి యోగం పట్టింది.ఇప్పుడు ప్రజలు ఆభవనాన్ని ఉపయోగించుకుంటున్నారు. 51.ఇక్కడే వేపచెట్టు క్రింద 'భాఈ' అను ఒక భక్తుడు అక్కల్‌కోట స్వామి యొక్క పాదుకలను సాధకులు పూజించాలనే ఉద్దేశంతో స్థాపించాడు. 52.అతడు తన ఉపాస్య దైవమైన అక్కల్‌కోట స్వామి సమర్థ పటాన్ని నిత్యం నియమనిష్ఠలతో పూజించేవాడు. 53.అక్కల్‌కోట వెళ్లి స్వామి వారి పాదుకలను దర్శనం చేసుకోవాలని, భక్తిగా పూజోపచారాలను సమర్పించుకోవాలని అతనికి సంకల్పం కలిగింది. 54. ముంబై నుండి బయలుదేరాలని ప్రయాణానికి సిద్ధం చేసుకుని అక్కడికి ఆమర్నాడు వెళ్లాలన్న నిశ్చయం మారి శిరిడీ మార్గం పట్టాడు. 55.కారణం అతడు ప్రయాణమవ్వాలని తలచిన ముందురోజు అతనికి స్వప్నంలో 'ప్రస్తుతం నా స్థానం శిరిడీలో, నీవు అక్కడికి వెళ్ళు' అని స్వామిసమర్థ ఆజ్ఞాపించారు. 56.వారి ఆజ్ఞను శిరసావహించి ముంబై నుండి ప్రయాణమై శిరిడీ వెళ్ళి అక్కడ ఆరు నెలలు ఆనందంగా గడిపే భాగ్యాన్ని పొందాడు. 57.పూర్ణనిష్ఠావంతుడైన భాఈ తనకు కలిగిన ఈ దృష్టాంతం చిరస్మరణీయంగా ఉండాలని వేప చెట్టుక్రింద పాదుకలను స్థాపించాడు. 58.శకసంవత్సరం **1834** లో శ్రావణమాసం, శుక్లపక్ష పర్వకాలంలో స్వామి పాదుకలను వేప చెట్టు క్రింద భక్తి ప్రేమలతో స్థాపించారు. 59. ఒక శుభముహూర్తాన దాదా కేల్కర్ చేతులమీదుగా విధివిధానాలతో శాస్త్రోక్తంగా

ఉపాసనీ మహారాజ్ స్వయంగా పాదుకలను స్థాపింపచేశారు.60.తరువాత ఈ పాదుకల పూజావ్యవస్థను బ్రాహ్మణుడైన దీక్షితు చేసేవాడు. ఇతర ఏర్పాట్లను సగుణమేరు చూసేవాడు. ఇది పాదుకల కథ.61.ఈ విధంగా ఏ వికారాలు లేని సత్పురుషులు పరమేశ్వరుని ప్రత్యక్ష అవతారాలు. లోక కల్యాణానికి జగత్తును ఉద్ధరించడానికి వీరు అవతరిస్తారు.62.కొంతకాలం జరిగిన తరువాత ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. శ్రద్ధగా శ్రవణం చేస్తే శ్రోతలకు విచిత్రంగా అనిపిస్తుంది.63. తమలపాకులను అమ్ముకునే మొహిద్దీన్ భాయి అనే వానికి బాబాకు మధ్య వివాదం ఏర్పడి అది కుస్తీకి దారితీసి ఇద్దరూ పరస్పరం పోట్లాడారు.64.ఇద్దరూ చతురులైన పహిల్వానులే. అయినా విధి ఎదుట ఎవరి బలం సాగదు. బలవంతుడైన మొహిద్దీన్ చేతుల్లో బాబా పరాజితులయ్యారు.65.అప్పటినుండి నిశ్చయించుకొని బాబా తమ దుస్తులన్నీ మార్చేశారు. లంగోటీని కట్టుకుని కఫనీని తొడుక్కున్నారు. తలకు రుమాలును చుట్టుకున్నారు.66.వారికి కూర్చోవటానికి ఆసనం గోనెపట్టా. పడుకోవటం కూడా గోనెపట్టా పైనే. పాత చింకి గుడ్డలనుధరించి వానితోనే సంతృప్తి చెందేవారు67.'మహారాజు పదవికంటే పేదరికం శ్రేష్ఠం. పేదరికం అనలైన రాజరికం. ఐశ్వర్యం కంటె పేదరికం లక్ష రెట్లు శ్రేష్ఠం. అల్లాభాయి పేదల బంధువు' అని బాబా ఎల్లప్పుడూ అంటుండేవారు.68. గంగాధీరు కూడా ఇలాంటి స్థితికి లోనయ్యాడు. అతనికి కుస్తీలపై ఎంతో మోజు. ఒకసారి కుస్తీపడుతుండగా అతనికి వైరాగ్యం కలిగింది.69.యోగ్యమైన సమయం సమీపించింది. ఒక సిద్ధ పురుషుని వాణి పలికింది. 'దేవునితో ఆడాలి. అలా ఆడుతూ శరీరం అరిగిపోవాలి '70.అతడు కుస్తి పడుతుండగా అనుగ్రహ రూపమైన ఈవాణి అతని చెవులలో పడింది.అంతే ప్రపంచానికి తిలోదకాలు వదలి అతడు పరమార్థసాధనలో పడ్డాడు.71.పుణతాంబే సమీపంలో గోదావరి నది యొక్క ఉభయ

ప్రవాహాల మధ్య ఇతని మఠం ఉంది. ఇతని సేవకై శిష్యులు కూడా ఉన్నారు.72. సాయిబాబా ఏదైనా సరే అడిగేవాటికే జవాబిచ్చేవారు. వారెప్పుడూ స్వయంగా ఎవరితోనూ మాట్లాడేవారు కాదు.73. పగలు వేప చెట్టు క్రింద కూర్చునేవారు. ఒక్కొక్కప్పుడు గ్రామ శివారులలో ఉన్న కాలువ దగ్గర తుమ్మ చెట్టు క్రింద నీడలో కూర్చునేవారు. 74.మరొకప్పుడు మధ్యాహ్నం గాని సాయింత్రం గాని అక్కడినుండి మైలు దూరంలో ఉన్న నీమ్‌గాం పరిసరాలకు వెళ్ళేవారు. అలా పగలు స్వేచ్ఛగా విహరించేవారు.75. నీమ్‌గాం యొక్క జాగీర్దారు పదవిలో ప్రసిద్ధుడైన త్ర్యయంబక్‌డేంగలే ఇంటిలో ఉన్న బాబాసాహేబ్‌డేంగలే పైన బాబాకు అమితమైన ప్రేమ.76. నీమ్‌గామ్ గ్రామానికి వెళ్ళినప్పుడు బాబా అతని ఇంటికి వెళ్ళి రోజంతా అతనితో ప్రేమగా మాట్లాడేవారు.77. అతని తమ్ముడు నానాసాహేబుకు పుత్రసంతానం లేక మనసులో బాధపడేవాడు.78.మొదటి భార్యకు సంతాన యోగం లేక పోవటం వలన ద్వితీయ వివాహం చేసుకున్నాడు.అయినా విధి తప్పించుకోలేనిది. దైవనిర్ణయం అగాధం. 79.అతనిని బాబా సాహేబ్‌సాయి దర్శనానికి పంపాడు. బాబా యొక్క ఆశీర్వాదానుగ్రహాలతో నానాకు పుత్ర సంతానం కలిగింది. 80. ఆ తరువాత సాయిబాబా దర్శనానికి జనసముదాయం గుంపులు గుంపులుగా రాసాగారు. సాయి యొక్క కీర్తి అలా అభివృద్ధి అవుతూ వారి విషయం అహమ్మదునగరు వరకు పాకింది. 81.అక్కడి ప్రభుత్వ కార్యాలయానికి నానాసాహేబు తరచూ వస్తుండేవాడు. అక్కడే చిదంబర కేశవ్ ఆ జిల్లాకలెక్టరు వద్ద కార్యదర్శిగా ఉండేవాడు. 82. ఇతడు సాయిసమర్థుని దర్శనానికి భార్యాబిడ్డలను, బంధుమిత్రులను వెంటబెట్టుకొని రమ్మని నానాకు ఉత్తరం వ్రాశాడు. 83.ఈ విధంగా శిరిడీకి ఒకరిమెనుక ఒకరు అనేకులు రాసాగారు. దాంతో బాబా యొక్క లౌకిక పరివారం కూడా పెరిగింది. 84.సాయిబాబాకు ఎవరి సాంగత్యమూ అవసరం లేకపోయినా, భక్త పరివారం రోజంతా

వారిచుట్టూ మూగి ఉండేది. సూర్యుడు అస్తమించాక వారు శిరిడీ లోని పాడుపడిన మసీదులో నిద్రించేవారు. 85.శరీరంపైన పాదాలవరకు జీరాడే కఫనీని ధరించేవారు, తలకు తెల్లని వస్త్రం ఉండేది. వారి వద్ద ఎల్లప్పుడూ చిలుం, పొగాకు, రేకు డబ్బా, సటకా కట్టి ఉండేవి.86.వారు ఉతికిన తెల్లని వస్త్రాన్ని తలకు చుట్టి ఎడమ చెవి వెనుక జటాజూటంలా ముడివేసు కునేవారు.87.ఈ విధంగా దుస్తులను ధరించి ఎనిమిదేసి రోజులు కూడా స్నానం చేయకుండా ఉండేవారు. వారి పాదాలకు జోళ్ళుగాని చెప్పులు గాని ఉండేవికావు. ఒక గోనెపట్టాపైనే కూర్చునే వారు. 88.ఆ గోనెముక్కపైనే ఎల్లప్పుడూ కూర్చునే వారు.తలగడ ఎటు వంటిదో వారు ఎరుగరు. ఉన్నదానితోనే వారు సంతృప్తిగా ఉండేవారు.89.ఆ పాత గోనెముక్కే వారికి ప్రియమైన ఆసనం. వారు అదే చోట ఎల్లప్పుడూ కూర్చునేవారు.90.వారి నడుముకు కౌపీనం తప్ప కట్టుకోవటానికి వేరే వస్త్రాలేవీ ఉండేవి కావు. చలిబాధకు ఒక ధుని మాత్రమే ఉండేది.91.వారు మసీదులో దక్షిణాభిముఖులై కూర్చుని ఎదుట నున్న ధునిని అవలోకిస్తూ తమ ఎడమచేతిని కట్టుడా పైన వేసి ఉంచేవారు.92.వారు వాసనా సహితంగా అహంకారాన్ని నానా విధ వృత్తులను ప్రపంచ ప్రవృత్తులను యుక్తి ప్రయుక్తులను సమగ్రంగా ధునిలో ఆహుతి చేశారు.93.ఆ ప్రజ్వలమైన అగ్ని గుండంలో జ్ఞానాభిమానమనే సమిధలను వ్రేల్చారు. వారి నోట ఎల్లప్పుడూ 'అల్లామాలిక్' అన్న ఉచ్చారణ ఉండేది. అలా వారి పతాకం ఎప్పుడూ ఎగురుతూ ఉండేది.94.ఆ మసీదైనా ఎంత? మొత్తం స్థలమంతా రెండు స్తంభాల మధ్య ఉన్నంత. అందులోనే బాబా కూర్చోవటం, లేవటం, పడుకోవటం,అందరినీ కలుసుకోవటం. 95. వారికి గద్దె ఆనుకోవటానికి తలగడ అవి ఇప్పుడు వచ్చాయి. మొదట్లో వారి సమీపానికి వెళ్ళడానికి అందరికీ భయమే. 96.క్రీ.శ.1912 వ సంవత్సరం నుండి మసీదులో క్రొత్త రకం మార్పు ప్రారంభమయింది.97.మసీదు నేలలో

మోకాలి లోతులో గుంతలు ఉండేవి. భావికులైన భక్తుల ద్వారా ఒక్క రాత్రిలో నేలను చదును చేసి బండలు పరచబడ్డాయి.98.మసీదులో నివసించడానికి రాకమునుపు బాబా తకియాలో చాలాకాలం హాయిగా ఉన్నారు.99.అక్కడ వారు తమ కాళ్ళకు గజ్జెలు కట్టుకుని ఖంజరి తాళానికి అనుగుణంగా అతిసుందరంగా నృత్యం చేసేవారు. భక్తితో శ్రావ్యంగా పాడేవారు కూడా.100.మొదట్లో సాయి సమర్థులకు దీపోత్సవమంటే చాలా ప్రీతి. అందుకోసం వారు స్వయంగా దుకాణదారులవద్దకు వెళ్ళి నూనెను అడిగేవారు.101.రేకు డబ్బా చేతపుచ్చుకొని నూనె వర్తకుల అంగళ్ళకు స్వయంగా వెళ్ళి నూనెను అడిగి తెచ్చి ప్రమిదలలో నింపేవారు.102.దేవాలయాలలోనూ, మసీదులోనూ ప్రకాశవంతంగా దీపాలను వెలిగించేవారు. అలా కొన్ని రోజులవరకు ఆగకుండా జరిగింది.103.దీపారాధనలో బాబాకు బహు ప్రేమ. దీపావళి వలె దీపోత్సవాన్ని చేసేవారు.చింకిగుడ్డలతో వత్తులను చేసి మసీదులో దీపాలను వెలిగించేవారు.104.రోజూ ఉచితంగా నూనెను అడుక్కుని తెచ్చేవారు. దాంతో వర్తకుల మనసులలో దురాలోచన కలిగింది.అందరూ కలిసి ఇక ఈ గొడవకు స్వస్తి చెప్పాలని నిశ్చయించుకున్నారు.105.తరువాత బాబా నిత్యనియమానుసారం నూనెను అడగడానికి వెళ్ళగా అందరూ కూడా లేదని చెప్పారు. అప్పుడు ఆశ్చర్యంగా.106.ఒక అద్భుతం జరిగింది.బాబా మౌనంగా తిరిగి వచ్చారు. ప్రమిదలలో వట్టి పాడివత్తులను వేసారు. నూనె లేకుండా ఏం చేస్తారో అని వర్తకులు వింతగా చూడసాగారు.107.బాబా మసీదులో పిట్టగోడ పైని రేకుడబ్బాను తీసుకున్నారు. అందులో నూనె కొంచెమే ఉంది. దాంతో సంధ్యాదీపాన్ని వెలిగించడమే కష్టం. 108.ఆ నూనెలో నీరు పోసి బాబా స్వయంగా త్రాగేశారు. అ విధంగా బ్రహ్మార్పణ చేసి ఒట్టినీటిని తీసుకున్నారు.109.తరువాత ఆ నీటిని ప్రమిదలలో పోసి వానిలో పాడి వత్తులను తడిపి అగ్గిపుల్లను

గీచి దీపాలను వెలిగించారు.110. నీటిలో దీపాలు వెలగటం చూచి వర్తకులు ముక్కు మీద వేలేసుకున్నారు. మేము బాబాతో అబద్ధం చెప్పామని వారిలో వారు అనుకున్నారు. 111. కాసింతైనా నూనె లేకుండా దీపాలు రాత్రంతా వెలిగాయి. వర్తకులు సాయి యొక్క అనుగ్రహానికి పాత్రులు కారని అందరూ అనుకున్నారు. 112.బాబా యొక్క సామర్థ్యం తెలియక అసత్య వచనాలతో అనవసరంగా వారికి సంతాపాన్ని కలిగించి పాపాన్ని తెచ్చుకున్నాం అని వర్తకులు పశ్చాత్తాప పడ్డారు. 113.కాని బాబా మనసులో ఏం అనుకోలేదు. వారికి లోకులపై రాగద్వేషాలు లేవు. వారికి శత్రువులు మిత్రులూ అంటూ లేరు, అన్ని ప్రాణులు వారికి సమానమే. 114.ఇప్పుడు పూర్వకథానుసంధానం. మొహిద్దీను కుస్తీలో గెలిచి కీర్తి పొందిన తరువాతి చరిత్ర మహిమను సావధానులై వినండి. 115.కుస్తీ జరిగిన తరువాత ఐదవ సంవత్సరం అహమ్మదునగరు నివాసియైన జవహర్ అలీ అనే ఒక ఫకీరు శిష్యులతో సహా రహాతాకు వచ్చాడు. 116.వీరభద్రుని దేవాలయ సమీపంలో ఒక ఖాళీ స్థలాన్ని చూసుకొని అక్కడ తిష్ఠవేశాడు. ఫకీరు భాగ్యవంతుడు. 117.అదృష్టవంతుడు కాకపోతే అంతటా ప్రసిద్ధి చెందిన సాయి వంటి గొప్ప శిష్యుడు ఎలా లభిస్తాడు? 118.ఆ ఊళ్ళో అనేక మంది ఉన్నారు. వారిలో ఎంతో మంది క్షత్రియ జాతీయులు కూడా ఉన్నారు. వారిలో ఒకడైన భగుసదాఫల్ ఆ ఫకీరుకు సేవకుడయ్యాడు. 119.ఫకీరు గొప్ప పండితుడు. ఖురాన్ శరీఫ్ అతనికి కరతలా మలకం. అందుచేత స్వార్థులు, పరమార్థులు, భావికులు అనేక రకాలవారు అతని చరణాలను ఆశ్రయించారు. 120.అతడక్కడ ఈద్‌గా నిర్మాణాన్ని ప్రారంభించాడు. అలా కొంత కాలం గడిచాక వీరభద్రదేవుని అపవిత్రం చేస్తున్నాడన్న ఆరోపణ అతనిపై పడింది. 121.దాంతో ఆ ఈద్‌గా పని ఆగిపోయింది. ఫకీరును ఊరినుండి బైటికి గెంటివేశారు. అక్కడి నుండి అతడు శిరిడీకి వచ్చి మసీదులో బాబా వద్ద ఉన్నాడు.122.ఫకీరు గొప్ప

మృదుభాషి కావటంతో ఊరివారు అతని భజనలో పడ్డారు. అతడు బాబాను కూడా ఏదో మాయచేసి తన వశం చేసుకున్నాడని జనులు అనుకున్నారు. 123.అతడు బాబాతో నువ్వు నా శిష్యుడవు అని అన్నాడు. వినోద స్వభావంగల బాబా సరే అనగానే అతడు చాలా ఆనందించి, బాబాను వెంట తీసుకొని వెళ్ళాడు. 124. బాబా వంటి సాధుస్వభావం గల శిష్యునికి జవహరు ఆలీ గురువయ్యాడు. ఆ ఇద్దరూ రహతాలో ఉండటానికి నిశ్చయించుకున్నారు.125.గురువుకు శిష్యుని గొప్పదనం తెలియదు. కాని శిష్యునికి గురువు యొక్క అవగుణాలు తెలుసు. అయినా గురువును ఎన్నడూ అనాదరణ చేయకుండా శిష్యుని స్వధర్మాన్ని పాటించారు. 126.గురువు నోటి నుండి వెడలిన వచనాలను యోగ్యాయోగ్యాలను చూడకుండా తూచా తప్పకుండా పాటించారు. గురువు ఇంటికి నీరు కూడా మోశారు. 127.గురుసేవ చేస్తూ అప్పుడప్పుడు శిరిడీకి వచ్చేవారు. అలా ఉండగా అప్పుడు ఏం జరిగిందంటే. 128.అలా తరచూ వస్తూపోతూ ఉన్నా బాబా రహతాలోనే ఉండసాగారు. బాబా ఫకీరు వశమైపోయారు. ఇక శిరిడీ విడిచిపెట్టినట్లే అని అనిపించింది. 129.జవహర్ ఆలీ తన యోగ బలంతో సాయిని ఆకట్టుకున్నాడని జనులకు అనిపించింది. కాని శరీరాభిమానాన్ని దహింపజేసిన సాయి యొక్క వైఖరే వేరు. 130.సాయికి అభిమానం ఎక్కడిదని శ్రోతలకు సందేహం కలుగుతుంది. కాని, వారి ఆచరణ లోక కల్యాణానికే.వారి అవతరణ కార్యం ఇదే.1 31. శిరిడీలోని భక్తులకు బాబా యందు అమితమైన ప్రేమ. వారికి బాబా తమ వద్ద లేకపోవటం అసమంజసంగా అనిపించింది.132.తమ సర్వస్వాన్ని జవహర్ అలి అధీనం చేసిన సాయిని చూసి షిరిడీ గ్రామస్థులు మనోవేదనకు గురిఅయ్యారు.సాయిని ఏ విధంగా తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలి అన్న ఆలోచనలో పడ్డారు.133.ఆ ఇద్దఱి గురుశిష్యుల ఐక్యత బంగారం దాని మెరుగు, దీపం దాని వెలుగు వలె

ఉండేది. 134.శిరిడీలోని భక్తసమూహం రహతాలోని ఈద్‌గా వద్దకు వెళ్ళారు. గట్టి ప్రయత్నం చేసి బాబాను వెంటబెట్టుకొని శిరిడీ తిరిగి రావాలని అనుకున్నారు.135.కాని బాబా దానికి వ్యతిరేకంగా, 'ఫకీరు మహా కోపిష్ఠి.అతని జోలికి వెళ్ళకండి. అతడు నన్ను అసలు విడిచి పెట్టడు.136.మీరిక్కడినుండి పలాయనం చిత్తగించండి.ఇప్పుడు ఊళ్లోనుండి వచ్చి మీ పనిపడతాడు. అతని కోపం పరమ కఠినం.137.రాగానే ఉగ్రుడై మండి పడతాడు. వెంటనే బయలుదేరి వెళ్ళి శిరిడిదారి పట్టండి' అని చెప్పారు.138.ఇప్పుడు ఏమిటి కర్తవ్యం? బాబా ఇలా వ్యతిరేకంగా చెప్పారేమిటి అని అనుకోసాగారు. ఇంతలో అకస్మాత్తుగా ఫకీరు వచ్చాడు.139.కుఱ్ఱవాడి కోసం వచ్చారా? ఇక్కడ ఏం మాట్లాడుకుంటున్నారు. శిరిడీకి మరల తీసుకువెళ్ళాలనే ఉద్దేశంతో వచ్చారు కదూ ! ఆ శ్రమ పడకండి.140.అని మొదట అన్నా, గ్రామస్థుల ఒత్తిడికి మెత్తబడి కుఱ్ఱవానివెంట నన్ను కూడా తీసుకుని వెళ్ళండి అని అన్నాడు.141. ఆ విధంగా ఫకీరు కూడా బాబా వెంట వచ్చాడు. అతడు బాబాను విడిచి పెట్టడు. బాబా కూడా అతనిని విడిచి ఉండరు. ఇది ఎలా సంభవమో అర్థం కాలేదు.142.సాయి పరబ్రహ్మమూర్తి. జవహర్ అలీ భ్రమలతో కూడిన గువ్వుడిపండు, దేవీదాసు పరీక్షించగా శిరిడీలో అతని బండారం బ్రద్దలయింది.143.దేవీదాసు సుందరమైన ఆకారంతో, తేజోవంతమైన కళ్ళతో మనోహరమైన రూపం కలవాడు. పది పదకొండు సంవత్సరాల వయసులో మొదటిసారిగా శిరిడీకి వచ్చాడు.144.ఆ లేత వయసులో అతని నడుముకు ఒక లంగోటి మాత్రమే ఉండేది. యాత్రికునిగా వచ్చి మారుతీ దేవాలయంలో దిగాడు.145.అప్పా భిల్లు, మహల్సాపతి అతని వద్దకు వచ్చి పోతుండేవారు.కాశీరాం మొదలగు వారు అతనికి స్వయంపాకానికి సరుకులిచ్చే వారు. అలా అతని మహిమ పెరిగింది.146.బాబా పెళ్ళివారితో కలిసి శిరిడీకి రావటానికి పన్నెండేళ్ల ముందే

దేవిదాసు వచ్చి శిరిడీలో ఉండసాగాడు.147.ఇతడు అప్పాభిల్లుకు పలకపైన వ్రాయడం నేర్పించాడు. వెంకటేశ స్తోత్రం చదివించేవాడు. అందరితో కంఠస్థం చేయించేవాడు. అలా పాఠాలు నియమంగా జరిగేవి.148.దేవిదాసు మహాజ్ఞాని. తాత్యా కోతే అతనిని గురువుగా ఎన్నుకున్నాడు. కాశీనాథు మొదలైన వారు అతనికి ముఖ్య శిష్యులై అతని చరణాలను ఆశ్రయించారు.149.అతని వద్దకు ఈ జవహరు అలి ఫకీరు వచ్చాడు. శాస్త్రాలపై వాదోపవాదాలు జరిగాయి.విరాగియైన దేవీదాసు ఫకీరును ఓడించగా ఆ ఫకీరును అక్కడనుండి తరిమివేశారు.150.అతడు అక్కడి నుండి పోయి వైజాపురిలో ఉన్నాడు. అనేక సంవత్సరాలకు తిరిగి వచ్చి సాయినాథునికి నమస్కరించాడు.151.తను గురువు అతను శిష్యుడు అన్న అతని భ్రమ తొలగిపోయింది. బాబా అతనిని పూర్వంవలెనే సత్కరించారు. పశ్చాత్తాపంతో అతడు పరిశుద్ధుడయ్యాడు.152.ఇటువంటివి బాబా అగాధలీలలు. ఫకీరు యొక్కభ్రమలు విధివశాత్తు తొలగిపోయేవరకు తాను గురువు, బాబా శిష్యుడు అనేభావాన్ని బాబా ఆదరించారు.153.అతని గురు పదవి అతనిది,మన శిష్యపదవి మనది అన్నది ఇక్కడ ఉపదేశం. దీనిని సాయినాథులు స్వయంగా ఆచరించారు.154.మనం ఎవరికి సంబంధించిన వారమైనా కావచ్చు. లేదా ఎవరినైనా మన వారిగా చేసుకోవచ్చు. దీనికంటె వేరుగా ఉండటం మంచిదికాదు. దానివల్ల భవసాగరతీరాన్ని చేరుకోలేరు.155. ఈ సందర్భంలో ఇది ఒక బోధ. కాని అహాన్ని త్యజించాలని మనసున నిశ్చయించుకున్నవారు అరుదు.అట్టి నిరభిమానులు, శరీరాభిమానాన్ని జయించగలరు.156.ఇక్కడ స్వబుద్ధి కల్పన,చాతుర్యం పనికిరావు. తమహితాన్ని సాధించదలచినవారు అభిమాన రహితంగాప్రవర్తించాలి.157.శరీరాభిమానాన్ని దహింపజేసుకొన్న వారే శరీరాన్ని సార్థకం చేసుకున్నట్లు అట్టివారు పరమార్థాన్ని సాధించటానికి ఎవరికైనా శిష్యులవుతారు.158.విషయాలకు అతీతమైన బాబా యొక్క మనోస్థితిని

గమనించిన వారంతా విస్మయం చెందేవారు. బాబా లేతవయస్సును చూచి మనోహరరూపాన్ని చూచి జనులు విడ్డూర పోయేవారు. 159. జ్ఞానుల శరీర వ్యవహారాలు, వారి పూర్వకర్మానుసారం జరుగుతాయి. వారికి ప్రారబ్ధకర్మల భారం బాధలు ఉండవు. కర్మకు తాము కర్తలమని వారు తలపోయరు. 160. సూర్యుడు అంధకారంలోకి ప్రవేశించనట్లు జ్ఞానులబుద్ధి ద్వైతభావంలో ఉండదు. వారికి విశ్వమంతా ఆత్మస్వరూపమే. వారు అద్వైతంలో ఉంటారు. 161. గురుశిష్యుల ఈ వ్యవహారాన్ని సాయి యొక్క పరమ భక్తుడైన మహల్సాపతి చెప్పగా ఆద్యంతం అట్లాగే వినిపించాను. 162. ఈ కథను ఇంతటితో చాలించి ఇంతకంటె గహనమైన తరువాతి చరిత్రను యథాక్రమంగా చెబుతాను. సావధానంగా శ్రవణం చేయండి. 163. మసీదు పూర్వం ఎలా ఉండేది? ఎలా శ్రమ పడి నేలను చదును చేశారు? సాయి హిందువా లేక ముసల్మానా అన్నది ఎవరికీ నిశ్చయంగా తెలియదన్న విషయం, 164. ధౌతి పోతి ఖండయోగాది ప్రక్రియల గురించి, భక్తుల కర్మలను బాబా అనుభవించడం మొదలైన విషయాలను తరువాత మనవి చేస్తాను. 165. హేమాడ్ సాయికి శరణుజొచ్చి వారి చరణ ప్రసాదమైన ఈ కథా నిరూపణాన్ని శ్రవణం చేస్తే దురిత నివారణము పుణ్యపావనమని చెప్పుతున్నాడు. 166. స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో శ్రీ సాయి పునః ప్రకటమను ఐదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీసాయి సచ్చరిత - 6వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ప్రపంచిక వ్యవహారంలోనైనా, పరమార్థంలోనైనా, సద్గురువే మనలను నడిపించే నావికుడు అయినప్పుడు వారే మనలను తీసుకుని వెళ్లి ఆవలి ఒడ్డున దించుతారు. 1. సద్గురువు అన్న పదం మనసులో మెదలగానే మొదట సాయియే గుర్తుకు వస్తారు. ప్రత్యక్షంగా వారు మన ఎదుట నిలచి తమ అభయ హస్తాన్ని మన శిరసున ఉంచుతారు. 2. ధునిలోని విభూతితో ఉన్న వారి వరద హస్తం మన మస్తకాన్ని తాకగానే హృదయంలో ఆనందం ఉప్పొంగుతుంది. ప్రేమ కళ్లనుండి ప్రవహిస్తుంది. 3. గురువు యొక్క కర స్పర్శలోని విశిష్టత ఆశ్చర్యకరం. ఆ స్పర్శ ప్రళయాగ్నిలో కూడా దహింపబడని సూక్ష్మ శరీరాన్ని దహింపజేసి భస్మీభూతం చేస్తుంది. 4. దేవుని కథా విశేషాలను వింటే శిరో వేదన కలిగి అసంబద్ధంగా వాగే వారికి కూడా అది స్థిరత్వాన్ని కలిగిస్తుంది. 5. సాయి తమ కరకమలాన్ని శిరసుపై ఉంచితే అనేక జన్మల పరిపక్వపాపాలు ప్రక్షాళనమై భక్తులు పావనులౌతారు. 6. వారి సుందర రూపాన్ని చూస్తుంటే, పరమానందంతో కంఠం గద్గదమౌతుంది. కళ్ళనుండి ఆనంద బాష్పాలు ప్రవహిస్తాయి. హృదయంలో అష్టభావాలూ ప్రకటమవుతాయి. 7. సోహం భావం జాగృతమై ఆత్మానందం కలుగుతుంది. నేను, నువ్వు అనే భేదభావం వెంటనే సమసిపోయి సమరసమైన అద్వైతభావం కలుగుతుంది. 8. పురాణాలను పవిత్ర గ్రంథాలను చదువుతుంటే అడుగడుగునా సద్గురువు స్మరణకు వస్తారు. సాయిబాబా రామునిలా, కృష్ణునిలా

నటిస్తూ తమ చరిత్రను తామే వినిపిస్తారు.9.భాగవతం వినటానికి కూర్చుంటే సాయి నఖశిఖాంతం కృష్ణునిలా, భక్తులహితం కోసం ఉద్ధవగీతను గానం చేస్తున్నట్లు అనిపిస్తుంది. 10.ఊరికే మాట్లాడుతూ కూర్చుంటే కూడా ఒక అనుభవాన్ని చెప్పాలని అకస్మాత్తుగా సాయినాథుని కథ గుర్తుకు వస్తుంది. 11. చెప్పటానికి కాగితం తీసుకొని వ్రాద్దామనుకుంటే అక్షరానికి అక్షరం జోడించను వీలుకాదు. కాని అదే సాయి తమ శక్తితో వ్రాయిస్తే రచనాధార ఆగకుండా సాగుతుంది. 12.అహంభావం తలెత్తినప్పుడల్లా వారు దాన్ని తమ హస్తంతో క్రిందకు అణచి వేసి,తమ శక్తిపాతంతో శిష్యులను కృతార్థులను చేస్తారు. 13. కాయా వాచా మనసా, సాయి సమర్థునికి సాష్టాంగ పడితే కోరుకోకుండానే ధర్మార్థ కామ మోక్షాలు తమంతట తామే హస్తగతమవుతాయి.14.కర్మ జ్ఞాన భక్తి యోగాలనే ఈ నాలుగు మార్గాల ద్వారా ఈశ్వర ప్రాప్తి. ఈ నాలుగు దిక్కులనుండి బయలుదేరినప్పటికీ ఇవి మనలను గమ్యానికి చేర్చుతాయి. 15.భక్తి మార్గం తుమ్మవనం వంటిది. గుంతలతో కూడిన అతి కష్టమైనమార్గం. ఒక్కో అడుగు వేస్తూ నడిచే ఇరుకు మార్గం; అయినా అది హరి సమీపానికి తీసుకొని వెళ్లుతుంది.16.ముళ్లను తొలగించుకొని అడుగు వేయాలి. ఇదొక్కటే సులభోపాయం. అప్పుడే నిర్భయంగా మనధామాన్ని చేరుకుంటామని గురుమాత స్పష్టంగా చెప్పారు.17.మనోమాలిన్యాన్ని భక్తితో శుభ్రం చేస్తే వైరాగ్యం వికసిస్తుంది.జ్ఞానం పుష్పించి కైవల్య ఫలం లభిస్తుంది. ఆత్మానందం కలుగుతుంది. జనన మరణాలు కూడా తప్పుతాయి.18.పరమాత్మ స్వయం సిద్ధుడు.అతడే త్రివిధరూపమైన సచ్చిదానందుడు.ఉపాధిని గ్రహించి, భక్తులకు జ్ఞానబోధ చేయటానికి ప్రకటమయ్యాడు.19.పరమాత్మ సత్త్వరజతస్తమోగుణాలనే మూడు గుణాలతో వ్యక్తమవగానే మాయ కూడా క్రియా ప్రయుక్తమై సత్త్వరజస్తమోగుణాలను సుస్పష్టంగా వ్యక్తం చేసింది. 20.మట్టితో తయారైన ఒక విశిష్ట ఆకారం పేరు

కుండ,అది బ్రద్దలవుతే నామరూపవికారాలు పోతాయి. 21.ఈ అఖిల జగత్తు మాయనుండి వచ్చింది. జగత్తు, మాయ కార్య కారణ భావం కలిగి ఉంటాయి. వాస్తవానికి మాయయే సాకారమై ప్రత్యక్షంగా జగత్తు రూపంలో ఉద్భవించింది. 22.ఈ జగత్తుకు మునుపు మాయ బయటికి వ్యక్తం గాని స్థితిలో పరమాత్మలో లీనమై అవ్యక్తంగా ఉండేది. 23.అంటే ఇది వ్యక్తమైనప్పుడు పరమాత్మ రూపం. అవ్యక్తంగా ఉన్నా పరమాత్మరూపమే. ఈ విధంగా ఈ మాయ పరమాత్మకు ప్రతిరూపం. పరమాత్మకు అభేదం. 24.ఈ మాయ తమోగుణం నుండి చలనం లేని నిర్జీవ జడపదార్థాన్ని నిర్మించింది.ఇది ఆమె మొదటి క్రియ.25.తరువాత మాయ యొక్క రజో గుణం పరమాత్మ యొక్క చిత్ కళతోకలసి ఉభయ స్వభావ గుణాలతో విశ్వచైతన్యమయింది. 26.అటు తరువాత మాయ యొక్క సత్వగుణం బుద్ధి తత్వాన్ని నిర్మించింది. ఇందులో పరమాత్మ యొక్క ఆనంద గుణం మిళితమవ్వగా అక్కడితో ఆలీల సంపూర్ణమయింది. 27.ఈ విధంగా మాయ మహావికారి, క్రియోపాధిని గ్రహించనంత వరకు, పై తెలిపిన పదార్థాలను నిర్మించనంత వరకు త్రిగుణాలు అవ్యక్తంగానే ఉంటాయి. 28.గుణానురూపమైన క్రియను చేపట్టనంత వరకు మాయ వ్యక్తంకాదు.అంటే ఏ క్రియా చేయక అక్రియగా ఉన్నంత వరకు అది అవ్యక్తంగానే ఉంటుంది. 29.మాయ పరమాత్ముని కార్యమైతే, ఈ జగత్తు మాయ యొక్క కార్యం. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' దృశ్య జగత్తు అంతా బ్రహ్మమే అన్న ఈ తత్వం బ్రహ్మ మాయ మరియు జగత్తు ఈ మూడింటి యొక్క ఐక్యతను తెలుపుతుంది.30.ఈ మూడు ఒక్కటే అన్న అభేదాన్ని నిశ్చయంగా అనుభవపూర్వకంగా పొందాలని కోరుకునే వారు వేద శాస్త్రాలను అధ్యయనం చేయాలి. 31.సారాసారవిచారశక్తి, వేదశాస్త్రాలు, శ్రుతులు, స్మృతులు, గురువచనాలు,వేదాంత వాక్యాల అనుభవం, పరమానంద ప్రాప్తిని కలిగిస్తాయి.32.నా భక్తుల గృహాలలో అన్న వస్త్రాలకు

లోటుండదని సాయి అభయమిచ్చిన విషయం భక్తులకు అవగతమే 33. నన్ను అనన్యంగా భజించే వారి యొక్క మఱియు నిత్యమూ పవిత్ర మనసులతో నన్ను సేవించే వారి యోగక్షేమాలు వహించటం నా వ్రతం. 34. ఈ భగవద్గీతా వచనాన్ని ప్రమాణంగా తీసుకోండి. ఇక్కడ అన్నవస్త్రాలకు కొరతే ఉండదు. వానికొఱకు మీ శక్తిని వ్యర్థం చేసుకోకండి అని సాయి అన్నారు. 35. లౌకికమైన గౌరవ మర్యాదలను వదిలిపెట్టి దేవుని ద్వారం వద్ద తలను వంచండి. దేవుని ఎదుటే కొంగు చాచండి. దేవుని అనుగ్రహాన్ని పొందండి. 36. లోకులు గౌరవించినంత మాత్రాన తననుతాను మరచిపోవాలా? ఆరాధ్యమూర్తి యొక్క అంతఃకరణం కరుణతో కరిగిపోయి చెమటలు పట్టాలి. 37. ఈధ్యేయం మీదే ప్రీతి కలగాలి. సర్వేంద్రియాలకు భక్తి పిచ్చి పట్టాలి. ఇంద్రియ వికారాలు భక్తివైపు మొగ్గాలి. ఇక ఇతర కోరికలు ఏముంటాయి. 38. ఇతర విషయాలపై ప్రీతి లేకుండా ఎల్లప్పుడూ భజన జరగాలి. మనసు అన్నిటినీ మరచిపోయేలా నామస్మరణ యందు లగ్నమవ్వాలి. 39. అప్పుడు శరీరం, గృహం, ధనం, ఇవి గుర్తుండవు. చిత్తం పరమానందంలో నిమగ్నమౌతుంది. మనసు నిశ్చయంగా సముదర్శియై పరిపూర్ణమైన ప్రశాంతతను పొందుతుంది. 40. సత్సంగం చేసిన ఫలితంగా చిత్తవృత్తి శాంతించాలి. అనేక విషయాలపై చంచలంగా భ్రమించే మనసుకు తల్లీనత ఎక్కడిది? 41. శ్రోతలు ఈ సాయి చరిత్రను శ్రవణం చేస్తే మనసు భక్తివైపు మళ్ళుతుంది. అందు వల్ల సావధానులై శ్రద్ధగా భక్తిభావంతో ఈ కథను వినండి. 42. కథలలోని విషయాలను వింటే చంచలమైన మనసుకు తృప్తి, విశ్రాంతి కలుగుతాయి. అశాంతి నివృత్తియై సుఖం కలుగుతుంది. 43. ఇప్పుడు పూర్వకథానుసంధానం. శిథిలావస్థలో ఉన్న మసీదును మరమ్మత్తు చేసే విషయం, శ్రీరామ జన్మ కథా సంకీర్తనం గురించి మనవి చేస్తాను. 44. గోపాలగుండు అనే ఒక భక్తునికి బాబా యందు అమిత భక్తి. బాబా నామాన్ని ఎల్లప్పుడూ జపిస్తూ కాలం గడిపేవాడు. 45. అతనికి సంతానం

లేదు. తరువాత సాయి అనుగ్రహంతో పుత్రరత్నం కలిగి సంతుష్టుడయ్యాడు. 46. శిరిడీ గ్రామంలో ప్రతి సంవత్సరం ఒక జాతర లేక ఒక ఉరుసును ఏర్పాటు చేయాలని అది అందరికీ ఉత్సాహకరంగా ఉంటుందని గోపాలగుండుకు సంకల్పం కలిగింది. 47. ఈ విషయం తాత్యాకోతే, దాదాకోతే మాధవరావాది ప్రముఖులందరికి సమ్మతమై, దాని కొఱకు అన్ని ఏర్పాట్లను చేయసాగారు. 48. ఇలాంటి వార్షిక ఉత్సవానికి ముందుగా జిల్లా అధికారియొక్క అనుమతిని పొందటం ఆవశ్యకమైన నియమం. 49. అందుకొఱకు ప్రయత్నించగా ఊళ్ళోని ఒక కులకర్ణి కుత్సిత బుద్ధితో అడ్డుతగిలి వ్యతిరేకించడం వలన కార్యంలో విఘ్నం ఎదురైంది. 50. అలా కులకర్ణి అడ్డుపడిన పరిణామంగా శిరిడీలో జాతర జరగడానికి వీల్లేదని జిల్లా అధికారి ఆజ్ఞ జారీ అయింది. 51. కాని, శిరిడీలో ఈ జాతర జరపాలని బాబా సంకల్పం కావటం వలన, వారి ఆశీర్వాదం, వారి పూర్తి అనుమతి లభించాయి. 52. గ్రామస్థులు మరల గట్టిగా ప్రయత్నించగా అధికారులు తమ ఆజ్ఞను మార్చి అందరి కోరికను మన్నించారు. 53. అప్పటినుండి బాబా సమ్మతితో రామనవమికి ఉత్సవం నిశ్చయమైనది. దాని ఏర్పాట్లన్నిటినీ తాత్యాకోతే చూసేవాడు. ఉత్సవానికి జనం అమితంగా వచ్చేవారు. 54. శ్రీరామనవమి రోజున భజన పూజ సమారంభాలతో రకరకాల బాజాబజంత్రీలతో నలువైపుల నుండీ యాత్రికులు బాగా వచ్చేవారు. 55. ప్రతి సంవత్సరం రెండు క్రొత్త పతాకాలను వాద్యాలతో ఊరేగించి తెచ్చి మసీదు శిఖరానికి కట్టుతారు. అవి అక్కడే ఉంటాయి. 56. వానిలో ఒకటి నిమోన్‌కరుది. రెండవ పతాకం దావూ అణ్ణాది. ఆర్భాటంగా ఊరేగింపు ముగిశాక అవి శిఖరంపై ఎగురుతుంటాయి. 57. శ్రీరామనవమి ఉత్సవం, ఉరుసులో నుండి ఎలా ఉద్భవించింది అన్న ఆశ్చర్యకరమైన కథను వినండి. శిరిడీ యొక్క గౌరవాన్ని తెలుపుతుంది. 58. శక సం. 1833 లో శ్రీరామనవమి మొదట ఉరుసు

నుండి పుట్టింది. అప్పటినుండి నిరాటంకంగా జరుగుతూ ఉంది.59. ప్రసిద్ధి చెందిన కృష్ణ జాగేశ్వర భీష్మునికి, పరమ కల్యాణ ప్రదమైన రామనవమి ఉత్సవం జరిపించాలన్న సంకల్పం కలిగింది.60. అప్పటి వరకు కేవలం ఉరుసు జాతర మాత్రమే సాగేది. అందులో నుండే ఆ ఏడు శుభప్రదమైన ఈ రామజన్మోత్సవం ఉదయించింది.61. ఒకసారి భీష్ముడు ప్రశాంతంగా వాడాలో కూర్చుని ఉండగా కాకామహాజని పూజాసామగ్రితో మసీదుకు బయలుదేరాడు.62. కాకా మనసులోసాయిదర్శన లాలస, ఆపైన ఉరుసు ఉత్సాహం. కాకా ఉత్సవానికై ఒకరోజు ముందుగానే శిరిడీలో హాజరయ్యాడు.63. సరియైన ఆ సమయంలో భీష్ముడు కాకాతో 'నాకొక మంచి ఆలోచన స్ఫురించింది. నీవు నాకు సహాయం చేస్తావా అని అడిగాడు.64. రామజన్మదినమైన ఈ రోజు ఇక్కడ ప్రతి సంవత్సరం ఉరుసు జరుగుతోంది. ఉరుసుతో పాటు రామ జన్మోత్సవాన్ని కూడా ఏ శ్రమ లేకుండా జరపటానికి ఇది మంచి అవకాశం అని అన్నాడు.65. అతని అభిప్రాయం కాకాకు నచ్చింది. ముందు బాబా అనుమతి తీసుకో, వారి ఆజ్ఞ ఉండాలిగాని ఇక కార్యానికి ఏం ఆలస్యం లేదు అని చెప్పాడు.66. ఉత్సవంలో సంకీర్తన అవసరం. మరి ఎవరుచేస్తారు? అన్న ప్రశ్న. ఈ చిన్న గ్రామంలో హరిదాసు ఎక్కడి నుండి వస్తాడు అన్న ఒక సమస్య ఎదురైంది.67. భీష్ముడు 'నేను సంకీర్తన చేస్తాను. నీవు హార్మోనియంతో శ్రుతి కలుపు. రాధాకృష్ణబాయి ప్రసాదానికి సాంబిపొడి తయారు చేస్తుంది.68. పద బాబా వద్దకు పోదాం. శుభకార్యంలో ఆలస్యం కష్టకారకం. శుభానికి శీఘ్రత్వాన్ని జోడిస్తే ఆ కార్యాన్ని తప్పక సాధించవచ్చు.69. మనం వెళ్లి బాబాను సంకీర్తన చేయటానికి అనుమతిని కోరుదాం' అని అంటూ ఆ ఉభయులు మసీదుకు వెళ్ళారు.70. కాకా బాబా పూజను ఆరంభించగా బాబాయే అతనిని వాడాలో ఏం జరుగుతోంది అని ప్రశ్నించారు. కాకాకు ఏం అర్థం కాలేదు.71. వెంటనే బాబా అదే

ప్రశ్నను వేరు విధంగా వేశారు. భీష్మునితో ఏం బువా ఏమిటి అంటున్నావు అని అడిగారు. 72.అప్పుడు కాకాకు గుర్తుకు వచ్చింది. తమ ఉద్దేశాన్ని బాబాతో విన్నవించాడు. బాబాకు ఆ విషయం నచ్చింది.అలా ఉత్సవం నిశ్చయమయింది.73.మరునాడు ఉదయం బాబా లెండీకి వెళ్ళడం చూచి సభామండపంలో ఊయలను కట్టి సంకీర్తనకు సిద్ధమయ్యారు.74.తరువాత ఆ సమయానికి శ్రోతలు గుమిగూడారు. బాబా తిరిగివచ్చారు. భీష్ముడు లేచాడు. కాకావచ్చి హార్మోనియం ముందు కూర్చున్నాడు. ఇంతలో బాబా అతనిని రమ్మని కబురుపంపారు.75. బాబా నిన్ను రమ్మంటున్నారు అన్న కబురు విని కాకా మనసు మూగపోయింది. ఏం జరిగిందో తెలియలేదు. కథలో రసభంగం వాట్లిల్ల కూడదు. 76.బాబా యొక్క పిలుపు కాకాను కలవరపరిచింది. బాబాకు కోపం వచ్చిందా? సంకీర్తన నిర్విఘ్నంగా జరుగుతుందా 77.అని అనుకుంటూ కాకా అడుగు ముందుకు వేస్తూ వెనుకకు చూస్తూ భయంభయంగా నడుస్తూ మెల్లగా మెట్లు ఎక్కాడు కాని ఆలోచనలో పడ్డాడు. 78.అతనిని బాబా 'ఎందుకిక్కడ ఊయలను కట్టారు' అని అడిగారు కథా సంకీర్తన కోసమని విని బాబా ఆనందించారు. 79.అక్కడే సమీపంలో ఉన్న నింబారు వద్ద నుండి అందమైన ఒక మాలను తీసి కాకా మెడలో వేసి ఇంకో మాలను భీష్ముని కోసం ఇచ్చారు. 80. ఊయలను గూర్చి అడిగినప్పుడు భయపడ్డా, కాకా మెడలో మాల పడగానే అందరికీ ఊరట కలిగింది. 81.అసలే భీష్ముడు బహుశ్రుత వివిధ కథా పారంగతుడు కనుక సంకీర్తన రసభరితంగా సాగింది. శ్రోతలు అపరిమితానందాన్ని పొందారు. 82.బాబా కూడా అప్పుడు ప్రసన్న వదనులయ్యారు. వారు అనుమతిని ప్రసాదించినట్లే ఉత్సవాన్ని భజన సంకీర్తన సమేతంగా చేయించుకున్నారు. 83.రాముని జన్మ సమయమందు బాబా కళ్లలో గులాల్ పడగా కౌసల్య మందిరంలోని శ్రీరామునికి బదులుగా బాబా నరసింహస్వామిలా ప్రకటమయ్యారు.

84.గులాల్ కేవలం సాకు. రాముని జన్మలోని ఉత్సాహంతో అహం అనే రావణాసురుడు నశిస్తాడు. అంటే దుర్వృత్తి అనే రాక్షసుడు చస్తాడు. 85.అకస్మాత్తుగా బాబాకు కోపం వచ్చింది.నరసింహుని ప్రత్యక్ష అవతారంలా తిట్లను శాపాలను అమితంగా కురిపించారు. 86.ఊయలను ముక్కలు చేస్తారేమో,దాన్ని ఎలా భద్రపరచాలి అని రాధాకృష్ణమాయికి మనసులో చింతపట్టుకుంది. 87.అందుచేత దానిని వెంటనే విప్పెయ్యమని వెనుకనుండి అనగా, కాకా ఊయలను విప్పటానికి ముందుకు జరిగాడు. 88.అప్పుడు బాబా అత్యంత కోపంతో కాకా మీదకు ఉరికారు. ఊయలను విప్పేపని ఆగిపోయింది. బాబా వెంటనే చల్లబడ్డారు. 89.తరువాత మధ్యాహ్నం ఊయలను విప్పడానికి బాబా అనుమతిని కోరగా బాబా ఆశ్చర్యంగా 'అప్పుడే ఊయలను ఎలా విప్పుతారు? ఇంకా దీని అవసరముంది కదా' అని అన్నారు.90.ఆ అవసరమేమిటి? సాయి వచనాలు ఊరికే అన్నవి కావు అని ఆలోచించగా బాబా చెప్పిన మాట నిజమే. ఉత్సవం ఇంకా సమాప్తి కాలేదని వారి బుద్ధికి స్ఫురించింది.91.ఉత్సవం జరిగిన మరునాడు గోపాలకాలా జరిగితేనే కాని ఉత్సవం సంపూర్ణం కాదు.92.అందువల్ల రెండవరోజు గోపాలకాలా కీర్తన జరిగాక ఊయలను విప్పటానికి బాబా అనుజ్ఞ ఇచ్చారు.93.తరువాతి సంవత్సరం భీష్ముడు లేడు.సంకీర్తనకు బాలబువాసతార్కర్‌ను రప్పించవలెనని తలచారు. కాని అతనికి కవట్యాకు వెళ్లవలసి ఉండినది.94.అందువలన కాకా మహాజని, అర్వాచీన తుకారామని ప్రసిద్ధి చెందిన బాలబువా అనే భక్తుని తీసుకుని వచ్చి అతనితో ఉత్సవాన్ని చేయించారు.95.ఆ బాలబువా కూడా దొరకని పక్షంలో కీర్తనకు కాకాయే నడుం కట్టాల్సి వచ్చేది. అతనికి దాసుగణు రచించిన రామనవమి కథ బాగా తెలుసు.96.మూడవ సంవత్సరం బాలబువా సాతార్కర్ సమయానికి శిరిడీ రావడం ఎలా జరిగిందో, శ్రద్ధగా వినండి.97.సాయి బాబా కీర్తిని విని వారిని దర్శించుకోవాలన్న కోరిక బాల బువా మనసులో

కలిగింది. కాని తనకు ఎవరు తోడు దొరుకుతారా అని అతని ఆలోచన.98.బాలబువా స్వయంగా హరిదాసు. సాతారాలో ఉండేవాడు. కాని అప్పుడు ముంబైలోని పరేల్ అన్న చోట ఉన్నాడు.99.సతారా జిల్లాలో బిర్వాడ్ సిద్ధ కవట్యాలో ఒక దేవస్థానం ఉంది. అక్కడ రామనవమికి ప్రతి ఏడూ బువా సంకీర్తన చేసేవాడు.100.ఆషాఢ ఏకాదశి, చైత్ర మాసంలో శ్రీరామ నవమి, ఈ రెండు వార్షికోత్సవాలు జరపడానికి బువా నియమింపబడ్డాడు.101.అక్కడి రాజశాసనం ప్రకారం ప్రభుత్వం ఆ దేవుని ఖర్చుకు 124రూపాయిలను ఆ సంస్థానానికి ఇవ్వవలసిన ఏర్పాటు ఉండేది.102.ఈ రెండు ఉత్సవాలకు బాలబువాకు 30 రూపాయలు సంభావన ఇచ్చేవారు.కాని ఆ సంవత్సరం కవట్యాలో మహమ్మారి వచ్చి గ్రామస్థులు కష్టాల్లో పడ్డారు.103.అందువలన ఊరు ఖాళీ అయిపోయింది. రామనవమి ఉత్సవం ఆగిపోయింది.దాంతో ఉత్సవానికి ఆమరు సంవత్సరం రమ్మని బువాకు ఉత్తరం వచ్చింది.104.సారాంశం రాముని సేవాభాగ్యం తప్పిపోయింది. సంభావన కూడా ఆగిపోయింది. అలా అతనికి శిరిడీకి వెళ్ళటానికి అవకాశం లభించింది. వెంటనే వెళ్ళి దీక్షితును కలుసుకున్నాడు.105.బాబా యొక్క పరమ భక్తుడైన దీక్షితు తలుచుకుంటే శిరిడి వెళ్ళాలన్న అతని కోరికను తీర్చగలడు. స్వార్థం పరమార్థం సాధించుకోవచ్చు.106.అని తలచి అతడు దీక్షితుతో ఈ ఏడు వార్షికోత్సవం ఆగిపోయింది. అందువల్ల బాబా దర్శనం చేసుకొని అక్కడ సంకీర్తన కూడా చేయాలని ఉంది అని చెప్పాడు.107.శిరిడీ నుండి వచ్చిన మహాజని, భావుసాహెబు దీక్షితు, అతనితో మీకు సంభావన ఇవ్వటం, ఇవ్వకపోవటం బాబా ఇష్టం.దాని గురించి మేం నిశ్చయంగా చెప్పలేం కాని మీరు కీర్తన చేయటం సమ్మతమే అని చెప్పారు.108.ఇలా సంభాషణ జరుగుతుండగా అక్కడికి కాకా మహాజని అకస్మాత్తుగా వచ్చి శుభశకునంలా శిరిడీ ప్రసాదాన్ని విభూతిని పంచాడు.109.అప్పుడే శిరిడీ నుండి వచ్చిన కాకా మహాజని,

క్షేమసమాచారాలను తెలుసుకుని, తన ఇంటికి వెళ్ళిపోయాడు.110.తరువాత దీక్షితు బువాతో ప్రేమగా బాబాను అడిగి తెలుసుకొని వారు సమ్మతిస్తే మీకు తప్పక కబురు పెడతాను.111.నా ఉత్తరం అందగానే మీరు శిరిడీకి రండి.దారి ఖర్చులకు ఏం భయపడకండి. దానికోసం మీరేం కష్టపడకుండా నిశ్చింతగా ఉండండి అని చెప్పాడు.112.తరువాత దీక్షితు శిరిడీ వెళ్ళాడు. బాబా అనుమతిని ఇచ్చారు. బాలబువా శిరిడీకి వచ్చి మనసారా సాయిబాబా దర్శనం చేసుకున్నాడు.113.అలా సాయిబాబా రామనవమి ఉత్సవ వైభవాన్ని అందరి సమక్షంలో, విశేషమైన ప్రేమతో బాలబువాతో చేయించారు.114.తన కోరిక ఫలించినందుకు బాల బువా సంతుష్టుడయ్యాడు. సాయిబాబా కూడా ప్రసన్నులయ్యారు.అందరి మనోభీష్టం నెరవేరింది.115.బువాకు 150/-రూల సంభావన కూడా ఇవ్వటానికి బాబా ఆజ్ఞ కాగా అతడు అపరిమితానందాన్ని పొందాడు.116.కవట్యాలో ఐదు సంవత్సరాలకు లభించే సంభావన బాబా ఒకే ఉత్సవంలో ఇస్తే మరి బువా ఎందుకు ఆనందించడు? బాబాకు ఎంతో కృతజ్ఞుడయ్యాడు.117.తరువాత ఒకరోజు దాసుగణు శిరిడీకి రాగా ప్రతి సంవత్సరం రామనవమి ఉత్సవాన్ని జరిపించే బాధ్యతను, బాబా అనుమతితో అతనికి అప్పగించారు.118.అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ జన్మోత్సవం అతి వైభవంగా ఆర్భాటంగా జరుగుతుంది.పీకల వరకు తినేలా అన్న సంతర్పణ, పేద పిల్లలకు మహదానందం.119.సమాధి మందిరం యొక్క మహాద్వారం వద్ద మంగళ వాద్యాలతో మేళతాళాలతో ఆనందంగా సాయి నామ ఘోష అంబరాన్ని తాకుతూ ఉంటుంది.120.గోపాలగుండుకు ఉత్సవం జరపాలని సంకల్పం కలిగినప్పటి, శిథిలమైన మసీదును అందంగా,రూపొందించాలని స్ఫురించింది.121.మసీదును తాను బాగు పరచాలని నిర్ధారించుకొని దానికై రాళ్ళను సిద్ధపరచాడు.122.కాని ఈ జీర్ణోద్ధరణ యోగం అతని భాగ్యంలో లేదు కాబోలు. ఈ విశిష్టమైన కార్యం బాబా

మనసుకు నచ్చినట్లుగా సిద్ధించింది.123.ఈ కార్యాన్ని నానాచందోర్కర్‌తో చేయించాలని,ఆ తరువాత మసీదు నేలను కాకా దీక్షితు ద్వారా మరమత్తు చేయించాలని బాబా మనసులో ఉండి ఉంటుంది.124.అది అట్లాగే జరిగింది.బాబా ఆజ్ఞను అడిగి అడిగి అందఱూ అలసిపోయి, మహాల్సాపతిని మధ్యస్థం చేసుకోగా అప్పుడు బాబా తమ అనుమతిని ఇచ్చారు.125.మసీదు నేలను ఒక రాత్రిలోనే బాగుచేసారు. ఆ మరునాడే బాబా గద్దెపై కూర్చున్నారు.126.క్రీ.శ.1911వ సంవత్సరంలో సభామండపం తయారయింది. దానికోసం ప్రచండ ప్రయత్నం చేసి ఎంతో ప్రయాస పడ్డారు. అది అందరికీ వణుకు పుట్టించింది.127.ఇదే విధంగా భక్తులు శ్రమపడి ఆ పనిని ఒకే రాత్రిలో పూర్తి చేశారు.128.రాత్రి ప్రయాసతో స్తంభాలను పాతటం, వానిని బాబా ఉదయం ఊడ బెరకటం, భక్తులు అదను చూచుకొని మరల గట్టిగా పాతటం,ఈ విధంగాఎంతో శ్రమపడ్డారు.129.అంతా నడుం బిగించి రాత్రిని పగలుగా మార్చి,తమ కోరికను తీర్చుకోవటానికి చాలా కష్టాలను సహించారు.130.మొదట మసీదులో ఖాళీ స్థలం కొద్దిగానే ఉండేది. దీనిని యోగ్యమైన సభామండపంలా తయారు చేయాలన్న సంకల్పం దీక్షితుకు కలిగింది.131.దానికి కావలసినంత డబ్బు ఖర్చుచేసి ఇనుప దూలాలను తెప్పించి బాబా శయనించటానికి చావడికి వెళ్ళినప్పుడు ఈ కార్యాన్ని సాధించాడు.132.భక్తులు రాత్రిని పగలుగా చేసి కష్టపడి దూలాలను పాతటం బాబా చావడినుండి రాగానే వానిని ఊడదీయటం.133.ఒకసారి బాబా అత్యంత కోపంతో ఒకచేత్తో తాత్యామెడను పట్టుకొని రెండవ చేత్తో ఒక స్తంభాన్ని కదిపి ఊడపెరకాలని చూచారు.134. స్తంభాన్ని బాగా కదిలించి వదులు చేశారు. తాత్యా తలపైని పాగా లాగేసి పుల్లగీసి దానికి నిప్పంటించి కోపంగా గుంతలో పడేశారు.135.ఆ సమయంలో వారి కళ్ళు అగ్ని గోళాల వలె కనిపించేసరికి అందరి ధైర్యం సడలిపోయింది. వారి ముఖం వైపు ఎవరు

చూడగలరు?136.వెంటనే బాబా తమ కఫనీ జేబులో చెయ్యి వేసి, ఒక రూపాయిని బయటకు తీసి,అది సుముహూర్తమన్నట్లుగా,అక్కడ దానిని కూడా నిక్షిప్తం చేశారు.137.తిట్లను శాపాలను వర్షంలా కురిపించారు. తాత్యా కూడా మనసులో చాలా కలవరపడ్డాడు. ఆ వికట పరిస్థితి ఎలా జరిగిందా అని 138.జనులు, భక్తులు ఆశ్చర్యపోయారు.ఈ రోజు ఎందుకో దుశ్శకునాలు?తాత్యాపటేలుకు కలిగిన ఈ బాధ ఎలా తొలుగుతుంది?139.భాగోజి శిండె ధైర్యంచేసి మెల్లమెల్లగా ముందుకు జరిగాడు. కాని అతడు కూడా బాబా చేతికి చిక్కాడు.బాబా అతనిని తమ ఇష్టమొచ్చినట్లు బాగా గ్రుద్దారు.140.మాధవరావు కూడా వారి చేతిలో పట్టుబడ్డాడు. అతడు కూడా ఇటుక దెబ్బల ప్రసాదాన్ని పొందాడు. మధ్యస్థంగా వెళ్లిన వారిని కూడా బాబా దెబ్బలతో అనుగ్రహించారు.141.బాబా ఎదుట పడి తాత్యాను ఎవరు విడిపించగలరు అని అనుకుంటుండగా బాబా కోపం సన్నగిల్లి శాంతించారు.142.వెంటనే అంగడి వానిని పిలిపించి జరీ అంచు తలపాగాను తెప్పించారు. దానిని తామే న్యయంగా తాత్యాను సన్మానించారా అన్నట్లు అతని తలకు కట్టారు.143.ఆ కోపానికి కారణమేమిటి? తాత్యాపై విరుచుకుపడటం, అరవటం ఎందుకు అని భక్తులు ఆశ్చర్యపోయారు.144.బాబాకు ఎందుకు కోపం వచ్చింది, క్షణంలోనే ప్రసన్న చిత్తులయ్యారు దీనికి కారణం ఎవరికీ ఏమీ తెలియలేదు.145.బాబా ఒకప్పుడు శాంతచిత్తులై ఉంటారు. కథలను, కబుర్లను ప్రేమగా చెబుతారు. మరునిమిషం ఏ కారణం లేకుండానే అకస్మాత్తుగా కోపోద్దీపితులవుతారు.146.ఇట్టి బాబా విషయాలు ఒకటి చెప్పుతుంటే మరొకటి గుర్తుకు వస్తాయి. ఏది చెప్పాలి ఏది మానాలి? పక్షపాతం తగదుకదా!.147.నా ఇష్టాయిష్టాలు చూడటం తగదు. ఈ కథలను శ్రవణం చేయాలన్న శ్రోతల కోరికను తీర్చే కథలు సందర్భానుసారంగా ఉంటాయి.148.తరువాతి అధ్యాయంలో పెద్దల నోటినుండి

విన్న వారి గత చరితాలను శ్రవణం చేయండి. సాయిబాబా హిందువా లేక ముసల్మానా అన్న విషయాన్ని నాక
తోచిన విధంగా తెలియ చేస్తాను.149.బాబా దక్షిణ నెపంతో డబ్బు తీసుకొని దేవాలయ జీర్ణోద్ధరణకై ఖర్చు
చేయడం,ధోతి పోతి ఖండయోగంతో తమ శరీరాన్ని ఎలా కష్టపెట్టేవారు.150.పరులకోసం ఎలా శ్రమ పడతారు,
భక్తుల కష్టాలను ఎలా నివారిస్తారు అన్న వివరాలు తరువాతి అధ్యాయంలో స్పష్టమవుతాయి.వీనిని విని శ్రోతల
సంతుష్టులవండి.151.స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి
సమర్థసచ్చరితంలో రామజన్మోత్సవ కథా వివరణ అన్న ఆరవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత - 7వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీకులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఇప్పుడు పూర్వ కథను గుర్తుకు తెచ్చుకుందాం. దేవాలయాలను బాగుపరచటంలో బాబాకు ఎంత ప్రీతి.1.బాబా పరోపకార్యార్థం ఎలా శ్రమపడేవారు, తమ భక్తులను ఎలా చూచుకునేవారు భక్తుల కష్టాలను సహించడానికి తమ శరీరాన్ని ఎలా శ్రమ పెట్టేవారు.2.సమాధి, ఖండయోగం, ధౌతి, పోతి మొదలగు ప్రయోగాలను చేసేవారు. చేతులు కాళ్ళు శిరస్సును వేరుగా చేసి మరల వానిని పూర్వంలా కలిపేవారు. 3.బాబాను హిందువు అనుకుంటే యవనునివలె, యవనుడనుకుంటే సులక్షణమైన హిందువువలె కనిపించే విలక్షణమైన అవతారం వారిది. ఏ పండితుడు వారిని వర్ణించగలడు? 4.వారు హిందువా లేక మహమ్మదీయ జాతికి చెందినవారా అని అణుమాత్రమైనా అంతు చిక్కలేదు. వారెప్పుడూ రెండు జాతుల వారినీ సమానంగా చూచేవారు.5. హిందువుల రామనవమి పండుగను స్వయంగా జరిపించేవారు. సభామండపంలో మధ్య ఊయలను కట్టించి కథా సంకీర్తనను చేయించేవారు. 6.తమ సమక్షంలో ఊయల ఉండగా రామకీర్తనను చేయించేవారు, అదే రాత్రి మహమ్మదీయులకు కూడా సందల్ (చందోత్సవం) ఊరేగింపుకు అనుమతినిచ్చేవారు. 7.చాలామంది మహమ్మదీయులు చందన ఊరేగింపు ఉత్సవాన్ని వైభవంగా జరుపుకునేవారు. బాబా ఉభయ ఉత్సవాలను సంతోషంగా సమానంగా జరిపించేవారు. 8.రామనవమి రోజున కుస్తీలపోటీలను పెట్టించవేసి ఉత్సాహంగా కంకణాలను తలపాగాలను గుఱ్ఱాలను బహుమతిగా ప్రదానం

చేసేవారు. 9.గోకులాష్టమి పండగ వస్తే గోపాలకాలా జరిపించేవారు. అల్లే ముసల్మానుల పండుగ వస్తే నమాజు చదవటానికి అడ్డుపెట్టేవారు కాదు. 10.ఒకసారి మొహరం పండుగ రాగా ముసల్మానులు కొందఱు మసీదుకు వచ్చి ఒక తాబూత్ ను చేయించి ఊళ్లో ఊరేగించాలన్నారు.11.అల్లే బాబా ఆజ్ఞాను సారం తాబూత్‌ను తయారు చేసి నాలుగు రోజులుంచి ఐదవ రోజున దానిని క్రిందకు దించేశారు. అయినా బాబా మనసుకు సంతోషం లేదు, దుఃఖమూ లేదు. 12.బాబా ముసల్మాను అనుకుందామా అనుకుంటే వారి చెవులు కుట్టి ఉండేవి. హిందువు అని అనుకుందామంటే వారి సుంతీ ప్రమాణం.అలా హిందువూ కాని ముసల్మాను కాని పావన అవతారం సాయిది. 13.వారిని హిందువు అనుకుంటే సదామసీదులో నివాసం, యవనులని అనుకుంటే మసీదులో అహర్నిశలూ అగ్నిహోత్రం. 14.మసీదులోవిసరటం, మసీదులో ఘంటావాదన శంఖానినాదం, మసీదులో అగ్నికి ఆహుతులు. ఇక వారు ముసల్మాను ఎలా అవుతారు? 15.ఎల్లప్పుడూ మసీదులో భజనలు అర్ఘ్యపాద్య పూజలు,అన్న సంతర్పణలు, ఇక వారు ముసల్మాను ఎలా అవుతారు? 16.ముసల్మాననుకుంటే వారిని బ్రాహ్మణోత్తములు పూజిస్తారు. అగ్నిహోత్రులు అభిమానాన్ని మడిని విడిచి వారి చరణాలకు సాష్టాంగపడతారు. 17.అలా జనులు ఆశ్చర్యపోతారు. ప్రత్యక్షంగా అనుభవాలను పొందాలని వచ్చిన జనులు కూడా అల్లే ప్రవర్తిస్తారు.బాబా దర్శనంతో నోట మాట రాక మౌనం వహిస్తారు.18.ఎప్పుడూ హరి శరణులో ఉండే వారిని హిందువని ముసల్మానని ఎలా అనగలం? శూద్రుడు గాని, అతి శూద్రుడుగాని, జాతి విహీనుడు గాని, యోగ్యతను గుర్తించడానికి జాతి ఏ మాత్రం ప్రమాణం కాదు. 19.వారుజాతిభేదాలు లేక హిందువునైనా ముసల్మానునైనా అన్ని వర్ణాలను సమానంగా చూస్తారు. వారికి శరీరాభిమానం లేదు. 20. ఫకీరుల బంతిలో కూర్చుని ఆ సమయానికి లభించిన

మాంసాన్ని లేదా చేపలను తినేవారు. అక్కడ కుక్కలు మూతి పెట్టినా అసహ్యించుకునేవారు కాదు. 21.రైతులు ధాన్యం కొరత ఏర్పడితే అవసరానికి వాడుకోవటానికి, ఆ సంవత్సరంలో పండిన ధాన్యాన్ని గోధుమలను, ముందుగానే పోగుచేసి సంచుల్లో కట్టి ఉంచుతారు. 22. అట్లే మసీదులో బస్తాలతో నింపి పెట్టిన గోధుమలను విసుక్కోవటానికి అక్కడ తిరగలి ఉండేది. చెరగటానికి చేటలు కూడా ఉండేవి. సంసారానికి అవసరమైన వాటికి ఏ కొరతా లేదు. 23.సభామంటపంలో శోభాయమానంగా అందమైన తులసీ బృందావనం, అక్కడే లక్షణమైన ఒక చెక్క రథం ఉండేవి. 24. ఏదో పుణ్యసంచితం వల్ల ఈ మంచి వస్తువులకు ఇక్కడ పరమేశ్వరుని తో కలయిక ఏర్పడింది. ఇటువంటి సంగ్రహాన్ని హృదయ పేటికలో సేకరించి పెడితే, ఆమరణాంతం ఏలోటూ కనిపించదు. 25. ఏదో పుర్వార్జిత సౌభాగ్యం వలన బాబా పాదాల వద్ద ఆశ్రయం లభించి మనసుకు శాంతి, ప్రాపంచిక వ్యవహారాల్లో నిశ్చింత కలిగాయి. 26.తరువాత ఎంత సుఖాన్ని సంపాదించినా ఈ సుఖం మరల రాదు. శ్రీ సాయి సమర్థుని సమాగమంలో లభించిన ఆనందాన్ని అనుభవించి నేను ధన్యుణ్ణయ్యాను. 27. పరిపూర్ణ నిశ్చలత్వానికి ఆత్మానందానికి నిలయం సాయి. వారి విశిష్టతను నేను ఎలా వర్ణించను? వారి చరణాలను ఆశ్రయించిన వారు అక్కడే స్థిరపడిపోయారు. 28.మృగచర్మాన్ని దండాన్ని పట్టుకుని తిరిగే తాపసులు, హరిద్వారాది తీర్థ క్షేత్రాలలోని వారు, సన్యాసులు, త్యాగులు బైరాగులు, బిచ్చగాళ్ళు మొదలైన అనేక రకాల జనులు బాబా వద్దకు వచ్చేవారు. 29.బాబా మాట్లాడుతూ తిరుగుతూ నవ్వుతూ ఉండేవారు. వారి జిహ్వపై నిరంతరం 'అల్లామాలిక్' అన్న నామం ఉండేది. వారికి వాదాలు, వితండ వాదాలు అయిష్టం. వారి వద్ద ఎల్లప్పుడూ సటకా ఉండేది. 30.వారు గొప్ప తపస్వి. మనో వికారాలను అణచి వేసి ఇంద్రియాలను నిగ్రహించినవారు. వారి వాక్కునుండి పూర్ణ వేదాంతం స్రవిస్తుంది.

చివరకు వారి అంతు ఎవరికి చిక్కలేదు. 31. లక్ష్మిపుత్రుణ్ణైనా శ్రీమంతుణ్ణైనా, భికారివంటి పెదవాణ్ణైనా ఉభయులను ఒకే త్రాసులో తూచేవారు. 32. ఎవరివైనా మంచి పనులు చెడు పనులు, మనసులోని మర్మాలు వారికి తెలిసేవి. భక్తుల రహస్యాలను వారికి మాత్రమే అర్థమయ్యేలా చెప్పి, వారిని ఆశ్చర్యపరచేవారు 33. వారు జ్ఞాన భండారం. కాని ఏమి ఎరగనట్లుగా అజ్ఞాని వలె నటించేవారు. గౌరవాలు, సన్మానాలు వారికి అసహ్యం. ఇవి శ్రీ సాయి లక్షణాలు. 34. వారు మానవ శరీరంలో ఉన్నా వారి చర్యలలో అపూర్వమైన దివ్యత్వం ఉండేది. శిరిడీలోని ప్రత్యక్ష దైవం వీరే యని జనులంతా భావించేవారు. 35. బాబా చమత్కారాలను పామరుణ్ణైన నేను ఎంతని వర్ణించను? వారు శిరిడీలోని దేవతల ఆలయాలను చక్కగా పునరుద్ధరణ చేసేవారు. 36. శిరిడీలోని గ్రామదేవతలు గణపతి, ఉమామహేశ్వరుని, మరియు మారుతి మందిరాలను తాత్యాపాటిలు ద్వారా పునరుద్ధరణ చేయించారు. 37. భక్తుల వద్దనుండి దక్షిణ నెపంతో పుచ్చుకున్న డబ్బును కొంత ధర్మకార్యాలకు వినియోగించి, మిగతా డబ్బును తిరిగి భక్తులకు ఇచ్చేసేవారు. 38. ప్రతిరోజు ఒకరికి ముప్పై, ఒకరికి పది, పదిహేను లేక యాభై తమకు తోచినట్లుగా సంతోషంగా పంచేవారు. 39. అలా ధర్మంగా వచ్చిన డబ్బును పుచ్చుకున్న వారు దానిని సద్వినియోగం చేయాలని అనుకునేవారు. బాబా మనసులో కూడా ఆ అభిప్రాయం ఉండేది. 40. సాయిబాబా దర్శనంతో అనేకులు ఆరోగ్యవంతులు అయ్యారు. అనేక మంది దుష్టులు శిష్టులయ్యారు. ఎంతో మంది కుష్ఠువ్యాధి నయమయింది. అనేకులు తమ అభీష్టాలను పొందారు. 41. వారి చరణాలను ఆశ్రయించిన మాత్రాన అంజనం గాని ఆకురసం కాని వేయకుండానే అనేక మంది అంధులకు కళ్ళ చూపు వచ్చింది. అనేకమంది కుంటివాళ్ళ కాళ్ళు బాగయ్యాయి. 42. అమోఘమైన వారి మహిమ యొక్క అంతు ఎవరికీ దొరకదు. యాత్రికులు నలువైపులనుండి అసంఖ్యాకంగా

వారి వద్దకు రాసాగారు. 43.బాబా ధుని సమీపంలో మలమూత్రాలను విసర్జించేవారు. ఒకప్పుడు స్నానం చేసేవారు, మరొకప్పుడు చేసేవారు కాదు . ఎప్పుడూ ధ్యాన నిమగ్నులై ఉండేవారు. 44.మొదట్లో బాబా తలకు తెల్లటి పాగా కట్టుకుని, నడుముకు స్వచ్ఛమైన లుంగీని కట్టుకుని, శరీరంపైన జుబ్బాకాని చొక్కా కాని తొడుగుకునేవారు. 45. మొదట్లో బాబా ఊరివారికి వైద్యం చేసేవారు. మరల మరల పరీక్షించి మందులను ఇచ్చేవారు. వారి హస్తవాసి మంచిదన్న కీర్తితో వైద్యుడిగా ప్రసిద్ధి చెందారు. 46. ఒకసారి ఒక భక్తునికి కళ్ళుబాగా వాచి రెండు కనుగుడ్లు ఎఱ్ఱని గోళాల వలె అయ్యాయి. శిరిడీలో వైద్యులెవరూ దొరకలేదు. 47.అమాయకుడైన ఆ భక్తుడు పాపం బాబాకు కళ్ళను చూపించాడు. బాబా వెంటనే జీడిగింజలను చితక కొట్టి ముద్దలా చేసారు. 48.కొందరు సురమాను పెడతారు. కొందరు ఆవుపాలతో కట్టు కడతారు. కొందరు చల్లని కర్పూరపు బిళ్ళగాని లేక అంజనంగాని వేస్తారు. 49.కాని బాబా పద్ధతే వేరు. ఒక్క ముద్దను తమ చేతుల్లోకి తీసుకొని ఒక్కో కంట్లో బాగా నింపి బట్టతో కట్టుకట్టారు. 50.ఉదయం కళ్ళకు కట్టిన పట్టీని విప్పి కళ్ళపై నీరు ధారగా పోశారు. కళ్ళ వాపంతా తగ్గిపోయి కళ్ళు శుభ్రమయ్యాయి. 51.సుకుమారమైన నాజూకు కళ్ళల్లో జీడిగింజలను వేస్తే కళ్ళు మండలేదు సరికదా కళ్ళ జబ్బు పారిపోయింది. ఇలా అనేక అనుభవాలు. 52.బాబాకు ధౌతి పోతి వంటి యోగ ప్రక్రియలు తెలుసు. ఎవరికీ తెలియకుండా ఒక ఏకాంత స్థలానికి వెళ్ళి స్నానంచేసేటప్పుడు ప్రేగులను బయటకు తీసి కడిగి శుభ్రం చేసి ఎండ బెట్టేవారు. 53.మసీదు నుండి బావి ఎంతదూరాన ఉందో,అంత దూరంలోనే ముందుకు వెళితే అక్కడ మట్టి చెట్టు దాని అవతల మరొక బావి ఉండేవి. రెండు రోజుల కొకసారి బాబా అక్కడికి వెళ్ళేవారు. 54.మిట్ట మధ్యాహ్నం మండుటెండలో అక్కడ ఎవరూ లేకుండా చూచి తాము స్వయంగా నీరు చేదుకొనిమొహం

కడుక్కునే వారు. 55.ఇలా ఒకసారి బాబా స్నానానికి కూర్చుని ప్రేగులను తీసి వానిని త్వరత్వరగా కడగ సాగారు. 56.మేకను కోసినప్పుడు ప్రేగులను బయటకు తీసి శుభ్రం చేసి చుట్టపెట్టేలా 57.బాబా వారి ప్రేగులను బయటకు తీసి, లోపలా బయటా స్వచ్ఛంగా శుభ్రం చేసి జామ చెట్టుపై పరచి ఎండ పెట్టేవారు. జనులు అదిచూచి ఆశ్చర్యపోయేవారు. 58.బాబా యొక్క ఈ అద్భుత లీలను తమ కళ్ళతో చూచిన వారిలో కొందఱు ఇప్పటికీ శిరిడీలో ఉన్నారు.వారు బాబాను అపూర్వమైన వ్యక్తి అని అనేవారు.59.ఒక్కోసారి ఖండయోగ ప్రక్రియతో బాబా తమయొక్క కాళ్ళూ చేతులను వేరు చేయగా వారి అవయవాలు మసీదులో అక్కడక్కడా పడి ఉండేవి. 60.ఇలా వారి శరీరం భయంకరంగా ఖండ ఖండాలుగా పడి ఉన్నప్పుడు ఆ వింతను చూడాలని ప్రజలు పరుగిడి వెళ్తే బాబా వారికి యథాప్రకారం పూర్తిగా కనిపించేవారు. 61.ఒకసారి బాబా అవయవాలను ముక్కలు ముక్కలుగా చూసిన వ్యక్తి,బాబాను ఏ దుర్మార్గుడో అత్యాచారం చేసి హతమార్చాడు అని చాలా గాబరా పడ్డాడు. 62.మసీదులో బాబా అవయవాలు వేరు వేరుగా విడివిడిగా నలుదిక్కులా పడి ఉన్నాయి.అర్ధరాత్రి సమయం వారి వద్ద ఎవరూ లేరే అని తనలో బాధపడ్డాడు. 63.ఈ విషయాన్ని ఎవరితోనైనా చెప్పితే తనకే ముప్పు అని తలచి వెళ్ళి బయట కూర్చున్నాడు. 64. ఇది సాయి యొక్క యోగక్రియ అని అతను అసలు ఎఱుగడు. ఛిన్నాభిన్నంగా పడి ఉన్న బాబా శరీరాన్ని చూచి అతని హృదయం దడదడలాడింది.65.ఎవరికైనా ఆ విషయాన్ని తెలియచేయాలని అతనికి చాలా అనిపించింది. కాని మొదట ఈ కబురు తెలిపినందుకు తనే అపరాధి యని నిశ్చయమవుతుంది 66.అని అనేక రకాలుగా ఊహించి ఎవరికీ చెప్పలేదు.తెల్లవారుఝామున మరల వెళ్ళి చూచి విస్మితుడయ్యాడు. 67.తను ముందు చూచినదంతా అదృశ్యమైపోయింది. బాబా క్షేమంగా తమ స్థానంలో కూర్చుని ఉన్నారు. ఇది

కల కాదు కదా అని ఆ వ్యక్తి విస్తుపోయాడు. 68.ఈ ధౌతి పోతి యోగ ప్రక్రియలను బాబా బాల్యం నుండి ఆచరించేవారు. వారి యోగస్థితి ఎవరికీ అర్థం కాని అగమ్య గోచరం.69.బాబా ఎవరిదైనా దమ్మిడీ అయినా తాకేవారు కాదు, వారి సుగుణాల కారణంగా ప్రఖ్యాతిని పొందారు.పేదలకు, దుర్భలులకు ఆరోగ్యాన్నిచ్చి ఆ ప్రాంతంలో వైద్యుడన్న కీర్తిని పొందారు.70.వారు కేవలం పరుల కొరకు వైద్యులు. తమ విషయంలో అత్యంత వైరాగ్యంగా ఉండేవారు. పరోపకారానికి సహించరాని బాధలను సహించేవారు.71.ఈ విషయంలో శ్రోతలకు నేనొక విలక్షణమైన కథను వినవిచేస్తాను.దాంతో బాబా యొక్క సర్వవ్యాపకత్వం వారి దయార్ద్రత విదితమవుతాయి.72.క్రీ.శ. 1910 వ సం॥లో దీపావళి ముందు ఘన త్రయోదశి రోజు బాబా మామూలుగా ధుని వద్ద కూర్చుని ధునిలో కట్టెలను కాల్చుతున్నారు.73.ధుని బాగా ప్రజ్వరిల్లి ఉండగా బాబా తమ చేతిని నిప్పులో దూర్చి నిశ్చింతగా కూర్చుంటే వారి చేయి కాలింది.74.వారి సేవకుడైన మాధవ ఆ దృశ్యాన్ని చూచాడు. మాధవరావు దేశ్‌పాండే కూడా వారివద్ద ఉన్నాడు. వెంటనే బాబా వెనుకకు పరుగెత్తాడు.75.వారి నడుము పట్టుకుని వెనుకకు లాగి దేవా! ఎందుకిలా చేశారని అడిగాడు.76.బాబా తేరుకొని'ఒక పసిపాప, తల్లి చంకలో నుండి హఠాత్తుగా జారి కమ్మరి వాని కొలిమిలో పడింది. 77.ఒక కమ్మరివాని భార్య తన భర్త పిలుపు విని బిడ్డను ఒడిలో వేసుకుని కొలిమి తిత్తిని ఊదసాగింది.78.అలా కొలిమిని ఊదుతూ ఊదుతూ పరధ్యానంలో తన ఒడిలో బిడ్డ ఉన్న విషయం మరిచిపోయింది. పిల్ల దుడుకుగా జారిపోతే నేను వెంటనే పైకి లేవనెత్తాను శామా. 79.ఆ బిడ్డను బయటికి తీయబోతే ఇలా జరిగింది. ఈ చేయికాలితే కాలనీ, బిడ్డ ప్రాణం దక్కింది కదా' అని అన్నారు. 80.ఇక చేతి బాధను ఉపశమింప చేయడానికి ఏమిటి మార్గం అని ఆలోచించిన మాధవరావు, నానాచందోర్కరుకు ఉత్తరం

వ్రాయాలని నిశ్చయించుకుని.81.సవిస్తరంగా ఉత్తరం వ్రాశాడు. నానా వెంటనే పరమానంద్ అనే ప్రసిద్ధ డాక్టరును వెంట బెట్టుకుని శిరిడీ వచ్చాడు. 82.కాలిన గాయాన్ని తగ్గించటానికి డాక్టరును, అవసరమైన అనేక రకాల ఔషధాలను తీసుకుని నానా సాయి చరణాల వద్దకు వచ్చాడు. 83.బాబాకు పాదాభివందనం చేసి, కుశల సమాచారాలను తెలుసుకుని తాను వచ్చిన పనిని తెలిపి, బాబా యొక్క చేతిని చూపించమని ప్రార్థించాడు. 84.చేయి కాలినప్పటి నుండి భాగోజీ శిండె చేతికి నేయి రాసి ప్రతిరోజూ ఆకులు వేసి గట్టిగా కట్టు కట్టేవాడు. 85.ఆ కట్టు విప్పి పరమానందుకు చూపించి ఔషధోపచారాలను చేస్తే బాగా నయమౌతుందన్న.86.కోరికతో నానా బాబాను ఎంతో ప్రార్థించాడు. కట్టు విప్పి చూడాలని పరమానందు కూడా ప్రయత్నం చేశాడు. 87.కాని బాబా ఇవాళ రేపు ఇవాళరేపు అంటూ, నావైద్యుడు అల్లా అని చెప్పుతూ తమ చేతిని అసలు చూడ నివ్వలేదు.వారికి ఏ బాధా లేదు.88.పరమానందు తెచ్చిన మందులకు శిరిడీ గాలి కూడా సోకలేదు గాని అతనికి సాయి సందర్శన భాగ్యం లభించింది.89.రోజూ భాగోజీయే సేవచేసేవాడు. భాగోజీయే చేతిని మర్దించేవాడు. దాంతో కాలిన చేయి నయమై అందరికీ సంతోషం కలిగింది.90.ఈ విధంగా బాబా చేతిగాయం నయమైన తరువాత కూడా ఏ కారణం చేతనో,వారికి ఏ బాధా లేకపోయినా, తెల్లవారగానే రోజూ కట్టు విప్పే కార్యక్రమం.91.వారి చేతికి ఏ నొప్పి లేకపొయినా. నిష్కారణంగా నిత్యం వారి చేతికి నేతి మర్దన సేవ చేయటం బాబా సమాధి వరకు జరిగింది.92.భాగోజీ యొక్క ఈ సేవ ఉపచారం సాయి సిద్ధునకు అవసరమై ఉండలేదు. కాని భక్తుల శ్రేయస్సుపై ప్రీతి కల బాబా భాగోజీకి నిత్యం ఆ సేవాభాగ్యాన్ని ప్రసాదించారు. 93.పూర్వ జన్మ మహాపాపం వలన భాగోజీకి కుష్ఠువ్యాధి బాధ ప్రాప్తించింది. అయినా అతని భాగ్య విశేషం వలన,సాయి సహవాసం లభించింది.94. బాబా లెండీకి వెళ్ళేటప్పుడు

భాగోజీ వారికి గొడుగు పట్టుకునేవాడు.శరీరంలోని పుళ్లు చీము రక్తంతో నిండి ఉన్నా అతడు బాబా యొక్క పరిచారకులలో ప్రథముడు.95.ప్రతిరోజూ ఉదయం బాబా ధుని సమీపంలో స్తంభం వద్ద విశ్రామంగా కూర్చున్నప్పుడు భాగోజి సేవకు హాజరయ్యేవాడు.96.బాబా కాళ్ళకు చేతులకు ఉన్న కట్టులను విప్పి అక్కడి వ్రణాలను నేతితో బాగా మర్దన సేవ చేసేవాడు.97.భాగోజి శిండె పూర్వజన్మలో మహా పాపిష్ఠి వాడు. అతని శరీరమంతా మహా వ్యాధి యైన కుష్ఠురోగం వ్యాపించింది.అయినా అతడు బాబా భక్తులలో శ్రేష్ఠుడు.98.కుష్ఠువ్యాధివలన భాగోజి వ్రేళ్ళు పోయినై; అన్ని అవయవాలలో నుండి భరింపరాని చెడువాసన వస్తూ ఉండేది. అతడు ఇలాంటి దౌర్భాగ్యంలో ఉన్నా కూడా ఉత్కృష్టమైన బాబా యొక్క సేవా భాగ్యాన్ని పొందాడు.99.బాబా యొక్క అగాధ లీలలు ఎన్ని అని వర్ణించను? ఒకసారి గ్రామంలో ప్లేగువ్యాధి వ్యాపించింది. అప్పుడు జరిగిన చమత్కారాన్ని వినండి.100.దాదా సాహేబు ఖాపర్డే కొడుకు తనతల్లితో పాటు సాయి వద్ద ఆనందంగా ఉన్నాడు.101.అసలే పసివాడు. శరీరం కాలిపోయేలా జ్వరం రాగా,కన్నతల్లి హృదయం ద్రవించిపోయి అశాంతితో మనసు తల్లడిల్లింది.102.తన ఊరైన అమరావతికి వెళ్లి పోవాలని తలచి, ఆమె సాయంకాల సమయం సాయి ఆజ్ఞ కోసం వచ్చింది.103.సాయంకాలం బయటికి వెళ్తూ బాబా వాడా సమీపానికి రాగా, ఆమె వెళ్లి బాబా పాదాలను పట్టుకొని వారితో విషయం చెప్పింది.104.స్త్రీలది అసలే కలవరపడే స్వభావం. పైగా కుఱ్ఱవానికి ప్లేగు జ్వరం తగ్గక ఆమె మరీ భయపడిపోయి బాబాకు మనవి చేసింది.105. ఆమెతో బాబా మృదువుగా పలుకుతూ 'ఆకాశంలో మేఘాలు క్రమ్ముకున్నాయి. వర్షం పడి పంట పండుతుంది. మేఘాలు తొలగిపోతాయి.106.ఎందుకు భయపడతావు?' అని అంటూ తమ కఫనీని నడుం వరకు లేవనెత్తి నిగనిగలాడుతున్న బొబ్బలను అందరికీ

చూపారు.107.కోడిగ్రుడ్లంత ప్రమాణంలో నలువైపులా నాలుగు గడ్డలున్నాయి. 'చూడు మీ కష్టాలను నేనిలా అనుభవించాలి'అని చెప్పారు.108.దివ్యమూ, అలౌకికమూ ఐన ఈ లీలను చూచి ప్రజలు ఆశ్చర్యపోయారు. సత్పురుషులు భక్తులకొఱకు అనేక కష్టాలను ఎలా అనుభవిస్తారో కదా!109.మైనం కంటె మెత్తగా నవనీతంలాంటి మనసుగల బాబా, ఏ లాభం లేకుండానే భక్తులను ప్రేమిస్తారు. భక్తులే వారి బంధువులు.110.ఒకసారి నానా సాహెబు చందోర్కరు నందుర్ బార్ వదిలి పండరీపురం వెళ్ళటానికి బయలుదేరాడు.111.నానా పరమ భాగ్యశాలి. అతని అనన్య సేవ ఫలించింది. భూవైకుంఠ ప్రాప్తికలిగి, అతడు అక్కడ మామలత్‌దారునిగా నియమింప బడ్డాడు.112.నందుర్‌బార్‌లో ఉత్తరువు అందుకొన్న వెంటనే వెళ్ళిపోవలసి ఉండినది. భగవంతుని దర్శించుకోవాలన్న కోరికతోగబగబా ప్రయాణానికి సిద్ధమయ్యాడు.113.శిరిడీయే ప్రథమ పండరీపురం కనుక, సకుటుంబ సపరివారంగా శిరిడీకి వెళ్ళి బాబాకు నమస్కారం చేయాలన్న ఆలోచన కలిగింది.114.తాను శిరిడీ వస్తున్నట్లుగా ఉత్తరం వ్రాయలేదు. కబురుకూడా పంపలేదు. సామానంతా సర్దుకొని త్వరగా బండిలో కూర్చున్నాడు.115.ఇలా నానా బయలుదేరిన విషయం శిరిడీలో ఎవరికీ తెలియదు. కాని సాయికి సర్వం తెలుసు. వారి కళ్ళు సర్వత్రా ఉన్నాయి.116.నానా నిమ్‌గాం ఊరి శివారుకు వచ్చేసరికి శిరిడీలో జరిగిన చమత్కారాన్ని వినండి.117.బాబా మహాల్సాపతి సమేతంగా మసీదులో ఉన్నారు.అప్పాశిండె, కాశీరాం మొదలగు భక్తులు ముచ్చటించు కుంటూ కూర్చున్నారు. 118.ఇంతలో 'పండరీపురం ద్వారాలు తెరుచుకున్నాయి.మనం నలుగురం కలసి ఆనందంగా భజన చేద్దాం' అని బాబా అన్నారు. 119.పూర్ణత్రికాల జ్ఞాని అయిన సాయి నానా గ్రామ శివారు వద్దకు వచ్చిన విషయం తెలుసుకుని భజన సంబరం లో పడ్డారు. 120.॥పండర్ పుర్‌లా జాయాచే జాయాచే॥

తిథేంచ్ మజలా రాహ్యేచే॥తిథేంచ్ మజలా రాహ్యేచే॥ఘర్ తే మార్ఝ్యా రాయాచే॥ పండరిపురానికి వెళ్ళాలి వెళ్ళాలి.అక్కడే నేను ఉండాలి.అది మా ప్రభువు గృహం. బాబా స్వయంగా భజన పాడుతుంటే అక్కడకూర్చున్న భక్తులు వారిని అనుకరిస్తూ అంతా పండరీనాథుని ప్రేమలో లీనమై పోయారు. ఇంతలో నానా కూడా వచ్చాడు.121.సకుటుంబంగా బాబా పాదాలకు వందనం చేశాడు. తమతో మహారాజు పండరీపురానికి వచ్చి నిశ్చింతగా ప్రశాంతంగా ఉండాలని నానా బాబాతో విన్న వించుకున్నాడు.122.నానా అలా అడిగే అవసరం లేకుండానే బాబా అప్పటికే పంఢరీపుర ప్రయాణానికి ఉత్సాహంగా భజన చేస్తున్నారని భక్తులు నానాకు తెలియ చేశారు.123.నానా తనలో అత్యంత విస్మయాన్ని చెందాడు.బాబా లీలను గని ఆశ్చర్య చకితుడయ్యాడు. గద్గదుడై బాబా చరణాలపై శిరసు వంచాడు.124.అలా నానాచందోర్కరు బాబాకు ప్రణమిల్లి వారి ఆశీర్వాదాన్ని, విభూతి ప్రసాదాన్ని, వారి సెలవును తీసుకుని పంఢరీపురానికి బయలుదేరాడు.125.ఇలాగే ఈ కథ చెప్పుకుంటూ పోతే గ్రంథం విస్తారమై పోతుంది. అందువల్ల ఇప్పుడు భక్తుల దుఃఖాలను తొలగించే విషయాలను త్వరగా ముగిస్తాను.126.ఈ అధ్యాయాన్ని ఇంతటి తో సమాప్తి చేస్తాను. బాబా చరిత్రకు అంతమంటూ ఉందా? తరువాతి అధ్యాయంలో ఇతర కథలను నా శ్రేయస్సు కొఱకు చెప్పుతాను.127.'నా' అన్న ఈ అహంభావాన్ని అణచి వేయాలను కున్నా అణగటం లేదు. ఈ 'నేను' ఎవరు అనేది నిశ్చయంగా తెలియదు. కనుక సాయియే తమ కథను చెప్పుతారు.128. వారే మానవజన్మయొక్క మహిమను తెలియ చేస్తారు. తమ భిక్షావృత్తిని గురించి, బాయజాబాయి భక్తిని గూర్చి, తమ భోజన పద్ధతిని కూడా చెప్పుతారు.129.మహల్సాపతిని, తాత్యాకోతే గణపతిని తమ వెంట పెట్టుకుని బాబా మసీదులో ఎలా శయనించేవారో ఆలకించండి.130.హేమాడ్‌పంత్ సాయికి శరణు

జొచ్చి తాను భక్తుల పాదరక్షనని తెలియ చేస్తున్నాడు. సాయి ఆజ్ఞాను సారం ఇంతవరకు కథా వివరణ జరిగింది.131.స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో వివిధ కథా నిరూపణమును ఏడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీసాయి సచ్చరిత - 8 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయంలో సాయి హిందువా లేక యవనులా అన్న విషయం, బాబా నివాస స్థానమైన శిరిడీ మహాబాగ్యం గూర్చి చెప్పబడింది.1.మొదట బాబా పసివానిగా ప్రకటమై, తరువాత పిచ్చి ఫకీరుగా మారటం, బంజరు భూమిలో అందమైన తోటను నిర్మాణం చేయటం.2.అదే ప్రదేశంలో భవనం తయారవటం, బాబా యొక్క ధౌతి పోతి ఖండయోగ ప్రక్రియలను వర్ణించడమైనది.3.తమ శరీరానికి శ్రమ కలిగించి అపాయాలను సహించే భక్త రక్షకుడైన సాయినాథుని నేనేమని వర్ణించను?4.ఇప్పుడు మానవ జన్మ యొక్క ఘనత, సాయి యొక్క భిక్షావృత్తి వర్ణన, బాయజాబాయి సాధుసేవ, బాబా భోజన పద్ధతిని గూర్చి,5.బాబా, తాత్యా, మహల్సాపతి ఈ ముగ్గురూ మసీదులో ఎలా శయనించేవారు, రహతాలోని కుశాల్ చందు గృహానికి సాయి సమర్థులు ఎలా వెళ్ళేవారు మొదలగు విషయాలను వినండి.6.ప్రతిరోజు ఉదయాస్తమానాలవుతాయి. అలా అనేక సంవత్సరాలు వృథాగా గడిచిపోతాయి.సగం జన్మ నిద్రావస్థలో గడిచిపోతుంది. మిగిలిన జీవితాన్నైనా సరిగ్గా అనుభవించరు.7. బాల్యావస్థలో క్రీడాసక్తులు, తరుణ వయసులో తరుణీరక్తులు, వృద్ధాప్యంలో జరాగ్రస్తులై ఎప్పుడూ వ్యాధులతో పీడింపబడుతూ ఉంటారు.8.పుట్టటం, బాగా పుష్టిగా పెరగటం, గాలిని పీలుస్తూ వదులుతూ దీర్ఘాయువుగా బ్రతకటం, వీనితో

జన్మ సార్థకమైనట్లా?9.మానవ జన్మ యొక్క కర్తవ్యం పరమార్థప్రాప్తి. ఇదే సత్యం. లేకపోతే కుక్కలు పందులు మొదలగువాని బ్రతుకులలో ఏం లోపంఉంది?10.కుక్కలు కూడా తమ పొట్టలు నింపుకుంటాయి. స్వేచ్ఛగా సంతానోత్పత్తిని కూడా చేస్తాయి. ఇలా కుక్కలూ మానవులు సమానంగా ఉంటే ఇక మానవ శరీరానికి ఉన్న గొప్ప తనమేమిటి?'11. శరీర పోషణ మరియు మైథునం ఇవే మానవ శరీరానికి సాధనాలైతే, ఈ జన్మకు పర్యవసానం ఇదే అయితే ఈ నరజన్మ వ్యర్థం.12.ఆహార నిద్రా భయ మైథునాలు ఈ నాలుగింటితోనే ఆయువు ముగిసిపోతే ఇక కుక్కలకూ మానవులకూ భేదమేముంది? మీ వివేకంతో నిర్ణయించుకోండి.13.ఇదే మానవ శరీరానికి సార్థకత అయితే మానై పుట్టితే మాత్రం ఏంలోటు?కొలిమి తిత్తి కూడా శ్వాసోచ్ఛ్వాసలను చేస్తుంది. కుక్కలు కూడా పుష్టిగా పెరుగుతాయి.14.మనుషులు ముక్తులు, నిర్భయులు, స్వతంత్రులు, మరియు శాశ్వతంగా ఉండేవారు అన్న వివేకం ఉండటం ఈ జన్మకు సఫలత.15.మనమెవరం,ఎక్కడ నుండి వచ్చాం,ఈ మానవజన్మకు కారణమేమిటి అన్న ఈ రహస్యాలను తెలుసుకున్న వారు వివేకవంతులు. లేకపోతే అంతా వృధా శ్రమ.16.నందాదీపం యొక్క జ్యోతి మొదటా చివరా ఒకేలా ఉంటుంది.అయినా అది క్షణక్షణం వేరువేరుగా మారుతుంటుంది. ఈ శరీర పరిస్థితి కూడా అంతే.17.బాల్యం, యవ్వనం, వార్ధక్యావస్థలు జనులందటికీ ఉంటాయి. కాని అవి సహజంగా ఎలా వచ్చి పోతాయో ఎవరూ తెలుసుకోలేరు.18.కళ్ళకు కనిపించేది వెంటనే నశించిపోతుంది.అపరిమితంగా మారుతున్నా, ఒకటిగానే భాసిస్తుంది. అలాగే ఈ క్షణంలో ఉన్న శరీరం మరో క్షణంలో ఉండదు.19.శరీరం మలమూత్రాలు, శ్లేష్మం చీము రక్తాల మురికి కాలువ. దీనిని క్షణక్షణం మరణం వెంటాడుతూనే ఉంటుంది.ఇది చాలా చెడు లక్షణాలు గలది.20.ఈ మానవ శరీరం క్రిమికీటకాలకు ఆలవాలం.అనేక రోగాలకు

ఆగారం.క్షణభంగురం. అశాశ్వతం.21.రక్తమాంసాలు,నరాలతోనున్న వాహనం, ఎముకలు చర్మాలతో కూడిన ఒక ఆకారం. మలమూత్రాల దుర్గంధపు గొయ్యి. ఇది జీవునికి ప్రత్యక్ష ప్రతిబంధకం.22.రక్తమాంసాలు,చర్మం, నరాలు,కొవ్వు, మజ్జ, ఎముకలు, వాయువు మరియు మలమూత్రాలు విసర్జించే మురికి అవయవాలు కల ఈ శరీరం అల్పాయువు కలది.23. ఇలాంటి అమంగళం స్వరూపమైన మానవ శరీరం, క్షణభంగురమే అయినా మంగళకరుడైన పరమేశ్వరుని ప్రాప్తి ఈ శరీరం ద్వారానే.24.జననమరణాలు ఎప్పుడూ వెంటే ఉంటాయి. వీనిని తలుచుకుంటేనే దారుణ భయం కలుగుతుంది. అకస్మాత్తుగా ప్రాణం వెళ్ళిపోతుంది.25.పగలురాత్రులు ఎంతమంది వస్తున్నారో మరి ఎంతమంది పోతున్నారో ఎవరు గమనిస్తున్నారు? మార్కండేయునివలె పూర్ణాయువుతో పుట్టినవారికి కూడా కాలగతి తప్పదు.26.క్షణభంగురమైన ఇటువంటి మానవ శరీరంలో, పుణ్యం సంపాదించిపెట్టే శ్లోకాలు, కథా వార్తలూ వినే సమయమే సార్థకమవుతుంది. మిగతా కాలం వ్యర్థం.27.దీనిని బాగా నిశ్చయంగా తెలుసుకోవటం ఈ జన్మకు సార్థకం. కాని ఎవరికైనా అనుభవం లేకుండా విశ్వాసం కుదరదు.28.ఈ అనుభవానికి బాగా అభ్యాసం చేయాలి.అప్పుడు శాశ్వతమైన ఆనందాన్ని ఆశించే జీవుడు ఈ వైభవాన్ని సాధించగలడు.29.పరమేశ్వరుని అనుగ్రహంతో భార్యాబిడ్డలు, ధనం, వైభవం, సముద్రంచే చుట్టబడి ఉన్న భూమి సంప్రాప్తించినా, మనసులో అసంతృప్తే ఉంటుంది.30.శాశ్వతమైన సుఖశాంతులను పొందాలనే ధ్యేయాన్ని మనసులో పెట్టుకొని ,సర్వభూతాంతరాత్మయైన భగవంతుణ్ణి ఉపాసించటమే పరమపద ప్రాప్తిదాయకం.31.ఈ మానవ శరీరం చర్మం,ఎముకలు, రక్తమాంసాలతో తయారయింది. ఇది పరమార్థం సంపాదించుకోవటానికి ప్రత్యక్ష ప్రతి బంధకం. దీనిపై మమకారాన్ని విడవాలి.32.దీనిని కేవలం ఒక నౌకరు వలె భావించండి. దీనిని నెత్తిన కూర్చో

పెట్టుకోకండి. బాగా గాఢంగా చూస్తూ, దీనిని నరకద్వారం చేసుకోకండి.33. జీవించడానికి సరిపడా అన్నవస్త్రాలు, తగు మాత్రం ఆలనాపాలనా చేసి, దీనిని జనన మరణాలను తప్పించుకోవటానికి, ఆధ్యాత్మిక ప్రగతికొఱకు వినియోగించండి.34. ఇది జనన మరణాదులతో కూడిన అనర్థాత్మకం. ప్రతి క్షణం వినాశోన్ముఖం, నిరంతరం దుఃఖాలను కలిగించే దీని సుఖాలు క్షణికం.35. ఇవి మెరుపుతీగవలె ఒక క్షణం ఉండి వెంటనే పోతాయి. ఇవి సాగరతరంగాల వలె క్షణిక మని గ్రహించండి.36. శరీరం, ఇల్లు, ఇల్లాలు, పిల్లలు అంతా నశించిపోయే వారని తెలుసుకొనరు. తల్లిదండ్రులను స్వయంగా భుజంపై మోసుకొని పోయినా మనమూ వెళ్ళవలసిన వారమేనని గ్రహించరు.37. చనిపోయినవారి వెనుక చావటం, మరల జన్మించటం అలా జనన మరణాల చక్రంలో తిరగడమే కాని దీనిని ఏ విధంగా తొలగించు కోవాలా అని ఒక్క క్షణమైనా ఆలోచించరు.38. నిత్యం కుటుంబ భారాన్ని మోస్తూ ఆయువు వేగంగా గడిచిపోతుంది. కాలం ఆయువును గణించడంలో నిమగ్నమై ఉంటుంది. అది తన కర్తవ్యాన్ని ఎప్పుడూ మర్చిపోదు.39. చివరి ఘడియ రాగానే అది ఒక్క క్షణమైనా ఆగదు. జాలరి వలను బాగాలాగినప్పుడు దానిలో చిక్కుకున్న చేపల వలె జీవులు మరణ సమయంలో గిలగిల కొట్టుకుంటారు.40. మహాభాగ్యం వలన ఎంతో పుణ్యసంచయంతో ప్రాప్తించిన మానవ శరీరాన్ని ప్రతిఘడియా సద్వినియోగం చేసుకోండి.41. ఈ మానవశరీరం భగీరథ ప్రయత్నంచేసినా లభించదు. కేవలం అదృష్టవశాత్తు అనుకోకుండా చేజిక్కిన అవకాశాన్ని మట్టిలో కలిపి వ్యర్థం చేయకండి .42. తరువాతి జన్మలో సాధించవచ్చని అనుకోకూడదు. ఈ అవకాశం ఒకసారి చేయి జారిపోయిందా ఇక అంతే. మరల ఇదే తప్పక లభిస్తుందని నిశ్చయం లేదు. అలా అనుకున్న వాడు మూర్ఖుడు.43. కొందరు పాపులు వారివారి కర్మానుసారం శుక్రబీజాలతో

కలిసి యోనిద్వారా జన్మించే శరీరాలను పొందుతారు.44.అంతకంటే అధములు జంగమ వర్గాలలో జన్మిస్తారు. మరల తమ కర్మానుసారం స్థావరాలై జన్మిస్తారు.45.వారివారి కర్మానుస్థానం, జ్ఞానాన్ని బట్టి వారి శరీర గ్రహణమని శ్రుతి ప్రమాణం.46. యథా ప్రజ్ఞంహి సంభవాః అని శ్రుతి మాత అత్యంత కరుణతో వచించింది.వారివారి జ్ఞానాన్ని బట్టి జననం కూడా ఉంటుంది.47.పరమేశ్వరుని లీల అంతుపట్టనిది.దానిని సంపూర్ణంగా తెలుసుకోవటం అశక్యం. ఎవరికైనా అంశ మాత్రమైనా అది అవగాహన ఐతే ఆ మానవ శరీరం ధన్యం.48.పరమ భాగ్యం వలన నరజన్మ లభిస్తుంది. మహాపుణ్యం కారణంగా బ్రాహ్మణ వర్ణంలో జన్మించటం, పరమేశ్వరుని అనుగ్రహం వలన సాయి చరణాల ప్రాప్తి, ఇవన్నీ చాలా అరుదైన లాభాలు.49.నానా రకాల జన్మలున్నా మానవ జన్మ అన్నిటికంటే శ్రేష్ఠం. మనమెక్కడ నుంచి వచ్చాం మనలను ఎవరు సృష్టించారు అని వివేకంతో ఆలోచించేది మానవులే.50.ఇతర యోనులలో జన్మించే ప్రాణులు దీనిని గ్రహించలేవు. అవి ఎలా పుడతాయో అలాగే చచ్చిపోతాయి. భూతభవిష్యత్ వర్తమానాల గతి గురించిగాని, ఈశ్వరుని గురించిగాని అవి ఎఱుగవు.51.అందువలన పరమేశ్వరుడు ఈ మానవ శరీరాన్ని సృష్టించి, వివేక వైరాగ్యాలతో మానవుడు తనను ఆరాధిస్తాడని ఆనందించాడు.52.నశ్వరమైన శరీరాన్ని కలిగిన మానవుడు, సాధనతో అవినాశి అయిన నారాయణుడు కాగలడు.ఈ సృష్టిలో మానవ శరీరానికి సమానమైన సాధనా సంపద వేరొకటి లేదు.53.గారడీవాడు గొప్ప చతురుడు. అజ్ఞానుల ఎదుట తన ఆటలను ప్రదర్శించడు. తన కళా కౌశలంలోని మర్మాలను గ్రహించగల ప్రేక్షకులను కోరుకుంటాడు.54.అట్లే పశుపక్షులు మొదలగు జీవజంతువులను, చెట్లుచేమలను అపారంగా సృష్టించిన పరమేశ్వరునికి,తన లీల నిస్సారమని అనిపించి, నిరాశతో దుఃఖం కలిగింది.55. సూర్యచంద్రులు, తారలూ నిండిన విస్తారమైన బ్రహ్మాండాన్ని నిర్మించిన గొప్ప కౌశలాన్ని

ఎవరూ కొంచమైనా గ్రహించటం లేదు.56.ఈ సకల లీలను చేయటంలో జగదీశుణ్ణైన నా ఉద్దేశం ఏమిటి అని నిశ్చయంగా ఒక్క- జీవి ఐనా తెలుసుకోవటం లేదు.57.నా ఈ అనుపమానమైన అపార వైభవన్ని గ్రహించగలిగే కుశాగ్ర బుద్ధి కల ప్రాణిని సృష్టించనంతవరకు నా కార్యం ముమ్మాటికీ నిష్ఫలం.58.అని తలచి జగదీశ్వరుడు తన సామర్థ్యాన్ని సృష్టిలోని సారాసారాన్ని విచక్షణా బుద్ధితో గ్రహించగల ప్రాణిని మానవునిరూపంలో సృష్టించాడు.59. అగాధమైన నా వైభవాన్ని, అట్లే అపూర్వమైన నా శక్తిని, నామాయా లీల నంతటిని అతడు ఆశ్చర్యపూర్వకంగా తెలుసుకుంటాడు.60.అతడే నన్ను అవలోకిస్తూ, జ్ఞానాన్ని సంపాదిస్తాడు. నన్ను ధ్యానిస్తాడు,ఆశ్చర్యపడతాడు. అప్పుడు నా లీల సంపూర్ణమవుతుంది.61.ప్రేక్షకులు ఆనందించటమే నా యొక్క లీలకు సంపూర్ణత.నేను జగత్తును శాసించే విధానాన్ని చూచి నరుడు కృతార్థుణ్ణని అనుకోవాలి.62.శరీరాన్ని పోషించటం కోరికలను తీర్చుకోవటానికి,డబ్బు గడించటానికి కాదు. యావజ్జీవం తత్వజ్ఞానాన్ని సంపాదించటమే జీవితానికి సాఫల్యత.63.అభేద జ్ఞానమే తత్వం. ఉపనిషత్తులోని బ్రహ్మజ్ఞానం అదే. పరమాత్మ ఉపాసన అన్నా అదే. భక్తులు భగవంతుడు అన్నా అదే.64.గురువు బ్రహ్మా వేరు వేరు కాదన్న అభేద జ్ఞానం కలగడమే భక్తి. ఈ భక్తితో మాయను తరించడం సులభమని తెలుసుకోండి.65.యోగ్యులు,శ్రద్ధకలిగిన పురుషులు, జ్ఞాన వైరాగ్యాలను సంపాదించుకుంటారు. ఈ ఆత్మతత్వంలో లీనమైన భక్తులు భాగ్యవంతులు.66.అజ్ఞానం నిరసనం కాకుండా, ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోకుండా, కృతార్థులమని అనుకోవడం ఒక విలక్షణమైన ప్రతిబంధకం.67.జ్ఞానం మరియు అజ్ఞానం ఈ రెండూ అవిద్యలో పుట్టిన వికారాలు. ముల్లుతో ముల్లును తీసి రెంటినీ పారవేసినట్లుగా,68.జ్ఞానంతో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాజ్ఞానాతీతులై నిర్మలమైన ఆత్మ స్వరూపంలో స్థితులవటమే నరజన్మ యొక్క

పర్యవసానం.69. విషయవాసనలనే చమురంతా అయిపోయి అజ్ఞానాంధకారపు బుగ్గి రాలిపోయి 'నేను, నాది' అనే వత్తి కాలిపోనంత వరకు జ్ఞానజ్యోతి తన ప్రభను ప్రకాశింపచేయదు.70.శరీరానికి సంబంధించిన పనులు, అవి తప్పనిసరి అయినా కాకపోయినా, అవన్నీ బుద్ధి సంకల్పించినవని తెలుసుకోవాలి.71.సుఖంగా ఐశ్వర్యాన్ని, విశ్రాంతినీ అనుభవించడం లేదా రామ నామాన్ని స్మరించడం.మనకు మరో రెండవ పని లేదు.కనుక ఏ కోరికలు లేకుండా నిశ్చింతగా ఉండండి.72.శరీరం, ఇంద్రియాలు,మనసు,బుద్ధి ఇవన్నీ ఆత్మకు ఉపాధులు.అందువలననే స్వయంగా అనాది అభోక్త అయిన ఆత్మ,భోక్తృత్వాన్ని ఆపాదించుకుంటుంది.73.ఆత్మ యొక్క భోక్తృత్వం ఔపాధికం.ఆత్మ స్వాభావికంగా స్వయంగా అనుభవించలేదు. ఈ విషయంలో న్యాయ శాస్త్రం అన్వయ వ్యతిరేకలు ప్రమాణాలు .74.ఈ ఆత్మ రహస్యాన్ని తెలుసుకొని ప్రాప్తించిన కర్మలను బుద్ధికి అప్ప చెప్పి దాని ద్వారా మనోధర్మాలను చేయిస్తూ, స్వయంగా తాము ఏ పనీ చేయనట్లు ప్రవర్తించాలి.75.స్వధర్మాన్ని ఆచరిస్తూ, ఎల్లప్పుడూ ఆత్మానాత్మ చింతన చేస్తూ, ఆత్మ స్వరూపంలో ప్రశాంతంగా ఉండటమే మానవ జన్మ యొక్క పర్యవసానం.76.చతుర్విధ పురుషార్థాలను సాధించటానికి మానవశరీరం కంటే వేరే సాధనం లేదు. అభ్యాస పరాయణుడైన నరుడే నారాయణ పదవిని పొందగలడు.77.అందువలన శరీరం పతనం కానంతవరకు ఆత్మజ్ఞానం కొఅకు ప్రయత్నం చేయండి. ఈ మానవ జన్మను ఉపేక్షించి ఒక్క క్షణమైనా వృథాచేయకండి.78.సముద్రం యొక్క ఉప్పునీరు మేఘునిలో పడగానే అవి అమృతంలా మధురమైనట్లు గురుచరణాలను ఆశ్రయించిన వారి దుఃఖాలు, సుఖమయమవుతాయి.79.గురువులేకుండా మానవ శరీరానికి సద్గతి ఏ విధంగా కలుగుతుంది? గురువు స్వయంగా తమ దగ్గరకు చేర్చుకున్నప్పుడు జడులైన జీవులు ఉద్ధరింపబడతారు.80. మంత్రం, తీర్థం, దేవుడు,

ద్విజుడు, జ్యోతిషం మరియు వైద్యుడు వలెనే ఏడవవారు గురుమహారాజు వీరందరి యందు భక్తి విశ్వాసం ప్రధానం.81.వీరి యందు ఏ ప్రమాణంలో ఎంతటి భక్తి భావం ఉంటే ఆప్రమాణంలోనే సిద్ధి ప్రాప్తి. భక్తి తీవ్రత ఎంత ఎక్కువగానో తక్కువగానో ఉంటే సిద్ధి కూడా అట్లే అని తెలుసుకోండి.82.సత్పురుషులు బద్ధులను ముముక్షువులు గాను, ముముక్షువులను ముక్తులుగాను, మార్చుతారు.అవ్యక్తమైన వీరు వ్యక్తమై పరోపకారార్థం పనిచేస్తారు.83.వ్యాఖ్యలు ప్రవచనాలు పురాణాలు చేయలేని పనులు సత్పురుషుల ఆచరణ, ప్రవర్తన, వారి మౌన ఉపదేశాల ద్వారా సులభసాధ్యమౌతాయి.84.క్షమ, శాంతి, నిస్సంగత్వం, భూతదయ, పరోపకారం, ఇంద్రియనిగ్రహం, నిరహంకారం మొదలగు వానిని ఆచరించే వారు దుర్లభం.85.గ్రంథపఠనం ద్వారా లభించని సుగుణాలు వానిని ఆచరించేవారిని చూస్తే సులభంగా లభిస్తాయి.అసంఖ్యాకమైన తారాగణం ఇవ్వలేని వెలుగును సూర్యుడు ఒక్కడే ఇవ్వగలుగుతాడు.86.అట్లే ఉదారులైన సత్పురుషులు తమ స్వాభావికమైన ఆచరణ ద్వారా అనేక జీవులను బంధ విముక్తులను చేసి అత్యంత ఆనందాన్ని ప్రసాదిస్తారు.87.సాయి మహాత్ములు ఈకోవకు చెందినవారే. వారు ఐశ్వర్యవంతులు,గొప్ప శ్రీమంతులు. అయినా ఫకీరుని వలె ఆచరించేవారు.ఎల్లప్పుడూ ఆత్మ నిరతులై ఉండేవారు.88.వారు అన్ని ప్రాణులనూ సమదృష్టితో చూచేవారు. నేను నాది అన్న మాట వారికి లేదు.అన్ని ప్రాణులను దయతో చూచే వారు. అన్ని జీవులలోనూ భగవంతుణ్ణి చూచేవారు.89.వారికి సుఖాలలో ఆనందం లేదు, దుఃఖాలలో శోకమూ లేదు. రాజును పేదను సమానంగా చూడటం సామాన్య విషయమా?90.తమ కనుసైగతో క్షణంలో నిరుపేదను మహారాజుగా మార్చగల సాయి జోలి పుచ్చుకొని గడపగడపకు తిరిగే వారు.91.వారు ఎవరింటికి వెళ్ళి బిచ్చగానివలె అమ్మాయీ! రొట్టెముక్క తెచ్చిపెట్టు అని తమ చేయిచాచేవారో వారు ధన్యులు.92.ఒక

చేతిలో రేకు డబ్బా, రెండవ చేతిలో జోలి తగిలించుకొని, ప్రతిరోజూ స్వయం నియమంగా కొన్ని ఇళ్ళకు వెళ్ళేవారు.93.కూర సాంబారు పాలు మజ్జిగ వంటి పలచని పదార్థాలను జనులు రేకు డబ్బా లో పోసేవారు. వారి భోజన కౌశలం చూడండి.94.అన్నమును రొట్టెను బాబా జోలిలో వేయించుకునేవారు. పలచని పదార్థాలను డబ్బాలో వేయించుకునే వారు.95.వారి జిహ్వాకు రుచిని గ్రహించాలన్న ఆశ లేదు. ఇక మనసులో వేరువేరు పదార్థాల రుచిని తెలుసుకోవాలన్న లాలస ఎందుకుంటుంది?96.తమ జోలిలో యాదృచ్ఛికంగా పడినవానిని సేవించి తృప్తి పడే వారు. ఇవి రుచికరం, అవి అరుచికరమని వారి జిహ్వా ఎఱుగదు.97.వారు ప్రతిరోజు పగలు భిక్ష కోసం ఊళ్లోకి వెళ్ళేవారు. దానితో కడుపునింపుకుని సంతుష్టులయేవారు.98.అదైనా నియమంగానా! తమ ఇచ్ఛానుసారం ఒకప్పుడు ఒకేరోజు పన్నెండు మారులు భిక్షకు ఊళ్లోకి వెళ్ళేవారు.99.ఇలా తెచ్చిన అన్నాన్ని మసీదులోని మట్టి పాత్రలో ఉంచేవారు. కాకులు కుక్కలు అందులోనే తింటున్నా ఎప్పుడూ వానిని తరిమేవారు కాదు.100.మసీదు ప్రాంగణాన్ని చిమ్మే స్త్రీ కూడా పది పన్నెండు రొట్టెలను తనింటికి తీసుకు వెళ్ళేది. ఆమె నెప్పుడూ వారించేవారు కాదు.101.కుక్కలను పిల్లులను కలలో కూడా తరమటం ఎఱుగని వారు పేదలను దుర్భలులను అడ్డగిస్తారా? వారి జీవితం ధన్యం.102. మొదట్లో వారు పిచ్చి ఫకీరు అనే ప్రజలలో ప్రసిద్ధి అయ్యారు. రొట్టె ముక్కలను అడుక్కొని పొట్ట నింపుకొనే వారిలోని గొప్పతనం ఎలా కనిపిస్తుంది?103.ఫకీరు అయినా వారు ఉదారహృదయులు. ప్రేమమూర్తులు. ఏమీ అపేక్షించనివారు. పైకి చంచలంగా కనిపించినా అంతరంగంలో నిశ్చలంగా ఉండేవారు.వారి ప్రవర్తన అంతుపట్టనిది.104.శిరిడీ కుగ్రామంలో ఉదారస్వభావం కలభాగ్యవంతులు ఉండేవారు. వారు బాబాను మహాత్మునిగా భావించేవారు.105. తాత్యాకోతే తల్లి బాయిజాబాయి, రొట్టెలబుట్టను తలపై పెట్టుకుని మధ్యాహ్నం

అడవిలోకి వెళ్ళేది.106.మైళ్ళు మైళ్ళు నడిచి చెట్లు పొదలు దాటుకుంటూ వెళ్లి పిచ్చి ఫకీరును వెదికి పట్టుకుని వారి పాదాల పై పడేది.107.ఆమెది ఎంతటి ఉత్తమ స్వభావం. మధ్యాహ్నం, సాయంత్రం అరణ్యానికి వెళ్ళి బాబాకు రొట్టె కూర పెట్టేది.108.ఆమె యొక్క తపస్సును బాబా జీవితాంతం మరిచిపోలేదు. దానికి గుర్తుగా ఆమె పుత్రునికి మేలుచేశారు.109.ఆమెకు ఆమె భర్తకూ ఇద్దరికీ ఫకీరు చరణాలయందు దృఢమైన భక్తి. ఆ ఉభయులకూ ఫకీరే దేవుడు. భగవంతుడు భక్తి భావం ఉన్న వారికే చెందుతాడు.110. ఫకీరు బాబా ధ్యానమగ్నుడై ఉండగా బాయిజాబాయి ఆకుమేసి బుట్టలోని అన్నం వడ్డించి పట్టుదలగా తినిపించేది.111.రాజవైభవం కంటె పేదరికం శ్రేష్ఠం. ఎల్లకాలం నిలకడగా ఉండేది పేదరికమే. భాగ్యం క్షణ భంగురం అని బాబా ఎప్పుడూ చెప్పేవారు.112.తరువాత బాబా అడవులను వదిలి ఊళ్లోకి వచ్చి ఉంటూ మసీదులో అన్నం తిననారంభించారు. ఆ తల్లి శ్రమను తొలగించారు.113. ఆ దంపతులు పాటించిన నియమాన్ని వారి తరువాత తాత్యా కూడా అట్లే పాటించాడు.114.సత్పురుషులు నిజంగా ధన్యులు. వారి హృదయంలో ఎప్పుడూ వాసుదేవుడు ఉంటాడు. ఆ సత్పురుషులతో సమాగమ సౌఖ్యాన్ని పొందిన భక్తులు ధన్యులు.115.తాత్యా మహాభాగ్యవంతుడు. మహల్సాపతి కూడా గొప్ప పుణ్యాత్ముడు. వీరిద్దరూ బాబా యొక్క సమాగము గౌరవాన్ని సమానంగా అనుభవించారు.116.తాత్యా మరియు మహల్సాపతి మసీదులో శయనించేవారు. బాబాకు కూడా వీరిద్దరి పైనా సమానంగా అనుపమానమైన ప్రేమ.117.వీరు తూర్పు పడమర ఉత్తరం మూడు దిక్కులలో ముగ్గురి తలలనుంచి, మధ్యన ఒకరి పాదాలు మరొకరికి తగిలేలా,118.ప్రక్కలు పరచుకుని కథలు కబుర్లు చెప్పుకుంటూ ఒకరికి కునుకు వస్తే రెండోవారులేపేవారు.119.తాత్యా గుఱ్ఱుపెడితే బాబా అతనిని ఇటూఅటూ దొర్లించి అతని తలను పట్టుకొని

వత్తుతూ వెంటనే లేపేవారు.120.మహల్సాపతితో కలసి బాబా తాత్యాను గట్టిగా పట్టుకుని అతని కాళ్ళు పట్టేవారు. అతని వీపును కూడా మర్దించేవారు.121ఈ విధమైన అనుబంధంతో తాత్యా 14 సంవత్సరాలు బాబాతో మసీదులో నిద్రించాడు. భాగ్యవంతమైన ఆ రోజులు గడిచిపోయినై. ఆ జ్ఞాపకాలు ఎప్పుడూ గుర్తుంటాయి.122.తల్లి దండ్రులను ఇంటివద్దవదిలి, బాబాపై ప్రీతితో మసీదులో శయనించిన తాత్యాకుగల ప్రేమను ఎలా తూచగలం? అతనిపై నున్న బాబా కృపను ఎవరు విలువ కట్టగలరు?123.తండ్రి చనిపోయిన తరువాత తాత్యా సంసారంలో పడ్డాడు. ఇంటికి యజమాని మరియు గృహస్థుడై ఇంట్లోనే నిద్రించేవాడు.124.ఇటువంటి భక్తులకు మరియు శ్రద్ధా నిష్ఠలున్నవారికే సాయి యొక్క అనుభవాలు ఆహ్వానించకుండానే కలుగుతాయి. ఇది భక్తులకు చమత్కారాన్ని కలిగిస్తుంది.125.రహతాలో ఖుశాలుచందు అనే పేరుతో ప్రసిద్ధి చెందిన ఒక గృహస్థుడు ఉండేవాడు. అతడు బాబా భక్తుడు, ధనవంతుడు, ఆ ఊరి షావుకారు.126.బాబాకు ప్రసిద్ధ గణపతి కోతే పాటిలుపైనున్నంత ప్రేమ ఖుశాల్ చందు పినతండ్రి పైన కూడా ఉండేది.127.మార్వాడి జాతి వాడైనా అతనికి బాబా పై చాలా అభిమానం. ఈ ఇద్దరూ తరుచు ప్రీతిగా కలుసుకునేవారు.128.కొంత కాలానికి దైవేచ్ఛతో పెద్ద సేఠ్ చనిపోయాడు. అయినా బాబా అతనిని మరచిపోలేదు. పైగా ఆ ప్రేమ రెండింతలయింది.129.తరువాత ఖుశాల్ చందు పైని బాబా ప్రేమ పెరుగుతూనే ఉండేది. బాబా తమ జీవితాంతం అహర్నిశలూ అతని బాగోగులను కనిపెట్టుతూ ఉండేవారు.130.భావికులైన భక్తులను వెంటబెట్టుకుని బాబా ఒకసారి ఎద్దులబండిలోను మరోసారి గుఱ్ఱపు బండిలోను మైలున్నర దూరంలో నున్న రహతాకు వెళ్ళేవారు.131.ఆ గ్రామస్థులు డోలు సన్నాయి మొదలగు వాద్యాలతో సహా, ఊరిపొలిమేర వద్ద బాబాను కలుసుకుని, ప్రేమతో వారికి సాష్టాంగప్రణామం చేసేవారు.132.అటు

తరువాత అక్కడి నుండి బాబాను ప్రేమతో ఆనందం ఉప్పొంగుతుండగా, మెళతాళాలతో అతి వైభవంగా ఊళ్లోకి తీసుకుని వెళ్లేవారు.133. ఖుశాల్ చందు బాబాను తన ఇంటికి తీసుకుని వెళ్లేవాడు. అక్కడ ఫలాహారాలను సేవింపచేసి, వారిని సుఖంగా కూర్చుండ పెట్టి 134.ఆ తరువాత ఉభయులూ పాత కథలను గతస్మృతులను ముచ్చటించుకునేవారు. వారి పరస్పర ఆనందాన్ని ఎవరు వర్ణించగలరు?135.ఈ విధంగా ఆనందంగా విహరించి, ఫలాహారాన్ని సేవించిన తరువాత బాబా తమ సహవాసులతో కలిసి సంతోషంగా తిరిగి వచ్చేవారు.136.ఒకవైపు రహతా గ్రామం, రెండో వైపు నీమ్‌గాం గ్రామం. ఈ రెంటి మధ్య శిరిడీ గ్రామం.137.ఈ మధ్య కేంద్ర బిందువు నుండి ఈ రెండు గ్రామాల నుండి బయటికి బాబా స్థూల శరీరంతో తమ నిర్యాణం వరకు ప్రయాణం చేయలేదు. అయినా వారికి ఎక్కడ ఏం జరుగుతున్నదీ అంతా తెలుసు.138.వారు ఎక్కడికీ ప్రయాణం చేయలేదు. రైలుబండిని అసలు చూడనే లేదు. అయినా ఆ రైలుబళ్ళ రాకపోకల వేళల గురించి వారికి తెలుసు.139.రైలుబండి కదిలే సమయానికి వెళ్లాలని భక్తులు ప్రయాణమై బాబా అనుమతి కోసం వారి వద్దకు వెళ్ళితే, అంత తొందర పడుతున్నారెందుకు అని అనేవారు.140.బాబా! ఇక త్వర పడకపోతే ముంబై వెళ్లే రైలు తప్పిపోతుంది. ఉద్యోగానికి ముప్పు వస్తుంది. మా యజమాని నన్ను ఉద్యోగం నుండి తీసేస్తాడు.141.అని అంటే ఇక్కడ వేరే మరో యజమాని ఎవరూ లేరు .ఎందుకింత తొందర.వెళ్లి కొంచెం రొట్టెతిను,మధ్యాహ్నం భోజనం చేసివెళ్లవచ్చు అని చెప్పేవారు.142.వారి మాటను జవదాటే ధైర్యం ఎవరికి ఉంటుంది? పిన్నలు ,పెద్దలు, వివేకులు, ప్రాజ్ఞులు అందరికీ ఇది అనుభవమే.143.వారి ఆజ్ఞను పాటించిన వారి బండి ఎప్పుడూ తప్పిపోలేదు. కాని వారి మాటను లక్ష్యపెట్టని వారు తప్పక ఫలితాన్ని అనుభవించేవారు.144. అసంఖ్యాకంగా ఉన్న ఇటువంటి అపూర్వమూ

అభినవమూ ఐన అనేకుల అనుభవాలను ఒకటి తరువాత ఒకటి సంక్షిప్తంగా చెప్పుతాను.145. హేమాడ్ సాయి చరణాలకు శరణు జొచ్చి, తరువాతి అధ్యాయంలో భక్తులు తమ ఊళ్లకు వెళ్లేటప్పుడు, బాబా ఆజ్ఞను పొందాలి.146. ఆజ్ఞను పొందినవారే వెళ్ళటం, లేని వారు ఉండిపోవటం, లేకపోతే బాబా మాటను జవదాటటం వలన అపాయాలకు గురి కావడం గురించి తెలియచేస్తాడు.147. అట్లే మధుకర వృత్తిని చేపట్టి, సాయిబాబా భిక్షాన్నాన్ని ఎందుకు సేవించేవారు, పంచసూనాది పాతక క్షాళనం మొదలగు కథల వర్ణన తరువాత.148. మీమీ శ్రేయస్సు కొఱకు సాయి చరిత్రను శ్రవణం చేయండని హేమాడ్ శ్రోతల చరణాలకు నమస్కరించి మాటిమాటికీ వేడుకుంటున్నాడు. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో శ్రీసాయి సమర్థావతరణమను ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీసాయి సచ్చరిత - 9వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఇప్పుడు పూర్వకథాను సంధానం, బాబా అనుమతి లేకుండా భక్తులు తమ ప్రదేశాలకు బయలుదేఱితే వారు ఎలా ఇబ్బంది పడేవారు. 1. భక్తుల శ్రేయస్సు కొఱకు పంచసూనాది పాపనివృత్తికి బాబా తమ నిర్వాణ పర్యంతం భిక్షావృత్తిని అవలంబించటం. 2. ఆబ్రహ్మస్తావరాలలో సాయియే సర్వత్రా వ్యాపించి ఉన్నారు. సాయి కరుణతో సకల ప్రాణులలో భగవంతుడు ఉన్నాడని అందఱి మనసులలో నాటేవారు. 3. అందువలన ఈ పావన కథలను శ్రద్ధగా శ్రవణం చేయండని నేను శ్రోతలను ప్రార్థిస్తున్నాను. వీనిని వింటే కృతకృత్యులవుతారు. 4. శిరిడీ యాత్ర యొక్క విశిష్టత. యాత్రికులు బాబా అనుమతి లేకుండా, తిరిగి వెళ్ళిపోతే విఘ్నాలను ఆహ్వానించుకున్నట్లే. 5. అయితే ఒకసారి వారి ఆజ్ఞ అయిన తరువాత శిరిడీలో ఒక్క క్షణం ఉన్నా విఘ్నాలు తలపైన పడేవి. ఇది అందరికీ అనుభవం. 6. బాబా ఆజ్ఞను మీరి ప్రవర్తించిన వారు దారిలో కష్టాలు పడేవారు. అనేకులను దారిలో దొంగలు దోచుకునేవారు. దానిని వారు జీవితాంతం గుర్తుంచుకునే వారు. 7. రొట్టె తిని వెళ్లండని బాబా చెప్పగా ఎవరైనా తినకుండా త్వరపడి బయల్దేరి వెళ్ళితే వారికి బండి దొరకక ఉపవాసంతో మాడిపోయేవారు. దీనిని అనేక భక్తులు గ్రహించారు. 8. ఒకసారి తాత్యాకోతే పాటిలు కోపర్‌గాంలో ప్రతివారం జరిగే సంతకు బయల్దేరి మసీదుకు వచ్చాడు. 9. టాంగాను బయట నిలిపి బాబా దర్శనం చేసుకుని బాబా అనుమతిని తీసుకునే వంకతో

వెళ్లి వస్తానంటూ బాబా పాదాలకు వందనం చేశాడు.10. భక్తులు అశ్రద్ధతో బాబా అనుమతిని తీసుకోకున్నా బాబాకు సమయా సమయాలు మంచి చెడు వేళలు తెలుసు. తాత్యా తొందరపాటును చూచి కొంచెం ఆగు అని అన్నారు.11.బజారుకు మరోసారి వెళ్ళొచ్చు, ఇప్పుడు ఊరి బయటకు వెళ్ళవద్దని చెప్పారు. కాని తాత్యా యొక్క మొండి వైఖరిని గమనించి శ్యామాను వెంటబెట్టుకుని వెళ్ళు అని చెప్పారు.12.కాని శ్యామా అవసరమేముందని తలచి బాబా మాటను లెక్క చేయకుండా తాత్యా టాంగాలో కూర్చుని బజారుకు బయల్దేరాడు.13.రెండు గుఱ్ఱాలలో ఒకటి చంచలమైనది.300 రూపాయల ఖరీదైనది. సావుల్ విహీర్ వద్ద అదుపు తప్పి అతి వేగంగా పరుగెత్తసాగింది.14.ఎన్నడూ కొరడా దెబ్బతిని ఎఱుగనిది, అతిత్వరగా బజారుకు వెళ్ళగల గుఱ్ఱం పడిపోయింది. దాంతో అకస్మాత్తుగా బండి పడి పోయింది. తాత్యా నడుం పట్టింది.15.ఇక ఎక్కడి బజారు ఎక్కడి సంత? తాత్యాకు సాయిమాత గుర్తుకు వచ్చారు. వారిమాట విని ఉంటే ఈ అపాయం తప్పేది కదా; జరిగిపోయినదానిని గూర్చి ఆలోచించటం వ్యర్థం.16.ఇలాగే మరోసారి జరిగింది. తాత్యా కోల్హార్ గ్రామానికి బయలుదేఱాడు. టాంగా సిద్ధం చేసుకుని వచ్చి బాబా పాదాలకు వందనం చేసి ఇక వెళ్లివస్తానని చెప్పాడు.17. బాబా పూర్తి అనుమతి లభించలేదు.అయినా అలాగే బయల్దేరాడు.ఆ తరువాత ఏం జరిగిందో వినండి.18.అసలే అది చాలా వేగంగా వెళ్లేబండి.గుఱ్ఱాలు అదుపు లేకుండా దారి తెన్ను మిట్టపల్లాలు చూడకుండా అతివేగంగా పరుగెత్తగా ప్రాణం మీదకు వచ్చింది.19.సాయిబాబా దయతో ఆ అపాయం తొలగింది. టాంగా తుమ్మచెట్టుకు గ్రుద్దుకొని ఆగిపోయింది.నయం.అక్కడితో వెనుకకు మరలాడు. తరువాత ప్రమాదం నుండి తప్పించుకున్నాడు.20.ఇలాగే ఒక ముంబై పుర నివాసి. ఆంగ్లేయుడైన గొప్ప గృహస్థుడు. మనసులో ఏదో కోరికతో సాయి దర్శనానికి

వచ్చాడు.21.అతడు మాధవరావు పేర నానా చందోర్కరు వద్ద నుండి సిఫారసు పత్రాన్ని తెచ్చుకున్నాడు. ఒక గుడారంను అడిగి తీసుకుని అందులో సుఖంగా ఉన్నాడు.22.ఎవరైనా బాబా ఇష్టానికి వ్యతిరేకంగా మసీదు మెట్లెక్కి వెళ్ళి,స్వేచ్ఛగా వారి దర్శనం చేసుకుని వస్తామని అనుకోవడం అసంభవమని అందరికీ తెలుసు.23.ఆంగ్లేయుడు మూడుసార్లు మసీదు మెట్లెక్కాలని ప్రయత్నం చేశాడు. కాని వ్యర్థమైంది. దాంతో పాపం అతడు నిరుత్సాహపడ్డాడు.24.మసీదు పైకి వెళ్ళి మోకాళ్ళపై వంగి బాబాకు వందనం చేసి వారి చేతిని చుంబించి అక్కడ కూర్చోవాలని అతని మనసులోని కోరిక.25.కాని బాబా అతనిని మసీదులో తమ వద్ద కూర్చోవడానికి రానివ్వలేదు.26.అతడు క్రిందనే సభామండపంలో కూర్చుని,అక్కడినుండే తమ దర్శనం చేసుకోవాలి కాని పైకి రాకూడదని ఆంక్ష .27.అతడు తిరిగివెళ్ళి పోవటానికి బయలుదేరి, బాబా అనుమతి కొఱకు ప్రాంగణం లోకి రాగా, బాబా, 'ఎందుకింత తొందర రేపు వెడుదువుగానిలే' అని అన్నారు.28.బాబా అనుమతి లేకుండా వెళ్ళినవారు చాలా పశ్చాత్తాప పడ్డారు.కనుక వెళ్ల వద్దని జనులు అతనికి అనేక విధాల నచ్చ చెప్పారు.29.అయినా అతను పట్టించుకోలేదు. జరగవలసిన దాని ముందు ఏదీ సాగదు. అందువలన అతడు బాబా అనుమతి లేకుండానే బయలుదేరి మార్గంలో బాధ పడ్డాడు.30.మొదట బండి బాగానే నడిచింది.తరువాత గుఱ్ఱాలు దారి తప్పాయి. సావుల్ విహీర్ దాటే సరికి ఎదురుగా ఒక సైకిలు వచ్చింది.31.గృహస్థుడు వెనుక కూర్చుని ఉన్నాడు. అకస్మాత్తుగా గుఱ్ఱాలు బెదరగా కుదుపు వచ్చి ఒక్కసారిగా టాంగా పట్టు తప్పింది. వెనుకఉన్న గృహస్థుడు రోడ్డుమీద వెల్లకిలా పడ్డాడు.32.గొప్ప ప్రయత్నంతో టాంగాను ఆపారు. ఆ గృహస్థు కొంతదూరం ప్రాకుకుంటూ వెళ్ళాడు. అతనిని లేవనెత్తి టాంగాలో కూర్చోబెట్టగా టాంగా ముందుకు సాగింది.33.ఒకవైపు శిరిడీ మరొకవైపు ముంబై

ఉండగా, టాంగా కోపరిగాం హోస్పటలు దగ్గరకు వెళ్లింది.34.బాబా ఆజ్ఞను జవదాటినందుకు అతడు అక్కడ ప్రాయశ్చిత్తంగా కొన్నిరోజులు పశ్చాత్తాపపడ్డాడు. తన కర్మను అనుభవిస్తూ ఆస్పత్రిలో పడి ఉన్నాడు.35.ఈ విధంగా లెక్కలేనన్ని అనుభవాలు కలగగా, ప్రజలు కీడు శంకించి భయంతో బాబా ఆజ్ఞను పాటించసాగారు. బాబా ఆజ్ఞను జవదాటే సాహసం చేసేవారు కాదు.36.కొందటి విషయంలో బండి చక్రాలు ఊడి పోయేవి.కొందరి విషయంలో గుఱ్ఱాలు అలసిపోయేవి.మరి కొందరికి రైలుబండి తప్పిపోయి ఉపవాసం ఉండేవారు. లేదా కొందరు మరమరాలు నమిలేవారు.37.బాబా ఆజ్ఞను శిరసావహించినవారు, వేళకాని వేళకూడా రైలును అందుకొని, సుఖంగా ప్రయాణం చేసి దానిని జీవితాంతం గుర్తుంచుకునేవారు.38.బాబా భిక్షావృత్తిని సంవత్సరాల తరబడి ఎందుకు ఇష్టపడ్డారు అని ఎవరికైనా అనిపిస్తే ఆ సంశయాన్ని నివృత్తి చేస్తాను, వినండి.39.బాబా ఆచరణను పరిశీలిస్తే వారికి భిక్ష చేయటమే ఉచితమని తెలుస్తుంది. గృహస్థులకు అది ఆనందదాయకం. దాని ద్వారా తమ గృహస్థ కర్తవ్యాన్ని పాలించి వారు తమ శ్రేయస్సును సాధించుకోగలరు.40.వాక్కును, తనువు మనసును, ధనాన్ని సాయి పాదాలకు సమర్పించే అనన్య భక్తులపై సాయికి అమిత ప్రేమ.41.గృహస్థాశ్రమంలో ఉండి అన్నం వండుకునే వారి ఇంటి యజమాని ముందుగా యతులకు బ్రహ్మచారులకు భోజనం పెట్టాలి.42.అలా పెట్టకుండా గృహస్థు తాను ముందుగా భోజనం చేస్తే త్రికరణశుద్ధి కొఱకు చాంద్రాయణ వ్రతాన్ని ఆచరించాలని శాస్త్రనియమం.43.యతులు బ్రహ్మచారులు స్వయంగా వండుకోవడం నిషేధం.అలా వండుకుంటే,వారి నెత్తిన కూడా చాంద్రాయణ వ్రతం పడటం నిశ్చయం.44. అందువలన శాస్త్రాలు, వారి పొట్టలను నింపే బాధ్యతను గృహస్థులపైన వేశాయి. యతులు తమ ఉదరపోషణకు ఎప్పుడూ ప్రయత్నం చేయరు.45.బాబా గృహస్థులు కారు. వానప్రస్థానికి చెందరు. వారు

కేవలం బ్రహ్మచారులు. బాల సన్యాసి. వారికి భిక్షయే ప్రశస్తమైనది. 46. ఈ అఖిల విశ్వమూ నా ఇల్లు. నేనే వాసుదేవుణ్ణి. నేనే విశ్వంభరుణ్ణి. నేనే అక్షర పరబ్రహ్మను అన్న దృఢమైన జ్ఞానం కలవారు భిక్షాన్నానికి పూర్తి అధికారులు. 47. వారు విశ్వమంతా ఒకే కుటుంబమని భావిస్తారు. ఇతరులు హాస్యాస్పదంగా వీధులలో అడుక్కోవటాన్ని గమనించండి. 48. ముందు సంతానం పైన, ధనంపైన, లోకంపైన, పదవిపైన మోహాన్ని విడవాలి. ఈషణ త్రయాలు లేని వారు భిక్షాన్నాన్ని ఆశించాలి. 49. లేకపోతే తుకారాం మహారాజు తెలిపినట్లు భిక్షాపాత్రను ఆశ్రయించటం సిగ్గుచేటు. దీనిని అర్థం చేసుకోలేకపోతే వ్యర్థం. 50. సాయి సమర్థులు గొప్ప సిద్ధులని చిన్నాపెద్దా అందరికీ బాగా తెలుసు. కాని మనం ఎల్లప్పుడూ ఆశాబద్ధులమై ఉండటం చేత వారి శ్రీచరణాలను చేరుకోవడానికి సిద్ధంగా లేము. 51. పంచమహా యజ్ఞాలను ఆచరించకుండా భోజనం చేయటం గృహస్థులకు నిషిద్ధం. శిరిడీలో రోజూ బాబా స్వయంగా వీనిని చేయించి భోజనాన్ని పవిత్రం చేయించేవారు. 52. వారు ప్రతిరోజూ అయిదు ఇళ్ళకు వెళ్లి అతిథియజ్ఞాన్ని గుర్తుచేసేవారు. తమ ఇళ్లల్లోనే కూర్చుని ఈ లాభాన్ని పొందిన వారు ఎంతటి భాగ్యవంతులు. 53. పంచమహా యజ్ఞాలను ఆచరించిన తరువాత శేషించిన ఆ అన్నాన్ని సేవిస్తే, తెలియకుండా చేసిన వారి కఠినమైన పంచ సూనలు నశించి పోతాయి. 54. కండణి, చుల్లి, పేషణి, ఉదకుంభీ, మార్జని ఇవి పంచసూనాలని ప్రజలలో ప్రసిద్ధి. 55. రోటిలో ధాన్యం వేసి రోకలితో దంచి పాట్మును తీయటంలో తెలియకుండానే జీవహింసజరుగుతుంది. 56. కాని ఇదంతా చేయకపోతే ఆధాన్యం వంటకు పనికి రాదు. పంచ సూనలలో మొదటి పాపం కండణి. 57. పొయ్యిలో కట్టెలు పెట్టి వండటంలో తెలియకుండా ఎన్నో జీవులు చచ్చిపోతాయి; చుల్లి అని ఇది రెండోపాపం. 58. తిరగలిలో ధాన్యాన్ని పిండి చేస్తున్నప్పుడు, తెలియకుండా అసంఖ్యాక ప్రాణులకు

హానికలుగుతుంది. దీని పేరు పేషణి.59.వాపీ కూప తటాకాల నుండి కుండలో నీళ్లు తేవటం లేదా అక్కడ స్త్రీలు, పురుషులు తోమడం, లేదా ఉతకడం వలన అసంఖ్యాక ప్రాణులు మరణిస్తాయి.60.బిందెలను శుభ్ర పరచటానికి వానిని చేత్తో తోమటంలో అనిచ్చా పూర్వకంగా హత్యలు జరుగుతాయి. ఇది ఉదకుంభి అనే నాలుగో పాపం.61.అట్లే చన్నీళ్లతో గాని లేక వేడినీళ్లతో స్నానం చేస్తున్నప్పుడు, కల్లాపి చల్లుతున్నప్పుడు ఎన్నో ప్రాణులు దారుణంగా చచ్చిపోతాయి. దీని పేరు మార్జని.62.ఈ పంచమహాపాపాల నుండి విముక్తులవటానికి గృహస్థులు పంచమహాయజ్ఞాలను చేస్తే పంచ పాపాలు నశించి చిత్తశుద్ధి కలుగుతుంది. 63.చిత్తశుద్ధితో ప్రకాశవంతమైన శుద్ధ జ్ఞానం ఉత్పన్నమౌతుంది. జ్ఞానం కలిగిన తరువాత ఫలితంగా భాగ్యవంతులు మోక్షాన్ని పొందుతారు. 64. సాయిబాబా యొక్క ఈ భిక్షావృత్తిని గూర్చి వ్రాస్తుంటే గ్రంథం పెరిగిపోతుంది. ఇప్పుడు నిజంగా జరిగిన ఒక కథను తెలిపి ఈ అధ్యాయాన్ని సమాప్తి చేస్తాను.65.మనసులో కేవలం ప్రేమ ఉంటే చాలు. ఎవరితోనైనా బాబాకు ఏదైనా పంపితే, తెచ్చినవారు మరిచిపోయినా బాబా అడగటం మరచిపోయేవారు కాదు.66.రొట్టె కూర గాని, పాలకోవా గాని దృఢమైన భక్తిభావంతో ఇవ్వాలి. అటువంటి భక్తులు తటస్తపడితే బాబాకు ప్రేమ ఉప్పొంగేది.67.అలాంటి ప్రేమ గల ఒక భక్తుని కథను వింటే మనసుకు ఆనందం కలుగుతుంది. ఎవరైనా చేపట్టిన పనిలో పొరపాటు చేస్తే వారిని బాబాయే దారిలో పెట్టేవారు.68. ఇలాంటి రమ్యమైన శిక్షణా పద్ధతితో బాబా సరియైన సమయానికి సరిదిద్దే వారు. దీనిని అనుభవించినవారు ధన్యభాగ్యులు. వారి ఆనంద స్థితిని వర్ణించలేను.69.రామచంద్రుడు అనే భక్తశ్రేష్ఠుని తండ్రి ఆత్మారాముడు. వారి ఇంటిపేరు తర్ఖడ్. అతనికి సాయియే విశ్రామ ధామం.70.అతనిని బాబా సాహేబు తర్ఖడ్ అని అందరూ ఎప్పుడూ పిలిచేవారు. ఇప్పుడు ఈ గ్రంథంలో

అతని గురించిన కథ.71.సాయి పైన ఉప్పొంగే ప్రేమలో మునిగిపోయి తర్ఖడ్ చెప్పిన, అతని అనుభవాలను వినటం ఎంతో ఆహ్లాదకరం.72.అతని భక్తి వైభవం ఎంత గొప్పది? అడుగడుగునా అతనికి సాయి అనుభవాలే. ఒకదానిని మించినది మరొకటి,వానిని అతడు హావభావాలతో రసభరితంగా చెప్పేవాడు.73.బాబాసాహేబు అమితమైన ప్రేమతో సాయి యొక్క చిత్రపటాన్ని తన ఇంట్లో అందమైన చందన మండపంలో ఉంచి రోజూ త్రికాల పూజలు చేసేవాడు.74.తర్ఖడ్ గొప్ప పుణ్యాత్ముడు.అతని పుత్రుడు కూడా భక్తుడు.సాయికి నైవేద్యం సమర్పించకుండా భోజనం చేసేవాడు కాదు.75.ప్రాతఃకాలంలోనే స్నానం చేసి, కాయావాచామనసా నిత్యం బాబా పటాన్ని పూజించి భక్తిగా నైవేద్యం సమర్పించేవాడు.76.ఈ విధంగా అతడు నిత్యం క్రమం తప్పకుండా పూజ చేయగా అతని శ్రమ ఫలించి, అతనికి అత్యుత్తమమైన అనుభవం కలిగింది.77.అతని తల్లికూడా సాయి యొక్క పరమ భక్తురాలు.ఆమె శిరిడీ వెళ్లాలని ఉబలాటపడింది. ఆమె వెంట దారిలో తోడుగా కొడుకును పంపాలని తండ్రి ఉద్దేశం.78.శిరిడీ వెళ్లి సాయిసమర్థుని దర్శనం చేసుకుని కొంతకాలం అక్కడే ఉండి ప్రత్యక్షంగా సాయి పాదాలను సేవించుకోవాలని ఆమె కోరిక.79. కాని తండ్రి తలచినట్లుగా కుమారుని మనసులో వెళ్లాలని లేదు.ఇంట్లో రోజూ నియమంగా ఎవరు పూజచేస్తారు అని అతని చింత.80.తండ్రి ప్రార్థనా సమాజానికి చెందిన వాడు. ఇష్టం లేని అతనిని విగ్రహారాధన చేయమని ఎలా ఇబ్బంది పెట్టగలడు? అదీ అతని సమస్య.81.తండ్రి మనోగతాన్ని తెలుసుకుని కొడుకు ప్రయాణానికి సిద్ధమై, తండ్రితో ప్రేమపూర్వకంగా అన్న మాటను వినండి.82.సాయికి నైవేద్యం సమర్పించకుండా ఇంట్లో ఎవరూ భోజనం చేయమని మాట ఇస్తేనే గాని, నేను నిశ్చింతగా ప్రయాణం చేయలేను. 83. తండ్రికి తన కొడుకు యొక్క నిత్యపూజా కార్యక్రమం బాగా తెలుసు కనుక, 'నేను నిత్యం నైవేద్యం సమర్పిస్తాను. నీవు

నిశ్చింతగా ఉండు.84.ముందుగా సాయికి సమర్పించకుండా ఎవరూ అన్నాన్ని స్వీకరించం.నా ఈ మాటలు ప్రమాణంగా భావించి ఏ అనుమానం పెట్టుకోకుండా సుఖంగా వెళ్ళు' అని చెప్పాడు.85.ఇలా తండ్రి హామీ ఇచ్చాక ఆ అబ్బాయి శిరిడీ ప్రయాణమయ్యాడు. మరునాడు ఉదయం తర్ఖడ్ స్వయంగా పూజ చేశాడు.86. బాబాసాహెబ్ తర్ఖడ్ రెండవ రోజు పూజను ప్రారంభించక ముందు,బాబా చిత్రపటంముందు సాష్టాంగప్రణామం చేసి ప్రార్థించాడు.87.'బాబా నా కుమారుడు చేసిన విధంగానే నా పూజను సేవను స్వీకరించండి.యాంత్రికంగా పైపైన మాత్రమే కాకుండా నాలో ప్రేమను కలిగించండి' అని.88.ప్రతి రోజూ బ్రహ్మ ముహూర్తాన లేచి స్నానం చేసి తర్ఖడ్ ప్రార్థనా పూర్వకంగా పూజ చేసి, ప్రతిదినం నైవేద్య సమర్పణ కూడా చేసేవాడు.89.బాబాసాహెబ్ పటిక బెల్లం ముక్కను నైవేద్యంగా సమర్పించేవాడు.ఈ విధంగా చక్కగా నియమంగా జరుగుతుండగా ఒకరోజు విఘ్నం జరిగింది.90.తర్ఖడ్ మనసు వ్యవహారాలలో మునిగి ఉండటం వలన మరపు కారణంగా ఒకదినం నైవేద్యం లేకుండానే అందఱి భోజనాలు అయ్యాయి.91.తర్ఖడ్ ఒక పెద్ద మిల్లులో ముఖ్యాధికారి కావటంవలన,రోజూ తెల్లవారు ఝామునే అతనికి బయటికి వెళ్లవలసివచ్చేది.92.మధ్యాహ్నం తిరిగి బయటి నుండి వచ్చిన తరువాత ఉదయం తాను నివేదించిన పటిక బెల్లం ప్రసాదాన్ని భోజనానికి కూర్చున్నప్పుడు తీసుకునే వాడు.93.ఇలా జరుగుతుండగా ఒకరోజు పటిక బెల్లాన్ని నైవేద్యం పెట్టటం మరచిపోయాడు. అందువలన భోజనంలో ప్రసాదం లేదు.94.భోజనానికి కూర్చున్నప్పుడు, వంటమనిషి రోజూ ఆ పటిక బెల్లం నైవేద్యాన్ని పళ్లెంలో వడ్డించేది. అదే అన్నశుద్ధి.95.కాని ఆ రోజున పూజా సమయంలో ఏదో కారణంగా త్వరపడటం వలన, పటిక బెల్లాన్ని నైవేద్యంగా సమర్పించలేదు. అందువలన ప్రసాదాన్ని వడ్డించలేదు.96.తర్ఖడ్ పశ్చాత్తాపంతో పళ్లెం ముందు నుండి లేచి, సాయిపటానికి వందనం

చేసి, ఆవేదనతో నయనాశ్రువులతో వేడుకున్నాడు.97.'బాబా! ఏమిటి ఈ మాయ? నావలన ఈ పొరపాటు ఎలా జరిగింది? నా పూజ యాంత్రికంగా జరిగింది.నన్ను క్షమించండి.98. ఇది పొరపాటు కాదు. మహా పాపం. నేను బాగా పశ్చాత్తాప పడుతున్నాను. నేను పొరపాటు చేశాను. నేను సిగ్గు విడిచినవాణ్ణి. మహా ప్రభూ నన్ను కరుణించండి.99.అంతఃకరణం కరిగి బాబా పటం ముందు సాష్టాంగ పడ్డాడు. మహారాజా! దయాఘనా! నాపై కరుణ చూపండని ప్రార్థించాడు.100.నిస్సహాయుడై కొడుకుకు ఉత్తరం వ్రాశాడు. నా వలన పెద్ద ప్రమాదం జరిగింది. నన్ను క్షమించమని బాబాను ప్రార్థించు.101.అనన్య శరణు జొచ్చిన నన్ను కరుణించమని సాయిని ప్రార్థించు. మరియు ఈ దీన దాసుని కొఱకు వారి అభయ హస్తాన్ని వారి అభయ వచనాన్ని వేడు.102.బాంద్రాలో జరిగిన ఈ విషయం, వంద కోసుల దూరంలో ఉన్న శిరిడీకి వెంటనే చేరింది. అప్పుడు బాబా అన్న మాటలను వినండి.103.బాబా భూతభవిష్యత్ వర్తమానాలకు, దేశకాలాలకు అతీతులు,వారు త్రికాలజ్ఞాని అని అనటానికి ఇది ప్రత్యక్ష ప్రమాణం.104.అదేరోజు శిరిడీలో ఉన్న అబ్బాయి సాయికి వందనం చేయడానికివెళ్ళగా, ఆ సమయాన జరిగిన దానిని శ్రోతలు సావధానులై వినండి.105.ఆ అబ్బాయి ఎంతో ఉత్సాహంగా తల్లితో సహా సాయి చరణాలకు నమస్కరించగా, బాబా ఆ తల్లితో అన్న మాటలను విని అతనికి అత్యంత ఆశ్చర్యం కలిగింది.106.'ఏం చేయను తల్లీ! ప్రతిరోజూ లాగే నేను ఈ రోజూ బాంద్రాకు వెళ్లాను. తినటానికి త్రాగటానికి ఏమీ లేక నేను ఉపవాసంతో తిరిగిరావాల్సి వచ్చింది.107.ఎలాటి ఋణానుబంధమో. తలుపులు మూసే ఉన్నా నేను స్వేచ్ఛగా లోపలికి ప్రవేశించాను.నన్ను ఎవరు అడ్డు పెట్టగలరు?.108. ఇంట్లో యజమాని లేడు.ఆకలితో నాకడుపులో ప్రేగులు అలమటిస్తున్నాయి. మిట్ట మధ్యాహ్నం వేళ అన్నం లేకుండా నేనట్లే వెనుకకు తిరిగి వచ్చేశాను.'109. ఈ మాటలను

విన్నవెంటనే, ఆ అబ్బాయి తన తండ్రి, నైవేద్యం సమర్పించడం బహుశా మరచి ఉంటాడని గ్రహించాడు.110.తనకు ఇంటికి వెళ్లటానికి అనుమతినిమ్మని బాబాను వేడుకున్నాడు. కాని బాబా అతనిని వెళ్ళనివ్వలేదు. అతని పూజను అక్కడే స్వీకరించారు.111.అబ్బాయి అదే రోజు జరిగినదంతా సవిస్తరంగా శిరిడీ నుండి తండ్రికి ఉత్తరం వ్రాశాడు. దానిని చదివి ఆ తండ్రి మనసు కరిగిపోయింది.112.ఇక్కడ ఆ తండ్రి ఉత్తరం అక్కడ కొడుకుకు అందింది. ఆ అబ్బాయికి కూడా చాలా ఆశ్చర్యం కలిగింది. అతని కళ్లనుండి కూడా అశ్రువులు జారాయి.113.సాయి యొక్క ఈ లీల ఎలాంటిదో చూడండి. ప్రేమ ఉప్పొంగ కుండా ఎలా ఉంటుంది? దీనికి ద్రవించని పాషాణం లాంటి వారెవరుంటారు?114.ప్రేమమయి అయిన ఈ అబ్బాయి తల్లి శిరిడీలో ఉండగా, బాబా ఒకసారి ఆమెను అనుగ్రహించిన విశేషాన్ని వినండి.115.ఆమె భోజనగదిలో ఉన్నప్పుడు ఆకులలో అన్నీ వడ్డించి ఉండగా, ఇంతలో ఆ మధ్యాహ్నం పూట ఆకలితో ఉన్న ఓ కుక్క తలుపు దగ్గరకు వచ్చింది.116.ఆకులో ఉన్న రొట్టె ముక్కను ఆమె కుక్కకు వేయగా, అక్కడికి బురదతో నిండి ఆకలితో ఉన్న ఒక పంది వచ్చింది.117.ఇది సహజంగా జరిగిపోయింది. ఆమె దీనిని మనుకు పట్టించుకోలేదు. కాని మధ్యాహ్నం బాబా తమంతట తాము ఆ విషయాన్ని ప్రస్తావించారు.118.మధ్యాహ్నం భోజనమైన తరువాత రోజూలాగే, ఆమె దూరంగా మసీదులో కూర్చుని ఉండగా బాబా ఆమెతో ఆదరంగా119.'అమ్మా! ఈ రోజు నువ్వునాకు తిండి పెట్టావు, కడుపు నిండింది, గొంతువరకు తిన్నాను,ఎంతోవ్యాకుల పడుతున్న ఈ ప్రాణాలను నీవు తృప్తిపరచావు.120.రోజూ ఇలాగే చేస్తూ ఉండు. నిజంగా పనికి వచ్చేది ఇదే.మసీదులో కూర్చుని నేను అబద్ధం చెప్పటం ముమ్మాటికి జరగదు.121.ఇలాగే నా దయా గుణాన్ని గ్రహించు.ఆకలి గొన్నవారికి ముందు పెట్టి, మనం తరువాత తినాలి.దీనిని మనసులో బాగా గుర్తుంచుకో'.122.

సాయి సమర్థులు చెప్పినది ఆ స్త్రీకి ఏమీ అర్థం కాలేదు. దాని భావార్థమేమిటో? బాబా మాటలు ఎప్పుడూ నిరర్థకం కావు. 123. నేనే ఒకరిపై ఆధారపడి డబ్బు ఇచ్చి దొరికిందేదో తింటున్నాను. నేను నీకివ్వటం ఎలా సంభవం అని ఆమె అన్నది. 124. 'నువ్వు ప్రేమగా పెట్టిన రొట్టెతిని నేను పూర్తిగా సంతృప్తి చెందాను. నాకు ఇంకా త్రేనుపులు వస్తున్నాయి.' అని బాబా జవాబిచ్చారు. 125. 'నీవు భోజనానికి కూర్చున్నప్పుడు ఆకలితో వ్యాకుల పడుతూ అకస్మాత్తుగా తలపువద్దకు వచ్చిన ఓ కుక్కను చూచావుకదా? దానితో నాకు ఏకాత్మత. 126. అలాగే శరీరమంతా బురదతోనిండి ఆకలితో అలమటిస్తున్న పందిని చూడలేదూ, దాని ఆత్మ నా ఆత్మ ఒక్కటే. 127. ఆ మాటలువిని ఆ స్త్రీ ఆశ్చర్యపడింది. ఇలా తిరుగుతున్న కుక్కలూ, పందులూ, పిల్లులూ మొదలగు సమస్త ప్రాణులూ బాబా యేనా అని, 128. నేను ఒకప్పుడు కుక్కను, మరొక ప్పుడు పందిని, ఒకప్పుడు గోవును, ఒకప్పుడు పిల్లిని, మరొకప్పుడు చీమ, దోమ లేదా జలచరాన్ని. నేను ఆయా రూపాలతో విహరిస్తుంటాను. 129. నన్ను సర్వజీవులలోను చూచేవారే నాకు ప్రీతిపాత్రులు అని తెలుసుకో. నీవు భేదబుద్ధిని త్యజించి నన్ను ఇట్లే భజించు.' 130. అవి మాటలా? కావు పరమామృతం. దానిని సేవించిన ఆ స్త్రీ మనసు కరిగింది. కళ్ళు ఆనందాశ్రువులతో నిండాయి. కంఠం గద్గదమైంది. 131. ఇటువంటిదే ప్రేమ రసాత్మకమైన ఈ స్త్రీ యొక్క మరొక అందమైన కథ. ఇది సాయి సమర్థుని ఏకాత్మతను భక్తులతోటి వారి ఐక్యతను తెలియ చేస్తుంది. 132. ఒకసారి పురందరు, తన భార్యా బిడ్డలను వెంట బెట్టుకుని శిరిడీకి బయలుదేరాడు. అతని భార్యకు తర్ఖడ్ భార్య ప్రేమగా వంకాయలను ఇచ్చింది. ఒక కాయతో బాబాకు భర్తాను. 133. రెండవదానితో వేపుడు కూరను చేసి, వారికి తృప్తిగా వడ్డించమని ఆమెతో చెప్పింది. 134. ఆమె అట్లే నని వంకాయలు తీసుకుంది. శిరిడీకి చేరుకున్నాక హారతి ముగిసిన తరువాత, ఆమె భోజన సమయానికి

వంకాయ భర్తాను తీసుకుని వెళ్ళింది.135.రోజూలాగే నైవేద్యాన్ని సమర్పించి ఆ పళ్లెమును అక్కడ ఉంచి ఆమె వెళ్ళిపోయింది.అందరి నైవేద్యాలను కలిపి బాబా భోజనానికి కూర్చున్నారు.136.వంకాయ కూరను రుచి చూచి అది బాగా రుచికరంగా ఉన్నట్లు అందరికీ అనిపించింది. వంకాయ వేపుడు తినాలని ఉంది. దాన్ని ఇప్పుడు తెచ్చి పెట్టండని బాబా అన్నారు.137.బాబా వంకాయ వేపుడు తినాలన్న కోరికతో భోజనం చేయకుండా ఆగారు అని రాధాకృష్ణబాయికి కబురుపంపారు. ఏం చేయాలో ఎవరికీ అర్థంకాలేదు.138.వంకాయలు కాసేకాలంకాదు. ఇప్పుడు వేపుడు కూర నెలా తయారు చేయాలి? భర్తాను తెచ్చిన పురందర్ భార్యను వెదక సాగారు.139.ఆమె తెచ్చిన పళ్లెంలో వంకాయ కూర ఉంది. అందువల్ల బహుశా ఆమె వద్ద ఇంకా వంకాయలు ఉండి ఉంటాయని అనిపించింది.140.ఆమెను అడగగా అప్పుడు వంకాయ వేపుడు యొక్క ప్రాముఖ్యం,దానిపై బాబాకు ఎందుకంత ప్రీతి అన్న అసలు విషయం అందరికీ అర్థమైంది.141.ఒక కాయతో కూర చేసి మధ్యాహ్నం సమర్పించాను. రెండవకాయతో వేపుడు చేసి తరువాత తీసుకుని వెళ్లాలని కోసి ఉంచాను అని ఆమె చెప్పింది. 142.తరువాత ఆ వంకాయల ఉదంతం అందరికీ క్రమ క్రమంగా తెలిసింది.సాయి యొక్క సర్వవ్యాపకతను గ్రహించి అంతా ఆశ్చర్య పడ్డారు. 143.క్రీ.శ. 1915 వ సం॥ డిసెంబరు నెలలో, మరొకసారి తర్ఖడ్ భార్యయే బాబాకు అత్యంత ప్రేమతో పాలకోవాను పంపింది. 144. పరమపదించిన బాలారాం కర్మను జరపటానికి, అతని కుమారుడు శిరిడీ బయలుదే రుతూ ఆ విషయాన్ని చెప్పటానికి తర్ఖడ్ వద్దకు వచ్చాడు. 145. అతనితో బాబాకు ఏదైనా పంపాలని తర్ఖడ్ భార్యకు అనిపించింది. 146.ఇంట్లో చూస్తే పాలకోవా తప్ప మరేం లేదు. అదైనా అదివరకే నైవేద్యంగా అర్పించిన పేడా. ఆ అబ్బాయి వెళ్ళడానికి తొందరపడుతున్నాడు. 147. అంతేకాక ఆ అబ్బాయి సూతకంలో ఉన్నాడు.

ఇంట్లో ఒకసారి అర్పించిన పాలకోవా మాత్రమే ఉంది. దానినే సాయికి అర్పించటానికి అబ్బాయితో పంపాలనుకుంది.148.ఇప్పుడు దీనినే తీసుకొని వెళ్లి ప్రేమపూర్వకంగా బాబాకు ఇవ్వు. వారు ప్రీతిగా తింటారు అని చెప్పింది.149.అబ్బాయి గోవిందు పాలకోవాను తీసుకుని వెళ్లాడు, కాని బాబా దర్శనానికి వెళ్లినప్పుడు దానిని తాను బసచేసిన చోటే మరచి పోయాడు.అప్పుడు బాబా ఓపికగాఉన్నారు.150. తరువాత సాయంత్రం మరల అబ్బాయి దర్బారుకు వెళ్లినప్పుడు కూడా మునుపటి వలెనే మరచిపోయి మసీదుకు ఒట్టి చేతులతో వెళ్లాడు.151.బాబా అతనిని నువ్వు నాకొఅకు ఏం తెచ్చావని అడిగి చూచారు.ఏమీ తేలేదని అతడు చెప్పగా,కొంచెం గుర్తుకు తెచ్చారు.152.నాకోసమని ఎవరూ ఏ వస్తువూ నీకివ్వలేదా?అని అడిగారు. లేదని అబ్బాయి చెప్పగా,సాయి సమర్థులు స్పష్టంగా అడిగారు.153.'ఒరేయ్ ! ఇంటినుండి బయల్దేరినప్పుడు ఆ తల్లి ప్రేమతో నీచేతికి నేను తినటానికి మిఠాయి ఇవ్వలేదూ'?అని స్పష్టంగా అడిగారు.అప్పుడు అతనికి గుర్తుకు వచ్చింది.154.ఎలా మరిచిపోయానా అని ఎంతో సిగ్గుపడ్డాడు. తలవంచి బాబా చరణాలకు వందనం చేసి క్షమించమని వేడుకున్నాడు.155.వెంటనే పరుగుపరుగున బసకు వెళ్లి పాలకోవాను తెచ్చి బాబాకు అర్పించాడు.తన చేతిలో పడగానే బాబాదాన్ని నోట్లో వేసుకున్నారు.అలా ఆ తల్లి యొక్క భక్తికి ప్రసన్నులయ్యారు.156.ఇటువంటి ఈ సాయి మహాను భావులు ఎవరి మనసులో ఏ భావముంటే దానికి అనుగుణంగానే అనుభవాలను కలుగచేసి భక్తుల గౌరవాన్ని నిలబెట్టేవారు.157.ఈ కథలోని మరొక ఉద్దేశం – సర్వజీవులలోను భగవంతుణ్ణి చూడాలి అని. సర్వశాస్త్రాలకు సమ్మతమైనది ఇదే. ఇందులోని సిద్ధాంతం ఇదే.158.ఇక తరువాతి అధ్యాయంలో బాబా ఎక్కడ నివసించేవారు – ఎలా శయనించేవారు –సావధాన చిత్తులై శ్రవణం చేయండి.159.హేమాడ్ సాయి చరణాలకు శర

ణు జొచ్చి,శ్రోతలు ఈ కథలను శ్రవణం తో పాటు మననం నిదిధ్యాసనం చేస్తే, కృతకృత్యులౌతారని మనవి చేస్తున్నాడు.160.స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన,శ్రీ సాయి సమర్థసచ్చరితంలో తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీసాయి సచ్చరిత - 10 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ;శ్రీ కులదేవతాయైనమః
శ్రీసీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

నిరతం బ్రహ్మ స్వరూపంలో స్థితులై ఉన్నవారిని, సకల ప్రజల శ్రేయస్సులో నిమగ్నులైనవారిని భక్తిపూరిత మనసులతో నిరంతరం స్మరించండి.1.వారిని స్మరించినంతమాత్రాన జనన మరణభ్రమణం తొలగిపోతుంది.ఇదే సాధనలలో ఉత్తమమైన సాధనం దీని కోసం ఒక గవ్వైనా ఖర్చుకాదు.2.తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితం సునాయాసంగా హస్తగతమౌతుంది.ఇంద్రియాలు దృఢంగా ఉన్నంతవరకు ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలి.3.ఇతర దేవతలందరూ మాయ. గురువొక్కరే శాశ్వతమైన దైవం.వారి చరణాల యందు విశ్వాసం ఉంచితే వారు విధి వ్రాతను మార్చగలరు.4.ఉత్తమమైన సద్గురు సేవతో ప్రపంచ సుఖదుఃఖాలన్నీ నిర్మూలనమవుతాయి. న్యాయం మీమాంస ఘటపటాది అధ్యయనం అవసరంలేదు.5.సద్గురువు నావికుడైతే, అధిభౌతిక ఆధ్యాత్మిక అధిదైవికమను తాపత్రయ దుఃఖాల నుండి భావికులైన భక్తులు తరింప బడుతారు.6. లౌకికమైన ఈ సాగరాన్ని దాటటానికి నావికునిపై విశ్వాసముంచాలి కదా! అట్లే భవసాగరాన్ని దాటటానికి గురువు యందు విశ్వాసం ఉంచాలి.7.గురువు శిష్యుల భక్తిశ్రద్ధలను గమనించి వారికి జ్ఞానాన్ని కరతలామలకం చేస్తారు. మరియు ఆనందలక్షణమైన మోక్ష ప్రాప్తిని అనాయాసంగాహస్తగతం చేస్తారు.8.ఎవరి దర్శన మాత్రాన హృదయగ్రంథి

విడిపోయి, విషయవాసనలన్నీ తొలగిపోతాయో, మరియు సంచిత క్రియామాణ కర్మలు క్షీణించిపోతాయో అట్టి సద్గురువు చరిత్రను నేను గానం చేస్తాను.9.అష్టమాధ్యాయంలో మానవ జన్మ యొక్క ప్రయోజనాన్ని, నవమాధ్యాయంలో భిక్షావృత్తి యొక్క ప్రాముఖ్యాన్ని విన్నారు.10.బాయిజాబాయి యొక్క రొట్టె కూరగురించి, ఖుశాల్ చందు సమాచారం, మహల్సాపతి తాత్యాల శయనపద్ధతి శ్రవణానందంగా వర్ణించడమయింది.11.ఇప్పుడు శ్రోతలు సావధాన చిత్తులై బాబా యొక్క తరువాతి చరిత్రను వారు ఎక్కడ ఎలా శయనించేవారు, ఎలా ఎక్కడెక్కడ విహరించేవారు అన్న విషయాలను వినండి.12.బాబా లౌకిక జీవనం ఎంత ఉత్తమం!. హిందువులు మహమ్మదీయులు ఉభయులకు వారు తల్లి. పులి మేకలవంటి సహజ శత్రువులకు వారు విశ్వాసధామం.అవి వారి వద్ద ఏ భయమూ లేకుండా ప్రేమగా విహరించేవి.13.ఆహారం గురించిన కథ అయింది. ఇప్పుడు బాబా ఎలా ఉండేవారు, ఎలా శయనించేవారో శ్రోతలు శ్రద్ధగా వినండి.14.నాలుగు మూరల పొడవు ఒక జానెడు వెడల్పుగల చెక్కపలకకు రెండువైపులా గుడ్డపేలికలు కట్టి, దానిని పైకప్పుకు వ్రేలాడగట్టి బాబా దానిపై పరుండేవారు.15.వారి తలవద్దా కాళ్ళవద్దా దీపాలు వెలుగుతుండేవి. వారు దానిపైకి ఎప్పుడు ఎక్కేవారో ఎప్పుడు దిగేవారో ఎవరూ చూచి ఎరుగరు.16.దానిపై మెడవంచుకుని కూర్చునేవారు, లేదా దానిపై నిద్రించేవారు. కాని వారు దానిపైకి ఎక్కడం, దిగడం ఎవరికీ తెలియదు.17.చింకి గుడ్డలతో కట్టిన ఆ పలక బాబా బరువును ఎలా భరించేది? వారివద్ద మహామహా సిద్ధులుండగా ఆ పలక ఏపాటిది? అది నామమాత్రానికే.18.అతి సూక్ష్మమైన నలుసు కళ్లలో గ్రుచ్చుకో కలిగినప్పుడు అణిమా సిద్ధి గల బాబా అవలీలగా చెక్కపైకి చేరుకోగలరు. బాబా చీమల దోమల క్రిముల రూపంలో సునాయాసంగా సంచరించేవారు.19.అణిమా సిద్ధి వారి ఇంటి దాసి కాగా దోమలా కావటానికి వారికి ఎంతసేపు? ఆధారం లేకుండా ఆకాశంలోనైనా ఉండగలిగే

వారికి చెక్కపలక ఒక లెఖ్ఖా?20. అణిమ మహిమ లఘిమ వంటి అష్టసిద్ధులు, నవనిధులు బద్ధాంజలితో వారి సన్నిధిలో రెండు వైపులా నిలబడగా వారికి చెక్కపలక కేవలం నిమిత్త మాత్రం.21. చీమలను, క్రిమికీటకాలను, కుక్కలను,పందులను, పశుపక్షులను, మనుషులను, రాజును పేదను, చిన్న వారిని పెద్దవారిని అందరినీ బాబా సమానంగా చూచేవారు.22.మూడున్నర మూరల శరీరంతో శిరిడీలో ఉంటున్నట్లు పైకి కనిపించినా పుణ్యరాసి అయిన ఆ మహారాజు సర్వహృదయవాసి.23. వారు పైకి లోకులకు మార్గదర్శిగాఉన్నట్లు ప్రవర్తించినా లోపల ఎవరితోనూ ఏసంబంధం లేకుండా ఉండేవారు.లోపల ఏకోరికలు లేకుండాఉన్నా పైకి భక్తుల యెడ మోహపాశంతో బంధింపబడి ఉన్నట్లు కనిపించే వారు.24. అంతరంగంలో అత్యంత నిష్కామంగా ఉండేవారు. బయట భక్తుల కోసం ఏవో కోరికలతో ఉన్నట్లు ఉండేవారు. పైకి కోపాన్నిప్రదర్శించినా, వారి అంతరంగం ఆత్మశాంతికి నిలయం.25.పైకి పైశాచిక ప్రవృత్తితో కనిపించినా వారు లోపల పరబ్రహ్మస్థితిలో ఉండేవారు. పైకి ప్రపంచపు వ్యవహారాలలో చిక్కుకున్నట్లు కనిపించినా, వారికి లోపల భేదభావం లేని ప్రేమ.26.వారు ఒకప్పుడు ప్రేమతో చూచేవారు.మరొకప్పుడు రాయి పుచ్చుకుని పరుగెత్తేవారు. ఒకప్పుడు చీవాట్లు పెట్టినా, మరొకప్పుడు ఆనందంగా కౌగిలించుకునేవారు.27.ఒకప్పుడు ఓర్పుగా సహనంతో సమాధ్యవస్థలో ఆనందంగా ఆత్మస్థితులై ప్రశాంతంగా ఉండేవారు. లేదా భక్తుల యెడ ప్రసన్నచిత్తులై ఉండేవారు.28. ఎటూ కదలక నిశ్చింతగా మౌనంగా ఎల్లప్పుడూ ఒకే ఆసనంలో తల్లీనులై ఉండేవారు. వారిచేతిలో సటకా దండం ఉండేది.29.వారికి కీర్తి కండూతి లేదు. ధనాపేక్షలేదు. చిత్తవృత్తిని నిరోధించిన యోగంతో ప్రాణరక్షణకు భిక్షను తీసుకుని కాలక్షేపం చేసేవారు.30.సన్యాసి వేషంలో ప్రత్యక్ష యతీశ్వరునివలె ఉండేవారు. వారి చేతిలోఉండే సటకా యే దండం. అల్లామాలిక్ అని ఎల్లప్పుడూ

అంటూ భక్తులపై ప్రేమను కురిపించేవారు. 31. మానవరూపంలో అవతరించిన సాయి యొక్క సగుణ రూపం ఇది. మన పూర్వపుణ్యార్జితం వలన అమూల్యమైన ఈ సంపద, అదృష్టవశాత్తు మనకు లభ్యమైంది. 32. సాయిని ఓ మానవునిగా భావించినవారు మందమతులు, మందభాగ్యులు. వారి విధి విచిత్రమైనది వారికి ఈ భాగ్యం ఎలా ప్రాప్తిస్తుంది? 33. సాయిబాబా ఆత్మబోధకుగని, పూర్ణానంద విగ్రహం. భవార్ణవాన్ని దాటటానికి వారినే ఆశ్రయించండి. 34. ఆబ్రహ్మస్తంబ పర్యంతం నిండి అపారంగా అనంతంగా నిరంతరం అభిన్నంగా ఉన్న పరబ్రహ్మమూర్తి బాబా. 35. కలియుగం యొక్క కాలవ్యవధి నాలుగులక్షల ముప్పైరెండువేల సంవత్సరాలు. రమారమి ఐదువేల సంవత్సరాలు గడిచాక బాబా అవతరించారు. 36. బాబా జన్మించినతేది తెలియకుండా ఏ ఆధారంతో నిశ్చయంగా ఇలా చెప్పగలరని శ్రోతలకు సంశయం కలుగుతుంది. శ్రద్ధగా వినండి మరి. 37. బాబా శిరిడీ క్షేత్రంలో తమ నిర్వాణం వరకు నివసించాలనే సంకల్పంతో, అరవై సం॥ల వరకు సన్యాసవృత్తితో గడిపారు. 38. పదహారు సం॥ల వయసులో బాబా మొదట శిరిడీలో ప్రకటమయ్యారు. మూడు సంవత్సరాలు అక్కడున్నారు. 39. అక్కడినుండి వారు ఎక్కడికి వెళ్లారో కానీ దూరాన నైజాంరాజ్యంలో కనిపించారు. ఆ తరువాత పెళ్లివారితో పాటు వచ్చి శిరిడీలోనే స్థిరంగా ఉండి పోయారు. 40. ఇరవై సంవత్సరాల వయసునుండి అరవై సంవత్సరాలు వారు శిరిడీలోనే నివసించినది అందరికీ అవగతమే. 41. శక సం॥1840, (1918 అక్టోబరు 15) ఆశ్వయుజ శుద్ధ దశమి రోజున, విజయదశమి సుముహూర్తాన, బాబా తమ నిజధామానికి చేరుకున్నారు. 42. ఈ విధంగా 80 సం॥ల బాబా ఆయుర్దాయాన్ని బట్టి వారు సుమారుగా శక సం. 1760 లో జన్మించారని నిర్ణయించవచ్చు. 43. కాల గమనాన్ని త్రొక్కి పట్టి ఉంచే మహాత్ముల ఆయుర్దాయాన్ని ఎప్పుడైనా నిశ్చయంగా చెప్పగలరా? ఇది కష్టసాధ్యమైన

పని.44.మహాత్ములెప్పుడూ తమ ఆత్మస్థితిలో ఉంటారు. వారు జనన మరణ రహితులు. సూర్యునికి ఉదయాస్తమయాలు ఎక్కడివి? అతను ఎప్పుడూ స్థిరంగా ఉంటాడు. 45. శ.క సం॥ 1603(క్రీ.శ.1781 సం)లో శ్రీ సమర్థ రామదాసు సమాధి చెందారు. తరువాత 200 సంవత్సరాలు పూర్తి కాక ముందే ఈ మూర్తి ఉదయించారు.46.భారతభూమి యవనులచే ఆక్రమింపబడి హిందూరాజులు యవనుల పాదాక్రాంతులై నప్పుడు, భక్తిమార్గం లుప్తమై, ప్రజలు ధర్మరహితులయ్యారు.47.అప్పుడు శ్రీ సమర్థ రామదాసు జన్మించి, శివాజీ ద్వారా రాజ్యాన్ని యవనుల నుండి రక్షించారు. బ్రాహ్మణుల గోవుల సంరక్షణ కూడా చేశారు.48. రెండు శతాబ్దాలు పూర్తికాకుండానే మునపటివలెనే మరల కాలం పాడై,మత భేదాలవల్ల హిందూ మహమ్మదీయుల మధ్యచీలిక లేర్పడ్డాయి. సాయిబాబా దానిని పరిష్కరించారు.49.రాముడు రహీము ఒక్కరే.వారిలో కించిత్తైనా భేదంలేదు. అలాంటప్పుడు భక్తిలో ఆటంకమెందుకు? భక్తులలో వైరమెందుకు?50.పసివారిలా మీరెంత అజ్ఞానులు! హిందూ ముసల్మానులను స్నేహబంధంతో కలపండి. దృఢమైన వివేకమార్గాన్ని అవలంబిస్తేనే మీరు అవతలి తీరాన్ని చేరగలరు.51.వాదవివాదాలు మంచివి కావు. ఎవరితోనూ పోటీ పడకండి. ఎల్లప్పుడూ మీ శ్రేయస్సును గూర్చి ఆలోచించండి. మిమ్ము శ్రీహరి రక్షిస్తాడు.52.యోగ యాగాలు తపస్సు జ్ఞానం వగైరా పరమాత్మ ప్రాప్తికి, సాధనాలుగా ఉన్నా, భగవంతుని తెలుసుకో లేని వారి జన్మ వ్యర్థం.53.ఎవరైనా ఏదైనా అపకారం చేస్తే, వారికి చేయ గలిగితే ఉపకారమే చేయాలిగాని మనం ప్రతీకారం చేయకూడదు. ఇది బాబా ఉపదేశసారం.54.స్వార్థానికైనా పరమార్థానికైనా ఇది మంచి ఉపదేశం. గొప్పవారైనా తక్కువ వారైనా,స్త్రీలకు శూద్రులకు అందరికీ ఇది సులువైన మార్గం.55.స్వప్నంలోని రాజ్యవైభవం మేలుకోగానే మాయమైపోయేలా,ఈ ప్రపంచం కేవలం మాయ అని బాబా

ఉద్దేశం.56.శరీరానికి మనసుకు కలిగే సుఖదుఃఖాలు మిథ్య. అవి కలల వంటివని ఆత్మానుసంధానంతో గ్రహించి వానిని వదిలించుకున్న వారు ముక్తిని సాధించారు.57.బద్ధులుగా ఉన్న భక్తులను చూచి బాబా మనసు కరిగిపోయేది. వీరు శరీరానికి అతీతమైన స్థితిని ఎలా పొందగలరా అని వారికి అహర్నిశలూ చింత.58.'అహం బ్రహ్మాస్మి' అన్న వృత్తితో అఖండానందంలో ఉండే స్వభావం వారిది. ఏకోరికలూలేని నిర్వికల్ప చిత్తస్థితి మరియు నివృత్తి వచ్చి వారి వద్ద ఉండేవి.59.తంబూర చిరుతలు పుచ్చుకుని ఇంటింటికీ తిరుగుతూ వచ్చేపోయే వారి ముందు చేయిచాచటం వారెఱుగరు.60.అనేకమంది గురువులు శిష్యులను చేరదీసి డబ్బు కొఱకు బలవంతంగా వారి చెవులలో మంత్రాలను ఊదుతారు.61.శిష్యులకు ధర్మం గురించి నేర్పుతూ, తాము అధర్మాన్ని ఆచరిస్తారు. అటువంటి గురువులు భవాన్ని ఎలా తరింప చేయగలరు? జననమరణాలను ఎలా తప్పించగలరు? 62.తమధార్మిక ఖ్యాతిని జగాన చాటుకునేలా పతాకాలను ఎగరవేసుకొనే కోరిక లేని మూర్తి సాయి.63.వారికి శరీరాభిమానం లేదు.వారు ఎల్లప్పుడూ భక్తుల యెడ అత్యంత ప్రేమ స్వభావం కలవారు. ఇదే ప్రవృత్తితో ఉండే మూర్తి సాయి.64.నియత గురువులు అనియత గురువులని రెండు రకాల గురువులు. శ్రోతలకు ఒక్కొక్కరి పద్ధతిని స్పష్టంగా చెప్పుతాను.65. దైవీ సంపదతో పరిపూర్ణులుగా చేసి, అంతఃకరణాన్ని పరిశుద్ధ పరచి, మోక్షమార్గంలో ప్రవేశపెట్టటం వరకే అనియత గురువుల పని.66.నియత గురువుల యొక్క ఆశ్రయం లభిస్తే ద్వైతం తొలగిపోయి, అద్వైత భావం జాగృతమవుతుంది. వారు తత్త్వమసి మహావాక్యాన్ని ప్రత్యక్షంగా అనుభవైకవేద్యంగా చేస్తారు.67.చరాచరాలలో విశ్వమంతా వ్యాపించి ఉన్న గురుతత్త్వం భక్తుల కొఱకు సగుణ సాకార రూపంలో అవతరించి తన కార్యం సమాప్తికాగానే తన అవతారాన్ని చాలిస్తుంది.68.సాయిబాబా ఈ రెండవ కోవకు చెందిన వారే. వారి జీవితాన్ని నేనెలా వర్ణించను? వారు నాకుబుద్ధిని

ప్రసాదించిన విధంగానే ఈ చరిత్ర రచన సాగుతుంది.69లౌకిక విద్యలకు అనేక గురువులుంటారు కాని ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించే వారే సద్గురువు. భవసాగరాన్ని దాటించగల వారే సమర్థులు. వారి మహిమ అగోచరం.70. ఎవరైనా బాబా దర్శనానికి వెళ్లితే వారు అడగకుండానే వారి భూత భవిష్య వర్తమానాలను వారి ఉద్దేశాలను, వారి ఆలోచనలను సంపూర్ణంగా తెలియ చేసేవారు.71.వారు సర్వత్ర సర్వజీవులలోను పరమేశ్వరుని చూచేవారు. మిత్రులను శత్రువులను సమానంగా చూచేవారు. వారికి కించిత్తైనా భేదభావంలేదు.72.ఎవరివద్దా ఏవీ ఆశించేవారు కాదు. సదా సమదృష్టి కలిగినవారు. అపకారం చేసేవారిపై కూడా అమృత వృష్టిని కురిపించేవారు. హెచ్చతగ్గులు లేకుండా సుస్థిరంగా ఉండేవారు. వారికి ఏ వికల్పాలూ లేవు.73.నశ్వరమైన శరీరంలో ఉన్నా ప్రపంచ మోహంలో చిక్కుకొనక, దేహంలో ఉంటూనేశరీరానికి అతీతమైన స్థితిలో ఉంటూ శరీరంలోనే ముక్తులైనారు.74.శిరిడీ జనులు ధన్యులు. సాయియే వారి పూజ్యదైవం. భోజనం చేస్తున్నా శయనిస్తున్నా ఎల్లప్పుడూ సాయినే ధ్యానం చేసేవారు.75.వారి ప్రేమ ధన్యం. పొలాలలోను ఇళ్లలోను పనులు చేసుకుంటూ దంచుతున్నా విసురుతున్నా, మజ్జిగ చిలుకుతున్నా, బాబా మహిమను గానం చేసేవారు.76.కూర్చున్నా, తింటున్నా, పడుకున్నా సాయినామాన్ని ఎప్పుడూ స్మరించేవారు; ఒక్క బాబా తప్ప మరో దైవాన్ని వారు తలిచేవారు కాదు.77.ఆ స్త్రీల ప్రేమ ఎంత గొప్పది? ఆ ప్రేమలో ఎంత మాధుర్యం ఉంది? నిర్మలమైనప్రేమయే కవిత వ్రాయగలదు. కాని విద్వత్తు కాదు.78.ఏమాత్రం పాండిత్యం లేకుండా సాధారణ భాషలో ఉండేది. అందులోని కవిత్వానికి పండితులు కూడా తలలూపాల్సిందే.79.నిర్మలమైన ప్రేమను ఆవిర్భవింప చేసేదే నిజమైన కవిత్వం. ఆ స్త్రీల గానాన్ని శ్రోతలు వినవచ్చు.80.సాయిబాబా ఇచ్ఛ ఉంటే ఆ పాటలనన్నింటినీ సేకరించగలిగితే, ఒక అధ్యాయమై శ్రోతలకోరిక

తీరుతుంది.81.భక్తులను అనుగ్రహించటానికే నిరాకార పరమాత్మ శిరిడిలో సాయిరూపంలో ప్రకటమయ్యారు. వారిని తెలుసుకోవడానికి, దేహాహంకారమూ వికారాలు పోయి భక్తి కలగాలి. వారికి శరీరంపై అభిమానం లేదు.వారికి మనోవికారాలు లేవు.82.భక్తుల పుణ్యమంతా పోగై ఫలించే సమయం వచ్చినప్పుడు అది సాయి రూపంలో మొలకెత్తి శిరిడీలో పక్వానికి వచ్చింది.83.అవ్యక్తనీయమైన తత్త్వం వ్యక్తీకరించబడింది. అల్లే జన్మ లేనివానికి జన్మ,మరియు ఆకారం లేని ఆతత్త్వం మూర్తీభవించిన కరుణరసం అనే ఆకారాన్ని ధరించింది.84. యశస్సు, ఐశ్వర్యం, వైరాగ్యం, జ్ఞానం, ఔదార్యం, వైభవం ఈషడ్ గుణాలతో ఉన్న మూర్తి సాయి.85.వారి నిగ్రహం చాలా విశిష్టమైనది.వారు ఎవరి వద్ద నుండీ ఏమీ గ్రహించేవారు కాదు. నిరాకారులైన వారు, భక్తులను అనుగ్రహించటానికే ఒక రూపాన్ని ధరించారు.86.వారిది ఎటువంటి కరుణా స్వభావం? భక్తుల ప్రేమను గెలుచుకున్నారు. బహుశా భగవంతుడు కూడా వారిని తెలుసుకోలేడేమో!87. భక్తుల శ్రేయస్సు కొఱకు సాయి మహారాజు వాగ్దేవత వచించటానికి సాహసించని, చెవులుకూడా వినటానికి సిగ్గుపడే మాటలు అనేవారు.88.ఆ మాటలను చెప్పటం కంటే మౌనంగా ఉండటం మంచిది కాని కర్తవ్యాన్ని వదిలి పెట్టటం మంచిదికాదు కనుక చెప్పవలసి వచ్చింది.89.భక్తులతో బాబా అతి వినయంగా 'నేను మీ దాసానుదాసుణ్ణి. మీకు ఋణగ్రస్తుణ్ణి. మీ దర్శనానికి వచ్చాను.90.మీ అనుగ్రహం వలన మీ పాదాలవద్దకు చేరుకోగలిగాను. నేను మీ మలంలో క్రిమిని. అందువల్ల ఈ సృష్టిలో ధన్యుణ్ణి' అని అనేవారు.91.ఎంతటి అణకువ బాబా మనసులో వినమ్రంగా ఉండాలనే కోరిక! అది ఎటువంటి ఉన్నతమైన నిరభిమానం,ఎంత సౌమ్యత!.92.ఈ పై మాటలు వాస్తవంగా బాబా ఉచ్చరించినవే నేను చెప్పిన ఈ మాటలు ఎవరికైనా అగౌరవంగా అనిపిస్తే క్షమించమని వేడుకుంటాను.93.దాంతో వాక్కు-

కలుషితమైంది. విన్నపాపం తొలగటానికి సాయినామాన్ని జపిస్తాను. తద్వారా అందరి దోషాలు తొలగిపోతాయి.94.జన్మజన్మల మన తపస్సు కేవలం సాయి కృపచేత ఫలించింది. ఇది దప్పికగొన్నవారికి చలివేంద్రంవలె అపార సుఖాన్నిస్తుంది.95.బాబా జిహ్వాద్వారా రసాన్ని ఆస్వాదిస్తున్నట్లు అందఱికి అనిపిస్తుంది. కాని వారు ఏ రుచినీ ఎఱుగరు. వారి జిహ్వాకు రస స్ఫూర్తి లేదు.96. విషయ స్ఫూర్తి లేనివారు విషయ సుఖాలను ఎలా అనుభవిస్తారు? విషయాలు వారి ఇంద్రియాలను తాకినప్పుడు వారు విషయాలలో ఎలా చిక్కుకోగలరు?97.ఎదుటికి వచ్చిన వస్తువులను కళ్లతో చూడటమే కాని చూచిన దేమిటో వారెఱుగరు. చూడాలనే కోరిక వారికి లేదు.98.హనుమంతుని కౌపీనం అతని తల్లికి,రామునికి మాత్రమే కనిపించాయి. మరి అతని బ్రహ్మచర్యాన్ని ఎలా పోల్చగలం?99.ఆ ఇంద్రియాన్ని తల్లియే చూడనప్పుడు ఇక ఇతరుల మాటేమిటి? బాబాయొక్క బ్రహ్మచర్యం పరమ కఠినం, అది అపూర్వం సంపూర్ణం.100.వారు నడుముకు కౌపీనం ధరించేవారు. మెడక్రింద ఉండే మేక చన్నుల వంటి వారి ఇంద్రియాలు కేవలం మూత్ర విసర్జనకు మాత్రమే.వారి ఇంద్రియాలు వారి అవయవాలలో ఉండేవి.101.వారి శరీరస్థితి ఇలాంటిది. ఇంద్రియాలు కర్మలను చేస్తున్నా, వారికి విషయాసక్తి కించిత్తైనా ఉండేది కాదు.102. సత్త్వరజస్తమో గుణాల వలన ఇంద్రియాలన్నీ వానివాని స్థానాలలో కట్టుబడి ఉన్నాయి. అవి లౌకిక కార్యాలను చేస్తున్నా దేనిలోనూ చిక్కుకోవు.103.బాబా నిస్సంగులు.శుద్ధజ్ఞాన స్వరూపులు. ఆత్మారాములు. కామక్రోధాలు వారిలో అణిగిపోయాయి. వారు ఏ కోరికలు లేనివారు. సకల కోరికలు పూర్తిగా తీరిన వారు.104.విషయాలు కూడా బ్రహ్మమే యని తలచే ముక్తస్థితి వారిది. వారు పుణ్యపాపాలకు అతీతమైన సంపూర్ణ నివృత్తిస్థానం.105.నానావల్లి లెమ్మనగానే గద్దె విడిచి పెట్టినవారికి శరీరాభిమానం కాని భేద బుద్ధిగాని

కలలో కూడా ఉండవు.106.ఇహలోకంలో పొందవలసినవి పరలోకంలో సాధించ వలసినవి వారికి ఏవీ లేవు. వారు కేవలం లోక కళ్యాణం కోసమే ఈ భూమిపై అవతరించిన సత్పురుషులు.107.ఇటువంటి కరుణామయులు అవతరించినందుకు ప్రయోజనం, ప్రజలకు శ్రేయస్సును అనుగ్రహించడానికే తప్ప మరొకటి కాదు. వారు పరుల శ్రేయస్సును కోరే పరమ కృపాళువులు.108. వారి హృదయం నవనీతం వలె అత్యంత మృదువైనదని అంటారు. వెన్న తనకు తాపం తగిలితేనే కరుగుతుంది. కాని సత్పురుషుల హృదయం ఇతరులకు తాపం కలిగితే ద్రవించిపోతుంది.109.వారి వస్త్రం అతుకులతో ఉన్న కఫని.వారు కూర్చోవటానికి గోనెపట్టా.వారి మనసు వృత్తి శూన్యం. ఇట్టి వారికి వెండి సింహాసనం ఏమవసరం?110.సింహాసనం వారికి ఇబ్బంది కలిగించగా దానిని వెనుకకు జరిపితే భక్తుల ప్రేమను చూచి వారు ఏమీ పట్టించుకునే వారు కాదు.111.బాబా శిరిడీ సరోవర కమలం.ఆ పరిమళాన్ని భక్తులు సేవిస్తారు. నిర్భాగ్యులకు, కప్పలకు వలె ఎప్పుడూ బురదయే గతి.112.ఆసనాలు, ప్రాణాయామం, ఇంద్రియదమనం, మంత్రం, తంత్రం యంత్రం, భజనలగూర్చి బాబా ఎప్పుడూ ఎవరికీ చెప్పేవారు కాదు. చెవిలో ఊదటం కూడా లేదు.113. లోకవ్యవహారాలలో లౌకికంగా ప్రవర్తిస్తున్నట్లు కనిపిస్తారు కాని వారి అంతరంగం మరో రకంగా ఉండేది. వ్యవహారాలలో ఎంతో దక్షతను చూపే వారి కౌశలం మరెవరికీ ఉండదు.114.వారు భక్తుల కొఱకే ఆకారాన్ని ధరించారు. భక్తుల కొఱకే వారి మనోభావాలు. సత్పురుషుల లౌకికాచారాలను అందఱూ తెలుసుకోవాలి.115. సాయి మహారాజు సాధువులకు నిధానం; శుద్ధ పరమానంద స్థానం. నిరభిమానం నిర్లిప్తత గల వారికి నా సాష్టాంగ వందనం.116.సాయి మహారాజు వచ్చి చేరిన ఆ స్థానం మహా పుణ్యపావనమైనది. పుణ్య సంచయం లేకపోతే ఇటువంటి సన్నిధి దుర్లభం.117.మంచి విత్తనం నుండి రసవత్తరమైన

పండ్లు వస్తాయన్న ప్రసిద్ధ వచనాన్ని, ప్రజలు శిరిడీలో తరచి చూచి తెలుసుకున్నారు.118.సాయిబాబా హిందువులు కారు, యవనులు కారు. వారికి ఏ వర్ణము లేదు.ఏ ఆశ్రమమూ లేదు. అయినా వారు భవాన్ని సమూలంగా నశింపజేస్తారు.119.అపారము అనంతమూ అయిన గగనంవలె బాబా చరిత్ర గహనమైనది. దానిని యదార్థంగా అవగాహన చేసుకోవటం వారికి తప్ప ఎవరికి శక్యం?120.చిత్తం యొక్క పని చింతనం.ఆలోచన లేకుండా మనసు ఒక క్షణమైనా ఊరికే ఉండదు. విషయాలను ఇస్తే విషయచింతన చేస్తుంది.గురువును ఇస్తే గురువును ధ్యానిస్తుంది.121.అందువలన సర్వేంద్రియాలను చెవులలో నిలుపుకొని, గురువు మహిమను వింటే, అదే సాయి గురువు యొక్క సహజమైన స్మరణ, భజన, కీర్తన.122. పంచాగ్ని సాధన, యజ్ఞయాగాలు, అష్టాంగ యోగాలు, మంత్ర తంత్ర ప్రయోగాలు బ్రాహ్మణులకు మాత్రమే శక్యం. ఇవి ఇతరులకు ఏం ఉపయోగపడవు.123.సత్పురుషుని కథ అలా కాదు.అది అందరిని సన్మార్గంలో పెడుతుంది. భవభయ వ్యథను హరిస్తుంది. పరమార్థాన్ని బోధిస్తుంది.124.సత్పురుషులచరిత్రను శ్రవణం, మననం, అధ్యయనం, నిధి ధ్యాసనం చేస్తే ద్విజులు శూద్రులు స్త్రీలు పవిత్రులవుతారు.125.ప్రేమంటూ లేని మానవులు ఉండనే ఉండరు. ఒకరికి ఒక వస్తువుపై ప్రేమ. మరొకరికి మరొకదాని పై ప్రేమ.ఇలా వేరువేరుగా ఉంటుంది.126.ఒకరి ప్రేమ సంతానంపై ఉంటుంది. మరొకరి ప్రేమ గౌరవమర్యాదలు ధనసంపదలపై ఉంటుంది. ఇంకొకరికి శరీరంపైన, ఇంటిపైన, లౌకికమైన కీర్తి ప్రతిష్ఠలపైనా, విద్యాప్రాప్తిపైనా ఉంటుంది.127.విషయ సుఖాలలోనున్న ప్రేమనంతటిని ఒక్కటిగా చేసి హరిచరణాలనే మూసలో వేస్తే అదే భక్తి రూపంలో ప్రకటమవుతుంది.128.అందువలన శరీరంతో ప్రపంచ వ్యవహారాలను చేస్తూ మనసును సాయి చరణాలకు సమర్పిస్తే వారి అనుగ్రహం కలుగుతుంది.ఇది ఒక సులభమైన ఉపాయం.129.ఇటువంటి అల్పమైన

సాధనతో గొప్ప ప్రయోజనం కలుగుతుంది. ఐనా జనులు శ్రేయాన్ని సంపాదించుకోవడానికి ఎందుకు ఉదాసీనులై ఉంటారు.130.చిన్న ఉపాయంతో అంత గొప్ప లాభం కలుగుతున్నప్పుడు మరి ప్రజలు ఎందుకు దానిని ఆచరించరు? అని శ్రోతల మనస్సులలో సహజంగా సందేహం కలుగుతుంది.131.దానికి కారణం ఒక్కటే. భగవత్ కృపలేకుండా శ్రవణాలాసక కలుగదు. భగవంతుడు ప్రసన్నుడై అనుగ్రహించినప్పుడే శ్రవణాలాసక కలుగుతుంది. 132. అందువలన సాయిని శరణువేడితే, ఆ సాయి నారాయణునకు అనుగ్రహం కలిగి, శ్రవణాలాసక ఉత్పన్నమవుతుంది. ఈ సులభ సాధనం చేజిక్కుతుంది.133.గురుకథా శ్రవణమను సత్సంగాన్ని ఆశ్రయించి ప్రాపంచిక బాధలను పదిలించుకోండి. నిశ్చయంగా ఇదే మీ జీవితానికి సార్థకత. మనసులలో ఏ సందేహాలను పెట్టుకోకండి.134. అనేక చాతుర్యాలను విడచి నిరంతరం 'సాయీ సాయీ' యని స్మరించండి. మీరు తరిస్తారు. ఇందులో ఏం సందేహం లేదు.135.ఇవి నా మాటలు కావు. సాయి బాబా నోటి నుండి వచ్చిన గంభీర వచనాలు. వీనిని నిరర్థకమని భావించకండి, వీనికి వెలకట్టకండి.ఇవి అమూల్యమైనవి.136.చెడు సహవాసం మంచిది కాదు. అది అనేక దుఃఖాలకు నిలయం. తెలియకుండానే సుఖప్రదమైన మార్గంనుండి మరలించి చెడుదార్లను పట్టిస్తుంది. 137.సాయినాథులు లేక ఒక సద్గురువు తప్ప చెడుసాంగత్యం నుండి రక్షించగలవారెవరు?138.ఓ భక్తులారా! ప్రేమమయులైన గురువుయొక్క నోటి నుండి వెలువడిన వచనాలను శ్రద్ధగా స్మరించండి. చెడు సాంగత్యం తొలగిపోతుంది. 139.సృష్టిలోని రూపాలు కళ్లలో నిండినప్పుడు సౌందర్యాన్ని అపేక్షించే మనస్సు దానితో రమిస్తుంది. ఆ దృష్టి అంతర్ముఖమైతే అది సత్సంగంలో రంజిల్లుతుంది.140.సత్సంగం యొక్క మహిమ అటువంటిది. అది శరీరాభిమానాన్ని సమూలంగా అణచివేస్తుంది. అందువలన సత్సంగం కంటే మరో

సాధనలేదు.141.నిత్యం సత్సంగం చేయండి. ఇతర సాంగత్యాలు దోషపూరితమైనవి.శరీరమంతటిని నిర్మలం చేసేది, ఏ దోషాలూ లేనిదీ సత్సంగం ఒక్కటే.142. సత్సంగం శరీరంపైన ప్రీతిని అభిమానాన్ని తొలగిస్తుంది. ఒక్కసారి దానిపట్ల శ్రద్ధ కలిగితే, దాని బలవత్తర శక్తి వల్ల తప్పక సంసారం నుండి విముక్తి కలుగుతుంది.143. భాగ్యవశాత్తు సత్సంగం లభించిందా ఉపదేశాలను సహజంగా గ్రహించవచ్చు.చెడు సహవాసాలన్నీ తొలగిపోయి మనసు నిశ్చలస్థితిలో రమిస్తుంది.144.పరమార్థంలో ప్రవేశించడానికి విషయసుఖాల యందు విరక్తి ఒకటే ఉపాయం.సత్సంగాన్ని ఆశ్రయించకుండా ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోలేరు.145.సుఖాల వెంట దుఃఖాలు,దుఃఖాల వెంట సుఖాలు వస్తుంటాయి. జీవుడు ఎప్పుడూ సుఖాలనే ఆశిస్తూ దుఃఖాలకు విముఖంగా ఉంటాడు.146.సుఖాలను ఆశించి, దుఃఖాలకు ముఖం చాటేసినా, జరుగవలసినది అవశ్యం జరిగితీరుతుంది. సుఖదుఃఖాలనే ఈ రెండు అనుభవాల నుండి విముక్తిని కలిగించేది సత్పురుషుల సాంగత్యం ఒక్కటే.147.సత్సంగం వలన శరీరాభిమానం నశిస్తుంది. సత్సంగం వలన జననమరణాలు ఆగిపోతాయి. సత్సంగం వలన చైతన్యఘనుడైన పరమాత్మను చేరుకోవచ్చు. సత్సంగంతో తక్షణం గ్రంథి విచ్ఛేదనం జరుగుతుంది.148.ఉత్తమ గతిని పొందటానికి సత్సంగం ఒక్కటే పావనమైనది. అనన్యంగా దాని శరణుజొచ్చితే ఆత్మ శాంతి నిశ్చయం.149.భగవంతుని భక్తితో నమస్కరించని వారిని, మరియు భగవంతుని భజన, ఆరాధన,నామస్మరణ చేయని వారిని భక్తపరాయణులుగా చేయటానికి సత్పురుషులు అవతరిస్తారు. 150.గంగ,భాగీరథి, గోదావరి, కృష్ణవేణి, కావేరి, నర్మదాది నదులు, సత్పురుషులు స్నానార్థం ఎప్పుడు వస్తారా అని వారి పాదాలను కోరుకుంటాయి.151.ప్రపంచంలోనివారి పాపాలను స్వయంగా ప్రక్షాళనం చేస్తాయి. కాని వాని పావనివృత్తి సత్పురుషుల చరణ ప్రాప్తి లేకుండా ఎన్నడూ కాదు.152.మన

ఎన్నో జన్మల భాగ్యోదయం వలన సాయి మహారాజు యొక్క చరణాలు ప్రాప్తించగా భక్తుల యొక్క జనన మరణాలు తొలగిపోయాయి. సకల భవభయాలూ హరించుకుని పోయాయి.153.సాధువులైనశ్రోతలారా! ఇప్పుడు శ్రవణం చేసిన దానిని మననం చేసుకోండి. ఇకమనం విశ్రాంతి తీసుకుందాం. తరువాతి వ్యర్థన తరువాత.154.హేమాడ్ సాయికి శరణు జొచ్చుతున్నాడు. నేను సాయి చరణాల పాద రక్షను. వారి కథను మనవిచేస్తూ సుఖ సంపన్నుణ్ణవుతాను.155.భక్తుల శ్రేయస్సు కొఱకు బాబా మసీదు చివర నిలబడి ఒక్కొక్కరికి విభూది ప్రదానం చేయటం ఎంతటి మనోహరమైన దృశ్యం.156. ప్రపంచం మిథ్య అన్న సంపూర్ణమైన జ్ఞానంతో, అనవరతం బ్రహ్మానందంలోవిలీనమై, సదా వికసించిన కుసుమం వంటి మనసుగల వారి చరణాలకు సాష్టాంగ నమస్కారం.157. వారు కళ్లల్లో జ్ఞానాంజనం వేస్తే వెంటనే ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. ఇటువంటి మహిమ కల సాయికి సాష్టాంగ నమస్కారం.158. తరువాతి అధ్యాయం ఇంతకంటే బాగుంటుంది, శ్రవణాల ద్వారా అంతరంగంలోనికి ప్రవేశించి, సకల మాలిన్యాలను తొలగించి హృదయమందిరాన్ని పావనం చేస్తుంది.159.స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో 'శ్రీసాయి సమర్థ మహిమ' అను పదియవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీసాయి సచ్చరిత - 11 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీసీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గత కథానుసంధానం – వెడల్పులేని చెక్క పలకపై బాబా శయనం – ఎవరి కంటా పడకుండా ఆ చెక్క పలకపై ఎక్కటం దిగటం – అర్థంకాని వారి కౌశలం. 1.హిందువులను ముసల్మానులను సమానంగా చూడటం – వారి యొక్క ఆయుర్దాయం గురించిన వివరణ – వారు శిరిడీలోని పూజ్య దైవమని తెలియ జేయటం.2.ఇప్పుడు ఈ పదకొండవ అధ్యాయాన్ని మధురమైన గురు కథలతో అలంకరించి సాయి చరణాలకు దృఢమైన భక్తితో అర్పించాలని అనిపించింది.3.దీనివలన సగుణ సాకార రూపధ్యానం సంభవ మవుతుంది. ఇది ఏకాదశ రుద్రావర్తన వంటిది. పంచభూతాలపై బాబా యొక్క శక్తి, అధికారం, వారి మహిమ ప్రమాణ పూర్వకంగా అర్థమవుతాయి. 4.బాబా వచనాలను ఇంద్రుడు, అగ్ని, వరుణుడు ఎలా గౌరవించేవారో ఇప్పుడు తెలియ జేస్తాను. శ్రోతలు శ్రద్ధగా వినండి.5.పూర్ణ విరక్తికే విరక్తి అయిన, అనన్యంగా శరణుజొచ్చే భక్తులకు విశ్రాంతి స్థానమైన, సాయి యొక్క సగుణమూర్తిని మనసున ప్రేమపూర్వకంగా ధ్యానిస్తాను.6.గురువచనాల యందు విశ్వాసమే వారు కూర్చుండటానికి ఆసనం. సకల కోరికలను సన్యసించాలన్న సంకల్పంతో పూజ చేద్దాం.7.ప్రతిమా స్థండిల, అగ్ని, తేజస్సు, సూర్యమండలం, నీరు, ద్విజులు ఈ ఏడింటికంటే గురుమహారాజు గొప్ప.వారిని అనన్యంగా పూజిద్దాం. 8.అనన్య భక్తితో వారి చరణాలను ఆశ్రయిస్తే గురువే కాదు పరబ్రహ్మ కూడా కదలివస్తాడు. ఇటువంటి

గురుపూజలోని విశేషాన్ని గురుభక్తులు అనుభవించాలి.9.పూజించే వారు శరీర భ్రాంతితో ఉన్నప్పుడు గురువు కూడా శరీరధారులై ఉండటం అవసరం.శరీర భావానికి అతీతంగా ఉన్నవారు నిరాకారాన్ని ఆరాధించేవారు నిరాకారాన్నే ధ్యానించాలని శాస్త్ర నిర్ధారణ. 10.సగుణమూర్తిని ధ్యానించనంత వరకు భక్తి భావం అసలు కలుగదు. ప్రేమపూర్వకమైన భక్తి కలుగనంత వరకు మనసనే మొగ్గ వికసించదు.11.మొగ్గ వికసించకపోతే సువాసన ఉండదు. అంతే కాదు అక్కడ మకరందం ఉండదు. అందువలన తేనెటీగలు క్షణమైనా అక్కడ నిలువవు. 12.సగుణమే సాకారం, నిర్గుణమే నిరాకారం.వీనిలో పరస్పరం బేధంలేదు.సాకారం, నిరాకారం రెండూ ఒక్కటే. 13.నేయి పేరుకొని ఉన్నా, కరిగిఉన్నా నేయి అనే అంటాము.సగుణ, నిర్గుణాలు ఒక్కటిగా మిళితమై విశ్వమంతటా వ్యాపించి ఉన్నాయి. 14.కళ్లారా చూడటానికి మనసారా భక్తితో పాదాలమీద శిరస్సు ఉంచడానికి వీలుగా సాకార రూపం ఉంటే అక్కడ ధ్యానానికి సౌకర్యం. అక్కడ ప్రేమకలగటానికి అవకాశం ఉంది.15.ప్రేమగా ముచ్చటించటానికి గంధాక్షతలతో పూజించటానికి ఒక ఆకారం అవసరం. 16.నిర్గుణం కంటె సగుణాలతో ఉన్నవారిని అర్థం చేసుకోవడం చాలా సులభం. సగుణమూర్తిపై ప్రేమ దృఢమైతే నిర్గుణ ధ్యానం అదే కలుగుతుంది.17.భక్తులు నిర్గుణనిరాకార పరమాత్మను తెలుసుకోవాలని బాబా అనేక ఉపాయాలను పన్నేవారు. భక్తులను వారి అధికారాన్నుసరించి చాలా కాలం వారికి తమ దర్శనం లేకుండా వారిని దూరంగా ఎక్కడికో పంపేవారు. 18.ఒకరిని దేశాంతరం పంపితే మరొకరిని శిరిడీలోనే ఏకాంతస్థలంలో ఉంచేవారు. మరొకరిని వాడాలోనే నిర్బంధించి గ్రంథ పారాయణకు నియమించేవారు.19.ఇలా అనేక సంవత్సరాలు అభ్యాసం చేస్తే నిర్గుణం యొక్క ధ్యానం పెరుగుతుంది. కూర్చున్నా, పడుకున్నా, భోజనంచేస్తున్నా మనసు బాబా సన్నిధిలో లగ్నమై ఉంటుంది.

20.శరీరం నాశవంతమైనది.ఎప్పుడో ఒకప్పుడు అంతం కావలిసిందే.అందువలన భక్తులు శరీరం కొసం దుఃఖించకుండా అనాద్యనంతుని తెలుసుకోవాలి.21.అనేక రకాలుగా కనపడే ఈ దృశ్య జగత్తంతా అవ్యక్తమైన పరమాత్మనుండి ఆకారానికి వచ్చింది. మరల అవ్యక్తం లోకి వెళ్ళిపోతుంది. 22.ఈ చరాచర సృష్టిలో వ్యష్టి వలెనే సమిష్టికూడా ఉంది. అవ్యక్తం నుండి ఉత్పన్నమై చివరకు అందులోనే మరల కలిసి విలీనమైపోతుంది. 23.అందువలన మరణమన్నది ఎవరికీ సంభవించదు.ఇక మరి బాబాకు మరణమెక్కడిది? వారికి మరణమే లేదు.వారు నిత్య, శుద్ధ, బుద్ధ, నిరంజనులు.24.వారిని భగవద్భక్తులని కొందఱు, మహా భాగవతులని మరికొందఱు అంటారు. కాని మాకు వారు సాక్షాత్తు మూర్తీభవించిన భగవంతుడు.25.గంగ సాగర సంగమానికి వెళ్లుతూ దారిలో తపించేవారిని చల్లబరచి తీరంలోని చెట్లకు నీరందిస్తూ అందరి దాహాన్ని తీరుస్తుంది.26.అట్లే సత్పురుషుల అవతార స్థితి. వారు ప్రకటమై మరల వెళ్ళిపోతారు. కాని వారి ఆచరణ పద్ధతి జగాన్ని పావనం చేస్తుంది.27.వారి క్షమాశీలత విశిష్టమైనది. సహజమైన వారి శాంత స్వభావము, విలక్షణమైన ఋజుత్వము, మృదుత్వము, సంతృప్తి నిరుపమానం. 28. శరీర ధారులై కనిపించినా, ప్రపంచంలో విహరిస్తున్నా, వారు అంతరంగంలో నిర్గుణ నిర్వికారులు, నిస్సంగులు, నిర్ముక్తులు.29.శ్రీకృష్ణుడు స్వయం పరమాత్మయై ఉండి 'సత్పురుషులు నా ఆత్మ, వారు నా సజీవ ప్రతిమలు. ప్రేమ స్వరూపులైన సత్పురుషులలో నేనే ఉన్నాను. 30.సత్పురుషులను నా ప్రతిమా రూపం అని అనటం భావ్యం కాదు. వారు నా నిశ్చల స్వరూపులు. అందువలన నా భక్తుల బరువుబాధ్యతలను నేను మోస్తాను. వారి అవమానాలను నేను భరిస్తాను.31.సత్పురుషులకు అనన్య శరణు జొచ్చిన వారి పాదాలకు నేను కూడా వందనం చేస్తాను' అని సత్పురుషుల మహిమను శ్రీకృష్ణుడు ఉద్ధవునితో చెప్పారు.32.సాయి సగుణులలో సగుణుడు, నిర్గుణులలో నిర్గుణుడు.

గుణవంతులలో అత్యుత్తమమైన గుణవంతుడు. మరియు సర్వశ్రేష్ఠమైన గుణాలున్న వారికి రాజు. 33.కోరికలుతీరినవాడు పర్యాప్త కాముడు,కృతకృత్యుడు, సదా యదృచ్ఛాలాభ సంతుష్టుడు. అనవరతం ఆత్మనిరతుడు, సుఖదుఃఖాలకు అతీతుడు. 34.ఆత్మానందానికి ఐశ్వర్యమైనట్టి వారిని ఎవరు వర్ణించగలరు? బ్రహ్మదేవుని అవతారమైన వీరిని ఏ విధంగానూ వర్ణించలేము. 35.ఈ అనిర్వచనీయమైన శక్తియే సాకార రూపంలో భూమిపై అవతరించింది. సచ్చిదానందమూర్తి జ్ఞానసంవిత్తి ఇదే. 36.ప్రపంచ వ్యవహారాల నుండి నివృత్తి చెందిన బ్రహ్మాకారాంతఃకరణమూర్తి ఇదే. ఎల్లప్పుడూ ప్రపంచానికి అతీతంగా బ్రహ్మాత్మైక స్థితి యందుండే కేవలానందమూర్తి. 37.'ఆనందో బ్రహ్మేతి' అని శ్రుతి. దీనిని శ్రోతలు నిత్యం శ్రవణం చేస్తారు. పుస్తక జ్ఞానులు పారాయణ చేస్తారు. భక్తులు ఈ అనుభవాన్ని శిరిడీలో పొందుతారు. 38.ధర్మాధర్మాది లక్షణాలతో కూడిన ఈ ప్రపంచం అతి విలక్షణమైనది.ఆత్మ జ్ఞానం లేనివారు అనుక్షణం దీనినుండి తమ్ముతాము రక్షించుకోవాలి. 39.కాని ఆత్మను తెలుసుకున్న వారికి ఇది వర్తించదు. వారు తమ ఆత్మస్వరూపంలోనే ఉంటారు. వారు నిత్యముక్తులు. ఆనందమయులు, ఎప్పుడూ చిన్మయరూపులు. 40.సాయిబాబాయే అందరికీ అధిష్ఠానం. వారికి ఆసనం ఏమవసరం? అందునా వెండి సింహాసనం! కాని బాబా భక్తుల ముచ్చటను తీరుస్తారు.41.ఏనాటిదో ఒక పాత గోనెముక్కపై భావికులైన భక్తులు చక్కటి గద్దెను వేసేవారు. 42.బాబా వెనుక ఆనుకోవటానికి గోడకు ఒక తలగడను ఉంచేవారు. బాబా భక్తుల మనసులోని కోరికలను అనుసరించి ప్రవర్తించేవారు. 43.వాస్తవంగా శిరిడీలో కనిపించినా వారు అంతటా ఉన్నట్లు, తమ భక్తులకు నిత్యం అనుభవాలను కలుగజేసేవారు.44. స్వయం నిర్వికారులైనా భక్తుల భావాలకు అనుగుణంగా, అన్ని విధాలా సకల పూజోపచారాలను స్వీకరించేవారు.45.ఒకటి వింజామర మరొకటి

వీవన వారికి వీచేవారు. కొందఱు సన్నాయి, ఢోలు వగైరా వాద్యాలు వాయించేవారు. కొందరు పూజను సమర్పించేవారు.46.ఒకరు వారి హస్తాలు పాదాలు ప్రక్షాళన చేస్తే, మరొకరు అత్తరు గంధం అద్దేవారు. ఇంకొకరు మహానైవేద్యాన్ని జాజి జాపత్రి మొదలగు పదమూడు పరిమళ వస్తువులతో కూడిన తాంబూలాన్ని సమర్పించేవారు.47.ఒకరు బొటన వ్రేలితో శివలింగానికి పెట్టేలా అడ్డబొట్టు పెట్టేవారు. మరొకరు కస్తూరి కలిపిన సుగంధ చందనాన్ని రాసేవారు.48.ఒకసారి తాళ్యాసాహేబు నూల్కరు స్నేహితుడు, డాక్టరు పండిత్ అనే పేరుగల వ్యక్తి సాయిబాబా దర్శనానికి వచ్చాడు.49.శిరిడీలో అడుగు పెట్టగానే ముందుగా మసీదుకు వెళ్ళి బాబాకు ప్రణమిల్లి కొంతసేపు ప్రశాంతంగా కూర్చున్నాడు. 50.'దాదాభట్టు వద్దకు వెళ్లు' అంటూ బాబా అతనికి తమ చేత్తో దారిని చూపించారు. 51.పండిత్ దాదా వద్దకు వెళ్ళాడు. దాదా అతనిని సముచితంగా ఆహ్వానించాడు. ఆ తరువాత దాదా, బాబా పూజకు బయలుదేరి మీరూ వస్తారా అని అడిగాడు. 52.దాదా వెంట పండిత్ వెళ్లాడు. దాదా, బాబా పూజను చేశాడు. బాబాకు గంధం బొట్టు పెట్టటానికి అప్పటి వరకూ ఎవరూ సాహసించలేదు. 53.ఏ భక్తుడైనా, సరే బాబా తమ నుదుట గంధం రాయనిచ్చేవారు కాదు. మహల్సాపతి మాత్రం వారి కంఠానికి చందనం పూసేవాడు. ఇతరులు వారి పాదాలకు పూసేవారు. 54.కాని అమాయకుడు, భావికుడైన ఈ పండితుడు చందనం గిన్నెను తన చేతిలోకి లాక్కొని సాయి మస్తకాన్ని పట్టుకొని త్రిపుండ్ర రేఖలను దిద్దాడు.55.అతని ధైర్యాన్ని చూచి దాదా మనసులో పండిత్ సాహసానికి బాబా కోపోగ్రులవుతారని కలవరపడ్డాడు.56.కాని అలా జరగకూడనిది జరిగినా, బాబా ఒక్క ముక్కైనా అనలేదు సరికదా చాలా ప్రసన్నంగా కనిపించారు. పండిత్‌ను అసలు కోపగించలేదు.57.దాదా మనసులో చింత. అయినా ఆవేళను గడవనిచ్చాడు.అదే రోజు సాయంకాలం. ఇలా అడిగాడు.58.'మేము మీ

నుదుట గంధంతో తిలకం దిద్దాలని ఎంత ఉత్సాహపడినా మమ్మల్ని తాకనివ్వరు కదా, మరి ఈ ఉదయం ఏం జరిగింది? 59.మా తిలకం మీకు నచ్చదు గాని ఆ పండిత్ త్రిపుండ్ర రేఖలు మీకు ఇష్టమయ్యాయా? ఏమిటీవింత? ఇదేం సమంజసంగా లేదు, అని అన్నాడు. 60.అప్పుడు బాబా మందహాస వదనంతో ప్రేమగా దాదాతో పలికిన మధుర వచనాలను అందరూ శ్రద్ధగా వినండి. 61.''దాదా! అతని గురువు బ్రాహ్మణుడు. నేను ముసల్మాను జాతీయుణ్ణి. అయినా అతడు నన్ను తన గురువు వలెనే భావించి పూజ చేశాడు. 62.'నేను చాలా పవిత్ర బ్రాహ్మణుడను ఇతడు అపవిత్ర జాతిలోని ముసల్మానుకదా ఇతనిని ఎలా పూజించడం' అని అతడు అసలు సందేహించలేదు. 63.అలా నన్ను తన వశం చేసుకున్నాడు. అక్కడ నా ఉపాయమేం సాగక నేను అతనిని వద్దని వారించలేక పోయాను, ఆ విధంగా నన్ను తన స్వాధీనం చేసుకున్నాడు.'' 64.ఇలాంటి సమాధానాన్ని విని దాదాకు అది కేవలం వినోదంగా అనిపించింది. కాని దానిలోని ఇంగితాన్ని తరువాత తెలుసుకున్నాడు. 65.బాబా యొక్క అర్థం కాని పద్ధతి దాదా మనసులో బాగా నాటుకుంది. పండిత్‌తో ముచ్చటించాక విషయం విశదమైంది. 66.ధోపేశ్వర్‌లో రఘునాథ్ అన్న సిద్ధుడు కాకా పురాణిక్ అన్న పేరుతో ప్రసిద్ధి చెందాడు. శిష్యత్వ ఋణానుబంధం కారణంగా, పండిత్ వారి పాదాలయందు భక్తి కలిగి ఉన్నాడు. 67.అతడు బాబాను తన గురువైన కాకాగా భావించాడు. అతనికి అట్లే అనుభవమయింది. మనసులో ఉండే భావాన్ని బట్టి భక్తి ప్రభావంకూడా ఉంటుంది. 68.అలా బాబా తమ మనసుకు నచ్చినప్పుడే సర్వోపచారాలను చేయించుకునేవారు. లేదా పూజా పళ్ళెమును త్రోసివుచ్చి నరసింహరూపాన్ని ప్రదర్శించేవారు. 69.ఈ రూపాన్ని ప్రకటించినప్పుడు వారి వద్ద నిలబడే ధైర్యం ఎవరికి ఉంది? వారు మరల శాంతించేవరకు అంతా ప్రాణ భయంతో పరిగెత్తేవారు. 70.బాబా ఒకప్పుడు అకస్మాత్తుగా కోపంతో భక్తులపై

నిప్పులు చెరిగేవారు. మరొకప్పుడు మైనం కంటే మెత్తగా శాంతి క్షమలు మూర్తీభవించినట్లు ఉండేవారు.71.ఒకప్పుడు కాలాగ్ని రూపంగా భాసించి భక్తులను ఖడ్గధారపై నడిపించేవారు.మరొకప్పుడు వెన్నకంటె సున్నితంగా ఆనందవృత్తిలో విలసిల్లుతున్నట్లు ఉండేవారు. 72.కళ్ళు ఎఱ్ఱగా చేసి కోపంతో అటు ఇటు ఊగిపోతున్నా,వారి కడుపులో కన్నతల్లికి బిడ్డలపై ఉండే కారుణ్యఝరి ఉండేది.73.క్షణంలో వారి కోపం తగ్గిపోగానే భక్తులను పిలిచి 'నేనెవరినైనా కోపించినట్లు నాకు తెలియదు. 74.తల్లి బిడ్డలను తన్ని తరిమివేస్తే, సముద్రం నదులను వెనుకకు మరల్చితే నేను మిమ్ములను తరిమివేస్తాను.అప్పుడు అహితం చేస్తాను.75.నేను నా భక్తులకు అంకితుణ్ణి.నేను భక్తుల వద్దనే ఉంటాను. నేనెల్లప్పుడూ ప్రేమకోసం తపిస్తూ భక్తుల పిలుపుకు బదులు పలుకుతాను.' అని అనేవారు.76. ఈ కథాభాగాన్ని వ్రాస్తుంటే వైన చెప్పిన దానికి సంబంధించిన మరొక కథ సహజంగా గుర్తుకు వచ్చింది. ఉదాహరణంగా చెబుతాను. శ్రోతలు శ్రద్ధగా వినండి.77.కల్యాణ్ నివాసియైన సిద్దిక్ ఫాల్కే అను పేరుగల ఒక ముసల్మాను, మక్కా మదీనా యాత్రలు చేసి శిరిడీకి వచ్చాడు.78.వృద్ధుడైన ఆ హాజీ ఉత్తరాభిముఖంగా ఉన్న చావడిలో దిగాడు. మొదట తొమ్మిదినెలలూ అతనిపై బాబా ప్రసన్నులు కాలేదు.79.అతనికి కాలం కలసిరాలేదు.అతని రాకపోకలు వ్యర్థమయ్యాయి. అనేక రకాల ప్రయత్నాలు చేసినా బాబా దర్శనం కాలేదు.80.మసీదు ద్వారాలు అందరికీ తెరచి ఉండేవి. ఎవరికీ ఏ అడ్డు, తెర గానీ లేవు. కానీ ఆ ఫాల్కేకు మాత్రం మసీదు ఎక్కటానికి అనుమతిలేదు.81.ఏమిటి నాకీ కర్మ! మసీదులో అడుగు పెట్టలేకున్నానే. నేనేం పాపం చేశాను అని ఫాల్కే మనస్సులో దుఃఖించాడు.82.బాబా నాపై ఏ విధంగా ప్రసన్నులవుతారు అని అహర్నిశలూ అదే ఆలోచనలతో అతని హృదయం రోగగ్రస్తమైంది. 83.ఇంతలో, విచారించకు! మాధవరావును పట్టుకుంటే నీ కోరిక తీరుతుంది.అని ఎవరో తెలియజేసారు.

84.ముందుగా నంది దర్శనం చేసుకొకపోతే శంకరుడు ప్రసన్నుడౌతాడా! ఆ మార్గాన్నె అవలంభించాలి అని అనగా అతనికి ఆ ఉపాయం నచ్చింది.85.శ్రోతలకు ఇది అతిశయోక్తిగా అనిపించవచ్చు. కాని శిరిడీలో బాబా దర్శనానికి వెళ్ళే భక్తులకు ఇది అనుభవం. 86.బాబాతో సంప్రదించాలని అభిలషించేవారు ముందు మాధవరావును వెంటబెట్టుకుని వెళ్లాలి.87.ఎవరు ఎక్కడనుండి, ఎందునిమిత్తం, ఏ కార్యార్థం వచ్చారన్న విషయాలను బాబాకు మాధవరావు మధురంగా తెలియజేస్తూ ప్రారంభించేవాడు.ఆ తరువాత బాబా మాట్లాడడానికి ఉద్యుక్తులయ్యేవారు. 88.ఆ సంగతినంతా విని హాజీ మాధవరావును 'ఒకసారి నా ఈ తపనను తొలగించు.దుర్లభమైన బాబా దర్శనాన్ని కలిగించు' అని బ్రతిమాలాడు. 89.అలా మాధవరావును వేడుకోగా అతడు కష్టమైనా సరే ప్రయత్నించి చూడాలని అనుకున్నాడు. 90.ధైర్యాన్ని కూడకట్టుకొని మసీదుకు వెళ్లాడు.చాలా మెల్లగా'బాబా!ఆ వృద్దుడు చాలా బాధపడుతున్నాడు. అతనిని కరుణించండి.91.హాజీ మక్కామదీనా యాత్రలు చేసి శిరిడీకి తమ దర్శనానికి వచ్చాడు. అతనిపై దయ చూపటం లేదు ఎందుకు?అతనిని మసీదులోకి రానివ్వండి.92.జనులు అసంఖ్యాకంగా వచ్చి మసీదులో మీ దర్శనం చేసుకొని వెళుతున్నారు కదా?మరి ఇతని విషయంలో విషమ భావం ఎందుకు?.93.ఒక్కసారి మీ కృపాదృష్టిని ప్రసరించండి. అతనిని మసీదులో మిమ్మల్ని కలుసుకోనివ్వండి. తన మనసులోని మాటను చెప్పుకొని వెంటనే వెళ్ళిపోతాడు' అని చెప్పాడు. 94.శామా! నువ్వు ఇంకా ముక్కుపచ్చలారని పసివాడవు. అతనిపై అల్లా అనుగ్రహం లేకపోతే అతనికి నేనేంచేయగలను.95.అల్లామియాకు ఋణపడి ఉండకపోతే ఎవరైనా మసీదు ఎక్కగలరా? ఇక్కడి ఫకీరు లీల అపూర్వం. నేను అతనికి యజమానిని కాను.96. సరే అక్కడ బారవి(బావి) సమీపంలో వెనుక ఇఱుకుబాట ఉంది.అతడు ఆమార్గంలో వస్తాడా అని వెళ్ళి స్పష్టంగా అడుగు అని

అన్నారు.97.'ఎంతటి కష్టమైన మార్గమైనా వస్తాను, నేను వారిని ప్రత్యక్షంగా కలుసుకోవాలి. నన్ను వారి చరణాల వద్ద కూర్చోనివ్వాలి' అని ఫాల్కే చెప్పాడు. 98.శామా ద్వారా అతని సమాధానాన్ని విని బాబా 'నాలుగు వాయిదాలలో నాకు నలభై వేల రూపాయలను ఇస్తాడా అని అడుగు' అన్నారు.99.మాధవరావు మాటలు విని హాజీ ఈ 'మాట అడగాలా? వేలు ఏమిటి అడగాలే కాని నలభై లక్షలన్నా ఇస్తాను.' అని చెప్పాడు. 100.అది విని బాబా 'ఈ రోజు మా మసీదులో మేకను కోయాలని ఉంది. మరి నీకు మాంసంకావాలా? 101.లేక ఎముక మాంసం కావాలా? లేక వృషణాల పై కోరికా? ఆ ముసలివాణ్ణి నిశ్చయంగా ఏది కావాలో వెళ్లి అడుగు' అని చెప్పారు.102.బాబా అన్న మాటలన్నీ మాధవరావు హాజీతో చెప్పాడు. హాజీ 'నాకవేవీ వద్దు.103.వారికి ఇవ్వాలని ఉంటే నా కోరిక ఒక్కటే. కొళంబాలోని ఒక ముక్క లభిస్తేచాలు, కృతకృత్యుణ్ణి' అని చెప్పాడు.104.హాజీ చెప్పిన మాటను మాధవరావుతిరిగివచ్చి బాబాకు మనవి చేశాడు.వెంటనే బాబా ఉగ్రులయ్యారు.105.మట్టిపాత్రను నీళ్ళకుండను స్వయంగా పైకి ఎత్తి ద్వారంవైపు విసిరి వేశారు. తమ చేతిని కరకరా కొరుకుతూ హాజీ వద్దకు వచ్చారు.106.తమ కఫినీని రెండు చేతులా పట్టుకుని హాజీ ఎదుట కఫినీని పైకి లేవనెత్తి 'నీ మనసులో ఏమనుకుంటున్నావు? నా ముందా నీ ప్రతాపం? 107.ముసలివానిలా బడాయి చూపిస్తున్నావు. ఇలాగేనా ఖురాను పఠించటం? మక్కాయాత్ర చేశానని గర్విస్తున్నావుగాని నన్ను ఎఱుగలేకున్నావు' 108. అని అతనిని అవమానించారు. అవాచ్య శబ్దప్రహారాలను చేశారు. హాజీ చాలా గాబరా పడ్డాడు. బాబా వెనుకకు తిరిగి వచ్చేశారు.109.మసీదు ప్రాంగణంలోనికి ప్రవేశిస్తూ తోటమాలి మామిడి పళ్లను అమ్మటం చూశారు. మొత్తం బుట్టను కొని హాజీకి పంపించారు.110.వెంటనే వెనుతిరిగి మరల ఆ హాజీ వద్దకు వెళ్ళారు. తమ జేబులో నుండి డబ్బుతీసి 55 రూపాయలను లెక్కపెట్టి అతని చేతిలో

లెక్కపెట్టారు. 111.అప్పటినుండి అతనిపై ప్రేమకలిగి అతనిని భోజనానికి ఆహ్వానించారు. ఇద్దలూ అంతా మరచిపోయారు. హాజీ ఆత్మానందంలో తల్లీనుడయ్యాడు.112.ఆ తరువాత అతడు యథేచ్ఛగా వస్తూపోతూ బాబా ప్రేమలో మునిగిపోయాడు. బాబా అతనికి అప్పుడప్పుడూ రూపాయలనిచ్చేవారు.113.మేఘాలను కూడా శాసించగల సాయి సమర్థులు. ఒకసారి ఇంద్రుని ప్రార్థించడం చూసి ఆశ్చర్యం కలిగింది.114.అతి భయంకరమైన సమయం.ఆకాశమంతా చీకటి క్రమ్ముకు పోయింది.ఝుంఝూమారుతం వీస్తుంటే పశువులకు పక్షులకు భీతి వాటిల్లింది.115.సూర్యుడు అస్తమించి సాయంకాలమైంది.అకస్మాత్తుగా సుడిగాలివీచి అది ప్రబలమై,భయంకరమైన సంచలనంచెలరేగింది.116.మేఘాల ఉరుములు,విద్యుల్లతల మెరుపులు,గాలియొక్క భయంకర శబ్దం.పెద్దవర్షం. 117.ముసలధారలతో మేఘాల వర్షం, టపటపమని వడగళ్ళు చప్పుడు. గ్రామస్థులు భయపడిపోయారు. దూడలు, పశువులు అరవ సాగాయి. 118.బికారులు, భిక్షగాళ్ళు మసీదు చూరుక్రింద తలదాచు కోవటానికివచ్చారు. పశువులు, దూడలూ కూడా మసీదులో ఒక దగ్గర చేరాయి.మసీదు క్రిక్కిరిసింది. 119. నలువైపులా నీరే. గడ్డి కొట్టుకొని పోయింది. కళ్లాలలోని పంటంతా తడిసిపోయింది. జనం ఆందోళనపడ్డారు.120.గ్రామస్థులంతా గాబరాపడిపోయి మసీదులోని సభామంటపంలోకి వచ్చి నిండిపోయారు. కొందఱు మసీదు చూరు క్రింద ఉండి బాబాతో మొరపెట్టుకున్నారు.121.జోగులాంబ, జాఖాలమ్మ , మరిడమ్మ, శని,శంకరుడు,అంబాబాయి, మారుతి, ఖండోబా, మహల్సమ్మ వగైరా దేవీదేవతలు శిరిడీలో ఎన్నో చోట్ల ఉన్నారు. 122.కాని కష్టపరిస్థితులలో ఉన్న గ్రామస్థులకు ఏ ఒక్కరూఅక్కరకు రాలేదు. మాట్లాడుతూ, నడుస్తూ పరిగెత్తుతూ, వారి కష్టాలలో ఆదుకునేది ఒక్క సాయియే.123.వారికి ఏ కోడో లేక మేకో అవసరం లేదు. ఒకటో రెండో రూపాయలూ అవసరం లేదు.

వారు కేవలం భక్తినే ఆశిస్తూ కష్టాలను తుడిచివేస్తారు.124.ఆ భీభత్సానికి ప్రజలు భీతి చెందటం గమనించిన సాయి మహారాజు అమితంగా కరిగిపోయారు. తమ ఆసనం నుండి లేచి ముందుకు వచ్చి మసీదు అంచున నిలుచున్నారు.125.మేఘాల ఉరుములతో ఆకాశం దద్దరిల్లి పోతోంది. ఉరుములు ఉరిమి, మెరుపులు మెరుస్తున్నాయి. సాయి మహారాజు అక్కడ నిలచి గట్టిగా ఉచ్చ స్వరంతో కేకలు వేశారు. 126. భగవంతునికి తమపై కంటే తన భక్తులపైన సాధుసత్పురుషులపైన ప్రేమ.అందువలన దేవుడు వారు చెప్పినట్లు చేస్తాడు. భక్తులకోసమే అవతరిస్తాడు.127.భక్తుల మొరవిని వారిని రక్షించవలసిందే.భక్తుల భావాన్ని గుర్తుంచుకొని తను ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాడు.128.బాబా యొక్క కేకలపైని కేకల శబ్దం విచిత్రంగా మసీదు కదలిపోతుందా అన్నట్లుగా, అందరి చెవులూ దిబ్బెళ్లు పడిపోయాయి.129.ఆ పెద్ద శబ్దం,పర్వతాలలో ప్రతిధ్వనివలె మసీదులో, మందిరాలలో ప్రతిధ్వనించింది. మేఘగర్జనలు వర్షధారలు ఆగిపోయినై. 130.బాబా యొక్క పెద్దపెద్ద కేకలతో సభా మండపమంతా అదిరిపోయింది.భక్తమండలి భీతితో గాబరాపడ్డారు. తమ తమ స్థలాలలో ఊరికే ఉండిపోయారు. 131.నిజంగా బాబా లీల వర్ణించతరం కాదు. వర్షం ఆగింది. వెంటనే గాలి కూడా తగ్గింది. మబ్బులు చెదరిపోయాయి.132.తుఫాను మెల్లగా మందగించింది. నక్షత్రాలు కనిపించ సాగాయి, అంధకారం తొలగిపోయింది. 133.ఆ తరువాత వర్షం తుఫాను గాలి పూర్తిగా తగ్గిపోయాయి. ఆకాశంలో చంద్రుడు కనిపించాడు. అందరికీ ఆనందం కలిగింది.134.ఇంద్రునికి దయ కలిగిందనిపించింది. సత్పురుషుల వాక్కును నిలపెట్టాలికదా మరి. వాతావరణం శాంతించగానే మేఘాలు మన్నెండు దిశలుగా వెళ్ళిపోయినై. 135.వర్షం తగ్గింది.గాలి మందమందంగా వీచింది.ఉరుములు పూర్తిగా ఆగిపోయాయి,పశువులకు పక్షులకు ధైర్యం వచ్చింది. 136. దూడలు, పశువులు

ఇళ్ళ చూరుల క్రిందనుండి బయటకు వచ్చి నిర్భయంగా తిరగసాగాయి.పక్షులు కూడా ఆకాశానికి ఎగిరిపోయాయి.137.భయంకర పరిస్థితి నుండి రక్షించిన బాబా యొక్క ఉపకారాన్ని గ్రహించి జనులంతా తమ తమ ఇళ్ళకు వెళ్లిపోయారు. పశువులు కూడా ధైర్యంగా వెళ్లిపోయాయి.138.ఈ విధంగా, మూర్తీభవించిన కరుణారసమే సాయి. వారు బిడ్డల గురించి కన్నతల్లి వలె కలవరపడతారు. భక్తులయందు వారికి ఉన్న అత్యంత ప్రేమను నేనెంతని గానం చేయను?139.సాయిబాబాకు అగ్నిపై కూడా ఇటువంటి ప్రభావమే ఉంది.ఈ విషయంలో శ్రోతలు ఒక సంక్షిప్త కథను శ్రద్దగా వింటే బాబా యొక్క అపూర్వ శక్తి అర్థమవుతుంది. 140.ఒకసారి మధ్యాహ్న సమయాన ధునిలో అగ్ని బాగా అంటుకుంది.ఆ అగ్ని జ్వాలలు కల్లోలంగా పైకి లేస్తుంటే ఆ సమీపంలో ఎవరు ఉండగలరు?141.ప్రచండంగా మండుతున్న అగ్ని జ్వాలా శిఖలు, మసీదు పై కప్పును తాకుతున్నాయి. ఆ క్షణం మసీదు మండి బూడిదైపోతుందేమో అని అనిపించింది.142.జనమంతా చింతిస్తుంటే బాబా మాత్రం ప్రశాంతంగా ఉన్నారు. 'ఏమిటి ఈ బాబాయొక్క వైఖరి'అని జనమంతా ముక్కుమీద వేలేసుకున్నారు. 143.నీళ్ళు పట్టుకొని రండి అని ఒకరంటే,పోసేవారెవరని మరొకరన్నారు.అలా పోస్తే బాబా సటకాతో కొడతారేమో? అమ్మో ! అక్కడికి ఎవరు వెళ్ళగలరు?144.అందరికీ అధైర్యమే. బాబాను అడిగే ధైర్యం ఎవరికీ లేదు.అప్పుడు బాబా చిరాకుగా సటకాపైన చెయ్యి వేశారు.145.రగులుతున్న అగ్ని జ్వాలలను చూచి సటకాను చేతిలోకి తీసుకొని దెబ్బపై దెబ్బ కొట్టుతూ 'వెనక్కు వెళ్లు' అని అన్నారు.146.ధునికి ఒక మూర దూరంలో ఉన్న స్తంభంపైన సటకాతో కొడుతూ జ్వాలలవైపు చూస్తూ 'శాంతించు శాంతించు' అని అన్నారు. 147.ఒక్కొక్క దెబ్బకు జ్వాలలు తగ్గి ధుని శాంతించింది. అలా అందరి భయం పారిపోయింది. 148.సత్పురుషులలో శ్రేష్ఠులైన ఈ సాయి,

పరమేశ్వరుని మరో అవతారం.వారి చరణాలపై శిరస్సు నుంచితే వారు తమ కృపాహస్తాన్ని ఉంచుతారు. 149. సస్థచిత్తులై భక్తిశ్రద్ధలతో నిత్యం ఈ అధ్యాయాన్ని పారాయణం చేస్తే ఆపదల నుండి విముక్తులవుతారు. 150.ఇంకా అధికంగా చెప్పాలంటే శుద్ధాంతఃకరణంతో నిర్మలమైన మనసుతో, నియమనిష్ఠలతో,సాయి భక్త పరాయణులౌతే శాశ్వతమైన సనాతన పరబ్రహ్మను పొందగలరు.151.అసాధారణమైన మీ అభీష్టాలుకూడా తీరుతాయి.చివరకు పూర్తిగా ఏ కోరికలు లేనివారై దుర్లభమైన సాయుజ్య ధామాన్ని చేరుకుంటారు.ఎప్పుడూ చెదరని,ఎడతెగని శాంతి తృప్తి కలుగుతాయి.152.పరమార్థసుఖాన్ని,పరమార్థజ్ఞానాన్ని అనుభవించాలని, మనసులో కోరుకునే భక్తులు ఈ అధ్యాయాన్ని మరల మరల శ్రద్ధగా శ్రవణం చేయండి.153.దాని వలన చిత్తవృత్తి పరిశుద్ధమవుతుంది. ఈ కథా శ్రవణంలో మనసుకు పరమార్థ ప్రవృత్తి కలుగుతుంది. అరిష్టాలు తొలగిపోతాయి. ఇష్టదేవతాప్రాప్తి కలుగుతుంది. బాబా యొక్క లీలల అనుభవాలను తెలుసుకోండి. 154.హేమాడ్ పంతు సాయికి శరణుజొచ్చి అతిపావనమైన తరువాతి అధ్యాయంలో గురుశిష్యుల మహిమ, గురుపుత్రునికి ఘోలప్ గురు దర్శనం.155.శిష్యుడు తమ గురువును ఎట్టి పరిస్థితులలోనూ త్యజించరాదు అని సాయి ప్రత్యక్షంగా అనుభవాన్ని కలుగజేసి భక్తి భావాన్ని దృఢపరచారు.156.బాబా పాదాల వద్దకు వచ్చిన ప్రతిఒక్క భక్తునికి వారిదర్శనంలో విశేషం. ఒకరికి ఒకలా మరొకరికి మరోలా దర్శనమిచ్చి బాబా వారిని అందులోనే దృఢపరచారు. 157. సస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్‌పంత్ విరచితమూ అయిన శ్రీ సాయి సమర్థసచ్చరితంలో శ్రీసాయి మహిమావర్ణనమను పదునొకండవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 12 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

జయ జయ సద్గురుసాయినాథా! మీ చరణాలలో శిరసునుంచి నమస్కరిస్తున్నాను. మీరు ఎల్లప్పుడూ నిర్వికారమైన ఆత్మ స్వరూపంలో లీనమై ఉండి, మీ శరణు జొచ్చిన వారిని కరుణిస్తారు. 1.సచ్చిదానందా! ఆనంద కందా! మీరు భవభయ కష్టాలకు లోనైన వారికి సుఖాలను కలిగిస్తారు. మరియు అద్వైత బోధతో ద్వైతాన్ని ఛేదించి మందబుద్ధులను కూడా తరింప చేస్తారు. 2. అంతటా పూర్ణంగా వ్యాపించి ఉన్న ఆకాశం వలె, మీ స్వరూపాన్ని చిత్రించుకుని అనుభవించినవారు భాగ్యవంతులు. 3. సాధువుల సంరక్షణకు మరియు దుర్జనులను సమూలంగా నశింపచేయటానికి పరమేశ్వరుని అవతారం. కాని ఇది సత్పురుషుల పట్ల వేరు. 4. వీరికి సాధువులు సాధువులుకానివారు అంతా సమానమే. ఒకరు ఎక్కువా ఒకరు తక్కువ అన్న భేదభావాన్ని వీరు ఎఱుగరు, ఉభయులూ వారికి సమానం. 5. సత్పురుషులు పరమేశ్వరుని కంటె గొప్పవారు. కారణం వారు మొదట దుర్జనులను దారిలో పెడతారు. వారి మనసు దీనులకొఱకు ప్రేమతో తపించిపోతుంటుంది. 6. అగస్త్య ఋషి వలె సాయి భవసాగరాన్ని పానం చేశారు. వీరు అజ్ఞానాంధకారాన్ని తొలగించే జ్ఞానభాస్కరులు. పరమాత్మ వీరిలో వసించి ఉంటారు. వాస్తవానికి వీరు పరమాత్మ కంటే భిన్నులు కారు. 7. ఈ సాయి ఇటువంటి సత్పురుషులలో ఒకరుగా, భక్తులకోసం అవతరించిన జ్ఞానరాజు, కైవల్య తేజస్సును అధిష్ఠించిన వారు. 8. వీరికి అన్ని ప్రాణులయందు అత్యంత

ప్రేమ, ఇతర విషయాల యందు అత్యంత అనాసక్తత, ఒక చోట ఆసక్తి మరొకచోట విరక్తి ఉన్నట్లు కనిపించినా సర్వత్రా సమభావమే.9.వారికి ఎవరియందు మిత్రులూ, శత్రువులూ అన్న భావం లేదు.రాజైనా పేదైనా వారికి సమానం.ఇటువంటి సాయి మహానుభావుని ప్రభావాన్ని వినండి.10. సత్పురుషులు భక్తులపైన ప్రేమాకర్షణవలన వారికోసం తమపుణ్య సంచయాన్ని ఖర్చుపెడతారు. భక్తులకోసం కొండలు గుట్టలు ఏవి అడ్డు తగిలినా లెక్కచేయక వాటిని దాటేస్తారు.11.అజ్ఞానం వలన, పరమార్థం ఏమిటో తెలియక భార్యాబిడ్డలతో ధనసంపాదనలో మునిగిపోయే వారిని అజ్ఞానులని తలచి వదిలివేయాలి.12.దేవుడు ఇటువంటి అమాయకులను కరుణిస్తాడు. కాని దేవునికి దూరంగా విముఖంగా ఉన్నవారి అభిమానాన్ని అణచివేస్తాడు.13.సాధువులు అజ్ఞానులను కరుణిస్తారు. దానితో వారికి సాధువులపై విశ్వాసం కుదురుతుంది. జ్ఞానాభిమానం వ్యర్థం.14.పండితమ్మన్యులు, మూఢమతులు, శుష్కాభిమానంతో వృథాగా పొంగిపోతారు.వారు భక్తిమార్గాన్ని అవహేళన చేస్తారు.అట్టి వారి సాంగత్యం పనికి రాదు.15.వర్ణసంకర కపటం వద్దు. వర్ణాభిమానాన్ని చాటుకోవటం వద్దు.వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తున్న అహంభావమూ వద్దు.వీనితో పాషండపండితులవకండి.16.వేదవేదాంగ పారంగతులమని అనుకునేవారు జ్ఞానగర్వంతో మదోన్మత్తులై భక్తిమార్గానికి అడ్డు తగులుతారు.వారికి తరించేమార్గంలేదు. 17. అమాయకులు విశ్వాసం ఆధారంతో భవభయసంకటాల నుండి వివముక్తులౌతారు.కాని శాస్త్ర పండితుల చిక్కులను ఎవరూ విడదీయలేరు.18.సత్పురుషుల యందు విశ్వాసముంచితే అజ్ఞానులకు అజ్ఞాననిరసనమవుతుంది. జ్ఞానాభిమానులకు సంశయాలు తొలగిపోయి సద్భావం ఉత్పన్నమౌతుంది.19.ఒకసారి ఒక విచిత్రమైన ఘటన సంభవించింది. దైవనిర్ణయానుసారం, ఒక కర్మఠునికి సాయిని కలుసుకునే అసామాన్యమైన భాగ్యం

కలిగింది.20.అతని సంకల్పం వేరుగా ఉండింది. విశేషమైన యోగం వలననే శిరిడీ ప్రయాణలాభం కలిగి అక్కడ తన గురువు దర్శనమైంది.21.గురువు యొక్క మహాత్మ్యమును తెలియచేసే రసభరితమైన ఆ కథను తప్పక శ్రవణం చేయండి. అది గురుభక్తుల ప్రేమకు నిదర్శనం.22.నాసిక్ క్షేత్రస్థుడు కర్మఠుడు, ఆచారాలను నిష్ఠగా పాటించే ఒక అగ్నిహోత్రి,ఇంటి పేరు ముళే.పూర్వపుణ్య బలంతో ఒకసారి శిరిడీకి వచ్చాడు.23.ఎంతో పుణ్యసంచయం లేకపోతే ఎవరూ కూడా శిరిడీలో క్షణమైనా నిలువలేరు. ఎవరిదైనా ఎంతటి దృఢనిశ్చయమైనా బాబా సముఖంతో ఏవీసాగవు.24.నేను శిరిడీవెళ్లి నాకు తోచినంత కాలం అక్కడుంటానని ఎవరైనా అనుకోవచ్చు కాని అదివారి ఆధీనంలో ఉండదు. అనుకున్నట్లు జరగదు.అక్కడ అందఱూ పరాధీనులే.25. నేను నేనే అహంభావంతో దేనినీ నిశ్చయించుకోలేక అలసిపోయారు.బాబా తమ ఇష్టానుసారం ప్రవర్తించే ఒక స్వతంత్ర దైవం.వారి ఎదుట ఇతరుల అహంకారం కరిగిపోతుంది.26.మనమంతు వస్తేనే గాని బాబాకు మనం గుర్తుకురాము. వారిగుణగణాలన్నీన మనచెవులకు సోకదు. ఇక వారిని దర్శించుకోవటం, స్మరించటం ఎక్కడిది?27.అనేకులు సాయిసమర్థుని దర్శనానికి వెళ్లాలని సంకల్పించుకున్నా,సాయి నిర్వాణ పర్యంతం వారికి ఆ యోగం కలగలేదు.28.తరువాత పోదాం పోదాం అని అనుకుంటూ కాలయాపన చేసినవారికి ఏవో అడ్డంకులవలన ప్రయాణం కుదరలేదు.ఇంతలో బాబా సమాధి చెందారు.29.ఇవాళ పోదాం రేపు పోదాం అని అనుకుంటూ ఆఖరుకు బాబా యొక్క ప్రత్యక్ష దర్శన భాగ్యాన్ని పోగొట్టుకుని చివరకు పశ్చాత్తాప పడ్డారు.30.బాబా దర్శనాభిలాష తీరని వారు ఈ కథలయందు విశ్వాసముంచి భక్తిశ్రద్దలతో వింటే పాలకు బదులు మజ్జిగ లభించినట్లు బాబా యొక్క దర్శన పిపాస కొంత తీరుతుంది, అయితే విశ్వాసమొక్కటి ఉండాలి.31. భాగ్యంకొద్దీ శిరిడీ వెళ్లి,బాబా దర్శన స్పర్శన సుఖాలను పొందినవారు,అక్కడ

బాబా ఉంచితే తప్ప తము ఇష్టానుసారం అక్కడ ఉండగలిగేవారా, బాబా ఉంచాలిగాని! 32.ఎవరైనా తాము తలచినట్లుగా వెళ్లి అక్కడ ఉండాలనుకున్నా ఉండలేరు. బాబా అనుమతి ఉంటేనే ఉండాలి. వెళ్లిపొమ్మంటే తిరిగి వెళ్లిపోవలసిందే. 33.ఒకసారి కాకామహాజని ఒక వారంరోజులు శిరిడీలో ఉండాలన్న కోరికతో ముంబైనుండి వెళ్లాడు. 34.అక్కడ చావడి అందంగా అలంకరించ బడి ఉంది. బాబా ఎదుట ఊయల ప్రేలాడ కట్టబడి ఉంది. భక్తులు శ్రీకృష్ణజన్మోత్సవంలో ఆనందంగా నృత్యం చేస్తున్నారు. 35. ఆ గోకులాష్టమి పండుగ వైభవాన్ని ఆనందంగా కళ్లారా తిలకించాలని కాకా ఆ శుభసందర్భాన శిరిడీకి వచ్చాడు.36. మొదట బాబా దర్శనానికి వెళ్లగా, బాబా అతనిని 'మీ ఇంటికి ఎప్పుడు వెళ్లుతున్నావు' అని అడిగారు. కాకా ఆశ్చర్యపోయాడు.37.వచ్చీరాగానే ఇదేం ప్రశ్న అని, కాకా తనలో విస్మయం చెందాడు.శిరిడీలో ఒక వారం రోజులుండాలని అతని కోరిక. 38.బాబా స్వయంగా అడిగినప్పుడు మరి జవాబు ఇవ్వాలి కదా.దానికి కూడా బాబాయే సూచించినట్లు, 39 'బాబా ఎప్పుడు ఆజ్ఞ ఇస్తే అప్పుడు వెళ్తాను' అని జవాబిచ్చాడు.కాకా ప్రత్యుత్తరాన్ని విని బాబా 'రేపు వెళ్లు' అని చెప్పారు.40. కాకావారి ఆజ్ఞను శిరసా వహించి వారికి పాదాభివందనంచేసి కృష్ణాష్టమి పంటి పండుగరోజే బయలుదేరాడు. 41.ఊరు చేరుకుని కార్యాలయానికి వెళ్లి చూడగా అక్కడ అతని యజమాని కాకా ఎప్పుడు తిరిగి వస్తాడా అని అతని రాకకు నిరీక్షిస్తున్నాడు. 42.అకస్మాత్తుగా గుమాస్తాకు జబ్బు చేయటం వలన యజమానికి కాకాయొక్క అవసరం తప్పనిసరియై అతనిని వెంటనే రమ్మని శిరిడీకి ఉత్తరం వ్రాశాడు. 43. కాకా శిరిడీనుండి బయలుదేరాక పోస్టుమనిషి వాకబు చేసి ఉత్తరాన్ని త్రిప్పిపంపగా అది కాకా ఇంటికి వచ్చింది. 44.దీనికి విరుద్ధంగా ఉన్న మరో చిన్న విషయాన్ని వినండి. భక్తులకు తమ శ్రేయస్సు ఏమిటో తెలియదు. కాని బాబాకు అది స్పష్టంగా తెలుసు. 45.నాసిక్‌లో

భావూసాహేబు ధుమాల్ ఆను పేరుగల ప్రసిద్ధి చెందిన వకీలు, బాబా యందు భక్తిప్రేమ గలవాడు. ఒకసారి అతడు కేవలం బాబా దర్శనానికై వచ్చాడు. 46. అతిత్వరగా దర్శనం చేసుకుని బాబా పాదాలకు వందనం చేసి, విభూతిని, వారి ఆశీస్సులను తీసుకుని వెంటనే వెళ్లి పోవాలని అతని ఉద్దేశం. 47. ధుమాల్ వెళ్లే దారిలో నిఫాడ్ అను ఊరిలో అతనికి ఒక కేసుకు వెళ్లవలసిన అవసరం ఉంది. 48. అతని ఆలోచన అలా ఉంది కాని బాబాకు ఉచితానుచితాలు తెలుసు అందువలన ధుమాల్ తిరిగి వెళ్లిపోవటానికి అనుమతిని అడిగితే వారు అతనికి ఆజ్ఞ ఇవ్వలేదు. 49. అలా అనుమతిని స్పష్టంగా ఇవ్వకుండా అక్కడ ఒక వారం రోజులు ఉంచేసారు. కేసు వాయిదా పడింది. అలా మూడుసార్లు జరిగింది. 50. ధుమాల్‌ను అక్కడ వారం పైగా ఉంచేసారు. వాయిదా రోజున ఇక్కడ న్యాయాధీశునికి అస్వస్థత. 51. జన్మలో ఎన్నడూ ఎరుగని దుర్భరమైన కడుపునొప్పి వచ్చి కేసు దానంతట అదే వాయిదా పడింది. ఆ సమయం ధుమాల్‌కు సార్థకమైంది. 52. సాయి యందు విశ్వాస ముంచినందుకు అతనికి సాయి సాన్నిధ్యం మరియు అతని ముద్దాయికి చింతా నివారణ, ఏ ప్రయాసా లేకుండానే కలిగాయి. 53. తరువాత ఓ శుభ సమయాన ధుమాల్‌కు వెళ్లటానికి ఆజ్ఞ లభించింది. సాయి యొక్క విచిత్ర లీలా విశేషంతో అన్ని పనులు చక్కగా జరిగాయి. 54. అలా ఆ కేసు నాలుగు నెలలు నడిచింది. నలుగురు న్యాయాధీశులు మారారు. చివరకు విజయం లభించింది. నిందితుడు నిర్దోషి అని విడుదల చేయబడ్డాడు. 55. ఒకసారి బాబా, నానా సాహేబు నిమోన్‌కరు అన్న భక్త శ్రేష్ఠుని పత్ని పక్షం వహించిన విషయం వినండి. 56. నిమోన్ అన్న ఊరికి నానాసాహేబు వతన్‌దారు. ప్రభుత్వం అతనికి గౌరమేజిస్ట్రేటు పదవిని ప్రదానం చేసింది. అక్కడ ఇతనికి చాలా గౌరవం. 57. అతడు మాధవరావుకు పెదనాన్న. వయసులో పెద్దవాడు పూజ్యుడు. అతని భార్య కూడా గొప్ప నిష్ఠా పరురాలు. సాయియే వారి ఇష్టదైవం. 58. తమ స్వగ్రామాన్ని

విడిచి ఆ ఉభయులూ శిరిడీలో సాయి చరణాలయందు భక్తిశ్రద్ధలను ఉంచి సుఖంగా ఉన్నారు. 59.వారు బ్రహ్మముహూర్తాన లేచి, ప్రాతఃకాల స్నానం చేసి, పూజకు సిద్ధంచేసుకుని కాకడ హారతిని చేయటానికై చావడికి వెళ్లేవారు. 60.ఆతరువాత స్తోత్రాలను వల్లించేవారు: నానా రోజూ సూర్యాస్తమయంవరకూ బాబా సేవలో, బాబా వద్దనే ఉండేవాడు. 61.బాబాను లెండీ వరకు తీసుకుని వెళ్లటం,మరల వారిని మసీదుకు తీసుకుని రావటం. అలా ప్రేమ పూర్వకంగా అవసరమైన సేవలు చేసేవాడు. 62. అతని భార్య కూడా ఆమెకు తోచిన విధంగా దినమంతా అత్యంత ప్రేమతో బాబా వద్దనేఉండి బాబా సేవ చేసేది.63.వారు స్నానపానాలకు,వండుకోవటానికి,రాత్రి నిద్రించటానికి మాత్రమే తమ బసకు వెళ్లేవారు.64.మిగతా సమయమంతా ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం ఆ ప్రేమమయ దంపతులు బాబా వద్దనే ఉండేవారు. 65.ఆ ఇద్దరి సేవను వర్ణిస్తుంటే గ్రంథం చాలా విస్తారమై పోతుంది. అందువలన ప్రస్తుత విషయానికి సంబంధించిన కథా భాగాన్ని వినిపిస్తాను. 66.వారి అబ్బాయి అస్వస్థతగా ఉండటంవలన ఆ స్త్రీకి బేలాపూర్‌కి వెళ్లాల్సివచ్చి, అక్కడికి బయలుదేరటానికి భర్తను సంప్రదించింది.67.అలవాటు ప్రకారం బాబా అనుమతిని తీసుకుని ఆ విషయం భర్తకు తెలిపింది. 68.ఈ విధంగా ఆమె బేలాపూర్ వెళ్ళటం నిశ్చయమైంది. కాని నానా రేపే తిరిగిరావాలని అనటం జరిగింది. 69.ఏవో కారణాలవలన నానా ఆమెతో రేపే తిరిగివచ్చేసేయి అని అన్నాడు.ఆమె మనసుకు దుఃఖంకలిగింది. 70.మరురోజు పోళా అమావాస్య కావటంవలన ఆ రోజు అక్కడే గడపాలని ఆమె ఉబలాట పడింది.కాని నానాకు అది ఇష్టం లేదు. 71.అమావాస్య రోజు ప్రయాణం మంచిది కాదు. ఈ పరిస్థితి నుండి ఎలా తప్పించు కోవాలి అని ఆమె తపన పడింది. 72.బేలాపూర్‌కు వెళ్లక పోతే ఆమె మనసుకు శాంతి ఉండదు. భర్త ఆజ్ఞను ఎలా ఉల్లంఘింస్తుంది.భర్త మనసు బాధ పెట్టలేదు 73.

పరేవని బేలాపూర్ వెళ్లటానికి సిద్ధమై బయలుదేరింది. బాబా తెండీ తోటకు వెళ్లుతుండగా వారికి నమస్కరించింది.74.ఎవరైనా బయటి ఊరికి వెళ్లేటప్పుడు ప్రయాణం నిర్విఘ్నంగా జరగాలని భగవంతునికి నమస్కరించటం శిరిడీలో అలవాటు.75.అక్కడి దేవుడు సాయి కనుక ఎంత త్వరగా వెళ్లవలసి వచ్చినా ముందు వారి చరణాలకు నమస్కరిస్తారు.76.అదే ప్రకారం బాబా సాతే వాడా ఎదుట ఒక క్షణంపాటు నిలవగా,ఆ స్త్రీ బాబాచరణాలకు నమస్కరించింది.77.నానా సాహేబు నిమోంకరు మొదలగు పెద్దలు పిన్నలూ, బాబా దర్శనం చేసుకోవాలని వచ్చి వారికి నమస్కరించారు.78.అలా అక్కడ అందరూ చూస్తుండగా, బాబా పాదాలపై శిరసునుంచి బయలుదేరటానికి అనుమతిని కోరుతున్న ఆ స్త్రీ తో బాబా నానా సమక్షంలో చెప్పిన దానిని గమనించండి.79.ఆమె బాబా చరణాలపై శిరసు నుంచి బయలుదేరటానికి అనుమతిని కోరగా'సరే వెళ్లు, నిశ్చింతగా ఉండు,80.బేలాపూర్‌కు వెళ్లి నాలుగు రోజులు నిశ్చింతగా సుఖంగా ఉండి, అందఱినీ కలుసుకొని మరల శిరిడీకి రా'అని చెప్పారు.81.బాబా మాటలు ఆమెకు ఎంతో ఊరటను కలిగించాయి.నిమోన్‌కరుకు విషయం అర్థమైంది.అలా ఆ ఇద్దరి మనసులూ కుదుటపడ్డాయి.82.సారాంశం, మనం ఏదైనా ఆలోచించినప్పుడు దాని పూర్వాపరాలు ఏవీ మనకు తెలియవు. కాని మన మంచి చెడులు సత్పురుషులకు తెలుస్తాయి. వారికి తెలియనిదేదీ ఉండదు.83.భూతభవిష్యవర్తమానాల జ్ఞానం వారికి కరతలామలకం. అందువలన వారి ఆజ్ఞానుసారం ప్రవర్తిస్తే, భక్తులు సుఖసంపన్నులౌతారు.84.ఇప్పుడు పూర్వకథాను సంధానం.బాబా ముచేను కరుణించి అతనికి గురుదర్శనాన్ని కలిగించిన ముఖ్యకథను చెప్పుతాను.85.శ్రీమంతుడైన బాపూసాహేబు బుట్టీని కలుసుకుని వెంటనే తిరిగి వెళ్లిపోవాలని ముచే తలచాడు.86.అది అతని ఉద్దేశమైనా బాబా సంకల్పం వేరు.ఆ చమత్కారంలోని అర్థాన్ని

సావధానంగా వినండి.87.ముళేబుట్టీని కలుసుకున్న తరువాత, భక్తులు మసిదుకు బయలుదేరుతుంటే, ముళే మనసులో కూడా కోరిక కలిగి వారితో తను కూడా వెళ్లాడు.88.అతడు షట్ శాస్త్రాలు అధ్యయనం చేశాడు.జోతిష్యంలోనూ సాముద్రికంలోనూ అతి ప్రవీణుడు. బాబా దర్శనంతో ఆనందించాడు.89.భక్తులు ప్రేమగా బాబాకు పాలకోవా, బత్తాసులను, బర్ఫీని, కొబ్బరికాయలు, నారింజ మొదలగు పళ్లను ఫలహారాలను,ప్రేమతో అర్పిస్తున్నారు.90. అవి కాక బాబా తమకు తోచినప్పుడు అమ్మకానికి స్త్రీలు తెచ్చిన జామపళ్లు, అరటి పళ్లను చెరకును తాము స్వంత డబ్బిచ్చి ఖరీదు చేసేవారు.91.తమస్వంత డబ్బుతో మామిడి పళ్ల బుట్టలను కొనేవారు.అరటిపళ్లను కూడా చాలా తెప్పించి, తమకు ఇష్టం వచ్చినట్లుగా భక్తులకు పంచేవారు.92.ఒక్కోమామిడి పండును రెండుచేతులలోనూ పట్టుకుని నలిపి, మెత్తబడినాక భక్తులకు ఇచ్చేవారు.93.మామిడి పండు పెదవులకు తగలగానే గిన్నెలోనుండి వచ్చినట్లు రసమంతా ఒక్కసారిగా కడుపులోకి వెళ్లిపోయేది. ఇక తొక్కటెంక పారవేయటమే.94.అరటిపళ్ల విషయం అదో వింత.'భక్తులు లోపలి పదార్థాన్ని తీసుకుంటే బాబా వాని తొక్కలను సేవించేవారు.ఎంతటి అద్భుత మైనలీల.95. ఈ పళ్ళనన్నింటినీ బాబా తమ చేతులతో అక్కడి వారందరికీ పంచేవారు. ఎప్పుడైనా తమ మనసుకు నచ్చినప్పుడు ఒకటీ అరా స్వయంగా తినేవారు.96.ఆ పద్ధతి ప్రకారం ఆ రోజు బాబా కేవలం భక్తుల కోసమే అరటి పళ్ల బుట్టను కొని పంచిపెడుతున్నారు.97.ముళేశాస్త్రికి బాబా చరణాలను చూచి చాలా ఆశ్చర్యం కలిగింది. వారి హస్తం లోని ధ్వజ వజ్రాంకుశ రేఖలను పరీక్షించాలని అతనికి కోరిక కలిగింది.98. అప్పుడు బాబా వద్ద కాకాసాహెబు దీక్షితు ఉన్నాడు. అతడు నాలుగు అరటి పళ్లను బాబా చేతులలో పెట్టాడు.99.ఒకరెవరో బాబాతో, 'ఈతడు ముళేశాస్త్రి

నాసిక్ క్షేత్ర నివాసి, అతని పుణ్యం కొద్దీ మీచరణాలవద్దకు వచ్చాడు.అతనికి పళ్ల ప్రసాదం ఇవ్వండి' అని చెప్పారు.100. ఎవరు చెప్పినా చెప్పకున్నా బాబా మనసుకు నచ్చితే తప్ప, ఎవరికీ ఏమీ ఇచ్చేవారు కాదు. అప్పుడు ఏంచేశారు?101. ముళే అరటిపళ్లకోసం కాక బాబా హస్తాన్నిచూడాలనే కోరికతో చేతిని ముందుకు చాచాడు. బాబా అటు వైపు అసలు దృష్టి పెట్టకుండా అందరికీ ప్రసాదాన్ని పంచుతున్నారు.102. ముళే బాబాతో,నాకు పళ్లు వద్దు.మీ హస్తాన్ని ఇటివ్వండి. సాముద్రికాన్ని చూస్తాను అని ప్రాధేయ పడ్డాడు. కాని బాబా అతనికి తమ చేతినివ్వలేదు.103.అయినా ముళే ముందుకు జరిగి చేయి చాచాడు. బాబా తాము ఏం ఎఱుగనట్లుగా ఉన్నారు.అటుకేసి తిరిగి చూడనైనా లేదు.104.సరికదా ముళే చాచిన చేతిలో నాలుగు అరటిపళ్లను ఉంచి కూర్చోమని చెప్పారు. అంతే కాని తమ చేతిని ముళే చేతికివ్వలేదు.105.జీవితపర్యంతం పరమేశ్వరుని కొఱకు శరీరాన్ని అరగ తీసినట్టి వారికి సకల కోరికలూ తీరి, సద్భక్తులకు తల్లి తండ్రి ఐన సాయిమహారాజుకు సాముద్రికం ఏమవసరం?106.సాయిబాబా యొక్క వైరాగ్యాన్ని,సాముద్రికంలోని వారి విముఖతను చూచి,ముళే శాస్త్రి తన చేతిని వెనుకకు తీసుకుని ఇకవారిని ఇబ్బంది పెట్టడం మానుకున్నాడు.107.కొంతసేపు నిశ్చింతగా కూర్చుని భక్తులతో పాటు బసకు వెళ్లాడు. స్నానంచేసి మడి బట్టలు కట్టుకొని అగ్నిహోత్రాన్ని ఆరంభించాడు.108.ఇక్కడ మసీదులో, రోజూ వెళ్లే పద్ధతి ప్రకారంగా, బాబా లెండీకి బయలుదేరుతూ 'కాషాయరంగు తీసుకుని రండి. కాషాయవస్త్రాలు ధరిస్తాను' అని చెప్పారు.109.అందరికీ అది ఓ చమత్కారమని అనిపించింది.బాబాకు అసలు కాషాయరంగు ఎందుకు, వారికీరోజు ఇదెందుకు గుర్తుకు వచ్చింది అని ఆలోచించసాగారు. 110.బాబా యొక్క నిగూఢ వచనాలు ఇట్లాగే ఉంటాయి.వానిని ఎవరైనా ఎలా తెలుసుకోగలరు?అయినా శ్రద్ధగా వింటే సరియైన

అర్థం స్ఫురిస్తుంది.111.సాధుసత్పురుషుల వాక్కు ఎప్పటికీ నిరర్థకంగా ఉండదు. ఎప్పుడూ అర్థభరితంగా ఉంటుంది.ఆవాక్కుకు ఎవరు విలువ కట్టగలరు?112.మనం నిత్యవ్యవహారంలో ముందుగా ఆలోచించుకుని తరువాత మాట్లాడతాం.కాని సత్పురుషులు తాము మొదట ఉచ్చరించిన వచనాలనే ఆచరిస్తారు.113.అందరూ అంగీకరించే ఈ సిద్ధాంతాన్ని బట్టి సత్పురుషుల వచనాలెప్పుడూ నిరర్థకంగా ఉండవు. బాగా ఆలోచిస్తే సరియైన సమయానికి చిక్కు వీడిపోతుంది.114.బాబా లెండీ నుండి తిరిగి వచ్చారు.సన్నాయి బూరలు మ్రోగసాగాయి. బాపూ సాహేబు జోగ్, ముళేకు సమయాన్ని సూచించాడు.115.'హారతి సమయమైంది. మసీదుకు వస్తారా అని అడిగాడు.ముళే శాస్త్రిమడిలో ఉన్నాడు.మసీదుకెలా వెడతాడు? అది అతని చిక్కుపరిస్థితి.116.మూడో ఝామున సాయంత్రం వెళ్లి దర్శనం చేసుకుంటానని సావధానం చెప్పాడు.అప్పుడు జోగ్ హారతికి సిద్ధమవుతున్నాడు.117.ఇక్కడ బాబా మాట్లాడుతూ వచ్చి తమ ఆసనంలో కూర్చున్నారు. అందరి పూజలూ అయాక హారతి మొదలైంది.118.ఇంతలో బాబా 'ఆక్రొత్త బ్రాహ్మణుని వద్దనుండి దక్షిణను తీసుకుని రండి' అని అనగా బాపూసాహేబుబుట్టీ తక్షణం దక్షిణను అడగటానికి తానే వెళ్లాడు.119.ముళే అప్పుడే స్నానం చేసి మడి బట్టలు కట్టుకుని ఆసనంలో ప్రశాంతంగా కూర్చున్నాడు.120.బాబా కబురు విని అతడు కలవరపడ్డాడు. నేను నిర్మలమైన అగ్నిహోత్రుణ్ణి. నేనెందుకు దక్షిణ నివ్వాలి?121.బాబా గొప్ప సత్పురుషులే కావచ్చు. నేను వారికి బద్దుడినా?నన్ను దక్షిణ అడగటం ఎందుకు?అని అతని మనసు వికలమైంది.122.సాయి వంటి వారు దక్షిణను అడగటం,కోటీశ్వరుడు ఆ కబురు తేవటం.ముళే తనలో సంశయించి దక్షిణను తీసుకుని.123.ప్రారంభించిన తన అనుష్ఠాన కర్మ పూర్తి కాకుండానే వదిలేసి మసీదుకు ఎలా వెళ్లటమా అని మరో

సందేహం. రానని అనలేదు.124. సంశయాత్మలకు నిశ్చయమంటూ ఉండదు. నిశ్చింతగా ఉండలేరు వారి చిత్త మెప్పుడూ డోలాయమానమవుతుంది. వారిది ఇటూ అటూ గాని త్రిశంకు స్థితి.125.ముళే బాగాఆలోచించుకుని వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. దక్షిణను తీసుకుని మసీదులోని సభామండపంలోకి వెళ్లి దూరంగా నిలుచున్నాడు.126.తను మడిలో ఉన్నాడు.అపవిత్రమైన మసీదులో బాబావద్దకు ఎలా వెళ్లాలి అని అనుకుని బద్దాంజలుడై దూరంగానిలిచి పూవులను విసిరాడు.127.ఇంతలో ఒక చమత్కారం జరిగింది.తన కళ్లెదుట, తమ ఆసనంలో ఉన్న బాబా అదృశ్యమై ఘోలప్ గురువర్యులు కనిపించారు.128.ఇతరులకు రోజూ కనిపించే సాయి సమర్థులు కనిపించగా,ముళే కళ్ళకు ఎప్పుడో బ్రహ్మీ భూతుడైన ఘోలప్‌నాథులు కనిపించారు;ముళే చాలా ఆశ్చర్యచకితుడయ్యాడు.129. సమాధి చెందిన గురువు కళ్లెదుట కనిపించే సరికి,ముళేకు ఆశ్చర్యం మరియు సందేహం కూడా కలిగాయి.130.అంతా కల అని అనుకుందామంటే తనేం నిద్రపోవడంలేదు. మరి తను మేలుకొని ఉండగా గురువు తన ఎదుట ఎలా ఉన్నారు? సంభ్రమాశ్చర్యాలతో క్షణం పాటు అతని నోటమాట రాలేదు.131.తనను తాను గిల్లుకున్నాడు.ఇది అబద్దం కాదు అని అనుకున్నాడు. అందరితో బాటు నేనిక్కడ ఉండగా నా మనసులో అనవసరమైన సందేహం ఎందుకు?132. మొదట ముళే ఘోలప్ భక్తుడు. బాబా విషయంలో ముందు సందేహించినా తరువాత నిర్మలమైన మనసుతో బాబాకు అంకితుడయ్యాడు.133.అతడు అగ్రవర్ణ బ్రాహ్మణుడు. వేద వేదాంగ శాస్త్ర సంపన్నుడు.మసీదులో ఘోలప్ దర్శనంతో చాలా ఆశ్చర్యపోయాడు.134.తరువాత పైకి వెళ్లి తన గురువు చరణాలకు ప్రణామం చేసి చేతులు జోడించి మౌనంగా నిలుచున్నాడు.135.సన్యాసివలె కాషాయవస్త్రాలు ధరించిన ఘోలప్ స్వామిని చూచి ముళే వెంటనేపరుగెత్తి వెళ్లి వారి చరణాలను కౌగలించుకున్నాడు.136.అతని ఉచ్చు

వర్ణాభిమానం తొలగిపోయింది. అతని కళ్లలో అంజనం వేసినట్లు నిరంజనుడైన తన గురువు కనిపించగానే అతనికి నిధి లభించినట్లు భావించాడు.137. చిత్తంలోని వికల్పాలు తొలగిపోయి బాబాపై ప్రీతి కలిగింది. అర్ధోన్మీలిత నేత్రాలతో సాయి పాదాలను తదేకంగా చూడసాగాడు.138. అనేక జన్మల పుణ్యం ఫలించి, సాయి పాదదర్శనమై వారి చరణ తీర్థస్నానంతో అతనికి దైవసాన్నిధ్యం లభించినట్లు అయింది.139. దూరం నుండి పూలు విసిరిన వ్యక్తి, బాబా పాదాలమీద శిరసు నుంచగా, అకస్మాత్తుగా ఏమిటీవింత అని భక్తులు ఆశ్చర్యపడ్డారు.140. అందఱూ బాబా హారతిని పాడుతుంటే ముళే ఘోలప్‌గారి నామాన్ని బిగ్గరగా చెప్పసాగాడు. ఉచ్ఛ స్వరంతో వారి హారతినే గానంచేస్తూ వారి ప్రేమలో విలీనమైపోయాడు.141. అతని మడి మాయమైపోయింది. అంటు ముట్టూ ఆలోచన తొలగిపోయి సాయికి సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆనందంతో అతను కళ్లు మూసుకున్నాడు.142. లేచి కళ్లు తెరచిచూస్తే ఘోలప్‌స్వామి అదృశ్యమై వారి స్థానంలో సాయిసమర్థులు దక్షిణను అడుగుతూ కనిపించారు.143. బాబా యొక్క అపారశక్తిని వారి ఆనందస్వరూపాన్ని చూచి, అతని చిత్తం స్తంభించిపోయింది. ముళే తనను తాను మరచిపోయాడు.144. సాయి మహారాజు కౌశలాన్ని గని అతనికి ఆకలిదప్పులు హరించుకునిపోయాయి. తన గురువుయొక్క దర్శన సుఖం ముళేకు పరమానందాన్ని కలిగించింది.145. అతని మనసు సంతృప్తి చెందింది. ఆనందాశ్రువులు కారగా బాబా చరణాలకు నమస్కరించాడు.146. తన వద్ద నున్న దానిని దక్షిణగా ఇచ్చి మరల బాబా చరణాలపై శిరసునుంచాడు. అతని కళ్ల వెంట ప్రేమాశ్రువులు దొర్లాయి. శరీరం రోమాంచితమైంది.147. కంఠం గద్గదమైంది. మనసులో అష్టభావాలు ఉప్పొంగాయి. నా సందేహం దూరమైంది. పైగా నా గురువు లభించారు అని అనుకున్నాడు.148. బాబా యొక్క అలౌకిక లీలను చూచి ముళేతో సహా అందరూ ఆశ్చర్యపడ్డారు. అప్పుడు

కాషాయరంగు అర్థం విశదమై బాబా మహిమ అనుభవమైంది.149.ఆ ముళ్ళే, ఆ సాయి మహారాజే.ఆ మహారాజు కళ ఎవరు తెలుసుకోగలరు ? వారిలీల అగాధం. 150.ఇలాగే సాయిదర్శనంలో శ్రద్ధగల ఒక మామలతుదారు స్నేహితుడైన ఒక డాక్టరుని వెంటబెట్టుకుని శిరిడీకి బయలుదేరాడు.151.ఆ డాక్టరు బ్రాహ్మణకులస్తుడు. రామోపాసకుడు. ఆచారవంతుడు స్నానసంధ్యలూ విహితాచరణ నియమనిష్ఠలందు ప్రీతికలవాడు. 152.'నా ఆరాధ్యదైవం జానకీ ప్రాణవల్లభుడు. సాయిబాబా ముసల్మాను కనుక నేను వారికి నమస్కరించను' అని స్నేహితునికి ముందుగానే చెప్పాడు.153.'ముసల్మాను పాదాలకు వందనం చేయటానికి నా మనసు అంగీకరించదు. అందుచేత శిరిడీకి వెళ్లటానికి నేను మొదటినుండి వెనుకాడుతున్నాను.' అని అన్నాడు. 154.బాబా పాదాలపై పడు అని నిన్నెవరూ బలవంత పెట్టరు ఇటువంటి ఆలోచనలను పట్టుదలను పెట్టుకోకు.మనసును బాగా దృఢ పరుచుకో. 155.నాకు నమస్కారం చేయి అని బాబాఎప్పుడూ అనరు అని మామలతదారు బాగా నచ్చచెప్పగా, అతడు సరేనని వెళ్ళటానికి ఒప్పుకున్నాడు. 156.తనమిత్రుని మాటలు విని, అనుమానాలను దూరం చేసుకుని, మనసులో నిశ్చయించుకుని సాయి దర్శనానికి బయలుదేరాడు. 157.అయితే శిరిడీలో బాబా దర్శనార్థం మసీదుకు వెళ్లగానే ఆశ్చర్యకరంగా అతనే ముందుగా సాయికి సాష్టాంగ ప్రణామంచేశాడు.అది చూచి అతని స్నేహితుడు చాలా ఆశ్చర్యపోయాడు. 158.'ముసల్మానుకు నాకంటే ముందుగానే ఎలా సాష్టాంగపడ్డావు?వారికి నమస్కరించనన్న నీ నిశ్చయాన్ని మరచిపోయావా' అని అడిగాడు. 159.అందుకు అతడు 'నేను మేఘశ్యాముడైన రాముని రూపాన్ని చూచాను. పావనుడు కోమలుడు అందంగా శోభిస్తున్న రామునికి వందనం చేశాను. 160.చూడు! అక్కడ కూర్చుని అందఱితో మాట్లాడుతున్నది ఆరాముడే' అని అంటూ ఉండగా క్షణంలో సాయి రూపం కనిపించింది.

161.అప్పుడు ఆ డాక్టరు ఆశ్చర్యంగా'ఇది స్వప్నం కాదు కదా. వీరు ముసల్మాను కాదు. యోగ సంపన్నులైన అవతారపురుషులు. 162.చోఖామేళా మాల జాతివాడు. రోహిదాసు మాదిగ వాడు. సజ్జన కసాయి హింస చేసేవాడు. వీరి జాతిని గుఱించి ఎందుకు ఆలోచించాలి?163.వీరు కేవలం జగత్తును ఉద్ధరించటానికి జీవులను జననమరణాల చక్రం నుండి తప్పించటానికి నిర్గుణ నిరాకారం నుండి సాకార రూపంతో ప్రపంచానికి వచ్చారు.164.క్షణంలో సాయి, క్షణంలో రామునిలా కనిపించినట్టి వీరు ప్రత్యక్ష కల్పద్రుమం. నాతో సాష్టాంగ ప్రణామాన్ని చేయించి నా అహంభావాన్ని అణచి వేశారు' అని అనుకున్నాడు.165.మరునాడు 'సాయినాథులు నన్ను కరుణిస్తే తప్ప,నేను మసీదులో అడుగు పెట్టను' అని దీక్ష బూని శిరిడీలో ఉపవాసంతో ఉన్నాడు.166. అలా మూడు రోజులు గడిచాయి.నాలుగవరోజున ఏం జరిగిందో శ్రద్ధగా వినండి.167. ఖాందేశవాస్తవ్యుడైన డాక్టరు స్నేహితుడు ఒకడు,సాయి దర్శనానికి అక్కడికి వచ్చాడు.168.అతనిని తొమ్మిది సంవత్సరాలకు కలుసుకున్నందుకు డాక్టరుకు పరమానందం కలిగింది. అతనితో తనూ మసీదుకు వెళ్లాడు.169.వెళ్తూ బాబాకు వందనం చేశాడు. బాబా 'ఏం డాక్టర్! నిన్ను పిలవటానికి ఎవరైనా వచ్చారా? ఎందుకు వచ్చావో నాకు జవాబు చెప్పు' అని ప్రశ్నించారు.170.నిగూఢమైన ఆ ప్రశ్నవిని డాక్టరు కరిగిపోయాడు. తన నిర్ణయం స్మరణకు వచ్చింది. మనసులో చాలా బాధపడ్డాడు.171.అయినా ఆరోజు అర్ధరాత్రప్పుడు అతనిపై బాబా కృప కలగగా నిద్రలో పరమానంద స్థితి యొక్క మాధుర్యాన్ని చవిచూచాడు.172.తన స్వగ్రామానికి వెళ్లిపోయిన తరువాత కూడా, అతడు పదిహేను రోజులు సంపూర్ణానంద స్థితిని అనుభవించాడు.అలా అతనికి సాయిపాదాల యందు భక్తి అధికమైంది.173.ఇట్లే సాయి లీలల యొక్క అనుభవాలు అసంఖ్యాకం. ఒకదాననిమించినది మరొకటి . చెప్పుకుంటూపోతే గ్రంథ

గౌరవం పెరుగుతుంది కాని గ్రంథం విస్తారమవుతుందన్న భీతితో తగ్గిస్తున్నాను.174. మొదట ప్రారంభించిన ముళేకథను వింటే శ్రోతలకు ఆశ్చర్యం కలుగుతుంది.కాని అందులోని తాత్పర్యాన్ని, బోధించిన నీతిని అర్థం చేసుకోవాలి. 175.తమ తమ గురువులయందు దృఢ విశ్వాసముంచాలి కాని వేరెక్కడా ఉంచకూడదు అని మనసులో బాగా నిశ్చయించుకోవాలి.ఇది రహస్యం.176.బాబా యొక్క ఈ లీలలో ఇంతకంటే వేరే కారణం కనిపించదు. ఎంతటి గొప్ప ఆలోచనా పరులకైనా ఇదే అర్థం స్ఫురిస్తుంది.177.ఎవరికి ఎంత కీర్తి ఉన్నా,తమ గురువులకు ఏ కీర్తి లేకపోయినా, తమ గురువులయందే విశ్వాసముంచాలి అనే దీనిలోని ఉపదేశం.178.పురాణాలు పుస్తకాలు వెదికినా అంతటా ఈ బోధయే నిండి ఉంది. కాని ఇది అనుభవంలోకి వస్తే తప్ప నిష్ఠ కుదరదు.179. తమపై తమకు నమ్మకం లేని కొందఱు ఆత్మ నిష్ఠులవలె ఊరేగుతారు; కాని వారు జన్మలో పడే బాధలు అడుగడుగునా స్పష్టంగా కనిపిస్తాయి. 180.వారికి ఇహంలేదు పరంలేదు. జీవితాంతం ఎప్పుడూ ఏదో చింత. మనసుకు ఒక్కక్షణమైనా శాంతి ఉండక పోయినా ముక్తులవలె గొప్పలు చెప్పుకుంటారు.181.తరువాతి అధ్యాయం ఇంతకంటె మధురంగా హృదయంగమంగా ఉంటుంది.కేవలం సాయిదర్శనంలోని ఆనందాన్ని అనుభవించండి.182.భీమాజీ పటేలు అనేభక్తుని క్షయరోగాన్ని బాబా ఎలా తొలగించారు మరియు భక్త చాందోర్కరుని విశ్వాసాన్ని దృఢం చేసిన విషయం.183.బాబా కేవలం దర్శనంతో భక్తులను పాపరహితులను చేసి, వారి ఐహిక కోరికలను తీర్చుతూ ఆధ్యాత్మిక అవసరాలను కూడా ప్రసాదిస్తారు.184.యోగుల దృష్టిపాతంతో నాస్తికుల పాపాలు కూడా తొలగినప్పుడు, ఇక ఆస్తికుల పాపాలు సహజంగానే పోతాయి.185.పరతత్వంలో బుద్ధి స్థిరపడి అపరోక్షానుభవం కలిగినవారి దృష్టిపడగానే,దుస్తరపాపాలనుండి తరింపబడతారు.186.ఇటువంటి బాబా యొక్క కథ అర్థం కాదు.

బాబా మీపట్ల ప్రేమ కలిగి ఉన్నారని తెలుసుకుని, జ్ఞానులు అజ్ఞానులు అందఱూ పరిశుద్ధమైన మనసుతో పవిత్రంగా శ్రవణం చేయండి.187. భక్తి ప్రేమలందు శ్రద్ధ ఎక్కడ ఉంటుందో, ఎక్కడ బాబాయందుమనసులో ప్రీతి ఉంటుందో అక్కడే నిజమైన తపన అక్కడేశ్రవణానందం ఉంటాయి.188. అనన్యంగా శరణుజొచ్చిన వారికి వజ్రపంజరమై, అపారమైన శక్తి కలిగి భవభయాన్ని హరింపచేయగల సాయి చరణాలకు హేమాడ్ నమస్కరిస్తున్నాడు.189. స్వస్తి శ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో శ్రీ సంతఘోలప్ గురువు మరియు శ్రీరాముని దర్శనం అను పన్నెండవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీసద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 13 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

బాబా వచనాలు అతి చిన్నవిగా, సూత్రాలవలె,సంగ్రహంగా ఉన్నా,అవి అర్థగాంభీర్యంతో గహనంగాను సమగ్రంగాను ఉండేవి.1.తత్వంలోని అర్థం, లోతుగా గూఢంగా ఉండేది.వారి మాటలు ఎప్పుడూ నిరర్థకం కావు. అవి అమూల్యంగాను సమతుల్యంగాను ఉండేవి.2.ఇక పూర్వాపరాల అనుసంధానంలో ఉండండి. లభించినదానిని అనుసరించి ప్రవర్తించండి. ఎప్పుడు తృప్తిగా ఉండండి. లేనిదానికై చింతపడకండి.3.'నేను ఇల్లువాకిలి లేని ఫకీరును.ఏ బాధలూ లేకుండా ఒకచోట స్థిరంగా కూర్చున్నాను.4.అయినా తప్పించుకోలేని ఈ మాయ నన్ను కూడా తరచు వేధిస్తుంది. నేను మరచిపోయినా అది నన్ను మరచిపోకుండా నిరంతరం పెనవేసుకుని ఉంది.5.అది హరి యొక్క ఆదిమాయ. బ్రహ్మాదులను కూడా ఎగరగొట్టేస్తుంది.దుర్బల ఫకీరుణ్ణి; దాని ముందు నేను ఏపాటివాడను?6.హరి ప్రసన్నుడైనప్పుడే అది విచ్చిన్నమౌతుంది. అఖండ హరి భజన లేకుండా మాయా నిరసనం కాదు'7.అని బాబా మాయ యొక్క మహిమను భక్తులకు చెప్పిదాని నుండి నివృత్తి పొందటానికి భజన పద్ధతిని తెలియచేశారు.8.'సత్పురుషులు నా సచేతనమూర్తులు'అని కృష్ణపరమాత్మ స్వయంగా ఉద్ధవునితో భాగవతంలో స్పష్టంగా చెప్పారు.ఇది తెలియని వారెవరు?9.దయాఘనులైన సాయిసమర్థులు, భక్తుల శ్రేయస్సు కోసం తెలిపిన సత్యాలను అతి వినయంగా వినండి.10.'పాపాలు తొలగిపోయి పుణ్యాత్ములైన వారేనన్ను భజించి

నన్ను తెలుసుకుంటారు.11.ఎల్లప్పుడూ 'సాయీ సాయీ' యని స్మరించేవారిని సప్తసముద్రాల అవతల ఉన్నా రక్షిస్తాను. ఈ నామాటల యందు విశ్వాసముంచితే తప్పక మేలు కలుగుతుంది.12.నాకు పూజాసామగ్రి గాని, అష్టోపచార షోడశోపచార పూజలుగాని అవసరం లేదు.అపరిమితమైన భక్తి ఉన్నచోటే నా నివాసం'13.అని భక్తవత్సలుడైన బాబా అనేకసార్లు చెప్పారు. ఇప్పుడు వారి ప్రేమ వచనాలను స్మరించుకుంటే మనసుకు ఉపశమనం.14. ఇలాంటి దయాళువు శరణాగతులను సంరక్షించే సాయిసఖులు, భక్తుల సేవలను స్వీకరించి వారిపై చూపించిన విశేషాన్ని గ్రహించండి.15.చిత్తచాంచల్యం లేకుండా ఏకాగ్ర మనసుతో ఈ నూతన కథను సమగ్రంగా వింటే మీరు కృతకృత్యులౌతారు.16.సాయి నోటి నుండి వెలువడిన అమృత వృష్టియే మనకు పుష్టి తుష్టి. కనుక తమ హితాన్ని కోరుకునేవారు శిరిడీలోని కష్టాలకు విసుగు చెందరు.17.గతాధ్యాయంలో బాబా ఒక అగ్ని హోత్రునికి బ్రహ్మీభూతుడైన అతని గురువు యొక్క దర్శనాన్ని కలిగించి,అతనికి ఆనందాన్ని కలిగించారు.18.ఇప్పుడు ఈ అధ్యాయం అంతకంటే మధురమైనది. క్షయరోగంతో బక్కచిక్కి ఎండిపోయిన, ఒక భక్తుని, బాబా స్వప్నంలో శిక్షించి అతనికి ఆరోగ్యాన్ని ప్రసాదించారు.19.కల్మషదహనకారకమైన సాయినాథుని అద్భుత చరిత్రను భక్తులు సావధానంగా వినండి.20.ఇహపరాలకు సాధనమై పుణ్యపావనమైన ఈ చరిత్ర గంగా జలంవలె పవిత్రమైనది, దీనిని వినేవారి చెవులు ధన్యం.21.దీనిని అమృతంతో పోల్చుదామంటే అమృతం ఇంతకంటె మధురంగా ఉంటుందా? అమృతం ప్రాణాన్ని రక్షిస్తుంది.ఈ చరిత్ర జన్మరాహిత్యాన్ని ఇస్తుంది.22.మేము శక్తిగలవారం తలచుకున్నదేదైనా చేసేయగలం అని అనుకునేవారు ఈ కథనువినాలి.23.నిజంగా జీవులు స్వతంత్రులే అయితే మరి అహోరాత్రాలు సుఖాలకై శ్రమిస్తున్నా, దుఃఖం మాత్రమే కలుగుతుంది.ఎందుకు? ఇది విధి విలాసం.24. దుఃఖాన్ని

తప్పించుకోవటానికి అడుగడుగునా అనుక్షణమూ అప్రమత్తంగా ఉన్నా, దుఃఖం అతి శ్రద్ధగా మనలను వెదికి వెంటాడుతుంది.25.తప్పించుకోబోతే మెడకు చుట్టుకుంటుంది. తీసి పారవేయాలనుకుంటే అధికంగా పెనవేసుకుంటుంది. దానితో జీవులు అహర్నిశలూ పోరాడటం వ్యర్థ ప్రయత్నం.26.వాస్తవంగా జీవులు స్వతంత్రులే అయితే, సుఖాలన్నీ వారి అధీనంలో ఉంటూ, దుఃఖం లవలేశమైనా వారిని అంటుకుండా ఉండాలి కదా!27. స్వతంత్రబుద్ధితో ఎప్పుడూ పాపాలు చేయకుండా పుణ్యాలనే సమృద్ధిగా సంపాదించుకుని బాగా సుఖాలనే పొందాలి కదా.28.కాని జీవుడు స్వతంత్రుడు కాడు. కర్మతంత్రం అతని వెంటనే ఉంటుంది. దాని లీల విచిత్రం .జీవులు కర్మ చేతిలో కీలు బొమ్మలు.29.పుణ్యకర్మలను చేయాలనే ఉద్దేశమున్నా పాదాలు పాపం వైపుకు లాక్కెళ్లుతాయి. ఏ సత్కర్మలు చేయాలి అని వెతుక్కుంటుంటే దుష్కర్మలు ఎదురౌతాయి.30.పూణె జిల్లాలోని జున్నార్ తాలూకాలో, నారాయణ గాం అనే ఊరి పటేలు భీమాజి. ఇప్పుడు అమృతరసం వంటి అతని కథను వినండి.31.భీమాజి ఇల్లు సకల సుఖాలతో సంపదలతో ఉండేది. అతడు వచ్చేపోయే వారికి భోజనం పెట్టేవాడు. ఎన్నడూ ఏ బాధాలేక, ఎల్లప్పుడూ ప్రసన్న మనసుతో ఉండేవాడు.32.విధియొక్క విలక్షణమైన సంయోగం. మేలుగాని కీడుగాని మనకు తెలియకుండానే జరుగుతాయి. కర్మయొక్క పర్యవసానంగా లేని రోగాలు పుట్టుకువస్తాయి.33.క్రీ.శ. 1909 వ సంవత్సరం, దురదృష్టం భీమాజీని పీడించటంతో, కఫక్షయరోగోద్భవం వలన జ్వరం కూడా పుట్టుకొచ్చింది.34. భరించలేనంత దగ్గుతో జ్వరం కూడా అధికమవసాగింది.రోజు రోజుకూ బాధ ఎక్కువ కాగా భీమాజి నిరాశ చెందాడు.35.నోటినుండి ఎప్పుడూ కఫం. రక్తం గడ్డలు పడటం ఎక్కువ కాసాగింది. కడుపులో నొప్పి. ఆ బాధకు ప్రాణం గిలగిలాడేది.36.అలా భీమాజీ బాధతో పక్కను అంటుకు పోయాడు. శరీరం చిక్కి ఎండిపోసాగింది.

ఎన్నెన్నో ఉపాయాలు చికిత్సలూ అయ్యాయి. అతనికి అత్యంత విరక్తి కలిగింది. 37. అన్నపానీయాలేవీ రుచించేవి కాదు. పథ్యమాహారం కూడా జీర్ణమయ్యేది కాదు. అటువంటి అస్వస్థత కారణంగా ఏమీ తోచక అతని పరిస్థితి సహించలేనిదిగా తయారైంది. 38. దేవీ దేవతలకు పూజోపచారాలు జరిగాయి. వైద్యులు డాక్టర్లు చేతులు వ్రేలాడేశారు. బ్రతుకుతానన్న ఆశపై నీళ్లు వదులుకుని భీమాజీ దుఃఖంలో మునిగి పోయాడు. 39. ఇక బ్రతికేది కొద్దిరోజులేనని పటేలు మనసులో బాధపడసాగాడు; బాగా క్షీణించిపోయి విసుగుతో రోజులు గడిపేవాడు. 40. తను ఆరాధించే కులదేవత తనకు ఆరోగ్యాన్నివ్వలేదు. జోతిష్యులను భూతవైద్యులను సంప్రదించి విసిగిపోయాడు. 41. ఒకరు ఇది శరీరానికి సంబంధమైన వ్యాధి అని అన్నారు. దైవఘటన వలన కలిగిన పూర్వకర్మ ఫలితం కనుక మానవయత్నం ఉపయోగపడదని కొందలు అన్నారు. 42. డాక్టర్లు అయ్యారు. హకీములయ్యారు. అనేకులు చికిత్సలు చేసిచేసి అలసిపోయారు. ఎవరిదీ ఏదీ ఉపయోగపడలేదు. అందటి ప్రయత్నాలు విఫలమయ్యాయి. 43. పటేలు బాగా నిరాశ చెందాడు. దేవా! నేనెలాంటి పాపం చేశాను? ఏదీ ఉపయోగపడటంలేదు అని అనుకునేవాడు. 44. దైవం ఎంత విచిత్రం. సుఖాలను అనుభవించేటప్పుడు ఒక క్షణమైనా తన స్మరణను కలుగనివ్వడు. అతని లీల ఆశ్చర్యకరం. 45. తనకు ఇష్టం వచ్చినప్పుడు నానా కష్టపరంపరలను పంపి నారాయణా పరుగునరా అని తన స్మరణ చేయించుకుంటాడు. 46. పటేలు తపించిపోతూ చేసిన ఆర్తనాదాన్ని విన్న దేవుడు వెంటనే కరిగిపోయాడు. భీమాజీకి, నానాసాహేబుకు ఉత్తరం వ్రాయాలని బుద్ధి పుట్టింది. 47. ఇతరులెవరూ చేయలేని దానిని నానా ఎలాగైనా చేయగలడని అతనికి పూర్తి విశ్వాసం. 48. అదే శుభశకునమై రోగోపశమనానికి కారణమైంది. తరువాత అతడు నానాకు సవిస్తరంగా ఉత్తరాన్ని వ్రాసి పంపాడు. 49. నానా సాహేబు స్మరణ కలగటం సాయినాథుని ప్రేరణే. అదే రోగనివారణకు

కారణభూతమైంది. సత్పురుషుల లీలలు ఆలోచనకు అంతుపట్టవు.50.కాలచక్ర రచనావిధానంలో కూడా దైవం యొక్క ఉద్దేశమే కనిపిస్తుంది.అందువ లన అన్యథా ఆలోచించి వ్యర్థమైన గొప్పతనాన్ని ఆపాదించుకోకూడదు.51.మంచి చెడు క్రియల నన్నిటినీ నడిపించే సూత్రధారి ఈశ్వరుడు.తరింప చేసినా మరణింపచేసినా కార్యకర్త అతడొక్కడే.52.పటేలు నానా చందోర్కరుకు సవిస్తరంగా ఇలా ఉత్తరం వ్రాశాడు. 'మందులు తినితిని విసుగెత్తి నాకు జీవితంపై విరక్తి కలిగింది. ప్రపంచమంతా దుఃఖమయంగా అనిపిస్తూ ఉంది.53. డాక్టర్లు వ్యాధి నివారణ సాధ్యం కాదని నా ప్రాణాలపై ఆశ వదిలేశారు. వెద్యులకు హకీములకు ఏం అర్థం కాకుండా ఉంది. నాక్కూడా నమ్మకం పోయింది.54.అయినా మీ చరణాల పద్మ నాదొకమనవి. మిమ్మల్ని కలుసుకోవాలని నాకు కోరికగా ఉంది'.55.నానాచందోర్కరు ఉత్తరాన్ని చదివాడు. భీమాజీ ఎంతో మంచివాడవటం వలన నానా బాధపడ్డాడు. అతని మనసు కరిగిపోయింది.56.ఒక నివారణోపాయాన్ని తెలుపుతూ జవాబు వ్రాశాడు. 'వెంటనే వెళ్ళి సాయిబాబా పాదాలు పట్టుకో. ఇదొక్కటే తరుణోపాయం. మనకు తల్లి తండ్రి వారొక్కరే.57. మనకేకాదు. అందఱికీ వారే కరుణామయిఅయిన తల్లి. పిలవగానే పరుగిడి వచ్చి కరుణతో చేయినందుకుంటారు. బిడ్డల అవసరాలు వారికి బాగా తెలుసు.58.క్షయరోగమే కాదు వారి దర్శనంతో మహారోగం కూడా పోతుంది. ఏ మాత్రం సందేహం పెట్టుకోక వెళ్లివారి పాదాలను గట్టిగా పట్టుకో.59.ఎవరు ఏది కోరితే అది ఇస్తానని వారు ప్రతిజ్ఞ పూనారు. అందుకే త్వరగా వెళ్లివారిని దర్శించు కొమ్మని చెబుతున్నాను.60.భయాలన్నిటిలో పెద్దదైన మరణ భయంకంటే వేరొకటి ఉంటుందా? వెళ్లు,సాయి చరణాలను గట్టిగా పట్టుకో. వారొక్కరే నిన్ను నిర్భయుణ్ణి చేయగలరు.'61.పటేలు పరిస్థితి భరించలేనిబాధతో ప్రాణాంతకమైంది.ఎప్పుడెప్పుడు సాయినాథుని

కలుసుకుంటానా. ఎప్పుడు కార్యంసాధించుకుంటానా. 62. అని పటేలు తహతహలాడాడు. త్వరత్వరగా సామాను సర్దుకుని ఆమరునాడే శిరిడీ ప్రయాణ మవ్వాలని అనుకున్నాడు. 63. ఆ విధంగా దృఢ నిశ్చయంతో అందఱివద్దా సెలవు తీసుకుని పటేలు సాయిమహారాజు దర్శనానికి శిరిడీ బయలుదేఱాడు. 64. ఎంత త్వరగా శిరిడీ చేరుకుంటానా అని తన వారితో కలసి ఉత్సాహంగా బయలుదేఱాడు. 65. అతని బండి మసీదు ప్రక్కన ముందు ద్వారం వద్దకు వచ్చింది. భీమాజీని నలుగురు మోసుకుని పైకి తీసుకువచ్చారు 66. నానాసాహేబు వారివెంట ఉన్నాడు. మాధవరావు కూడా అక్కడికి వచ్చాడు. అతని ద్వారా బాబాను కలుసుకోవటం అందఱికీ సులభం. 67. పటేలును చూచి బాబా 'శ్యామా! ఈ దొంగను ఎక్కడినుండి తీసుకువచ్చి నా మీద పడ వేశారు. ఇదేమైనా మంచి పనేనా! అని అన్నారు. 68. భీమాజీ సాయి పాదాలయందు శిరసునుంచి 'సాయినాథా! నేను అనాథను. నన్ను కరుణించండి. దీననాథా! నన్ను రక్షించండి' అని వేడుకున్నాడు. 69. పటేలు యొక్క బాధను చూచిన సాయినాథునికి దయ కలగింది. అంతే, తన బాధ తక్షణం ఉపశమనమౌతుందని పటేలుకు విశ్వాసమేర్పడింది. 70. భీమాజీ యొక్క అస్వస్థతను గమనించి, దయాసాగరులైన సాయి సమర్థులు అమితంగా కరిగిపోయారు. మందహాస వదనంతో, 71. 'కూర్చో. ఏం బాధపడకు. బుద్ధిమంతులు కలవరపడరు. శిరిడీలో అడుగుపెట్టగానే నీవు అనుభవించాల్సిన కర్మ అంతమైంది. 72. కంఠం వరకూ కష్టాలలో మునిగి ఉన్నా, మహామహా బాధల గోతులలో పాతుకుపోయినా, ఈ మసీదు మాత మెట్లు ఎక్కిన వారు, సుఖాన్ని అధిరోహించినట్లే అని గ్రహించు. 73. ఇక్కడి ఫకీరు చాలా దయాళువు. నీవ్యథను నిర్మూలించి ప్రేమతో సంరక్షిస్తారు. వారు అందఱి పట్లా కారుణ్యమూర్తి. 74. అందువలన నీవు నిశ్చింతగా భీమా బాయి ఇంట్లో ఉండు. ఒకటి రెండు రోజులలో నీకు స్వస్థత చేకురుతుంది. ఇకవెళ్లు' అనిచెప్పారు. 75. దైవయోగం

వలన అమృత సించనం ద్వారా ఒక ఆయుహీనునకు పునర్జన్మ కలిగినట్లు పటేలుకు తృప్తి కలిగింది. 76.మరణోన్ముఖునకు అమృతపానం లభించినట్లు, తృషార్తునకు మంచినీరు దొరికి నట్లు, సాయి నోటి నుండి వెడలిన వచనాలు పటేలుమనసుకు శాంతిని కలిగించాయి.77. ప్రతి అయిదు నిమిషాలకు అతని నోటినుండి రక్తపు గడ్డలు పడేవి. కాని బాబా ఎదుట ఒక గంటసేపు కూర్చున్నా ఏం కాలేదు.78. బాబా అతని జబ్బును పరీక్ష చేయలేదు. ఏ కారణంగా ఆ రోగం పుట్టుకు వచ్చింది అని ప్రశ్నించనూ లేదు. కేవలంవారి కృపాదృష్టితో రోగం వెంటనే తొలగిపోయింది. 79.వారి కరుణా కటాక్షం ఉంటే చాలు, ఎండిపోయిన మ్రోడుకూడా చిగురిస్తుంది. వసంత ఋతువు కాకున్నా పూలు వికసించి రమణీయమైన ఫలాలనిస్తాయి.80.రోగంగాని ఆరోగ్యంగాని పుణ్య పాపాలు నశించిపోవాలి. ఎవరి కర్మను వారు అనుభవించడం తప్ప అన్యోపాయం లేదు.81.కర్మను అనుభవించటం మాత్రమే రోగం నశించటానికి మార్గం. జన్మజన్మల లోనూ ఇదే తప్పక జరుగుతుంది.కర్మను అనుభవించటం తప్ప రోగాన్ని తొలిగించే మరో ఉపాయంలేదు.82.అయినప్పటికీ సత్పురుషుల దర్శనం వ్యాధి ఉపశమనానికి ఒక కారణం. దానితో వ్యాధిగ్రస్తులు దుఃఖపడకుండా వ్యాధి యొక్క బాధను సహించగలరు.83.వ్యాధి దారుణమైన బాధను కలిగిస్తుంది. కాని సత్పురుషులు తమ కరుణాకటాక్షంతో కర్మానుభవ బాధలను సులువుగా నివారిస్తారు. 84.అందువలన బాబా వచనాలే ప్రమాణం.అవి రామబాణం వంటి ఔషధం. ఒకసారి నల్లకుక్కకు పెరుగన్నం తినిపించగా చలిజ్వరం నివారణమైంది.85.కథలో మరొక అడ్డుకథ అని అనిపిస్తుంది. కాని దీని సారాంశాన్ని శ్రవణం చేస్తే ఆ కథ ఇక్కడ ఉచితమని అనిపిస్తుంది. దీనిని నా స్మరణకు తెచ్చింది సాయియే.86.నా కథనునేనే రచిస్తానని వారు చెప్పినట్లే ఇప్పుడు వారే నాకు ఈ కథను గుర్తు చేశారు.87.బాలా గణపతి అనే గొప్ప భావికుడైన

దర్జీ జాతి వాడుండేవాడు. అతడు మసీదులోనికి బాబా వద్దకు అతి దీనంగా వచ్చాడు.88.'బాబా నేనేం పాపం చేశానోనన్ను ఈ చలిజ్వరం విడిచి పెట్టటంలేదు. ఎన్నో చికిత్సలు చేసినా ఇదినా శరీరాన్ని విడవటంలేదు. 89.నేనేం చేయను? ఔషధాలు కషాయాలు అన్నీ అయ్యాయి.ఈ జ్వరం పోయే ఉపాయాన్ని మీరైనా చెప్పండి'అని ప్రాధేయ పడ్డాడు.90.అప్పుడు బాబాకు దయకలిగి, ఆ చలిజ్వరానికి ఒక ఉపాయాన్ని చెప్పారు.ఆ వింత కథను వినండి. 91.'లక్ష్మీదేవాలయం వద్ద నల్లకుక్కకు పెరుగన్నం పెట్టు, వెంటనే బాగైపోతావని చెప్పారు.92.బాలా భయపడుతూ భయపడుతూ ఇంటికి వెళ్లి చూడగా మూత పెట్టి ఉంచిన అన్నం కనిపించింది.ప్రక్కనే పెరుగుకూడా దొరికింది. 93.పెరుగన్నం సిద్ధంగా ఉంది.కాని ఈ సమయాన దేవాలయం వద్ద నల్లకుక్క ఉంటుందా అని బాలా అనుకున్నాడు. 94.కాని అతడు అనవసరంగా చింతపడ్డాడు.బాబా చెప్పిన చోటికి చేరుకునే సరికి ఒక నల్లకుక్క తోక ఆడించుకుంటూ తన దగ్గరకు రావటం చూచాడు.95.అలా అంతాకలసిరాగా బాలా చాలా ఆనందించాడు. కుక్కకు పెరుగన్నం పెట్టి ఆ విషయాన్ని బాబాకు తెలియ చేశాడు.96.సారాంశం, ఇలా జరిగినదాన్ని ఎవరు ఏమనుకున్నా, బాలాకు చలిజ్వరం తగ్గి స్వస్థత చేకూరింది.97.ఇలాగే బాపుసాహేబ్ బుట్టికి కడుపులో శీతలం కలిగింది. దానితో వెంటవెంటనే విరేచనాలు, ఘడియఘడియకు వాంతులపైన వాంతులు ఎడతెగకుండా రాసాగాయి.98. అన్నిరకాల ఔషధాలతో అలమారా నిండిపోయింది.కాని ఏ ఒక్కటీ పనిచేయలేదు. ఆ చింతతో అదే ఆలోచనతో బాపూసాహేబు చాలా కలవరపడ్డాడు.99.వాంతులు విరేచనాలు ఆగకుండా ఎడతెరపి లేకుండా అవటంవలన అతడు బాగా నీరసించిపోయాడు.అలవాటు ప్రకారం రోజూ బాబా దర్శనానికి వెళ్లటానికి అతనికి శక్తి లేకపోయింది.100.ఈ వార్త బాబా చెవికిసోకింది.బుట్టీని రప్పించి తమ ఎదుట కూర్చోబెట్టుకున్నారు.'ఖబర్దార్! ఇకనుండి మలవిసర్జనానికి

వెళ్లకూడదు.101.ఇక వాంతులు కూడా ఆగిపోవాల్సిందే! అని అన్నారు. చూపుడు వ్రేలుతో అతన్ని ఉద్దేశించి మరలా అట్లాగే అన్నారు.102.తాత్పర్యం, వారి వచనాల దెబ్బ ఎలాటిదో గాని,రెండు వ్యాధులూ పారిపోయి బుట్టీ ఆరోగ్యం బాగుపడింది.103.ఒకసారి ఊళ్లో కలరా వ్యాధి వచ్చింది.ఆ ఉపద్రవంలో బుట్టీకి ఎడతెరపిలేని వాంతులు విరేచనాలు.దప్పికతో అతని ప్రాణం విలవిల లాడింది.104.అతని దగ్గరే ఉన్న డాక్టరు పిల్లే అన్ని ప్రయత్నాలు చేశాడు. కాని అవేవీ ఫలించలేదు. చివరకు బాబా వద్దకు వెళ్లాడు.105.విషయాన్ని వారికి వివరించాడు. అతనికి కాఫీ ఇమ్మంటారా లేక మంచినీరే మంచిదా అని పిల్లే బాబాను అడిగాడు.106.అప్పుడు బాబా 'పాలలో బాదాం అక్రోట్‌పిస్తా వేసి ఆ ఖీరును అతనికి త్రాగటానికి ఇవ్వండి.107.దానివలన అతని దప్పిక తీరుతుంది.వ్యాధి త్వరగా నివారణమవుతుంది' అని చెప్పారు.అలాంటి జావను త్రాగించగా బుట్టీకి కలిగిన ఉపద్రవం తొలగిపోయింది.108.అక్రోట్‌పిస్తా బాదాములతో కలరావ్యాధి తగ్గుతుందా? బాబా వచనాలయందు విశ్వాసమే మూలకారణం. అక్కడ సందేహానికి తావులేదు.109.ఒకసారి ఆళంది నుండి ఒక స్వామి సాయిసమర్థుని దర్శనానికి శిరిడీ గ్రామానికి వచ్చి సాయి నివాసానికి చేరాడు.110.అతనికి చెవిపోటు.ఆ అనారోగ్యం కారణంగా నిద్రాభంగమయ్యేది.శస్త్ర చికిత్స చేయించుకున్నా ఏ కాస్తైనా ప్రయోజనం కలగలేదు.111.భరించలేని చెవిపోటు వచ్చింది. నివారణోపాయాలు పనికిరాలేదు. అక్కడినుండి బయల్దేరి వెళ్లాలని తలచి,సాయి ఆశీర్వాదం కొఱకు వెళ్లాడు.112.వారి పాదాలకు అభివందనం చేసి,బాబా విభూతి ప్రసాదాన్ని తీసుకుని, మీ కృప ఎప్పుడూ ఉండాలి అని స్వామి సాయి ఆశీస్సులను కోరాడు.113.ఆ స్వామి యొక్క చెవిపోటు గురించి మాధవరావు దేశపాండే బాబాతో మనవి చేశాడు. 'అల్లా అచ్చాకరేగా' అల్లామంచి చేస్తాడు అని మహారాజు ధైర్యాన్నిచ్చారు114.అలా

సాయి ఆశీస్సులను అందుకుని స్వామి పుణే పట్టణం వెళ్లాడు. వారం రోజులకల్లా అతని చెవిపోటు తగ్గి పోయిందని ఉత్తరం వ్రాశాడు.115. వాపు తగ్గనందువలన మరల శస్త్రచికిత్స చేయించుకోవాలని తిరిగి ముంబైకి వెళ్లాడు.116. మరలా అదే డాక్టరు చెవిని పరీక్షించగా వాపు ఎక్కడా కనిపించలేదు.117. ఇక శస్త్రచికిత్స అవసరంలేదని డాక్టరు చెప్పాడు. దానితో స్వామి యొక్క చింత తొలగిపోయింది. అందరికీ ఆశ్చర్యం కలిగింది.118. ఇలాంటిదే మరో కథ ప్రసంగవశాత్తు గుర్తుకు వచ్చింది. దానిని చెప్పి ఈ అధ్యాయాన్ని త్వరగా ముగిస్తాను.119. మసీదు యొక్క సభామండపంలో, నేలపని ఆరంభించడానికి ఎనిమిది రోజులు ముందు, కాకామహాజనికి దుర్భరమైన అజీర్ణవ్యాధి.120. దాని వలన విరేచనాలు అధికంగా అవసాగాయి. తన భారాన్ని బాబా పై వేసి ఏ ఔషధాలనూ తీసుకోలేదు. ఏ చికిత్సలూ చేసుకోలేదు. అతడు చాలా విసుగెత్తి పోయాడు.121. సాయి పూర్ణఅంతర్జ్ఞాని అని మహాజనికి తెలుసు. అందువలన తన అస్వస్థతను గురించి బాబాకు చెప్పలేదు.122. బాబా తలచుకున్నప్పుడు వారే వ్యాధిని నివారిస్తారని పూర్తి విశ్వాసంతో వ్యాధిని సహిస్తూ ఉన్నాడు.123. కర్మఫలితాన్నంతా అనుభవించాల్సిందే. కాని తనకు, పూజలో ఏ ఆటంకం కలగకూడదని కాకా ఎప్పుడూ కోరుకునేవాడు.124. విరేచనాలు ఎడతెరపి లేకుండా అవుతున్నందువలన వాని వలన హారతిసేవ తప్పి పోకుండా ఏంచేశాడంటే,125. చెంబులోనీరునింపి, చీకట్లో కూడా చేతికి అందేలా మసీదులో ఒక మూల ఉంచాడు,126. తను బాబావద్ద చరణ సంవాహన చేస్తూ కూర్చునేవాడు, హారతికి హాజర య్యేవాడు. రోజూ ఇలాగే జరిగేది.127. కడుపులో కదలిక కలగగానే చేతికి అందుబాటులో ఉన్న చెంబు పుచ్చుకుని ఏకాంతస్థలానికి వెళ్లి నిర్మలుడై తిరిగివచ్చేవాడు.128. నేలపని ప్రారంభించటానికి తాత్యా బాబాను ఆజ్ఞ వేడగా వారు అతనితో ఏమన్నారో వినండి.129. 'మేము లెండీకి వెళ్లి

తిరిగి వచ్చాక ఈ నేల పని ప్రారంభించండి' అని.130.తర్వాత బాబా లెండీ నుండి తిరిగివచ్చి వెళ్ళి తమ ఆసనంపై కూర్చున్నారు. ఆ సమయానికి సరిగ్గా కాకా వచ్చి బాబా పాదసంవాహన మొదలుపెట్టాడు.131.కోపర్‌గాం నుండి వచ్చిన టాంగాలో ముంబై నుండి భక్తులు వచ్చారు. పూజా సామగ్రితో పైకి వెళ్లి బాబాకు అభివందనం చేశారు.132. ఇతర భక్తులతో పాటు అంధేరి నుండి పటేలు కూడా వచ్చి పూజ కోసం పుష్పాలను అక్షతలను పట్టుకుని ఎదురు చూస్తూకూర్చున్నాడు.133.ఇంతలో క్రింద ప్రాంగణంలో రథాన్ని ఉంచే చోట గునపంతో త్రవ్వుతూ నేలపని మొదలైంది.134.ఆ శబ్దాన్ని విన్నంతనే, బాబా విచిత్రంగా కేకలు వేశారు. వెంటనే కళ్లను భయంకరంగా పెద్దవి చేసి తక్షణం న్యసింహావతారాన్ని దాల్చారు.135.ఎవరు గునపంతో త్రవ్వుతున్నారు? వారి నడుం విరక్కొడతానంటూ, సటకాపుచ్చుకుని లేచేసరికి అందఱూ భయపడిపోయారు.136.గునపాలను పారవేసి పనివాళ్లు పరుగుతీశారు. కాకా కూడా బెదరిపోయి లేచి పరుగెడుతుంటే బాబా అతని చేతిని పట్టుకున్నారు.137.'ఎక్కడికి వెళ్లతున్నావు కూర్చో' అని అన్నారు. ఇంతలో తాత్యా, లక్ష్మి వచ్చారు. వారిపై కూడా బాబా ఇష్టం వచ్చినట్లుగా తిట్లను కురిపించారు.138. ప్రాంగణం బయట ఉన్న గుంపును కూడా బాగా తిట్టారు. అప్పుడు అక్కడ పడి ఉన్న వేయించిన వేరుశనగపప్పు సంచిని అందుకున్నారు.139.బాబా కోపావేశంలో ఉన్నప్పుడు, భయభీతులై నలుదిక్కులకూ పరుగెత్తిన వారెవరిదో ఆ సంచి,మసీదులో పడిపోయి ఉంది.140.దానిలో బాగా శేరు గింజలుండి ఉంటాయి. వానిని పిడికెడు పిడికెడుగా బయటికి తీసి చేతితో నలిపి పొట్టు ఊదేసి శుభ్రం చేసి,141.వానిని మహాజనికి తినటానికి ఇచ్చారు.అలా ఒక వైపు తిడుతూనే మరో వైపు గింజలను నలపటం,142. శుభ్రమైన గింజలను అతని చేతిలో పోసి తినేసేయి అని అంటూ కొన్ని తామూ నోట్లో వేసుకుంటూ అలా సంచిని ఖాళీచేశారు.143.గింజలన్నీ అయిపోయాక నాకు దాహం వేస్తూ

ఉంది నీరు తీసుకునిరా అని చెప్పారు. కాకా చెంబు నిండా నీరు తేగా, తాము స్వయంగా త్రాగి, అతనిని త్రాగమని చెప్పారు.144. కాకా నీరు త్రాగిన తరువాత' నీ మలద్వారం మూసుకుంది. ఆ బ్రాహ్మలు ఎక్కడ చచ్చారు. వెళ్లి వారిని పిలుచుకునిరా' అని అన్నారు.145. తరువాత భక్తులు వచ్చారు. మసీదు మరల ఎప్పటి వలెనే నిండిపోయింది. నేలపని మరల ఆరంభమైంది. కాకా విరేచనాలు ఆగిపోయినై 146. విరేచనాలకు ఇదేం ఔషధం? సత్పురుషుల వచనమే అసలు ఔషధం. వారిచ్చినది ప్రసాదంగా గ్రహిస్తే, దానికంటే శ్రేష్ఠమైనది మరొకటి లేదు. వారివచనాలను అనుగ్రహంగా భావిస్తే వేరే ఔషధాలు అవసరం ఉండవు.147. హర్దా పట్టణంలోని ఒక గృహస్థుడు కడుపులో శూలవ్యాధితో పదునాలుగేళ్లు బాధపడ్డాడు. సమస్త ప్రయత్నాలు చేశాడు.148. అతని పేరు దత్తోపంతు. శిరిడీలోని సాయి మహాత్ములు దర్శనంతో కష్టాలను నివారిస్తారని ఆనోటా ఆనోటా అనగా విన్నాడు.149. వారి కీర్తిని విని శిరిడీకి వెళ్లాడు. సాయి చరణాలకు వందనం చేసి వారిని కరుణించుమని ప్రార్థించాడు.150. 'బాబా! ఈ కడుపుశూల నా వెంటపడి పదునాలుగేళ్లు నిండాయి. దీనికి పరమావధి అయింది. ఇది ఇక చాలు. ఈ బాధను అనుభవించే శక్తి ఇంక నాకు లేదు.151. నేనెవరినీ హింసించలేదు. తల్లి తండ్రులను అవమానించలేదు. పూర్వజన్మలో ఏం చేశానో గుర్తులేదు. నాకీ కష్టం వచ్చింది' అని దుఃఖించాడు.152. సత్పురుషుల ప్రేమావలోకనం, వారి ఆశీర్వచనం, వారి ప్రసాదం మాత్రంతో వ్యాధి నిర్మూలమవుతుంది. వేరే ఇంకేమీ అవసరం లేదు.153. అటువంటిదే దత్తోపంతు అనుభవం. బాబా అభయహస్తం అతని శిరసున పడి, వారి ఆశీర్వాదం విభూతి ప్రసాదం లభించగానే, అతని మనసుకు శాంతి కలిగింది.154. సాయి మహారాజు అతనిని కొన్ని రోజులు అక్కడే ఉంచేసుకున్నారు. క్రమక్రమంగా అతని కడుపు శూల బాధ పూర్తిగా నివారణమైంది.155. ఇటువంటి మహానుభావుని ప్రభావాన్ని నేను ఎంతని వర్ణించను? ఇతురులకు

ఉపకారం చేయటం వారి నిత్యస్వభావం. చరాచరాలలోవారికి సద్భావమే.156. వారి లీలలను స్తుతించాలన్నా గానంచేయాలన్నా ఒకటి కంటే మరొకటి విచిత్రం. ఇప్పుడు పూర్వానుసంధానం మరల భీమాజీ చరిత్ర.157.బాబా విభూతిని తెప్పించి కొంచెం భీమాజీకి ఇచ్చి, కొంచెం అతని నుదుట రాసి అతని శిరసుపై తమ హస్తాన్ని ఉంచారు.158.బసకు వెళ్లటానికి ఆజ్ఞ ఇచ్చారు. పటేలు బండి వరకు తనే నడుచుకుంటూ వెళ్లాడు. అతనికి హుషారుగా ఉన్నట్లు అనిపించింది.159.అతని కోసం నియమించిన స్థలానికి వెళ్లాడు. ఆ స్థలంఇరుకుగా ఉంది. అయినా అది బాబాయే స్వయంగా సూచించిన స్థలం. అందుకే దానికి మహత్వం.160.దిమ్మెసతో అప్పుడే సమతలంగా చదునుచేసిన నేల చెమ్మగా ఉంది. అయినా బాబా ఆజ్ఞను శిరసావహించి భీమాజీ అక్కడే తన వసతిని ఏర్పరుచుకున్నాడు.161.భీమాజీకి డబ్బు తెలిసినవారు అనేకులు ఉన్నారు. పొడిగా ఉన్న స్థలం లభిస్తుంది. కాని బాబా స్వయంగా చెప్పిన స్థానాన్ని వదిలి వేరే స్థలాన్ని చూచుకోలేదు కదా.162.అక్కడే రెండు గోనె గుడ్డలు పరచుకుని వానిపై పరుపు వేసుకుని పటేలు నిశ్చింతగా శయనించేవాడు.163.ఆ రోజు రాత్రి అతనికి కలవచ్చింది. బాల్యం నాటి మాస్టారు వచ్చి అతన్ని కొట్టసాగాడు.164.పద్యం కంఠస్థం చేయటానికి, చేతిలో ఒక బెత్తం పుచ్చుకుని బాగా దెబ్బలు కొడుతూ అతని వీపు చితకబాదాడు. అలా శిష్యుని చాలా కష్ట పెట్టాడు.165.ఆ పద్యాన్ని తెలుసుకోవాలని శ్రోతలు చాలా కుతూహల పడుతున్నారని ఆ పద్యాన్ని అక్షరమక్షరం సాంతం చెబుతున్నాను.166.పద్యం :- ''పరుల గృహాలలో పాదం పెట్టటం పాము తలపై పాదం మోపటమని భావించే స్త్రీ ॥ లోభి చేతినుండి అతి కష్టంగా రాలే డబ్బులా అతి తక్కువగా మాట్లాడే స్త్రీ ॥ ఇంట్లో డబ్బులేక పోయినా పతి సహచర్యాన్నే సుఖంగా భావించే స్త్రీ ॥ తన పతి కోరిన విధంగా ప్రశాంత మనసుతో ప్రవర్తించే స్త్రీ, ఈ

స్వభావం కల స్త్రీ యే నిజమైన సతి''. ఈ శిక్ష ఎందుకొరకు అన్న విషయం ఏమీ అర్థం కాలేదు. ఎంతో పట్టుదలతో మాష్టారు బెత్తం వదలటంలేదు.167.వెంటనే మరో కల వచ్చింది. అది ఇంతకంటే విలక్షణమైనది. ఎవరో ఒక గృహస్థుడు వచ్చి అతని ఛాతిని అదిమి పట్టి కూర్చున్నాడు.168.చేతిలోకి ఒక పాత్రాన్ని తీసుకుని, దానితో భీమాజీ ఛాతిని సన్నికల్లుగా చేసి రుద్దుతుంటే అతని ప్రాణాలు ఉక్కిరి బిక్కిరై కంఠంలోకి వచ్చి వైకుంఠానికి వెళ్లిపోయినట్లనిపించింది.169.కల అయిపోగానే అతనికి బాగానిద్రపట్టింది. మనసుకు కొంచెం విశ్రాంతి కలిగింది. సూర్యుడు ఉదయించే సరికి పటేలు మేలుకున్నాడు.170.అతని మనసుకు ఎన్నడూ లేనంత హుషారు కలిగింది. వ్యాధిని గురించిన ఆలోచనంతా పూర్తిగా మాయమైంది.సన్నికల్లు పాత్రం, బెత్తంతో కొట్టడం ఎక్కడ గుర్తుంటాయి?171.కల భ్రమ అని జనులంటారు కాని, ఒక్కొక్కప్పుడు దానికి విరుద్ధంగా అనుభవమవుతుంది. పటేలుకు ఆ స్వప్న సమయంలో రోగం వదిలి బాధ తొలగిపోయింది.172.అతడు చాలా సంతోషించాడు. అతనికి పునర్జన్మ కలిగినట్లనిపించింది.బాబా దర్శనానికిమెల్ల మెల్లగా బయలుదేరి వెళ్లాడు.173.బాబా యొక్క చంద్రవదనాన్ని చూచి పటేలు మనసు సాగరంలా ఉప్పొగింది. అతడు ఆ ఆనందసాగరంలో మునిగిపోగా,అతని కళ్లు మూసుకుని పోయాయి.174.కళ్ళ నుండి ప్రేమాశ్రువులు ప్రవహించాయి. ఆస్థితిలో బాబా పాదాలపై మస్తకాన్నుంచాడు.బెత్తంతో శిక్షించటం,గుండెను బ్రద్దలు చేసే బాధ,దాని ఫలితం ఆనందదాయకమైంది.175. బాబా! మీ ఈ ఉపకారానికి పామరుణ్ణైన నేను ఎలా బదులు తీర్చుకోగలను? అది అశక్యం. అందువల్ల కేవలం మీ పాదాలపై శిరసునుంచుతాను.176.ఇదే నా ఋణవిముక్తి. ఇంతకంటే వేరే ఉపాయం లేదు.సాయీ! మీ లీలలు అతర్క్యం. ఆలోచనలకు అందనివి.177.అని బాబా కీర్తిని గానం చేస్తూ అక్కడ నెల రోజులున్నాడు. ఆ తరువాత నానా

ఉపకారాన్ని స్మరించుకుని కృతార్థుడై తిరిగి వెళ్లిపోయాడు.178.పటేలు బాబా యందు భక్తి శ్రద్ధలు కలిగి వారి కృపకు కృతజ్ఞతా పూర్వకంగా, ఆనందంతో నిండిన మనసుతో తరచు శిరిడీ వచ్చేవాడు.179.సాయినాథునికి రెండు చేతులు ఒక తల, అనన్య శ్రద్ధావిశ్వాసాలు ఇవి చాలు. వేరే ఏవీ అవసరం లేదు. కాని కృతజ్ఞత మాత్రం తప్పక ఉండాలి.180.కష్టాలలో చిక్కుకున్న వారెవరైనా సత్యనారాయణస్వామికి మ్రొక్కుకొని ఆపదల నుండి బయటపడగానే సత్యనారాయణ వ్రతాన్ని సాంగోపాంగంగా ఆచరిస్తారు.181.అట్లే పటేలు సాయిసత్యవ్రతం చేయసాగాడు. ప్రతిగురువారం శుభ్రంగా స్నానం చేసి విధిపురస్సరంగా వ్రతాన్ని చేసేవాడు.182.జనులు సత్యనారాయణ కథలు చదువుతారు.పటేలు దాసగణు రచించిన అర్వాచీన భక్తలీలామృతం లోని సాయిచరితాన్ని ప్రేమపూర్వకంగా చదివేవాడు.183.నలుబది అయిదు అధ్యాయాలున్న ఈ గ్రంథంలో దాసగణు అనేక భక్తుల గురించి గానం చేసాడు. వానిలో సాయినాథుని గురించి మూడు అధ్యాయాలు ఉన్నాయి.ఇవి సాయి సత్యవ్రత కథలు.184. వ్రతాలలో ఉత్తమమైన ఈ వ్రతంలో, పటేలు ఈ మూడు అధ్యాయాలను చదివేవాడు. అలా అతడు అపరిమితమైన సౌఖ్యాన్ని పొందాడు. అతని మనసుకు ప్రశాంతి కలిగింది.185. ఆప్తుల బంధుమిత్రుల సహితంగా ఆనందభరిత మనసుతో, నియమంగా సాయి సత్యవ్రతాన్ని ఆచరించేవాడు.186.పూజా పద్ధతి నైవేద్యం మొదలైన వన్నీ అదే పద్ధతి ప్రకారమే. అక్కడ సత్యనారాయణుడు ఇక్కడ సాయి నారాయణుడు. రెంటిలో ఏదీ తక్కువ కాదు.187.దీనిని పటేలు ప్రవేశ పెట్టాడు. ఇది ఊరిలో పరిపాటై, ఈ సాయి సత్యవ్రతం పరంపరగా వాడుకలోనికి వచ్చింది.188.భాగ్యముంటే, దయామయులైన ఇటువంటి సత్పురుషులు తమ దర్శనంతో ప్రపంచంలోని దుఃఖాలను హరించివేస్తారు.వారు కాలాన్ని వెనక్కు మళ్లిస్తారు.189.ఇక తరువాతి కథలో ఒకరి సంతాన చింత వర్ణన. దీనిలో

సత్పురుషులలోని ఏకాత్మత చమత్కారం ప్రకటమవుతాయి.190.నాందేడు పట్టణ నివాసి, పార్సీ జాతీయుడైన ఒక గొప్ప శ్రీమంతునికి బాబా ఆశీర్వాదం లభించి పుత్ర సంతానం కలగటం.191.మౌల్వి సాహెబు అనే సాధువు గురించి బాబా సూచించటం, పార్సీ వ్యక్తి ఆనందంతో తన గ్రామానికి వెళ్లి పోవటం,192.అత్యంత ప్రేమ పూరితమైన ఈ కథను శ్రోతలు శాంతచిత్తులై వినండి. సాయి యొక్క వాత్సల్యం వారి సర్వవ్యాపకత్వం తెలుస్తాయి.193.హేమాడ్ పంత్ సాయికి శరణు జొచ్చి, తరువాతి అధ్యాయాన్ని శ్రద్ధగా శ్రవణం చేయండని.సాధువులకు శ్రోతలకు నమస్కరిస్తున్నాడు.194.స్వస్తి శ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో, భీమాజీ క్షయ నివారణమన్న పదమూడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 14 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

జయ సాయినాథా! సత్పురుష శ్రేష్ఠా! జయజయదయాళూ! గుణగంభీరా! జయనిర్వికారా! పరాత్పరా! జయజయ అనంతా! నిరవద్యా! 1. భక్తులపైనున్న దయతో వారికి తెలియకుండానే మీరు వారిపై దృష్టి నుంచి, అనేక మిషలతో వారికి మీ సాన్నిధ్యాన్ని కలుగ చేసి, వారిని కష్టాలనుండి తరింప చేస్తారు. 2. దీనులను ఉద్ధరించటానికి, భక్తుల చెడు వాసనలనే దుష్టులైన రాక్షసులను హత మార్చటానికి ఇది ఒక లీలావతారం. 3. మీవద్దకు సద్భావంతో వచ్చిన వారు ఆత్మ స్వరూపం యొక్క ఆనందరసాన్ని పానం చేశారు. వారి అంతరంగం ఆనందంతో నిండిపోయి, ప్రేమ సుఖంలో ఊగి పోయారు. 4. ఇటువంటి సకల సుగుణ శోభితులైన సాయి సమర్థుని చరణాలపై, హీనుణ్ణి దీనుణ్ణినేను, అత్యంత వినయంగా సాష్టాంగ ప్రణామం చేస్తున్నాను. 5. ఇప్పుడు పూర్వకథాను సంధానం. నల్ల కుక్కకు పెరుగన్నం పెట్టగా చలిజ్వరం తొలగి పోయిన కథ అయింది. 6. దుర్భరమైన కలరా వ్యాధి, బాబా చూపుడు వ్రేలుతో బెదరించి జావ త్రాగించగా తొలగటం, వేయించిన వేరుశనగ పప్పు తినిపించగా విరోచనాలు మాయమై పోవటం, 7. మరియు ఒకరి కడుపుశూల, మరొకరి కర్ణవ్యాధి, ఇంకొకరి బలీయమైన క్షయరోగం, సాయిదర్శనంతోనే నశించిపోవటం విన్నాం. 8. శ్రీసాయి దయతో భీమాజీ సుఖ సంపన్నంగా సాయి యందు సంపూర్ణ కృతజ్ఞతతో సాయి చరణాలకు పూర్తిగా శరణుజొచ్చాడు. 9. ఇప్పుడు అద్వితీయమైన అపూర్వ

చమత్కార కథను, శ్రోతలు అత్యంత ఆదరంతో వినడానికి కుతూహలంగా ఉన్నారని సాదరంగా వినిపిస్తున్నాను.10.శ్రోతలు సావధానులై ఉండకపోతే వక్తకు కథ ఎలా స్ఫురిస్తుంది?కథనం ఉత్కృష్టంగా ఎలా ఉంటుంది?కథ ఎలా రసవంతమవుతుంది?11.వక్త కథను ఎలా వివరించగలడు?వక్త ఎప్పుడూ శ్రోతల అధీనంలో ఉంటాడు.శ్రోతలే అతని ఆధారం. వారివల్లే రసమాధుర్యం అధికమవుతుంది.12.ఇది సత్పురుషుల చరిత్ర. అందుకే సహజంగా అన్ని విధాలా మధురం.సత్పురుషుల ఆహార విహారాలు మధురం. సహజంగా పలికే వారి వచనాలూ మధురం. 13.ఇది కేవలం వారి జీవిత చరిత్ర కాదు.దయాఘనులైన సాయి మహారాజు, భక్తుల కొఱకు తమ స్మరణ అనే సాధన చేయించటానికి ప్రేమగా ఆత్మ స్వరూప ఆనందాన్ని కురిపించారు.14.ప్రవృత్తి మార్గ విషయాలను చెప్పుతూనే, వారు నివృత్తి మార్గంలో ప్రవేశ పెడతారు.ఈ విధంగా ఇది లౌకికాన్ని పరమార్థాన్ని సాధింప చేసే సత్పురుషుని కథ.15.అంటే ప్రపంచంలో సుఖంగా ఉంటూనే,సావధానంగా మానవ శరీరాన్ని తప్పక సార్థకం చేసుకోవాలి. 16. అనేక జన్మల పుణ్య ఫలంగా ఆశించకుండానే, జీవునికి మానవ శరీరం లభిస్తుంది. శరీరంలో పరమార్థాన్ని తెలుసుకున్న వారు అదృష్ట వంతులు.17.ఈ శరీరాన్ని సార్థకం చేసుకోని వారు భూమికి భారంగా నిరర్థకంగా జన్మించినట్లు. అటువంటివారికి, పశువుకంటె అధికమైన సుఖం ఏంలభిస్తుంది.18.ఆహారనిద్రా భయమైథునాలు వీనికంటే వేరే దేనినీ ఎఱుగని నరులు కేవలం కొమ్ములు తోకల్లేని పశుసమానులు.19.గొప్పదైన ఈ మానవ జన్మ వల్లనే భగవద్భక్తిని సాధించ కలగడం; దీనివలననే నాలుగు ముక్తులు మరియు ఆత్మసాక్షాత్కారం కూడా ప్రాప్తిస్తాయి.20.ఈ ప్రపంచం మేఘాలపైని మెరపు తీగవలె చంచలమైనది.ఇక్కడ కాలరూపసర్పం కాటేసిన లోకులకు, సుఖ ఘడియలు దుర్లభం. 21.తల్లితండ్రి, అన్నాచెల్లి, భార్యాభర్త,కొడుకు కూతురూ, పెదతండ్రి,

పినతండ్రి వీరంతా నదీ ప్రవాహంలోని కట్టెలవలెనే ఒక చోట కలిసి ఉన్నట్లుగా ఉంటారు. 22.కట్టెలు ఆక్షణం అలా కనిపించినా అవి అలల తాకిడికి విడిపోయి మరల కలుసుకోవు. అట్లే వీరూ కలుసుకోరు.23.తమ శ్రేయస్సును సాధించుకోలేని జనులు కన్నతల్లిని వ్యర్థంగా కష్టపెట్టిన వారే. సత్పురుషుల చరణాలను ఆశ్రయించకపోతే ఈ జన్మ వ్యర్థం. 24. జీవుడు జన్మించిన వెంటనే మృత్యుమార్గంలో పడ్తాడు. ఇవాళోరేపో ఎల్లుండో ఈ జన్మను నమ్ముకుంటే నరుడు మోసపోయినట్లే.25.అందువల్ల మరణాన్ని ఎప్పుడూ స్మరణ యందుంచుకోవాలి. శరీరం కాలునికి ఆహారం. ఇది ఈ ప్రపంచలక్షణం.అందువల్ల అప్రమత్తంగా ఉండాలి. 26.ప్రపంచ వ్యవహారాలలో జాగ్రత్తగా నడుచుకుంటే పరమార్థం అనాయసంగా లభిస్తుంది. ప్రపంచ వ్యవహారాలలోను, పురుషార్థాలను సాధించుకోవడంలోనూ సోమరి తనం, ఉదాసీనత పనికిరావు. 27.సాయి కథను ప్రేమతో వింటే శుభం కలుగుతుంది మరియు సాయి చరణాలయందు భక్తి పెంపొంది సుఖాల నిధి లభిస్తుంది.28.సాయి యందు సంపూర్ణ ప్రేమ ఉన్నవారికి ఈ కథల సముదాయం, సాయిచరణ కమలాలను అనుక్షణమూ గుర్తుకు తెస్తుంది.29.మరియు మాటలతో వర్ణించలేని వారి మహిమను మాటలతో వివరిస్తుంది. ఇంద్రియాలకు అందని వారిని ఇంద్రియాలతో సేవించేలా చేస్తుంది. ఈ కథామృతాన్ని, ఎంతపానం చేసినా సంపూర్ణ తృప్తి లభించదు.30.సత్పురుషుల లీలలు అతర్క్యం, అంతులేనివి. వారిమహిమలు అనిర్వచనీయం. వానిని మాటలలో సంపూర్ణంగా చెప్పగల సమర్థులెవరు? 31.ఈ కథలు నిత్యం చెవులలో పడుతుంటే సాయి ఎల్లప్పుడూ కళ్ళలో మనసులో మెదులుతుంటారు. పగలూరాత్రి మన స్మరణలో చింతనలో, ధ్యానంలో ఉంటారు. 32.జాగ్రతావస్థలో, స్వప్నంలో, కూర్చున్నా, లేచినా, భోంచేస్తున్నా, పడుకున్నా, జనులమధ్య ఉన్నా, వనాల లోకివెళ్లినా, ఎక్కడున్నా వారు ఎల్లప్పుడూ మన వెంటే ఉన్నట్లు అనిపిస్తుంది.

33. ఈ విధంగా నిధి ధ్యాసనలను చేస్తే మనసు ఉన్మని స్థితిని పొందుతుంది. ఇలా అనుదినం జరుగుతుంటే చిత్తం చైతన్య మయమవుతుంది. 34. ఇక తరువాతి కథా సంగతి. గతాధ్యాయం చివర చెప్పిన దానిని మొదలుపెడతాను. శ్రోతలు శ్రద్ధగా వినండి. 35. భక్తి భావమనే పూరి హల్వా తినగలిగినంత ఎంతైనా తినవచ్చు. గొంతు వరకు సేవించినా ఎన్నడూ పూర్తిగా తృప్తికలగదు. 36. ఇప్పుడు మరోకథ. శ్రోతలు శ్రద్ధగా వింటే సత్పురుషుల దర్శనంతో మనసు దృఢమై జన్మసార్థకమవుతుంది. 37. బాబా పైకి కనిపించేలా ఏమీ చేసేవారు కాదు. తమస్థానం విడిచి ఎక్కడికీ వెళ్లేవారు కాదు. అయినా కూర్చున్న చోటే సర్వం తెలుసుకుంటున్నట్లుగా అందరికీ అనుభవాన్ని కలిగించేవారు. 38. మన శరీరంలో ఉన్న సత్ తత్వమే అఖిల బ్రహ్మాండంలోనూ ఉన్నది. శరీరంపైని భ్రాంతిని మరచిపోయి ఎప్పుడూ అభేదాన్ని అవలోకించాలి. 39. ఈ సత్తత్వాన్ని శరణు జొచ్చిన వారికి, అందటూ ఒక్కటేనన్న ఏకత్వ భావం ఉంటుంది. అలాకాక అనేకత్వభావముంటే జనన మరణ పరంపర తప్పదు. 40. ఈ అనేకత్వభావాన్ని కలిగించే బుద్ధి అజ్ఞానమే అని త్రిశుద్ధిగా తెలుసుకోవాలి. గురువు సాంగత్యంతో చిత్తశుద్ధి కలిగి, ఆత్మస్వరూప జ్ఞానం కలుగుతుంది. 41. అజ్ఞాన నివృత్తియే ఏకత్వప్రాప్తి. అజ్ఞానం తొలగిపోతే అంతా ఒక్కటే అన్న జ్ఞానం కలుగుతుంది. భేదబుద్ధి అంతఃకరణంలో అణుమాత్రం ఉన్నా ఏకత్వభావం ఎట్లా ఉంటుంది? 42. ఆబ్రహ్మాదిస్థావరాలలో వివిధ ఉపాధులలో ఓతప్రోతమై ఉన్న బ్రహ్మతత్వం అవివేకులకు బ్రహ్మ వలె అగుపించదు 43. సకల విజ్ఞాన ఘన స్వభావం కలిగి, ప్రపంచ వ్యవహారాలలో నిరాసక్తత ఉండి, నామరూపాల కతీతంగా ఉన్నవారే నిరవయవ బ్రహ్మ. 44. ఉపాధి భేదాలవలన అజ్ఞానం, మోహాది సంభ్రమల కారణంగా భిన్నత్వానికి అలవాటు పడ్డ చిత్తానికి ఏకత్వజ్ఞాన బోధతో స్పష్టత చేకూరుతుంది. 45. నేను వేరు జనంవేరు కాదు. విభిన్నంగా ఏదీ లేదు. అంతటా

ఒకే తత్వం వ్యాపించి ఉంది కాని, వేరుగా మరేదీలేదు. 46. వివిధ నామరూపాలతో కార్యకలాపాలు చేసేవన్నీ ఉపాధులే అని తెలుసుకొని భేద బుద్ధిని త్యజించటం, అదే బ్రహ్మ అవటం. 47. జగమంతటా దశదిశలా నేనే వ్యాపించి ఉన్నాను; నేను లేని చోటంటూలేదు. నాకంటే అన్యులెవరూ లేరు. 48. అన్న ఇదే భావాన్ని దృఢపరచుకుని మాయా భ్రమను తొలగించుకోవాలి. నాకంటే వేరు వస్తువేదీ లేదు అని తెలుసుకుని మనసును ఆత్మయందు స్థిరపరచాలి. 49. భేద భావం అసలు ఎలా ఉత్పన్నమవుతుంది? అని శ్రోతలకు సంశయం కలగటం సహజం. జీవుడు జ్ఞాత అంటే తెలుసుకునే వాడు. బ్రహ్మ జ్ఞేయం అంటే తెలుసుకొన బడేది. ఏ ఉపాయంతో ఈ భేదభావం తొలగిపోతుంది. 50. అణుమాత్రం భేదబుద్ధి ఉన్నా ఏకత్వభావం నశించి పోయి జనన మరణాలకు కారణమైన అనేకత్వాన్ని కలిగిస్తుంది. 51. అజ్ఞానాంధకార దృష్టి తొలగిపోతే నానారకాలుగా ఉన్నసకల సృష్టి లోపించి పోయి, ఒక్క ఆత్మ స్వరూపమే దృష్టియందు ఉంటుంది. 52. శుద్ధోదకంలో శుద్ధోదకం పోస్తే అంతా ఒక్కటిగా కలిసి పోయి రెండూ ఒకే విధంగా కనిపిస్తాయి. భేదభావమేమి మిగలదు. 53. కట్టెలు ఆకారంలో వేరువేరుగా ఉన్నా అగ్నిలో కాలాక ఆకారాన్ని కోల్పోయి, అగ్ని స్వరూపంలోకలిసిపోతాయి. 54. అలాగే ఆత్మ ఒక్కటే అన్న జ్ఞానాన్ని వేరే ప్రమాణాలతో ప్రతిపాదించనవసరం లేదు. ఆత్మ ఎప్పుడూ ఏరూపం లేకుండా, సర్వప్రాణులలో పరిపూర్ణంగా ఉంటుంది. 55. మిథ్యారోపం కారణంగా, మనసు ఎప్పుడూ భ్రమలకు లోనై, జనన మరణదుఃఖాలను అనుభవిస్తూ జీవులు ఎల్లప్పుడూ అశాంతంగా ఉంటారు. 56. నామరూపాది ఉపాధులను త్యజించి విశుద్ధమైన విజ్ఞానాన్ని సాధించిన సిద్ధులను మాయబాధ పెట్టదు. వారు సదా ఆత్మానందంలో లీనమై ఉంటారు. 57. ఇటువంటి స్థితికి ప్రత్యక్ష ఉదాహరణ శ్రీసాయి చరణాలు. వారి దర్శన భాగ్యాన్ని పొందినవారు ధన్యులు. 58. నీటిలో కనిపిస్తున్న చంద్రుడు

నీటికి అతీతంగా ఉన్నట్లు,సత్పురుషులు భక్తులతో పరివేష్టితులై ఉండి కూడా వాస్తవానికి వారు అలిప్తంగా ఉంటారు.59.వారి చుట్టూ భక్తులున్నా వారికి ఎవరి యందు మోహమమకారాలు ఉండవు.వారి చిత్తవృత్తి ఆత్మస్వరూపంలో ఉంటుంది, కనుక వారు దృశ్యాలకు విముఖంగా ఉంటారు. 60.భగవంతుడు ఇటువంటి మహా సత్పురుషుల అధీనంలో ఉంటాడు. వారికి సిద్ధించని దేదీలేదు. వారెఱుగనిదేదీలేదు. 61.జగత్తులో ఉపదేశాలు ఇచ్చేగురువులు, పుచ్చుకునే శిష్యులు అసంఖ్యాకంగా ఉంటారు. కాని ఉపదేశాలతో పాటు అనుభవాలను ప్రసాదించేవారు అరుదు. 62.ఈ వర్ణనను చాలించి ఇక ముఖ్యకథ లోకి వద్దాం. శ్రోతలు ఉత్సుకతతో ఉన్నారుకదూ! విని లాభాన్ని పొందండి.63.మొగలు సామ్రాజ్యంలోని నాందేడు పట్టణంలో, ప్రసిద్ధి చెందిన ఒక పార్సీ వ్యాపారి ఉండేవాడు. గొప్పధార్మికుడు. పేరు రతన్‌జీ. లోకులు అతనిని ప్రేమించేవారు.64.అతనికి గుఱ్ఱాలు బళ్లూ పాలాలు మొదలగు ధనసంపద సమృద్ధిగా ఉండేది. అతని ఇంటి ద్వారాలెప్పుడూ తెరచే ఉండేవి. ఎవరూ నిరాశతో మరలి పోయేవారు కాదు.65.ఇలా అతడు పైకి అహోరాత్రాలూ ఆనంద సాగరంలో మునిగి ఉన్నట్లున్నా అతని మనసులో దుర్భరమైన చింత ఎల్లప్పుడూ ఆవరించి ఉండేది. 66.ఎవరికైనా సంపూర్ణ సౌఖ్యం ఉండదు. ఇది ఈశ్వరుని లీలా విధానం. ఒకరికి ఒక చింత, మరొకరికి మరో చింత. ఏదో ఒకటి అంటి పెట్టుకుని ఉండనే ఉంటుంది.67. కొందరు నేను గొప్పవాణ్ణి, మహా ఐశ్వర్యవంతుణ్ణి, అని అనుకుంటూ వ్యతిరేకంగా నడుచుకుంటూ గర్విస్తారు. 68. అని ఏ లోపమూ లేనివారికి,దృష్టి దోషం తగులుతుందేమోనని పరమేశ్వరుడు, స్వయంగా తన చేతులతో దిష్టి చుక్క పెట్టారా అనిపిస్తుంది.69.ధన కనక సంపద గల రతన్‌జి వచ్చేపోయే వారికి అన్నం పెట్టే వాడు. దీనుల దైన్యాన్ని తొలగించేవాడు. ఎప్పుడూ ప్రసన్నంగా ఉండేవాడు. 70.ఈ విధంగా ప్రపంచ

దృష్టిలో ఆసేటు సుఖంగానే ఉన్నాడు. కాని పుత్రహీనునికి ధనంతో పొందే సుఖాలు ఏపాటివి? 71. అతనికి ఒకరి తరువాత ఒకరుగా పన్నెండు మంది ఆడపిల్లలు కలిగారు. కాని అతనికి సుఖమెక్కడిది? అతని మనసుకు శాంతి ఎక్కడిది? 72. ప్రేమేలేని వారి కీర్తన, తాళస్వరంలేని గానం, యజ్ఞోపవీతంలేని బ్రాహ్మణుడు శోభించగలరా? 73. సకల కళా ప్రవీణులై ఉండి విచక్షణాజ్ఞానం లేనివారు, ఆచారసంపన్నులై ఉండి భూతదయాహీనులైతేశోభిస్తారా? 74. నొసట గోపీచందన తిలకం దిద్ది, కంఠంలో తులసీమాల నలంకరించుకుని, సత్పురుషులను అవహేళన చేసేవారు శోభిస్తారా? 75. అనుతాపం లేని తీర్థయాత్రలు, కంఠాభరణం లేని అలంకరణ, పుత్రుడులేని గృహస్థుని గృహం శోభిస్తాయా? 76. నారాయణుడు ఒక్కడినైనా సుపుత్రుని ప్రసాదించడా అని రతన్‌జీకి అనుదినం చింత. మనసు నిశ్చింతగా ఉండేది కాదు. 77. ఆకారణంగా సేటు ఎప్పుడూ తనలోదుఃఖిస్తుండేవాడు. అతనికి అన్నపానీయాలు రుచించేవికావు. రాత్రింబవళ్లూ దుఃఖంతో చింతామగ్నుడై ఉండేవాడు. 78. 'దేవా! నా ఈ కళంకాన్ని కడిగేసి, నన్ను నిష్కళంకుణ్ణి చేయి. నావంశానికి ఒక ఆధారమైన పుత్రుని ఇచ్చి నాగౌరవాన్ని కాపాడు 79. ప్రభూ!' అని ప్రార్థించేవాడు. అతనికి దాసగణుని యందు గొప్ప నమ్మకం. అతనితో తన మనసులోని కోరికను బాధను మొఱబెట్టుకున్నాడు. శిరిడీకి వెళ్లితే నీ మనోభీష్టం నెరవేరుతుంది. 80. సాయిబాబా దర్శనం చేసుకుని వారి చరణాలకు నమస్కరించి నీమనసులోని కోరికను వారికి మనవి చేయి. వారు నిన్ను ఆశీర్వదిస్తారు. 81. వెళ్లిరా నీకు శుభం కలుగుతుంది. బాబా యొక్క లీల అతర్క్యం. వారికి అనన్య శరణు జొచ్చితే ధన్యుడవవుతావు అని దాసగణు చెప్పాడు. 82. ఈ సలహా రతన్‌జీకి నచ్చింది. కొన్ని రోజులుగడిచాక మనసున నిశ్చయించుకుని శిరిడీకి వెళ్ళాడు. 83. మసీదులో బాబా దర్శనం చేసుకుని వారి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు. పుణ్యరాసియైన

ఆ మహారాజును చూచి, అతనికి ప్రేమ ఉప్పొంగింది. 84.పూలబుట్టను విప్పి పూలమాలను తీసి ప్రేమతో బాబా కంఠంలో వేసి, వారిచరణాలవద్ద ఫలాలను సమర్పించాడు.85.రతన్‌జీ అత్యంత ఆదరంగా వినయంగా బాబా వద కూర్చుని ప్రార్థన చేశాడు దానిని వినండి. 86.'ప్రజలు మహాకష్టాలలో చిక్కుకున్నప్పుడు మీరు వెంటనే రక్షిస్తారని మీచరణాల వద్దకు వస్తారు అన్న విషయాన్ని విన్నాను.87.నేను ఎంతో ఆశతో మీదర్శనం కోసం ఇక్కడివరకూ వచ్చాను.మహారాజా! నన్ను నిరాశతో త్రిప్పి పంపకండి అని మీపాదాల వద్ద విన్నవించుకుంటున్నాను అని అన్నాడు.88.బాబా' అతనితో వస్తా వస్తానుకుంటూ ఇవాళ వచ్చావు.నాకేం దక్షిణను ఇస్తావో ఇవ్వు. నీవు కృతార్థుడవు అవుతావు' అని అన్నారు.89.ఎవరైనా దర్శనానికి వచ్చి బాబా పాదాలకు వందనం చేస్తే, వచ్చినవారు హిందువుగాని ముసల్మాను లేదా పార్సీగాని, బాబా వారిని దక్షిణను అడిగేవారు. 90.అదైనా కొంచెమా! ఒకటో రెండో లేదా అయిదు రూపాయలు. లేదా తమ ఇష్టాను సారం వంద వేయి లక్ష కోటి. 91.ఇచ్చిన తరువాత ఇంకాతెమ్మనేవారు. అయిపోయినై అంటే అప్పు తీసుకునిరా అనేవారు. ఎక్కడా అప్పుకూడా దొరకనప్పుడు అడగటం మానేసేవారు. 92.భక్తులతో ''నువ్వేం చింతపడకు నీకు బోలెడన్ని రూపాయలనిస్తాను. నావద్ద నిశ్చింతగా కూర్చో. 93.'దునియామె కిసీకా కోయిహై, అవుర్ కిసీకా కోఈ హై. అప్‌నాతోయహా కోయీ నహి హై. అప్‌నా అల్లా హి అల్లాహై'.'ప్రపంచంలో ఒకరికి మరొకరున్నారు. నాకైతే ఇక్కడ ఎవరూ లేరు. నాకు అల్లాయే అల్లా'. 94.నన్ను ప్రాణ సమానంగా ప్రేమించే వారు నాకు కరువు. అట్టివారు నాకు ఒక్కటి ఇస్తే నేను వారికి నూరింతలు ఇస్తాను' అని అనేవారు.95.గొప్పలక్షాధికారిని సైతం దక్షిణను అడగటానికి పేదవాని ఇంటికి వెళ్లమని సాయి మహారాజు ఆజ్ఞనిచ్చేవారు. 96.గొప్ప భాగ్యవంతుడైనా భిక్షారియైనా పేదవాడైనా బలహీనుడైనా ఒకరు ఎక్కువ ఒకరు తక్కువా

అని సాయి తలచేవారు కాదు. 97.గొప్ప శ్రీమంతులైనా సరే, వారి ఆజ్ఞను శిరసా వహించి వారి కొఱకు నిరభిమానంగా పేదవారింటికి వెళ్లియాచించేవారు. 98.సారాంశం – బాబా, దక్షిణ అనే మిషతో, నిరహంభావంతో నమ్రతగా ప్రవర్తించమని భక్తులకు బోధించేవారు.99.సాధువులకు ధనమెందుకు అని ఎవరికైనా సంశయం కలగవచ్చు. కాని బాగా ఆలోచిస్తే మనసులోని సందేహం తీరిపోతుంది.100.సాయిబాబా ఏ కోరికలు లేనివారు కదా, మరి వారికి దక్షిణ అంటే డబ్బుతో ఏంపని? భక్తులను డబ్బు అడుక్కునేవారు నిష్కాములెలా అవుతారు?101.రాయిని రత్నాన్ని, రాగినాణాన్ని బంగారు నాణాన్ని, ఒకేలా చూచేవారు చేయి చాచడమెందుకు?102.కడుపునింపుకోవటానికి భిక్షచేసేవారికి, వైరాగ్య దీక్షబూనిన విరక్తునికి, నిరపేక్షునికి డబ్బుపై అపేక్ష ఎందుకు?103.అష్ట సిద్ధులూ చేతులు జోడించుకుని ఎల్లప్పుడూ ఎవరిద్వారం వద్ద కూర్చుని ఉంటాయో, నవనిధులూ ఎవరి ఆజ్ఞను పాటిస్తాయో,అట్టివారు డబ్బును అడుక్కోవలుమా?104.ఐహిక సుఖాలను తన్నివేసి అముష్మికాలవైపు అసలు చూడని సమదర్శికి, విరాగికి ధనమెందుకు?105.ఉత్తమమైన సాధుసజ్జనులు, సత్పురుషులు, భక్త పరాయణులు, భక్తుల శ్రేయస్సు కోసం జీవిస్తారు. వారికి ధనమెందుకు,106.సాధువుకు దక్షిణ ఏమవసరం? వారు ఏకోరికలూ లేకుండా ఉండాలి కదా. ఫకీరులా ఉన్నా లోభం వదలలేదు.నిత్యం డబ్బును ఆరాధించటమా? 107.ప్రథమ దర్శనంలో దక్షిణను పుచ్చుకుని, పునర్దర్శనంలో మరల దక్షిణను అడుగుతారు. చివర సెలవుతీసుకునేటప్పుడూ దక్షిణను తెమ్మంటారు. మాటిమాటికీ ఇదేమిటి? 108.మొదటపానీయం ఉత్తరా పోశమనం. తరువాతహస్తముఖ ప్రక్షాళనం కరోద్వర్తన తాంబూలదానం. ఇవ్వీఅయాకే కదా దక్షిణ.109.కాని బాబాయొక్క క్రమం విచిత్రం. చందన విలేపనంతోనో పుష్పాక్షతలతో అలంకరించేటప్పుడో దక్షిణనిమ్మని కోరేవారు. 110.ఆరంభంలోనే అంటే

పూజార్చనలకు ముందే దక్షిణనుఅడిగేవారు. ఓం తత్ బ్రహ్మార్పణ మస్తు అని వెంటనే అనాలి.111.ఇలా ఎందుకు అన్న సందేహం తీరటానికి ఎక్కువ శ్రమ పడనవసరంలేదు. కాస్త సావధానులై ఉంటే సంశయం నివృత్తి అవుతుంది.112.ధర్మకర్మలను చేయాలనే ఆశయంతోనే ధనాన్ని కూడబెట్టాలి. కాని చాలా ధనం వ్యర్థమైన కోరికల కోసం, విషయ సుఖాలకోసం వెచ్చింప బడుతుంది.113.ధనం ద్వారా ధర్మకార్యాలు జరగాలి. ఆ ధర్మం ద్వారా జ్ఞానం కలగాలి. ధర్మం స్వార్థం కొఱకు చేసినా, పరమార్థమార్గంలో పడి మనసుకు శాంతి లభిస్తుంది.114.మొదట చాలా కాలం వరకు బాబా ఎవరివద్దా ఏమీ తీసుకునే వారు కాదు. కాలిపోయిన అగ్గిపుల్లలనుసేకరించి జేబులో నింపుకునేవారు.115.భక్తులైనా కాకపోయినా ఎవరినీ ఏమీ అడిగే వారుకాదు. ఎవరైనా దమ్మిడి దుగ్గాని ఇస్తే దానితో పొగాకు లేదా నూనె తెప్పించే వారు.116.వారికి పొగాకు ఇష్టం. బీడిగాని చిలుముగాని పీల్చేవారు. ఆ చిలుం గొట్టం యొక్క సేవ కూడా అపారం. చాలా వరకు అది పొగలేకుండా ఉండేది కాదు.117. సత్పురుషుల దర్శనానికి, దక్షిణ లేకుండా రిక్త హస్తాలతో ఎలా వెళ్లాలని ఎవరికైనా అనిపిస్తుంది. అందువలన బాబా దక్షిణను తీసుకునేవారు.118.దమ్మిడిని ఇస్తే దానిని జేబు లో వేసుకునేవారు. ఎవరైనా రెండు పైసల నాణాన్ని ఇస్తే, దాన్ని అలాగే తిరిగి ఇచ్చేసేవారు. ఇలా చాలా కాలం గడిచింది.119.తరువాత కొంత కాలానికి సాయిబాబా మహాత్మ్యం పెరిగింది. భక్తులు గుంపులు గుంపులుగా రాసాగారు. పద్ధతి ప్రకారం పూజలు జరిగేవి.120.సువర్ణ పుష్పం అంటే దక్షిణ లేకుండా పూజపూర్తికాదు. ఈ పూజా విధానం పూజచేసేవారికి తెలుసు. 121.రాజాభిషేకంలోను, పాదపూజలలోను పూజచేసేవారు కానుకలను తెస్తారుకదా,అట్లేగురుపూజలోకూడా దక్షిణను సమర్పిస్తారు. 122. దక్షిణను ఇచ్చేవారు ఉన్నత స్థితిని పొందుతారు. సువర్ణదానం చేసినవారు పరిశుద్ధ

చిత్తులై జ్ఞానులౌతారని వేదమంత్రాలలో చెప్పబడి ఉంది.123.చందన ప్రదానంవలన సౌమంగల్యం, అక్షతలనర్పిస్తే ఆయువర్ధనం, పుష్పాలు తాంబూలాన్ని అర్పిస్తే ఐశ్వర్యం, దక్షిణను సమర్పిస్తే ధనసమృద్ధి.124.పూజా ద్రవ్యాలలో గంధాక్షతలు పూలు తాంబూలం ముఖ్యమైనట్లే, సువర్ణ పుష్పం అంటే దక్షిణ కూడా అవసరం. దక్షిణతో బహుధనప్రాప్తి. 125.దేవతల పూజలలో దక్షిణ అవసరమైనట్లే వ్రతాలు ఉద్యాపనలు వాయనదానాలందు బంగారాన్ని అర్పించటం ఆచారం.126. ప్రపంచంలో ఇచ్చిపుచ్చుకునే సకల వ్యవహారాలన్ని డబ్బుకారణంగానే. ప్రజలు తమ ప్రతిష్ఠకు భంగం వాటిల్లినప్పుడు దానిని తొలగించుకోవటానికి డబ్బు ఖర్చు చేస్తారు.127. హిరణ్యగర్భ గర్భస్థ మొదలగు మంత్రాలను ఉచ్చరిస్తారు. దేవతల పూజలలో అవసరమైన దక్షిణ మరి సత్పురుషుల పూజలో ఎందుకు అవసరముండదు ?128.సత్పురుషుల దర్శనానికి వెళ్ళినప్పుడు తమతమ జ్ఞానాన్ని బట్టి ఎవరికి తోచిన విధంగా వారు వస్తారు. అందఱూ ఒకేలా అనుకోవటం సంభవం కాదుకదా! 129.భక్తిగాభజన చేయాలనే భావం ఒకరి మనసులో ఉంటే, సత్పురుషులను పరీక్షించాలనే కోరిక మరొకరికి ఉంటుంది.మనసులోని విషయాలను చెప్పేవాడే సత్పురుషుడు అని ఒకరు అంటారు.130. దీర్ఘాయువును ఒకరు వేడుకుంటే , ఏనుగు బంగారం సంపదలను మరొకరు పుత్రపౌత్రులను ఎన్నడూ తరగని శక్తిని ఇంకొకరు అడుగుతారు.131.బాబా యొక్క అగాధ లీల విచిత్రం. వారిని అవహేళన చేయాలని ఎవరైనా వెళ్లితే వారి దుర్బుద్ధి నశించి భస్మమై బాబా చరణకమలాలపై పడిపోయేవారు. 132.వారికి ఇంతటి భాగ్యంలేకపోతే, అనుతాపంతో పశ్చాత్తాపపడి అహంకారం తొలగిపోగా ప్రత్యక్ష అనుభవాన్ని ఎలాపొందేవారు.133. సర్వసాధారణంగా భక్తులు ప్రాపంచిక విషయాలలో ఆసక్తులై ఉంటారు. దక్షిణ ప్రదానంవలన వీరి చిత్తం పరిశుద్ధమవాలని బాబాసంకల్పం.134.'యజ్ఞేన దానేన తపసా' ఈ వేదవాక్యంలో

ఆత్మజ్ఞానాన్ని పొందాలన్న ఉత్సుకత గలవారికి దక్షిణ ప్రదానం సాధనోపాయమని స్పష్టంగా చెప్పబడి ఉంది. 135. భక్తులు స్వార్థులుగాని పరమార్థులు గాని తమ మనోభీష్టప్రాప్తికి, తమ శ్రేయస్సు కోసం గురువులకు దక్షిణను ఇవ్వాలి. 136. ప్రజాపతి తన సంతానమైన దేవతలకు దైత్యులకు మానవులకు వారి బ్రహ్మచర్యం ముగిసిన తరువాత, ఉపదేశాన్ని కోరినప్పుడు ఇదే చెప్పాడు. 137. 'ద' అను ఒక అక్షరాన్ని ఉపదేశం చేశాడు. దీనిని వారెలా గ్రహించారో తెలుసుకుని దానిని దృఢ పరచాడు. గురుశిష్యుల లీల విలక్షణమైనది. 138. 'ద' అంటే దమనం సంయమంతో ఉండాలని దేవతలు, దయకలిగి ఉండాలని అసురులు, దానమివ్వాలని మానవులు అర్థం చేసుకున్నారు. దానిని ప్రజాపతి బాగా ఉందని సమర్థించాడు. 139. దేవతలు అన్యులెవరో కాదు. మానవులేకాని భిన్న స్వభావం కలవారు. ఉత్తమగుణసంపద ఉండి సంయమం లేనివారిని దేవతలని అంటారు. 140. దుష్టులు క్రూరులు హింసా పరులైన రాక్షసులు మానవులలోనే ఉన్నారు. మానవులను భయంకరమైన లోభం పీడిస్తూ ఉంది. ఇలా మానవులు మూడు రకాలుగా ఉంటారు. 141. మానవుల ప్రధానమైన అవగుణం లోభం. కృపాసాగరులైన సాయినాథులు, భక్తులకు తమ చేతిని అందించి ఈ లోభమనే గోతిలో నుండి పైకి లాగుతారు. 142. తైత్తిరీయ ఉపనిషత్తులోని పదకొండవ అనువాకంలో అనేక రకాల దానంలోని పద్ధతులు విధించబడి ఉన్నాయి. వానిలో ముఖ్యమైన వానిని వినండి. 143. దానం ఎప్పుడూ శ్రద్ధతో ఇవ్వాలి. శ్రద్ధ లేకుండా ఇస్తే ఫలితం ఉండదు. రాజాజ్ఞ పట్ల, శాస్త్రాజ్ఞ పట్ల భీతి ఉండాలి. ఏదైనాసరే అణకువతో సిగ్గుపడుతూ ఇవ్వాలి. 144. వివాహాది శుభసందర్భాలలో కానుకలను, డబ్బును ఇవ్వవలసి ఉంటుంది. అలా ఇచ్చి మిత్రధర్మాన్ని నిలబెట్టుకోవాలని ప్రాపంచిక వ్యవహారం మనకు బోధిస్తుంది. 145. భక్తుల శ్రేయస్సు కొఱకు సాయిబాబా కూడా భక్తులను 'ద'కారాన్ని అడిగేవారు. దయ కలిగి ఉండండి,

దానం చెయండి, సంయమంతో ఉండండి. అత్యంత సుఖాన్ని పొందుతారు. 146. దయలేకుండా, సంయమం లేకుండా, దానం చేయకుండా ఉండటం– ఈ మూడుదోషాలను తొలగించటానికి గురుదేవులు భక్తులకు 'ద' అనే ఏకాక్షర చిన్న ఉపాయాన్ని తెలియ చేశారు. 147. కామం, క్రోధం మరియు లోభం ఇవి ఆత్మోన్నతికి అవరోధాలు. వీనిని జయించటం అత్యంత కష్టం. కనుక దానికిది సులభోపాయం. 148. శ్రుతిలోవలెనే స్మృతిలో కూడా ఇది చెప్పబడి ఉంది. శ్రోతలకు వివరంగా తెలియటానికి క్రింద వ్రాస్తున్నాను. 149. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః, కామఃక్రోధః స్తథా లోభస్తస్మాత్ ఏతత్ త్రయం త్యజేత్. (భగవద్గీత- 16వ అధ్యాయం 21 వశ్లోకం) కామక్రోధలోభాలు నరకానికి మూడు ద్వారాలు. వీనివల్ల ఆత్మవినాశనం. అందువలన ఈ మూడింటినీ త్యజించాలి. 150. పరమ దయాళువైన సాయి సమర్థులు భక్తుల శ్రేయస్సును సాధించటానికి వారి కొఱకే దక్షిణను అడిగి వారికి త్యాగాన్ని బోధించేవారు. 151. అసలు దక్షిణ యొక్క విశిష్టత ఏమిటి? గురువు యొక్క ఉపదేశాన్ని సాధించటానికి ప్రాణాలను సైతం ఇవ్వటానికి సిద్ధంగా లేనివారికి పరమార్థమెలా సిద్ధిస్తుంది. 152. వాస్తవానికి భక్తుల శ్రేయస్సు కొఱకు కాకపోతే, బాబాకు దక్షిణను అడిగే అవసరమేముంది? వారి జీవితం దక్షిణపై ఆధారపడిలేదు. 153. వారు పొట్టకోసం భిక్షను అడుక్కునేవారు. దక్షిణవారి స్వార్థం కోసం కాదు, దక్షిణ ప్రదానంతో భక్తుల మనసులు పరిశుద్ధం కావాలని వారి ఉద్దేశం. 154. పైన సూచించిన వేద వచనాను సారం, దక్షిణ ప్రదానం నెరవేరకుండా పూజ సంపూర్ణం కాదు. 155. ఈ దక్షిణ ప్రసంగాన్ని ఇక చాలిద్దాం. దక్షిణ యొక్క ఉద్దేశాన్ని బాగా చర్చించడమైంది. బాబాకు దక్షిణ పై అభిలాషలేదు. కేవలం భక్తుల మంచి కొఱకే దక్షిణను గ్రహించటం. 156. ఇక తరువాత కథా భాగాన్ని మనవి చేస్తాను. రతన్‌జీ యొక్క దక్షిణ ఉదంతాన్ని సాయి యొక్క విచిత్ర లీలను వినండి. 157. ఈ

అద్భుతమైన కథను శ్రోతలు ఆదరణతో విని, అలౌకికమైన సాయి యొక్క సర్వవ్యాపకత్వాన్ని గ్రహించండి. 158. సేటును దక్షిణను అడిగినప్పుడు, సాయి అతని పూర్వ వృత్తాంతాన్ని తెలియ చేసినప్పటికీ, అది సేటుకు అర్థం కాక అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.159. 'నీవు 3 రూపాయల 14 అణాలను నాకు ఇచ్చావు. అది నాకు తెలుసు. ఇప్పుడు నా కొఱకు తెచ్చిన మిగతా దక్షిణను ఇవ్వు' అని చెప్పారు.160. రతన్‌జీకి బాబా యొక్క ప్రథమ దర్శనం అదే. బాబా మాటలనువిని ఆసేటు ఆశ్చర్య చకితుడై గుర్తు తెచ్చుకో సాగాడు.161. తను మునుపు ఎప్పుడూ శిరిడీకి రాలేదు. ఎవరితోనూ ఏమీ పంపలేదు. అలాంటప్పుడు సాయిబాబా చెప్పినది ఆశ్చర్యం కాదూ!162. రతన్‌జీ మనసులో చాలా ఇబ్బంది పడ్డాడు. దక్షిణను ఇచ్చి బాబా పాదాలపై పడ్డాడు. అతనికి బాబా అన్న గూఢమైన మాట అర్థం కాలేదు.163. ఆ చిక్కు అట్లే ఉండి పోయింది. తను వచ్చిన కారణం బాబాకు మనవి చేసి వారి చరణాలకు మరల సాష్టాంగ నమస్కారంచేసి చేతులు జోడించుకుని కూర్చున్నాడు. 164. సేటు మనసులో చాలా తృప్తిచెందాడు. 'బాబా! నా పూర్వజన్మభాగ్యం ఉదయించి మీ చరణాల దర్శనం లభించింది. 165. నేను దౌర్భాగ్యుణ్ణి. అల్పజ్ఞుణ్ణి. నాకు పూజార్చనలు యజ్ఞాలు తెలియవు. భాగ్యవశాత్తు త్రికాలజ్ఞులైన మీదర్శనం లభించింది. 166. మీకు నాచింత తెలుసు. దానిని తొలగించండి. దయామయా! నేను మీ అనన్య భక్తుణ్ణి. మీ పాదాలను ఆశ్రయించాను. నన్ను తరిమి వేయకండి'. 167. అని వేడుకున్నాడు. సాయినాథునికి దయ కలిగింది. 'వృథాగా చింతించకు. నీ దురదృష్టం ఇప్పటినుండి తొలగిపోయింది,168. అని విభూతి ప్రసాదాన్ని చేతిలో పెట్టి, తమ కృపాహస్తాన్ని అతని శిరసుపై ఉంచి, నీమనో భీష్టాన్ని అల్లా తీర్చుతాడు' అని సేటును ఆశీర్వదించారు. 169. రతన్‌జీ బాబా ఆజ్ఞను తీసుకుని నాందేడు మరలివచ్చాడు. దాసగణుకు జరిగినది సవిస్తరంగా చెప్పాడు.

170.'నా భాగ్యం కొద్దీ బాబా దర్శనమై నామనసు ఆనందంతో నిండి పోయింది. వారు ప్రసాదాన్ని ధైర్యాన్ని ఇచ్చారు. వారి ఆశీర్వాదాన్ని పొందాను. 171.అన్నీ సవ్యంగానే జరిగాయి ఒకటి నాకసులు అర్థం కావటం లేదు. సాయిమహారాజు ఏమన్నది నాకు బోధపడలేదు. 172.3రూ। 14 అణాలు నీవు నాకిచ్చావని తెలుసు. బాబా ఎందుకలా అన్నారు నాకు స్పష్టంగా చెప్పండి. 173.నేను మొదటి సారిగా శిరిడీ వెళ్లాను కదా, మరి నేను ఎప్పుడు వారికి ఈ రూపాయలు అణాలు ఇచ్చాను? దీనిలోని భావంతెలియటం లేదు. 174. దీనిలోని గూఢార్థాన్ని నేను తెలుసు కోలేకుండా ఉన్నాను. దీనిలోని అర్థం మీ కేమైనా బోధపడిందా' అని అడిగాడు. 175.ఈ చమత్కారం లోని సారాంశం ఏమిటి? ఏంతోచకుండా ఉందే అని దాసగణు ఆలోచించసాగాడు. 176.అతనికి మౌల్వీసాహెబు అని పిలువబడే ఒక అవలియా గుర్తుకు వచ్చాడు. 177.ముసల్మాను జాతీయుడైనా అతని కార్యకలాపాలు సాధువులను పోలి ఉంటాయి. ప్రారబ్ధానుసారం హమాలి పని చేస్తూ తనవిధులను నిర్వహించేవాడు.178.ఇక్కడ అతని చరిత్రను సవిస్తరంగా వ్రాయాలంటే ఈ గ్రంథంలోని విషయం మారి పోతుంది.అతని గూర్చి నాందేడులో అందరికీ తెలుసు. 179.రతన్‌జీ శిరిడీకి వెళ్లాలని నిశ్చయించుకున్నాక మౌల్వీసాహెబు అనుకోకుండా అతని ఇంటికి వచ్చాడు. 180.ఆ ఉభయుల మధ్య అమితమైన ప్రేమ ఉండేది. అతనికి ఫలాలను పుష్ప హారాలను సమర్పించాడు.181.సేటుకు ప్రేరణకలిగి అతనికి పూలమాల ఫలహారాలతో ఒక చిన్నవిందును ఏర్పాటు చేశాడు. ఆవిందుకు చేసిన ఖర్చు దాసగణుకు గుర్తుకు వచ్చింది. 182. ఆవిందుకు ఖర్చు చేసిన జాబితాను తెప్పించాడు. ప్రతి పైసాను లెక్కపెట్టి మొత్తం ఖర్చు చూడగా బాబా చెప్పిందానికి సరిగ్గా సరిపోయింది. 183.3రూ। 14 అణాలు.అంతకు ఎక్కువాకాదు తక్కువాకాదు.సరిగ్గా అంతే. ఆ ఖర్చు రసీదును బాబా ఇవ్వటం అందరికీ అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించింది.

184.సాయి మహారాజు జ్ఞానరాసి. మసీదులో కూర్చునే భూతభవిష్యవర్తమానాలు ఎక్కడ ఏ దేశంలో జరిగినా తెలుసుకుంటారు.185.సర్వప్రాణులతో సాయి సమర్థులకు ఏకత్వభావముంటే తప్ప ఇలా ఇతరుల అనుభవాన్ని చెప్పగలరా?186.శిరిడీ నుండి నాందేడుదూరం. రెంటిమధ్యన చాలా అంతరం ఉంది. ఉభయ సాధువులూ ఒకరిని ఒకరు ఎఱుగరు. మరి ఈ తంతివార్త సాయికి ఎలా వచ్చింది?187.సాయి మహారాజు వేరు, మౌల్వీసాహేబు వేరు అన్న భేదబుద్ధి ఆ ఉభయులలోనూ లేదు.188.మౌల్వీలోని ఆత్మ అందరిలోనూ ఉన్న సర్వాంతరాత్మ. ఇటువంటి ఏకాత్మభావంలోని మర్మాన్ని తెలుసుకున్నవారు ధన్యులు.189.ఆ ఇద్దఱి శరీరాలు పైకి వేరువేరుగా ఉన్నా లోపల ఇద్దఱూ ఒక్కటిగానే ఉన్నారు. వారిని ఇద్దఱు అని చెప్పటం సరికాదు. ఎందుకంటే వారు వేరువేరుగా ఎప్పుడూ లేరు. 190.ఆ ఇద్దఱిదీ ఒకే జ్ఞానం, ఒకే ప్రాణం,ఒకే అనుసంధానం. సమసమానంగా ఒకే వృత్తి. ఒకే చైతన్యం. 191.శిరిడీ నాందేడుల మధ్య చాలా దూరం. అయినా ఆ ఇద్దఱిలో ఒకే మనసు. ఒకరు శరీరమైతే ఒకరు ప్రాణం. అందువలననే వారిద్దఱి మధ్య తంతి వార్త.192.ఈ సత్పురుషులు ఎంతటి అద్భుతమైన వారు. సృష్టిలో ఎక్కడ ఏం జరిగినా, తంతి యంత్రంలో ఏ తీగలు లేకుండానే వారికి సమస్తం అవగతమవుతుంది. 193.తరువాత కొంత కాలానికి దైవానుగ్రహం వలన రతన్‌జీ భార్య గర్భం ధరించింది. అతని ఆశావృక్షం ఫలించింది. 194.ఒక శుభ సమయాన భార్య ప్రసవించింది. బాబా ఆశీర్వచనం సత్యమై అతనికి పుత్ర రత్నం ప్రాప్తించగా రతన్‌జీ ఆనందించాడు.195.అనేక సంవత్సరాలు వర్షాలు లేనిచోట అకస్మాత్తుగా పర్జన్యుడు వర్షించినట్లు, పుత్ర సంతాన ప్రాప్తితో సేటు పూర్తిగా సంతృప్తి చెందాడు.196.అలా ఆ వంశవృక్షం ఫలించింది. క్రమక్రమంగా అభివృద్ధి అయిన సంతానం తో రతన్‌జీ సుఖంగా ఉన్నాడు.197తన మనోభీష్టం తీరిన తరువాత, రతన్‌జీ సాయి దర్శనానికి

వెళ్లి వారి ఆశీర్వాదాలను పొంది సంతుష్టుడయ్యాడు. 198.వసంతంలో మామిడికాయలు బాగా కాసినా అన్నీ ఫలాలు కావు. అట్లే పన్నెండుగురు సంతానంలో నలుగురు బ్రతికారు. ప్రస్తుతం సుఖంగా ఉన్నారు 199.ఏం జరిగినా మనసు సంతృప్తి చెందాలని శాంత స్వభావుడైన రతన్‌జీ కించిత్తైనా విచారించలేదు.200.ఇక తరువాత కథాసారం. సాయి స్థిర చరాలలో నిండి ఉన్నారు. ఎవరైనా సరే ఎక్కడైనా స్థిరంగా కూర్చుని కూడా ఈ అనుభవాన్ని పొందవచ్చు. 201.థాణా పట్టణంలో నిస్సహాయుడైన చోళ్కరు అను ఒక పేదవాడు ఉండేవాడు. అతని భక్తి భావానికి గురువు ప్రసన్నులయ్యారు. 202.అతడు సాయిని మునుపెన్నడూ చూడకుండానే మొక్కుకోగా అతని కోరిక తీరటం, బాబా అతనికి చక్కటి అనుభవాన్ని కలగచేయటం గురించి వినండి.203.ప్రేమలేని భజన, అర్థం తెలుసుకోకుండా గ్రంథపఠన, భక్తిలేకుండా దేవుని పూజ ఇవన్నీ వ్యర్థం.204. కుంకుమతిలకంలేని నొసలు, అనుభవంలేని జ్ఞానం వ్యర్థం. ఇవి పుస్తకాలలో నేర్చిన విద్యతో చెప్పేది కాదు. ఈ విలువను అనుభవంతో గ్రహించాలి. 205.ఈ సాయిలీలా ప్రబంధం ఎందు నిమిత్తం? దీనితో అనుబంధమేమిటో నేను ఎఱుగను. బాబా ఏ ప్రయోజనానికి నాతో దీనిని వ్రాయిస్తున్నారో వారికే తెలుసు. 206.అంతేకాక గ్రంథరచనకు అల్పత అవసరం. కేవలం నేను వారి సేవకుణ్ణి. వారి అనుమతి తోనే ఈ కార్యాన్ని నిర్వహిస్తున్నాను. 207.చాతక పక్షులవలె తృష్ణార్తులైన శ్రోతల దప్పికను తీర్చటానికి, స్వానంద ఘనులైన సాయి సమర్థులు, ఈ అగాధమైన కథా పానీయాన్ని వర్షింప చేశారు. 208.ఎవరి శక్తి ప్రభావంతో ఈ వాక్కు ఈ చరిత్రను వర్ణిస్తుందో వారి చరణధూళి కణాలలో నా ఈ శరీరాన్ని దొర్లిస్తాను. 209.ఈ వాక్కును నడిపించేది వారే. నా ద్వారా తమ కథను చెప్పించేది వారే. నాచంచల చిత్తం వారి పాదాలయంచే స్థిర పడుగాక. 210.ఈ శారీరక మరియు వాచిక కార్యముల వలనే, అక్షయసుఖదాయకమైన

మానసిక భజన కూడా జరుగుగాక .211.నేను సాయిబాబా యొక్క విధేయుడనైన పాద సేవకుడను. ఈ చరిత్రను చెప్పటం చెప్పించటం సాయియే అయినప్పుడు శ్రోతలు మాత్రం వేరు ఎలా అవుతారు? వారు కూడా సాయి కంటె వేరు కారు. 212.ఇది కేవలం చరిత్రలా కనిపిస్తుంది. కాని ఈ సకలమూ సాయి యొక్క లీల. సాయి స్వయంగా ప్రేమతో ఈ లీలను నిర్వహించారు. 213.సాయిబాబా చరిత్ర అగాధం. బాబా నన్ను నిమిత్త మాత్రునిగా చేసి తమ భక్తులకు విచిత్రమైన అనుభవాలను కలుగచేసి భక్తులను సంతుష్ట పరుస్తారు.214.ఇది చరిత్ర మాత్రమే కాదు.సుఖాలకు నిలయం.మధురమైన పరమామృతం.భాగ్యమున్నవారు దీనిని భక్తిభావంతో సేవించాలి. 215.విచిత్రమైన గురుకృపా మహిమను మనం భక్తులం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని మరియు భక్తులకు శాంతి కలగాలని నేను గ్రంథరచనకు శ్రమ పడ్డాను.216.ప్రేమతో ఈ చరిత్రను గానం చేస్తే భక్తులకు శ్రవణంలో ఆనందం అధికమౌతుంది. కథను చెప్పటంతో భక్తులకు భక్తి ప్రేమలు పెరుగుతాయి .217. అహోరాత్రాలూ శ్రవణం చేస్తే మాయామోహ బంధనాలు విడిపోతాయి. త్రిపుటి తొలగిపోయి శ్రోతలు సుఖసంపన్నులవుతారు. 218.హేమాడ్ శ్రీసాయి చరణాలను పట్టుకుని అనన్యభావంతో శరణు జొచ్చుతున్నాడు. మరియు ఆ చరణాలను క్షణమైనా విడువకుండా అఖండ సాష్టాంగ ప్రణామం చేస్తున్నాడు.219. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో రతన్‌జీ సాయి సమాగమమను పదునాలుగవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 15 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

అపారమైన పుణ్యం పండిన వారికే సాయిబాబా దర్శనం లభిస్తుంది. త్రితాపాలు వారిని బాధించవు పైగా సాధనలతో పరమార్థం సాధిస్తారు. 1.దయచేసి శ్రోతలు ఒక క్షణం గురువును ధ్యానించి, ఈ కథల యందు శ్రద్ధ కలిగి మీ దృష్టిని నావైపు మళ్లించండి. 2.మాకు తెలుసు, వృథా ప్రయాస మీకెందుకు అని అనకండి. మిమ్ము సముద్రంతో పోల్చుతున్నందుకు నన్ను క్షమించండి. 3.సాగరం అంతులేకుండా అనంతంగా నిండి ఉన్నా, నదులను వెనుకకు పంపదు. సహస్ర ధారలతో మేఘాలు వర్షించినా ఆ నీటికి కూడా చోటిస్తుంది.4. అట్లే మీరు సజ్జనులైన శ్రోతలు, మీతో సహవాసం చేయాలని నా కోరిక. నన్ను తిరస్కరించకండి. దీనులను త్యజించటం మంచిది కాదు.5.నిర్మలమైన గంగా జలంగాని, ఊరిలోని మురికి నీటి ప్రవాహంగాని, సాగరగర్భంలో రెంటికీ చోటుంటుంది. ఆ సాగర సంగమం వల్ల ఎటువంటి అలజడి ఉండదు.6.అందువలన సత్పురుషుల కథా శ్రవణమందు శ్రోతలకు ఉన్న ఆసక్తి వలననే సాఫల్యతను పొందగలరు. కనుక నాయందు దయ ఉంచండి. 7.ఈ కథామృతాన్ని, సాదరంగా శ్రద్ధాసహనాలతో సేవిస్తే శ్రోతలు ప్రేమతో కూడిన భక్తిని పొంది కృతకృత్యులవుతారు. 8. మరియు శ్రోతలు భక్తిని ముక్తిని, భక్తులు సహజంగా పరమప్రాప్తిని పొందుతారు. భావార్థులకు సుఖశాంతులు ,అందరి మనసులకూ విశ్రాంతి లభిస్తాయి.9.గురువు నోటి నుండి వెలువడిన మధురగాథను వింటే భవభయవ్యథ

తొలగిపోతుంది. ఆత్మతత్వం స్వయం ప్రకటమై శ్రోతల మనసులకు ఆనందం కలుగుతుంది. 10.ఈ అధ్యాయంలో ప్రేమమయుడైన ఒక భక్తుడు సాయిని ప్రార్థించగా, వారు అతనికి దర్శనమిచ్చి ప్రసన్నులయిన విషయాన్ని వినండి.11. అప్పుడే పాలు త్రాగినా పిల్లి పిల్లలు, బయటికి వెళ్లితిరిగి వచ్చిన తల్లి పిల్లి పై పడి మరలమరల పాలు త్రాగటానికి పరుగెత్తుతాయి.12.అప్పుడు ఆ పిల్లివిసుగుతో గుర్‌గుర్ మంటే ఒక క్షణం అణిగిఉండి, తల్లి కూచుంటే చాలు పిల్లలుదాని చుట్టూచేరి ప్రేమగా తిరుగుతాయి.13.పిల్లలు పాలు త్రాగటానికొచ్చినప్పుడు ప్రేమతో పిల్లికి పాలు చేపగా అది గుర్‌గుర్‌మని అనకుండా ప్రీతిగానేలపై కాళ్లు చాపుకుని ఒరుగుతుంది. 14.ప్రేమ జనించగానే విసుగుమాయమవుతుంది. పిల్లలను గట్టిగా పెనవేసుకుని మాటిమాటికీ నాకుతుంటుంది.ఎంతటి విచిత్రమైన దృశ్యం.15.పిల్లలు వాడి,గోళ్లతో తల్లి పొదుగును గోకుతుంటే, ప్రేమరుచి అధికమై పాలు అనేక ధారలుగా బాగా వచ్చేలా చేస్తాయి.16.ఆ పిల్లి పిల్లల అనన్య ప్రేమోత్పత్తికి, తల్లికి పాలధార ఉత్పన్నమయ్యేలా,సాయి పాదాలయందున్న మీ ఆసక్తి భక్తి సాయి మనసును ద్రవింప చేస్తుంది.17.ఒకసారి హరిభక్తి పరాయణుడైన దాసగణుగారి శ్రావ్యమైన సంకీర్తనను థాణా ప్రజలు కోపీనేశ్వరాలయంలో ఏర్పాటు చేశారు. 18.దాసగణు సజ్జనుల ప్రార్థనతో హరి కథను వినిపించేవాడు. కాని ఒక గవ్వైనా స్వీకరించేవాడుకాదు. అలా అని దురభిమానంగా ఉండేవాడు కాదు.19. కీర్తనకు గవ్వైనా ఇవ్వనుసరం లేదు.అతని శరీరంపైన చొక్కాగాని తలపైనపాగాగాని ఉండేవి కావు. నడుముకు సాధారణమైన పంచె ఉండేది అంతే. అయినా శ్రోతలు అమితంగా వచ్చేవారు. 20.అతని ఈ దుస్తుల కథను వింటే ఎంతో వినోదంగా ఉంటుంది. బాబా యొక్క కౌశలాన్ని స్పష్ట చిత్తులై వినండి. 21.ఒకసారి శిరిడీ గ్రామంలో దాసగణు కథ ఉండగా అతడు శరీరం పైన కోటు,కండువా,తలకు పాగా కట్టి బయలుదేరాడు.22.ఆచారపద్ధతి ననుసరించి

వెళ్ళి బాబా పాదాలకు ఆనందంగా వందనం చేయగా, బాబా 'వాహ్వా! పెళ్లికొడుకులా అలంకరించుకున్నావు. 23. ఇలా శృంగారించుకుని ఎక్కడికి వెళుతున్నావు?' అని అతనిని ప్రశ్నించారు. 'కీర్తన చేయటానికి వెళ్ళుతున్నాను' అని గణు జవాబిచ్చాడు. 24. బాబా మరల అతనితో 'అంగరఖా ఉత్తరీయం తలపాగా ఇవన్నీ ఎందుకు? ఎందుకోసం ఇంత ప్రయాస? మనకివేవీ అవసరం లేదు. 25. వీనిని నా ఎదుట తీసివేసేయి. శరీరంపైన వీని భారం ఎందుకు?' అని చెప్పారు. అప్పుడు వారి ఆజ్ఞాను సారం దాసగణు వానిని వారి చరణాల యందుంచాడు. 26. అప్పటి నుండీ ఇప్పటి వరకూ అతడు కీర్తన సమయాలలో ఎప్పుడూ, చొక్కాలేకుండా చేతిలో చిరుతలు మెడలో మాలను ధరించేవాడు. 27. ఆచారానికి ఇది విరుద్ధమైనా ఇది అత్యంత పరిశుద్ధమైన పద్ధతి. ఇది ప్రబుద్ధులలో ప్రబుద్ధుడైన నారదుని ప్రసిద్ధ మార్గం. 28. ఇది నారదీయ మూల సంప్రదాయం. ఇక్కడి నుండే హరిదాసుల పరంపర మొదలైంది. వీరి ధ్యేయం అంతరంగ పరిశుద్ధత. బాహ్యాలంకారాలు వీరికి అవసరం లేదు 29. అధోభాగాన్ని మాత్రం వస్త్రంతో కప్పుకుని, చిరుతలు తంబూరా వాయించుకుంటూ నోటితో హరినామాన్ని ఉచ్చరిస్తూ ఉండే నారదుని రూపం అందరికీ పరిచయమే. 30. సాయి సమర్థుని కృపతో దాసగణు సత్పురుషుల కథలను తాను స్వయంగా రచించి, ఏ కానుకలు తీసుకోకుండా కీర్తనలు చేసి ప్రసిద్ధి చెందాడు. 31. సాయి భక్తియందు మరింత ఉత్సాహాన్ని విస్తరింప చేశాడు. ఆత్మానంద సాగరం వంటి, సాయి ప్రేమరసాన్ని పెంపొందించాడు. 32. భక్త శిరోమణియైన చందోర్కరు అత్యంత ఉపకారం చేశాడు. సాయి చరణ భక్తి బాగా విస్తరించడానికి అతడే మూల కారణం. 33. దాసగణు శిరడీకి రావడం నానా చందోర్కరుని కారణంగానే. అనేక ప్రదేశాలలో దాసగణు హరి కీర్తనలు, సాయిబాబా భజనలు చేసేవాడు. 34. పూణే, శోలాపూర్, నగర్ జిల్లా మొదలైన ప్రాంతాలలో సాయి మహారాజు ఖ్యాతి అదివరకే

వ్యాపించి ఉంది.కాని కొంకణ ప్రాంతంలోని ప్రజలలో సాయి భక్తిని వ్యాపింప చేసింది వీరిద్దరే.35.వీరిద్దరి మూలంగానే ముంబై ప్రాంతంలో సాయి భక్తి వ్యాపించింది. వీరి ద్వారా దయామయులైన సాయి ప్రచారం జరిగింది.36.శ్రీ కోపీనేశ్వరమందిరంలో సాయిదయతో హరి నామ జయజయకారాల మధ్య సంకీర్తన జరుగుతుండగా చోళ్కరుకు ఒక కోరిక కలిగింది.37.సంకీర్తనకు ఆనేకమంది వస్తారు. పలురకాల శ్రోతలుంటారు. కొందఱికి హరిదాసుగారి చెప్పేపద్ధతి, వారి హావభావాలు కొందఱికి ఇష్టం. 38.మరి కొందఱికి వారిగానం నచ్చుతుంది. వాహ్వా! దాసుగారు ఎంతబాగా గానం చేస్తారు. విఠల నామ సంకీర్తనలో ఎలా విలీనమై పోతారు, కథ చెబుతూ ఎంత బాగా నృత్యం చేస్తారు అని సంతోషిస్తారు.39.కొందఱికి పూర్వరంగ భక్తి, కొందఱికి కథా భాగంలోఆసక్తి, కొందఱికి హరిదాసు ఇతరులను అనుకరిస్తూ చేసే హాస్యం రుచిస్తుంది. కొందఱికి కథలు ఇష్టం.40.హరిదాసు విద్యలేని వాడా విద్వాంసుడా టీకా తాత్పర్యాలను బాగా చెప్పగలిగే పండితుడా లేదా కేవలం కథలు చెప్పడంలో ప్రవీణుడా అని, కథా శ్రవణం చేసేవారి అలోచనా పద్ధతి ఇలా ఉంటుంది. 41.ఈ విధంగా శ్రోతలు అనేకరకాలుగా ఉంటారు.కాని శ్రవణంలో శ్రద్ధా భక్తిని పెంచుకుని పరమేశ్వరుని యందు, సత్పురుషుల చరణాల యందు ప్రీతి కలిగి ఉండే శ్రోతలు అరుదు.42.ఎంతగా శ్రవణం చేసినా అజ్ఞాన పొరలు అలాగే ఉంటే ఆ శ్రవణం వ్యర్థమేగాని దానివల్ల ఏం ప్రయోజనం?43.మలక్షాళనం చేయలేని దానిని సబ్బు అని అనగలమా? అజ్ఞాన నిరసనం చేయలేని దానిని శ్రవణం అని అంటామా?44.అసలే చోళ్కరు మంచి భక్తి కలవాడు. సాయిపై అతనికి ప్రేమ ఉప్పొంగింది. 'సాయి దయామయా! ఈ దీనుని అనుగ్రహించు' అని మనసులో వేడుకున్నాడు. 45.పాపం డబ్బులేని పేదవాడు. కుటుంబభారాన్ని మోయలేని అసమర్థుడు. ప్రభుత్వ పదవిలో కుటుంబానికి

సరిపడా సంపాదనను ఇప్పించాలని బాబా పైభారం మోపాడు.46.తమ అభిష్టాలు తీరితే చక్కని భోజనాన్ని పెడతామని, లేదా బ్రాహ్మణ సంతర్పణ చేస్తామని కోరికలున్నవారు మ్రొక్కుకుంటారు.47.శ్రీమంతులు తమ మనోకామన సిద్ధిస్తే వేయిమందికి భోజనం పెట్టుతామని లేదా శత గోదానాలను చేస్తామని మ్రొక్కుకుంటారు. 48.చోళ్కరు అసలే పేదవాడు. మ్రొక్కుకోవాలని అనిపించింది. సాయి చరణాలను ధ్యానించి దీనంగా వేడుకున్నాడు. 49.'బాబా! నాది పేద సంసారం. ఉద్యోగంపైనే ఆధారపడ్డాం. ఉద్యోగం ఖాయం కావాలంటే పరీక్ష ఉత్తీర్ణుడనవ్వాలి.50. నా జీవితం ఉద్యోగంపైనే ఆధారపడి ఉంది. శ్రమపడి పరీక్షకు తయారయ్యాను ఉద్యోగం ఖాయం కావాలంటే పరీక్షలో ఉత్తీర్ణుడనవ్వాలి. లేకపోతే తాత్కాలిక ఉద్యోగం ఊడుతుంది.51.మీ కృపతో పరీక్ష ఉత్తీర్ణుడనయితే, మీ పాదాలవద్ద హాజరై మీపేర పటిక బెల్లాన్ని పంచి పెడతాను.ఇది నా దృఢ నిశ్చయం' 52. అని మ్రొక్కుకున్నాడు.అతని కోరిక నెరవేరింది. ఎంతో సంతోషపడ్డాడు. మ్రొక్కు తీరడానికి ఆలస్యమైపోతుందని పంచదారను త్యజించాడు.53.దారి ఖర్చుకు డబ్బు అవసరం. రిక్తహస్తాలతో ఎలా వెళ్లాలి? ఇవాళ రేపు అని రోజులు గడిచిపోతున్నాయి.54.సహ్యాద్రి పర్వత శ్రేణిలోని నాణేఘాట్ అనే పర్వతాన్ని దాటేయ వచ్చు కాని సంసారులకు ఇంటి గడపను దాటటం బహు కష్టం.55. శిరిడీ మ్రొక్కు తీరే వరకు పంచదార వేసిన పదార్థాలను మానివేసి టీ కూడా చక్కెర లేకుండానే తీసుకోసాగాడు.56. అలా కొన్ని రోజులు గడిచాక, సమయం కలిసి వచ్చి, శిరిడీకి వెళ్లి మ్రొక్కును తీర్చుకుని ఆనందించాడు.57. సాయిని దర్శించుకుని వారి చరణాలకు సాష్టాంగప్రణామం చేసి,పరిపూర్ణ ఆహ్లాదాన్ని పొందాడు.58.పరిశుద్ధ మనసుతో సాయికి శ్రీ ఫలాన్ని అర్పించి పటిక బెల్లాన్ని పంచిపెట్టాడు. ఈ రోజు నా సకల కోరికలు తీరి సఫలుణ్ణయ్యాను అని అనుకున్నాడు. 59.సాయి దర్శనంతో ఆనందించి వారితో

సంభాషించి సంతుష్టుడయ్యాడు. చోళ్కరు జోగ్‌వద్ద అతిథిగా ఉండటం వలన, జోగ్ వద్దకు వెళ్ళటానికి సిద్ధమయ్యాడు.60.జోగ్ లేవగానే అతడు కూడా జోగ్‌తో బయలు దేరాడు. బాబా జోగ్‌తో ' ఇతనికి త్రాగటానికి కప్పులో చక్కెర బాగా ఎక్కువగా వేసి టీ ఇవ్వు' అని చెప్పారు.61.తన మ్రొక్కును గుర్తుకు తెచ్చిన మాటలు చెవిన పడగానే చోళ్కరు చకితుడయ్యాడు. కళ్లనుండి ఆనందాశ్రువులు దొర్లుతుండగా సాయి చరణాలపై శిరసు నుంచాడు.62.జోగ్‌కు వింతగా అనిపించింది. అంత కంటే రెండింతలు చోళ్కరు విస్మితుడయ్యాడు. కారణం బాబా మాటలలోని ఆంతర్యం అతనికి అర్థమైంది.63 బాబాకు అసలు టీ తెలియదు. అది ఇప్పుడెందుకు గుర్తుకు వచ్చింది? చోళ్కరుకు విశ్వాసం కుదురటానికి. అతని భక్తిని దృఢపరచటానికి. 64.చోళ్కరు బాగా గ్రహించేలా, బాబా అతనితో స్పష్టంగా 'చోళ్కర్! నువ్వు అనుకున్న పటిక బెల్లం అందింది. నీ త్యాగనియమం కూడా పూర్తయింది.65.మ్రొక్కు త్వరగా తీర్చలేక చక్కెరను మాని ప్రాయశ్చిత్తం చేసుకున్నావు. దీనిని నీవు రహస్యంగా దాచినా నాకు సమస్తం తెలిసింది.66.మీరెవరైనా ఎక్కడైనా సరే ఉండండి. భక్తి భావంతో నావైపు మళ్లితే నేను మీ భక్తి శ్రద్ధల ననుసరించి, రాత్రింబవళ్లూ మీ వద్దనే ఉంటాను.67. నా ఈ శరీరం ఇక్కడున్నా మీరు సప్త సముద్రాలకవతల ఏం చేస్తున్నా, నాకు తక్షణం తెలిసి పోతుంది.68.ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లండి. నేను మీ వెంటే ఉంటాను. మీ హృదయం లోనే నానివాసం. నేను మీ అంతర్యామిని.69. మీ హృదయంలో ఉన్న నన్ను మీరు నిత్యం ఆరాధించండి. సర్వజీవులలో అంతర్యామిగా ఉన్నది నేనే.70.ఇంట్లోగాని, వాకిట్లోగాని లేదా దారిలో గాని ఆయాస్థలాలలో ఎవరు మీకు కలిసినా, నేనే ఉన్నాను. నేనే వారిలో తిష్ఠవేసుకుని ఉన్నాను. 71.చీమలు క్రిములు, జలచరాలు, ఆకాశాన ఎగిరే పక్షులు, శ్వాన సూకరాలు మొదలగు ప్రాణులన్నింటిలోనూ సర్వత్రా నేనే

నిరంతరంగా నిండి ఉన్నాను. 72.నన్ను వేరుగా భావించకండి. మీకు నాకూ ఏ మాత్రం భేదంలేదు. ఇలా నన్ను తెలుసుకున్నవారు గొప్ప భాగ్యవంతులు. 73.ఈ మాటలు మామూలుగా కనిపించినా ఇవి ఉత్తమమైన జ్ఞానాన్ని కలుగచేసేవి. బాబా ఎంతో ప్రేమతో చోళ్కరు భక్తిని స్థిరపరచారు.74.అతని అంతరంగంలో ఉన్న దాన్నంతా బాబా అలా తెలియ చేసి, అతనికి గొప్ప అనుభవాన్ని కలుగ చేశారు. సత్పురుషులు ఎంతటి చతురులు?75.బాబా వచనాలు అమూల్యం. అవి భక్తుల హృదయాలలోనికి దూసుకుని వెళ్ళి ప్రేమ మడిని తడిపి, భక్తి మార్గాన్ని తెలుపుతాయి.76.చాతక పక్షియొక్క తృష్ణను తీర్చటానికి మేఘం దయతో ధారగా వర్షిస్తుంది. దాని ఫలితంగా భూమి అంతా తడుస్తుంది. ఇది అదే విధంగా జరిగింది.77. పాపం చోళ్కరు ఎక్కడి వాడో దాసగణు సంకీర్తన కారణంగా బాబాకు మ్రొక్కుకున్నాడు. బాబా కూడా ప్రసన్నులయ్యారు.78.ఈ చమత్కార లీలతో సత్పురుషుల అంతరంగం ప్రకటమైంది. బాబా జ్ఞానోపదేశం చేయటానికి తత్పరులై ఉండి, ఇటువంటి అవకాశాలను కలిగిస్తారు 79.చోళ్కరు కేవలం నిమిత్తమాత్రుడు. భక్తులందరికీ శ్రేయాన్ని కలిగించటానికి, బాబా చేసే అనూహ్యమైన లీలలను అవలోకిస్తూ ఉండాలి.80.ఇటువంటిదే మరో లీలను వర్ణించి ఈ అధ్యాయాన్ని సమాప్తి చేస్తాను. బాబాను ఒకరు ఏమని ప్రశ్నించారు వారు దానికి ఎలా సమాధానమిచ్చారు.81. ఒకసారి బాబా మసీదులో తమ ఆసనంలో కూర్చుని ఉండగా ఒక భక్తుడు వారి ఎదుట కూర్చుని ఉన్నప్పుడు ఒక బల్లి కిచకిచమని పలికింది. 82.బల్లి పలకటం బల్లిపడటం భవిష్యత్తును సూచిస్తుందని అతడు సహజమైన జిజ్ఞాసతో బాబాను ప్రశ్నించాడు. 83.'బాబా! వెనుక గోడ పైన బల్లి ఎందుకు కిచకిచమని పలుకుతుంది? దాని మనస్సులో ఏమి ఉండి ఉంటుంది? అది అశుభ సూచకం కాదు కదా' అని అడిగాడు.84.బాబా అతనితో 'బొరంగాబాదునుండి సోదరి తనను

కలుసుకోవటానికి ఇక్కడికి వస్తుందని ఆనందంతో పలుకుతుంది' అని చెప్పారు.85.అది అసలే బల్లి.అదెంత ప్రాణి? దానికి అమ్మానాన్నా అన్నా అక్కా ఉంటారా? దానికి ప్రపంచవ్యవహారాలు ఏముంటాయి? 86.బాబా వినోదానికి ఏదో అలా చెప్పి ఉంటారని తనలో అనుకొని అతడు ఊరకే కూర్చున్నాడు.87.ఇంతలో బొరంగాబాదు నుండి ఒక గృహస్థుడు గుఱ్ఱం మీద బాబా దర్శనానికి వచ్చాడు. అప్పుడు బాబా స్నానం చేస్తున్నారు. 88.అతని ప్రయాణం ఇంకా ముందుకు సాగాలి. కాని దాణాలేకుండా గుఱ్ఱాలు నడవవు. అందు చేత శెనగలు కొని తేవాలని బజారుకు బయలు దేరాడు.89.భుజానికి తగిలించుకున్న సంచిలోని చెత్తను దులిపాడు.బల్లిని గూర్చి ప్రశ్నించిన వ్యక్తి ఆశ్చర్యంగా అతన్ని చూడసాగాడు.90.సంచిని తిరగేసి నేలమీద కొట్టినప్పుడు, అందులోనుండి ఒక బల్లి నేలపై పడింది. అందఱూ చూస్తుండగా అది సరసరా గాబరాగా పరుగెత్తింది.91.బాబా, ప్రశ్నించిన ఆ వ్యక్తితో, ఇప్పుడు దాన్ని సరిగ్గా చూడు! అదే ఆ బల్లి సోదరి. దీని చమత్కారం చూడు అని చెప్పారు. 92.ఆ బల్లి అక్కడినుండి వెంటనే కిచకిచమనే సోదరి శబ్దాన్ని గుర్తించి వయ్యారంగా కులుకుతూ వెళ్లింది.93.ఆ అక్కాచెల్లెళ్లు ఇద్దఱూ చాలా రోజులకు కలుసుకోవటం వలన ఆ ప్రేమ అనుమానం. ప్రేమగా ఆలింగనం చేసుకుని ముద్దులాడుకున్నాయి. 94.బల్లులు స్వేచ్ఛగా ఆనందంగా గిరగిరా అడ్డ దిడ్డంగా తిరిగాయి.95. ఎక్కడి బొరంగాబాదు పట్టణం, ఎక్కడి శిరిడీ ఇదేం విశేషం. అకస్మాత్తుగా ఆ గుఱ్ఱపు స్వారీ, అతనితో పాటు బల్లి రావటం వింత కాదూ! 96.అది బొరంగాబాదు బల్లే కావచ్చు. దాణా సంచిలో దూరి ఉండవచ్చు.కాని బల్లిని గూర్చి అడిగిన సమయానికి సరిగ్గా అది ఎలా వచ్చింది? 97.బల్లి కిచకిచమని పలకటం దానిని గురించి ప్రశ్నించటం, దానికి బాబా అర్థం చెప్పి అనుభవాన్ని కలగచేయటం. 98.అసమానమైన యోగం కలసిరావటం కాదూ! వినోదం అంటే అందఱికీ

ఎప్పుడూ ఇష్టమే. సత్పురుషులు భక్తుల క్షేమాన్ని అభివృద్ధి చేయటానికి అనుపమానమైన సంఘటనలను సిద్ధ పరుస్తుంటారు. 99.ఇక్కడ జిజ్ఞాసతో ఎవరూ ప్రశ్నను అడగక పోతే సాయి యొక్క మహిమను ఎలా తెలుసుకుంటాం?వారి సామర్థ్యం ఎవరికి అర్థమౌతుంది?100.అనేక సమయాలలో అనేక బల్లులు పలుకుతుంటాయి.ఇది అందరికీ తెలిసిందే. వాని గురించి,ఆ శబ్దాల అర్థాన్ని ఎవరు అడుగుతారు?.101.దీని సారాంశం, ఈ జగత్తును ఆడించే సూత్రం, రహస్యంగా అర్థం కాకుండా ఉండి అందఱినీ ఆశ్చర్య పరుస్తుంది. 102. బల్లి పలికితే అనర్థ సూచకమని, క్ష్ణక్ష్ణ అని అంటే ఆ అనర్థం తొలగిపోతుందని అంటారు.103. జనం ఏమనుకున్నా ఈ చమత్కారం యొక్క అర్థం,జనులు తమ సర్వవ్యాపకత్వాన్ని తెలుసుకుని భక్తి యందు స్థిర పడాలని బాబా యొక్క ఉత్తమ మైన ఉపాయం.104.ఈ అధ్యాయాన్ని భక్తి శ్రద్ధలతో పఠించి మరల మరల పునరావర్తన చేసే వారి కష్టాలను గురుదేవులు తొలగిస్తారని మనసులో దృఢమైన విశ్వాసముంచండి. 105.అనన్య భావంతో గురు చరణాలయందు శిరసునుంచేవారిని రక్షించే అభయ ప్రదాత, కష్టాలను హరించే కర్త ఒక్క సాయి బాబాయే. 106. ఇందులో ఏ సందేహాన్ని పెట్టుకోకండి.భక్తుల శ్రేయస్సు కొఱకు సాయి బాబా గురించి నా స్వానుభవం లోని రహస్యమైనదాన్ని చెప్పుతున్నాను.107.ప్రపంచమంతటా సంపూర్ణంగా నేనొక్కణ్ణే, నేను తప్ప రెండవది ఏదీలేదు. ఈ లోకంలో మాత్రమే కాదు.అఖిల త్రిలోకాల యందు నేను, నేనే. 108.ఇటువంటి అద్వితీయ భావం, నిరభిమానం, నిరహంకారం,సంపూర్ణజ్ఞానం నిండి ఉన్న చోట ఇక భయమను మాటే ఉండదు. అంతటా చైతన్యం నిండి ఉంటుంది.109.హేమాడ్ పంత్ సాయికి శరణుజొచ్చి ఒక్క క్షణమైనా వారి చరణాలను వదిలి ఉండలేడు. కారణం అవే ప్రపంచాన్ని తరింపజేస్తాయి. ఇక మధురమైన వర్ణనను వినండి. 110. బ్రహ్మజ్ఞానాన్ని

చిటికలో కావాలని కోరే వారికి సాయి గురువర్యులు సృష్టించిన చక్కటి ప్రసంగం. 111. ఎవరో ఒక లోభి సాయిని బ్రహ్మజ్ఞానాన్ని అడగగా, మహారాజు దానిని అతని జేబులో నుండే తీసి ఇస్తారు. 112. శ్రోతలు ఈ కథను వింటే బాబా యొక్క సామర్థ్యం తెలుస్తుంది. లోభం నిర్మూలమవనంత వరకు నిస్సందేహంగా బ్రహ్మప్రాప్తి లేదు. 113. బ్రహ్మజ్ఞాన ప్రాప్తికి ఎవరు అధికారి? దీనిని ఎవరూ ఆలోచించరు. ఎవరికి ఏ విధంగా బ్రహ్మజ్ఞానం ప్రాప్తిస్తుందో దానిని కూడా సాయి మహారాజు వివరిస్తారు. 114. నేను వారి దాసానుదాసుణ్ణి. ఈ సాయి ప్రేమ విలాసాన్ని మీరు ఎంతో ఉత్సాహంగా వింటారన్న ఆశతో వేడుకుంటున్నాను. 115. శ్రోతలు సావధానంగా వింటే సత్పురుషుల మహిమ అర్థమవుతుంది. చైతన్య ప్రాప్తి తో మీమనసు ఆనందంతో ప్రసన్న మవుతుంది. 116. స్వస్తి శ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్, పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో చోళ్కర శర్కరాఖ్యానం అను పదునైదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 16 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ;శ్రీ కులదేవతాయైనమః;
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

రాజాధిరాజ చక్రవర్తీ! శాంతి సింహాసనంపై విరాజిల్లు మూర్తీ! స్వానంద సామ్రాజ్యాధిపతీ! గురుమహారాజా! మీకు అనన్యంగా వందనం చేస్తున్నాను.1.అభేదభక్తి సహజస్థితి ఇరు ప్రక్కలా మీకు వింజామరులు వీచుతాయి. స్వానుభూతి సద్యప్రతీతి మీకు గౌరవంగా గాలిని వీచుతాయి.2.ఆత్మస్థితి ఛత్రాన్ని, శాంతి, వివేకం దండాన్ని ధరించి ఉంటాయి. మాయామోహాది షడ్రిపులు మీవద్ద ఒక్క క్షణమైనా నిలువ జాలవు.3.నాలుగు వేదాలు,షడ్ దర్శనాలు, అష్టాదశ పురాణాలు, వైతాళికుల వలె ఉన్న మీ జ్ఞానప్రకాశం స్వానందం వ్యాపించిఉన్న మీ సభావైభవం ఎంత గొప్పది. 4.విరక్తి,భక్తి, శుద్ధ జ్ఞానం, శ్రవణ,మనన,నిది ధ్యాసనలు, ఆత్మానుసంధానం,సాక్షాత్కారం ఈ అష్టప్రధానులు మీ సేవలో ఉంటాయి.5.శాంతి దాంతి అనే దివ్య మణులు కంఠాభరణాలుగా మెరుస్తుంటాయి. మీ వాణి వేదాంత సాగర సుధా తరంగిణివలె మధురమైనది.6.పదునైన జ్ఞానమనే ఖడ్గ ప్రహారంతో, నరకటానికి లేచిన మీహస్తాన్ని చూచి, భవవృక్షం గడగడ వణుకుతుంది.7.జయ నిరంజనా! అవ్యయా! గుణాతీతా! యోగిరాజా! దీనులను ఉద్ధరించటానికి పరోపకారార్థం మీరు శరీరాన్ని ధరించారు.8.గతాధ్యాయంలో ఒక భక్తుని కోరిక నెఱవేరి అతని మ్రొక్కును తీర్చినప్పుడు, బాబా అతని నిర్ణయాన్ని తెలియపరచారు.9.సద్గురువుకు ఎప్పుడూ ఏ కోరికలూ ఉండవు. వారి కోరికలను శిష్యులు తీర్చగలరా? వారు శిష్యులకు సేవచేసి శిష్యుల కోరికలను తీర్చి

వారిని కొరికలు లేనివారిగా చేస్తారు.10.వారికి భక్తితో పత్రిని పుష్పాలను అర్పిస్తే అతి ప్రేమగా స్వీకరిస్తారు. అదే అహంభావంతో అర్పిస్తే వెంటనే తిరస్కరిస్తారు.11.సచ్చిదానంద సాగరులైనవారికి బాహ్యోపచారాల అవసరం ఏముంది? అయినా గౌరవభావంతో ఉపచారాలను చేస్తే సంతోషంగా స్వీకరిస్తారు.12. ఏమీ తెలియని అజ్ఞాన ముసుగును కప్పుకుని జ్ఞానాన్ని ప్రసాదిస్తారు. మర్యాదను అతిక్రమించకుండా మధురమైన శిక్షణను ఇస్తారు. 13.భక్తితో వారి సేవను చేసినవారు బ్రహ్మ సాయుజ్యాన్ని పొందుతారు. అందువల్ల ఇతర సాధనలన్నీ వదిలి గురు సేవలోనే లీనమై పోవాలి.14.ఆ సేవలో బద్ధకం, అలసత్వం ఉన్నా గొప్పగా విఱ్ఱవీగినా, సాధకులు చిక్కులలో పడిపోతారు. అసలు ముఖ్యమైనది గురుచరణాల యందు దృఢ విశ్వాసం.15.శిష్యులు స్వయంగా ఏమీ చేయలేరు. సద్గురువే వారిని దారిలో పెట్టాలి. శిష్యులకు తమ అపాయాలు తెలియవు.వారికవి తెలియకుండానే గురువు వారికి ఉపాయాలను తెలియ చేస్తారు.16.త్రిభువనాలలో వెదకినా గురువుకంటె మరో గొప్పదాత ఎవరూ ఉండరు.శరణాగతులకు పరమ శరణ్యమైనట్టి వారికి అనన్యంగా శరణు పొందుదాం. 17.వారిని చింతామణితో పోల్చాలనుకుంటే చింతామణి కేవలం కోరుకున్న దానినే ఇస్తుంది. గురువు భక్తులకు పరమ ఆశ్చర్యం కలిగేలా మనసు కోరని దానిని ఇస్తారు. 18. గురువును కల్పతరువుతో పోల్చాలనుకుంటే అది కల్పిత వస్తువులనే ఇస్తుంది. కాని గురుదేవులు మనసు ఊహించని నిర్వికల్ప స్థితిని కలుగ చేస్తారు. 19.కామధేనువు కోరుకున్న కోరికలను తీరుస్తుంది. గురువు అంతకంటె అధికం.ఆశించని ఆత్మస్థితిని వారు తప్ప ఎవరు ప్రసాదించగలరు?20.ఇప్పుడు శ్రోతలకు నా విజ్ఞప్తి. గతాధ్యాయం చివర, బ్రహ్మజ్ఞాన ప్రాప్తిని కోరిన వ్యక్తి కథ చెప్పుతానన్నాను కదూ. ఆ కథను వినండి.21.బ్రహ్మజ్ఞానాన్ని ఆశించి వచ్చిన భోక్తను బాబా ఎలా తృప్తి పరచారు? తమ భక్తులకు పరమార్థాన్ని

ఎలా ఉపదేశించారో వినండి. 22.సత్పురుషులు ఎల్లప్పుడూ ఏ కోరికలూ లేనివారు. వారి కోరికలన్నీ పూర్తిగా తీరిపోయి ఉంటాయి. కాని అత్యాశగల భక్తులు, కోరికలు తీరక ఎల్లప్పుడూ అసంతృప్తితో ఉంటారు.23.కొందఱు పుత్రసంతతిని కోరితే, కొందఱు అఖండ రాజ్య సంపత్తిని, మరి కొందఱు భక్తి విశ్వాసాలను కోరుకోగా, ఒకరిద్దరు మాత్రమే ప్రపంచం నుండి ముక్తిని కోరుకుంటారు.24.ఇట్లే ధనసంపాదనలో నిమగ్నుడైన ఒక భక్తుడు, బాబా యొక్క గొప్ప కీర్తిని విని వారిని దర్శించు కోవాలని తలచాడు.25.అతని ఇంట చాలా సంపద ఉంది. సంతానం ఉన్నారు.అపరిమితంగా దాసదాసీ జనం ఉన్నారు. అతనికి ఉదారమూర్తియైన బాబాను దర్శించుకోవలెనని తోచింది.26.'బాబా గొప్ప బ్రహ్మజ్ఞాని. సాధుసత్పురుషుల మకుటమణి.అమోఘమైన లీలలను చేస్తారు. అట్టివారి చరణాలపై మస్తకాన్ని ఉంచుతాను.27.నాకు ఇతర ఏ కొరతాలేదు.నేను బ్రహ్మజ్ఞానాన్ని అడుగుతాను. అదిగాని అవలీలగా లభిస్తే నేను ధన్యుణ్ణవుతా'నని తలచాడు.28.అప్పుడు అతని మిత్రులు బ్రహ్మాను తెలుసుకోవటం సులభంకాదు. నీవంటి లోభికి బ్రహ్మ ప్రకటమవటం దుస్సాధ్యం.29.ధనం, భార్యాబిడ్డలకంటే వేరే ఆనందం తెలియని వానికి బ్రహ్మ కేవలం భ్రాంతి. అట్టివారికి విశ్రాంతి ఎక్కడిది?30.ఇంద్రియశక్తి క్షీణించిన తరువాత, ప్రపంచంలో ఎవరూ గౌరవించరు.అప్పుడు ఖాళీగా ఊరికే కూర్చుని బ్రహ్మగురించిన ఆలోచనలను అల్లుకుంటారు.31.నీ బ్రహ్మజిజ్ఞాస కూడా అలాంటిదే. లోభిలా చేతినుండి డబ్బురాల్చకపోతే నీకోరికను తీర్చేవారెవరూ దొరకరు' అని చెప్పారు. 32.అయినా అతడు ఆ కోరికతో శిరిడీకి బయలుదేరాడు.తిరుగు ప్రయాణానికి కూడా టాంగా బండి మాట్లాడుకుని, సాయి చరణాల వద్దకు చేరాడు. 33.వారి దర్శనం చేసుకుని వారి పాదాలకు వందనం చేశాడు. అప్పుడు సాయిబాబా పలికిన మధురవచనాలను శ్రోతలు శ్రవణం చేయండి.

34. ఈ సాయి కథా కల్పతరువును ఏకాగ్రత అనే నీటితో తడిపితే చక్కగా ఉంటుంది. శ్రోతలకు శ్రద్ధ, ఆదరం అభివృద్ధి అయిన కొలదీ మంచి ఫలాలను ప్రసాదిస్తుంది. 35. దీని యొక్క అన్ని శాఖలూ భక్తి రసంతో నిండి, సుగంధ పుష్పాలను పుష్పింప చేసి, మధురఫలాలతో నిండి భక్తుల కోరికలను తీరుస్తుంది. 36. బ్రహ్మజ్ఞానాన్ని కోరిన వ్యక్తి బాబాతో, 'బాబా! బ్రహ్మను చూపించండి. నేను అందుకోసమే వచ్చాను. శిరిడీబాబా బ్రహ్మను అతిత్వరగా చూపిస్తారని ప్రజలంటుంటారు. 37. నేను ఆ కోరికతోనే ఇంత దూరం వచ్చాను. ప్రయాణంలో చాలా శ్రమ పడ్డాను. అయినా బ్రహ్మజ్ఞానం లభిస్తే నేను కృతకృత్యుణ్ణవుతాను' అని అన్నాడు. 38. బాబా అతనితో ఇలా అన్నారు. 'నీవేం చింతపడకు. ఇప్పుడు నీకు ఖచ్చితంగా బ్రహ్మను చూపిస్తాను. ఇక్కడ అంతా నగదు వ్యవహారమే, అప్పుమాటే లేదు. నీవలె అడిగేవారు దుర్లభం. 39. అంతా ధనాన్ని సంపదను కోరుతారు. కష్టాలను రోగాలను నివారించండి అని అడుగుతుంటారు. లౌకికమైన మర్యాదలను రాజనీతి పదవులను కోరుతారు. ఎప్పుడూ సుఖాలనే అడుగుతుంటారు. 40. కేవలం ఐహిక సుఖాల కోసం జనం శిరిడీకి పరుగెత్తుకుని వచ్చి ఫకీరునైన నన్ను భజిస్తారు. కాని బ్రహ్మను ఎవరూ అడగరు. 41. నాకు అటువంటి భక్తులు అనేకమంది. నీ వంటి వారు ఇక్కడ కరువు. నేను బ్రహ్మ జిజ్ఞాసుల కొరకు ఆతురతతో ఉన్నాను. నాకు ఈ రోజు పర్వదినం. 42. బ్రహ్మవస్తువు పైని భీతితో సూర్య చంద్రులు నియమంగా ఉదయించటం, నియమంగా అస్తమించటం, వాని ప్రకాశం నియమ బద్ధంగా ఉండటం, 43. గ్రీష్మ వసంతాది ఋతువులు, ఇంద్రాది దేవతలు, రాజులు నియమంగా ప్రజలను పాలించటం అన్నింటికీ మూలకారణం బ్రహ్మయే. 44. అందువలన శరీరం విడిపోకముందే వివేక వంతులు బ్రహ్మజ్ఞానాన్ని సాధించటానికి ప్రయత్నిస్తారు. అదిలేకపోతే జనన మరణాల పునరావర్తన ఆగకుండా వెంటే ఉంటాయి. 45. బ్రహ్మను

తెలుసుకోకుండా శరీరం పతనమైతే ప్రాపంచిక బంధనాలు తొలగిపోవు. కనుక పునర్జన్మ తప్పదు.46. బ్రహ్మ ఏమిటో నేను నీకు సర్వం చూపిస్తాను చూడు! చుట్టబడిఉన్న బ్రహ్మజ్ఞానసారాన్ని, నిన్ను నఖశిఖాంతం పెనవేసికొని ఉన్నదాన్ని, నేను బయటికి తీసి చూపిస్తాను!47. ఎంతటి సుధామధురవాణి! అది కేవలం అద్వైతసుఖాలగని! సంశయాందోళనలు గల వారిని ఉద్ధరించ సామర్థ్యంగలది.48. క్షణికానందాన్నిచ్చే సుఖ ప్రలోభాలలో అహోరాత్రులు చిక్కుకున్న వారిని కూడా బాబా వచనాలు మంచి విహితాచరణలో పెడతాయి.49. చింతామణి ప్రసన్నమైతే లౌకిక సుఖాలు లభిస్తాయి. మహేంద్రుడు ప్రసన్నుడౌతే స్వర్గసంపదలు లభిస్తాయి.50. ఇంతకంటే ఘనంగా గురువు అలౌకికమైన వానిని ప్రసాదిస్తారు. గురువుకు సమానమైన దాతలేరు. వారు ప్రసన్నులౌతే దుర్లభమైన బ్రహ్మను భక్తులకు చూపిస్తారు.51. వారి మధురగాథను శ్రవణం చేస్తే ప్రాపంచిక వ్యథలను మరచిపోవచ్చు. బ్రహ్మను కోరి వచ్చిన వానికి ఎలా పాఠం చెప్పాలో బాబాకు తెలుసు.52. అతనిని కూర్చోబెట్టి అతడు కోరివచ్చిన విషయాన్ని మరచిపోయేలా ఇతర విషయాలలో లీనమయేలా చేశారు.53. తరువాత బాబా ఒక కుఱ్ఱవానిని దగ్గరకు పిలిచి 'వెంటనే నందు వద్దకు వెళ్లు.54. బాబాకు అయిదురూపాయలు అత్యవసరం, కనుక కాసేపటికోసం అప్పు వెంటనే ఇవ్వమని అతనితో చెప్పు' అని అన్నారు.55. ఆ అబ్బాయి నందు వద్దకు వెళ్ళగా అతని ఇంటికి తాళం వేసి ఉంది. వెంటనే తిరిగి వచ్చి ఆ విషయాన్ని బాబాకు మనవి చేశాడు.56. బాబా అబ్బాయితో 'మళ్ళీ వెళ్లు. బాలా వ్యాపారి ఇంటి వద్దే ఉండి ఉంటాడు. అదే మాట అతనితో చెప్పి రూపాయలను తీసి కొని రా' అని చెప్పారు.57. అక్కడికి వెళ్లటం కూడా వృథా అయింది. బాలా కూడా అప్పుడు ఇంట్లో లేడు. ఆ మాటే అబ్బాయి బాబాతో ఆదరంగా చెప్పాడు. 58. బాబా వెంటనే అతనిని మరో ఒకరిద్దరి వద్దకు పంపారు. ఆ అబ్బాయి వృథాగా తిరిగి అలసి

పోయాడు కాని ఎక్కడా గవ్వైనా దొఅకలేదు.59. సర్వాంతర్యామియైన సాయిబాబాకు ఆ సమయాన నందుగాని బాలా వ్యాపారి గాని ఇంట్లో ఉండరని పూర్తిగా తెలుసు.60.మానవుని రూపంలో కదలాడుతూ మాట్లాడుతూ ఉన్న సజీవబ్రహ్మ సాయి. వారికి అయిదు రూపాయలు కరువా? బ్రహ్మను కోరి వచ్చిన వ్యక్తికోసం అలా అద్భుతాన్ని చేశారు. 61.బంధువులు ఇంటికి వస్తే వారికోసం తయారు చేసిన హల్వా, మృష్టాన్నం వగైరా ఇతరులకు కూడా లభిస్తుంది. 62.బ్రహ్మజ్ఞానాన్ని కోరిన వ్యక్తిని నిమిత్తమాత్రునిగా చేసి సాయిబాబా అందఱి శ్రేయస్సు కొరకై భక్తులకు బోధించారు. 63.ఆ వ్యక్తి జేబులో రెండు వందల యాభై రూపాయల నోట్లకట్ట ఉన్నదని సాయినాథులు తెలుసుకున్నారు. 64.మరి అది అతనికి తెలియదా? అతనికి కళ్లులేవా? జేబులో నోట్ల కట్ట ఉండగా బాబాకు ఇవ్వాలా వద్దా అన్న ఆలోచనలో పడ్డాడు. 65. సాయికి అయిదు రూపాయలు అప్పుగా అదైనా ఒక ఘడియకోసం ఇవ్వటానికి అతనికి మనసు రాలేదు. బ్రహ్మసాక్షాత్కారాన్ని కోరటానికి వచ్చాడు. 66.సాయిమహారాజు సత్యసంధులు. వారు అప్పుగా అడిగినదైనా కొంచెమేకదా! పోనీ ఇద్దామని అనిపించినా మనసు మారిపోయి ఇవ్వలేదు.67.అయిదు రూపాయలు ఇవ్వటానికి ప్రాణం ఒప్పుకోలేదు.ఈ చిన్న సహాయం చేయలేని వాడు మూర్తీభవించిన లోభమే కదా! 68.బాబా యందు నిజమైన భక్తి భావం గల మరెవరైనా అయితే ఆ అప్పువింతను కళ్లప్పగించి చూడరు. 69.బ్రహ్మకోసం నిజంగా ఎంతో తపించే వాడైతే అతనికి విషయం అర్థం కాకుండా ఉంటుందా? ఏమో నాకలా అనిపించదు. ధనం పైని వ్యామోహం అతనిని కబళించి వేసింది.70.పోనీ ఊరి కైనా కుర్చోవాలా అదీలేదు. వెంటనే తిరిగి వెళ్లి పోవాలని త్వరపడసాగాడు. ఓ సాయిబాబా! బ్రహ్మను ఇప్పుడే చూపించు అని అడిగాడు.71.'నీవు కూర్చున్న చోటే బ్రహ్మను చూపించాలనేగా ఇప్పటివరకూ నా ప్రయత్నం. నీకేం అర్థం

కాలేదా? అని బాబా అన్నారు. 72. బ్రహ్మ కొఅకు పంచప్రాణాలు, పంచ కర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు, మనోబుద్ధి అహంకారాలు సమర్పించ వలసి ఉంటుంది. 73. బ్రహ్మజ్ఞానం లభించే మార్గం కఠినం. అది అందరికీ సులభసాధ్యం కాదు. సమయం వచ్చినప్పుడు ప్రకటమై అదృష్టమున్నవారికి అది వెంటనే లభిస్తుంది. 74. హిరణ్యగర్భ పదవి వరకు ఐహిక విషయాలన్నింటి యందు విరక్తిని అనాసక్తిని కలిగిన వారే బ్రహ్మ విద్యా ప్రాప్తికి అధికారులు. 75. ఏకించిత్తైనా విరక్తిలేనివానికి, ఎవరైనా బ్రహ్మతత్వోపదేశం చేస్తే మాత్రం అతనికి ఫలితమే ముంటుంది? 76. ఉత్తమాధికారులు బ్రహ్మజ్ఞాన బోధను గ్రహిస్తారు. కాని సాంప్రదాయానికి బద్ధులైన మధ్యమాధికారులకు క్రమ క్రమంగా బోధించాలి. 77. ఒకటి విహంగమ మార్గం. రెండవది పరంపర సోపానమార్గం. అయితే, అనధికారులకు బ్రహ్మబోధ వృథాశ్రమ. 78. ఒక్క ఆత్మజ్ఞానం తప్ప, బ్రహ్మ ప్రాప్తికి శ్రేష్ఠమైన సాధనం లేదు. ఇది సత్యమైన వేదాంత వచనమైనప్పటికీ అది అందఱి అధీనంలో ఉందా?. 79. అభ్యాసం మరియు శ్రమ తప్పనిసరి. ఎముకలు పుల్లలైపోవాలి. అప్పుడు గురుకృపా ప్రకాశంతో బ్రహ్మజ్ఞానం మెల్లమెల్లగా చేజిక్కుతుంది. 80. నేను ఈశ్వరుణ్ణి, నేను నియంతను అని హిరణ్యగర్భునికి అహం కలిగినప్పుడు, తన స్వరూపాన్ని మరచిపోవటంతో విశ్వం యొక్క ప్రాదుర్భావం కలిగింది. 81. నేనే బ్రహ్మను అన్న జ్ఞానం కలిగి నప్పుడు, జ్ఞాత ఆత్మస్వరూపంలో విలీనమైపోయి నప్పుడు, అదే విశ్వాభాసవిసర్జన అని శ్రుతి ఘోషిస్తుంది. 82. ఆత్మజాగృతి కాగా అంతఃకరణవృత్తి, బ్రహ్మతో ఏకరూపమైనప్పుడు బ్రహ్మాగ్నిలో విశ్వం ఆహుతియై, సృష్టి అంతా భస్మమైపోతుంది. 83. జీవుల స్థితి కూడా ఇదే. మాయాభ్రమ నివృత్తి కాగానే త్రాడు, కిరణాలు, ముత్యపుచిప్ప వీని ఆభాస వెంటనే తొలగి పోతుంది 84. ముత్యపు చిప్ప అన్న జ్ఞానం లేకపోవటమే వెండి అని భ్రమించటానికి కారణం. వెండి జ్ఞానం కలగగానే అది

ముత్యపుచిప్ప అన్న విషయం తెలుస్తుంది. భ్రమ నివృత్తికాగానే వెండి అన్న భ్రమ తొలగిపోయి ముత్యపుచిప్ప అన్న జ్ఞానం స్పష్టమవుతుంది. 85.అన్యోన్యమైన ఈ మోహలక్షణాన్ని జ్ఞాన దీపంతో ప్రకాశింప చేయండి. అజ్ఞానమాలిన్యాన్ని క్షాళన చేయండి.అప్పుడు భ్రాంతి నశిస్తుంది. 86.జనన మరణాల బంధనమే లేకపోతే మోక్షం కోసం సంయమనమెందుకు? వేదాంతానికి మనకు ఏం సంబంధం? ఈ ప్రబంధం ఎందుకు?87.నేను బద్ధుణ్ణి, ముక్తుణ్ణి కావాలి అని దృఢనిశ్చయాసక్తి ఉన్నవారు మాత్రమే ఇక్కడ అర్హులు. అత్యంత అజ్ఞానులుగాని లేదా పూర్ణజ్ఞానులు గాని కారు. 88.అసలు బద్ధులే కానప్పుడు ఇక ఎలాంటి ముక్తి? ఇదంతా వస్తుస్థితి. బంధనము మరియు ముక్తి ఇవి రెండు త్రిగుణాల సమాగమమువలననే అని అందరికి అనుభవం.89.ద్వైతం లేని చోట ఎవరు ఎవరిని బంధించటం, విడిపించటం? అద్వైతంతో ద్వైతం పోతే అక్కడ ఎవరూ బద్ధులూ కారు ముక్తులూ కారు.90. పగలు రాత్రి అన్న వానిని సూర్యుడు సృష్టించాడా? ఇవి దృష్టి దోషం వలననే గాని సూర్యుడు తటస్థుడు.91.నేనొక కర్తను ఒక భోక్తను అన్న అభిమానంతో సుఖదుఃఖాలను స్వర్గనరకాలను అనుభవిస్తుంటే విషయవాసనలయందు ఆసక్తి అధికమవుతుంది.92.ఆత్మ నిత్యం, సనాతనం, శాశ్వతం. జననమరణాలనే వికారాలు లేనిది. ఆత్మ ఓంకార అక్షరానికి ప్రతీక. అనాది,అనంతం.ఎల్లప్పుడూ ఉండేది.93.శరీరమే ఆత్మ అని తలచేవారు తామువేరు సృష్టి వేరు ఆని అనుకునేవారు ఆత్మజ్ఞానం కోసం శ్రమపడ్డా పరమార్థం లభించదు.94.కృత నిశ్చయులై వాక్కుమొదలైన సర్వేంద్రియాలను మనసులో లయం చేసి,మనసును నశింపజేసి బుద్ధిని ఆశ్రయించాలి.95.ప్రకాశ స్వరూపమైన జ్ఞానంతో మనసును బుద్ధి యందు ఏకాగ్రం చేయాలి. సర్వేంద్రియాలూ మనసుతో సహా బుద్ధి అధీనంలో ఉంటాయి. 96. కుండకు ఆదికారణం మట్టి. అట్లే ఇంద్రియాలకు బుద్ధి. ఇది దాని నిత్య స్థితి. బుద్ధి యొక్క వ్యాపకత్వం

ఈ విధంగా ఉంటుంది.97.బుద్ధి తనవ్యాపకత్వ గుణంతో మనసును, సకలేంద్రియాలను వ్యాపిస్తుంది. బుద్ధిని సర్వవ్యాపియైన మహతత్త్వంలో, ఈశ్వరతత్త్వంలో, లయంచేసి మహత్తత్వాన్ని ఆత్మతత్వంలో విలీనం చేయాలి. 98. ఈ విధంగా సామరస్యాన్ని సాధిస్తే ఆత్మస్వరూపం నిర్ధారణగా ప్రకటమవుతుంది. అప్పుడు వెండి, ఎండమావి, సర్పాకారం కేవలం దృష్టి వికారాలని అర్థమవుతుంది.99.ఈ అశేష విశేషరహితమైనట్టి జననమరణాలు లేనట్టి ఆత్మదర్శనం లేనిదే శ్రేయస్సులేదు అని సత్పురుషులు ఎప్పుడూ చెప్పుతుంటారు.100.కార్యాలకు ఒక కారణం ఉంటుంది. కాని ఆత్మ స్వయంభూ. కారణం లేనిది. ఆత్మ పురా అపి నవ – సనాతనమైనది, నూతనమైనది. స్వభావ సిద్ధంగా బుద్ధికి అందనిది. 101.ఆకాశం వలె అవిచ్ఛిన్నం. సృష్టి లయలకు అతీతం. ఓంప్రణవం ఆత్మకు ఆలంబనం. ఆత్మ నిరాధారం. నిష్కళంకం.102.పరబ్రహ్మను తెలుసుకోవాలి. అపరబ్రహ్మను పొందాలి. బ్రహ్మకు ప్రతీకయైన ఓంను ధ్యానించాలి, ఎల్లప్పుడూ ఉపాసన చేయాలి. 103. సర్వవేదాలసారమైన ప్రణవస్వరూపమే ఓంకారం. ఆ ప్రణవాన్ని అర్థ సహితంగా, నిర్ధారణగా తెలుసుకోవటమే మహావాక్యాల చింతన. 104.వేదాలు స్వయంగా ప్రతిపాదించినది, జనులు బ్రహ్మచర్య నియమాలను ఆచరించి అత్యంత ప్రయత్నంతో సంపాదించిన దానిని 'ఓం' అని అంటారు. 105.ఆ పరమపద ప్రాప్తికి మార్గం అతి దుర్గమమైనదేఐనా, సద్గురు అనుగ్రహమున్న సాధకులకు సుగమమే. 106.ఇంద్రియాలలో అతి స్థూలమైన దాని నుండి క్రమంగా సూక్ష్మం వరకు స్థూలసూక్ష్మ తారతమ్యంతో నిర్విరామంగా ప్రయత్నంచేస్తే సాధకులు సాధించగలరు.107.ఓం శబ్దంతో ఉచ్చరించే ఓం అక్షరం సకల తపస్సుల సారం. ఆ శబ్దాన్ని ఉచ్చరించిన మాత్రాన దాని అర్థం స్ఫురిస్తుంది.దానిని నిరంతరం స్మరిస్తే సాక్షాత్కారం కలుగుతుంది.108.ఏ వికారాలు మార్పులు వృద్ధి క్షయాలు లేని, సర్వవ్యాపక చైతన్యమైన

ఆత్మను తెలుసుకున్నట్టి సద్గురువు యొక్క అనన్య భక్తుడు ధన్యుడు.109. ఆధ్యాత్మిక అధిభౌతిక అధిదైవికమనే త్రివిధ తాపాలలో ఎల్లప్పుడూ తపించిపోయే వారు ఈ భాగ్యాన్ని ఎలా అనుభవించగలరు? ఈ వైభవం ఒక్క సత్పురుషులకే పరిమితం. 110. అజ్ఞానం వలన జననమరణాల భ్రమణ దాని నుండి నివృత్తి పొందటానికి సాధన, బ్రహ్మ మరియు ఆత్మ ఒక్కటే అన్న ఏకత్వభావన. అది ఇక్కడే సంభవం.111. విషయ కల్పనలు లేని శూన్య స్థితి కలిగినప్పుడు అహం బ్రహ్మాస్మి అనేభావం కలుగుతుంది. వేదాలలోని మహావాక్యాన్ని అనవరతం స్మరిస్తుంటే, బుద్ధి సహజస్థితిని పొందుతుంది.112. అప్పుడు గురువచనాలు, శాస్త్ర ప్రమాణాలు అనుభవంలోకి వచ్చి అంతర్బాహ్యాకరణ వృత్తి, మనసుతో సహా శాంతించి ఆత్మజ్ఞానం లభిస్తుంది.113. అదే ఉత్తమ దర్శనప్రాప్తి. అప్పుడు విషయ సుఖాలపై విరక్తి కలిగి, అజ్ఞానం మొదలగు హృదయ గ్రంథులు విడిపోయి, అవ్యక్తంలో ప్రవేశం దొరుకుతుంది. 114. సూర్యకిరణాలలోని అతిసూక్ష్మ కణం కంటెను అతిసూక్ష్మమైనది, అణువు కంటెను అత్యంత సూక్ష్మమైనదని ఆత్మను నిర్ధారించారు.115. పెద్ద వస్తువుల కంటె పెద్దది బ్రహ్మాండం. బ్రహ్మాండం కంటెను మహత్తరమైనది ఆత్మ. అయినా ఇవన్నీ సాపేక్ష ప్రమాణాలు. ఆత్మ ప్రమాణాతీతం.116. సూక్ష్మత్వంలో అణోరణీయాన్, సూక్ష్మమైనదానికంటే సూక్ష్మం. మహత్వంలో మహత్ పరిమాణం కలది. ఆత్మకు నామరూపాధులన్నీ కేవలం ఉపాధులు. ఆత్మనిరుపాధికం. పరిపూర్ణం.117. ఆత్మకు జననంలేదు. మరణంలేదు. ఆత్మకు మూలకారణం కూడా లేదు. ఆత్మ జననం లేనిది. నిత్యం. శాశ్వతం. సనాతనమైనది. ఆత్మను ఇది అని నిర్ధారించటం కష్టం. 118: ఓంకార ప్రతీకయైన బ్రహ్మమే దానిమూల స్వరూపం. ఆగమనిగమాలకు కూడా అంతుపట్టని ఆత్మ, అందఱికీ సులభ సాధ్యమా? 119. ఆత్మను ఇది అని నిర్ధారించ లేక వేదాలు అలసిపోయినవి.

తాపసులు వనవాసులయ్యారు. ఉపనిషత్తులు చెతులు వ్రెలాడెశాయి. ఎవరికి దాని అంతు చిక్కలేదు. 120. ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోవటానికి అభేదదర్శులైన ఆచార్యులు కావాలి. ఇతరులకది సాధ్యంకాదు. తార్కికులకు అక్కడ ప్రవేశం లేదు. 121. కేవలం తర్కం చేసేవారికి అక్కడ చోటు లేదు. వారు భ్రమలలో గిరగిరా తిరుగుతుంటారు. ఆగమాచార్యులకు తప్ప ఇతరులకు ఆత్మజ్ఞానానికి కావలసిన స్థిరమైన బుద్ధిఉండదు. 122. స్వబుద్ధి కల్పన సిద్ధాంతాలనే అనంత తారలు ఎనభైనాలుగు లక్షల జనన మరణాలను తప్పించలేవు. ఆగమాచార్యుడనే చంద్రుడు ఒక్కడు చాలు, అజ్ఞానంధకారం లవలేశమైనా ఉండదు. 123. బహుప్రయాసతో ఇతరులు సాధించలేని దానిని, సద్గురువును దృఢంగా పట్టుకున్నవారు అల్పప్రయాసతో సాధించగలరు. వారికి బ్రహ్మజ్ఞానం ప్రకటమవుతుంది. 124. దానితో అజ్ఞానం తొలగిపోయి సచ్చిదానంద స్వరూపం స్థిరపడి ఆత్మస్వరూప స్థితి అనుభవంలోనికి వస్తుంది. దీనికి మరో పేరు మోక్షం. 125. జీవులు అధికంగా అపేక్షించ దగినది ఇదే. దీనికోసమే జీవులు నిరంతరం చాలా శ్రమ పడతారు. దీనికోసమే బ్రహ్మ యోగనిష్ఠులు ఎల్లప్పుడూ అంతర్నిష్ఠలో ఉంటారు. 126. మనసు చంచలమైనప్పుడు విషయాలు కల్లోల పరుస్తాయి. ఆత్మ స్వరూపంలో స్థితులైనవారి మనసు స్థిరపడి విషయాలు క్షీణించిపోతాయి. 127. ఆత్మస్వరూపానికి విముఖంగా ఉన్నవారిని విషయాలు కలవర పెడతాయి. కాని స్వరూపోన్ముఖులైనవారి నుండి విషయాలు మొహం చాటేస్తాయి. 128. మోక్షాన్ని మాత్రమే కోరుకుంటూ ఇహపర సుఖాలను, ఇతర విషయాలను అణుమాత్రమైనా ఆశించకుండా ఉండే వారే మోక్షానికి అర్హులు. 129. వీనిలోవి ఒక్క లక్షణం లోపించినా వారు, ముముక్షువులు కారని బాగా తెలుసుకోవాలి. అలాంటి వారు, ఒక కన్నే ఉన్నా, రెండు కన్నులతో చూస్తు న్నట్లు నటించే వారిలా ముముక్షువుల వలె కేవలం నాటకమాడేవారు. 130. అహంకారం తొలగి పోనంత వరకు, లోభం

నిర్మూలమవనంతవరకు మనసు వాసనా రహితం కానంతవరకు, బ్రహ్మజ్ఞానం నాటుకోదు. 131.శరీరమే ఆత్మ అని అనుకునే బుద్ధియే భ్రాంతి. బంధనానికి కారణం ఆసక్తి. విషయ సుఖాల ఆలోచనలను విడిచిపెడితే బ్రహ్మజ్ఞాన ప్రాప్తి హస్తగతమవుతుంది.132.నిర్గుణ బ్రహ్మ సాక్షాత్కారం కఠిన కార్యం.అందువలన సగుణ బ్రహ్మ యొక్క ఉపాసనలోని మర్మాన్ని తెలుసుకోవడమే బుద్ధిమంతుల ధర్మం.133.ఆత్మసర్వ జీవులలో నిగూఢంగా ఉంటుందన్న తత్త్వం వేదాంతులకు తెలుసు.కాని దీనిని అనుభవపూర్వకంగా అంతటా తెలుసుకోవ టమెలా? 134.ముందు చిత్తశుద్ధి కావాలి.ఆపైన సూక్ష్మమైన కుశాగ్రబుద్ధి ఉండాలి.అప్పుడే ఆత్మ దయతో తప్పక స్వయం ప్రకటమవుతుంది.135.ఆత్మ నిత్యం.ఏవికారాలు లేనిది.ఆత్మను తెలుసుకున్నవారు శోకరహితులు. వారే ధైర్యవంతులు.ధీమంతులు.వారే భవంనుండి ముక్తులు.136.ఇక్కడ ప్రవచనా ప్రావీణ్యంగాని, గ్రంథార్థ ధారణాశక్తిగాని,లేక వేదశ్రుతుల విశ్లేషణ గాని అవసరంలేదు.137.ఆత్మ ఏ మార్పూ చెందక నిత్యం ఉండేది. శరీరం అనిత్యం. అశాశ్వతం. అనవస్థితం. ఎప్పుడూ మార్పు చెందేది అని తెలుసుకుని తమ శ్రేయస్సును సాధించుకునే వారు యోగ్యాయోగ్యాలను తెలుసుకున్న దక్షులు.138.ఆత్మజ్ఞానులు సదా నిర్భయులు. వారు ఒక్కటే తప్ప రెండవది లేదన్న అద్వితీయ భావంతో శోకాన్ని తొలగించుకున్నవారు.139.ఆత్మజ్ఞానం కఠినమైనప్పుడు, ప్రవచనాల శ్రవణంతో దాని అంతు పట్టనప్పుడు, కేవలం మేధస్సు మాత్రంఏం చేయగలదు? అయినప్పటికీ ఉపాయాలతో ఆత్మను తెలుసుకోవచ్చు.140.ఎల్లప్పుడూ ఏ కోరికలూ లేక ఆత్మజ్ఞానాన్ని మాత్రమే కోరుకునేవారికి, ఆత్మను చాలా అధికంగా అపేక్షించే వారికే ఈ పరమ ప్రయోజనం.141.శ్రవణాది సమయాలలో 'ఆత్మను నేనే' అన్న అభేద దృష్టి కలిగి, దానినే అనుసంధానం చేసేవారిని ఆత్మ అనుగ్రహిస్తుంది. 142.ఎల్లప్పుడూ దురాచారాలలో

ఆసక్తులై, అస్థిరులై,అశాంతితో అలమటించేవారి మనసు ఏకాగ్రం కాదు. అటువంటి వారు జ్ఞానులైనా సరే ఆత్మజ్ఞానాన్ని పొందలేరు.143. శ్రుతిస్మృతి ప్రతిపాదితమైన, యోగ్యమైన కర్మలను చేస్తూ,అవిహిత కర్మలను త్యజించి,ఎల్లప్పుడూ ఏకాగ్ర చిత్తులై ఉండేవారికి ఆత్మ అంకితమైపోతుంది.144. దుశ్చరితాలనుండి విముఖులై ఆచార్యులైన గురుచరణాలలో వినమ్రత కలిగి, ఫలాపేక్షలేని వారికే ఆత్మప్రాప్తిస్తుంది.145. విషయ సుఖాలలోని కోరికలు తీరనంతవరకు, కేవలం ఆత్మనే కోరుకోనంత వరకు, సకల మనోవృత్తి ఆగిపోనంత వరకు, ఆత్మారాముడు దుర్లభం. 146. జిజ్ఞాసువుల తపస్సును గని ఆత్మకు స్వయం దయకలిగి తన స్వరూపాన్ని తానే ప్రకటం చేస్తుంది. కాని ఇది గురువు లేకుండా సులభసాధ్యం కాదు. 147. ఆత్మ స్వరూప ప్రాప్తికి సాధకులు శ్రవణమననాదులను, అభేదభావాను సంధానాన్ని,చక్కగా చేస్తే ఆత్మజ్ఞానం సుఖంగా లభిస్తుంది. 148. ఈ ప్రపంచమంతా అజ్ఞానమయం. ప్రపంచ వ్యాప్తికి మూల కారణం అజ్ఞానమే, జ్ఞానం వినా మోక్షానికి మరో వేరే ఆధారం లేదని తెలుసుకోవాలి. 149. అనుమానం మరియు యుక్తి ప్రభావం ఇవి శాస్త్రజ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటానికి. మనసులోని ప్రపంచం నశించిపోతేనే జ్ఞానోద్భవం. లేదా అది అసంభవం.150. మహాత్ముడైనా పాపాత్ముడైనా జీవాత్మయే పరమాత్మయని తెలుసుకుని వ్యవహరించేవాడు మహాత్ముడు. అతడొక్కడే అభేదాత్మ. 151. బ్రహ్మాత్మైకత్వ జ్ఞానమే జ్ఞానం యొక్క పర్యవసానం. ఆత్మజ్ఞానం ఒక్కసారి కలగగానే సమస్తమైన అజ్ఞానం నశించి పోతుంది. 152. ఆత్మజ్ఞానం కలిగితేచాలు. ఇక తెలుసుకోవలసినది మిగలదు. వస్తుజాతమంతా వారికి కరతలగతంలా సాక్షాత్కారమవుతుంది. 153. ఆత్మజ్ఞానం వలన, ప్రపంచనివృత్తి మరియు వెంటనే శుభప్రదమైన మోక్షంతో పరమానంద ప్రాప్తి. 154. ఆత్మసూక్ష్మం కంటే సూక్ష్మం. మహత్తుకంటే మహత్తరం అని చెప్పటం ఆత్మ యొక్క సర్వవ్యాపకత్వాన్ని

బుద్ధికి తెలియచేయటానికి. 155. ఆత్మ స్వయంగా సూక్ష్మం కాదు మహత్తుకాదు. అక్కడ తరతమ భావాలు కల్పితం. ఆబ్రహ్మస్తంబ పర్యంతం ఆత్మ చరాచరాలలో పరిపూర్ణంగా ఉంది. 156. ఏ హద్దూలేని అనిర్వచనీయమైన ఈ ఆత్మయొక్క అస్తిత్వాన్ని బుద్ధికి తెలియ చేయటానికి ఆత్మను వాక్కుతో వచనాలలో పరిమితం చేస్తారు. 157. అసలైన ఆత్మరహస్యం కేవలం బుద్ధివైభవయోగంతో చేజిక్కదు. సద్గురువుల, సాధు సత్పురుషుల సాంగత్యంలో ఉండి, వారిని సేవించి వారి కృపను పొందిన వారికి ఆత్మప్రాప్తి 158. బ్రహ్మజ్ఞాన వివరణ కేవలం కొన్ని గ్రంథాలలో మాత్రమే నిండి ఉందా? సద్గురు కృప లభించకపోతే కల్పాంతంలోకూడా అది కైవసం కాదు. 159. నిత్యనైమిత్తిక కర్మలను చేయకున్నా, మనసులో పరిశుద్ధమైన సంస్కారాలులేకపోయినా, బ్రహ్మజ్ఞానానుభవం అసలు సంభవం కాదు. 160. ఒక్క బ్రహ్మమాత్రమే నిత్యం. మిగతావన్నీ అనిత్యం. దృశ్యజాతమంతా శాశ్వతం కాదు. ఇది సత్యం. ముమ్మాటికీ సత్యం. 161. బ్రహ్మను గురించి చెప్పేవారూ లభించరు. అల్లే బ్రహ్మజ్ఞానాన్ని వినే పవిత్రులైన శ్రోతలూ దొఅకరు. ప్రేమమయులు అనుభవ శీలురైన సద్గురువులు మరీ అరుదు. 162. అడగగానే ఇవ్వటానికి బ్రహ్మజ్ఞానం అందుబాటులో ఉందా? పర్వతాలలో గుహలలో దాక్కుని యమ నియమాలతో కట్టుబడి ధ్యాన ధారణాలలో నిమగ్నమైనవారికి కూడా అది దొరకదు. 163. గురువు అనుగ్రహం లేకపోతే బ్రహ్మజ్ఞానం లభించదు. అటువంటిది నీవంటి మూర్తీభవించిన లోభ స్వరూపానికి ఎలా లభిస్తుంది బాబూ? 164. డబ్బు ఆశ బాగా ఉన్నవారికి బ్రహ్మజ్ఞాన ప్రాప్తి కల్పాంతంలోనైనా ఎన్నడూ లభించదు. దీనిని బాగా గుర్తుంచుకో. 165. పరమార్థాన్ని శ్రవణం చేసినా, విషయ సుఖాలను చింతన చేస్తూ ప్రపంచాన్ని నిదిధ్యాసన చేసేవారికి ఆత్మ సాక్షాత్కారం ఎలా సాధ్యం?

166.మల విక్షేప ఆవరణాలనే త్రిదోషాలతో ఉన్న అంతఃకరణాన్ని నిష్కామ కర్మతో మలక్షాళనం చేసి, విక్షేపాన్ని ఉపాసనతో తొలగించాలి.167. ఇలా స్వకర్మ మరియు ఉపాసనా చేయగా చిత్తం పరిపక్వమవుతుంది.మలవిక్షేపాలు నిర్మూలం కాగా, ఆవరణ మిగులుతుంది.168.ఈ ఆవరణ, సర్వ అనర్థాలకు బీజం.సూర్యుని ప్రకాశంతో అంధకారం తొలగిపోయేలా, జ్ఞానం ప్రకటమవగానే అజ్ఞాన ఆవరణ నశిస్తుంది. 169. వేదాంతంలో నిష్ణాతులైన వారు వర్ణించిన సత్యజ్ఞానానంద లక్షణాలు గల బ్రహ్మను జ్ఞానులు మాత్రమే తెలుసుకోగలరు. 170.మసక చీకటిలో ఒక బాటసారి అడవిలో నడుస్తూ ఒక చెట్టు మొండెమును చూచి దొంగ అనుకుని భయపడి పోయి, అక్కడే దాక్కుంటాడు.171. నేనొక్కణ్ణే ఉన్నాను. నా వద్ద డబ్బుంది. వాడు దారిదోపిడి చేసే దొంగలాఉన్నాడు.ఇప్పుడేం చేయాలి? ప్రాణంపై ఇక భరోసాలేదు అని అనుకుంటాడు. 172.దూరం నుండి దీపం రాగానే చెట్టు మొండెము బయటపడి,అతని భయం తొలగిపోయింది. చెట్టును చూచిదొంగఅని భ్రమించినది భ్రాంతిఅని అర్థమైంది.173.ఇప్పుడు శ్రోతలకు బ్రహ్మజ్ఞాన ప్రాప్తికి అడ్డంకులను మనవి చేశాను. తరువాతి అధ్యాయంలో శ్రేయాన్ని కోరేవారికి శ్రేయస్సు తన స్వరూపాన్ని ప్రకటించటం వినండి. 174.హేమాడ్ సాయి పాదాలలో దొర్లి తనకు స్ఫురించినది చెప్పాడు. సాయిబాబా దయతో చెప్పించిన దానిని అమాయక భక్తులు వింటారు.175. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో బ్రహ్మజ్ఞాన కథనమను పదునారవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 17 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఈ అధ్యాయంలో శ్రేయం మరియు ప్రేయం లక్షణాలను వర్ణిస్తానని గతాధ్యాయంలో చెప్పానుకదూ! వానిని శ్రద్ధగా శ్రవణం చేయండి. 1. ప్రకాశం అంధకారం అన్యోన్య సంబంధంతో ఒకేలా ఉన్నా, అవి పరస్పరం భిన్నంగా ఉంటాయి. శ్రేయప్రేయాలు అంతే. 2. ప్రియమైన వాటి కొరకు పరుగులు తీసే మనసు గల వారు స్వార్థంతో పతనమై పోతారు. శ్రేయం వివేక రూపమైతే ప్రేయం అవివేక రూపం. 3. శ్రేయాలకు సంబంధించిన విషయాలు కేవలం జ్ఞానానికి సంబంధించినవి . ప్రేయాల విషయాలు అజ్ఞానానికి సంబంధించినవి. ప్రేయాలు వివేకులను ఎప్పుడూ పొరపాటు పడనివ్వవు. శ్రేయాలు అజ్ఞానులకు రుచించవు. 4. కనక కామినుల యందు ప్రీతి, ఇంద్రియాలకు విషయ సుఖాలపై కోరిక ఉన్నంతవరకు, వివేక వైరాగ్యాలను సంపాదించుకోనంత వరకు, ప్రేయాలే మధురంగా ఉంటాయి. 5. నీరుక్షీరాలు బాగా కలిసి పోయేలా ప్రేయాలు శ్రేయాలు కలిసే ఉంటాయి. మానస సరోవరంలోని హంస పాలను మాత్రం సేవిస్తుంది. 6. ధీరులు, బుద్ధిమంతులు, అదృష్టవంతులు, కేవలం శ్రేయాలనే అపేక్షిస్తారు. ప్రియాలకు ఎప్పుడూ విముఖులై ఉంటారు. 7. కాని మందబుద్ధులు శరీరం, పశువులు, సంతానం ధనం, గౌరవం మొదలగు యోగక్షేమాల వెంటబడి ఒక్క ప్రేయాలనే సాధించుకుంటారు. 8. శ్రేయాలు ఏవి? ప్రియాలు ఏవి? ఈ రెంటిని మానవులు బాగా తెలుసుకున్నా, స్వతంత్రబుద్ధి కలవారవటం వలన

రెంటిలోదేనిని గ్రహించాలి అన్నది వారి ఆధీనంలోనే ఉంటుంది.9. అయినప్పటికీ రెండూ ప్రాప్తించినప్పుడు దేనిని గ్రహించాలో నిర్ణయించుకోవటం కష్టం. ప్రేయం మందబుద్ధులను జయించి వారిని ఆలింగనం చేసుకుంటుంది. 10. నీరు కలిసిన పాలలో నుండి పాలను మాత్రమే గ్రహించే హంసలా ప్రేయాన్ని వదిలి శ్రేయాన్నే స్వీకరించాలి. ఇదే పురుషార్థం.11. శ్రేయం మరియు ప్రేయం ఈ రెండూ మానవుల స్వాధీనంలో ఉన్నా, వివేకహీనులు, మందబుద్ధులు, వానిని తెలుసుకునే సమర్థులు కారు. 12.ముందుగా శ్రేయం దేనిలో ఉంది అని నిశ్చయంగా తెలుసుకోవాలి. ఆ తరువాత ఏవైనా ప్రతిబంధకాలు కలిగితే వానిని పూర్తిగా తొలగించుకోవచ్చు.13. ఇక్కడే పురుషార్థాలు కళ్లెదుట గట్టిగా నిలబడతాయి కనుక బుద్ధితో బాగా నిశ్చయించుకుని శ్రేయాల కొఱకే పోరాడాలి.14. ప్రపంచం యొక్క చక్రభ్రమణం అంతుపట్టనిది. అహర్నిశలూ ఆగకుండా తిరుగుతూనే ఉంటుంది. భయంకరమూ, నివారించడానికి వీలుకాని ఆధ్యాత్మికాది మూడు తాపాలను మానవులు సహిస్తారు.15. దానివలన అత్యధికమైన దుఃఖాలను సహిస్తూ, విసిగిపోయి వానిని తొలగించుకోవటానికి సుఖకరమైన సాధనాలను వెతుకుతారు.16. భరించలేని భవచక్ర భ్రమణం ఆగటానికి ఏఏ సాధనాలున్నాయని శ్రద్ధగా అన్వేషిస్తారు.17. గొప్ప భాగ్యం వలన ఇటువంటి బుద్ధిపుట్టినప్పుడు పురుషార్థత ఉదయిస్తుంది. అప్పుడు తమ స్వార్థం కొఱకు సాధనోపాయాలను కనిపెడతారు. 18. అనాది అవిద్య లేక మాయ, ముత్యపుచిప్పలోని వెండి ఎండమావులలోని నీరు వలె వ్యర్థం. ఆభాసరూపమైన మాయ గొప్ప అంతరాయం. దీనిని నశింపచేయాలి.19. స్వప్నంలో బంగారపు వడగళ్లవాన పడుతుంది. అవసరానికి పనికి వస్తాయని అత్యంత శ్రమతో వానిని మూట కట్టుకునే ప్రయత్నం చేస్తే మెలకువరాగానే అవి మాయమైపోతాయి. 20. కనిపించేవానిని కనిపించనివానిని అనుభవించాలన్న భోగలాలస, ఆశ, తృష్ణ మరియు కోరికలు

ఇవన్నీ ఎప్పుడూ ప్రతిబంధకాలని తెలుసుకోవాలి. ముందు వీనిని సమూలంగా ఊడబెరకాలి. 21.సూర్యకాంతిలో చూడ లేని దానిని, బుద్ధికి అందని దానిని, వేదశ్రుతులకు అంతుపట్టని దానిని గురువు తమ చేత్తో చూపిస్తారు. 22.కామక్రోధాలనే ఈ రెండు మనోవృత్తులు జ్ఞాన ప్రాప్తిని కలుగ నీయవు పైగా శ్రవణ మనన సమాధులను వెంటనే భంగం చేస్తాయి. 23. దీపం కర్పూరంతో సమాగమమయితే పరస్పరం ఒకదానిని మరొక దానితో తోసేయటం సాధ్యమా? ఆ రెండూ కలవటమే తడవుగా కర్పూరం దీపమై వెలుగుతుంది. 24. శ్రుతి స్మృతులయందు, అవిహితమని చెప్పిన దుష్కర్మలలో అనవరతం మునిగి ఉండి, విహితావిహిత కర్మలను తెలుసుకోలేని వ్యక్తి శాస్త్రజ్ఞానియైతే మాత్రం ఏంప్రయోజనం? 25. అట్లే అంతఃకరణంలోని కలవరం కారణంగా, ఎప్పుడూ అశాంతిగా ఉండేవారు ఇంద్రియలోలత్వం వలన మనసులో ఆందోళన పడేవారు జ్ఞానంలో పరిపూర్ణులుకాలేరు. 26. ఆచారాలను ఎరిగిన గురుపుత్రుడు మనసులో సంతృప్తిని కలిగి ఉంటాడు. నిశ్చలమైన మనసుతో ఆత్మాను సంధానం చేసేవాడొక్కడే జ్ఞాన సంపన్నుడు. 27.సంసారియైనా, మోక్షాన్ని కోరేవాడైనా, తన అసలు గమ్యానికి చేరుకోవాలంటే శరీర రథాన్ని స్వాధీనంలో ఉంచుకోవాలి. కేవలం వాచాలుడు ఏం చేయగలడు? 28.ఇక్కడ వాగ్జాటికి చోటులేదు. అసలైన అభ్యాసం అవసరం.శరీరాన్ని రథంగా భావించి, స్వయం స్థిరంగా కూర్చోవాలి. 29. శరీరమనే రథంలో తన బుద్ధిని సారథిగా చేసి, దానిలో యజమాని స్వయంగా స్థిరమైన మనసుతో కూర్చోవాలి. 30. విషయాలు పరుగులుతీసే మార్గాలను అధిగమించటానికి బుద్ధిని సారథిగా నియమించి, ఉచ్చృంఖలంగా ఉన్న దశేంద్రియాలనే గుఱ్ఱాలను మనస్సనే పగ్గంతో స్వాధీనంలోనికి తెచ్చుకోవాలి. 31. ఈ పగ్గం స్వేచ్ఛగా పరుగెత్తే గుఱ్ఱాలను అదుపులో ఉంచుతుంది. కనుక దీనిని సారథి చేతికిచ్చి నీవు స్వస్థ చిత్తంతో కూర్చో. 32.సారథి కుశలుడూ, నిపుణుడూ

అయితేనే గుఱ్ఱాలు బాగా పరుగెత్తుతాయి. కాని బలహీనమైన మనసు అనే పగ్గానికి ఇంద్రియాలనే గుఱ్ఱాలు అదుపులో ఉండవు.33. వివేకంతో ఉన్న బుద్ధి యొక్క సారథ్యం ఉండి మనో నిగ్రహము, ఏకాగ్ర చిత్తంము ఉన్నవారికే పరమపదప్రాప్తి. ఇతరులు మార్గంలో అలసిపోవటమే.34.మనసు ఎప్పుడూ చెడుగా ఉన్న వారికి శాంతి ఉండదు. వారికి పరమాత్మ ప్రాప్తి కలుగదు. జననమరణాల చక్రం తప్పదు.35. ఇటువంటి గొప్ప పరమపదప్రాప్తి, స్వయంగా ప్రకటమైనప్పుడు ఇది నిజంగా ఎక్కడుంది! అని మనసులోని సంశయం దూరమవుతుంది. 36.ఇక్కడ వాదోపవాదాలు పనికిరావు. పరమేశ్వరుని అనుగ్రహంతోనే ఆత్మ యొక్కస్థానం తెలుస్తుంది. ఇతర వాదాలు వ్యర్థం.37.తర్కంలోని చాతుర్యం ఇక్కడ పనికిరాదు. తర్కం చేసేవారి మతి కుంటుపడుతుంది. అమాయకులైన భావికులే సిద్ధిని పొందగలరు. ఇదే ఇక్కడి విశేషం.38.ఉత్తమమైన సమ్యక్ జ్ఞానానికి కారణమైన ఆ గతి వేరు. ఆ బుద్ధి కూడా వేరుగా ఉంటుంది. ఉత్తమమైన జ్ఞానాన్ని ప్రసాదించే ఆగమాలను ఎఱిగినవారు వేరుగానే ఉంటారు. 39.అమూల్యమైన శరీరం వృథాగా పాడైపోతూ ఉంది. ధనకాంక్ష మధ్యాహ్నపు నీడ వంటిదని, మరియు హరి యొక్కమాయ దుర్గమమని తెలుసుకుని సత్పురుషుల చరణాలను ఆశ్రయించాలి. 40. సత్పురుషులు భవసాగరాన్ని దాటించే నౌకలు. నీవు వానిలో ఒక ప్రయాణికుడవు కావాలి.వారు తప్ప తీరానికి చేర్చగల సమర్థులెవరు? 41.వివేక వైరాగ్యాల జంటను మూట కట్టుకున్న వారు జడులైనా, మూఢులైనా, రాయివంటి కఠినులైనా, భవసాగరం దాటటం వారికి కష్టం కాదు.42.భగవంతుని షడ్గుణ ఐశ్వర్యాలలో వైరాగ్యం వారి ప్రథమ ఐశ్వర్యం. అది మహాభాగ్యవంతులకు తప్ప ఇతరులకు దుర్లభం.43.విహిత కర్మలను చేయకపోతే చిత్తశుద్ధి జరగదు.చిత్తశుద్ధి లేక జ్ఞానసంపాదన సంభవం కాదు.44.కనుక కర్మ ఒకటే జ్ఞానప్రాప్తికి మూలకారణమని తెలుసుకోవాలి. నిత్య నైమిత్తిక కర్మానుష్ఠాల ద్వారానే

మనో మాలిన్యాలు క్షాళనమవుతాయి.45.ఇలా పరిశుద్ధమైన అంతఃకరణంలో వివేకవైరాగ్యాలు ఉత్పన్నమై శమదమాది సాధనా సంపత్తి లభించి ఈ శరీరమందే మోక్ష ప్రాప్తి కలుగుతుంది. 46.ఫలాపేక్షను త్యజించి ఏకాగ్రచిత్త యోగంతో గురువును అనన్య శరణు జొచ్చు వారిని సద్గురువులు అక్కున చేర్చుకుంటారు.47. బాహ్య ప్రవృత్తి లేని భావికులు, అనన్య భక్తులు జ్ఞాన ప్రాప్తితో ప్రజ్ఞావంతులౌతారు.ఇతర ఉపాయాలు పనికి రావు.48.జ్ఞానం లభించిన తరువాత అధర్మమార్గాలను అనుసరించే వారు ఇహపరాలకు దూరమై, క్రింద కాక పైనకాక త్రిశంకులా మధ్య వ్రేలాడుతారు.49.జీవుల అజ్ఞాన ప్రాప్తియే వాస్తవంగా ప్రపంచ ప్రవృత్తి. ఆత్మజ్ఞాన ప్రాప్తితో ప్రపంచం నివృత్తి అవుతుంది.50.ఆత్మను తెలుసుకున్న వారు ఎల్లప్పుడూ అహంభావ రహితులై ఉంటారు. వారికి ప్రపంచంలోని ధర్మాధర్మాలు, శుభాశుభాలు,హితాహితాలు ఏమవసరం?51.తాను శరీరమే అన్న అహంభావం తొలగిపోయిన వెంటనే ప్రపంచ విషయాల యందు నివృత్తి కలుగుతుంది. అదే జీవుని యొక్క పరమాత్మస్థితి అని నిశ్చయంగా గ్రహించాలి.52.ప్రపంచిక ప్రవృత్తి ఉన్నప్పుడు శత్రువులూ మిత్రులూ ఉంటారు. కాని నివృత్తియందు అలా కాదు. అంతటా నేను నేనే కనిపించగా, ఇక శత్రుత్వం మిత్రత్వం ఎక్కడుంటుంది? 53. ఇటువంటి మహాసుఖం ముందు శరీరానికి కలిగే దుఃఖం ఏపాటిది? ఆ మహా సుఖం లభించాక, ఇక ఐహిక సుఖాల కొఱకు ఎవరు ఏడుస్తారు? 54.ఐహిక దుఃఖాలు పర్వతాల వలె వారిపై పడ్డా ఏమాత్రమూ చలించరు. పర్వతరాజువలె ధైర్యంగా ఎదుర్కొంటారు.55.భగవంతుడు ఎవరియందు ప్రసన్నుడౌతాడో వారికే వైరాగ్యాన్ని ఇస్తాడు. దానితో పాటు వివేకాన్ని కూడా జతచేసి, వారిని భవసాగరం నుండి దాటిస్తాడు. 56.అద్దంలో కనిపించే మొహం యొక్క ప్రతిబింబంవలె, స్పష్టంగా ఆత్మను దర్శించు కోవాలన్న కోరిక కలిగిన వారికి ఇక్కడ భూలోకం, పైన బ్రహ్మలోకం;

మూడొచ్చోటు లేదు.57.యజ్ఞయాగాల ద్వారా దేవతలు తృప్తి చెందితే, పితృలోక ప్రాప్తి కలిగి, కర్మఫలాలను అనుభవించవచ్చు.కాని ఆత్మజ్ఞానం లభించదు.58. గంధర్వ, మహో, జన, సత్య, తపో లోకాలలో ఆత్మసాక్షాత్కారం అసలు సంభవంకాదు.అందువలన ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలన్న ఆసక్తి కలవారు భూలోకాన్నే కోరుకుంటారు.59.ఇక్కడ చిత్తశుద్ధి కలిగి, బుద్ధి అద్దంవలె నిర్మలమై, శుద్ధమైన ఆత్మస్వరూపం త్రిశుద్ధిగా ప్రతిబింబిస్తుంది.60.రెండవ స్థలమైన బ్రహ్మలోకంలో కూడా ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. కాని అక్కడ అనేక రకాల కష్టాలు అత్యంత ప్రయాసను కలిగిస్తాయి.61.మాయ పాము వలె లోపలి ప్రేవులను, బయట సర్వాంగాలను పెనవేసి పిండేస్తుంటే,దానిని ఆపగల సమర్థులెవరు?62.'నీ జేబులో యాభైరెట్లు రూపాయలుండగా నీవు ఊరికే కూర్చుని చూస్తున్నావా వానిని బయటికి తీయి చూద్దాం.బ్రహ్మ నీ జేబులోనే ఉన్నాడు'63.అని బాబా తీయమని చెప్పగా ఆ గృహస్థుడు జేబులో నుండి నోట్లకట్టను తీశాడు. దానిలో పది రూపాయల నోట్లను ఇరవై ఐదు లెక్కపెట్టాడు.64. అతడు లోలోపల సిగ్గుపడ్డాడు. మహారాజు ఎంతటి అంతర్జ్ఞాని అని అనుకుని బాబా ఆశీర్వచనాన్ని ఆశిస్తూ వారి చరణాలపై మస్తకాన్నుంచాడు.65.అప్పుడు బాబా అతనితో 'నీ బ్రహ్మమును చుట్టి దాచేసుకో.నిన్ను చుట్టుకున్న లోభం తొలగిపోనంతవరకు నీకు బ్రహ్మ జ్ఞానం లభించదు. 66.ద్రవ్యం పైని వాంఛ వదలకుండా, పుత్రులూ పశువులూ ధన సంపాదనల యందే ఆసక్తి గలవారికి బ్రహ్మజ్ఞానం. ఎలా లభిస్తుంది?67.ధనం పైని మోహం చాలా కఠినమయినది.ధన తృష్ణ అనే సుడిగుండాలు గల దుఃఖాల చెరువులో, మదమత్సరాలనే మకరాలు భరించలేనంతగా ఉంటాయి. కనుక ఒక్క విరాగియే తరించగలడు. 68.లోభానికి బ్రహ్మకు అఖండవైరం.లోభం ఉన్న చోట మనసుకు ఏకాగ్రత ఉండదు.ఆచార భ్రష్ముడైన లోభికి విరక్తి, ముక్తి

ఎలా సాధ్యం?69.లోభికి నిశ్చింత,శాంతి,సంతృప్తి ఉండవు. మనసులో ఒక్క లోభముందా సాధనలన్నీ మట్టి కొట్టుకుపోతాయి.70.శ్రుతులు స్మృతులు అవిహితమని నిషేధించిన కర్మలను ఆచరించడంలోనే సదా ఆసక్తులైన దుశ్చరితులకు చిత్త శాంతి ఉండదు.71.వారిని విక్షిప్త జీత్తులని అంటారు. వారు ఎల్లప్పుడూ దుష్కర్మల యందే నిమగ్నులై ఉంటారు. మంచి చెడూ చూడక ఎప్పుడూ విషయాలనే బురదలో పొర్లుతుంటారు.72.ఎంతటి విజ్ఞాన సంపన్నుడైనా, ఫలాపేక్షయందు విరక్తి కలుగనంతవరకు జ్ఞానం వ్యర్థం. అతడు ఆత్మసంపన్నుడు కాలేడు. 73.ఎవరైనా ఏదైనా కోరటానికి వచ్చినప్పుడు సత్పురుషులు ముందు అర్హతను చూస్తారు.వారి వారి యోగ్యతలను బట్టి వారివారికి ఇస్తారు.74.అహర్నిశలూ శరీరాభిమానంతో మనసులో విషయ చింతన ఉన్నవారికి గురూపదేశం వ్యర్థం.వారికి ఇహపరాలు రెండూ ఉండవు.75.చిత్తశుద్ధి లేకుండా పరమార్థ మార్గం లోనికి ప్రవేశించాలని అనుకుంటే, తమ జ్ఞాన గర్వాన్ని చాటుకోవడమే గాని అది నిజంగా వ్యర్థం.76. తమకు నచ్చిన విషయాన్నే చెప్పాలి. జీర్ణమయేటంత అన్నమే తినాలి, లేకపోతే అన్నం వ్యర్థమై అజీర్ణమవుతుందని అందరికీ తెలిసిందే కదా!77.నా భోషాణం పూర్తిగా నిండి ఉంది.ఎవరు దేనిని అడిగినా ఇవ్వగలను కాని పుచ్చుకునే వారి తాహత్తును చూచి వారు భరించగలిగినంతే ఇస్తాను.78.దీనిని శ్రద్ధగా వింటే నీవు కృతకృత్యుడవవుతావు.ఈ పవిత్రమైన మసీదులో కూర్చుని నేను అసత్యవచనాన్ని పలకను'.79.ఇది సత్పురుషుని వాక్కునుండి ప్రవహించిన అమృతఝరి.దీనిలో భక్తిగా మునకలు వేస్తే మలక్షాళనమై అంతర్బాహ్య పరిశుద్ధి కలుగుతుంది.80.ఇటువంటి సాయినాథుని మహిమను వర్ణించ సాగితే దానికి అంతంలేదు.నిరుపమానమైన వారిని ఏ ఉపమానంతో చెప్పగలం? వారు నిర్మలమైన ప్రేమకు మాత్రం అధీనులు.81.వారు సకల జనులకు తల్లి.ఆర్తులకు కష్టాలతో అలసిపోయినవారికి వారు విశ్రాంతి ధామం. ఆశ్రితులకు

కల్పవల్లి. దీనదుర్బలులకు నీడ.82. ప్రపంచానికి తిలోదకాలు వదిలి మౌనంగా పర్వతాలలో, గుహలలో, ఏకాంత వాసంలో తమ శ్రేయస్సును సాధించుకొనే వారు ఉంటారు.83.అటువంటి సాధువులు చాలా మంది ఉంటారు.వారు కేవలం తమ స్వార్థాన్ని లేదా పరమార్థాన్ని సాధించు కుంటారు. వారు ఇతరులకు ఏం ప్రయోజనం? 84.సాయిబాబా అటువంటి కోవకు చెందిన వారుకారు. వారికి ఆప్తులు ప్రియులు బంధువులు, ఇల్లూ వాకిలి భార్యాపిల్లలు ఎవరూ లేకున్నా, ప్రపంచంలోనే ఉన్నారు.85.అయిదు ఇళ్ళలో కరతల భిక్షను స్వీకరించి ఇరవై నాలుగు గంటలూ చెట్ల క్రిందే ఉంటూ, తమకంటూ ఏమి లేకున్నా, ప్రపంచ వ్యవహారాలన్నిటినీ బోధించే వారు.86.తాము బ్రహ్మా స్థితిలో ఉండి కూడా ప్రజల శ్రేయస్సు కొఅకు శ్రమపడే వారు. మహా జ్ఞానులైన ఇటువంటి సత్పురుషులు జగత్తులో చాలా అరుదుగా ఉంటారు.87.ఈ పవిత్ర రత్నం జన్మించిన ఆ కులం ధన్యం.ఆ వంశం ధన్యం.ఆ దేశం ధన్యం. పవిత్రులైన ఆ తల్లి తండ్రులూ ధన్యులు. 88.అనాయాసంగా పరశువేది లభిస్తే పాషాణమనుకుని పారవేసుకున్నట్లు, శిరిడీలోని ఈ పరమ భాగవతోత్తముని చాలా కాలం వరకూ ఎవరూ తెలుసుకోలేదు. 89.చెత్తకుప్పలోపడి ఉన్న రత్నం,పిల్లలకు దొరికితే దాన్ని రాయి అనుకొని వారు ఇష్టమొచ్చినట్లు సంతోషంతో ఎగరవేసి, కాలుతో తొక్కుతారు.90.మొదట బ్రహ్మజ్ఞానాన్ని కోరి వచ్చిన వ్యక్తి బాబా ఆశీస్సులతో తృప్తి చెందాడు.కఠినమైన మార్గాన్ని వదలాలి. నాకైనా మీకైనా అందరికీ అదే మార్గం.91.శబ్దాలను వింటూ, స్పర్శ సుఖాన్ని గ్రహిస్తూ, సువాసనలను ఆఘ్రాణిస్తూ, బయట కనిపించే రూపాలను చూస్తూ,ఇలా బాహ్య విషయాలను సేవిస్తున్నంత వరకు ఇంద్రియాలకు విషయాలపై సంయమనం కుదరదు. 92. విషయ సుఖాలపై విముఖత లేకుండా, ఇంద్రియాలను నిగ్రహించకుండా, ప్రత్యగాత్మ దర్శనం అంటే ఆత్మజ్ఞానం అశక్యం.93.ముందు ఈషణ త్రయాలను

వదిలి దృఢమైన శ్రద్ధా విశ్వాసాలతో సద్గురువుకు అనన్య శరణు పొందేవారు ఆత్మ జ్ఞానానికి పాత్రులు.94. శ్రోత్రాది పంచజ్ఞానేంద్రియాలు తమతమ విషయాలను వదిలి వేసినప్పుడు, మనసు స్వయంగా సంకల్ప వికల్పాలను వదలి పెట్టినప్పుడు. 95.అలా అన్నిటినుండి నివృత్తి యైన అంతఃకరణంలో, బుద్ధి కూడా నిశ్చయం తీసుకునే పనిని మానినప్పుడు, అదే పరమ గతి.అదే నిర్వికార బ్రహ్మ.96.బుద్ధి నిశ్చయశూన్యమై, మనసు కూడా చైతన్యమయమై ఆ పరమాత్మ ఒక్కడే తప్ప అన్యులెవరూ లేరని ఆత్మను తెలుసుకున్నవారు ధన్యులు.97. విషయ సుఖాలనుండి విముఖులైన వారి ఇంద్రియాలు ఆత్మోన్ముఖమవుతాయి.అప్పుడే నిజమైన ఆత్మ సుఖం ప్రకటమవుతుంది.ఇతర మైనవన్నీ సుఖాలు కావు.98.విషయ వికారాలతో కప్పబడి అతి సూక్ష్మంగా ఉన్న ఆత్మజ్ఞానాన్ని గ్రహించటం కష్టం.పరమానంద ప్రాప్తికి సరియైన సాధనలను తెలుసుకోవటం అతి కఠినం.99.హిరణ్యగర్భ పదవి వరకు ఇహపరసుఖాల యందు విరక్తి కలిగినవారే బ్రహ్మ పదమునకు అభిషిక్తులు.అట్టివారే ముక్తులని గ్రహించాలి. 100.మనసును విషయాలనుండి మెల్లమెల్లగా వెనుకకు మరలించి ఆత్మ స్వరూపంలో స్థిరపరచి ఆత్మజ్ఞానాన్ని సంపాదించాలి. 101.ఇహలోక పరలోక సుఖాల యందు వైరాగ్యం కలిగి హర్షశోకాది ద్వంద్వాలను త్యజించిన బుద్ధిమంతులకే ఈ సుఖం.ఇదే ఆధ్యాత్మ యోగం.102.అధి దైవిక ఆధ్యాత్మిక అధిభౌతికాలనే తాపత్రయాల బడబానల జ్వాలలో,బాగా మసిలి పోతున్న భవసాగరం లోని నీటిలో ఎవరు సుఖంగా ఉండగలరు?103.దాని నుండి తమను తాము ఉద్ధరించుకోవటానికి సాయిబాబా అనుగ్రహాన్ని పొందాలి. వారి చరిత్రను శ్రద్ధగా శ్రవణం మననం చేయాలి.104.సాయినాథుని చరిత్రలోని వారి విచిత్రలీలలను శ్రోతలు పుత్రమిత్రబంధు కళత్రాలతో సహా వింటే ఇహపరసుఖాలు లభిస్తాయి.105. భాగ్యవంతులు శ్రద్ధాళువులైన శ్రోతలు ఈ కథలను ఏకాగ్రతతో

వింటే శాంతికే శాంతి లభిస్తుంది.106.ఈ కథా నిర్ఝరీ ప్రవాహంలో కర్మా కర్మలనే లవణం కరిగిపోతుంది. శ్రవణద్వారాలనుండి సాయి యొక్క సుందర రూపం నయనాలలోనికి ప్రవేశిస్తుంది.107.ఈ చరిత్ర శ్రవణంతో పాతకాలు నశిస్తాయి. ఈ చరిత్ర శ్రవణంతో కాలునితో పోరాడి విజయాన్ని పొందుతారు.ఈ చరిత్ర శ్రవణంతో శ్రోతలు పరమోత్సాహాన్ని, ఉల్లాసాన్ని అనాయాసంగా పొందుతారు.108.ఈ చరిత్ర శ్రవణంతో అంతః కరణం పరిశుద్ధమవుతుంది. శ్రవణం తో జననమరణాలు వదిలిపోతాయి. శ్రవణంతో శ్రోతలు బ్రహ్మాత్వాన్ని పొందుతారు. శ్రవణం కేవలం బ్రహ్మార్పణ బుద్ధితో చేయాలి. 109. ఇలా సాయి సేవను కోరుకునే సేవకులను, భక్తులను శ్రీసాయిరాముడు నిష్కామలుగా చేసి వారి మనసుకు ఎల్లప్పుడూ విశ్రాంతిని కలిగిస్తారు.110.శ్రోతలారా! అనుదినము ఈ గ్రంథంలోని ఒక్క అధ్యాయాన్ని అయినా అధ్యయనం లేదా శ్రవణం, మననం, నిదిధ్యాసనం మరియు పరిశీలనం చేయండి.111.'ఆనందో బ్రహ్మేతి వ్యజనాత్' అని తైత్తిరీయ ఉపనిషత్తులోని ఈ వచనం బాగా ప్రసిద్ధి చెందినది. శ్రుతి సిద్ధాంతమైన ఈ వచనాన్ని బాబా తమ భక్తులకు తమ పద్ధతిలో బోధ చేశారు. 112.'మీరు కించిత్తైనా దిగులు పడకండి. ఎల్లప్పుడూ ఆనంద భరితులై ఉండండి.మరణం వరకూ ఏ చింతా పెట్టుకోకండి' అని బాబా ఎప్పుడూ బోధించేవారు.113.ఈ అధ్యాయం యొక్క ఉద్దేశం బ్రహ్మతత్వాన్ని నిర్ధారించడం. ఇది సాయికి శరణు జొచ్చినవారిని భవసాగరాన్నుండి తరింపచేసే నౌక.114.బాబా పదేపదే భక్తులకు హితవచనాలను చెప్పి పరోపకారం చేస్తూ,వారిని అనుసరిస్తూ తదనుసారం ప్రవర్తించేవారు.115.ఇది మంచి ఇది చెడు అన్న ఈ అభిప్రాయ భేదాలు కేవలం వ్యక్తిగతం. దీనివలన సామాన్యజనులకు సంతోషం కలుగుతుంది. అదే ఈ గ్రంథం యొక్క ప్రయోజనం.116.బాబా కార్యకారణాలను తెలుసుకుంటారు. వారి యొక్క సంకల్పాలను

అనుసరించే భవిష్యత్తు జరుగుతుంది.117.గురువు నోటి నుండి వచ్చిన కథలను విని,వారి అతర్క్యలీలలను అనుభవించి,ఆ లీలలన్నిటిని గుర్తుగా సంగ్రహించి ఇతరులకు వినిపించాలి.118.సాయి యొక్క ఈ అద్భుత చరిత్ర అత్యాదరంగా శ్రవణం చేస్తే, చెప్పేవారి మరియు వినేవారి దైన్యం నశిస్తుంది. అంతేకాదు, అందఱి చెడురోజులు తొలగిపోతాయి. 119.బాబాయొక్క అలౌకికమైన లీలలను గని ఏ అభాగ్యుడు చకితుడవడు? కేవలం వారి దర్శనమాత్రంతో సంతుష్టుడై, వారి పాదాలలో లీనమై పోతాడు.120. విస్తారమైన ఈ చరితాన్ని పరిశుద్ధమైన మనసుతో వినటానికి శుభప్రదమైన అవకాశం కలిగితే ఎవరు వృధా చేసుకుంటారు?121.పుత్రమిత్ర కళత్రాలనే సుడిగుండాలలో, కామక్రోధాలనే మొసళ్లు, అనేక రోగాలనే తిమింగలాలు విజృంభిస్తుంటాయి. ఆశలనే అలలు కలవర పెడుతుంటాయి. 122.ఉద్వేగాలనే దెబ్బలు మళ్లీమళ్లీ తగులుతుంటాయి. సుఖదుఃఖాలనే ద్వంద్వాలు మనసులో సంశయాలను ఉత్పన్నం చేస్తాయి. అయినా ప్రపంచాన్ని వదిలిపెట్టరు.123. శుద్ధ బ్రహ్మవు నీవే, కాని శరీరంలో బంధింపబడి ఉన్నావు. పంజరంలోని తీగను గట్టిగా పట్టుకుని తలక్రిందుగా వ్రేలాడే చిలుకలా ఉన్నావు,అని మనం స్వయంగా జీవాత్మకు బోధించాలి.124.కేవలం మోహమాయల వలన బుద్ధి భ్రమించింది.ఆ కారణంగా నీ శ్రేయస్సును మరచిపోయావు అని నిన్ను నీవే హెచ్చరించుకుని త్వరగా నీ స్వరూపాన్నితెలుసుకో 125.భ్రమ కారణంగా భ్రమ అధికమై మనసులో దేహాభిమానాది సంభ్రమాలు కలుగుతుంటాయి. నేను నాది అన్నది మృగతృష్ణ వంటిదని తెలుసుకుని ఏమమకారాలు లేకుండా ఉండాలి.126.నేను నీవు అన్న ఈ ప్రపంచంలో ఎందుకు చిక్కుకున్నావు? చిలుకా! నీ కాలికి ఉన్న బంధనాన్ని విదిలించుకుని పైకి ఎగిరి విహరించు. 127.ముక్తత ఉన్నచోట బద్ధత ఉంటుంది. అట్లే బంధన మున్నప్పుడు ముక్తి కూడా ఉంటుంది.ఈ ఉభయ దశలను దాటి

శుద్ధ ఆత్మ స్వరూపమందు స్థిరపడాలి.128.ఇది సాక్షేపజ్ఞానం. సుఖం మరియు దుఃఖం అనే అజ్ఞానాన్ని వదలి జ్ఞానాన్ని సాధించు కుంటే బ్రహ్మజ్ఞానం సమీపంలోనే ఉన్నట్లు.129. శరీరంలో నేను నీవను భేద భావమున్నంతవరకు నీవు స్వహితాన్ని తెలుసుకోలేవు.అందువలన నీనా అన్న దాన్ని వదిలేసేయి. కృపణునిలా శరీరాన్ని అంటిపెట్టుకోవటం మానేసి నిన్ను నీవు తెలుసుకో.130.కుబేరుని వంటి ధనవంతుడు భిక్షా వృత్తితో తిరుగుతుంటే అది కేవలం అజ్ఞానం వలన ఆపాదించుకున్న దౌర్భాగ్యమే.131.ఎప్పుడూ ఉత్తమమైన శాస్త్రాలను శ్రవణం చేయాలి. సద్గురువు యొక్క వచనాలను విశ్వాసంతో పాటించాలి.వానిని శ్రద్ధగా అనుసంధానం చేయాలి.132.గురువుల ఆచార పద్ధతులను చూచి,జనులు తమను ఉద్ధరించు కోవటానికి మార్గాలను ఎన్ను కుంటారు. అలా అసంఖ్య జీవులు ఉద్ధరింపబడి మోక్షాన్ని సహజంగా పొందుతారు.133.భవబంధనాలు విడిపోయే ఘడియ ఎప్పుడు వస్తుందా అని అహర్నిశలూ ఆలోచించేవారు త్వరగా వివుక్తిని పొందుతారు.134. ప్రపంచం నిస్సారమని బాగా తెలుసుకుని,వీలైనంతవరకు ఏకాంతాన్ని సదుపయోగం చేసుకుని, ఏకాంతంలో ఎప్పుడూ అధ్యయనంలోను ఆత్మచింతనలోనూ ఉండాలి.135.శిష్యులు సంపూర్ణ వినయ విధేయతలు, శ్రద్ధ, భక్తి గల మనసుతో సాష్టాంగపడి శరణు వేడితే తప్ప గురువు జ్ఞాన నిధిని ప్రసాదించరు.136.గురువుకు సర్వస్వాన్ని అర్పించి వారి శుశ్రూష చేయాలి. బంధ మోక్షాల గూర్చి బాగా తెలుసుకోవాలి.విద్య అవిద్య గురించిన ప్రశ్నలను గురువును అడిగి తెలుసుకుని సఫలతను చెందాలి.137.ఆత్మ ఎవరు పరమాత్మ ఎవరు అన్న విషయాలను గురువు తప్ప ఎవరూ చెప్పరు. గురువుకు సంపూర్ణంగా శరణాగతులైతే తప్ప వారు ఏకాన్త జ్ఞానాన్ని ప్రసాదించరు.138.గురువు కాక ఇతరులెవరైనా జ్ఞాన బోధ చేసినా దానితో భవబంధనాలు విడిపోవు.అది కించిత్తైనా మోక్ష ఫలప్రదం కాదు.అది మనసులో అసలు

నాటుకోదు. 139.గురువు వినా జ్ఞాన ప్రాప్తి లేదని పండితులందరికీ విదితమే. బ్రహ్మ మరియు ఆత్మ ఒక్కటే అన్న విషయాన్ని అనుభవింపచేసే సామర్థ్యం గురుచరణాలకే ఉంది.140.అక్కడ ఏ సందేహాలు లేకుండా దర్పాభిమానాలను వదిలివేసి, గురువుకు సాష్టాంగ దండప్రణామం చేసి, వారి చరణాలపై శిరసుంచాలి.141.దృఢమైన మనసుతో గురుచరణాలను గట్టిగా పట్టుకుని 'నేను మీ దాసానుదాసుణ్ణి.మీ పాదాలనే నమ్మాను'అని నోటితో అంటే చాలు. 142.ఇక వారి చమత్కారాన్ని చూడండి. దయాసాగరులైన ఆ గురువు తమ అనుగ్రహమనే అలల శయ్యపై తేలి ఆడించగలరు.143.తమ అభయహస్తాన్ని శిరసుపై నుంచి, ఇడ పింగళ నాడులను సరిచేసి,సమస్త పాతకాల రాసిని దహించి వేసి,నుదుట విభూతిని పెడతారు.144.ఆ విధంగా బాబా బ్రహ్మజ్ఞానాన్ని,కోరివచ్చిన వ్యక్తిని కేవలం నిమిత్తమాత్రునిగా చేసి,భక్తులకు, బ్రహ్మ నిరూపణను, జీవుని శివుని ఐక్యతా జ్ఞానాన్ని సంపూర్ణంగా బోధించారు. 145.ఇంతటి గొప్ప విద్య, అనుపమానమైన ప్రజ్ఞ ఉన్న సాయిమహారాజుకు హాస్య రసం ఎందుకు ఇష్టం? వినోదం వారికి ఎందుకు ప్రీతికరం.146.అని సహజంగా అనుమానం కలుగుతుంది కదూ! బాగా ఆలోచిస్తే ఒక్కటే సమాధానం. శ్రద్ధగా వినండి.147.పసిపిల్లలతో మాట్లాడుతూ వారి వచ్చీరాని ముద్దుమాటలతో ఆనందిస్తున్నప్పుడు మనమెవరైనా పెద్దవారిలా ప్రవర్తిస్తామా?148.ఆ ప్రేమను శబ్దాలు వర్ణించగలవా? వినోదంగా హాస్యాలతో జ్ఞానబోధ ఒక కళ.149.పొట్టలో ఏ రోగం ఉందో పిల్లలకు తెలుస్తుందా?వారికి మందూమాత్రలూ తల్లి ఇవ్వాలి. వారు ఒకవేళ మందు త్రాగక మొండికేస్తే.150.వారిని ఒకప్పుడు బ్రతిమాలి బామాలి లేదా ఒకప్పుడు కళ్లు ఎఱ్ఱచేసి లేదా బెత్తం దెబ్బలు తగిలించి లేదా ఒకప్పుడు ప్రేమగా గుండెలకు హత్తుకునేది తల్లియే.151.బాలురు పెద్దవారయాక వారి బుద్ధి తీవ్రతను బుద్ధి మాంద్యాన్ని గమనించి వారిని లాలించాలి. అట్లే జ్ఞానంలో కూడా.

152. తీక్షణమైన బుద్ధిగల వారు జ్ఞానోపదేశాన్ని క్షణం ఆలస్యం లేకుండా త్వరగా గ్రహిస్తారు. అదేమందబుద్ధి గలవారి తలకెక్కించటం చాలా కష్టం.153. జ్ఞాన నిధియైన సాయి సమర్థులు ముందు భక్తుల యొక్క బుద్ధిని వారి పాత్రతను నిర్ధారించి, జ్ఞానాన్ని సమృద్ధిగా వితరణ చేస్తారు.154. వారు పూర్ణ అంతర్ జ్ఞాని. వారికి అందరి గురించి ముందే తెలుసు. వారి వారి అర్హతలను అనుసరించి సాధనను నియమిస్తారు.155. అట్లే వారి వారి అర్హతలను తెలుసుకుని వారి యోగ్యతలను, అయోగ్యతలను అనుసరించి భక్తుల బాధ్యతలను వహిస్తారు.156. మనం పైకి వయసుమళ్లిన వారివలె కనిపించినా సాయి సిద్ధుని ఎదుట నిజంగా పిల్లల కంటె పిల్లలం. ఎప్పుడూ వినోదం కోసం ఆతురత పడతాం.157. బాబా వినోదానికి నిలయం. ఎక్కడ ఎవరికి ఏదిరుచిస్తుందో చక్కగా తెలుసుకుని భక్తుల కోరికలను తీర్చివారిని సంతుష్టులను చేస్తారు.158. బుద్ధి మంతులు గాని లేదా మంద బుద్ధులుగాని ఈ చరిత్రను పఠిస్తే పరమానందం కలుగుతుంది. శ్రవణం చేస్తే వినాలనే కుతూహలం పెరుగుతుంది. మననం చేస్తే సంతృప్తి ఆనందం లభిస్తాయి.159. మరల మరల పఠిస్తే పరమార్థ జ్ఞానం కలుగుతుంది. నిదిధ్యాసనలు చేస్తే మహదాహ్లాదం అనంతమైన సుఖం లభిస్తాయి. ఇది ఇటువంటి అమోఘమైన లీల.160. ఇలాంటి అనుభవాన్ని కించిత్తైనాపొందిన భాగ్యవంతులు కాయావాచా మనసులతో సాయికి అంకితమైపోయారు. సాయి లీలలు తర్కానికి అంతుపట్టనివి. 161. హేమాడ్ సాయి చరణాలకు శరణు జొచ్చి, బ్రహ్మజ్ఞానం కోరి వచ్చిన వ్యక్తిని నిమిత్తమాత్రునిగా చేసి, భక్తుల శ్రేయస్సుకై బాబా వినోదం ద్వారా జ్ఞాన ప్రదానం చేయడం చెప్పాడు. 162. తరువాతి అధ్యాయం ఇంతకంటె మధురమై శ్రవణార్థుల కోరికను తీరుస్తుంది. బాబా నామనసులో రహస్యంగా ఉన్న కోరికను స్పష్టంగా వెల్లడి చేసి తీర్చటం.163. నేను మాధవరావు వద్దకు వెళ్లి అతనికి బాబా యొక్క

సందేశాన్ని అందించి, బాబా యొక్క అనుగ్రహాన్ని పొందిన విషయాన్ని సంపూర్ణంగా వినండి. 164.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో బ్రహ్మజ్ఞాన కథనమును పదునేడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 18 వ అధ్యాయం.

శ్రీ గణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

పరమ సత్యమూ నిత్యమూ అయిన సద్గురు దేవా మీకు జయము జయము! మీరు భక్తులకు ఈ జగత్తు మిథ్యయన్న అనుభవాన్ని కలిగిస్తారు. మాయను మీ నియంత్రణ యందు ఉంచే దేవా! మీకు జయము జయము!. 1. జయజయ అనాద్యనంతా! జయజయ ద్వంద్వాతీతా! జయజయ నిర్వికారా! ఆత్మ స్వరూపాన్ని బోధించేది మీరొక్కరే. 2. స్నానం చేయాలని సాగరంలో మునిగిన సైందవ ప్రతిమ మరల బయటకు రాగలదా? ఇది ఎన్నటికీ సాధ్యం కాదు. మీ వద్ద కూడా అట్లే. 3. ఏ బ్రహ్మను గూర్చి వేద శ్రుతులు అహర్నిశలూ చర్చిస్తాయో ఆ బ్రహ్మను మీరు భక్తులకు అప్రయాసంగా ప్రేలితో చూపిస్తారు. 4. భాగ్యవశాత్తు మీ ఆశ్రయంలోకి వచ్చినవారెవరికైనా మన ది పరులది అన్న సంకుచిత భావం ఉండదు. 5. గతాధ్యాయంలో, నోట్ల కట్టలో చుట్టి ఉన్న బ్రహ్మను ఆవిష్కరింపజేసి, బ్రహ్మను కోరుకునే వారికి లోభం ప్రతిబంధకమని తెలిపిన పావన కథను వర్ణించడమైంది. 6. ఇప్పుడు బాబా నన్ను అనుగ్రహించిన కథను శ్రోతలు శ్రద్ధగా శ్రవణం చేస్తే, బాబా మార్గదర్శకత్వం మీకు అనుభవమవుతుంది. 7. ఈ మధుర వృత్తాంతాన్ని ఉన్నది ఉన్నట్లు చెబుతాను. శ్రోతలు తమ శ్రేయస్సు కొఅకు స్వస్థచిత్తంతో వినండి. 8. శ్రోతలు శ్రద్ధగా ఉంటే వక్తకు ఉత్సాహం. అలా ఉభయులకూ హృదయంలో ప్రేమ

పొంగి ఆనందం కలుగుతుంది.9.సాయిబాబా ఏమాత్రమైనా భేదభావం లేకుండా భక్తుల అర్హతను బట్టి వారికి సరియైన మార్గాన్ని బోధించేవారు.10.గురువు బోధించిన ఉపదేశాన్ని ఇతరులకు తెలియచేస్తే గురువు వాణి విఫలమవుతుందని అనేకులు అనుకుంటారు.11.కాని ఇది వట్టి కల్పన మాత్రమే. అర్థంలేని వ్యర్థ ప్రేలాపనలే. గురువులు ప్రత్యక్షంగానే కాక,స్వప్నంలో ఉపదేశించిన విషయాన్ని కూడా అందఱికీ తెలియచేస్తారు.12.దీనికి నిదర్శనం లేదను కుంటారేమో. బుధ కౌశిక ఋషి ప్రమాణం. అతడు తనకు స్వప్నంలో బోధించిన రామరక్షా దీక్షా మంత్రాన్ని అందరికీ చెప్పేశాడు. 13.గురువు వర్షాకాలంలోని మేఘం. వారు ఆనందమనే జలాన్ని ఉత్సాహంగా వర్షింప చేస్తారు. దానిని సేకరించుకుని దాచుకోవటానికి కాదు.యథేచ్ఛగాతాము సేవించి ఇతరులకు కూడా పంచిపెట్టాలి.14.తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం వారి చిబుకాలను పట్టుకుని, మాయ మాటలను చెప్పి వారికి మందు త్రాగిస్తుంది. బాబా కౌశలం కూడా అంతే. 15.వారి మార్గం రహస్యంగా ఉండేది కాదు.వారు ఏ విధంగా అకస్మాత్తుగా భక్తుల కోరికలను తీర్చేవారో శ్రద్ధగా వినండి. 16.సద్గురువు యొక్క సాంగత్యం ధన్యం.దాని మహిమను ఎవరువర్ణించగలరు? సద్గురువు యొక్క ఒక్కొక్క వచనాన్ని స్మరించుకుంటే స్ఫూర్తి పొంగుతుంది.17.భక్తిగా భగవంతుని ఆరాధన, గురుపూజ,గురుసేవ చేస్తే గురువు యొక్క ఆశ్రయం లభిస్తుంది. ఇతర సాధనలన్నీ వ్యర్థం. 18. మనసులోని విక్షేపం మరియు ఆవరణల కారణంగా, భవాన్ని దాటే మార్గం అయోమయంగా అస్పష్టంగా ఉంటుంది. దానిని నిర్విఘ్నంగా దాటటానికి గురువు యొక్క వచనాలు దీప కిరణాలవలె మార్గాన్ని సూచిస్తాయి. 19.గురువే ఈశ్వరుడు. బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు. వాస్తవానికి గురువే పరమేశ్వరుడు. గురువే పరాత్పర

పరబ్రహ్మ.20.గురువు జనని. గురువు జనకుడు. భగవంతుడు కోపిస్తే గురువు రక్షిస్తాడు. కాని గురువు కోపిస్తే ఎవరూ రక్షించరని ఎప్పుడూ గుర్తుంచు కోవాలి. 21.ప్రవృత్తి మార్గంలోను మరియు ప్రపంచంనుండి బయటపడే తీర్థ వ్రతాది నివృత్తి మార్గంలోను, ధర్మాధర్మకార్యాలలో విరక్తిని వేద శ్రుతులలోని జ్ఞానాన్ని బోధించే ప్రవక్త గురువే.22.అతికోమల హృదయులు, కరుణామయులు అయిన సత్పురుషులు బుద్ధిని వికసింపచేసి ఆత్మస్వరూపం యొక్క వైభవాన్ని చూపించి భక్తుల కోరికలను తీరుస్తారు. 23.దానితో విషయవాసనలు తొలగిపోయి నిద్రలో కూడా జ్ఞానదృష్టి ఉంటుంది. వారి కృపతో వివేక వైరాగ్యాలనే ఫలాలు చేజిక్కుతాయి.24.సత్పురుషుల సాంగత్యంలో ఉంటూ ప్రేమతో వారి సేవ చేస్తే భక్తకామ కల్పద్రుమమైన భగవంతుడు స్వయంగా కష్టాలన్నిటినీ నివారిస్తాడు.25. ఎల్లప్పుడూ సత్పరాయణులై ఉంటూ సత్పురుషుల కథలను శ్రవణం చేయాలి. సత్పురుషుల పాదాలకు వందనం చేయండి, పాప ప్రక్షాళనమవుతుంది. 26.ముంబైలో బ్రిటిష్ ప్రభుత్వంలో లార్డు రే గవర్నరుగా ఉన్నప్పుడు, క్రాఫర్డు పాలన పడిపోయింది. ఆ సమయంలో బాగా ప్రసిద్ధి చెందిన ఒక వ్యక్తి బాబా భక్తిలో పడ్డాడు.27.తాపత్రయాలతో ఉన్న ఈ ప్రపంచం ఒట్టి అసత్యం. ఆ వ్యక్తికి వ్యాపారంలో నష్టం వాటిల్లి మనసుకు చాలా విరక్తి కలిగింది. దానితో అన్నిటినీ వదులుకుని బయట పడ్డాడు.28.మనసు అస్థిరమై చంచలమై పోయింది.దూరంగా ఎక్కడికైనా వెళ్లి ఏకాంతంగా సుఖంగా ఉండాలన్న ఆలోచనను బాగా దృఢం చేసుకున్నాడు.29.జీవులు అత్యంత కష్టాలలో ఉన్నప్పుడు, దేవుడు గుర్తుకు వస్తాడు. అప్పుడు వారు భగవంతుని స్మరిస్తూ అతని వెంట పడతారు.30.పాపకర్మలను ఆచరించటం తగ్గిపోనంతవరకు భగవంతుని నామం నోటికి రాదు. అయినా భగవంతుడు జీవుల భక్తిని చూచి వారిని సత్పురుషులతో కలుపుతాడు. 31.ఆ భక్తునికి కూడా

అట్లే జరిగింది. ప్రపంచంపై బాగా విరక్తి చెందిన ఆ వ్యక్తిని చూచి అతని మిత్రుడు అతనికి చెప్పిన హిత వచనాలను వినండి.32. మీరు సాయి సమర్థుని దర్శనానికి శిరిడీకి వెళ్లి దయామయులైన ఆ సత్పురుషుని ప్రార్థించండి.33. సత్పురుషుల సాంగత్యం ఒక్క క్షణం లభించినా, చంచలమైన మనసు నిశ్చలమై తక్షణం హరిచరణాలలో లగ్నమై పోతుంది. అక్కడినుండి వెనుకకు మరలడం కష్టం. 34. జనులు దేశదేశాల నుండి వచ్చి సాయి పాదధూళిలో పొర్లుతారు. ఆ సాయి మహారాజు ఆజ్ఞను పాటిస్తూ, వారిసేవ చేస్తూ తమ మనోభీష్టాలను తీర్చుకుంటారు.35. ప్రసిద్ధమైనవారి కీర్తి ప్రతిష్ఠలను ఆబాలవృద్ధులందరికీ తెలుసు. వారికి దయకలిగితే దుఃఖ నివృత్తి కలుగుతుంది.36. శిరిడీ ఒక పవిత్రక్షేత్రం. అక్కడ అహర్నిశలూ జాతరలాగా ఉంటుంది. మీరు కూడా వెళ్లి మీ అనుభవాన్ని చూడండి. సత్పురుషుల దర్శనంతో ఎప్పుడూ మంచి చేకూరుతుంది అని మిత్రుడు చెప్పాడు.37. వర్షాలులేక ఎంతగానో దుఃఖితుడైన దరిద్రునికి అకస్మాత్తుగా బాగా వర్షం కురిసినట్లు, ఆకలితో ప్రాణం అలమిటిస్తుంటే పంచ భక్ష్యాలు వడ్డించినట్లు.38. స్నేహితుడు చెప్పిన సలహాను స్వీకరించాడు. దానితో తన అనుభవాన్ని తెలుసుకోవాలని శిరిడీ మార్గాన్ని పట్టాడు.39. గ్రామంచేరి సాయిని దర్శించుకుని సాష్టాంగ ప్రణామం చేశాడు. వెంటనే అతని నయనాలు తృప్తి చెందాయి. మనసు శాంతించింది.40. పూర్ణ పరబ్రహ్మ సనాతనుడు స్వయం జ్యోతి నిరంజనుడైన సాయిని చూచి అతని మనసు సుప్రసన్నమైంది.41. పూర్వార్జిత పుణ్య ఫలం వల్ల, భాగ్యవశాత్తు బాబా చరణాలు లభించాయని అనిపించింది. సాయి దర్శనంతో నిశ్చింత కలిగి మనసుకు శాంతి చేకూరింది.42. అతని ఉపనామం సాఠే. దృఢ నిశ్చయం కలవాడు. గురుచరిత్ర పారాయణను నియమ నిష్ఠలతో ఆరంభించాడు.43. సప్తాహం సమాప్తి అయిన రాత్రి బాబా తమ చేతిలో గురు చరిత్ర గ్రంథాన్ని పట్టుకుని సాఠేకు

అర్థాన్ని తలయ చస్తున్నట్లుగా దృష్టాంతాన్ని కలిగించారు.44.బాబా తమ ఆసనంలో కూర్చుని తమ ఎదుట సాఠేను కూర్చుండ బెట్టుకుని, గురుచరిత్ర గ్రంథాన్ని పట్టుకుని వ్యాఖ్యానించసాగారు.45.బాబా అలా గ్రంథపారాయణ చేస్తూ పారాణికునివలె వర్ణించటం, సాఠే శ్రోత వలె నిశ్చల మనసుతో శ్రద్ధగా గురు కథను వినటం. 46.దీని అర్థం ఏమిటని సాఠే ఆలోచించ సాగాడు.అతనికి చాలా ఆశ్చర్యం కలిగింది. ప్రేమతో అతని కంఠం గద్గద మైంది.47. అజ్ఞానాంధకారమనే తలగడను తలక్రింద వేసుకుని వాసనలనే పడకపై గుఱ్ఱుపెట్టే వారిని దయామయులైన సాయినాథులు మేల్కొలుపుతారు.48.సమయానికి నా వెన్ను తట్టి 'గురుచరిత్రయనే అమృతాన్ని నాచే త్రాగించారు కదా! కృపాళూ!49.అని తనకు కలిగిన దృష్టాంతంతో సాఠే వెంటనే మేల్కొన్నాడు. జరిగిన ఆ వృత్తాంతాన్నంతా కాకాసాహేబు దీక్షితుకు తెలియచేసాడు.50.దీని అర్థం నాకు బోధపడలేదు.అది సమర్థులకే తెలియాలి.బాబా మనసులో ఏమున్నదో తెలియదు. కాకా!వారిని అడగండి.51.నేను మరల పారాయణ చేయాలా, లేక సమాప్తి అయిందా అని మీరు వారి ఉద్దేశాన్ని తెలుసుకోండి. అప్పుడే నాకు మనశ్శాంతి అని చెప్పాడు.52.తగిన సమయం చూచి కాకా బాబాకు సాఠే స్వప్నాన్ని తెలిపి, 'బాబా! ఈ దృష్టాంతంతో కాకాకు ఏమని తెలియ చేశారు?53.సప్తాహం ఇంతటితో సమాప్తి చేయాలా లేక మరల ఆరంభించాలా? దృష్టాంతం యొక్క అర్థాన్ని మీరు స్వయంగా వివరించి అతనికి మార్గాన్ని చూపించండి'.54.సాఠె గొప్పభక్తి భావమున్న వాడు. అతని పై దయచూపి అతని కష్టాన్ని తొలగించండి. ఇదే మీ చరణాలకు నా విన్నపం'అని చెప్పాడు.55.అప్పుడు బాబా 'మరొకసారి పారాయణ జరగని' అని ఆజ్ఞాపించి 'గురువు యొక్క ఈ గ్రంథాన్ని పఠిస్తే భక్తులు పవిత్రులౌతారు. 56.ఈ గ్రంథాన్ని పారాయణ చేస్తే శుభం కలుగుతుంది.పరమేశ్వరుడు ప్రసన్నుడౌతాడు.భవబంధనాలు విడిపోతాయి' అని

చెప్పారు.57.వారు ఈ విషయాన్ని చెప్పుతున్నప్పుడు నేను బాబా పాదాలు పట్టుతున్నాను. నామనసులో ఆశ్చర్యం కలిగి అనేక ఆలోచనలు లేచాయి.58.ఇదేమిటి బాబా! సాతేకు శ్రమ లేకుండానే ఫలితమా! ఏడు రోజులలోనే అతనికి ఫలితం లభించింది. నాది అనేక సంవత్సరాలది వ్యర్థమైపోయింది.59. ఏడురోజులలో గురుచరిత్రను ఒక్క సారే పారాయణ చేశాడు. నేను నలభై సంవత్సరాలుగా పారాయణ చేస్తున్నానే.ఆ విషయాన్ని అసలు ఆలోచించనేలేదా?60.ఒకరికి ఏడురోజులలో ఫలితం, మరొకరికి ఏడేళ్ల పారాయణ నిష్ఫలమేనా? ఈ దయాఘనులు ఎన్నడు నాపై దయను కురిపిస్తారా అని నేను చాతక పక్షిలా నిరీక్షిస్తున్నాను.61.ఈ సత్పురుషులు ప్రసన్నులై నాకు ఉపదేశాన్నిచ్చి నామనో భీష్టాన్ని తీర్చే రోజు ఎప్పుడు వస్తుంది అని అనుకున్నాను.62. సద్గురు సాయి భక్తవత్సలుడు చేసిన చమత్కారాన్ని చూడండి. నా మనసులోని ఆలోచనలను వెంటనే తెలుసుకున్నారు. 63.అజ్ఞానం వలన కోటాను కోటి మంచిచెడూ వాసనలు మనసులో వెంటవెంటనే లేస్తుంటాయి. అవన్నీ బాబాకు తెలుస్తాయి. 64.మనసు ఆలోచించినట్లు శత్రువులు కూడా ఆలోచించరు. ఇది అందరికీ బాగా తెలిసినదే. ఇతరులకెవరికీ తెలియనివి సాయి మహారాజుకు వెంటనే తెలిసిపోతాయి. 65.కాని కరుణామయి అయిన ఆ తల్లి అందరి దురాలోచనలను తనకడుపులో దాచుకుంటుంది.మంచి ఆలోచనలు కలిగినప్పుడు వానిని బాబా ప్రోత్సాహ పరుస్తారు. 66.బాబా నామనోగతాన్ని తెలుసుకుని ఇలా అన్నారు.'లేచి శ్యామా వద్దకు వెళ్లి అతని వద్దనుండి పదిహేను రూపాయలను తీసుకునిరా.67.కానేపు అతని దగ్గర కూర్చుని మాట్లాడి అతడు ఇచ్చిన దక్షిణను పుచ్చుకుని త్వరగా తిరిగిరా' 68.సాయినాథునికి నాపై దయ కలిగి దక్షిణ నిమిత్తం'ఇప్పుడే శ్యామా దగ్గరికి వెళ్లి నా కొఅకు రూపాయలను అడుగు' అని చెప్పారు.69.అలా వారి ఆజ్ఞ అయాక ఇక అక్కడ కూర్చునే సాహసం ఎవరికుంటుంది?అలా

కూర్చుంటే వారి ఆజ్ఞను ధిక్కరించి నట్లే కదా,అందుచేత వారి అనుమతిని తీసుకుని లేచాను.70.వెంటనే బయలుదేరాను.మాధవరావు అప్పుడే స్నానం చేసి బయటకువచ్చాడు.71.ఉతికిన పంచెను చుట్టుకుని కుచ్చిళ్లను సవరించుకుంటూ నోటితో నామస్మరణను చేస్తున్నాడు.72.'మీరు మసీదు నుండి వచ్చినట్లుంది. మధ్యలో ఎలా వచ్చారు? ఏదో కలవర పడుతున్నట్లున్నారే! ఇవాళ ఒక్కరే వచ్చారేమిటి!73.రండి కూర్చోండి. నేనిప్పుడే స్నానం చేసి పంచె కట్టుకుంటూ వస్తున్నాను. వెళ్లి దేవుళ్ళకు అభిషేకం చేసి వెంటనే వచ్చేస్తాను.74.మీరు తాంబూలం వేసుకునేలోగా నేను పూజావిధిని ముగించుకుని వస్తాను. మనం తాపీగా ముచ్చటించుకోవచ్చు'75.అని చెప్పి మాధవరావు ఇంట్లోకి వెళ్లాడు. అక్కడే కిటికీ పైన ఏకనాథ భాగవత గ్రంథం ఉంది. నేను దానిని చేతికి అందుకున్నాను.76. ఊరికే విప్పేసరికి సరిగ్గా నేను ఉదయం చదువుతూ మధ్యలోనే ఆపేసిన భాగం వచ్చింది.77.నాకు అత్యంత ఆశ్చర్యం కలిగింది. ఉదయం నేను చదవని భాగాన్ని బాబా ఇక్కడ పూర్తి చేయించి నియమాన్ని పాటింప చేశారు. 78. నియమిత భాగాన్ని పూర్తిగా చదవకుండా మధ్యలో మానేసి ఆ స్థానం నుండి వెళ్లకూడదు.ఇదీ నియమంగా చదవటమంటే.79.ఇప్పుడు చిన్న ఉపకథ గుర్తుకు వచ్చింది. దీనిని వదిలి పెట్టకూడదు. ఏకనాథ భాగవతానికి సంబంధించిన ఈ కథను శ్రోతలు శ్రద్ధగా వినండి.80.గురు భక్తి రసంతో నిండిన ఈ ఏకనాథ భాగవతాన్ని సాయిక్పపకు పాత్రుడైన సీతారాం దీక్షితు నిత్యం పఠించేవాడు.81.జగత్తును ఉద్ధరించే నిమిత్తం నారాయణుడు బ్రహ్మ అనే భూమిలో భక్తి బీజాన్ని నాటగా,అది నారదుడనే పాలంలో పంటకు వచ్చింది. 82.ఆ పాలం యొక్క దశలక్షణాలుగల పంటను వ్యాసమహర్షి సంగ్రహపరచాడు.శుక మహర్షి పరీక్షిత్తు అనే కళ్లంలో గింజలను వేరుపరచగా,83.శ్రీధరస్వామి తూర్పార పట్టాడు. ఆ పంటను జనార్దనస్వామి కొలవగా,

ఏకనాథ్ మహారాజు రసవత్తరమైన భోజనాన్ని పుష్కలంగా తయారుచేశాడు.84. భాగవతంలోని ఏకాదశ స్కంధం భక్తిప్రేమ ఆనందాలకు గని. ముప్పైరెండు అధ్యాయాలతో ఉన్న బృందావనం వంటి ఈ గ్రంథాన్ని దీక్షితు నిత్యం చదివేవాడు. 85. రోజూ పగలు దానిని వ్యాఖ్యానించేవాడు. రాత్రిపూట భావార్థరామాయణాన్ని చదివేవాడు. ఈ గ్రంథం కూడా గురువు ఆజ్ఞగా దీక్షితునకు ప్రమాణికమైంది.86. భక్తిరసామృతానికి సారమూ, జ్ఞానేశ్వరికి రెండవ అవతారమైన ఈ భాగవత గ్రంథం, మహారాష్ట్రకు ఏకనాథుడు చేసిన మహోపకారం.87. దీక్షితు ప్రాతఃకాల స్నానం చేసి, నిత్యం నియమంగా సాయిబాబా పూజ, ఇతర దేవిదేవతార్చనలయ్యాక, నైవేద్యం నీరాజనలు చేసి.88. తరువాత నివేదించిన పాలు ఫలాహారాన్ని శ్రోతలతో పాటు తీసుకుని, నిత్యక్రమాను సారం గ్రంథాన్ని శ్రద్ధగా చదివేవాడు. 89 భగవత్ పరాయణుడైన తుకారాం, భండారా అను కొండపై ఏకాంతంగా దీనిని సహస్రపారాయణలు చేశాడు. దానిలోని మాధుర్యాన్ని ఎవరు వర్ణించగలరు?90. మహాప్రాసాదికమైన ఈ దివ్య గ్రంథాన్ని నిష్ఠాపరుడైన దీక్షితు జీవుల ఉద్ధరణకై పఠించాలని సాయి సమర్థులు ఆజ్ఞాపించారు.91. భగవంతుని కోసం అరణ్యాలకు వెళ్లవలసిన పనిలేదు. ఏకాదశ స్కంధంలోని ఉద్ధవగీతలో భగవంతుడు ప్రకటమవుతాడు. శ్రద్ధతో పారాయణ చేస్తే భగవత్ ప్రాప్తి నిశ్చయం.92. భారతంలోని కృష్ణార్జునుల సంవాదంకంటె ఇందులోని కృష్ణోద్ధవుల సంభాషణ రసపూరితం. శ్రీకృష్ణుని ఉపదేశాలను ఏకనాథుడు ప్రేమపూరితంగా చెప్పాడు.93. ఇటువంటి ప్రాసాదిక గ్రంథాన్ని మరియు జ్ఞానదేవుని భావార్థదీపికను దయామయులైన సాయిసమర్థులు శిరిడీలో నిత్యం చదివించేవారు.94. సఖారం హరి జోగ్ సాశేవాడాలో భాగవత గ్రంథాన్ని చదవాలని బాబా ఆజ్ఞ. ఇది భక్తులకు చాలా ఉపయోగకరంగా ఉండేది. 95. భక్తుల శ్రేయస్సు కోసం బాబా వారిపై కరుణతో ఈ గ్రంథాన్ని ప్రతిరోజూ వారితో శ్రవణం చేయించేవారు.

96.బాబా యొక్క అనుగ్రహ పద్ధతి అమోఘం. ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా ఉపదేశించేవారు. భక్తులు దగ్గరలో ఉన్నా దేశాంతరాలలో ఉన్నా వారి హృదయాలలో సన్నిహితంగా ఉండేవారు.97.తాము మసీదులోనే కూర్చుని ఉన్నా, ఎవరికైనా ఏదైనా పని అప్ప చెప్పితే వారికి తమ శక్తిని ప్రసాదించి, ఆ కార్యాన్ని చేయించుకునేవారు. 98.బాపూ సాహేబుజోగ్‌కు వాడాలో గ్రంథాన్ని పఠించమని చెప్పారు. దానిని అతడు నిత్యం నియమంగా చదివేవాడు. వినడానికి శ్రోతలు కూడా వచ్చేవారు. 99. మధ్యాహ్న భోజనం తరువాత జోగ్, రోజూ బాబా వద్దకు వచ్చి వారి చరణాలకు నమస్కరించి విభూతిని తీసుకుని గ్రంథపఠనకై వారి ఆజ్ఞను తీసుకునేవాడు. 100.ఒకప్పుడు జ్ఞానేశ్వరిని మరొకప్పుడు ఏకనాథ భాగవతాన్ని పఠించేవాడు. ఎంతో ఆనందంతో పారాయణచేసి అర్థాలను విశ్లేషించి బాగా వ్యాఖ్యానించేవాడు.101.అలా బాబా అతనికి ఆజ్ఞ ఇచ్చిన తరువాత తమ దర్శనానికి వచ్చిన కొందఱు భక్తులకు అది శ్రవణం చేయండని వెంటనే పంపించేవారు.102. ఒక్కోసారి సంక్షిప్తంగా ఒక కథలాగా చెప్పేవారు.వానిని శ్రోతలు తమ చెవులలో నింపుకునే వారు. ఇంతలో బాబా వెంటనే వాడాకు వెళ్లి గ్రంథ శ్రవణం చేయండని చెప్పేవారు. 103.శ్రోతలు భక్తిభావంతో వాడాకు వెళ్లగా,అక్కడ వారికి బాబా చెప్పిన కథే నడుస్తుండేది.అప్పుడు వారికి విషయం బాగా స్పష్టంగా పూర్తిగా అర్థమయేది.104. జ్ఞానేశ్వరుని జ్ఞానేశ్వరి, లేదా ఏకనాథుని భాగవతం చదువుతున్నా,బాబా చెప్పిన కథలనే వివరిస్తుంటే శ్రోతలకు చాలా విశిష్టంగా అనిపించేది.105. గ్రంథంలోని ఒకటి రెండు భాగాలను చదవమని బాబా ఆదేశించక పోయినా జోగ్ అంతకు ముందు బాబా చెప్పిన ప్రసంగానికి సరిపోయే కథను చదివేవాడు. 106.భగవద్గీత, భాగవతం ఈ రెండు ముఖ్య గ్రంథాలే భాగవత ధర్మానికి సార భూతం. జోగ్ వీటిని నిత్యం పఠించేవాడు. 107.భావార్థ దీపిక అన్నపేరుతో నున్న గీత జ్ఞానేశ్వరి టీకా మరియు ఏకనాథుని

భాగవతంలోని ఏకాదశ స్కంధం పరమార్థ నిరూపణకు ఆధారాలు. 108.అలా నిత్య క్రమానుసారం భాగవత పఠన జరుగుతుంటే నేను కూడా ఎప్పుడూ పఠించేవాణ్ణి. కాని ఆ రోజు అంతరాయం కలిగింది. 109.ఒక కథను సగం చదివి, భక్తసమూహం మసీదుకు బయల్దేరుతుంటే చదువుతూ ఉన్న గ్రంథాన్ని అక్కడ పెట్టి నేను కూడా అక్కడికి వారితో పరుగెత్తాను.110.నాకు బాబా వచనాలను వినాలన్న కోరిక కాని బాబా సంకల్పం వేరే. భాగవత పఠనాన్ని వదిలి ఇతర కష్టాలు పడటం వారికి సమ్మతం కాదు.111.అందువలన నేను ఆ రోజు చదవ వలసిన భాగాన్ని బాబా నాచే చదివించారేమోనని అనిపిస్తుంది.వారి లీలను తలచుకుంటే ప్రేమ ఉప్పొంగుతుంది.112. ఇక్కడితో భాగవత కథ, ఉపకథ కూడా అయిపోయినవి. మాధవరావు పూజ ముగించుకుని బయటకు వచ్చాడు.113.'శ్యామా వద్ద నుండి పదిహేను రూపాయల దక్షిణను తీసుకునిరా అన్న బాబా ఆజ్ఞను నేను తీసుకుని వచ్చాను.114.నేను బాబా పాదసేవ చేస్తూ కూర్చుండగా అకస్మాత్తుగా నీవు స్మరణకు వచ్చావు.అంతే, లేచి శ్యామా వద్దకు వెళ్లి దక్షిణను తీసుకునిరా,115.అతని ఇంట్లో కాసేపు కూర్చుని మీరు ఉభయులూ పరస్పరం ముచ్చటించుకున్న తర్వాత తిరిగిరా' అని బాబా చెప్పారు.116.మాధవరావు అది విని అత్యంత ఆశ్చర్యచకితుడయ్యాడు. రూపాయలకు బదులుగా నా నమస్కారాలే నాదక్షిణ అని అన్నాడు.117.సరే అలాగే అని అతని పదిహేను నమస్కారాలను కొంగున ముటకట్టుకున్నాను.ఒక పనైంది.ఇక అతనితో ముచ్చటించాలికదా.118.అతనితో,'ఏం కబుర్లు చెప్పుతావో చెప్పి నా కుతూహలాన్ని తీర్చు. బాబా యొక్క పావన యశోగంగలో మునిగి మన పాపాలను నశింప చేసుకుందాం' అని అన్నాను.119.మాధవరావు 'సరే కూర్చోండి. ఈ దేవుని లీల ఎటువంటిదో మీకంతా తెలుసు. కాసేపు విశ్రామంగా కూర్చోండి .120.ఇదిగో ఈ ఆకులు

కాచు పుచ్చుకోండి. వక్కలు సున్నం డబ్బాలో ఉన్నాయి. తలపై టోపి పెట్టుకుని నేను ఒక్క క్షణంలో వచ్చేస్తాను. 121. సాయిబాబా యొక్క లీల అగాధం. నేను మీకు ఎంతని చెప్పను? శిరిడీకి వచ్చినప్పటినుండి మనం కొంచెం చూశామా? 122. నేను కేవలం గ్రామ వాసుణ్ణి. మీరంతా పట్టణవాస్తవ్యులు. అంతులేని వారి లీలలను మీ వద్ద నేనెలా వర్ణించను? 123. అని అంటూ మాధవరావు ఇంట్లోకి వెళ్లి దేవునికి పత్రి పుష్పాలను సమర్పించి టోపీ పెట్టుకుని వెంటనే వచ్చి నా వద్ద కూర్చున్నాడు. 124. తర్కానికి అందని ఈ దేవుని లీలలను వారి కౌశలాన్ని ఎవరు తెలుసుకోగలరు? వారి లీలలకు అంతులేదు. అవి విలక్షణమైనవి. 125. మీరంతా గొప్ప విద్యావేత్తలు. ఒకరికి మించి ఒకరు జ్ఞానులు. తెలివి లేని గ్రామ వాసులమైన మాకు బాబా చరిత్ర ఎలా అర్థమౌతుంది? 126. ఏ విషయాలైనా వారు స్వయంగా చెప్పలేరా? మా వద్దకు పంపించటమెందుకు? వారు చేసేది ఏమిటో వారికే తెలుసు. వారి ప్రవర్తన మానవులవంటిది కాదు. 127. ఇప్పుడు ఒక మంచి విషయం గుర్తుకు వచ్చింది. ఆ విషయాన్ని చెప్పి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటాను. 128. ఇక్కడ ప్రత్యక్షంగా మా కళ్లెదుట జరిగిన వృత్తాంతాన్ని చెప్తుతాను. ఎవరి మనసులో ఎటువంటి సంకల్పం ఉంటే, దానిననుసరించి బాబా అలాగే సఫలీకృతం చేసేవారు. 129. అప్పుడప్పుడు బాబా మనుషుల అంతు చూస్తారు. భక్తి ప్రేమలను బాగా పరీక్షించిన తరువాత ఉపదేశాలను ఇచ్చేవారు. 130. అని చెప్పుతుండగా ఉపదేశం అన్న మాట చెవులలో పడగానే, వెంటనే నా మనసులో విద్యుల్లత మెరసినట్లుగా నాకు సాతే యొక్క గురుచరిత్ర కథ గుర్తుకు వచ్చింది. 131. మసీదులో చలించిన నామనసును స్థిర పరచటానికే కదూ బాబా నన్ను శ్యామా వద్దకు పంపటం– బాబా చర్య విలక్షణం. 132. మనసులో లేచిన ఆలోచనలను అణచివేశాను. కథా శ్రవణంలో ఇనుమడించిన కోరికను తీర్చుకుంటాను. 133. బాబా యొక్క లీలలను మాటలను కొంచెం కొంచెం

చెప్పుతుంటె వారి భక్తవాత్సల్యాన్ని గమనించి మనసుకు ఆనందం కలిగింది.134.అటుతరువాత శామా మరో కథను చెప్పసాగాడు. ఒక దేశముఖ్ స్త్రీ ఉండేది. ఆమెకు సత్పురుషుల దర్శనం చేసుకోవాలని కోరిక. 135.సాయిబాబా కీర్తిని విని వారిని దర్శించుకోవాలన్న సంకల్పంతో ఆమె సంగమ నేరు జనుల వెంట శిరిడీకి వచ్చింది. 136.ఖాశాబాదేశముఖ్ యొక్క తల్లి; ఈమె పేరు రాధాబాయి. సాయి చరణాల యందు నిష్ఠ కలిగి వారి దర్శనం చేసుకుంది.137.దానితో మార్గంలో కలిగిన అలసట తీరింది.సాయిపాదాల యందు భక్తి కలిగింది. తను వచ్చిన పని గుర్తుకు వచ్చింది.138. సాయి సమర్థుని గురువుగా చేసుకుంటే వారు తనకు ఉపదేశాన్ని ఇస్తారు. దానితో పరమార్థాన్ని సాధించుకోవచ్చు అని ఆమె మనసులోని కోరిక.139.ఆమె వయసులో వృద్ధురాలు. బాబాపై అత్యంత భక్తితో ఎలా అయినా వారి వద్ద ఉపదేశాన్ని గ్రహించాలని మనసులో నిర్ధారించుకుంది.140. 'బాబా స్వయంగా ఏదైనా మంత్రాన్ని ఉపదేశించి నన్ను అనుగ్రహించేటంత వరకు ఎక్కడికీ వెళ్లను.141.శ్రీసాయి సత్పురుషులలో శ్రేష్ఠులు, పవిత్రులు. వారి నోటినుండే మంత్రాన్ని గ్రహించాలి. మరెక్కడ తీసుకున్నా అది అపవిత్రం. కనుక నన్ను అనుగ్రహించాలి'142.అని ఆమె మనసులో దృఢ నిశ్చయం చేసుకుని అన్న పానాలు మాని సత్యాగ్రహం చేస్తూ కూర్చుంది.143. ఆమె అసలే వృద్ధురాలు. కడుపులో కాసింతైనా అన్నంలేదు.ఓ గుక్కనీరు కూడా త్రాగలేదు. ఉపదేశం కోసం దృఢ నిశ్చయంతో ఉంది.144. అలా ఆమె మూడు రోజులు రాత్రింబవళ్లూ ఉపవాసంతో ఉంది. బాబా ఉపదేశాన్నిచ్చే వరకూ అలాగే ఉపవాసంలో ఉంటానని గట్టి దీక్షతో ఉంది. 145.మంత్రోపదేశాన్ని తీసుకోక పోతే శిరిడీకి రావటం వ్యర్థం అని తాను బస చేసిన చోట మరణానికి కూడా సిద్ధపడింది.146.అలా అన్నపానాలు మాని మూడురోజులు తపస్సు చేసి ఆమె అలసి నీరసించి పోయింది.చాలా

ఉదాసినురాలైంది.147.ఇదేంబాగాలేదు, ఈ వృద్ధురాలు మరణానికి భయపడటం, లేదు ఇప్పుడేం చేయాలి అని నేను ఆలోచించాను.148.మసీదుకు వెళ్లి బాబా వద్ద కూర్చున్నాను.బాబా రోజూ వలెనే కుశల ప్రశ్నలు వేశారు. 149.'శ్యామా ఇవాళ ఏమిటి సంగతి? అంతా బాగానే ఉంది కదా? ఆ నారాయణుని బుట్టి బాగా పాడైంది.నన్ను చాలా కష్టపెడుతున్నాడు.' అని అన్నారు. 150. వృద్ధురాలి దీక్ష విషయంలో నేను అసలే బాగా బాధతో ఉన్నాను. కనుక బాబాను ఆ సమస్యను ఎలా పరిష్కరించాలి అని అడిగాను.151.ఇదేంచమత్కారం? ఇదేం గారడి? మీ లీల ఇతరులకు అర్థం కాదు.మీరు ఒక్కో వ్యక్తిని ఊరికి రప్పించి వారి విషయం మమ్మల్ని అడుగుతారు.152.ఆ వృద్ధురాలు దేశముఖిని, ఆహారం మానేసి మూడురోజులు మీ కారణంగా ఉపవాసం ఉంది.153.ఆమె పరమ మొండిది. మీ చరణాల యందు ఆమెకు చాలా నిష్ఠ.ఆమెను అసలు చూడనైనా చూడకుండా ఎందుకిలా బాధపెడుతున్నారు? 154.ఆమె అసలే ఎండిపోయిన కట్టలా ఉంది. పైగా మూఢంగా పట్టుదలతో ఉంది. ఆహారం లేక ప్రాణం పోగొట్టుకునేలా ఉంది.155.సాయిబాబా దర్శనానికి వృద్ధురాలు ఉపదేశం కొఱకు వెళ్లగా, వారు ఆమెను కరుణించ కుండా మరణానికి అప్ప చెప్పారు అని లోకులు అంటారు. 156.బాబా! ఇలాంటి అపవాదు రాకూడదు. ఆమెకు హితోపదేశం చేసి,ఆమెను అనుగ్రహించండి.అపవాదును ఆపండి.157.శరీరంలో శక్తిలేక, ప్రాణాలు నిలువక ఆమె మరణిస్తుంది.మీకు అపకీర్తి కలుగుతుంది. 158. ఆమె కఠిన దీక్ష మాకు చాలా బాధగా ఉంది. దురదృష్టవశాత్తు ఆమె మరణిస్తే అనుచితమైన ఘటన సంభవిస్తుంది.159. ఆ వృద్ధురాలు మరణానికి సిద్ధమైంది. ఆమెను కరుణించకపోతే ఆమె బ్రతుకుతుందనుకోను. మీరు స్వయంగా ఆమెకేదైనా చెప్పండి' అని అన్నాను. 160.ఈ అధ్యాయం ఇక్కడితో అయింది. మిగతా కథను వినాలన్న శ్రోతల కోరిక తరువాతి అధ్యాయంలో

ప్రేమరసపూరితమైన కథతో తీరుతుంది. 161.ఆ వృద్ధురాలికి బాబా ప్రేమతో ఇచ్చిన హితోపదేశాన్ని శ్రద్ధగా శ్రవణంచేస్తే అజ్ఞానంతో చేసే పట్నుదల పారిపోతుంది. 162.హేమాడ్ సాయి చరణాలకు శరణుజొచ్చి, అనాయాసంగా భవాన్ని తరించటానికి శ్రవణంలో తత్పరులవండి అని: శ్రోతలకు నమస్కరిస్తున్నాడు. 163. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో మదనుగ్రహం అను పదునెనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 19 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

సాయి సూక్ష్మంకంటె అత్యంత సూక్ష్మం.మహత్తు కంటె అత్యంత మహత్తు.ఆ బ్రహ్మస్తంబ పర్యంతం వస్తుజాలమంతా సాయియే.1.ఇటువంటి సద్వస్తువుకు రంగురూపాలతో ఒక ఆకారానిఇచ్చి, చర్మచక్షువులతో చూడాలని కోరిక కలిగింది. 2.సూర్యోపాసకులు సూర్యునికి భక్తిభావంతో వత్తులతో హారతి నిస్తారు. విఘ్నేశ్వరుని భక్తులు బెల్లంతో గణపతిని చేసి బెల్లం నైవేద్యం పెడతారు.3.సముద్రంలోని నీటిని దోసిలితో తీసుకొని సాగరానికి అర్ఘ్యమిస్తారు. ఇవన్నీ గమనిస్తే అనుచితంగా ఉంటాయి.4.సూర్యదేవుడు, సాగరుడు గొప్ప ప్రభావం కలవారు.భక్తుల భావాన్ని ఉదార స్వభావంతో చూస్తారు. వారు ఉచితానుచితాలను పట్టించుకోరు. భక్తుల గౌరవాన్ని నిలబెట్టటం వారి పని.5.'సమాన శీల వ్యసనేషు సఖ్యం' ఇది సామాన్య సూత్రం అయినా శరీరం మరియు ఆత్మ యొక్క సంగమం పరమ అనివార్యం.6.ఇవి పరస్పరం భిన్న స్వభావం కలవి.అయినా రెంటికీ విలక్షణమైన స్నేహం.ఒకటిలేక మరొకటి విడిగా క్షణమైనా ఉండలేవు.7.ఈ శరీరం నశించిపోయేది.ఆత్మ నిర్వికారం,నశించనిది. అయినా రెంటికీ అపారమైన ప్రేమ.అందువలననే ప్రపంచంలో చక్రభ్రమణం.8.ఆత్మ మహాశక్తి కలది.దీనికంటే సూక్ష్మం, అవ్యక్తం. అదే ఆకాశం, ప్రకృతి లేదా వ్యక్తం దానినే మాయ అని కూడా అంటారు.9.వీటి అన్నింటికంటే పురుషుడు సూక్ష్మం. ఇంద్రియాదులన్నింటికి అక్కడే విశ్రామం. అంతిమ పరమగతి కూడా

అదే. శుద్ధ బ్రహ్మకూడా అదే.10.ఇటువంటి ఆత్మ నిర్వికారియై ఉండి, స్ఫటికంలా స్వచ్ఛమైనదే ఐనా ఈ ప్రపంచంలో మాయతో మరియు కర్మలతో బంధింపబడినట్లు భాసిస్తుంది.11.స్ఫటికంలో ఎరుపు, నలుపు పసుపు రంగులు ప్రతిబింబించినా స్ఫటికం మాత్రం అన్ని రంగుల కంటే వేరుగా ఉంటుంది. నిర్మలంగా విశేషంగా ఉంటుంది. 12.ఎండమావులలోని నీరు, ముత్యపుచిప్పలోని వెండి, చుట్టుకొని ఉన్న త్రాడులో లేని పాము ఆభాస. 13.త్రాటిపైన సర్పాన్ని ఆరోపించటం వాస్తవంగా అప్రమాణం. అట్లే నేను ఈ శరీరాన్ని అని అభిమానం కలిగి ఉండటం, ఏ బంధనం లేని ఆత్మకు మిథ్యాబంధనాన్ని కలిగించడం.14.దేహేంద్రియాలు, మనసు, ప్రాణం వీటి అన్నింటికంటే ఆత్మ విలక్షణమైనది. ఆత్మ స్వయంజ్యోతి శుద్ధ చైతన్యం. ఆకారవికారాలు లేనిది. 15.శరీరం, బుద్ధి, మనసు, ప్రాణం వీనిపై అభిమానం ఉన్నంత వరకు కర్తృత్వ భోక్తృత్వాల భావం, సుఖదుఃఖాలు అనివార్యం. 16.మఱ్ఱి విత్తనం ఎంత సూక్ష్మమైనది! దాని గర్భంలో మఱ్ఱి వృక్షం యొక్క శక్తి ఇమిడి ఉంది. ఆ వృక్షంలో అసంఖ్యాకమైన విత్తనాలు, వానిలో కోట్లాది వృక్షాలు ఉంటాయి.17.ఇలా ప్రతి మఱ్ఱి విత్తనంలో ఒక్కో మఱ్ఱివృక్షం ఉంటుంది. ఇది ప్రళయాంతం వరకు గోచరిస్తుంది. విశ్వం కూడా ఇట్లే ప్రత్యక్షంగా కన్పిస్తుంది. దీనిని శ్రద్ధగా అవలోకించండి. 18.నిర్భయత్వాన్ని, శాశ్వతత్వాన్ని, ముక్తతను, స్వాతంత్ర్యాన్ని పరమాత్మ ప్రాప్తిని పొందటమే జీవితానికి సాఫల్యత. మానవ జన్మ యొక్క ధ్యేయమిదే.19.జ్ఞానం లేకుండా మోక్షం లేదు. విరక్తి లేకుండా జ్ఞానం కలుగదు. ప్రపంచం అశాశ్వ తమని మనసుకు అనిపించనంత వరకు విరక్తి కలుగదు. 20.ఈ ప్రపంచం అనిత్యమని తెలుసుకునే లోగా విశ్వాభాస దృష్టికి గోచరమవుతుంది. దాని వలన బాటసారి ఎటుపోవాలో తెలియక మధ్యలో తడబడతాడు. 21.ఈ విశ్వాభాస ఇలాంటిది. శుద్ధ జ్ఞాన స్వరూపమైన పరమాత్మయందు

మాయా విలాసం మిథ్య. ప్రపంచంలో ఉద్భవించే ఒకస్వప్నం లాంటిది. దీని కొఅకు వ్యర్థమైన ప్రయాస ఎందుకు? 22. స్వప్నం నుండి జాగ్రదావస్థకురాగానే స్వప్నం మాయమైపోతుంది. అందువలన ఆత్మ స్వరూపంలో స్థిరపడినవారు ప్రపంచంలోని విషయసుఖాలను కోరుకోరు. 23. ఆత్మ ఒక్కటే అన్న జ్ఞానం మరియు ఆత్మ యొక్క యథార్థ జ్ఞానం లేకుండా, శోకమోహాది బంధనాలను విడిపించుకోవటానికి ఆత్మజాగృతి తప్ప అన్యోపాయం లేదు. 24. సాధనలన్నింటిలో జ్ఞానమే శ్రేష్ఠమైనప్పటికీ బాబా అహోరాత్రులు సర్వసాధారణంగా భక్తిమార్గాన్ని అవలంబించాలని ఉపదేశించేవారు. 25. జ్ఞానమార్గం యొక్క మహిమను తెలుపుతూ ఆ మార్గం రామాఫల సమానమని భక్తిమార్గం స్వల్పసాధనతో కూడుకుని మధురరసంతో ఉన్న సీతాఫలాన్ని సేవించటంలాంటిదని చెప్పేవారు. 26. భక్తి స్వచ్ఛమైన సీతాఫలం వంటిది. జ్ఞానం పరిపక్వమైన రామాఫలం వంటిది. ఒకటిని మించి మరొకటి సువాసనలతో మధుర రసంతో ఉంటాయి. 27. రామాఫలాన్ని కాయగానే కోసి పండేస్తే దానిలోని గుజ్జు వగరుగా ఉంటుంది. చెట్టుపైన పండే వరకు ఓపికగా ఉన్నవారికే అది మధురంగా ఉంటుంది. 28. రామాఫలం చెట్టుపైన పరిపక్వమైతేనే అది మధుర రసంతో ఉంటుంది, నేలపైన పండేస్తే వగరుగా ఉంటుంది. 29. చెట్టుపైన పండించటాన్ని ఎరిగినవారే దాని రుచిని ఆస్వాదించగలరు. సీతాఫలానికి ఈ ప్రయాస లేదు. గుణం తక్కువైనా విలువ ఎక్కువే. 30. రామాఫలానికి పతన భయముంది. అట్లే జ్ఞానులకు కూడా నిర్భయమనేది ఉండదు. వారు అష్టసిద్ధులను జయించాలి. ఏ మాత్రం అలసత్వం పనికి రాదు. 31. అందువలనే సాయి దయామయులు చాలా వరకు తమ భక్తులకు భక్తి మరియు నామస్మరణ గురించే వివరిస్తుండేవారు. 32. శ్రీకృష్ణ భగవానుడు జ్ఞానం కంటే ధ్యానం శ్రేష్ఠమైనదని అర్జునునికి చెప్పాడు. అట్లే సాయిబాబా కూడా భక్తుల భవబంధనాలు విడిపోవటానికి ఇదే సాధన

చెప్పారు.33.ఈ విషయాన్ని ఇలా ఉంచి గతాధ్యాయంలో వర్ణిస్తూ వర్ణిస్తూ అసంపూర్తిగా వదిలిన దానిని నేను ఇప్పుడు చెబుతాను. శ్రోతలారా! శ్రద్ధగా వినండి.34.శక్తి ఉడిగిపోయిన వయోవృద్ధురాలు సాయి వద్ద నుండి మంత్రోపదేశాన్ని కోరి, ఉపవాసవ్రత దీక్షను చేపట్టి ఒక కష్టాన్ని సృష్టించింది.35. ఆమె పరిస్థితిని చూచి భీతిచెందిన మాధవరావు, బాబావద్దకు వెళ్లి మధ్యవర్తిగా మాట్లాడాడు. ఇది పూర్వకథ.36. సాయి యొక్క సంకల్పాలను ప్రకాశింప చేసే ఈ చరిత్ర అనే జ్యోతి వెలిగింది. దీని వెలుగు భక్తులకు మార్గదర్శకమై వారికి యోగ్యమైన మార్గం లభించుగాక. 37.బాబా ఆజ్ఞానుసారం మాధవరావు నాకు చెప్పాలని ఆరంభించిన సుందరమైన కథను మరల మనవిచేస్తాను. 38.వృద్ధురాలి నిగ్రహాన్ని చూచి బాబా ఆమె మనసును మార్చి, ఆమెను అనుగ్రహించిన అభినవ కథ . 39.బాబా ఆ స్త్రీని ప్రేమతో పిలిపించి 'అమ్మా! నువ్వెందుకిలా సత్యాగ్రహాన్ని చేస్తున్నావు? మరణించాలని ఎందుకు అనుకుంటున్నావు?40.బాబా ఎవరైనా ప్రౌఢ స్త్రీని అమ్మా అని పురుషులను కాకా, బాపూ, భాఈ అని మధురంగా పిలిచేవారు.41.వారి అంతరంగం ఎంత ప్రేమ మయమో! వారి పలుకు కూడా అట్లే మంజులం. దీనదయాళువైన శ్రీసాయి, దీనదుర్బలుల యందు కరుణ కలిగి ఉంటారు. 42.ఆమెను పిలిచి తమ ఎదుట కూర్చుండ బెట్టుకుని తమ గురుత్వం యొక్క గుప్తమైన తాళం చెవిని ప్రేమగా ఆమె చేతికిచ్చారు.43. ప్రపంచంలోని దుఃఖాలను ఉపశమింప చేయటానికి, భక్త చకోరాల దప్పికను తీర్చటానికి చిద్ఘనులైన సాయి కురిపించిన ఆనందరసాన్ని సేవించండి .44. 'అమ్మా!నిజం చెప్పు. ఇలా ఎందుకు నీ ప్రాణానికి ముప్పు తెచ్చుకున్నావు? నేను రొట్టె ముక్కలను అడుక్కునే ఫకీరును మాత్రమే. నాపై దయ చూపించు.45. నేను నిజంగా నీ బిడ్డను, నీవు తల్లివి. పరమ సుఖాన్ని కలిగించే ఒక విషయాన్ని

నీకు చెప్పుతాను, శ్రద్ధగా విను.46.మా గురువు గొప్ప అవలియా, దయామయుడు. నేను వారి సేవ చేసి చేసి అలసిపోయాను.కాని వారు నా చెవిలో ఏమంత్రాన్ని ఉపదేశించలేదు. 47. వారిని ఎన్నడూ వదలి పెట్టకూడదని నా దృఢమైన నిశ్చయం. ఎంత శ్రమపడైనా వారి నోటినుండి మంత్రాన్ని గ్రహించాలని నా కోరిక. 48. కాని వారు ముందు నన్ను దోచు కొన్నారు. రెండుపైసలనే యాచించారు. వానిని నేను వెంటనే ఇచ్చేశాను.మంత్రాల కొఱకు ఎంతగానో ప్రార్థించాను.49. మా గురువు ఏ కోరికలు లేనివారు. వారికి రెండు పైసలతో ఏంపని? శిష్యులను డబ్బు అడిగే వారిని నిష్కామములని ఎలా అనగలం.50. అని సందేహించ కండి. వారికి వ్యావహారికమైన పైసలపై కోరికలేదు.వారికి పైసల ఆలోచనే లేదు.వారికి కాంచనంతో ఏం పని? 51. వారు అడిగినవి రెండూ శ్రద్ధా మరియు సహనం. ఇవే రెండు పైసలు. వేరే ఏవీకావు. నేను వానిని అప్పుడే ఇచ్చేశాను. దానితో గురుమాత ప్రసన్నులయ్యారు.52. అమ్మా! ధైర్యమే సహనం. దీనిని ఎప్పుడూ దూరం చేసుకోకూడదు. ఎప్పుడైనాసరే ఏ కఠిన సమస్య ఎదురైనా ఇదే తీరానికి చేరుస్తుంది. 53. పురుషులలోని పౌరుషశక్తి అయిన ఈ సహనం పాపతాప దైన్యాలను నివారిస్తుంది. యుక్తి ప్రయుక్తులతో ఆపదలను తొలగిస్తుంది.భయభీతులను నెట్టివేస్తుంది . 54. కీర్తి ప్రతిష్ఠలను కలిగించేది ఈ సహనమే.ఇది కష్టాలను తరిమి వేస్తుంది. ఇది ఎవరికీ అంతుపట్టనిది, ఆలోచనలకందనిది.55.సహనం సద్గుణాలకు గని. సద్విచారాలకు రాణి. శ్రద్ధా మరియు సహనం ఈ రెండూ స్నేహంగా ప్రాణానికి ప్రాణంలా ఉండే అక్కా చెల్లెళ్లు. 56.సహనంలేక పోతే మనుష్యుల పరిస్థితి దైన్యం. గొప్పపండితుడైనా గుణవంతుడైనా సహనం లేని జీవితం వ్యర్థం. 57.గురువు మహా సమర్థులైనా కేవలం శిష్యుల ప్రజ్ఞానాన్ని, గురుచరణాలలో

ప్రబల నిష్ఠను, దృఢమైన శ్రద్ధను, ధైర్యాన్ని, సహనాన్ని అపేక్షిస్తారు.58. రాయిని మరియు రత్నాన్ని రెంటిని చక్కగా అరగ తీస్తే రెండూ బాగా మెరుస్తాయి. రాయి రాయిగానే ఉంటుంది. మణి మణిలా ప్రకాశిస్తుంది.59. మెరవటానికి రెంటినీ ఒకేలా అరగతీయాలి. రాయి రత్నం యొక్క తత్వాన్ని గ్రహించ గలదా? మణి వలె తే జస్సుతో ప్రకాశించగలదా? రాయి తన స్వభావానుసారం నున్నగా కాగలదు.60. నేను పండ్రెండు సంవత్సరాలు గురువుపాదాలవద్ద ఉన్నాను. చిన్న వాణ్ణి అయిన నన్ను గురువు పెద్దవాణ్ణిగా చేశారు. అక్కడ అన్న వస్త్రాలకు ఏం లోటు లేదు. వారికి నాపై ఎంతో ప్రేమ.61.వారు మూర్తీభవించిన భక్తి ప్రేమ. వారికి శిష్యులపైన వాస్తవమైన ప్రేమ. మా గురువుకు సమానమైన గురువు అరుదు. ఆ సుఖాన్ని, వైభవాన్ని వర్ణించ శక్యం కాదు.62.వారి ప్రేమను ఎలా వర్ణించను? వారిని చూడగానే ధ్యానంతో కళ్లు మూసుకుంటాయి. మేము ఉభయులం ఆనందంలో మునిగి పోయేవారం. నేను ఇతర వస్తువులను చూడటం ఎఱుగను.63. నేను అహర్నిశలూ ప్రేమగా గురుముఖావలోకనమే చేసేవాణ్ణి. నాకు ఆకలి దప్పులు ఉండేవి కావు. గురువులేక పోతే మనసు అస్వస్థతగా ఉండేది.64. వారు తప్ప వేరే ధ్యానం లేదు. వేరే లక్ష్యం లేదు. రోజూ వారొక్కరినే స్మరించేవాణ్ణి. గురువు యొక్క కౌశలం అద్భుతం.65.ఇదే మా గురువు అపేక్షించినది. ఇంతకంటే వేరే ఏదీ కోరలేదు. వారు నన్నెప్పుడూ ఉపేక్షించలేదు. వారు ఎప్పుడూ నన్ను కష్టాలనుండి రక్షించేవారు. 66.నన్ను ఒకప్పుడు వారి పాదాలవద్ద, మరొకప్పుడు సముద్రతీరానికి అవతల ఉంచేవారు. అయినా వారి సాన్నిధ్య సుఖం దూరం కాకుండా నన్ను కృపాదృష్టితో చూచుకునేవారు.67.తాబేలు తన పిల్లలకు దృష్టిద్వారానే ఆహారం సమకూర్చేలా మా గురువు పద్ధతి కూడా అల్లే కృపాదృష్టితో పోషిస్తారు. 68.అమ్మా !ఈ మసీదులో కూర్చుని చెప్పుతున్నాను. ప్రమాణపూర్వకంగా నమ్ము.

గురువు నా చెవిలో ఏమీ ఊదలేదు. నేను నీకు ఎలా ఊదుతాను?69.తాబేలు యొక్క ప్రేమ దృష్టి ద్వారానే పిల్లలకు సుఖం సంతుష్టి. అమ్మా! ఊరికే ఎందుకు కష్టపడతావు? ఉపదేశం గురించినేనేమీ ఎరుగను.70.నదికి ఒక తీరాన తాబేలు ఉంటుంది. దాని పిల్లలు మరో తీరాన ఉంటాయి. వాని పాలన పోషణ దృష్టాదృష్టులతోనే. మంత్రాల గొడవ వ్యర్థం. 71.నీవు వెళ్లి అన్నంతిను. నీ ప్రాణాలకు ముప్పు తెచ్చుకోకు. ఒక్క నాయందు దృష్టి ఉంచు; పరమార్థం చేతికందుతుంది.72.నీవు నన్ను అనన్య దృష్టితో చూడు. నేను కూడా నిన్ను అట్లే చూస్తాను. మా గురువు నాకు వేరే ఏదీ నేర్పించ లేదు.73.సాధనల సంపద అవసరం లేదు, షట్‌శాస్త్రాల జ్ఞానమూ అవసరం లేదు. కర్తాహర్తా గురువేయని సంపూర్ణ విశ్వాస మొక్కటి తప్పక ఉండాలి.74.అలా గురువు యొక్క మహిమ అపారం. గురువు హరిహర బ్రహ్మమూర్తి. వారి శక్తిని తెలుసుకున్న వారు ఒక్కరే త్రిజగాలలో ధన్యులు'.75.బాబా ఆవిధంగా ఆ వృద్ధురాలికి బోధించగా, ఆమె మనసులో విషయం బాగా నాటుకుంది. బాబా చరణాలపై శిరసునుంచి ఆమె తన దీక్షను వదిలింది.76.ఆ కథనంతా విని ఆమె యొక్క సమర్పణ బుద్ధిని తెలుసుకుని ఆ కథలోని సార్థకతకు నా మనసులో ఆశ్చర్యం ఆనందం కలిగాయి.77.బాబా యొక్క ఈ లీలను గని పరమానందంతో కంఠం గద్గదమైంది. ప్రేమోద్రేకంతో శరీరం రోమాంచితమైంది. బాబా బోధ నా అంతరంగంలో బాగా నాటుకుంది.78.నా గద్గద కంఠాన్ని చూచి మాధవరావు ఏమిటి అణ్ణాసాహేబు! ఊరికే మౌనంగా కూర్చుండి పోయారెందుకు?.శరీరం పులకితమైంది కదూ!79.బాబాకు సంబంధించిన ఇటువంటివి అనేక కథలున్నాయి. నేను ఎన్నని చెప్పను? అని మాధవరావు చెప్పుతుండగా గంట మ్రోగటం వినిపించింది.80.ప్రతిరోజు మధ్యాహ్న భోజనానికి ముందు భక్తులు మసీదుకు వెళ్లి కూర్చుంటారు. బాబాకు విధి పూర్వకంగా గంధాక్షతలతో అర్ఘ్యపాద్యాది పూజను చేస్తారు.81.అటు

తరువాత బాపూ సాహేబు జోగ్ భక్తి ప్రేమలతో పంచారతిని ఇస్తాడు. భక్తులంతా హారతిని పాడుతారు. 82. ఆ హారతి సమయాన్ని తెలుపుతూ గంట గణ గణమని మ్రోగ సాగింది. నా మనసులోని సంశయం పోయింది. మేము మసీదుకు బయలుదేరాం. 83. మధ్యాహ్న సమయంలోని ఈ హారతిని పురుషులు స్త్రీలు కలిసి చేస్తారు. స్త్రీలు మసీదుపైన పురుషులు క్రింద మండపంలో ఉండేవారు. 84. తాళాలు తప్పెట్లు మంగళ వాద్యాలు మ్రోగుతుండగా ఉచ్చస్వరంతో ఉల్లాసంతో ఆనందంగా అందఱూ హారతిని పాడుతారు. మేము మండప ద్వారం వద్దకు వెళ్లాం. 85. హారతి ఘనంగా జరుగుతూంది. పురుషులు మెట్ల వద్ద గుమి గూడి ఉన్నారు. పైకి వెళ్లటానికి స్థలం లేదు. 86. హారతి పూర్తి అయే వరకు క్రిందనే ఉండి తరువాత భక్తులతో పాటు బాబా వద్దకు వెళ్లవచ్చు అని నా ఆలోచన. 87. నేనలా అనుకున్నా, మాధవరావు మెట్లు ఎక్కి నా చేయి పట్టుకుని నన్ను కూడా బాబా వద్దకు లాక్కుని వెళ్లాడు. 88. బాబాతమ స్థానంలో నిశ్చలంగా కూర్చుని చిలుము పీలుస్తున్నారు. వారి ఎదుట జోగు ఎడమ చేత్తో ఘంట వాయిస్తూ పంచారతిని ఇస్తున్నాడు. 89. అలా ఆ హారతి సమయంలో మాధవరావు బాబా యొక్కకు డివైపున కూర్చుని నన్ను బాబా ఎదురుగా కూర్చోబెట్టాడు. 90. శాంతమూర్తి సత్పురుషులలో శిరోమణియైన బాబా, మంజుల స్వరంతో 'శామ్‌రావు నాకు దక్షిణగా ఏమిచ్చాడు' అని అడిగారు. 91. 'బాబా! ఇదిగో, శామ్‌రావు ఇక్కడే ఉన్నాడు. దక్షిణకు బదులుగా నమస్కారాలను ఇస్తాను. అవే నేను బాబాకు అర్పించే పదిహేనురూపాయలు అని అన్నాడు' అని చెప్పాను. 92. సరే మీరు ఉభయులూ ముచ్చటించు కున్నారా? మీరు ఏం మాట్లాడుకున్నారు? అదంతా నాకు చెప్పు. 93. నమస్కారాల కథ అలా ఉండనీ. అతనితో మాట్లాడినదంతా ఏమిటో నాకు వినిపించు అని వారనగా 94. జరిగిన వృత్తాంతాన్ని బాబాతో చెప్పాలని నాకెంతో ఉత్సాహంగా ఉంది కాని గట్టిగాహారతి చప్పుడు.

నాలోని పరమానందం నాపెదవులనుండి ప్రవహించింది.95. తలగడకు ఆనుకుని కూర్చున్న బాబా నా మాటలు వినటానికి ముందుకు జరిగారు.నేను కూడా ముందుకు జరిగి చెప్పనారంభించాను.96.''బాబా! అక్కడ విన్న వృత్తాంతం మనసుకు మధురంగా అనిపించింది. అందులోని ఆ ముదుసలి స్త్రీ కథ అత్యంత అద్భుతం. 97.శామ్‌రావు ఆ విషయాన్ని చెప్పటంతో నా అజ్ఞానం నాకు తెలిసి వచ్చింది. ఆ కథ నెపంతో మీరు నన్ను అనుగ్రహించారని అర్థమైంది' అని చెప్పాను.98. అప్పుడు బాబా అత్యంత ఉత్సుకతతో 'ఏమిటా విశేషమైన కథ? ఎలాంటి అనుగ్రహం? అదంతా నాకు చెప్పు' అని అడిగారు.99.అప్పుడే తాజాగా విన్న కథ. పైగా నా మనసులో బాగా నాటుకున్నది. ఉన్నది ఉన్నట్లు మనవి చేశాను. అది విని బాబా ప్రసన్నులైనట్లు కనిపించారు. 100.అలా నేను చెప్పినదంతా బాబా శ్రద్ధగావిని వెంటనే నాతో ఈ విషయాన్ని బాగా గుర్తుంచుకో అని చెప్పారు. 101.మరల ఎంతో ఉత్సాహంగా 'నీవు విన్న కథ నిజంగా మధురంగా ఉందా? నీ మనసుకు బాగా పట్టిందా? నిజంగా సార్థకత అనిపించిందా?'అని అడిగారు.102.'బాబా! ఆ కథాశ్రవణంతో నా మనసులోని వేదన తొలగిపోయి శాంతి కలిగింది. నాలోని ఆవేదన తొలిగింది. నాకు నిజమైన మార్గం తెలిసింది' అని చెప్పాను.103.అప్పుడు బాబా 'మా పద్ధతి విశిష్టమైనది. ఈ ఒక్క కథను బాగా గుర్తుంచుకుంటే చాలా ప్రయోజనం కలుగుతుంది. 104.ఆత్మను తెలుసుకోవడానికి జ్ఞానం అవసరం. జ్ఞాన ప్రాప్తికి ధ్యానం చేయాలి. ఆ ధ్యానమే ఆత్మానుష్ఠానం. దాని ద్వారానే మనోవృత్తి శాంతిస్తుంది.105.కోరికలన్నింటినీ వదిలి సర్వజీవులలో ఉన్న పరమాత్మను ధ్యానించాలి. ధ్యానం సరిగ్గా కుదిరినప్పుడు ఆత్మప్రాప్తిస్తుంది.106. సత్‌చిత్ ఆనందం నాయొక్క స్వరూపమని తెలుసుకుని ఆ రూపాన్ని ఎల్లప్పుడూ ధ్యానించు.107.ఇటువంటి ధ్యానం కుదరకపోతే నా ఈ సగుణ రూపాన్ని నఖశిఖాంతం

అహర్నిశలూ మనసులో అనుసంధానం చేయి.108.నన్ను ఇలా ధ్యానిస్తే మనో వృత్తి నిశ్చలమై ధ్యాత ధ్యానం ధ్యేయం అన్న త్రిపుటి తొలగిపోతుంది.109.ఈ త్రిపుటి పోగానే ధ్యాత చైతన్య ఘనుడై పోతాడు. ఇదే ధ్యానం యొక్క లక్ష్యం. దీని ద్వారా బ్రహ్మలో లీనమైపోతావు.110.తాబేలు నదికి ఒక ఒడ్డున ఉంటుంది. దాని పిల్లలు మరొక తీరాన ఉంటాయి. వానికి పాలుగాని వెచ్చదనం గాని ఉండవు.కేవలం తల్లి యొక్క దృష్టి ద్వారానే పిల్లలు పుష్టిగా పెరుగుతాయి. 111.పిల్లలు ఎప్పుడూ తల్లినే ధ్యానిస్తుంటాయి.అంతే. వానికి ఇంకేమి చేయాల్సిన అవసరంలేదు. పాలుగాని, వేరే ఆహారం గాని అవసరం లేదు. తల్లి చూపులే వానికి పోషణ.112.'ఈ కూర్మదృష్టి ప్రత్యక్ష అమృతవృష్టి. పిల్లలకు స్వానంద పుష్టి. అచ్చే గురుశిష్యులలో ఐక్యతాసృష్టి'.113.సాయి నోటి నుండి వచ్చిన ఈ వచనాలు ముగిసే సరికి హారతి చప్పుడు ఆగి 'శ్రీ సచ్చిదానంద సద్గురుకి జై జై అంటూ అందరూ కేకలు వేశారు. 114.నీరాజనోపచారాలు విస్తారమైన హారతి ముగిశాయి. జోగ్ పటిక బెల్లాన్ని అర్పించగా బాబా తమ చేతులను చాపారు. 115. ఆ చేతులనిండా జోగ్ నిత్య క్రమానుసారం పటిక బెల్లాన్ని దోసిలి నిండా ప్రేమ పూర్వకంగా పెట్టి నమస్కరించాడు. 116.ఆ మొత్తం పటిక బెల్లాన్ని బాబా నా చేతులలో గుమ్మరించి 'నేను చెప్పిన విషయాలన్నిటినీ మనసుకు బాగా పట్టించుకుంటే నీ స్థితి ఈ పటిక బెల్లంవలె అవుతుంది. 117.నీ మనసులోని కోరికలు సంశయాలు తీరుతాయి అని చెప్పారు. 118.నేను బాబాకు అభివందనం చేసి బాబా! నాకు మీ ఆశీర్వచనమే చాలు. నన్ను రక్షించండి అని వారి కరుణను ప్రార్థించాను. 119. అప్పుడు బాబా కథను శ్రవణం మననం మరియు నిదిధ్యాసనం చేస్తే, స్మరణ మరియు ధ్యానం కుదిరి ఆనంద ఘనుడైన పరమాత్మ ప్రకటమవుతాడు. 120.చెవులతో విన్న కథనంతా, నీ మనసుకు పట్టించుకుంటే శుభప్రదమైన గని తెరుచుకుంటుంది. నీ పాపాలు

ప్రక్షాళనమవుతాయి. 121. తుఫాను గాలి వీచితే సముద్రం పై అలలు లేచి అసంఖ్యాకమైన బుడగలు నురుగు తీరానికి కొట్టుకుని వస్తాయి. 122. అలలు, బుడగలు, నురుగు, సుడిగుండాలు, ఇవన్నీ అనేకరకాలుగా కనిపించే ఒకే నీరు. ఇదంతా దృష్టిలోనిభ్రమ కారణంగానే. గాలి శాంతించగానే అన్నీ ఒక్కటే. 123. ఎందుకు ఈ విధంగా జరిగింది అనో లేదా ఎందుకు నాశనమయిందిఅని అందామాజరిగినదంతా మాయాలీల అని అర్థం చేసుకోవాలి అంతే. 124. సృష్టిలో జరిగేవన్నీ ఇల్లే అని గ్రహించి వివేకులు నశ్వరమైనవానిని కోరరు. వారు శాశ్వతమైన ఆత్మను సాధిస్తారు. 125 జ్ఞానం కంటే ధ్యానం శ్రేష్ఠమైనది. ధ్యానానికి యదార్థమైన జ్ఞానం ఉండాలి. బ్రహ్మ తత్త్వం గురించి పూర్తిగా జ్ఞానం లేకపోతే ధ్యానం సరిగ్గా కుదరదు. 126. సమ్యగ్ విజ్ఞానానికి ధ్యానం మూలం. దీనికి ప్రత్యగాత్మానుష్ఠానమని పేరు. అయితే క్రియా రహితమైన దానిని ఎలా ధ్యానించాలి? 127. ప్రత్యగాత్మయే ఈశ్వరుడు. మరియు ఈశ్వరుడే గురువు. ముగ్గురిలో అణుమాత్రమైనా భేదం లేదు. వారిని వేరువేరుగా చూచినవారు నష్టపోతారు. 128. నిదిధ్యాసనం పరిపక్వమైతే, ధ్యాతాధ్యానం ఒక్కటైపోతే, నివాత దీపకళికవలే చిత్తం శాంతిస్తుంది. అదే సమాధి. 129. ఏ కోరికలూ లేక సర్వజీవులలోను ఒక్క పరమాత్మయేయని, మరియు ఒక్క ఆత్మ తప్ప రెండవ వస్తువేదీ లేదని అద్వితీయ జ్ఞానంతో నిర్భయం కలిగితే అప్పుడు ఆత్మ ధ్యానం కుదురుతుంది. 130. అజ్ఞానం వలన చేసే కర్మబంధనాలతో సంబంధం తొలగిపోతుంది. విధి నిషేధాల నిర్బంధాలు వదలిపోతాయి. అప్పుడు మోక్షంతో కలిగే ఆనందాన్ని అనుభవిస్తారు. 131. ఆత్మ అసలు ఉందా లేదా? ఉంటే అంతటా ఒక్కటే ఉందా? లేక వేరు వేరు చోట్ల వేరు వేరుగా ఉందా? ఆత్మ కర్తయా లేక కర్మలు చేసేదా? ఏ కర్మలూ చేయనిదా? అని ముందుగా షట్ శాస్త్రాలు వెదికి తెలుసుకోవాలి. 132. ఆత్మ ఒక్కటే అన్న ప్రత్యక్ష అనుభవజ్ఞానమే జ్ఞానానికి పరాకాష్ఠ. అక్కడే

మోక్షం, మరియు పరమానందప్రాప్తి. 133.అంధునికి ఏనుగును గూర్చి వర్ణించడానికి బృహస్పతి వంటి వక్తను తీసుకుని వస్తే మాత్రం అతని వాక్చాతుర్యం ఏనుగురూపాన్ని చూపించగలదా? అట్లే వాక్కుకు అతీతమైన దానిని వర్ణించ వీలుకాదు.134. వక్తయొక్క నోరు అంధుని చెవులు అతనికి చూపును ఇవ్వగలవా? ఏనుగు స్వరూపాన్ని చూడటానికి అంధునికి ఉపయోగపడేవి నిజంగా నేత్రాలే కదా! 135.మరి ఆ నేత్రాలు లేనప్పుడు అంధుడు ఏనుగును ఎలా చూడగలడు? అట్లే గురువు, దివ్యనేత్రాలను ప్రసాదించి నప్పుడే జ్ఞానప్రాప్తి.136.సాయి స్వరూపం యథార్థ జ్ఞానం.వారు మూర్తీభవించిన పరిపూర్ణ జ్ఞానమని తెలుసుకోవటమే వారి ధ్యానం, అనుష్ఠానం. అదే వారి దర్శనం. 137.అజ్ఞానం నుండి,కోరికల నుండి,కర్మ బంధనాల నుండి విమోచనం కావాలంటే వేరే ఇతర సాధనలు లేవు.దీనిని బాగా తెలుసుకోవాలి.138.సాయిబాబా మీ వారూ కాదు, మావారూ కాదు.వారు సర్వజీవులలో ఉండే పరమాత్మ. సూర్యుడు సకల జగానికి సంబంధించినట్లు బాబా అందరికీ చెందినవారు.139.ఇప్పుడు వారి మాటలను వినండి. సర్వసాధారణమైనా అవి అమూల్యమైనవి. వానిని ఎప్పుడూ స్మరణయందుంచుకుంటే ఫలప్రదం. 140. 'పూర్వజన్మ ఋణానుబంధం లేకుండా ఎవరూ ఎక్కడికీ వెళ్లనే వెళ్లరు.మానవులే కాదు, పశుపక్షులు కూడా అంతే. అందుచేత ఎవరినీ ఛీ ఫొమ్మని తరమకండి.141.వచ్చేపోయే వారిని ఆదరించండి. దప్పిక గొన్న వారికి నీరు, ఆకలిగొన్న వారికి అన్నం, బట్టలు లేని వారికి బట్టలూ, అట్లే విశ్రమించటానికి చోటునిస్తే శ్రీహరి సంతుష్టుడవుతాడు. 142.ఎవరికైనా డబ్బు అవసరమయినప్పుడు ఇవ్వటానికి నీ మనసు సందేహిస్తే ఇవ్వవద్దు. కాని, వారిపై కుక్కలా అరవకు.143.ఎవరైనా వందమాటలన్నా సరే స్వయం కఠినంగా బదులివ్వకు. నిరంతరం సహనాన్ని వహిస్తే అపారమైన సుఖం కలుగుతుంది. 144.ప్రపంచం తలక్రిందులైనా మనం వెనకాముందు కాకూడదు. నిశ్చలంగా మన స్థలంలోనే ఉండి తమాషాను

చూడాలి. 145. నీకూ నాకూ మధ్య నున్న గోడ పడగొట్టేసి చూడు, అప్పుడు రాకపోకలకు ప్రశస్తమైన మార్గం ఏర్పడుతుంది. 146. నేను, నువ్వు అను భేద బుద్ధియే గురుశిష్యుల మధ్యనున్న గోడను. దానిని పడగొట్టక పోతే అద్వైత స్థితి లభించదు. 147. 'అల్లామాలిక్', 'అల్లామాలిక్' అతడు కాక రక్షకుడు ఎవరూ లేరు. అతని లీల అలౌకికం. అంతులేనిది. అర్థం కానిది. 148. అతడు ఏది తలచితే అదే అవుతుంది. తనను చేరుకునే మార్గాన్ని అతడే చూపిస్తాడు. ఆ సమయం వస్తే క్షణం పట్టకుండా మనోభీష్టం తీరుతుంది. 149. ఋణాను బంధం కారణంగా భాగ్యవశాత్తు మీరు నేను కలుసుకున్నాం. పరస్పరం ప్రేమగా ఉంటూ సుఖాలను సంతుష్టినీ అనుభవిద్దాం. 150. ఇక్కడ అమరులెవరున్నారు? పరమార్థాన్ని సాధించిన వారే కృతార్థులు. శ్వాసోచ్ఛ్వాసలతో నడుస్తున్నంతవరకు జీవులుగా మాత్రమే ఉంటారు'. 151. బాబా యొక్క ఈ కృపావచనాలు చెవులలో పడగానే దప్పిక గొన్న వారికి నీరు లభించినట్లుగా ఆతురతతో ఉన్న నా మనసుకు ఆనందం కలిగింది. 152. ఎనలేని ప్రజ్ఞ దృఢమైన శ్రద్ధ ఉన్నా సాయి వంటి గురువు యొక్క శక్తి లభించటానికి బలమైన దైవశక్తి అవసరం. 153. ఇందులోని సారం చూడగా భగవంతుడు గీతలో నిర్ధారణగా చెప్పినట్లు 'ఏ యథామాం' అంటే సర్వభారాలు కర్మలపైనే. 154. 'యథా కర్మయథా శ్రుత' కర్మను ఎలా అభ్యాసం చేస్తే అలాగే హితం కలుగుతుంది. ఇదే ఈ అధ్యాయం లోని ఉద్దేశం. ఇదే ఇందులోని బోధామృతం. 155 'అనన్యాశ్చింతయంతోమాం' ఇదే భగవద్గీతలోని మర్మం. అనన్య భావంతో ఆరాధించేవారి యోగక్షేమాలను గోవిందుడు చూస్తాడు. 156. ఈ మధుర ఉపదేశాలను విని 'దేవాన్ భావయతానేన' అన్న స్మృతివచనం స్మరణకు వచ్చింది. భగవంతుని భక్తిగా ఆరాధిస్తే అతడు మిమ్మల్ని ప్రేమిస్తాడు. 157. నీవు బాగా ప్రయత్నం చేయి. పాలను అంటే ఫలితాన్ని గూర్చిన చింతను వదిలి పెట్టు. పాలగిన్నె పట్టుకుని నేను మీ వెనుకే

నిలబడి ఉన్నాను 158.అని చెప్పితే, ప్రయత్నం నేను చేస్తాను పాలగొన్నెను మీరే ఖాళీ చేయించాలి అని అంటారేమో! అటువంటిది నాకు తెలీదు. చేసే పనిలో దక్షత ఉండాలి.159.అన్న బాబా యొక్క ఈ ప్రతిజ్ఞావాణిని ప్రమాణ పూర్వకమని తలచి ప్రవర్తించే వారెవరైనా సరే ఇహ పరసుఖాల గని లభించినట్లు భావించాలి.160.ఇప్పుడు శ్రోతలకు మరో విన్నపం. ఒక్క క్షణం సుస్థిరమైన మనసుతో బాబా నా నిశ్చయాన్ని బలపరచిన స్వానుభవ కథ వినండి. 161.మన మనసులలో మంచి సంకల్పం కలిగితే సాయి మహారాజు ప్రోత్సాహపరచి తమ పెదవులు కదపకుండానే అనుగ్రహదానం చేసిన విషయాన్ని వినండి. 162.వారికి అనన్యంగా శరణుజొచ్చి భక్తియొక్క కౌతుకాన్ని అవలోకించి, ఆపైన సాయి యొక్క లీలా విశేషాన్ని నిత్యనూతనంగా అనుభవించండి. 163.ప్రాతఃకాల సమయం.నిద్రనుండి మేలుకోగానే మనసులో మంచి ఆలోచనా తరంగాలు లేస్తే, దానిని మరింతగా బలపరచాలి. 164.ఆ వృత్తినే పోషిస్తే అత్యంత సంతోషం కలుగుతుంది. బుద్ధి కూడా వికసిస్తుంది.మనసుకు ప్రసన్నత కలుగుతుంది. 165.అని ఒక సత్పురుషుని వచనం. దీనిని అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలనిపించింది. అట్లే అనుభవమై శాంతి లభించి అది వింతగా తోచింది. 166.శిరిడీవంటి పవిత్రక్షేత్రంలోగురువారం వంటి మంగళకరమైన రోజు రామనామాన్ని అఖండ ఆవర్తన చేయాలన్న సంకల్పం కలిగింది. 167.బుధవారం రాత్రి శయ్యపైన శరీరం నిద్రావశమయే వరకు మనసును రామనామస్మరణలో ఉంచి అదే ధ్యాసతో ఉన్నాను. 168.ప్రాతఃకాలం మేలుకోగానే మనసుకు రామనామం గుర్తుకు వచ్చింది. దాంతో జిహ్వా సార్థకమైంది. 169.మనసులోని ఆలోచనను నిశ్చయం చేసుకున్నాను. ముఖం కడుక్కుని శుచియై దొరికిన పూలను పట్టుకుని సాయి యొక్క ప్రాతఃదర్శనానికి వెళ్లాను. 170.దీక్షితుని భవనం దాటి బుట్టి యొక్క వాడా బయటనుండి వెళ్లుతుండగా ఒక బొరంగాబాదుకర్

సుందరమైన ఒక పద్యాన్ని మధురంగా పాడుతుండగా విన్నాను.171.ఆ పద్యాన్ని ఓవీ రూపంలో చెప్పాలంటే పద్యంలోని స్వాభావికమైన మాధుర్యం పోతుంది. శ్రోతలు ఆనందించలేరు.172.అందువల్ల మొత్తం పద్యాన్ని అక్షరమక్షరం గానం చేస్తాను. దాని వల్ల ప్రేమమయులైన శ్రోతలు ఆ పద్యంలోని ఉపదేశాన్ని గ్రహించి ఆనందిస్తారు. 173.పద్యం – 'గురుకృపాంజన పాయోమేరే భాఈ ! రామ బినా కఛుమానతనాహి అందర్ రామా బాహర్ రామా, సుమేమే దేఖత సీతారామా జాగత రామా సోవత రామా జహాదేఖే వహా పూరనకామా ఏకాజనార్దని అనుభవనీకా జహాదేఖే వహారామ్ సరీఖా. నేను మనసును రామ నామ స్మరణలో ఉంచాలని ముందే నిశ్చయించుకుని ప్రారంభం చేయటాన్ని పై పద్యం బలపరిచింది.174.దానిలో నా మనోనిశ్చయమనే అంకురానికి కరుణాఘనులైన సాయి సమర్థులు ఆ పద్యరూపంలో సించనం చేశారు అని బోధపడింది.175. ఔరంగాబాదుకర్ చేత తంబురాను పట్టుకుని మండపంలోపల సాయిసముఖంలో ఉచ్చస్వరంతో పైకి గట్టిగా పాడుతున్న ఆ గానాన్ని విన్నాను.176.బాబా భక్తుడైన ఔరంగాబాదుకర్ నా వలనే బాబా చరణాలయందు అనురక్తుడు.అతనికి అనేక పద్యాలు కంఠస్థమై ఉండగా,ఆ సమయాన ఆ పద్యమే ఎందుకు స్ఫురించింది? 177.నా మనసులోనిది ఎవరికీ తెలియదే మరిఅతడు ఆ పద్యాన్నే ఎందుకు పాడాడు. బాబా ఏవిధంగా సూత్రాన్ని కదిలిస్తుంటే మనసులో అలాగే స్ఫురణ కలుగుతుంది. 178. మనమంతా కేవలం కీలు బొమ్మలం, సాయిమాత సూత్రధారి. వారు స్వయంగా చెప్పకున్నా నాకు మంచి ఉపాసనను అందించారు.179.నా అంతరంగంలోని ఆలోచన బాబా మనసులో ప్రతిబింబించిందా అన్నట్లుగా బాబా ఈ విధంగా ప్రత్యక్ష అనుభవాన్ని కలిగించారని అనిపించింది. 180.నామం యొక్క మహత్వం ఎంత గొప్పది! దీనిని సాధువులు మహాత్ములు ఎంతగానో వర్ణించారు; పామరుణ్ణైన నేను ఎంతని వర్ణించగలను? దీనివలననే

స్వరూప ప్రాప్తి. 181.ఆత్మ సాక్షాత్కారాన్ని కలిగించే రామ అను రెండు అక్షరాలను 'మరా' అని తిరగేసి స్మరించి దారి దోపిడి చేసే బోయవాడు ఉద్ధరింపబడి వాల్మీ వాల్మీకి అయ్యాడు. విశేషమైన వాక్సిద్ధిని పొందాడు. 182. 'మరామరా' అని తిరగేసి స్మరిస్తే అతని జిహ్వాపై రాముడు ప్రకటమయ్యాడు. రాముడు జన్మించక ముందే రాముని అవతార చరిత్రను వ్రాశాడు. 183.రామనామం ద్వారా పతితులు పావను లౌతారు. రామనామంలో అమితమైన ప్రయోజనాలు. రామనామంతో భేదబుద్ధి తొలగి సమభావం కలుగుతుంది.రామనామంతో బ్రహ్మప్రాప్తి. 184.రామనామావర్తనతో జననమరణాలు తొలగిపోతాయి. ఒక్క రామనామస్మరణతో కోటి లాభాలు. 185.రామనామ ధ్వని ఉన్నచోట విష్ణువు యొక్క సుదర్శనచక్రం తిరుగుతూ కోటివిఘ్నాలను ధ్వంసం చేస్తుంది. ఈ రామనామం దీనులను సంరక్షిస్తుంది. 186.ఉపదేశించటానికి సాయిబాబాకు ఒక ప్రత్యేక కాలం గాని, ఒక స్థలం గాని,ఒక సమయంగాని అవసరంలేదు.వారు కూర్చుని ఉన్నా, నుంచుని ఉన్నా, నడుస్తున్నా, ఉపదేశాలను అతి సహజంగా ఇచ్చేవారు.187.ఈ విషయంలోని ఒక మధురమైన కథను శ్రోతలు శ్రద్ధగా శ్రవణం చేస్తే సాయి యొక్క దయ మరియు వారి సర్వవ్యాపకత్వం అర్థమవుతుంది.188.ఒకసారి ఒక భక్త శ్రేష్ఠుడు మరొకరిని గూర్చి ముచ్చటిస్తూ, స్వయం చెడు ఆలోచనలకు లోనై నిందారోపణలో పడిపోయాడు.189.అతని మంచి గుణాలు ఒక వైపు ఉండి పోయాయి.నోటి నుండి నింద బాగా ప్రవహించసాగింది. అసలు విషయం అడుగునపడి నింద పైకి వచ్చింది.190.ఏకారణం చేతనైనా ఎవరి ఆచరణైనా సరిగ్గా లేకపోతే వారి గురించి వారికి వారి ఎదుటే తెలియచేసి వారిపై దయ తలచాలి.191.ఎవరినైనా సరే ఎప్పుడూ నిందించకూడదు అని ప్రతి ఒక్కరికీ బాగా తెలుసు. అయినా ఎంత నిగ్రహించుకున్నా, ఆ స్వభావం పొట్టలో అణిగి ఉండదు. 192.కడుపులోనుండి కంఠంలోనికి,

కంఠం నుండి జిహ్వపైకి, అక్కడినుండి మెల్లమెల్లగా పెదవులపైకి, సుఖంగా సంతోషంగా ప్రవహిస్తుంది.193.నింద చేసే వాని కంటె ఎక్కువ ఉపకారం చేసేవారు త్రిభువనాలలో ఉండరు. నిందారోపణ చేసి వారికి శ్రేయస్సును కలిగించటమే.194.మురికిని కొందరు కుంకుడు కాయలతోను కొందరు సబ్బు శీకాయాది వస్తువులతో కడుగుతారు. మరికొందరు నిర్మలమైన నీటితో కడుగుతారు. కాని నింద చేసేవాడు ఇతరుల మురికిని తన నాలుకతో శుభ్రం చేస్తాడు.195.ఇతరులకు ఉపకారం చేయటానికి తాము మానసిక అధోగతిని సహిస్తారు. వారి మహోపకారం వర్ణించ శక్యం కాదు. పరనింద చేసేవారు అత్యంత వందనీయులు.196.నిందా నెపంతో దోషాలను తెలియపరుస్తూ అడుగడుగునా సావధానపరుస్తూ, అనేకరకాల అనర్థాలను తొలగిస్తూ సహకరిస్తారు. అట్టివారి ఉపకారాన్ని నేనెంతని వర్ణించను?197.అట్టివారి గొప్పతనాన్ని సాధుసత్పురుషులు ఎందరో అనేకరకాల వర్ణించారు. అలాంటి నిందచేసేవారికి నేను సాష్టాంగ ప్రణామాన్ని చేస్తాను.198.శ్రోతలకు బాగా విసుగు కలిగింది కదూ! నిందారోపణ చేసినవాడు మలవిసర్జనానికి బయలు ప్రదేశానికి వెళ్లాడు.బాబా దర్శనానికి భక్తులు మసీదుకు వెళ్లారు.199.బాబా పూర్ణ అంతర్ జ్ఞాని. ఆయా సమయాలకు సరిగ్గా భక్తులకు శిక్షణను ఇచ్చేవారు.వారు తరువాత ఏం చేశారో వినండి.200.భక్తులతో సహా లెండీకి వెడుతూ బాబా ఆ నింద చేసినవానిని గూర్చి అడిగారు. అతడు కాలువ వద్ద బయలు ప్రదేశానికి వెళ్లినట్లు భక్తులు చెప్పారు.201. తమ కార్యక్రమాన్ని ముగించుకుని బాబా లెండీ నుండి బయలుదేరారు. కాలువకు వెళ్లిన భక్తుడు కూడా ఇంటికి బయలు దేరాడు.202.ఆ ఉభయులూ పరస్పరం కలుసుకున్నారు. అప్పుడు జరిగిన వృత్తాంతాన్ని నేను చేతులు జోడించి శ్రోతలకు మనవిచేస్తాను. శ్రద్ధగా వినండి. 203.అక్కడ ఒక కంచె ప్రక్కన ఒక ఊరి పంది మలాన్ని మృష్టాన్నంలా చప్పరిస్తూ తినేస్తోంది.బాబా

తమ చేతితో దానిని అతనికి చూపించారు. 204. 'చూశావా! జనుల మలం దాని జిహ్వాకు ఎంత మధురంగా ఉందో తన ఆప్త జనుల మీద కోపాన్ని ప్రదర్శించే తన కోరికను యథేచ్ఛగా తీర్చుకుంటోంది. 205. ఎంతో పుణ్యసంచయంవలన ప్రాప్తించిన ఈ మానవ జన్మను ఇలా వ్యర్థం చేసుకునే ఆత్మ ఘాతకునికి ఈ శిరిడీ ఏం సుఖం ఇవ్వగలదు' 206. అని అంటూ బాబా వెళ్లిపోయారు. నిందచేసిన ఆ భక్తుడు మనసులో చాలా బాధ పడ్డాడు. ఉదయం తను చేసిన నిందారోపణ గుర్తుకు వచ్చింది. అతని హృదయంలో బాబా మాటలు బాగా గ్రుచ్చుకున్నాయి. 207. ఆయా సందర్భాల ననుసరించి బాబా అలా భక్తులకు బోధించేవారు. ఆ బోధలోని సారాన్ని అంతరంగంలో భద్రపరచుకుంటే పరమార్థం ఎంతో దూరంలో ఉండదు. 208. నా హరి కృప ఉంటే నాకు మంచంపైన అన్నీ సమకూర్చుతాడు అన్న మాట నిజమే కాని ఆ మాట అన్న ఆచ్ఛాదనల వరకే. 209. పరమార్థంలోకూడా అలా జరుగుతుందని భావిస్తే పరమార్థాన్ని కోలుపోవల్సిందే. ఎవరు ఎలా చేస్తే అలా అనుభవిస్తారు అన్న బాబా మాటలు అమూల్యం. 210. వారి యొక్క ఇతర వచనాలను వింటే ఆత్మానందం కలుగుతుంది. శ్రద్ధాభక్తులుంటే అవి హృదయంలోకి చొచ్చుకుని పోతాయి. 211. నేను జలంలో, భూప్రదేశంలో, ప్రాణులలో, జనులలో, వనాలలో, దేశవిదేశాలలో, ఆకాశంలో, ప్రకాశంలో వ్యాపించి సంచరిస్తుంటాను. నేను ఒకే ప్రదేశంలో ఉండేవాణ్ణి కాను. 212. మూడున్నర మూరలలో పరిమితమై ఉన్నానని, ఇదే నా వ్యాప్తి అని అనుకునే వారి భ్రాంతిని తొలగించడానికి నేను శరీరాన్ని ధరించాను. 213. అహర్నిశలూ అనన్యంగా నన్ను నిష్కామంగా ఆరాధించేవారికి ద్వైత భావం లేని నాతో ప్రత్యక్ష ఏకాత్మత ప్రాప్తిస్తుంది. 214. మాధుర్యం లేకుండా బెల్లం, తరంగాలు లేకుండా సాగరం, తేజస్సు లేకుండా కళ్లు ఉండవు కదా! అట్లే నేను లేకుండా ఏ అమాయక భక్తుడూ ఉండడు. 215. జననమరణ ఆవర్తన తప్పించు

కోవాలని నిశ్చయించుకున్నవారు, ప్రయత్న పూర్వకంగా ధర్మానుసారంగా ప్రవర్తించాలి. నిశ్చలమనసుతో ఉండాలి.216.కఠినమైన మాటలు త్యజించాలి. ఎవరి మనసునూ మాటలతో నొప్పించరాదు. ఎల్లప్పుడూ పరిశుద్ధ కర్మల యందే నిరతులై ఉండాలి. మనసును స్వధర్మంలో ఉంచాలి. 217.మీ మనోబుద్ధులను నాకు సమర్పించి నన్ను ఎల్లప్పుడూ స్మరించండి.ఇలా చేస్తే శరీరానికి ఎప్పుడు ఏం జరిగినా ముమ్మాటికీ ఏ భయం ఉండదు.218.అనన్యంగా నా యందు దృష్టి ఉంచి,నా కథలను వర్ణించే వారు, వినేవారు ధన్యులు. నా స్మరణ తప్ప అన్య ఆలోచనలేవీ లేకుండా ఉంటే, చిత్తం పరమాత్మలో లీనమైపోతుంది. 219.నా శరణు పొందు నానామాన్ని స్మరించు అని అందరికీ బాబా చెప్పారు. దానితోపాటు 'నేను' ఎవరు అని తెలుసుకోవటానికి శ్రవణ మననాలను ఆజ్ఞాపించారు.220.ఒకరికి భగవన్నామ స్మరణ ఒకరికి భగవల్లీలా శ్రవణం ఒకరికి భగవత్పాదపూజ ఇలా విభిన్న ప్రకృతి కలవారికి వేరువేరు సాధనలను చెప్పారు.221.ఒకరికి ఆధ్యాత్మరామాయణ పఠన, ఒకరికి జ్ఞానేశ్వరీ పురశ్చరణ, మరొకరికి హరివరద పారాయణ, ఇంకొకరికి గురుచరిత్ర అధ్యయనం. 222.ఒకరిని తమపాదాలవద్ద కూర్చుండ బెట్టు కుంటే, మరొకరిని ఖండోబా మందిరానికి పంపారు. ఇంకొకరి కంఠానికి ప్రేమతో విష్ణు సహస్రనామావళి కట్టారు.223.ఒకరికి రామ విజయాన్ని ఉపదేశిస్తే, మరొకరికి ధ్యానాన్ని నామమహాత్మ్యాన్ని, ఇంకొకరికి చాందోగ్య ఉపనిషత్తును గీతా రహస్యాన్ని ఉపదేశించి వీనిలో విశ్వాసం ఉంచి వీనిలోని స్వాభావిక మాధుర్యాన్ని శ్రద్ధతో అనుభవించండని చెప్పేవారు.224.బాబా అలా ఒకరికి ఒకటి మరొకరికి మరొకటి బోధ చేసేవారు. వారి దీక్షాపద్ధతి అనేకరకాలు. అవి అనంతం. ఒకరికి ప్రత్యక్షంగా దీక్షనిస్తే మరొకరికి దృష్టాంతాలతో ఇచ్చేవారు. వారి ఉపదేశాలు అపూర్వంగా విశేషంగా ఉండేవి.225.అనేక వర్ణాల భక్తులు పరుగుపరుగున వారి దర్శనానికి వస్తారు.మద్యపానం

పైన ప్రీతి ఉన్న వారి స్వప్నంలోకి వెళ్లేవారు.226.వారి వక్షస్థలంపైన కూర్చుని కాళ్లూ చేతులూ గుండెను బాగా ఒత్తి పట్టి, వారు మరల మద్యం ముట్టుకోమని ప్రమాణం చేస్తేగాని వారిని విడిచిపెట్టేవారు కారు.227. వివాహం జరిగే గృహాలలో జ్యోతిష్యులు హరిహరుల చిత్రాలను వేసినట్లుగా బాబా భక్తుని స్వప్నంలో గోడపైన గురుః బ్రహ్మ అనే మంత్రాన్ని వ్రాసేవారు.228. ఎవరైనా రహస్యంగా ఆసనాలను వేస్తూ హఠ యోగసాధనలను చేస్తుంటే బాబా తమ దివ్యజ్ఞానంతో తెలుసుకుని,గురి తప్పని బాణం గ్రుచ్చుకునేలా బోధించే వారు. 229.ఎవరో అపరిచితుణ్ణి పట్టుకుని అతనితో'ఇంత తిని నిశ్చింతగా కూర్చోలేవా? ఓపిక పట్టి ఉండు' అని కబురు పంపారు.230.ఒకరితో ప్రత్యక్షంగా మాది చాలా కఠినమైన పద్ధతి. ఒకటి రెండు సార్లు చెప్పిచూస్తాం, చివరి ప్రయత్నం చాలా కఠినంగా ఉంటుంది. 231.ఒకసారి చెప్తాం రెండుసార్లు చెప్తాం, ఎవరైనా మామాటలను లక్ష్యపెట్టకపోతే కన్నబిడ్డలనైనాసరే రెండు ముక్కలుగా చీరిపారేస్తాం' అని చెప్పేవారు.232.సాయిబాబా మహాజ్ఞాని.పామరుణ్ణైన నేను ఆ మహానుభావుని చమత్కారాలను ఎలా వర్ణించగలను?వారు ఒకరికి విరక్తిని, జ్ఞానాన్ని కలుగజేస్తారు. ఒకరికి సద్భావాన్ని భక్తిని కలుగజేస్తారు.233. ఒకరికి ప్రపంచ వ్యవహారాలలో నడచుకునే పద్ధతిని, ప్రశస్తమైన రీతిలో శిక్షణనిస్తారు. ఉదాహరణకు విచిత్రమైన ఒక సంఘటనను శ్రోతలకు చెప్తాను.234.ఒకసారి మిట్ట మధ్యాహ్నమప్పుడు బాబా మనసుకు ఏం తోచిందో తెలియదుగాని వారు అకస్మాత్తుగా రాధాకృష్ణబాయి ఇంటి ప్రక్కకు వచ్చారు. 235. వారి వెంట కొందరు భక్తులున్నారు. అప్పుడు బాబా 'వెళ్లి నిచ్చెనను పట్టుకుని రండి,' అని అనగానే వెంటనే

ఒకరు వెళ్లి నిచ్చెనను తెచ్చిపెట్టారు.236.దానిని బాబా ఆ ఇంటి పైకి వేయించారు. స్వయంగా కప్పు పైకి ఎక్కారు. మనసులో వారి ఉద్దేశం ఏమిటో ఎవరికీ తెలియదు.237.వామన్‌గోండ్‌కరుని ఇంటికప్పుకు నిచ్చెనను వేయించి తాము స్వయంగా చరచరా ఇంటి కప్పుపైకి ఎక్కారు.238.అక్కడినుండి ఆ ఇంటికి ఆనుకుని ఉన్న రాధాకృష్ణబాయి ఇంటి కప్పును దాటుకుంటూ వెళ్లారు. అదేం చమత్కారమో! ఎవరికీ అర్థం కాలేదు. 239.అప్పుడు రాధాకృష్ణబాయి తీవ్రమైన చలి జ్వరంతో అనారోగ్యంతో ఉంది.240. బాబా కూడా ఇద్దరు వ్యక్తులు ఆసరాగా పట్టుకుంటేనే నడవగలిగేవారు.అంత బలహీనంగా ఉండగా అంతటి శక్తి వారి కెక్కడినుండి వచ్చిందో.241.వెంటనే ఇంటి కప్పుకు రెండవ వైపుకు అదే నిచ్చెనను వేయించుకుని క్రిందకు దిగివచ్చారు. 242.నేలపై కాలు మోపగానే ఆలస్యం చేయకుండా వెంటనే నిచ్చెన తెచ్చిన వానికి రెండు రూపాయలు ఇచ్చారు.243.నిచ్చెనను రెండువైపులా వేయటం ఏమంత కష్టమైనపని? ఆ శ్రమకు ఫలితంగా బాబా అంత డబ్బు ఇచ్చి ఋణం తీర్చుకున్నారు.244.నిచ్చెన తెచ్చినవానికి బాబా అంతడబ్బు ఎందుకిచ్చారు అనికుతుహలంతో వారిని అడగాలను కున్నారు.245. ఒక వ్యక్తి ధైర్యంతో వారిని ప్రశ్నించగా, బాబా ' ఎవరిశ్రమ భారాన్నైనా ఉచితంగా లవలేశమైనా తీసుకోకూడదు.246.ఎవరితోనైనా పని చేయించుకోవచ్చు. కాని ఎవరి శ్రమనూ ఉచితంగా తీసుకోరాదు అని ఒకనియమాన్ని పాటించాలి' అని బాబా ప్రత్యుత్తరమిచ్చారు.247.బాబా ఉద్దేశాన్ని ఎవరు అర్థం చేసుకోగలరు? వారి విషయాలువారికే అర్థం అవుతాయి. సత్పురుషుల అంతరంగం అత్యంత గూఢంగా ఉంటుంది.248.వారి నోటి నుండి వెలువడిన

మాటలే మనకు ఆధారం.వారి ఉపదేశాలననుసరించి ప్రవర్తిస్తే, ప్రపంచ వ్యవహారాలు చక్కగా సుఖంగా సాగిపోతాయి.249. తరువాతి అధ్యాయం ఇంతకంటే మధుర రసభరితం. అమాయకురాలైన ఒకపనిపిల్ల వేదాంతంలోని గూఢమైన చిక్కును విడతీస్తుంది.250.హరిదాసు అయిన దాసగణు జనులకు ఉపకారం చేయాలని ఈశావాస్య ఉపనిషత్తును మరాఠీ భాషలోకి అనువదించాలని నడుం కట్టాడు.251. సాయి బాబా అనుగ్రహంతో గ్రంథ రచన అయింది, కాని ఏవోకొన్ని గూఢార్థాలు తెలియక అతని మనసుకు సందేహం కలిగింది. మరి ఆ సమస్యను బాబా ఎలా పరిష్కరించారు? 252.'బాబా శిరిడీలోనే కూర్చుని దాసగణుతో నీవు పార్లేకు తిరిగి వెళ్లినప్పుడు, కాకాదీక్షితు ఇంట్లో పనిచేసే పిల్ల నీ సందేహాలను తీర్చుతుంది.' అనిచెప్పారు. 253.ఈశావాస్యమనే కమలాల సరోవరంలో, వాగ్దేవి అనే భ్రమరం ఝంకారం చేస్తూ తిరుగుతుంటే చతురులైన శ్రోతలు ఆ ఆనందాన్ని అనుభవించండి.254.తరువాతి అధ్యాయంలో ఈ కథను చెప్పేవారు చెప్పించేవారు సాయిదయామయులు. సావకాశంగా శ్రవణం చేస్తే శ్రోతలకు శుభం కలుగుతుంది.255. హేమాడ్ సాయికి మరియు సర్వజీవులలోని భగవంతునికి శరణు వేడుతూ, శ్రోతలు సావధానంగా వినాలని వేడుకుంటున్నాడు. 256.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ, అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో మదనుగ్రహమను పందొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 20 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీసీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఓం నమోగురువరా! అనుగ్రహ వచనాలనే ముత్యాలను కలిగిన మానస సరోవరా! మీ చరణాలవద్ద అనన్య భక్తులు హంసలవలె ఆశ్రయించి ఉన్నారు.1.మహా ఉదారులైన మీరు మిమ్మల్ని ఆశ్రయించిన వారికి మీ అనుగ్రహమనే ముత్యాలను ప్రసాదించి వారికి ఆత్మ స్వరూపంలోవిశ్రాంతిని కలిగించి వారి జనన మరణాల రాకపోకలను తొలగిస్తారు.2. సాయిసిద్దుని ఆశ్రమం ఎంత గొప్పది? దర్శనంతో ప్రపంచంలోని కష్టాలను పోగొడుతుంది. దాని పరిసరాలలో ఉన్నవారి భవభ్రమలను,అశాంతిని పారిపోయేలా చేస్తుంది.3.సాయి అసలు నిరాకారమేఐనా భక్తుల కొఱకు సాకార రూపాన్ని ధరించారు. మాయానటి రూపాన్ని గ్రహించి నటునివలె లీలలను ప్రదర్శించారు. 4.అటువంటి సాయిని ఒక్కక్షణం ధ్యానించి శిరిడీకివెళ్లి అక్కడ మధ్యాహ్న హారతి తరువాతి కార్యక్రమాన్ని శ్రద్ధగా చూద్దాం.5.మధ్యాహ్న హారతి తరువాత సాయి మహారాజు మసీదు చివరకు వచ్చి అత్యంత కృపాదృష్టితో భక్తులకు విభూతిని పంచిపెడతారు.6.ప్రేమికులైన భక్తులు వెంటనే వారి చరణాలను ఆలింగనం చేసుకుని నిలుచుని బాబా వదనాన్ని అవలోకిస్తూ వారిపై బాబా కురిపించే విభూతిని స్వీకరిస్తారు.7.బాబా పిడికిళ్ల నిండా విభూతిని నింపుకుంటూ భక్తుల చేతులలో పోసేవారు. తమ బొటనవ్రేలితో భక్తుల నుదుట అద్దేవారు. వారి హృదయంలో అత్యంత ప్రేమ.8.'తమ్ముడూ! భోజనానికి వెళ్లు.అన్నా! నువ్వుకూడా వెళ్లు, వెళ్లి కమ్మగా

తిను. మీరందరూ ఇళ్లకు వెళ్లండి'అని ఒక్కొక్కరికి చెప్పేవారు.9.అదంతా గతించిన వైభవం.ఇప్పుడు దానిని చూడలేకపోయినా శిరిడీలో ఆయా వేళలందు ఆయా స్థానాలలో నిశ్చలంగా ధ్యానిస్తే అది కనిపిస్తుంది. 10.ఈ విధంగా సాయిని నఖశిఖ పర్యంతం ధ్యానిస్తూ, భక్తిగా వారికి సాష్టాంగ ప్రణామం చేసి కథను కొనసాగిస్తాను. 11.గత అధ్యాయాంతంలో బాబా పనిపిల్ల ద్వారా వేదశ్రుతి యొక్క అర్థాన్ని వివరించారు అని శ్రోతలకు చెప్పాను కదూ! 12.ఈశావాస్య భావార్థ బోధిని అన్న గ్రంథాన్ని దాసగణు వ్రాయనారంభించాడు. అందులో అతనికి పండేహం కలగగానే ఆ సంశయ నివృత్తికై శిరిడీకి వచ్చి సద్గురు చరణాల వద్దకు చేరాడు.13.అప్పుడు బాబా,'నీవు తిరిగి వెళ్లినప్పుడు, కాకా ఇంట్లోని పనిపిల్ల నీ సంశయాన్ని నివారిస్తుంది' అని చెప్పారు.14.ప్రస్తుతం ఆ వచనాలే కథాను సంధానం, అక్కడి నుండే మొదలు పెడదాం. శ్రోతలు శ్రద్ధతో ఉంటే శ్రవణం చక్కగా జరుగుతుంది.15.సంస్కృత భాషా జ్ఞానం లేనివారికోసం దాసగణు ఈశావాస్యోపనిషత్తు అర్థాన్ని మరాఠీ భాషలో, ఓవీఛందస్సులో, ప్రతిపదార్థంతో స్పష్టంగా వివరించాలని.16. ఈశావాస్య భావార్థబోధినిని ప్రాకృత భాషలో సుగమంగా రచించాలన్న సంకల్పంతో ప్రారంభించాడు. 17.కఠినమైన గూఢార్థాలతో ఉన్న ఈ ఉపనిషత్తులోని పదాలను చక్కగా అనువదించగలిగాడు. కాని పదాలలో అంతర్గతంగా ఉన్న జ్ఞానం బోధపడకపోతే మనసుకు సంతృప్తిలేదు. 18.నాలుగు వేదాల సారమే ఉపనిషత్తుల భాండారం. హరి మరియు గురువు అనుగ్రహం లేకుండా ఆ జ్ఞాననిధి ప్రాప్తి అత్యంత కఠినం. 19.నేను జ్ఞానిని నా స్వప్రయత్నంతో ఉపనిషత్తులను యథార్థంగా ఆకళింపు చేసుకుని వివరిస్తాను, అని ఎవరైనాఅనుకుంటే.20.అది కల్పాంతంలో కూడా సంభవం కాదు. గురువు కృపలేకపోతే అడుగడుగునా కష్టాలు ఎదురై అంతరార్థం బోధపడదు.21.కాని అదే గురువుపాదాలను ఆశ్రయించినవారికి కించిత్తైనా శ్రమ ఉండదు.

గురువు సముఖంలో గూఢార్థాలు వాటంతట అవే వెల్లడి అవుతాయి. 22. ఈ ఆత్మజ్ఞాన శాస్త్రం జనన మరణాలను ఛేదించే శస్త్రం. నిరభిమానులు నిస్సంగులు మాత్రమే దీనిని వ్యాఖ్యానించగల సమర్థులు. 23. అట్టివారిని ఆశ్రయిస్తే అర్థాలు క్షణంలో బోధపడతాయి. బుద్ధి యొక్క ప్రతిబంధకం తొలగిపోయి గూఢార్థాలు విశదమవుతాయి. 24. ఈశావాస్యోపనిషత్తును మరాఠీ భాషలో అనువదించడంలో దాసగణుకు ఇదే కష్టం కలిగినా, సాయినాథుని అనుగ్రహంతో అది తొలగిపోయింది. 25. అతని సంస్కృత భాషాజ్ఞానం స్వల్పమే అయినప్పటికీ ఆచార్యవిద్యారణ్యస్వామి మరియు సాయిబాబా పాదాలకు వందనం చేసి ఓవీ రచనను మొదలు పెట్టాడు. 26. దాసగణు యొక్క పాలధారవాణికి, సాయినాథుని అనుగ్రహమనే పంచదార జోడైంది. అందులోని మాధుర్యాన్ని శ్రోతలు ఒక క్షణం స్వీకరించాలి. 27. ఈశావాస్య భావార్థ బోధినిలో అంతర్గతంగా ఉన్న మర్మాలను తెలుసుకోవాలంటే మూలగ్రంథాన్ని అధ్యయనం చేయాలి. ఈ కథను చెప్పటంలో ఉద్దేశం వేరు. ఈ కథను వినండి. 28. తమ భక్తులు గ్రంథాలను అధ్యయనం చేస్తున్నప్పుడు బోధపడని విషయాలను సాయిమహారాజు ఏమీ మాట్లాడకుండానే ఎలా బోధపరచేవారో గమనించండి. 29. ఈ కథలోని ఉద్దేశం ఇదే. దీని సారాంశాన్ని శ్రోతలకు విదితం చేయాలని నా కోరిక. మరి శ్రద్ధగా వింటారు కదూ! 30. దాసగణు ఛందోబద్ధంగా ఓవీలలో ఈశావాస్యోపనిషత్తుకు టీకా వ్రాశాడు. విద్వజ్జనులు దానిని ఆమోదించి అతనిని గౌరవించారు. అతని మనోభీష్టం నెరవేరింది. కాని అతనికి ఒక సందేహం ఉండిపోయింది. 31. దానిని అతడు పండితుల ఎదుట ఉంచాడు. ఘనంగా విస్తారమైన చర్చలు జరిగాయి. కాని దానిని ఎవరూ సంతృప్తికరంగా తీర్చలేక పోయారు. 32. ఇంతలో ఏదో కారణంగా దాసగణుకు శిరిడీకి వెళ్లటం తటస్థించి అతని సంశయ నివారణం సహజంగా జరిగింది. 33. దాసగణు సాయి

దర్శనానికి మసీదుకు వెళ్లి శ్రీవారి చరణాలపై మస్తకాన్నించి, సాష్టాంగ నమస్కారం చేసి సంతుష్టుడయ్యాడు. 34.సత్పురుషుల అనుగ్రహం, అవలోకనం వారి నోటి నుండి వెలువడే మధుర వచనాలు వారి మందహాసవదనం భక్తులకు శుభప్రదం. 35. సత్పురుషుని దర్శన మాత్రంతో సకల దోషాలు క్షాళనమవుతాయి. అట్టివారి సన్నిధానంలో ఎల్లప్పుడూ ఉండగలిగిన వారి పుణ్యాన్ని ఎంతని వర్ణించగలను? 36.'ఏం గణూ! ఎక్కడినుండి రాక? అంతా కుశలమేనా? మనసు ప్రసన్నంగానే ఉంది కదా' అని బాబా దాసగణుని ప్రశ్నించారు. 37. మీ అనుగ్రహ ఛత్రం ఉండగా నేనెందుకోసం దుఃఖించాలి? బాగా ఆనందంగా ఉన్నాను అని జవాబిచ్చాడు. 38.'మీకంతా తెలుసు. అయినా లోకాచారంగా అడుగుతున్నారు. మీరు క్షేమ సమాచారాలను ఎందుకు అడుగుతున్నదీ నాకు తెలుసు. 39. ఒక కార్యాన్ని నాతో స్వయం ఆరంభింప చేసి అది రంగురూపాలతో ఒక దశకు వచ్చాక, మధ్యలో దానిని ఎవరూ పరిష్కరించలేని సమస్యను తెచ్చి పెడతారు' అని చెప్పాడు. 40. అలా ఆ ఇద్దరూ పరస్పరం ముచ్చటించుకుంటుండగా దాసగణు బాబా చరణ సంవాహన చేస్తూ, ఈశావాస్యభావార్థబోధిని గురించి అడిగాడు. 41.'బాబా! ఈశావాస్య భావార్థ బోధినిని రచిస్తుంటే నా మనసులో ఏవో సందేహాలు కలిగి కలం ఆగిపోయింది. వానిని విడమర్చి చెప్పండి, 42. అని జరిగినదంతా బాబా చరణాల వద్ద మొర పెట్టుకుని తన సంశయాలు తీరటం కష్టమని తెలియ చేశాడు. 43.'సాయినాథా! ఈశావాస్య ఉపనిషత్ కథ వ్రాయటంలో, నా గ్రంథ పరిశ్రమ వృథాయే అని మీకు బాగా తెలుసు. 44. నా సందేహం తీరకపోతే గ్రంథం సరిగ్గా అర్థంకాదు' అని విన్నవించుకోగా సాయి మహారాజు అతనిని ఆశీర్వదించి నీవు నిశ్చింతగా ఉండు 45. ఇందులో కఠినమైనది ఏముంది? నీవు ఎక్కడినుంచి వచ్చావో అక్కడికి మరలా వెళ్లినప్పుడు కాకా పనిమనిషి నీ సందేహాన్ని తీరుస్తుంది' అని చెప్పారు. 46. కాకా అంటే భావూసాహేబు

దీక్షితు. బాబాకు ప్రేమమయ భక్తుడు. కాయావాచామనసా ఎల్లప్పుడూ గురుసేవలో ఉండేవాడు.47.ప్రసిద్ధి చెందిన బొంబాయి పట్టణానికి కొంతదూరంలో పార్లే అన్న ఊళ్ళో ఈ హరి ఉంటాడు. 48.అతని అసలు పేరు హరి. అది అమ్మానాన్నా పెట్టిన పేరు. జనులు అతన్ని బావూసాహేబని పిలిచినా, బాబావద్ద అతనికి మరో మూడో పేరు. 49.బాబా కాకామహాజనిని బడేకాకా అని, నిమోంకరుని ముసలికాకా అని, భావుసాహెబును కుంటికాకా లేదా బొంబాయి కాకా అని కూడా పిలిచేవారు.50.తల్లితండ్రి ఒకపేరు పెడతారు. రాశిని బట్టి మరోపేరుంటుంది. ముద్దుగా మరో పేరుతో పిలుస్తుంటారు.ఇలా అనేకరకాల పేర్లు.51. సాయిమహారాజు విచిత్రమైన పేర్లు పెట్టేవారు. ఆ పేర్లతోనే ఎప్పుడూ వారు చలామణి అయ్యేవారు. వానిని భక్తులు ప్రేమగా బిరుదులవలె తలచేవారు.52.ఒకసారి భిక్షు, ఒక్కోసారి కాకా అంటూ బాబా వేసిన ముద్రతోనే దీక్షితు శిరిడీలో కాకా అని ప్రసిద్ధుడయ్యాడు.53.కాకా పనిమనిషి సంశయాన్ని ఎలా తీర్చగలదా అని దాసగణుకు మరియు అందరికీ కూడా ఆశ్చర్యం కలిగింది. 54.పనిమనిషి పనిమనిషే కదా. ఆమెకు అంత శాస్త్ర జ్ఞానం ఉంటుందా? ఏం వింత? ఇదంతా విచిత్రంగా ఉంది. 55.వేదశ్రుతి యొక్క వ్యుత్పత్తి జ్ఞానం ఎక్కడ? పనిపిల్ల జ్ఞానం ఎక్కడ?సాయి మహారాజు పరిహాసం చేశారని జనులు అనుకున్నారు. 56.బాబా కేవలం వినోదానికే అలా అన్నారని అందరికీ అనిపించింది. కాని బాబా వినోదంగా చెప్పినా అది సత్యమే అవుతుందని దాసగణుకు అనిపించింది.57.బాబా అన్నమాటలు విని అవి ఊరికే పైపైకి అన్నవి అని అందరికి అనిపించింది. కాని దాసగణుకు అవి సత్యమని తెలుసు.58.వారి మాటలలో ఏ లీల ఉందో? చూడాలని భక్తులు ఆతుర పడ్డారు.59.అది వినోదానికి పలికిన వాణికావచ్చు కాకనూ పోవచ్చు కాని అది ఏ కారణం లేకుండా ఎన్నటికీ ఉండదు. బాబా పలికిన ఒక్కొక్క

అక్షరం లోను అర్థం అనే నిధి ఉంటుంది. 60.వారు తమనోటితో చెప్పినవి ఏవైనా అవి ఒట్టి మాటలు కావు. అవి బ్రహ్మలిఖితాలు. ఒక్క అక్షరమైనా వృథా కాకుండా సమయానికి సరిగ్గా కార్యాన్ని సాధిస్తాయి.61 అని దాసగణుకు బాగా దృఢనమ్మకం. వారివారి భావాన్ని బట్టి, విశ్వాసాన్ని బట్టి ఫలితం కలుగుతుంది.62.భావన ఎలా ఉంటే ఫలితం అలా ఉంటుంది. విశ్వాసం ఎంతగా ఉంటే బలం కూడా అంతగా ఉంటుంది. అంతఃకరణం ఎంత ప్రేమమయంగా ఉంటే, వారి జ్ఞానం కూడా అంత నిర్మలంగా ఉంటుంది.63.బాబా జ్ఞానులకు శిరోమణి. వారి వాణి అసత్యం కాదు. వారు తమ భక్తుల కోరికలను నెరనేరుస్తానని ప్రతిజ్ఞ బూనారు.64.గురువచనాలు అసత్యం కావు.ఈ కథను బాగా మనసుపెట్టి వినండి. భవ భయ బాధలన్నీ హరించుకునిపోయి, సాధనా మార్గంలో ప్రవేశిస్తారు.65.దాసగణు పార్లేకు చేరుకుని కాకా సాహేబు దీక్షితు ఇంటికి వెళ్ళాడు.కాకా యొక్క పనిమనిషి తన కార్యంలో ఎలా సహకరిస్తుందో చూడాలని అతనికి ఉత్సుకతగా ఉంది.66.మరునాడు ఉదయం దాసగణు ఇంకా శయ్యపైన సుఖమైన నిద్రలో ఆనందంతో ఉండగా ఒక విశేషం జరిగింది.67.ఎవరో ఒకరైతు బిడ్డ మంజుల స్వరంతో గానం చేస్తూ ఉంది.ఆ స్వరంలోని మాధుర్యం దాసగణు హృదయంలోనికి చొచ్చుకొని పోయింది.68.దీర్ఘంగా ఆలాపయుక్తంగా పాడిన ఆ పాటలోని చక్కటి పదాల కూర్పును విని అతని మనసు తల్లీన మవటంతో అతడు మరింత శ్రద్ధగావినసాగాడు.69.శబ్దానికి మెలకువ కలిగిన వెంటనే పాటలోని అర్థాన్ని శ్రద్ధగా వినేసరికి అతని మనసు ప్రసన్నమైంది.70.చక్కటి స్వరంతో ఇంత శ్రావ్యంగా పాడే ఈ అమ్మాయి ఎవరై ఉంటుంది? ఈశావాస్యోపనిషత్తులోని చిక్కు సమస్యను తీర్చేది ఈ అమ్మాయేనా? 71.బాబా చెప్పిన పనిపిల్ల ఈమేనా?సంస్కారంలేని వాణి నుండివేద శ్రుతికి అర్థాలు తెలియ చేసినపిల్ల ఎవరో చూడాలని అనుకుని.72.బయటికి

వెళ్ళి చూడగా, నిజంగానే ఒక రైతు బిడ్డ కాకా ఇంట్లో మోరీ వద్ద అంట్లగిన్నెలు తోముతూంది.73.వాకబు చేయగా ఆ పిల్ల దీక్షితు ఇంట్లో నామ్య అనే నౌకరుచెల్లెలు అన్న విషయం తెలిసింది. 74. ఈమే కాకా పనిమనిషి. ఈమె గానం ద్వారానే దాసగణు సంశయం తొలగింది. ఎనుబోతు నోటి నుండి వేదపఠనాన్ని చేయించగల సత్పురుషులు ఏం చేయలేరు?75.అలా ఆ పిల్ల యొక్క గానంతో దాసగణు మనసుకు తృప్తి కలిగింది. బాబా పరిహాసం లోని మహిమ అందరికీ తెలిసి వచ్చింది.76.దాసగణు కాకా ఇంట్లో పూజ గదిలో దేవుని పూజకు కూర్చుని ఉండగా ఈ పాటను విన్నాడని కొందరంటారు.77.ఏమైనా కాని తాత్పర్యం ఒక్కటే.సాయి మహారాజు తమ భక్తులకు అనేక మిషలతో ఎలాంటి శిక్షణను ఇచ్చేవారో అవలోకించండి. 78.'మీ మీ ప్రదేశాలలో కూర్చుని నన్ను అడగండి. ఊరికే అరణ్యాలలోనో లేక ఎక్కడెక్కడో వ్యర్థంగా తిరగటమెందుకు? మీ జిజ్ఞాసను నేను తీర్చుతాను. నాపై విశ్వాసముంచండి.79.నేను అన్ని ప్రదేశాలలో వ్యాపించి ఉన్నాను.నేను లేని ఖాళీ చోటులేదు. భక్తుల భావాన్నునుసరించి ఎక్కడైనా సరే ఎలా అయినా ప్రకటమవుతాను' అని చెప్పేవారు. 80.ఎనిమిది ఏళ్ల వయసుగల పనిపిల్ల చిరిగి పోయిన గుడ్డముక్కను నడుముకు చుట్టుకుంది. అయినా నారింజరంగు చీర అందాన్ని వర్ణిస్తూ చక్కని స్వరంతో పాటపాడ సాగింది.81.ఆ జరీ చీర ఎంత గొప్పగా ఉంది?చీర అంచు ఎంత అందంగా ఉంది? దాని కొంగు ఎంత ఆకర్షణీయంగా ఉంది? అని పాడటంలో ఆ పిల్ల లీనమై పోయింది.82.కడుపు నిండా తినటానికి తిండిలేదు. ఒంటి నిండా కప్పుకోవటానికి పాత బట్టకూడా లేదు. అయినా ఎవరిదో నారింజరంగు చీరను వర్ణిస్తూ ఆ పిల్ల సంతోషంగా కనిపించింది.83.ఆ పిల్ల యొక్క దైన్యస్థితిని, ఆమె మనసులోని ఆనందాన్ని చూచి దాసగణుకు జాలి కలిగి మోరేశ్వరునితో ఏం చెప్పాడంటే .84.ఆ పిల్లకు ఒంటి నిండా బట్టలేదు. ఒక చీర ఆమె కివ్వు నీ సేవకు

పరమేశ్వరుడు ప్రసన్నుడౌతాడు. నీకు పుణ్యం కూడా వస్తుంది' 85.మోరేశ్వరుడు అసలే దయాహృదయుడు. ఆ పైన దాసగణుని విన్నపం. అందమైన చీరను కొని సంతోషంగా ఆ పిల్లకు అందచేశాడు.86. రోజూ సద్ది అన్నంతినే వారికి పంచభక్ష్యాలు లభించినట్లుగా ఆ చీరను చూచి ఆ పిల్ల చాలా సంతోషించింది.87.మరునాడు ఆ చీరను కట్టుకుని గిరగిరా తిరుగుతూ ఆనందంగా ఆడుకుంది. ఆమె ఇతర పిల్లల కంటె గొప్పగా కనిపించింది. ఆ చీరపై ఎంత ప్రేమ. 88.ఆమె మరునాడు కొత్త చీరను దాచుకొని మునుపటివలె చింకి గుడ్డను చుట్టుకుంది. అయినా అసంతృప్తిగా అగుపించలేదు.89. క్రొత్తచీర కట్టుకోలేదు. అయినా భావన మారటం వలన మునుపటి ఆమె దైన్యస్థితి తొలగిపోయినట్లు దాసగణుకు అనిపించింది.90.ఆ పిల్ల క్రొత్తచీరను ఇంట్లో దాచుకుని చింకి గుడ్డను కట్టుకుని వచ్చినా, ఆమె మనసులో క్రొత్తచీర కట్టుకోలేదన్న బాధలేదు, లోటులేదు.91.పేదరికం వలన పాత బట్టలు క ట్టుకున్నా, బాగా ఉన్నప్పుడు కూడా అట్లేచేయటం. దీనిని పేదరికం గౌరవంగా తిరగటం అని అంటారు. మనసులోని భావాన్ని బట్టి సుఖదుఃఖాలు. 92.దాసగణు యొక్క సమస్య ఈ విధంగా తీరగా, అతనికి ఈశావాస్యోపనిషత్తు యొక్క సారాంశం తెలిసి దాని అర్థం వెంటనే బోధపడింది. 93.ఈ బ్రహ్మాండమంతా పరమేశ్వరునిచే వ్యాపించబడి ఉన్నప్పుడు, మరి అతడు లేని ఖాళీ స్థలం ఉన్నది అని ఎవరనుకుంటారు?94.పరబ్రహ్మపూర్ణం. ఈ జగత్తుకూడా పూర్ణం. పూర్ణబ్రహ్మ నుండి పూర్ణ జగత్తు ఉద్భవించింది. పూర్ణం నుండి పూర్ణం తీసివేస్తే, పూర్ణమే మిగులుతుంది.95.పనిపిల్ల యొక్క పేదరికం ఈశ్వరుని అంశం. చింకి చీర కూడా ఈశ్వరుని అంశము. దాత దానం దేయం వీని అన్నింటి లోనూ ఒకే ఈశ్వరుడు నిండి ఉన్నాడు. 96.'నేను నాది' అన్న భావాన్ని పారద్రోలి ఎప్పుడూ నిరభిమానంగా ఉంటూ దేనినీ

అభిలషించకుండా సుఖాలను త్యాగ పూర్వకంగా అనుభవించాలి.97. ఇటువంటి బాబా యొక్క అమోఘమైన వాణి అనేకులకు అనుభవమైంది. బాబా శరీరమున్నంతవరకు శిరిడీ విడిచి వెళ్లకున్నా, వారు జనుల మధ్య గాని లేక నిర్జన ప్రదేశాలలోనో ప్రకటమవుతారు.98. ఒకరికి మచ్చిందర్ కొండపైన మరొకరికి ఎక్కడో ఏదో పట్టణంలో కోల్హాపుర్ లోనో, షోలాపూర్‌లోనో, రామేశ్వరంలోనో వారి ఇచ్ఛానుసారం ప్రకటమవుతారు.99. ఒకరికి పైకి కనిపించే రూపంలో మరొకరికి జాగ్రతావస్థలోనో, స్వప్నావస్థలోనో దర్శనమిచ్చి రాత్రింబవళ్లు భక్తుల కోరికలను తీర్చుతారు. 100. ఇటువంటి అనుభవాలు ఒకటి రెండు కావు ఎన్నని వర్ణించను? వారు నివసించేది శిరిడీలోనే అయినా వారు ఎవరికీ తెలియకుండా ఎక్కడికైనా వెళ్లగలరు.101. ఈ పిల్ల ఎవరు? ఎవరి బిడ్డ? పేదరికంలో ఉన్న పనిమనిషి, ఆమె నోటి నుండి సహజంగా నారింజరంగు చీరపై గానం వచ్చింది.102. ఏదో సందేహం కలిగి బాబాను ప్రశ్నించటం, ఆ సందేహాన్ని కాకా ఇంట్లోని పనిమనిషి తీర్చటం ఇదంతా మాయా రచన కాదూ!103. కాకా ఇంట్లో ఒక పని మనిషి ఉంటుందని ఆమె భవిష్యత్తులో పాటపాడి శ్రుతి అర్థాన్ని బోధిస్తుందని బాబాకు ముందుగానే ఎలా తెలుసు?104. కాని అలా జరిగింది మాత్రం వాస్తవం. దాసగణుకు ఆశ్చర్యం కలిగింది. అతని సందేహం తీరి ఈశావాస్యోపనిషత్తు బాగా బోధ పడింది.105. అసలు ఈ గొడవంతా ఎందుకు? బాబా స్వయంగా తమ నోటితో ఆ సందేహాన్ని అక్కడే తీర్చేయవచ్చు కదా! అని శ్రోతలకు సందేహం కలుగుతుంది.106. నిజమే, అలా అక్కడే చేయవచ్చు కాని ఈశావాస్యోపనిషత్తులోని మహిమను ఎలా తెలుసు కుంటారు? పరమేశ్వరుడు ఆ పిల్లలో కూడా వ్యాపించి ఉన్నాడని బాబా తెలియ చేశారు.107. ఉపనిషత్తులన్నిటి ధ్యేయం ఆత్మయొక్క యదార్థ జ్ఞానాన్ని నిరూపించటం. ఇదే మోక్ష ప్రాప్తి కొఱకు పాటించాల్సిన నియమాల వివరణ. గీతార్థ ప్రవచనం కూడా ఇదే.

108. ప్రాణులు వేరువేరుగా ఉన్నా, ఆత్మ అభిన్నం. ఆత్మకు కర్తృత్వ భోక్తృత్వాలు లేవు. ఆత్మ ఎప్పుడూ పవిత్రం. ఆత్మకు కర్మాచరణ లేదు. ఆత్మకు పుణ్యపాపాలు ఉండవు.109. నేను ఉచ్చమైన బ్రాహ్మణ జాతీయుణ్ణి, ఇతరులు నాకంటే నీచ కులస్తులు అన్న భేదభావమున్నంతవరకు కర్మాచరణ అవసరం.110. నేను ఏ ఆకారం లేకుండా అంతటా ఒకేలా వ్యాపించి ఉన్న ఆత్మను, నాకంటే వేరే ఎవరూ లేరు, అన్నింటిలో నేనే వ్యాపించి ఉన్నాను అని తెలుసుకోవటం ఆత్మజ్ఞానం. 111. పూర్ణ బ్రహ్మ స్వరూపం నుండి విడిపోయిన జీవాత్మ మరల ఏవిధంగా నైనా మునుపటివలెనే ఆ పరమాత్మ స్వరూపాన్ని పొందటమే ధ్యేయంగా ఉండాలి.112. శ్రుతి స్మృతి మరియు వేదాంతం అన్నింటి సిద్ధాంతం ఇదే. చివరకు సాధించవలసింది నిశ్చయంగా ఇదే. విడిపోయిన జీవాత్మకు అచ్యుతపద ప్రాప్తి.113. 'సమం సర్వేషు భూతేషు' ఇలాంటి విశిష్టమైన స్థితి ప్రాప్తించనంతవరకు జీవాత్మ పరమాత్మ కాలేదు. ఆత్మజ్ఞానం కలుగదు. 114. విహిత కర్మల ద్వారా చిత్తం పరిశుద్ధమైతే అభేద జ్ఞానం కలుగుతుంది. శోకమోహాదులు తొలగి ఆత్మ జ్ఞానం ప్రకటమవుతుంది.115. ముల్లోకాలలోని చరాచరాలన్నింటిలో వ్యాపించి ఉన్న పరమేశ్వరుడు నిష్క్రియ నిష్కల పరాత్పరుడు, అశరీరుడు. ఎల్లప్పుడూ ఉండే ఆత్మ.116. నామరూపాత్మకంగా ఉన్న ఈవిశ్వంలో లోపలా బయటా వ్యాపించి ఉన్న ఆ పరమేశ్వరుడు. 'తానే నేనుగా' నిర్విశేషమైన రూపంలో నిండి ఉన్నాడు.117. వాస్తవానికి నిరాకార ఆత్మ మాయాగుణం వల్ల సాకారంగా భాసిస్తుంది. ఈ ప్రపంచం కోరికలున్న వారికే గాని కోరికలు లేనివారికి నిస్సారంగా కనిపిస్తుంది.118. చేతనాచేతనమైన ఈ భూతభౌతిక జగత్తులో ఒక్క పరమేశ్వరుడే గాని రెండవవారెవరూ లేరని నిస్సందేహంగా నిర్ధారణ చేసుకోవాలి.119. జగత్తు గురించిన జ్ఞానం మనసుకు నచ్చకపోతే, ధనం బంగారం మొదలగు వానిని అభిలషించకూడదు.120. ఇది కూడా వీలుకాకపోతే కర్మలు చేయటమే మనపని

అని తెలుసుకుని నూరేళ్లూ జీవితాంతం కర్మలనే చేస్తుండాలి.121.ఆ కర్మలైనా తమతమ వర్ణాలకు ఆశ్రమాలకు ఉచితమైన కర్మలను శాస్త్రాలలో చెప్పిన రీతిగా, అనుష్ఠాన సహితంగా అగ్నిహోత్రాది నిత్య విహితకర్మలను ఆచరిస్తే అంతఃకరణం పరిశుద్ధమౌతుంది.122. చిత్తశుద్ధికి ఇది ఒక మార్గం.రెండవది సర్వసంగ పరిత్యాగం. ఈ జ్ఞాన యోగాన్ని ఆశ్రయించక పోతే కేవలం కర్మలనే అనుభవించవలసి వస్తుంది.123.ఎవరికి ఏ అర్హత ఉన్నదో తెలుసుకోగలిగిన వారు అందరికి బ్రహ్మవిద్యను, ఉపనిషత్తుల జ్ఞానాన్ని ఇవ్వరు.మనసులో అభేదభావం కలగనంతవరకు ఉపనిషత్తుల జ్ఞానం పదాలవరకే పరిమితం.124.అయినా అటువంటి శాబ్దిక జ్ఞానం కూడా అవసరం. కారణం జిజ్ఞాసువులు ముందు దానినే అడుగుతారు. అందువలననే బాబా పనిపిల్ల చెబుతుందని దాసగణుని పార్లెకి పంపారు.125.బాబా స్వయంగా ఈ బోధను చేసే వారే కాని తరువాతి సంఘటన సంభవించేది కాదు.'ఏకమేవాద్వితీయం' అని వారు చెప్పదలచిన లీల అతనికి అర్థమయ్యేది కాదు.126.కాకా యొక్క ఆ పనిమనిషి నేనుకాక మరెవరు?ఆమె రూపంలో నేనే ఆ జ్ఞానాన్ని బోధించాను అని 'ఈశావాస్య' అన్న దానికి అర్థాన్ని వివరించారు. 127.పరమేశ్వరానుగ్రహం లేశమైనా లేకపోయినా ఆచార్యుల యొక్క విశేషమైన అనుగ్రహం లేకపోయినా ఆత్మజ్ఞానానికి ప్రవేశం లేదు. సిద్ధుల ఉపదేశమే అవసరం.128.ఆత్మను ప్రతిపాదించేవి మరియు 'సర్వత్ర నేనే, నేను కాక ఎక్కడా ఎవరూ లేరు' అని తెలిపే శాస్త్రాలను మాత్రమే శ్రవణం చేయాలి.129.అలా ఆత్మ తత్త్వం గురించి వివరంగా తెలిసిన తరువాత ఎవరు నేను ఆత్మను,అన్యుణ్ణి కాను అని అభేదానుసంధానం చేస్తారో వారికే ఆత్మ ప్రసన్నమవుతుంది.130.ఈ విధంగా ఆత్మనిరూపణ జరిగితే,ఇట్లే ఆత్మానుసంధానంలో ఉంటే, ఇట్లే ఆత్మతత్వంలో నిశ్చలంగా స్థిరపడి ఉంటే పరమాత్మప్రాప్తి.131.తరువాతి అధ్యాయంలో వినాయక తాకూరు

మొదలగువారి కథలను శ్రద్ధగా శ్రవణం చేస్తే శ్రోతలు పరమార్థ జ్ఞానానికి ఆకర్షితులవుతారు.132.ఆ కథలు కూడా ఇట్లే మధురంగా ఉంటాయి. వానిని వింటే శ్రోతల కోరిక తీరుతుంది. మహా పురుషుల దర్శనాభిలాష తీరుతుంది. 133. సూర్యుడు ఉదయించగానే అంధకారం తొలగిపోయేలా ఈ కథామృతపానంతో మాయ హరించుకుని పోతుంది.134.మాటలకు అందని సాయి యొక్క లీలలను వారు తప్ప ఎవరు చెప్పగలరు? నన్ను ఒక నిమిత్తమాత్రునిగా చేసి వారే తెలియ చేస్తారు.135.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో ఈశావాస్యభావార్థ బోధనం అను ఇరువదియవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత - 21వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయాంతంలో చెప్పిన విధంగా తాకూరాదులకు మహాపురుషుని దర్శనం కలిగిన విషయాన్ని ఏకాగ్ర మనసుతో శ్రవణం చేయండి.1.వక్త చెప్పిన మాటలు చెవిన పడగానే శ్రోతల మనసులు ఆనందంతో ఊగి శరీరం రోమాంచితమవకపోతేఆ మాటల వలన ఏం ప్రయోజనం? అవి వ్యర్థమే.2. ఆశ్రవణంతో శ్రోతలు కరిగిపోకపోతే, బాష్పాలతో వారి కంఠం గద్గదమై నయనాలనుండి ప్రేమానందాశ్రువులు ప్రవహించకపోతే ఆ మాటలు వ్యర్థమే.3.బాబా యొక్క వాణి మనోహరం.వారి ఉపదేశ పద్ధతి అలౌకికం.వారి ప్రతిమాటలోనూ క్రొత్తదనం ఉంటుంది. నేను వారి చరణాలలో మస్తకాన్ని ఉంచుతున్నాను.4.భాగ్యం ఉదయించక పోతే సాధుసత్పురుషులతో కలయిక ఏర్పడదు. వారు ఎంతో సమీపంలో ఉన్నా పాపులకు కనిపించరు.5.ఈ సిద్ధాంతాన్ని నిరూపించటానికి ఏ దేశవిదేశాలకో వెళ్లవలసిన అవసరం లేదు.నేను నా అనుభవాన్ని శ్రోతలకు చెప్పుతాను.6.పీరు మొలానా అన్న ప్రసిద్ధుడైన సిద్ధుడు బాంద్రా పట్టణంలో ఉండేవాడు. హిందువులు పారసీకులు ఇతర మతాల పండితులు కూడా అతని దర్శనానికి వచ్చేవారు.7.అతనివద్ద ఇనూస్ అనే సేవకుడుండేవాడు. నేను ఆ పట్టణంలో న్యాయాధీశునిగా ఉండగా అతడు నన్ను పీరుమొలానా దర్శనానికి రమ్మని ఎంతగానో బలవంత పెట్టేవాడు.8.అక్కడికి గుంపులు గుంపులుగా వేలాది జనం వస్తుంటారు. ఆ జనంలోకి వెళ్లి మన గౌరవాన్ని ఎందుకు పోగొట్టుకోవాలి. 9.అన్న

ఆలోచనలతో నేను దర్శనానికి ఎప్పుడూ వెళ్లలేదు. మన నీడకే మనం భయపడినట్లుగా దురదృష్టం అడ్డుపడింది. 10.అలా అనేక సంవత్సరాలు గడిచిపోయినవి.నాకు అక్కడి నుండి బదిలీ అయింది. తరువాత శుభసమయం వచ్చి,శిరిడీతో శాశ్వత సంబంధం ఏర్పడింది.11.తాత్పర్యం, సత్పురుషులతో సమాగమం అభాగ్యులకు లభించదు.ఈశ్వరుని కృప ఉంటేనే అది సుగమం. లేకపోతే ఆ యోగం దుర్లభం. 12. ఈ విషయంలోని మధుర కథను శ్రోతలు ఇప్పుడు శ్రద్ధగా వినండి. ఈ సత్పురుషుల వ్యవస్థ అనాది కాలం నుండి ఎలా గుహ్యంగా ఉందో గమనించండి.13.వారు సమయానుకూలంగా అవసరాల కనుగుణంగా వారికి నచ్చిన ప్రదేశాలలో, తమ కార్యాలను సాధించుకోవటానికి అవతరిస్తారు.వారు పరస్పరం అభిన్నులు. 14.దేశం, కాలం, వస్తువు వేరుగా ఉన్నా ఒకరి మనోగతాలను మరొకరు సంపూర్ణంగా తెలుసుకుంటారు. అలా లోపల వారంతా ఒక్కటే. 15.ఒక సార్వభౌముడు రాజ్యంలో అక్కడక్కడా స్థావరాలను ఏర్పరచి వానిలో అధికారులను నియమించి సంక్షేమాన్ని గమనించేలా,16. అట్లే స్వానంద సామ్రాట్టు అక్కడక్కడా ప్రకటమై,తనరాజ్య శకటాన్ని కనబడని పగ్గాలతో గుప్తంగా నడిపిస్తాడు.17.ఒకసారి ఒక ఆంగ్ల విద్యావిభూషితుడు బి. ఏ. పట్టభద్రుడు క్రమక్రమంగా అభివృద్ధి చెంది పేరుపొందిన అధికారి అయ్యాడు.18.తరువాత మామలతుదారై ఆ పైన ఎదుగుతూ,ఎదుగుతూ ప్రాంతాధికారి అయ్యాడు. అప్పుడు దైవవశాత్తు అతనికి సాయిబాబా సాన్నిధ్యం లభించింది.19.ఈ ఉద్యోగాలు పదవులు గౌరవ మర్యాదలతో కూడుకున్నవి. మరియు దూరపు కొండలవలే బాగానే కనిపిస్తాయి. కాని దగ్గరగా వెళ్ళితే ఏవేవో చెట్లతో నిండి ఉంటాయి. 20.పూర్వపు మంచి రోజులు పోయాయి.అప్పుడు అధికారంలో ఉన్న పదవులను కోరుకునేవారు. ప్రజలు కూడా అధికారులను గౌరవించేవారు. అలా వారు పరస్పరం ఆనందంగా ఉండేవారు.21.ఇప్పటి పరిస్థితి

అడగకండి. సుఖంగా ఉద్యోగం చేసుకునే కాలం పోయింది. ఇప్పుడు బరువు బాధ్యతలు బాగా పెరిగాయి. డబ్బుకు కొరత లేకున్నా శ్రమ తప్పదు. 22. పూర్వం మామలత్‌దారును ప్రాంతీయాధికారులను గౌరవించేవారు. బాగా శ్రమపడి ఉద్యోగం చేసినా పదవులకు పూర్వం ఉన్న ఆ వైభవం ఇప్పుడు కనిపించటం లేదు. 23. చాలా డబ్బు ఖర్చుపెట్టి బాగా విద్య అభ్యసించినా అధికార పదవి రాదు. 24. మొదట బి.ఎ. కావాలి. తరువాత నెలకు ముప్పై రూపాయల జీతంపై గుమాస్తా అవుతాడు. ఇది వారి పరిస్థితి. 25. తరువాత కొండలపైకి వెళ్లి భూమికొలతలు కొలిచేవారి మధ్యన ఉండి పని నేర్చుకోవాలి. పరీక్ష పాసుకావాలి. 26. అటుపైన ఎవరైనా ఉద్యోగస్తులు స్వర్గస్తులౌతే వారి చోటు ఖాళీ అయినప్పుడు ఆ పదవి వస్తుంది. 27. ఇక ఈ ఊకదంపుడు చాలిస్తా, ఊరికే వ్యర్థంగా వాగటమెందుకు. ఒక గృహస్థునికి సాయిబాబాతో ఎలా కలయిక ఏర్పడిందో వినండి. 28. బెలగాంవద్ద వడగాం అనే గ్రామానికి సర్వేయర్లు వచ్చి మకాం వేశారు. 29. ఆ గ్రామంలో ఉన్న ఒక మహాత్ముని దర్శనానికి వెళ్లి అతని చరణాలపై శిరసునుంచి అతని ఆశీర్వాదాన్ని అనుగ్రహాన్ని పొందారు. 30. ఆ మహాత్ముని చేతిలో నిశ్చల దాసు రచించిన 'విచారసాగర్' అన్న గ్రంథముంది. అప్పుడు అతడు దానిని చదువుతున్నాడు. 31. కొంత సమయమయ్యాక సర్వేయరు వెళ్లుతానని చెప్పి బయలుదేరుతుండగా ఆ సాధువు సంతోషంతో ఆ గృహస్థునితో ఏం చెప్పాడో వినండి. 32. 'సరే ఇప్పుడు వెళ్లు. కాని ఈ గ్రంథాన్ని పఠించు. దానితో నీ మనోభీష్టం తీరుతుంది. బాగా గుర్తుంచుకో, 33. నీవు తరువాత నీ పని మీద ఉత్తర దిశగా వెళ్లినప్పుడు నీ మహా భాగ్యం వలన దారిలో ఒక మహా పురుషుని దర్శనం కలుగుతుంది. 34. తరువాతి మార్గాన్ని నీకు వారు చూపిస్తారు. నీమనసుకు స్థిరత్వాన్ని కలిగిస్తారు. నీకు ఉపదేశం చేసి ఆత్మ జ్ఞానాన్ని కలిగిస్తారు' అని చెప్పాడు. 35. ఆ గృహస్థునికి అక్కడి పని ముగిసి అక్కడి

నుండి జున్నారుకు బదిలీ అయింది. నాణేఘాట్ అను కొండను ఎక్కవలసిన కష్టం ఎదురైంది 36. అక్కడి దారి అత్యంత కఠినమైనది. ఎనుబోతుపైన కొండ ఎక్కాలి. ఎనుబోతు ఒక్కటే అక్కడి వాహనం. కనుక ఎక్కటానికి దానినే తీసుకొచ్చారు. 37. పెద్ద అధికారి అయితే గుఱ్ఱపు బండో లేక మోటారో దొరుకుతుంది. కాని అప్పుడు అతనికి ఎనుబోతుతో తన అవసరం తీర్చుకోవలసి వచ్చింది. 38. నడకతో కొండ ఎక్కటం అశక్యం. ఎనుబోతు తప్ప వేరే సదుపాయంలేదు. అదే నాణేఘాట్ కొండ ఎక్కే అపూర్వ వాహనం యొక్క ప్రత్యేకత? 39. అప్పుడు ఆ గృహస్థు ఆలోచించి ఎనుబోతుపైన జీను వేసి దానిని తయారు చేసికొని దానిపై శ్రమపడుతూ కూర్చున్నాడు. 40. సవారి బాగానే ఉన్నా ఎనుబోతువంటి అపూర్వమైన వాహనంపై కొండ ఎక్కటం, ఎగుడుదిగుడు నేల మూలాన కుదుపులకు వెన్ను నొప్పి వచ్చింది. 41. ఆ ప్రయాణం ఎలాగో సాగింది. జున్నార్‌లోని కార్యక్రమం పూర్తయింది. అక్కడి నుండి బదిలీయై మకాం మారింది. 42. అతనికి కల్యాణ్‌కు బదిలీయై నానాచందోర్కరును కలుసుకోవడం సంభవించింది. సాయినాథుని కీర్తిని విని వారిని దర్శించుకోవలెనని బుద్ధి పుట్టింది. 43. ఆ మరునాడే శుభ సమయం వచ్చింది. నానా చందోర్కరు శిరిడీయాత్ర ప్రయాణానికి సిద్ధమై 'నా వెంట నువ్వుకూడా యాత్రకురా. 44. ఉభయులం వెళ్లి బాబా దర్శనం చేసుకుని వారికి ప్రణమిల్లి అక్కడ ఒకటి రెండురోజులుండి తిరిగి కల్యాణ్‌కు వచ్చేద్దాం' అని చెప్పాడు. 45. కాని ఆ రోజు ఠాణా పట్టణంలో సివిలు కోర్టులో ఒక కేసుకు అతడు హాజరు కావలసి ఉండి చందోర్కరు వెంట వెళ్లలేక పోయాడు. 46. కేసు విషయం సమర్థులైన సాయి బాబా చూచుకుంటారు. వారి దర్శనం చేసుకోవాలన్న నీ కోరిక తీరుతుంది అని నానా బలవంత పెట్టాడు. 47. కాని అతని కది నచ్చదు? కేసు తారీఖు తప్పిపోతుందని అతని భయం. నొసట వ్రాసినది తప్పుతుందా? 48. నానా

చందోర్కరు అతనికి పూర్వపు అనుభవాలను తెలియచేసి సాయిదర్శన కాంక్ష మనసులో ఉంటే విఘ్నాలు ప్రక్కకు తొలగిపోతాయని చెప్పాడు. 49.కాని అతనికి విశ్వాసం కలుగలేదు. అతని స్వభావానికి నానా ఏం చేయగలడు? కేసు విషయం ముందు తేల్చుకుని ఆ బాధను వదిలించుకోవాలని. 50.అతడు థాణాకు వెళ్లాడు. చందోర్కరు శిరిడీకి బయలుదేరి బాబా దర్శనం చేసుకుని వెనుకకు తిరిగి వచ్చేశాడు. ఇక్కడ థాణాలో జరిగిన వింత. 51.సమయానికి సరిగ్గా ఆ వ్యక్తి కోర్టుకు హాజరు అయినా కేసు మరో తేదీకి వాయిదా పడింది. చందోర్కరుతో వెళ్లే అవకాశం కూడా పోయింది. మనసులో చాలా బాధపడ్డాడు. 52.చందోర్కరు మాటలను విశ్వసిస్తే బాగుండేది. అతడు తన వెంట శిర్డీ తీసుకొని వెళ్లేవాడు. సాయి దర్శనం చేసుకుని శిరిడీలో ప్రశాంతంగా ఉండేవాణ్ణి. 53.దావా వాయిదా పడింది. సాధుసమాగమం కూడా పోయింది అని తలచి తక్షణం శిరిడీ వెళ్లటానికి నిశ్చయించుకున్నాడు. 54.శిరిడీకి వెళ్లాక నానా నాకు అక్కడ కలుస్తాడో లేదో. అతడైతేనే సాయినాథునికి నా గురించి తెలియ చేస్తాడు. అలా అయితే మనసుకు ఆనందం కలుగుతుంది. 55.శిరిడీలో నాకు పరిచితులెవరూ లేరు. అందరికీ నేను అపరిచితుణ్ణి. నానా కలిస్తే బాగుంటుంది, కాని ఆ యోగం ఉన్నట్లులేదు. 56.అని ఆలోచించుకుంటూ రైలుబండిలో కూర్చుని మరునాడు శిరిడీ చేరాడు. కాని నానా అక్కడ లేడు. 57.అతడు బయలుదేరిన రోజే నానా తిరిగి వెళ్లిపోయాడు. దానితో నిరాశ చెందాడు. నిరుత్సాహం చికాకు కలిగాయి. 58. అయితే అతనికి అక్కడ వేరే స్నేహితులు కలిసి సాయిబాబా దర్శనాన్ని కలిగించారు. అతని కోరిక తీరింది. 59.సాయి దర్శనంతో అతని మనసు సాయి చరణాల యందు లగ్నమైంది. సాష్టాంగదండప్రణామం చేయగా అతని శరీరం పులకాంకితమై కళ్లల్లో నుండి ప్రేమాశ్రువులు స్రవించాయి. 60.అలా మనసు స్థిరపడగా త్రికాలజ్ఞుడైన బాబా మందహాస వదనంతో అతనితో ఏమన్నారో వినండి. 61.'కన్నడ

అప్పా చెప్పినట్లుగా, ఎనుబోతుపై కొండ ఎక్కడం లాగా,ఇక్కడ సులభోపాయాలు లేవు.శరీరం అరగతీయక తప్పదు'62.ఈ సంకేతపదాలు చెవిలో పడగానే అతని అంతరంగం సంతోషంతో ఉప్పొంగింది.మహాత్ముడు మునుపు చెప్పిన వచనం నిజమని అనుభవమైంది.63.రెండు చేతులూ జోడించి సాయి పాదాలయందు శిరసునుంచాడు.సాయినాథా!నన్ను కరుణించండి. నేను అనాథను. నన్ను మీ ఒడిలోకి తీసుకొండి.64.మీరే నాకు మహా పురుషులు.నిశ్చలదాసు గ్రంథంలోని ఉపదేశం నాకివాళ బాగా అర్థమైంది.విశిష్టమైన ఆనందాన్ని పొందాను. 65.ఎక్కడి బడగాం, ఎక్కడి శిరిడీ, ఎటువంటి సత్పురుషులైన మహానుభావుల జంట! వారి ఉపదేశాలు క్లుప్తమైన భాషలో ఉన్నా ఎంత స్పష్టంగా ఉన్నాయి.66.'ఈ గ్రంథాన్ని చదువు. ఒక మహా పురుషుని కలుసుకున్నప్పుడు వారు నీకు తరువాతి కర్తవ్యాన్ని ఉపదేశిస్తారు'అని ఒకరు చెప్పారు.67. అదృష్టవశాత్తు ఆ మహాపురుషుణ్ణి కలుసుకున్నాను.ఆయనే తానని ఒకరు చెప్పినట్లు పఠించాను. ఇక రెండవవారు చెప్పినట్లు ఆచరించాలి'68.అతనితో సాయిబాబా'అప్పా చెప్పినది యదార్థం. కాని దానిని ఆచరించినప్పుడు నీ మనోభీష్టం పూర్తిగా తీరుతుంది'అని చెప్పారు.69.వడగాంలో నిశ్చలదాసు రచించిన 'విచారసాగర్' గ్రంథాన్ని పఠించమని,ఆ గ్రంథపారాయణ తరువాత ఆచరణను గూర్చి చెప్పారు.70.ముందు గ్రంథాన్ని శ్రవణం చేసి దానిని మననం చేయాలి.మరల మరల పారాయణ చేస్తూ ఉంటే నిది ధ్యాసకలుగుతుంది.71.చదివినంత మాత్రాన సరిపోదు. చదివిన దానిని ఆ చరణలో పెట్టాలి లేదా బోర్లించిన కుండపై నీరు గుమ్మరించినట్లవుతుంది.72. అనుభవ జ్ఞానం ప్రాప్తించనంతవరకు గ్రంథపఠన వ్యర్థం. బ్రహ్మ సంపన్నులైన గురుకృప లేకుండా పుస్తక జ్ఞానం నిష్ఫలం.73.ఈ విషయంలో భక్తిలోని యథార్థత మరియు పురుషార్థం యొక్క ఆవశ్యకతను తెలియ చేసే ఒక చిన్న కథను శ్రోతలు తమ శ్రేయస్సుకై వినండి. 74.ఒకసారి

అనంతరావుపాటన్‌కర్ అనే పుణె పట్టణ వాసియైన ఒక వ్యక్తి సాయిదర్శనం కలగాలనే ఉద్దేశంతో శిరిడీకి వచ్చాడు. 75. అతడు వేదాంతాన్ని బాగా శ్రవణం చేశాడు. ఉపనిషత్తుల గ్రంథాలను టీకాతో సమూలంగా చదివాడు. కాని అతని మనసు ఎల్లప్పుడూ చంచలంగా ఉండి అతనికి ప్రశాంతి లేకుండా పోయింది.76.సాయి సమర్థుని దర్శనం చేసుకున్న పాటన్‌కర్ కళ్లు తృప్తి చెందాయి. బాబా పాదాలకు అభివందనం చేసి యథాశక్తి పూజ చేశాడు.77.తరువాత చేతులు జోడించి బాబా సముఖంలో కూర్చుని అనంతరావు ప్రేమగా, దీనంగా అడిగాడు.78.'నేను అనేక గ్రంథాలను చదివాను. వేదవేదాంగాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేశాను.శాస్త్రాలను పురాణాలను శ్రవణం చేశాను కాని మనసుకు శాంతి లేదెందుకు.79.చదివినదంతా వ్యర్థమై పోయింది.నాకంటే ఏ చదువూలేని భక్తులు నయం అని ఇప్పుడనిపిస్తోంది.80.గ్రంథావలోకనం వ్యర్థమైంది.శాస్త్ర పరిశీలన వ్యర్థం.సకల పుస్తకాల జ్ఞానం మనసుకు ప్రశాంతత చేకూర్చలేకపోతే వ్యర్థమే కదా!.81.శాస్త్ర ఉత్పత్తిని తర్కించడంలో ఏముంది?మహా వాక్యాలను మరల మరల పఠించడమెందుకు? వీనితో మనసుకు శాంతి లభించకపోతే ఇక బ్రహ్మజ్ఞానం ఎందుకు?. 82.సాయిబాబా దర్శనంతో చింత తొలగిపోతుందని, బాబా వినోదంగా ముచ్చటిస్తూ సన్మార్గాన్ని సహజంగా చూపుతారని ఆనోటా ఆనోటా చెప్పగా విన్నాను.83.అందువలన మహారాజా! తపోరాశీ !మీ పాదాలవద్దకు చేరాను.నామనసుకు ధైర్యం కలిగేలా నన్ను ఆశీర్వదించండి' అని దీనంగా విన్నవించుకున్నాడు. 84.అప్పుడు సాయి మహారాజు వినోద భరితమైన ఒక కథను చెప్పగా అనంతరావు తన జ్ఞానం సఫలమైనట్లు సంతృప్తి చెంది సంతుష్టుడయ్యాడు.85. కొన్ని మాటలతో చెప్పిన పరమార్థసారమైన ఆ కథ చెబుతాను వినండి. వినోదమే అయినా జ్ఞానంతో కూడినది. దానిని ఎవరు అనాదరం చేస్తారు? 86.'ఒకసారి ఒక వ్యాపారి వచ్చాడు. అప్పుడు ఒక గుఱ్ఱం

అతని ఎదుట తొమ్మిదిలద్దెలను వేసింది. 87.వ్యాపారస్తుడు తన కార్యంలో తత్పరుడై కొంగులో లద్దెలన్నిటిని గట్టిగా మూట కట్టుకుని చిత్త ఏకాగ్రతను పొందాడు'అని బాబా చెప్పారు. 88.సాయి సమర్థులు ఎందుకిలా చెప్పారు? దీని అసలు అర్థం ఏమై ఉంటుంది'.వ్యాపారస్తుడు లద్దెలను ఎందుకు పోగు చేసుకున్నాడు?. ఏమీ అర్థం కావటం లేదు. 89.అని అనంతరావు ఆలోచించి,వెళ్లి ఆ సంభాషనంతో కేల్కరుతో చెప్పాడు. 90.అసలు ఆ వ్యాపారి ఎవరు? లద్దెల ప్రయోజనమేమిటి? సంఖ్య తొమ్మిదికి ఏమి కారణం? నాకు వివరంగా చెప్పండి.91.దాదా! ఇందులోని రహస్యం ఏమిటి? అల్ప బుద్ధిగల నాకు ఏం అర్థం కావటం లేదు. బాబా మనసులో ఉన్నదానిని నాకు అర్థమయేలా విశదీకరించి చెప్పు అని అడిగాడు.92.అతనితో దాదా 'నాకు కూడా ఏం అర్థం కావటం లేదు. బాబా మాటలన్నీ ఇల్లే ఉంటాయి .అయినా వారు నాకు స్ఫురింప చేసినట్లుగా నాకు అర్థమైనది చెప్పుతాను. 93.ఆ గుఱ్ఱం ఈశ్వరుని అనుగ్రహం.లద్దెలు నవవిధ భక్తులు. భక్తి ప్రేమ లేకుండా పరమేశ్వరుడు ప్రాప్తించడు,జ్ఞానం లభించదు.94. శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణ, చరణ సేవ, అర్చన, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం ఇవి నవవిధ భక్తులు.95.సంపూర్ణ భక్తితో వీనిలో ఏ ఒక్కరకమైన భక్తి లభించినా, భక్తికి అఱ్ఱులు చాచే శ్రీహరి భక్తుల ఇంట్లోనే ప్రకటమవుతాడు.96.జప తప వ్రతాది యోగ సాధనలు, వేదోపనిషత్తుల అధ్యయనం,ఆధ్యాత్మ జ్ఞానాన్ని గొప్పగావ్యాఖ్యానించటం,ఇవన్నీ భక్తి లేకపోతే వ్యర్థం.97.వేద శాస్త్రవ్యుత్పత్తి జ్ఞానం అవసరం లేదు. గొప్ప జ్ఞాని అన్న గొప్పకీర్తి ప్రతిష్టలూ అక్కరలేదు. భక్తి ప్రేమలేని శుష్క-భజనల యందు ప్రీతిఅవసరంలేదు. ప్రేమతో కూడిన భక్తి అవసరం.98.నీవు స్వయంగా వ్యాపారస్తుడవని భావించి వ్యాపారంలోని భావార్థాన్ని అర్థం చేసుకో.శ్రవణాది భక్తి యొక్క ధ్వజం ఎగురుతుంటే జ్ఞానరాజు ఆనందిస్తాడు.99.గుఱ్ఱం తొమ్మిదిలద్దెలను

వేయగానే వ్యాపారి వానిని తీసుకోవటానికి ఆతురతతో పరుగెత్తాడు. అట్లే నవవిధ భక్తిని మూటకట్టుకుంటే మనసుకు శాంతి కలుగుతుంది.100. అందరిపట్ల సద్భావం కలుగుతుంది. గంభీరత పెరుగుతుంది. అలా కాకపోతే మనసులోని చాంచల్యం తప్పదు అని గురువర్యులు ప్రేమతో తెలియచేశారు' అని చెప్పాడు.101. మరునాడు అనంతరావు సాయి పాదాలకు వందనం చేస్తుండగా బాబా అతనిని 'లడ్డెలను కొంగున కట్టుకున్నావా' అని అడిగారు.102. అప్పుడు అనంతరావు ఈ దీనునిపై మీ అనుగ్రహముంటే వానిని సహజంగా మూటకట్టుకోవటం సాధ్యం. దానిలో ఏం గొప్పతనం ఉంది అని చెప్పాడు.103. నీకు శుభం కలుగుతుండని బాబా అతనిని ఆశీర్వదించారు. అనంతరావుకు సుఖశాంతులు లభించి ఆనందించాడు.104. ఇక మరొక చిన్నకథను శ్రోతలు శ్రద్ధగా సాదరంగా వింటే బాబా యొక్క సర్వజ్ఞత, వారు సన్మార్గంలో ప్రవేశపెట్టే విధానం తెలుస్తాయి.105. ఒకసారి ఒక వకీలు వచ్చి వెంటనే మసీదుకు వెళ్లి సాయినాథుని దర్శనం చేసుకుని, వారి పాదాలకు వందనం చేశాడు.106. తక్షణం దక్షిణను ఇచ్చి వకీలు ఒక ప్రక్కన కూర్చున్నాడు. సాయిబాబా ఎవరితోనో సంభాషిస్తుంటే అతనికి వినాలన్న కోరిక కలిగింది.107. బాబా అతని కేసి చూస్తూ అతనిని ఉద్దేశించి చెప్పిన మాటలు ఆ వకీలు మనసులో గ్రుచ్చుకుని అతనికి అనుతాపాన్ని కలిగించాయి.108. 'జనులు ఎంత మోసగాళ్లు. పాదాలపై పడతారు. దక్షిణను కూడా ఇస్తారు. మనసులో తిడతారు కూడా. ఎంతటి ఆశ్చర్యం?'109. ఆ మాటలను విన్న వకీలు ఊరికే కూర్చునే ఉన్నా మనసులో బాగా అర్థం చేసుకున్నాడు. బాబా మాటలలోని తాత్పర్యం మనసులో బాగా నాటుకుంది.110. తరువాత బసకు వెళ్లినప్పుడు దీక్షితుతో, 'బాబా చెప్పిన మాటలన్నీ అర్థ భరితమైనవి.111. నేనురాగానే నాపై చెణుకు విసిరారు. నిందాహేళనలతో ఎవరి మనసునూ బాధపెట్టరాదని బాబా సూచించారు.112. మా మునసబు ఆరోగ్యం బాగాలేక బాధపడుతూ

శరీరం కుదుటపడాలని సెలవు మీద ఇక్కడికి వచ్చాడు.113. మేము వకీళ్లు కూర్చునే గదిలో ఉండగా ఆ మునసబు గురించిన ప్రస్తావన వచ్చి అనేకరకాల అర్థం పర్థం లేని చర్చ జరిగింది.114.సాయిని ఆశ్రయిస్తే ఔషధాలు లేకుండానే అస్వస్థత పోతుందా, మునసబు పదవిలో ఉన్న వ్యక్తికి ఇలా ప్రవర్తించటం సబబా,115.అని మునసబు గురించి అలా ఆడిపోసుకుంటూ సాయిని అపహాస్యం చేయడం జరిగింది.నేను కూడా అందులో పాల్గొన్నాను. అది అనుచితమని బాబా తెలియ చేశారు.116.అదివారి ఆగ్రహం కాదు. వారి అనుగ్రహం. ఎవరి గురించియైనా చెడుగా వ్యర్థంగా చర్చించుకోకూడదు.హేళన, అపహాస్యం, నింద మొదలగు చెడు ఆలోచనలను త్యజించాలి.117.మరొక విషయం. వందలక్రోసుల దూరంలో ఉన్నా సాయిబాబా అందరి అంతరంగాలను తెలుసుకుంటారని అనుభవమైంది. నిజంగా బాబా ఎంతటి అంతర్ జ్ఞాని!118.మరొక విషయం నిశ్చయమైంది.'పర్వతాల వంటివి ఎన్ని అడ్డం ఉన్నా వారి దృష్టికి ఏవీ అడ్డు తగలవు అని బాగా దృఢమైంది. ఎంతో రహస్యంగా ఉన్నవి కూడా వారికి తేటతెల్లం.'119.అప్పటినుండీ వకీలు ఎవరినిందా చేయకూడదు, ఎవరినీ చెడుగా మాట్లాడకూడదని నిశ్చయించుకుని లెంపలు వేసుకున్నాడు.120.మనం ఎక్కడ ఏం చేస్తున్నా అది సాయి దృష్టిలో పడకుండా ఉండదు అన్న విషయం నిర్ధారణ అయింది. చెడు పనులు చేసే మనసు మారింది.121. మంచి పనులు చేయాలనే బుద్ధి జనించింది.ముందూ వెనుకా సాయి ఉన్నారన్న భావన ఉంటే వారిని ఎవరు మోసగించగలరు?అన్న విషయం నిర్ధారణమైంది.122.ఈ కథ వకీలుకు సంబంధించినదే అయినా ఇది అందఱికీ జ్ఞానం కలిగించేది.123.వకీలుకు, వక్తకు, శ్రోతలకు, సాయి యొక్క భక్తులందరికి కూడా ఇలాంటి జ్ఞానం కలగాలని నేను ప్రార్థిస్తాను.124.సాయి కృపా మేఘం వర్షించగా మనకందరికీ దాహం తీరి తృప్తి కలుగుతుంది. ఇందులో ఏం విశేషం లేదు.125.సాయినాథుని

మహిమ అమోఘం. వారి పరమపావన కథ అగాధం. పరబ్రహ్మావతార మూర్తి అయిన సాయినాథుని చరిత్ర అంతంలేనిది.126.ఇక తరువాతి అధ్యాయంలోని కథను శ్రోతలు శ్రద్ధగా వింటే మీ మనోభీష్టం తీరి మీ మనసుకు స్థిరత్వం కలుగుతుంది.127.భక్తులకు భవిష్యత్తులో సంభవించే కష్టాలు సాయి సమర్థునికి ముందుగానే తెలిసేవి.వారు వానిని వినోదాలతో హాస్యాలతో నవ్వుతూ ఆడుతూ నివారించేవారు.128.భక్తహేమాడ్ సాయికి శరణు జొచ్చి,ఈ కథను సమాప్తి చేస్తున్నాడు. తరువాతి కథానుసంధానం భక్తుల కష్టాల నివారణ.129.సాయి దయా సాగరులు భక్తుల దుర్భర కష్టాలను ముందుగానే తెలుసుకుని సమయానికి సరిగ్గా సూచించి వానిని ఎలా తొలగిస్తారో తెలుసుకొండి. 130. స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ,భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన,శ్రీ సాయి సమర్థసచ్చరితంలో అనుగ్రహకరణమను ఇరువది ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీసాయి సచ్చరిత - 22 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

జయసద్గురు! ఆనంద ఘనా! జ్ఞానస్వరూపా! పరమపావనా! జయజయ భవ భయనివారణా! కలిమల దహనా! పరిపూర్ణా!1. మీరు ఆనందసాగరం. మీలో లేచే అనేక ఆలోచనా తరంగాలు కూడా మీరే అయి మీ భక్తులను అనుగ్రహిస్తారు. 2. మసక చీకటిలో పాముగా కనిపించినది వెలుతురులో త్రాడు. అంధకారాన్ని ప్రకాశాన్ని రెంటినీ ఉత్పన్నం చేసింది మీరే. 3. సర్పమనే భ్రమను కలిగించేది, అది త్రాడు అని తెలిపేది మీరే. భయాన్ని కలిగించేది, దానిని తొలగించేది మీరే. 4. మొదట పూర్తిగా అంధకారమున్నప్పుడు పాము లేదు త్రాడు లేదు. అక్కడ భ్రమకలగటానికి ఆస్కారం లేదు. ఏ ఆకారంలేని నిరాకారం మీరే. 5. నిరాకారం ఆకారం దాల్చి అది కొద్ది వెలుతురులో సర్పంలా భాసిస్తుంది. ఆ ఆభాసకు కారణం కూడా మీరే. 6. ఇలా కనిపించడం కనిపించకపోవడమనే మీ అంతఃకరణవృత్తిలోని ఆనంద ప్రభావం, భావాభావ రహిత స్వభావం ఎవరికీ అంతుపట్టదు. 7. ఈ కారణంగానే శ్రుతులు మౌనం వహించాయి .అనేక ముఖాలు గల ఆదిశేషుడు కూడా మీ స్వరూపాన్ని తెలుసుకోలేక మీ స్తుతి చేయలేకపోయినప్పుడు నేనెంతటి వాణ్ణి? 8. బాబా! మీ స్వరూప దర్శనం తప్ప నా మనసుకు మరేదీ రుచించదు. ఆ మీ రూపాన్ని కళ్ల ఎదుట నిలుపుకుని ధ్యానించాలని అనిపిస్తుంది. 9. పరమ సుఖాన్ని పొందటానికి శుద్ధ జ్ఞానమూర్తి అయిన మీ చరణాలు తప్ప మాకు వేరే గతి లేదు. 10. మీ నిత్య వైభవం ఎంత

గొప్పది? మీ దర్శనానికి అనేక భక్తులు వచ్చి మీ పాదాలలో శిరసునుంచి ప్రేమగా ఆత్మానందాన్ని దోచుకుంటారు.11.ఆ మీ పాదాలు ఎటువంటివి?శాఖా చంద్రన్యాయం వలె పాదాంగుష్టాన్ని పట్టుకుని కూర్చుని మీ దర్శనాభిలాష తో వచ్చిన వారి కోరిక తీర్చుతారు.12.కృష్ణపక్షంలోని అమావాస్య నాటి అంధకార రాత్రి గడచిపోగానే, చంద్రుని దర్శనం కలుగుతుందని అందరికీ సహజంగా ఆశ ఉంటుంది.13.కృష్ణ పక్షం రాత్రి గడవగానే, చంద్ర దర్శనం కోసం ఆశతో జనులు ఆకాశం వైపు పశ్చిమ దిక్కుకు దృష్టి సారిస్తారు.14.అట్లే మీరు ఎడమ తొడ పైని కుడికాలు వేసుకుని కూర్చుని ఉన్నప్పుడు, భక్తుల ఆ కోరికను మీ పాదాల వద్ద తీర్చుతారు.15.ఎడమ చేతి చూపుడు వ్రేలు మరియు మధ్య వ్రేలుతో మీ కుడికాలి బొటన వ్రేలును పట్టుకుని ఉన్నప్పుడు రెండు వ్రేళ్ల మధ్యన ఉన్న కాలి బొటన వ్రేలి గోరు విదియ చంద్రుని వలె ప్రకాశిస్తూ కనిపిస్తుంది.16.చంద్ర దర్శనానికి చాలా కుతూహలంగా ఉన్నా, ఆకాశాన చంద్రుని దర్శనం కాదు. అయినా తెలిసిన వారు చెట్టు యొక్క రెండు కొమ్మల మధ్య నుండి చూడాలని చెబుతారు.17. ఇలా ఈ రెండు కొమ్మల మధ్యనుండి చూస్తే చంద్రుని దర్శనం అవుతుంది. సన్నని గీత వలె కనిపించినా చంద్రుని దర్శన పిపాస తీరుతుంది.18.బొటన వ్రేలి మహిమ ధన్యం. బాబా స్వయం వేణీ మాధవుడై గంగాయమునలను ప్రకటింప చేసి దాసగణుని సంతుష్ట పరచారు.19.దాసగణు ప్రయాగ తీర్థంలో స్నానానికి వెళ్లటానికి బాబా అనుమతిని వేడగా, వారు 'ఈ నాయొక్క బొటన వ్రేలు ప్రయాగ అని తెలుసుకుని ఇక్కడే స్నానం చేయి' అని చెప్పారు.20. బాబా అలా చెప్పగా దాసగణు బాబా పాదాలపై శిరసునుంచగా అప్పుడు అక్కడ గంగా యమున ఉభయనదుల నీరు ప్రకటమయింది.21.ఈ సందర్భంలో దాసగణు రచించి స్వయంగానం చేసిన అగాధ శక్తి అఘటిత లీల అన్న అందమైన పద్యాన్ని వినాలన్న కుతూహలం గల శ్రోతలు.22. ఈ సాయి

సచ్చరిత లోని చతుర్థాధ్యాయాన్ని మరల చదివితే క్రొత్తదనం కనిపిస్తుంది23.శాఖా చంద్ర న్యాయానుసారం చూపుడువ్రేలు, మధ్య వ్రేలు రెంటిని కాలి బొటన వ్రేలిపై ఉంచి సాయి మాత భక్తులకు సులభోపాయాన్ని చూపారు.24.నిరభిమానంగా ఉంటూ సర్వప్రాణులముందు నమ్రతగా తలవంచి ఒక్క అంగుష్ఠధ్యానం చేయడం భక్తికి సులభ సాధనం.25.ఇప్పుడు పూర్వకథానుసంధానం. బాబా భక్తులను అనుగ్రహించిన కథ అయింది. తరువాత అపూర్వమైన చరిత్ర శ్రవణాన్ని శ్రద్ధగా చేయండి.26.బాబా కారణంగానే శిరిడీ అతి పవిత్రమైన పుణ్య క్షేత్రమైంది. పుణ్యాన్ని కోరుకునే సద్బుద్ధిగల యాత్రికులు అక్కడికి అహోరాత్రులూ వస్తుంటారు.27.సాయి రూపంలో కల్పవృక్షం ప్రత్యక్షంగా శిరిడీలో అవతరించిందని తమ అనుభవాలతో ప్రత్యక్షంగానో లేక పరోక్షంగానో తెలుసుకుంటారు.28.బాబా పేదవారినైనా శ్రీమంతుణ్ణైనా సమానంగా చూస్తారు. అద్భుతమైన లీలను చూపి, భక్తులకు శ్రేయస్సును కలిగిస్తారు.29.అమితమైన వారి ప్రేమను, స్వాభావికమైన జ్ఞాన సంపదను, సర్వాత్మ భావాన్ని అనుభవించినవారు ధన్యులు.30.బాబా ఒక ప్పుడు దృఢమైన మౌనధారణలో ఉండేవారు. అదేవారి బ్రహ్మవ్యాఖ్యానం. మరొకప్పుడు చిదానంద ఘనులై భక్తులతో పరిపుష్టిత్తులై ఉండేవారు.31.ఒకప్పుడు గూఢార్థ ధ్వనితో అర్థం కాకుండా మాట్లాడటం, మరొకప్పుడు వినోదంగా పరిహాసమాడటం, ఒకప్పుడు సందిగ్ధత లేకుండా ఉండటం, క్రోధంతో మండిపడటం,32.ఒకప్పుడు భావ గర్భితంగా, ఒకప్పుడు వివేకంగా, ఒకప్పుడు నిశ్చయ పూర్వకంగా, అనేకులకు అనేకరకాలుగా ఉపదేశాలను ఇచ్చేవారు.33.ఆవిధంగా సాయి సమర్థుల ఆచరణ, వాక్కుకు మనోబుద్ధులకు అతీతమైనది. ఆలోచనలకు అందనిది. జ్ఞానాతీతమైనది.34. వారిని ఎంత చూచినా, వారి మాటలను ఎన్ని విన్నా తృప్తి కలగదు. వారితో ఎంత సంభాషించినా తనివి తీరదు. మనసుకు భరించలేనంత

ఆనందం కలుగుతుంది. పర్జన్యధారలను లెక్క పెట్టవచ్చు.35. పెనుగాలిని మూట కట్టవచ్చు. కాని సాయి యొక్క చమత్కారాలను ఎవరు తూచగలరు? 36. ఇక తరువాతి కథ. సాయికి భక్తులను సంరక్షించటంలో ఉన్న చింతను, మరియు వారు భక్తుల కష్టాలను నివారించటం గూర్చి స్పష్టచిత్తులై వినండి. 37. బాబా భక్తుల గండాలను తెలుసుకుని సమయానికి సరిగ్గా వారికి ధైర్యాన్నిచ్చి, వారి కష్టాలను నివారించి, వారిని తమ పాదాల చెంత స్థిరపరచేవారు. వారు ఎప్పుడూ భక్తులకు శ్రేయస్సును కలిగించటంలోనే తత్పరులై ఉంటారు. 38. ఈ విషయంలో, శ్రవణంలో ఉత్సుకత ఉన్న మీకు ఒక కథ ఆనందాన్ని కలిగిస్తుంది. సాయి సమాగమంలోని సుఖాన్ని పెంచుతుంది. భక్తులకు శ్రద్ధను కలిగిస్తుంది. 39. హీనులుగాని, దీనులుగాని, పేదవారుగాని సాయి కథలయందు భక్తి శ్రద్ధలు కలుగుతాయి. ప్రతిక్షణం సాయి నామాన్ని జపించేవారిని సాయి తీరానికి చేర్చుతారు. 40. కాకాసాహేబుమిరికరు అహమ్మదు నగరు పట్టణ నివాసి. ప్రభుత్వం ప్రసన్నమై అతనికి సర్దార్ పదవీ ప్రదానం చేసింది. 41. అతని కుమారుడు కూడా కర్తవ్యతత్పరుడు. కోపర్‌గాం మామలేదారుగా ఉండగా చితలీకి పర్యటనకు వెళ్లుతూ బాబా దర్శనానికి శిరిడీకి వచ్చాడు. 42. మసీదుకు వెళ్లి బాబా చరణాలపై శిరసునుంచాడు. అక్కడ క్షేమసమాచార వార్తలు జరుగుతున్నాయి. 43. అప్పుడు భక్తులు చాలామంది ఉన్నారు. మాధవరావు కూడా ఆ సమీపంలో ఉన్నాడు. విశేషమైన ఆ కథామృతాన్ని శ్రద్ధగా సేవించండి 44. బాబా భక్తజనులకు భవిష్యత్తులో జరిగే కష్టాలను సూచించి వానిని తప్పించుకునే ఉపాయాలను కూడా తెలిపి వారిని రక్షించడం గొప్ప చమత్కారం. 45. బాబా మిరికరును విచిత్రంగా 'ఇది మన ద్వారకామాయి నీకు తెలుసా' అని ప్రశ్నించారు. 46. బాలా సాహేబుకు అసలు అర్థం కాలేదు. అప్పుడు బాబా 'ఇదిగో చూడు! ఇదే ద్వారకామాయి. 47. ఇదే మన ద్వారకామాత. మసీదులోని ఈమె ఒడిలో కూర్చున్న బిడ్డలను నిర్భయులను

చేస్తుంది. వారికి దుఃఖమనే మాటే ఉండదు.48.ఈ మసీదుమాత గొప్ప దయగలది. భావికులకు అమాయకులకు తల్లి. ఎవరు ఏ అపాయాలలో చిక్కుకున్నా ఈమె వెంటనే రక్షిస్తుంది.49.ఒక్కసారి ఈమె ఒడిలో కూర్చున్నారా వారి కష్టాలు తొలగిపోతాయి. ఈమె నీడలో విశ్రమించిన వారు సుఖాల ఆసనాన్ని అధిష్ఠిస్తారు.50.ఈ మెయే ద్వారక, ద్వారావతి' అని చెప్పి బాబా అతనికి విభూతినిచ్చి తమ అభయహస్తాన్ని అతని శిరస్సుపై ఉంచారు. మిరికరు వెళ్లిపోవటానికి బయలు దేరాడు.51.మిరికరును మరొక ప్రశ్న అడగాలని బాబా అతనిని నీకు పాడుగాటి బాబా యొక్క విశేషం తెలుసా.52. అని కుడి మోచేతిక్రింద ఎడమ చేతిని ఉంచి కుడిచేతిని త్రిప్పుతూ అది ఇలా భయంకరంగా ఉంటుంది.53.కాని అది మనల్ని ఏం చేయగలదు?మనం ద్వారకామాయి బిడ్డలం. ఊరికే చూడటమేగాని ఆమె వింత చర్య ఎవరికీ అర్థంకాదు.54.రక్షించడానికి ద్వారకామాయి ఉండగా సర్పం ఎలా చంపగలదు? రక్షించేవారి శక్తిముందు చంపేవారి శక్తి ఏపాటిది అని అన్నారు55.బాబా ఈ సందర్భంలో ఈ విషయాన్ని ఎందుకు చెప్పారు, దీనికి మిరికరుకు ఏమిటి సంబంధం అని అందరికీ జిజ్ఞాస.56.కాని బాబాను ప్రశ్నించే ధైర్యం లేదు. చితళీకి వెళ్లటానికి ఆలస్యమై పోతుందని మిరికరు బాబా చరణాలకు నమస్కరించి క్రిందకు దిగాడు.57.అతని వెంట మాధవరావు ఉన్నాడు. ఇద్దఱూ మండపద్వారం వద్దకు వెళ్ళారు. బాబా మాధవరావును 'ఒక క్షణం ఇటురా' అని వెనుకకు పిలిచారు.58. 'శ్యామా! నువ్వు కూడాప్రయాణమై అతని వెంట వెళ్లి చితళీలో పర్యటించిరా, బాగా సరదాగా ఉంటుంది' అని చెప్పారు.59.వెంటనే శ్యామాక్రిందకు దిగి మిరికరు వద్దకు వచ్చి నేను మీ వెంట మీ టాంగా బండిలో చితళీకి రావాలి అని అన్నాడు.60.ఇంటికి వెళ్లి వెంటనే తయారై వస్తాను. మీ వెంట చితళీ వెళ్లమని బాబా చెప్పారు అని అన్నాడు. 61.అతనితో మిరికరు చితళీ వరకు అంత దూరం మీరు

వచ్చి ఏం చేస్తారు? మీకు వృథా శ్రమ కదా అని అన్నాడు. 62.మాధవరావు వెనుకకు వెళ్లి అతని మాటను బాబాతో చెప్పాడు. బాబా 'సరే మంచిదే. మనదేంపోతుంది? 63.మంత్రం, తీర్థం, ద్విజులు, దేవతలు, దైవజ్ఞులు, వైద్యులు, గురువు వీరియందు ఎలాంటి భావం ఉంటే అలాంటి ఫలమే లభిస్తుంది. 64.మనం ఎప్పుడూ మంచినే ఆలోచించాలి. యోగ్యమైన దానిని ఉపదేశించాలి. ఎవరి కర్మ ఎలా ఉంటే అట్లే తప్పకుండా జరుగుతుంది' అని చెప్పారు. 65. ఇంతలో మిరికరుకు సందేహం కలిగింది. బాబా మాటలను పాటించాలి అని తలచి మాధవరావుతో చితళీకి పద అని మెల్లగా చెప్పాడు. 66.సరే ఆగండి అలాగే వస్తాను కాని మరల బాబా అనుమతిని తీసుకోవాలి. వారు వెళ్లమంటే వెంటనే తిరిగి వస్తాను. 67.నేను బయలు దేరితే మీరు వద్దని వెనక్కు పంపారు. బాబా పోనీలే మనదేం పోతుంది అని నన్ను ఊరికే కూర్చోపెట్టారు. 68.ఇప్పుడు మరల వారిని అడుగుతాను,సరే అంటే వెంటనే వస్తాను. వారు ఎలా చెప్పితే అలా చేస్తాను.నేను వారి ఆజ్ఞను పాలించే దాసుణ్ణి. 69.అని చెప్పి బాబా వద్దకు వెళ్లి, మిరికరు నన్ను తన వెంట చితళీకి రమ్మంటున్నాడు. మీ ఆజ్ఞను కోరుతున్నా అని అన్నాడు.7 0.బాబా నవ్వుతూ 'సరే అతడు తీసుకుని వెళ్లితే నువ్వు వెళ్లు. ఈమె పేరు మసీదు మాయి.తన మాటను నిల బెట్టుకోదా? 71.ఈ తల్లి చాలా దయాళువు.ఈమెకు బిడ్డలపై అత్యంత ప్రేమ.కాని బిడ్డలకు విశ్వాసం లేక పోతే వారిని ఎలా రక్షిస్తుంది అని అన్నారు.72.మాధవరావు సాయి పాదాలకు వందనం చేసి టాంగాలో ఎక్కటానికి మిరికరు వద్దకు వెళ్లాడు. 73. అలా ఆ ఉభయులూ చితళీకి వెళ్లారు.అక్కడ విచారించగా రావలసిన అధికారులు రాలేదని తెలిసి నిశ్చింతగా కూర్చున్నారు. 74.వారికి మారుతి దేవాలయంలో బసను ఏర్పాటు చేశారు. వెంటనే వారిద్దరూ అక్కడికి వెళ్లారు. 75.రాత్రి ఒక ఝాము గడిచింది అంటే పదిగంటలై పోయింది.జంఖాన పరుపు తలగడవేసుకుని దీపం వెలుగు

లో ముచ్చటించుకుంటూ కూర్చున్నారు.76.అక్కడ ఒక వార్తా పత్రిక ఉంది. మిరికరు దానిని తెరచి చదవసాగాడు. విశేషమైన వార్తలలో అతని మనసు లగ్నమైంది. అప్పుడు ఒక విచిత్రం జరిగింది.77. ఆ భయంకర సమయంలో ఒక సర్పం ఎక్కడినుండి ఎలా వచ్చిందో తెలియదు. ఎవరి కంటా పడకుండా చుట్ట చుట్టుకుని కూర్చుంది. 78.మిరికరు నడుం వరకు మెత్తగా ఉన్న దుప్పటిపై నిర్భయంగా హాయిగా కూర్చుని ఉంది.79. అది అక్కడికి మెల్ల మెల్లగా వచ్చినప్పుడు సరసరమని కాగితం చప్పుడు అయింది కాని ఆ శబ్దం సర్పానిదే అని ఎవరూ ఊహించ లేదు. 80.ఇంతటి భయంకరమైన పరిస్థితిలో మిరికరు వార్తా పత్రికలో నిమగ్నమై ఉన్నాడు. కాని నౌకరు మనసులో ఆలోచనా తరంగాలు లేచాయి.81.శబ్దం ఏమై ఉంటుంది ఎక్కడినుండి వచ్చింది అని, దీపాన్ని కాస్తపైకి ఎత్తేసరికి పాడుగాటి మహారాజును చూచాడు.82.చూడగానే గాబరాపడుతూ పాము పాము అని మెల్లగా అరిచాడు. మిరికరుకు ధైర్యం సడిలి శరీరమంతా కంపించి పోయింది.83.మాధవరావు కూడా చకితుడై బాబా! ఎమిటిలా చేశావు? లేని విఘ్నాన్ని కలిగించావేమిటి? ఇప్పుడు దీనిని తొలగించు అని మొఱ పెట్టుకున్నాడు.84.ఆ అవస్థను చూచి ఎవరి చేతికి ఏది దొరికితే దాన్ని పుచ్చుకుని జనం చప్పుడు చేయకుండా పరుగున వచ్చారు.85.ఆపాము మెల్లమెల్లగా నడుం క్రిందనుండి జారుకోవడం కనిపించింది. అది సర్పమా? మూర్తీభవించిన అనర్థం దిగుతున్నట్లు అనిపించింది. 86.చూస్తూ చూస్తుండగానే ఆ గ్రహణం వదిలింది. పైకి లేచిన కళ్ళులు టపటపమని ఆపాము పై పడగానే అది ముక్కలై పోయింది.87.ఆవిధంగా ఆ అరిష్టం తొలగింది. ఇదంతా చూచి మిరికరు హృదయంలో సాయి సమర్థునిపై అత్యంత ప్రేమ ఉప్పొంగింది.88.అతని దుఃఖం తొలగిపోయింది. కళ్లనుండి ప్రేమాశ్రువులు ప్రవహించసాగాయి. ఎంతటి అరిష్టం తొలగిపోయింది, బాబా కిదంతా ఎలా తెలిసింది? 89.గండం గడిచిపోయింది. సమయానికి

సరిగ్గా సూచించి వద్దంటున్నా శ్యామాను సహాయానికి పంపి టాంగాలో కుర్చోపెట్టారు.90.వారి మనసులో ఎంతటి దయ.వారి సర్వజ్ఞత ఎటువంటిది!. భవిష్యత్తులోరానున్న చెడును గ్రహించి ఎంత చక్కగా తెలియజేశారు. 91.వారి దర్శనంలోని మహాత్యాన్ని చూపారు. మసీదు యొక్క మహాత్యాన్ని మనసులో నాటారు.వారి ప్రేమను సహజమైన లీలతో నిదర్శనం ద్వారా తెలియ చేశారు అని తల పోశాడు.92.ఒకసారి నానా డేంగాలే అన్న.ఒక గొప్ప జ్యోతిష్యుడు శ్రీమంతుడైన బుట్టీతో ఏమన్నాడో వినండి.93.'ఈరోజు మీకు చాలా అశుభం, మీకు గండం ఉంది. చాలా జాగ్రత్తగా ఉండాలి. అయినా ధైర్యం వహించండి '94.డేంగలే అలా చెప్పగా పాపం బాపూసాహేబు మనసులో చింత పట్టుకుంది. మాటిమాటికీ అదే ఆలోచనతో మనసుకు అశాంతి . సమయం అసలు గడవలేదు.95.తరువాత రోజూవెళ్లే వేళకు భక్తులు మసీదుకు బయలు దేరారు. బాపూసాహెబు నానా మొదలగు వారు వెళ్లి బాబా వద్ద కూర్చున్నారు.96.వెంటనేబాబా బుట్టీని 'ఈ నానా ఏమంటున్నాడు? నిన్ను చంపాలని చూస్తున్నాడా? మనం ఏం భయపడనవసరం లేదు.97. ఎలా చంపుతావో చంపు నేను చూస్తానని అతనితో సవాలు చేయి' అని చెప్పారు, ఇక తరువాతి చమత్కారాన్ని చూడండి .98. సాయంకాలం బాపూసాహేబు బుట్టీ మలవిసర్జనానికై బయలు ప్రదేశానికివెళ్లగా అక్కడికి ఒక పాము వచ్చింది.99. భయంకరమైన ఆ అరిష్టాన్నిచూచి బుట్టీ బయటకు వచ్చేశాడు. నౌకరు లహాను పామును కొట్టి చంపాలని రాయిని లేప నెత్తాడు.100.కాని బాపూసాహేబు అతనిని అడ్డగించి ఇలాంటి విషయాలలో త్వరపడకూడదు. వెళ్లి కట్టను పట్టుకురా అని చెప్పాడు. 101.కట్ట కోసం అతడు వెళ్లగా, పాము గోడపైకి ఎగబ్రాకి పోతూ అకస్మాత్తుగా జారి క్రిందపడి సరసరా ఒకరంధ్రం లోనికి దూరిపోయింది. 102.అది అలా అక్కడినుండి తప్పించుకుని పోయింది.దానితో దానిని చంపవలసిన అవసరం తప్పింది. బుట్టీకి బాబా మాటలు

గుర్తుకువచ్చాయి. అలా అతనికి, సర్పానికి కష్టం తొలగిపోయింది.103. సాయి సన్నిధిలోని వైభవాన్ని భాగ్యం కొద్ది తమ కళ్లతో చూచినవారు ఎన్నటికీ మరచిపోలేరు.104. ఇటువంటి అనేక అనుభవాలను కలిగించి బాబా భక్తుల మనసులను ఆకర్షించేవారు. వానిని వర్ణించాలంటే ఆ వర్ణన ముగిసిపోదు కాని కాగితాలు సరిపోవు.105. ఇటువంటిదే మరొక కథ. రాత్రిరెండవ ఝామునలో చావడి యందు బాబా ఎదుట ప్రత్యక్షంగా జరిగినది వినండి.106. కోపర్‌గాం తాలుకాలోని కొరాలే అన్న గ్రామంలో అమీర్ శక్కర్ అను వ్యక్తికి వంశపారంపర్యంగా వచ్చిన పంట భూములున్నాయి. అతనికి సాయిపాదాల యందు భక్తి.107. అతడు కసాయి జాతికి చెందినవాడు. దూరి వ్యాపారం చేసేవాడు. అతనికి బాంద్రాలో బాగా పలుకుబడి ఉంది. కాని అత్యంత బలమైన కష్టం వచ్చి చాలా బాధపడ్డాడు.108. కష్టాలు వచ్చి పడ్డప్పుడు దేవుడు గుర్తుకు వస్తాడు. అమీరు తన వ్యాపారాన్ని మానివేశాడు. వ్యవహారాలన్నిటినీ ముగించుకుని శిరిడీకి పరుగు పెట్టాడు.109. పంచపాండవుల తల్లి కుంతి, వనవాసంలోని అజ్ఞాతవాసంలో అనేకరకాల కష్టాలను అపాయాలను సహించింది. అయినా దేవుణ్ణి కష్టాలనే ప్రసాదించమని ప్రార్థించింది.110. 'దేవా! పరమేశ్వరా! సుఖాలను కోరుకునే వారికి సుఖాలను ఇవ్వు.111. కాని నేను నీ నామస్మరణను ఎన్నడూ మరచి పోకుండా నాకు, నిరంతరం దుఃఖపరంపరలను ఇవ్వు ప్రభూ! ఇదే నేను కోరుకునేది. ఇవ్వాలని ఉంటే ఇదే ఇవ్వు. దీని వలన నీ నామస్మరణ కలుగుతుంది. ఇదే నా కంఠానికి అలంకారం.112. వక్త మరియు శ్రోతలూ ఇలాగే అహర్నిశలూ దీనినే సాయిపాదాల వద్ద కోరుకోవాలి, దేవా! మీ నామాన్ని మరచి పోకుండా ఎల్లప్పుడూ మీ పాదాల వద్ద ఆశ్రయాన్నివ్వండి అని.113. అమీరు బాబాకు నమస్కరించి భక్తిగా బాబా హస్తాన్ని చుంబించాడు. తన వ్యాధిని గూర్చి సవిస్తరంగా మనవి చేసి ఆ దుఃఖం నుండి విమోచనం కలుగ.చేయమని

ప్రార్థించాడు.114.అతని సంధివాత రోగం పోయే ఉపాయం చెప్పమని ప్రార్థించాడు.'ప్రశాంతంగా చావడిలో ఉండు' అని బాబా ప్రత్యుత్తర మిచ్చారు.115.బాబా నియమంగా మసీదునుండి రోజు విడిచి రోజు రాత్రి చావడికి వచ్చేవారు. అమీరు అక్కడే ఉండేవాడు.116.అతడు సంధివాతంతో చాలా బాధ పడుతున్నాడు. శిరిడీ గ్రామంలో మరెక్కడైనా సుఖంగా ఉండి ఉండేవాడు. లేదా కొరాలే వెళ్లైనా ఉండేవాడు.అక్కడ అతనికి చాలా గౌరవం.117.చావడి చాలా పురాతనమైనది. క్రిందా పైనా బాగా శిథిలమైపోయింది.అక్కడ తొండలు,బల్లులూ, తేళ్లూ, పాములూ స్వేచ్ఛగా విహరిస్తుంటాయి.118.అందులోనే కుష్ఠురోగులూ ఉంటారు. అక్కడే కుక్కలు ఎంగిలి మెతుకులు తింటుంటాయి. అమీరు చాలా ఇబ్బంది పడ్డాడు. కాని బాబాతో ఏమీ అన లేకపోయాడు.119.చావడి వెనుక భాగం చెత్తతో నిండిపోయింది. మోకాలి లోతు గోతులు. గోడకు పదహారు రంధ్రాలు. అక్కడి పరిస్థితిని కుక్కలు కూడా పట్టించుకోవు. అక్కడికి రావటమే వ్యర్థం 120.పైనుండి వర్షం. క్రింద నేలంతా తేమగా ఎత్తు పల్లాలుగా ఉంది. కల్లోలంగా ఒకటే చలిగాలి.అమీరుకు మనసులో చింత.121.శరీరంలోని కీళ్లు పట్టుకుని పోయాయి. గాలివానతో ఆ స్థలం బాగా తడిసి పోయింది.కాని బాబా వచనాలే ఔషధం.122.గాలివాన వచ్చినా, నేల తడిగా ఎత్తు పల్లాలుగా ఉన్నాసరే,ఇక దాని విషయం ఆలోచించనే కూడదు.123.ఆ ప్రదేశం సందేహాస్పదంగా ఉన్నా అక్కడ అతనికి సాయి సాన్నిధ్యం మహాప్రసాదం' వారి వచనాలే ఔషధం అని తలచి సుఖంగా ఉన్నాడు.124.చావడి మెట్లెక్కగానే ఎదుటనున్న మధ్య భాగంలో పరుపు పరచుకుని అక్కడ అమీరు శక్కర్ తొమ్మిది నెలలున్నాడు. 125.సంధివాతం అతని శరీరమంతా అలుముకుంది. ఆ జబ్బుకు అక్కడి వాతావరణం విపరీతమైనది,కాని అతని దృఢ విశ్వాసం కారణంగా అది సరిపోయింది. 126.అతడు తొమ్మిది నెలలు అక్కడే ఉండాలని బాబా నియమం

పెట్టారు. మసీదుకు కూడా వెళ్లటానికి, దర్శనానికి ఆంక్ష విధించారు.127.అయినా చావడివంటి ప్రదేశాన్ని నియమించటం వలన అతనికి రోజూ ఉదయం సాయంకాలం ఏ ప్రయాస లేకుండా బాబా దర్శనం లభించేది.128.ఇంతేకాక రోజు విడిచిరోజు, రెండు పూటలా చావడిలో జరిగే వైభవాన్ని కళ్లారా చూచే అవకాశం కూడా లభించింది.129.బాబా రోజూ ఉదయం భిక్షకు వెళ్లేటప్పుడు చావడి మీదుగానే వెళ్లాలి.అలా వారు వెళ్తున్నప్పుడు తిరిగి వస్తున్నప్పుడు వారి దర్శనం అమీరుకు తన చోటు కదలకుండానే లభించేది.130.అట్లే రోజూ సాయంకాలం బాబా చావడి ఎదుట నిలుచుని చూపుడు వ్రేలును, తలను ఊపుతూ దిక్కులకు వందనం చేసేవారు. 131.అక్కడినుండి వెనుకకు మరలి సమాధిమందిరం మూలవరకు వెళ్లి భక్తులు వెంటరాగా మసీదుకు తిరిగి వెళ్లేవారు. 132.చావడికి రోజు విడిచి రోజు వచ్చేవారు. వారిద్దరి మధ్య నామమాత్రంగా ఒక పలకల తలుపు పరదావలె అడ్డు ఉండేది అంతే. అమీరు, బాబా ఆ ఇద్దరికీ ముచ్చటించుకోవటం సరదా.133. చావడిలోనే పూజ, అక్కడే హారతిని చేసి,భక్తులు తమ ఇళ్లకు వెళ్లి పోయేవారు.అటు తరువాత వారిద్దరూ ప్రశాంతంగా కబుర్లు చెప్పుకునేవారు. 134.అమీరుకు అది బందిఖానా వలె ఉన్నా నిజానికి సాయి సాంగత్యం ఎంతో భాగ్యం.లేకపోతే అటువంటి సుఖాన్ని ఆనందాన్ని అనుభవించటం ఎవరికైనా దుర్లభం.135.అయినాకూడా అమీరుకు విసిగెత్తిపోయింది. ఒకే చోట ఉండటం బందిఖానా వలె అనిపించింది.ఏ ఊరికైనా వెళ్దామా అని అనిపించింది.136.స్వతంత్రాన్ని కోరుకునే వారికి పారతంత్రం నచ్చుతుందా? ఈ బందిఖానా ఇక చాలు అని అతనికి అనిపించింది.137.బాబా అనుమతి లేకుండానే తనకు నియమించిన ప్రదేశాన్ని విడచి కోపర్ గాంకు వెళ్లి ఒక ధర్మశాలలో ఉన్నాడు.138.అక్కడ జరిగిన చమత్కారం వినండి. చావటానికి సిద్ధంగా ఉన్న ఒక ఫకీరు దాహంతో చాలా బాధపడుతూ ఒక గ్రుక్కెడు

నీరు త్రాగించమని అడిగాడు.139.అమీరుకు జాలి కలిగి అతనికి నీరు త్రాగించాడు. నీరు త్రాగిన వెంటనే ఫకీరు శరీరం నిశ్చేష్టగా పడిపోయింది.140.అతని ప్రాణం పోయింది.ఆ దరిదాపులలో ఎవరూ లేరు. పైగా రాత్రి సమయం. పాపం అమీరు గాబరాపడి పోయాడు.141.ఉదయాన్నే ఫకీరు ఆకస్మిక మరణానికి విచారణ జరుగుతుంది. దోషిని పట్టుకుంటారు. ప్రభుత్వం విచారణ జరుపుతుంది.142.నిజంగా జరిగిన దానిని చెప్పితే ఎవరు నమ్ముతారు? సాక్షుల విచారణలో తేలిన దానిని బట్టి న్యాయం జరుగుతుంది. 143.నేనే అతనికి నీరు త్రాగిస్తుంటే, అకస్మాత్తుగా ఫకీరు ప్రాణాలు పోయాయి అని జరిగిన సత్యాన్ని చెబితే నేను పట్టుబడి పోతాను. 144.అతని మృతికి నేను కారణమని ముందునన్ను పట్టుకుంటారు. తరువాత ఎప్పుడో నిజం తెలిశాక నేను నిరపరాధినని నిశ్చయమవుతుంది.145.కాని అంతవరకు పరిస్థితిని భరించలేను. అందువల్ల వెంటనే వచ్చిన దారినే పారిపోవాలి అని నిశ్చయించుకున్నాడు. 146.అలా అమీరు ఎవరూ చూడకుండా ఆ రాత్రికి రాత్రే అక్కడి నుండి బయలుదేరాడు. వెనుకకు తిరిగి చూస్తూ ముందుకు నడుస్తూ దారి పొడుగునా బాధ పడ్డాడు.147.చావడిని చేరుకునే వరకు మనసుకు శాంతి లేదు అని చింతిస్తూ, అమీరు శిరిడీకి పయనమయ్యాడు.148.బాబా ఇలా చేశారేమిటి? ఇదెక్కడి పాపం ముంచుకొచ్చింది? ఇది నా కర్మే ఇలా ఫలించింది అని నాకు బాగా తెలిసింది.149.సుఖం కోసం చావడిని వదిలిపెట్టాను.అందుకే నాకీ శిక్ష బాబా! ఇప్పుడు నన్నీ కష్టం నుండి బయటికిలాగి తీసుకొని వెళ్ళి శిరిడీలో పడవేయండి అని అనుకున్నాడు. 150.వెంటనే అమీరు ఆ శవాన్ని ఆ ధర్మశాలలో వదిలి ఆ రాత్రికి రాత్రే బయలు దేఱాడు.151.బాబా! బాబా! అని నోటితో అంటూ, కరుణించమని వేడుకుంటూ! చావడికి చేరుకుని ప్రశాంతతను పొందాడు.152.ఇలా జరిగాక అతడు లెంపలు వేసుకుని చెడు మార్గాన్ని వదిలి మంచిగా ప్రవర్తించసాగాడు.153. అలా అతడు బాబా పై విశ్వాసంతో

వాతం జబ్బు నుండి తేరుకున్నాడు. ఆ తరువాత జరిగిన దానిని వినండి.154. చావడి మొత్తం మూడు భాగాలు. ఆగ్నేయమూల బాబా ఉంటారు. నాలుగు ప్రక్కలా చెక్కపలకలు మూయబడి ఉండేవి. బాబా అందులో శయనించేవారు. 155.రాత్రంతా దీపాలు వెలిగించి ఉంచేవారు.ఎల్లప్పుడూ బాబా వెలుగులో పడుకునేవారు. ఫకీరులు, బైరాగులు బయట ప్రదేశంలో చీకట్లో ఉండేవారు.156.బహుశా అమీరు కూడా వారిలో ఒక్కడు కావచ్చు. ఇటూ అటూ ఇతరులు కూడా ఎంతోమంది అక్కడే అడ్డంగా చేరబడో లేక నిద్రపోతూనో ఉండేవారు. 157.బాబాకు మెనుకవైపు సామాను ఉంచే గదిలో పరమ విరాగి, సేవాతత్పురుడైన అబ్దుల్లా అనే భక్తుడుండేవాడు. 158.ఒక రోజు అర్ధరాత్రి బాబా గట్టిగా కేకలు వేస్తూ అబ్దుల్లాను పిలిచి'నా ప్రక్కలోకి దెయ్యం వచ్చి చేరింది చూడరా' అని అన్నారు. 159.బాబా బిగ్గరగా మరల మరల పిలవగా అబ్దుల్ దీపాన్ని చేతబుచ్చుకొని వచ్చాడు. బాబా గట్టిగా కేకలు వేస్తూ 'ఇప్పుడు అది ఇక్కడే ఉండింది కదా!' అని అన్నారు.160.'అంతా బాగా చూచాను. ఇక్కడ నాకేది కనిపించ లేదు' అని అబ్దుల్ చెప్పాడు. 'కళ్లు తెఱచి సరిగ్గా చూడరా!' అని బాబా మరల చెప్పారు. 161.అబ్దుల్ అంతా తిరిగి తిరిగి చూచాడు.బాబా తమ సటకాతో నేలపై కొట్టుతుంటే బయట నిద్రపోతున్న జనం మేల్కొని చూడసాగారు.162.అమీరుశక్కర్ కూడా మేల్కొన్నాడు. 'ఇవాళ ఇదేం గొడవ? ఈ అర్ధరాత్రప్పుడు మాటి మాటికి సటకా దెబ్బలు ఎందుకబ్బా!'163.బాబా లీలగని, ఎక్కడి నుండో పాము ప్రవేశించింది అని బాబాకు తెలిసిందని అమీరుకు అర్థమయింది.164.అతనికి బాబా యొక్క స్వభావం బాగా అనుభవపూర్వకంగా తెలుసు.బాబా మాట్లాడే పద్ధతి తెలుసు.పరిస్థితినంతా అర్థం చేసుకున్నాడు.165.భక్తులకు ఏదైన అరిష్టం సంభవిస్తే బాబా అది తమకే కలిగినట్లు చెప్తారు. బాబా యొక్కఆ భాష అమీరుకు అవగతం.అందువలన అతడు విషయం

అర్థం చేసుకున్నాడు. 166.ఇంతలో అతని పక్కవద్దే ఏదో కదులుతున్నట్లుగా కనిపించింది. వెంటనే 'అబ్దుల్ ఇక్కడికి దీపం పట్టుకురా' అని అమీరు అరిచాడు. 167.దీపం బయటికి తీసుకుని రాగానే ఆ వెలుతురులో చుట్ట చుట్టుకుని ఉన్న పాము కనిపించింది. పాము తలను క్రిందకూ పైకి కదలుస్తోంది. 168. జనం దాన్ని అక్కడే చంపేశారు. అది బాబా యొక్క మహదుపకారమని తలచి, బాబా తమ విచిత్ర పద్ధతితో ఎట్లా భక్తులను జాగరూకులను చేస్తారు కదా! అని అనుకున్నాడు. 169.ఎక్కడి దెయ్యం? ఎక్కడి దీపం? సమయానికి సరిగ్గా మేలుకొలిపి భక్తులను కష్టాలనుండి కాపాడటం కోసమే వారి యుక్తి .170. ఇటువంటి అసంఖ్యాకమైన పాముల కథలను బాబా చరిత్రలో వర్ణించవచ్చు. దీని వల్ల ఈ గ్రంథం విస్తారమై పోతుంది. అందువల్ల సంక్షిప్తంగా చెప్పాను. 171. పాము తేలు నారాయణుని అంశాలే అని భక్తతుకారం వచనం. దూరం నుండే వానికి వందనం చేయాలని కూడా అతనే అన్నాడు.172.అవి అధమ జాతికి చెందినవి కనుక వానిని చెప్పులతో శిక్షించాలని అన్నాడు. అందువలన క్రూర జీవులతో ఎలా ప్రవర్తించాలో నిశ్చయంగా తెలియదు.173.పరమేశ్వరుని నియమం ప్రకారం ఆయాజీవుల స్వభావ ధర్మాన్ని అనుసరించి వాని పనులుంటాయి. ఇదే ఇందులోని మర్మం.174. దీనికి బాబా సమాధానమొక్కటే. జీవులన్నీ సమానం. అన్నింటి యందూ అహింసా భావముండాలి.175.పాము కాని తేలుకాని అన్నిటికీ అధిష్ఠానం ఈశ్వరుడే. ఆయన సంకల్పం లేనిదే ఎవరైనా ఏ అపాయాన్ని అయినా చేయగలరా? 176.ఈ విశ్వమంతా ఈశ్వరుని అధీనంలో ఉంది. ఇక్కడ ఏదీ స్వతంత్రం కాదు.ఇది బాబా తెలియ చేసిన అనుభవ జ్ఞానం. కాని మనం దురభిమానాన్ని వదిలిపెట్టం. 177.ఒక తేలు చెరువులో పడి ఉక్కిరి బిక్కిరై తల్లడిల్లుతూ నీళ్లలో మునిగి పోతుంటే ఒకడు ఆనందంగా చప్పట్లు కొడుతూ, నీవూ ఇలాగే మమ్మల్ని బాధపెడతావు అని అన్నాడు.178.ఆ చప్పట్లను

విని మరొకడు వరుగెత్తుకుని వచ్చి తేలు నీటిలో మునకలు వేస్తుంటే కరుణతో కరిగిపోయాడు.179.తేలుదగ్గరికి వెళ్లి పటకారతో దానిని బయటికి తీశాడు. తేలు తన జాతి స్వభావంతో అతని బొటనవ్రేలిని కుట్టింది. 180.మన జ్ఞానం ఇక్కడ ఏం పనికి వస్తుంది? మనం అన్ని విధాలా పరాధీనులం. మన బుద్ధిదాత నారాయణుడు. అతడు ఎలా జరిపిస్తే అలా జరుగుతుంది.181.అనేక మందికి అనేక అనుభవాలున్నాయి.నేను నా అనుభవాన్ని కూడా చెప్పుతాను. సాయిబాబా యొక్క వచనాల యందు విశ్వాసముంచి వానిని గౌరవించాలి. ప్రబలమైన నిష్ఠ ఉంటేనే వారి వైభవాన్ని తెలుసుకోగలం.182.కాకా సాహెబు దీక్షితు రోజూ ఏకనాథభాగవతాన్ని చదివేవాడు అలాగే ప్రతి నిత్యం రాత్రి భావార్థరామాయణాన్ని పఠించేవాడు.183.ఒకపూట స్నానం, దేవుని పూజ చేయటం మానినా, ఇతర నియమాలన్నీ మానినా అతడు పఠించే సమయం మాత్రం తప్పేది కాదు.184.ఏకనాథుని ఈ రెండు గ్రంథాలు పరమార్థానికి సారాలు. సాయిసమర్థుని అనుగ్రహం వలన దీక్షితుకు అవి బాగా అర్థమయ్యేవి.185.అద్వితీయ మధురమైన ఈ గ్రంథాలలోని ఆత్మజ్ఞానం, వైరాగ్యం, నీతి ఈ మూడింటి జ్యోతి దేదీప్యమానంగా ప్రకాశాన్నిస్తుంది. 186.ఆ బోధామృత పాత్రను భాగ్యం కొద్దీ నోటికి అందుకున్నవారికి త్రితాపాలు ఉపశమించి మోక్షం ప్రాప్తిస్తుంది.187.సాయిబాబా కృపవలన దీక్షితుకు శ్రవణం చేయటానికి శ్రోతలు లభించే యోగం, నాక్కూడా భాగవత శ్రవణం చేసే అవకాశం లభించాయి. దాని వలన నాకు ఉపకారం జరిగింది.188.ఆ పవిత్ర కథను వినడానికి పగలు రాత్రి వెళ్ళసాగాను. దాని వలన భాగ్యం కొద్దీ చెవులను పవిత్రం చేసే ఈ కథా శ్రవణం లభించింది. 189.ఒక రాత్రి పరమ పవిత్రమైన కథా శ్రవణం జరుగుతుండగా విచిత్రమైన కథ జరిగింది.శ్రోతలు ఆ కథను వినండి. 190.ఒక దానిని వర్ణిస్తుంటే మధ్యలో మరొకటి స్ఫురిస్తుంది. నేనేం చేయను? శ్రవణం చేయదగిన దానిని

నేనెందుకు ఉపేక్షించాలి?191. రామాయణంలోని కథ రసవత్తరంగా సాగుతుంది. హనుమంతునికి సీతామాత జాడ తెలిసింది. అయినా స్వామి యొక్క సమర్థతను పరీక్షించాలని వెళ్లి చివరకు అరిష్టాన్ని అనుభవించాడు. 192. రాముని శరపరంపరలతో హనుమంతుడు ఆకాశంలో గిరగిరా తిరిగాడు. అతడి ప్రాణం తల్లడిల్లింది. అప్పుడు అతని తండ్రి అక్కడికి వచ్చాడు.193. అతని హిత వచనాలను విని హనుమంతుడు రాముని శరణు జొచ్చాడు. ఈ కథా భాగాన్ని శ్రవణం చేస్తుండగా జరిగిన విచిత్రాన్ని వినండి.194.అందరి మనసులూ కథా శ్రవణానందంలో మగ్నమై ఉన్నాయి. అప్పుడు మూర్తీభవించిన విఘ్నంలా ఒక తేలు ఎలా ఉత్పన్నమైందో! 195. దానికి శ్రవణముందు ఎందుకు ప్రీతి కలిగిం దో అర్థం కాలేదు. నాకు తెలియకుండానే నా భుజాల పై ప్రాకి ముడుచుకుని కూర్చుని కథారసంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ఉంది. 196.ఇక్కడ కూడా బాబా ఇచ్చిన అనుభవాన్ని చూడండి. నా దృష్టి అక్కడ లేదు. హరికథా శ్రవణంలో తత్పరులైన వారిని హరి స్వయం రక్షిస్తాడు. 197.సహజంగా నా దృష్టి మరలి చూడ్డును కదా ! భయంకరమైన తేలు నాకుడి భుజం మీది కండువాపై కదలకుండా సుస్థిరంగా కూర్చుని ఉంది.198.ఏ కదలికా లేక శ్రవణ పరాయణుడైన శ్రోత తన ఆసనంలో స్థిరంగా ప్రశాంతంగా కూర్చుని శ్రద్ధగా ఆలకిస్తున్నాడా అన్నట్లుంది.199.దాని శరీర స్వభావానుసారం ఊరికే కొండిని ఏ కాస్త కదల్చినా భరించలేనంత బాధతో నేను ప్రశాంతంగా కూర్చోలేక పోయేవాణ్ణి. 200. రామకథ మంచి రసవత్తరగా ఉంది. వక్త, శ్రోత ఉభయులూ గ్రంథంలో మునిగిపోయారు. రామకథా శ్రవణంలో రసభంగం వాటిల్లేది. దుర్భరమైన ఆ దుష్ట సాంగత్యం అటువంటిది.201 అదే మరి రామ కథా మహిమ. అక్కడ విఘ్నాల ప్రభావం సాగదు. విఘ్నాలు తమ ధర్మాన్ని మరచి అక్కడ విశ్రాంతిని పొందుతాయి.202.రాముని దయవలన నా కండువాను మెల్లగా దూరంగా పడేయాలని నా బుద్ధికి తోచింది. చంచల

బుద్దిగల ప్రాణిని చివరివఱకూ విశ్వసించరాదు. 203. పైన వేసుకున్న అంగవస్త్రాన్ని మెల్లగా రెండు చివరలూ పట్టుకుని దానిలో తేలును బాగా గట్టిగా మూట కట్టి తోటలోకి తీసుకుని వెళ్లి జారవిడిచాను. 204. జాతిరీత్యా తేలు భయంకరమైనది. అవకాశం దొరికితే దాని జాతి స్వభావంతో కుట్టుతుందని భయం కలుగుతుంది. నిజమేకాని బాబా ఆజ్ఞ బలీయమైనది. అందువలన తేలును చంపటానికి చేతులు రాలేదు. 205. ఇక్కడ శ్రోతలకు సందేహం కలగటం సహజం. తేలు ఘాతకి కదా మరి దానిని చంపకూడదా? అది కుట్టితే సుఖంగా ఉంటుందా? ఎందుకు దానిని చంపకూడదని అంటారో అర్థం కాదు. 206. పాములు తేళ్లు వంటి విషప్రాణులను ఎవరూ ఎప్పుడూ ఉపేక్షించ కూడదు. అశ్రద్ధగా వానిని వదిలి వేయరాదు అని అంటాం. వానిని విడిచి పెట్టాలని బాబా చెప్పారా? 207. శ్రోతల అనుమానం నిజమే. నాకు కూడా ఇలాగే అనిపించేది. కాని ఇటువంటి సందర్భంలో బాబా అభిప్రాయాన్ని వినండి. 208. ఇంతకంటే విపత్కరమైన సందర్భం. ఒకసారి శిరిడీలో కాకాదీక్షితు ఇంట్లో మేడపైన కిటికీవద్ద ఒక భయంకరమైన పాము వచ్చి చేరింది. 209. కిటికీ చట్రం క్రింద ఉన్న రంధ్రంలో నుండి లోపలికి ప్రవేశించింది. దీపం వెలుతురులో చుట్ట చుట్టుకుని మెరుస్తూ కూర్చుంది. 210. దీపాల వెలుతురుకు మనుషుల సందడికి ఒక క్షణం కలవరపడి తరువాత ఊరికే ఉండిపోయింది. 211. వెనుకకూ వెళ్లదు ముందుకూ జరగదు. పడగను క్రిందకూ పైకి కదుల్చుతూ ఉంది. దానిని ఏ ఉపాయంతో చంపాలా అని అందరూ ఒకటే గోల పెడుతున్నారు. 212. ఒకరు బడితెను ఒకరు కఱ్ఱను పట్టుకుని పరుగున వచ్చారు. కాని దానిని కొట్టడానికి స్థలం ఇరుకుగా ఉన్నందున చాలా కష్టం కలిగింది. 213. సహజంగా అది ప్రాకుతూ, గోడపై నుండి క్రిందికి దిగితే, ప్రథమంగా నా పరుపు చుట్ట వద్దకు వచ్చి ఉంటే, దాంతో నాకు మహా కష్టం

కలిగేది.214.దాని నాజూకు శరీరం పై దెబ్బ పడితే అది దెబ్బ తప్పించుకుని ఉంటే అది పగతో అపాయాన్ని కలిగించేది. దీపాన్ని తెచ్చి చూడగా అది ఉన్న స్థలం కనిపించింది. 215.దానికి పోయే కాలం రాలేదు. మా అందరి అదృష్టం బాగుంది. అది భయంకర సమయమైనా బాబా మమ్మల్ని రక్షించారు. 216.ఆ పాము చరచరా తాను వచ్చినదారినే వెళ్లిపోయింది. దానికి భయం తప్పింది. ఇతరులకు కూడా నిర్భయం కలిగింది. దానితో అందరికీ సుఖం కలిగింది. 217.అప్పుడు ముక్తారాంలేచి పాపం పాము తప్పించుకుని పారి పోవడంతో బ్రతికిపోయింది. ఆ రంధ్రం నుండి వెళ్లిపోకపోతే దాని ప్రాణం పోయేది అని అన్నాడు. 218. అతని దయార్ద్ర దృష్టి నా మనసుకు బాధ కలిగించింది. దుష్టజీవుల పైన దయ ఎందుకు? ఇలా అయితే సృష్టిలో ఇక వ్యవహారాలెలా సాగుతాయి? 219.అక్కడికి ముక్తారాం అప్పుడప్పుడు వస్తాడు కాని మేము రోజూ ఉదయం సాయంకాలం కూర్చుంటాం.నా పరుపుచుట్ట మరీ కిటికీ దగ్గరగానే. అతని మాట నాకు నచ్చలేదు. 220.అతడు పూర్వ పక్షాన్ని వహిస్తే నేను ఉత్తర పక్షాన్ని చేపట్టాను.ఒకటే వాదోపవాదాలు. చర్చలు బాగానే సాగాయి. నిర్ణయం ఏం తేలలేదు. 221.పామును చంపాలని క్షణం కూడా వదిలిపెట్టరాదని ఒకరు అంటారు. నిరపరాధ జీవిని ఎందుకు హింసించాలి అని మరొకరు అంటారు.222.ఒకరు ముక్తారాం మాటను వ్యతిరేకించి నామాటను ఒప్పుకున్నారు. అలా పరస్పర వాదన బాగా పెరిగింది.చివరకు ఏం తేలలేదు.223. ముక్తారాం క్రిందికి వెళ్లిపోయాడు. నేను నా స్థలాన్ని మార్చాను.కిటికీ రంధ్రానికి ఒక చెక్కముక్కను కొట్టి పడుకోవటానికి పక్కబట్టలు పరచుకున్నాను. 224.నిద్రతో కళ్లు మూతలు పడుతున్నాయి. భక్తులు నిద్రపోవటానికివెళ్లిపోయారు. నేను ఆవులించ సాగాను. వాదం దానంతట అదే ఆగిపోయింది. 225.అలా ఆ రాత్రి గడిచి తెల్ల వారింది. కాలకృత్యాలు తీర్చుకుని ముఖం కడుక్కున్నాను.బాబా తెండీ నుండి

తిరిగివచ్చారు. మసీదులో జనం గుమిగూడారు.226. రోజూలాగే నేను ప్రాతఃకాలం మసీదుకు వెళ్లాను.ముక్తారాం మొదలైన భక్తులు వచ్చి వారివారి స్థానాలలో కూర్చున్నారు.227.ఒకరు చేతిలో పొగాకును నలుపుతుంటే మరొకరు బాబా యొక్క చిలుం గొట్టాన్ని నింపుతున్నారు. ఒకరు బాబా పాదాలను, చేతులను పట్టుతున్నారు. అలావారి సేవ జరుగుతూ ఉంది. 228.బాబాకు అందటి మనోవృత్తులూ తెలుసు.'గతరాత్రి వాడాలో దేని గురించి వాదోపవాదాలు జరిగాయి' అని మెల్లగా అడిగారు.229.నేను బాబాతో జరిగిందంతా చెప్పాను. ఇటువంటి పరిస్థితులలో పాములను చంపాలా చంపకూడదా అని అడిగాను.230.బాబా ఒక్కటే విషయాన్ని చెప్పారు.'పామైనా తేలైనా అన్నింటిలోనూ ఈశ్వరుడు విరాజమానుడై ఉంటాడు. అందువలన అన్నింటినీ ప్రేమించాలి. 231.ఈశ్వరుడు ఈ జగత్తుకు సూత్రధారి.అన్ని జీవులూ ఆయన ఆజ్ఞానుసారం ప్రవర్తిస్తాయి. పాముకాని తేలుకాని ఈశ్వరుని ఆజ్ఞకు వ్యతిరేకంగా ప్రవర్తించవు. 232.అందువలన ప్రాణులన్నింటిని ప్రేమతో దయతో చూడండి. సాహసాన్ని వదిలి సహనాన్ని వహించండి. శ్రీహరి అందరినీ రక్షిస్తాడు' అని చెప్పారు. 233.ఈ విధంగా సాయి బాబా యొక్క కథలు అనేకం చెప్పవచ్చు.శ్రోతలు వీని లోని సారాంశాన్ని గ్రహించాలి 234.తరువాతి అధ్యాయం ఇంత కంటే మధురమైనది, భక్తిశ్రద్ధలతో కూడుకున్నది. భక్త దీక్షితు విపరీతమైన కఠినపరిస్థితిలో మేకను చంపటానికి సిద్ధపడతాడు. 235. స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో అపమృత్యు నివారణమను ఇరువది రెండవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీసద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీసాయి సచ్చరిత - 23 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

జీవుడు వాస్తవానికి త్రిగుణాతీతుడు. కాని మాయామోహితుడై తన సచ్చిదానంద స్వరూపాన్ని మరచి పోయి శరీరమే తాను అని అనుకుంటాడు.1.ఆ శరీరాభిమానంతో నేను కర్తను నేను భోక్తను అని తలచి అనర్థమైన జనన మరణ పరంపరలో పడి బాధ పడతాడు.వానినుండి బయటపడే మార్గాన్ని ఎఱుగడు.2. గురువు పాదాల యందు ప్రేమ పూర్వకమైన భక్తి యోగమే అనర్థాలను ఉపశమింప చేసే మార్గం. మహానటులైన శ్రీసాయి రంగనాథులు భక్తులను ఆనందంలో రంజింప చేస్తారు.3.వారు అవతారపురుషులని మేము విశ్వసిస్తాము. కారణం వారి లక్షణాలన్నీ అవే.అయినా 'నేను అల్లా యొక్క పాదదాసుణ్ణి అని' వారు స్వయంగా చెప్పేవారు. 4. సాక్షాత్తు అవతార పురుషులే అయినా లౌకిక వ్యవహారాలను శుద్ధమైన వర్ణాశ్రమ ధర్మాలను చక్కగా ఆచరించి ప్రజలకు తెలియ చేసేవారు.5.వారు ఎవ్వరితోను ఎప్పుడూ పోల్చుకునే వారు కాదు. ఇతరులను కూడా పోల్చుకోని చ్చేవారు కాదు. చరాచరాలన్నింటిలో విశ్వంభరుణ్ణి చూచేవారికి అణకువయే ఆభరణం.6.వారు ఎవరినీ తిరస్కరించే వారుగాదు. ఎవరినీ తుచ్ఛంగా చూచేవారు కాదు. అన్ని జీవులయందూ చైతన్య ఘనుడైన నారాయణుని చూచేవారు. 7. 'అనల్‌హక్' నేనే పరమేశ్వరుణ్ణి అని ఎప్పుడూ అనే వారు కాదు. 'నేను ఎల్లప్పుడూ పరమేశ్వరుని స్మరించే వారి పాద దాసుణ్ణి' 'యాదేహక్' అని చెప్పేవారు.అల్లామాలిక్ అని స్మరించేవారు. 8.సత్పురుషులు ఏ జాతికి

చెందినవారు, వారు ఏమితింటారు,ఎలా ప్రవర్తిస్తారు అన్న విషయాలు,వారి స్థితిగతులు మనకు అర్థం కావు. వారు ఎల్లప్పుడూ అన్నింటికీ అతీతులు.9.జడులైన జీవులను ఉద్ధరించటానికి పరోపకారపరాయణులైన సత్పురుషులు సృష్టియందు అవతరిస్తారు. ఇదే సర్వేశ్వరుని కృప.10.పుణ్య సంచయం బాగా ఉంటేనే సత్పురుషులను గురించిన విషయాలు విని ఆనందించాలన్న కోరిక జనిస్తుంది.11.ఒకసారి ఒక యోగాభ్యాసి, నానాచందోర్కరుని వెంటబెట్టుకుని బాబా దర్శనానికై మసీదుకు వచ్చాడు.12.అతడు పతంజలి యోగశాస్త్రాన్ని సమగ్రంగా అభ్యసించాడు. కాని అతని అనుభవం చూస్తే, అతనికి ఒక క్షణమైనా సమాధిస్థితి సాధ్యమయ్యేది కాదు.13.సాయి మహారాజు యోగీశ్వరులు. వారి అనుగ్రహముంటే నా సంశయాలు తొలగిపోయి, సమాధ్యవస్థ స్థిరపడుతుంది. 14.అని తలచి సాయిబాబాను దర్శించుకోగా,అప్పుడు బాబా ఉల్లిపాయను నంజుకుంటూ రొట్టెను తింటూ కూర్చున్నారు. 15.ఎండు చద్ది రొట్టెను ఉల్లిపాయను బాబా నోటి వద్ద చూచి నా సందేహాలను ఇతడేం నివారించగలడు అని అతనికి అనుమానం కలిగింది. 16.అతని మనసులో వికల్పం కలిగింది.అంతర్జ్ఞానియైన సాయిమహారాజు 'నానా! ఉల్లిపాయను జీర్ణించుకొన గలిగినవారే దానిని తినాలి.17.జీర్ణించుకునే శక్తి ఉన్నవారు దానిని నిర్భయంగా తినవచ్చు'అని అన్నారు.ఆ మాటలను విన్న యోగాభ్యాసి చకితుడయ్యాడు.విశ్వాసంతో సాయిని శరణుజొచ్చాడు.18.తరువాత బాబా వచ్చి తమ ఆసనంపై కూర్చున్నారు.ఆ యోగాభ్యాసి మనసులో సంకల్పవికల్పాలు లేకుండా శ్రద్ధతో బాబా వద్దకూర్చున్నాడు.19.తన సందేహాలకు సమాధానాలను తెలుసుకుని, బాబా విభూతిని ఆశీస్సులను పొంది సంతోషంగా వెళ్లిపోయాడు.20.ఇటువంటి అనేక కథలను శ్రవణం చేస్తే దుఃఖాలు మోహాలనే అనర్థాలువెంటనే ఉపశమిస్తాయి.21.నీటి గుంట చిన్నదే అయినా,అత్యంత దుర్గంధంతో

కూడుకుని ఉన్న ఆ మురికి గుంటను పంది నిరతిశయ సుఖమని అనుకుంటుంది. 22. అట్లే జీవుడు, చిలుక – వీరి పరిస్థితి ఒక్కటే. ఒకరు శరీరంలోను ఒకటి పంజరంలోనూ బంధింప బడి ఉన్నారు. చిలుకకు స్వాతంత్ర్యం లేకున్నా పారతంత్రమే బాగా ఉన్నదనుకుంటుంది. 23. కూపస్థమండూకం వంటి ఈ చిలుక దాని సర్వ సుఖాలూ పంజరంలోనే ఉన్నాయని అనుకుంటుంది. పాపం దానికి స్వాతంత్ర్యంలోని ఆనందం తెలియదు. కాముకుడైన జీవుడు కూడా అట్లే. 24. ఆహా! నా పంజరం ఎంత సుఖంగా ఉంది! ఊగటానికి బంగారు కమ్మి ఎంత బాగా ఉంది! తలక్రిందులుగా వ్రేలాడుతున్నా కాలుకాస్తైనా కదలకున్నా పర్వాలేదు, నేను బాగా ఉన్నాను. 25. బయట ఈ సుఖం లభిస్తుందా? తినటానికి దానిమ్మగింజలు రుచికరమైన మిరపకాయలు దొరకవు. నా సుఖాన్ని నేను చేతులారా వదులుకోవాలా అని అనుకుంటుంది. 26. కాని ఆ చిలుకకు తగిన సమయం వచ్చిందా, అకస్మాత్తుగా ఎవరో కలిసి ప్రేమగాదాని వెన్ను తట్టి కళ్లకు అంజనం వేస్తారు. 27. ఆ స్పర్శతో శక్తిపాతమై కళ్లుతెఱుచుకుని పంజరం నుండి బయటపడి రెక్కలు విప్పుకుని గాలిలో ఎగురుతుంది. ఇకదానిని ఎవరు ఆపగలరు? 28. ఎదుట విశాల జగత్తు కనిపిస్తుంది. యథేచ్ఛగా తినటానికి దానిమ్మ గింజలు జామపళ్లు, స్వేచ్ఛగా విహరించటానికి విశాలాకాశం. అప్పుడు స్వాతంత్ర్య సుఖాన్ని అనుభవిస్తుంది. 29. అట్లే ఈ జీవుని పరిస్థితి. ఈశ్వరానుగ్రహం, సద్గురుప్రాప్తి రెండూ లభిస్తే, బంధం విడిపోయి స్వాతంత్ర్య సుఖాన్ని అనుభవిస్తాడు. 30. భావికులైన శ్రోతలారా ఇప్పుడు కాసేపు ప్రేమరసభరితమైన కథను వింటారా? 31. గతాధ్యాయంలోని చమత్కారం – బాబా మిరికరుకు శ్యామాను తోడుగా ఇచ్చి చితలీ పర్యటనకు పంపారు. 32. బాబా భవిష్యజ్ఞానంతో పాముద్వారా కలిగే విఘ్నాన్ని తెలుసుకుని మిరికరుకు ఆ సమయానికి జరగబోయే ఆపదను చక్కగా సూచించారు. 33. సూచన మాత్రమే కాదు. మిరికరు వద్దన్నా అతని

వెంట నివారణోపాయంగా శ్యామాను బలవంతంగా పంపి, అతనిని ఆ కష్టం నుండి కాపాడారు.34.భక్త కల్యాణ తత్పరుడైన బాబా అలా బాలా సాహేబు మిరికరు గండాన్ని తప్పించి, విచిత్రమైన అనుభవాన్ని కలుగ చేశారు.35.అంతకంటే ఘోరంగా శ్యామాకు అకస్మాత్తుగా పాము కఱచిన పరిస్థితిలో, బ్రతుకుతాడన్న ఆశ కూడా లేనప్పుడు, బాబా అతనిని మృత్యువునుండి విముక్తుణ్ణి చేశారు.36.ముందుగా ఈ కథ శ్రోతలకు చెప్పుతాను. ఇది కూడా ఒక బాబా లీల. పాము కాటు వేసినప్పుడు బాబా ఏం ఉపాయం చేశారో చూడండి.37.సుమారు ఏడుగంటలప్పుడు శ్యామా చిటికెన వ్రేలిని పాము ఎకాఎకి కాటేయగా అక్కడ విషం వలన మంట.38. భరించలేనంత అత్యంత వేదన, ప్రాణాంతకం వంటి ఆ బాధకు మాధవరావు భయభీతుడై తనలో చింతించ సాగాడు.39.అతని శరీరం ఎఱ్ఱబారింది. ఆప్తులు స్నేహితులూ అందరు కలసి విరోబా వద్దకు పద అని అన్నారు.అతని ప్రాణం అపాయంలో పడింది. 40. నిమోంకరు వచ్చి విభూతిని తీసుకుని వెళ్ళు అని చెప్పాడు. మాధవరావు మసీదుకు పరుగు తీశాడు. బాబా ఏం చేశారు?41.బాబా చూపు శ్యామా చూపులో కలవగా బాబా చేసిన చమత్కారం చూడండి. అతనిని పైకి రానివ్వకుండా బాగా తిట్టసాగారు.42.'భట్మ్యా! పైకి ఎక్కవద్దు. ఎక్కావంటే ఖబర్దార్, ఫో! క్రిందకు దిగిపో!' అంటూ గట్టిగా గర్జించారు.43.నిప్పులు చెరుగుతున్నట్లు బాగా కోపపడ్డారు. బాబా ఎందుకు ఇంత కఠిన వచనాలను విసిరారు అని మాధవరావు చకితుడయ్యాడు.44.వారి క్రోధాన్ని చూచి మాధవరావు చాలా గాబరా పడ్డాడు. అతనికి ఏం తోచలేదు. ధైర్యం సడలిపోయి క్రిందనే కూర్చున్నాడు.45.తనదేవునికే కోపం వస్తే, బాబాయే తనను తిరస్కరిస్తే ఇక బ్రతికే ఉపాయంలేదని మాధవరావు భయపడ్డాడు.46.ఘోరంగా మండిపోతున్న బాబా యొక్క క్రోధాన్ని చూచి వారి తిట్లను శాపాలను విని ఎవరు మాత్రం గాబరాపడరు? అది అటువంటి భయంకర

పరిస్థితి. 47.మసీదు నా పుట్టిల్లు, నేను సాయికి కన్నకొడుకును. మరి కన్నతల్లే బిడ్డను ఇవాళ ఇంతగా కోప్పడుతుంది ఎందుకు? 48.పాము కాటేసింది అన్న వేదనను తల్లి దగ్గర కాక మరెక్కడ చెప్పు కుంటాం? కాని ఆ తల్లే తన్ని తరిమేస్తే ఇక తన గతి ఏమిటి? అని దీనంగా మొహం పెట్టాడు. 49.బిడ్డకు కన్నతల్లి ఎట్లాగో మాధవరావుకు బాబా కన్నతల్లి. ఇటువంటి అనుబంధం అహర్నిశలూ ఉండగా మరి ఈ రోజు ఇదేం పరిస్థితి? 50. తల్లే తన్ని తరిమేస్తే ఇక బిడ్డను ఎవరు రక్షిస్తారు? అప్పుడు మాధవరావు ప్రాణాల మీద ఆశకు నీళ్లు వదులుకున్నాడు. 51. కొంతసేపు గడిచాక బాబా శాంతించారు. మాధవరావు ధైర్యం తెచ్చుకుని పైకి వెళ్లి కూర్చున్నాడు. 52.అప్పుడు బాబా, 'నీవు ధైర్యం వదలకు. ఏం చింతపడకు. నీవు బాగౌతావు. దయాళువైన ఫకీరు నిన్ను సంరక్షిస్తాడు. 53.ఇంటికి వెళ్లి సుస్థిరంగా కూర్చో ఇంటి నుండి బయటికి ఎక్కడికీ వెళ్లకు. నిర్భయంగా నిశ్చింతగా ఉండు. నా మీద విశ్వాసముంచు' అని చెప్పారు. 54.శ్యామా ఇంటికి చేరుకునేసరికి బాబా, తాత్యాతో కబురు పంపారు. 55.'అతనిని నిద్ర పోవద్దని చెప్పు. ఇంటిలోనే తిరుగుతుండాలి. నచ్చిన దానిని సుఖంగా తిని జాగ్రత్తగా ఉండమని చెప్పు' 56.కాకాసాహేబు దీక్షితుతో బాబా, 'రాత్రి కునుకు పడుతుంటుంది. అతనిని నిద్ర పోనివ్వకండి' అని చెప్పారు. 57.అలా జాగ్రత్త పడగా ఆ బాధ వదిలిపోయింది. వ్రేలి మీద విషపుమంట కొద్దిగా ఉంది. 58.తరువాత అది కూడా పోయింది. ఎటువంటి భయంకరమైన గండం గడిచింది. ఇటువంటి ప్రేమమయి సాయిమాత, భక్తులకోసం కరుణతో కరిగిపోతారు. 59.'భట్యా! పైకి ఎక్కవద్దు' అన్న శబ్ద ప్రహారాన్ని బాబా మాధవరావు పైన ప్రయోగించారా? 60.కాదు, ఆ శబ్దసంధానం మాధవరావును ఉద్దేశించి కాక, కాటేసిన పాముపై తీవ్రంగా ప్రయోగింప బడింది. 61.ఎక్కావంటే ఖబర్దార్ అన్న సాయి నోటి నుండి వెలువడిన తీక్షణమైన ఆజ్ఞతో విషసంచారం ముందుకు

ప్రసరించకుండా అక్కడే ఆగిపోయింది.62.అంత మాత్రమే కాదు. 'పో క్రిందకు దిగి పో' అన్న సాయి యొక్క మాటే పంచాక్షరీ మంత్రం.దానితో తక్షణం విషం దిగి పోయింది.63.అంతే. లౌకికమైన పంచాక్షరీ మంత్రాలు ఇతరఉపాయాల అవసరం రాలేదు.ఈ విధంగా భక్తులకు ఆశ్రయమైన సాయి భక్తుల కష్టాలను తొలగిస్తారు. 64.బాబా ఏ మంత్రావర్తన చేయలేదు. నీటిని బియ్యాన్ని మంత్రించి చల్లలేదు. మరి విషం ఎలా దిగి పోయింది? 65.ఇది చమత్కారం కాదూ! వారి నోటి నుండి వెలువడిన మాటమాత్రంతో మాధవరావు బాధ తగ్గిపోయింది. వారి కరుణకు అంతమంటూ లేదు.66.గతాధ్యాయంలో సూచించిన అద్భుతమూ రసభరితమూ అయిన మొత్తం కథనంతా శ్రోతలు శ్రద్ధగా వినండి.67.మునుపటి అధ్యాయంలో వర్ణించిన దానికంటే ఇది విశేషమైనది. సాయిబాబా ఎలా లీలలను చేస్తారో శ్రోతలు వింటారు.68.రసపూరితమైన ఈ కథలను వింటే గురువచనాల యందు దృఢవిశ్వాసం కలిగి కర్మ అకర్మ వికర్మలు తొలగి పోయి గురుచరణాలయందు నిష్ఠ ఏర్పడుతుంది.69.సులభాతి సులభమైన ఉపాయం, సాయి పాదాలను హృదయంలో స్మరించండి. మాయా నిరసనానికి ఇదొక్కటే తరుణోపాయం.70.ప్రపంచంలోని భయం బహు బాధాకరమైనది. మాయా సముద్భూతమైన ఈ దుఃఖం కథా శ్రవణంతో విచ్ఛిన్నమై అఖండ ఆనందం కలుగుతుంది.71.ఒకసారి శిరిడీలో మహామారి కలరావ్యాధి వ్యాపించగా గ్రామస్థులు భయభీతులై గ్రామంలో దండోరా వేశారు.రహదారులన్నీ మూసివేశారు.72.కలరా వ్యాధి అధికమయేసరికి గ్రామస్థులు చాలా కలవర పడ్డారు.ఇతర గ్రామాలవారు రాకూడదని ఆంక్షను విధించారు.అన్ని వ్యవహారాలు ఆగిపోయినై.73.ఊరిలో కలరా ఉన్నంత వరకూ మేకను చంపరాదు. గ్రామ సరిహద్దులు దాటి ఏ బండి రాకూడదు అన్న నియమాలను పాటించసాగారు.74.గ్రామస్థులకు క్షుద్రదేవతలపై ఉన్న ఈ మూఢవిశ్వాసం

బాబాకు అసలు నచ్చలేదు. వారి ఉద్దేశంలో అది జనుల అజ్ఞానం.75.అక్కడ ఊరివారు నియమాలను విధించటం. వానిని బాబా అతిక్రమించటం ఎలా జరిగిందో శ్రద్ధగా వినండి.76.గ్రామ పంచాయతీ వారి నియమాలను గ్రామస్థులు పాటించాలి. వానిని ఏ కాస్త ఉల్లంఘించినా పరిహారంగా జరిమానా చెల్లించాలి. శిక్ష పడుతుంది. 77.బాబాకు ఆ శిక్ష భయంలేదు. వారు ఎప్పుడూ నిర్భయులు. వారు హరి చరణాలలో లీనమైనవారు. కలికాలాన్ని జయించినవారు. 78.ఒకసారి వేరే ఊరినుండి కట్టెలతో నిండిన ఒక బండి ఊరి శివారు వద్దకు రాగా అప్పుడు కఠిన పరిస్థితి ఏర్పడింది. ఊరివారు తగవు లాడుకోసాగారు.79.ఊరిలో కట్టలకు కరువుగా ఉందని ఊరివారందరికీ తెలుసు. కాని నియమాన్ని ఉల్లంఘించటం ఉచితం కాదని అందరూ బాధ పడసాగారు. 80.బండివాని వద్దకు వెళ్లి బండిని వెనుకకు మరలించసాగారు. ఈ విషయం బాబాకు తెలిసి, వెంటనే అక్కడికి చేరుకున్నారు. 81.వారు స్వయంగా బండి ఎదుట నిలబడగా బండివానికి ధైర్యం కలిగింది. గ్రామస్థుల పట్టుదల వదిలి పోయింది. బండి గ్రామశివార్లలోనికి వచ్చింది. 82.అక్కడి నుండి బండిని మండప ద్వారం వద్దకు రప్పించి, మండపంలో బండిని ఖాళీ చేశారు. ఎవరినోటి నుండీ ఒక్కమాటైనా రాలేదు. 83.గ్రీష్మంగాని, శరత్కాలం గాని, హేమంతంకాని, వర్షాకాలంకాని, వసంతఋతువుగాని, మసీదులో ఎల్లప్పుడూ బాబా ధుని మండుతుంది.84.బాబాయొక్క నిర్ధారణ ఎంత విచిత్రమైనది. అగ్నిహోత్రుని అగ్నిహోత్రం వలె బాబా యొక్క పవిత్ర ధుని అహోరాత్రులు ప్రజ్వలిస్తూ ఉంటుంది. 85.కేవలం ఈధుని కోసమే బాబా కట్టలను కొని మండపం ఎదుట గోడకు రాసిపోసి ఉంచేవారు. 86.సంత రోజున కట్టలు తెప్పించి పోగు చేసి ఉంచేవారు. వానిపైనే పొరుగు వారి కళ్లు. తమకు లాభం కలిగేంతవరకు నిర్లక్ష్యంగాఉండేవారు అరుదు.87'బాబా! పొయ్యిలోకి కట్టెలు లేవు. కట్ట పుల్లలు లేందే పొయ్యి రాజుకోదు'అని

ఏమేమో కల్లబొల్లి మాటలు చెప్పేవారు. వారుకూడా తమ వాటాను తీసుకొని పోయేవారు. 88.ఇతరులను కష్టబెట్టడం స్వార్థుల స్వభావం. మసీదులోని సభా మండపానికి ద్వారం లేదు. అందువల్ల వారికి మంచి అవకాశం. అవసరమున్న వారు మోసగాళ్లూ కూడా లాభం పొందేవారు. 89.సాయిబాబా గొప్ప పరోపకారి. వారి ఉదారత్వాన్ని ఎలా వర్ణించను? పైకి కఠినంగా కనిపించినా వారి అంతరంగం అత్యంత కోమలం.90.వారి మహిమ అగాధం. నిరభిమానంగా వారి చరణాలకు అభివందనం చేస్తేనే,వారిని అవగాహన చేసుకోగలం.91. పరమేశ్వరుడు చరాచరాలలో వ్యాపించి ఉన్నాడని నిరంతరం గుర్తుంచుకొని ఎవరితోనూ వైరం తెచ్చుకోకూడదు.92. సృష్టి అంతటా దశదిశలూ ముందూ వెనుక లోపలా బయటా పరమేశ్వరుడు నిండి ఉన్నాడని తెలుసుకున్నవారు ఎవరైనా, ఎవరినైనా చెడుబుద్ధితో చూస్తే బాబా బాధపడేవారు.93.సాయిబాబాకు సంపూర్ణవైరాగ్యం ఉన్నా, సమాజ వ్యవస్థను రక్షించటానికి తమను ఆశ్రయించిన వారికి మార్గదర్శకంగా ఉండటానికి ప్రపంచికుని వలె ఆచరించేవారు.94. ఈ మహాత్ముని నమ్రతను వింటే ఆశ్చర్యం కలుగుతుంది. భక్తుల యెడ వారి ప్రేమ కనిపిస్తుంది. వారి అవతారం సార్థకం. 95.వారి హృదయంలో దీనుల ఎడల అమితమైన వాత్సల్యం, వారికి వినమ్రత చాలా ఇష్టమని కోటానుకోటి అనుభవాలను చెప్పవచ్చు. 96.వారు ఉపవాస తపవాసాలు ఎన్నడూ చేసి ఎఱుగరు. హఠయోగాది సాధనాలతో శ్రమించేవారు కాదు. రుచిగా కమ్మగా కావాలని ఎన్నడూ కోరుకునే వారు కాదు. ఆహారాన్ని కొంచెంగానే సేవించేవారు. 97.కొన్ని ఇళ్ళకు నియమంగా వెళ్ళి చద్దివో ఎండువో రొట్టెలను అడుక్కునే వారు. ఇదే వారి నిత్య భిక్ష. వారు జిహ్వాను అదుపులో ఉంచే వారు.98.వారు జిహ్వా యొక్క కోరికలను తీర్చేవారు కాదు. మృష్టాన్నాలను ఆశించే వారు కాదు. ఏది లభించినా, లభించక పోయినా సంతుష్ట పడేవారు.99.అలా ప్రాణధారణను చేసుకుంటూ,

నిరభిమానంగా ఉంటూ, జ్ఞానానికి, మోక్షానికి, సాధనమైన శరీరాన్ని రక్షించుకునేవారు. 100.వారి శాంతియే వారి భూషణం. వారికి మాలలూ అలంకరణలూ, విభూతి మరియు చందన చర్చనలూ అవసరం లేదు. శ్రీసాయి పూర్ణ పరబ్రహ్మ. 101. అతి పావనమూ, బోధదాయకమూ, భక్తి ప్రధానమూ అయిన ఈ ఆఖ్యానాలను శ్రద్ధగా శ్రవణం చేసిన వారి మోయాభ్రమ తొలగిపోతుంది. 102.భావార్థులైన శ్రోతలు జతగూడినప్పుడు, సాయి యొక్క నిధి తెరుచుకుంటుంది. వ్యర్థంగా కుతర్కం చేసే వారికి ఇది అర్థం కాదు.అమాయక భక్తులు ఆ ప్రేమను అనుభవించగలరు. 103.ఇక తరువాతి కథానుసంధానం. శ్రోతలు ఏకాగ్రమనసుతో వింటే ప్రేమ ఉప్పొంగి కళ్లలో ఆనందాశ్రువులు నిండుతాయి.104. బాబా చాతుర్యం ఎంతటిది? వారి యుక్తి ప్రయుక్తుల లోని మర్మాన్ని సద్భక్తితో తెలుసుకున్న వారు తరచు అనుభవాలను పొందుతారు.105.ఈ సాయి చరిత్ర పీయూష పానం. దానిని శ్రద్ధగా ఆదరించి గురుచరణాలలో మనసు నుంచి కథానుసంధానాన్ని వినండి.106.ఈ కథ అపూర్వమైన ఆనందరస భోజనం. దీనిని సేవించేటప్పుడు శ్రోతలు త్వరపడకూడదు. రకరకాల పదార్థాలలోని విశిష్టతను యథేచ్ఛగా చవిచూడాలి. 107.కట్టెలబండి కథ చాలు. అంతకంటె విలక్షణమైన మేక కథా వృత్తాంతాన్ని వింటే శ్రోతలకు ఆశ్చర్యం, గురుభక్తులకు ఆనందం కలుగుతుంది.108.ఒకసారి ఒక తమాషా జరిగింది.ఎవరో మరణానికి సిద్ధంగా బక్కచిక్కి ఉన్న ఒక మేకను తెచ్చారు. దానిని చూడటానికి జనం వచ్చారు.109.యజమానిగాని, ఏ దిక్కూమొక్కూగాని లేని వారిని రక్షించేవారు సాయిమాత. బలహీనులు, రోగగ్రస్తులు, దుఃఖితులు మసీదులో సేద తీర్చుకుంటారు. 110.మేకను తెచ్చినప్పుడు బడేబాబా దగ్గరే ఉన్నాడు.'ఒక్కదెబ్బతో దీనిని చంపేసి బలి ఇవ్వు' అని బాబా అతనితో చెప్పారు.111.ఈ బడే బాబా ఎంత గొప్పవాడు.బాబాకు కుడిచేతి వైపు కూర్చునే

వాడు. ఇతడు ముందు చిలుము పీల్చిన తరువాత బాబా చిలుం సేవించేవారు.112.బడే బాబా లేకుండా బాబా ఏపనీ చేసేవారు కాదు. అతడు భోజనం చేయకుండా బాబా భోజనం చేసేవారు కాదు.113. ఒకసారి దీపావళి వంటి పండగరోజున పళ్లాల నిండా పక్వాన్నాలను వడ్డించారు. పంక్తిలో అంతా తమతమ స్థానాలలో కూర్చున్నారు. బడేబాబా అలిగి వెళ్లిపోయాడు.114.బడేబాబా పంక్తిలో లేకుండా సాయిబాబా అన్నం తినరు. సాయిబాబా ఆహారం తీసుకోకపోతే ఇతరులెలా తింటారు?115.అందువలన అందఱూ వేచి ఉండి చివరకు బడే బాబాను వెదకి పట్టుకునివచ్చారు. అతడు పంక్తిలో కూర్చున్నాక బాబా ఆహారాన్ని సేవించారు.116.జరుగుతున్న కథను వదిలి బడే బాబా గురించి తెలియచేయాలనిపించింది. దీనిని అడ్డుకథ అని తలవకండి.117.బడే బాబా బాబా యొక్క అతిథి.భోజన సమయానికి సభామండపంలో బాబా పిలుపు కోసం చెవులు అటే ఉంచి క్రింద కూర్చునేవాడు. 118.రెండు వైపులా రెండు పంక్తులుంటే మధ్య భాగంలో బాబా విరాజమానులయేవారు. బాబాకు ఎడమవైపున బడేబాబా స్థలం ఖాళీగా ఉండేది.119.నైవేద్యాలన్నీ పళ్లాలలో వడ్డించాక ఆ పళ్లాలను పంక్తిలో పెట్టాక, భోజన సమయం రాగా,భోజనం చేసేవారు తమతమ స్థానాలలో కూర్చునేవారు.120.అప్పుడు బాబా స్వయం అత్యంత ఆదరంగా పరమ ఆదరంగా ఉచ్చ స్వరంతో 'బడే మియా' అని పిలువగా అతడు వెంటనే వందనం చేస్తూ పైకి వచ్చేవాడు. 121.నిష్కారణంగా అన్నంపై అలిగిన వానిని ఆదరించడమా! ఆహారాన్ని అవమానపరచిన వానికి ఇంత గౌరవం ఎందుకు?122.అంటే బాబా లౌకిక వ్యవహార పద్ధతిని తాము స్వయంగా ఆచరించి చూపారు. భోజన పంక్తిలో అతిథికి పెట్టకుండా అన్నం సేవించడం ఉచితంకాదు.123. గృహస్థుల ఈ ధర్మాన్ని బాబా ఎప్పుడూ ఉల్లంఘించలేదు. భక్తుల ఆపదలను తొలగించే పనులను వారు స్వయంగా ఆచరించేవారు.124.అతిథి

పూజతో ఇష్టప్రాప్తి. దానివలన అరిష్టాలు తొలగిపోతాయి. లేకపోతే విఘ్నాలు నిశ్చయం. అందువలన శిష్యులు అతిథులను పూజిస్తారు.125.అతిథి భోజనం చేయకుండా ఉంటే పశుపుత్ర ధనధాన్య వినాశనం. అతిథిని ఉపవాసం ఉంచితే అనర్థాన్ని ఆహ్వానించినట్లే. 126.సాయి సమర్థులు బడేబాబాకు ప్రతిరోజు యాభై రూపాయలను దక్షిణగా ఇచ్చేవారు. అతనికి వీడ్కోలు చెప్పటానికి స్వయం వంద అడుగులు అతనివెంట వెళ్ళేవారు. 127.మేకను బలి ఇమ్మని ఆ బడేబాబాకు మొదటి అవకాశాన్ని ఇస్తే 'దీనిని ఊరికెనే ఎందుకు వధించాలి' అని అన్నాడు. 128.అక్కడే ఉన్న మాధవరావుతో బాబా, 'శ్యామా! నీవైనా కత్తిపట్టుకురా ఈమేకను కోద్దాం,వెళ్లు' అని ఆజ్ఞాపించారు. 129.మాధవరావు గొప్ప భక్తుడు. రాధాకృష్ణబాయి వద్దకు వెళ్లి కత్తిని పట్టుకుని వచ్చి బాబా ముందు ఉంచాడు. 130.మాధవరావు కత్తిని పట్టుకు రావటానికి శ్రమ పడినా అతడు కత్తి లేకుండా వచ్చి ఉంటే అది బాబాకు నచ్చేది కాదు. 131.ఇంతలో ఈ విషయం రాధాకృష్ణబాయి చెవిలో పడి ఆమెకు దయకలిగి కత్తిని మెనుకకు తెప్పించేసుకుంది. 132.మాధవరావు మరోకత్తిని పట్టుకుని రావటానికి వెళ్లి, తన చేతులతో ఆ హత్య జరగకూడదని వాడాలోనే కూర్చుండి పోయాడు.133.తరువాత కాకా దీక్షితు మనసును పరీక్షించాలని బాబా 'నీవు వెళ్ళి కత్తిని పట్టుకురా. ఆ మేకను వధించి దానిని బాధనుండి విముక్తి చేద్దాం' అని ఆజ్ఞాపించారు.134.కాకా అపరంజి బంగారమని బాబాకు తెలిసినా, దానిని కాల్చి పుటం పెట్టితే తప్ప జనులకు విశ్వాసం కుదరదు.135.బంగారం మంచిదా కాదా అని గీటురాయి మీద పరీక్షించకుండా జనం ఒట్టి మాటలను నమ్మరు.136.విలువ రావటానికి రత్నం సమ్మెట పోట్లను సహించాలి. అట్లే సుత్తి దెబ్బలు సహించకుండా రాతికి దివ్యత్వం రాదు.137.కాకా బాబా మెడలోని తాయెత్తు, అయినా ఇతరులకీ విషయం ఎలా తెలియ చేయాలి? రత్నాన్ని పరీక్షించేవారు దానికి తీగకట్టి అగ్నిలో వేస్తారు.

138.సత్పురుషుల వచనాలను సందేహించేవారి సంకల్పం వ్యర్థం. వారిమాటలు సారహీనం. వారు పరమార్థాన్ని కించిత్తైనా సాధించలేరు.139.గురువచనాలు వందనీయమని తలచేవారి స్వార్థం పరమార్థం సఫలీకృతమౌతాయి. కాని వాని యందు దోషాన్ని,కుటిలత్వాన్ని చూచేవారు అధః పతనాన్ని పొందుతారు.140.గురుసేవాతత్పరులు, గురువు ఆజ్ఞ యందు గౌరవమున్నవారు తమ ఇష్టాయిష్టాలను, ఆలోచనలను గురువు శిరసుపై ఉంచుతారు. 141.గురువు ఆజ్ఞను పాలించే సేవకులు స్వతంత్రంగా ఆలోచించరు. గురువు ఆజ్ఞను ఎప్పుడూ పాటించే వారు మంచి చెడులను సారాసారాలను చూడరు.142.వారి చిత్తం సాయి నామస్మరణలో, దృష్టి సాయిసమర్థుని చరణాలలో ఉంటాయి. మనోవృత్తి సాయి ధ్యానధారణలయందు ఉంటుంది. వారి శరీరం సాయి కొఱకే. 143.గురువు ఆజ్ఞను, ఆజ్ఞాపాలనను రెండింటిలో ఒక్క క్షణమైనా ఆలస్యం సహింపరానిది. ఇది విలక్షణమైన విధానం. 144.దీక్షితు శుద్ధ సత్వగుణం కల ధీరుడు. మహా మేరుపర్వతం వలె దృఢ నిశ్చయం కలవాడు. మేక ప్రాణాలను ఎలా తీయాలా అన్న ఆలోచన అతనికి సోకనేలేదు.145.అమాయకమైన మేక చస్తుంది. దాని ఆత్మ తల్లడిల్లుతుంది. స్వచ్ఛమైన తన చరిత్రకు అప్రతిష్ఠ, పైగా మహా పాపం పైన పడుతుంది.146.అన్న ఆలోచనలే అతనికిలేవు.ఆజ్ఞాభంగం పాపం. ఆజ్ఞా పరిపాలన కంటే పుణ్యం లేదు.147.గురువు ఆజ్ఞయే ప్రమాణమని తలచే అతని కోమలాంతఃకరణంలో విచిత్రమైనప్రేరణ కలిగి మేక ప్రాణాలు తీయడానికి ఉద్యుక్తుడయ్యాడు.148.బాబా ఆజ్ఞానుసారం సాఠె వాడాకు వెళ్లి ఆయుధాన్ని తెచ్చి మేకను వధించటానికి సిద్ధమయ్యాడు. కించిత్తైనా సంకోచించలేదు.149.గురువు ఆజ్ఞా పరిపాలనే వీరుల లక్షణమని తలచి మనసును దృఢం చేసుకుని కత్తిని చేతపట్టుకున్నాడు150.దీక్షితు పవిత్రమైన బ్రాహ్మణ వంశంలో జన్మించి, పుట్టినది మొదలు అహింసా వ్రతాన్ని ఆచరించినవాడు.మరి అతనికి ఇలాంటి

సందర్భంలో చేతులెలా వస్తాయి?151.గుర్వాజ్ఞా పాలనకు మనసులో గట్టిగా నిశ్చయించుకున్నాడు. కాని గుండె దడదడ లాడింది. శరీరం చెమటలు పట్టింది.152.కాయావాచామనసా శబ్దప్రహారమే తెలియని వాడు శస్త్రప్రహారం చేయటమా? ఎంత కఠినమైన సంఘటన!153.గురువచనాలను అవమానించిన వారికి వేరుగతి లేదు. పైగా వారి పూర్వ పుణ్య కర్మ నిశ్చయంగా నశిస్తుంది.154.గురువు ఆజ్ఞా పరిపాలనే భూషణాలలో భూషణం. శిష్యుని అర్హతకు ఇదే గుర్తు. గురువు ఆజ్ఞా ఉల్లంఘనం మహా పాపం.155.గురువు ఆజ్ఞను ఒక క్షణమైనా ఆలస్యం చేయకుండా పాటించాలి. అలా చేయటంలో సందేహించేవాడు దౌర్భాగ్యుడు. కొమ్ములులేని నరపశువు. 156.గురువు ఆజ్ఞను పాటించడానికి ముహూర్తాలు, శుభాశుభాలు, ఇప్పుడు,తరువాత అన్నవి అవసరంలేదు. ఏమీ ఆలోచించకుండా వెంటనే ఆజ్ఞను పాలించేవాడు వివేకి. అలా కాక ఆలస్యం చేసేవాడు దౌర్భాగ్యుడు. 157.దీక్షితు ఒక చేతితో పంచెను నడుముకు బాగా బిగించి,రెండవ చేతితో కత్తిని పుచ్చుకుని చొక్కాను చేతివైకి జరుపుకుంటూ మేక వద్దకు వచ్చాడు.158.ఇదేం విచిత్రం! కాకా మనసులోని కోమలత్వం ఎక్కడికి పోయింది అని గ్రామస్థులు ఆశ్చర్యపడ్డారు.159.ముసల్మాను, మాంసాహారియైన ఫకీరు బాబా మేకను చంపటానికి వెనకాడి, కత్తిని పట్టుకోనప్పుడు కాకా ఎలా సిద్ధమయ్యాడు?160.మహా పురుషులు వజ్రం కంటె కఠినంగాను కుసుమాలకంటె కోమలంగాను ఉంటారని అంటారు.అది నిజమే.161.దీక్షితు కత్తిపట్టుకున్న చేయిని వైకి లేవనెత్తి బాబా! ఒకసారి చెప్పండి. దీనిని చంపేయనా అని అడిగాడు.162.శస్త్రధారణ ఆర్తులను రక్షించటానికి కదా, ఆ శస్త్రంతో నిరపరాధ మేకను చంపటమా? గురుసేవకే ప్రాణాలను అంకితం చేసిన వారికి సంకోచమా?163.దీక్షితు మేకను చంపాలని త్వరపడినా అతని హృదయంలోని కరుణ వలన చేయి వెనకకే గాని ముందుకు సాగటం లేదు.164.'ఇంకా

చూస్తున్నావేమి? చంపేసేయి' అన్న బాబా చివరి ఆజ్ఞను విని దీక్షితు ఆవేశంగా దెబ్బకొట్టడానికి వంగాడు. 165.కత్తిని పైకెత్తాడు. మేకకు పోయే కాలం వచ్చింది. అయినా దానిని రక్షించేవాడు భగవంతుడు. అతని దయ తక్షణం దానికి ప్రాప్తించింది.166.ఇప్పుడు కాకా తప్పక వధించేసేలా ఉన్నాడని అపాయాన్ని గ్రహించిన సాయి మాత 'వద్దులేరా ఊరుకో!.167. బ్రాహ్మణుడవై ఇంత కఠోరంగా హింస చేయటానికి సిద్ధమయ్యావు. నీ మనసుకు ఆలోచనే లేదా' అని అడిగారు.168.ఈ మాటలు విని దీక్షితు కత్తిని పడవేశాడు. అందరికీ ఆశ్చర్యం కలిగింది. మేకకు ప్రాణదానం జరిగింది. గురుభక్తి శిఖరాన్ని అధిష్ఠించింది.169. అప్పుడు కాకా కత్తి పడేసి ఏమన్నాడో వినండి. 'బాబా! మీ అమృత వచనాలు మాకు ధర్మశాసనం.170.మేము రెండో ధర్మాన్ని ఎరుగం. మాకు సిగ్గూ లజ్జా లేవు. గురు వచనా పాలనే మా కర్తవ్యం. ఇదే మాకు వేదం.171.గురువు ఆజ్ఞా పరిపాలనే శిష్యుల శిష్యత్వం. అదే వారికి భూషణం.అలా కాక గురువు ఆజ్ఞను ధిక్కరించటం దోషం.172. సుఖమైనా కష్టమైనా మాకు ఫలితంపై దృష్టిలేదు. విధి ప్రకారం జరిగేది జరుగుతుంది. మా గురించిన చింత పరమేశ్వరునికే.173.మాకు తెలిసిందల్లా ఒక్కటే. మీ స్వరూపాన్ని కళ్లల్లో నింపుకుని ఎల్లప్పుడూ మీ నామాన్ని ధ్యానించటం, అహర్నిశలూ మీ ఆజ్ఞాకింకరులమై ఉండటం.174.హింసా అహింసా మేమెరుగం. మమ్ము తరింప చేసేవి సద్గురు చరణాలు. గురువు ఎందుకొఱకు ఆజ్ఞాపించారని మేం ఆలోచించం. ఆజ్ఞాపాలనే మా కర్తవ్యం.175. గురువు ఆజ్ఞ స్పష్టంగా తెలిశాక, యుక్తాయుక్తాలను ఇష్టాయిష్టాలను ఆలోచించే శిష్యులు సేవా భ్రష్టులై నష్టపోతారు.176. గురువు ఆజ్ఞను ఉల్లంఘించటం జీవుని అధఃపతనం.గుర్వాజ్ఞా పరిపాలన ముఖ్యమైన ధర్మాచరణ.177.మనసు గురుచరణాలలో ఉండాలి. ప్రాణాలు ఉండనీ పోనీ మాకు గురువు ఆజ్ఞయే ప్రమాణం. దాని ఫలితం గురువుకు తెలుసు. 178.మేము

మంచి చెడు ఎరుగం. స్వార్థం పరమార్థం ఎరుగం.ఒక్క గురుకార్యార్థం జీవించటమే మాకు తెలుసు.అదే మా పరమార్థం. 179.గురువు మాటకు విధి నిషేధాలు ఉండవు. గురువు ఆజ్ఞాపించిన కార్యమే శిష్యుని లక్ష్యం. శిష్యుని కష్టాలు గురువు శిరసు పై ఉంటాయి.180.మేము మీ ఆజ్ఞకు దాసులం. యోగ్యాయోగ్యాలను ఆలోచించం. అవకాశం వచ్చినప్పుడు ప్రాణాలు సైతం వెచ్చించైనా గురువచనాలను పాటిస్తాం' అని చెప్పాడు 181. కరుణ స్వభావం గల అతని మనసు పాషాణంలా కఠినంగా కాగా, కసాయి కూడా సాహసించని పనిని బ్రాహ్మణుడై కూడా చేయటానికి సిద్ధమయ్యాడు.182.ఇదంతా శ్రోతలకు నమ్మటానికి కష్టమనిపిస్తుంది. కాని ఇది సద్గురువు చేసిన గారడి. గురువచనాలను ఒక్కసారి పాటిస్తే అందులోని రహస్యం తెలుస్తుంది. 183.ఒక్కసారి గురువును ఆశ్రయించి వారి చరణాల యందు సంపూర్ణ విశ్వాసం ఉంచితే చాలు. ఇక శిష్యుని చింత గురువుది. ఇక ఏ శ్రమా చేయవలసిన అవసరం లేదు. 184.అతని బాధ్యత గురువుదే కనుక ఎల్లప్పుడూ గురువు పాదాలను విశ్వసించేవారికి ఏ భయమూ ఉండదు. అతని ఆత్మవిశ్వాసం గురువే. ఒడ్డుకు చేర్చేవారు గురువే. 185.ఉత్తమ, మధ్యమ, అధమ అని శిష్యులు మూడు రకాలుగా ఉంటారు. ఒక్కోరకాన్ని సంక్షిప్తంగా తెలియజేస్తాను. 186.గురువు యొక్క మనోభీష్టాన్ని తెలుసుకొని వారి ఆజ్ఞకోసం ఆగక వారు చెప్పక ముందే దానిని వెంటనే పాటించటం ఉత్తమ శిష్యుని లక్షణం. 187. గురువు ఆజ్ఞను తుచ తప్పకుండా అక్షరం అక్షరం ఆలస్యం చేయకుండా పాటించేవారు మధ్యమ శిష్యులు. 188. గురువు ఆజ్ఞాపించినప్పుడు చేస్తా చేస్తానంటూ జాప్యం చేస్తూ, అడుగడుగునా పొరపాటు చేయటం అధమ శిష్యుని లక్షణం. 189.గురువు వద్దే ఉన్నా,అంతరంగంలో నిత్యానిత్యవివేకం పరమవైరాగ్యం లేకపోతే గురువు వారిని ఎలా అనుగ్రహిస్తారు?190.నిరంతరం గురుచరణాలను ఆశ్రయించి ఉన్న వారి కోరికలను ఆప్త బంధువైన

పరమేశ్వరుడు తీర్చి, వారిని నిష్కాములుగా వారి మనసులను నిశ్చలంగామారుస్తాడు.191.నిస్వార్థమైన శ్రద్ధ ప్రబలమైన ప్రజ్ఞాబలం, దృఢమైన సహనం ఉంటే పరమార్థం నిశ్చయం.192.ఇక్కడ హఠయోగం ప్రాణాయామం సమాధి వగైరా అవసరం లేదు. ఈ సాధనలన్నీ మనకు అర్థం కానివి.193. శిష్యుడు బాగా శిక్షణ పొందితే ఇక సద్గురువు యొక్క అనుగ్రహానికి ఏమీ ఆలస్యం.194.గురువు ఎల్లప్పుడూ వారి కరుణను ప్రసాదించటంలో తత్పరులై ఉంటారు. సగుణ సాక్షాత్కారాన్ని భక్తులు మాత్రమే అనుభవిస్తారు. భావికులకు భక్తి కలుగుతుంది. ఇతరుల మనసులలో డాంబికం. 195.తరువాత బాబా కాకాతో 'ఈ సిల్ల డబ్బా పట్టుకో. నేను ఇప్పుడు హలాల్ చేసి దీనికి సద్గతిని కలిగిస్తానని' అన్నారు. 196.అసలే ఆ మేక చావుకు సిద్ధంగా ఉంది.అక్కడే దగ్గరలో తకియా ఉంది. ఫకీరు బాబాకు సమయానికి సరిగ్గా ఒక ఆలోచన తట్టింది.1 97.ఆ మేకను తకియాలో వధించటానికి బాబా అనుమతిని తీసుకున్నాడు. కాని అక్కడి నుండి తీసుకుని వెడుతుంటే మేక దారిలోనే చచ్చిపోయింది. 198. మేక చావటం తప్పదని అందరికీ తెలుసు. ఆ విషయాన్ని గ్రహించి సరైన సమయంలో బాబా ఆ లీలను చూపించారు. 199. సద్గురువును శరణు జొచ్చిన వారు సద్గురు స్వరూపులైపోతారు. సైంధవం సాగరం లోనికి స్నానానికి వెడితే అది మరల బయటకు రాగలదా? 200.ఈ జగత్తులో సుఖదుఃఖాలను అనుభవించే భోక్త జీవుడు. ప్రపంచంలోని సుఖదుఃఖాలను ప్రసాదించేవాడు పరమేశ్వరుడు. కాని మోక్ష ప్రదాత ఒక్క సద్గురువే. వారు ఆత్మైక్యతకు నిధి.201.సద్గురువు హృదయంలో దయ కలిగితే వారు దివ్యదృష్టిని ప్రసాదిస్తారు. దానితో ఈ సకల సృష్టి ఒక్కసారిగా మాయమౌతుంది. 202. హేమాడుపంతు సాయి చరణాలకు శరణుజొచ్చి శరీరాభిమానాన్ని వదిలి వేసి, బాబా! నన్ను నిరభిమానంగా ఉంచండి అని ప్రార్థిస్తున్నాడు. 203.తరువాతి రెండు అధ్యాయాలలో

పరిహాసాలతో సాయి మహారాజు తయారు చేసిన హాస్యరస భోజనంలోని విశేషాన్ని గ్రహించండి.204.పైకి వినోదంగా కనిపించినా అది అత్యంత జ్ఞానదాయకం. అర్థం చేసుకున్నభక్తులు పరమ సుఖాన్ని పొందుతారు. 205. స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో గురుభక్తి లీలా దర్శనమను ఇరువది మూడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయి నాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీసాయి సచ్చరిత - 24 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయంలో కరుణామయులైన సాయి సద్గురువు వినోదాలతో హాస్యాలతో కూడా ఎలా బోధించారో చెప్తానని, మాట ఇచ్చాను కదూ. 1.నేను చెప్తుతానని అనడం అహంకారం. గురుచరణాలలో నిరహంకారం ఉండాలి. అప్పుడే కథ చక్కగా సాగుతుంది. ఇక శ్రద్ధగా వినండి. 2.సాధుసజ్జనులు మహాపురుషులు ఎల్లప్పుడూ మేఘాలులేని ఆకాశంవలె స్వచ్ఛంగా, నిర్మలంగా, నిష్కల్మషంగా, పరిశుద్ధంగా నిర్దోషులై ఉంటారు. 3.సాయి మహారాజు యొక్క ఆరాధన స్వార్థానికి పరమార్థానికి సాధనం. అంతేకాక, స్వస్వరూపాను సంధానానికి సహాయపడుతుంది. దాని వలన మనసుకు శాంతి కలుగుతుంది. 4.తమ హితాన్ని సాధించతలచే వారు ఈ కథలయందు శ్రద్ధ ఉంచాలి. దానితో సహజంగా పరమానందాన్ని అనుభవిస్తారు. జీవితం సార్థకమౌతుంది. 5.శ్రవణంతో మనసుకు విశ్రాంతి కలిగి, భవభయ భ్రాంతి తొలగుతుంది. పరమానంద ప్రాప్తి కలుగుతుంది. శ్రోతలకు సద్గతి తప్పక కలుగుతుంది. 6.అంతర్ సాక్షియైన సాయి సమర్థులు భక్తుల మనోభావాలను సంపూర్ణంగా తెలుసుకుంటారు. తమ కర్తవ్యాన్ని పాలించి తమ మాట నిలబెట్టుకుంటారు. 7.బుద్ధిని ప్రేరేపించే సాయి సమర్థులు తమ వచనాలను తామే తెలియ చేస్తారు. స్వార్థాన్ని పరమార్థాన్ని సాధింప చేసే ఆ వచనాలను నాయథా శక్తి చెప్తుతాను. 8.జనులు అంధులు కారు, రాత్రింవేళ చూడలేని వారు కాదు. కళ్లు ఉండీ జనులు గ్రుడ్డివారు. కేవలం శరీర తాదాత్మ్యం

వలన తమ హితాన్ని తెలుసుకోలేకున్నారు.9.ఈ శరీరం ఎలా ఉంది అంటే ఒక్క క్షణమైనా దీనిని విశ్వసించలేం. అందువలన చేతులు జోడించి ఒక్క క్షణం ఈ కథా రసాన్ని చవిచూడమని ప్రార్థిస్తున్నాను.10.వినోదాలు పరిహాసాలు అందరికీ ప్రీతి.బాబా పద్ధతి అలౌకికం. వారు పరిహాసంలో నుండి కూడా అందరికీ హితకరమైన బోధను చేసేవారు. 11.జనులు ఎగతాళిని ఇష్టపడరు. కాని బాబా యొక్క పరిహాసాన్ని కోరుకునే వారు తమ వంతు ఎప్పుడు వస్తుందా అని ఇష్టంగా ఎదురు చూచేవారు. 12.సాధారణంగా ఎవరికీ పరిహాసం ఇష్టముండదు. ఈ పరిహాసం పరమ ఇష్టం. పైగా అభినయంతో కూడిన దైతే అది కార్యాన్ని తప్పక సిద్ధింపచేస్తుంది. 13. అభినయాలతో మందహాస వదనంతో నయన విలాసాలతో హాస్యరసంతో నిండిన పరిహాస రసాన్ని వర్ణించలేం. 14. ఇప్పుడు పరిహాసంలో నుండి పరమార్థాన్ని ఉత్పన్నం చేసి,ఒక చిన్న ఉపదేశాన్నిచ్చిన,అభినవమైన నా అనుభవ కథను చెప్తాను శ్రద్ధగా వినండి. 15.శిరిడీలో ప్రతి ఆదివారం పెద్ద సంత జరుగుతుంది. ఆరుబయట డేరాలు వేయబడతాయి. బాగా వ్యాపారం జరుగుతుంది. 16.అక్కడే దారి ప్రక్కన కూరగాయల రాసులుంటాయి. నూనె , తమలపాకులు అమ్మేవారు తమ సరుకులను పెట్టుకొని దారి ప్రక్కన కూర్చుంటారు.17.ఒక ఆదివారం మధ్యాహ్నం నేను బాబా వద్ద కూర్చుని వారి పాద సంవాహన చేస్తుండగా ఒక విశేషం జరిగింది.18.అది మధ్యాహ్నం దర్బారు. రోజుకు మల్లె జనం కిక్కిరిసి ఉన్నారు. పైగా ఆదివారపు సంత. చాలా మంది జనం చేరారు.19.నేను బాబా ఎదుట కుడివైపుగా కూర్చుని తలవంచుకుని నామాన్ని స్మరిస్తూ బాబా పాదసేవ చేస్తున్నాను.20.మాధవరావు ఎడమ ప్రక్క, వామనరావు కుడివైపు, శ్రీమంతుడైన బుట్టి తమ స్థలాల్లో సేవకొఅకు కూర్చున్నారు. 21.కాకా కూడా అక్కడే కూర్చున్నాడు.ఇంతలో మాధవరావు 'అణ్ణాసాహేబు! ఇక్కడ ఉన్న ఈ గింజలు ఎక్కడివి అని నవ్వాడు. 22.అలా అని కోటు చేతిని

వ్రేలితో తాకగా కోటు చేతి మడతలలోని గింజలు పైకి వచ్చాయి.23.అవి ఏమిటా అని ఎడమ మోచేయి చాచి చూద్దునుగదా, టపటపమని వేపిన శనగ గింజలు క్రిందకురాలాయి.వానిని భక్తులు ఏరటం చూచాను.24.అలా ఏరి పోగు చేసినవి పాతిక శెనగ గింజల దాకా ఉన్నాయి. ఆ వరిస్థితి పరిహాసానికి కారణమైంది.ఇది ఎలా జరిగింది? 25.తర్కంపైన తర్కం. శనగగింజలు కోటులోకి ఎలా వెళ్లాయి? అని అందరికీ ఆశ్చర్యం కలిగింది.26.ఖాకీ కోటు మడత ఎంత? దానిలో ఈ గింజలు ఎలా ఎక్కడినుండి వచ్చి చేరాయో. నిశ్చయంగా ఎవరికీ తెలియదు.27. నేను నామాన్ని జపిస్తూ పాదసేవ చేస్తుండగా ఈ పప్పుగింజల కథ ఎలా ఉత్పన్నమైంది?28.ఎంతో సేపటి నుండి సేవచేస్తుంటే అవి రాలలేదేం? అంత సేపు అవి అక్కడ ఎలా ఉన్నాయి? అని అందరికీ ఆశ్చర్యం కలిగింది.29.ఎక్కడి నుండి శనగగింజలు అక్కడికి వచ్చాయి? కోటు మడతలలో ఎలా ఉన్నాయి? అని ఆశ్చర్యపడుతుండగా, బాబా ఏమన్నారో వినండి. 30.బోధనా పద్ధతి విలక్షణమైనది. అనేకుల పద్ధతి అనేకరకాలుగా ఉంటుంది. బాబా వారివారి స్థితి గతులను బట్టి బోధిస్తారు.31.ఆ మహారాజు యొక్క శిక్షణా పద్ధతి విచిత్రం.ఆనందంగా ఉండే ఆ పద్ధతి, ఎప్పుడూ గుర్తుంటుంది.నా అనుభవంలో అటువంటి దానిని కనివిని ఎరుగను.32.'ఇతనికి తను ఒక్కడే కమ్మగా తినే దురలవాటుంది. ఇవాళ సంత కదా. వెళ్లి శనగపప్పు తిని వచ్చాడు.33.ఒక్కరే తినటం మంచిదికాదు. అతని అలవాటు నాకు తెలుసు. ఈ శనగపప్పే దానికి సాక్ష్యం. ఇంక ఆశ్చర్యమెందుకు?'అని అన్నారు.34.ఎవ్వరికీ పెట్టకుండా తినటం నేనెరుగను. కనుక నాకు ఈ దురలవాటును అంటగట్టినా, నాకది వర్తించదు.35.బాబా! నేను ఈ నాటి వరకు శిరిడీలోని సంతను అసలు చూడనే లేదు.మరి శనగపప్పు కొని తిన్నది ఎప్పుడు?36.ఎవరికైనా అటువంటి అలవాటు ఉందేమో కాని నాకు మాత్రం ఆ దురలవాటు లేదు. ముందుగా ఎవరికైనా కొంచెమైనా

పెట్టకుండా నేను ఏ వస్తువునూ నోట్లోవేసుకోను.' అని చెప్పాను.37. బాబా యుక్తిగా ఏ విధంగా తమ పాదాలయందు భక్తిని స్థిరపరుస్తారో గమనించండి. నా మాటలను విని ఏమన్నారో వినండి.38.'దగ్గరుంటే వారికి ఇస్తావు. ఎవరూ లేకపోతే నువ్వైనా ఏంచేస్తావు? నేను మాత్రం ఏం చేయగలను? నేను గుర్తున్నానా?39.నేను నీవద్దలేనా? నాకు ఆహారం అర్పిస్తున్నావా?' అని కేవలం శనగపప్పు మిషతో అసలు తత్వాన్ని చక్కగా బోధించారు.40.ముందు దేవతలకు, పంచప్రాణాలకు వైశ్వానర దేవతాగ్నికి, అర్పించకుండా, అతిథికి పెట్టకుండా భోజనం చేస్తే ఆ ఆహారం మహాదోష పూరితం.41.ఇది చాలా చిన్న విషయంగా అనిపిస్తుంది. కాని దీనిని వ్యవహారంలోకి ప్రవేశ పెడితే గొప్ప మహిమ గలదని తెలుస్తుంది. ఇది ఒక రసాస్వాదన గురించి చెప్పినా పంచ విషయాలకూ ఇది వర్తిస్తుంది. 42.విషయ భోగాలకు బాగా అలవాటుపడి, విషయాల అధీనంలో ఉండేవాడు పరమార్థాన్ని సాధించలేడు. విషయాలను తన అధీనంలో ఉంచుకునే వానికి పరమార్థం దాసోహం అంటుంది.43.'యదా పంచావతిష్ఠంతే' అన్న శ్రుతి వచించిన మంత్రాన్ని బాబా పరిహాస మెపంతో మనకు దృఢపరచారు.44.శబ్ద స్పర్శ రూప గంధాలు ఈ నాలుగింటి తోటి సంబంధం కూడా ఇదే. బాబా యొక్క ఈ కథానుబంధం ఎంతటి బోధప్రదం. 45. మనసు బుద్ధి మొదలగు ఇంద్రియాలు విషయాలను సేవించేటప్పుడు ముందుగానన్ను స్మరిస్తే అవి మెల్లమెల్లగా నాకు సమర్పించబడతాయి. 46.ఇంద్రియాలు విషయాలను అనుభవించకుండా ఉండటం కల్పాంతంలో కూడా సంభవం కాదు. ఆ విషయాలను గురుచరణాలకు అర్పిస్తే విషయాసక్తి సహజంగా తొలగిపోతుంది. 47.దేనినైనా కోరాలనిపిస్తే నా విషయాలనే కోరుకోండి. కోపమొస్తే నాపైనే కోపం తెచ్చుకోండి. అహంకారాన్ని దురభిమానాన్ని నాకు సమర్పించి నా పాదాల యందు భక్తి కలిగి ఉండండి.48.కామం, క్రోధం

అభిమానం ఈ మనోవృత్తులు ఉధృతంగా లేచినప్పుడు వానిని నావైపుకు మళ్లించండి 49. ఈ విధంగా క్రమక్రమంగా మనోవృత్తిని శ్రీహరి తొలగిస్తాడు. ఈ కామ క్రోధ అభిమానాలనే విషం వంటి మూడింటి తరంగాలను గోవిందుడు నశింప చేస్తాడు. 50. నిజానికి ఈ మనో వికారాలు నా స్వరూపంలోనే లయమౌతాయి. లేదా అవి నారూపాన్నే పొందుతాయి. నా పాదాలయందే విశ్రమిస్తాయి. 51. అలా అభ్యాసం చేయగా మనోవృత్తి క్షీణించి కొంత కాలానికి నిర్మూలనమై మనసు వృత్తి శూన్యమౌతుంది. 52. గురువు ఎల్లప్పుడు మన సమీపంలోనే ఉన్నారన్న దృఢమైన బుద్ధి ఉన్న వారిని విషయాలు ఎప్పుడూ బాధించవు. 53. ఈ భావం బాగా నాటుకుంటే చాలు ఇక భవబంధం విడిపోయినట్లే. విషయాలలో గురువు ప్రకటమౌతారు. అలా విషయాలు గురువు రూపంలో ఉంటాయి. 54. విషయాలను అనుభవించటానికి ఏ కాస్త కోరిక కలిగినా బాబా అక్కడే ఉన్నారని, ఆ విషయాలు సేవించ తగినవా తగనివా అన్న ఆలోచన మనసుకు కలుగుతుంది. 55. సేవించతగని విషయం సహజంగా వదలిపోతుంది. భక్తుని వ్యసనం తొలగిపోతుంది. దృఢమైన అభ్యాసంతో సేవించతగని విషయాలపై మనసుకు అసహ్యం కలుగుతుంది. 56. ఈ నియమాలన్నీ వేదాలలో ఉన్నాయి. వీని ప్రకారం విషయాలను సేవించేవారు విచ్చల విడిగా ప్రవర్తించరు. 57. మనసుకు అలా అలవాటు చేయగా విషయ సుఖాల ఆలోచనలు మందగిస్తాయి. గురువు యొక్క ఆరాధన యందు ప్రీతి కలుగుతుంది. శుద్ధజ్ఞానం మొలక ఎత్తుతుంది. 58. శుద్ధ జ్ఞానం అభివృద్ధి కాగా దేహబుద్ధి అనే బంధనం విడిపోతుంది. అప్పుడు ఆ శుద్ధ బుద్ధి అహంబ్రహ్మ అనే భావంలో లీనమై ఆనందం ప్రాప్తిస్తుంది. 59. ఈ శరీరం క్షణభంగురమైనా పరమ పురుషార్థాన్ని సాధించేది దీని ద్వారానే. మోక్షంకంటే గొప్పదైన భక్తి యోగాన్ని ప్రసాదించచేసేది ఈ శరీరమే. 60. ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలపైన పంచమ పురుషార్థం భక్తియోగం.

అలౌకిక మైన ఈ భక్తి యోగానికి సమానమైనది వేరే ఏదీలేదు.61.గురుసేవలో కృతార్థులైన వారికి ఈ మర్మాలు యథార్థంగా అర్థమౌతాయి. వారికే భక్తి జ్ఞాన వైరాగ్యాలు, పరమార్థం ప్రాప్తిస్తాయి. 62.గురువు మరియు దేవుడు వీరిలో భేదాన్ని చూచేవారు మొత్తం భాగవతంలో భగవంతుణ్ణి చూడలేరు. 63.రామాయణమంతా చదివినా రామునికి సీత ఏమౌతుందో తెలియదు. ద్వైత భావాన్ని వదిలి గురువు భగవంతుడు అభిన్నులని తెలుసుకోవాలి.64.పవిత్రమైన గురుసేవ లభిస్తే, విషయవాసనలు నిర్మూలనమౌతాయి.అంతఃకరణం పరిశుద్ధమై అందులో ప్రకాశవంతమైన ఆత్మస్వరూపం ప్రకటమౌతుంది' అని చెప్పారు.65.ప్రబలమైన సంకల్పశక్తితో శనగపప్పును సృష్టించటం బాబాకు హస్తలాఘవం. ఇంతకంటె విలక్షణమైన లీలలను కూడా చూపించటానికి వారికి ఎంతో సమయం పట్టదు.66.కేవలం పాట్ట కూటి కోసం ఇంద్రజాలం చేసే లౌకిక గారడివాడు,ఎముకతో మంత్రదండాన్ని త్రిప్పుతూ కోరిన వస్తువును బయటికి తీస్తాడు.67.అలౌకిక గారడియైన సాయినాథుని లీల ఎంతో మహిమాన్వితమైనది.సంకల్పమాత్రంతో క్షణంలో ఎన్నో లెక్కలేనన్ని శనగ పప్పులను సృష్టిస్తారు.68.ఈ కథలోని సారం ఏమిటి అని ఆలోచిద్దాం. పంచ విషయాలలోని ఏ విషయ సుఖమైనా బాబా లేకుండా సేవించరాదు.69.అని మనసుకు ఇలాంటి శిక్షణనిస్తే ఇది బాగా గుర్తు ఉండి ఇచ్చి పుచ్చుకునే లావాదేవీలలో సాయి చరణాలు ఎప్పుడూ గుర్తుంటాయి. 70.సగుణ మూర్తియైన ఈ శుద్ధ బ్రహ్మ కనుల ఎదుట ఉంటాడు. భక్తి విరక్తి ముక్తి పరమప్రాప్తి లభిస్తాయి. 71.వారి సుందర రూపాన్ని మనో నేత్రంతో వీక్షిస్తుంటే ప్రపంచ సుఖాలు ఆకలిదప్పులు హరించుకుని పోతాయి. ఐహిక సుఖాల కోరిక నశించి మనసుకు శాంతి కలుగుతుంది.72. ఓవీలను గుర్తుకు తెచ్చుకుందామని ప్రయత్నించినప్పుడు ఒక పదమన్నా గుర్తుకురాదు కాని తిరుగలి వద్ద కూర్చున్నప్పుడు గుర్తుకు వస్తుంది.అట్లే ఈ శెనగల లీల చెప్పుతుంటే సుదాముని

కథ గుర్తుకు వచ్చింది.73. ఒకసారి బలరాముడు కృష్ణుడు సుదాముడు గురువు ఆశ్రమంలో సేవచేస్తుండగా కట్టెలను తేవటానికి బలరాముని శ్రీకృష్ణుని పంపారు.74.గురుపత్ని ఆజ్ఞాపించగా కృష్ణుడు బలరాముడు అరణ్యానికి వెళ్లారు. వారి వెనుక సుదాముని కూడా పంపారు.75.తరువాత గురుపత్ని సుదామునికి శెనగలను ఇచ్చి అరణ్యంలో ఆకలి ఐనప్పుడు వీనిని ముగ్గురూ తినండని ఆజ్ఞాపించింది. 76.తరువాత అడవిలో కృష్ణుడు, అన్నా దాహం వేస్తూ ఉంది' అని అంటే సుదాముడు శెనగల మాట చెప్పకుండా ఏమన్నాడో వినండి .77.పరగడుపున నీరు త్రాగ కూడదు. కాసేపు విశ్రమించు అని అన్నాడే కాని ఈ శెనగలను తినమని చెప్పలేదు. కృష్ణుడు సుదాముని ఒడిలో విశ్రమించాడు.78.కృష్ణుని కళ్లు మూతపడగానే సుదాముడు శెనగలను తినసాగాడు.అన్నా, ఈ శబ్దం ఏమిటి? ఏంతింటున్నావు? అని కృష్ణుడు ప్రశ్నించగా.79.ఇక్కడే ముంది తినడానికి? చలివలన పళ్లు పటపట మంటున్నాయి. విష్ణు సహస్రనామాన్ని కూడా స్పష్టంగా ఉచ్చరించలేకుండా ఉన్నాను అని చెప్పాడు.80.సుధాముని ఈ మాటలను విని సర్వసాక్షియైన కృష్ణ పరమాత్మ, నాకు సరిగ్గా ఇటువంటి కలే వచ్చింది. 81.ఒకరి వస్తువును మరొకరు తింటుండగా ఏమి తింటున్నావని అడిగితే ఏముంది తినటానికి మట్టి అని అన్నాడు. ఆ వాణి యధార్థమైంది. 82.అన్నా, ఇది ఒట్టి స్వప్నమే. నేను లేకుండా నీవు ఎప్పుడైనా తింటావా? ఇంకా నేను కలలోనే ఉండటం వలన ఏమితింటున్నావని అడిగాను అని అన్నాడు. 83.పూర్వాశ్రమంలో కృష్ణుని లీల సుదామునికి తెలిసి ఉంటే ఈ తప్పుచేసి దాని పరిణామాన్ని అనుభవించి ఉండేవాడు కాడు. 84.ఆ దోషం మాత్రం సాధారణమైనదా? అతడు పరమ దారిద్ర్యానికి గురి అయ్యాడు. అందువలన ఎవరికీ పెట్టక ఒక్కరే తినేవారు దీనిని గుర్తుంచుకోవాలి. 85.శ్రీకృష్ణ పరమాత్మకు సఖుడైన సుదాముని వంటి భక్తునికి నియమంలో కించిత్తు పొరపాటు రాగా సంసారంలో చాలా బాధను

అనుభవించాడు.86.తరువాత అతనే భార్య కష్టార్జితమైన పిడికెడు అటుకులను ప్రేమతో సమర్పించగా కృష్ణుడు ప్రసన్న చిత్తుడై అతనికి ఐశ్వర్యాన్నిచ్చి సంతుష్టుణ్ణి చేశాడు. 87.ఇప్పుడు ప్రబోధాత్మకమైన మరొక విషయాన్ని చెప్పుతాను. అది మొదట వినోదాన్ని ఆనందాన్ని కలిగించి, చివర జ్ఞానాన్ని కలిగించే విషయం.88.ఒకరికి పరమార్థ బోధ ఇష్టం.మరొకరికి తర్కం,యుక్తి వాదం, మరొకరికి.పరిహాసం వినోదం ఇష్టం.అలా అందరికీ ఆనందమే ఆనందం.89.ఇది ఒక పరిహాస కథ.ఒక స్త్రీ మరియు ఒక వృద్ధునికి సాయిబాబా దర్బారులో తగువు పడింది. అది ఎవరినీ అగౌరవ పరచకుండానే తొలగింపబడింది. 90.ఈ కథ కూడా రస పూరితమైనది. శ్రోతలకు చాలా ఆనందాన్ని కలిగిస్తుంది. భక్తులు తమలో తాము పోట్లాడుకుంటుంటే హాస్యరసం 91.ఉత్పన్నమవుతుంది. దామోదర్‌ఘుసాఁయం అన్న భక్తునిఉపనామం బాబరే. వాడుకలోనున్న పేరు అణ్ణా చించణీకరు. అతనికి బాబాపై అమితమైన ప్రేమ.92.అతడు మొరటు స్వభావంతో ఎవరినీ లెక్క చేసేవాడుకాదు.మంచీ చెడు చూడకుండా మొహమాటం లేకుండా మాట్లాడేవాడు.93.ఎంత కఠినంగా మాట్లాడినా అతడు సజ్జనుడు. సాత్వికుడు. కాని గుళ్లతో నిండి నొక్కగానే పేలి పోయే తుపాకి తలపై ఉన్నట్లుండేవాడు. 94.పనులన్నీ త్వరగాజరగాలి. అరువు మాటలేదు. ఎవరి వద్ద మొహమాటం లేకుండా నిష్కర్షగా వ్యవహరించేవాడు. 95.చేతితో నిప్పైనా పట్టుకోవచ్చునేమోగాని అణ్ణామాత్రం అంత కంటె ఎక్కువగా మండి పడుతుండేవాడు.కాని అతను నిష్కపట స్వభావం కలవాడు.అందుకే బాబాకు ప్రియుడు.96.ఒకసారి మధ్యాహ్నం మసీదులో బాబా దర్బారు నిండుగా ఉంది. బాబా తమ ఎడమ చేతిని కటకటాలపై వేసి కూర్చున్నారు.97.ఏమీ ఎఱుగనట్లు తటస్థంగా ఉన్నట్లు కనిపించినా బాబా భక్తులలో పోట్లాటను రగిలించి కోపతాపాలను కలిగించి వారికి నచ్చచెప్పుతుండేవారు.98.భక్తుల్లో

ఒకరు బాబా నడుంపట్టేవారు. ఒకరు వారి పాదాలను పట్టేవారు.మరొకరు వారి వీపును పొట్టను మర్దించేవారు. ఆ రీతిగా సేవచేసేవారు.99.బాబా ఊర్ధ్వ రేతస్సు పరిశుద్ధ ఆచారాలను కల బాల బ్రహ్మచారి. స్త్రీలను పురుషులను అందరినీ సేవ చేయనిచ్చేవారు.100.అణ్ణా బయట కటకటాల వద్ద వంగి బాబా ఎడమ చేతిని మెల్ల మెల్లగా పట్టుతున్నాడు.కుడివైపు పరిస్థితిని స్పష్టచిత్తులై వినండి.101.అక్కడ బాబాయందు అనన్య భక్తి కలిగిన ఒక స్త్రీ ఉంది.బాబా ఆమెను అమ్మాఅని అనేవారు. జనులు పిన్నమ్మా అని పిలిచేవారు. 102.ఆమె అసలు పేరు వేణుబాయి. ఇంటి పేరు కౌజలగి. ఆమెకు సాయి పాదాలయందు అనుపమానమైన ప్రేమ.103.అణ్ణా వయసు యాభై దాటింది.నోట్లో పళ్లులేవు. పిన్నమ్మ కూడా వయసుమళ్లిందే.ఆ ఉభయులకూ తగాదా వచ్చింది.104.అణ్ణా తన భార్యతో సహా బాబా సేవ చేస్తున్నాడు. వేణుబాయి విధవరాలు.ఆమె బాబా పొట్టను ఆయాస పడుతూ ఒత్తుతోంది.105.ఆమె మనసు నిర్మలమైనది. సాయి సేవను చక్కగా చేస్తుంది.తన రెండు చేతులను కలిపి బాబా పొట్టను మర్దన చేయసాగింది.106.వెనుక నుండి ముందు పొట్ట వరకు రెండు చేతులతో పట్టుకుని మజ్జిగ చిలుకుతున్నట్లు ఒత్తసాగింది.107.అలా ఆమె బాబాను స్మరిస్తూ నిర్భయంగా ఒత్తుతూ ఉంది.బాబా కూడా కిమ్మనకుండా వారికేబాధ లేదా అన్నట్లున్నారు. 108.ఆమె చాలా వింతగా పొట్ట వీపుకు అంటుకుపోయేలా బాగానలిపేస్తూ పొట్ట ఒత్తుతూ ఉంది.ఆమె ప్రేమతోనే చేస్తున్నా చూచే వారికి దయ కలుగుతుంది.109.భక్తులకు ఎల్లప్పుడూ క్షేమం కలగాలని,వారు అనవరతం తమ స్మరణలో ఉండాలని, వారి నుండి సాయి నిష్కపటమైన ప్రేమను తీసుకుని ఎటువంటి సేవనైనా స్వీకరించేవారు. 110. మనకు సత్పురుషుల సత్సంగం లభించటానికి. మన తపోశక్తి ఏపాటిది? కాని దీన వత్సలుడైన సాయి తన భక్తుల నెప్పుడూ ఉపేక్షించరు. 111.ఆమె ఒత్తడంలో

ఎంత నేర్పు ఉన్నది? దానితో బాబా క్రిందకూ పైకి ఊగిపోతున్నారు. ఆమె కూడా అట్లే కదులుతూ ఉంది. ఆ సేవ విచిత్రమైనది. 112. అణ్ణా ముందుకు వంగి ఉన్నా కదలక స్థిరంగా ఉన్నాడు. వేణు బాయి సేవయందు లీనమై ఉండటం వలన ఆమె ముఖం క్రిందకు పైకి కదులుతూ ఉంది. అప్పుడు ఏమైంది? 113. ఆమె సాయిసేవా సుఖంలో బాబా పాట్టను పిండేస్తుండగా, గబుక్కున ఆమె ముఖం అణ్ణా ముఖం వద్దకు వచ్చింది. 114. అప్పుడు మంచి హాస్య స్వభావంగల ఆమె ఆ అవకాశాన్ని తీసుకుని ఈ చపలుడైన అణ్ణా నన్ను ముద్దివ్వమని కోరుతున్నాడు. 115. ఇదేమిటి అణ్ణా! తల నెరిసి పోయినా నీకు సిగ్గులేదు. నన్ను ముద్దు పెట్టుకోవాలని చూస్తున్నావు అని పిన్నమ్మ అనేసరికి అణ్ణాతన చొక్కా చేతిని మడుచుకున్నాడు. 116. నేను ముసలివాణ్ణా, నేను పిచ్చివాణ్ణా? నేనేమైనా అంత మూర్ఖుణ్ణా? నీవే మొహంలో మొహం పెట్టి నాతో తగువుకు తయారయ్యావు అని అన్నాడు. 117. బాబాకు వారిద్దరి యందూ ప్రేమ. వారిద్దరి తగువును చూచి వారిని శాంతింప చేయటానికి ఒక మంచి యుక్తిని పన్నారు. 118. ఎంతో ప్రేమగా 'అరె అణ్ణా! ఊరికే ఎందుకు గొడవ చేస్తున్నావు? తల్లిని ముద్దు పెట్టుకోవటంలో అనుచితమేముందో అర్థం కావటంలేదు' అని అన్నారు. 119. దానిని విని ఇద్దరూ చల్లబడ్డారు. ఆ హాస్యరసవాణి అక్కడికి అయిపోయింది. అందులోనుండి ప్రేమతో కూడిన హాస్యరసం ఉప్పొంగింది. ఆ పరిహాసం అందరికీ నచ్చింది. 120. చూచ్చానికి ఇది చిన్న కథే. దీనిలోని మర్మాన్ని తెలుసుకోగల శ్రోతలు ఇందులోని మాధుర్యాన్ని గ్రహించగలరు. ఆ పరిస్థితిలో వారిద్దరినీ ఎలా శాంతింప చేశారు అన్నది ఈ కథలోని ఉద్దేశంలా కనిపిస్తుంది. 121. తల్లిబిడ్డలలో ఉండవలసిన ప్రేమ ఆ ఇద్దరిలో ఉండి ఉంటే వారికలా కోపం వచ్చేది కాదు. తగువు పుట్టేది కాదు. 122. కొరడాతో కొడితే నవ్వటం పూలతో కొడితే ఏడవటం అనేది మనో తరంగాల బట్టి ఉంటుంది.

ఈ అనుభవం ఎవరికి లేదు? 123. ఇది ఎవరికి తెలియదు? బాబా సమయోచితంగా చెప్పిన మాటలోని విశేష జ్ఞానాన్ని శ్రోతలు గ్రహించి శాంతంగా ఉంటారు. 124. ఇలాగే ఒకసారి బాబా పాట్టను మర్దిస్తూ ఉండగా ఆమె మొరటు తనాన్ని గమనించిన బాబా పరమ భక్తులకు బాధ, దయ, చింత కలిగాయి. 125. 'ఓ తల్లీ, ఇదేమి మర్దించటం? దయ చూపించు బాబా నరాలు తెగిపోగలవు' అని అన్నారు. 126. ఆ మాటలు చెవిన పడగానే బాబా వెంటనే తమస్థానం నుండి లేచి చేతిలోనికి సటకా తీసుకుని నేలపై కొట్టారు. 127. వారికోపం తీవ్రరూపాన్ని దాల్చింది. వారి కళ్లు నిప్పుకణాలవలె అయ్యాయి. అటువంటి పరిస్థితిలో వారి ఎదుట ఎవరు నిలబడగలరు? 128. పిల్లి కళ్లు చీకటిలో మెరిసేలా బాబా కళ్లు పగలు మెరుపుసాగాయి. ఆకళ్లలోని జ్వాలలు సృష్టిని తగల పెట్టేస్తాయా అన్నట్లున్నాయి. 129. సటకా చివరి భాగాన్ని చేత్తో పట్టుకుని తమ పాట్ట లోపలికి గ్రుచ్చి మరోవైపు కొనను ఎదుటనున్న స్తంభానికి ఆన్చి ఆ స్తంభాన్ని గట్టిగా వాటేసు కున్నారు. 130. సుమారు రెండున్నర అడుగుల పొడవు ఉన్న ఆ సటకా మొత్తం బాబా కడుపు లోపలికి పోయి క్షణంలో పాట్ట పగిలి పోయి ప్రాణాంతక మయ్యేలా అనిపించింది. 131. స్థిరంగా ఉన్న స్తంభం ఏం కదులుతుంది? బాబాయే దానికి దగ్గర దగ్గరగా జరిగి స్తంభానికి పాట్టను గట్టిగా అదిమి పట్టారు. చూచే వారు భయభీతులయ్యారు. 132. ఇక పాట్ట పగిలి పోతుందని తలచి వారు ఇదెక్కడి దుర్భరమైన కష్టం వచ్చి పడింది బాబూ అని ముక్కు మీద వేలేసుకున్నారు. ఇప్పుడు ఈ అనర్థం తొలగేది ఎలా? 133. భక్తుల అధీనంలో ఉండటం బాబా వ్రతం. ఆ పిన్ని కొఱకు ఇంత కష్టం సహించాలా అని భక్తులు బాధపడ్డారు. 134. ఎవరైనా సేవ చేస్తుండగా మధ్యలో ఎవరైనా అనుచితంగా మాట్లాడినా, లేక సేవ చేసే వారిని ఏమైనా అన్నా బాబాకు నచ్చేదికాదు. 135. బాబాకు బాధ కలగ కూడదని బాధతో భక్తులు ప్రేమతో పిన్నమ్మకు తెలిపినందుకు

దాని పరిణామం ఇలా కావాలా అని బాధ పడ్డారు. 136. దేవునికి కరుణ కలిగింది. సాయిబాబా శాతించారు భయంకరమైన ఆ చర్యనుమాని, వచ్చి తమ ఆసనం లో కూర్చున్నారు.137.బాబా యందు ప్రేమ కలిగిన భక్తులు బాబా యొక్క కఠిన స్వభావాన్ని తెలుసుకొని అప్పటి నుండి ఇక ముందు అలా ప్రవర్తించకూడదని బాగా లెంపలు వేసుకున్నారు. 138.అప్పటి నుండి ఎవరికి తోచినట్లు వారిని సేవ చేయనివ్వాలి. ఎవరి దారికి అడ్డుపోకూడదు అని నిశ్చయించుకున్నారు.139. సాయిసమర్థులు స్వయం సామర్థ్యవంతులు, నిగ్రహానుగ్రహాలు ఎరిగిన జ్ఞానులు. సేవ చేసేవారి సుగుణాలు అవగుణాలు వారికి తెలుసు. మన కెందుకు అని అనుకున్నారు. 140.బాబాకు ఒకరి సేవ సుఖంగా ఉంటుంది మరొకరి సేవ కటువుగా మొరటుగా ఉంటుందని మన బుద్ధి వికారాల ననుసరించి అనుకోవడమేగాని నిజమైన దానిని గ్రహించలేం.141.ఇప్పుడు ఈ వినోదం ఈ పరిహాసం లోని ఉద్దేశాన్ని అర్థం చేసుకోగలిగినవారు అర్థం చేసుకుంటారు.సాయి కథారసం లోని ఆనంద మకరందాన్ని భక్తులు సేవిస్తారు. 142.హేమాడ్ సాయి చరణాలలో లీనమవుతాడు.తరువాతి అధ్యాయంలో ఇంతకంటెను గంభీరమైన కథలో, సాయి దయామయులు భక్త దామోదరుని కోరిక తీర్చుతారు. 143.అది కూడా గొప్ప చమత్కారం. దామోదరు ప్రపంచంలో చాలా కష్టాలు పడుతుంటే అతనిని తమ వద్దకు రప్పించుకుని అతని బాధను తీర్చుతారు. 144. స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థసచ్చరితంలో వినోద విలసితమను ఇరువది నాలుగవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయి నాథార్పణమస్తు.శుభం భవతు.



శ్రీసాయి సచ్చరిత - 25 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

కృపాసాగరులైన సాయి మహారాజు సాక్షాత్తు పరమేశ్వరుని అవతారం. పూర్ణబ్రహ్మ. మహా యోగిశ్వరులైన వారికి సాష్టాంగ నమస్కారం.1.జయ జయ సాధులలామా !మంగళధామా! ఆత్మారామా! సాయి సమర్థా! భక్త విశ్రామా! పూర్ణకామా! మీకు ప్రణామాలు.2.గతాధ్యాయంలో హాస్యరసం గురించిన వర్ణన జరిగింది. భక్తులను ప్రేమించే సాయి బాబా ఎల్లప్పుడూ వారిని రంజింప చేస్తుంటారు.3.సాయి పరమదయామూర్తి వారి యందు అనన్య భక్తి ఒకటి ఉంటే చాలు. భక్తి శ్రద్ధలున్న భక్తులు కోరుకున్న దానికి కొదువ లేదు. 4.శ్రీకృష్ణుడు ఉద్ధవునితో సద్గురువు నారూపమే అని చెప్పాడు. ఇటు వంటి సద్గురువులను భక్తితో ప్రేమతో భజించాలి. దీనినే అనన్య భక్తి అని అంటారు.5.శ్రీ సాయి చరితాన్ని వ్రాయాలని నా అంతరంగంలో కోరిక కలిగింది.. శ్రవణ యోగ్యమైన తమ లీలలను సాయి అత్యద్భుతంగా నా చేత వ్రాయింప చేశారు. 6.నాకు వ్యుత్పత్తి జ్ఞానం రచనావ్రతం లేకున్నా పామరుణ్ణైన నాకు స్ఫూర్తినిచ్చి, భక్తులను జాగృతం చేయటానికి నా ద్వారా ఈ గ్రంథాన్ని రచియింపచేశారు.7.'విషయాలను సేకరించు' అని నా వంటి అజ్ఞానికి వారు ఆజ్ఞ ఇచ్చినప్పుడే నా అల్ప ప్రజ్ఞ జ్ఞాన సంపన్నమైంది.8.గంభీర స్వభావులైన సాయి భక్తులను ఉద్ధరించటానికి తమ కథా సంగ్రహాన్ని అందిస్తారని నాకు ధైర్యం కలిగింది. 9.లేకపోతే ఈ వాగ్విలాసానికి నేను సాహసించ గలనా? సాయి చరిత్ర రూపంలో ఉన్న ఈ

చరితామృత రసం సత్పురుషుల చరణ ప్రసాద పాయసం.10. శ్రీ సాయి సచ్చరిత రూపంలో ఇది భక్తులకు అమృతపు చలివేంద్రం. భవతాపాన్ని నివారించే సాయికృపను యథేచ్ఛగా సేవించండి. 11. ఇది చరిత్ర కాదు చంద్రకాంతం; సాయి కథామృతాన్ని స్రవింప జేస్తుంది. దప్పికగొని ఉన్న భక్త చకోరులు మనసారా సేవించి తృప్తులౌతారు. 12. ఇక ప్రేమికులైన శ్రోతలు ఏకాగ్రమనసుతో, ఏ సందేహాలు లేక కలిమలాన్ని దహనం చేసే సాయి యొక్కపావన కథను వినండి. 13. ఒకసారి సాయి యందు అనన్య నిష్ఠ కుదిరితే ఆ భక్తుల కష్టాలు అరిష్టాలు అన్నీ తొలగి వారి అభీష్టాలు తీరుతాయి. 14. ఈ విషయంలో సాయి యొక్క భక్తవాత్సల్యాన్ని తెలియ చేసే ఒక వృత్తాంతాన్ని శ్రోతలు శ్రద్ధగా వింటే మనసుకు ఆనందం కలుగుతుంది. 15. శ్రద్ధగా మనసు పెట్టి ఈ అభినవ కథను వినండి. దయార్ద్రమైన గురుమాత గురించిన అనుభవం కలుగుతుంది. 16. ఇది చాలా చిన్న కథ అయినా దీనిలోని అర్థంలో ఎంతో జ్ఞానం ఉంది. ఒక ఘడియ సేపు శ్రద్ధగా వింటే కష్టాలు తొలగిపోతాయి. 17. అహమ్మదు నగరులో దాము అణ్ణాకాసార్ అన్న పేరుతో సుఖంగా ఉన్న శ్రీమంతుడైన భక్తుడు సాయి పాదాల యందు ప్రేమ కలిగి ఉండేవాడు. 18. ఆ పరమభక్తుని కథను శ్రవణంచేస్తే ఆనందం కలుగుతుంది. సాయి యొక్క భక్త రక్షణ తత్పరత ప్రత్యక్షంగా కనిపిస్తుంది. 19. శ్రీరామనవమి వార్షికోత్సవంలో రెండు పెద్ద క్రొత్త పతాకాలను శిరిడీ గ్రామంలో ఊరేగించటం అక్కడి వారికి తెలుసు. 20. వానిలో ఒకటి నిమోన్‌కరుది రెండవది ఈదామూ అణ్ణాది. ఈ నియమం అనేక సంవత్సరాల నుండి భక్తి ప్రేమలతో ఆగకుండా సాగుతూ ఉంది. 21. దాము అణ్ణాకు ఇద్దరు భార్యలున్నా పుత్ర సంతానం కలగలేదు. సాయి బాబా ఆశీర్వాదంతో పుత్రరత్నాలను పొందాడు. 22. అప్పుడు శ్రీరామనవమి ఉత్సవానికి పతాకాన్ని సమర్పిస్తానని మ్రొక్కు కున్నాడు. అప్పటినుండి ప్రతి సంవత్సరం పతాకాన్ని ఊరేగించటం ఆరంభమైంది.

23.వడ్రంగి కొండ్యా ఇంటి వద్ద పతాకం ఊరేగింపుకు సిద్ధమై అక్కడి నుండి వాద్యాల మ్రోగింపుతో పతాకాలను ఊరేగింపుకు తీసుకుని వెళ్లేవారు. 24.పొడవైన ఆ పతాకాలను మసీదు పైన రెండు వైపులా కట్టేవారు. ప్రతి సంవత్సరం ఆ మహోత్సవ సమారంభం జరుగుతుంది. 25.అప్పుడు అక్కడికి వచ్చే ఫకీరులకు తృప్తిగా భోజనం పెట్టేవారు. ఈ రీతిగా రామనవమిని దాము అణ్ణా సేట్ జరిపించేవాడు. 26.ఆ దాముఅణ్ణా కథను ఇప్పుడు శ్రోతలకు మనవి చేస్తాను. శ్రద్ధగా శ్రవణం చేస్తే సాయి యొక్క సామర్థ్యం విదితమౌతుంది. 27.ముంబై నగరంలోని దాము అణ్ణా స్నేహితుడు 'రెండు లక్షలు లాభం వచ్చే వ్యాపారం ఉంది, ఇటువంటి లాభసాటి వ్యాపారం చేద్దామా' అని ముంబై నుండి ఉత్తరం వ్రాశాడు. 28.'నువ్వూనేను ఇద్దరం భాగస్వాములుగా చేరి, చెరో లక్ష సంపాదించుకుందాం. నిర్భయమైన వ్యాపారం. వెంటనే జాబు వ్రాయి. 29.ఇప్పుడు దూదిని కొందాం. దాని ధర వెంటనే పెరిగి పోతుంది. ఇప్పుడు ఈ అవకాశం ఉపయోగించుకోక పోతే తరువాత మనం పశ్చాత్తాప పడాల్సివస్తుంది. 30.ఈ సమయాన్ని జారవిడుచుకోకు' అని వ్రాయగా అణ్ణా మనసు కలవర పడింది. అతనికి తన స్నేహితునిపై గట్టి విశ్వాసం. అయినా ఏం నిశ్చయించుకోవాలో తోచలేదు. 31.వ్యాపారం చేయాలా వద్దా, ఏమౌతుందో ఏమో అన్న సంశయంతో అణ్ణాకు చింత పట్టుకుంది. 32.దాముఅణ్ణా కూడా గురు పుత్రుడు. బాబాకు ఉత్తరం వ్రాశాడు. మాకు స్వతహాగా ఆలోచించే బుద్ధిలేదు. మీరే మాకు రక్ష 33.వ్యాపారం బాగానే ఉంది చేద్దాము అని అనిపిస్తూ ఉంది. కాని దీనిలో లాభంకలుగుతుందా లేక నష్టమా దయచేసి తెలియచేయండి 34.అని, మాధవరావుకు ఉత్తరం వ్రాశాడు. ఆ ఉత్తరాన్ని బాబాకు చదివి వినిపించి వారి ఆజ్ఞను తెలియ చేయమని. 35. మరునాడు మధ్యాహ్నం ఆ ఉత్తరం మాధవరావు చేతికందింది. అతడు దానిని తీసుకుని వెళ్లి మసీదులో బాబా పాదాల వద్ద ఉంచాడు. 36.'శ్యామా! ఏమిటి

హడావిడి? ఇక్కడున్న ఈ కాగితం ఏమిటి?' అని బాబా అడిగారు. 'బాబా! నగర్ లోని దాము సేట్ మిమ్మల్ని ఏదో అడుగు తున్నాడు' 37. అని శ్యామా చెప్పాడు. 'ఏం వ్రాశాడు? ఏం ఆలోచన చేస్తున్నాడు? దేవుడు ఇచ్చింది చాలదని, అతడు ఆకాశాన్ని అందుకోవాలనుకుంటున్నాడు. 38. సరే అతని ఉత్తరం చదువు'. అని బాబా అన్నారు. 'అక్షరాలా మీరు చెప్పినదే దాము అణ్ణా ఉత్తరంలో ఉన్నది. 39. దేవా! మీరు నిశ్చలంగా కూర్చుని భక్తులలో కలవరం లేపుతారు. వారు బాధపడుతుంటే, వారిని మీ పాదాల వద్దకు రప్పించుకుంటారు. 40. ఒకరిని స్వయంగా రప్పిస్తారు. మరొకరికి ఉత్తరాన్ని వ్రాయిస్తారు. ఉత్తరం లోని విషయాన్ని ముందుగానే చెప్పేశారు కదా ఇక చదవటమెందుకు అని శ్యామా అన్నాడు. 41. బాబా 'అరె శ్యామా! చదువు చదువు. నా మాటే నిజమని ఎందుకు అనుకుంటావు? ఊరికే ఏదో తోచింది చెప్తుంటానంతే' అని అన్నారు. 42. మాధవరావు ఉత్తరం చదవగా బాబా శ్రద్ధగా విని బాధతో, 'సేటుకు మతి పోయింది' అన్నారు. 43. 'నీ ఇంట్లో ఏం లోటుంది? ఉన్న సగం రొట్టె చాలు. లక్షల వెంట పడకు అని అతనికి ప్రత్యుత్తరం వ్రాయి' అని చెప్పారు. 44. ఆ జవాబు కోసం క్షణ క్షణం ఎదురు చూస్తున్న దాముఅణ్ణా అది అందగానే దానిని తక్షణం చదివాడు. 45. అందులోని విషయాన్ని తెలుసుకుని సేటు నిరుత్సాహపడ్డాడు. అతని ఆశావృక్షం పడిపోయింది. అతని మనోరథపు దుర్గం కూలిపోయింది. 46. ఇప్పుడు ఒక లక్ష సంపాదించి అరలక్షను వడ్డీకి ఇచ్చి, త్వరలో లక్షాధికారినై షావుకారు అయిపోయి నగర్ లో సుఖంగా ఉంటాను. 47. అని అతడు తనలో నిర్మించుకున్న మనోరాజ్యాలు అక్కడి కక్కడే కరిగి పోయాయి. బాబా ఇలా చేశారేమిటి అని దాముఅణ్ణా అత్యంత నిరాశ చెందాడు. 48. అసలు ఉత్తరం వ్రాయడం పొరపాటైంది. తన మంచిని తానే పాడు చేసుకున్నాడు. చూస్తూ చూస్తూ వడ్డించిన విస్తరిని తనే తన్నుకున్నట్లయింది. 49. కళ్లతో చూడటానికి

చెవులతో వినటానికి వ్యత్యాసముంటుంది. కనుక బాబా వద్దకుమీరు స్వయం వస్తే బాగుంటుంది అని. 50. మాధవరావు ఉత్తరంలో అలా సూచించాడు. దాని ప్రకారం బాబా వద్దకు వెళ్లటం మంచిదేమో. తనకు అదే శుభప్రదమేమో. బహుశా బాబా అనుమతిని ఇవ్వవచ్చు. 51. అని ఆలోచించుకుని అణ్ణా శిరిడీకి వచ్చాడు. సాయికి సాష్టాంగ ప్రణామం చేసి వారి సమీపంలో కూర్చున్నాడు. 52. మెల్లమెల్లగా వారి పాదాలను పట్టసాగాడు. బాబాను అడగటానికి ధైర్యం చాలలేదు. బాబాకు లాభం లో భాగం సమర్పించాలని అతని మనసులో ఆలోచన కలిగింది. 53. సాయినాథా! ఈ వ్యాపారం లో నాకు సహాయం చేస్తే, లాభంలోని కొంత భాగం మీచరణాలకు సమర్పిస్తానని తనలో అనుకున్నాడు. 54. సాయి చరణాలపై శిరసునుంచి కొంతసేపు కూర్చున్నాడు. సంకల్ప వికల్పాలు మనసు లక్షణం. దాముఅణ్ణా మనసులో వ్యాపారం గురించిన ఆలోచన సాగింది. 55. భక్తుడు అనేక రకాల కోరికలను కోరుకుంటాడు. కాని తన నిజమైన శ్రేయస్సును తెలుసుకోడు. గురువు ఒక్కడే శిష్యుని భూత భవిష్య వర్తమానాలలోని హితాన్ని తెలుసుకుంటారు. 56. ఎవరైనా తమ మనోగతాన్ని ఎంత గుప్తంగా ఉంచినా సర్వాంతర్యామి అయిన సాయిసమర్థులు వారి అంతరంగంలోని దానిని తెలుసుకుంటారు. 57. ఎవరైనా సరే తమ మనసులోని విషయాన్ని సాయి చరణాలయందు ప్రేమతో మనవి చేసుకుని, వారి యందు పూర్తి విశ్వాసంతో వారి అనుమతిని కోరితే, సాయి వారికి యోగ్యమైన మార్గాన్ని చూపుతారు. 58. ఇది వారి వ్రతం. భక్తులందరికీ ఇది తెలుసు. వారు అనన్య శరణాగతులైన భక్తుల ఆపదలను నివారిస్తారు. 59. గురువే నిజమైన మాతాపితలు. అనేక జన్మల నుండి పోషించి రక్షించేవారు గురువు. గురువే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. చేసేవారు చేయించేవారూ వారు ఒక్కరే. 60. బిడ్డ మధుర పదార్థాలను కోరితే తల్లి చేదు ఔషధాన్ని త్రాగిస్తుంది. బిడ్డ ఏడ్చి గోల చేసినా తల్లి ప్రేమ మారదు

61.ఔషధం లోని చేదు జబ్బును నయం చేస్తుందని బిడ్డకు తెలియదు. ఏది మంచో తల్లికే తెలుస్తుంది.62.అణ్ణా బాబాను భాగస్వామిగా చేసుకున్నా బాబా దానికి లోబడతారా! వారిప్రేమ ఏ లాభమూ ఆశించనిది. వారెల్లప్పుడూ తమ భక్తుల హితంలో తత్పరులై ఉంటారు.63.ధన కనకాలను మట్టిలా భావించేవారికి వ్యాపారంలో భాగమెంతటిది? ఈ సత్పురుషులు కేవలం దీనజనులను ఉద్ధరించటానికే జగత్తులో అవతరిస్తారు.64.యమ నియమ శమదమాది సంపదలున్నవారు, మాయా మాత్సర్యాది వికారాలనే దోషాలు లేని వారు, కేవలం పరులను అనుగ్రహించటానికే జీవించేవారు, సత్పురుషులు.65.దాముఅణ్ణా యొక్కభాగస్వామ్యం అనే ఆలోచన అతని మనసులోనే రహస్యంగా ఉండగా, బాబా బయటికి ఏం సమాధానం చెప్పారో శ్రద్ధగా వినండి.66. జీవుల యొక్క భూత భవిష్య వర్తమానాలు వారి మనోగతాలన్నీ బాబాకు కరతలామలకం.67.భక్తుల యొక్క భవిష్యత్తు బాబాకు పూర్తిగా తెలుసు. సమయానికి సరిగ్గా వారు ఏ విధంగా హెచ్చరించారో వినండి.68.'ఆపణ్ నాహిరే బావూ కిసీమే' 'మేము ఎందులోనూ లేము బాబూ' అని బాబా ప్రేమగా వ్యాపారం సరియైనది కాదని, తమ అయిష్టతను సూచించారు.అణ్ణా లోలోన సిగ్గు పడిపోయాడు.69.బాబా మాటలను విని దాముఅణ్ణాకు విషయం అర్థమైంది. మనసులోని సంకల్పాన్ని విడిచిపెట్టి అధోవదనుడై ఊరికే కూర్చున్నాడు.70.అతని మనసులో మరో ఆలోచన కలిగింది. బియ్యం గోధుమలు వంటి ధాన్యాలతో మరో వ్యాపారం చేస్తేనో అని. దానికి బాబా ఇచ్చిన సమాధానాన్ని వినండి. 71.'అయిదు సేర్లు చొప్పున కొని ఏడు సేర్లు చొప్పున అమ్ముతావు' అని చెప్పారు. వారి మాటలను విని అణ్ణా మనసులో సిగ్గుపడి పోయాడు.72.సృష్టిలో ఎక్కడ ఏది సంభవించినా సాయి దృష్టిలో పడకుండా ఉండదు. క్రిందా పైనా ఇక్కడా అక్కడా అంతా వారికి అవగతం.73.ఇక్కడ దాముఅణ్ణా స్నేహితుడు అణ్ణా వద్ద నుండి

జవాబు రాక ఏం చేయాలో తెలియక ఆలోచనలో పడ్డాడు.74.తరువాత జరిగిన వృత్తాంతమంతా అతనికి దాముఅణ్ణా ఉత్తరం వ్రాయగా అతడు అది చదివి ఆశ్చర్యపోయాడు. కర్మ గతి ఎంత విచిత్రం అని అనుకున్నాడు.75. చేతి లోని వ్యాపారాన్ని తాను స్వయం ఆలోచించ కుండా ఆ ఫకీరు సలహా కోరడమెందుకు?వృథాగా లాభాన్ని వదులు కున్నాడు. 76.దేవుడు ఇస్తే కర్మలాగేసుకుంటుంది.జరగవలసిన దానిని బట్టే బుద్ధి పని చేస్తుంది. ఇంత చక్కటి వ్యాపారంలో మధ్యన ఆ ఫకీరు ఎందుకు?77.ప్రపంచ వ్యవహారాలు వదిలేసి ఇంటింటా రొట్టెముక్కలు అడుక్కుని పొట్ట నింపుకునే వాడు ఏం సలహా చెప్పగలడు?78.పేటుకు అసలు అదృష్టం లేదు. అందుకే ఇలాంటి బుద్ధి పుట్టింది. ఇక వేరెవరినైనా భాగస్వామిగా చూచు కోవాలి. జరగవలసి లేనప్పుడు జరగదు అంతే అని అనుకున్నాడు.79. అణ్ణా ఊరికే ఉండిపోయాడు. అతని స్నేహితునితో,కర్మ కాలిన ఒక వ్యక్తి భాగస్వామిగా చేరి కష్టాలలో పడ్డాడు. 80. సట్కా వ్యాపారం చేయగా,అతని రోజులు బాగా లేక అక్కడ కూడా దెబ్బతిని నష్టపోయాడు. ఫకీరు మాట విననందుకు శిక్ష.81.మా దాముఅణ్ణా ఎంతటి అదృష్టవంతుడు. గొప్ప తెలివిగలవాడు.సాయిబాబా నిజంగా మహాత్ముడు. వారికి భక్తులపై ఎంతటి కరుణ?82.స్నేహితుడనని దాముఅణ్ణా నా మాట విని ఉంటే కష్టాలలో చిక్కుకుని పోయేవాడు. ఫకీరు మాటవిని రక్షింపబడ్డాడు. అతనికి ఎంతటి దృఢవిశ్వాసం. 83.అతని వెఱ్ఱితనాన్ని హేళన చేశాను. నేను చాలా తెలివైన వాణ్ణని గర్వపడ్డాను. అంతా వ్యర్థమని అనుభవమైంది. 84.ఆ ఫకీరును అనవసరంగా నిందించాను. వారి సలహాను పాటించి ఉంటే వారు నన్ను కూడా రక్షించేవారే. ఇలా నష్ట పోయే వాణ్ణి కాను అని అనుకున్నాడు. 85.మరొక విషయాన్ని చెప్పి అణ్ణా యొక్క వృత్తాంతాన్ని త్వరగా ముగిస్తాను. బాబా లీలలు శ్రోతలకు ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలగ చేస్తాయి. 86.ఒకసారి గోవా నుండి ఒక పార్సిలు వచ్చింది. రాలె

అన్న పేరుగల మామలెదారు మామిడి పళ్లను పంపించాడు.87.సాదరంగా సాయిబాబాకు సమర్పించటానికి పార్సిలు మాధవరావు పేరున కోపర్‌గాం నుండి శిరిడీకి వచ్చింది.88.ఆ పార్సిలును మసీదులో బాబా ఎదుట విప్పగా దానిలో ఘుమఘుమ సువాసనతో, మూడువందలకి పైగా మధురమైన మంచి మామిడి పళ్లు ఉన్నాయి.89.బాబా వానిన్నిటినీ చూచి మాధవరావుకు ఇచ్చారు. అతడు నాలుగు పళ్ళను కొళంబాలో వేసి మిగిలిన వానిని తన వెంట పట్టుకుని పోయాడు. 90.కొళంబాలో పళ్లు ఉంచగానే బాబా 'వానిని అక్కడే ఉండ నివ్వండి' అవి దామూఅణ్ణాకి ఇవ్వాలి, అని చెప్పారు. 91.తరువాత రెండు గంటలయ్యాక దాముఅణ్ణా పూజాసామగ్రి పూలు పట్టుకుని బాబా పూజ చేయటానికి మసీదుకు వచ్చాడు.92.జరిగిన వృత్తాంతం అతనికి తెలియదు. బాబా గట్టిగా 'మామిడిపళ్లు దామ్యావి. ఆ పళ్లు దాముఅణ్ణా కొఅకు. తినాలని లోకులకు దృష్టి వానిపై ఉన్నా అవి మనవి కావు.93.ఎవరి పళ్లు వారే తీసుకోవాలి. ఎవరివో మనమెందుకు తీసుకోవాలి? అవి ఎవరివో వారే తినాలి, తిని చావాలి' అని అన్నారు.94.అది బాబా ప్రసాదం అన్న భావంతో అణ్ణా వానిని స్వీకరించాడు. బాబా మాటల విపరీత అర్థానికి ఏం భయపడనవసరం లేదని అణ్ణాకు బాగా తెలుసు.95.పూజను ముగించుకుని అణ్ణావెళ్ళాడు.మరల వచ్చి 'బాబా! ఈ పళ్లను పెద్ద భార్యకా లేక చిన్నభార్యకా? ఎవరికివ్వాలో నాకు తెలియదే అని అడిగాడు.96. బాబా 'చిన్నభార్యకివ్వు. ఆమెకు ఎనమండుగురు బిడ్డలు కలుగుతారు. నలుగురు మొగపిల్లలు, నలుగురు ఆడుపిల్లలు ఈ మామిడి పళ్ల లీలవలన కలుగుతారు' అని చెప్పారు.97.దాము అణ్ణాకు పుత్ర సంతానం లేకపోవటం వలన అనేక ప్రయత్నాలు చేశాడు. సాధుసత్పురుషులను ఆశ్రయించి వారి అనుగ్రహం మరియు ఆశీస్సుల కోసం వారిని భజించేవాడు. 98.గ్రహాల అనుగ్రహం కోసం జ్యోతిష్యం విద్యనేర్చుకుని స్వయం జ్యోతిష్యుడయ్యాడు. 99. జ్యోతిష్యం ప్రకారం తనకు

సంతాన ప్రాప్తి లేదని తెలుసుకుని అతడు నిరాశ చెందాడు.100.అయినా సాయి సత్పురుషుని ముఖతః వచ్చిన వచనాలు, వారి ప్రసన్నత అతనికి మరల ఆశను ధైర్యాన్ని కలిగించాయి.101.ఆ తరువాత కొంత కాలానికి బాబా వచనం ఫలించింది.వారి అనుగ్రహం మామిడి పళ్ల రూపంలో అంకురించి సంతాన ఫలాలనిచ్చింది.102.బాబా చెప్పినట్లుగానే జరిగి అతనికి సంతానం కలిగింది.జ్యోతిష్యం నిష్ఫలమైంది. సాయిమాట అమోఘమని నిశ్చయమైంది. 103.ఇది బాబా శరీరధారులై ఉన్నప్పుడు వారి వాణిమహిమ. శరీరాన్ని త్యజించిన తరువాత కూడా తమ వాక్కు యొక్క మహిమను వారు స్వయం నిర్ధారణగా చెప్పారు.104.'నేను ప్రాణాలు విడిచినా నా వచనాలను ప్రమాణంగా భావించండి. నా సమాధినుండి నా అస్థికలు మీకు ధైర్యాన్ని కలిగిస్తాయి.105.నేనే కాదు. నా సమాధి మీతో మాట్లాడుతుంది. అనన్య శరణాగతులైన వారి వెనువెంటే ఉంటుంది.106.నేను మీ కళ్లకు కనిపించకుండా పోతానని నా కోసం చింతించకండి. నా ఎముకలు మీతో మాట్లాడుతాయి. అవి మీతో ముచ్చటించటం మీరు వింటారు. 107.నన్ను కేవలం స్మరించండి.అంతఃకరణంలో నా యందు విశ్వాసముంచండి.ఏ కోరికలూ కోరకుండా నిష్కామంగా నన్ను ఆరాధించండి. మీరు కృతకృత్యులై శుభాలను పొందుతారు'.108.భక్తుల కోరికలను తీర్చే ఓ కల్పతరువా! శ్రీసమర్థ సాయిసద్గురూ! మీ చరణాలనుండి వియోగం కలుగకుండా కరుణించమని హేమాడ్ ప్రార్థిస్తున్నాడు. 109.గురువరా! భక్తజన కరుణాకరా! పరుగునరా! ఈ ప్రపంచంలో విశ్రాంతి అంటూలేదు. కనుక ఈ జనన మరణాలు ఇక చాలు.110.మేము మా స్వభావానుసారం ప్రవృత్తి పరులం. ఎప్పుడూ బాహ్యమైన విషయ సుఖాలనే ఆలోచిస్తుంటాము. మమ్ము ఈ విషయ భోగాలనుండి మరల్చి మామనోవృత్తిని అంతర్ముఖం చేయండి. 111.ఈ భవసాగరంలో తరంగాలవలె ఊగిసలాడుతున్నాం. సమయానికి సరిగ్గా మీ అభయహస్తాన్ని ఇచ్చి, ఈ

భవం నుండి విముక్తులను చేయండి. 112. ఇంద్రియాలు స్వేచ్ఛగా దురాచారాలలో ప్రవేశిస్తాయి. ఉచ్ఛృంఖలంగా ప్రవహించే ఈ నదికి ఆనకట్ట కట్టి ఇంద్రియాలను వెనుకకు మరలించండి.113.ఇంద్రియాలు అంతర్ముఖం కానంతవరకు ఎప్పటికీ ఆత్మ దర్శనం కాదు. ఆత్మ సాక్షాత్కారం లేకపోతే ఆత్యంతిక సుఖం సాధ్యంకాదు. జన్మ నిరర్థకం. 114.అంతిమ సమయంలో భార్యాపుత్రులు గాని మిత్రులుగాని చివరి వరకూ ఎవరూ కూడా పనికిరారు. మాకు తోడుగా ఉండి ముక్తిని ఆనందాన్ని ప్రసాదించేది మీరొక్కరే.115.కర్మాకర్మల బంధనాలను తొలగించి, ఈ దుఃఖాలనుండి విముక్తిని కలిగించండి. మహారాజా! మీ కృపా శక్తితో ఈ దీన దుర్బలులను ఉద్ధరించండి. 116.మీ కృపా సామర్థ్యంతో వాదోపవాదాలు చేసే చెడు ప్రవృత్తిని పూర్తిగా నశింప చేయండి. సాయి మహారాజా! పావనమైన మీ నామ స్మరణయందు మా జిహ్వాకు రుచి కలగ నీయండి.117.నాసంకల్పవికల్పాలు పోయి, గృహాన్ని మరియు శరీరాన్ని మరచి పోయి నేను నాదన్న అహంభావం పారిపోయేలా నా మనసును ప్రేమ మయంగా మార్చండి .118.నా మనసు యొక్క చంచలత్వం తొలగి నిశ్చలమై,దానికి ఇతర విషయాలేవీ గుర్తుకురాకుండా ఉండుగాక. ఎప్పుడూ మనసులో మీ నామస్మరణ జరుగుగాక.119.మమ్ము మీ అక్కున చేర్చుకుంటే మా అజ్ఞానాంధకారం తొలగిపోయి మీ నీడలో సుఖంగా ఉంటాము. మీ ఆశ్రయంలో లోటంటూ ఉంటుందా?120. మీరు మా వెన్ను తట్టి, మమ్ము మేల్కొలిపి మాకు మీ చరితామృతాన్ని త్రాగించారు. ఇది మరి సామాన్య సుకృతమా?121.తరువాతి అధ్యాయం ఇంతకంటే తీయనైనది. అది శ్రవణార్థుల కోరికలను తీర్చి సాయి చరణాలయందు ప్రేమను పెంచి దృఢమైన శ్రద్ధను కలిగిస్తుంది. 122.ఒక భక్తుడు తన గురువు పాదాలను వదిలి సాయి దర్శనానికి వచ్చి, సాయి పాదాలకు అభివందనం చేయగా, బాబా అతనిని అతని గురువు వద్దనే స్థిరంగా ఉండేలా చేశారు.123.మరో గృహస్థుడు

శ్రీమంతుడై ఉండి కూడా, కష్టాలలోచిక్కుకుని భార్యా బిడ్డలతో సహా సాయిబాబా దర్శనానికి వచ్చాడు.124.బాబా అతని బాధ నెలా తీర్చారు,అపస్మారంలో ఉన్న అతని పుత్రుని వ్యాధిని కేవలం దర్శనంతో తొలగించి అతనికి పూర్వపు దృష్టాంతాన్ని గుర్తుచేసిన విషయాన్ని వినండి.125.హేమాడ్ సాయికి శరణు జొచ్చి సాయి కథలను ఆసక్తితో శ్రవణం చేసి మీ శ్రవణాలను సార్థకం చేసుకోండి అని శ్రోతలకు మనవి చేస్తున్నాడు.126.స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన,శ్రీ సాయి సమర్థసచ్చరితంలో భక్తాభీష్ట సంపాదనమను ఇరువదిఅయిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు .శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత - 26 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

భూత భౌతిక విషయాలతోనున్న ఈ అఖిల విశ్వం అద్దంలో ప్రతిబింబించిన నగరంవలె మాయ విజృంభణం, భ్రమ. 1. వాస్తవానికి ఇది అసలు ఉత్పన్నంకాలేదు. ఆత్మ స్వరూపంలో అనుస్యూతమై ఉన్నది. ఆత్మ స్వరూపంలో ఉన్న ఈ విశ్వం చరాచరాలతో అద్భుతంగా అగుపిస్తుంది. 2. అద్దంలో కనిపించేవన్నీ వాస్తవానికి అద్దంలో ఉండవు. వాసనలతో కూడిన నిద్రలో కనిపించినవి మెలకువ రాగానే నశించి పోతాయి. 3. జాగ్రదావస్థలోకి రాగానే స్వప్నంలో లభించిన ప్రపంచం పోతుంది. సద్గురుని మహావాక్యోపదేశం వలన అద్వయానందం కలుగుతుంది. 4. విశ్వం యొక్క స్ఫురణ సత్తా మరియు అధిష్ఠానమైన, గుర్వాత్మఅగు ఈశ్వరుడు ప్రసన్నుడైనప్పుడే ఆత్మసాక్షాత్కారం. 5. ఆత్మ స్వరూపము సత్స్వరూపమూ, స్వప్రకాశకమైనది. భూత భౌతిక విశ్వం మాయాకౌతుకం లీల. 6. ఆబ్రహ్మ స్తంబ పర్యంతం భూతభౌతిక జగత్తు అంతా కల్పితం. ఈ విధంగా అంతటా వ్యాపించిన జగత్తు కేవలం మాయా విజృంభితం. 7. ఆత్మ స్వరూప జ్ఞానం లేనందువలన త్రాడు సర్పంగా, మాలగా, కట్టుగా, ప్రవాహంగా భాసిస్తుంది. అట్లే విస్తరించి ఉన్న ఈ జగత్తుకు ఆత్మ స్వరూపంలో చోటులేదు. 8. గురువు వచనాలను బోధించే సమయం ప్రాప్తించినపుడు మాయామయమైన ఈ దృశ్య జగత్తు తత్త్వజ్ఞానంతో లయమై పోతుంది. 9. ఉత్తమపురుష ఏకవచన రూపమైన గృణాతి అర్థాన్ని మనసులో ఉంచుకుంటే తత్త్వోపదేశం చేయటంలో గురువొక్కరే సమర్థులు

అని శిష్యునకు విదితమవుతుంది.10.అందువలన మనబుద్ధి ఆత్మ పరాయణ అయి నిత్యానిత్య వివేకయుక్తమై వైరాగ్యంతో ఉండేలా చేయమని బాబాను ప్రార్థిద్దాం.11.నేను అవివేకిని మూఢుణ్ణి. నా బుద్ధి అజ్ఞానంతో ఎప్పుడూ కుతర్కాలు చేస్తుంది. అందువలననే ఈ సమస్యలు.12.బాబా! నాకు గురువు యందు వేదాంత వచనాల యందు దృఢ విశ్వాసముండేలా, నా అంతఃకరణం అద్దంలా నిర్మలమై అందు ఆత్మజ్ఞానం ప్రకటమయ్యేలా చేయండి.13.సద్గురూ సాయి సమర్థా! యదార్థ జ్ఞానాన్ని తెలుసుకునేలా అనుగ్రహించండి. అనుభవజ్ఞానం లేకుండా వట్టి వాచాలత్వముంటే పరమార్థాన్ని ఏం సాధించగలం?14.బాబా! మీ ప్రభావంతో జ్ఞానాన్ని శరీరంలో అనుభవింపచేసి సహజమైన సాయుజ్యాన్ని ప్రసాదించి మమ్ము కరుణించండి.15.ఆ ముక్తి కోసం దేవా! సద్గురుసాయీ! శరీరమే నేను అని తలచే మా అహంభావాన్ని మీ చరణాలయందు అర్పిస్తాము.మాలో నేను అనేది లేకుండా ఇక ముందు మమ్మల్ని మీరే కాపాడాలి.16.మా శరీరాభిమానాన్ని తీసేసుకోండి. మాకు సుఖదుఃఖాలు తెలియకుండా పోవాలి.మీ ఇచ్ఛానుసారం మీ సూత్రాన్ని నడిపించి మా మనసులను అరి కట్టండి.17.లేదా మా అహంభావం కూడా మీరే అయి మా సుఖదుఃఖాల అనుభవాలను కూడా మీరే తీసుకోండి. మాకు వాని చింత వద్దు. 18.జయజయవ్యూర్ణకామా! మాకు మీ యందు ప్రేమ స్థిరపడుగాక. మంగళ ధామా! ఈ చంచలమైన మనసు మీ పాదాలయందు విశ్రాంతిని తీసుకొనుగాక.19.బాబా! మీరు కాక మాకు మరెవరు హితవచనాలను చెప్పుతారు? ఎవరు మా దుఃఖాలను తొలగించి మా మనసులకు శాంతిని చేకూరుస్తారు?.20.బాబా! మీరు శిరిడీ రావటం శిరిడీ యొక్క భాగ్యం మీరు అక్కడే మీ నివాసాన్ని ఏర్పరచుకుని శిరిడీని పుణ్యక్షేత్రంగా చేశారు. 21.శిరిడీ యొక్క సుకృతం ఎంతధన్యం? సాయిదయామయులు దానిని భాగ్యవంతంగా తమ వసతిస్థానంగా అలంకరించారు.

22.సాయిదేవా! మాకు ప్రేరణ కలిగించేది మీరే, మా వాక్కును నడిపించేది మీరే. మీ గుణాలను గానం చేయటానికి నేనెవరిని? చేసేవారు, చేయించేవారూ మీరొక్కరే. 23. మీతో నిత్య సమాగమం మాకు ఆగమనిగమాలు. నిత్యం మీ చరిత్ర శ్రవణమే మాకు పారాయణం. 24. అనుక్షణం మీ నామావర్తనే మాకు కథా కీర్తన. అదే మా నిత్యానుష్ఠానం. అదే మాకు తృప్తి. 25. మీ భజన నుండి దూరం చేసే సుఖాలు మాకు వద్దు. పరమార్థంలో ఇంతకంటె అధికంగా అధఃపతనాన్ని కలిగించే ఆటంకాలు ఏవి ఉంటాయి? 26. ఆనందాశ్రువుల వేడి నీటితో మీ చరణాలను ప్రక్షాళనం చేస్తాను. నిర్మలమైన ప్రేమ అనే చందనాన్ని మీ శరీరానికి పూస్తాను. మీకు శ్రద్ధ అనే మంచి వస్త్రాన్ని కప్పుతాను. 27. బాహ్యోపచార పూజ కంటే ఈ అంతరంగ పూజా విధానంతో మిమ్ము ప్రసన్నులను చేసి సుఖసంతుష్టుణ్ణి అవుతాను. 28. సాత్విక అష్ట భావాలనే నిర్మలమైన అష్టదళాల కమలాన్ని, అచంచలమైన ఏకాగ్రమనసుతో పావనమైన మీ చరణాలకు సమర్పించి ఫలితాన్ని పొందుతాను. 29. శ్రద్ధాభక్తి అనే బుక్కాను మీ నొసట అద్ది, దృఢమైన విశ్వాసమనే మొలత్రాటిని మీ నడుముకు బంధించి, మీ పాదాంగుష్ఠాలయందు నాకంతాన్ని అర్పించి అలౌకికమైన ఆనందాన్ని అనుభవిస్తాను. 30. ప్రేమ రత్నాలతో మిమ్ము అలంకరించి నా సర్వస్వాన్నీ మీకు దిగ దిడుపు దిష్టి తీస్తాను. నా పంచప్రాణాలను వింజామరలుగా వీస్తాను. మీ తాప నివారణ కోసం తన్మయత్వమనే గొడుగును పట్టుతాను. 31. ఈ విధంగా గంధం అర్ఘ్యం మొదలైన అష్టోపచారాలతో సాయి మహారాజా! మా మంచికోసం మీకు స్వానంద పూజచేస్తాను. 32. నామనోభీష్టాలు తీరటానికి ఎల్లప్పుడూ 'సాయి సమర్థ' అని స్మరిస్తాను. ఈ మంత్రం ద్వారానే పరమార్థాన్ని సాధిస్తాను. నిష్ఠతో కృతార్థుడనవుతాను. 33. గతాధ్యాయంలో దయామయులైన సాయి సమర్థులు, తమ భక్తులకు శుభాలను కలిగించటానికి ఎలా బోధించే వారో చెప్పాను. 34. ఇప్పుడు ఈ అధ్యాయంలో బాబా

భక్తులను వారివారి గురువుల చరణాలలో ఎలా స్థిరపరచేవారో ఆ కథావృత్తాంతాన్ని చెప్పుతాను వినండి.35.గత అధ్యాయం చివర పంతు అన్న భక్తుని కథామృతాన్ని తెలియచేస్తానని చెప్పాను. తత్త్వం బాగా నిశ్చయంగా తెలియటానికి శ్రోతలు శ్రద్ధగావినాలి.36.ఆ భక్తునికి బాబా ఎటువంటి అనుభవాలను చూపించారు? అతని నేత్రాలకు నిష్ఠ అనే అంజనాన్ని ఎలా వేశారు? అతనిని అతని గురువు పాదాలయందు దృఢపరచి ఎలా అతని మనసును శాంత పరచారో వినండి.37. ఒకసారి పంతు అన్న పేరుగల ఒక భక్తుడు చాలా శ్రమపడి మిత్రుని వెంట సాయిబాబా దర్శనాభిలాషతో శిరిడీ వెళ్ళాడు.38.అప్పటికే అతడు ఒక గురువు అనుగ్రహాన్ని పొంది వారి యందు శ్రద్ధ కలిగి ఉన్నాడు. అందువలన శిరిడీకి ఎందుకు వెళ్లాలి? అని సందేహం కలిగింది.39.అయినా వారివారి భాగ్యం కొద్దీ అనుకోకుండానే అదృష్టం కలిసి వస్తుంది. అలా అతనికి సాయి దర్శన భాగ్యం లభించి అమోఘమైన సుఖం కలిగింది. 40.తానొకటి తలచితే దైవం మరొకటి తలచు. విధి ఎదుట ఎవరిదీ సాగదు కదా. ఆ విషయాన్ని ఇక స్పష్టచిత్తులై వినండి.41. కొంతమంది శిరిడీకి వెళ్లాలని నిశ్చయించుకుని తమ ఇళ్ళనుండి బయలుదేరి అందఱూ కలిసి రైలుబండిలో ఆనందంగా కూర్చున్నారు.42.వారు బండిలో ఎక్కేసరికి అక్కడే కూర్చుని ఉన్న పంతుకు వారంతా శిరిడీకి వెళ్ళుతున్నట్లు తెలిసింది.43.పంతు స్నేహితులూ బంధువులూ వారిలో ఉన్నారు. పంతుకు శిరిడీ వెళ్లాలని లేకపోయినా వారి బలవంతం వలన ఇరుకున పడ్డాడు.44.పంతు మొదట ఎక్కడివరకు వెళ్లాలని అనుకున్నాడో అక్కడివరకే టికట్టు తీసుకున్నాడు. తరువాత తన ఆలోచనను మార్చుకున్నాడు.45.కాని మిత్రులు బంధువులు తమ వెంట శిరిడీకి రమ్మని ఒత్తిడి చేయగా పంతు సరేనన్నాడు.46.పంతు విరార్‌లో దిగాడు. మిత్రులు ముంబైకి వెళ్ళారు, చేతిఖర్చుకు అప్పుతీసుకుని పంతుకూడా ముంబైకి వెళ్ళాడు. 47.మిత్రులమనసు కష్టపెట్టకూడదని,

తన గురువు అనుమతిని తీసుకుని అందరూ కలిసి ఆనందంగా శిరిడీ వెళ్లారు.48.ఉదయం పదకొండు గం॥ల సమయాన అందఱూ మసీదుకు వెళ్ళారు. అక్కడ భక్తులు బాబా పూజకు గుంపులుగా ఉండటం చూచి వారికి చాలా ఉత్సాహం కలిగింది.49.బాబాను దర్శించుకుని అందరూ ఆనందించారు. ఇంతలో పంతుకు తలతిరిగి తెలివి తప్పి పడిపోయాడు.50.అతని ప్రాణం నీరసించి పోయింది. శరీరం చేష్టలు లేకుండా పోయింది.అతని వెంట ఉన్న వారికి భయాందోళనలు కలిగాయి.51.కాని సాయిబాబా యొక్క కృపాదృష్టి పడింది. మిత్రులు పంతు మస్తకంపై నీరును చల్లగా అతనికి తెలివి వచ్చింది.52.తేరుకుని గాబరాపడుతూ లేచి కూర్చున్నాడు. నిద్రనుండి అప్పుడే లేచినట్లు అనిపించింది.53.బాబా సర్వజ్ఞులు. పంతు అదివరకే ఒక గురువుకు శిష్యుడన్న విషయాన్ని గ్రహించి అతనికి ధైర్యాన్ని, అభయాన్ని ప్రసాదించి అతని నిష్ఠను అతని గురువుయందే స్థిరపరచారు.54.'ఎలాంటి సందర్భంలోనైనా మన ఆశ్రయాన్ని విడిచి పెట్టకూడదు. ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటూ అనన్యంగా అందరిలోనూ ఏకత్వాన్ని చూడు' అని చెప్పారు.55.పంతుకు అది బాగా అర్థం అయింది.తన గురువు స్మరణకు వచ్చారు. సాయిబాబా యొక్క అనుగ్రహం జీవితమంతా గుర్తు ఉంది.56.అప్లే ముంబై పట్టణ నివాసి హరిశ్చంద్ర అన్న ఒక గృహస్థుడు,పుత్రుడు అపస్మార రోగగ్రస్థుడు కావడం వలన ఎంతో దుఃఖ పడసాగాడు.57.దేశ విదేశాలలోని వైద్యులయ్యారు. కాని ఏమీ నయం కాలేదు.అందటి ప్రయత్నాలు వ్యర్థమై సాధుసత్పురుషులు మిగిలారు.58. క్రీ.శ.**1910** సం॥ లో దాసగణు కీర్తనలతోసాయినాథుని కీర్తి బాగా వ్యాపించి శిరిడీ యాత్ర చేసేవారు అధికమయ్యారు.59.చిన్న గ్రామమే అయినా గొప్ప భాగ్యం వలన శిరిడీ పండరిపురం వలె అత్యంత మహిమ కలదవటం వలన యాత్రీకులు అధికంగా వచ్చేవారు.60.సాయి బాబా కేవలం దర్శనంతోనో లేదా కేవలం హస్త

స్పర్శతోనో లేదా వారి కృపాదృష్టితోనో రోగాలను తొలగిస్తారని అనేకులకు అనుభవమైంది.61.బాబాకు అనన్య శరణు జొచ్చిన భక్తులు శుభాలను పొందుతారు. బాబా భక్తుల కోరికలను తెలుసుకుని వానిని తీర్చుతారు. 62.వారి విభూతితో పిశాచాలు పారిపోతాయి. వారి ఆశీర్వచనంతో దుఃఖాలు తొలగిపోతాయి.వారి కృపాకటాక్షంతో బాధలు నశిస్తాయని ప్రజలు శిరిడీకి పరుగు తీస్తారు. 63.బాబా యొక్క మహాత్మ్యాన్ని దాసగణు గ్రంథాలలోను కథా కీర్తనలలోను కర్ణాకర్ణిగా విని పితళేకు బాబా దర్శనం చేసుకోవలెనని కోరిక కలిగింది.64.పూర్వ పుణ్యఫలితంగా పితళే, భార్యా బిడ్డలను రకరకాల పళ్లను వెంట తీసుకుని శిరిడీకి వచ్చాడు.65.పుత్రుని బాబా పాదాలపై పడవేసి తానూ స్వయం సాష్టాంగపడ్డాడు. అప్పుడు ఒక విపరీతం జరిగే సరికి పితళె చాలా గాబరా పడ్డాడు.66.సాయిబాబాను ముఖా ముఖిగా చూడగానే పితళే కుమారుడు కళ్లు తిరిగి అకస్మాత్తుగా తెలివి తప్పి పడిపోయాడు.అతని తల్లి తండ్రులు భయ పడిపోయారు.67.స్పృహ లేకుండా నేలమీద పడి బాగా నురుగులు కక్కుతుంటే, అప్పుడు 'తమ కర్మకు ఏం చేయాలి' అని తల్లితండ్రులకు చింత పట్టుకుంది.68.బాలుని శరీరమంతా చెమటలు పట్టాయి. నోటినుండి వచ్చే నురుగు ఆ పరిస్థితిని చూస్తే బాలుని శ్వాస ఆగిపోతుందేమో అనిపించింది. బాలుడు బ్రతుకుతాడన్న ఆశపోయింది.69.బాలుడు అలా అంతకు మునుపు అనేకసార్లు స్పృహను కోల్పోవటం జరిగింది. కాని ఇంతసేపు ఎప్పుడూ ఉండలేదు.70.ఇప్పుడు ఇది 'నభూతో నభవిష్యతి' వలే ప్రాణాంతకంగా వచ్చింది. ఏమిటి ఇలా జరిగిందని కుమారుని చూచిన తల్లి కళ్ల నుండి ఆశ్రువులు ఆగకుండా కారుతున్నాయి.71. అసలు వచ్చింది దేనికి? జరిగిందేమిటి? ఏదైనా ఉపాయం లభిస్తుందని వస్తే అపాయం జరిగింది.ఈ సాయి పాదాలు ఇంతటి ఘాతుకమా? మా ప్రయత్నమంతా వ్యర్థమేనా?72.దొంగల భయంతో ఇంట్లోకి ప్రవేశిస్తే ఇల్లేపైన

పడ్డట్లయింది. అల్లేమేమిక్కడకు రావడం జరిగింది అని ఆమె అన్నది.73.పులి తినేస్తుందని ఆవు, ప్రాణభయంతో పారిపోతుంటే దారిలో కసాయి ఎదురైనట్లు జరిగింది.74.ఎండకు మాడిపోతున్న బాటసారి చెట్టు నీడలోకి వెళ్లితే,ఆచెట్టే వ్రేళ్లతో సహా ఊడిపడ్డట్లయింది మాగతి.75.భక్తిగా దేవుని గుడిలోనికి పూజకని వెళ్లితే గుడి కూలి పైన పడ్డట్లయింది అని ఆ స్త్రీ వాపోయింది. 76.అప్పుడు బాబా 'మనసులో ధైర్యం తెచ్చుకో అబ్బాయిని లేపి జాగ్రత్తగా తీసుకుని వెళ్లు. అతనికి తెలివి వస్తుంది.77. పిల్లవాణ్ణి బసకు తీసుకుని వెళ్లు. కాసేపట్లో అతడు బాగౌతాడు. ఊరికే కంగారుపడకు' అని బాబా ఆమెకు ధైర్యం చెప్పారు.78.తరువాత వారు అలా చేయగా బాబా వచనాలు నిజమయ్యాయి. పితళె కుటుంబమంతా ఆనందించారు. వారి మనసులోని సందేహాలు తొలగిపోయినాయి. 79.అబ్బాయిని బసకు తీసుకుని వెళ్లగానే అతనికి తెలివి వచ్చింది.అతని తల్లితండ్రుల దిగులు తొలగి పోయి చాలా ఆనందించారు.80.పితళే భార్యతో సహా బాబాదర్శనానికి వచ్చి వారికి అత్యంత వినయంగా సాష్టాంగ ప్రణామం చేశాడు.81.తన కుమారుడు స్వస్థత చెందినందుకు కృతజ్ఞతతో ఆనందంతో బాబా చరణాలను ఒత్తుతూ కూర్చున్నాడు. బాబా చిరునవ్వు నవ్వుతూ. 82. 'ఏమిటి? ఇప్పుడైనా నీ మనస్సులోని ఆలోచనా తరంగాలు శాంతించాయా'? అని అడిగి విశ్వాసంతో సహనాన్ని కలిగి ఉండే వారిని శ్రీహరి రక్షిస్తాడు అని అన్నారు. 83.పితళె ఆగర్భ శ్రీమంతుడు.గొప్పకులీనుడు, గౌరవంకలవాడు. బాబాకు పళ్లను మిఠాయిలను దండిగా అర్పించాడు.84.అతని భార్య మంచి సాత్వికురాలు. శ్రద్ధా భక్తులున్న ప్రేమమయి. స్తంభం వద్ద కూర్చుని బాబా వైపు తదేక దృష్టితో చూచేది. 85.అలా చూస్తూచూస్తూ ఉంటే ఆమె కళ్లు అశ్రువులతో నిండిపోయేవి. ఆమె అలా రోజూ చేస్తుంటే ఆమె విశేషమైన ప్రేమకు బాబా తమను తాము మరచి పోయేవారు. 86. సత్పురుషులు కూడా

భగవంతుని వలెనే భక్తపరాధీనులు. వారిని అనన్యంగా ఆరాధించే వారిని అనుగ్రహిస్తారు.87. పితళే కుటుంబం, తిరిగి వెళ్లిపోవటానికి ప్రయాణమై మసీదుకు బాబా వద్దకు వెళ్ళారు. బాబా అనుమతిని విభూతిని తీసుకుని బయలుదేరారు. 88.ఇంతలో బాబా తమ జేబునుండి మూడు రూపాయలను తీసి పితళేను దగ్గరకు పిలిచి చెప్పిన మాటలను వినండి. 89.'బాపూ! నేను నీకు పూర్వం రెండు రూపాయలను ఇచ్చాను. వాటితో పాటు ఈ మూడింటినీ ఉంచి పూజచేయి. నీకు శుభం కలుగుతుంది.'90.ఆ రూపాయలను పితళే చేతిలోకి తీసుకుని వానిని ప్రసాదంగా భావించి ఆనందంగా స్వీకరించాడు. బాబా పాదాలకు సాష్టాంగపడి 'మహారాజా! నన్ను కరుణించండి' అని అన్నాడు. 91.అతనిలో ఆలోచనాతరంగాలు లేచాయి. నేను ఇక్కడికి రావటం ఇదే మొదటిసారి కదా! మరి బాబా అప్పుడేమిటి? నాకేం అర్థం కావటం లేదు.92.నేనిదివరకెప్పుడూ బాబాను చూడనే లేదు. మరి వారు నాకు రెండు రూపాయలను ఎప్పుడు ఇచ్చారు? దీని అర్థం అసలు బోధపడటం లేదు అని ఆశ్చర్యపడ్డాడు.93.బాబా మాటలు స్పష్టంగా ఎలా అర్థమౌతాయి? అతనిలో జిజ్ఞాస అధికమైంది. కాని బాబా ఏమీ సూచించలేదు. వారి మాటలు అర్థం కాకుండా ఉండిపోయినై. 94.సత్పురుషులు సహజంగా పలికిన ఆ మాటలు తప్పక నిజమవుతాయని పితళెకు తెలుసు కనుక ఆలోచనలో పడ్డాడు.95.తరువాత ముంబైలోని తన ఇంటికి వెళ్ళాడు. వారింట్లోని ఒక పుస్తకాలు అతని జిజ్ఞాసను తీర్చింది. 96.ఆమె అతని తల్లి. ఆమెతో శిరిడీ విశేషాలను ముచ్చటిస్తుండగా మూడు రూపాయల ప్రస్తావన వచ్చింది. కాని ఆమెకు ఆ రూపాయలతో ఉన్న సంబంధం అర్థం కాలేదు. 97.ఆలోచించగా ఆమెకు గుర్తుకువచ్చింది. బాబా చెప్పింది నిజమే'ఇప్పుడు నాకు విషయం గుర్తుకు వచ్చింది అని పితళెతో చెప్పింది.98.ఇప్పుడు నీవు వీకుమారుని శిరిడీకి సాయి దర్శనానికి తీసుకుని వెళ్లినట్లుగానే మునుపు మీనాన్న నిన్ను అక్కల్‌కోటకు తీసుకుని

వెళ్ళారు.99.అక్కడి మహారాజు సిద్ధులు. పరోపకారపరాయణులు.మహా ప్రసిద్ధులు. సర్వజ్ఞులు, యోగులు విద్వాంసులు. మీ నాన్న గారు కూడా పవిత్రమైన ఆచారాలతో ఉండేవారు.100.మీ తండ్రి పూజను స్వీకరించి ఆ యోగిరాజు ప్రసన్నులై పూజచేసుకోవటానికి రెండు రూపాయలను ప్రసాదంగా ఇచ్చారు. 101.పూజార్చనలను చేయటానికి స్వామి నీ కొఅకు ప్రసాదంగా ఆ రెండు రూపాయలను ఇచ్చారు. 102.ఆ రెండు రూపాయలు దేవతార్చన యందు ఉండేవి.వానిని మీ నాన్న విధేయతగా అత్యంత శ్రద్ధానిష్ఠలతో పూజించేవారు.103.వారి నిష్ఠ నాకు ఒక్కదానికే తెలుసు.వారి తరువాత పూజా సామాను పిల్లల ఆటవస్తువులై పోయాయి. 104.దేవుని మీద శ్రద్ధ పోయింది.పూజ చేయటం సిగ్గు చేటైంది.పూజ చిన్న పిల్లలవంతు అయింది.అలాంటి పరిస్థితిలో ఆరూపాయలను ఎవరు పట్టించుకుంటారు?105.అలా అనేక సంవత్సరాలు గడచి పోయాయి.ఆ రూపాయలు మరుగున పడిపోయి అవి గుర్తులేకుండా పోయాయి.అలా రెండు రూపాయలూ పోయాయి.106.మరచిన దానిని గుర్తుచేయటానికి, నీ కష్టాలను తొలగించటానికి.నీ మహాభాగ్యం కొద్దీ అక్కల్ కోట మహారాజు సాయిరూపంలో కలిశారు.107.కనుక ఇకనుండి కుతర్కాలు సందేహాలు వదిలిపెట్టు.వక్రమైన చెడువ్యవహారాలను మాను.నీ పూర్వికుల అడుగుజాడలలో నడువు.108.సత్పురుషుల ప్రసాదాన్ని భూషణంగా భావించు.వారు ఇచ్చిన రూపాయలను పూజించు.సాయి సమర్థులు పూర్వవృత్తాంతాన్ని గుర్తుకు తెచ్చి భక్తిని పునరుజ్జీవనం చేశారు' అని చెప్పింది. 109.తల్లి యొక్క మాటలను విని పితలై మనసుకు పరమానందం కలిగింది. సాయి యొక్క సర్వవ్యాపకత్వం బాగా నాటుకుంది. వారి దర్శనంతో జన్మ సార్థకమయిందని తలచాడు. 110.తల్లియొక్క అమృత వాక్కులు నిద్రాణమైన అతని భక్తిభావాన్ని జాగృతం చేశాయి.అతనికి పశ్చాత్తాపమనే ప్రాయశ్చిత్తం కలిగింది; భవిష్యత్తులో సన్మార్గాన్ని సూచించాయి.111.జరగవలసింది

జరిగింది.సత్పురుషులు భావి జీవితాన్ని జాగ్రతం చేశారు. వారి ఉపకారాన్ని కృతజ్ఞతతో గుర్తుంచుకుని పితళే తన విధులలో సావధానంగా ఉన్నాడు. 112.ఇటువంటి మరొక అనుభవాన్ని చెప్పుతాను. శ్రద్ధగా వినండి. భక్తుల యొక్క ఉచ్చ్రుంఖల మనోవృత్తిని బాబా ఎలా నిగ్రహించే వారో గమనించండి.113.గోపాలనారాయణ ఆంబ్లేకర్ అన్న పేరుతో పూణెలో సాయిబాబా యొక్క భక్త శ్రేష్ముడుండేవాడు.అతని కథను వినండి.114.అతడు ఆంగ్లప్రభుత్వంలోని అబ్కారి శాఖలో ఉద్యోగి. అక్కడ పదేళ్లు పని చేసి ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చున్నాడు.115.అతని నుదుటిరాత ప్రతికూలంగా మారింది. అన్ని రోజులూ ఒకేలా ఉండవుకదా. అతనిని దౌర్భాగ్యం దాపురించింది.గ్రహాలదశ వలన కలిగే కష్టాలను అనుభవించకుండా ఎవరు తప్పించుకోగలరు!116.మొదట్లో అతనికి థాణా జిల్లాలో ఉద్యోగం.ఆ తరువాత అదృష్టవశాత్తు అదే జిల్లాలోని జప్పార్‌కు అధికారిగా వచ్చాడు.అక్కడే నిరుద్యోగి అయ్యాడు.117.ఉద్యోగం ఆకుమీది నీటిబొట్టు క్షణభంగురం.అదిపోతే మరల లభించటం మాటలా?అతడు ఎంతగానో ప్రయత్నించాడు. 118.కాని అతనికి అదృష్టం లేదు. అందువల్ల స్వతంత్రంగా బ్రతకాలని నిశ్చయించుకున్నాడు. కష్టాలు పరాకాష్టనందుకోగా అతడు అన్ని విధాలా హతాశుడయ్యాడు.119.ఉన్న డబ్బు అంతా ప్రతిఏడూ ఊడ్చుకుని పోయి కష్టాల పైన కష్టాలు వచ్చి,బాగా దిగజారి అతని ఇంటి పరిస్థితి భరించలేనంత బాధాకరమైంది. 120.ఈ విధంగా ఏడు సంవత్సరాలు గడిచాయి.ప్రతి సంవత్సరం శిరిడీకి వెళ్లి బాబాకు సాష్టాంగ ప్రణామం చేసి వారి ముందు తన బాధను ఏకరువు పెట్టేవాడు. 121.క్రీ.శ.1916 వ సంవత్సరంలో పూర్తిగా విసుగు చెంది శిరిడీ క్షేత్రానికి వెళ్లి అక్కడ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.122.భార్యతో సహా వెళ్లి అక్కడ రెండు మాసాలున్నాడు. ఒకరోజు రాత్రి

జరిగిన వృత్తాంతాన్ని వినండి.123.అంబ్డేకరు దీక్షితు వాడా ఎదుట ఒక ఎద్దుబండి మీద కూర్చుని ఉండగా అతనిలో ఆలోచనా తరంగాలూ లేచాయి.124.అతనికి జీవితంపై విసుగెత్తి పోయింది. అత్యంత ఉదాసీనుడై, చాలు బాబూ ఈ కష్టాలు ఇక వద్దు. జీవించాలన్న కోరిక నాకు లేదు.125.అని తలచి ప్రాణాలపైని ఆశను వదిలేసి ఆంబ్డేకర్ బావిలో దూకటానికి సిద్ధమయ్యాడు.126.సమీపంలో ఎవరూ లేని ప్రశాంత సమయంలో నా సంకల్పాన్ని నెరవేర్చుకుని కష్టాలను తొలగించుకుంటాను అని అనుకున్నాడు. 127.ఆత్మహత్య ఘోరమైన పాపమైనా అతడు తన నిశ్చయాన్ని దృఢం చేసుకున్నాడు. కాని సూత్రధారులైన సాయిబాబా అతని దురాలోచనను తొలగించారు.128.అక్కడికి నాలుగు అడుగుల దూరంలో ఒక భోజనశాల యజమాని ఇల్లు ఉంది. అతనికి కూడా బాబాయే ఆధారం. అతడు కూడా బాబా యొక్క పరిచారకుడు.129.ఆ సగుణుడు తన ఇంటి గుమ్మం వద్దకు వచ్చి ఆంబ్డేకరును'ఈ అక్కల్‌కోట మహరాజు పుస్తకం ఎప్పుడైనా చదివావా?'అని అడిగాడు.130.ఏదీ చూడనీ ఏం పుస్తకం అంటూ ఆంబ్డేకరు పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని మామూలుగా పుటలను తిరగేస్తూ మధ్యనుండి చదవసాగాడు.131.కర్మధర్మ సంయోగం ఎలా కలసి వచ్చిందంటే అనుకోకుండా అతడు చదివే విషయం అతని ఆలోచనకు సరిగ్గా సరిపోయింది.132. అతని మనసుకు బాగా నాటుకునేలా సహజంగా వచ్చిన కథను శ్రోతలకు పూర్తిగా చెప్పాలంటే గ్రంథం పెద్దదైపోతుందన్న భయంతో సంక్షిప్తంగా మనవి చేస్తాను.133.అక్కల్‌కోటలో ఆత్మనిష్ఠలో ఉన్న సత్పురుషశ్రేష్ఠులైన మహరాజు ఉన్నప్పుడు అక్కడ వ్యాధి గ్రస్తుడైన ఒక భక్తుడు భరించ లేనంత బాధ పడుతుండేవాడు. 134.తన వ్యాధి తొలగిపోతుందన్న ఆశతో ఆయనకు చాలా రోజులు సేవచేశాడు. ఆ బాధ ఇక ఏమాత్రం సహించలేక చాలా నిరుత్సాహ పడిపోయాడు. 135.ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకుని

ఒక రాత్రి సమయాన ఒక బావి వద్దకు వెళ్లి దానిలో దూకాడు. 136.అంతలో మహారాజు అక్కడికి వచ్చారు. స్వహస్తాలతో అతనిని బయటికి లాగి 'అనుభవించవలసిన కర్మనంతా అనుభవించి తీరాలి'అని ఉపదేశించారు.137.మన పూర్వజన్మ కర్మ అయిన కుష్ఠువ్యాధిని గాని ఇతర రోగాల బాధలను గాని పూర్తిగా అనుభవించకుండా ఆత్మహత్యా ప్రయత్నం ఏం చేయగలదు?138. అనుభవించాల్సిన కర్మ పూర్తి కాకపోతే మరోసారి జన్మించవలసి వస్తుంది.అందువలన ఈ కష్టాన్ని కాస్త ఓర్చుకో.ఆత్మహత్య చేసుకోకు' అని బోధించారు.139.ఆ సందర్భానికి సరిగ్గా సరిపోయిన ఆ కథను చదివి ఆంబ్లేకరు మనసులో చకితుడయ్యాడు. బాబా యొక్క సర్వవ్యాపకత్వాన్ని గ్రహించి అక్కడే కూర్చుండి పోయాడు.140.పూర్వజన్మ కర్మను అనుభవించి తీరాలి అని బాబా సమయానికి సరిగ్గా సూచించ బట్టి నేను దుస్సాహసం చేయక పోవటం మంచిదే అయింది అని అనుకున్నాడు.141.ఆ అనుభవం అతనికి అశరీరవాణి పలుకువలె అనిపించింది. సాయి చరణాలలో అతనికి దృఢవిశ్వాసం కలిగింది.'ఇది సాయి యొక్క అఘటిత ఘటన.142.సగుణుని ముఖతః సాయి యొక్క సంకేతం ఆపుస్తకంద్వారా కాస్త ఆలస్యంగా అంది ఉంటే ఈ జన్మ నశించి పోయేదే కదా!143.ఈ జీవితాన్ని పోగొట్టుకునేవాణ్ణి. కుటుంబానికి ఘోరమైన కష్టాలను కలిగించేవాణ్ణి. భార్యకు అనర్థం కలిగేది. స్వార్థాన్ని పరమార్థాన్ని పోగొట్టుకునే వాణ్ణి.144.బాబా సగుణుని ప్రేరేపించి ఆ పుస్తకం మిషతో నన్ను ఆత్మహత్యనుండి విరమించుకునేలా చేశారు' అని తలపోశాడు. 145.ఆ విధంగా జరగకపోతే పాపం అతడు వృధాగా ప్రాణాలు పోగొట్టుకునే వాడే. కాని సాయి వంటి రక్షకుడు ఉండగా చంపేవాడు అతనిని ఎలా చంపగలడు? 146.ఆంబ్లేకరు తండ్రికి అక్కల్‌కోట స్వామి యందు భక్తి. అట్లే అతనికి కూడా అలాంటి భక్తి ఉండాలని బాబా ఈ అనుభవాన్ని

కలిగించారు. 147.ఆ తరువాత అంతా బాగా జరిగింది. ఆ రోజులు గడిచిపోయినై. ఆంబ్లేకరు జ్యోతిష్య విద్యలో బాగా పరిశ్రమ చేసి ఆ ఫలితంగా బాగాఅభివృద్ధి చెందాడు.148. సాయి కృపా ప్రసాదంతో అతనికి మంచిరోజులు వచ్చినై. జ్యోతిష శాస్త్రంలో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. పూర్వపు దైన్యావస్థ తొలగిపోయింది.149.అతనికి గురుచరణాలలో ప్రేమ అధికమైంది. సుఖంగా క్షేమంగా ఉన్నాడు.గృహంలో సుఖశాంతులు నెలకొనగా పరమానందాన్ని పొందాడు.150.ఇటువంటివి లెక్కలేనన్ని చమత్కారాలు.ఒకదాని కంటె మరొకటి గొప్పవి. ఇలా చెప్పుతుంటే గ్రంథం విస్తారమై పోతుంది కనుక సంక్షిప్తంగా చెప్పాను.151.హేమాడ్ సాయి చరణాలలో శరణు జొచ్చి తరువాతి అధ్యాయంలోని మధుర కథనం – బాబా శామాకు విష్ణు సహస్రనామాన్ని ప్రదానం చేశారు. 152.శామా వద్దు వద్దు అంటున్నా అతనిపై అత్యంత ప్రేమ ఉన్న బాబా అతనికి బలవంతంగా విష్ణుసహస్రనామాన్నిచ్చి అందులోని మహత్మ్యాన్ని అందంగా వర్ణించారు. 153.ఆ కథను శ్రద్ధగా వినండి.అనుగ్రహప్రదాన సమయం వచ్చినప్పుడు, శిష్యునికి అసలు కోరిక లేకపోయినా బాబా దానిని ప్రదానం చేయటం కనిపిస్తుంది.154. అలౌకికమైన అనుగ్రహాన్ని సద్గురువు ఎలా ప్రసాదిస్తారు అన్నది అధ్యాయంలో కనిపిస్తుంది. దీనిని శ్రోతలు శ్రద్ధగా వినండి. 155. శుభాలకే శుభాన్ని చేకూర్చే ఈ సాయి గుణాలకు నిధి.వారి పవిత్ర చరిత్ర శ్రవణం మరియు కీర్తన మహా భాగ్యం. 156.స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన,శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో అపస్మార ఆత్మహత్యా నివారణం మరియు నిజగురు పదస్థిరీకరణమను ఇరువది ఆరవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయి నాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీసాయి సచ్చరిత - 27 వ అధ్యాయం.

శ్రీ గణేశాయనమః; శ్రీ సరస్వత్యైనమః; శ్రీ గురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

శ్రీ సద్గురు చరణాలను దృఢంగా పట్టుకుంటే బ్రహ్మాది త్రిమూర్తులకు నమస్కరించినట్లే. సాక్షాత్తు పరబ్రహ్మకు పాదాభివందనం చేసినట్లు, దానివల్ల ఆత్మానందం ప్రకటమవుతుంది. 1. ఒక్క సాగరంలో మునిగితే సకల తీర్థాలలో స్నానమాచరించినట్లే. గురుచరణాల వద్ద తిష్ట వేసుకుని కూర్చుంటే సకలదేవతల సన్నిధిలో ఉన్నట్లే. 2. జయజయ సాయి సద్గురూ! జయజయ సాయుజ్యకల్పతరూ! జయజయ ఆత్మజ్ఞానసాగరా! మాకు ఈ కథలయందు పూజ్యభావాన్ని కలిగించండి. 3. మేఘాల నీటిని చాతక పక్షులు త్రాగేలా భావికులైన భక్తులు మీ కథామృతాన్ని సేవించి ఎప్పుడూ సుఖంగా ఉందురుగాక. 4. మీ పావన కథను విని, శరీరమంతా చెమటలు పట్టి, రోమాంచితమగుగాక. కళ్లనుండి ప్రేమాశ్రువులు దొరలుగాక. ప్రాణాలు మీ చరణాల వద్ద నిలచు గాక. 5. మనసు ఉప్పొంగుగాక. శరీరం మాటిమాటికి రోమాంచిత మగుగాక. శ్రోతలు పరివారంతో సహా మరలామరలా కన్నీరు కార్చుదురుగాక. 6. పరస్పర విరోధాలు, చిన్నాపెద్ద అనేభేదభావాలు తొలగిపోవుగాక. గురువు యొక్క అనుగ్రహాన్ని తెలుసుకోవటానికి ఇదే గుర్తు. దీనిని గ్రహించటానికి అంతరంగాన్ని శోధించాలి. 7. ఈ అనుగ్రహం కంటికి కనిపించనిది. ఏ ఇంద్రియానికి గోచరించనిది. జ్ఞానాన్ని ప్రసాదించే దాత సద్గురువు తప్ప త్రిభువనాలు వెదకినా లభించరు. 8. కామక్రోధాది అరిషడ్ వికారాల ఉపశమనం, భక్తిభావం, గురుచరణాలలో అత్యంత ప్రేమ పరమ

నిష్ఠ లేకపోతే, అస్థభావాలు జనించవు. 9. భక్తులకు ఆత్మానందం గురువుకు పరమసుఖం. భక్తులు క్రమేణా పరమార్థంలో ప్రవేశించటం గురువుకు సంతోషం. 10. శరీరం, ఇల్లు, భార్యాపిల్లలు, నావారు నేను, నా దన్న భావం మధ్యాహ్నపు నీడవలె క్షణికమైన మాయ. 11. ఈ మాయా చిక్కులో బంధింప బడకుండా ఉండాలని మనసులో ఉంటే అనన్య భావంతో సాయిని శరణువేడండి. 12. మాయను అంతం చేయాలనుకొన్న వేదశాస్త్రజ్ఞులు ఆశలు వదులుకొన్నారు. సమస్త ప్రాణులలోనూ భగవంతుని చూచేవారే నిశ్చయంగా తరించగలరు. 13. ధన్యుడైన చాందుపటేలు నిజాంరాజ్యాన్ని వదిలి ఫకీరైన సాయిని వెంట పెట్టుకుని మొదట నెవాసాకు వచ్చాడు. 14. అక్కడ ఒక సంవత్సరమో లేక ఆరుమాసాలో ఆ ఫకీరు ఉన్నారు. అక్కడే కానడ్ ఊరిలోని కమాను తోడుగా ఉంచుకున్నారు. 15. తరువాత ప్రసిద్ధమైన టాకళి ఊరిలోని దగడు అనే పేరుగల తమల పాకులు అమ్మే వాడు, కమా మరియు సాయిబాబా శిరిడీ వచ్చారు. 16. అక్కడక్కడా అనేకమైన పుణ్యక్షేత్రాలు పవిత్ర తీర్థ స్థలాలు ఉన్నాయి. కాని సాయి భక్తులకు శిరిడీయే అత్యంత పవిత్రమైనది. 17. దైవవశాత్తు ఈ యోగం కలుగకపోతే దీనులమైన మనకు సాయితో కలిసి ఉండే మహద్భాగ్యం ఎలా కలిగేది? ఇది మన అదృష్టం. 18. భక్తులు తమ కార్యాన్ని సాధించుకోవటానికి, వెళ్లి బాబా శరణుజొచ్చితే, వారు వారికి యోగ్యమైన మార్గాన్ని చూపించేవారు. 19. అందువలన ఏకాగ్రమనసుతో ఈ సాయి సచ్చరితను మరల మరల పారాయణం చేయండి. కారణం పరమ పావనమైన ఈ సాయి చరిత్ర గురువు అనుగ్రహానికి ఉత్తమ సాధనం. 20. గతాధ్యాయంలో ఒకరిని అతని గురువు పాదాలవద్ద స్థిరపరచటం, ఒకరికి లక్ష్మీకోట స్వామిని గుర్తు చేసి జాగృతిని కలిగించటం, 21. మరొకరిని ఉపాయంతో దేహాంతకమైన ఆత్మహత్యనుండి క్షణంలో రక్షించి జీవన దానం చేయటాన్ని వర్ణించడమైనది. 22. ఇప్పుడు ఈ అధ్యాయంలో, సాయిబాబా

ప్రసన్నులౌతే భక్తులకు అనుగ్రహాన్ని ప్రసాదించి వారిని ఎలా సుఖసంపన్నులను చేస్తారో తెలియచేస్తాను 23. బాబా యొక్క బోధనా పద్ధతి అద్భుతమైనది. వారు ఆడుతూపాడుతూ నవ్వుతూ వినోద భరితంగా ఎవరికి ఏ విధంగా బోధించేవారో శ్రోతలు శ్రద్ధగా వినండి. 24. ఇదే గ్రంథంలో బాబా యొక్క అనేక రకాల ఉపదేశాలు ఇదివరకు వర్ణించాను. వారు భక్తుల అర్హతలను, గ్రహణశక్తిని బట్టి వారికి తగిన మార్గాలను ఉపదేశించేవారు. 25. రోగనిర్ణయం మరియు దానికి ఏ ఔషధం ఎంత ఇవ్వాలి అన్నది వైద్యునికి తెలుస్తుంది. కాని రోగికి అవేవీ తెలియవు. రోగి, ముందు బెల్లాన్ని కోరుతాడు. 26. బెల్లం తియ్యగా ఉంటుంది కాని రోగులకు అది అపకారం చేస్తుంది. అయినా రోగి అదే కావాలని మొండి చేస్తాడు. బెల్లం ముక్క చేతిలో పెట్టే వరకు మందును చేతికందు కోడు. 27. రోగిపై నిర్బంధం ఉండకూడదు. అందువల్ల వైద్యులు యుక్తిగా, ముందు బెల్లం ముక్కపెట్టి తరువాత ఔషధాన్నిచ్చి తమ పనిని సాధిస్తారు. 28. అయితే బెల్లం యొక్క దోషాన్ని హరించే విధంగా అనుపానాన్ని మారుస్తారు. దాంతో మందు ఒంటికి పట్టుతుంది. బాబా పద్ధతి కూడా అదే. 29. కాని అందరి పట్ల ఇదే నియమం కాదు. భక్తుల అర్హతలను, స్వభావాలను, భక్తిశ్రద్ధలను, సేవను, ప్రేమను గమనించి వారికి అనుగ్రహాన్ని ప్రసాదించేవారు. 30. బాబా యొక్క లీలలు అద్భుతం. వారు ఎవరిపైనైనా ఎప్పుడైనా ప్రసన్నులైతే వారిని ఎలా అనుగ్రహిస్తారో వినండి. 31. ఒకసారి బాబా మనసుకు తోచిందా, ఎవరికి ఏ కోరికా లేకపోయినా మామూలుగా వినోదాలతో పరిహాసంచేస్తూ భక్తులను కృతార్థులను చేస్తారు. 32. భక్తుల మనసులలో ఏదైనా గ్రంథ పఠన చేయాలని కోరిక కలిగితే వారు ఆ గ్రంథాన్ని బాబా చేతులలో ఉంచి దానిని వారి ప్రసాదంగా తిరిగి తీసుకునేవారు. 33. ఆ తరువాత దానిని పఠనం చేస్తే అది శుభప్రదం, శ్రోతలకు వక్తకూ పరమ శ్రేయస్కరం. అది ప్రసాదపూర్వ శ్రవణం. 34. ఒకరు దశావతార చిత్రాలను, ఒకరు దశావతార

స్తోత్రాలను, మరొకరు పంచరత్నగీతవంటి పవిత్ర పుస్తకాలను చరిత్రలను బాబాకు అర్పించెవారు. 35.దాసగణు కూడా తన 'సంతలీలామృతం' మరియు 'భక్త లీలామృతం' గ్రంథాలను అర్పించాడు. మరొకరు వివేక సింధు గ్రంథాన్ని అర్పించారు. బాబా వానిని శ్యామాకు ఇచ్చేవారు.36.'శ్యామా ఈ పుస్తకాలు నీ కొరకు. వీనిని ఇంట్లో భద్రంగా కట్టి ఉంచు' అని చెప్పేవారు. వారి ఆజ్ఞను శిరసావహించి శ్యామా ఆ పుస్తకాలను భద్రపరచేవాడు. 37.భక్తులు అలా అంగళ్లనుండి పుస్తకాలను తెచ్చి.వానిని బాబా చేతికిచ్చి వారి ప్రసాదంలా వాటిని మరల తీసుకోవాలని అడిగేవారు. 38.బాబా ఉదార స్వభావం కలవారే అయినా భక్తులు అలా ఇవ్వటానికి సాహసించలేక మాధవరావును వెంట బెట్టుకుని బాబా ముందుకు వెళ్లేవారు.39.అదను చూచి అతని ద్వారా అతని చేత్తోనే బాబా చేతికి గ్రంథాన్ని ఇప్పించేవారు. బాబాకు ఆ గ్రంథాల ప్రాముఖ్యత తెలిసినట్లే భక్తుల స్థితి కూడా తెలుసు. 40.భక్తులు గ్రంథాలను చేతికి ఇచ్చినప్పుడు బాబా పుస్తకాల పుటలను మరలమరల త్రిప్పేవారు.అప్పుడు భక్తులు పుస్తకాలను తిరిగి తీసుకోవటానికి చేతులు చాచేవారు.41.బాబా వారికి ఇవ్వకుండా వాటిని మాధవరావుకు ఇచ్చి శ్యామా దీనిని ప్రస్తుతం నీవద్ద ఉంచు అనేవారు.42.అదిగో దానికోసం ఆతురతతో చేతిని చాచిన వారిది ఇది.వారిది వారికి ఇవ్వనా అని శ్యామా స్పష్టంగా అడిగేవాడు.కాని బాబా 'నీ దగ్గరే ఉంచు' అని చెప్పేవారు43.ఒకసారి భాగవత పఠనంలో ప్రీతిగల భక్తుడు కాకా మహాజని ఆ గ్రంథాన్ని తన వెంట తీసుకుని శిరిడీ వెళ్లాడు. 44.అక్కడ అతనికి మాధవరావు కలిసి ఆ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని మసీదుకు వెళ్లాడు. బాబా మామూలుగా. 45.శ్యామా నీ చేతిలోని ఆ పుస్తకం ఏమిటి అని అడిగారు. శ్యామా బదులు చెప్పగా ఆ పుస్తకాన్ని చేతికి అందుకుని చూచి అతనికి తిరిగి ఇచ్చేశారు. 46.ఇదే ఏకనాథ భాగవత గ్రంథాన్ని ఇదే ప్రతిని కాకా మహాజని అదివరకు శ్రీవారినుండి

ప్రసాదంగా స్వీకరించినదే.47. ఈ గ్రంథం అసలు నాదికాదు.ఇది కాకా మహాజనిది. నేను చదవాలనే కోరికతో తీసుకున్నానని శ్యామా స్పష్టంగా తెలియచేశాడు.48.అయినా బాబా అతనితో 'నీకిది పనికి వస్తుందని నీవద్ద ఉంచమని ఇచ్చాను.నీ పుస్తకాలలో ఉంచు' అని చెప్పారు.49.తరువాత కొంతకాలమయాక కాకా మహాజని మరల శిరిడీకి వచ్చాడు.మరొక భాగవత గ్రంథాన్ని తీసుకుని వచ్చి, బాబా చేతిలో ఉంచాడు. 50.దానిని బాబా ప్రసాదంగా అతనికి తిరిగి ఇచ్చి 'బాగా శ్రద్ధగా పఠించు.' అని ఆజ్ఞాపించారు. ఇది నీకు బాగా పనికి వస్తుంది అని అతనికి ఉత్సాహాన్ని కలిగించారు.51. అంతేకాదు, 'ఇదే నిజంగా మన కార్యాన్ని సాధిస్తుంది. దీనిని ఎవరికీ ఇవ్వకు' అని ఎంతో ప్రేమగా చెప్పారు.కాకా భక్తిగా బాబాకు వందనం చేశాడు.52.బాబా ఏ కోరికలు లేని నిష్కాములు.దేనినీ ఆశించనివారు.భాగవత ధర్మాన్ని ఆచరించేవారికి వస్తువులను సేకరించే అవసరమేముంది? 53.వారి మనసును ఎవరు గ్రహించగలరు? ఈ గ్రంథాలను సంగ్రహపరచటం వ్యవహార దృష్టిలో అతి పవిత్రమైనది. ఇది భక్తుల శ్రవణానికి సాధనం.54.శిరిడీ పవిత్ర క్షేత్రానికి దేశ దేశాలనుండి భక్తులు వచ్చి, ఇక్కడ కలిసి జ్ఞానయజ్ఞాన్ని చేస్తారు. 55.అప్పుడు ఈ గ్రంథాలు అవసరమవుతాయి.'నేను నాధామానికి వెళ్లిపోయాక శ్యామా వీనిని తీసి చూపుతాడు. ఈ గ్రంథాలు నా ప్రతిరూపాలౌతాయి'.56.పరమపావనమైన ఈ గ్రంథాలు శిరిడీలో కాని ఇతర ప్రదేశాలలో కాని పఠిస్తే భక్తులకు బాబా గుర్తుకు వస్తారు.పుస్తకాల సంగ్రహ కారణం అదే అయి ఉంటుంది. 57.రామాయణమైనా భాగవతమైనా పారమార్థిక గ్రంథమేది అయినా రామకృష్ణాదుల చరితాలను పఠిస్తుంటే ముందూ వెనుకా సాయియే కనిపిస్తారు.58.ఈ సాయియే ఆ గ్రంథాలలోని ఆయా మహాత్ముల రూపంలో నటించారని అనిపిస్తుంది. అందువల్ల సాయి మూర్తిని శ్రోతలు వక్త ఎప్పుడూ తమ ఎదుట చూస్తారు.59. గ్రంథాన్ని గురువుకు అర్పించినా లేదా బ్రాహ్మణునకు దానం

చేసినా అది దాతకు శుభప్రదమని శాస్త్రప్రమాణం. 60. గ్రంథాలను తనింటికి తీసుకుని వెళ్లి వానిని భద్రంగా కాపాడే బాధ్యతను బాబా శ్యామాకు అప్పచెప్పటం అదేమన్నా స్వల్ప ప్రయోజనమా? 61. శ్యామాకు బాబాపై అపరిమితమైన భక్తి ఉన్నట్లే బాబాకు అతనిపై అత్యంత ప్రేమ. అతనికి ఏదైనా నియమాన్ని విధించాలని సాయికి సంకల్పం కలిగింది. 62. అప్పుడు శ్యామాకు కోరికలేకున్నా బాబా అతనిని ఎలా అనుగ్రహించారో వినండి. 63. ఒకరోజు ఒకరామదాసి సాధువు మసీదులో ఉన్నాడు. అతనికి రామాయణాన్ని పఠించడం నిత్యనియమం. 64. ప్రాతఃకాలం ముఖం కడుక్కుని స్నానసంధ్యలుచేసి, విభూతి పెట్టుకుని, అనంతరం కాషాయవస్త్రాలను ధరించి అనుష్ఠానం చేసేవాడు. 65. విష్ణుసహస్రనామావర్తన తరువాత శ్రద్ధగా ఆధ్యాత్మరామాయణాన్ని పారాయణం తరువాత పారాయణం చేసేవాడు. 66. అలా కొంతకాలం గడిచాక మాధవరావుకు మంచి సమయం వచ్చి సాయి సమర్థుని చిత్తంలో ఒక ఆలోచన కలిగింది. అది ఏమిటో వినండి. 67. మాధవరావు సేవ ఫలించింది. అతడు ప్రపంచ బాధలనుండి విశ్రాంతి పొందటానికి అతనికి మంచి నియమాన్ని చూపించి, అతడు భక్తిమార్గం యొక్క ఫలితాన్ని పొంది, ప్రపంచం నుండి విశ్రాంతి పొందాలని బాబాకు సంకల్పం కలిగింది. 68. ఆ ఆలోచన రాగానే బాబా రామదాసుని తమ వద్దకు పిలిపించి 'కడుపులో ప్రేగులు తెగిపోయేలా నొప్పిగా ఉంది. 69. వెంటనే వెళ్లి, పోవాముఖిని త్వరగా తీసుకునిరా. దానిని కాస్తతీసుకుంటే తప్ప ఈ కడుపునొప్పి పోదు' అని చెప్పారు. 70. రామదాసు పాపం భక్తుడు. చదువుతున్న పుస్తకంలో గుర్తుపెట్టి బాబా ఆజ్ఞానుసారం అంగడికి పరుగుతీశాడు. 71. రామదాసు అలా క్రిందకు దిగిపోగానే ఇక్కడ బాబా ఏం చేశారంటే తమ ఆసనం నుండిలేచి, పుస్తకాల దగ్గరకు వెళ్ళారు. 72. అక్కడ ఇతర పుస్తకాలతోపాటు విష్ణుసహస్రనామ పుస్తకం ఉంటే బాబా దానిని తీసుకుని తిరిగి తమ స్థానానికి వచ్చారు. 73. 'శ్యామా ఈ పుస్తకాన్ని

చూడు! దీనిలో గొప్ప గుణాలున్నాయి. అందువల్లే నీకు దీనిని ఇస్తున్నాను. చదివిచూడు.74.ఒకసారి నాకు చాలా బాధ కలిగింది. గుండె దడదడలాడింది. ప్రాణం రెపరెపలాడింది.నేను బ్రతుకుతానన్న నమ్మకం పోయింది.75.ఆ సందర్భంలో ఈ పుస్తకం ఎంతగా ఉపయోగపడిందో నీకెలా చెప్పను? శ్యామా! ఈ పుస్తకం వలననే ఈ ప్రాణాలు రక్షింపబడ్డాయి.76.ఒక్క క్షణం గుండెకు హత్తుకోగానే, వెంటనే ప్రాణం కుదుట పడింది. దేవుడే నాలో ప్రవేశించి నా ప్రాణాలు కాపాడాడా అనిపించింది. దీనివలననే జీవుడు బ్రతికాడు.77. అందువల్ల శ్యామా! దీనిని నీవు తీసుకుని వెళ్లి మెల్లమెల్లగా చదువు.రోజూ ఒకటో అరో మాటలను నేర్చుకో.గొప్ప ఆనందాన్ని కలిగిస్తుంది' అని చెప్పారు.78.శ్యామా 'ఇది నాకు వద్దు. రామదాసుకి కోపం వస్తుంది. ఈ చెడువనిని నేనే చేశానని అంటాడు.79.అసలే అతడు కోపిష్ఠివాడు. అడ్డదిడ్డంగా తలతిక్కగా వాగుతాడు. ఎందుకీ వ్యర్థమైన పోట్లాట? నాకు ఈ గొడవంతా వద్దు.80.పైగా ఈ పుస్తకం సంస్కృత భాషలో ఉంది.నాది మొరటు వాక్కు. నా నాలుకకు ద్విత్వాక్షరాలు పలుకవు.వానిని నేను స్పష్టంగా ఉచ్చరించలేను' అని చెప్పాడు.81.బాబా చేసినదంతా చూచి శ్యామా అది బాబా తగువు పెట్టటానికి అని తలచాడు.బాబాకు అతనిపై ఎంత వాత్సల్యమున్నది అతనికి తెలియదు. 82.మా శ్యామా వెఱ్ఱివాడే కావచ్చు. అయినా అతనిపై నాకు మమకారం. అతనికి నాపై ప్రేమ. అందువల్ల అతనిపై నాకు దయ.83.ఈ విష్ణుసహస్రనామమాలను స్వహస్తాలతో అతని కంఠానికి కట్టి, అతనిని భవభయబాధల నుండి ముక్తుణ్ణి చేస్తాను.అతనికి నామం పై ప్రీతిని కలిగిస్తాను. 84.నామం పాపాలనే పర్వతాలను పగలగొట్టుతుంది.నామం శరీర బంధనాలను విడగొట్టుతుంది.నామం కోటి చెడువాసనలను సమూలంగా పెరికి వేస్తుంది.85.నామం కాలుని మెడను విరిచేస్తుంది.నామం జనన మరణచక్రాన్ని తప్పిస్తుంది.శ్యామాకు ఇటువంటి సహస్రనామం మధురమవ్వాలి.

86. ప్రయత్న పూర్వకంగా నామాన్ని స్మరిస్తే మంచిది. అప్రయత్నంగా నామ జపం చేసినా చెడుకలుగదు. తెలియకుండా నోటితో ఉచ్చరించినా నామ ప్రభావం ప్రకటమౌతుంది.87. అంతఃకరణాన్ని పరిశుద్ధపరచడానికి నామం కంటే సులభమైన మరో సాధనం లేదు. నామం జిహ్వాకు భూషణం. నామం పరమార్థాన్ని పోషిస్తుంది.88. నామ జపానికి స్నానం చేయాల్సిన అవసరం లేదు. అట్లే నామానికి విధి విధానాలేవీ లేవు. నామ సంకీర్తనలో సకల పాపాలు నశించిపోతాయి. నామం ఎల్లప్పుడూ పావనమైనది.89. అనవరతం నానామాన్ని స్మరించే వారు తీరానికి చేరుకుంటారు. ఇతరసాధనలేవీ అవసరం లేకుండానే మోక్షం హస్తగతమవుతుంది.90. నానామాన్ని ఎల్లప్పుడూ జపించేవారి పాపాలు క్షాళనమవుతాయి. మెల్లగా లోలోపల నానామాన్ని జపించేవారు ఉత్తమ గుణ సంపన్నులకంటె ఉత్తములు' అని చెప్పారు.91. ఇదే బాబా మనోగతం. దానిననుసరించి ప్రవర్తించేవారు. శ్యామా వద్దు వద్దు అని వారించినా బాబా పుస్తకాన్ని అతని జేబులో పెట్టారు.92. అతని తల్లిదండ్రుల గొప్ప పుణ్యఫలం కారణంగా అతనికి సాయిబాబా యొక్క కృపాఫలం లభించింది. ఇటువంటి పావనమైన విష్ణుసహస్రనామం ప్రపంచంలోని బాధలను తొలగిస్తుంది.93. ఇతర కర్మలను చేయటానికి ఒక విధి విధానం అవసరం. కాని నామ జపానికి అవేవీ లేవు. నిరవధికంగా చేయవచ్చు. ప్రదోషం, చదవకూడని సమయం వంటివి లేవు. నామజపం వంటి మంచి ఉపాసనాసాధన వేరే ఏదీ లేదు.94. ఇదే విధంగా ఏకనాథ మహారాజు కూడా, ఇదే విష్ణుసహస్రనామాన్ని తమ పొరుగింటి వ్యక్తి తలపై పెట్టి అతనిని పరమార్థ మార్గంలో ప్రవేశ పెట్టారు.95. ఏకనాథులవారింట నిత్యం పురాణ పఠనం ఉండేది. వారి పొరుగింటి వ్యక్తి బ్రాహ్మణ జాతీయుడు. కాని స్నానసంధ్యాదులు లేక దురాచారాలలో నిమగ్నుడై ఉండేవాడు.96. ఎన్నడూ పురాణ శ్రవణం చేసేవాడు కాదు. ఆ దుర్మార్గుడు ఏకనాథుని ఇంట్లో అడుగు పెట్టేవాడు

కాదు. ఏకనాథులు కరుణించి అతనిని పిలిపించారు.97. గొప్పజాతిలో జన్మించి జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నాడు. అతడు ఎలా బాగుపడతాడా అని ఏకనాథులకు పరమదయ కలిగింది.98.అందువలన అతడు వద్దన్నా అతనిచే విష్ణుసహస్ర నామం లోని ఒక్కొశ్లోకాన్ని చదివించి అతనిని ఉద్ధరింప చేశారు.99.ఈ విష్ణుసహస్రనామ పారాయణం చిత్తశుద్ధికి సులువైన మార్గం. ఇది పూర్వీకులనుండి పరంపరగా వచ్చినది.అందుకే బాబా ప్రయత్నం మరియు శ్రమ.100.సోనాముఖీ ఔషధాన్ని తీసుకుని రామదాసు వెంటనే వచ్చాడు.కలియుగ నారదుడైన అణ్ణాచించనీకరు అతనికి జరిగిన వృత్తాంతాన్ని తెలియచేశాడు.101. రామదాసు అసలే కోపిష్టి.ఆ పైన నారదుని చెప్పుడు మాట. ఇక ఆ అపూర్వ సందర్భాన్ని యదార్థంగా ఎవరు వర్ణించగలరు?102.కుతర్కబుద్ధిగల రామదాసుకి మొదలే మాధవరావుపై సంశయం. నా పుస్తకాన్ని కాజేయటానికి నీవే బాబాను మధ్యవర్తిగా చేశావు అని అన్నాడు. 103.సోనాముఖీ విషయం మరచిపోయి మాధవరావుపై విరుచుకు పడ్డాడు. నిగ్రహించుకోలేనంత ఎక్కువ క్రోధావేశంతో బాగా తిట్లను కురిపించాడు.104.'కడుపు నొప్పి అన్నది ఒట్టి సాకు.నీవే బాబాను పురికొల్పావు. నీ కళ్లు నా పుస్తకాలపై పడ్డాయి. నా వద్ద ఇదేం సాగదు.105.నా పేరు రామదాసు. వీరుణ్ణి. నిర్భయుణ్ణి. బుద్ధిగా నా పుస్తకాన్ని తిరిగి ఇవ్వక పోతే నీ ఎదుటే తలబ్రద్దలు కొట్టుకుని రక్తం చిందిస్తాను.106.నీ దృష్టి నా పుస్తకంపై పడింది. నీవే ఈ కపట నాటకమంతా ఆడి, బాబా పై రుద్ది, ఏమీ ఎఱుగనట్లున్నావు'. 107.మాధవరావు ఎన్నోవిధాల నచ్చచెప్పినా రామదాసు శాంతించలేదు. అప్పుడు మాధవరావు సౌమ్యంగా శాంతంగా అన్నది వినండి. 108.నేను కపటినని నాపై నింద వేయకు.వృధాగా నాకు దోషాన్ని అంటకట్టకు. ఆ పుస్తకం విశేషమేమిటి? అది ఎక్కడా లభించదా?109.నీ పుస్తకానికి రత్నాలు పొదిగారా, లేక బంగారం తొడిగారా?బాబాపైన కూడా నీకు

విశ్వాసం లేదు. ఇది సిగ్గు పడవలసిన విషయం అని అన్నాడు.110. బాబా వారిని చూచి మధురంగా' రామదాసూ! ఇప్పుడు ఏం మునిగిపోయింది? అనవసరంగా ఎందుకు బాధపడుతున్నావు?111. శ్యామా మన కుఱ్ఱవాడే కదా, నీవు ఊరికే ఎందుకు నరాలు తెంచుకుంటున్నావు? వృథాగా ఎందుకింత కష్టపడుతున్నావు? ప్రపంచానికి తమాషా చూపిస్తున్నావు. 112. ఎందుకిలా కయ్యానికి కాలుదువ్వుతున్నావు? చక్కగా మంచిగా మాట్లాడరాదూ? ఈ పుస్తకాలను నిరంతరం చదువుతావు. అయినానీ అంతఃకరణం అపరి శుద్ధంగానే ఉంది.113. ప్రతిరోజూ ఆధ్యాత్మ రామాయణం చదువుతావు. విష్ణుసహస్రనామా వర్తన చేస్తావు. కాని ఈ నిరంకుశ స్వభావాన్ని విడిచిపెట్టవు. పైగా రామదాసునని చెప్పుకుంటావు.114. నీవు ఎటువంటి రామదాసువయ్యా? నీకు అన్నింటియందు అనాసక్తి ఉండాలి. కాని నీకు పుస్తకంపైని మోహం పోలేదు. నీ ఈ ప్రవర్తనను ఏమనాలి?115. రామదాసుకి మమత ఉండరాదు. చిన్నాపెద్దా అందరియందూ సమతా భావముండాలి. కాని నీవు భేదభావంతో ఈ అబ్బాయి చేతిలోని పుస్తకం కోసం పోట్లాడుతున్నావు.116. పో! పోయి నీస్థానంలో కూర్చో. డబ్బుతో పుస్తకాలు దొరుకుతాయి. కాని కల్పాంతం వరకు మంచి మనుషులు దొరకరు. బాగా ఆలోచించుకో!117. నీ పుస్తకం యొక్క మహిమను శ్యామాకు చెప్పటానికి నేనే స్వయంగా ఆ పుస్తకాన్ని తీసి అతనికి ఇచ్చాను.118. అదంతా నీకు కంఠస్థం కదా. దానిని శ్యామాకు ఇవ్వాలని అనిపించింది. మరలమరల చదివితే ఎంతో శుభం కలుగుతుంది' అని చెప్పారు.119. సాయి యొక్క ఆ వాణిలో ఎంతటి మధుర రసం? ఎంతటి దయ. హృదయానికి ఆనందాన్ని కలిగించే చల్లటి హాయి. ఇది అత్యంత అపూర్వం. 120. రామదాసు బాగా అర్థం చేసుకున్నాడు. కోపంగా బాగా ఎఱ్ఱబారిన ముఖంతో శ్యామాను ఉద్దేశించి, ఇదిగో నీకు ఇప్పుడే చెప్పుతున్నా. దీనికి బదులుగా పంచరత్న గీతను తీసుకుంటా' నని అన్నాడు.121. రామదాసి బాగా

చల్లబడిపోవటం మాధవరావుకు ఆనందం కలిగింది. వెంటనే 'ఒక్కటేమిటి నేను మీకు పది పంచరత్న గీతాపుస్తకాలను బదులుగా ఇస్తాను' అని అన్నాడు.122. దానితో ఆ పోట్లాట శాంతించింది. గీతా గ్రంథాన్ని జామీనుగా ఇవ్వటానికి అంగీకారమైంది. అయితే గీతలోని భగవంతుణ్ణి తెలుసుకోలేని వానికి అసలు గీత ఎందుకు? 123.సాయి సముఖంలో ఆధ్యాత్మరామాయణాన్ని పారాయణం పై పారాయణం చేసే ఆ రామదాసు మాటకు మాట జవాబిస్తూ సాయిబాబాతో ఇలా పోట్లాడుతున్నాడేమిటి?124. ఇంతకీ దోషం ఎవరిదని చెప్పటం? నేనెలాచెప్పగలను? ఆ విధంగాజరగకపోతే విష్ణుసహస్రనామం యొక్క మహాత్మ్యం ఎలా తెలుస్తుంది.125.ఇంతటి పోట్లాటకు కారణమై, బాబా యొక్క బాధను కూడా నివారించిన ఆ పుస్తకం మనకు కూడా శుభం కలిగిస్తుంది. అది సాయిబాబా మనకు ఇచ్చిన అమూల్యవరం.126.ఈ విధంగా శ్రమ పడకపోతే మాధవరావుకు విశ్వాసం కుదిరేది కాదు. నిజంగా అతని జిహ్వాకు అక్షరాలు అలవాటు అయ్యేవి కావు. అతనికది కంఠస్థమయేది కాదు.127. ప్రేమ మయులైన ఇటువంటి సాయినాథులు, దుర్లభమైన పరమార్థ లీలలను ఎప్పుడు ఎలా కనబరుస్తారో వారి చర్య అర్థమవటం కష్టం.128.తరువాత శ్యామాకు బాగా నిష్ఠకుదిరింది. దీక్షితు మరియు నార్కే అతనికి ఉచ్చరించటాన్ని బాగా నేర్పారు. అటుతరువాత శ్యామా అక్షరాలను గుర్తుపట్టి చదవటం నేర్చుకుని పుస్తకాన్ని కంఠస్థం చేశాడు. 129.మాధవరావు యొక్క సంభాషణ, సాయిబాబా యొక్క శుద్ధమైన బోధ, పరమానంద భరితమైన వినోదం నిస్సంశయంగా సుఖదాయకం.130.బ్రహ్మ విద్యను అభ్యసించేవారియందు బాబాకు అమితమైన ప్రేమ. దానిని సందర్భానుసారంగా ఎలా వ్యక్త పరిచేవారో గమనించండి.131.ఒకసారి జోగ్‌కు తపాలాద్వారా ఒక పార్సిలు వచ్చింది. శిరిడీ పోస్టాఫీసుకు వెళ్లి దానిని తీసుకోవటానికి గబగబా బయలుదేరాడు.132.పుస్తకాన్ని తెరచి చూడగా అది

లోకమాన్య తిలక్ రచించిన గీతారహస్యభాష్యం. దానిని చంకలో పెట్టుకుని మసీదుకు బాబా దర్శనానికి వచ్చాడు. 133. బాబాకు నమస్కరించటానికి తలవంచేసరికి పార్సిలు బాబా పాదాలపై పడింది. 'బాపూసాహేబ్! ఇదేమిటి?' అని బాబా ప్రశ్నించారు. 134. బాబా ఎదుట పార్సిలు విప్పి అదేమిటో తెలియచేశాడు. దానిని బాబా చేతికిచ్చాడు. వారు దానిని అవలోకించారు. 135. బాబా గ్రంథాన్ని తీసి చేతిలోనికి తీసుకున్నారు. అటూఇటూ తిరగేసి చూచి తమ జేబులోనుండి ఒక రూపాయిని తీసి ఆ పుస్తకంపై ఉంచారు. 136. ఆ రూపాయితో సహా ఆ గ్రంథాన్ని జోగు ఒడిలోవేసి 'దీనిని మొత్తం చదువు. శుభం కలుగుతుందని' చెప్పారు. 137. ఇటువంటివి బాబా యొక్క అనుగ్రహ కథలను అసంఖ్యాకంగా వర్ణించవచ్చు కాని గ్రంథం విస్తారమవుతుందని సంక్షిప్తంగా చెప్పుతున్నాను. 138. ఒకసారి శిరిడీలో ఏం జరిగిందంటే దాదాసాహేబు ఖాపర్డే కుటుంబ సమేతంగా శిరిడీకి వచ్చి బాబా ప్రేమలో లీనమై, అక్కడే ఉన్నాడు. 139. ఖాపర్డే సామాన్య గృహస్థుడు కాడు. గొప్ప విద్వాంసుడు. ఉన్నత స్థానంలో ఉన్నవాడు. సాయి సన్నిధిలో చేతులు జోడించుకుని వారి చరణాలయందు శిరమును ఉంచేవాడు. 140. ఆంగ్లవిద్యా పారంగతుడు. శాసనసభలో బాగా పలుకుబడి కలవాడు. వక్తృత్వంలో అందరినీ కదిలించి వేసేవాడు. కాని బాబా ఎదుట మౌనంగా ఉండేవాడు. 141. బాబా భక్తులు అసంఖ్యాకంగా ఉన్నా వారివద్ద మౌనవ్రతంలో ఉండేవారు ఖాపర్డే, నూల్కరు, బుట్టి తప్ప ఇతర భక్తులెవరూ లేరు. 142. ఇతరులంతా బాబాతో బాగా మాట్లాడేవారు. కొందరు ఏజంకూ లేకుండా వారికి సమానంగా మాటకుమాట సమాధానం చెప్పేవారు. కాని పై ముగ్గురు మౌన వ్రతంలో ఉండేవారు. 143. మాట్లాడక పోవటమే కాదు. బాబా ఎదుట కేవలం తలలు వంచి ఉంచేవారు. అంతే. వారి వినమ్రత వర్ణించతరం కాదు. వారు శ్రద్ధగా వినటం కూడా వినయంగా ఉండేది. 144. విద్యారణ్య స్వామి యొక్క పంచదశిని,

వ్యాఖ్యానించగల దాదాసాహేబు మసీదులోకి వెళ్లగానే మౌనంగా ఉండేవాడు.145.శబ్దబ్రహ్మ ఎంత శక్తివంతమైనా శుద్ధబ్రహ్మముందు నిస్తేజమే కదా! సాక్షాత్తు పరబ్రహ్మమూర్తి అయిన సాయిముందు పాండిత్యం సిగ్గుపడవలసిందే. 146.ఖాపర్డే నాలుగు నెలలు, అతని భార్య ఏడు నెలలూ శిరిడీలో ఉన్నారు. ఆ ఉభయులకు రోజురోజుకు ఎంతో ఆనందం అనుభవమైంది.147.అతని భార్య అత్యంత నిష్ఠావంతురాలు. ఆమెకు సాయి పాదాలయందు అత్యంత ప్రేమ. ఆమె నిత్యం మసీదుకు సాయిబాబాకు నైవేద్యాన్ని స్వయంగా తీసుకుని వచ్చేది.148. బాబా నైవేద్యాన్ని స్వీకరించేవరకు ఉపవాసవ్రతంతో ఉండేది. సాయి మహారాజు ఆరగించిన తరువాతే ఆమె భోజనం చేసేది. 149.ఒక శుభ సమయాన పరమ భక్తవత్సలుడైన బాబా, అచంచలమైన ఆ స్త్రీ శ్రద్ధను గమనించి ఆమెకు ఉజ్వలమైన పరమార్థమార్గాన్ని చూపించారు.150.బోధనాపద్ధతి అనేక రకాలు. బాబా పద్ధతి విశిష్టమైనది. వారు ఆడుతూ పాడుతూ నవ్వుతూ హృదయంలో బాగా నాటుకునేలా అనుగ్రహాన్ని ప్రసాదించేవారు151.ఒకసారి ఖాపర్డే భార్య అన్నం వప్పు వూరి హల్వా పాయసం అప్పడాలు వడియాలు వడవప్పు అవీ వళ్లెంనిండా పట్టుకుని వచ్చింది.152. ఆ వళ్లెం వచ్చిన వెంటనే బాబా ఆతురతతో తమ ఆసనంపై నుండి లేచారు. చేతిపైని కఫనీని పైకి జరుపుకున్నారు. 153. భోజనం చేసే చోట కూర్చున్నారు. వళ్లాన్ని తమ ముందుకు లాక్కుని దానిపైని మూతను ప్రక్కకు జరిపి, భోజనానికి ఉద్యుక్తులయ్యారు. 154.ఇతరులు కూడా అంతకంటె చాలా రుచిగా ఉన్న నైవేద్యాలను అపరిమితంగా తీసుకుని వస్తారు. అవి ఎంతో సేపు అక్కడ పడి ఉంటాయి. ఈ భోజనంపై వారికి ఎందుకంత ప్రేమ. 155.ప్రాపంచికులకు ఉన్న భేదబుద్ధి సత్పురుషులకు ఉంటుందా? ఇలాంటి భేదభావం తగునా? అని మాధవరావు సాయి సమర్థుని అడిగాడు.156.అందటి వళ్లాలను అక్కడే ఉంచేసి వెండి వళ్లాలను కూడా దూరంగా జరిపేసి

ఈస్త్రీ పళ్లెం మాత్రం రాగానే లేచి ఆరగిస్తున్నావు ఏమిటి విశేషం?157. ఈమె భోజనమే అంత మధురంగా ఉందా?దేవా!మాకిది పెద్ద సందేహం.ఇదేం నీ మాయ?ఇష్టాయిష్టాల భేదభావం నీకెందుకు? అని అడిగాడు. 158.'ఈభోజనం యొక్క విశేషమేమిటో చెప్పనా?పూర్వం ఈమె బాగా పాలిచ్చే ఒక వ్యాపారస్థుని ఆవు. 159.ఆ తరువాత కనిపించకుండా పోయింది.తరువాత ఒక మాలి వద్ద జన్మించింది.ఆ తరువాత ఒక క్షత్రియుని ఇంట్లో పుట్టింది. మరు జన్మలో ఒక వైశ్యుని పత్ని అయింది.160.తరువాత బ్రాహ్మణుల గర్భంలో జన్మించింది. చాలా కాలానికి కనిపించింది. ప్రేమతో తెచ్చిన అన్నం రెండు ముద్దలు సుఖంగా తిననివ్వు.161.అని అంటూ బాబా యథేచ్ఛగా తిన్నారు.చేతులు నోరు కడుక్కుని తృప్తిగా త్రేన్చి తమ ఆసనం పైకి వచ్చి కూర్చున్నారు.162.అప్పుడు ఆ స్త్రీ వారికి వందనం చేసి వారి పాదాలను ఒత్త సాగింది.ఆ అవకాశాన్ని తీసుకుని బాబా ఆమెకు హితోపదేశం చేయసాగారు. 163.బాబా చరణాలను పట్టుతున్న ఆమె చేతిని బాబా తమ చేతితో ఒత్తసాగారు. భగవంతుని, భక్తురాలి పరస్పర సేవను చూచి శ్యామా పరిహాసమాడాడు.164.'భలే బాగా ఉంది.ఈ దృశ్యం ఎంత ఆనందకరం!.మీ పరస్పర ప్రేమ భావాన్ని చూస్తుంటే చాలా ఆహ్లాదకరంగా ఉంది' అని అన్నాడు.165.ఆమె సేవకు బాబా ప్రసన్నులై ఆమెతో మెల్లగా 'రాజారాం రాజారాం' అను .166.అలా ఎల్లప్పుడూ అంటూ ఉండు.అమ్మా!నీ జీవితం సఫలమౌతుంది.నీ మనస్సు శాంతిస్తుంది.నీకు అపరిమితమైన శుభం కలుగుతుంది.' అని చెప్పారు. 167.ఆహా!ఎంత అద్భుతమైన వచనాలు.అవి హృదయంలోనికి చొచ్చుకుపోయి తక్షణం శక్తిపాతం చేస్తాయి. 168.ఇటువంటి దయామయులు శరణాగతులను రక్షించే సాయి సమర్థులు, ఎల్లప్పుడూ భక్తుల మనోభీష్టాలను తీర్చి వారికి శుభాలను కలుగచేస్తారు.169.ఇక,అత్యంత ప్రేమతో వినమ్రతతో, శ్రోతలకు చాలా శుభప్రదమైన

విషయాన్ని చెప్పుతాను. దానిని మీరు మీ మనసులో భద్రపరచుకొండని వినయంగా విన్నవించుకుంటున్నాను. 170. బెల్లం యొక్క తీపికి ఆకర్షింపబడ్డ చీమ తల తెగిపోయినా ఆ బెల్లం ముక్కను విడువదు. అట్లే సాయి చరణాలను మీరు ఆశ్రయిస్తే వారు అత్యంత కరుణతో మిమ్ము రక్షిస్తారు.171.గురువు శిష్యుడు వేరు కారు. విభిన్నంగా కనిపించినా వారు ఒక్కరే.వారిని వేరు పరచాలని ప్రయత్నించినవారి అభిమానం కరిగిపోయింది.172. ఒకరు లేకుండా మరొకరు ఉండరు. గురువు అజ్ఞాని అయితే శిష్యుడుకూడా అజ్ఞానియే. జ్ఞానియైన గురువును ఆశ్రయించిన శిష్యుని ద్వైతం నశించి పోతుంది.173.గురువు ఒక ఊరిలో ఉండి శిష్యుడు మరో ఊరిలో ఉన్నట్లు భావిస్తే అది అబద్ధం అప్పుడు ఆ ఉభయులూ బాహ్యానికి మాత్రమే గురుశిష్యులు.174.అసలు వారు ఇద్దలు కానప్పుడు వారు వేరెలా అవుతారు?ఒకరు లేక ఒకరు ఉండరు. వారిద్దరూ అంత అన్యోన్యంగా ఉంటారు.175.గురువు మరియు శిష్యుని యందు భేదం లేదు. ఇది నిత్య సత్యం.గురుచరణాలపై భక్తుడు శిరసు నుంచటం స్థూలంగా కనిపించే ఆచారం. 176. శిష్యుడు గురువు యందు అద్వైత భావాన్ని గురువు కూడా శిష్యుని యందు అట్లే అభేద భావం కలిగి వారిరువురు పరస్పరం సమరస భావంతో ఉండకపోతే వారి సంబంధం నామమాత్రానికే.177.అన్నవస్త్రాలు ఎలా లభిస్తాయని క్షణమాత్రమైనా చింతించకండి. ఇవన్నీ ప్రారబ్ధానుసారం ఏ ప్రయత్నంలేకుండానే ప్రాప్తిస్తాయి.178. వానిని సంపాదించాలని ప్రయత్నించినా అది వ్యర్థ శ్రమే అవుతుంది. పరమార్థ సంపద కోసం రాత్రింబవళ్లూ చింతన చేస్తూ ప్రయత్నం చేయండి.179.ఉత్తిష్ఠత జాగ్రత! లే!మేలుకో! గాఢనిద్రలో పడి ఎందుకు గుఱ్ఱుపెడుతున్నావు? అని శ్రుతిమాత తారస్వరంతోగర్జిస్తూ భక్తులను ప్రేమగా మేలుకొలుపుతూ ఉంది.180. సర్వానర్థాలకు బీజభూతమైన, అజ్ఞానమనే నిద్రలో మునిగిఉన్న వారిని సమయానికి మేలుకొలిపే

గురు జ్ఞానామృతాన్ని సేవించండి.181.దాని కొఅకు అత్యంత వినమ్రతతో గురుచరణాలలో శరణాగతులవండి. విహితా విహితాలను తెలిసినవారు గురువు ఒక్కరే. కాని పసిపిల్లలవంటి వారమైన మనకు అది తెలియదు. 182.అహంభావంతో కించిజ్ఞుడైన జీవుడు, నిరహంభావంతో సర్వజ్ఞుడైన శివుడు, ఇద్దఱూ ఒక్కటే అన్న అభేద భావాన్ని కలిగించేవారు ఒక్క గురువే.183. అజ్ఞానమనే ఉపాధితో ఉన్న ఆత్మ జీవుడు. మాయోపాధితో ఉన్న ఆత్మ శివుడు. ఈ రెంటిలోని భేదభావాన్ని తొలగించగల సమర్థులు ఒక్క గురువే. 184. మనసు సంకల్ప వికల్పాల అధీనంలో ఉంటుంది.దానిని సాయి చరణాలయందు సమర్పించండి. అప్పటినుండి మనసులో స్ఫురించిన కార్యాల యొక్క కర్తృత్వం గురువుదే. 185.అట్లే కర్మలను చేసే శక్తినంతా సాయికి సమర్పించి వారు ఆజ్ఞాపించిన విధంగా నడుచుకోండి.186.సాయి యొక్క శక్తి అంతటా ఉన్నదని తెలుసుకోండి. వారిపై భారం మోపి నిరభిమానంతో పనులను చేస్తే సిద్ధి హస్తగతమవుతుంది.187.కాని ఇది నేను చేస్తాను అని ఏ కాస్త గర్వమున్నా దాని ఫలితం ఒక్క క్షణమైనా ఆలస్యంకాకుండా తక్షణం కనిపిస్తుంది. 188. మాయామోహనిద్రలో అలసత్వంతో అటు ఇటు పొర్లుతున్న హేమాడ్ పంతుకు హరి యొక్క మరియు గురువు యొక్క అనుగ్రహం ప్రాప్తించింది. 189.కేవలం అదృష్టవశాత్తు ఏ ప్రయత్నమూ ఏ అభ్యాసమూ లేకుండానే లభించింది. తమ లక్ష్యసిద్ధి కొఅకు వారేహేమాడ్ పంతును గౌరవించినట్లుగా అనిపిస్తుంది. 190.భక్తులను ఉద్ధరించటానికి తమ చరిత్రను బలవంతంగా పంతు చేయిపట్టుకుని సవిస్తరమైన గ్రంథాన్ని వ్రాయించారు.191.అఖండాను సంధానమనే దారంతో అనన్యమైన ప్రేమ భక్తి అనే చిత్రవిచిత్ర పుష్పాలతో హారం గ్రుచ్చి మనోహరమైన సాయికి సాదరంగా సమర్పిస్తాను.192. ఆత్మ స్వరూపమనే స్వరాజ్య సింహాసనాన్ని లభింపజేసుకుని దానిపై స్థిరంగా విరాజమానులవుదాము. నిరభిమానంగా

అంతరంగంలో ఆత్మానందాన్ని అనుభవిద్దాం. 193. ఇటువంటి అగాధమైన సాయి చరిత్రలో తరువాతి కథ ఇంతకంటె విచిత్రమైనది. మీ చెవులను పవిత్రం చేసుకోవటానికి క్షణంపాటు సావధానులవండి. 194. తరువాతి మూడు అధ్యాయాలలో, బాబా తమ స్థానంలోనే కూర్చుని, అద్భుతమైన దృష్టాంతాలను చూపిస్తారు. 195. మొదటి అధ్యాయంలో లాలా లక్ష్మిచందు విషయం. అతని పాదాలను ప్రేమ సూత్రంతో కట్టి అతనికి తమ ఆశ్రయాన్ని కలిగించారు. 196. బర్వాణపురంలోని ఒక స్త్రీ నుండి పులగాన్ని కోరి ఆమె తమ దర్శనానికి ఉత్సాహపడేలా చేసి ఆమెకు ప్రేమ యొక్క విశిష్టతను చూపించారు. 197. ఆ తరువాత మేఘా స్వప్నంలో త్రిశూలాన్ని గీయమని దృష్టాంతం. అటుపైన అకస్మాత్తుగా అతనికి శివలింగం ప్రాప్తించటం. 198. ఇటువంటి అనేక కథలు ఉన్నాయి. శ్రోతలు వీనిని భక్తి పూర్వకంగా వింటే శ్రవణం సార్థకమవుతుంది. 199. సాగరంలో మునిగిన ఉప్పులాగ హేమాడ్ సాయికి శరణుజొచ్చి సోహం భావమనే అభేద భావంతో సాయికి అనన్యంగా పాదాభివందనం చేస్తున్నాడు. 200. మనసు అహర్నిశలూ సాయిధ్యానంలో ఉంటూ, వారు తప్ప వేరే ఏదీ మనసులో ప్రవేశించకుండా, సావధానంగా ఉండాలని భక్తిగా ప్రార్థిస్తున్నాడు. 201. గతించినకాలం తుడిచిపెట్టుకుని పోయి, భవిష్యత్తు తీరానికి చేర్చబడి మిగిలిన వర్తమానకాలమంతా నిరంతరం గురు చరణాలలో ఉండుగాక .202. స్వస్తి శ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో దీక్షానుగ్రహదానమనే ఇరువది ఏడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయి నాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 28 వ అధ్యాయం

శ్రీ గణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

సాయిబాబా ఒకే ప్రదేశానికి పరిమితం కాదు. వారు సర్వప్రాణులలోనూ ఉన్నారు. బ్రహ్మనుండి చీమదోమాది క్రిమికీటకాలన్నింటిలోనూ సర్వత్రా వ్యాపించి ఉన్నారు.1.సాయి పూర్ణ శబ్ద బ్రహ్మ. పరబ్రహ్మను తెలుసుకునే మార్గాన్ని తెలియ చేస్తారు. ఇలా రెండింటి యందు ప్రవీణులవటం వలన వారు సద్గురువు పదవికి సమర్థులు.2. స్వయం గొప్పజ్ఞానియైనా శిష్యులకు బోధించలేని వారు, లేదా ఆత్మ స్వరూపంలో స్థిరపరచలేని వారు సద్గురువులు కారు.3.తండ్రి శరీరాన్ని జన్మింప చేస్తాడు. జననం వెనుకే మరణం ఉంటుంది. గురువు జనన మరణాలను నశింప చేస్తాడు. అందుచేత గురువు యొక్క కరుణ అపారం.4.ఇప్పుడు గతంలో తెలియ చేసినట్లు స్వప్న అధ్యాయంలో బాబా భక్తులకు స్వప్నాలలో ఎలా దర్శన మిచ్చారో శ్రవణం చేయండి.5. ఒకరికి కలలో త్రిశూలాన్ని గీయమని చెప్పుతారు. మరొకరిని పులగం కోరుతారు. ఇంకొకరిని చేతబెత్తం పుచ్చుకుని గురువువలె వీపు బ్రద్దలు గొడతారు.6.ఒకరిని కలలో భయపెట్టి త్రాగే దురలవాటును తొలగిస్తారు. భక్తుల యొక్క అనేక కష్టాలను తొలగించి వారికి తమ పాదాల యందు ప్రీతిని కలిగిస్తారు.7.ఒకరిని వీపు బ్రద్దలయేలా బాది ఛాతిపై నూరేరాయితో మర్దించినట్లుగా దశమాధ్యాయంలో చెప్పిన విషయాన్ని శ్రోతలు ఇదివరకే విన్నారు. 8.తరువాతి కథా విశేషాన్ని గానం చేసినవారు, విన్నవారు ధన్యులు. ఉభయులూ తల్లీనులై అక్షయానందాన్ని

పొందుతారు.9.నిందలు చేయడంవల్ల, చెడుమాటలు వినటం వల్ల వచ్చిన పాపాలను ప్రక్షాళనం చేసే పరమపావనమైన సత్పురుషుని కథలను మరల మరల తెలియ చేస్తాను.10.ఇప్పుడు ఆ కథా వర్ణనను శ్రోతలు శ్రద్ధగా శ్రవణం చేస్తే అడుగడుగునా సాయిబాబా యొక్క కరుణ కనిపిస్తుంది.11.రాలీ సోదరులు గ్రీకు వర్తకులు, భారతదేశ మంతటా కొనుగోలు చేసేవారు.వారి శాఖలు అనేక పట్టణాలలో ఉండేవి. ముంబై నగరంలో కూడా ఒకటి ఉండేది. 12.అక్కడి అధికారుల క్రింద లక్ష్మీ చందు అనే గుమాస్తా ఉద్యోగాన్ని బాగా ఆజ్ఞాపాలన చేస్తూ విశ్వాస పూర్వకంగా ఉండేవాడు. 13. మొదట రైల్వేలో ఉండేవాడు. తరువాత వెంకటేశ ముద్రణాలయంలో పని చేసేవాడు. అప్పుడు అతనికి సాయితో సమాగమం ఎలా సంభవించిందో వినండి.14.'నా వారు దేశంలో ఉన్నా వేలమైళ్ల దూరంలో ఉన్నా వారిని నేను పిచ్చుకపిల్ల కాలికి దారం కట్టి లాగినట్లు లాక్కుని వస్తాను.'15.అని బాబా అనేక సార్లు చెప్పగా చాలామంది విన్నారు. అనుభవాన్ని కూడా పొందారు. బాబా యొక్క ఆలీలను చెప్తాను.16.బాబా ఇటువంటి ఆనేకమంది పిల్లలను దేశదేశాలనుండి శిరిడీకి తీసుకుని వచ్చారు. వారిలో లక్ష్మీచందు ఒకడు. ఇతడు బాబాయొక్క భావికుడైన బిడ్డడు.17.అనేక జన్మలలోగడించిన ప్రారబ్ధ కర్మ ఉదయించినప్పుడే సత్పురుషుల సమాగమం ప్రాప్తించి, మోహంవలన కలిగే అజ్ఞానం నశిస్తుంది.18.వివేకాగ్ని ప్రదీప్తమవుతుంది. భాగ్యోదయమై వైరాగ్యం కలుగుతుంది. సంచిత కర్మనశించి జీవితం సఫలమవుతుంది.19.సాయినాథులు కళ్లలో నిండిపోతే ఇక అక్కడ మరొకరికి చోటు లభించదు. కళ్లు మూసుకున్నా నలువైపులా సాయినాథులే ఉంటారు.20.లాలాజీని కలుసుకున్నప్పుడు అతడు చెప్పిన స్వానుభవ విషయాలను నేను హృదయ పేటికలో ప్రేమగా పదిల పరచుకున్నాను. వానిని చెప్పాలని ఉత్సాహంగా ఉంది. 21.లాలాజీకి బాబా పిలుపు– అదొక అలౌకికలీల.దానిని భావికులైన శ్రోతలు శ్రద్ధగా వినండి. 22.క్రీ.శ.1910

క్రిస్మస్ సెలవు రోజులలో లాలాజీకి శిరిడీ ప్రయాణ యోగం పట్టింది. 23. అప్పుడే అతనికి ప్రథమంగా బాబా యొక్క ప్రత్యక్ష దర్శనం. కాని ఈ యోగం పట్టే చిహ్నం ఒకటి రెండు నెలలు ముందుగానే సూచనగా జరిగింది. దానిని వినండి. 24. శాంతాక్రూజ్‌లో ఉండగా మనసులో ఏ ఆలోచనా లేనప్పుడు ధ్యానంలో అతడు అకస్మాత్తుగా స్వప్నంలో విశేషమైన దృష్టాంతాన్ని చూచాడు. 25. గడ్డం పెరిగి ఉన్న ఒక ముసలి సాధువు నిలబడి ఉండగా, ఆ మహాత్ముని చుట్టూ భక్తులు గుమిగూడి ఉండటం చూచి ప్రేమగా అతనికి అభివందనం చేశాడు. 26. తరువాత దత్తాత్రేయ మంజునాథ్ బిజూర్ అనే పేరుగల గృహస్థుని ఇంటికి లక్ష్మీచందు, దాసగణు సంకీర్తనకు వెళ్లాడు. 27. బాబా పటాన్ని ముందు ఉంచటం దాసగణుకు అలవాటు. ఆపటాన్ని చూడగనే లక్ష్మీచందుకు తాను స్వప్నంలో చూచిన మూర్తి గుర్తుకు వచ్చారు. 28. అదే గడ్డం, అదే వయస్సు, అవే అవయవాలు, అవే పాదాలు. తను కలలో చూచిన మహాత్ములు వీరే కావచ్చు అని అనిపించి లక్ష్మీచందు మనసు మూగ పోయింది. 29. అసలే అది దాసగణు కీర్తన. అందులో తుకారం కథ. పైగా తన కలలో సాధువు దర్శనం. లాలాజీ చాలా తల్లీను డయ్యాడు. 30. కోమల మనస్కుడైన లక్ష్మీచందు కళ్లనుండి ప్రేమాశ్రువులు దొర్లాయి. ఈ ప్రేమమయ మూర్తిని ఎప్పుడెప్పుడు చూద్దునా అని అతని ప్రాణం తహతహలాడింది. 31. మొదట స్వప్నంలో చూచిన మూర్తియే సరిగ్గా సంకీర్తనలో కనిపించగా అతని మనసులో అదితప్ప మరో ఆలోచన కలగటంలేదు. 32. తనతో శిరిడీవరకు తోడుగా వచ్చే స్నేహితుడెవరైనా దొరుకుతాడా? నేను ఎప్పుడు ప్రత్యక్షంగా ఈ సత్పురుషుని పాదాలపై శిరస్సునుంచగలను? 33. ఎప్పుడు ఈ సాధువు దర్శనం కలుగుతుంది? వారి ప్రేమలోని ఆనందాన్ని అనుభవిస్తానా అని లక్ష్మీచందు ఎప్పుడూ ఆతుర పడేవాడు. 34. దారి ఖర్చుకు డబ్బు సదుపాయం కావాలి. వారి దర్శనం త్వరగా కలగటానికి ఏం చేయాలి అని

మార్గాలు వెదకసాగాడు.35.భగవంతుడు ఎప్పుడూ భక్తికి ఆకలిగొని ఉంటాడు. ఎలాంటి చమత్కారం జరిగిందంటే, అదే రాత్రి ఎనిమిది గంటలప్పుడు అతని స్నేహితుడు తలుపు తట్టాడు.36.తలుపు తెలుచి చూసే సరికి అతని స్నేహితుడు శంకరరావు వచ్చి 'శిరిడీకి వస్తావా' అని అడిగాడు.37.నారాయణ మహారాజు దర్శనానికి ఖేడ్‌గాం వెళ్లాలని కోరిక కలిగింది. కాని ముందుగా శిరిడీ వెళ్లాలని తోచింది అని అన్నాడు.38.వెదకపోయిన తీగ కాలికి తగిలినట్లుగా లక్ష్మీచందు ఆనందానికి అంతు లేకుండా పోయింది.39.సోదరుని వద్దనుండి పదిహేను రూపాయలను అప్పు తీసుకున్నాడు. శంకరరావు కూడా అట్లేచేసి ఇద్దరూ ప్రయాణానికి సిద్ధమయ్యారు. 40.పక్కబట్టలూ అవీ సర్దుకుని బయల్దేరి వెళ్లి వేళకు టికట్లను తీసుకుని ఉభయులూ బండిని అందుకున్నారు. 41.శంకరరావు గొప్పగా భజన చేసేవ్యక్తి. బండిలో ఇద్దరూ భజన చేశారు. లక్ష్మీచందు దారిలో కలిసిన వారిని బాబా గురించి వాకబు చేశాడు.42.శిరిడీ నుండి వచ్చిన వారెవరైనా తటస్తపడితే లక్ష్మీచందు వారికి ఉత్సుకతతో నమస్కరించి సాయిబాబా యొక్క మహిమను మాకు నమ్మకం కలిగేలా చెప్పండి.43.సాయిబాబా అహమ్మద్ నగర్ ప్రాంతంలో గొప్ప సత్పురుషులుగా బాగా ప్రసిద్ధి చెందారని అంటారు.వారిపై మాకు విశ్వాసం కుదిరేలా వారి వద్ద కలిగిన అనుభవాలను చెప్పండి అని అడిగేవాడు.44.రైలు డబ్బాలో,శిరిడీ సమీపంలో ఉండే నలుగురు ముసల్మానులు ఉన్నారు. వారితో ముచ్చటించగా లక్ష్మీచందు మనసుకుతృప్తి కలిగింది.45.సాయిబాబా గురించి మీకు తెలిసినది మాకు చెప్పండి అని లక్ష్మీచందు వారిని ఎంతో ప్రీతిగా భక్తిగా ప్రశ్నించాడు.46.సాయిబాబా చాలా సంవత్సరాల నుండి శిరిడీలో ఉంటున్నారు.వారు గొప్ప సత్పురుషులు. మహాత్ములు అవలియా అని వారు జవాబు చెప్పారు. 47.ఆవిధంగా ముచ్చటించు కుంటూ ఆ ఇద్దరూ ఆనందంగా ప్రయాణాన్ని సాగించారు.కోపర్‌గాం చేరుకోగానే సేటుకు జ్ఞాపకం

వచ్చింది.48. సాయిబాబాకు జామపళ్లు ప్రీతి, కోపర్‌గాంలో జామపళ్లు పండుతాయి. గోదావరీ తీరాన వానిని అమ్ముతారు. వానిని బాబాకు సమర్పించాలని అనుకున్నాడు. 49.కాని గోదావరీ తీరానికి రాగానే అక్కడి దృశ్యాన్ని చూచి ఆనందిస్తూ సేటు జామపళ్ళను మరిచిపోయాడు. టాంగా బండి గోదావరి అవతలి తీరానికి పోయింది.50.అక్కడి నుండి శిరిడీ నాలుగు ఊళ్ళ అవతల ఉన్నది. టాంగా బాగా వేగంగా వెళ్ళి పోతూ ఉంది. లక్ష్మీచందుకు జామపళ్ళు గుర్తుకు వచ్చాయి.కాని అక్కడ అవి దొరకవు. 51.ఒక ముసలావిడ తలపైన బుట్టతో బండి వెనుక పరుగున రావడంచూచాడు. ఆమె కోసం బండిని ఆపించాడు. జామపళ్లు తమకోసమే వచ్చాయా అని తలచాడు.52. లక్ష్మీచందు ఆనందభరితుడై పళ్లను ఏరి ఏరి తీసుకున్నాడు. మిగిలిన పళ్లను తన తరపున బాబాకు అర్పించమని ఆ ముసలావిడ అన్నది.53.జామపళ్లు గుర్తుకు రావటం, మరల మరచిపోవటం, అకస్మాత్తుగా ఒక ముసలావిడ కలవటం, ఆమెకు సాయిపై గల భక్తి ఆ ఇద్దరికీ ఆశ్చర్యాన్ని కలగ చేసింది. 54.మొదట స్వప్నంలో వృద్ధుడు కనిపించటం, వారే సంకీర్తనలో దర్శన మివ్వటం ఎంత విచిత్రం? ఈ ముసలావిడ వారికి కావలసిన మనిషే అయి ఉంటుందేమోనని లాలాజీ తనలో అనుకున్నాడు.55.తరువాత బండి ముందుకు సాగి మాటల్లోనే శిరిడీ చేరింది. దూరంనుండి మసీదుపై జెండాలను చూచి ఆ ఉభయులూ భక్తిగా వందనం చేశారు.56.తరువాత పూజాసామగ్రిని తీసుకుని వెంటనే మసీదుకు వెళ్లి సాయి దర్శనం చేసుకుని ఆనందించారు. 57.బయటి వరండా ద్వారంనుండి సభామండపంలోకి ప్రవేశించి దూరం నుండి బాబాను చూచి వారి కంఠం గద్గదమయింది.58. చూడాలని కోరుకున్న మూర్తి యొక్క దర్శనం కాగానే లక్ష్మీచందు ఆకలి దప్పులను మరచి తల్లీనుడై ఆత్మానందాన్ని పొందాడు.59.పరిశుద్ధ జలంతో బాబా చరణ కమలాలను ప్రక్షాళనం చేశాడు. అర్ఘ్య పాద్యాది సకల పూజలు చేసి

శ్రీఫలాన్ని అరటి పళ్ళను అర్పించాడు.60.ధూపదీపాలు దక్షిణ తాంబూలాలను పుష్పహారాన్ని సమర్పించి మనసులోనే ప్రదక్షిణ చేసి, బాబా పాద సన్నిధిలో కూర్చున్నాడు.61.లక్ష్మీచందు ప్రేమమయుడైన భక్తుడు.అతనికి కూడా గురుకృపలోని ఆనందం లభించింది. సాయి చరణారవిందాలలో భ్రమరంలా రమించాడు.62.అప్పుడు బాబా 'సాలె రస్తేమె భజన్‌కర్తే, ఔర్ దూసరే ఆద్‌మీకో పూఛ్‌తే, క్యాదూస్‌రోంసే పూఛ్‌నా'సబ్‌కుఛ్ అపనే ఆంఖోసే దేఖ్‌నా,క్యో దూస్‌రే ఆద్మీకో పూఛ్‌నా, ఝూటా హై క్యాసచ్చా సహీనా కర్‌లో అపనా విచార్‌ఆప్.?'వెధవా! దారిలో భజన చేస్తావు. మరో మనిషిని అడుగుతావు.63.అంతా మన కళ్లతో చూడాలి గాని రెండో వ్యక్తిని అడగటమెందుకు? కల అబద్ధమా నిజమా నీవే ఆలోచించుకో!64.మార్వాడి దగ్గర అప్పు తీసుకుని దర్శనానికి రావలసిన అవసరమేముంది? ఇప్పుడు నీ కోరిక తీరిందా?'అని అన్న మాటలు విని లక్ష్మీచందు నివ్వెరపోయాడు.65. తాము దారిలో బాబాగూర్చి వాకబు చేయటం ఇక్కడ బాబాకు ఎలా తెలిసిపోయింది అని లక్ష్మీచందుకు పరమాశ్చర్యం కలిగింది.66.ఇంటిలో తనకు స్వప్నం రావటం, బండిలో భజన చేయటం వగైరా విషయాలు బాబాకు ఎలా తెలిశాయి? వీరు ఎంతటి సర్వజ్ఞులు.67.బాబాను త్వరలో దర్శనం చేసుకోవాలన్న ఉత్కంఠతో డబ్బు కొద్దిగా ఉండటంవలన అప్పు తీసుకుని తన కోరిక తీర్చుకున్న విషయం కూడా వీరికి తెలిసింది ,68.లక్ష్మీచందుకు పరమాశ్చర్యం కలిగింది. అట్లే బాబా యొక్క కౌశలం అంతు పట్టనిది. సాయి చరణకమలాలను ఆశ్రయించిన భక్తభ్రమరాలకు ఇతర భక్తసమూహానికంతా ఆశ్చర్యం కలిగింది.69.అప్పు చేసి పండుగ చేసు కోవటం, తీర్థ యాత్రాపర్యటనలు చేయటం వంటి అప్పుల వ్యవహారాలు బాబాకు ఇష్టంలేదు అని ఇక్కడ వారి ముఖ్యమైన బోధ.70.లక్ష్మీచందు భక్తులందరి వెంట సాలె వాడాకు వెళ్లాడు. మధ్యాహ్నం సంతోషంగా భోజనానికి కూర్చున్నాడు.

71.ఇంతలో ఒక భక్తుడు సాంజా అన్న పదార్థాన్ని బాబాప్రసాదమంటూ ఆకులలో కొంచెం వడ్డించాడు. దానిని తిని లాలా తృప్తి చెందాడు.72. మరునాడు భోజన సమయంలో లాలాజీకి సాంజా గుర్తుకు వచ్చింది.కాని అది రోజూ లభించదుగా.అతని కోరిక మనసులోనే ఉండిపోయింది.73.ఇక మూడవరోజున విశేషం. లాలాజీకి మిగిలిపోయిన కోరికను,సాయి మహారాజు ఉపాయంతో ఎలా తీర్చారో గమనించండి. 74.గంధాక్షతలు, పుష్పాలు, గంట, నీరాజనం,పంచారతి"వగైరా తీసుకుని జోగు మసీదుకు వచ్చి బాబాను అడిగాడు.75.'ఈరోజు నైవేద్యం ఏంతీసుకుని రమ్మంటారు'అని.సాయి మహారాజు 'నాకు పళ్ళెం నిండా సాంజా తీసుకునిరా, పూజ ఆరతి తరువాత చేయి' అని చెప్పారు.76.పూజాసామగ్రిని అక్కడే ఉంచి జోగు వెంటనే వెనుకకు వెళ్లి అందరికీ సరిపడా సాంజాను తీసుకుని వెంటనే వచ్చాడు.77.ఆ తరువాత మధ్యాహ్న హారతి అయింది. భక్తులు ముందుగా తెచ్చిన నైవేద్యపళ్లాలు పైకి రాసాగాయి. అప్పుడు బాబా భక్తులతో.78.'ఇవాళ్టి రోజు బాగా ఉంది. సాంజా ప్రసాదాన్ని తీసుకోవాలని ఉంది. త్వరగా తీసుకుని రండి.అందరం తృప్తిగా సేవిద్దామని' అన్నారు.79.భక్తులు వెళ్లి రెండు గిన్నెలనిండా సాంజాను తెచ్చారు. లక్ష్మీచందుకు బాగా ఆకలి కూడా వేస్తూ ఉంది. వెన్ను నొప్పికూడా ఉంది.80.పాత్రలోఆకలి,వెన్నులోపోటు. దానివలన లక్ష్మిచందు మనసు బాగా లేదు. అప్పుడు బాబా నోటినుండి వచ్చిన వచనాలను శ్రోతలు శ్రద్ధగా గమనించండి .81.'భూఖ్‌లగీహై అచ్చాహువా కమర్‌మే దర్ద్ చాహియే దవా, అబ్ సాంజాకి చలీహై హవా కరో సవార్ ఆరతి''ఆకలి అవుతోంది మంచిదే. వెన్ను నొప్పికి మందు కావాలి. ఇప్పుడు సాంజాతినే వేళ అయింది. ఇక ఆరతికి లే'. 82.లక్ష్మీచందు మనసులో ఉన్నదంతా బాబా మాటలలో స్పష్టంగా ప్రతిధ్వనించింది. సాయిమహారాజు అంతర్‌జ్ఞాని కదా! 83. ఆరతిపూర్తయాక భోజన సమయంలో

లక్ష్మీచందుకు సాంజా లభించించింది. అలా అతని కోరిక తీరి మనసుకు ఆనందం కలిగింది. 84. అప్పటినుండి అతనికి బాబాపై ప్రేమ బాగా నాటుకుంది. కొబ్బరికాయ అగరువత్తులు పూలమాలలతో బాబా పూజోపక్రమాన్ని సాగించాడు. అలా లక్ష్మీచందుకు క్షేమం కలిగింది. 85. సాయిపైని భక్తి ఎంతగా కుదిరింది అంటే ఎవరైనా శిరిడీకి వెళుతున్నట్లు తెలిస్తే వారితో అతడు పూలమాల, అగరువత్తులు, కర్పూరం పంపేవాడు. 86. శిరిడీకి వెళ్లే వారితో ఈ మూడు వస్తువులను దక్షిణతో సహా బాబాకు నియమంగా పంపేవాడు. 87. అతడు శిరిడీ వెళ్లినప్పుడు ఒక రోజు రాత్రి చావడి ఊరేగింపు వైభవాన్ని చూడటానికి వెళ్ళగా అప్పుడు బాబాకు బాగా దగ్గువచ్చి వారికి చాలా బాధ కలిగింది. 88. ఈ దగ్గు బాబాను ఇలా కష్టపెడుతుందేమిటి? ఎవరిదో దృష్టి దోషం తగలటం వలన ఇలా దగ్గుతున్నారు అని లక్ష్మీచందు మనసులో అనుకున్నాడు. 89. అది కేవలం మనసులో లేచిన ఆలోచనే. మరునాడు ఉదయం అతడు మసీదుకు వెళ్లగా బాబా విశేషంగా చెప్పిన దానిని వినండి. 90. మాధవరావుతో తమంతట తాము 'నిన్న నాకు బాగా దగ్గువచ్చింది. ఇది ఎవరిదైనా దృష్టి తగలటం వల్లనా?. 91. నాకు నిజంగానే ఎవరిదో దృష్టి తగిలినట్లుంది. ఇదేం దృష్టిదోషమో ఈ దగ్గు నా ప్రాణాన్ని విసిగిస్తోంది' అని చెప్పారు. 92. లక్ష్మీచందుకు ఆశ్చర్యం కలిగింది. అరె ఈ మాటలు నా మనసులోని ఆలోచనలు కదా! ఇవి వీరికి ఎలా తెలిశాయి? అంటే బాబా అందరి హృదయాలలో ఉన్నారు. 93. అని అనుకొని చేతులు జోడించి, 'మీ దర్శనంతో చాలా ఆనందం కలిగింది. దయచేసి మమ్ము ఎప్పుడూ ఇలాగే రక్షించండి మహారాజా! అని విన్నవించు కున్నాడు. 94. ఇక నాకు ఈ పాదాలు తప్ప వేరే దైవంలేదు. నా మనసు మీ ఆరాధనలో రమిస్తూ మీ చరణాల వద్ద ఎల్లప్పుడూ ఉండుగాక. 95. మీ పాదాల యందు నా మస్తకాన్నుంచి మీ సెలవు కోరుతున్నాను. ఇక మాకు ఆజ్ఞ నివ్వండి. అనాథులమైన మమ్ము ఇలాగే రక్షించండి 96. మీ

కృపాదృష్టి మాపై ఎల్లప్పుడూ ఉండుగాక. దాని వలన ప్రపంచంలోని కష్టాలు కలుగ కుండుగాక. మీ నామసంకీర్తనం ఘనంగా జరుగుతూ ఎల్లప్పుడూ సంతృప్తిగా సుఖాలు కలుగుగాక అని ప్రార్థించాడు.97. బాబా విభూతిని ఆశీర్వాదాన్ని తీసుకుని, ఆనందాన్ని పొంది, లక్ష్మీచందు స్నేహితునితో సహా మార్గంలో సాయి యొక్క గుణాలను కీర్తిస్తూ వెళ్లాడు.98. ఇటువంటి మరోపిచ్చుకకు బాబాను ప్రత్యక్షంగా దర్శించుకునే ఘడియ వచ్చినప్పుడు బాబా ఆమెను బంధించి శిరిడీ తీసుకుని వచ్చారు. ఆ విశేషాన్ని వినండి. 99. ఆ పిచ్చుక ప్రేమమయి అయిన ఒక స్త్రీ. ఆమె కథ అత్యంత ఆశ్చర్యకరమైనది. బర్హానుపురంలో వచ్చిన స్వప్నంలో ఆమె సాయి మహారాజును చూచింది.100. ఆమె బాబాను ఎన్నడూ ప్రత్యక్షంగా దర్శనం చేసుకోలేదు. అయినా ఆమెకు కలలో కనిపించి, ఆమె ఇంటి ముంగిట నిలచి బాబా ఆమెను పులగం భోజనాన్ని అడిగారు. 101. ఆమె వెంటనే మేలుకొని చూడగా అక్కడ ఎవరూలేరు. తన దృష్టాంతాన్ని ఆమె వెంటనే అందరికీ తెలియ చేసింది.102. ఆమె భర్త అదే పట్టణంలో తపాలా విభాగంలో అధికారి. తరువాత వారికి అకోలాకు బదిలీ అయాక వారు శిరిడీ వెళ్లటానికి ప్రయాణమయ్యారు.103. ఆ దంపతులు గొప్ప భక్తులు. సాయిబాబా దర్శనానికి తహతహలాడారు. సాయి యొక్క అలౌకికమైన మాయను తమకు కలిగిన దృష్టాంతాన్ని చూడాలని తలచారు. 104. ఒక మంచి రోజున ఆ ఉభయులూ శిరిడీకి బయలు దేరారు. దారిలో గోదావరీ తీరానికి వందనం చేసి, శిరిడీ చేరుకున్నారు.105. భక్తిగా బాబా దర్శనం చేసుకుని ప్రేమగా పూజించి నిత్యం వారి చరణసేవ చేస్తూ సుఖంగా సంతృప్తిగా ఉన్నారు.106. ఆ దంపతులు అలా శిరిడీలో రెండు మాసాలు ఆనందంగా ఉన్నారు. బాబా కూడా వారి భక్తి ప్రేమలకు వారి ఖిచిడి భోజనానికి సంతుష్టులయ్యారు.107. అసలు ఆ దంపతులు ఖిచిడీనైవేద్యాన్ని సమర్పించటానికి శిరిడీ వచ్చారు. కాని పదునాలుగు

రోజులు గడిచినా వారి ఖిచిడీ నివేదన జరగలేదు.108.వారి సంకల్పం నెరవేరటంలో ఆలస్యం ఆస్త్రీకి నచ్చలేదు. పదునైదవ రోజున మధ్యాహ్నం ఆమె ఖిచిడీతో వచ్చింది. 109.అప్పుడు తెరవేసి ఉంది. అప్పటికే బాబా తమ భక్తులతో సహా భోజనానికి కూర్చున్నారు అని ఆమెకు అర్థమైంది. 110. అలా భోజనం చేసే సమయంలో తెరలోపలికి ఎవరూ వెళ్లరు. కాని ఆ స్త్రీకి ఆతురత. నిశ్చింతగా క్రింద ఉండలేక పోయింది.111.అసలు అకోలా నుండి శిరిడీకి ప్రయాణమై వచ్చింది ఖిచిడీ నైవేద్యాన్ని అర్పించే కోరికతో కదా! మరి అది నెరవేరక పోతే ఊరికే ఎలా ఉండ గలదు.?112.ఎవరినీ లక్ష్యపెట్టకుండా ఆమె తన చేతులతో తెరను తొలగించి తనంతటతాను ఉత్సాహంతో వెళ్లి తన మొక్కును తీర్చుకుంది.113.అప్పుడు బాబా విచిత్రంగా ఆ ఖిచిడీ కోసమే ఎదురుచూస్తున్నట్లు ముందుగా దానినే అడిగి రెండు చేతులతో పళ్లాన్ని పట్టుకున్నారు. 114.ఖిచిడీని చూచి సంతోషంగా ముద్దమీద ముద్ద తీసుకుని నోట్లో పెట్టుకున్నారు.అందరికీ ఆశ్చర్యం కలిగింది. 115.బాబా ఆతురతను చూచి అందరికీ విస్మయం కలిగింది. ఖిచిడీ కథను విని సాయిబాబా యొక్కఅలౌకిక శక్తి అర్థమైంది. 116.ఇప్పుడు, ఇక తరువాతి కథను వింటే మనసులో ప్రేమోత్పన్నమవుతుంది. ఒక గుజరాతి బ్రాహ్మణుడు, బాబా సేవ చేయటానికి అనుకోకుండా శిరిడీ వచ్చాడు.117.మొదట అతడు రావుబహద్దురు సాఠే వద్ద పని చేశాడు.నిజాయితీగా సేవ చేయటంవలన అతనికి బాబా చరణాల వద్ద ఆశ్రయం లభించింది.118.ఆ కథ కూడా చాలా రసవత్తరమైనది. భక్తి ప్రేమలను ఆశించే వారి కోరికలను శ్రీహరి ఎలా తీర్చుతాడో వినండి 119.అతని పేరు మేఘా. సాయితో ఏదో ఋణానుబంధం ఉండటంవలన అతడు శిరిడీలో స్థానాన్ని పొందాడు ఆకథను వినండి. 120.సాఠె ఖేడాజిల్లాకు ప్రాంతీయాధికారిగా ఉన్నప్పుడు, అక్కడ ఈ మేఘా, అతనికి అనుకోకుండా కలిశాడు. సాఠె అతనిని

శివాలయంలో నిత్యపూజా సేవలో నియమించాడు.121.తరువాత సాఠె శిరిడీ వచ్చాడు.అతనికి భాగ్యోదయమై శిరిడీలో సాయి మహారాజు దర్శనమై వారి చరణాలలో మనసు లగ్నమైంది. 122.శిరిడీకి వచ్చే యాత్రీకుల గుంపును గమనించాడు. వారు బస చేయటానికి భక్తుల సౌకర్యార్థం, తనకు అక్కడ ఒక భవనం ఉండాలని తలచాడు.123.తరువాత గ్రామస్థులను కలుసుకున్నాడు. మొట్టమొదట బాబా ప్రకటమైన స్థలాన్ని సంపాదించి అక్కడ భవనం నిర్మించాలని నిర్ణయించుకున్నాడు.124.ఈ పవిత్రస్థల మహిమ వెనుక చతుర్థాధ్యాయంలో పూర్తిగా వర్ణించ బడింది. మరల ఏకరువు పెట్టటం అనవసరం. ఇక తరువాతి విషయ వర్ణన. 125.మేఘా యొక్క గొప్ప పుణ్య సంచయం వలన అతనికి రావు బహద్దుర్ సాఠె లభించాడు. సాఠె ప్రయత్నం వలననే మేఘా పరమార్థంలో పడ్డాడు.126.మేఘా పరిస్థితుల ప్రభావం వలన కర్మ భ్రష్టుడవగా,సాఠె అతనికి గాయత్రిని ఉపదేశించి అతనిని సన్మార్గంలో ప్రవేశ పెట్టాడు.127.మేఘా సాఠె సేవలో ఉండగా వారిలో పరస్పరం ఆదరణ పెరిగింది. మేఘా సాఠెను గురువులా భావించేవాడు. అతనిపై అభిమానం కూడా కలిగింది.128. ఒకసారి ప్రసంగవశాత్తు తమ గురువు యొక్క మహాత్మ్యాన్ని వర్ణిస్తుండగా సాఠె మనసులో ప్రేమ ఉప్పొంగింది.సాఠె మేఘాతో సాదరంగా. 129'బాబాకు గంగోదక స్నానం చేయించాలని నా కోరిక, ముఖ్యంగా అందుకోసమే నిన్ను శిరిడీకి పంపుతున్నాను. 130. అంతేకాక నీ అనన్య సేవను చూచి నీవు సద్గురువును ఆశ్రయించాలని వారి పాదాలయందు నీకు భక్తి కలగాలని నా మనసులోని కోరిక. 131.నీ శరీరం సార్థక మవుతుంది. నీ జన్మ పరమ శుభప్రదమవుతుంది.వెళ్లి కాయావాచా మనసులతో సద్గురువు పాదాలను ఆశ్రయించు' అని చెప్పాడు.132.మేఘా ఆ గురువు ఏజాతి వ్యక్తి అని ప్రశ్నించాడు. 'వాస్తవం నాకు కూడా తెలియదు. మసీదులో కూర్చుంటారు. కనుక ముసల్మాను అని కొందరంటారు' అని సాఠె

చెప్పాడు. 133.మహమ్మదీయుడన్న శబ్దం చెవులలో పడగానే మేఘా మనసులో సంకోచం కలిగింది. మహమ్మదీయుని కంటే నీచుడు ఉండడు. అటువంటి వాడు గురువేమిటి? 134.వెళ్లనంటె సాకె బాధపడ్తాడు.పోనీ సరేనని ఒప్పుకుంటే దుర్గతిపాలు కావాలి. ఏం చేయాలో తోచక మేఘా చింతించసాగాడు.135.ముందు నుయ్యి వెనుక గొయ్యి వంటి పరిస్థితిలో మనసు ఊగిసలాడింది.అయినా సాకె చాలా బలవంత పెట్టగా మేఘా బాబా దర్శనానికి వెళ్లటానికి నిశ్చయించుకున్నాడు. 136.తరువాత మేఘా శిరిడీ చేరి మసీదు ప్రాంగణంలోకి వెళ్లి మెట్లు ఎక్కుతుండగా బాబా లీలను ఆరంభించారు. 137.ఉగ్రస్వరూపాన్ని ధరించి చేత్తో రాయి పుచ్చుకుని మెట్లపై అడుగుపెట్టావంటే ఖబడ్దార్! - ఇక్కడ మహమ్మదీయుడు ఉన్నాడు. 138.నీవు గొప్ప కులానికి చెందిన బ్రాహ్మణుడవు.నేను నీచులలో నీచుణ్ణైన యవనుణ్ణి. నీవు అపవిత్రుడవైపోతావు. వెనక్కు తిరిగి వెళ్లిపో' అని అన్నారు.139.అపర ప్రళయరుద్రుని స్వరూపం వంటి బాబా యొక్క ఆ రౌద్రరూపం చూచేవాళ్ళకు వణుకు పుట్టించగా మేఘా వణికి పోయాడు.140.కాని ఆకోపం కేవలం పైపైనే. బాబా అంతరంగంలో దయ బాగా ప్రవహిస్తూంటుంది. నా మనసులోని ఆలోచనలను ఎలా తెలుసుకున్నారు అని మేఘా ఆశ్చర్యంతో చకితుడయ్యాడు.141.దూరాన ఉన్న ఖేడాజిల్లా ఎక్కడ? ఇంత దూరాన ఉన్న అహమ్మదునగరు ఎక్కడ? సంశయాలతో నిండిన నా మనసును బయట పెట్టటానికి బాబా కోపం అని అనుకున్నాడు. 142.బాబా కొట్టాలని ముందుకు వస్తుంటే ధైర్యం సడలిపోయిన మేఘా ముందుకు వెళ్లే సాహసం చేయలేక ఒక్కో అడుగు వెనక్కువేశాడు.143.ఆ తరువాత మేఘా కొంతకాలం శిరిడీలో ఉన్నాడు. బాబా యొక్క స్వభావాన్ని గమనించి శక్త్యానుసారం సేవ చేస్తూండేవాడు. కాని అతనికి బాబా పై దృఢ విశ్వాసం కుదరలేదు. 144.కనుక తరువాత ఇంటికి వెళ్ళిపోయాడు. అక్కడ జ్వరంతో మంచాన పడ్డాడు. బాబా పై నిది

ధ్యానంతో అభిమానం పెరగగా మరల శిరిడీకి వచ్చాడు. 145. మరల తిరిగి వచ్చిన మేఘా అక్కడే సంతోషంగా ఉన్నాడు. సాయిబాబా చరణాల యందు భక్తి భావం పెంపొంది సాయికి అనన్యభక్తుడయ్యాడు. అతనికి సాయియే ఏకైక దైవం.146.మేఘా మొదటి నుండి శివభక్తుడు.సాయి పాదాలయందు అనురక్తుడై, సాయినాథుని శంకరుని వలెనే భావించేవాడు. సాయియే అతని ఉమానాథుడు. 147. అతడు అహర్నిశలూ 'సాయీ శంకర్' అని నామాన్ని ఘోషించేవాడు. దానితో అతని మనసు కల్మష రహితమైంది. అతని బుద్ధి తదాకారమైంది.148.అతడు సాయికి అనన్యభక్తుడై సాయిని ప్రత్యక్ష శంకరుని వలె భావించేవాడు. 'శంకర! శంకర!' అని నోటితో గట్టిగా పలికేవాడు. ఇతర దేవతలను ఒప్పుకునేవాడు కాదు. 149.సాయియే అతని దేవతార్చన. సాయియే అతని గిరిజారమణుడు. ఇదే దృఢ విశ్వాసంతో మేఘా ఎల్లప్పుడూ ప్రసన్నంగా ఉండే వాడు.150.శంకరునికి బిల్వదళాలు ప్రీతి. కాని శిరిడీలో బిల్వవృక్షం లేదు. దానికోసం మేఘా రెండు మూడుమైళ్ల దూరం వెళ్లి తన కోరికను నెరవేర్చుకునేవాడు.151.చక్కగా పూజ చేయాలన్న తన మనసులోని కోరికను తీర్చుకొని సంతృప్తిచెందటానికి, బిల్వపత్రి కోసం ఒకటిన్నర కోసుల దూరమేమిటి పర్వతాలను కూడా దాటగలిగే వాడు.152. ఎంతో దూరం నుండి బిల్వపత్రిని తెచ్చి పూజాసామగ్రిలో ఉంచి, గ్రామదేవతలను వరుసగా విధిపూర్వకంగా పూజించేవాడు.153.అదంతా ముగిసాకవెంటనే మసీదుకు వెళ్లి ప్రేమపూర్వకంగా బాబా ఆసనానికి నమస్కరించి వారి పాద సంవాహన వగైరా చేసి ముందు వారి పాద తీర్థాన్ని సేవించేవాడు. 154.మేఘా యొక్క మరొక కథను వింటే ఆనందం కలుగుతుంది. గ్రామ దేవతల యందు బాబాకు గల గౌరవం, మరియు వారి సర్వ వ్యాపకత్వం తెలుస్తాయి. 155.మేఘు శిరిడీలో ఉన్నంతవరకు నిత్యం మధ్యాహ్నం ఆరతిని చేసేవాడు.కాని ముందుగా సకలగ్రామదేవతలను పూజించి మసీదుకు వెళ్లేవాడు.156.ఇది

అతని దినచర్య. ఒకరోజు అతని నిత్య పద్ధతి తప్పింది. శ్రమపడి ప్రయత్నించినా ఖండోబాదేవుని పూజ జరగలేదు.157.పూజ చేయటానికి ప్రయత్నం చేశాడు కాని గుడిద్వారాలు తెరుచుకోలేదు. అందువల్ల ఆ పూజను చేయకుండానే బాబా ఆరతిని చేయటానికి వచ్చాడు. 158.అప్పుడు బాబా అతనితో నీ పూజలో విఘ్నం జరిగింది. దేవతలందరి పూజ జరిగినా ఒకరి పూజ మాత్రం జరగలేదు.159.వెళ్లు. ముందు దానిని చేసి తరువాత ఇక్కడకురా అని అనగా, తలుపులు మూసి ఉన్నాయి, వానిని తెరవాలనుకున్నా తెరుచుకోలేదు, కనుక ఆ పూజను వదిలి పెట్టవలసి వచ్చిందని మేఘా చెప్పాడు.160.'ఇప్పుడు ద్వారాలు తెరచే ఉన్నాయి వెళ్లిచూడు' అని బాబా చెప్పారు. మేఘా వెంటనే గబగబా వెళ్లాడు. బాబా మాటలు అతనికి అనుభవమయ్యాయి.161.ఖండేరాయని పూజ చేశాక మేఘా తపన పోయింది. తరువాత బాబా మేఘాను పూజను చేయనిచ్చారు.162.పిమ్మట గంధ పుష్పాది అష్టోపచార పూజను అత్యంత ఆదరంగా చేసి మేఘా యథాశక్తి పూలమాలను ఫలాలను దక్షిణను అర్పించాడు.163.ఒకసారి మకర సంక్రాంతి రోజున బాబాకు చందనంతో నలుగు పెట్టి గోదావరి నీటితో అభ్యంగన స్నానం చేయించాలని మేఘాకు కోరిక కలిగింది.164.బాబా అనుమతి కోసం వారిని బలవంత పెట్టగా వారు 'సరే నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో పో' ఆన్నారు. వెంటనే మేఘా కుండను తీసుకుని నీటి కోసం బయలుదేరాడు.165. సూర్యోదయం కాకముందే గొడుగుగాని చెప్పులు కాని లేకుండా ఖాళీకుండను చేతబట్టుకుని నీరు తేవటానికి గోదావరికివెళ్లాడు.166.రానుపోను ఎనిమిది కోసుల దూరాన్ని నడవాలి. అది చాలా ప్రయాసతో కూడినపని అని అతనికి కలలో కూడా అనిపించనే లేదు.167.మేఘాకు ఆ చింత లేదు. బాబా అనుమతి లభించగానే బయలు దేరాడు. దృఢమైన నిశ్చయముంటే కార్యంలో ఉత్సాహం ఉండనే ఉంటుంది. 168.సాయి బాబాకు గంగోదకంతో స్నానం చేయించాలని మనసులో

సంకల్పించుకున్నాక ఇక ఎక్కడి కష్టం? ఎక్కడి అలసట? దృఢమైన శ్రద్ధయే ప్రమాణం.169. నీరును తెచ్చి రాగి గంగాళంలో పోశాడు. ఇక స్నానానికి లెమ్మని బాబాను బలవంతపెట్టి సాగాడు. కాని బాబా ఒప్పుకోలేదు.170. మధ్యాహ్న ఆరతి అయిపోయింది. భక్త బృందం ఇళ్లకు వెళ్ళిపోయారు. మధ్యాహ్నమై పోయింది. స్నానానికి అంతా సిద్ధంగా ఉంది అని మేఘా అన్నాడు.171. మేఘా చాలా బలవంత పెట్టగా లీలా విగ్రహుడైన సాయి, మేఘా చేతిని తమ చేత్తో పట్టుకుని నచ్చచెప్పసాగారు.172. 'నాకు గంగా స్నానం వద్దురా ! ఫకీరునైన నాకు గంగనీరు ఎందుకు? నువ్వెంత తెలివి తక్కువ వాడివిరా' అని అన్నారు. 173. కానీ మేఘా అవేం వినిపించుకోలేదు. బాబాను శంకరుని వలె భావించాడు. గంగా స్నానంతో శంకరుడు ఆనందిస్తాడు. అదొక్కటే అతనికి తెలుసు.174. 'ఇవాళ మకర సంక్రాంతి పండుగ. గంగోదకంతో అభిషేకంచేస్తే శంకరుడు సుప్రసన్నుడవుతాడు అని చెప్పాడు.175. అతని ప్రేమను, శుద్ధాంతఃకరణాన్ని, దృఢ నిశ్చయాన్ని గని బాబా సరే నీ కోరిక తీరుస్తానని అన్నారు.176. తరువాత లేచి స్నానానికై వేసిన పీటపై కూర్చున్నారు. తలను మేఘా ముందుకు వంచి 'తలపై కొంచెం నీరు పోయి,177. శరీరాని కంతటికీ శిరసు ప్రధానం. శిరసుపై కాసిని నీరు చల్లితే అది పూర్తిగా స్నానం చేసినట్లే. ఇదైనా ఒప్పుకోరా' అని అన్నారు.178. సరే అని మేఘా చెంబు తీసుకుని బాబా శిరసుపై పోస్తూ ప్రేమ ఉప్పొంగగా 'హర గంగే' అంటూ మొత్తం నీరును బాబా శరీరంపై గుమ్మరించాడు.179. నా శంకరునికి స్నానం చేయించానని మేఘా చాలా ఆనందించి బిందెను క్రిందపెట్టి చూడగా ఆశ్చర్యం. 180. బాబా శరీర మంతా నీరు గుమ్మరించినా, బాబా శిరసు మాత్రమే తడిసింది. ఇతర అవయవాలు పొడిగానే ఉన్నాయి. వారి బట్టలలో ఎక్కడా నీటి చుక్కే లేదు.181. మేఘా అభిమానమంతా కరిగిపోయింది. దగ్గర ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. ఈ విధంగా సాయిబాబా

భక్తుల మురిపాలను పూర్తిగా తీరుస్తారు.182.'నీ మనసులో స్నానం చేయించాలని తలచావు. సరే నీ ఇష్ట ప్రకారమే చేయి. కాని అందులో కూడా నాలో ఉన్న గుర్తు నీకు సహజంగా తెలుస్తుంది.'183.ఇదే సాయి భక్తిలోని మర్మం. భాగ్యవశాత్తు వారిపట్ల భక్తి కలిగిన వారికి ఏదీ దుర్గమం కాదు. అంతా సుగమమే.184. కూర్చున్నా లేచినా మాట్లాడుతున్నా, ఉదయం మధ్యాహ్నం బయట తిరుగుతున్నా, భక్తులు శ్రద్ధాస్థైర్యాలను కలిగి ఉంటే తమ మనోభీష్ఠాలను పొందుతారు.185.వ్యవహారాలతో ఇటువంటి ప్రత్యక్ష దృష్టాంతాన్ని, కలిగించి క్రమక్రమంగా పరమార్థంలో ఆసక్తిని కలిగించి భక్తులకు జ్ఞానబోధను చేస్తారు. 186.ఇటువంటిదే మేఘా యొక్క మరొక కథ. వింటే భక్తులపై సాయికి గల ప్రేమను గని శ్రోతలకు ఆనందం కలుగుతుంది.187.నానాసాహెబు ఇచ్చిన బాబా యొక్క పెద్ద క్రొత్త పటాన్ని వాడాలో పెట్టి మేఘా భక్తిగా పూజించేవాడు.188.మసీదులో ప్రత్యక్షమూర్తిని, వాడాలో వారి ప్రతికృతియైన పటాన్ని రెండు స్థలాలలోనూ పూజను ఆరతిని పగలూ రాత్రి చేసేవాడు.189.ఇలా సాయి సేవలో పన్నెండు నెలలు గడవగా ఒక తెల్లవారు ఝామున మేఘా మెలుకువగా ఉన్నప్పుడు అతనికి ఒక దృష్టాంతం కలిగింది.190.మేఘా ప్రక్కమీద కళ్లుమూసుకుని మెలుకువతో ఉండగా బాబా రూపాన్ని స్పష్టంగా చూచాడు.191.మేఘా మేలుకుని ఉండటం చూచిన బాబా అతని ప్రక్కపై అక్షతలను చల్లి 'మేఘా త్రిశూలాన్ని గీయరా!' అని చెప్పి అక్కడే మాయమయ్యారు.192.బాబా మాటలను విన్న మేఘా ఉత్సాహంగా కళ్లు తెఱచి చూచేసరికి బాబా అంతర్ధానమయ్యారు.అతడు చాలా ఆశ్చర్యపోయాడు. 193.అతడు నలుదిక్కులా చూడగా ప్రక్కపైన అక్షతలు ఇక్కడా అక్కడా పడి ఉన్నాయి. మరి ఇంటి తలుపులు మునపటి వలె మూసే ఉన్నాయి. అతనికి ఏమీ అర్థం కాలేదు.194.వెంటనే మసీదుకు వెళ్లి బాబా దర్శనం చేసుకుని మేఘా త్రిశూల దృష్టాంతాన్ని

చెప్పి త్రిశూలాన్ని గీయటానికి వారి అనుమతిని కోరాడు.195. మేఘా అంతా చెప్పాక బాబా 'ఏం దృష్టాంతం? త్రిశూలాన్ని గీయమని చెప్పిన నా మాటలను వినలేదా?196.ఒట్టి దృష్టాంతమని నా మాటలు నిజమా కాదా అని పరీక్షిస్తున్నావా? నా మాటలు అర్థభరితము, వాస్తవము.అక్షరమైనా వ్యర్థం కాదు.'197. అని అన్నారు. మీరు నన్ను మేలుకొలిపినట్లుగా నాకనిపించింది.కాని ఒక్క తలుపైనా తెఱచి లేదు. అందువల్ల నాకు అలా అనిపించింది అని మేఘా అన్నాడు.198.అతనితో బాబా అన్నది వినండి.'నా ప్రవేశానికి ద్వారం అవసరం లేదు.నాకు ఆకారం లేదు.రూపం లేదు.నేనెల్లప్పుడూ ఎల్లెడలా ఉంటాను.199.నాపై భారం వేసి, నన్ను నిరంతరం ధ్యానిస్తూ నాలో లీనమైనవారి శరీర వ్యాపారాలన్నీ సూత్రధారినై నేను నడిపిస్తాను.' 200. అని చెప్పారు. తరువాతి విశేషం. త్రిశూలం యొక్క ప్రయోజనాన్ని శ్రోతలు శ్రద్ధగా వింటే దానికి సంబంధించిన విషయం స్పష్టమవుతుంది.201.మేఘా వెళ్లి త్రిశూలాన్ని గీయటం మొదలుపెట్టి వాడాలోని బాబాపటం వద్ద గోడపై ఎఱ్ఱటి రంగుతో గీశాడు.202.రెండవరోజే మసీదుకు పూనే నుండి ఒక భక్తుడు రామదాసు వచ్చి భక్తిగా బాబాకు నమస్కరించి వారికి శివలింగాన్ని అర్పించాడు.203.ఇంతలో మేఘా కూడా అక్కడికి వచ్చి బాబాకు సాష్టాంగ నమస్కారం చేశాడు. బాబా అతనితో 'ఇదిగో శంకరుడు వచ్చాడు.ఇక మీద ఇతనిని నీవు జాగ్రత్తగా చూచుకో.' 204.అని చెప్పారు. త్రిశూలం గీయమని చెప్పిన దృష్టాంతం వెనుకే అకస్మాత్తుగా శివలింగం లభించగా మేఘా స్తబ్దుడయ్యాడు. లింగాన్ని తదేకంగా చూస్తూ ప్రేమతో గద్గదు డయ్యాడు.205.ఈ లింగం గూర్చి కాకాసాహేబు దీక్షితుకు కలిగిన మరో అపూర్వ అనుభవాన్ని శ్రోతలు వింటే సాయి చరణాలయందు విశ్వాసం కుదురుతుంది. 206.మేఘా ఆలింగాన్ని తీసుకుని మసీదునుండి

వెళ్ళాడు. వాడాలో దీక్షితుస్నానం చేసి నామస్మరణలో నిమగ్నుడయ్యాడు. 207.శుభ్రమైన వస్త్రంతో శరీరాన్ని తుడుచుకుని రాతి బండ పై నిలుచుని తువాలును తలపై వేసుకుని సాయిని స్మరించుకుంటున్నాడు.208. నిత్యనియమానుసారం శిరోభాగాన్ని కప్పుకుని నామస్మరణ చేస్తుండగా అతనికి శివలింగ దర్శనమయింది.209.నామస్మరణలో ఉండగా ఇవాళ శివలింగ దర్శనం ఎందుకు అయింది? అని దీక్షితు ఆశ్చర్య పడుతుండగా అతని ఎదుట ప్రసన్నవదనంతో మేఘా కనిపించాడు.210. 'కాకా! బాబా శివలింగాన్ని ఇచ్చారు చూడండి' అంటూ మేఘా చూపించాడు. ఆ విశేషమైన లింగాన్ని చూచి కాకాకు ఆశ్చర్యానందాలు కలిగాయి. 211. ఇంతకు ముందే తను ధ్యానంలో చూచిన రూపురేఖలు ఆకారలక్షణాలు గల ఆలింగాన్ని తక్షణం చూచి దీక్షితు సంతోషించాడు.212.అటు తరువాత,మేఘా త్రిశూలాన్ని గీచిన పిదప సాయి బాబా పటం వద్ద శివలింగస్థాపనను బాబా చేయించారు.213.మేఘాకు శంకరుని పూజ ప్రీతి కనుక సాయిబాబా అతనికి శివలింగాన్ని ప్రదానం చేసి అతని భక్తిని అలా దృఢపరచారు. అది వారి లీలా విశేషం.214.ఇటువంటి కథ ఒకటా? అంతులేనన్ని చెప్పవచ్చు. కాని గ్రంథం విస్తారమై పోతుంది. శ్రోతలు క్షమించాలి.215. మీరు శ్రవణోత్సుకతతో ఉన్నారు. కనుక తరువాతి అధ్యాయంలో ఇంతకంటె అలౌకికమైనది సాయి యొక్క కౌశలాన్ని తెలిపే మరోకథ. 216.హేమాడ్ సాయిశరణు జొచ్చి అందరి దురితాలను నివారించి భవభయాన్ని హరింపచేసే సాయి చరిత్రను వినిపిస్తాడు. 217.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో దృష్టాంత కథనమును ఇరువది ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం. శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత - 29 వ అధ్యాయం.

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఈ అధ్యాయంలో కల్పనాతీతమైన బాబా మహిమను వినిపిస్తానని గతాధ్యాయంలో చెప్పాను. కథానుసంధానం ఒక్కటే .1.క్రీ.శ 1916 వ సం॥ లో బాబా యొక్క అద్భుత లీలలను విని వారి దర్శనార్థం ఒక భజన మండలి శిరిడీకి వచ్చింది. 2.వారు యాత్రికులు. మద్రాసు ప్రాంతంలో బాబా కీర్తిని విని కాశీయాత్రకు వెడుతూ మార్గంలో శిరిడీలో దిగారు.3.సాయిబాబా గొప్ప సత్పురుషులు ధీరులు ఉదారులు కృపామూర్తి. యాత్రికులకు డబ్బు బాగా పంచి పెట్టుతారు. 4.దమ్మిడీలకు దుగ్గానికి లెక్కే లేదు. పావులాలను అర్థరూపాయలను వర్షంలా కురిపిస్తారు. ఒకరికి పది ఒకరికి ఇరవై మరొకరికి యాభై అలా ఇస్తుంటారు.5.పండుగ పబ్బాల లోనో లేక విశేష వర్యదినాలలోనో కాదు, ప్రతిరోజూ అదే విధంగా సంతోషంగా పంచిపెడతారు.6.వారి వద్దకు వినోదాలు చేసేవారు పాముల వాళ్లు వచ్చి నాట్యం చేస్తారు.గాయకులు గానం చేస్తారు.భట్రాజులు స్తుతి చేస్తారు.తమాషాలు గారడీ చేసేవారు సలాములు చేస్తారు.హరి భక్తులు వచ్చి భజన చేస్తారు.7.సాయిమహారాజు అలా ఉదారంగా దానధర్మాలు విరివిగా చేస్తారని,వారి కీర్తిని కర్ణా కర్ణిగా విని మద్రాసు వారికి సాయి దర్శనాభిలాష కలిగింది. 8.బాబా మనసుకు తోస్తే బాటసారులకు ప్రయాణీకులకు కూడా డబ్బు పంచేవారు. కరుణామయులైన సాయినాథులు దీనులను దుర్బలులను చక్కగా పరామర్శించేవారు.9.భజన బృందంలో ఒక పురుషుడు ముగ్గురు స్త్రీలు,

అంతా కలిసి నలుగురు. అంతే పురుషుడు అతని పత్ని మరదలు అతనికుమార్తె. అందఱూ సాయిబాబా దర్శనాభిలాష కలవారు.10. బాబాను సందర్శించి సంతుష్టులయ్యారు. రోజూ నియమంగా బాబా వద్ద భక్తిగా భజన చేసేవారు. 11.వారు రామదాసి సంప్రదాయం వారు. అత్యంత ఉత్సాహంగాను ఉల్లాసంగాను భజన చేసేవారు. బాబా తమకు తోచినప్పుడు వారికి ఒకరూపాయో అర్ధరూపాయో ఇచ్చేవారు.12.ఒక్కోసారి బర్ఫి మిఠాయిలనిచ్చేవారు. మరోసారి రిక్తహస్తాలతోనే పంపేవారు. వారి ఈ పద్ధతి ఇలాగే ఉండేది.కాని ఇదే పద్ధతి నిశ్చయంగా ఉండేది కాదు. 13.వారు డబ్బును పంచేవారు. ఇది వాస్తవమే. ఇందులో ఏం అసత్యం లేదు. కాని అందరికీ ఇచ్చేవారు కాదు.వారి మనసులో ఏముండేదో ఎవరికీ తెలిసేది కాదు.14.ఫకీరులు, బిచ్చగాళ్లు బాబాద్వారం వద్దకు ఎప్పుడూ వస్తుండే వారు. బాబా గొప్ప కరుణామయులే అయినా అందరికీ ధర్మం చేసేవారు కాదు. 15.ఆ భాగ్యాన్ని పొందే ఘడియ వచ్చిన వారికే ఆ సత్పురుషుని హస్త స్పర్శను పొందిన ద్రవ్యం లభించేది. 16. ఈ విషయంలో శ్రోతలను సంతుష్టిపరచే ఒక వృత్తాంతాన్ని మనవిచేసి ముందుకు సాగుతాను.17.ఉదయం ఫలహారాన్ని సేవించిన తరువాత బాబా మసీదులో ధుని సన్నిధిలో స్తంభం వద్ద కూర్చుని ఉండగా అమని అక్కడికి వచ్చేది.18. ఆ పిల్లకు మూడేళ్లు.బట్టలు లేకుండా సమయానికి సరిగ్గా చేతిలో రేకుడబ్బా పుచ్చుకుని తల్లి జమిలి వెంట గబగబా వచ్చేది.19.అమని బాబా ఒడిలో కూర్చుని వారి చేతికి డబ్బా నిచ్చి బాబా చేతిని పట్టుకుని 'బాబా!రూపాయి రూపాయి' అనేది.20.బాబాకు పిల్లలంటే చాలా ప్రీతి.ఆ పిల్ల కూడా ముద్దుగా అందంగా ఉండేది. బాబా ఆ పిల్లను ముద్దు పెట్టుకుని చేత్తో నిమురుతూ పొట్టకు అదిమి పట్టుకునేవారు.21.బాబా అలా పొట్టకు వత్తి పట్టుకున్నా అమని మనసు మాత్రం రూపాయి మీదే. 'బాబా! నాకు రూపాయి నివ్వు,ఇవ్వూ, అనేది. ఆమె దృష్టి అంతా బాబా జేబు మీదే.22.అమని

పసిపిల్ల స్వభావం కలది. కాని పెద్దవారికి గొప్పవారికి కూడా డబ్బు ఆశే. అంతా స్వార్థం కోసమే పరుగులు తీస్తారు. పరమార్థం కావాలని పరితపించే వారు ఒకరిద్దరే.23.ఆ పిల్ల బాబా ఒడిలో కూర్చునేది. ఆమె తల్లి బాబాకు దూరంగా కట్టడా బయట ఉండి, బాబా ఇచ్చేవరకు కదలకుండా అక్కడే ఉండు అని ఆ పిల్లకు సైగచేసేది.24.'నేను మీబాబుకు ఏమైనా ఋణపడ్డానా? వచ్చి ఊరికే నావెంట పడతావు. పనికి మాలినదానా! ఊరికే ధర్మానికి తినే రకం' అని బాబా కోప్పడేవారు.25.కాని ఆ కోపం పైపైనే. వారి లోపల ప్రేమ తరంగాలు ఉప్పొంగుతుంటాయి. జేబులో చేయి వేసి రూపాయిని బయటకు తీసేవారు.26.ఆ డబ్బాలో వేసి గట్టిగా మూసే సరికి తక్షణమే చప్పుడు అయ్యేది. డబ్బా చేతిలో పడగానే ఆ పిల్ల వెంటనే ఇంటిదారి పట్టేది.27.ఇలా ఉదయం ఫలహార సమయాన జరిగేది. అట్లే బాబా లెండీకి బయలుదేరేటప్పుడు కూడా బాబా అమనికి అలాగే కోప్పడుతూ రూపాయి నిచ్చేవారు. 28.ఇలా ప్రతిరోజు అమనికి రెండు, జమలీకి ఆరు, దాదా కేల్కరుకు అయిదు, భాగ్యాకు సుందరికి చెరోరెండు. 29. తాత్యాబాకు పదినుండి పదిహేను, ఫకీరు బాబాకు పదిహేను నుండి యాభైవరకు, పేదవారికి ఎనిమిది నిత్యం నియమంగా పంచేవారు. 30.ఇటువంటి వారి దాన శీలత కీర్తిని విని మద్రాసు బృందం వారు స్వార్థంతో డబ్బు కొరకు భజన చేయటం మొదలు పెట్టారు.31.బయటకు వారి భజన బాగానే ఉన్నా వారి మనసులలో అత్యంత ద్రవ్యలోభం. బాబా డబ్బు ఇస్తారన్న ఆశతో ఆ కుటుంబం వారు శిరిడీలో ఉన్నారు.32.వారిలో ముగ్గురికి బాబా చాలా డబ్బు ఇవ్వాలని ఆశ.కాని ఒక స్త్రీకి మాత్రం సాయి పాదాల యందు భక్తి ఉంది.33.మేఘాలను చూచి ఆనందంగా నాట్యంచేసే నెమలివలె, చంద్రుని చూచి ఆనందించే చకోరంవలె ఆమెకు బాబా యందు గౌరవాదరాలు. 34.ఆమె యొక్క భక్తి భావాన్ని గని కరుణామూర్తి అయిన సాయిబాబా ఒకరోజు మధ్యాహ్న ఆరతి

సమయంలో ఆమెకు శ్రీరాముని రూపంలో దర్శనమిచ్చారు.35. ఇతరుల కంతా సాయినాథులు. ఆ స్త్రీ దృష్టికి బాబా జానకీవల్లభుని వలె కనిపించగా ఆమె కళ్లనుండి అశ్రువులు జలజలా రాలాయి. అదిచూచి జనులు ఆశ్చర్యపడ్డారు. 36.రెండు చేతులతో తాళాలు వాయిస్తూ కళ్లనుండి అశ్రువులను కారుస్తుంటే ఆ అపూర్వ దృశ్యాన్ని చూచి భక్తులు విస్మితులయ్యారు.37.ఇటువంటి దృశ్యాన్ని చూచి, ఈమెకు ఇంతటి ప్రేమ ఎలా కలిగింది? ఈమెకు మాత్రమే ఇంత ఆనందం ఎలా కలిగింది? అనివారి మనసులలో జిజ్ఞాస కలిగింది.38.తరువాత సాయంత్రం తన భర్తకు ఆమె సాయి యొక్క అద్భుతలీలను, వారు తనకు కలిగించిన శ్రీరామదర్శన విశేషాన్ని తనంతట తానే ఆనందంతో తెలియచేసింది.39.నీలోత్పలదళశ్యాముడు, భక్త కామకల్పద్రుమమైన భరతాగ్రజుడు, సీతా మనోభిరాముడైన దశరథరాముడు నాకు కనిపించాడు.40.కిరీటకుండల మండితుడు, వనమాలా విరాజితుడు, పీతాంబరధారి, చతుర్భుజుడైన జానకీనాథుడు నాకు కనిపించాడు.41.శంఖ చక్ర గదాధరుడు. శ్రీవత్సలాంఛన కౌస్తుభహారాలతో శోభిల్లు పురుషోత్తముడైన పరాత్పరుని మనోహరరూపాన్ని నేను చూచాను.42.మానవ రూపాన్ని ధరించిన అసామాన్య లీలావతారిఅయిన ధనుర్ధారి, జానకీ ప్రాణనాథుడైన శ్రీరాముడు నాకు కనిపించాడు.43.పైకి ఫకీరువలె కనిపించినా, ఇంటింట భిక్షాన్ని అడుక్కున్నా,మనోహరుడైన జానకీ ప్రాణనాథుడు ధనుర్ధారి శ్రీరాముడిగా కనిపించాడు. 44.పైకి అవలియావలె ఉన్నా ఎవరికి ఎలా కనిపించినా, నాకు మాత్రం ధనుర్ధారి, మనోహరుడైన, జానకీ వల్లభుడు కనిపించాడు.45.ఆ స్త్రీ గొప్ప భక్తురాలు కాని ఆమె భర్త అతిస్వార్థపరుడు. స్త్రీలు అమాయక స్వభావం కలవారు. ఇక్కడ ఎక్కడి రాముడు?46.అమాయక భక్తులకు మనసులో ఉన్నదే పైకి భాసిస్తుంది.మాకందరికీ సాయిబాబా కనిపిస్తే, ఈమెకు మాత్రం రాముని రూపమెలా కనిపించింది?47.అని నానా రకాలుగా కుతర్క బుద్ధితో

ఆమెను అవహేళన చేశాడు. అయినా ఆమె మనసులో ఏమీ బాధపడలేదు. ఆమె అసత్య కల్పనలను ఎఱుగదు. 48.ఆమె పరమార్థంలో అదివరకే అర్హతను పొందిన ప్రసిద్ధిని సంపాదించుకున్నది.ఆమెకు అలా అప్పుడప్పుడూ రాముని దర్శనం కలుగుతుండేది.49. కాని తరువాత ద్రవ్య లోభం కలిగింది. డబ్బు వద్ద దేవుడుండడు. అందువల్ల ఆమెకు రాముని దర్శనం కరువైపోయింది. ఇది లోభ స్వభావం.50.సాయిబాబాకు ఇదంతా అవగతమే. ఆమె పాపాలు తొలగిపోయినట్లు గ్రహించి ఆమెకు మరల రాముని దర్శనాన్ని కలిగించి ఆమె కోరికను తీర్చారు. 51.తరువాత అదేరాత్రి ఎలాంటి వింత జరిగింది అంటే ఆ గృహస్థుడు నిద్రలో భయంకరమైన కలను కన్నాడు. 52.తాను ఒక పట్టణంలో ఉండగా, తనను ఒక పోలీసు పట్టుకుని తన చేతులను వెనుకకు విరిచికట్టి , అక్కడే వెనుక నిలబడి త్రాటిరెండు కొనలను గట్టిగా బిగిస్తున్నాడు.53. అదే స్థలంలో ఒక పెద్ద పంజరం ఉన్నది.దాని బయట ఆసమీపంలోనే సాయిబాబా ఆ దృశ్యాన్ని చూస్తున్నట్లు ఊరికే నిలుచున్నారు.54.అతడు సాయి మహారాజును తన సమీపంలో చూచి రెండు చేతులూ జోడించి, దీనవదనంతో దైన్యంగా,55.'బాబా! మీ కీర్తిని విని మీ పాదాల వద్దకు వస్తే మీరిక్కడే ప్రత్యక్షంగా ఉండగా మాకీ దుస్థితి ఎందుకు' అని అన్నాడు.56.'చేసుకున్న కర్మనంతా అనుభవించి తీరాలి'అని సాయిమహారాజు జవాబిచ్చారు. గృహస్థుడు మరల అత్యంత వినయంగా. 57.'ఇటువంటి కష్టాన్ని అనుభవించటానికి నేను ఈ జన్మలో ఏ నేరం చేయలేదు' అని చెప్పాడు. బాబా 'పూర్వజన్మలలో చేసి ఉండచ్చు' అని అన్నారు.58.'పూర్వజన్మలలో నేనేం చేశానో నాకేం తెలుసు? ఏదైనా ఉన్నా అది మీ దర్శనంతో భస్మమై పోవాలి కదా!59.మీ దర్శనంతో అగ్ని ముందు తృణం వలె భస్మమై పోయి నేను ఎందుకు కర్మనుండి విముక్తుణ్ణి కాలేదు'?60.అని అడిగాడు. అప్పుడు సాయిబాబా 'నీ కంతటి

విశ్వాసముందా?' అని అడిగారు. 'ఉన్నది' అని అతడు చెప్పగా బాబా అతనిని కళ్లు మూసుకోమని ఆజ్ఞాపించారు. 61. అతడు కళ్లు మూసుకుని నిలబడగా వెంటనే ఎవరో పడ్డట్లుగా దభేలుమని చప్పుడు వినిపించింది. 62. ఆశబ్దాన్ని విని చకితుడై కళ్ళు తెరచి చుట్టూ చూచాడు. తను బంధనం నుండి విముక్తుడై పోలీసులు రక్త సిక్తమై పడి ఉండటం కనిపించింది. 63. దాంతో చాలా గాబరాపడుతూ సాయిమహారాజు వైపు చూడసాగాడు. బాబా నవ్వుతూ అతనితో 'ఇప్పుడు నీవు భలేగా పట్టుబడ్డావు. 64. ఇప్పుడు ఇక్కడి అధికారి వచ్చి ఇదంతా చూచి తప్పకుండా నీవే నేరస్థుడవని నిన్ను మరల బందీగా పట్టుకుంటాడు'. 65. అని చెప్పారు. అతడు 'మీరు చెప్పింది నిజమే. ఏదో విధంగా నన్ను విడిపించండి. మీరు తప్ప నన్ను రక్షించే వారెవరూ కనిపించటంలేదు' అని వేడు కొన్నాడు. 66. దానిని విని బాబా 'మరలకళ్లు మూసుకో' అని చెప్పారు. అతడట్లే చేసి కళ్లు తెరచి చూడగా మరో విశేషం. 67. తను పంజరం బయట ఉన్నాడు, తన వద్ద ఉన్న సాయిబాబాకు సాష్టాంగ ప్రణామం చేశాడు. 68. బాబా అతనిని 'ఇప్పుడు చేసిన నమస్కారానికి ఇంతకుముందు చేసిన నమస్కారానికి రెండింటిలో ఏమైనా భేదమున్నదా? బాగా ఆలోచించి చెప్పు అని అడిగారు. 69. అతడు 'బాబా! భూమికీ ఆకాశానికి ఉన్నంత అంతరముంది. మొదట కేవలం ద్రవ్యం కోసం నమస్కరించాను. ఇప్పుడు మీరు పరమేశ్వరుడన్న భావంతో వందనం చేస్తున్నా. 70. మొదట నాకసలు ఏమాత్రం భక్తిలేదు. పైగా మీరు ముసల్మానులై ఉండి హిందువులమైన మమ్ము భ్రష్టు పట్టిస్తున్నారని నామనసులో కోపంగా ఉండేది' 71. అని చెప్పగా బాబా 'నీకు మహమ్మదీయ దేవుళ్లపై భక్తి లేదా?' అని అడిగారు. లేదని గృహస్థు చెప్పాడు. 72. బాబా అతనితో, 'మీ ఇంట్లో పంజాలేదూ? మొహరమప్పుడు దానిని పూజచేయవూ? బాగా ఆలోచించుకో. 73. మీ ఇంట్లో కాడ్‌బీబి ఉంది. ముసల్మానుల దేవతయైన ఆమెను వివాహాది శుభకార్యాలలో పూజించి ఆమెను

శాంతపరుస్తారు కదా అన్నారు!74.అవునని అతడు ఒప్పుకున్నాడు. నీకేదైనా కోరిక ఉందా అని బాబా ప్రశ్నించగా అతనికి తన గురువైన రామదాసును దర్శించవలెనని కోరిక కలిగింది.75.బాబా,'వెనుకకు తిరిగి చూడు' అని అతనికి చెప్పారు. అతడు తిరిగి చూసే సరికి తన ఎదుట సమర్థరామదాసు!76.వారి పాదాలపై పడగా వారు వెంటనే అదృశ్యమయ్యారు.తరువాత అతడు జిజ్ఞాసతో.77.'బాబా! మీకు వయసుమళ్లి మీ శరీరం ముడుసలి వలె కన్పిస్తుంది. మీ ఆయుర్దాయాన్ని మీరెరుగుదురా?'అని అడిగాడు.78.'నేను ముడుసలి అని అంటున్నావా? ఏదీ నాతో పరుగెత్తి చూడు' అంటూ బాబా పరుగెత్త సాగారు. వారి వెనుక గృహస్థుడు పరుగు పెట్టాడు.79.సాయి మహారాజు వేగంగా పరుగెత్తుతుంటే లేచిన ఆ ధూళిలో వారు అదృశ్యమయ్యారు. గృహస్థునికి మెలకువ కలిగింది. 80.గృహస్థుడు మేలుకొని తన స్వప్నాన్ని ఆలోచించుకుంటుంటే అతని మనసు మారిపోయి బాబా యొక్క మహిమను స్తుతించాడు.81.సాయి యొక్క సామర్థ్యాన్ని గని సాయి పాదాల యందు అతనికి భక్తి కుదిరింది. సాయి పట్ల ఉన్న పూర్వపు దురభిప్రాయాలు సంశయాలు తొలగిపోయాయి.82. మూడగా అంతా స్వప్నమే.అయినా ఆ ప్రశ్నలు జవాబులు విన్న శ్రోతలు వానిలోని గూఢమైన భావార్థాన్ని గ్రహించాలి.83.ఈ ప్రశ్నోత్తర సంవాదన ద్వారా మద్రాసు గృహస్థుడు చక్కటి జ్ఞానాన్ని పొందాడు. అలా వినోదాల ద్వారా అతనికి బాబా యందున్న విరోధభావం తొలగిపోయింది. 84.మరునాడు ఉదయం ఆ భక్త బృందం బాబా దర్శనానికి మసీదుకు వచ్చింది.బాబా వారిని కరుణించి వారికి రెండురూపాయల బర్ఫీమిఠాయిని ఇచ్చారు.85. అట్లే తమ వద్ద నున్న రెండురూపాయలను వారందరికి ఇచ్చి కొంతకాలం వారిని అక్కడ ఉంచుకున్నారు. వారు పూజలు భజనలు చేశారు. 86.తరువాత కొంతకాలం గడిచాక వారు వెళ్లి పోవటానికి బయలుదేరారు. వారికి చాలా డబ్బు దొరక లేదు గాని బాబా ఆశీస్సులు

పుష్కలంగా లభించాయి.87.'అల్లా మాలిక్ బహుత్ దేగా, అల్లా తుమ్హారా అచ్చా కరేగా,''అల్లా మీకు చాలా ఇస్తాడు. మీకు శుభం కలుగచేస్తాడు' అని అన్నారు. ఆ ఆశీర్వచనాలే వారికి మార్గంలో అహర్నిశలూ ఉపయోగ పడ్డాయి. 88.సాయి యొక్క ఆశీర్వాదంతో సాయి బాబాను మనసులో ధ్యానించుకోవటం వలన ప్రయాణంలో వారికి పగలూరాత్రి కలలోనైనా కాసింత ఇబ్బంది కలుగలేదు.89.బాబా ఆశీర్వాద ఫలితంగా వారి యాత్ర ఏలోటూ లేక,సుఖంగా సాగి వారు ఏబాధలూ పడకుండా ఇంటికి చేరుకున్నారు.90.వారు సంకల్పించిన యాత్రలే కాక అనేక ఇతర యాత్రలు కూడా చేశారు.అందరికీ అనుపమానమైన ఆనందం కలిగింది. సాయి బాబా యొక్క వచనాలలోని అమోఘమైన శక్తిని వర్ణించారు.91. అంతేకాదు 'అల్లా అచ్చాకరేగా''అల్లా మంచి చేస్తాడు' అన్న సాయి సత్పురుషుని ఆశీర్వచనం అక్షరసత్యమై వారి మనోభీష్టం నెరవేరింది.92.ఈ విధంగా తీర్థ యాత్రలకు బయలు దేరిన మద్రాసు బృందం, సదాచార సంపన్నులూ, సాత్త్వికులుగా మారి భగవద్భక్తులైనారు. వారిని బాబా విముక్తులను చేశారు.93.ఇటువంటి మరొక రసభరితమైన కథను చెప్పుతాను వినండి. శ్రద్ధగా భక్తిభావంతో శ్రవణం చేస్తే శ్రోతలకు ఆశ్చర్యం కలుగుతుంది.94.పరమదయాళువు భక్తులకు కల్పవృక్షమైన సాయిబాబా ప్రేమతో ఏ విధంగా భక్తుల కోరికలను ఎల్లప్పుడూ తీరుస్తారో వినండి.95.థాణా జిల్లాలోని బాంద్రా పట్టణంలో ఉన్న రఘునాథరావు టెండూల్కరు అను ఒక భక్తశ్రేష్ఠుడు, ధీరుడు, నిశిత బుద్ధికల పండితుడు.96.ఎప్పుడూ ఆనందంగా ఉండే గొప్ప ప్రేమ గలవాడు.సాయి బాబా చరణ కమలాలవద్ద లభించే జ్ఞాన మకరందాన్ని ఆస్వాదించాలన్న అభిలాషతో వారి పాదాల వద్ద చేరాడు. సాయినామాన్ని అఖండంగా జపించేవాడు.97. అతడు సాయి లీలలను 'భజనమాల' అను పుస్తకంలో వర్ణించాడు. వానిని భక్తితో పఠించినవారికి అడుగడుగునా సాయియే కనిపిస్తారు.

98.అతని భార్య సావిత్రి. వారి జ్యేష్ఠ పుత్రుడు బాబు. విచిత్ర అనుభవాలు గలవారి చరిత్రను వినండి. 99.ఒకసారి మెడికల్ కాలేజీలో అలోపతి వైద్య శిక్షణను పొందిన బాబు అనుమానంతో పరీక్షకు కూర్చోలేదు.100.అతడు అహర్నిశలు బాగా అధ్యయనం చేశాడు.అయినా తాను ప్యాసు అవుతానా అని జ్యోతిషుని ప్రశ్నించాడు. 101.జ్యోతిషుడు పంచాంగ పుటలను తిరగవేసి రాసులను నక్షత్రాలను ప్రేక్షలతో లెక్క-పెట్టి గ్రహబలాలను చూచాడు. 102.చివర బాబుతో 'నువ్వు బాగా పరిశ్రమ చేశావు. కాని ఈ సంవత్సరం గ్రహబలం లేదు. వచ్చే ఏడు నీకు శుభప్రదం. నీవు నిస్సందేహంగా పరీక్ష ప్యాసు అవుతావు' అని చెప్పాడు.103. ఈ మాటవిని విద్యార్థికి ధైర్యం సడలిపోయి భయం కలిగింది. తన శ్రమంతా వ్యర్థమయేలా ఉంటే ఇక పరీక్షకు వెళ్లి ఏం ప్రయోజనం? అని అనుకున్నాడు. 104.తరువాత ఆ విద్యార్థి తల్లి త్వరలోనే శిరిడీకి వెళ్లింది.ఆమె బాబా చరణాలకు నమస్కరించగా కుశలసమాచారాల ప్రస్తావన సాగింది.105.అప్పుడు ఆమె బాబాతో దీనంగా,'అబ్బాయి గ్రహాలు అనుకూలంగా ఉంటే పరీక్ష వ్రాసేవాడు.106.కాని జ్యోతిషుడు జాతకం చూచి ఈ ఏడు ఆ యోగం లేదన్నాడు. అందువలన అబ్బాయి బాగా చదివి కూడా పరీక్ష వ్రాయనంటున్నాడు.107.బాబా! ఈ గ్రహదశఏమిటి? ఇప్పుడు మాకీ నిరాశ ఎందుకు? ఈ ఏడు ఈ పరీక్ష ప్యాసు అయిపోతాడని అందరం చాలా ఆశ పడ్డాం' అని చెప్పింది. 108.ఆమె మాటలను విని బాబా 'జాతకపత్రికలను చుట్టచుట్టి స్వస్థచిత్తంతో ధైర్యంగా పరీక్షకు వెళ్లమని, నా మాట వినమని బాబుకు చెప్పు. 109.ఎవరి సలహాలను పాటించవద్దు. జాతకాన్ని చూడవద్దు. జ్యోతిషుని మాటను విశ్వసించవద్దు. చక్కగా చదువుకోమని చెప్పు.110.అబ్బాయి తప్పక నెగ్గి కీర్తిని పొందుతాడు. వెళ్లి నిశ్చింతగా పరీక్ష వ్రాయమని, నిరాశపడవద్దని, నా యందు విశ్వాస ముంచమని చెప్పు'111.బాబా అనుమతిని తీసుకుని ఆ తల్లి ఊరికి తిరిగి

వెళ్లింది. బాబా సందేశాన్ని అబ్బాయికి తెలియచేసి అతనికి ఉత్సాహాన్ని ధైర్యాన్ని కలుగచేసింది. 112. అబ్బాయి సాయి చెప్పినట్లుగా వారి ఆజ్ఞానుసారం ఉత్సాహంగా ప్రశ్నలన్నింటికీ జవాబులు వ్రాసి పరీక్ష బాగా వ్రాశాడు. 113. వ్రాత పరీక్షలు పూర్తి అయిపోయాయి. అన్ని ప్రశ్నలూ బాగా సంతృప్తికరంగా వ్రాశాడు. కాని అవిశ్వాసంతో సందేహంతో అతని బుద్ధి మళ్లీ చలించింది. 114. అతడు ఉత్తీర్ణుడవటానికి అతడు వ్రాసినది సరిపోతుంది. కాని అది సరిపోదేమోనని అతనికి అధైర్యం. 115. వాస్తవానికి వ్రాత పరీక్షలో ప్యాసు అయినా అవలేదని అతనికి అనిపించి ఉదాసీనతతో మౌఖిక (నోటి) పరీక్షకు వెళ్లలేదు. 116. మౌఖిక పరీక్ష ఆరంభమైన మొదటిరోజు గడచి పోయింది. రెండవరోజు బాబు భోజనం చేస్తుండగా ఒక స్నేహితుడు వచ్చాడు. 117. ఇదేమి ఆశ్చర్యం? పరీక్షకునికి నీ గురించి చింత. 'టెండూల్‌కర్ ఎందుకు రాలేదో ఇప్పుడు వెళ్లి కనుక్కొనిరా' అని అన్నారు. 118. 'వ్రాత పరీక్షలో ప్యాసు కాకపోవటంవలన మౌఖిక పరీక్షకు వెళ్లే శ్రమ ఎందుకని నిరుత్సాహంగా ఇంట్లోనే కూర్చున్నాడు అని నేను స్పష్టంగా చెప్పాను. 119. అప్పుడు అతడు, వ్రాత పరీక్షలో ప్యాసు అయినట్లుగా ఆ సంతోషవార్త అతనికి అందచేసి నీవు అతనిని ఉన్న పళంగా వెంటబెట్టుకునిరా అని చెప్పాడు. 120. అని అనగా బాబుకు కలిగిన ఆనందం అడగాలా? సాయి మహారాజును స్మరించుకుని ఒక్క క్షణమైనా ఆలస్యం చేయకుండా ఉత్సాహంగా పరుగు తీశాడు. 121. అలా పరీక్ష ప్యాసు కావలెనన్న అతని కోరికను తీర్చి, సాయిబాబా అతనికి తమ యందు దృఢమైన విశ్వాసం కుదిరేలా చేశారు. 122. తిరుగలి పిడిని ఊపి గట్టిగా కొట్టి బిగించే విధంగా గురువుపాదాలలో నిష్ఠా విషయం కూడా అల్లే. సాయిబాబా ఊపి ఊపి నిష్ఠ దృఢంగా నాటుకునేలా చేస్తారు. 123. వారు ఎవరికైనా ఎప్పుడైనా ఏదైనా చెప్పితే అది భక్తుల మనసులకు తట్టకుండా ఉండేది కాదు. ఆ రీతిగా నిత్యం బాబా, అనుభవాలతో నిష్ఠను

దృఢ పరిచేవారు. 124.వారు తెలిపిన మార్గంలో పోతుంటే మొదట మొదట సుఖంగానే ఉంటుంది. కాని తరువాత ఆ దారిలోని ముళ్ల పొదల కారణంగా నలు దిక్కులా ముళ్లే ముళ్లు.125.అప్పుడు నిష్ఠ సడలుతుంది. బాబా ఇటువంటి అడ్డదారిలో ఎందుకు తీసుకుని వచ్చారా అని మనసులో సంశయం కలుగుతుంది.126.కాని ఇలా అనిపించినప్పుడే దృఢమైన శ్రద్ధ కలిగి ఉండాలి.ఈ కష్టాలు మనకు ప్రత్యక్షంగా పరీక్షా గీటురాళ్లు.వీని వలననే మనసులో శ్రద్ధ దృఢంగా నాటుకుంటుంది.127.కష్టాలను లెక్క చేయకుండా వానిని ఎదుర్కొంటూ అనవరతం సాయి నామస్మరణ చేస్తే సకల కష్టాలు తొలగిపోతాయి. ఇది నామం యొక్క ప్రచండ శక్తి.128.ఈ అంతరాయాలు అంటే కష్టాల వల్ల కలిగే ప్రయోజనమిదే.ఆ కష్టాలే మన మనసులలో సాయిని నెలకొల్పుతాయి. అప్పుడే సాయి స్మరణ జరుగుతుంది. కష్టాలు ఉపశమించటం కూడా అప్పుడే.129. అబ్బాయి తండ్రి అత్యంత ప్రేమమయుడు, ధీరుడు,ఉదారుడు,సత్యశీలుడు,బాబా భక్తుడు. అతని శరీరం నీరసించి పోయింది.130.అతడు ముంబైలోని ప్రసిద్ధమైన విదేశీ వ్యాపార సంస్థలో శ్రద్ధగా విశ్వాసంతో ఉద్యోగం చేశాడు.131.వృద్ధాప్యంవలన కళ్లు సరిగ్గా కనిపించకుండా పోయినై. ఇంద్రియాలు తమతమ పనులు చేయలేక నీరసించి పోయినై. దాంతో అతడు ప్రశాంతమైన విశ్రాంతిని కోరుకున్నాడు. 132.పని చేయటానికి శరీరంలో శక్తి మిగల లేదు. అందువల్ల రఘునాథరావు తన ఆరోగ్యాన్ని బాగుచేసుకోవటానికి సెలవుతీసుకుని సుఖంగా విశ్రాంతి తీసుకున్నాడు.133. సెలవంతా అయిపోయినా అతనికి పూర్తిగా విశ్రాంతి లభించలేదు. అందువల్ల ఇంకా సెలవు కావాలని ప్రార్థిస్తూ మరల దరఖాస్తు పెట్టుకున్నాడు. 134.దానిని చూచి దయాళువైన సంస్థలోని పైఅధికారి, అంతా తెలుసుకుని కోరుకున్న సెలవును సిఫారసు చేశాడు.135.విశ్వాసంతో చేసిన ఇతని సేవకు మెచ్చి ఉదారుడైన యజమాని శేషజీవితాన్ని గడపటానికి జీతంలో

సగభాగాన్ని పెన్షన్‌గా ఇచ్చాడు.136.ఇది ప్రభుత్వ పద్ధతి. నమ్మకమైన ఉద్యోగుల ఉత్సాహాన్ని బలపరచటానికి మంచి సంస్థలుకూడా ఈ పద్ధతిని అవలంభిస్తాయి.137.నేను ఉద్యోగం మానివేస్తే మా యజమాని నాకు పెన్షను ఇస్తారా అని రఘునాథరావు చింతించసాగాడు.138.నా జీతం మొత్తం నూటయాభై రూ॥లు. ఇకపై 75 రూ॥ల పెన్షను డబ్బుపైన ఖర్చుల భారం పడుతుంది అని మనసులో ఆలోచించేవాడు.139.కాని తరువాత ఒక వింత జరిగింది. బాబా యొక్క ఆ లీలలోని విశేషాన్ని చూడండి. మొదట రఘునాథరావు భార్యతో వారి హితం కోసం, బాబా ముచ్చటించిన కొతుకాన్ని వినండి.140.పెన్షను ఆర్డరు అందటానికి పదిహేను రోజుల సమయముండగా బాబా ఆమె కలలో.141.'వందరూపాయలు ఇవ్వాలని నా ఇచ్ఛ. నీ కోరికకు అది సరిపోతుందా' అని ఆమె ఉద్దేశాన్ని అడిగారు.'మమ్మల్ని ఎందుకు అడుగుతున్నారు. మీపైనే మాకు విశ్వాసం' అని ఆమె చెప్పింది.142.అక్కడ అతని దరఖాస్తుపై రఘునాథరావు నమ్మకమైన ఉద్యోగిగా ఈనాటి వరకు చాలా సేవ చేశాడు. కనుక అతనికి జీతంలో సగం పెన్షను ఇవ్వాలని నిర్ణయం జరిగింది.143.బాబా నోటితో వంద అని చెప్పినా పైన మరో పది కూడా ఇచ్చారు. ఇలా కరుణామయులైన సాయిసమర్థునికి భక్తులపైన అపారమైన ప్రేమ.144. ఇప్పుడు సుందరము, మనోరంజకము, భక్తులకు ప్రేమోత్సాహాలను, శ్రోతలకు ఆనందాన్నీ కలిగించే మరొక కథను వినండి. 145.క్యాప్టెను హోటే అను పేరుగల ఒక డాక్టరు బాబాయందు గొప్ప భక్తి శ్రద్ధలు కలవాడు.ఒక తెల్లవారు ఝామున బాబా అతనికి స్వప్నంలో దర్శన మిచ్చిన అందమైన కథ.146.హోటే గ్వాలియరులో బాబాను స్వప్నంలో చూచాడు. అప్పుడు బాబా ప్రశ్నలోని కౌశలాన్ని, హోటే ఇచ్చిన జవాబును గమనించండి.147.'నన్ను మరిచి పోయావా' అని బాబా ప్రశ్నించగా, హోటే వెంటనే వారి చరణాలను పట్టుకుని, 'బిడ్డలు తల్లిని మరచిపోతే

ఇక వారికి తరుణోపాయమెక్కడిది?'148.అని వెంటనే లేచి తోటలోనికి వెళ్లి తాజా చిక్కుళ్లను కోసుకుని వచ్చి స్వయంపాకం వస్తువులను,దక్షిణను సిద్ధపరచుకుని149.ఆ చేటును సమర్పించబోతుండగా అతనికి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది.అది స్వప్నమని అర్థం చేసుకున్నాడు.150.ఆ పదార్థాలన్నిటినీ తక్షణం బాబాకు ప్రత్యక్షంగా సమర్పించటానికి శిరిడీ వెళ్లాలన్న కోరిక హాటేకు కలిగింది.151.కాని అప్పుడు అతడు గ్వాలియరులో ఉన్నాడు. అందువలన ముంబైలోని తన స్నేహితునికి వృత్తాంతాన్నంతా తెలియచేస్తూ ఉత్తరం వ్రాశాడు. నీవు స్వయంగా శిరిడీ వెళ్లి. 152.నీకు తపాలా ద్వారా అందిన డబ్బుతో స్వయంపాక వస్తువులను మంచి చిక్కుళ్లను కూడా ఏ విధంగా నైనా తీసుకో.153. మిగిలిన డబ్బును బాబాకు స్వయంపాక వస్తువులతో సమర్పించు. వారి పాదాలకు వందనం చేసి వారి ప్రసాదాన్ని తీసుకుని నాకు పంపు'154.డబ్బు అందగానే స్నేహితుడు శిరిడీకి వెళ్లి సరుకులన్నీ తీసుకున్నాడు. చిక్కుళ్ళు లేకుండా ఎలాగ అన్న ఆలోచన. ఇంతలో తలపైన బుట్టతో ఒక స్త్రీవచ్చింది. 155.ఆమెను పిలిచి చూడగా చిక్కుళ్ళు చేతికి తగిలాయి. చాలా ఆశ్చర్యం కలిగింది.156.అప్పుడు ఆ సరుకులన్నీ పట్టుకుని వెళ్లి సాయిమహారాజుకు శ్రద్ధగా అర్పించాడు.వారు వానిని నిమోంకరుకు ఇచ్చారు.మరురోజు అతడు వానిని వండి నైవేద్యాన్ని అర్పించాడు.157.తరువాత బాబా భోజనానికి కూర్చున్నప్పుడు, పప్పు అన్నం అవీ ఏవీ తాకకుండా, చిక్కుళ్ల కూరనే తీసుకుని తినగా అందరికీ ఆశ్చర్యం కలిగింది.158.బాబా చిక్కుళ్ల కూరనే తీసుకుని తిన్నారన్న వృత్తాంతం తెలిసి నప్పుడు హాటేకు చాలా ఆనందం కలిగింది.159.మనసులోని భావాలను బట్టే అనుభవాలు కలుగుతాయని హాటేకు అనుభవపూర్వకంగా తెలిసి వచ్చింది. తరువాతి కథలోని విశేషాన్ని వినండి. సాయి భక్తుల కోరికలను తీర్చటంలోని మాధుర్యం తెలుస్తుంది.160.సాయిబాబా హస్త స్పర్శతో పవిత్రమైన ఒక

రూపాయి బిళ్లను ఇంట్లో అట్టి పెట్టుకోవాలని హోటేకు కోరిక జనించగా బాబా ఆ కోరికను తీర్చారు.161.మనసులో కోటానుకోట్ల ఆలోచనలు. వానిలోని చెడువాటిని వదిలి,మంచివానిని ఉంచుకోవాలి. ఇప్పుడు సాయిబాబా యొక్క సామర్థ్యాన్ని గమనించండి. వారు భక్తుల వెనుకే నిలిచి ఉంటారు.162.హోటేకు కలిగిన మంచి కోరిక సఫలమవటానికి క్షణం పట్టలేదు. తక్షణమే ఒక భక్తుడు సాయి దర్శనానికి శిరిడీ బయలు దేరాడు.163.సంకల్పాలు మాత్రం మంచివై ఉండాలి.సాయి వానిని తీరుస్తారు. సద్భావాలను ఇష్టపడే వారి కోరికలను తీర్చే బాధ్యత వారిదే. 164. హోటే అత్యంత ప్రేమగా ఒక రూపాయిని స్నేహితునికి ఇచ్చి, దీనిని బాబాచేతిలో ఉంచాలి. మరిచిపోకుసుమా! అని చెప్పాడు. 165.స్నేహితుడు శిరిడీ వెళ్లి వెంటనే బాబా దర్శనం చేసుకున్నాడు. వారి చరణాలకు నమస్కరించి వారి సముఖంలో కూర్చున్నాడు.166.బాబా దక్షిణ కొరకు చేయి చాచగా అతడు మొదట తన దక్షిణను ఇచ్చాడు. బాబా వెంటనే దానిని తమ జేబులో వేసుకున్నారు. ఆ తరువాత హోటే ఇచ్చిన రూపాయిని తీసి 167.దాన్ని బాబా అరచేతిలో ఉంచి, చేతులు జోడించి ఈ దక్షిణను డాక్టరు హోటే నాతో పంపించాడు అని చెప్పాడు. 168. సర్వహృదయవాసి సాయి. హోటే గ్వాలియరు నివాసి అయినా అతని మనసులోని కోరికను తెలుసుకుని ఆ రూపాయిని తదేకంగా చూస్తూ కూర్చున్నారు.169.బాబా ప్రేమతో ఆ రూపాయిని ముందుంచుకుని దాన్నే చూస్తుంటే జనులు ఆశ్చర్యంగా చూడసాగారు.170.బాబా తమ కుడి చేతి బొటన వ్రేలితో ఆ రూపాయిని మాటిమాటికీ ఎగురవేస్తూ కాసేపు ఆడుకుని దానిని మరల ఇచ్చేశారు.171.'ఇది ఎవరిదో వారికి ఇవ్వు. నీ వెంట విభూతి ప్రసాదాన్ని తీసుకుని వెళ్లు. నీది మాకేదీ అవసరం లేదు. ప్రశాంతంగా ఉండమని అతనితో చెప్పు' అని అన్నారు. 172.ఆ స్నేహితుడు సాయి చరణాలకు సాష్టాంగ ప్రణామం చేసి, విభూతి ప్రసాదాన్నీ వారి అనుమతినీ తీసుకుని

తన ఇంటికి గ్వాలియరు చేరుకున్నాడు.173. గ్వాలియరుకు రాగానే డాక్టరు హోటేకు రూపాయినిచ్చి సకల వృత్తాంతాన్ని తెలియ చేశాడు. హోటే హృదయం ప్రేమతో నిండిపోయింది.174.నేను తలచినట్లుగా బాబా నా మనసులోని కోరికను తెలుసుకుని దానిని తీర్చారు అని అన్నాడు.175.అలా హోటే మనసుకు అనిపించింది. అది అతని ఆలోచన; కానీ సత్పురుషుల ప్రణాళికను దాని ప్రయోజనాన్ని ఎవరు తెలుసుకోగలరు.176.ఇదే నిశ్చితమైనది అని స్పష్టంగా చెప్పలేం. దీనికి వ్యతిరేకమైన మరొక సంఘటనను చూడండి. సత్పురుషులకు తమ మనోగతం తమకే తెలుస్తుంది.177.ఒకరి రూపాయిని తిరిగి ఇచ్చి వేస్తారు. మరొకరు ఇచ్చిన దానిని జేబులో వేసుకుంటారు. దానికి కారణమేమని చెప్పగలం? బాబా మనసులో ఏముందో ఎవరు చెప్పగలరు?178.కారణాలను వారే ఎరుగుదురు. కేవలం తమాషా చూడటమే మన పని. మధురమైన అవకాశాన్ని జారవిడుచుకోకుండా, ఈ విషయంలోని కథను వినండి. 179.బాబా యందు అపారప్రేమ ఉన్న వామననార్వేకరు ఒకసారి ఒక అందమైన రూపాయను భక్తిగా అర్పించాలని తెచ్చాడు.180.దానికి ఒకవైపు రామలక్ష్మణులు సీతామాత మరోవైపు బద్ధాంజలుడైన అందమైన మారుతి బొమ్మ చెక్కి ఉన్నాయి.181.బాబా హస్త స్పర్శతో విభూతి ప్రసాద సహితంగా అది మరల తనకు లభించాలనే కోరికతో దానిని వారి చేతిలో ఉంచాడు.182.ఎవరిమనసులో ఏముంటుందో బాబాకు అంతా తెలుసు.అయినా ఆరూపాయి తమ చేతిలో పడగానే వెంటనే జేబులో వేసుకున్నారు.183.వామనరావు మనసులోని కోరికను మాధవరావు బాబాకు తెలియచేసి ఆ రూపాయిని అతనికి తిరిగి ఇమ్మని ప్రార్థించాడు.184. అతనికి ఎందుకు ఇవ్వటం? మనమే అట్టి పెట్టుకుందాం' అని బాబా వామనరావు ఎదుటే స్పష్టంగా చెప్పారు. 185.అయినా అతడు దీని వెల '25 రూ॥ లను ఇస్తే నేనతనికి బదులుగా దీనిని తిరిగి ఇస్తానని చెప్పారు.186.ఆ ఒక్క రూపాయి కోసం

వామనరావు గబగబా అక్కడా అక్కడా డబ్బు సేకరించి తెచ్చి బాబాకు ఇచ్చాడు.187.బాబా వానిని కూడా తమ జేబులో వేసుకున్నారు. 'రూపాయల రాసిపోసినా ఈ రూపాయిని తూచలేవు. దీనికంటే వాని విలువ చాలా తక్కువ.188.శామా! దీనిని నీవు తీసుకో. నీ వస్తువులలో పెట్టుకో. దేవుళ్ల వద్ద ఉంచి పూజచేస్తాండు అని చెప్పారు. 189.ఇలా ఎందుకు చేశారు అని ప్రశ్నించే సాహసం ఎవరికి ఉంది? సాయిబాబా యోగ్యమైన దానిని అయోగ్యమైన దానిని ఎఱుగుదురు. ఇవ్వటానికి తీసుకోవటానికి వారు సమర్థులు. 190. ఇప్పుడు ఈ కథ ముగించి శ్రోతల మనసులకు విశ్రాంతిని కలిగిస్తా. దానివలన శ్రవణం చేసిన దానిని మననం మరియు నిదిధ్యాసనం చేయటానికి అవకాశం కలుగుతుంది.191. శ్రవణం చేసిన దానిని మననం చేయకపోతే అది ఒంట పట్టదు. అట్లే నిదిధ్యాసనం లేకపోతే ఆ శ్రవణం నిష్ప్రయోజనం అవుతుంది.192. హేమాడ్ సాయి శరణు జొచ్చి వారిపాదాలపై మస్తకాన్ని ఉంచుతున్నాడు. ఇది సకలసాధనాలలో సాధనం. తరువాతి కథనం తరువాత.193.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్‌పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో స్వప్న కథా కథనమను ఇరువది తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 30 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఓం నమో సాయిదయామయా! భక్తవత్సలా! కరుణాలయా! మీ దర్శనమాత్రంతో భక్తుల భవభయాన్ని తొలగించి, వారి ఆపదలను నశింప చేస్తారు.1. ఓ సత్పురుష చూడామణీ! సాయినాథా! మొదట నిర్గుణంగా ఉన్న మీరు భక్తుల భావమాత్రంతో కట్టుబడి సగుణసాకార రూపంలో వచ్చారు.2. తమ భక్తులను ఉద్ధరించటం సత్పురుషులకు తప్పనిసరి. మీరు సత్పురుషుల బృందానికి ఆచార్యులు కనుక మీకు భక్తోద్ధరణ అనివార్యం. 3. మీ చరణద్వయాన్ని ఆశ్రయించిన వారి సకల కల్మషాలు నశించిపోయి, పూర్వ జన్మ సంస్కారాలు ఉదయించి, వారి మార్గం నిర్భయం నిష్కంటకం అవుతుంది.4. మీపాదాలను తలచుకుని గొప్పగొప్ప తీర్థ క్షేత్రాలనుండి బ్రాహ్మణులు వచ్చి గాయత్రీ పురశ్చరణ పురాణ గ్రంథపఠనం చేస్తారు.5. అల్ప శక్తులము సంస్కారహీనులమైన మేము భక్తిని ఏం తెలుసుకోగలం? మమ్ము అందఱూ వదలివేసినా సాయిబాబా వదలి పెట్టరు. 6. వారి అనుగ్రహాన్ని పొందిన వారు అత్యంత మహాశక్తిని పొందుతారు. ఆత్మానాత్మ వివేకసంపత్తిని జ్ఞానప్రాప్తిని కూడా పొందుతారు.7. సాయి నోటి నుండి వెలువడిన వచనాలను వినాలన్న కుతూహలంతో భక్త జనులు వెర్రి వారై వారి మాటలను మనసులో పదిలపరచుకుని విశ్వాసంతో వానిని అనుభవపూర్వకంగా గ్రహిస్తారు. 8. తమ భక్తుల మనోభీష్టాలు సాయినాథునికి పూర్తిగా తెలుసు. వానిని తీర్చే సమర్థులు కూడా వారే. కనుకనే వారి భక్తులు

కృతార్థులౌతారు.9.సాయినాథా! పరుగు పరుగున రండి! మీ చరణాలయందు మస్తకాన్ని ఉంచుతున్నాను. నా సర్వాపరాధాలను మన్నించి ఈ దాసుని చింతను నివారించండి.10.ఇలా కష్టాలలో ఉన్న భక్తులు సాయినాథుని స్మరిస్తే వారి దుఃఖపూరిత మనసులకు శాంతిని ప్రసాదించేది వారొక్కరే.11.ఇటువంటి దయాసాగరులైన సాయినన్ను అనుగ్రహించారు. ఆ కారణంగానే మంగళకరమైన ఈ గ్రంథం పాఠకులకు లభ్యమైంది.12.లేకపోతే నాకు ఎక్కడి అర్హత? ఈ కార్యభారాన్ని ఎవరు తలపై వేసుకోగలరు? వారికార్యాన్ని వారే చేసుకునేటప్పుడు నాపై భారమెక్కడిది? 13. నా వాణిని ప్రకాశింపజేసే వారు, అజ్ఞానాంధకారాన్ని నశింపచేసేవారు, జ్ఞానదీపకులు ఐన సాయిసమర్థులు ఉండగా నేనెందుకు సందేహించాలి.14.దయామయులైన ఆ ప్రభువుపైని విశ్వాసం వలననే నాకు అణుమాత్రమైనా శ్రమ అనిపించకుండా నా కోరిక తీరింది. ఈ గ్రంథంవారి కృపాప్రసాదం.15.ఈ గ్రంథ రూపంలో సత్పురుషుని స్నేహ నా యొక్క పూర్వ జన్మల పుణ్యసంచయం.సాయిదేవా! ఈ సేవను చక్కగా చేయించుకున్నారు.ఈ భాగ్యం వలన నేను ధన్యుణ్ణయ్యాను. 16.గతాధ్యాయంలో సాయిదయామయులు అనేక రకాల దృష్టాంతాలతో భక్తులకు ఏ విధంగా జ్ఞానాన్ని బోధిస్తారు అన్న విషయాన్ని శ్రవణం చేశారు.17.ఇప్పుడు ప్రస్తుత అధ్యాయంలో మధురమూ, ఆనంద దాయకమైన ఒక సప్తశృంగీదేవి ఉపాసకుని కథను వినండి.18.దేవీ దేవతలు తమ భక్తులను సత్పురుషుల స్వాధీనం చేయటం ఒక చమత్కారం. దీనిని శ్రద్ధగా అవలోకించండి.19.సాయిమహారాజు కథలు అనేకం. ఒకటి కంటె ఒకటి అద్భుతం. శ్రవణ యోగ్యమైన ఈ కథను శ్రద్ధగా వినండి.20.ఇది కథకాదు. అమృతపానం. దీనివలన మనసుకు శాంతి లభిస్తుంది. సాయి యొక్క సర్వ వ్యాపకత్వం మరియు వారి మహిమ తెలుస్తాయి. 21.సంశయించేవారికి, తర్కవాదులకు ఈ విషయాలు నచ్చవు. ఇక్కడ వాదోపవాదాలు కాదు. నిరవధికమైన ప్రేమ

అవసరం. 22.వినేవారు జ్ఞానులై భక్తి భావంతో ఉండాలి.మరియు శ్రద్ధా శీలురు, నిష్కావంతులు లేదా సాధువులను ఆదరించే వారై ఉండాలి. ఇతరులకు ఇది ఒక కట్టుకథ. 23.ఈ సాయి లీలా కల్పతరువు నిర్వికల్ప ఫలపుష్పాలను కలిగి ఉన్నది.భాగ్యవంతులైన భక్తులే ఈ పుష్పాలను ఫలాలను గ్రహించగలరు.24.భక్తులారా! వినండి. పరమ పావనమైన ఈ కథ పరమార్థాన్ని కోరేవారికి మోక్షాన్ని ప్రసాదిస్తుంది.ఇది సకల సాధనాలలో ముఖ్యమైనది. అందరికీ శుభప్రదమైనది. 25.జడ జీవులను సహజంగా ఉద్ధరించే ఈ సాయి కథామృతపానం లౌకికుల మనసులకు శాంతిని కలుగచేస్తుంది. ముముక్షువులకు ఇది మోక్ష సాధనం.26.ఒక కథను ఆలోచిస్తుంటే కల్పనాతీతమైన మరొక కథ స్ఫురిస్తుంది. అందువలన హేమాడు శ్రోతలను శ్రవణానికి వినయంగా ఆహ్వానిస్తున్నాడు.27.ఇలా ఒక్కొక్క కథను చెప్పుతుంటే సాయి యొక్క లీలల లోని రసాస్వాదన పెంపొందుతుంది. ప్రాపంచిక కష్టాలలో ఉన్నవారికి శాంతి లభిస్తుంది. ఇదే సాయి యొక్క సమర్థత.28.నాసిక్ జిల్లాలోని వణి అనే గ్రామంలో కాకాజీవైద్య అనే ఒక వ్యక్తి అక్కడి దేవివద్ద పూజారిగా ఉంటుండే వాడు.29.ఆ దేవి సప్తశృంగీదేవి.ఆ పూజారి మనసు స్థిరంగాలేదు. ప్రాపంచిక విషయాలలో చిక్కుకుని అనేకరకాల కష్టాలతో బాధపడుతుండేవాడు.30.కాలచక్రభ్రమణంలో మనసు సుడిగుండం వలె గిరగిరా తిరుగుతుంది.శరీరం కూడా ఇటూ అటూ పరుగెత్తుతుంది.ఒక్క క్షణమైనా శాంతి లభించదు. 31:కాకాజీ చాలా దుఃఖితుడై తన బాధను తొలగించుకోవటానికి దేవాలయంలోనికి వెళ్లి, దేవిని కరుణించమని వేడుకున్నాడు.32.అతడు అలా భక్తి భావంతో ప్రార్థించగా దేవి అతని భక్తికి ప్రసన్నురాలై అదేరాత్రి అతనికి దృష్టాంతాన్ని ఇచ్చిన వివరాన్ని శ్రోతలు వినండి. 33. దేవి సప్తశృంగీమాత కాకాజీ స్వప్నంలో 'నీవు బాబా వద్దకు వెళ్లు మనసు కుదుటపడుతుంది' అని చెప్పింది.34.ఈ బాబా ఎవరో ఎక్కడివాడో దేవి స్పష్టంగా తెలియచేస్తుందని

కాకా ఉత్సాహంతో కళ్లు తెఱిచాడు.35.తక్షణం స్వప్నం మాయమైంది. అతని జిజ్ఞాస తీరలేదు. దేవి చెప్పిన బాబా ఎవరై ఉంటారు అని కాకాజి ఆలోచించసాగాడు.36.బాబా అంటే త్ర్యంబకేశ్వరుడై ఉండవచ్చు అని కాకాజీ బాగా నిర్ధారణ చేసుకుని వెంటనే బయలుదేరి వెళ్లి త్ర్యంబకేశ్వరుని దర్శనం చేసుకున్నాడు. కాని అతని మనసులోని అశాంతి దూరం కాలేదు.37.కాకాజీ పదిరోజులు త్ర్యంబకేశ్వరులో ఉన్నాడు. కాని చివరి వరకూ ఉదాసీనతే గాని అతనికి ఉత్సాహం కలుగలేదు.38.మనసులోని క్షుబ్దత చాంచల్యం తగ్గలేదు. అతని చింత తగ్గలేదు. సరికదా రోజురోజుకూ ఉద్విగ్నత అధికమవగా కాకాజీ వెనుకకు బయలుదేరాడు.39.నిత్యం ప్రాతఃకాలం స్నానం చేసి, లింగం పై నంతత ధారతో అభిషేకం చేసి రుద్రావర్తన చేసేవాడు.అయినా అతని అంతరంగంలో అశాంతి.40.మరల దేవి వద్దకు వెళ్లి 'అమ్మా! నన్ను త్ర్యంబకేశ్వరానికి ఎందుకు పంపావు? ఇకనైనా నా మనసును స్థిరపరచు. ఈ రాకపోకలు లేకుండా చేయితల్లీ.'41.అని అత్యంత దీనంగా దేవిని వేడుకున్నాడు. ఆ రాత్రి దేవి అతనికి స్వప్నంలో దర్శనమిచ్చి, 42.'నేను బాబా అని శిరిడీలోని సాయిసమర్థుని గూర్చి చెప్పాను. నీవు అనవసరంగా త్ర్యంబకేశ్వరుకు ఎందుకు వెళ్లావో తెలియదు'అని అన్నది.43.'ఈ శిరిడీ ఎక్కడుంది? ఎలా వెళ్లాలి? బాబా ఎవరో నాకేమీ తెలియదే.ఇప్పుడు అక్కడికి ఎలా వెళ్లాలి? ఇది ఎలా జరుగుతుందో, ఏం అర్థం కావటంలేదే.'44. సత్పురుషుల చరణాలయందు భక్తి వారి దర్శనాభిలాష ఉంటే సత్పురుషులే కాదు అనంతుడు కూడా వారి మంచి కోరికను తీర్చుతాడు. 45.భగవంతుడు, సత్పురుషుడు ఒక్కరే. ఆ ఉభయులలో లవలేశమైనా భేదం లేదు. పైగా వారిని ఉభయులుగా భావించటం ద్వైతం. సత్పురుషులూ పరమేశ్వరుడూ ఒక్కరే.46.సత్పురుషుల దర్శనానికివెళ్లి స్వేచ్ఛగా మనసులోని కోరికను తీర్చుకుంటానని అనుకోవటం కేవలం అహంకారం. సత్పురుషుల యోజనా పద్ధతి బుద్ధికి

అందనిది. 47.వారి సంకల్పం లేకుండా వారి దర్శనానికి ఎవరు వెళ్లగలరు? ఆశ్చర్యమేమిటంటే వారి అనుమతి లేకుండా చెట్టుఆకు కూడా కదలదు.48. వారివారి భక్తిభావం, శ్రద్ధానిష్ఠలు, తీవ్రమైన దర్శనాభిలాషను బట్టి భక్తశ్రేష్ఠులు స్వానందానుభవం లోని పరాకాష్ఠను పొందుతారు.49.సాయిబాబా దర్శనానికి ఎలా వెళ్లాలి అని ఇక్కడ కాకాజీ ఆలోచిస్తుండగా అతని నివాసాన్ని వెతుక్కుంటూ శిరిడీనుండి అతిథి వచ్చాడు. 50.ఆ అతిథి సామాన్యమైన వాడా? బాబాకు అందఱికంటె అధిక ప్రియుడు. ఆ ప్రేమకు అతనితో అన్యులెవరూ సరితూగలేరు. అతని యోగ్యత కూడా ధన్యమైనది.51.అతని పేరు మాధవరావు. దేశపాండే అన్నది వంశపారంపర్యంగా వచ్చింది. బాబా వద్ద అతనికి తప్ప మరెవరిదీ చనువు సాగేది కాదు.52.ఎప్పుడూ ప్రేమగా దెబ్బలాడుకోవడం అరె ఒరె అని ఏకవచన సంబోధన. బాబాకు అతనిపై కన్నకొడుకు వలె విశేషమైన ప్రేమ. అతడు వణికి వచ్చాడు. 53.చిన్నప్పుడు అతనికి జబ్బు చేస్తే అతని తల్లి దేవికి మ్రొక్కుకుంది. 'తల్లీ! ఈ బాలుణ్ణి నీ ఒడిలో వేస్తున్నా. వీణ్ణి చంపినా బ్రతికించినా నీవే.54.నా బిడ్డ బాగైతే నీదర్శనానికి తీసుకునివస్తాను' అని మ్రొక్కుకోగానే బాలుడు బాగయ్యాడు.55.మన పని పూర్తికాగానే వైద్యుణ్ణిగాని దేవుణ్ణిగాని మరచిపోతాం. మ్రొక్కు కష్టకాలంలోనే గుర్తుంటుంది. మ్రొక్కును తీర్చక పోతే అది భయానికి కారణమవుతుంది.56. ఎన్నోరోజులు మాసాలు సంవత్సరాలు గడచిపోయాయి. మ్రొక్కును మరచి పోయింది. చివరకు ఆ తల్లి తన అంతిమ సమయంలో మాధవరావుతో, 57. 'చాలా సంవత్సరాలనుండి ఉన్నమ్రొక్కు ఇంత వరకు తీర్చలేదు. ఇంకా ఆలస్యం చేయటం మంచిదికాదు. నీవు దేవిదర్శనానికి వెళ్లు' అని చెప్పింది.58.అంతేకాక ఆమె రెండు స్తనాలలో తామరవచ్చి చాలా బాధ పడింది. భరించలేని ఆ బాధను సహించలేక దేవికి మరొక మ్రొక్కును మొక్కుకుంది.59.'తల్లీ! నీకు నమస్కరిస్తున్నా. ఈ యాతన నుండి నన్ను రక్షిస్తే,

రెండు వెండి స్తనాలను నీకు సమర్పిస్తాను' అని .60.ఈ మ్రొక్కును కూడా తీర్చాలి తీర్చాలి అనుకుంటూనే తీర్చలేక పోయింది. దేహావసాన సమయంలో ఇది కూడా గుర్తుకు వచ్చింది. 61.ఈ మ్రొక్కును కూడా కొడుకుకు గుర్తుచేసి, మ్రొక్కులు తీరుస్తానని అతని వద్ద మాట తీసుకుని ఆ తల్లి ఏ కోరికలూ లేక హరి చరణాలలో లీనమైపోయింది.62.ఆ తరువాత వణికి వెళ్లాలి వెళ్లాలి అని అనుకుంటూ రోజులు మాసాలు సంవత్సరాలు గడిచిపోయాక మాధవరావు మ్రొక్కులను తీర్చటం మరచి పోయాడు. 63.ఈ విధంగా ముప్పై సంవత్సరాలు గడిచిపోయాక శిరిడీలో ఏం జరిగిందంటే ఒక జ్యోతిషుడు అక్కడక్కడా పర్యటిస్తూ అక్కడికి వచ్చాడు.64.అతడు జ్యోతిషవిద్యలో గొప్ప జ్ఞానం ఉన్నవాడు. భూత భవిష్య వర్తమానాలను తెలపగలవాడు. అనేకమంది జిజ్ఞాసువులను సంతృప్తి పరచి వాహ్వా అని అనిపించుకున్నాడు. 65.శ్రీమంతుడైన కేశవరావు బుట్టి మొదలగు అనేకులకు జ్యోతిషం చెప్పి వారిని సంతుష్టపరిచి అప్పటికప్పుడు అభిమానాన్ని సంపాదించుకున్నాడు.66.మాధవరావు తమ్ముడు బాపాజీ తన భవిష్యాన్నిగూర్చి ప్రశ్నించగా దేవి అతనియందు ప్రసన్నంగా లేదని తెలిపాడు.67.'మీ తల్లి తన అంతిమ సమయంలో తను మ్రొక్కుకున్న విషయాన్ని, మ్రొక్కులను తీర్చమని మీ అన్నకు చెప్పింది.68.వానిని ఈనాటి వరకు తీర్చనందున దేవి బాధను కలిగిస్తూ ఉంది.' అని చెప్పాడు. ఆ కథనంతా బాపాజీ మాధవరావు ఇంటికి రాగానే చెప్పాడు.69.మాధవరావుకు అంతా గుర్తుకు వచ్చింది. కంసాలిని పిలిపించి రెండు వెండి స్తనాలను చేయించి వానిని తీసుకుని మసీదుకు వెళ్లాడు.70. బాబాకు సాష్టాంగ ప్రణామం చేసి రెండు వెండి స్తనాలను వారి ముందు ఉంచి 'ఇవిగో వీనిని స్వీకరించండి. మా మ్రొక్కు తీరుతుంది. 71.మీ రేమా సప్తశృంగి. మీరే మాకులదేవత. ఈ మ్రొక్కుబడిని తీసుకొని శాంతించండి. ఇక కష్టపెట్టకండి' అని అన్నాడు.72.బాబా 'సప్తశృంగి మందిరానికి వెళ్లి

ఈ స్తనాలను నీ చేతులతో ఆమె చరణాలవద్ద అర్పించు' అని జవాబు చెప్పారు.73.అలా బాబా బలవంతపెట్టగా మాధవరావుకు కూడా అట్లే తోచి ఇల్లువదిలి దేవి దర్శనానికి వెళ్లాలని నిశ్చయించుకున్నాడు.74.బాబా దర్శనానికి వెళ్లి శుభాశీస్సులను, విభూతి ప్రసాదాన్ని, వారి అనుమతిని తీసుకుని బయలుదేరాడు.75.సప్తశృంగి చేరుకుని వారి తెగకు చెందిన పూజారికైవెదకసాగాడు. దైవమశాత్తు ఏ శ్రమ లేకుండానే కాకాజీ ఇంట్లోనే దొరికాడు.76.కాకాజీ మనసులో అతిత్వరగా బాబా దర్శనం చేసుకోవాలని ఉత్సుకత, సరిగ్గా అప్పుడే మాధవరావు వచ్చి కలవటం. ఇది సామాన్య విషయమా?77.మీరెవరు ఎక్కడి నుండి రావటం? అని ప్రశ్నించగా అతడు శిరిడీ నుండే వచ్చాడని తెలిసినప్పుడు ఆ ఆనందానికి హద్దులు లేవు. ఉభయులూ వెంటనే కౌగలించుకున్నారు.78.ఇద్దఱూ ప్రసన్న చిత్తులై సాయిలీలలను చెప్పుకున్నారు. మ్రొక్కుబడి కార్యం పూర్తి కాగానే కాకాజీ శిరిడీకి బయలుదేరాడు.79.తలవని తలంపుగా మాధవరావు వంటి మంచి సహవాసం లభించటంతో కాకాజీ చాలా ఆనందించాడు.శిరిడీ మార్గాన్ని నిరీక్షించసాగాడు.80.మ్రొక్కు త్వరగా తీరిపోగానే ఆ ఇద్దరూ పరమోత్సాహంతో పరమ ప్రీతితో సాయి దర్శనానికి బయలుదేరారు.81.మనసులోని ప్రేమ ఉన్నట్లే గబగబా గోదావరీ తీరానికి చేరుకున్నారు.ఆ సమీపంలోనే శిరిడీ ఉంది.82.కాకాజి బాబా పాదాలకు వందనం చేసి, కన్నీటితో వానిని కడిగాడు. సాయి సందర్శనంతో సంతుష్టుడైన కాకా మనసు ప్రసన్నమయింది. 83.దేవి యొక్క దృష్టాంతం ఎవరికోసం సంభవించిందో ఆ సాయి సమర్థుని కళ్లారా చూచి కాకాజీ యదార్థమైన సుఖాన్ని పొందాడు. అతని మనోభీష్టం తీరింది.84.ఆ విధంగా కాకాజీ సుఖసంపన్నుడయ్యాడు. సాయి దర్శనంతో సేవతో అతని చిత్తం ప్రసన్నమైంది. బాబా కురిపించిన కృపతో అతని మనసులోని చింత నిజంగా తొలగిపోయింది. 85.అతని మనోచాంచల్యం మాయమైపోయింది.

దాంతో విస్మితుడయ్యాడు. ఇది ఎటువంటి విలక్షణమైన లీల అని తనను తానే ప్రశ్నించుకున్నాడు.86. ప్రవచనాలూ లేవు. ప్రశ్నలూ సమాధానాలూ లేవు. ఆశీర్వచనాలు లేవు. కేవలం దర్శనంతోనే సుఖం కలిగింది,87. చంచలమైన నా చిత్తవృత్తి కేవలం దర్శనంతో నివృత్తి అయింది. అలౌకికమైన సుఖం ప్రాప్తించింది. దీనినే దర్శన మహిమ అని అంటారు.88. అతని దృష్టి సాయిచరణాలయందు నిమగ్నమైంది. దానితో అతని వాక్కు మూగపోయింది. బాబా మాటలు చెవులలో పడగానే చాలా ఆనందించాడు.89. కాకాజీ సాయిసమర్థుని శరణుజొచ్చి ఆత్మానందాన్ని పొందాడు. పూర్వపు చిత్త వృత్తిని మరచిపోయాడు.90. ఈ విధంగా కాకాజీ పండ్రెండు రోజులు శిరిడీలో ఉండి సుస్థిరమైన మనసుతో సంతోషంగికి వెళ్లిపోయాడు.91. స్వప్నాలకు కూడా సమయం ఉంటుంది. ఉషఃకాలం, లేదా ప్రాతః కాలంలో వచ్చిన కలలే ఫలిస్తాయి. ఇతర సమయాలలో వచ్చిన కలలు నిష్ఫలం.92. అని అంతటా ప్రసిద్ధి. కాని శిరిడీలో కలలు ఎక్కడవచ్చినా ఎప్పుడు వచ్చినా అవి తప్పక సిద్ధిస్తాయి. ఇది భక్తులకు ఎప్పుడూ కలిగే అనుభవం.93. ఈ విషయంలోని చిన్న వృత్తాంతాన్ని శ్రోతలకు మనవి చేస్తాను. వారి మనసులకు కౌతుకం కలుగుతుంది. శ్రవణంలో ఉల్లాసం అధికమవుతుంది.94. ఒకరోజు మధ్యాహ్నం బాబా దీక్షితుతో, 'టాంగా తీసుకుని రహాతాకు వెళ్లి ఖుశాల్ భావును వెంట బెట్టుకునిరా.95. చాలా రోజులుగా నిన్ను కలుసుకోవాలని కోరికగా ఉండటం వలన బాబా నిన్ను పిలువనంపారు అని చెప్పు' అని చెప్పారు.96. వారికి పాదాభివందనం చేసి వారి ఆజ్ఞానుసారం దీక్షితు టాంగా తీసుకుని వెళ్లాడు. ఖుశాల్‌భావు వెంటనే కలిశాడు. దీక్షితు తను వచ్చిన విషయం చెప్పాడు.97. బాబా యొక్క సందేశాన్ని విని ఖుశాల్ భావుకు అమితాశ్చర్యం కలిగింది. నేను ఇప్పుడే నిద్రనుండి లేచాను. నిద్రలో కూడా నాకు ఇదే బాబా ఆజ్ఞ.98. ఇప్పుడే మధ్యాహ్నం నేను భోజనం చేసి ప్రక్కమీద విశ్రమిస్తుండగా కళ్లు

మూతలు పడ్డాయి. కలలో బాబా ఇదే చెప్పారు. 99. వెంటనే శిరిడీకి ఇప్పుడే బయల్దేరు అని. రావాలని నాకు కూడా చాలా కోరికగా ఉంది.కాని ఏం చేయను? గుఱ్ఱాలు ఇక్కడలేవు. ఇది వారికి తెలపటానికి మా అబ్బాయిని పంపాను.100.అబ్బాయి గ్రామ సరిహద్దు వరకు వెళ్లాడో లేదో మీ టాంగా వచ్చింది అని చెప్పాడు. దీక్షితు అతనితో వినోదంగా,'అందుకేగామరి నన్ను పంపారు.101.ఇప్పుడు మీరు వచ్చేటట్లైతే బయట టాంగా బండి సిద్ధంగా ఉంది' అని అన్నాడు. అతడు దీక్షితువెంట ఆనందంగా శిరిడీకి వచ్చాడు.102.తాత్పర్యం ఖుశాల్ భావును కలుసుకొని బాబా యొక్క మనోభీష్టం తీరింది.బాబాయొక్క ఆ లీలనుగని ఖుశాల్‌భావు గద్గదుడయ్యాడు.103.ఒకసారి రాంలాల్ అను పేరుగల ఒక పంజాబీ బ్రాహ్మణుడు ముంబైలో ఉంటుండగా బాబా అతనికి స్వప్నంలో దర్శనమిచ్చారు.104.ఆకాశం వాయువు రవి వరుణాది దేవతల అనుగ్రహప్రభావంతో బాహ్యంలోని అంతరంగంలోని విషయాలను తెలుసుకునే జ్ఞానం జాగ్రదావస్థ. 105.సకలేంద్రియాలు విశ్రమించి, జాగ్రదావస్థలోని సంస్కార ప్రబోధనలను గ్రాహ్య గ్రాహక రూపంలో స్ఫురింప చేసే లక్షణం స్వప్నం.106.రాంలాల్ స్వప్నం విలక్షణం. అతనికి బాబా యొక్క రూపురేఖలు తెలియవు. అతడు వారిని మునుపెన్నడూ దర్శించుకోలేదు. అయినా 'నావద్దకురా!'అని అన్నారు.107.ఒక మహాత్ముని ఆకారంతో కనిపించారు.కాని వారు ఎక్కడుంటారో తెలియదు. రాంలాలు మేలుకొని దీర్ఘంగా ఆలోచించ సాగాడు.108. వెళ్లాలని మనసుకు అనిపించింది కాని వారి చిరునామా,వారి నివాసం ఏదీ తెలియదు. అయినా అతనిని దర్శనానికి రమ్మని పిలిచిన వారికి రప్పించుకోవటం తెలుసు.109.అదే రోజు మధ్యాహ్నం రాంలాలు యాదృచ్ఛికంగా బాట వెంబడి నడుస్తుండగా ఒక అంగడిలో ఒక పటాన్ని చూచి చకితుడయ్యాడు.110.అది తాను స్వప్నంలో చూచిన రూపమేనని అతనికి అనిపించింది. వెంటనే

అంగడి వానిని వారి వివరాలను అడిగాడు.111.శ్రద్ధగా పటాన్ని చూచాడు. వారు ఎవరు ఎక్కడుంటారు అని వాకబు చేయగా వారు శిరిడీలోని సాయిబాబా అని తెలిసింది.దానితో రాంలాలు మనసు శాంతించింది.112.తరువాత అతడు పూర్తిగా వివరాలను తెలుసుకుని శిరిడీ వెళ్లి బాబా నిర్వాణ పర్యంతం బాబా వద్దనే ఉన్నాడు.113.భక్తులను తమ వద్దకు రప్పించుకుని వారి ప్రాపంచిక మరియు పారమార్థిక కోరికలను తీర్చడమే బాబా సంకల్పం.114.బాబా సకల కోరికలూ తీరిన వారు. ఎప్పుడూ నిష్కాములు, నిరహంకారులు, నిస్వార్థులు. ఏ మమకారాలు లేని వారు.భక్తుల కోరికలు తీర్చడానికే వారి అవతారం.115.ఎవరి వద్దకు క్రోధం దరిచేరదో,ఎవరివద్ద ద్వేషానికి చోటులేదో,ఎవరికి స్వార్థ దృష్టిలేదో అతడే నిజమైన సాధువని తెలుసుకోవాలి. 116.అందఱి యందూ వారికి నిస్వార్థమైన ప్రేమ. అదే పరమ పురుషార్థం. ధర్మమైన విషయాలందు తప్ప ఇతర విషయాలను చెప్పటంలో ఒక్కక్షణమైనా వ్యర్థం చేయరు.117.సారాంశం, బాబా నా చేతిని పట్టుకుని తమ చరితాన్ని వ్రాయించుకోవడం.భక్తులు తమ స్మరణలో నిమగ్నమవ్వాలని ఇదే ఇందులోని ఇంగితం. 118.అందువల్ల ఎల్లప్పుడూ శ్రీసాయి సచ్చరితను శ్రద్ధా భక్తులతో శ్రవణం చేయండని హేమాడ్ అత్యంత నమ్రతతో శ్రోతలకు మనవి చేస్తున్నాడు.119.దాని వలన మనసుకు శాంతి మరియు వ్యసనాలలో నిమగ్నమైన వారికి ఉపశమనం కలుగుతుంది. సాయి చరణాలలో భక్తి నాటుకుని భవం నుండి ముక్తి కలుగుతుంది.120.తరువాతి అధ్యాయంలో విజయానందుడనే సన్యాసి కథ. మానస సరోవరానికి బయలుదేరిన సన్యాసికి సాయి పాదాల వద్ద ముక్తి ప్రాప్తించింది. 121. అట్లే సాయిబాబా భక్త బాలారాం మాన్‌కరుకు కూడా విశ్రాంతి నిచ్చారు. నూల్కరు మరియు మేఘూల కోరికలను చక్కగా తీర్చారు. 122.పులివంటి క్రూరమృగానికి కూడా బాబా తమ చరణాల యందు చోటు నిచ్చారు.

ఇటువంటి సాయి యొక్క అగాధమైన అమోఘమైన చర్యలను వినడం ఒక మహోత్సవం. 123.స్వస్తి శ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో మ్రొక్కుబడి మొదలగు కథలకథనం అన్న ముప్పదియవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 31 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయంలో సప్తశృంగీ దేవీ భక్తుని కథ, సాయిబాబా మాధవరావు మ్రొక్కును తీర్పించటం. 1 ఖుశాల్ సేటుకు రామ్‌లాలుకు స్వప్నంలో దర్శనమిచ్చిన విషయం, మరియు రామ్‌లాలును బాబా తమ సమాధి వరకు తమ వద్ద ఉంచేసుకోవటం గురించి చెప్పబడింది. 2. అంతకంటె అపూర్వమైన ప్రస్తుత కథను శ్రోతలు అత్యంత శ్రద్ధగా వినండి. ఒక సన్యాసి మానస సరోవరానికి బయలుదేరి ఎలా బాబా వద్దముక్తి పొందాడు. 3. బాబా మాన్కరు, నూల్కరు, మేఘా కోరికలను కూడా తీర్చారు. మానవులకే కాక క్రూరమృగమైన ఒక పులికి బాబా తమ పాదాలవద్ద చోటిచ్చారు. 4. ఈ కథలు అతి విస్తారమైన వి. గ్రంథం చాలా పెద్దదై పోతుంది కనుక ఆత్మోద్ధరణకు సాధనమైన కథాసారాన్ని సంక్షిప్తంగా చెప్పుతాను. 5. అంతిమ సమయంలో మనసు ఎలా ఉంటే ప్రాణులకు గతికూడా అట్లే లభిస్తుంది. కీటకం భయంతో భ్రమరమైపోతుంది. జడభరతుడు జింకపైని ప్రీతితో జింకగా జన్మించాడు. 6. అంతిమ సమయంలో ధ్యానించిన రూపమే పునర్జన్మలో కలుగుతుంది. భగవంతుని చరణాలలో మనసు లీనమయితే జన్మరాహిత్యం. 7. ఈ కారణంవల్లనే నామస్మరణ అభ్యాసాన్ని చేయించటం; చివరి సమయంలో కలవరపాటు లేకుండా దేవుడు గుర్తు ఉండాలని. 8. జన్మంతా జాగరూకతగా ఉండి చివరి సమయంలో నిద్రపోతే చివరకు బ్రతుకు

వ్యర్థమై పోతుంది. అందుకోసం సత్సంగం చేయాలి.9. భావార్థులైన భక్తులు తమ ప్రాణాలను సత్పురుషులకు అప్ప చెప్పుతారు. కారణం వారికి జీవుల గతి నిర్గతి బాగా తెలిసి ఉంటాయి. చివరి సమయంలో తోడు వారే కదా. 10.ఈ విషయంలో సాయి సమక్షంలో జరిగిన ఒక మధురమైన కథా వృత్తాంతాన్ని వింటే శ్రోతలకు సాయి యొక్క భక్తవాత్సల్యత అర్థమవుతుంది.11.ఎక్కడి మద్రాసు? ఎక్కడి శిరిడీ? మిట్ట ప్రదేశంలోని మానస సరోవరం ఎక్కడ? భక్తులకు సమయం వచ్చినప్పుడు సాయిబాబా వారిని తమ పాదాల వద్దకు రప్పించుకుంటారు. 12.ఒకసారి విజయానందు అనే ఒక సన్యాసి మదరాసు నుండి మహా ఉల్లాసంగా మానస సరోవరానికి బయలుదేరాడు. 13.ఒక జపాను ప్రయాణీకుని వద్ద మానస సరోవరం యొక్క పటాన్ని చూచి మానస సరోవరాన్ని దర్శించాలని నిశ్చయించుకున్నాడు. 14.దారిలో శిరిడీగ్రామం.బాబా యొక్క మహిమను విని వారి దర్శనం చేసుకోవాలనే కోరికతో వారిస్థలాన్ని వెతుక్కుంటూ వచ్చాడు.15.సాయిమహారాజు గొప్పమహాత్ములు,కీర్తి ప్రతిష్ఠలు కలవారు,జగద్ విఖ్యాతి చెందినవారు అని విని వారి దర్శనాభిలాషతో మార్గంలోవెళ్తూ ఆగాడు.16.అప్పుడు శిరిడీలో హరిద్వారపు సోమదేవస్వామి ఉన్నారు. ఉభయులూ భక్త సమూహంతో సహజంగా కలుసుకున్నారు. 17.సన్యాసి స్వామిని మానస సరోవరం ఎంత దూరాన ఉందని ప్రశ్నించగా, గంగోత్రికి పైన 500 మైళ్ళ దూరాన ఉన్నదని స్వామి చెప్పారు.18.అక్కడ మంచు ఎక్కువగా కురుస్తుందని ప్రతి యాభై కోసుల దూరానికి భాషమారుతుంటుందని,భూటాన్ వాస్తవ్యులు అనుమానాలతో పరదేశీయులను చాలా పీడిస్తారని చెప్పాడు.19.స్వామి మాటలను విని సన్యాసి బాధపడ్డాడు. అతని మనసు వికలమైంది. చింతలో మునిగి పోయాడు. 20. సన్యాసి సాయిబాబా దర్శనం చేసుకుని వారి చరణాలకు సాష్టాంగ పడ్డాడు. అతని మనసుప్రసన్నమైంది. ఆసనం వేసుకుని కూర్చున్నాడు 21.ఇంతలో బాబా

కోపంగా అక్కడున్న భక్తులతో, 'ఈ సన్యాసిని వెళ్లగొట్టండి. ఇతని సాంగత్యం పనికిరాదు.' అని చెప్పారు. 22. అసలే సన్యాసి క్రొత్తవాడు. బాబా స్వభావాన్ని ఎరుగడు. బాబా కేకలను విని లజ్జితుడయ్యాడు. అయినా భక్తులు చేస్తున్న సేవను చూస్తూ కూర్చున్నాడు. 23. అది ప్రాతఃకాలం దర్బారు. మసీదులో భక్తులు గుంపులు గూడి ఉన్నారు. భక్తులు చేసే పూజోపచారాలను పూజా సామగ్రిని చూచి సన్యాసి చకితుడయ్యాడు 24. ఒకరు బాబా పాద ప్రక్షాళనం చేసి వారి అంగుష్ఠ తీర్థాన్ని శుద్ధమైన భక్తి భావంతో సేవిస్తున్నారు. మరొకరు దాన్ని కళ్లకద్దుకుంటున్నారు. 25. ఒకరు గంధాన్ని మరొకరు అత్తరు పరిమళాన్ని అద్దుతున్నారు. బ్రాహ్మణ క్షత్రియ శూద్రాది జాతి భేదాల సంబంధాల నన్నిటినీ మరచిపోయారు. 26. బాబా కోపగించినా సన్యాసికి వారిపై ప్రేమ ఉప్పొంగింది. కూర్చున్న చోటునుండి లేవలేదు. వెనుకకు వెళ్లలేక పోయాడు. 27. శిరిడీలో రెండు రోజులున్నాడు. ఇంతలో ఊరిలో అతని తల్లి చాలా జబ్బుతో ఉందని ఉత్తరం రాగా అతనికి దుఃఖం కలిగింది. 28. తల్లిని కలుసుకోవాలని, తన ప్రదేశానికి తిరిగి వెళ్లిపోవాలని అనిపించింది. కాని బాబా అనుమతి లేకుండా అడుగు కదల్చలేక పోయాడు. 29. ఆ ఉత్తరాన్ని చేత పట్టుకుని సన్యాసి మసీదుకు వెళ్లాడు. తల్లి పరిస్థితిని బాబాకు తెలిపి ప్రార్థించాడు. 30. 'మహారాజా! సాయి సమర్థా! నా మనసులో తల్లిని కలుసుకోవాలని కోరికగా ఉంది. నాపై ప్రసన్నులై వెళ్లటానికి నాకు అనుమతినివ్వండి. ప్రయాణీకుణ్ణి అయిన నన్ను కరుణించండి' 31. అంటూ బాబా పాదాలను పట్టుకుని, 'బాబా! దయచేసి నాకు అనుమతినిస్తారా? నాతల్లి కంఠంలో ప్రాణం పెట్టుకుని, నేలపై పడి ఉండి ఉంటుంది. 32. నా కోసం ఎదురుచూస్తూ ఉండి ఉంటుంది. నన్ను కళ్లతో చూచుకోనివ్వండి. ఆమె తన బాధను మరచి సుఖంగా మరణిస్తుంది. 33. సాయి సమర్థులు అంతర్ జ్ఞాని. సన్యాసి ఆయువే తీరిపోయిందని తెలుసుకుని అతనితో అన్న మాట శ్రద్ధగా

వినండి.34.'తల్లికి ఇంతటి గారాబు పట్టివైతే ఈ సన్యాసి వేషాన్ని ఎందుకు స్వీకరించావు? ఈ వేషానికి మమకారం శోభించదు. కాషాయానికి కళంకాన్ని తెచ్చావు.35. వెళ్ళి కూర్చో. నీవేం చింతించకు.కొన్ని రోజులు గడవని. అప్పుడు ఆలోచిద్దాం. మనసులో ధైర్యం వహించు.36. వాడాలో చాలా మంది దొంగలుంటారు. తలుపులు వేసుకుని అప్రమత్తంగా ఉండు.నీమీద దాడి చేసి సర్వస్వాన్ని అపహరించుకుని పోతారు. 37. వైభవం శాశ్వతం కాదు. ఈ శరీరం ఎప్పుడూ అశాశ్వతం. మృత్యువు ఎల్లప్పుడూ మన సమీపంలోనే ఉన్నదని తెలుసుకుని ధర్మాచరణలో ఉండాలి.38.భార్యాబిడ్డలు మొఱలగు వారియందు నేను నాది అను అభిమానం వలన కలిగే తాపత్రయాలనే అనర్థాలను ఐహికాలని అంటారు.39. రెండవ అనర్థం ఆముష్మికం. పారలౌకిక సుఖాలను కోరుకునే వారికి పరలోకాలు కూడా మోక్షానికి ప్రతిబంధకాలు. అవి ఎప్పుడూ పతనానికి కారణంగా ఉంటాయి. 40.అక్కడ పుణ్యసంచయానికి ఆస్కారం లేదు. స్వర్గసుఖప్రాప్తి భయరహితమైనది కాదు. పుణ్యం క్షీణించగానే పతనభయం ఉంటుంది. ఇందులో సందేహం లేదు.41.ఈ ఐహిక ఆముష్మికాలన్న ఉభయభోగాలు అనర్థాలను కలిగించేవే. అందుచేత వానిని నిశ్శేషంగా త్యజిస్తేనే అవి ఆనందాన్ని కలిగించగల ముఖ్యకారణాలు అవుతాయి.42. సంసారం పై విరక్తి కలిగి హరిచరణాలలో నిశ్చలమైన భక్తి కలిగిన వారి బంధనాలు విడిపోయి అజ్ఞానం తొలగిపోతుంది. 43.హరిభజనలో హరి స్మరణలో గడిచిన సమయం పాపతాప దైన్యాలను పారద్రోలుతుంది. అత్యంత ప్రేమతో హరిని ధ్యానిస్తే, అతడు కష్టాలనుండి మనలను రక్షిస్తాడు.44. నీ పూర్వపుణ్య విశేషం వలననే ఇక్కడకు వచ్చావు. ఇప్పుడు నా మాటలను శ్రద్ధగా విని జీవితాన్ని సార్థకం చేసుకో.45.రేపటి నుండి శ్రద్ధగా కాయా వాచా మనసా భాగవతాన్ని మూడు సప్తాహాలు పారాయణ చేయి.46.ఏ కోరికలూ లేకుండా ఆ గ్రంథాన్ని శ్రవణంచేయి, లేదా

నిదిధ్యాసనా తత్పరుడవై భక్తిభావంతో పఠించు.47.భగవంతుడు ప్రసన్నుడై సకల దుఃఖాలను అంతం చేస్తాడు. నీ మాయామోహాలు తొలగిపోయి అత్యంత సుఖం లభిస్తుంది.48.శుచిర్భూతుడవై హరిచరణాలలో మనసుంచి, ఈ వ్రతాన్ని పూర్తి చేయి.మోహం నుండి విముక్తుడవౌతావు' అని చెప్పారు.49.తమ శరీరానికి అంతిమ సమయం సమీపించినదని తెలుసుకుని బాబా మృత్యుంజయుని సంతుష్టపరచే రామవిజయాన్ని చదివించుకున్నారు. 50.మరునాడు ఉదయం సన్యాసి మొహం కడుక్కుని, స్నానంచేసి బాబా పాదాలపై పూవులనుంచి నమస్కరించాడు. 51.తరువాత భాగవతాన్ని చంకలో పెట్టుకున్నాడు.పారాయణకు ఏకాంతస్థలం కావాలి. ప్రశాంతమైన లెండీ స్థలం అతనికి నచ్చింది.52.అక్కడికి వెళ్లి ఆసనం వేసుకుని కూర్చుని పారాయణాన్ని ఆరంభించాడు. భగవత్ పరాయణుడైన సన్యాసి రెండు సప్తాహాలను పూర్తిచేశాడు.53.మూడవ సప్తాహంలో అతనికి అకస్మాత్తుగా అస్వస్థత చేకూరి బాగా నీరసించిపోయి పారాయణ పూర్తికాకుండానే ఆపివేశాడు.54.వాడాకు తిరిగి వచ్చి రెండురోజులు క్షణంగా గడిపాడు. మూడవరోజు తెల్లవారే సరికి సన్యాసి(స్వామి)కళ్లుమూశాడు.55.తన తలను ఫకీరు బాబా ఒడిలో ఉంచి కదలికలు లేక స్థిరంగా ఉండిపోయాడు. శరీరాన్ని వదిలి విదేహ ముక్తిని పొందాడు.56.అతని మరణవార్తను బాబాకు విన్నవించగా వారు ఆ శరీరాన్ని రోజంతా అలాగే ఉంచమని ఆజ్ఞాపించారు.57.అప్పుడే పూడ్చిపెట్టకండి అని బాబా అంటే, అతడు మరల బ్రతుకుతాడేమోనని ప్రజలు చాలా ఆశతో ఆ శరీరాన్ని రక్షించారు. 58.ఒకసారి వెళ్లిపోయిన ప్రాణం మరల తిరిగివస్తుందా? బాబా మాటల యందు విశ్వాసంతో శరీరాన్ని జాగ్రత్తగా ఉంచారు. 59. దాని పరిణామం మంచిదే అయింది. ఏ వారసులూ లేని శవాన్ని ఉంచడం వలన పోలీసులకు సందేహం తీరిపోయింది. అయినా మరణించినవారు ఎలా బ్రతుకుతారు?60.చక్కగా విచారణ జరగకుండా శవాన్ని

పూడ్చరాదు అని బాబా ఉద్దేశం. చనిపోయిన వారిని బ్రతికించటం ఎలా సాధ్యం? ఇది బాబాకు తెలియదా? 61. వారసులు లేని వారికి యజమానులైన ప్రభుత్వం ఆకస్మిక మరణంపై విచారణ జరుపుతుంది. కనుక ఆ విచారణకు ముందే శవాన్ని పూడ్చరాదు అని బాబా అలా చెప్పారు. 62. తరువాత అదంతా జరిగాక యథావిధిగా ప్రేతసంస్కారం జరిగింది. శవాన్ని యోగ్యమైన స్థలంలో పూడ్చి పెట్టడంతో సత్పురుషుని కార్యం ముగిసింది. 63. ఇటువంటి మరో వృత్తాంతాన్ని ఇప్పుడు శ్రోతలకు చెప్పుతాను. దీనిని శ్రద్ధగా వింటే సాయియొక్క వ్యాపకత్వాన్ని తెలుసుకుంటారు. 64. బాలారాం అను ఒక భక్తుని ఉపనామం మాన్‌కరు. అతడు గృహస్థుడు, బాబాకు పరమ భక్తుడు. 65. అతని భార్య మరణించగా అతనికి గృహస్థాశ్రమ విధులు సక్రమంగా జరగక ధైర్యం సడలి శాంతి పోయింది. అదే గొప్ప భాగ్యమైంది. 66. పూర్వార్జిత పుణ్యఫలప్రాప్తి వలన, అతనికి సాయిచరణ సన్నిధి లభించింది. దాంతో నిశ్చలమైన భక్తి, ప్రపంచంపట్ల సంపూర్ణవిరక్తి కలిగాయి. 67. ఆశాపాశాన్ని బిడ్డలయందు గల మమతాబంధనాలన్నిటినీ త్రెంచుకుని భాగ్యవంతుడైన మాన్‌కరు ప్రపంచంనుండి బయట పడ్డాడు. 68. పరమార్థ ద్వారానికి అడ్డు తగిలే పరుల సేవ అనే మోహ మాలను తన పుత్రుని మెడలోవేసి ఐహికానికి తాళం బిగించి సన్యాస చెప్పాడు. 69. ఇది కూడా ఒక రకమైన సన్యాసమే. సన్యాసాలలో అనేక రకాలు. కాని జ్ఞానాన్ని ప్రసాదించని సన్యాసం అడుగడుగునా కష్టాలనే కలిగిస్తుంది. 70. అందువలన ఉదారమూర్తి అయిన సాయి మాన్‌కరుని అనన్య భక్తికి మెచ్చి అతనిని అనుగ్రహించాలని తలచి అతని వైరాగ్యాన్ని బాగా దృఢపరచారు. 71. అనేక జన్మల సంస్కారాలవలన చంచలమైన మనసు స్థిరపడదు. మనసులోని ప్రబలమైన ఆలోచనా తరంగాలు అతని వైరాగ్యాన్ని శాశ్వతంగా గట్టిగా నిలువ నీయటం లేదు. 72. 'నా స్థానం ఒక్క శిరిడీలోనే లేదు. నేను దేశ కాలాలకు అతీతుణ్ణి

అని' అనుభవ పూర్వకంగా తెలియచేయటానికి బాబా మాన్‌కరుతో.73.'శిరిడిలో ఇక చాలు.ఈ పన్నెండు రూపాయలను ఖర్చుకు తీసుకో.మచ్చిందర్ గడ్‌కు వెళ్లి తపస్సు చేసుకుంటూ అక్కడ సుఖంగా ఉండు' అని ఆదేశించారు. 74.సాయిబాబా వచనాలను విని మాన్‌కరు శిరసు వంచి వారి పాదాలకు సాష్టాంగ పడి అభివందనం చేశాడు. 75.బాలారాం ఎంతో వినయంగా సాయితో 'మీ దర్శనం లేని చోట నేనేం చేయాలి?76.ఇక్కడైతే నిత్యం మీ పాద దర్శనం మీ చరణ తీర్థసేవనం మరియు సహజంగా మీధ్యాస అహర్నిశలూ ఉంటాయి.అక్కడ దీనుణ్ణైన నేను ఒక్కణ్ణే ఉండాలి.77.అయినా బాబా! మీరు లేకుండా అక్కడ నాకేం మంచి జరుగుతుందో తెలుసుకోగల సమర్థుణ్ణికాను. నన్ను ఎందుకోసం అక్కడికి పంపుతున్నారు?' అని అన్నాడు.78.గురువచనాల యందు భక్తులకు ఏ కాస్తా సందేహం కలుగకూడదు అని మాన్‌కరు అనుకున్నాడు.వెంటనే అతని సంశయాలు తొలగిపోయాయి. 79.'బాబా! క్షమించండి.నా క్షుద్రబుద్ధి వలన సంశయాలు కలిగాయి.అందుకు నేను సిగ్గుపడుతున్నాను. ఇటువంటి సందేహాలు నాకు శోభించవు.80. నేను మీ ఆజ్ఞను పాటించేవాణ్ణి. మీ నామస్మరణలో తత్పరుణ్ణి. కేవలం మీ ప్రభావంతో పర్వతంపైనే ఉంటాను.81.అక్కడే మీ ధ్యానం చేస్తాను. కృపామూర్తియైన మిమ్ము స్మరిస్తాను.మీ పాదాలనే గుర్తుంచుకుంటాను.అదేనా నిరంతర తపస్సు.82.నేను మీకు అనన్య శరణు జొచ్చుతున్నాను. నా రాక పోకలను మీ చేతులలో పెట్టాను. ఇక నేనెందుకు ఆలోచించాలి.83.మీ ఆజ్ఞ మీ శక్తితో నా మనసుకు శాంతి కలుగుతుంది. ఇలాంటి మీ సామర్థ్యం ఉండగా నేను వ్యర్థంగా ఎందుకు చింతించాలి' అని అన్నాడు.84.సాయి సమర్థులు సనాతన బ్రహ్మ. వారి వచనాలు బ్రహ్మలిఖితాలు.విశ్వాసమున్న వారికి ఇది పూర్తిగా అనుభవమవుతుంది.85.తరువాత బాబా అతనితో 'ప్రశాంతమైన మనసుతో నా మాట విను. వేరే ఆలోచనలతో

కష్టపెట్టుకోకు. 86. వెంటనే మచ్చిందర్ పర్వతానికి వెళ్లు. ప్రతిరోజు ముమ్మారు తపస్సు చేయి. కొంతకాలానికి ఆత్మానందంతో పరిపూర్ణుడవౌతావు' అని చెప్పారు.87. ఆ ధైర్యవచనాలను విని మాన్‌కరు, ఇకనేను ఏం మాట్లాడగలను అని మౌనంగా ఉన్నాడు. తరువాత పర్వతానికి బయలుదేరటానికి సిద్ధమయ్యాడు. 88. మరల సాయి చరణాలకు ప్రణామం చేసి విభూతి ప్రసాదాన్ని ఆశీర్వాదాన్ని తీసుకుని సన్తుష్టచిత్తుడై మచ్చిందర్‌కు బయలుదేరాడు.89. రమ్యమైన ఆ స్థలానికి చేరుకుని అక్కడి నిర్మలమైన నీటిని, మెల్లమెల్లగా వీచే వాయువును గని మాన్‌కరు సంతుష్టుడయ్యాడు.90. అలా మాన్‌కరు సాయిబాబా ఆజ్ఞతో ఆ పర్వతం పైన సాయి లేకుండా, వారు చెప్పిన ప్రకారం నియమంగా తపస్సును ఆచరిస్తూ ఉన్నాడు. 91. బాబా చమత్కారాన్ని చూడండి. మాన్‌కరు తపోమగ్నుడై ఉండగా కొండమీద బాబా ప్రత్యక్షంగా దర్శనమిచ్చారు. అతనికి సాక్షాత్కారమైంది.92. ధ్యానంలో మగ్నమై ఉన్నప్పుడు దర్శనమవుతుంది. ఇందులో ఏం ఆశ్చర్యంలేదు. కాని జాగ్రదావస్థలో ఆసనంలో కూర్చుని ఉండగా అతడు సాయిసమర్థుణ్ణి చూచాడు. 93. కేవలం కళ్ళతో చూడటమే కాదు. బాలకరాం బాబాను,'బాబా! నన్నెందుకు ఇక్కడకు పంపారు' అని ప్రశ్నించాడు కూడా. బాబా జవాబు ఏమిచ్చారంటే,94.'శిరిడీలో ఉండగా నానారకాల ఆలోచనా తరంగాలు నీ మనసులో లేచేవికదా. అందుకని నీ చంచలమైన మనసు కుదుటపడాలని పర్వత ప్రయాణాన్ని ఏర్పాటు చేశాను. 95. నేల నీరు వగైరా పంచభూతాల కలయికతో నిర్మాణమైన ఈ మూడున్నర మూరల శరీరం శిరిడీ బయట లేదని తలచావు. 96. ఇప్పుడు ఇక్కడ ఉన్నదే అక్కడా ఉన్నది. నిశ్చలమనసుతో సరిగ్గా చూడు. నేను నిన్ను అక్కడినుండి పంపినది ఇందు నిమిత్తమే అని తెలుసుకో,97. తరువాత నిర్ణయించిన కాలంగడిచాక మాన్‌కరు తన నివాస స్థలాన్ని చేరుకోటానికి మచ్చిందర్ పర్వతాన్ని విడిచాడు.98. బాంద్రా గ్రామం అతని ఊరు. అక్కడికి

వెళ్లాలని తలచి పూణె నుండి దాదరు వరకు రైలు బండిలో ప్రయాణం చేయాలని అనుకున్నాడు.99.పూణె స్టేషనుకు వెళ్లి టికెట్టు తీసుకోవాలని కిటికీవద్ద నిలుచున్నప్పుడు ఒక చమత్కారం జరిగింది.100.నడుము వరకు ఒక లంగోటిని చుట్టుకుని భుజంపై కంబళిని వేసుకున్న రైతు వేషంలో అపరిచితుడైన ఒక ప్రయాణీకుణ్ణి అక్కడ చూచాడు.101.అతడు దాదరుకు టికట్టును తీసుకుని, వెనుకకు తిరిగి మాన్‌కరును చూచి అతని వద్దకు వచ్చాడు.102.మీరు ఎక్కడికి వెడుతున్నారని బాలకరాంను అడిగాడు. దాదరుకు అని జవాబివ్వగా అతడు వెంటనే తన టికెట్టును బాలకరాంకు ఇస్తూ 'మీరు దీనిని తీసుకొండి.103.నేను కూడా అక్కడికే బయలుదేరా, కాని ఇక్కడ నాకు ఒక పెద్ద పని ఉంది. అది గుర్తుకు వచ్చింది.అందువలన నా ప్రయాణం ఆగిపోయింది' అని చెప్పాడు.104.డబ్బు వెచ్చించి శ్రమపడినా టికెట్టు లభించటం కష్టం.అటువంటిది ఏ శ్రమ లేకుండా ప్రాప్తించినందుకు మాన్‌కరుకు పరమానందం కలిగింది. 105.తరువాత టికెట్టు డబ్బు ఇవ్వటానికి జేబులో నుండి డబ్బు తీసి చూడగా,ఆ వ్యక్తి గుంపులో కలసిపోయి ఎక్కడికి వెళ్లిపోయాడో తెలియ లేదు.106.అతనిని వెదకాలని బాలకరాం ప్రయత్నం చేశాడు. కాని అదంతా నిష్ఫలమై పోయింది. ఇంతలో రైలు బండి వచ్చింది.107.పాదాలకు జోళ్లులేవు. తలకొక పాత గుడ్డ చుట్టుకుని, భుజంమీద కంబళి నడుముకు లంగోటితో ఉన్న ఈ సోదరుడు ఎవరై ఉంటారు.108.టికట్టు డబ్బు కాస్తా కూస్తా కాదు. అదీ అతని స్వంత డబ్బు. నన్ను ఋణగ్రస్తుణ్ణి చేశాడు. ఇదేమిటో నాకు అర్థం కావటం లేదు. 109.ఏమీ ఆశించని మనసుగల ఉదారుడు. పైకి రైతులా కనిపించిన ఆ వ్యక్తి ఎవరో తెలియక మాన్‌కర్‌కు చింత.110. ఆశ్చర్యంతో అతడు మళ్లీ కలుస్తాడేమోనని రైలుబండి కదిలేవరకు తలుపు దగ్గర నిలబడ్డాడు.111.బండి కదిలాక ఇక అతడు కలుస్తాడన్న ఆశంతా పోయి రైలు తలుపుకు ఉన్న

కమ్మిని పట్టుకుని బండిలోకి దూకాడు.112.పర్వతంపైన ప్రత్యక్ష దర్శనం. ఇక్కడ ఈ విచిత్రఘటన. విచిత్రమైన ఆ వేషాన్ని చూచి బాలారాం ఆలోచనలో పడ్డాడు.113.తరువాత సాయి పాదాలయందు దృఢమైన ప్రేమ, భక్తి శ్రద్ధలు ఉన్న ఈ సద్భక్తుడు శిరిడీలోనే కృతార్థుడయ్యాడు.114.సాయి పాదకమలాల ధూళి యందు, సాయి నామాన్ని ఆలపిస్తూ భక్తభ్రమరం బాలకరాం శిరిడీలోనే ఉన్నాడు.115.అప్పుడప్పుడూ, బాబా అనుమతితో ముక్తారాంను వెంట బెట్టుకుని, శిరిడీ విడిచి బయిటికి వెళ్లేవాడు.116.అయినా అతని కేంద్రస్థానం శిరిడీయే కనుక మరలమరల వస్తుండేవాడు. చివరికి పరమపావనమైన శిరిడీలోనే పరమపదించాడు.117.పూర్వజన్మలలో పుణ్యమున్న వారు సాయి దృష్టిలోపడి సాయి చరణాలలో లీనమై మరణాన్ని నిర్భయంగా పొందుతారు వారు ధన్యులు.118.తాత్యా సాహేబు నూల్కరు, భక్తశ్రేష్ముడైన మేఘా కూడా భజనలో తత్పరులై ఉండి చివరకు తమప్రాణాలను శిరిడీలో విడచిన ధన్యులు.119.మేఘా మరణించినప్పుడు అతని ఉత్తరక్రియ గొప్పగా జరిగింది.ఆ భక్తునిపైని బాబా అభిమానాన్ని గమనించండి.మేఘా కృతార్థుడు.120.భక్తులంతా వెంటరాగా గ్రామస్థులు మేఘాను స్మశానానికి ఊరేగింపుగా తీసుకుని వెళ్లినప్పుడు వారివెంట బాబాకూడా వెళ్లి మేఘాపై పుష్పాలను కురిపించారు.121.శవ సంస్కారమంతా జరిగాక మాయలో చిక్కుకున్న ఒక మానవునివలె దుఃఖించి కళ్లనీళ్లు పెట్టుకున్నారు.122.ప్రేమగా బాబా తమ చేతులతో శవాన్ని పూలతో కప్పి, దీనస్వరంతో శోకించి వెనుకకు మరలి వచ్చారు.123.మానవులను ఉద్ధరించే సాధువులను అనేకమందిని చూశాం కాని సాయిబాబా యొక్క మహిమను నేనెంతని వర్ణించను?124.వ్యాఘ్రం వంటి క్రూరమృగం మానవులవలె జ్ఞానం కలిగి ఉంటుందా? అది కూడా వారి చరణాలనాశ్రయించింది. అది అమోఘమైన బాబా యొక్క లీల. 125.ఈ విషయంలోని ఒక రమ్యమైన కథను శ్రద్ధగా వినండి. సాయిబాబా

యొక్క సమభావం వారి సర్వవ్యాపకత్వం బోధపడుతాయి.126.శిరిడీలో ఒకసారి ఒక చమత్కారం జరిగింది. బాబా నిర్వాణానికి ఏడురోజులు ముందు ఒక ఎద్దులబండి వచ్చి మసీదు ద్వారం వద్ద నిలబడింది.127.దానిలో వెనుక ప్రక్క ఒక భయంకరమైన వ్యాఘ్రం. దాని మెడ గొలుసులతో గట్టిగా కట్టబడి ఉంది.దాని మొహం భయంకరంగా ఉంది.128.దానికి ఏదోబాధ. దాని తాలూకు వారు ఎన్నెన్నో చికిత్సలు చేయించి అలసిపోయారు. సత్పురుషుల దర్శనం మంచిదని వారికి అనిపించింది.129.ఆ పులిని ఆడించేవారు ముగ్గురు.ఆ పులి వారి జీవనాధారం. వారు ఊరూరు తిరుగుతూ పులిని ఆడిస్తూ బ్రతుకుతున్నవారు.130.శిరిడీ ప్రక్కగా తిరుగుతుండగా బాబా యొక్కలీలలు వారి చెవులలో పడ్డాయి.బాబా దర్శనం చేసుకుందాం, పులిని కూడా అక్కడకి తీసుకుని వెళ్లాలి అని అనుకున్నారు. 131.బాబాచరణాలు కోరికలను తీర్చే చింతామణి.అష్టసిద్ధులూ వారికి సాష్టాంగ పడతాయి. నవనిధులూ వారి పాదాలవద్ద దొర్లుతూ వారి పాద తీర్థాన్ని సేవిస్తాయి.132.కనుక వారి చరణాలపై శిరసుంచి పులికోసం వారి అనుగ్రహాన్ని కోరుకుందాం. సత్పురుషుల ఆశీర్వచనం అందరికీ కల్యాణప్రదం.133.అని తలచి వారు పులిని ద్వారం వద్ద దింపి గట్టిగా గొలుసుతో పట్టుకుని ద్వారం వద్ద నుంచున్నారు.134.పులి అసలే భయంకరమైన క్రూర మృగం. పైగా రోగగ్రస్తత.అందువలన మరీ అస్వస్థతగా ఉంది. అందఱూ దానిని కుతూహలంగా చూస్తున్నారు.135.పులి పరిస్థితినంతా దానితాలూకువారు బాబాకు విన్నవించారు.బాబా అనుమతిని తీసుకునిద్వారం వద్దకు వచ్చారు.136.పులి గొలుసును తెంపుకుని పారిపోకుండా బాగా గట్టిగా పట్టుకుని దానిని జాగ్రత్తగా సాయి ఎదుటికి తీసుకుని వచ్చారు.137.మెట్లవద్దకు రాగానే తేజోరాసియైన సాయిని చూచి ఆ పులికి ఏమనిపించిందో గాని ఎంతో గౌరవంగా ముఖాన్ని క్రిందకు వంచింది.138.అదేమి చమత్కారమో మెట్లెక్కుతున్న

పులి బాబా పరస్పరం చూచుకున్నారు. పులి బాబాను ప్రేమగా చూచింది.139. అంతే, వెంటనే తోకను పైకి ఎత్తి ముమ్మారు భూమిని కొట్టి సాయి చరణాలయందు శరీరాన్ని వదిలి నిశ్చేష్టగా పడిపోయింది.140.భయంకరంగా ఒకసారి గట్టిగా అరచి తక్షణం అక్కడే మరణించింది. దానిని చూచిన వారంతా ఆశ్చర్యపోయారు.141.దాని యజమానులు దుఃఖపడ్డారు కాని తరువాత, రోగగ్రస్తమై మరణం సమీపించి ప్రాణి ముక్తి చెందినదని సంతోషపడ్డారు. 142.సాధు సత్పురుషుల సమక్షంలో ప్రాణం పోవటం గొప్ప పుణ్యం. క్రిమికీటకాలు కాని, వ్యాఘ్రంగాని, వాని పాపాలన్నీ పోతాయి.143. ఏదో పూర్వజన్మ ఋణం తీర్చుకోవటానికి సాయి చరణాలవద్ద శరీరాన్ని వదిలి ఋణం నుండి విముక్తి పొందింది. ఇది విధి యొక్క అఘటిత లీల.144.సాయిబాబా చరణాలయందు శిరసునుంచి మరణించిన ప్రాణి వెంటనే ఉద్ధరింపబడుతుంది. జీవితంలో సంపాదించుకోవలసినది ఇదే.145. ఎంతో గొప్ప భాగ్యముంటే తప్ప సత్పురుషుల సమక్షంలో శరీరాన్ని వదలటం ఉద్ధరింపబడటం సాధ్యమా?146. సత్పురుషుల సమక్షంలో శరీరాన్ని విడవటం పరమ సుఖం. అక్కడ విషం త్రాగినా అది అమృతమే అవుతుంది. ఆ మరణం సుఖమే గాని దుఃఖం కాదు.147.కళ్లముందు సత్పురుషుల చరణాలు ఉండగా మరణించిన ప్రాణులు ధన్యులు. వారి శరీరాలు కృష్ణార్పణమై వారికిక పునర్జన్మ ఉండదు.148.సత్పురుషుల కళ్ల ఎదుట కలిగే మరణం మరణం కాదు. అది వైకుంఠసుఖం. మృత్యులోకాన్ని జయించినట్లే. దాంతో పునర్జన్మ దుఃఖం ఉండదు.149. సత్పురుషుల సమక్షంలో శరీరాన్ని త్యజించిన వారికి పునరావృత్తి ఉండదు.సర్వపాపాలు నశించి వారు ఉద్ధరింపబడతారు. 150. సత్పురుషుల ఆపాదమస్తకం చూస్తూ శరీరాన్ని విడచిన వారిది మరణమా?కాదు అది వారి ఆత్మోద్ధరణ. 151. పూర్వజన్మగూర్చి ఆలోచిస్తే ఎవరో పుణ్యాత్ముడు విద్యాదర్పంతో మిడిసి పడుతూ ఎవరో ఒక హరి భక్తుని

అవమానపరచి ఉండవచ్చు.152.ఆ భక్తుని శాపం వలన క్రూరమృగ జన్మను పొంది ఉండవచ్చు. సత్పురుషుని చరణాల వద్ద శాపవిమోచనం కలిగి ఉంటుంది. భక్తుల చర్యలు నిజంగా విచిత్రం.153.సాయి సందర్శన భాగ్యంలో శాపవిమోచనమై పాపాలు దగ్ధమై బంధనాలు విడిపోయి, కష్టాలు తొలగిపోయి, ఏ శ్రమా లేకుండానే ముక్తిని పొందాడు. 154.సంపూర్ణ భాగ్యం లేకుండా సత్పురుషుల సమక్షంలో మరణమెలా సాధ్యం? త్రితాపాలు త్రిపుటి త్రిగుణాలు నశించిపోయి పులి నిర్గుణ పరమాత్మలో లీనమైపోయింది.155. పూర్వజన్మ కర్మానుబంధం వలన క్రూరమైన మృగశరీర సంబంధం విడిపోయింది. ఇనుప గొలుసుల బంధనం వదిలిపోయింది. ఇది పరమేశ్వరుని నిర్బంధం. 156.సాధు సత్పురుషుల చరణాల కంటే వేరే ఎక్కడ ముక్తి ప్రాప్తిస్తుంది? పులికి ముక్తి లభించినందుకు, దాని యజమానులు సంతసించారు.157. పులివారి కుటుంబాలను పోషించేది. అది వారి జీవనానికి సాధనం. అందువలన పులి మరణించినందుకు వారు బాధపడ్డారు.158.వారు సాయి మహారాజును, 'ఇప్పుడు ఈ పులిని ఏం చేయాలి? దీనిని ఎలా పూడ్చిపెట్టాలి? దీనికి మీరు సద్గతిని కలిగించండి' అని ప్రార్థించారు.159.'మీరేం చింతించకండి. దాని మరణం ఇక్కడే ఉంది. గొప్ప పుణ్యం చేసుకోవటం వలన ఇక్కడ అత్యంత శాంతిని పొందింది.160.తకియా వెనుకనున్న శివాలయం వద్దకు తీసుకుని వెళ్లి నంది సమీపంలో దీనిని పూడ్చిపెట్టండి.161.అలా చేస్తే మీ నుండి బంధవిముక్తి ఋణవిముక్తి కలిగి, దానికి సద్గతి కలుగుతుంది.162. గతజన్మలో బాకీపడ్డ ఋణాన్ని తీర్చుకోవటానికి ఈ రూపంలో జన్మించి, ఇంతవరకు మీ బంధనంలో ఉంది' అని సాయి మహారాజు చెప్పారు. 163.అప్పుడు పులిని దాని యజమానులు లేవనెత్తి శివాలయం వద్దకు తీసుకుని వెళ్లి నందికి వెనుక గోతిలో పూడ్చిపెట్టారు. 164.ఎటువంటి విచిత్రమైన చమత్కారం.పులి వెంటనే ఎలా చచ్చిపోయింది? ఇంత మాత్రమే జరిగి ఉంటే ఈ

విషయాన్ని మరచిపోయే వారమే. 165. కాని దీనికి ఏడవరోజునే బాబా శరీరాన్ని ధరణిపై విడవటం వలన ఈ విషయం మాటిమాటికీ మనసులో మెదులుతుంటుంది. 166. తరువాతి అధ్యాయం ఇంతకంటే మధురమైనది. బాబా తమ గురువు యొక్క లీలలను వర్ణించారు. వారు గోఖలేబాయిని అనుగ్రహించి ఆమె కోరికను తీర్చారు 167. హేమాడ్ సాయినాథుని శరణు జొచ్చుతున్నాడు. గురువు ద్వారా బావిలో తలక్రిందులుగా వ్రేలాడదీయబడి బాబా గురువు అనుగ్రహాన్ని ఎలా సంపాదించారో శ్రవణం చేయండి. 168. స్వస్తి శ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్తహేమాడ్ పంత్ విరచితమూ, అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో దర్శన మహిమ అను ముప్పది ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత - 32 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయంలో విజయానందు మరణించటం- బాలకరాం, సాయి సన్నిధిలో ఆత్మానందంలో లీనమవటం-.1.తాత్యాసాహేబు నూల్కరు మరియు భక్తశ్రేష్ముడైన మేఘా ఉభయులు సాయి సమక్షంలో శరీరాలను వదలటం చెప్పబడింది.2.ఇంతకంటె గొప్ప చమత్కారం - వ్యాఘ్రం వంటి క్రూర మృగం కూడా మరణించిన విధానాన్ని శ్రోతలు సవిస్తరంగా విన్నారు.3. ఇప్పుడు ప్రస్తుత అధ్యాయంలో, సాయిబాబా స్వయంగా వర్ణించిన మధుర వృత్తాంతాన్ని చెప్పుతాను. ఇది శ్రోతలకు అత్యంత హితాన్ని కలిగించేది.4. ఒకసారి బాబా అరణ్యంలో ఉండగా అనుకోకుండా గురువు దర్శనమైంది. గురువు యొక్క అద్భుత చర్య ఎటువంటిదో శ్రద్ధగా వినండి.5.ఈ కథలోని విశేషాన్ని పామరుణ్ణైన నేను ఎంతని వర్ణించగలను? దీనిని సాయి స్వయంగా తమ నోటితో చెప్పడం వలన ఇది శ్రద్ధాభక్తులను ముక్తినీ ప్రసాదిస్తుంది.6.ఒక స్త్రీ బాబాను దర్శనం చేసుకుని అక్కడ మూడురోజులు ఉపవాసవ్రతంతో ఉండాలని మనసులో అనుకుంది.7.కాని బాబా ఆమెకు మంచి అవకాశాన్ని కల్పించి,ఎలా ఆమె నిశ్చయాన్ని మార్చి ఆమెచే కమ్మని బొబ్బట్లు చేయించారు?8.బొబ్బట్లను కేవలం చేయించడమే కాదు ఆమె యథేచ్ఛగా తినేలా చేశారు. పరుల సేవలో శరీరాన్ని శ్రమింప చేసి జన్మను సార్థకం చేసుకోవటం ఆమెకు శ్రేయస్కరం. 9.ఉపవాసవ్రతం వలన కలిగే మేలుకంటె ఇతరులకు సాయపడటం పరమ కళ్యాణప్రదమని ఆమె ఎన్నటికీ

మరచిపోకుండా బాగా తెలియచేశారు.10.అట్లే పరమార్థంపై శ్రద్ధగలవారు ఎలా దృఢమైన అభ్యాసం చేయాలి? శాశ్వతమైన వస్తువును సాధించటానికి ఎలా కఠినమైన సాహసం చేయాలి?11.ఈ విషయంపైన కథానుక్రమం అమృతం కంటె పరమమధురం. ఇది శ్రోతలకు భక్తి ప్రేమలను కలిగించి దుఃఖాన్ని తొలగిస్తుంది.12.ఇప్పుడు శ్రవణార్థుల కోరికను తీర్చి వక్తకు శ్రోతలకు ఆత్మానందాన్ని కలిగించే మధురమైన కథ.13.పామరుణ్ణి మూర్ఖుణ్ణి అయిన నాచే బాబా అలౌకికము ప్రేమ భరితమైన కథలను చెప్పిస్తున్నారు. వీనిని వ్రాస్తుంటే కూడా అడుగడుగునా ఉత్సాహం. 14.గంగా దర్శనంతో పాపం, చంద్రుని దర్శనంతో తాపం తొలగిపోయేలా సాయిబాబా ముఖం నుండి వెలువడిన వచనాలు పాపతాపాలను తొలగించేవి.15.ఇప్పుడు గురుదర్శనాన్ని గురించి సాయిబాబా ముఖతః వెలువడిన వచనాలను శ్రోతలైన మీరు శ్రద్ధగా వినండి.16.వేదవేదాంగ అధ్యయనాలు శ్రుతి శాస్త్ర పారాయణాలు చేసినా గురుకృపలేకుండా జ్ఞానప్రాప్తి లేదు. ఇతర సాధనాలన్నీ వృథాశ్రమ మాత్రమే.17. అవ్యక్తాది స్థావరాలలో అతి విశాలమైన ప్రపంచ వృక్షం, జనన మరణ శోకాకులితం. కనిపించేవన్నీ నాశవంతమైనవి.18.ఛేదింపబడేది, నశించిపోయేది కనుక దీనిని వృక్షమని అంటారు. ఈ అవ్యక్త ప్రపంచం, స్థావరాల రూపంలో ప్రకటమైంది. కనుకనే ప్రపంచాన్ని వృక్షంతో పోల్చుతారు.19.దృశ్యరూపంలో కనిపించేది, నాశవంతమైన ఈ ప్రపంచవృక్షం యొక్క వ్రేళ్లు పైకి ఉంటాయి. దాని శాఖలు విస్తారంగా వ్యాపించి ఎవరికైనా కాస్తకూడా ఊహకు అందకుండా ఉంటాయి. 20.క్షణం క్షణం శాఖలు వ్యాపించుకుని పోతాయి. ఇది దూరం నుండి రమణీయంగా కనిపిస్తుంది. కాని ఆలింగనం చేసుకుంటే శరీరమంతా ముళ్లు గ్రుచ్చుకుంటాయి. 21.అరటి చెట్టు స్తంభం వలె ఇది సత్తువ లేనిది. నిస్సారమైనది. ఎండమావులవలె, గంధర్వనగరంవలె ఆశాలాలసలో బంధించే ఈ వృక్షం అందంగా కనిపిస్తుంది. 22. ఇది

అజ్ఞానంవలన కలిగే కోరికల కారణంగా చేసే కర్మలనుండి ఉద్భవించినది. అవ్యక్తబీజంలోనుండి పుట్టినది. అస్తిత్వం లేకుండానే ప్రతిక్షణం వేరువేరు స్వభావాలతో స్వతహా భాసిస్తూ ఉంది.23. అజ్ఞాన కారణంగా జన్మించినది కనుక ఇది అనర్థాత్మకం. ఆశాతృష్ణాది నీటితో చుట్టబడి ఉంటుంది.24. ధనధాన్యాలు, భార్యాబిడ్డలు, పరివారం వగైరా శరీర బుద్ధి కారణంగానే.25. లింగ భేదాలతో అసంఖ్యాకమైన ప్రాణులు ఈ వృక్షం యొక్క భుజాలు. కర్మ వాసనాలు మొదలగు వ్రేళ్లతోనున్న ఈ వృక్షం బోలు.26. శ్రుతి స్మృత్యాది పత్రాలతో నిండి శబ్దస్పర్శాది చిగుళ్లతో నిగనిగలాడుతూ యజ్ఞదానాది క్రియాకుసుమాలతో శోభిస్తూ సుఖదుఃఖాలనే ద్వంద్వ రసాలతో నిండి ఉంది.27. దీని ఫలాలకు అంతు అంటూ లేదు. ఆన్నింటికీ ఇదే జీవనాధారం. భూఃర్భువాది సకల లోకాలు దీనికంటె వేరుగాలేవు. 28. ఒకప్పుడు నృత్యాలు గీతాలు వాద్యాలు, ఒకప్పుడు నవ్వు లేదా ఏడుపులతో ఆటలతో, ఈ సనాతన అశ్వత్థ వృక్షం ఎప్పుడూ అధోవదనంతో ఉంటుంది.29. ఇది మాయోపాధి బ్రహ్మలో ఆవిర్భవించింది. ఇది వైరాగ్య శస్త్రంతో నశిస్తుంది. సద్భావం దీనికి మూలాధారం. దీని స్వభావం ప్రకాశించటం అని తెలుసుకోవాలి.30. బ్రహ్మ సత్యం. అంతటికీ ఆధారం. ఈ జగత్తు స్వప్నం వలె మిథ్య. దీనికి ఆది అంతం అని నిర్ధారించలేనప్పుడు మధ్య మాత్రం ఎలా ఉండగలదు?31. విరాగులు దేని కొఅకు పరిశ్రమ చేస్తారో, సాధువులు దేని యందు ఎల్లప్పుడూ అనురక్తులై ఉంటారో, ముముక్షువులు దేనిని అపేక్షిస్తారో దేనిని సాధకులు అభిలషిస్తారో. 32. అట్టి పరమాత్మ తత్వాన్ని తెలుసుకోదలచినవారు సత్పురుషులను శరణుజొచ్చి, కుతర్కాలన్నింటినీ విడిచి వారు చెప్పినది వినాలి. 33. మనసులోని ఆలోచనలన్నిటిని కట్టిపెట్టి, బుద్ధి చాతుర్యాన్ని వదలి, మమకారాలను విడిచి నిస్సంగులై చక్కగా గురుచరణాలను ధ్యానించాలి.34. కుతర్కాలను పారద్రోలాలి. లేకపోతే అవి మార్గంలో అడ్డు తగులుతాయి.

అహంకారాన్ని అరికాలి క్రింద నలిపివేస్తేనే భవాన్ని దాటి తీరానికి చేరుకొగలరు.35.ఈ విషయంలో బాబా స్వయంగా చెప్పిన ఒక మధురమైన కథను వినండి. గురువచనామృతాన్ని సేవిస్తే పరమానందాన్ని పొందగలరు. 36.'ఒకసారి మేం నలుగురం, పురాణాలను గ్రంథాలను చదివి జ్ఞాన సంపన్నులై పోయామని తలచి బ్రహ్మ నిరూపణ చేయసాగాం.37. 'ఉద్ధరేదాత్మా నాత్మానాం' ఈ గీతావచనం ప్రకారం పరావలంబనం ఎప్పుడూ పనికిరాదు.అని ఒకరు ప్రవచించారు.38. 'మనసును స్వాధీనంలో ఉంచుకున్న వాడే ధన్యుడు. సంకల్ప వికల్పాలు లేకుండా ఉండాలి. జగత్తులో నేను తప్ప వేరే ఏదీ లేదు' అని ఒకరు జవాబు చెప్పారు.39.'వికారాలతో మార్పులు చెందేది అనిత్యం,నిర్వికారం. ఒక్కటి మాత్రమే నిత్యం. అందుషలన నిరంతరం, నిత్యానిత్య వస్తువు గూర్చి ఆలోచించాలి.' అని మూడవ వాడు అన్నాడు.40. నాలుగవ వానికి పుస్తక జ్ఞానంపై నమ్మకం లేదు. అతని ఉద్దేశం 'శాస్త్రాలు చెప్పిన విధులను ఆచరించాలి. పంచప్రాణాలను, కాయావాచా గురుచరణాలకు సమర్పించాలి. 41. గురువే పరమాత్మ. చరాచరాలన్నింటిలో లోపలా బయటా గురువు నిండి ఉన్నారని నిర్ధారణగా తెలుసుకోవటానికి అపారమైన నిష్ఠ ఉండటం ఆవశ్యకం. 42. అనాగమజ్ఞులకు, పుస్తకపండితులకు వాదానికి కాలిదువ్వే తార్కికులకు, సంశయాత్ములకు సంపూర్ణజ్ఞానం కలలో కూడా లభించదు. నిర్మలమైన భక్తి అవసరం. 43.ఇలా మేం నలుగురం ప్రబుద్ధులం, బ్రహ్మను పరిశోధన చేయాలని బయలుదేరాం. స్వతంత్రంగా నిశ్చింత మనసుతో స్వయం బుద్ధితో బ్రహ్మమును తెలుసుకోవాలి.44.అని ముగ్గురి అభిప్రాయం. అలా అడవిలో స్వేచ్ఛగా విహరిస్తుంచే మార్గంలో ఒక వంజరి జాతివాడు కలిసి.45.'ఎండబాగా తీక్షణంగా ఉంది. మీ ప్రయాణం ఎంతవరకు? ఎందునిమిత్తం?' అని ప్రశ్నించాడు. అరణ్యంలో వెదకటానికి అని జవాబు చెప్పాం.46.దేనిని వెదకటానికి అని ఆ వంజరివాడు

అడగగా రహస్యంగా ఉన్నదాన్ని తెలియచేయటం మంచిది కాదు అని మేం జవాబు ఇచ్చాం. 47. మా ఆతురతను, మా తిరగటాన్ని గమనించి అతని హృదయం ద్రవించింది. 'ఈ అడవి దట్టమైనది, ప్రవేశించలేనిది. దారి తెలియకుండా మీ ఇష్టం వచ్చినట్లు తిరగకండి. 48.అరణ్యంలో తిరగటానికి మీ వెంట ఎవరినైనా మార్గదర్శకుణ్ణి తీసుకుని వెళ్లండి. మిట్ట మధ్యాహ్నం ఈ సాహసం ఈ శ్రమ ఎందుకోసం? 49.రహస్యమైన విషయమైతే చెప్పకండి. కాని కాసేపు కూర్చుని కాస్త రొట్టెతిని నీరు త్రాగిన తర్వాత వెళ్లండి. ఓర్పును వహించండి' అని చెప్పాడు. 50.ఎంతో దయతో చెప్పినా మేము అతని మాటను త్రోసి పుచ్చి అట్లే ముందుకు బయలుదేరాం. మార్గంలో బాగా అలసి పోయాం. 51.మేమందరం బుద్ధిమంతులం, మా మార్గాన్ని మేమే వెదుక్కోగలం, మార్గదర్శకుడు ఏమవసరం అని మా అహంభావం. 52.కాని అతి విస్తారమైన ఆ అరణ్యంలో దట్టంగా వృక్షాలు గడ్డి, సూర్యకిరణాలు కూడా ప్రవేశించ లేనప్పుడు అక్కడ దారి ఎలా తెలుస్తుంది? 53. ఏదిక్కునుండి వచ్చామో ఎటు వెళ్లాలో దారి మరచిపోయి, వృథాగా అటూ ఇటూ తిరిగాం. కాని దైవవశాత్తు బయలుదేరిన చోటికి చేరుకున్నాం. 54.దైవమే పంపినట్లు అనిపించింది. మునుపటి వంజరివాడు మరల కలిసి 'మీరు దారి తప్పినట్లున్నారు. బుద్ధి చాతుర్యం ఒక్కొక్కప్పుడు పనికి రాదు. 55.చిన్న పనైనా పెద్దదైనా దారి చూపించే వారెవరైనా ఉండాలి. కడుపు ఖాళీగా ఉంటే మీ పరిశోధన సాగదు. అట్టి స్థితిలో బుద్ధి భ్రమిస్తుంది. 56.పరమేశ్వరుని ఆజ్ఞ లేకుండా మార్గంలో ఎవరూ కలవరు. వడ్డించిన భోజనాన్ని తిరస్కరించకండి. అన్నం పళ్లాన్ని త్రోసి పుచ్చకండి. 57.ఎవరైనా రొట్టెలను ఇచ్చి తినమని చెప్పితే వారి మాట శుభశకునమని కార్యం నిర్విఘ్నంగా జరుగుతుందని గ్రహించాలి. 58.ఇప్పుడు ఈ అల్పాహారాన్ని తీసుకోండి. కొంచెం ధైర్యం వహించండి' అని చెప్పాడు. కాని అతని మంచి

మాటలు రుచించక మరల నిరాహారంగానే బయలుదేరాం.59.పరిశోధన పూర్తికాకుండా అన్నాన్ని సేవించం అన్న మొండి పట్టుదలతో ముగ్గురు నష్టపోయారు. 60.నాకు ఆకలిగా ఉంది. దాహంతో గొంతు ఎండి పోయింది. వంజరివాని ప్రేమ అలౌకికం. నిస్వార్థమైన అతని ప్రేమ నాకు నచ్చించి.61.మేము బాగా చదువుకున్న పండితులం. కాని మాకు దయాదాక్షిణ్యాలు లేవు. ఎంగిలి చేత్తో కాకిని తరిమికొట్టం.62.కాని ఏ చదువు ఏ యోగ్యతాలేనివాడు నిమ్నజాతి వంజరుడు హృదయంలోని నిండుప్రేమతో రొట్టెకూర తినమని చెప్పుతున్నాడు.63.ఇలా ఏ లాభాన్ని ఆశించని నిస్వార్థ ప్రేమను చూపించేవాడే నిజమైన జ్ఞాని. అతని మాటను గౌరవించడం బ్రహ్మవిద్యను తెలుసుకోవటానికి ఉపక్రమం అని అనిపించింది.64.ఆదరపూర్వకంగా అతడు ఇచ్చిన రొట్టె ముక్కను తిని నీరు త్రాగాను. అంతే ఏం ఆశ్చర్యం.65.అకస్మాత్తుగా గురుమహారాజు ప్రత్యక్షమయ్యారు. వాదోపవాదాలు దేని గురించి అని అడగగా జరిగిన వృత్తాంతమంతా అతనికి మనవి చేశాను.66.'నా వెంట వస్తావా నీవు వెదుకుతున్న దానిని త్వరగా చూపెడతాను.కాని నా మాటలయందు విశ్వాసముంచి నేను చెప్పినట్లు ప్రవర్తించేవారి కోరిక ఫలిస్తుంది.' అని చెప్పాడు.67.మిగతావారు ఆ మాటలను ఒప్పుకోలేదు. వారు అతని మాట వినకుండా వెళ్లిపోయారు. కాని నేను వారి ఆజ్ఞను శిరసావహించాను. తరువాత గురువుగారు నన్ను స్వీకరించారు.68.ఒక బావి వద్దకు తీసుకుని వెళ్లి నా రెండు కాళ్లకు త్రాడు కట్టి కాళ్లపైన తలక్రింద ఉండేలా నీటి పైకి వదిలారు.69.చేతులు నీటికి అందకుండా, నీరు ముఖంలోనికి పోకుండా చక్కగా బావిలోకి వ్రేలాడదీశారు. 70. త్రాటి రెండవ కొనను బావిప్రక్కనున్న ఒక చెట్టుకు బాగా కట్టి గురువుగారు చక్కగా సంశయం లేకుండా ఎక్కడికి వెళ్లారో ఎవరికీ తెలియదు.71.పది పండ్రెండు ఘటికలు గడిచాక గురువుగారు మరల వచ్చారు. చరచరాన్ను బయటకులాగి

'బాగున్నావా?' అని ప్రశ్నించారు. 72.'చాలా ఆనందంగా ఉన్నాను. నేను అనుభవించిన అపారసుఖాన్ని పామరుణ్ణైన నేను ఎలా వర్ణించను' అని జవాబిచ్చాను.73.నా మాటలను విని గురువుగారు ప్రసన్నులయ్యారు. తమ హస్తాలతో నా శరీరాన్ని నిమిరి, నన్ను వారి వద్ద అట్టిపెట్టుకున్నారు.74.ఇదంతా చెప్పుతుంటే నా హృదయం ప్రేమతో ఉప్పొంగి పోతుంది. తరువాత గురుమహారాజు నన్ను పాఠశాలకు తీసుకుని వెళ్లారు. పక్షి తన పిల్లలను రెక్కలలో ఒదిగి పెట్టుకునే రీతిగా గురువు నాపై ప్రేమను చూపారు.75.గురువుగారి ఆ పాఠశాల ఎంతో రమ్యమైనది. అక్కడ జననీ జనకుల వాత్సల్యం తొలగిపోయింది.మాయ మోహం మమకారాది శృంఖలాలు విడిపోయాయి. అవలీలగా ముక్తిని పొందాను.76.అవాంఛనీయమైన బంధనాలు విడిపోయాయి. పరమార్థంలో ప్రతిబంధకమైన ప్రవృత్తి తొలగిపోయింది. గురువు కంఠాన్ని వెనువేసుకుని వారి కళ్లలో ఉండిపోవాలని అనిపించేది. 77.వారి ప్రతిబింబంలేని కళ్లు వట్టి మాంసపు గోళాలు. ఆ కళ్లకంటే అంధుణ్ణి ఆయిపోయినా బాగుణ్ణు ఆని అనిపించేది. నా పాఠశాల అటువంటిది.78.అందులో అడుగు పెట్టాక వెనుకకు మరలిపోయే దౌర్భాగ్యులు ఎవరుంటారు? నా ఇల్లు వాకిలి తల్లితండ్రి నా సర్వం గురువే అయ్యారు.79.వారిని ధ్యానించటానికి ఇతర ఇంద్రియాలతో సహా మనసు తన స్థానాన్ని విడచి వచ్చి కళ్లలోనే ఉండిపోయింది.80.గురువు యొక్క ధ్యానమే దృష్టి యొక్క ఏకమాత్ర లక్ష్యం. ఇతరులంతా గురువు సమానంగాను గురువు తప్ప మరెవరూ లేరనే భావాన్ని అనన్య అవధానమని అంటారు.81.ఇలా గురు స్వరూపాన్ని ధ్యానం చేస్తే మనసు బుద్ధి కుంఠితమవుతాయి.కనుక నిశ్శబ్దంగా మౌనంగా గురువుకు వందనం చేయాలి.82.జ్ఞానం కోసం గురువును ఆశ్రయించనవసరం లేదు. శూన్యమైన ఉపదేశాల కోసం దక్షిణను ఇచ్చి డబ్బును పోగొట్టుకుని, ఫలితంగా పశ్చాత్తాపాన్ని పడటమే అవుతుంది. 83.నిగూఢమైన గుప్త జ్ఞానం ఉన్నట్లు

ప్రగల్భాలు పలుకుతూ తమ పరిశుద్ధాచరణను గూర్చి చాటుకునేవారు. చిన్నతనం నుండి కూట నాటకాలు ఆడినవారు శిష్యునికి ఏం ఉపదేశిస్తారు? 84. పైకి అన్ని విషయాలలోనూ మడి కట్టుకున్నట్లు అలిప్తంగా కనిపించటం, మనసులో మాత్రం అలజడి అశాంతి. అనుభవజ్ఞానం అసలే లేని గురువు యొక్క పాఠశాల పనికిరానిది. 85. కేవలం పుస్తక జ్ఞానం పుష్కలంగా ఉండి, బ్రహ్మజ్ఞానంలో అనుభవం లేని గురువు, స్వయంగా తన నోటితో తన గొప్పతనాన్ని చెప్పుకునే గురువు వద్ద శిష్యులకు ఏం మంచి లభిస్తుంది? 86. గురువు చెప్పిన వచనాలు హృదయంలో చొచ్చుకుని పోక అంతరంగంలో ఏ అనుభవమూ కలగచేయని ఆ గురువు మాటలు వట్టి ప్రేలాపనయే కాని ఆ గురుత్వం ఎందుకు పనికి వస్తుంది? 87. మా గురువు నన్ను బాగా సేవలో నియమించి నాకు జ్ఞాననిధిని చూపించారు. దానిని వెతుక్కునే అవసరం కలగలేదు. అట్లే ఆ బోధను అర్థం చేసుకోవటానికి ఏ కాస్త శ్రమా పడనవసరం లేకుండా పోయింది. 88. అర్థాలన్నీ వాటంతట అవే స్వయంగా ప్రకటమై అప్రయాసంగా జ్ఞానం చేతికందింది. గురుకృప కారణంగా శోధన అక్కడి కక్కడే ఆగిపోయింది. 89. తలక్రింద కాళ్లుపైన ఉంచి తలక్రిందులుగా ప్రేలాడ దీసినందువలన నాకు ఎలా ఆనందం కలిగిందో సమర్థులైన గురువుకే తెలుసు. 90. సత్పురుషుల విధానం తలక్రిందులుగా ఉంటుంది. దీనిని అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి. ఇక్కడ గురువు యందు నిష్ఠయే ప్రమాణం. గురుకృప ఒక్కటే సాధనం. 91. కర్మఠులకు విధినిషేధాలుంటే, జ్ఞానులకు జ్ఞానాభిమానం, యోగులకు దంభ ప్రదర్శన శ్రమ. ఇక్కడ శ్రద్ధా విశ్వాసాలు తప్ప ఏవీ సాగవు. 92. పండితుల కళ్లు గర్వాంధకారంతో నిండి ఉంటాయి. వారు అభిమానం మూర్తీభవించిన ప్రత్యక్షరూపాలు. జ్ఞానులు వానిని చూచి వారి సహవాసం నచ్చక పారిపోతారు. 93. జ్ఞాని 'నా కంటె వేరే మరో దేవుడు ఎవరున్నారు. నేను జ్ఞాన సంపన్నుణ్ణి. నేనే పరిపూర్ణ చిద్ఘనుణ్ణి' అని అంటాడు. 94. భక్తుడు తన

భక్తి భావంలో ఉంటాడు. జ్ఞాన గరిమను చాటుకోడు. తనువు మనసు ధనం స్వామి సేవకే వినియోగిస్తూ తన సర్వస్వం స్వామికే అర్పిస్తాడు.95.ఇది నా ప్రతాపం, ఇది నా చాతుర్యం, ఇది నా సామర్థ్యం, ఇది నా బుద్ధి వైభవం యొక్క ప్రభావం అన్న అహంభావం అతనికి ఉండవు.96.ఏది జరిగినా దైవమే చేయించాడని క్రిందకు దించినా పైకి ఎక్కించినా దేవుడేనని, పోట్లాడినా పోట్లాడించినా అతడేనని, చేసేవాడు చేయించేవాడు అతడు ఒక్కడేనని,97.కర్తృత్వం భగవంతునిపై వేసి, స్వయంగా అత్యంత నమ్రతతో ఉంటాడు.భక్తులు ఎప్పుడూ భగవంతునిపై ఆధారపడి ఉంటారు.వారికి స్వాతంత్ర్యం ఉండదు.98.మన నలుగురు ప్రబుద్ధులు దేనిని వెదకాలని బయలుదేరారో ఇంతవరకు తెలియకుండానే ఉంది కదూ! ఇప్పుడు ఆ విషయాన్ని వినండి.99.ఈ ఘనాపాటి కర్మఠులందఱూ పాండిత్యాన్ని, పుస్తకాలలోని శబ్దజ్ఞానాన్ని గర్వంగా చాటుకుంటూ చర్చించుకుంటుండగా భగవంతుని విషయం వచ్చింది. 100.తమ జ్ఞానంతో భగవంతుడు ఎక్కడుంటాడు? ఎలా ఉంటాడు? ఏ ఉపాయాలతో ఏ విధంగా మనకు త్వరగా లభిస్తాడు అని వారి ఆలోచన.101.ఆ ప్రబుద్ధులలో సాయి ఒకరు. వీరు మూర్తీభవించిన వివేక వైరాగ్యాల మూర్తి. వారు స్వయం పరబ్రహ్మ అయి ఉండీ మరి ఎందుకు అలా అవివేకంగా ప్రవర్తించారు.102. అని శ్రోతలకు సందేహం కలుగుతుంది.ఇది కేవలం లోక వ్యవహారం కొఱకు. భక్తులను ఉద్ధరించే సాయి సమర్థులు హీనత్వాన్ని ఎందుకు ఆపాదించుకుంటారు?103.తాము స్వయం అవతార పురుషులై ఉండి పంజరివానిని గౌరవించి, అతని ఆహారాన్ని స్వీకరించి, అన్నం బ్రహ్మమయని తెలియజేసి దాని మహిమను గానం చేశారు.104.అట్లే ఆహారాన్ని అవమానం చేసినవారికి ఎలా నష్టం వాటిల్లుతుంది అని ఈ ప్రబుద్ధుల కథ ద్వారా తెలియచేసి, గురువు లేకుండా ఎవరూ జ్ఞాని కారు అని చెప్పారు.105.తల్లి తండ్రి ఆచార్యుల

బోధలేకుండా ధర్మం జ్ఞానం లభించటం అశక్యం. అవి కూడా అధ్యయనంపై ఆధారపడి ఉంటాయి. అనుష్ఠానం లేకపోతే అంతా వ్యర్థం. 106.తల్లితండ్రి గురువుల ఆశీర్వచాలను సంపాదించుకోవాలన్న శ్రుతివచనం ప్రసిద్ధమైనది .107.ఈ ముగ్గురి మాట పాటించాలి. లేదా వేద పఠనం యజ్ఞాలు దానధర్మాలు చేయాలి. ఇవి జననమరణాలను తప్పించుకునే గొప్ప సాధనాలు. 108.ఇవన్నీ చిత్తశుద్ధికి సాధనాలు. ఇవి లేకుండా ఆత్మవస్తువు చేతికందదు. ఆత్మను తెలుసుకోలేని జీవితం వ్యర్థం. 109.శరీరం, ఇంద్రియాలు, మనసు మరియు బుద్ధి కూడా ఆత్మను తెలుసుకోలేవు. ఇటువంటి నిగూఢమైన ఆత్మస్వరూపాన్ని గురువు అనుగ్రహంతో దర్శించుకోవచ్చును.110. ప్రత్యక్ష ప్రమాణం,అనుమాన ప్రమాణం అన్న రెండు ప్రమాణాలతో తెలుసుకోలేని ఆత్మను,గురువు తప్ప సులువుగా కరతలామలకంలా ఎవరు చూపించగలరు? 111.ధర్మం, అర్థం మూడవదైన కామం శ్రమపడితే ప్రాప్తిస్తాయి. కాని నాలుగవదైన పరమపురుషార్థం గురువు లేకుండా వృథా శ్రమయే.112.ఈ శిరిడీ సత్పురుషుని దర్బారుకు జ్యోతిషులు వచ్చి బాబాకు వందనం చేసి, మానవ శరీరం యొక్క భవిష్యత్తును గొప్పవారికి గొప్పగా చెప్తారు.113.ధనధాన్యాది వైభవాలను అనుభవించే రాజులు, మరియు జోగులు బైరాగులు దర్శనాభిలాషతో వస్తారు.114.జపం చేసేవారు, తపస్సు చేసేవారు, వ్రతంలో ఉన్నవారు, సన్యాసులూ, యాత్రికులు, ఆ ఊరివారు, గాయకులు, నర్తకులు పరివార సమేతంగా సాయి దర్శనానికి శిరిడీకి వస్తారు 115.ఈ సాయి దర్బారుకు హరిజనులు కూడా వచ్చి జోహారులు చేస్తారు. వీరే నిజమైన తల్లి తండ్రి, వీరు జనన మరణాలను తప్పిస్తారు అని అంటారు. 116.మెడలో ఆత్మలింగాన్ని వేసుకుని,నొసట విభూతిని దిద్దుకుని, ధాన్యపు గింజల భిక్షపై దృష్టి ఉంచే జంగము వాని తమాషావేషాన్ని చూడాలి.117.లోపల కపటం ఉన్నా పైకి మధురంగా మాట్లాడే గారడివారు వస్తారు.దేవిని ఆరాధించే

గొంధళి ఉపాసిన చేసేవారు వస్తారు. భవానీ భక్తులు బాబా వద్ద ప్రీతిగా భిక్షను కోరుకుంటారు.118. గ్రుడ్డివారు, కుంటివారు, చెవిటివారు, గోసావి, జోగులు, నానక్ అనుయాయులు. భట్రాజులు, దివిటీలు పట్టుకునే వారు సాయిసమర్థుని యందు అత్యంత భక్తితో పరిగెత్తుకొని వస్తారు. 119. ఢక్కాలు ఢమరుకాలు వాయించుకుంటూ సోది చెప్పేవారు వస్తారు. కోలాటం వారు కూడా వచ్చి కోలాటం ఆడతారు. అట్లే ప్రేమమయుడైన వంజరివాడు ఆ సమయానికి వచ్చాడు.120. సాయి యొక్క అవతారం ధన్యం. వారు మూర్తీభవించిన వైరాగ్యం. వారికి విషయాలయందు ఆసక్తిలేదు. వారు నిస్సంగులు నిస్వార్థులు. భక్తులపై వారికి అసమానమైన ప్రేమ.121. ఇప్పుడు పూర్వానుసంధానం – మరల ముఖ్య కథను ఆరంభిస్తాను. శ్రోతలు సావధానులై వినండి.122. బాబా స్వయంగా ఉపవాసం ఉండేవారు కాదు. ఎవరినీ కూడా ఉండనిచ్చేవారు కాదు. ఉపవాసం ఉన్నవారి మనసు నిశ్చలంగా ఉండదు. అలాంటి వారు పరమార్థాన్ని ఎలా సాధించగలరు?123. ఖాళీ కడుపుతో భగవంతుడు లభించడు. కనుక ముందుగా ఆత్మను సంతుష్టపరచాలి అన్న ఈ ఉపదేశానికి సంబంధించిన మరొక కథను శ్రోతలకు మనవిచేస్తాను.124. మంచి మిట్ట మధ్యాహ్న సమయంలో ఆకలితో ఉన్నప్పుడు, క్రిందనేల తలక్రిందులయినప్పుడు అన్న బ్రహ్మకు ఉన్న విశిష్టస్థానం మనోవృత్తికి తెలుస్తుంది.125. అటువంటి దుర్భరమైన సమయంలో అన్నం ముద్దను నోటికి అందించకపోతే, ఇంద్రియాలు నీరసించిపోయి తమతమ పనులను మరచిపోతాయి. 126. పొట్టలో అన్నం తడి లేకపోతే, భగవంతుని ఏ కళ్లతో చూడగలం? దేవుని మహిమను ఏ వాక్కుతో వర్ణించగలం? ఏ చెవులతో వినగలం?127. సారాంశం – సకలేంద్రియాలూ శక్తివంతంగా ఉన్నప్పుడే భగవంతుని భక్తితో ఉపాసించగలం. ఆహారం లేకుండా శరీరం నీరసించిపోతుందే తప్ప పరమార్థం వైపు అడుగు సాగదు. 128. అతిగా భోజనం చేయటం

కూడా మంచిది కాదు. వాస్తవానికి మితభోజనం సుఖకరమైనది. ఉపవాసం అత్యంతభయంకరమైనది.అది ఎప్పుడూ బాధను కలిగిస్తుంది.129.ఒకసారి ఒక స్త్రీ, కేల్కరుకు ఉత్తరాన్ని తీసుకుని పరమోత్సాహంతో సాయి యొక్క దర్శనానికి శిరిడీకి వచ్చింది.130.సాయి మహారాజు చరణాల వద్ద మూడురోజులు ఉపవాస వ్రతంతో కూర్చోవాలని ఆమె నిశ్చయించుకుంది కాని ఆమె నిర్ణయం ఫలించలేదు. 131.బాబా నిత్యం ఆచరించే పద్ధతులను బట్టి పరమార్థాన్ని సాధించాలనుకునేవారు ముందు నడుముకు రొట్టెను మూటకట్టుకోవాలి. కాని ఆ స్త్రీ యొక్క నిర్ణయం చానికి వ్యతిరేకం.132. పరమాత్మసాక్షాత్కారాన్ని పొందగోరేవారు ముందుగా ఆహారాన్ని తీసుకోవాలి. జీవునికి శాంతిలేకపోతే దేవుని ఎలా తెలుసుకోగలం?. 133.ఆకలి కడుపుతో భగవంతుని ప్రాప్తి కల్పాంతంలో కూడా సంభవం కాదు. ఉపవాస తపవాసాలనే కష్టాలు సాయి వద్ద సాగవు. 134.అంతర్జ్ఞాని యైన సాయిమహారాజు ముందురోజే ఆ స్త్రీ రాక విషయం తెలుసుకుని దాదాకేల్కరుతో మాట్లాడారు.135.'ఈ హోలీ పండుగరోజున నా బిడ్డలు ఉపవాసం ఉంటారా? వారిని నేనెలా ఉపవాసం ఉండనిస్తాను? మరి నేనెందుకు ఉన్నాను?'136.సాయిబాబా ముఖం నుండి ఈ మాటలు బయట పడ్డాయోలేదో మరునాడే ఆ స్త్రీ శిరిడీలో ప్రవేశించింది.137. ఈమె ఇంటిపేరు గోఖలే. ఈమె ఉపవాసం చేయాలని నిశ్చయించుకుని వచ్చింది. దాదాకేల్కరు వద్ద తన సామాను మూటను ఉంచి అతనికి ఉత్తరాన్ని ఇచ్చింది. 138.కాశీబాయి కనిట్కరు ఆమెకు ఆప్తబంధువుకాగా,ఆ స్త్రీకి సాయిబాబా దర్శనానికి సదుపాయం కలిగించమని దాదాకు ఉత్తరం వ్రాసింది.139.శిరిడీకి చేరుకున్న వెంటనే ఆ స్త్రీ బాబా దర్శనం చేసుకుని కాసేపు అక్కడ కూర్చుంది. ఆమెకు సాయి బాబా ఉపదేశం మొదలు పెట్టారు. 140.వారికి ఎవరి మనసులో ఏముందో సమస్తం తెలుసు. భూమండలంలో

వారికి తెలియనిదంటూలేదు.141.'అన్నమున్నాద' అన్నం, అన్నం తినేవారు విష్ణుస్వరూపం. ఉపవాస తపవాసాలు, నిరాహారంగా లేక నీరుకూడా త్రాగకుండా ఉండడం ఇవన్నీ వ్యర్థంగా ఎందుకు? 142. ఈ ఉపవాసాలు తపవాసాలు చేసే అవసరం మనకేమిటి? అని బాబా తమంతట తాము ఆమెతో అన్నారు. 143.వెళ్లు! దాదాభట్టు ఇంట్లో చక్కగా బొబ్బట్లు చేయి, వారి పిల్లలకు పెట్టి నీవు కూడా కడుపునిండా తిను.'అని చెప్పారు.144.అసలు విషయం ఆ హోళీ పండుగ రోజున, ఈ స్త్రీ వెళ్లిన సమయాన దాదా భార్య అంటరాకుండా బయట చేరింది.145.అందుచేత ఆమె ఉపవాసవ్రతం కోరిక పోయి వంటచేయటం ఆమె వంతు అయింది. అలా పరమప్రేమతో బాబా ఆజ్ఞను పాలించింది. 146.ఆమె భక్తితో బాబా పాదాలకు వందనం చేసి దాదా ఇంటికి వెళ్లి బొబ్బట్లను చేసి అందరికీ పెట్టి తనూ తిన్నది. 147.ఎంతటి అందమైన కథ. అంతర్గతంగా దీనిలో ఉన్న సారాంశం – గురువు వచనాలను పాలించేవారి ఉద్ధరణకు ఆలస్యంలేదు.148.ఇటువంటిదే మరొక కథ గుర్తుకు వచ్చింది.సాయి సమర్థులు భక్తులకు ప్రేమతో చెప్పినది శ్రోతలు శ్రద్ధగా వినండి.149.పరమార్థాన్ని సంపాదించుకోవాలని ఆశించేవారు బాగా శ్రమపడి దృఢమైన అభ్యాసం చేయాలి. వారికి కొంత సాహసం కూడా ఉండాలి. 150.ఈ సత్కథామృతం అనే సాయి చరణ తీర్థాన్ని,శుభం కలగటానికి ఎల్లప్పుడూ సేవించాలి. వినయంగా సత్పురుషుల చరణాలను ఆశ్రయిస్తే అంతఃకరణం పునీతమవుతుంది. 151.'ఒకసారి నా చిన్నతనంలో నడుము చుట్టూ రుమాలు చుట్టుకుని బ్రతకటానికి ఏదైనా వృత్తి చేయాల ని బయలుదేరాను. 152. నడుస్తూ నడుస్తూ బీడ్‌గాం అనే ఊరు చేరుకుని విశ్రమించాను. మా ఫకీరు యొక్కవింత సంకల్పాన్ని గని నాకు ఆనందం కలిగింది. 153.నాకు అక్కడ జరీపని దొరికింది. విశ్రాంతి లేకుండా నేను బాగా కష్టపడ్డాను. నా శ్రమ పలించింది. మా ఫకీరు పరాక్రమాన్ని చూడండి.

154. నాకంటె ముందుగా ఉన్నవారు తెలివైన వారని పేరుపొందారు.నలుగురు బాలురు పని చేశారు.వారి పనికి కూడా విలువకట్టారు.155.ఒకడు యాభై రూపాయల పనిని చేశాడు. రెండవవాడు వంద. మూడవ వాడు వంద యాభై. నాది అందఱిది కలిపిన దానికంటె రెండింతలు.156.నా చాతుర్యాన్ని చూచి యజమాని చాలా ఆనందించాడు. నాపై ఎక్కువ ప్రేమతో మిగతావారి కంటె అధికంగా నన్ను అభిమానించాడు. 157.నాకు దుస్తులను ఇచ్చాడు. తలకుపాగా శరీరంపై శాలువను ఇచ్చాడు. కాని నేను ఇచ్చిన వానిని అట్లే మూటకట్టి ఉంచాను158.ఎవరైనా ఇచ్చింది ఏం సరిపోతుంది? ఎంత ఇచ్చినా అది ఎప్పుడూ అసంపూర్తిగానే ఉంటుంది. కాని మా ప్రభువు ఇవ్వసాగితే కల్పాంతం వరకూ ముగిసిపోవు.159.ఇవ్వగలిగేది ఒక్క మా ప్రభువే. వారితో సమానంగా ఇతరులు ఎవరు సరితూగగలరు?అపరిమితమైన దానిని పరిమితమని అనటం శోభిస్తుందా ?.160.మా ప్రభువు తీసుకో తీసుకో అని అంటారు.నన్ను ఇవ్వు ఇవ్వు ఆని అడుగుతారు. నా మాటను ఎవరూ లక్ష్య పెట్టరు. ఒక్కమాటైనా సరిగ్గా వినరు.161.మా ప్రభువు నిధి నిండి పొంగిపోతూ ఉంది. ఒక్కడైనా బండి తెచ్చుకోడు. త్రవ్వుకొండి అంటే ఎవరూ త్రవ్వుకోరు. ఎవరూ ప్రయత్నంచేయరు.162.ఆ ధనాన్ని త్రవ్వుకొండి బాగా దోచుకుని బల్లమీద తీసుకుని పొండి. తల్లికి నిజమైన కొడుకువలె నిధిని నింపుకొండి ఆని చెప్పుతాను.163.మా పరిస్థితి ఏమిటి? మట్టిమట్టిలో కలిసిపోతుంది. గాలి గాలిలో కలిసిపోతుంది.ఈ సమయం మరల రాదు.164.మా ఫకీరు కళ, మా భగవంతుని లీల, మా ప్రభువు విలక్షణం.165.నేను కూడా ఎప్పుడో ఎక్కడికో వెళ్లిపోతాను. ఏదో స్థానంలో కూర్చుంటాను. కాని ఈ జీవుడు మాయలో పడి మునకలు వేస్తుంటాడు.166.మాయ చాలా కఠినమైనది.నేను దానిని హీనంగా దీనంగా చేసేశాను. నేను అహర్నిశలూ నా మనుషులను గూర్చి చింతిస్తుంటాను. 167.ఎవరు ఎలా

ఎలా చేసుకుంటే అలా అలా అనుభవిస్తారు. నా మాటలను గుర్తుంచుకునేవారు ఎనలేని సుఖాన్ని పొందుతారు'.168.హేమాడ్ సాయికి శరణు జొచ్చి వేడుకుంటున్నాడు. అపూర్వమైన ఈ కథా వర్ణనను సాయియే స్వయంగా చేస్తుండగా,ఇక నా అహానికి చోటెక్కడిది?169.ఈ కథను మనవిచేసేది వారే. పఠించేవారూ వారే. శ్రవణం చేసేవారుకూడా వారే. వ్రాయించేవారు వ్రాసేవారు కూడా వారే. అర్థాన్ని బోధపరచేవారు కూడా వారే. 170.ఈ కథా భూమిక సాయియే. ఈ కథలోని మాధుర్యం వారే. వారే వక్త వారే శ్రోత. స్వానందభోక్త కూడా వారే. 171. మరి ఇటువంటి శ్రవణమాధుర్యం పరమార్థం సాధించుకోవటానికి తక్కువా? ఈ ఆనందాన్ని ఎల్లప్పుడూ అనుభవించే భక్తులు భాగ్యవంతులు.172.ఇక తరువాతి అధ్యాయంలోని సారాంశం – అపారమైన సాయి యొక్క విభూతి మహిమను సజ్జనులైన శ్రోతలు శ్రద్ధగా వినండి అని వేడుకుంటున్నాను.173.సాయి సమర్థులకు దయకలిగి అపూర్వమైన తమ సచ్చరిత కథను రసభరితంగా, వారే నాచే చెప్పించారని హేమాడ్ వినయంగా విన్నవించుకుంటున్నాడు. 174. స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమూ, భక్తహేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో గురు మహిమా వర్ణనం అను ముప్పది రెండవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 33 వ అధ్యాయం

శ్రీ గణేశాయనమః; శ్రీ సరస్వత్యైనమః ; శ్రీ గురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః;
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఇప్పుడు సాధు సజ్జనులకు వందనం చేస్తున్నాను. వారి కృపావలోకనం, పాతక పర్వతాలను దహించి తక్షణం కలిమలాన్ని క్షాళనం చేస్తుంది. 1. అట్టివారి ఉపకారాల రాసి జన్మజన్మలకు తీరదు. వారి మామూలు మాటలు హితోపదేశాలవలె పరమశాశ్వతమైన సుఖాలను కలగ చేస్తాయి. 2. వారి మనసులో ఇదినాది అది ఇతరులది అన్న భావం ఉండదు. ప్రాపంచిక భేదభావాల ఆలోచనలు వారి మనసులో కలగవు. 3. గతాధ్యాయంలో, గురువు యొక్క విశిష్ఠతను గూర్చి సంక్షిప్తంగా నిరూపించబడింది. ఇప్పుడు ఈ అధ్యాయంలో శ్రోతలు విభూతి యొక్క మహిమను వినండి. 4. సాయిబాబా దక్షిణను అడిగి మరీ పుచ్చుకుని, పేదలకు దీనులకు ధర్మం చేసి మిగిలిన డబ్బుతో కఫ్ని పుల్లలను కొని రాసిపోసి ఉంచేవారు. 5. ఎండు కఫ్నిలను తమ ఎదుట ధునిలో వ్రేల్చేవారు. దానిలో అమితంగా వచ్చే బూడిదను భక్తులకు విభూతిగా ఇచ్చేవారు. 6. భక్తులు శిరిడీనుండి తమ ఇళ్లకు మరలి వెళ్లే సమయాన, బాబా వద్ద సెలవు తీసుకునేటప్పుడు, వారికి బాబా విభూతిని ఇవ్వటం పరిపాటి. ఇది భక్తులందరికీ తెలుసు. 7. అంతేకాదు బాబా విభూతిని పట్టుకురండి అని అంటే, ఇప్పుడు బాబా అనుమతి అయింది అని తలచి సంతోషంగా మరలి వెళ్ళిపోయేవారు. 8. అట్లే వారు శిరిడీలో ఉన్నంత వరకు ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం విభూతిని ఇవ్వకుండా ఎవరినీ రిక్త హస్తాలతో పంపేవారు కాదు. 9. ఇది ప్రతిరోజూ జరిగే కార్యక్రమం.

అయితే ఆ విభూతి యొక్క లక్షణమేమిటి? నిత్యమూ మసీదులో అవిరామంగా ధుని ఎందుకు? రోజూ విభూతినివ్వటం అనే ఈ కార్యక్రమం ఎందుకు? 10. బాబా ఉద్దేశం ఏమిటి? వారిసూచన ఏమిటి? అంటే విశ్వంలోని సకలదృశ్యాలు బూడిద వంటివని నిశ్చయంగా తెలుసుకోవాలి అని. 11. ఈ శరీరం కూడా పంచభూతాల కాష్టం. భోగాలను అనుభవించటానికి మిగిలి ఉంటుంది. భోగాలు ముగిసి పోగానే నిశ్చేష్టగా పడిపోయి ఇది పట్టి బూడిద అని స్పష్టమవుతుంది. 12. మీది నాదికూడా ఇదే స్థితి. ఇది మీ స్మృతిలో ఉండాలని అహర్నిశలూ నాకు కూడా ఇది తెలిసి ఉండాలని విభూతిని ఇస్తాను. 13. అఖిల విశ్వం మాయ యొక్క ప్రదర్శనం. బ్రహ్మ మాత్రమే సత్యం. బ్రహ్మాండం అసత్యం. ఈ నిజానికి విభూతి గుర్తు. దీనిని బాగా తెలుసుకోవాలి. 14. ఇక్కడ ఎవరికీ ఎవరూ లేరు. భార్యాబిడ్డలు మాము అల్లుడు అని ఎవరూ లేరు. నగ్నంగా వచ్చాం. నగ్నంగానే వెళ్లిపోతాం. దీనిని విభూతి గుర్తుకు తెస్తుంది. 15. ఈ విభూతిని అద్దుకుంటే ఆధివ్యాధి బాధలు తొలగిపోతాయి. కాని ఈ విభూతి యొక్క నిగూఢమైన తత్వార్థం వివేకంతో కూడిన పూర్ణ వైరాగ్యం. 16. ఇవ్వగలిగినంత దక్షిణను ఇచ్చి ప్రాపంచిక వ్యవహారాలయందు వైరాగ్యాన్ని సాధించిన తరువాత, మెల్లమెల్లగా నివృత్తి యొక్క వైరాగ్య లక్షణాలు మనకు అర్థమవుతాయి. 17. వైరాగ్యం అబ్బినా దానితోపాటు వివేకం లేకపోతే ఆ వైరాగ్యం మట్టికొట్టుకు పోతుంది. అందువలన విభూతి విలువను తెలుసుకోండి. 18. వివేక వైరాగ్యాల జంట వలెనే విభూతి దక్షిణల జత. ఇవి లేకపోతే భవసాగర తీరాన్ని చేరటం అత్యంత కష్టం. 19. పెద్దలు పిల్లలు బాబా దర్శనానికి వచ్చి వినయంగా వారి చరణాలకు నమస్కారం చేస్తారు. వారు తిరిగి వెళ్లిపోయేటప్పుడు బాబా వారికి విభూతిని ఇస్తారు. 20. నిత్యం మసీదులో ధుని అహర్నిశలూ అక్షయంగా ప్రదీప్తంగా మండుతుంటుంది. అందులోని విభూతినే బాబా భక్తులకు పిడికెళ్లతో

ఇచ్చి సాగనంపే వారు. 21. ప్రసాదమని విభూతిని ఇచ్చేవారు. తమ బొటన వ్రేలితో భక్తుల నొసటున అద్ది అల్లే తమ చేతిని వారి శిరసుపై ఉంచి వారికి శుభాశీస్సులను ఇచ్చేవారు. 22. ఊది విభూతి బూడిద ఇవి మూడు పదాలు కాని అర్థం మాత్రం ఒకటే. బాబా ఇదే ప్రసాదాన్ని నిత్యం నిరాటంకంగా నిరవధికంగా పంచేవారు. 23. ప్రపంచం బూడిదతో సమానం. మనం ఇలా బూడిదై పోయే రోజు తప్పక వస్తుందని గుర్తుంచుకోవాలి. ఇది విభూతి యొక్క మహిమ. 24. తామరాకుపై నీరు వలె నశ్వరమైన ఈ శరీరం పతనమై పోయేదే కనుక దానిపైని అభిమానాన్ని త్యజించాలి అని విభూతి ప్రదానం తెలియచేస్తుంది. 25. విశ్వవ్యాప్తి అంతా నిజంగా బూడిద వలె నిస్సారమైనదని నిర్ధారణగా తెలుసుకుని జగత్తు యొక్క మిథ్యత్వాన్ని గ్రహించండి. సత్యమైనది విభూతియే అని తెలుసుకోండి. 26. విభూతి అంటే కేవలం మట్టి. సకల వస్తువుల నామరూపాల అంతిమగతి. ఈ జగత్తులో వస్తువుల మార్పు కేవలం నామమాత్రమే. నిజానికి అంతా మట్టియే. 27. ప్రేమ ఉప్పొంగినప్పుడు బాబా స్వయంగా పాటలు పాడుతుండగా విన్నాం. వానిలో ఊదిని గురించిన చిన్న ముక్కను శ్రోతలు శ్రద్ధగా వినండి. 28. 'రమతె రామ ఆయొజి ఆయొజి ఉదియాంకి గోనియా లాయొజి' రాముడు తిరుగుతూ తిరుగుతూ వచ్చాడు. ఊదీ సంచులను పట్టుకుని వచ్చాడు. మనసు ఉల్లాసంగా ఉన్నప్పుడు బాబా ఎంతో సంతోషంగా అత్యంత శ్రావ్యంగా మాటిమాటికి ఈ రెండు పాదాలను పాడేవారు. 29. సారాంశం, బాబా యొక్క ఈ ధుని ఎన్నో విభూతి సంచులను ప్రసవించింది. వానిని లెక్కించటం ఎవరి తరమూ కాదు. ఈ విభూతి పరమ శుభ ప్రదం. 30. విభూతి ప్రదానం లోని గూఢార్థాన్ని భావార్థాన్ని మరియు పరమార్థాన్ని గ్రహించి శ్రోతలు తమ శ్రేయస్సు కొఱకు యోగక్షేమాల కొఱకు విభూతి గురించి అడుగుతుంటారు. 31. అలా అడగకపోతే విభూతిలోని మహాత్మ్యం ఎలా విస్తరిస్తుంది? సాయిబాబా పరమార్థంలో ధురీణులు. భక్తుల

యొక్క ప్రాపంచిక కోరికలను తీర్చి వారికి పరమార్థాన్ని ప్రసాదిస్తారు.32.ఈ విభూతికి సంబంధించిన భక్తుల యోగక్షేమ కథలు అసంఖ్యాకంగా చెప్పవచ్చుకాని గ్రంథం విస్తరించకుండా సంక్షిప్తంగా చెప్పుతున్నాను.33.నారాయణ మోతీరాం ఇంటి పేరు జానీ, ఇతడు నాసిక్‌లో గృహస్థుడు. వంట బ్రాహ్మణుడు.34.బాబా యొక్క భక్తుడైన, ఈ నారాయణరావు రామచంద్ర వామనరావుమోడక్ అనే బాబా యొక్క మరొక భక్తుని ఇంట నౌకరీ చేసేవాడు. 35.ఇతడు బాబా శరీరంతో ఉన్నప్పుడు తల్లిని వెంటబెట్టుకుని బాబా దర్శనానికి వెళ్లాడు.36.అప్పుడు బాబా తమంతటతామే అతని తల్లితో ఇక ముందు నౌకరి చేయటమనే సేవా ధర్మం ఉండదు అని ముందుగానే సూచించారు. 37.ఈ బానిస బ్రతుకుకు స్వస్తి చెప్పి స్వతంత్రంగా ఏదో వ్యాపారం చేసుకోవటం ఇంత కంటె మంచిది అని అన్నారు.తరువాత కొంతకాలానికి భగవంతునికి దయకలిగింది.38. పరాధీనత లో ఉన్న అతని నౌకరి వదిలింది. స్వతంత్రంపై ప్రీతి కలిగింది. దాంతో స్వశక్తితో భోజన వసతి గృహాన్ని అక్కడే స్థాపించాడు.39.దానికి ఆనందాశ్రమమని పేరు పెట్టాడు. అందులో బాగా శ్రమ పడగా అది దినదినాభివృద్ధి చెంది అతనికి పేరు ప్రఖ్యాతులు లభించాయి. అతని మనసు శాంతించింది.40.అలా జరిగినదానిని గమనించి అతనికి సాయి చరణాలయందు నిష్ఠ పెరిగి అది దృఢమైన భక్తిగా మారింది. అనేక అనుభవాలు కలగటంతో, ఆ భక్తి బలంగా నాటుకుంది.41.సాయి యొక్క వాణి అతని అనుభవంలోకి వచ్చింది. శ్రవణార్థులకు ఇది ఒక కథ అయింది. అతనికి సాయి చరణాలయందు ప్రేమ అభివృద్ధి అయింది. సాయి యొక్కలీల అపూర్వం.42. బాబా ఎప్పుడూ ఏదైనా ఉత్తమ పురుషలో తమకు సంబంధించినట్లు చెప్పినా అదంతా ఇతరుల గురించి చెప్పినదే. జాగ్రత్తగా పరిశీలించిన వారికి ఇది ఎప్పుడూ అనుభమవుతుంది. 43. తరువాత అలా అనుభవాలు కలిగిన కొద్దీ నారాయణ రావుకు భక్తి ప్రేమలు బాగా పెరిగాయి.

అతనికి సంబంధించిన మరొక విషయాన్ని భక్తిభావంతో వినండి.44.నారాయణరావు మిత్రునికి ఒకరోజు అకస్మాత్తుగా తేలుకుట్టి చాలా బాధ కలిగింది.45.అటువంటప్పుడు కుట్టిన స్థలంలో విభూతిని రాసుకుంటే చాలా ఉపయోగకరం. కాని ఎంత వెదకినా ఊది కనిపించలేదు.46.మిత్రునికి బాధ సహించరానిదైంది.విభూతి లభించలేదు. నారాయణరావు బాబా పటానికి నమస్కరించి వారి కరుణను అర్థించాడు.47.తరువాత ఆ పటం క్రింద అగరవత్తుల నుండి రాలిన బూడిదను ఆ క్షణం విభూతిగా భావించాడు.48.సాయినామ మంత్రాన్ని నోటితో ఉచ్చరిస్తూ, ఒక చిటికెడు తీసి తేలు కుట్టిన చోట అద్దాడు. భక్తి భావం ఎలా ఉంటే అనుభవం కూడా అట్లే ఉంటుంది. 49.ఇది శ్రోతలకు వింతగా అనిపించవచ్చు కాని విభూతిని రాసిన తక్షణం బాధ వచ్చిన దారే పారిపోయింది.ఆ ఇద్దరి హృదయాలలో ప్రేమ ఉప్పొంగింది.50.ఇదైనా అగరువత్తులనుండి రాలిన విభూతి. దీనిని బాధపడిన వ్యక్తికి రాయడం జరిగింది. కాని విభూతి అని భావించినప్పుడు దారి పైని మట్టి కూడా ఇటువంటి అనుభవాన్ని కలిగించింది.51.ఆ మట్టిని బాధ పడ్డవారికి కాక వేరే వారికి రాసినా అది ఉపయోగపడింది. 52.ఒకసారి,ఒక భక్తుని కూతురు గ్రంథి జ్వరంతో బాధపడుతూ ఉందని వేరే ఊరిలో ఉన్న తండ్రికి అకస్మాత్తుగా వార్త అందితే,ఆ భక్తుడు చింతించ సాగాడు.53.తండ్రి బాంద్రా పట్టణంలో ఉన్నాడు. అతని కూతురు వేరే గ్రామంలో ఉంది.అతని వద్ద విభూతి లేదు. అందువల్ల నానాకు కబురు పంపాడు.54.మీరు బాబాను ప్రార్థించి,నా దుఃఖాన్ని దూరం చేయండి,విభూతి ప్రసాదాన్ని పంపండి అని నానా చందోర్కరుని వేడుకున్నాడు.55.ఆ కబురు తీసుకుని వెళ్ళేవానికి నానా కూడా దారిలోనే కలిశాడు. అప్పుడు నానా భార్యతో కల్యాణ్ వెడుతున్నాడు.56.థాణా పట్టణం స్టేషను వద్ద నానాకు ఈ కబురు అందింది.అయితే అతని వద్ద విభూతి లేదు.దారిలో నేల పైని మట్టిని

తీశాడు. 57.అక్కడే దారిలో నిలబడి, సాయిసమర్థుని ప్రార్థించి, వెనుకకు తిరిగి తన భార్య నొసటన ఒక చిటికెడు రాశాడు. 58.ఇక్కడ భక్తుడు తన కూతురు ఉన్న ఊరికి వెళ్లి అక్కడ విషయాన్ని తెలుసుకుని చాలా ఆనందించాడు. 59.ఆ అమ్మాయికి మూడురోజులు అత్యంత తీవ్రమైన జ్వరం వచ్చి,ఆమె ఆ బాధకు నీరసించి పోయింది.ఆ ముందురోజే కొంచెం నయమై విశ్రాంతి కలిగింది.60.చూడగా నానా బాబాను ప్రార్థించి మట్టిని విభూతిగా భావించి భార్య నొసటన అద్దినప్పటి నుండే ఆమె బాధ తగ్గింది.61.బాధ గురించిన ఈ కథ ఇలా ఉండనీ.మంచి అవకాశం వచ్చినప్పుడు మరల సవిస్తరంగా చెప్పవచ్చు.ఇది విభూతిని గురించిన చిట్కా.62.ప్రేమమయుడైన ఈ నానా చందోర్కరు జాంనేరులో మామలతుదారుగా ఉన్నప్పుడు, భక్త కల్యాణైకతత్పరుడైన సాయిబాబా చేసిన చమత్కారాన్ని వినండి. 63.ఈ విభూతి యొక్క మహిమ అపారం. శ్రోతలు శ్రవణ తత్పరులవండి.చాలా ఆశ్చర్యాన్ని కలిగించే రెండవ ఊదీ చమత్కారాన్ని చెప్తాను.64.నానా యొక్క కుమార్తె ప్రసవసమయం ఆసన్నమై సహించలేని ప్రసవవేదన పడుతూ జాంనేరునుండి సాయి సమర్థుని ఎన్నో విధాల పిలువసాగింది.65.జాంనేరులోని ఈ పరిస్థితి శిరిడీలో ఎవరికీ తెలియదు. సాయిబాబా సర్వజ్ఞులు, సర్వవ్యాపకులు. జగత్తులో వారికి తెలియనిదేదీ లేదు. 66.భక్తులతో ఏకాత్మత కలిగి ఉండటం వలన, నానాయొక్క అవస్థను తెలుసుకున్న సాయిసమర్థుల హృదయం ద్రవించింది.వెంటనే ఏంచేశారంటే,67.నానాకు విభూతిని పంపించాలని వారికి అనిపించింది. ఇంతలో రామ్‌గీరు బువా అను గోసావి మనసులో తన ఊరికి వెళ్లాలన్న కోరిక కలిగింది.68.అతని ఊరు ఖాండేశ్‌లో ఉంది. ప్రయాణానికి సిద్ధమై అతడు మసీదుకు బాబా దర్శనానికి వారి పాదాలవద్దకు వచ్చాడు. 69.బాబా శరీరధారులై ఉన్నప్పుడు ముందుగా వారి పాదాలపై పడకుండా ఎవరైనా ఏకార్యం కోసమైనా సరే వారి అనుమతిని తీసుకోకుండా వెళ్లరు. 70.వివాహంగాని,

ఉపనయనంగాని, విధి విధానాలతో చేసే ఏ శుభకార్యంగాని, ఏ సంకల్పంగాని బాబా యొక్క సమ్మతి అవసరం. 71. వారి సంపూర్ణ అనుమతి వారి ఆశీర్వాదం, వారి విభూతి ప్రసాదం లేకపోతే ఏకార్యమైనా నిర్విఘ్నంగా జరగదని అందరి దృఢ విశ్వాసం. 72. ఊరిలోని ఈ పద్ధతిని అనుసరించి, రామ్‌గీరు వచ్చి బాబా పాదాలకు వందనం చేసి బయలుదేరటానికి వారి అనుమతిని కోరాడు. 73. 'బాబా! ఖాందేశ్ లోని మా ఊరికి వెళ్లి వస్తాను. ఊదిని, ఆశీర్వాదాన్ని, బయలుదేరటానికి అనుమతిని ఈ దాసునికి ఇవ్వండి' అని అడిగాడు. 74. అతనిని బాబా ప్రేమగా బాపూగీర్ అని పిలిచేవారు. 'సరే నీవు సంతోషంగా ఊరికి వెళ్లు. దారిలో కాస్త విశ్రాంతిని తీసుకో. 75. ముందుగా జాంనేరుకు వెళ్లి నానా ఇంటి వద్ద ఆగు. వారి సమాచారాలను తెలుసుకుని నీవు ముందుకు సాగిపో' అని చెప్పారు. 76. మాధవరావు దేశపాండేతో 'శ్యామా! ఈ గోసావి వెంట నానాకు పంపటానికి అడ్కరు వ్రాసిన ఆరతిని కాగితంపై వ్రాసి ఇవ్వు' అని చెప్పారు. 77. తరువాత గోసావికి విభూతినిచ్చి మరికొంత విభూతిని పొట్లం కట్టి అతని చేతికిచ్చి బాబా నానాకు పంపారు. 78. 'ఈ పొట్లాన్ని, ఈ ఆరతిని తీసుకుని వెళ్లి నానాకు ఇవ్వు. వారి క్షేమాన్ని కుశల పరిస్థితిని తెలుసుకుని మీ ఊరికివెళ్లు' అని చెప్పారు. 79. రామ జనార్థనుడు రాసిన 'ఆరతిజ్ఞానరాజా' అను ఆరతి పాట వంటిదే, ఈ ఆరతి సాయిబాబా. రెండూ సమానంగా ఉంటాయి. 80. రామజనార్థనుడు జనార్దన భక్తుడు. మాధవఅడ్కరు సాయిపాదాంకితుడు. ఇతని ఆరతిపాట రచన అత్యంత అనుగ్రహంతో నిండినది. ఈ ఆరతి లేకుండా సాయి ఆరాధన పూర్తికాదు. 81. ఇది బాబాకు ప్రియమైనది. విభూతి వెంట బాబా పంపించిన ఆరతిపాట నంతటిని శ్రోతలు ఆలకించండి. దీని ఫలశ్రుతి తరువాత తెలుస్తుంది. 82. **ఆరతి:** ఆరతిగైకొను సాయిబాబా! (మీరు) ప్రాణులకు సుఖాన్ని ప్రసాదిస్తారు. (మీ) చరణధూళియందు ఈ దాసునికి, భక్తులకు

ఆశ్రయాన్నివ్వండి. కోరికలను వాసనలను దహించి నిరాకారులైన మీరు స్వస్వరూపంలో లీనమై ఉంటారు. ముముక్షువుల కళ్లకు శ్రీరంగనిలా దర్శనమిస్తారు.1.దయాఘనులైన సాయినాథా! (మీరు)వారివారి భక్తివిశ్వాసాల అనుసారం వారికి అనుభవాలను కలిగిస్తారు. ఇది మీ మాయ మీ చమత్కారం. 2.మీ నామాన్ని ధ్యానిస్తే ప్రపంచంలోని శారీరక మానసిక దుఃఖాలు నాశనమవుతాయి. మీ చర్యలు అగాధం, ఊహాతీతం.ఏదిక్కూలేని అనాథులకు మీరు మార్గాన్ని చూపుతారు.3.మీరు కలియుగంలో సగుణ బ్రహ్మరూపంలో ప్రత్యక్ష దత్త దిగంబరులై అవతరించారు.4. వారంలో ప్రతిగురువారం భక్తులు తమ ప్రభువును దర్శించుకోవటానికి యాత్రకు వస్తారు.వారి భవభయాన్ని తొలగించండి.5.మీ చరణధూళి సేవయే నా యొక్క సంపద. దీనినే నేను కోరుకునేది. దేవాధిదేవా!6.చాతకపక్షి వంటి ఈ దీనుడు ఆత్మసుఖమనే నిర్మలమైన నీటిని కోరుకుంటున్నాడు. దీనిని ఈ మాధవునకు త్యాగించి మీ మాటను నిలబెట్టుకోండి.7.గోసావి బాబాతో 'నా వద్ద మొత్తం రెండు రూపాయలే ఉన్నాయి. వీనితో నేను జాంనేరును ఎలా చేరుకోగలను? అని అడిగాడు.83.'నువ్వు నిశ్చింతగా వెళ్లు. నీకు అన్ని సౌకర్యాలు ఏర్పడతాయి' అని బాబా చెప్పారు. సాయిబాబా పాదాల యందు విశ్వాసముంచి గోసావి వెళ్లటానికి బయలుదేరాడు.84.బాబా ఆజ్ఞను శిరసావహించి బాపూగీర్ విభూతి ప్రసాదాన్ని స్వీకరించి కార్యతత్పరుడై త్వరగా బయలుదేరాడు.85. ఇప్పటివలె జాంనేరుకు అప్పుడు రైలుబండి మార్గం లేదు.ప్రయాణీకులకు ఏ సౌకర్యంలేదు. గోసావికి చింతపట్టుకుంది. 86.ప్రయాణీకులు జలగాంలో రైలు దిగి, అక్కడినుండి దారంతా నడచి వెళ్లాలి.87. ఒకరూపాయి పదునాలుగు అణాలరైలు టికెట్టు కొనగా మిగిలిన రెండు అణాల డబ్బుతో ముందుకు ఎలా సాగాలి. 88.అని ఆలోచిస్తూ గోసావి జలగాం స్టేషనులో టికట్టు ఇచ్చి బయటపడి దూరాన ఒక సిపాయిని చూచాడు.89.అప్పటికే

అతడు శిరిడీ నుండి వచ్చిన బాపూగీర్ ఎవరు అని వెతుక్కుంటున్నాడు. ప్రయాణీకుల ముందుకు వచ్చి మీలో శిరిడీ బాపూగీర్ ఎవరు చెప్పండి అని అడిగాడు. 90.అతడు అలా అడగటం తన కోసమే అని తెలుసుకుని, ముందుకు వెళ్లి బాపూగీర్‌నేనే. అయితే ఏమిటి అని అడిగాడు. 91.మీ కోసం నానా చందోర్కరు నన్ను పంపారు. వారు ఎదురుచూస్తుంటారు. త్వరగా వచ్చి టాంగాలో కూర్చోండి. పోదాం అని చెప్పాడు.92.బువాకు చాలా ఆనందం కలిగింది. నానాకు శిరిడీనుండి కబురు వెళ్లిందేమో. అందుకనే ఇప్పుడు (జట్కాబండి) టాంగా వచ్చింది. ఘోరమైన కష్టం తప్పింది అని అనుకున్నాడు.93.సిపాయి చురుకైన వానిలా కనిపించాడు. గడ్డం మీసాలు, గిరజాలు ఉన్నాయి.పంట్లాం అదీ చక్కగా వేసుకున్నాడు. టాంగా కూడా అందంగా ఉంది. 94.దానికి తగిన గుఱ్ఱాలు. అవేమున్నా బాడుగకు కట్టేవా? కార్యోత్సాహంతో ఇతర టాంగా బళ్లకంటె ముందుగా బయలుదేరింది.95.రాత్రి 12 ఘటికలప్పుడు (11గం॥)వేగంగా బయలుదేరిన టాంగా తెల్లవారు ఝామున దారిలో ఒక కాలువ వద్ద ఆగింది.96.అక్కడ బండివాడు గుఱ్ఱాలను నీరు త్రాగడానికి వదిలాడు. నేనిప్పుడే వస్తాను. సుఖంగా ఫలహారం చేద్దాం అని అన్నాడు.97.నేను మంచి నీరు తీసుకుని వస్తాను. మనం మామిడిపళ్లు, పేడాలు, బెల్లం అప్పాలు తిని బండికి గుఱ్ఱాలను కట్టి బయలుదేరుదాం అని అన్నాడు.98.ఆ దుస్తులు గడ్డంతో ముసల్మాను వలె ఉన్న అతని మాటలు విని, ఈ ఫలాహారాన్ని ఎలా తినాలి.99.అని సంశయించి గోసావి అతని కులం గురించి అడిగాడు. టాంగావాడు 'మీకు సందేహం ఎందుకు కలిగింది? నేను హిందువును. గఢవాల్ క్షత్రియపుత్రుణ్ణి. రాజ్‌పూత్ జాతివాణ్ణి.100.మీ కోసం ఈ ఫలహారం కూడా నానా పంపించారు. మనసులో ఏ సంకోచమూ లేకుండా నిశ్చింతగా తినండి' అని చెప్పాడు.101.అతనిపై విశ్వాసం కుదిరాక ఆ ఇద్దరూ ఫలహారం

తిన్నారు. టాంగా వాడు బండి కట్టాడు. సూర్యోదయానికి వారి ప్రయాణం ముగిసింది. 102. టాంగా ఊరిలోకి ప్రవేశించగానే నానా యొక్క కార్యాలయం కనిపించటంతో గుఱ్ఱాలు ఆగాయి. రామ్‌గీరు మనసులో సంతోషించాడు. 103. అతడు మూత్ర విసర్జనకు ప్రక్కగా వెళ్ళి కూర్చుని వచ్చేసరికి ఆశ్చర్యం. 104. అక్కడ టాంగా లేదు, గుఱ్ఱాలూ లేవు. టాంగావాడు కూడా లేడు. ఎవరూ కనిపించక ఆ స్థలం ఖాళీగా కనిపించింది. 105. ఇదేం చమత్కారం! నన్ను ఇంతవరకు తీసుకుని వచ్చినవాడు ఇంతలో ఎక్కడికి వెళ్లిపోయాడు అని రాంగీర్ మనసులో అనుకున్నాడు. 106. నానాను కలుసుకోవాలనే ఆతురతతో గోసావి ఆఫీసుకు వెళ్లి నానా ఇంటిలో ఉన్నాడని తెలుసుకుని అక్కడికి వెళ్లటానికి బయలుదేరాడు. 107. దారిలో నానా ఇంటి అడ్రసును అడిగి తెలుసుకుని అక్కడికి వెళ్లాడు. నానా ఇల్లు సులువుగానే దొరికింది. బయట అరుగుమీద కూర్చోగా నానా లోపలికి పిలిపించుకున్నాడు. 108. వారు పరస్పరం కలుసుకున్నారు. రామ్‌గీరు విభూతిని, ఆరతిని బయటకు తీసి నానా ఎదుట ఉంచి వృత్తాంతాన్నంతా మనవి చేశాడు. 109. విశేషమేమిటంటే, విభూతి వచ్చినప్పుడు ఆ సమయాన, నానాకుమార్తె ప్రసవ వేదన పడుతూ ఉంది. 110. ఆ కష్టాన్ని బాధను తొలగించటానికి నవచండీ హవనం మరియు దుర్గాసప్తశతి పారాయణ చేయించడం చూచి రామ్‌గీరు ఆశ్చర్యపోయాడు. 111. ఆకలితో ఉన్నవానికి అకస్మాత్తుగా పక్వాన్నాలతో నిండిన పళ్లెం ముందుకు వచ్చినట్లు, దాహంతో ఉన్న చకోర పక్షినోటికి అమృతం అందినట్లు నానాకు అనిపించింది. 112. భార్యను పిలిచి కుమార్తెకు నీటిలో వేసి స్నానం చేయించమని విభూతినిచ్చాడు. తాను స్వయంగా ఆరతి పాడటం ఆరంభించాడు. 113. క్షణం గడిచిందోలేదో విభూతిని వేసిన గ్లాసు నోటికి అందించగానే అమ్మాయికి బాధోపశమనం కలిగింది. 114. వెంటనే ఆమె బాధ తొలగిపోయి సుఖంగా ప్రసవించింది. గండం గడిచిపోగా

అందరి ఆదుర్దా తొలగిపోయింది.115. టాంగావాడు ఎక్కడికి వెళ్ళాడు? ఇక్కడ నాకు కనిపించటంలేదు, మీరు పంపిన ఆ టాంగా ఎక్కడ అని రామ్‌గీరు నానాను అడిగాడు.116.ఎక్కడి టాంగా? నేనేం పంపలేదే, అసలు నీవు వస్తున్నట్లు ఇక్కడ ఎవరికీ తెలియదు. నేను టాంగా ఎందుకు పంపుతాను అని నానా చెప్పాడు.117.అప్పుడు గోసావి కథనంతా విపులంగా చెప్పగా బాబా యొక్క భక్త వాత్సల్యాన్ని గని నానాకు ఆశ్చర్యం కలిగింది118.ఎక్కడి టాంగా,ఎక్కడి సిపాయి,నటించేది నటింపచేసేది సాయిమాతయే. వారు భక్తుల పైని ప్రేమతో కష్టసమయంలో పరుగెత్తుకుంటూ వస్తారు. 119.ఇప్పుడు ముందుకు సాగి మునుపటి కథను చెప్పుకుందాం.కొంతకాలానికి బాబా నిర్వాణం చెందారు. 120. క్రీ.శ.1918 వ సం॥ విజయదశమి దసరా పండుగరోజు మంచి శుభదినమని తలచి, తమ శరీరాన్ని ధరార్పణ చేశారు.121.అలావారు సమాధి చెందారు.దీనికి ముందే బాబా శరీరంతో ఉండగానే నారాయణరావు రెండుసార్లు బాబా దర్శనం చేసుకున్నాడు.122.బాబా సమాధి చెంది మూడు ఏళ్ళు గడిచాక నారాయణరావుకు బాబాను దర్శించుకోవాలని బలవత్తరమైన కోరిక కలిగింది. కాని సరైన అవకాశం లభించక నిరుత్సాహపడ్డాడు.123.బాబా సమాధి చెందిన ఒక సంవత్సరానికి నారాయణరావు వ్యాధితో బాధ పడ్డాడు. ఔషధోపచారలన్నీ అయ్యాయి. కాని చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు.124.వ్యాధితో కృశిస్తూ ఉన్నా అతడు అహర్నిశలూ బాబా ధ్యానమే చేసేవాడు.గురుదేవులకు మరణమెక్కడిది? వారు నారాయణునకు దర్శనమిచ్చారు. 125.ఒక రాత్రి అతనికి స్వప్నం వచ్చింది. సాయిబాబా ఒక సొరంగం నుండి నారాయణరావు వద్దకు వచ్చి అతనికి ధైర్యాన్నిచ్చారు.126.'నీవు మనసులో ఏ చింతా పెట్టుకోకు. రేపటినుండి బాధ తగ్గిపోతుంది. ఒక వారం గడిచే సరికి నీవు స్వయంగా లేచి కూర్చుంటావు.' అని చెప్పారు.127.అట్లే ఎనిమిది రోజులు గడవగానే అతనికి బాబా

వచనం అక్షరం అక్షరం అనుభవంలోకి వచ్చింది. నారాయణరావు లేచి కూర్చున్నాడు. మనసులోచాలా సంతోషించాడు. 128.అలా కొంత కాలం గడిచాక అతడు శిరిడీకి బాబా సమాధి దర్శనానికి వచ్చినప్పుడు తన ఈ అనుభవాన్ని చెప్పాడు.129.సాయిబాబా శరీరధారులై ఉన్నప్పుడు బ్రతికి ఉన్నట్లు, సమాధి చెందాక మరణించినట్లా? సాయి జననమరణాలకు అతీతులు. వారు ఎల్లప్పుడూ స్థిరచరాలలో నిగూఢంగా ఉంటారు. 130.కట్టెలో అగ్ని గుప్తంగా ఉంటుంది.కాని పైకి కనిపించదు. ఘర్షణ ప్రయోగంతో ప్రదీప్తమవుతుంది. అట్లే సాయి కూడా భక్తులకోసం ప్రకటమవుతారు.131.వారిని ఒకసారి ప్రేమగా చూస్తే జీవితాంతం వారికి అంకితమై పోతారు.వారు కేవలం అనన్యప్రేమను ఆశిస్తారు. ప్రేమగా పిలిస్తే వెంటనే ఓ యని పలుకుతారు.132.వారికి ఒక ప్రదేశంగాని, ఒక సమయం గాని అవసరం లేదు. ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారు. వారి చాతుర్యాన్ని ఎప్పుడు ఎలా చూపుతారో వారి లీల అర్థం కాదు.133.వారు కల్పించిన పరిస్థితిలో మనసులో అనేక రకాల కుతర్కాలు సందేహాలు కలుగుతాయి. అప్పుడు వారి చరణాల యందు దృష్టి నిలిపితే ధ్యాన ధారణలు కుదురుతాయి.134.ఇలా మనసు ఏకాగ్రమైనప్పుడు సాయిపై ధ్యానం చక్కగా జరుగుతుంది. దీనిని సాయియే చేయించుకుంటారు.ఏకార్యమైనా నిర్విఘ్నంగా జరిగిపోతుంది.135. ప్రాపంచిక వ్యవహారాలను విడిచి పెట్టాల్సిన అవసరంలేదు. ఏ అలవాటైనా దానికదే వదిలిపోతుంది. ఇలా మనసును అభ్యాసంలో ఉంచితే ఏ పనైనా సునాయాసంగా జరుగుతుంది.136.కర్మభూమిపైకి వచ్చిన శరీరం కర్మలను తప్పనిసరిగా చేయాల్సిందే. భార్యాబిడ్డలను, ధనాన్ని, గృహాలను యథేచ్ఛగా సేకరించుకోవచ్చు. 137.జరుగనున్నదానిని అట్లే జరిగిపోనివ్వండి. సద్గురువును ధ్యానించడమే మన అభీష్టంగా ఉంటే, సంకల్పవికల్పాలు నశించిపోతాయి.సంచిత కర్మ మరియు అరిష్టాలు కూడా తొలగిపోతాయి.138.భక్తుల

భావాలను గమనించి సాయి మహానుభావులు భక్తులకు అనేక అనుభవాలను కలగచేసి, భక్తి వైభవాన్ని పెంచుతారు. 139.తాము కోరిన రూపాన్ని పొంది తమకు ఇష్టం వచ్చిన చోట ప్రకటమవుతారు. భక్తుల క్షేమం కొరకు ఎక్కడెక్కడైనా తిరుగుతారు. అయితే భక్తి భావం అవశ్యకం.140.ఈ విషయంలోని మరొక కథను శ్రోతలు శ్రద్ధగా వినండి.ఇది సత్పురుషులు అహోరాత్రులు తమ భక్తుల కొరకు ఏ విధంగా శ్రమిస్తారో తెలుస్తుంది.141.మీ చెవుల తలుపులను తీసి, మీ హృదయమందిరాన్ని తెఱచి,ఈ కథను వానిలోపలికి ప్రవేశించనీయండి. ఇది భవభయకష్టాలను తొలగిస్తుంది.142.జర్మనీయుల ప్రసిద్ధయుద్ధ సమయంలో, శత్రువులతో పోరాడటానికి సైన్యాన్ని సిద్ధపరచవలసిన అవసరం ఏర్పడింది.143.భారతదేశంలోని పట్టణాలలో నలువైపులా సిపాయిలను నియమించే వారు. 144.క్రీ.శ.1917వ సం.లో ఒక భక్తునికి సమయం వచ్చింది.థాణా జిల్లాలో నియమింపబడే అవకాశం లభించి ఒక వింత సంఘటన జరిగింది.145.ఆ భక్తుని పేరు అప్పాసాహేబు కులకర్ణి. అతనికి సాయి చరణాలయందు భక్తి కుదిరింది. ఇది సాయియొక్క ప్రభావమే. వారి లీల అగాధం.146.ఎన్నో ఏళ్లక్రితం అతనికి బాలా సాహేబు భాటే వద్ద నుండి బాబా చిత్రపటం ఒకటి లభించింది. అతడు ఆ పటాన్ని పూజలో ఉంచాడు. 147.నిత్యం నియమంగా కాయావాచా మనసులతో ఆ పటానికి గంధాక్షతలతోను పుష్పాలతోను పూజించి నైవేద్యాన్ని సమర్పించేవాడు.148.ఎప్పుడు కర్మభోగాలు ముగిసిపోతాయి, ఎప్పుడు సాయి యొక్క ప్రత్యక్ష దర్శనయోగం కలుగుతుంది, ఎప్పుడు తన మనసులోని కోరిక తీరుతుందని అప్పా చింతించసాగాడు. 149.సాయిబాబా యొక్క చిత్రపట దర్శనం కూడా వారి ప్రత్యక్ష దర్శన సమానం. పరిపూర్ణ భక్తి భావముంటే తగిన సమయంలో ఇది అనుభవమవుతుంది.150.కేవలం పటం యొక్క దర్శనం బాబా యొక్క ప్రత్యక్ష దర్శనంతో

సమానమని తెలియచేసే వాస్తవికతా నిరూపణను శ్రోతలు శ్రద్ధగా వినండి.151.ఒకసారి నవయుగ తుకారాం అని పిలువబడే హరిదాసు ముంబైపుర నివాసి అయిన బాలబువాసుతార్ బాబా దర్శనానికి శిరిడీ వెళ్లాడు.152.అదే అతడు ప్రథమంగా బాబాను కలుసుకోవటం. అంతకు పూర్వం ఎప్పుడూ కలుసుకోలేదు. అతడు బాబా పరస్పరం చూచుకోగానే సాయి అతనితో 153.'నాలుగేళ్లనుండి ఇతడు నాకు పరిచయం' అని స్పష్టంగా చెప్పారు. బాబా ఇలా ఎందుకు అంటున్నారా అని బాలబువా ఆశ్చర్యపోయాడు.154.బాబా శిరిడీ వదిలి వెళ్లింది లేదు. నేను కూడా వారిని ఇవాళే కళ్లతో చూచాను. మరి వీరికి నేను నాలుగేళ్ల క్రితమే ఎలా పరిచయం?155.అని ఆలోచించగా నాలుగేళ్ల క్రితం ఒకసారి తాను బాబా పటానికి నమస్కరించటం బువాకు గుర్తుకు వచ్చింది.156.బాబా మాటలలోని సత్యం వెంటనే అర్థమైంది.సత్పురుషుల వ్యాపకత్వాన్ని, వారి భక్తి వాత్సల్యాన్ని చూడండి.157.'నేను కేవలం వారి పటానికి నమస్కరించాను. ప్రత్యక్షంగా వారిని ఈ రోజే చూచాను. నన్ను బాబా గుర్తుంచుకున్నారు కాని నేను వారిని ఎప్పుడో మరచిపోయాను.158.నేను మరచిపోయానని అనటం కూడా సరియైనదికాదు.బాబా మాటల అర్థం నాకు వెంటనే తెలియలేదు. పటానికి నమస్కరించటం ద్వారా నేను వారికి పరిచయమయ్యానని వారు అన్నది నేను తెలుసుకోలేక పోయాను.159.బాబాకు నేను తెలుసు, కానీ నాకా విషయం తెలియదు. సత్పురుషులు గుర్తుకు తెచ్చి తెలియచేస్తేనే దేనినైనా తెలుసుకుంటాము.160.నిర్మలమైన అద్దంలోనో లేక నిర్మలమైన నీటిలోనో సూర్యుని లేదా చంద్రబింబం యొక్క ప్రతిబింబాన్ని చూస్తాం. అదే విధంగా పటంకూడా ఒక ప్రతిబింబమే. శుద్ధస్వరూపం యొక్క ప్రతీక.161.అందువలన సత్పురుషుల చిత్రపటదర్శనం వారి యొక్క ప్రత్యక్ష దర్శన సమానం. సర్వాన్ని దర్శించే సత్పురుషులు దీనినే బోధిస్తారు.162. ఇప్పుడు పూర్వపు కథానుసంధానాన్ని వినటానికి శ్రోతలు

సావధానంగా ఉండండి. 163.అప్పా థాణా పట్టణ వాస్తవ్యుడు. భివండిలో పని ఉండటం వలన ఎనిమిది రోజులలో తిరిగివస్తానని చెప్పి బయటపడ్డాడు.164.రెండు రోజులు గడిచాక,ఒక అపూర్వ సంఘటన జరిగింది. థాణా లోని అతని ఇంటి ముంగిటకు ఒక ఫకీరు వచ్చాడు.165.అతనిని చూడగానే అందరికీ అతడు సాయియే అని అనిపించింది. అతని రూపురేఖలన్నీ నఖశిఖపర్యంతం పూర్తిగా పటంలోని బాబా వలెనే ఉన్నాయి.166.అప్పా భార్యాబిడ్డలు ఫకీరును చూచి అందరూ ఆశ్చర్యపోయారు. బాబాయే వచ్చారా! అనిపించింది.167.పూర్వం వారెవరూ బాబాను ప్రత్యక్షంగా చూచి ఉండలేదు. కాని అచ్చు పటంలోవలెనే ఉండటం వలన వీరే సాయిబాబా అని తెలుసుకుని జిజ్ఞాసతో 168.మీరు శిరిడీ సాయిబాబాయేనా అని ఫకీరును ప్రశ్నించారు. ఫకీరు చెప్పిన దానిని శ్రోతలు శ్రద్ధగా వినండి.169.'నిజంగా నేను స్వయం సాయిని కాను. కాని వారి ఆజ్ఞను పాలించే వారి దాస్యుణ్ణి. వారి ఆజ్ఞానుసారం మీ కుటుంబ క్షేమ సమాచారాలను తెలుసుకోవటానికి వచ్చాను' 170. అని చెప్పి దక్షిణను కోరగా గృహిణి వెంటనే ఒక రూపాయిని సంభావనగా ఇచ్చింది. అతడు కూడా బాబా విభూతిని ఇచ్చాడు. 171.సాయిబాబా విభూతిని పొట్లం కట్టి ఆ స్త్రీకి ఇచ్చి, 'దీనిని ఆ పటం వద్ద ఉంచండి. మీకు సుఖం కలుగుతుందని' చెప్పాడు.172.తనుపని పూర్తి చేసుకుని 'సాయి నాకోసం ఎదురు చూస్తుంటారు' అని సెలవుతీసుకుని ఫకీరు వెళ్లి పోయాడు.173. తరువాత అతడు అక్కడినుండి వచ్చినదారినే వెళ్లాడు.ఇక్కడ సాయి యొక్క ఈ అపూర్వ లీల జరిగింది.174. భివండికి బయలుదేరిన అప్పాసాహేబు ముందుకు వెళ్లక వెనుకకు మరలాడు. బాగా బండి గుఱ్ఱాలు జబ్బుపడటంతో ప్రయాణం ముందుకుసాగక ఆగిపోయింది.175.మధ్యాహ్నం అతడు థాణాకు వచ్చి జరిగిన వృత్తాంతాన్నంతా తెలుసుకున్నాడు. ఫకీరు దర్శనం చేసుకోనందుకు అప్పా మనసు

చివుక్కుమంది. 176.పైగా కేవలం ఒకే రూపాయిని దక్షిణగా ఇచ్చినందుకు తనలో సిగ్గుపడ్డాడు. నేను ఉండి ఉంటే పదికి తక్కువ ఇవ్వకుండా అసలు పంపేవాణ్ణి కాను 177.అని తలచి తనలో బాధపడ్డాడు.ఆ ఫకీరు మసీదు వద్ద దొరకవచ్చు అని అతనిని వెదకటానికి భోజనం చేయకుండానే బయలుదేరాడు.178.ఫకీరులు బసచేసే మసీదు, తకియా మొదలగు అన్ని ప్రదేశాలలోను అప్పా వెదికాడు.179.ఆ ఫకీరు కోసం అలా వెదకివెదకి అప్పా అలసిపోయాడు. కాని ఫకీరు ఎక్కడా కనిపించలేదు. అప్పుడు నిరాశ చెంది ఆకలిగా ఉన్నందువలన వెళ్లి భోజనం చేశాడు.180.ఖాళీ కడుపుతో దేనినీ వెదకటానికి వెళ్లకూడదని అతనికి తెలియదు. ముందుగా తన ఆత్మను సంతుష్టపరచి తరువాత వెదకటానికి వెళ్లాలి. 181.ఈ విషయంలో బాబా చెప్పిన కథ ఈ తత్త్వంలోని యదార్థాన్ని తెలుపుతుంది. ఇక్కడ దాని పునరుక్తి ఎందుకు? శ్రోతలకు ఆ అధ్యాయం అవగతమే కదా. 182.గురువు యొక్క మహిమ అన్న గతాధ్యాయంలోని కథలో కరుణామయులైన శ్రీసాయి తమ గురువు యొక్క ఘనతను తాము స్వయంగా వర్ణించారు.183.ఆ సత్యవచనమే అనుభవమైంది. అప్పా భోజనం చేసి స్నేహితుడైన చిత్రేను వెంట బెట్టుకుని మామూలుగా తిరగటానికి వెళ్లాడు. 184.కొంతదూరం వెళ్లాక ఒక పెద్దమనిషి వారివైపే చూస్తూ త్వరత్వరగా వారి వద్దకు రావడం గమనించాడు.185.అలా అతడు వచ్చి దగ్గర నిలబడ్డాడు. అప్పాసాహేబు అతనిని పరికించి చూడగా, ఉదయం వచ్చినది ఇతడే,186.తాము వెతుకుతున్న ఫకీరు ఇతడే అయి ఉంటాడని అనిపించింది. ఇతని రూపురేఖలు నఖశిఖపర్యంతం పటంలోవలెనే ఉన్నాయి.చూడగానే బుద్ధికి విస్మయంగా ఉంది.187. అని అప్పా తనలో తాను తర్కించుకుంటుండగా, ఆ ఫకీరు చేయిచాచాడు. అప్పుడు అతని చేతిలో అప్పా ఒకరూపాయిని ఉంచాడు. 188.ఫకీరు మరల అడగగా మరొకటి, ఆపైన మూడోరూపాయిని ఇచ్చాక కూడా ఆ ఫకీరు మరల అడగగా అప్పాకు

విచిత్రంగా అనిపించింది.189.అప్పా చిత్రే వద్ద ఉన్న మూడు రూపాయలను అడిగి తీసుకుని ఇచ్చాడు. అయినా అతడు అడగటం ఆపలేదు.190:ఇంటికివస్తే ఇంకా ఇస్తానని అప్పా అతనితో చెప్పగా అతడు సరే నన్నాడు. ముగ్గురూ ఇంటికి తిరిగివచ్చారు.191.ఇంటికి రాగానే అప్పా మరో మూడురూపాయలను ఫకీరుకు ఇచ్చాడు. అలా మొత్తం తొమ్మిది అయినా ఫకీరు తృప్తిచెందలేదు.192.మరల ఇంకా దక్షిణను అడగగా అప్పా వెంటనే, 'ఈ పదిరూపాయల నోటు మాత్రం మిగిలి ఉంది'193.'చిల్లర రూపాయలన్నీ అయిపోయాయి వేరే ఏదీ లేదు అని అనగా, ఫకీరు ఆ నోటు ఇచ్చేయరాదూ అని అన్నాడు. అప్పా అలాగే ఇచ్చేశాడు.194.నోటు చేతికి అందగానే ఫకీరు తొమ్మిది రూపాయలను ఇచ్చేసి వచ్చిన దారినే అతి వేగంగా వెళ్లిపోయాడు.195.ఈ కథాసారాన్ని గమనిస్తే, భక్తులు సంకల్పించిన దానిని సంపూర్ణంగా చేయించుకోవటం సాయియొక్క వ్రతం అని తెలుస్తుంది.196.శ్రోతల శ్రవణోత్సుకతను గమనించగా ఈ విషయానికి సంబంధించిన మరొక వృత్తాంతం సరిగ్గా ఇప్పుడు గుర్తుకు వచ్చింది. ఇక వినండి. 197.దహాణూ అన్న ఊరిలో హరిభావూ కర్ణిక్ అన్న పేరుతో, సాయి చరణాల యందు అనన్యమైన భక్తి భావంగల భక్తుడుండే వాడు.198.క్రీ.శ.1917 వ సం. పవిత్రమైన గురుపౌర్ణిమను ఎన్నుకొని శిరిడీయాత్రకు వచ్చాడు. అతని చిన్న కథను చెప్తాను.199.బాబా పూజ యథా విధిగా ముగిసాక వస్త్రాలను దక్షిణను సమర్పించి బాబా ఆజ్ఞను తీసుకుని క్రిందకు దిగుతుండగా అతనికి ఆలోచన కలిగింది.200.పైకి వెళ్లి బాబాకు మరొక రూపాయను ఇవ్వాలని అనిపించింది. కాని ఆ ఆలోచనను మానుకోవాల్సివచ్చింది. ఆరూపాయిని తనవద్దే ఉంచేసుకున్నాడు. 201. తిరిగి వెళ్లిపోవటానికి బాబా ఆజ్ఞ ఒకసారి అయ్యాక, తాను వెంటనే ముందుకు వెళ్లిపోవాలని తనకు బాబా అనుమతిని ఇప్పించిన వ్యక్తి(మాధవరావు దేశ్‌పాండే) పై నుండి సైగ చేశాడు. 202.ఆ సంకేతాన్ని అనుసరించి కర్ణిక్ ముందుకు సాగిపోయాడు. దారిలో మిత్రునితో సహా నాసిక్‌లో దిగాడు.203.కాలారాముని దేవాలయంలోకి

దర్శనానికి కర్నిక్ వెళ్లగా అక్కడ అనుకోకుండా నరసింగ్ మహారాజు అనే సాధువు దర్శనం కలిగింది.204. భక్త పరివారం అతని చుట్టూ ఉన్నారు. ఆ మహారాజు అకస్మాత్తుగా లేచి కర్నిక్ యొక్క చేతి మణికట్టును పట్టుకుని 'నా రూపాయిని ఇవ్వు' అని అడిగాడు.205.కర్నిక్ తనలో ఆశ్చర్యపోయాడు. కాని ఎంతో ఆనందంగా రూపాయిని ఇచ్చాడు. తాను ఇవ్వతలచిన రూపాయిని సాయియే అలా స్వీకరించారని భావించాడు.206.సాయి స్వీకరించడం కూడా నిజం కాదు. తనకొసలు మనసులో గుర్తులేకున్నా బలవంతంగా అడిగిమరీ తీసుకోవటం జరిగింది. 207.మనసు సంకల్పవికల్పాత్మకం. అనేక ఆలోచనాతరంగాలు ఒకటిపైన మరొకటి లేస్తుంటాయి. మొదట ఒకటి అనుకుంటే, వెంటనే మరో ఆలోచన వస్తుంది.208. మొదట వచ్చిన ఆలోచన భావన మంచిదై ఉండాలి. దానినే అలా పోషిస్తే అది శుభప్రదం.209.దానినే చక్కగా అనుసంధానం, నిదిధ్యాసన చేయాలి.దానిని మరచిపోకూడదు.అన్నమాటను నిలుపుకోవటానికి ప్రయత్నం చేయాలి.210. అప్పాసాహేబు అన్న మాటను తరువాత మరచి పోయేవాడే. కాని బాబా అతని కోరికను తీర్చి భక్తి యొక్క విశేషాన్ని చూపించారు.211.ఫకీరువద్ద పదిరూపాయల నోటుతో పాటు మొత్తం 19 రూపాయలుండగా అతడు అప్పాకు తొమ్మిది రూపాయలను మాత్రమే ఎందుకు ఇచ్చాడు? అంటే అప్పాకు పదిరూపాయలకంటే తక్కువకాకుండా ఇవ్వాలని ఉండినది.212.బాబా చేతి స్పర్శ కలిగిన ఆ తొమ్మిది బంగారు నాణెముల హారం, నవవిధ భక్తి ప్రేమలను భక్తులకు గుర్తుచేయటం బాబా మార్గం. 213.బాబా తమ శరీరాన్ని విసర్జించే సమయంలో వారు స్వయంగా తొమ్మిది రూపాయలను దానంగా ఇచ్చిన కథను వింటే వారి అభినవ దానవైఖరి అర్థమవుతుంది.214. అప్పా భార్య కాయావాచామనసా ఒకే రూపాయిని ఇవ్వగా ఫకీరు సంతృప్తిగా స్వీకరించాడు. మరల అడగలేదు.215. కాని తన భార్య ఇచ్చినది తక్కువ అని అప్పా మనసుకు తోచింది.'నేనైతే ఫకీరుకు పదింతలు ఇచ్చేవాణ్ణి' అని అనుకున్నాడు.216.అప్పా అలా పదిరూపాయలు

ఇస్తానని వచన బద్ధుడైనప్పుడు వానిని ఇవ్వకపోతే ఇచ్చిన మాటనుండి ఋణంనుండి ముక్తుడు ఎలా కాగలడు? 217. ఆ ఫకీరు ఇతరుల వంటి వాడు కాడు. ఎవరో బికారి అయితే చేతిలో ఏదో పడగానే వెనక్కు తిరిగి వెళ్లిపోతాడు. 218. కాని ఆ రోజు గడవకుండానే ఆ రోజే మరల వచ్చాడు. ఎవరో అపరిచితుడైన ఫకీరని అప్పా అనుమానించాడు. 219. ఫకీరు అడిగినప్పుడు అప్పావద్ద ఆరు రూపాయలు ఉన్నాయి. కాని ఆ డబ్బును ఇవ్వలేదు. 220. అప్పాపై ప్రేమలేకపోతే, బాబా ఫకీరు వేషంలో ఎందుకు వస్తారు? దక్షిణ అనే మిషలేకపోతే ఈ కథ రసవత్తరంగా ఉంటుందా? 221. అప్పాసాహేబు నిమిత్తమాత్రుడు. మీది మాది మన అందఱి పద్ధతి ఇదే. మొదట ఉదారంగా ఆలోచిస్తాం. కాని సమయం వచ్చినప్పుడు సందర్భానుసారం ప్రవర్తిస్తుంటాం. 222. మనమంతా వాగ్దాన తత్పరులం. దానం చేసేటప్పుడు అనేక సందేహాలతో ప్రాణం క్రిందా మీదా అవుతుంది. నిశ్చయమన్నది అరుదు. 223. మితంగా హితాన్నే మాట్లాడుతూ, తాము అన్న ప్రకారం ప్రవర్తించేవారు తమమాటను నిజంగా చేసి చూపించే హరి యొక్క ప్రియపుత్రులు, ఎక్కడో ఒకరు ఉంటారు. 224. అనన్యమైన భక్తిభావంతో ఉండే భక్తులు, ఐహికమైనవి గాని, లేక ఆముష్మికమైనవి గాని, కోరికలను కోరుకుంటే సాయిసమర్థులు వానిని తీర్చుతారు. 225. అప్పాసాహేబు మంచి తెలివిగలవాడు. ఆంగ్ల విద్యావిశారదుడు. అతనికి ప్రభుత్వం మొదట జీతం నలభైరూపాయలను మాత్రం ఇచ్చేది. 226. తరువాత బాబా యొక్క పటం లభించాక జీతం క్రమక్రమంగా పెరిగి ఆ నలభైకి ఎన్నోరెట్లు పెరిగింది. 227. బాబా ఒకటికి పదింతలు ఇస్తారు. పదింతల అధికారం. పదింతల సత్తా. ఇది బాబా వద్ద ఎప్పుడూ అందరికీ అనుభవం. 228. పైగా ఈ భక్తి నిష్ఠలు పరమార్థ దృష్టిని పెంపొందించటం ఇది సామాన్య విషయమా? 229. బాబాలీల విచిత్రమైనది. తరువాత ఫకీరు అప్పాకు ఇచ్చిన విభూతి పొట్లాన్ని భక్తిగా విప్పిచూచాడు. 230. విభూతితో పాటు

దానిలో పూలు అక్షింతలూ ఉన్నాయి. తాయతును చేయించుకుని దానిలో వానిని ఉంచి అత్యంత పూజ్యభావంతో చేతికి కట్టుకున్నాడు.231.తరువాత బాబా దర్శనం చేసుకున్నప్పుడు బాబా స్వయంగా ఇచ్చిన తమ వెంట్రుకను కూడా తాయత్తులో భద్రపరుచుకున్నాడు.232.బాబా యొక్క విభూతి మహిమ ఎంత గొప్పది? విభూతి శంకరుని భూషణం. భక్తిగా నొసటన రుద్దుకుంటే, విఘ్నాలన్నీ వెంటనే తొలగిపోతాయి.233.ముఖం కడుక్కుని, లేదా స్నానం చేసి, నిత్యం విభూతిని రాసుకుని, చరణతీర్థంతో పాటు సేవిస్తే పవిత్రత పుణ్యం కలుగుతాయి. 234.అంతేకాదు విభూతి విశేషమేమిటంటే, నిత్యం సేవిస్తే పూర్ణాయువు కలుగుతుంది. పాతకాలు నిశ్శేషంగా నశించిపోయి ఎల్లప్పుడూ సుఖంగా సంతోషంగా ఉంటారు. 235. ఇటువంటి మధురమైన కథామృత సేవనాన్ని సాయిబాబా అప్పా కొఱకు ఏర్పాటు చేశారు.ఆ విందు పంక్తిలో, మనం అతిథులుగా వచ్చిన బంధువులం కనుక,యథేచ్ఛగా ఆరగిద్దాం. 236.అతిథులకు ఇంటి యజమానికి ఒకటే విందు. రసాన్ని ఆస్వాదించడంలో ఏ భేదభావం లేదు. ఆత్మానందరూపంలో ఉన్న ఈ విందును సేవించి సంతృప్తులవ్వండి.237.హేమాడ్ సాయికి శరణు వేడుతున్నాడు. ఇక ఇంతవరకు శ్రవణం చాలు. తరువాతి అధ్యాయంలో ఇంతకంటె గొప్పగా విభూతి యొక్క మహిమను చెప్పుతాను. 238. సాయిబాబా దర్శనం మరియు విభూతి చర్చనంతో ఎముకలలో వ్రణం నిర్మూలనమవటం, నారుకురుపు నివారణం, గ్రంథి జ్వరం తొలగిపోవటం మొదలగువానిని శ్రద్ధగా వినండి. 239. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో విభూతి ప్రభావమన్న ముప్పది మూడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 34 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయంలో విభూతి మహిమ యథార్థంగా చెప్పబడింది. ఈ అధ్యాయంలో కూడా విభూతి యొక్క గుణాలను, లక్షణాలను వర్ణిస్తాను.1.వెనుకటి అదే కథా వృత్తాంతాన్ని అదే విభూతి వైభవాన్ని ఇప్పుడు శ్రోతలు తమ సుఖసంతోషాల కొఱకు ఏకాగ్ర మనసులతో వినండి.2.ఎముకలలోని వ్రణంతో దుర్భరమైన రోగం ఏ ఉపాయాలతోనూ తొలగకపోతే,సాయిబాబా తమ చేతితో విభూతిని అద్దగా బాధ నిర్మూలనమైంది. 3. ఇటువంటి విభూతి కథలు అనేకం.శ్రోతలకు ముచ్చుకు ఒకటి చెప్తాను. ఇది అనుభవపూర్వకమైనది కనుక వింటే అద్భుతంగా ఉంటుంది.4.నాసిక్ జిల్లాలోని మాలెగాం ఊరిలో, డాక్టరుగా ఉన్న ఒక వ్యక్తి యొక్క సోదరుని కుమారునికి వచ్చిన వ్యాధి బాధ ఏ ఔషధాలతోను తగ్గలేదు.5.అతడు స్వయం వైద్యుడు. స్నేహితుడూ వైద్యుడు. అనేకరకాల చికిత్సలు చేశారు.వారు శస్త్రచికిత్స చేయగల సమర్థులు. వారు ఎంతో అనుభవమున్న వారైనా వారి బుద్ధికి ఏం తోచలేదు.6.ఎముకలలో వ్రణం అనే జబ్బు. ఆ పదం అపభ్రంశమై ఎముకల వ్రణం అని పేరు మార్పుచెందినది. ఈ జబ్బు దుర్భరమైనది. మందులతో నయమయ్యేది కాదు. 7.అయినా దేశవిదేశాలలోని చికిత్సలన్నిటినీ ఏది వదలకుండా అనేక ప్రయత్నాలు చేశారు. శస్త్ర చికిత్స కూడా చేశారు కాని, దేనివల్ల గుణం కనిపించలేదు. 8.చిన్న వయసులో ఉన్న అబ్బాయి, బాధను సహించలేక విలవిలలాడుతుంటే, ఆప్తులు బంధువులు

ఆందోళన చెందేవారు. 9. ప్రయత్నాలన్నీ పరాకాష్ఠనందుకున్నాయి. అయినా వ్యాధి ఏ కాస్త అయినా తగ్గలేదు. ఆప్తులు, మిత్రులు, బంధువులు దేవతలను ఆరాధించమని అతనికి సలహా ఇచ్చారు. 10. దేవీ దేవతలుగాని, కులదేవత గాని ఎవరూ కూడా సహాయపడలేదు. శిరిడీ గ్రామంలో అవలియా ఉన్నారన్న వార్త వారి చెవికి సోకింది. 11. వారు శిరిడీలోని సత్పురుష శ్రేష్ఠులు. యోగీశ్వరులైన సాయిమహారాజు కేవలం దర్శనంతో వ్యాధిని తొలగిస్తారని విన్నారు. 12. అబ్బాయి తల్లిదండ్రులకు సాయిని సందర్శించుకోవలెనని కోరిక కలిగింది. భగవంతుని తలచుకుని ఈ ప్రయత్నం కూడా చేయాలని నిశ్చయించుకున్నారు. 13. వారు గొప్ప మహాత్ములు. వారి చేత్తో విభూతిని రాస్తే భయంకరవ్యాధి అయినా నశించిపోతుందని ప్రజలు అనుకుంటారు. వెళ్లి మన అనుభవాన్ని తెలుసుకోవడంలో నష్టమేముంది? 14. వెళ్లి వారి పాదాలకు వందనం చేసి చివరి ప్రయత్నం కూడా చేద్దాం. దానివల్లనైనా ఈ అపాయం తొలగవచ్చు. ఇది ఒక్కటే తరుణోపాయం. 15. అని తలచి అబ్బాయి తల్లిదండ్రులు సాయి దర్శనానికి ఆతురతతో గబగబా బయలుదేరి శిరడీ చేరారు. 16. వెంటనే బాబా దర్శనం చేసుకుని, వారి చరణాలకు సాష్టాంగ వందనం చేసారు. అబ్బాయి యొక్క బాధను గురించి చెప్పి వారి ఎదుట నిలబడ్డారు. 17. చేతులు జోడించి దీనంగా దుఃఖపూరితంగా బాబాకు విన్నవించారు. 18. 'వ్యాధితో బాధపడుతున్న ఈ బాలుడి బాధను మేము చూడలేకుండా ఉన్నాం. ఏం చేయాలో తెలియటంలేదు. వ్యాధి నయమవుతుందన్న ఆశ కనిపించటంలేదు. 19. పుత్రుని బాధను చూచి మేము బాగా క్రుంగిపోయాం. సాయిసమర్థా! మీ అభయ హస్తాన్ని ఇతని శిరస్సుపై ఉంచి బాధను తొలగించండి. 20. మీ మహిమను విని, మేము ఇక్కడికి వచ్చి అనన్య భక్తితో మీ శరణుజొచ్చాం. ఇతనికి ప్రాణదానం చేయండి' అని వేడుకున్నారు. 21. అప్పుడు కరుణామయులైన సాయి, వారికి ధైర్యాన్ని కలుగచేశారు. 'ఈ మసీదును ఆశ్రయించిన

వారికి కల్పాంతంలో కూడా దుర్గతి కలగదు. 22. ఇప్పుడు మీరు నిశ్చింతగా ఉండండి. విభూతిని తీసుకుని వ్రణంపై అద్దండి. ఎనిమిది రోజులలో బాధ తగ్గిపోతుంది. దేవునిపై విశ్వాసముంచండి. 23.ఇది మసీదు కాదు.ద్వారావతి. ఇక్కడ కాలు మోపినవారు వెంటనే ఆరోగ్యాన్ని క్షేమాన్ని పొందుతారు. ఇది మీకు కూడా అనుభవమవుతుంది. 24.ఇక్కడికి వచ్చి బాగుకాకపోవటం త్రికాలాల్లో కూడా జరగదు. ఈ మసీదు మెట్లెక్కిన వారి లక్ష్యం నెరవేరినట్లే అని తెలుసుకోండి.25.తరువాత బాబా ఆజ్ఞానుసారం బాధపడుతున్న బాలుని బాబా ఎదుట కూర్చుండ బెట్టారు. బాబ అతని పాదంపై చేత్తో నిమిరి అతనిపై కృపాదృష్టిని ప్రసరించారు.26.అది కేవలం శారీరకమైన బాధ. మానసికవ్యధ ఐనా లేక దైవయోగం వలన వచ్చిన బాధైనా సరే బాబా దర్శనంతో నిర్మూలనమై పోతుంది.27.సాయిబాబా వదనాన్ని చూస్తే చాలు.దుఃఖమంతా తక్షణం నశించిపోతుంది. వారి వచనామృతాన్ని సేవిస్తే రోగికి పరమ సుఖం కలుగుతుంది.28.ఆ తరువాత వారు శిరిడీలో నాలుగురోజుల వరకు ఉన్నారు.వ్యాధి నయమవటంతో వారికి సాయి చరణాలయందు విశ్వాసం కూడా కుదిరింది.29.అప్పుడు ఆ ముగ్గురూ బాబా యొక్క పూర్తి అనుమతితో మనసుల నిండా ఆనందంతో సంతృప్తిగా తమ ఊరికి తిరిగి వెళ్ళారు 30.ఇదేం చిన్న చమత్కారమా ! విభూతిలేపనం మరియు బాబా కృపాకటాక్షవీక్షణం, అపూర్వమైన ఈ ఉపచారాలతో ఎముకలలోని వ్రణం మానింది.31.భాగ్యంకొద్దీ ఇటువంటి మహాపురుషుని దర్శనం,వారిధైర్య వచనాలు, శుభప్రదమైన వారి ఆశీస్సులు లభిస్తే చాలు వ్యాధి నిర్మూలనమవుతుంది.32.అబ్బాయి వ్రణంపై విభూతిని అద్దుతూ, సేవించగా కొంతకాలానికి వ్రణం ఎండిపోయి అబ్బాయి ఆరోగ్యవంతుడయ్యాడు. 33.ఈ విషయాన్ని విని మాలెగాం ఊరిలో ఉన్న అబ్బాయి యొక్క బాబాయి సాయిబాబా దర్శనం చేసుకోవలెనని తలచాడు. ముంబైకి తిరిగి

వెళ్లేటప్పుడు శిరిడీ వెళ్లి తన కోరిక తీర్చుకోవలెనని తనలో అనుకున్నాడు.34.తరువాత ముంబైకి బయలుదేరగా మాలెగాంలోను మన్‌మాడ్‌లోను ఎవరో అతని మనసులో అనుమానాన్ని లేపారు.దానితో అతడు శిరిడీ వెళ్లే తన నిశ్చయాన్ని మానుకున్నాడు.35.మంచి పనులలో ఇలాగే అవుతుంది. మొదట కుత్సితబుద్ధిగలవారు అడ్డుతగులుతారు. లోకుల మాటలను లెక్కచేయనివారే చివరకు సద్గతిని పొందుతారు. 36.సత్పురుషుని దర్శనాభిలాషను అణచివేసుకున్న ఆ వ్యక్తి నేరుగా ముంబైకి వెళ్లిపోయాడు. సెలవును అలీబాగులో సుఖంగా గడపాలని అతని ఉద్దేశం.37.అలా నిశ్చయించుకున్నాక, వరుసగా మూడురాత్రులు నిద్రలో 'ఇంకా నాపై అవిశ్వాసమా!' అన్న మాటలు వినిపించాయి.38.వరుసగా విన్న ఆ అశరీరవాణికి డాక్టరు ఆశ్చర్యపోయాడు. ఆ మాటలు నిజమనిపించాయి. అతడు శిరిడీ ప్రయాణానికి నిశ్చయించుకున్నాడు.39.కాని ఒక రోగికి టైఫాయిడ్ జ్వరం ఉండటం వలన ఆ డాక్టరు యొక్క చికిత్స అతనికి అవసరమైనందున, ఆ రోగికి నయమైన వెంటనే శిరిడీ బయలుదేరాలని అనుకున్నాడు. 40.కాని ఆ జ్వరం చాలా తీవ్రంగా ఉండి ఎలాంటి చికిత్సకు గుణం కాలేదు. జ్వరం కాస్తైనా తగ్గలేదు. అందువలన ప్రయాణం వెంటనే కుదురలేదు.41.అప్పుడు అతడు మనసులో ఈ రోజు రోగికి జ్వరం తగ్గితే నేను క్షణం ఆలస్యం చేయకుండా రేపు శిరిడీకి ప్రయాణమవుతానని నిశ్చయించుకున్నాడు. 42.అలా దృఢంగా సంకల్పించుకోగా రెండు మూడు గంటలకే జ్వరం తగ్గింది. డాక్టరు సంకల్పం ఫలించి శిరిడీ బయలుదేరాడు.43.తను తలచినట్లు శిరిడీకి వెళ్లి భక్తిగా బాబా పాదాలకు వందనం చేశాడు. బాబా కూడా అతని మనసులోని అనుభవాలను దృఢపరచి తమ సేవయందు అతనిని ధ్యానమగ్నుని చేశారు. 44.తమ అభయ హస్తాన్ని అతని శిరసుపై ఉంచి, ఆశీర్వదించి, విభూతి ప్రసాదాన్ని ఇచ్చారు. డాక్టరు సాయి యొక్క అమోఘమైన

మహిమను గని ఆశ్చర్యపడ్డాడు. 45.అక్కడ నాలుగురోజులుండి ఆనందంగా తిరిగి వెళ్లిపోయాడు. పదునైదు రోజులు గడవక ముందే అతనికి ప్రమోషను వచ్చి వైజాపుర్‌కి వెళ్లాడు.46.అబ్బాయికి ఎముకలలో వ్రణం కారణంగా సాయి యొక్క దర్శనభాగ్యం కలిగి వారి చరణాలయందు ప్రేమ కుదిరింది.అలా అతడు శాశ్వతమైన సుఖాన్ని కూడబెట్టుకున్నాడు. 47.ఒకసారి ఇలాగే డాక్టరు పిల్లే నారుకురుపు బాధతో వ్యాకులపడ్డాడు. ఒకటిపై ఒకటి ఏడు కురుపులు లేవగా అతనికి చాలా దుఃఖం కలిగింది. 48.బాబాపై అతనికి చాలా ప్రేమ. బాబా అతనిని 'భావూ' అని ముద్దుపేరుతో పిలిచేవారు.రోజూ ఎంతో ప్రేమగా భావూ యొక్క యోగక్షేమాలను అడిగేవారు. 49.ఉదయం, సాయంత్రం మసీదు కటకటాల వద్ద భావూ కూర్చునే వాడు. బాబా అతనితో చాలా సమయం గడిపేవారు. వారిద్దరూ పరస్పరం హాయిగా ముచ్చటించుకునే వారు. 50.బాబా చిలుం పీల్చేటప్పుడు భావూ ఉండాలి. బీడీ కాల్చేటప్పుడు భావూ ఉండాలి.ఏ విషయమైనా నిర్ణయించేటప్పుడు భావూ ఉండాలి. అతడు దగ్గర లేకపోతే బాబాకు అసలు తోచేదికాదు. 51.అలా ఉండేది అతని కథ. నారుకురుపు బాధను భరించలేక భావూ అత్యంత నిరుత్సాహంతో దుఃఖంతో మంచం పట్టాడు. 52. ఇటువంటి దారుణమైన పరిస్థితిలో కూడా నోరారా సాయి నామస్మరణ చేసేవాడు. ఈ బాధ ఇక చాలు బాబూ ! ఈ యాతనకంటె మరణం మేలు అని సాయికి శరణువేడుకునేవాడు. 53.నా ఈ శరీరం పైన ఈ వ్రణాలు ఇంకా ఎంత కాలం?ఈ దుఃఖాన్ని అనుభవిస్తూ విసిగెత్తిపోయాను. ఈ బాధ సహించటానికి నాకిక శక్తిలేదు.54. పరిశుద్ధాచరణతో ప్రవర్తించే నాకు ఈ దుఃఖావస్థ ఎందుకు? నేనెన్నడూ దుష్కర్మలు చేయలేదే! నా తలపై ఈ పాపమెందుకు? 55.బాబా!ఈ నారుకురుపు బాధ మరణప్రాయంగా ఉంది. ఇంక నేనీ బాధను భరించలేను. ఇంతకంటే చావు వచ్చినా పర్వాలేదు. ఈ బాధను

తరువాతి జన్మలో అనుభవిస్తాను.56. ప్రారబ్ధ కర్మను ఎప్పుడూ తప్పించుకోలేం. దీనిని అనుభవించకుండా ఉండే మరోదారిలేదు, దీని కోసం మరోజన్మ నెత్తాలి. మందమతినైనా నాకిది తెలుసు.57.పది జన్మలనైనా సరే ఎత్తి సంతోషంగా నా ఈ కర్మను అనుభవిస్తాను. ఈ జన్మను ఇంతటితో చాలించేలా నన్ను అనుగ్రహించండి. 58.ఈ జన్మలో జీవించినది చాలు. ఈ జీవితం నుండి నన్ను విముక్తుణ్ణి చేయండి.ఇక నాకీ కష్టాలు వద్దు. ఇదే నేను మిమ్మల్ని వేడుకోవటం అని సాయికి కబురు పంపాడు.59.పిళ్లే ప్రార్థనను విని సిద్దపురుషులైన సాయి మహారాజు అంతఃకరణం కరగిపోయి కరుణ ఉప్పొంగింది. వారు డాక్టరు పిళ్లేను శాంతింప చేయటానికి కురిపించిన కరుణామృతాన్ని సేవించండి. 60.భక్తుల కోరికలను తీర్చే కల్పద్రుమమైన బాబా పిళ్లే యొక్క పరమ దుఃఖావస్థను గని అతని బాధను ఉపశమింప చేయటానికి ఉపాయం పన్నారు.61.బాబా విషయాన్ని విని పిళ్లే యొక్క కబురును తెచ్చిన దీక్షితుతో 'నువ్వు నిర్భయంగా ఉండు అని అతనితో చెప్పు.62.పది జన్మల వరకూ ఎందుకూ? మొత్తం పదిరోజులు అనుభవిస్తే చాలు.పరస్పరం కలిసి పంచుకుని అనుభవిద్దాం అని అతనితో చెప్పు' అని అన్నారు. 63.స్వార్థంగాని పరమార్థంగాని అథవా మోక్షంగాని ఇవ్వటానికి సమర్థుణ్ణి నేను ఉండగా అనర్థమైన మరణాన్ని కోరుకుంటున్నావు. ఇదేనా నీ పురుషార్థం?64.అతనిని లేపి ఎవరి వీపుపైననో మోసుకుని తీసుకునిరండి. ఈ కర్మ భోగాన్ని ఓర్పుతో అనుభవించాలి.గాని భయంతో బెంబేలు పడవద్దను' అని చెప్పారు.65.వెంటనే అటువంటి స్థితిలో డాక్టరు పిళ్లేను మసీదుకు తీసుకుని వచ్చారు. బాబా తమ వెనుకనున్న తలగడను తీసి తమ చేత్తో అతనికి ఇచ్చారు. 66.తమకు కుడివైపు ఫకీరు బాబా కూర్చునే చోట తలగడను ఉంచి,'దీనికి ఆనుకుని ఊరికే కూర్చో. అనవసరమైన చింత పెట్టుకోకు. 67.కాళ్లు బాగా చాపుకో. దానివల్ల నీకు హాయిగా ఉంటుంది. చేసుకున్న కర్మ

అనుభవించకుండా ముగిసిపోదు. ఈ ఉపాయం తప్ప మరో దారి లేదు.68. ఇష్టాయిష్టాలు, సుఖదుఃఖాలు, అమృతం లేదా విషం ఈ ద్వంద్వాలు సంచిత కర్మానుసారం ప్రవాహంవలె వచ్చిపడతాయి. వీని కోసం ఆనందించకూడదు, దుఃఖించకూడదు. 69.కర్మానుసారం వచ్చినవానిని సహనంతో అనుభవించాలి. అల్లామాలిక్ జగద్రక్షకుడు. ఎల్లప్పుడూ అతని స్మరణలో ఉండాలి. అన్ని బాధ్యతలనూ వారే చూచుకుంటారు.70.తనువు మనసు ధనం వాక్కులతో సహా వారి చరణాలను ఆశ్రయించాలి. నిరంతరం వారి స్మరణలో ఉంటే వారి లీల తెలిసి వస్తుంది' 71. అప్పుడు డాక్టరు పిళ్లే బాబాతో,'నానాసాహేబు చందోర్కరు నారు కురుపుపైన పట్టీ కట్టాడు. అయినా ఏం తగ్గలేదు' అని చెప్పాడు. 72.'నానా పిచ్చివాడు. ఆ పట్టీని విప్పేసేయి లేదా చస్తావు. ఇప్పుడు కాకి వచ్చి పొడుస్తుంది. దానితో నీవు బాగైపోతావు' అని బాబా చెప్పారు.73.అలా మాట్లాడుతున్న సమయంలో,అబ్దుల్ ప్రమిదలలో నూనె పోయటానికి పైకి వచ్చాడు. అప్పుడు అకస్మాత్తుగా ఏం జరిగిందంటే,74.అసలే మసీదు ఇరుకు. పైగా భక్తులు బాగా గుంపులుగా ఉన్నారు. అందులో పిళ్లే గొడవ. అబ్దుల్‌కు అడుగు వేయడానికి ఇబ్బందిగా ఉంది.75.అతడు తనవనిలో మునిగి ఉన్నాడు. అతని దృష్టి ప్రమిదలపైనే మగ్నమై ఉంది. అందువల్ల పిళ్లే వైపు చూడలేదు. అప్పుడు విచిత్రమైన సంఘటన జరిగింది.76.అబ్దుల్ మాత్రం ఏం చేస్తాడు? జరుగుతున్న దానిని ఎవరూ ఆపలేరు కదా! పిళ్లే కాలు చాచుకుని కూర్చున్నాడు. ఆ కాలిపై అబ్దుల్ కాలు పొరపాటుగా పడింది.77.పిళ్లే కాలు అసలే బాగా వాచి ఉంది. దానిపైన అబ్దుల్ కాలు పడగానే ఒక్కసారి బాధతో గట్టిగా కేకవేశాడు. ప్రాణం విలవిలలాడింది. 78.ఆ కేక తలలోకి చొచ్చుకునిపోయింది. బద్ధాంజలుడై బాబాతో దీనంగా మొఱపెట్టుకోసాగాడు. దానిని వినండి.79.నారుకురుపులు పగిలి చీము కారసాగింది. పిళ్లే చాలా బాధపడ్డాడు. ఒక వైపు ఏడుస్తూ మరోవైపు

పాడసాగాడు. 80.'కరంకర్ మేరె హాల్ పర్‌తూ కరీమ్. తేరా నాం రహామాన్ హై బొర్ రహీం. తూహీ దోనో ఆలంకా సుల్తాన్ హై. జహామే నుమాయా తేరీ శాన్ హై. ఘనాహోనే వాలా హై సబ్ కారోబార్ రహనూర్ తేరా సదా ఆశ్‌కార్ తూ ఆశిక్‌కా సదా మదతగార్ హై ॥ దయామయా । నీ పేరు కరుణామూర్తి. నాస్థితిని గని నన్ను కరుణించు. రెండు ప్రపంచాలకు నీవే మహారాజువి. నీ మహిమ ప్రపంచంలో వ్యాపించి ఉంది. ప్రపంచ వ్యవహారాలన్నీ ముగిసిపోయినా నీ మహిమ శాశ్వతంగా ఉంటుంది. నీవు ఎల్లప్పుడూ భక్తులకు సహాయకారివి. పిళ్లే కాలిపోటు ఆగి ఆగి వస్తూంది. అతని ప్రాణం వికలమైపోయింది. బాగా నీరస పడిపోయాడు. అదంతా సాయిబాబా యొక్క లీల అని అర్థమైంది. 81.'చూశారా! భావూ బాగైపోయి పాడసాగాడు' అని బాబా అన్నారు. పిళ్లే బాబాను, 'ఇంకా ఆకాకి వచ్చి పాడుస్తుందా'? అని ప్రశ్నించాడు. 82. అప్పుడు బాబా 'నువ్వు వెళ్లి వాడాలో సుఖంగా పడిఉండు. ఇప్పుడు ఇక కాకి పాడవలానికి ఘరలరాదు. 83. ఇప్పుడు అదేగా వచ్చి వెళ్లింది అదేగా నీకాలు త్రొక్కింది, అదే పాడిచి పారిపోయింది. నీ నారుకురుపును మట్టుపెట్టింది. 84. ఎక్కడి కాకి? ఎక్కడి కథ? అబ్దుల్ రూపంలో కాకిని ప్రకటించేసి బాబా జరగవలసిన దానిని తమ సమక్షంలో జరిపించారు. అలా తము మాటను నిజం చేశారు. 85. అది మాట కాదు. బ్రహ్మలిఖితం. కర్మను కూడా అడ్డగించగలరు. త్వరలోనే భావూకు బాధ తగ్గి హాయిగా అనిపించింది. 86. విభూతి లేపనం, విభూతి సేవనం, ఇదే ఔషధం, ఇదే అనుపానంతో పదవరోజు ఉదయం రోగం నిర్మూలమైంది. 87. కురుపులలోనుండి సన్నని తీగల్లాంటి బ్రతికి ఉన్న పురుగులు బయటికి వచ్చాయి. దుర్భరమైన బాధ తగ్గి దుఃఖం అంతమైంది. 88. ఈ చమత్కారానికి పిళ్లే ఆశ్చర్యపోయాడు. బాబా యొక్క ఉదారచర్యకు అతని నయనాల నుండి ప్రేమాశ్రువులు స్రవించాయి. 89. పిళ్లే అక్కడే బాబా చరణాలను కౌగలించుకున్నాడు.

అతని కంఠం గద్గదమై అతని నోట మాట పెగలలేదు.90.మరొక అనుభవాన్ని చెప్పి ఇక్కడికి విభూతి ప్రభావాన్ని ముగిస్తాను. భక్తి భావాలననుసరించి అనుభవాలు కలుగుతాయి. ఇదే ఈ గ్రంథం యొక్క సారం.91.ఒకసారి మాధవరావు యొక్క తమ్మునికి కష్టం వచ్చినప్పుడు విభూతితో అతని ఆపద తొలగింది.92.ఇటువంటి విభూతి ప్రభావాన్ని నేనెంతని వర్ణించను? గ్రంధిజ్వరం మొదలగు అన్ని రోగాలకు అటువంటి అత్యంత ఉత్కృష్టమైన ఔషధం మరొకటి లేదు.93.సావుల్ విహారు వద్ద ఉన్నప్పుడు, బాపాజి భార్యకు జ్వరం వచ్చింది. ఆమె తొడపై గడ్డ రాగా, బాపాజీ చాలా ఆందోళన పడ్డాడు.94.భయంకరమైన రాత్రి సమయంలో భార్య ఆవేదనను చూచి, బాపాజీ భయపడిపోయాడు. అతని ధైర్యం సడలిపోయింది.95. ఆ రాత్రికి రాత్రి భయంతో వణికిపోతూ పరుగున శిరిడీకి వచ్చి అన్నతో వృత్తాంతాన్నంతా చెప్పాడు.96.రెండు గడ్డలు లేచాయి. ఆమె జ్వరంతో కాలిపోతూంది. చాలా బాధ పడుతూ ఉంది. నాకు మంచి లక్షణాలేవీ కనిపించటంలేదు. వచ్చి నీ కళ్లతో చూడు అని చెప్పాడు.97.బాపాజీ దీనంగా చెప్పగా,మాధవరావుకు కూడా భయాందోళనలు కలిగాయి.నోరు ఎండి పోయింది.మనసు నిలకడగా లేదు. 98.మాధవరావు తెలివిగలవాడు కనుక గడ్డలు అనగానే అతనికి విషయం అర్థమై అదురుపుట్టింది. గ్రంథిజ్వరం(ప్లేగు)ప్రాణాంతకమని అందరికీ తెలిసిందే.99. శుభకార్యమైనా అశుభకార్యమైనా, మంచి పని అయినా చెడు అయినా ముందు సాయిబాబాను సంప్రదించటం శిరిడీలో పరిపాటి.100.భక్తుల కష్టాలను తొలగించేది వారే కనుక వారు చెప్పినట్లుగా ఆచరించటం అలవాటు. అటువంటి ఎన్ని అనుభవాలను వర్ణించగలం? 101.ఆ పద్ధతిని అనుసరించి మాధవరావు ముందుగా బాబాకు సాదరంగా సాష్టాంగ నమస్కారం చేసి,102.'జయ జయ సాయినాథా ! అనాథులమైన మమ్ము అనుగ్రహించండి. ఇప్పుడు ఈ కష్టం ఎందుకు? లేని

చింతపుట్నుకొచ్చింది. 103.మిమ్ముకాక వెళ్లి వేరే ఎవరిని యాచించను? బాబా ! ఆ స్త్రీని ఆశీర్వదించి ఆమె బాధను నివారించండి. 104.ఈ కష్టాన్ని తొలగించండి. మీరు తప్ప మాకు సాయంచేసేవారు ఎవరున్నారు? దుర్భరమైనజ్వరాన్ని ఉపశమింపచేసి, మీ మాటను నిలబెట్నుకోండి'105.అని వేడుకుని వెళ్లటానికి అనుమతిని కోరాడు. బాబా అతనితో 'ఈ అపరాత్రి నీవు వెళ్లకు విభూతిని ఇచ్చి పంపు' అని చెప్పారు.106.'అల్లామాలిక్ మన తండ్రి.ఏ జ్వరమైనా ఎటువంటి గడ్డ అయినా దానంతట అదే తగ్గిపోయి, తప్పక హాయి కలుగుతుంది.107.రేపు తెల్లవారగానే సావుల్ విహీరుకు వెళ్లిరా. ఇప్పుడు వెళ్లాలని ఆరాటపడకు. ఇక్కడే నిశ్చింతగా ఉండు.108.రేపు వెళ్లిరా.అనవసరంగా దుఃఖపడకు. విభూతిని రానుకుని భక్తిగా సేవిస్తే చాలు. ఎందుకు భయపడటం?'అని చెప్పారు. 109.బాబా మాటలను విని బాపాజీ భయపడ్డాడు.అతనికి నిరాశ కలిగింది. మాధవరావుకు మూలికలు ఆకుల వైద్యం తెలుసు. కాని ఇప్పుడు అవేవీ ఉపయోగ పడవు.110.ఒక్క సాయిబాబా అనుగ్రహం తప్ప ఔషధాలు తగ్గించలేమన్న రహస్యాన్ని మాధవరావు బాగా ఎరుగును.111.కనుక బాబా ఆజ్ఞను శిరసావహించి విభూతిని పంపించి తాను శిరిడీలోనే నిశ్చింతగా ఉన్నాడు.బాపాజీ మాత్రం నిరాశతో వెళ్లిపోయాడు.112.భార్య శరీరానికి విభూతిని రాసి కాస్త నీళ్లలో కలిపి కడుపులోకి త్రాగించగా బాగా చెమటలు పట్టి ఆమె బాగా నిద్రపోయింది.113.మరునాడు సూర్యోదయమయ్యే సరికి ఆమెకు ప్రాణం బాగా కుదుటపడింది. జ్వరంలేదు, విషపు గడ్డలులేవు. బాపాజీకి ఆశ్చర్యం కలిగింది.114.ఇక్కడ మాధవరావు నిద్రలేచి శుభ్రంగా ముఖం కడుక్కుని, సావుల్‌విహీరు వెళ్లటానికి బయలుదేరి బాబా దర్శనానికి మసీదుకు వచ్చాడు.115.బాబా పాదాలకు సాష్టాంగ వందనం చేసి విభూతిని, ఆశీర్వాదాన్ని తీసుకుని అక్కడి నుండి బయలుదేరాడు.116.మసీదు మెట్లు దిగుతుండగా బాబా, 'శామా ! వెంటనే తిరిగి

వచ్చేసేయి. అక్కడ ఆలస్యం చేసే అవసరం లేదు' అని ఆజ్ఞాపించడం వినిపించింది.117.రెండు గడ్డలతో తమ్ముని భార్య బాధను ఎలా భరిస్తోందో ఏమో. ఎంతో వేదన పడుతూ ఉండాలి. ఎంత తపన పడిపోతూ ఉందో అని మాధవరావు దారిపొడుగునా మదన పడసాగాడు.118.బాబా వెంటనే వచ్చేయమని ఎందుకు అన్నారు? వారు ఏదో సూచించినట్లు ఉంది అని ఆందోళనపడుతూ మాధవరావు గబగబా వెళ్లాడు.119.సావుల్ విహారు చేరుకునే వరకూ ధైర్యం లేదు. కాని గడపలో అడుగుపెట్టగానే అతనికి చమత్కారం కనిపించింది.120.గతరాత్రి గ్రంథి జ్వరంతో ఉన్న స్త్రీ పాయ్యి మీద టీ తయారు చేస్తూ ఉంది.ఆ విపరీత పరిస్థితిని చూచి మాధవరావు ఆశ్చర్యపోయాడు. 121.అప్పుడు ఈమె రోజూలాగే పనులు చేస్తూ ఉందే అని బాపాజీతో అనగా, బాపాజీ 'ఇదంతా నిజంగా బాబా విభూతి యొక్క అద్భుత చర్య' అని చెప్పాడు.122.నేను రాగానే విభూతి నీరును త్రాగించాను. శరీరమంతా బాగా రాశాను. వెంటనే చెమటలు పట్టి సుఖంగా నిద్రపోయింది.123.తెల్లవారగానే చక్కగా లేచి కూర్చుంది. గడ్డలు జ్వరంతో సహా మాయమయ్యాయి. ఇదంతా సాయి యొక్క మహిమ' అని చెప్పాడు.124.ఆ పరిస్థితిని చూచి శ్యామాకు 'వెంటనే తిరిగి వచ్చేయి' అన్న సాయిమాట గుర్తుకు వచ్చి ఆశ్చర్యపోయాడు.125.అతడు అక్కడికి వెళ్ళక ముందే కార్యం చక్కబడింది.అక్కడ టీ ని తీసుకుని మాధవరావు తిరిగి వచ్చేశాడు. ముందుగా మసీదుకు వెళ్లి బాబా చరణాలకు నమస్కరించాడు.126.'దేవా! ఏమిటి నీ ఈ లీల! మనసులో ఆందోళన కలగచేస్తావు. కూర్చున్నచోట సుడిగుండాలను లేపుతావు. మరల శాంతింప చేసేది కూడా నీవే' అని అన్నాడు. 127.అందుకు బాబా 'కర్మ తంత్రం యొక్క గతి అతిగహనమైనది. దానిని గమనించు.నిజంగా నేను ఏమీ చేయను. చేయించను. అనవసరంగా కర్తృత్వాన్ని నా తలపై వేస్తారు.128. విధివశాత్తు జరిగే కర్మలకు నేను సాక్షి

భూతుణ్ణి మాత్రమే. చేసేవాడు చేయించేవాడు అనంతుడైన ఆ ఒక్క పరమేశ్వరుడే. ఆ ఒక్కడే కరుణామయుడు.129.నేను దేవుణ్ణికాను, ఈశ్వరుణ్ణికాను. పరమేశ్వరుణ్ణికాను 'అనల్‌హక్'ను గాను. నేను 'యాదేహక్' పరమేశ్వరుని స్మరించేవాణ్ణి. అల్లాకు విశ్వాసపాత్రుడైన దాసుణ్ణి 130.అహంకారం లేకుండా పరమేశ్వరుని యందు కృతజ్ఞతా భావంతో ఆదేవునిపై భారం వేసిన వారి లక్ష్యం నెరవేరుతుందని జవాబిచ్చారు.131.ఇటువంటిదే ఒక ఇరానీ వ్యక్తి యొక్క గొప్ప అనుభవాన్ని వినండి.పసిబిడ్డ అయిన అతని కుమార్తె మాట గంటగంటకూ ఆగిపోతుండేది.132.ప్రతి గంటకు నోటి నుండి నురగ కక్కుతూ మూర్ఛవచ్చి అక్కడికక్కడే వంగిపోయి విలవిలలాడుతూ తెలివితప్పి పడిపోయేది.ఎన్ని ప్రయత్నాలు చేసినా ఏదీ ఫలించలేదు.133.అతని మిత్రుడు అతనికి విభూతి యొక్క మహిమను గూర్చి వర్ణించి రామబాణం వంటి ఇటువంటి విచిత్రమైన ఔషధం ఎక్కడా ఉండదు.134.ఇక ఏమీ ఆలస్యం చేయకుండా పార్లేకు వెళ్లి దీక్షితుని విభూతిని ఇమ్మని అడుగు.అతని వద్ద ఉంటుంది, సంతోషంగా ఇస్తాడు. 135.రోజూ భక్తి శ్రద్ధలతో సాయిబాబాను స్మరించుకుని, ఆ విభూతిని కొంచెం త్రాగించితే, మూర్ఛపోయి జబ్బు నయమవుతుందని చెప్పాడు.136.అట్లే ఆ వ్యక్తి దీక్షితుని వద్దనుండి విభూతిని అడిగి తెచ్చి నిత్యం నియమంగా ఆ అమ్మాయికి త్రాగించగా ఆమె ఆరోగ్యం కుదుటబడింది.137.అలా గంట గంటకు గాబరా పెడుతున్న మూర్ఛబాధ విభూతితో వెంటనే ఉపశమించి ఏడేసి గంటలకు వచ్చేది.138.కొంత కాలానికి జబ్బు పూర్తిగా నయమైంది. 139.హోర్వ్యా దగ్గర ఒక గ్రామంలో వృద్ధుడైన ఒక గృహస్థుడుండేవాడు. అతడు మూత్రపిండంలోనిరాళ్ల వ్యాధితో చాలా బాధపడేవాడు.140.ఈ వ్యాధి శస్త్ర చికిత్సతో తప్ప వేరే విధంగా నివారణ అవదు కనుక ఎవరినైనా శస్త్రచికిత్స ప్రవీణుని చూచుకో అని జనం చెప్పారు. 141.ఏం చేయాలో తోచక

రోగి చాలా దుఃఖిస్తూ ఉండేవాడు. బాధను భరించలేక రోగి శరీరం కృశించి పోయి మరణానికి దగ్గరయ్యాడు.142.శస్త్ర చికిత్సకు రోగికి ధైర్యం అవసరం. కాని అతనికి ధైర్యం లేదు. దైవవశాత్తు అతని దుష్కర్మ ముగిసిపోయింది. ఆ వింతను వినండి.143. ఇక్కడిలా ఉండగా సాయిబాబా భక్తుడైన ఆ ఊరి ఇనాందారు ఊరికి వచ్చాడు.144.అతని వద్ద బాబా విభూతి ఎల్లప్పుడూ ఉంటుందని అందరికీ తెలుసు.రోగి బంధువులు వచ్చి అతనిని విభూతి కోరారు.145.ఆ ఇనాందారు విభూతిని ఇవ్వగా దానిని కుమారుడు నీటిలో కలిపి తండ్రికి త్రాగించాడు.అంతే అయిదు నిముషాలు గడిచాయో లేదో విచిత్రంజరిగింది.146.విభూతి ప్రసాదం శరీరంలో పడగానే మూత్రపిండంలోని రాయి కదిలి వెంటనే మూత్రద్వారం నుండి బయటికి జారిపోయి రోగికి బాధ తగ్గింది.147.ముంబై పట్టణంలోని ప్రభు కాయస్థ జాతికి చెందిన ఒక గృహస్థుడు ఉండేవాడు.అతని భార్య ప్రసవ సమయంలో ప్రతిసారి బాధ పడుతుండేది.148.ఎన్నో ప్రయత్నాలు ఉపాయాలు చేసినా ఏ ఒక్కటీ ఉపయోగపడలేదు.ఆ స్త్రీ ప్రాణం పోతున్నట్లుగా తపించి పోతుండేది. 149.అక్కడ శ్రీరామ మారుతి అన్న పేరుతో బాగా ప్రసిద్ధి చెందిన సాయిభక్తుడు ఒకడుండేవాడు.అతని సలహాతో ఈ గృహస్థుడు శిరిడీకి బయలుదేరాడు.150.ప్రసవసమయం వచ్చినప్పుడు దంపతులు ఇద్దరూ దిగులు పడేవారు. శిరిడీలో అయితే నిర్భయంగా ఉండవచ్చు అని ఒకసారి వారు నిర్ణయించుకున్నారు.151.జరగవలసినది ఏదో జరగనీ అయితే అది బాబా సన్నిధిలో జరగనీ అని బాబావద్ద ఉండాలని దృఢసంకల్పం చేసుకుని శిరిడీకి వచ్చి ఉన్నారు.152.అలా ఆ దంపతులు శిరిడీలో ఎన్నో నెలలున్నారు. సాయిబాబా సాంగత్యం, పూజలూ, అర్చనలూ ఆ దంపతులకు ఆనందాన్ని కలిగించాయి.153.కొంతకాలం గడిచాక ప్రసవ సమయం సమీపించింది.ఆ కష్టం ఎలా తొలగుతుందా అని వారికి దిగులు పట్టుకుంది.154.అట్లే కొన్ని రోజులయ్యాక ప్రసవించే రోజు వచ్చింది.ఆ స్త్రీ గర్భాశయ ద్వారం

మూసుకుని పోవటంతో అందరికీ చింత పట్టుకుంది.155.ఆ స్త్రీకి ప్రసవ వేదన. ఏం చేయాలో ఎవరికీ ఏం తోచలేదు. అందరూ బాబాను నోరారా ప్రార్థించసాగారు. వారు కాక మరెవరు కరుణిస్తారు? 156.పొరుగింటి స్త్రీలు పరుగెత్తుకుని వచ్చారు. ఒక స్త్రీ బాబాను స్తుతిస్తూ గ్లాసులోని నీటిలో విభూతిని కలిపి ఆమెకు త్రాగించింది.157.అయిదు నిముషాలు గడిచాయో లేదో స్త్రీ ప్రసవ వేదన నుండి బయట పడింది. అయితే ఆమె గర్భంలోనే బిడ్డ ప్రాణం పోయింది.158.అది గర్భస్థ శిశువు ప్రారబ్ధం. ఆమెకు మరల గర్భం కలుగుతుంది. కాని ఆ స్త్రీ ప్రసవ భయంనుండి బయటపడి సుఖంగా ఉంది.159.ఆమె ఏ బాధ లేకుండా ప్రసవించింది. పెద్ద గండం గడిచి పోయింది. చింత తీరింది. జన్మనిచ్చిన బాబాకు ఋణపడింది.160.తరువాతి అధ్యాయం ఇంతకంటె మధురమైనది. దీనిని విన్న శ్రోతల కోరిక తీరుతుంది. ఎక్కువగా కుతూహలం చూపే దురలవాటు తొలగిపోయి భక్తి నాటుకుంటుంది.161.మాది నిరాకార ఉపాసన. మేము ఎవరికీ శిరసు వంచము. దక్షిణ వగైరాలను ఇవ్వం. అలా అయితేనే నేను సాయి దర్శనానికి వస్తాను.162.అని బాగా నిశ్చయించుకుని బాబాను చూడగానే శరీరాన్ని వారి పాదాలపై పడవేసి దక్షిణను కూడా సమర్పించటం చమత్కారం కాదూ!163.విభూతియొక్క అపూర్వ మహిమ,నేవాస్కరు యొక్క భక్తి ప్రేమలు, అతడు పాముకు పాలు త్రాగించటం, గృహస్థు ధర్మాన్ని పాటించటం, 164 ఇటువంటి ఉత్తమమైన కథలను వింటే భక్తి ప్రేమలు కలిగి ప్రాపంచిక దుఃఖాలు ఉపశమిస్తాయి. ఇంతకంటే పరమసుఖం ఏముంటుంది?165.హేమాడ్ సాయి చరణాలకు ప్రణమిల్లి శ్రోతలకు ఈ సచ్చరిత శ్రవణంలో ప్రేమను కలిగించమని వేడుకుంటున్నాడు.166. సస్తి శ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో విభూతి మహిమ అను ముప్పది నాలుగవ అధ్యాయం సంపూర్ణం.



శ్రీ సాయి సచ్చరిత 35 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయం చివర సూచించిన కథలనే ఇప్పుడు చెప్తాను. వీనిని ఏకాగ్రమనసుతో వినండి. 1. పరమార్థాన్ని ఆలోచించ మొదలిడితే భయంకరమైన ధార్మిక సాంప్రదాయాల శాఖల అభిమానం అడ్డు తగులుతుంది. ఈ అభిమానం వంటి దుర్భర విఘ్నం మరొకటి లేదు. 2. మేము నిరాకార తత్వాన్ని ఉపాసించే వారం. సాకారదేవతలు భ్రమ. కల్పన నుండి పుట్టినవి. సాధు సత్పురుషులు మానవులేకదా వారి ముందు శిరసు వంచి ఎందుకు నమస్కరించాలి? 3. వారికి అసలు సాష్టాంగపడకూడదు. దక్షిణను ఇవ్వకూడదు. వారి ముందు అసలు తలవంచరాదు. ఇలా చేయటం భక్తిని పరిహసించినట్లే. 4. అని శిరిడీ గురించి, ఒకరు ఒక రకంగా మరొకరు మరొకరకంగా అనేకులు అనేక రకాల విషయాలను చెప్తారు. అవన్నీ నమ్మదగినవి కావు. 5. అక్కడికి దర్శనానికి వెళ్లిన వారిని సాయిబాబా దక్షిణను అడుగుతారు అని అంటారు. ద్రవ్యాన్ని ఆశించటం వారి సాధుత్వానికి హీనత్వంకాదూ! 6. గుడ్డి నమ్మకం మంచిది కాదు. ప్రత్యక్ష అనుభవాన్ని పొందిన తర్వాత ఏ విధంగా ప్రవర్తించాలో అని మనసులో నిర్ణయించుకుంటాను. 7. నేను దక్షిణను ఇవ్వను. ధనాన్ని కోరేవారు సాధువులా? అట్టివారు నాకు నచ్చరు. అర్హత లేనివారికి నేను నమస్కరించను. 8. నేను శిరిడీకి వచ్చి వారిని కలుసుకుంటాను. కాని వారి పాదాలకు వందనం చేయను. దక్షిణ కూడా ఇవ్వను. 9. అని దుర్బుద్ధితో బయలుదేరిన వారు తమ నిశ్చయాన్ని గుర్తుపెట్టుకున్నా,

సాయిబాబాను దర్శించుకుని చివరకు వారి శరణుజొచ్చేవారు.10.అలా సాయిని దర్శించినవారు అక్కడికక్కడే అతుక్కుని పోయారు. మరల వెనుకకు తిరగలేదు. సాయి చరణాలలో లీనమై పోయారు.11.ఎవరైనా సాయికి వినయంగా శరణు జొచ్చి వారి చరణాలకు నమస్కరిస్తే చాలు తమ నిర్ణయాన్ని మరచిపోయేవారు. 12.సంప్రదాయంపైనున్న అభిమానాన్ని వదిలితే ప్రాణానికి చాలా సుఖం. ఈ ముప్పది ఐదవ అధ్యాయాన్ని శ్రోతలు ఆదరపూర్వకంగా వినండి.13.విభూతి యొక్క మహిమను, మరియు బాలానేవాస్కరు సర్పాన్ని సాయిగా భావించి ప్రేమగా ఆదరించిన అతని అనుభవాన్ని వినండి .14.శ్రోతలు నన్ను కరుణించాలి. నేను కేవలం బాబా ఆజ్ఞకు కింకరుణ్ణి.వారి ఆజ్ఞను గౌరవంగా పాలించగా అక్షరమైన ఈ చరిత్ర ఉత్పన్నమైంది.15.సాయి చరణాలయందు దృష్టి ఉంచి అక్కడినుండి అలలుగా ఉప్పొంగే పదాలను, నేను పదేపదే పవిత్ర చరిత్ర అనే ఈ కలశంలో నింపుతున్నాను.16.మనం తాబేలు పిల్లలవంటి వారం. కేవలం దృష్టి ప్రసరణతో పోషింపబడతాము. మనకు ఆకలిదప్పుల బాధలు లేవు.ఎల్లప్పుడూ సంతృప్తిగా ఉంటాము.17.దృష్టి సుఖం మనకు ఉండగా ఇక మనకు అన్నపానీయాలు అవసరం లేదు.దృష్టియే ఆకలిదప్పులను హరించి వేస్తుంది.ఆ చమత్కారాన్ని ఎంతని వర్ణించను?18.మనకు సకల దృశ్యవిషయాలు కృపాసాగరులైన సాయిమహారాజే.కనుక దృశ్యం ద్రష్ట దర్శనమను త్రిపుటి ఉండదు.19.అల్లే మనకు చర్మము దాని విషయ స్పర్శ రెంటిలోనూ సాయి భావనయే. ముక్కు మరియు వాసనల యందు కూడా సాయియే.20.శ్రవణాలలో శబ్దం పడగానే సాయి యొక్క రూపం ప్రకటమవుతుంది. దానితో శ్రవణం శ్రావణుడు శ్రావ్యం అనే త్రిపుటి ఒక్కసారిగా ఎగిరిపోతుంది.21.జిహ్వా రసాస్వాదాన్ని పొందేటప్పుడు సాయియే రసంలో మిళితమై ఉంటారు. రస రసం రసాస్వాదం అనే త్రిపుటి ఇక ఎక్కడ ఉంటుంది?

22. కర్మేంద్రియాల విషయంలో కూడా ఇంతే. కేవలం ఒక్క సాయిని సేవిస్తే సకల కర్మలు నశించిపోయి నైష్కర్మ్యం సిద్ధిస్తుంది. 23. ఈ గ్రంథం విస్తరించిపోతూ ఉంది. సాయిపై ప్రేమ ఎక్కడికో లాక్కెళ్లుతుంది. ఇప్పుడు పూర్వానుసంధానాన్ని గుర్తు తెచ్చుకుని కథాభాగానికి వద్దాం. 24. విగ్రహారాధనను ఇష్టపడక నిరాకార పరమాత్మను ఉపాసించే ఒకవ్యక్తి కేవలం విమర్శనా దృష్టితో శిరిడీకి వెళ్లాలని కుతూహలపడ్డాడు. 25. నేను వచ్చి ఆ సాధువును కేవలం దర్శించుకుంటాను. అంతే కాని వారికి తలవంచను. దక్షిణను కూడా ఇవ్వను. 26. నా ఈ రెండు షరతులకు ఒప్పుకుంటే నేను శిరిడీ వస్తానని చెప్పాడు. స్నేహితుడు సరేనని అనగా అతని వెంట నిశ్చింతగా బయలుదేరాడు. 27. అతని మిత్రుడైన కాకామహాజనికి సత్పురుషుల యందు అత్యంత భక్తి భావం. కాని అతని స్నేహితుడు ఒట్టి సంశయాత్మకుడు. 28. ఆ ఇద్దరూ శనివారం రాత్రి ముంబై నుండి బయలుదేరి ఆదివారం ఉదయం శిరిడీ చేరారు. 29. ఇద్దరూ సాయిబాబా దర్శనానికి మసీదుకు వెళ్లారు. అప్పుడు ఏం జరిగిందో సావధానంగా వినండి. 30. వారు మసీదుమెట్లపై అడుగు పెట్టగానే కాకా మిత్రుని చూచి దూరం నుండి 'కాయావెజి' (ఎందుకొచ్చారు) అని ఎంతో మధురంగా అన్నారు. 31. ప్రేమతో నిండిన ఆ మాటలను విన్న మిత్రునికి ఆ పదాల ఉచ్చారణ తన తండ్రిని గుర్తుకు తెచ్చాయి. 32. 'కాయావెజి! అన్న బాబా మాట, వారి స్వరం విని, కాకా మిత్రుడు ఆశ్చర్యపోయాడు. 33. ఆకర్షణీయమైన ఆ స్వరం గతించిన అతని తండ్రిని గుర్తుకు తెచ్చింది. బాబా ఆ స్వరాన్ని పూర్తిగా అనుకరించినట్లు అనిపించింది. 34. ఆ వాణిలో ఎంతటి ఆకర్షణ శక్తి! కాకా స్నేహితుడు విస్మితుడయ్యాడు. ఈ స్వరం నిజంగా మా తండ్రిదే. నాకు బాగా గుర్తున్నదే. 35. తండ్రి నోటి నుండి వచ్చినట్లే ఉన్న ఆ పిలుపును విని ఆ మిత్రుడు తనలో కరిగిపోయాడు. మునపటి తన నిశ్చయాన్ని మరచి, శిరసువంచి బాబా పాదాలకు వందనం

చేశాడు. 36.తరువాత బాబా కాకాను మాత్రమే దక్షిణను అడిగారు. కాకా ఇచ్చాడు. ఇద్దరూ తిరిగి వెళ్ళిపోయారు. మరల మధ్యాహ్నం వచ్చారు.37.అప్పుడుకూడా కాకా వెంట అతని మిత్రుడు ఉన్నాడు. ఇద్దఱూ ముంబైకి బయల్దేరటానికి కాకా బాబా అనుమతిని కోరాడు. బాబా కాకాను దక్షిణను అడిగారు.38.అదైనా కాకాను మాత్రమే, 'పదునేడు రూపాయలను ఇవ్వు' అని అడిగారు. కాని అతని మిత్రున్ని ఏమీ అడగలేదు. అందువలన అతని మనసులో అలజడి చెలరేగింది.39.అప్పుడు అతడు మెల్లగా,'ఎందుకు నిన్ను మాత్రమే దక్షిణను అడిగారు? ఉదయం కూడా నిన్నే అడిగారు. ఇప్పుడు కూడా నిన్నే అడిగారు.40.నేను నీవెంట ఉండగా మరి నన్ను దక్షిణను అడగకుండా వదిలివేశారేంఅని కాకాను అడిగాడు. ఈ విషయం బాబానే అడగరాదూ అని కాకా మెల్లగా జవాబిచ్చాడు. 41.ఇంతలో బాబా కాకాతో 'ఏమిటి అతడు నీతో ఏదో అంటున్నాడు'అని అడిగారు. అప్పుడు ఆ స్నేహితుడు బాబాతో, నేనుకూడా దక్షిణను ఇవ్వనా అని అడిగాడు.42.అందుకు బాబా,'నీకు ఇవ్వాలని మనసులో లేదుగా.అందుకే నిన్ను అడగలేదు. అయినా నీకు ఇవ్వాలని మనసుంటే ఇవ్వు' అని జవాబిచ్చారు.43.బాబా దక్షిణను అడగటం, భక్తులు ఇవ్వటం గూర్చి అతడు హీనంగా మాట్లాడాడు. అలాంటి వాడు బాబా అడగకుండానే దక్షిణను ఇవ్వనా అని అడిగాడు అని కాకా ఆశ్చర్యపోయాడు.44.నీకు ఇవ్వాలని ఉంటే ఇవ్వు అన్న బాబా మాటలకు మిత్రుడు వెంటనే పదునేడు రూపాయలను బాబా అడగకుండానే వారి చరణాలకు సమర్పించాడు.45.తరువాత బాబా అతనితో,'పోదువుగానిలేరా ఒక క్షణం కూర్చో'అని అతని భేదభావాన్ని తొలగించటానికి మధురంగా ఉపదేశించారు. 46.'నీకు నాకు మధ్య ఉన్న నూనె వాడి గోడను మొత్తం పడగొట్టేసేయి. అప్పుడు ఒకరినొకరం కలుసుకోవటానికి ప్రశస్తమైన మార్గం ఏర్పడుతుంది' అని చెప్పారు.47.ఆ తరువాత వారికి వెళ్లటానికి అనుమతిని

ఇచ్చారు. అప్పుడు ఆకాశాన్ని మేఘాలు బాగా క్రమ్ముకోగా చూచి మాధవరావు 'వీరు వానలో తడిసి పోతారేమో' అని అన్నాడు. 48.'వారిని నిశ్చింతగా వెళ్లనివ్వు. దారిలో వర్షం పట్టుకుంటుందన్న భయం ఏమీలేదు' అని బాబా చెప్పారు. 49. బాబా పాదాలకు అభివందనం చేసి ఆ ఉభయులూ బండిలో కూర్చున్నారు. ఆకాశంలో మెరుపులు మెరుస్తున్నాయి. పెనుగాలి వీస్తోంది. గోదావరిలో నీరు బాగా నిండుగా ఉంది. 50. ఆకాశాన ఉరుములు ఉరుముతున్నాయి. వారు నదిని నావలో దాటవలసివచ్చింది. బాబా యొక్క ధైర్య వచనాలపై కాకాకు పూర్తి విశ్వాసం. 51. కాని అతని స్నేహితుని అనుమానం. ప్రయాణం సాఫీగా సాగుతుందా, అనవసరంగా బయలుదేరాం, దారిలో కష్టాలుపడతామేమో అని చింత. 52. కాని వారు సుఖంగా వెళ్లి రైలుబండిలోకి ప్రవేశించాక మేఘాలు బాగా వర్షించాయి. నిర్భయంగా వారు ముంబై చేరారు. 53. కాకా స్నేహితుడు ఇంటికి వెళ్లి కిటికీ తలుపులు తెరచి చూడగా, గదిలో చిక్కుకున్న పిచ్చుకల్లో రెండు పిచ్చుకలు చచ్చిపడి ఉన్నాయి. ఒకటి మాత్రం ఎగిరిపోయింది. 54. ఆ దృశ్యాన్ని చూచి అతనికి చాలా బాధ కలిగింది. 'ఆహారం లేక పాపం వాని ప్రాణాలు పోయినై. 55. నేను శిరిడీకి బయలుదేరినప్పుడు కిటికీలను తెరచి ఉంచి ఉంటే అవి చచ్చిపోయేవి కావు. నా మూలకంగా అవి చచ్చిపోయాయి. 56. ఇప్పుడు ఎగిరిపోయినదాని కోసమే బహుశా బాబా ఆతురతతో ఇవాళ తిరిగి రావటానికి సమ్మతించారు. 57. లేకపోతే ఇదికూడా చచ్చిపోయేదే. ఆహారం లేకపోతే ఎలా బ్రతుకుతుంది? వాటి ఆయువు తీరి పోయింది. ఈ గతి పట్టింది. కాని ఒక్కటి బ్రతికే ఉంది' అని తలపోశాడు. 58. ఇతని యొక్క మరొక అనుభవం. ఇదికూడా వినడానికి ఇంపుగా ఉంటుంది. ఇతడు ఎన్నో నెలలు కాలిమడమలో నొప్పితో బాధపడుతున్నాడు. 59. ఈ జబ్బును శిరిడీకి వెళ్ళక ముందు ఎన్నోనెలలు అనుభవించాడు. శిరిడీ నుండి తిరిగి వచ్చాక ఏ నొప్పిలేదు.

తరువాత త్వరలోనే జబ్బు పోయింది.60.ఇటువంటిదే మరో కథ. సత్పురుషులను శోధించాలనే ఉద్దేశంతో వెళ్లి మనసులో లేకున్నా వారి చరణాలపై శిరసు వంచవలసి వచ్చిన విషయాన్ని వినండి .61. అల్పలోభం అడ్డు తగలటం వలన దక్షిణను ఇవ్వాలని లేకున్నా తమ దృఢనిశ్చయాన్ని వదిలి ఎలా దక్షిణను ఇస్తారో వినండి 62.ముంబై నివాసియైన వకీలు ధరంసి జేతాభాయి తక్కరుకు, పూర్వజన్మల పుణ్యబలం వల్ల సాయిని సందర్శించవలెనని కోరిక కలిగింది. 63.కాకా మహాజని యజమాని ఇతడే. ఇద్దరికీ బాగా పరిచయం. శిరిడీకి వెళ్లి బాబాను ప్రత్యక్షంగా కలుసుకోవలెనని అనుకున్నాడు. 64.తక్కరు కంపెనీలో కాకా మేనేజరు. కాకా తరచూ సెలవు రోజులలో శిరిడీకి ప్రయాణమయే వాడు. 65.పోనీ సమయానికి సరిగ్గా వచ్చేవాడా? ఎనిమిదేసిరోజులు శిరిడిలో ఉండిపోవటం – అదేమిటంటే సాయి ఆజ్ఞ ఇవ్వలేదని అనటం. ఇది ఉద్యోగం చేసే పద్ధతేనా?66.ఆ సత్పురుషుని విశిష్టత ఏమిటి? నాకీ ఆడంబరాలు నచ్చవు అనుకుని, సాయి అంతను తెలుసుకోవాలని, హోళీ పండుగ సెలవులలో సేటు బయల్దేరాడు. 67.శరీరంలోని దురహంకారం మరియు ఐశ్వర్య గర్వంతో సేటు, 'సత్పురుషులు మానవమాత్రులేకదా, ఎందుకు వారికి తలవంచాలి' అని తలచాడు.68.సాయిబాబా యొక్క స్థాయిని గని పండితులూ విద్వాంసులూ వారి ముందు మోకాళ్లమీద నిలుచుంటారు. అలాంటప్పుడు ఈ ధరంసి ఎంతటి వాడు? అతని నిశ్చయం ఏ పాటిది?69.అంధ విశ్వాసం మంచిది కాదు.మనం స్వయంగా పరీక్షించుకుందామని తనలో నిశ్చయించుకుని శిరిడీకి తయారయ్యాడు.70.ఇదివరకు వర్ణించిన ఒక స్నేహితుని వలె ధరంసి కూడా కాకాను వెంటబెట్టుకుని బయల్దేరుతూ కాకాతో,71.'నీవు శిరిడీకి వెళ్లితే అక్కడే ఉండిపోతావు. ఈ సారి అలా కుదరదు. నా వెంట తిరిగి వచ్చేయాలి. బాగా గుర్తుంచుకో'అని చెప్పాడు.72.అందుకు కాకా,'అది నా చేతులలో లేదు' అని అన్నాడు. అప్పుడు ధరంసి

దారిలో తోడుగా మరొకరిని వెంటబెట్టుకున్నాడు.73.కాకా తనతో తిరిగిరాకపోతేనో.దారిలో ఎవరైనా తోడులేకపోతే కుదరదు కనుక మరో మూడో వ్యక్తిని తీసుకుని ఆ ముగ్గురూ శిరిడీకి బయలుదేరారు.74. ప్రపంచంలో సహృదయులైన భక్తులు అనేక రకాల మంది ఉంటారు. అటువంటి భక్తుల సంశయాలను తొలగించటానికి బాబా వారిని ఏరిఏరి పట్టుకువస్తారు.75.ఆ భక్తులు తిరిగి వెళ్లిపోయి తమ అనుభవాలను ఇతరులకు చెప్తారు. లేదా ప్రజలను మంచి మార్గంలో పెట్టటానికి ఎవరితోనైనా వ్రాయిస్తారు.76.తాత్పర్యం బాబా వద్దకు ఎవరు వెళ్లినా వారి దర్శనసుఖంతో తృప్తిని పొందుతారు.వారిమనోవృత్తి తొలుత ఎలా ఉన్నా చివరకు పరమానందాన్ని పొందుతారు.77. పరీక్షించాలనే కోరికతో తమంతట తాము వెళ్లుతామని ఎవరైనా అనుకోవచ్చు కాని అది విచిత్రంగా ఉంటుంది.వారు వెళ్లి బాబా ఉద్దేశాన్ని సాధిస్తారు.78.ఎవరైనా బాబా స్ఫూర్తినిచ్చినప్పుడే కాలు బయట పెట్టగలరు.వారి స్వాభావికమైన మనోవృత్తిని జాగ్రతం చేసి బాబా వారిని పరమార్థంలో ప్రవేశ పెడతారు.79.బాబా కౌశలాన్ని ఎవరు తెలుసుకోగలరు? తెలుసుకోవాలని ప్రయత్నిస్తే దుర్దశ పాలవుతారు.కాని అహంభావాన్ని వదలి, వారి పాదాలవద్ద పొర్లితే సుఖాలను పొందుతారు.80.దేవతలవద్దకు, గురువువద్దకు, బ్రాహ్మణుల వద్దకు వెళ్లినప్పుడు రిక్త హస్తాలతో వెళ్లకూడదని కాకా దారిలో రెండుసేర్ల ద్రాక్షపళ్లను కొన్నాడు.81.గింజలు లేని ద్రాక్షపళ్లుంటాయి. కాని అప్పుడు దొరికిన గింజలున్న ద్రాక్షపళ్లనే కొన్నాడు.82.మాటమంతీ ముచ్చటించుకుంటూ ఆ ముగ్గురూ శిరిడీ చేరుకుని బాబా దర్శనానికి మసీదుకు వెళ్లారు.83.భక్తుడు బాబా సాహేబు తర్ఖడ్ కూడా అక్కడ ఉన్నాడు. అతనిని ధరంసి సేటు జిజ్ఞాసతో ప్రశ్నించినది వినండి. 84.ఇక్కడ ఏం విశేషముంది? మీరెందుకొచ్చారు? అన్నాడు. బాబా దర్శనానికి అని తర్ఖడ్ చెప్పాడు.ఇక్కడ చమత్కారాలు జరుగుతాయన్న వార్తవిన్నానే అని సేటు

అన్నాడు.85.తర్వాడ అతనితో, నాకు చమత్కారాలు చూడాలని కోరికలేదు. ఎవరి మనసులో ఏ కోరికలు ఉన్నాయో అవి ఇక్కడ సిద్ధిస్తాయి అని చెప్పాడు.86.కాకా బాబా పాదాలయందు శిరసునుంచి వారి చేతికి ద్రాక్షపళ్లను అందించాడు. భక్త బృందం అక్కడ బాగా కూడి ఉంది.బాబా వారికి పళ్లను పంచడం మొదలు పెట్టారు.87.ఇతరులతోపాటు ధరంసీకి కూడా బాబా కొన్ని పళ్లను ఇచ్చారు.అతనికి గింజలు లేని పళ్లే ప్రీతి. గింజలు ఉన్నవి ఇష్టం లేదు.88.ఆ ద్రాక్ష పళ్లంటే అతనికి విసుగు.ఆదిలోనే హంసపాదులా ఆరంభంలోనే ఇదో సమస్య. ఆ పళ్లను ఎలా తినాలి అన్న కష్టం వచ్చింది. వానిని తిరిస్కరించనూ లేదు.89.పైగా ద్రాక్షపళ్ళను కడగకుండా తినకూడదని డాక్టరు చెప్పాడు. తాను మాత్రం కడుక్కోవటం బాగుంటుందా అని మనసులో అనేక రకాల ఆలోచనలు.90.పళ్లను అట్లే నోట్లో వేసుకున్నాడు.పవిత్రమైన సత్పురుషుని ప్రదేశంలో ఎంగిలిని వేసి అపవిత్రం చేయరాదని గింజలను జేబులో వేసుకున్నాడు.91.'ఈ ద్రాక్షపళ్లు నాకిష్టం లేదని ఈ సత్పురుషునికి తెలియదా? నాకు బలవంతంగా ఎందుకు ఇస్తున్నారు'అని సేటు మనసులో అనుకున్నాడు.92.అతనిలో ఆ ఆలోచన రాగానే బాబా మరల అతనికి మరిన్ని పళ్లను ఇచ్చారు. అవి గింజలున్న పళ్లు అని అనుకుని ధరంసి నోట్లో వేసుకోకుండా వానినలాగే చేతిలో పట్టుకున్నాడు.93.నిజంగానే అతనికి గింజలున్నవి ఇష్టంలేదు.కాని బాబా తమ చేతులతో ఇచ్చారు. ఏం చేయాలి అని సేటు తపన పడిపోయాడు.94.నోట్లో వేసుకోవటానికి మనస్కరించక పిడికిట్లోనే పట్టుకుని ఉండగా బాబా 'తినేసేయి' అని అన్నారు. సేటు వారి ఆజ్ఞను పాలించాడు.95. తినేసేయి అని బాబా అనగానే ధరంసి వానిని నోట్లో వేసుకున్నాడు. అవన్నీ గింజలు లేని పళ్లు. తిని చాలా ఆశ్చర్యపోయాడు. 96.గింజలు లేని ద్రాక్షపళ్లను గని ధరంసి ఆశ్చర్యంగా 'సత్పురుషులకు ఏది అసాధ్యం? వీరికి ఎంతటి సామర్థ్యం?

97.నామనసులోని విషయాన్ని తెలుసుకున్నారు.అన్నీ గింజలున్న పళ్లే అయినా సాయిబాబా నా చేతికి గింజలు లేని మంచి పళ్లను ఇచ్చారు' అని అనుకున్నాడు.98. మనసు స్తంభించిపోయింది. బాబాను పరీక్షించాలన్నమాట మరచిపోయాడు. అతని అహంకారమంతా కరిగిపోయింది. సత్పురుషులయందు భక్తి ఉత్పన్నమైంది.99.ముసుపటి భావాలు మాయమయ్యాయి. అతని హృదయంలో సాయి పట్ల ప్రేమ జనించింది. శిరిడీకి రావలెనన్న ఉత్సాహం దృఢనిశ్చయమైంది.100.అక్కడే బాబా వద్దనే తర్ఖడ్ కూడా కూర్చుని ఉన్నాడు.సాయిబాబా అతనికి కూడా కొన్ని పళ్లను ఇచ్చారు.101.ధరంసి అతనిని మీ ద్రాక్షపళ్లు ఎలాంటివి అని అడిగాడు. గింజలున్న పళ్లు అని అతడు చెప్పగా ధరంసికి మరింత ఆశ్చర్యం కలిగింది.102.దాంతో అతనికి సాయిబాబాపై శ్రద్ధ కలిగింది. ఆ విశ్వాసాన్ని దృఢ పరచుకోవటానికి ఒక ఆలోచన స్ఫురించింది. సాయి సత్పురుషులైతే ద్రాక్షపళ్లను మరల కాకా దగ్గర నుండి ఇవ్వాలి అని అనుకున్నాడు.103. అప్పుడు బాబా అందరికీ పళ్లను పంచుతున్నారు.అయినా సేటు మనసులోని ఆలోచనను తెలుసుకుని, బాబా మరల కాకా నుండి పంపిణి మొదలుపెట్టారు.సేటుకు చాలా విచిత్రంగా తోచింది. 104.ఇతరుల మనోభావాలను తెలుసుకునే వారి శక్తిని, సమర్థతను గ్రహించి ధరంసి మనసు సాయిబాబా సత్పురుషులని అంగీకరించింది.105.అక్కడ ఉన్న మాధవరావు 'ఇతడు కాకా యొక్క యజమాని' అని సేటును బాబాకు పరిచయం చేశాడు.106.వెంటనే 'ఇతడు కాకాకు ఎక్కడి యజమాని?కాకా యజమాని వేరే ఉన్నారు' అని బాబా చెప్పారు. ఆ మాటలు విని కాకాకు అత్యంత ఆనందం కలిగింది.107.మరో వింత ఏమిటంటే ధుని ప్రక్కగా నిలబడి ఉన్న అప్పా అన్న వంటవానిపై వేశారు.108.'ఈ సేటు ఇంత దూరం శ్రమపడి వచ్చింది నా కొఅకు కాదు. ఇదిగో! ఈ అప్పా పైని ప్రేమతో శిరిడీకి వచ్చాడు'అని అన్నారు.109.ఆ సంభాషణతో ధరంసి విమర్శించాలన్న తన

నిశ్చయాన్ని మరచిపోయాడు. తనంతట తాను బాబా పాదాలపై పడ్డాడు. పిమ్మట వాడాకు వెళ్ళాడు. 110. మధ్యాహ్నం ఆరతి అయింది. భక్తులు ఇళ్ళకు వెళ్లిపోవటానికి తయారవుతున్నారు. బాబా అనుమతిని తీసుకునే సమయం రాగానే భక్తులు మసీదుకు బయల్దేరారు. 111. అప్పుడు ధరంసి కాకాతో, 'నేను అనుమతిని అడగను. నీకు అవసరమైతే నువ్వు అడుగు' అని అన్నాడు. అప్పుడు మాధవరావు 112. 'ఒకవారం పూర్తి కాకుండా బాబా కాకాకు అనుమతిని ఇవ్వరు. కనుక అతని విషయం నిశ్చయంగా చెప్పలేం. మీరే బాబాను అడిగి సెలవు తీసుకోండి' అని చెప్పాడు. 113. తరువాత ముగ్గురూ వెళ్లి కూర్చున్నారు. మాధవరావు బాబా అనుమతి కోరగా బాబా ఒక కథను చెప్పనారంభించారు. దానిని శ్రద్ధగా వినండి. 114. 'చంచలబుద్ధిగల ఒక వ్యక్తి ఉండేవాడు. అతని ఇంట్లో ధనధాన్యాలు సమృద్ధిగా ఉన్నాయి. అతనికి ఏ వ్యాధి బాధలు లేవు. లేని కష్టాన్ని ఆపాదించు కోవటం అతనికి ఇష్టం. 115. ఏ కారణం లేకుండా అనవసరంగా తలపై భారాన్ని మోస్తాడు. ఇక్కడా అక్కడా తిరుగుతాడు. మనసుకు నిశ్చలత్వంలేదు. బరువును క్రిందకు దించుకుని మరల పైకి ఎత్తుకుంటాడు. మనసు స్థిరంగా ఉండదు. 116. అతని ఆ అవస్థను చూచి నాకు దయ కలిగింది.' 'చూడు! ఇక నీకు నచ్చిన చోట నీ బరువును దించు. నిశ్చింతగా ఉండు. 117. అనవసరంగా ఊరికే తిరగకుండా ఒక చోట స్థిరంగా కూర్చో అని చెప్పాను' అని అన్నారు. ఆ మాట ధరంసి మనసులో చొచ్చుకుని పోయింది. ఆ మాటలు తనను గురించే అని గ్రహించాడు. 118. ఎంతో వైభవమున్నా ధరంసి ఏ కారణం లేకుండానే ఎప్పుడూ చింతిస్తూ ఉండేవాడు. అనవసరంగా బాధపడే వాడు. 119. అంతటి ఐశ్వర్యం గౌరవం ఉన్నా అతని మనసుకు శాంతిలేదు. లేనిపోని గొప్ప దుఃఖాలను కల్పించుకుని ఎప్పుడూ వానిలోనే మునిగి ఉండే వాడు. 120. బాబా నోటినుండి తన కథను విని సేటుకు పరమాశ్చర్యం కలిగింది. 'అరె! ఇది నా మనసులోని

పరిస్థితి' అని బాగా శ్రద్ధగా విన్నాడు.121.కాకా తిరిగి వెళ్లటానికి బాబా అంత త్వరగా అనుమతిని ఇవ్వటం అశక్యమైన ఘటన. అది అప్రయాసగా లభించటంతో, ధరంసి సంతుష్టుడయ్యాడు.122.కాకా కూడా తనవెంటే బయలుదేరాలని అతడు కోరుకున్నాడు. కనుక బాబా కాకాకు వెళ్లటానికి అనుమతినిచ్చి ఆ కోరికను కూడా తీర్చారు. 123.ఇది కూడా సేటుకు సంశయం. బాబా తన మనసులోని విషయాన్ని ఎలా గ్రహించారు? ఇదివారి సాధుత్వానికి లక్షణమని అతనికి అర్థమైంది.124.సేటు యొక్క సంశయం నివృత్తి అయింది.సాయి గొప్ప సత్పురుషులని బాగా తెలిసివచ్చింది. బాబా ఎవరిమనసులో ఎటువంటి ఆలోచనలుంటే వారికి అనుభూతిని అట్లే కలగచేశారు. 125. భక్తులు తాము కోరుకున్న మార్గాలలోనే వారిని బాబా ప్రవేశ పెడతారు.వారు భక్తుల అర్హతను ఎఱిగి వారికి తగినట్లుగా పరమార్థప్రాప్తిని కలగ చేస్తారు.126.భావార్థులనైనా లేదా తమను విమర్శించే వారినైనా సాయిదయామయులు సమానంగా చూస్తారు. ప్రేమమయియైన సాయిమాత ఒకరిని చేరదీసి మరొకరిని తిరస్కరించదు.127.కాకా, ధరంసి బయలుదేరేటప్పుడు బాబా కాకా వద్దనుండి పదిహేను రూపాయలను దక్షిణను అడిగి తీసుకుని అతనితో,128. 'నాకు ఎవరైనా ఒక రూపాయిని దక్షిణగా ఇస్తే, నేను అందుకు బదులుగా వారికి లెక్కపెట్టి పదింతలు ఇవ్వవలసి ఉంటుంది.129.నేను ఎవరి వద్దనుంచి ఏదీ ఉచితంగా తీసుకోను. అట్లే నేను అందరినీ కూడా అడగను. ఫకీరు వేలెత్తి ఎవరిని చూపిస్తే వారివద్దే దక్షిణ విషయం.130.పైగా ఫకీరుకు ఋణపడి ఉన్నవారినే అడగటం.దాతలు పంటను తరువాత అనుభవించటానికి విత్తనాలను నాటుకుంటారు. 131.శ్రీమంతుల ధనం పరోపకారానికి మరియు ధార్మిక కార్యాలలో ఖర్చు అయితేనే అది శుభప్రదం. ఉదారంగా దానం చేస్తే నిశ్చయంగా ఫలం ప్రాప్తిస్తుంది. అటువంటి వారికి జ్ఞానమార్గం లభిస్తుంది.132. అనేక బాధలకు ఓర్చి

సంపాదించిన ఈ ధనం కేవలం కోరికలను అనుభవించటానికే అని తలచి, ధర్మాన్ని లెక్కచేయక, ధనాన్ని వ్యర్థంగా ఖర్చుపెడతారు.133.పైసాపైసా కూడబెట్టి పదికోట్లవరకు కూడబెట్టిన డబ్బును, స్వార్థం కోసం విషయసుఖాలను అనుభవించాలని కోరుకోని వారు సుఖంగా ఉంటారు'.134.'నా దత్త ముపతిష్ఠతి' ఇవ్వక పోతే లభించదు. ఈ శ్రుతి వాక్యం అందరికీ తెలుసు. మునుపు ఇచ్చినది స్పష్టంగా కనిపిస్తుంది కనుకనే బాబా దక్షిణను అడుగుతారు.135.రామావతారంలో రఘురాముడు అనేక సువర్ణస్త్రీ ప్రతిమలను దానం చేశాడు.ఆ ఫలితాన్ని కృష్ణావతారంలో పదహారువేల స్త్రీలరూపంలో పొందాడు.136.భక్తి జ్ఞాన వైరాగ్యాలు లేని అతి దీనులైన భక్తులకు,బాబా ముందు వైరాగ్యాన్ని అలవాటు చేసి అటుతరువాత భక్తి జ్ఞానాలను ప్రసాదిస్తారు.137.భక్తులతో దక్షిణను దానం చేయించటం వైరాగ్యానికి నిదర్శనం. తరువాత బాబా వారిని భక్తి మార్గంలో ప్రవేశపెట్టి జ్ఞానులను చేస్తారు.138.'మేం మాత్రం ఏం చేస్తాం? ఒకటి తీసుకుంటాం.దానికి పదింతలు ఇస్తాం. క్రమక్రమంగా జ్ఞాన మార్గంలో ప్రవేశపెడతాం' అని బాబా చెప్పగా ధరంసీకి ఆసక్తి కలిగింది.139.మునపటి తన నిశ్చయాన్ని మరచిపోయి తనంతటతాను పదిహేను రూపాయలను బాబా చేతిలో ఉంచాడు.అంతా అపూర్వంగా లేదూ!140.వృథాగా గొప్పలు చెప్పుకొన్నాను. ప్రత్యక్షంగా కలుసుకోవటం మంచిదైంది. సాధువులు ఎలా ఉంటారో బోధపడింది. అనుభవంతో వారియందు భక్తి కలిగింది.141.సరిగ్గా ఆలోచించకుండా నేను వారికి వందనం చేయటానికి రాను అని నిర్ణయించుకున్నాను. కాని చివరకు నా అంతట నేను అది కూడా చేశాను. సత్పురుషుల లీలలు అగోచరం. 142.నిరంతరం అల్లామాలిక్ అని పలికే వారికి కష్టమైనది ఏముంటుంది?నేను కేవలం సాధువుల చమత్కారాలను చూడాలని కుతూహల పడ్డాను.143.నా నిర్ణయం వ్యర్థమైంది. ఒక మానవునికి సాష్టాంగపడి, వారు అడగకుండానే

నా అంతట నేను దక్షిణ ప్రదానం కూడా చేశాను.144.నా గొప్పతనం అంతా వృథా అయింది.నా అంతట నేను పూజ్యభావంతో నా శిరసును వారి చరణాలయందు వంచాను. ఇంతకంటె విశేషం ఏముంటుంది?145.సాయి యొక్క కౌశలాన్ని ఎలా వర్ణించను? ఇదంతా వారు స్వయంచేసినా పైకి ఏమీ ఎఱుగనట్లు అలిప్తంగా ఉంటారు. ఇంత కంటే విశేషం ఏముంటుంది?146.వారికి ఎవరైనా వందనం చేసినా చేయకున్నా, దక్షిణను ఇచ్చినా ఇవ్వకున్నా, ఆనందానికి నిలయమైన సాయి దయాఘనులు ఎవరినీ కించపరచరు.147.వారిని పూజిస్తే ఆనందించరు, అవమానిస్తే దుఃఖించరు. హర్షంలేని చోట విషాదం ఎక్కడుంటుంది? వారిది పూర్ణ నిర్ద్వంద్వ స్థితి.148.ఎవరి భావం ఎలా ఉన్నా ఒకసారి వారి దర్శనం కలిగిన వారికి తమ చరణాలయందు భక్తి నాటుకునేలా చేస్తారు. ఇదిసాయి యొక్క అద్భుతశక్తి. 149.బాబా ఆశీర్వాదాన్ని విభూతి ప్రసాదాన్ని తీసుకుని ధరంసి మరియు కాకా నిస్సందేహంగా తిరిగి వెళ్లిపోయారు.ఇది బాబా యొక్క అమోఘమైన ఖ్యాతి.150.శిరిడీ నుండి తిరిగిపోవటానికి బాబా అనుమతి అవసరం.వారి ఆజ్ఞను ఉల్లంఘిస్తే విఘ్నాలను ఆహ్వానించినట్లే.151.తమకు తోచినట్లు తిరిగి వెళ్లిపోతే దారిలో దారుణమైన కష్టాలు, బాధలు, అవమానాలు కలిగి, వానిని తప్పించుకోవటం కష్టమవుతుంది.152.శిరిడీ నుండి తిరిగి రావటం అలా ఉంటుంది. మన పరిస్థితి కూడా అదే. 'నేను తీసుకురాకపోతే ఎవరూ రారు' అని బాబా అనేవారు. 153.'నా ఇష్టం లేకుండా ఇంటి గడపను ఎవరుదాటగలరు? ఎవరు శిరిడీ రాగలరు? స్వేచ్ఛగా ఎవరికి నా దర్శనమవుతుంది'అని బాబా అనేవారు.154.అంటే రాకపోకలు సాయిదయామయుని అధీనంలో ఉన్నాయి.వారికి మనపై అనుగ్రహం కలిగినప్పుడే వారి దర్శనం సంభవం.155.శిరిడీకి వెళ్ళటం, తిరిగి రావటం ఇలా ఉంటాయి. సాయిబాబా ప్రసన్నులు కాకపోతే, వారు ఎవరికైనా సరే అనుమతిని ఇవ్వటం విభూతిని ఇవ్వటం జరగదు. 156.వారికి

పాదాభివందనం చేసి, తిరిగి వెళ్ళటానికి అనుమతిని కోరినప్పుడు వారు విభూతిని, ఆశీర్వాదాన్ని ఇస్తారు. అదే వారి అనుమతి అని అర్థం.157. ఇప్పుడు శ్రోతలకు విభూతిని గురించిన ఒక అభినవ అనుభవాన్ని చెప్తాను. తరువాత నెాస్కరు యొక్క భక్తి ప్రభావం మరియు అతడు సాయి మహానుభావుని కృపను పొందటం, 158. బాంద్రా పట్టణంలోని కాయస్థ ప్రభుజాతికి చెందిన ఒక గృహస్థునికి ఎన్ని ప్రయత్నాలు చేసినా రాత్రి సుఖమైన నిద్ర ఉండేది కాదు.159. అతడు కళ్ళు మూసుకుని నిద్రిస్తుంటే అకస్మాత్తుగా స్వప్నంలో మరణించిన అతని తండ్రి వచ్చి ప్రతి రోజూ మేలుకొలిపేవాడు.160. పూర్వం జరిగిన వానిని గూర్చి, మనసులో రహస్యంగా ఉన్న మాటలు, అర్థం కాని తిట్లను, శాపనార్థాలను ఉచ్చరిస్తూ బాధపెట్టేవారు.161. ప్రతిదినం ఇలాగే జరిగేది. ప్రతిరోజూ నిద్రాభంగమయ్యేది. ఆ బాధను వదిలించుకోవటానికి ఏం చేయాలో అర్థమయ్యేది కాదు.162. ఏ ఉపాయమూ తోచక అతడు విసుగుచెందాడు. ఏదైనా తరుణోపాయాన్ని చూపించు అని ఒక సాయిభక్తుని ప్రార్థించాడు.163. భాగ్యవశాత్తు అతని పుణ్యకర్మ ఫలంగా, సాయిబాబా భక్తుడైన అతని మిత్రుడు 'నాకు ఏ ఉపాయాలూ తెలియవు. సాయిమహారాజు మహానుభావులు. వారి యందు నీకు భక్తి విశ్వాసాలు ఉంటే ఊదీ ప్రభావం నీకు తెలుస్తుంది' అని చెప్పాడు.164. అతడు చెప్పిన విధంగానే ఇతడు చేశాడు. చక్కటి అనుభవం కూడా కలిగింది. అతనికి మరల దుస్స్వప్నాలు కలుగలేదు.165. అదృష్టవశాత్తు వారిద్దఱూ మిత్రులు. సాయి సమర్థుని భక్తులు. విచిత్రమైన బాబా విభూతి మహిమను వర్ణించి, కొంచెం ఇచ్చి,166. నిద్రించే ముందు నొసటన అద్దుకుని విభూతి పొట్లాన్ని తలక్రింద ఉంచుకుని భక్తిగా బాబాను స్మరించుకో.167. మనసులో భక్తి భావం ఉంచుకొని ఆ విభూతి ప్రభావాన్ని చూడు, అది వెంటనే నీ బాధను తొలగిస్తుంది. అది దాని స్వభావం అని చెప్పాడు.168. అలాగే చేయగా అతనికి ఆరాత్రి గాఢ నిద్రపట్టింది. చెడుకలలు

రాలేదు. అతడు చాలా ఆనందించాడు.169.ఇక అతని ఆనందాన్ని అడగాలా? ప్రతిరోజూ సాయిని స్మరించుకుని విభూతిపొట్లాన్ని తలగడ క్రింద పెట్టుకునేవాడు.170.తరువాత బాబా పటాన్ని తెచ్చుకుని తలవైపు గోడకు తగిలించి గురువారం మాలనువేసి భక్తిగా పూజించేవాడు.171.బాబా పటానికి గురువారం మాలను వేసి, ప్రతిరోజూ మానసిక పూజ చేయగా అతని బాధ తొలగిపోయింది.172.ఇది విభూతి యొక్క ఉపయోగం.అద్భుతమైన మరొక ఉపయోగాన్ని చెప్తాను.173.ఎటువంటి కష్టసమయాలలో ఉపయోగించినా విభూతి మనోభీష్టాలను తీరుస్తుంది.174.బాలాజి పాటిల్‌నేవాస్కరు అనే ఒక గొప్ప భక్తుడుండేవాడు. అతడు బాబా కోసం లోకోత్తరమైన సేవ చేస్తూ శరీరాన్ని అరగ తీశాడు.175.రోజూ గ్రామంలో బాబా తిరిగే దారులు,వారు లెండీకి విహారానికి వెళ్లే మార్గం చిమ్మటం. ఇవి నెవాస్కరు రోజూ చేసే పనులు.176.అతని తరువాత ఈ సేవను రాధాకృష్ణాబాయి చేసేది.ఆమె ఈ పనిని అలౌకికంగా చేసేది.177.అందరికీ ఆదరణీయమైన బ్రాహ్మణజాతీయురాలై ఇటువంటి నికృష్టమైన సేవను ఎలా చేయాలా అని ఆమె నిర్మలమైన మనస్సుకు ఎప్పుడూ అనిపించలేదు.178.ఉదయానలేచి చేత్తోచీపురు పుచ్చుకుని బాబా తిరుగాడే దారులను స్వయంగా శుభ్రం చేసే ఆమె సేవ ధన్యం.179.ఆమె వలె పనిని శుభ్రంగా త్వరగా వేరే ఎవరు చేయగలరు? కొంతకాలం గడిచాక అబ్దుల్ ముందుకొచ్చాడు.180. మహాభాగ్యవంతుడైన ఆ పాటిల్ ప్రపంచంలో ఉంటూనే ప్రాపంచిక విషయాలలో అనాసక్తితో ఉండేవాడు.అతని స్వార్థత్యాగాన్ని తెలియచేసే కథా భాగాన్ని వినండి.181.అతడు పొలంలోని పంటను కోయగానే మొత్తం ధాన్యాన్ని తెచ్చి మసీదు ఆవరణలో రాసిపోసి,బాబా చరణాలకు సమర్పించేవాడు. 182.ఆ పంటకు బాబాయే యజమాని అని తలచి, వారు ఇచ్చిన

ధాన్యాన్ని మాత్రం ఇంటికి తీసుకుని వెళ్లి జీవితం గడుపుకునేవాడు.183.సాయిమహారాజు కాళ్లూ చేతులూ ముఖం కడుక్కున్న నీరు, వారుస్నానం చేసిన నీరు, ప్రవహించే మురికి కాలువలోని నీరును త్రాగేవాడు.184. ఈ నెవాస్కరు ఉన్నంతవరకూ, ఈ నియమం ఆగకుండా అలాగే జరిగింది. తరువాత అతని పుత్రుడు కూడా కొంచెం తండ్రికి వలెనె చేసేవాడు.185.అతడు కూడా ఎప్పుడూ బాబాకు ధాన్యాన్ని పంపేవాడు. ఆ జొన్న రొట్టెలు సాయిమహారాజు తమ సమాధివరకూ రోజూ నాలుగు వేళలా తినేవారు.186.ఒకసారి ఏంజరిగిందంటే, బాలాపాటిల్ శ్రాద్ధం వచ్చింది. అన్నం అవీ వండి సిద్ధంగా ఉన్నాయి. ఇక వడ్డించడమే తరువాయి.187.వచ్చేజనాన్ని అంచనా వేసి వంటలు తయారుచేశారు. కాని చూడగా అనుకున్న వారికంటె మూడింతలు జనం వచ్చారు.188.నెవాస్కరు భార్య చాలా ఆందోళన పడింది. ఇప్పుడు అమర్యాద పాలు బడకుండా ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుందా అని అత్తగారితో మెల్లగా వాపోయింది.189.ఆమె అత్తగారికి బాబాపై గొప్ప విశ్వాసం. మన సాయిసమర్థుల గొప్ప అండ ఉండగా మనకు దిగులు ఎందుకు? నీవు నిర్భయంగా ఉండు.190.అని కోడలితో చెప్పి ఆమె పిడికెడు విభూతిని తీసుకుని వంటకాలున్న ప్రతిగిన్నెలో వేసి గిన్నెలను బట్టలతో కప్పిపెట్టింది.191.'ఇక సంతోషంగా వడ్డించు. గిన్నెలోనుండి ఎంత కావాలో తీసుకుని మరల మునుపటిలాగే బట్టను కప్పి పెట్టు. దీనిని బాగా గుర్తుంచుకో.192.ఇది సాయి యొక్క అన్నం. ఒక మెతుకైనా మనది కాదు. కనుక అవమానంపాలు కాకుండా మనలను వారే రక్షిస్తారు. ఏ లోటు కలిగినా అది వారికే వర్తిస్తుంది' అని చెప్పింది.193.అత్తగారి దృఢమైన నమ్మకానికి నిదర్శనంగా కోడలికి చక్కటి అనుభవమైంది. ఏ ఇబ్బందీ కలగకుండా బంధువులూ అతిథులూ భోజనంచేశారు.194.వచ్చినవారందరూ భోజనం

చేశారు.అంతా యథావిధిగా బాగా జరిగిపోయింది. అయినా అన్నం మాత్రం ఇంకా గిన్నెలలో మిగిలి ఉంది. 195.విభూతికి ఇటువంటి ప్రభావం ఉంది. ఇది సత్పురుషులకు సహజం. భక్తులు వారివారి మనోభావాలను బట్టి అనుభవాలను పొందుతారు.196. విభూతి మహిమను గానం చేస్తుంటే నేవాస్కరు యొక్క భక్తి విశేషానికి సంబంధించిన మరొక కథ గుర్తుకు వచ్చింది. దానిని వినండి.197.అయితే ఇది ఇప్పటి విషయానికి విభిన్నమైనదా అని అనుమానం.అయితే అవనీ కాని, సందర్భానుసారంగా చెప్పుతాను.198.అని నిశ్చయించుకుని ఆ కథను ఇక్కడ చెప్పుతాను. ఇది సందర్భం కాదు అని అనిపిస్తే శ్రోతలు క్షమించాలి.199.ఒకసారి శిరిడీ వాస్తవ్యుడైన రఘూపాటిల్ నెవాసుకు వెళ్లి నేవాస్కరు ఇంట్లో బసచేసాడు.200.ఒకరాత్రి పశువులను త్రాళ్లతో గుంజలకు కట్టి ఉండగా అకస్మాత్తుగా ఒక పాము కొట్టంలో ప్రవేశించి బుస కొట్టింది.201.బాగా పడగ విప్పి చక్కగా అక్కడ కూర్చుంది.ఆ పరిస్థితిని చూచి అందఱికీ మతిపోయింది.202.పశువులు ప్రయత్నంచేసి విప్పుకుని పారిపోవటానికి గొడవ చేస్తున్నాయి. సాయియే ఆ రూపంలో ప్రకటమయ్యారని నేవాస్కరుకు దృఢమైన విశ్వాసం.203.పశువులను విప్పక పోతే వేరే ఉపాయంలేదు. ఎవరి అడుగైనా పాముపై పడితే అపాయం కాదూ!204.దూరంనుండి ఆ పామును చూచి నెవాస్కరుకు ఆనందం కలిగింది. శరీరమంతా పులకాంకితమైంది.సాష్టాంగ ప్రణామం చేశాడు.205.సాయి యొక్క కృపాదృష్టి పాము రూపంలో వచ్చిందని తలచి పాము కోసం ఒక గిన్నె నిండా పాలు తెచ్చి పెట్టాడు.206.ఆ పాటిల్ మనోభావం ఎంతటి దృఢమైనదో. అతని మనసులో అణుమాత్రమైనా భీతి కలగలేదు. సరికదా పాముతో ఏమన్నాడో శ్రోతలు వినండి.207.'బాబా! ఎందుకు బుస్‌బుస్ మంటున్నావు? మమ్మల్ని భయపెట్టాలని చూస్తున్నావా ఏం?

ఇదిగో పాలగిన్నె. నిశ్చింతగా త్రాగు. దీనిని సేవించు.208. చిన్న గిన్నెడు పాలు ఏం సరిపోతాయని పెద్దగిన్నె నిండా పాలు త్రెచ్చి నిర్భయంగా దాని ముందు ఉంచాడు. భయాలన్నీ మనసులోని భావనలవలననే 209. పాలగిన్నెను పాము వద్ద ఉంచి తను వెళ్లి మరీ దగ్గరగా కాక, దూరంగానూ కాక, మునపటి స్థలంలో కూర్చున్నాడు. అతని ముఖంలో పాముపై ఉత్సాహం కనిపించింది.210.పాము ఇంట్లోకి ప్రవేశించటం భయపడాల్సిన విషయం. అందరి మనసులూ ఒకేలా ఉంటాయా? ఆ ఆపద ఎలా తొలగుతుందా అని అందఱూ ఆందోళన పడ్డారు.211. బయటికి పోవటానికి భయం.పాముగాని ఇంట్లోకి దూరిందా ఇక బయటికి రావటం కష్టం. అందుకని అందఱూ దానిమీదే కన్నేసి కూర్చున్నారు.212. అయినా పాము తృప్తి చెంది,అందఱి దృష్టిని తప్పించుకుని,ఎటువైపు వెళ్లిపోయిందో తెలియలేదు. అందరికీ ఆశ్చర్యం కలిగింది.213.కొట్టమంతా వెదికినా దాని ఆచూకీ అసలు దొరకలేదు. అందఱి మనసులూ కుదుటపడ్డాయి. కాని నెవాస్కరు మనసులో బాధ.214. కొట్టంలోకి ప్రవేశించినప్పుడు కనిపించినట్లుగా వెళ్ళేటప్పుడుకూడా కనిపించి ఉంటే బాగుండేది అని అతని బాధ.215.బాలాకు ఇద్దరు భార్యలు. పుత్రులు చిన్నవారు. నెవాసానుండి అప్పుడప్పుడూ బాబా దర్శనానికి వచ్చేవారు.216. బాబా వారిద్దఱికీ చీరలు రవికలు కొని ఆశీస్సులతో ఇచ్చేవారు. ఇలాంటి భక్తుడు బాలా.2 17. ఈసచ్చరితలోని మార్గం సరళమైనది. ఈ సాయి సచ్చరిత పారాయణ ఎక్కడెక్కడ జరుగుతుందో అక్కడ ద్వారకామాయి, మరియు సాయిబాబా కూడా నిశ్చయంగా ప్రకటమవుతారు.218.అక్కడే గోదావరీ తీరం,అక్కడే సమీపంలో శిరిడీక్షేత్రం,అక్కడే ధునితో సహా సాయి ఉండి,స్మరించినంత మాత్రాన కష్టాలను నివారిస్తారు.219.సాయిచరిత్రను పారాయణ చేసే చోట

సాయి ఎల్లప్పుడూ నివసిస్తుంటారు. భక్తిపూర్వకంగా చరిత్రావర్తన చేస్తే సాయిబాబా ప్రసన్నులవుతారు. 220. ఆనందఘనులైన సాయిని స్మరిస్తే చాలు. అనుదినం వారి నామాన్ని జపిస్తే చాలు. కఠినమైన ధ్యానధారణాది ఇతర జపతప సాధనలేవీ అవసరంలేదు. 221. సాయిచరణాల యందు భక్తితో దృఢవిశ్వాసంతో, వారి విభూతిని నిత్యం నియమంగా ధరించి సేవించినవారి మనసులోని కోరికలు తీరుతాయి. 222. ధర్మార్థకామ మోక్షాది నాలుగు పురుషార్థాలను సాధించి కృతార్థులౌతారు. స్వార్థం మరియు పరమార్థ విషయాలలోని గుహ్యార్థాలన్నీ స్పష్టంగా తెలుస్తాయి. 223. మహాపాపాలు, ప్రబల పాతకాలు, ఉపపాతకాలు మొదలైనవన్నీ విభూతి స్పర్శతో నిర్మూలనమై అంతర్బాహ్య పరిశుద్ధత లభిస్తుంది. 224. ఈ విభూతి ధారణలోని మహిమ భక్తులకు తెలుసు. శ్రోతలకు కూడా శుభం కలగాలని వివరంగా వర్ణించాను. 225. వివరంగా వర్ణించానని చెప్పటం సబబు కాదు. ఎందుకంటే, స్వయంగా నాకు కూడా విభూతి మహిమ యథార్థంగా తెలియదు. అయినా శ్రోతల శ్రేయస్సుకొఱకు సంక్షిప్తంగా వర్ణించడమైనది. 226. శ్రోతలకు ఇదే నా ప్రార్థన. సాయిబాబాకు వందనం చేసి తమతమ అనుభవాలను తెలుసుకోండి. ఈ నా మాటను వినండి. 227. ఇక్కడ తర్కంతో పని లేదు. దృఢమైన పూజ్యభావం అవసరం. బుద్ధిచాపల్యం పనికిరాదు. పరమ శ్రద్ధ అవసరం. 228. శ్రద్ధావిహీనులకు, కేవలం వాదాలతో తర్కించేవారికి, విమర్శకులకు సత్పురుషుల బోధ లభించదు. పరిశుద్ధ భక్తిగల భావికులే జ్ఞానాన్ని పొందగలరు. 229. ఈ కథలో హెచ్చుతగ్గులన్నీ సాయి ప్రేరితాలే అని తలచి దోషదృష్టి లేకుండా సాయిసచ్చరితను పఠించండి. 230. ఈ విధంగా రసికులైన పాఠకబృందం పరమదయాళువు ప్రేమమయులైన సాయిమూర్తిని మనసులలో స్థాపించుకుని నిత్యం స్మరించుకోండి. 231. ఎక్కడ శిరిడీ? ఎక్కడి గోవా? గోవాలో జరిగిన దొంగతనాన్ని మొత్తం సాయి వివరంగా

చెప్పే కథ తరువాత. 232. సాయి చరణాల యందు మస్తకాన్ని ఉంచి, శ్రద్ధగా శ్రవణం చేయండని హేమాడ్ మనస్ఫూర్తిగా శ్రోతలకు అతివినయంగా మనవి చేసుకుంటున్నాడు. 233. స్వస్తి శ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో చికిత్సా ఖండనం విభూతి మండనమను ముప్పది అయిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 36 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః; శ్రీగురుభ్యోనమః; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఇప్పుడు గతాధ్యాయాను సంధానం – రమ్యమైన దొంగతనపు కథను వివరిస్తానని చెప్పాను. శ్రోతలు దానిని శ్రద్ధగా వినండి.1.ఇది కథ కాదు. ఆత్మానందరసం. త్రాగుతున్న కొద్దీ దాహం దారుణంగా అధికమౌతుంది.ఆ దాహాన్ని తీర్చటానికి వేరేకథ చెప్పబడుతుంది.2.దానివల్ల శ్రోతలకు శ్రవణంలో సుఖం కలుగుతుంది. ఇది ఎంతో రసవత్తరమైనది. ప్రపంచంలోని కష్టాలను నివారించి సుఖాలను కలుగ చేస్తుంది.3.తమ హితాన్ని సాధించు కోవాలని కోరుకునే భాగ్యవంతులు సాయికథా వర్ణనను శ్రద్ధగా శ్రవణం చేయండి.4.అపారమైన సత్పురుషుల మహిమను సాంతం ఎవరూ వర్ణించలేరు. మరి నాకు ఏ అర్హత ఉంది? లేదని నాకు బాగా తెలుసు.5.నా అహంభావాన్ని సాయి తమ వాత్సల్యంతో తొలగించారు.సాయి ఎవరిద్వారానైనా తమ వైభవాన్ని తామే వర్ణింప చేసి భక్తులతో శ్రవణం చేయిస్తారు.6.పరాత్పరుడనే సరోవరంలో విహరించే సాయి రూప హంస, హంస సోహం అనే వృత్తి కలిగి అనాసక్తితో బ్రహ్మరూపంలోని ముత్యాలను అత్యంతఉత్సాహంతో సేవిస్తూంది.7.వారికి ఊరు పేరులేదు. కాని అపారమైన వైభవం కలవారు. ఒక క్షణంలో నిరుపేదను రాజుగా మార్చగలరు. ఇదివారి కరుణా కటాక్షలీల.8.ఈ పరతత్వ జ్ఞానావతారం పేరు ప్రతిష్ఠలకు దూరంగా ఉండి, అనేకరకాల అనుభూతులతో సాక్షాత్కారాన్ని కలగచేస్తారు.9.తాము అనుగ్రహించిన వారికి వారు తమ వివిధ రూపాలను

చూపుతారు. అపూర్వమైన అసంఖ్యాక సంఘటనలను సృష్టిస్తారు. వారి అపారమహిమను వినండి. 10. వారిని ధ్యానంతో తెలుసుకునేవారు, లేదా భక్తిగా కీర్తించేవారు ఏ లోటూ లేకుండా పూర్తిగా రక్షింపబడతారు. 11. సాయికి తమ కథల యందు మక్కువ ఎక్కువ. అందుకే అనవరతం వానిని గుర్తుకు తెచ్చి, వక్తను, శ్రోతలను నిమిత్తమాత్రులుగా చేసి భక్తుల కోరికలను తీర్చుతారు. 12. పరమార్థమందు పూర్తి శ్రద్ధ కలిగి, ప్రపంచానికి నీరు వదలి, పరమేశ్వరుని ఆశ్రయించిన అనేక ప్రాణులను వారు ఉద్ధరించారు. 13. వారిని దేశవిదేశాల వారు ఆరాధిస్తారు. వారి భక్తిపతాకం ఎప్పుడూ ఎగురుతుంటుంది. వారు దీనులను దుర్బలులను కాపాడుతూ అందరి కోరికలను తీర్చుతారు. 14. ఇప్పుడు వక్త నోటిని, శ్రోతల చెవులనూ పావనం చేసే పరమ పవిత్రమైన ఈ సాయి చరిత్రను శ్రద్ధగా వినండి. 15. ఇద్దరు గృహస్థులు సాయిబాబా దర్శనానికి గోవానుండి వచ్చారు. ఆ ఇద్దరూ సాయి దర్శనంతో సంతసిల్లి వారి చరణాలకు ప్రణామం చేశారు. 16. ఇద్దరూ జతగా ఒకేసారి వచ్చినా సాయిబాబా ఒకరినే 'నాకు పదిహేను రూపాయలు దక్షిణను ఇవ్వు' అని అడగగా అతడు ఆనందంగా ఇచ్చాడు. 17. రెండవ వ్యక్తిని అసలు అడగకుండానే అతడు తనంతటతాను 35 రూపాయలను ఇచ్చాడు. కాని వానిని బాబా వెంటనే తిరస్కరించగా అతనికి ఆశ్చర్యం కలిగింది. 18. ఆ సమయాన మాధవరావు కూడా అక్కడే ఉన్నాడు. బాబా భేదభావాన్ని గమనించి, సాయిని ఏమని అడిగాడో వినండి. 19. 'బాబా! ఎందుకు ఈ భేదం? స్నేహితులిద్దరూ జతగా వచ్చారు. ఒకరిని అడిగి మరీ దక్షిణను తీసుకున్నారు. రెండవ వ్యక్తి స్వయంగా ఇస్తే తిరిగి ఇచ్చేశారు. 20. సత్పురుషుల వద్ద ఈ భేదభావమెందుకు? మీ అంతట మీరు ఒకరిని అడిగారు. ఒకరు స్వయంగా ఇస్తే తిరస్కరించి అతనిని నిరాశ పరచారు. 21. కొంచెం డబ్బును ప్రేమగా తీసుకుని ఎక్కువ డబ్బుకు ఆశ పడలేదు. నేను మీ స్థితిలో ఉంటే ఇలా ప్రవర్తించే వాణ్ణి కాను'

అని అన్నాడు.22.'శామా! నీకసలు ఏం తెలియదు. నేను ఎవరివద్దనుండీ ఏమీ తీసుకోను.ఈ మసీదుమాత ఇక్కడ బాకీ ఉన్న డబ్బు అడుగుతుంది.ఇచ్చినవారు ఋణముక్తులౌతారు.23.నాకేమైనా ఇల్లు ఉందా?సంసారం ఉందా?నాకు డబ్బుతో ఏం అవసరం?అన్ని విధాలా నేను నిశ్చింతగా ఉంటాను.24.కాని ఋణం,శత్రుత్వం,హత్య చేసిన వారిని అవి కల్పాంతం వరకూ విడిచిపెట్టవు.వారి వారి అవసరాలకు జనం దేవతలకు మ్రొక్కుకుంటారు.వారిని ఉద్ధరించటానికి నేను శ్రమపడాలి.25.మీకు ఆ చింతలేదు.మీ మీ అవసరాలు తీర్చుకోవటానికి మీరు మ్రొక్కుకుని వేడుకుంటారు.భక్తులలో ఋణముక్తులైన వారు నాకు ఎప్పుడూ ప్రీతిపాత్రులు.26.ఇతడు మొదట పేదవాడు.మొట్టమొదటి జీతం డబ్బు పదిహేను రూపాయలను దేవునికి అర్పిస్తానని మ్రొక్కుకుని తరువాత మరచిపోయాడు.27.తరువాత ఆ పదిహేను ముప్పై అయ్యాయి.ముప్పైనుండి అరవై, అరవైనుండి నూరు, అలా రెండింతలు, నాలుగింతలుగా జీతం పెరిగింది.అట్లే అతని మరపు కూడా బాగా పెరిగింది.28.అతని జీతం అలా పెరిగి ఏడువందల రూ॥లు అయింది. తన కర్మవశాత్తు ఇక్కడికి వచ్చాడు. నేను నా పదిహేను రూపాయలను ఇలా దక్షిణ మిషతో అడిగాను.'29.ఇక రెండవ విషయం విను. 'ఒకసారి సముద్రతీరంలో విహరిస్తుండగా ఒక పెద్ద భవనం కనిపించింది.అక్కడ వరండాలో కూర్చున్నాను.30.ఆ భవనం యజమాని బ్రాహ్మణుడు. కులీనుడు. ధనవంతుడు.ప్రేమపూర్వకంగా నన్ను లోపలికి ఆహ్వానించి అన్నపానీయాలను సుష్టుగా పెట్టాడు.31.అక్కడ ఒక అలమారా వద్ద శుభ్రమైన ప్రత్యేక స్థలాన్ని నేను శయనించటానికి ఇచ్చాడు.నాకు నిద్ర వచ్చింది.32.నేను బాగా నిద్రించడం గమనించి,అతడు రాతిని ఊడబెరికి గోడకు రంధ్రం చేసి నాకు తెలియకుండా నా జేబును కత్తిరించి, నన్ను పూర్తిగా దోచుకున్నాడు.33.నేను మేలుకొని జరిగినదాన్ని తెలుసుకుని

వెంటనే ఏడవ సాగాను. ముప్పైవేల రూ॥లు పోయినవి. చాలా దుఃఖం కలిగింది. 34. అవి నోట్ల కట్టలు. అకస్మాత్తుగా అంత నష్టం కలిగినందుకు నా గుండె చెదిరిపోయింది. పైగా బ్రాహ్మణుడు నన్ను సమాధాన పరచాడు. 35. నాకు అన్న పానీయాలు రుచించలేదు. అలా పదిహేను రోజులు అక్కడే వరండాలో దీనవదనంతో కూర్చున్నాను. 36. పదిహేనవరోజు పూర్తవుతుండగా దారివెంట వెడుతున్న ఒక ఫకీరు అకస్మాత్తుగా వచ్చి నేను ఏడుస్తుండటం గమనించాడు. 37. నా దుఃఖానికి కారణమేమిటని అడిగాడు. నేను అతనితో జరిగిన దాన్నంతా చెప్పాను. 'నేను చెప్పిన విధంగా చేస్తే, నీవు కష్టం నుండి బయటపడతావు. 38. నీకు ఒక ఫకీరు ఆచూకీ మరియు వారి గురించి చెప్పుతాను. నీవు వారి శరణు వేడు. వారు నీ ధనం నీకు మరల లభింపచేస్తారు. 39. కాని నేను చెప్పిన విధంగా వ్రతాన్ని ఆచరించాలి. నీవు కోరుకున్నది లభించేవరకు నీకు ప్రియమైన పదార్థాన్ని వదిలిపెట్టు. దానివల్ల నీ కార్యం సిద్ధిస్తుంది' అని చెప్పాడు. 40. నేను ఆ ఫకీరు చెప్పినట్లు అలాగే చేయగా నా డబ్బు నాకు తిరిగి లభించింది. తరువాత నేను ఆ భవనాన్ని విడిచి పెట్టాను. మునుపటి వలనే సముద్రతీరానికి వచ్చాను. 41. నడుస్తుండగా ఒక నావ కనిపించింది. కాని అందులో నేను ప్రవేశించలేకపోయాను. అయినా ఒక మంచి సిపాయి నాకు నావలో స్థలాన్ని ఇచ్చాడు. 42. గాలి అనుకూలంగా ఉండటంతో నావ తీరానికి చేరుకుంది. బండిలో కూర్చుని ఇంటికి రాగా ఈ మసీదు మాత నా కళ్లకు కనిపించింది'. 43. ఇక్కడికి బాబా చెప్పటం ముగిసింది. 'ఈ అతిథులను ఇంటికి తీసుకుని వెళ్లి భోజనం పెట్టు' అని బాబా శ్యామాకు ఆజ్ఞాపించారు. 44. అట్లే వారికి పళ్లేలలో భోజనాన్ని వడ్డించి శ్యామా వారిని కుతూహలంగా 'బాబా చెప్పిన విషయం మీకేమైనా అర్థమయిందా' అని అడిగాడు. 45. 'నిజానికి సాయిబాబా ఎప్పుడూ ఇక్కడే ఉంటారు. సముద్రం, నావ, నావికుడు వారికేం తెలుసు? 46. ఎక్కడి బ్రాహ్మణుడు? ఎక్కడి

భువనం? జన్మంతా చెట్ల క్రిందే గడిపేవారికి దొంగలు దోచుకుని పోయేటంత సంపద ఎక్కడినుండి వచ్చింది?.47.ఈ విషయాన్ని మీరు రాగానే ఆరంభించారు.ఇది మీకు సంభవించిన పూర్వకథ కావచ్చు. మీకు గుర్తు చేయటానికి చెప్పినట్లుంది'అని అన్నాడు. 48.అప్పుడు ఆ వచ్చిన వారు గద్గదులై,'సాయిబాబా సర్వజ్ఞులు, పరబ్రహ్మావతారం,అద్వైతులు, ఏ భేదభావం లేనివారు, సర్వవ్యాపకులు.49.ఇప్పుడు వారు చెప్పిన ప్రతి అక్షరం మా కథలే. స్వాదిష్టమైన ఈ భోజనమయాక, మీకు సవిస్తరంగా చెప్పుతాను.50.బాబా ఏకరువు పెట్టినదంతా నిజంగా జరిగినదే. కాని వారు మా పరిచయం లేకుండా మా గురించి ఎలా తెలుసుకున్నారు? ఇదంతా చమత్కారంగా ఉంది' అని చెప్పారు. 51.భోజనమయాక మాధవరావుతో పాటు తాంబూలాన్ని నములుతూ వారు తమ కథా వర్ణనను ఆరంభించారు.52.ఆ ఇద్దరిలో ఒకడు ఇలా చెప్పసాగాడు,'మానివాస స్థానం పర్వతప్రాంతం. కాని బ్రతుకు తెరువు కోసం సముద్రంతో సంబంధం ఏర్పడింది.53.అందుకోసం గోవాకు వెళ్లాను. ఉద్యోగం లభించాలన్న కోరికతో దత్త భగవానుని ఆరాధించాను. అత్యంత భక్తిగా మ్రొక్కుకున్నాను.54.'దేవా కుటుంబాన్ని పోషించుకోవటానికి ఏదో ఒక ఉద్యోగం లభించాలి. కరుణామయా! నేను నీ శరణుజొచ్చాను. నాకు ఉద్యోగాన్ని ఇవ్వు.55.నేటినుండి త్వరలో ఈ మాటను నిలబెట్టుకుంటే, నా మొదటినెల జీతమంతా నీకు సమర్పిస్తాను అని మ్రొక్కుకున్నాను.56.భాగ్యం కొద్దీ దత్తభగవానుడు ప్రసన్నుడయ్యాడు. త్వరలోనే మ్రొక్కు ఫలించింది. నాకు మొదట జీతం పదిహేను రూపాయలు లభించేవి.57.తరువాత సాయిబాబా వర్ణించిన విధంగానే నా జీతం పెరిగింది. కాని మ్రొక్కును పూర్తిగా మరచి పోయాను.దానినే వారు ఇప్పుడు గుర్తుకు తెచ్చారు.58.ఎవరికైనా వారు దక్షిణను తీసుకున్నట్లు అనిపిస్తుందేమో కాని అది దక్షిణ కాదు. వారు నా ఋణాన్ని తీర్చారు.అలా దక్షిణ సాకుతో నా

పాత మొక్కును గుర్తుచేశారు అని చెప్పాడు.59.తాత్పర్యం, సాయి ద్రవ్యాన్ని యాచించరు. తమ భక్తులను కూడా యాచించనివ్వరు. ధనం ఎప్పుడూ అనర్థమని తలచేవారు కనుక, బాబా భక్తులను ధనమోహంలో పడనివ్వరు.60.వారి పాదాల యందు ఎల్లవేళలా అనురక్తుడై ఉన్న మహల్సాపతి వంటి భక్తుడు, జీవితాన్ని కష్టాలతో గడుపుతున్నా, అతనిని ఏ మాత్రం ధనాన్ని కూడా ఎవరి వద్దనుంచి తీసుకోనిచ్చేవారు కాదు.61.దక్షిణ రూపంలో వచ్చిన డబ్బును సాయి స్వయంగా అనేక సార్లు జనులకు పంచి పెట్టేవారు కాని కష్టాలలో ఉన్న మహల్సాపతికి మాత్రం ఎప్పుడూ ఏ కొంచెమైనా ఇచ్చేవారు కారు.62.అతడు కూడా చాలా స్థిరమైన మనసుకలవాడు.సాయిబాబా ఉదారంగా ఉన్నా, అతడు చేయి చాచి ఎన్నడూ యాచించలేదు.63.అతని ఆర్థిక పరిస్థితి నికృష్టంగా ఉండేది.అయినా అతనికి ఉత్కృష్టమైన వైరాగ్యముండేది. పేదరికంతో పీడింపబడుతున్నా అతడు ఎప్పుడూ అల్పసంతోషి.64.ఒకసారి దయాళువైన హంసరాజు అనే ఒక వ్యాపారికి, మహల్సాపతికి ఏమైనా ఇవ్వాలని అనిపించింది.65.అతని పేద సంసారాన్ని చూచి తనకు చేతనైన సహాయం చేయాలని సద్బుద్ధి కలిగింది.66.అతడు ఇటువంటి నిరుపేద పరిస్థితిలో ఉన్నా అతనికి ఇతరులెవరైనా సహాయం చేయదలచినా, సాయినాథునికి అదికూడా నచ్చేదికాదు. ధనమందు అనాసక్తి ఉండటం వారికి ఇష్టం.67.ఆ భక్తుని పరిస్థితికి ఆ వ్యాపారి మనసు కరిగి ఏం చేశాడంటే దర్బారులో బాబా మహల్సాపతి ఇద్దరూ ఉన్నప్పుడు డబ్బును, మహల్సాపతి చేతిలో పెట్టాడు.68.మహల్సాపతి ఆ డబ్బును వినయంగా తిరిగి ఇచ్చేసి సాయిబాబా అనుమతి లేకుండా నేను స్వీకరించను అని చెప్పాడు.69.అతడు ధనాన్ని ఆశించే భక్తుడు కాడు. పరమార్థం కొరకు ఎంతో పరితపించేవాడు. ప్రేమ నిండిన హృదయంతో నిస్వార్థంగా కాయావాచా మనసా సాయిపాదాలకు అంకితమైనవాడు.70. హంసరాజు సాయితో,'బాబా! అతనిని ఒక గవ్వైనా తాకనివ్వరేం' అనిఅంటే

వారు 'నా భక్తులను ధనం ఆకర్షించదు. వారు ద్రవ్య ప్రలోభంలో చిక్కుకుని పోకూడదు' అని చెప్పారు.71.తరువాత రెండవ అతిథి,'నాకు కూడా బాబా చెప్పింది అర్థమైంది.ఆ కథనంతా చెప్తాను వినండి.వింటుంటే ఎంతో ఉత్సాహంగా ఉంటుంది.72. ముప్పైయైదు ఏళ్లనుండి నా వద్ద శ్రద్ధగా చాలా నమ్మకంగా బాగా పని చేసే బ్రాహ్మణునికి దురదృష్టవశాత్తు బుద్ధి భ్రష్టుపట్టి ,నేను కూడబెట్టిన ధనాన్ని దొంగిలించాడు.73.మా ఇంటి గోడకు అలమారా అమర్చి ఉంది. అందులోని ఇటుకరాయిని మెల్లగా ఊడదీసి కన్నం వేశాడు.74.బాబా అలమారా అని చెప్పిన దానిలోనే కన్నం వేయటానికి, అందరూ నిద్రించాక గోడలోని రాయిని ఊడదీశాడు.75.నా రూపాయలను దొంగిలించి తీసుకుని వెళ్లారని బాబా చెప్పారు కదా! అదంతా కూడా నిజమే. నోట్ల కట్టలను తీసుకుని వెళ్లాడు.76.అవి ముప్పైవేల రూపాయలు. ఇది బాబా కెలా తెలిసిందో అర్థం కావటం లేదు.శ్రమతోసంపాదించిన డబ్బు పోగా,నేను అహర్నిశలూ ఏడుస్తూ కూర్చున్నాను.77.వెదకివెదకి అలసిపోయాను. ఏం చేయాలో అర్థం కాలేదు.పదిహేనురోజులు అలా చింతలో పడి ఉన్నా, దాని నుండి బయటపడే దారి కనిపించలేదు.78.ఒకరోజు వరండాలో దుఃఖంతో కూర్చుని ఉండగా దారిన ఒక ఫకీరు వెళ్తూ, నా దుఃఖానికి కారణమడిగాడు.79.బాధపడుతున్న నన్ను చూచి ఫకీరు ప్రశ్నించాడు. నేను విషయమంతా చెప్పగా అతడు నాకు దుఃఖ నివారణోపాయం చెప్పాడు.80.కోవర్‌గాం తాలూకాలో శిరిడీ అనే ఒక గ్రామమందు సాయి అనే ఒక అవలియా ఉన్నారు.నీవు వారికి మ్రొక్కుకో.81.నీకు ప్రియమైన వస్తువును సేవించటం మానివేసి, మీ దర్శనమయ్యేవరకు నేను దీనిని త్యజిస్తానని మ్రొక్కుకో'82. అని ఆ ఫకీరు చెప్పాడు.నేను వెంటనే అన్నమును త్యజించాను.'బాబా! దొంగిలింపబడ్డ నా ధనం దొరికాక మీ దర్శనం చేసుకుని నేను అన్నం తింటాను' అని మ్రొక్కుకున్నాను.83.అంతే ఒక పదిహేను

రోజులు గడిచేసరికి బ్రాహ్మణుని మనసుకు ఏం తోచిందో తెలియదు. అతడు తనంతట తాను వచ్చి నా ధనాన్ని నాకు ఇచ్చాడు.84.'నా బుద్ధి చెడిపోవటం వలన నేను ఇటువంటి పనిని చేశాను.ఇప్పుడు మీ పాదాలపై శిరసునుంచుతున్నాను.నన్ను క్షమించానని అనండి'అని వేడుకున్నాడు.85.అలా అంతా సవ్యంగా జరిగింది.సాయిబాబా దర్శనాభిలాష ఉత్పన్నమైంది.ఆ కోరికకూడా ఇవాళ తీరింది. ఈ భాగ్యం ప్రాప్తించినందుకు నేను ధన్యుణ్ణి.86.నేను కష్టంలో దుఃఖపడుతూ నా వరండాలో కూర్చుని ఉండగా నాకు ధైర్యాన్ని కలిగించటానికి వచ్చిన వారు మరలా కలవలేదు.87.నా యందు కరుణతో నాకు సాయి గురించి చెప్పి, శిరిడీని చేతితో చూపించినవారు మరల కలవలేదు.88.అకస్మాత్తుగా నన్ను కలిసి,నా విషయాన్ని అడిగి తెలుసుకుని చివర నా మ్రొక్కును తీర్చుకునేలా చేసినవారు మరలా కలవ లేదు.89.నిజంగా ఆ ఫకీరే అవలియా అయిన ఈ సాయి అని అనిపిస్తోంది. నాకు తమ దర్శన భాగ్యాన్ని కలిగించటానికి వారు స్వయం ఉత్సాహపడ్డారు.90.ఎవరైనా సరే ఏదో ఒక కోరికతోనే సాధువుల దర్శనానికి వెడతారు.నాకు అసలు వీరిని దర్శించుకోవాలనే కోరికలేదు.నా ధనం లభించటానికి ఆ ఫకీరే మొదట వీరికి మ్రొక్కుకొమ్మని ప్రోత్సాహించాడు.91.ఎవరికి మ్రొక్కుకుంటే అనాయాసంగా నా ధనం ప్రాప్తించిందో అట్టివారు,ముప్పై అయిదు రూపాయలను ఆశించటం జరగదు.92.పైగా అజ్ఞానులమైన మనలను పరమార్థతత్పరులను చేయటానికి,మనకు ఎల్లప్పుడూ శుభాలను కలిగించటానికి శ్రమపడతారు. దక్షిణమిషతో మనలను దారికి తీసుకువస్తారు. 93.ఇందుకొరకే ఈ అవతారం. లేకపోతే పామరులం, ఏ భక్తి లేని వారమైన మనం ఎలా భవాన్ని దాటగలం? బాగా ఆలోచించండి.94.నా డబ్బు తిరిగి లభించిందన్న అమితానందంలో మ్రొక్కుబడిని మరచిపోయాను. ధనమోహం చాలా దుర్భరం.95.తరువాత ఒక రోజు కులాబా దగ్గర ఉన్నప్పుడు నేను కలలో

సాయిని చూచాను. వెంటనే శిరిడీకి బయలుదేరాను.96.సాయి సమర్థులు చెప్పినట్లుగానే నన్ను నావలో ఎక్కనివ్వక అడ్డుపెట్టగా ఒక సిపాయి ప్రయత్నంతో నా కష్టం తప్పింది. ఇది నిజమే.97.నేను కష్టాలతో రేవు వద్దకు వచ్చినప్పుడు నిజంగానే ఎవరో ఒక సిపాయి నా కొరకు వాళ్లని వేడుకున్నాడు.98.అంతకు ముందే నన్ను తిరస్కరించిన నావ అధికారులు నాకు నావలో స్థలాన్ని ఇచ్చి నన్ను కృతజ్ఞుణ్ణి చేశారు.99.సిపాయి అసలు నాకు పరిచయస్తుడు కాడు. అయినా నేను అతనికి పరిచయస్తుడనని చెప్పగా నావలో ఎవరూ నన్ను అడ్డగించలేదు.నావలో సుఖంగా కూర్చున్నాను.100.ఇలా నావ వద్ద జరిగిన సిపాయి వృత్తాంతం, నా విషయంలో జరగగా సాయిబాబా దీనిని తమపై ఆరోపించుకున్నారు.101.వీరి అద్భుత స్థితిని గని నాకు మతిపోయింది. ఈ సాయి జగత్తంతా నిండి ఉన్నట్లు నాకు అనిపిస్తోంది.102.వీరు లేకుండా అణువంత ప్రదేశమైనా లేదు. మాకు అనుభవాన్ని కలగజేసినట్లే వీరు ఇతరులకు కూడా అట్లే కలిగిస్తారు. 103.మేము ఎవరం? ఎక్కడివారం?ఎంత గొప్ప భాగ్యవంతులం? మమ్మల్ని తమవద్దకు లాక్కొని వచ్చి ఇలా చక్కని దారికి తీసుకుని వచ్చారు.104.మేము మ్రొక్కుకోవటం – మా ధనం అపహరించబడటం – మ్రొక్కును తీర్చుకోవటంలో విశేషం– ధనం లభించటం.105.మా భాగ్యమెంత గొప్పది.మేము వారిని పూర్వం ఎప్పుడూ దర్శించుకోలేదు. వారిని ధ్యానించలేదు. వారిని గురించి వినైనా లేదు. వారు మమ్మల్ని గుర్తుంచుకున్నారు.106.ఇట్టి వీరి సాంగత్యంలో అనేక సంవత్సరాలున్నవారు,అహర్నిశలూ వారి పాదాలను సేవించే భగవద్భక్తులు ధన్యులు.107.సాయిబాబా ఎవరెవరితో మాట్లాడారో,నవ్వారో,ఆటలాడారో,కూర్చున్నారో, నడిచారో,భోజనం చేశారో,శయనించారో, కోపగించారో వారందరూ భాగ్యవంతులు.108.మా చేతులారా వారికి ఏం చేయకపోయినా వారు మాపై ఇంత అనుగ్రహాన్ని చూపారు.

ఎల్లప్పుడూ వారి సాంగత్యంలో ఉన్న మీరు ధన్యులు, భాగ్యవంతులు. 109.ఎంతో భాగ్యవంతులైన మీరే మీ సత్కర్మలతో మీ పుణ్యార్జితంతో మానవుని రూపంలో ఉన్న ఈ దివ్యమూర్తిని శిరిడీకి రప్పించినట్లు అనిపిస్తుంది.110.అనంతకోటి జన్మల పుణ్యఫలం వలన మాకు శిరిడీ రావటం ప్రాప్తించింది. శ్రీసాయి దర్శన భాగ్యం కలగటానికి సర్వస్వాన్ని అర్పించేయాలని అనిపిస్తుంది.111. సాయి సజ్జనులు స్వయం అవతార పురుషులు. గొప్ప వైష్ణవునిలా ఆచరిస్తారు. జ్ఞానవృక్షం యొక్కశాఖ. చిదాకాశంలో శోభిస్తున్న భాస్కరులు.112.మా పుణ్యం కొద్దీ ఈ మసీదు మాత లభించి, సాయి దర్శనాన్ని కలిగించి, మా మ్రొక్కులను తీర్చింది.113.మాకు వీరే దత్త భగవానులు. అందువలననే ఆ వ్రతం ఆచరించమని ఆజ్ఞాపించి, మమ్ము నావలో కూర్చుండబెట్టి,శిరిడీకి తమ దర్శనానికి తీసుకుని వచ్చారు.114.ఇటువంటి తమ సర్వవ్యాపకత్వాన్ని, సర్వాంతర్యామిత్వాన్ని,తాము సర్వత్రా సాక్షియని సాయి తెలియచేశారు.115.వారి మందహాస వదనాన్ని చూచి పరమానందం కలిగింది. ప్రపంచ దుఃఖాన్ని మరచిపోయాను.పరమార్థాన్ని సాధించాలన్న ఉత్సాహం కలిగింది. 116.ప్రారబ్ధానుసారం జరగనున్నది జరగనీ అని మనసున నిశ్చయించుకుని సాయి చరణాలలో అఖండమైన ప్రేమతో వారి మూర్తిని ఎల్లప్పుడూ కళ్లలో నిలుపుకోవాలి.117.అగాధము, అగమ్యము అయిన సాయిబాబా లీలలకు వారి ఉపకారాలకు అంతం లేదు. దయాళువైన సాయీ! ఈ శరీరాన్ని మీకు నివాళిగా చేయాలి అని అనిపిస్తుంది'.118.ఇప్పుడు మరోకథను కాసేపు శ్రద్ధగా వినండి. సాయి నోటి నుండి వెలువడిన అక్షరాలు నిశ్చయంగా బ్రహ్మలిఖితాలు.119.సఖారాం బొరంగాబాదుకర్, షోలాపూర్ పట్టణనివాసి.అతని భార్య, పుత్రసంతానం కోసం ఆతురతతో శిరడీకి వచ్చింది.120.పరమపావనులైన సాయి సత్పురుషుని అగాధ చరిత్రను విని సవతి కొడుకుని వెంటబెట్టుకుని సాయి

దర్శనానికి వచ్చింది.121.వివాహమై ఇరవైఏడు సంవత్సరాలు గడిచిపోయినా ఆమెకు సంతానం కలగలేదు. దేవీ దేవతలకు మ్రొక్కుకుని ఆమె మనసుకు నిరాశ కలిగింది.122.ఆ సువాసిని, తన మనసులోని కోరికతో బాబా దర్శనానికి శిరిడీకి వచ్చి ఆలోచించసాగింది.123.బాబా చుట్టూ ఎప్పుడూ భక్తబృందం గుమిగూడి ఉంటుంది. నాకు ఎప్పుడు ఏకాంతంగా కలుస్తారు,నా మనసులోని మాటను వారికి ఎలా చెప్పాలి అని చింతించసాగింది.124.మసీదు ప్రాంగణం తెరచే ఉంటుంది.బాబా వద్ద భక్తులు ఎప్పుడూ ఉంటారు. తన బాధను మనవి చేసుకోవటానికి ఎవరూ లేని ప్రశాంత సమయం ఎప్పుడు లభిస్తుంది అని ఆలోచించేది.125.అలా ఆమె, ఆమె కొడుకు విశ్వనాథ్ బాబా సేవను చేస్తూ అక్కడ రెండు నెలలున్నారు. 126.ఒకసారి బాబా వద్ద విశ్వనాథ్‌గాని వేరే ఎవరూ గాని లేని సమయం చూచి ఆ స్త్రీ మాధవరావుతో తన కోరికను మనవి చేసుకుంది.దానిని వినండి.127.'బాబా ప్రశాంతంగా ఉన్నప్పుడు మంచి సమయం చూచి మీరైనా నా మనసులోని కోరికను బాబా చెవిలో వేయండి.128.అది కూడా బాబా చుట్టూ భక్తులు లేనప్పుడు వారు ఒక్కరే ఉన్నప్పుడు ఎవరూ వినకుండా చెప్పాలి' అని వేడుకుంది.129.మాధవరావు ఆమెతో 'ఈ మసీదు ఎప్పుడూ ఖాళీగా ఉండదు. ఎప్పుడూ ఎవరో ఒకరు దర్శనానికి వస్తూనే ఉంటారు.130.ఈ సాయి దర్బారు ఎల్లప్పుడూ తెరచే ఉంటుంది.ఇక్కడ ఎవరికీ ఏ ఆటంకమూ లేదు. అయినా ఒక మాట చెప్తాను గుర్తుంచుకో. 131.ప్రయత్నించటం నా పని. ఫలితాన్నిచ్చేవాడు కీర్తిదాత,మంగళప్రదుడు.చివరకు సుఖాన్ని కలిగించేది వారే, కనుక మీ చింత ఉపశమిస్తుంది.132.బాబా భోజనానికి కూర్చున్నప్పుడు,నీవు ఒక టెంకాయను, అగరువత్తులను చేతపట్టుకుని, సభామండపంలో రాతిమీద కూర్చో.133.బాబా భోజనమయాక, వారు ఆనందంగా ఉన్నప్పుడు చూచి నేను నీకు సైగ చేస్తాను. అప్పుడే

నీవు పైకి రా' అని చెప్పాడు.134.ఆమె అలా వేచి ఉండి, శుభ ఘడియ యోగం కలిసిరాగా, ఒకసారి సాయిబాబా భోజనం ముగిసాక అనుకోకుండా అవకాశం లభించింది.135. బాబా తమ చేతులు కడుక్కున్న తరువాత మాధవరావు వస్త్రంతో తుడుస్తుండగా, బాబా ఆనందంలో ఉండి ఏం చేశారో చూడండి.136. ప్రేమోల్లాసంతో బాబా మాధవరావు బుగ్గను గిల్లారు. అప్పుడు భగవంతునికి భక్తునికి జరిగిన ప్రేమ సంవాదాన్ని వినండి.137.మాధవరావు వినయ సంపన్నుడయినా కోపాన్ని నటిస్తూ, బాబాతో వినోదంగా 'ఇది మంచి లక్షణమేనా!138.ఇలా గట్టిగా బుగ్గగిల్లే చిలిపి దేవుడు మాకు అవసరం లేదు. మేము మీకు ఋణపడి ఉన్నామా? మన స్నేహానికి ఇదేనా ఫలితం?' అని అన్నాడు.139.అప్పుడు బాబా ప్రత్యుత్తరంగా 'మొత్తం డెబ్భైరెండు జన్మలలో నేను ఎప్పుడైనా నీపై చేయి వేశానా బాగా గుర్తు తెచ్చుకో' అని అన్నారు.140.అప్పుడు మాధవరావు, 'మాకు ఎప్పుడూ తినటానికి మంచి క్రొత్త క్రొత్త మిఠాయిలను ఇచ్చే దేవుడు కావాలి.141.మాకు మీ గౌరవ మర్యాదలు లేదా స్వర్గలోక విమానాలు అవసరం లేదు. మీ చరణాల యందు ఎప్పుడూ కృతజ్ఞత ఉండేలా కరుణించండి. అంతే. ఇంత మాత్రం చాలు' అని అన్నాడు.142.అందుకు బాబా,'ఇందు కొఅకేగా నేను ఇక్కడికి వచ్చాను. మీకు తిండిపెట్టటానికి, నాకు మీపై ప్రేమ కలిగింది' అని అన్నారు. 143.తరువాత బాబా వెళ్ళి కటకటాల వద్ద తమ ఆసనంపై కూర్చోగానే, మాధవరావు ఆ స్త్రీకి సైగ చేశాడు.ఆమె తన కోరికను తీర్చుకోవటానికి సిద్ధ పడింది. 144. సైగ చేయగానే వెంటనే లేచి గబగబా మెట్లెక్కి బాబా ఎదుటికి వచ్చి వినయంగా వినమ్రతతో నిలబడింది. 145.బాబాకు శ్రీఫలాన్ని అర్పించి, వారి పాదపద్మాలకు వందనం చేసింది.బాబా ఆ కొబ్బరికాయను తమ చేతులతో గట్టిగా కటకటాల పైన కొట్టారు.146.'శ్యామా! ఇది ఏమిటి అంటుంది?కొబ్బరికాయ బాగా చప్పుడు చేస్తూ ఉంది' అని అన్నారు.

శ్యామ ఆ అవకాశాన్ని అందుకుని ఏమన్నాడంటే,147 'తన గర్భంలో కూడా ఇల్లే చప్పుడు అవ్వాలని ఈ స్త్రీ తన మనసులో అనుకుంటూ ఉంది. ఆమె కోరిక తీరాలి. ఆమె మనసు మీ చరణాలయందు లగ్నమవాలి, ఆమె సమస్య తీరుగాక.148.ఆమెనను గ్రహించి కొబ్బరికాయను ఆమె ఒడిలో వేయండి. మీ ఆశీర్వాదంతో ఆమె కడుపు పండి కొడుకులు కూతుళ్లూ కలుగుతారు' అని అన్నాడు. 149.అప్పుడు బాబా అతనితో, 'కొబ్బరికాయలతో పిల్లలు కలుగుతారా? ఇలా వెళ్ళొగా ఎందుకనుకుంటారు? జనానికి పిచ్చి పట్టినట్లు అనిపిస్తూ ఉంది' అని అన్నారు.150.శ్యామా,'మాకు తెలుసు. మీ మాటలలోని ప్రభావంతో పిల్లలు వరుసగా పుట్టుతారు. మీ మాటలు అంత అమూల్యం.151.కాని ఇప్పుడు మీరు భేదభావంతో ఆశీర్వాదాన్ని ఇవ్వకుండా ఊరికెనే కూర్చుని వృథా మాటలు చెప్పుతున్నారు. ఆమెకు కొబ్బరికాయను ప్రసాదంగా ఇవ్వండి' అని అన్నాడు.152.'కొబ్బరికాయను పగులగొట్టు' అని బాబా అంటే 'కాదు ఆమె ఒడిలో వేయండి' అని శ్యామా అన్నాడు.ఇలా బాగా వాదులాడాక బాబాయే ఓడిపోయారు.153.'సరే, ఆమెకు బిడ్డలు కలుగుతారు వెళ్లు' అని అన్నారు. 'ఎప్పుడో చెప్పండి' అని శ్యామా నిలదీసి అడిగాడు.'పండ్రెండు మాసాల అనంతరం' అని బాబా చెప్పగా శ్యామా ధన్ మని కొబ్బరి కాయను పగుల కొట్టాడు.154.సగం కాయను ఇద్దఱూ తిని మిగిలిన సగాన్ని స్త్రీకి ఇచ్చారు.శ్యామా ఆ స్త్రీతో 'నా మాటకు నీవు సాక్షివి.155.ఇవ్వాళ్టి నుండి పన్నెండు మాసాలు పూర్తికాకముందే నీ కడుపుపండి సంతానం కలగకపోతే నేను ఏం చేస్తానో విను.156.వీరి తలపై ఇలాగే కొబ్బరికాయను కొట్టి, ఈ దేవుణ్ణి మసీదు నుండి తరిమివేయకపోతే నా పేరు మాధవరావు కాదు. 157.ఇటువంటి దేవుణ్ణి ఇక మసీదులో ఉండనివ్వను అని ఖచ్చితంగా చెప్పుతున్నాను. నీకు తప్పక అనుభవం కలుగుతుందని తెలుసుకో' అని చెప్పాడు.158.అతని ధైర్యవచనాలను విని ఆ స్త్రీ మనసులో

సంతోషించి బాబా చరణాలకు సాష్టాంగ ప్రణామం చేసి నిశ్చింతగా తన గ్రామానికి వెళ్లిపోయింది.159. తనకు అంకితమై పోయిన శ్యామా మాటలకు బాబాకు కించిత్తైనా కోపం రాలేదు.కారణం వారు భక్తుల ప్రేమపాశంతో కట్టబడి ఉండి భక్తుల మనోభీష్టాలను తీర్చుతారు. 160. భక్తుల మాటలు నిజమని నిరూపించటానికి, భక్తులను పాలించే కరుణాఘనులైన సాయిదయామయులు భక్తుల మురిపాలను ప్రేమతో తీరుస్తారు.161.శ్యామా బాబాకు గారాబు భక్తుడు. ప్రేమమయుడు. యుక్తాయుక్తాలు తెలియని అమాయకుడు. సత్పురుషులు భక్తుల సంకల్పాలను తీర్చుతారు. ఇదివారి నిత్య వ్రతం.162.పండ్రెండు మాసాలు గడిచేసరికి బాబా తమ సంకల్పాన్ని పూర్తి చేశారు. బాబా చెప్పిన తర్వాత మూడు మాసాలు గడిచాక ఆ స్త్రీ గర్భం ధరించింది.163. అదృష్టవశాత్తు పుత్రుని ప్రసవించింది. ఐదు మాసాల బిడ్డను వెంట తీసుకుని ఆమె భర్తతో సహా బాబా దర్శనానికి శిరిడీకి వచ్చింది. 164.ఆమె భర్త ఎంతో ఆనందంతో సాయిసమర్థుని చరణాలకు వందనం చేసి, వారికి ఐదువందల రూపాయలను అర్పించి కృతజ్ఞుడయాడు.165. తరువాత ఈ డబ్బును బాబా యొక్క గుల్షన్ శ్యామకర్ణను ఉంచే స్థలంలో గోడలను కట్టించటానికి ఉపయోగించారు.166. ఇటువంటి సాయి సమర్థుని స్మరించండి, చింతన చేయండి, ధ్యానించండి.వేరే ఎక్కడెక్కడికో పరుగులు పెట్టకండి. హేమాడుకు సాయియే,విశ్రామధామం.167. తన నాభిలోనే కస్తూరిని ఉంచుకుని ఎక్కడనో వెతుక్కోవడం ఎందుకు? హేమాడుపంతు ఎల్లప్పుడూ సాయి చరణాలలో నిమగ్నమై నిరవధిక సుఖాన్ని పొందుతున్నాడు.168. తరువాతి అధ్యాయం ఇంతకంటెను రసవత్తరమైనది. ప్రేమికులైన బాబా భక్తులందరూ బాబాను మసీదు నుండి చావడి వద్దకు ఎలా ఉత్సాహంతో ఊరేగించేవారో.169.మరియు బాబా యొక్క వంట పాత్ర కథ, ప్రసాదప్రదానం ఇంకా వినోద వార్తలను శ్రోతలారా తరువాతి అధ్యాయంలో వినండి. మీకు శ్రవణంలో

ఉత్సాహం అధికమౌతుంది.170.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన,శ్రీసాయి సమర్థ సచ్చరితంలో సాయి సర్వ వ్యాపకత్వము మరియు సాయి ఆశీర్వచన సాఫల్యత అను ముప్పది ఆరవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత - 37 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

సాయిచరిత్ర ధన్యం. వారి నిత్య ఆచరణ ధన్యం. అంతుపట్టని వారి అత్యద్భుత చర్యలను జరిగినవి జరిగినట్లుగా వర్ణించడం అశక్యం.1. వారి సచ్చరిత అగాధం. వారి జీవనం ధన్యం. అప్రతిహతమైన వారి అసిధారావ్రతం ధన్యం.2.బాబా ఒకప్పుడు బ్రహ్మానందంలో ఉన్మత్తునివలె ఉంటారు.ఒకప్పుడు ఆత్మజ్ఞానంలో తృప్తులై ఉంటారు. మరొకప్పుడు అన్నీ చేస్తూ ఉన్నా అలిప్తంగా ఉంటారు.ఇలా వారి స్థితి అస్థిరంగా ఉంటుంది.3.ఒకప్పుడు ఏ ప్రవృత్తి లేకుండా ఉంటారు.అయితే ఏం చేయకుండా నిద్రపోయే స్థితిలో ఉండరు.తమ ఆశయమందు మనసును ఉంచి ఎల్లప్పుడూ ఆత్మస్వరూపంలో సావధానులై ఉంటారు.4.ఒకప్పుడు సాగరంవలె ప్రసన్నంగా ఉంటారు. కాని వారి అంతు లోతు తెలియవు. అగాధమైన సముద్రం వంటి వారిని యదార్థంగా ఎవరు వర్ణించగలరు?5.వారికి పురుషులు సోదరుల వంటివారు. స్త్రీలు తల్లి సమానులు లేదా అక్కచెల్లెళ్లు.వారు ఊర్ధ్వరేతస్సుగల బ్రహ్మచారి అని అందఱికీ తెలుసు.6. ఇటువంటి వారి సాంగత్యంలో లభించిన మనసు యొక్క నిశ్చలమైన స్థితి మరణం వరకు ఉండుగాక. 7. వారి సేవ చేయాలన్న కోరిక స్థిరంగా ఉండుగాక. వారి చరణాల యందు అనన్యభక్తి దృఢపడుగాక. సర్వప్రాణులయందు భగవద్భావం కలుగుగాక. సాయి నామమునందు అఖండ ప్రీతి కలుగుగాక.8. సాయి

యొక్క ఒకొక్క చర్యకు కారణాన్ని శోధించాలని ప్రయత్నించినవారి మనసు పనిచేయక వారు తటస్థంగా ఊరికే ఉండిపోతారు.9.స్వర్గసుఖాలకోసం అనేకమంది పరితపిస్తారు. భూలోకంలో మరణభీతి కలదని అంటారు. దీనిని తుచ్ఛంగా భావించి స్వర్గలోకాన్ని గొప్పగా వర్ణిస్తారు.10. అవ్యక్తం నుండి ఆకారానికి రావటం 'వ్యక్త' స్థితి అని, మరల అదే అవ్యక్తంలో ప్రవేశించటం మృత్యువు అని అంటారు.11. అధర్మం, అజ్ఞానం, రాగద్వేషాదులు మృత్యుపాశాలు.వానిని పూర్తిగా దాటినవారికే స్వర్గలోకంలోకి ప్రవేశం.12. స్వర్గం! స్వర్గం అంటే ఏమిటి? వైరాగ్యమే స్వర్గలోకం. విశ్వమంతా వ్యాపించిన పరమేశ్వరుడే ఆత్మ అని తెలుసుకోవటం, మానసిక దుఃఖాలేవీ లేకపోవటం స్వర్గం.13. అక్కడ వ్యాధుల బాధలు,చింతలు, దుఃఖాలు ఉండవు. అక్కడ ఆకలిదప్పులు ఉండవు. ఎవరూ వృద్ధాప్యంతో బాధపడరు.14. మృత్యుభయం లేకుండా ఏ విధినిషేధాలూ లేక జీవులు అత్యంత నిర్భయంగా సంచరించటమే దివ్యమైన స్వర్గస్థితి.15. ఆబ్రహ్మస్థావరాలలోను స్థావరజంగమాలలోను సంపూర్ణంగా ఉన్న అదే తత్త్వం, మృత్యువు తరువాత ఉంటుంది. అది అక్కడా మరియు పృథ్వియైనా భిన్నత్వం లేకుండా ఉంటుంది.16.అజ్ఞాన మోహంలో ఉన్న జీవుడు ప్రపంచ వ్యవహారాలను త్యజించినా అతనికి ఉపాధితో కూడి ఉన్న ఆత్మ, బ్రహ్మకానిది వలె భాసిస్తుంది. 17.నేను జీవుణ్ణి,బ్రహ్మను కాను. నేను వేరు పరబ్రహ్మ నాకంటే భిన్నుడు అన్న భేద జ్ఞానం ఉన్న వారెప్పుడూ మృత్యువు అధీనంలో ఉంటారు.18. జననం వెనుక మరణం, మరణం వెనుక మరల జననం, ఈ జననమరణాల చక్రభ్రమణం వారివెంటే ఉంటుంది.19. దుష్కరమైన యజ్ఞ దాన తపస్సులవలన లభించే స్వర్గం,నారాయణుని చరణ స్మరణ లేని స్వర్గలోకం ఎందుకు?20.కేవలం విషయభోగాలకు స్థానమైన

స్వర్గ భువనం మనకు అవసరం లేదు. గోవిందుని నామస్మరణ లేని చోటు మనకు ఎందుకు? 21. స్వర్గలోకమైనా లేక నరకలోకమైనా విషయసుఖాలలో ఏమీ భేదం లేదు. దేవేంద్రునికైనా గాడిదకైనా సుఖం ఒక్కటే .22. ఇంద్రుడు నందనవనంలో విహరిస్తే గాడిద పెంటకుప్పలో పొర్లాడుతుంది. అలా సుఖం ఒక్కటే. ఏకాస్త భేదం లేకుండా సమానంగా ఉంటుంది.23. పుణ్యం క్షయమైపోగానే పడిపోయే స్వర్గం కోసం ఎందుకు ప్రయత్నించటం? అంతకంటె గొప్ప మహత్వం గల భూలోకంలో జన్మించటం మంచిది కదూ.24.కల్పం అంటే మానవులకు 432 కోట్ల 20లక్షల సంవత్సరాలు, పైగా ఆయువు ఉన్నా, బ్రహ్మలోకం యొక్క గొప్పదనమేముంది? అల్పాయువుతో ఒక్క క్షణం ఉన్నా భూలోకం వంటి చోటు మరొకటి లేదు.25.ఆయువు క్షణ భంగురమైనా, ఏ పనైనా ఒక్క క్షణం చేసినా, సర్వం ఈశ్వరార్పణం అని చేసేవారికి అభయస్థానం ప్రాప్తిస్తుంది.26.భగవద్భక్తులు లేని ప్రదేశం, గురువుల కథా వర్ణన, హరిసంకీర్తన,సంగీత నృత్యాలు, దేవుని పూజచేయని స్థానం ఎందుకు పనికి వస్తుంది?27.బ్రహ్మ, ఆత్మ ఒక్కటే అన్న అనుభవజ్ఞాన ప్రాప్తికి, అత్యంత శ్రేయస్కరమైన సాధనకు, గొప్ప స్వర్గలోకం కంటె భూలోకమే ఉత్తమం.28. కాయావాచా మనసా పంచ ప్రాణాలను గురువుకు సమర్పించి, నిశ్చయాత్మక బుద్ధిని కూడా ఆత్మలో లీనం చేసి, అన్ని విధాలా గురువు అధీనంలో ఉండాలి.29.ఈ విధంగా సద్గురువుకు శరణుజొచ్చితే, భవభయమనే మాట ఎందుకు ఉంటుంది? సకల దుఃఖాలను నివారించే వారుండగా ఇక ప్రాపంచిక కష్టాల గురించిన చింత ఎందుకు?30. అజ్ఞానం ఉన్న చోట,భార్యాబిడ్డలు, పశు పక్షులు మొదలగు మాయా బంధనాలున్న చోట, అహర్నిశలూ ప్రపంచ చింతే ఉంటుంది. కాని మంచి ఆలోచనలు అసలు రావు.31. ఈ అన్నిటికీ మూలకారణం

అజ్ఞానం. ఇది అనేకత్వాన్ని భ్రమను కలిగిస్తుంది. అందువలన ఆచార్యులవద్ద సంస్కృతంలో ఉన్న వేదజ్ఞానాన్ని సంపాదించుకోవాలి.32.అజ్ఞానం తొలగిపోతే అనేకత్వ జ్ఞానం అణుమాత్రమైనా ఉండదు. ఈ ఏకత్వజ్ఞానం కలిగిన వారికి జనన మరణాలు వదిలిపోతాయి.33. భేదదృష్టి ఏకాస్త ఉన్నవారైనా జననమరణాల కష్టాలలో పడతారు. ప్రళయం మరియు సృష్టి వారి వెనకే ఉంటాయి.34. శ్రేయస్కరమైన విషయాన్ని ఆశించటం నిస్సందేహంగా జ్ఞానం. ప్రేయాన్ని మాత్రమే ఆశించటం అజ్ఞానం.35. మృత్యువే గొప్ప భవభయం. దానినుండి నిర్భయులం కావాలంటే గురుచరణ ద్వయాలను గట్టిగా పట్టుకోండి. వారు అద్వైత బుద్ధిని ప్రసాదిస్తారు.36. ద్వైతం ఉన్నది అంటే అక్కడే భయం కూడా ప్రవేశిస్తుంది. నిర్విశేష భేదరహితుడైన గురుచరణ సేవలో ఉన్న వారికి భయం ఏమాత్రం ఉండదు.37. గురువు నొసటున నిర్మలమైన ప్రేమ చందనాన్ని అద్దండి.వారికి భక్తి భావమనే పీతాంబరాన్ని కట్టండి. వారు తమ భక్తులకు విశ్వంభరుని చూపిస్తారు.38. దృఢమైన శ్రద్ధ అనే సింహాసనాన్ని వారికి సమర్పించి, అష్టభావాల ఆనందాశ్రుజలాలతో అభిషేకం చేస్తే వారు వెంటనే ప్రసన్నులౌతారు.39. భక్తి మేఖలను వారి నడుముకు చుట్టి, సర్వస్వాన్ని వారికి అర్పించి, ప్రీతితో చివర ఆరతిని ఇవ్వండి .40. ఏదైనా కార్యం నశించిపోయినా అది తన అస్తిత్వాన్ని ఆశ్రయించే ఉంటుంది.రాతితో కుండను పగలగొట్టితే ఆ కుండ ఆకారం మాత్రమే పోతుంది.41. కాని కుండ యొక్క అస్తిత్వమైన మట్టి అసలు లేకుండా పోవడం జరగదు. విరిగిన కుండ పెంకులతో కుండ ఆకారాన్ని మరల పొందవచ్చు.42. కనుక ఏ కార్యం నశించిపోయినా అది తన అస్తిత్వాన్ని ఆశ్రయించే ఉంటుంది.ఇదే విధంగా ఎవరి మరణమైనా పర్యవసానం శూన్యత్వం కాదు.43.ఏ కార్యమైనా కారణం

లేకుండా ఉండదు. అవ్యక్తం వ్యక్తమైనా, అది ఎల్లప్పుడూ సత్యాన్ని ఆశ్రయించి ఉంటుంది. అనుభవం ద్వారా ఇది అందరికీ తెలిసినదే.44. సూక్ష్మత్వంలోని న్యూనాధిక్యతలు కూడా దీనినే తెలుపుతాయి. స్థూలమైన కార్యం నాశనమైనా సూక్ష్మకారణం మిగిలి ఉంటుంది.45. అదికూడా నశించిపోతే అంతకంటే సూక్ష్మమైనది మిగిలి ఉండి, సకలేంద్రియాలు, మనసు,బుద్ధి యొక్క విషయగ్రహణ శక్తి క్షీణించిపోతుంది.46.తాత్పర్యం,బుద్ధి కూడా అలసిపోయిన చోట, వ్యక్తం అవ్యక్తమౌతుంది. కాని దాని అస్తిత్వం పోదు. అది సదా సర్వత్రా ప్రకాశిస్తూ ఉంటుంది. 47. బుద్ధి కోరికలకు ఆశ్రయాన్నిస్తుంది.ఆ బుద్ధి నశించిపోగానే,వెంటనే ఆత్మోదయమై అక్షయపద ప్రాప్తిస్తుంది.48.అజ్ఞానం,మాయ, కోరికలు,కర్మ ఇవే మృత్యువు యొక్క ముఖ్య ధర్మాలు.ఇవన్నీ ఉపశమిస్తే బంధనాలు తొలగిపోతాయి.49.బంధనాలన్నీ విడిపోగానే, మేఘాల అడ్డుతొలగిపోగానే, దేదీప్యమానంగా ప్రకాశించే రవిలా ఆత్మ అనాయాసంగా సాక్షాత్కరిస్తుంది.50.'ఈ శరీరమే నేను''ఈ ధనం నాది' అనే భావనను శరీరాభిమానం అని అంటారు.దీనివలననే హృదయగ్రంథిబంధనం మరియు మాయవలన కలిగే దుఃఖాలు.51.ఈ శరీరం ఒకసారి మాయమైపోయినా, కర్మబీజాలవలన మరో శరీరాన్ని పొందుతారు. ఆ కర్మబీజాలను నిశ్శేషంగా దహించివేయకపోతే పునర్జన్మ కలుగుతుంది.52. మరల ఆ బీజాలు వృక్షాలవుతాయి.ఇలా వాసనా బీజాలవలన మరోజన్మను కలిగించే ఈ చక్రం వాసనలు తగ్గిపోనంతవరకూ ఆగకుండా తిరుగుతూనే ఉంటుంది.53.కోరికలను సమూలంగా నశింప చేయటమే హృదయగ్రంథి నిరసనం.అప్పుడే మనుష్యుడు మరణాన్ని అధిగమించి అమరుడౌతాడు.ఇదే వేదాంతోపదేశం. 54.ధర్మాధర్మాలకు అతీతమైన స్థితిని

'విరజా' అంటే కోరికలు లేని స్థితి అంటారు. ఇది అజ్ఞానాన్ని, వాసనలను సమూలంగా నశింప చేస్తుంది. ఇక్కడ మృత్యువుయొక్క సామర్థ్యం ఏం సాగదు.55. వాసనల పరిత్యాగమే బ్రహ్మానంద యోగం. 'నిరాలేఖ్యా' అంటే ఎవరూ వర్ణించలేనిది అయినా మాటలతో పొందుపరచాలని ప్రయత్నిస్తారు. 'అనిర్వాచ్యా' అంటే ఎవరూ శబ్దాలతో నిర్వచించలేనిది అయినా వాక్కును ఉపయోగించాలని ప్రయత్నిస్తారు.56. బ్రహ్మ జ్ఞానం కలగటమే సకల అనిష్టాల నివృత్తి. అదే మనోభీష్టప్రాప్తి. ఇది శ్రుతి ప్రామాణ్యం.57.'బ్రహ్మవిదాప్నోతిపరం' బ్రహ్మను తెలుసుకున్న వారికి పరమపద ప్రాప్తి. బ్రహ్మానందానికి ఇదే అంతిమ సాధనం. ఇంతకంటె పరమశ్రేష్ఠమైనది ఏముంటుంది? 'తరతిశోకమాత్మవిత్' ఆత్మను తెలుసుకున్నవారు దుఃఖం నుండి తరిస్తారు.58. అజ్ఞానానికి మూలమైన భవార్ణవాన్ని దాటటానికి బ్రహ్మజ్ఞానమే ఉపాయం, ఇదే సకల ప్రాప్తికి సాధనం.59. సంపూర్ణ శ్రద్ధ మరియు ధైర్యం, ఈ రెండూ ఉమామహేశ్వరులు. వారి కృపాహస్తం శిరస్సుపై లేకపోతే హృదయంలోని విశ్వంభరుడు కనిపించడు.60. సాయినాథ గురువర్యుల వచనాలు అమోఘమైన శక్తిగలవి. శ్రద్ధా నిష్ఠలతో పాటు సహనం కూడా ఉంటే మహా ఐశ్వర్యాన్ని పొందుతారని వారు చెప్పారు.61. ఈ దృశ్య జగత్తు అంతా అసత్యం అంటే అస్తిత్వంలేనిది అని దీనిని ఒప్పుకోవలసినదే. స్వప్నంలో ప్రత్యక్షంగా చూచినదంతా మేలుకోగానే అదృశ్యమైపోతుంది.62. బుద్ధి ఇంతవరకే ఆలోచించగలదు. మరియు ఆత్మ స్వరూప విషయంలో సరియైన అవగాహన ఇంతవరకే. కాని సత్ మరియు అసత్ అనేవి లేవు అన్న తత్త్వం యొక్క భావనే నిజమైన ఆత్మ.63. సద సదాది ప్రత్యయవర్జితము, స్త్రీ పురుష భేదాలు, విశేషగుణాలు లేనిది, మరియు అనేక విధాలుగా వర్ణింపబడ్డ సర్వవ్యాపి అయిన ఆత్మయొక్క స్వరూపం గురురూపం.64. ఈ

ఆత్మ సర్వవిశేషరహితం, జరాజననమరణాలకతీతం, ప్రాచీనం,శాశ్వతం, ఎప్పుడూ వినాశరహితం. 65.నిత్యమూ, పురాతనమూ, జన్మలేని ఆత్మ ఆకాశంవలె సర్వత్రా వ్యాపించి ఉంటుంది.ఆత్మ అవిచ్ఛిన్నం. వృద్ధిలేనిది, మార్పులేనిది. 66.శబ్దమూ,రూపమూ లేనిది.అనాది, అనంతం,అవ్యయం,ఏవాసనా రుచీలేనిది,అలిప్తం,ఆత్మస్వరూపాన్ని ఎవరు వర్ణించగలరు? 67. కళ్లకు కనిపించని ఇటువంటి నిర్గుణమైన ఆత్మ అజ్ఞానం వలన తెలియబడటం లేదు.ఈ అజ్ఞానాన్ని జ్ఞానంతో తొలగించాలి.ఆత్మను శూన్యమని ఎప్పుడూ అనకూడదు.68.శ్రీసాయి యొక్క పరమహంస స్థితి, వారి వైభవ సంపత్తి ఎంత గొప్పవి? కాలం దోచుకుని పోయిన ఆ సంపత్తిని మరల చూడగలమా?69.భార్యాబిడ్డల మోహంలో,ధనాసక్తిలో చిక్కుకున్న భక్తులేకాక యోగులు విరాగులు కూడా వారి దర్శనానికి వచ్చి వారి చరణకమలాలయందు భక్తి కలిగి అక్కడుంటారు.70. కోరికలనుండి, కర్మబంధనాలనుండి, ఈషణత్రయాలనుండి ముక్తులైనవారు, శరీరం సంసారం మొదలగు విషయాలయందు విరక్తులైన భక్తులు జగత్తులో ధన్యులు.71.దృష్టికి సాయియే,దృశ్యమని తలచే వారికి వేరే వస్తువు కనిపిస్తుందా? సకల దృశ్యాలయందు సాయియే తప్ప ఖాళీచోటు కనిపించదు.72.నోటిలో సాయి నామం, హృదయంలో సాయి యందు ప్రేమ ఉన్న వారి యోగక్షేమాలు సాయి స్వయం చూస్తారు.73.అదే విధంగా చెవులతో కూడా సాయి అన్న శబ్దంతప్ప మరో శబ్దాన్ని వినకూడదు.ముక్కుతో సాయి పరిమళాన్ని పీల్చాలి. జిహ్వతో సాయి యొక్క మధురరసాన్ని ఆస్వాదించాలి. 74. సాయి యొక్క మందహాస వదనం సుఖాలలో ఉత్తమ సుఖాన్ని ఇస్తుంది. సాయి వచనామృతాన్ని సేవించినవారు ధన్యులు.75. సాయిబాబా శుభాలకు నిలయం. సుఖశాంతులకు జన్మ

స్థానం. వారు సదసద్వివేకంతోను మరియు వైరాగ్యంతోనూ ఎల్లప్పుడూ అంతరంగంలో అప్రమత్తులై ఉంటారు.76.పాలతో కడుపునిండిపోయినా ఆవుదూడ తల్లి దగ్గరనుండి కదలదు.అందువలన దూడను తల్లినుండి దూరంగా కట్టివేసినట్లు,మనసును లాగి గురుచరణాలకు కట్టిపడేయాలి.77. గురువు ప్రేమను, అనుగ్రహాన్ని పొందటానికి వారి పాద పద్మాలకు వందనం చేయండి. వారు చేసిన హితబోధను చక్కగా తెలుసుకుని అనుక్షణమూ అనుభవాలను పొందండి .78.ఇంద్రియాలు యథేచ్ఛగా విషయాలలో రమిస్తున్నా, హృదయంలో సాయియందు ప్రీతి కలిగి ఉండండి. అదే చివరకు స్వార్థం పరమార్థం రెంటికీ పనికి వస్తుంది. 79.మంత్ర సిద్ధి గల మాంత్రికుడు అంజనం వేసి భూమిలో ఉన్న నిధిని చూపించినట్లే గురుచరణాల ధ్యానంతో నిండిన కళ్లు జ్ఞాన విజ్ఞానాలను తెలుసుకుంటాయి.80. సిద్ధ పురుషుల లక్షణాలు సాధకులకు సాధనాలు. వానిని సంపాదించుకోవటానికి తెలివిగా గట్టి ప్రయత్నంతో అభ్యాసం చేయాలి. 81.పాలలో నేయి ఉంటుంది.కాని పాలను కాచి పెరుగువేసి తోడుపెట్టకపోతే మజ్జిగ గాని వెన్నగాని రాదు. 82.మజ్జిగను చిలకకుండా వెన్న లభించదు. వెన్నను మంటపై కాచకపోతే రుచికరమైన నేయి లభించదు. 83.పూర్వపు అభ్యాసం వలన కలిగిన బుద్ధి కుశలత, సంస్కారబలము అవసరం.అభ్యాసం లేకుండా చిత్తశుద్ధి జరగదు.చిత్తశుద్ధిలేక జ్ఞానం కలగదు. 84.అంతఃకరణం నిర్మలంగా ఉంటేనే ఆత్మప్రాప్తి.కనుక ఆత్మసాక్షాత్కారం ప్రాప్తించేవరకు భగవద్భక్తి విడిచిపెట్టరాదు.85.ఆత్మజ్ఞాన మందిర నిర్మాణానికి,దానిపై వైరాగ్య ధ్వజం ఎగరటానికి, మరియు నాలుగు రకాల ముక్తి అనే కలశాలు నిలపటానికి భగవద్భక్తి అనే పునాది అవసరం. 86. శ్వాన సూకరాలు రాత్రింబవళ్లూ బురదలో పొర్లుతూ, మలాన్ని తింటూ, విషయ

భోగాలను అవి కూడా అనుభవిస్తాయి. మానవ శరీరానికి కూడా అవే ఉంటే అందులో గొప్పతనమేముంది? 87. చిత్తశుద్ధిని కలిగించి, అఖండ బ్రహ్మసిద్ధిని ప్రాప్తింపచేసే స్వధర్మాచరణమను తపస్సును శరీరంతోనే సాధించాలి. 88. సాధుసత్పురుషుల సేవ ముక్తికి నిలయం. స్త్రీలోలత నరకద్వారమని పెద్దలు చెప్పిన మాటలను ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.89. సదా సదాచారసంపన్నులై ఉండి, శరీరధారణకు మాత్రం అన్నం తింటూ, ఇల్లు, ఇల్లాలు, పిల్లలు వగైరాల యందు ధ్యానంలేని సాధువులు ధన్యులు.90. సతతం సాయిబాబాను ధ్యానించే వారి అనుభవ విశేషాలను గమనించగా, అట్టివారికి సాయి ఋణపడి వారిపై స్వయం శ్రద్ధవహిస్తారు.91.నామస్మరణ మహత్మ్యం ధన్యం. గురువుకూడా భక్తులను స్మరిస్తారు. ధ్యానించేవాడు ధ్యేయస్థితిని పొంది తన పూర్వస్థితిని పూర్తిగా మరచిపోతాడు.92. 'మీరుచేసే పనులు మీకు బాగాతెలుసు. నాకు మాత్రం అహర్నిశలూ మీ చింతే, అని పలికిన బాబా యొక్క ప్రేమమయవాణి అనేకులకు గుర్తు ఉండే ఉంటుంది.93. మనకు జ్ఞానకథలు అవసరం లేదు. సాయియొక్క ఈ చరిత్ర చాలు. మన నెత్తిమీద ఎన్ని పాపాలు ఉన్నా ఇది మనలను కష్టాలనుండి రక్షిస్తుంది.94. దీనిని నిత్యం పారాయణ చేయలేకపోతే ఇందులోని గురుభక్తి గురించిన ప్రకరణాలను నియమంగా చదివి వానిని హృదయానికి ఆభరణంగా చేసుకోండి. 95. ప్రతిరోజూ ఏ సమయంలోనైనా ఈ చరిత్రను పఠించే భక్తులకు గురువుతో సహా శ్రీహరి తప్పక లభిస్తాడు. 96.ఈ గ్రంథాన్ని నిరంతరం పఠించేవారి గృహంలో లక్ష్మి ఎల్లప్పుడూ నివసిస్తుంది. సహనంతో ఒక సప్తాహం పారాయణ చేసేవారి దారిద్ర్యం తొలగిపోతుంది.97. దీనిని నేను చెప్పుతున్నట్లుగా భావించకండి. దానివల్ల మనసులో సందేహాలు ఉత్పన్నమౌతాయి. సాయియే నా నోటితో చెప్పిస్తూ ఉన్నారు

కనుక అనవసరమైన ఆలోచనలను మానండి .98. సకలగుణాలకు నిధియైన ఈ సాయి తమ భక్తులకు కైవల్యాన్ని ప్రసాదిస్తారు. కలియుగంలోని పాపాలను నశింపచేసే వారి కథలను శ్రోతలు శ్రవణం చేయండి.99. ఇటువంటి సత్పురుషుల చరిత్రముందు స్వర్గసుఖమేపాటిది? తక్షణం ఫలితాన్నిచ్చే ఈ సచ్చరితను వదలి స్వర్గం వైపు ఎవరు చూస్తారు?100. సుఖం దుఃఖం ఇవి చిత్తవికారాలు. సత్సంగంలో ఏ వికారాలూ ఉండవు. సత్సంగం చిత్తాన్ని చైతన్యంలో విలీనంచేసి, సుఖదుఃఖాలకు తావు లేకుండా చేస్తుంది.101. విరాగికి ఏకాంతంలో లభించే సుఖం, భక్తునికి భక్తి ద్వారా లభించే సుఖం, ఇంద్రునికైనా ఏ చక్రవర్తికైనా కల్పాంతంలో కూడా లభించదు.102. ప్రారబ్ధకర్మ భోగం బలవత్తరమైనది. బుద్ధి కర్మానుసారం పుడుతుంది. అయినా ఈ విధినిర్ణయాలను భక్తుడు తప్పించుకోగలడు.103. భగీరథ ప్రయత్నం చేసినా ప్రారబ్ధకర్మ భోగం తప్పదు. జరుగనున్నది తప్పక జరుగుతుంది. దానినుండి తప్పించుకోవటం అశక్యం.104. వద్దనుకున్నా వచ్చి పడే దుఃఖం వలెనే, సుఖం కూడా అనుకోకుండా వస్తుంది. ఈ శరీరాల ప్రారబ్ధగతి సత్పురుషులకు ముందే తెలిసి ఉంటుంది.105. అఖండ సాయినామ సంకీర్తన, ఇదే మన తపస్సు, వ్రతం, దానం, ధర్మం. తరచూ శిరిడీ ప్రయాణమే మన తీర్థయాత్రా పర్యటన.106. సాయిబాబాకు అనన్య శరణుజొచ్చి 'సాయీ సాయీ' అని వారి నామాన్ని స్మరించటమే మంత్రానుష్ఠానం, అదే ధ్యానం, అదే పురశ్చరణ.107. వారియందు నిష్కపటమైన ప్రేమను కలిగి ఉండటమే వారి వాస్తవమైన పూజ. అమోఘమైన వారి లీలల యొక్క అనుభవాలను అంతరంగంలో తెలుసుకోండి .108. ఇక బెల్లపుతయారీ చాలు. మనకు వెంటనే బెల్లం కావాలి. పూర్వం సూచించిన రసభరితమైన కథను శ్రవణం చేయటానికి అందరూ ఉత్సుకతతో ఉన్నారు.

109. ఇటువంటి శ్రోతల శ్రద్ధను గమనించి, సూచించిన కథా విశేషాన్ని వినటంలో, వారి మనసు ఏకాగ్రంగా ఉండాలని నేను గ్రంథ విస్తారాన్ని తగ్గించాను.110.పామరుణ్ణి మందమతినైన నేను కావ్యరచనా పద్ధతిని ఎఱుగను. కలం పట్టుకుని ఉన్న నాచేతిని పట్టుకుని సాయి స్వయంగా వ్రాయిస్తుంటే నేను వ్రాస్తున్నాను.111.నా బుద్ధి ప్రదాత సాయి అండ లేకుండా నేనీ చరిత్రను ఎలా వ్రాయగలను? వారికథలను వారే చెప్పిస్తారు. వ్రాయించేది కూడా వారే.112. ఇప్పుడు కథానుసంధానం – చావడి ఊరేగింపు మరియు బాబా వంటపాత్ర మరియు ప్రసాదవితరణ గురించి చెబుతానని మాట ఇచ్చాను.ఆ కథల వివరణను వినండి.113. ఇంకా ఆ విషయాలకు సంబంధించిన వానిని లేదా గుర్తుకు వచ్చిన వేరే కథలను చెబుతాను. శ్రోతలు శ్రద్ధగా వినండి. 114. సాయి కథలలోని విశిష్టత ధన్యం. వాని శ్రవణ ప్రభావం ధన్యం. వానిని మననం చేయటం వలన మన నిజస్వభావం ప్రకటమై సాయి చరణాలయందు సద్భావం కలుగుతుంది.115.ఇప్పుడు ముందుగా చావడిని గురించి వర్ణిస్తాను.బాబా నియమంగా రోజు విడచి రోజు చావడిలో శయనించేవారు.116.ఒకరాత్రి మసీదులో రెండవరాత్రి చావడిలో గడిపేవారు. ఇలా ఈ పద్ధతిని వారి సమాధి వరకు కొనసాగించారు.117.తరువాత క్రీ.శ.1909 సం॥ డిసెంబరు పదవతారీఖునుండి సాయిబాబాకు చావడిలో పూజార్చనలు భజనలు మొదలయ్యాయి.118. ఆ చావడి సమారంభాన్ని యథాశక్తి చెప్పనారంభిస్తాను. సాయిదయ అనే ఉత్సాహంతో పరమాత్మ ప్రాప్తి కలుగుతుంది.119.బాబా చావడికి వెళ్లేరోజు భజన మండలి వారు మసీదుకు వచ్చి మధ్యాహ్నం రెండవ జాము వరకు మండపంలో భజన చేసేవారు.120.వెనుకవైపు శోభాయమానంగా రథం, కుడివైపు తులసీ బృందావనం, వాని ఎదుట బాబా కూర్చునేవారు. మధ్య భజనచేసే

భక్తులు.121.హరిసంకీర్తనలో ప్రేమ ఉన్న భక్తులు స్త్రీలు పురుషులు త్వరత్వరగా సభామండపంలోకి వచ్చి భజనకు హాజరయేవారు. 122.ఒకరు తాళాలు ఒకరు చిరుతలు ఒకరు మృదంగం ఒకరు ఖంజరి మ్రోగిస్తూ, పెద్ద స్వరంతో భజన చేసేవారు.123.సాయిసమర్థులు నూదంటురాయి వలె తమ సహజమైన ఆకర్షణశక్తితో ఇనుము వంటి జడులైన భక్తులను,వారికి తెలియకుండానే తమ పాదాల వద్దకు లాక్కుని వచ్చేవారు.124.దివిటీలవారు ప్రాంగణంలో దివిటీలను వెలిగించేవారు.ఒకరు అక్కడే పల్లకిని అలంకరించేవారు. ద్వారం వద్ద చక్కగా ముస్తాబైన దండధారులు జయజయకారాలు చేసేవారు.125.నాలుగు బాటలున్న కూడలిలో మకర తోరణాలు కట్టేవారు.జెండాలు ఆకాశం వైపు ఎగురుతుండేవి.బాలురు క్రొత్తబట్టలను ధరించి ఆభరణాలను అలంకరించుకునేవారు.126.మసీదు పరిసరాలలో వెలుగుతున్న అనేక దీపాల వరుసలుండేవి. ద్వారం వద్ద బాబా గుఱ్ఱం శ్యామకర్ణ చక్కగా అలంకరింపబడి ఉండేది.127.ఇంతలో తాత్యాపటేలు భక్తులతో పాటు వచ్చి, బాబా వద్ద కూర్చుని బాబా వెంట బయలుదేరటానికి సిద్ధంగా ఉండేవాడు.128.బాబా తయారుగా ఉన్నా తాత్యాపాటీల్ వచ్చేవరకు అతని కోసం ఎదురుచూస్తూ తమ స్థలంలోనే కూర్చుని ఉండేవారు.129. తాత్యా, బాబా చేయిపట్టుకుని లేపితేనే బాబా లేచి చావడికి బయలుదేరేవారు.130.తాత్యాబాబాను మామా అని పిలిచేవాడు. వారిలో పరస్పరం అంతటి ప్రేమ. ఇటువంటి వారి ఆప్తధర్మాన్ని దేనితోనూ పోల్చలేం. 131.బాబా రోజూ ధరించే కఫనీతో చంకలో సటకా పెట్టుకుని,పొగాకును,చిలుంగొట్టాన్ని తీసుకుని, భుజంపై రుమాలును వేసుకుని సిద్ధంగా ఉండేవారు.132.తాత్యా వారి శరీరంపై అందమైన జరీ అంచు శాలువాను చక్కగా తలపై కూడా ఉండేలా

కప్పేవాడు.133.ఆ తరువాత బాబా వెనుకనున్న గోడ క్రింద ఉన్న కళ్ళాలను ముందు భాగాన్ని తమకుడికాలి బొటన వ్రేలితో ఒక క్షణం కదిపేవారు.134.అట్లే అక్కడ వెలుగుతున్న దీపాన్ని స్వయంగా కుడిచేత్తో ఆర్పివేసిన తరువాత చావడికి బయలుదేరేవారు.135.బాబా బయలుదేరబోతుండగా వాద్యాలు మ్రోగేవి.టపాకాయలు వెలిగేవి. నలుదిక్కులా దివిటీలు ప్రకాశించేవి.136.కొందఱు ధనుసులా వంగి ఉన్న కొమ్ము బూరాను ఊదేవారు.కొందఱు తాళాలు చిరుతలు వాయించేవారు.చప్పట్లు కొట్టేవారు అమితంగా ఉండేవారు.137. తంబూర, మృదంగ నాదాలతో, సాయినామ ఘోషతో, భజనతో స్త్రీలు పురుషులు ప్రేమగా వరుసగా నడిచేవారు.138. ఒకరు ఊరేగింపు పతాకాన్ని,మరొకరు గరుడధ్వజాన్ని పట్టుకుని నాట్యం చేస్తూ గెంతుతూ భజన చేస్తూ బయలుదేరేవారు.139.అందఱూ అత్యంత ఆనందంగా తప్పెట్లు బాకాలు జయజయకార ధ్వనులతో పతాకాన్ని పట్టుకుని నడుస్తుంటే శ్యామకర్ణ థైథై నాట్యం చేసేది.140. అలా వాద్యాల చప్పుళ్ళతో బాబా మసీదు నుండి బయలుదేరి మెట్లవద్దకు చేరుకునేసరికి ద్వారపాలకులు గట్టిగా పరాకులు పలికేవారు.141.తాళాలు తప్పెట్లు వగైరా వాద్యాలతో భక్తులు అక్కడ ఆనందంగా భజన చేసేవారు.142. చేత్తో పతాకాలను పట్టుకుని భక్తులు ఆనందంగా నడుస్తుంటే బాబాకు ఇరువైపులా ఇద్దఱు వింజామరలను వీవనలను వీచేవారు.143.శాలువలను దుప్పట్లను మడచి బాబా నడిచే దారిలో పరచి వానిపై బాబాను చేయిపట్టుకుని నడిపించేవారు.వారిపై వింజామరలను వీచేవారు.144.తాత్యా బాబా ఎడమచేతిని, మహల్సాపతి బాబా కుడిచేతిని పట్టుకునేవారు. బాపూసాహేబు జోగ్ బాబా శిరసుపై ఛత్రాన్ని పట్టుకోగా ఊరేగింపు చావడివైపు సాగేది.145.కాళ్లగజ్జలు గలగలలాడగా సర్వాభరణాలతో

అలంకరింపబడిన ఎఱ్ఱటి గుఱ్ఱం శ్యామకర్ణ ముందు ఉండేది .146.దండధారులు ముందు నడుస్తూ సాయినామాన్ని ఘోషిస్తూ ఛత్రాన్ని పట్టుకునేవారు,కొందఱు వింజామరులను వీచేవారు.147. అనేకరకాల వాద్యాలు మ్రోగుతుండగా భక్తులు జయజయకారాలు చేస్తూ నడిచేవారు, దండదారులు ప్రేమగా జయకారాలు చేసేవారు.148. హరినామాన్ని ఉచ్చరిస్తూ, తాళాలు తప్పెట్లు మృదంగం మొదలగు వాద్యాల చప్పుళ్ళకు అనుగుణంగా జయకారాలు చేస్తూ నడిచేవారు. 149. భజనచేసే భక్తులు ఆనందంగా దారిలో సాయి యొక్క జయజయకారాలు చేస్తూ, నలు వైపులా దారులున్న కూడలిలో ఆగేవారు.150.తప్పెట్లు తాళాలు మొదలగు వాద్యాలు చాలా బాగా మ్రోగేవి.ఒకటే సాయినామఘోష.ప్రేమగా సంతోషంగా భజన జరిగేది.151.స్త్రీలు పురుషులు వెంట నడిచేవారు. అందఱూ భజనానందంలో లీనమై ఉండేవారు. వాద్యాల చప్పుళ్ల తో, సాయినామ ఘోషతో ఆకాశం దద్దరిల్లేది.152.ఆ చప్పుళ్లకు ఆకాశం ప్రతిధ్వనిస్తుండగా కనుల పండువుగా ప్రేక్షకులను ప్రసన్నులను చేసే కమనీయమైన చావడి ఊరేగింపు అనుపమానంగా శోభిల్లుతుండేది.153.చావడి ఎదుట నిలబడిన సాయిబాబా వారి ముఖశోభ, అరుణ సంధ్యా సమయంలో ఆకాశంలో అగుపించే తప్తకాంచనప్రభవలె, 154.వారి వదనం బాలారుణ ప్రభవలె, చైతన్య కేంద్రం వలె కనిపించేది.ఆ దర్శన లాభాన్ని ఎవరు వదులుకుంటారు?155.రక్తవర్ణంలో వెలుగుతున్న బాబా ముఖప్రభను ఆ సమయంలో దర్శించటం ధన్యం.వారు ఉత్తరాభిముఖులై ఏకాగ్రచిత్తంతో ఎవరినో పిలుస్తున్నట్లుగా ఉండేవారు.156.ఆ వాద్యాల శబ్దఘోషలో అప్పుడు సాయిమహారాజు పూర్ణానందంతో కుడిచేతిని పైకి క్రిందకు మాటిమాటికీ ఆడించేవారు. 157.ఆ సమయంలో భక్త శ్రేష్ముడైన దీక్షితు వెండిపళ్లెంలోని పూలను

మాటిమాటికీ బాబా శరీరమంతటా పుష్పవృష్టిలా కురిపించేవాడు.158.కాకాసాహేబు సాయి యొక్క మస్తకంపై గులాబిపూలను గులాల్‌తో కలిపి భక్తిప్రేమలతో చల్లేవాడు.159.అలా కాకా పూలను,గులాల్‌ను చల్లినప్పుడు వాద్యాల చప్పుళ్లను మరీ ఎక్కువగా చేసేవారు.160.బాబా భక్తులైన గ్రామ ప్రజలు బాబా దర్శనానికి ప్రేమతో వచ్చేవారు. ఆ సమయంలో బాబా ముఖం ఎఱ్ఱగా,అభినవంగా కనిపించేది.161.ఆ తేజోవిలాసాన్ని చూచి ప్రేక్షకుల కళ్లు విప్పారేవి, వారి మనసులకు ఆనందం కలిగి ప్రాపంచిక దుఃఖాలను మరచిపోయేవారు.162.ఆహా! ఏమి అద్భుతమైన దివ్యతేజం!బాబా బాలభాస్కరునివలె ప్రకాశిస్తుంటే, వారి ఎదుట చాలాసేపు నిలబడి, తాళాలు తప్పెట్లు వగైరా వాద్యాలను మరీగట్టిగా చప్పుడు చేసేవారు.163. బాబా ఒకటిన్నర గంటలవరకు, ఒకే స్థలంలో నిలబడి ఉత్తరదిశవైపు ముఖం త్రిప్పి కుడి చేతిని క్రిందకు పైకి ఆడించే వారు.164.మొగలి పూవువంటి పచ్చని రంగు మేనుతో కొంచెం ఎఱ్ఱని ముఖవర్చస్సు గల ఆ శోభను జిహ్వ వర్ణించలేదు. ఆ వైభవ లాభాన్ని కళ్లే అనుభవించాలి.165. అప్పుడు మహల్సాపతి నాట్యం చేస్తున్నా, బాబా ఏకాగ్రంగా ఉండటం చూచిన వారికి ఆశ్చర్యం కలుగుతుంది.166.బాబాకు కుడివైపు మహల్సాపతి నిలబడి బాబా కఫనీని చేత్తో పట్టుకోగా, ఎడమవైపు తాత్యాకోతే చేత్తో లాంతరు పట్టుకుని నడిచేవాడు.167.భక్తి ప్రేమలతో కూడిన ఆ ఉత్సవం ఎంతటి ఆనందదాయకం! ఆ వైభవాన్ని చూడటానికి ధనవంతులు, పెద్దమనుషులు ఒకచోట గుమిగూడేవారు.168. బాబా యొక్క ఉజ్వలమైన రక్తవర్ణ ముఖచంద్రం, అవర్ణనీయమైన తేజస్సుతో వెలుగుతుంటే భక్తుల కళ్లు ఆనందంతో నిండి పోయేవి.169.భక్త సమూహం బాబాకు ఇరువైపులా, దర్జాగా మెల్లమెల్లగా ఎంతో ప్రేమగా నడిచేవారు.170.ఇటువంటి వైభవాన్ని ఇక మీద

ఎవరూ కళ్లతో చూడలేరు.ఆ కాలం ఆరోజులు గడిచిపోయాయి. ఇప్పుడు ఆ జ్ఞాపకాలే మనసుకు శాంతిని కలిగిస్తాయి.171.అలా బజంత్రీలు అపారంగా మ్రోగుతుండగా దారిలో జయజయకారాలు చేస్తూ, బాబాను చావడిలోని ఆసనం వద్దకు తీసుకుని వెళ్లి వారికి దివ్యోపచారాలు చేసేవారు.172.చావడి పైన తెల్లటి వస్త్రాన్ని కట్టేవారు.రకరకాల దీపాలను వ్రేలాడగట్టేవారు.వాని ప్రకాశం అక్కడక్కడా వ్రేలాడదీసిన అద్దాలలో ప్రతిఫలించి ఆ దృశ్యం అత్యంత ప్రకాశవంతంగా ఉండేది.173. భక్తులందఱూ చావడిలో గుమిగూడేవారు. తాత్యాబా ఆసనం వేసి బాబాను పట్టుకుని దానిపై కూర్చుండబెట్టేవాడు.174. ఎత్తుగా తయారుచేసిన ఆసనం వెనుక బాబా ఆనుకోవటానికిబాలీసును వేసేవారు.బాబా కూర్చుండగానే వారిపై అంగరఖాను కప్పేవారు.175.అలా దివ్యాంబరాలను కప్పి, ఆనందంగా పూజ చేసేవారు. పూలమాలలను వేసి గట్టిగా పాడుతూ ఆరతినిచ్చేవారు. 176. పరిమళ చందనాన్ని, సుగంధ ద్రవ్యాలను వారి చేతులకు పూసేవారు. విలువైన వస్త్రాలతో అలంకరించి శిరసుపై కిరీటాన్ని ఉంచి చూచేవారు.177. ఒకప్పుడు సువర్ణ కిరీటాన్ని, మరొకప్పుడు తురాయితో ఉన్న తలపాగాను పెట్టేవారు.రత్నాలమాలనో, మాణిక్యాల మాలనో178. లేదా తెల్లటి ముత్యాల మాలలను వారి మెడలో వేసేవారు.ఇవి దీపాల వెలుతురులో బాగా ధగధగా మెరుస్తుండేవి.179.బాబా నొసటున కస్తూరి పరిమళంతో నల్లటి నామాన్ని పెట్టి వైష్ణవ పద్ధతిలో మధ్య నల్లటి తిలకం కూడా పెట్టేవారు.180. వారి రెండు భుజాలపైన నేరేడు రంగు ముఖములు జరీ అంగరఖా వేసి అది జారిపోతుంటే రెండు వైపులా ఎవరూ గమనించకుండా మాటిమాటికీ సవరించేవారు.181.అట్లే తలపైని కిరీటాన్ని లేదా తలపాగాను వారికి తెలియకుండా వెనుక నుండి సవరించేవారు.182.కిరీటంగాని లేక తలపాగాగాని తగిలితే పారవేస్తారేమోనని

భయపడుతున్నా వారికి కిరీటాన్ని అలంకరించాలన్న ప్రేమ ఉత్సాహం అధికంగా ఉండేవి.183. సర్వాంతర్యామిఅయిన సాయి,భక్తులు వెనుక దాగి చేస్తున్నదానిని తెలుసుకోలేరా? భక్తుల ఉత్సాహాన్ని గని ఏమీ ఎఱుగనట్లు మౌనంగా ఉండేవారు.184.బ్రహ్మానందంతో విరాజిల్లుతున్నవారికి జరీ అంగరఖా ఆభరణాలు అలంకారాలా? ఆత్మశాంతితో శోభిల్లుతున్న వారికి కిరీటం అలంకారమా?185.అయినా అనేకరకాల అందమైన అలంకారాలతో బాబాను శృంగారించే వారు. వారి నొసటున కేసరి మిశ్రమంతో మనోహరమైన తిలకందిద్దేవారు.186.ఒకరు రత్నాల మాలనో ముత్యాల మాలనో వారి కంఠానికి అలంకరిస్తే మరొకరు వారి నొసటున తిలకందిద్దేవారు. అలా బాబా భక్తుల ముచ్చటలను తీర్చేవారు.187.బాబా అలంకరణ అంతా అయ్యాక, వారి శిరస్సుపై కిరీటం కంఠంలో ముత్యాలమాల మెరుస్తుండగా ఆ శోభ అత్యద్భుతంగా ఉండేది.188.నానాసాహేబు నిమోన్కరు బాబాపై, కళ్ళకు అమర్చబడి గుండ్రంగా తిరిగే తెల్లని ఛత్రాన్ని పట్టుకునేవాడు.189.బాపూసాహేబుజోగ్ సాయి సద్గురు చరణాలను ప్రేమగా, ప్రక్షాళనం చేసి, అర్ఘ్య పాద్యాదులను భక్తిగా అర్పించి, యథావిధిగా పూజచేసేవాడు.190.బాబా ఎదుట వెండి పళ్లెమును పెట్టి అందులో బాబా చరణాలనుంచి అత్యాదరంగా అభిషేకం సుగంధచందనం పూసేవాడు. 191. కేసరిగిన్నెను తీసుకుని వారి చేతులకు పరిమళాన్ని రాసేవాడు.అటుపైన వారి చేతులలో తాంబూలాన్ని ఉంచేవాడు. అప్పుడు వారు ప్రసన్నదృష్టితో ఉండేవారు.192.తాత్యాబా మొదలైన వారు నిలబడి ఉండి బాబాను పట్టుకుని గద్దెపై కూర్చుండ బెట్టి బాబా చరణాలకు భక్తిగా నమస్కరించేవారు.193.నిర్మలంగా పరిశుద్ధంగా ఉన్న చావడినేలను తెల్లగా స్ఫటికంవలె మెరిసేలా శుభ్రపరిచేవారు.అక్కడికి బాబా యొక్క

శ్రీచరణాలలో ఆశ్రయాన్ని పొందటానికి ఆబాలవృద్ధులు వచ్చేవారు.194. బాబా ఆసనంపై విరాజమానులై వెనక తలగడకు ఆనుకుని కూర్చొన గానే, వారికి ఇరువైపులా వీవనలను వింజామరలను వీచేవారు.195.మాధవరావు పొగాకును నలిపి పొడి చేసి చిలుం తయారుచేసి, తాత్యాబాచేతికి ఇచ్చేవాడు.మొదట దానిని తాత్యాబా ఊదేవాడు.196.పొగాకు బాగా రాజుకోగానే బాబా చేతికి ఇచ్చేవాడు.బాబా మొదట పీల్చి దానిని మహల్సాపతికి ఇచ్చేవారు.197.అలా ఆ చిలుం అయిపోయేవరకు అది ఇక్కడి నుండి అక్కడికి మరల మరల మహల్సాపతి, శ్యామా, తాత్యాబా చుట్టూ గుండ్రంగా తిరిగేది.198.అది నిర్జీవమైన వస్తువైనా ధన్యమైనది. దానికి ఎంతటి గొప్ప భాగ్యం? ప్రాణంతో ఉన్న మనం దానికి సమానం కాము. దాని సేవ నిజమైనది.199.దాని తపస్సు మహా కఠినమైనది. పసితనంలో గట్టిగా త్రొక్కించుకుని, తరువాత శీతోష్ణాలను సహించి, అగ్నిలో కాలి బయటకు వచ్చింది.200.దాని భాగ్యం కొద్దీ, బాబా కరస్పర్శను పొంది ధునిలో కాలి, ఎఱ్ఱ రంగును పూసుకుని చివర బాబా ముఖ చుంబనాన్ని పొందింది.201.భక్తులు బాబా రెండు చేతులకు కర్పూరం కేసరాలతో కలిపిన చందనం అద్దేవారు. కంఠమందు పూలమాలను వేసి, సువాసనను పీల్చటానికి వారికి పూలగుత్తిని ఇచ్చేవారు.202. మందహాస వదనంతో ఎప్పుడూ అత్యంత ప్రేమగా దయగా అవలోకించే సాయికి అలంకారాలయందు అభిమానం ఎందుకుంటుంది? అంతా భక్తుల ముచ్చటను తీర్చటానికే.203.భక్తి అనే ఆభరణాన్ని, శాంతి అనే భూషణాన్ని అలంకరించుకున్న వారికి ఈ లౌకిక మణిమాలల శృంగారం ఏమవసరం?204. మూర్తీభవించిన వైరాగ్యానికి పచ్చలహారం ఎందుకు? భక్తులిచ్చిన వానిని మెడలో వేసుకుని వారి కోరికలను తీర్చటానికి.205.

బంగారపు పచ్చలహారం, ఎనిమిది వరుసలుగాని పదహారు వరుసలుగాని ముత్యాలమాల, నీలిరంగు కమలాలతో కలిసి అభినవంగా శోభించేది.206.వారి మెడలోని మల్లెలు మొల్లలు మరియు తులసి మాలలు పాదాలవరకు వ్రేలాడుతుండేవి.అపూర్వమైన ముత్యాలహారాలు వారి కంఠాన ధగధగ మెరుస్తుండేవి.207. బంగారపు పచ్చలహార పతకం బాబా ఛాతిపై వ్రేలాడేది. వారినొసటన అందంగా నల్లని తిలకం అత్యంత ఆకర్షణీయంగా శోభించేది.208.శిరసుపైన జలతారు శాలువతో ఛత్రఛామరాల సేవలతో వైష్ణవ భక్తుని వలె తేజస్సుతో భాసిల్లే వారిని ఫకీరని అనగలమా?209.మంగళవాద్యాల చప్పుడులో జోగ్ ప్రేమతో సంబరంగా చేతిలో పంచారతిని పట్టుకుని బాబాకు ఆరతినిచ్చేవాడు.210.పంచోపచారపూజలు చేసి బాబాకు, మెరిసిపోయే పంచారతిని కర్పూర నీరాజనాన్ని ఇచ్చేవాడు.211. ఈ ఆరతి ముగిసిన తరువాత భక్తులు ఒక్కరు ఒక్కరుగా బాబాకు సాష్టాంగ ప్రణామం చేసి అందరూ తమ ఇళ్ళకు బయలుదేరేవారు.212. అత్తరు పన్నీరు మరియు చిలుము బాబాకు ఇచ్చి వారి అనుమతిని తీసుకుని తాత్యాబా తన ఇంటికి వెళ్ళటానికి బయలుదేరగా, బాబా అతనితో, 213.'వెళ్లితే వెళ్ళు కాని రాత్రి మధ్యమధ్య నన్ను గమనిస్తూ ఉండు' అని చెప్పేవారు. సరే నంటూ తాత్యా చావడినుండి తన ఇంటికి వెళ్లేవాడు.214.అలా జనమంతా వెళ్లిపోయాక బాబా స్వహస్తాలతో మూటను విప్పి ధోవతులను తీసి మడతలను విప్పి, తమ చేతులతో తమ పక్కను పరచుకునేవారు.215. అరవై అరవైబదు శుభ్రమైన దుప్పట్లను తాము స్వయం పరచుకుని వానిపై పడుకునేవారు.216. ఇటువంటి చావడి కథను ఇంతవరకు జరిగినది జరిగినట్లుగా చెప్పడం జరిగింది. ఇక రెండవ కథ తరువాతి అధ్యాయంలో వర్ణింపబడుతుంది.217.శ్రోతలు క్షమించాలి. అగాధమైన సాయి

మహిమలను సంక్షిప్తంగా చెప్పటానికి వీలు కాదు. అవి విస్తరిస్తూనే ఉంటాయి. 218. ఇక సాయియొక్క వంటపాత్ర కథ, మిగతా విశేషాలు తరువాతి అధ్యాయంలో చెప్తాను. శ్రద్ధగా వినండి. 219. అనవరతం గురుస్మరణలో ఉండటమే హేమాడుపంతు స్వార్థం. అదే అతని పరమార్థం. గురుచరణాలకు అభివందనం చేయటంలోనే కృతార్థత. కారణం ఆ పాదాలవద్దనే నాలుగు పురుషార్థాలు ఉన్నాయి. 220. స్వస్తి శ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో చావడి వర్ణనమను ముప్పదిఏడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత - 38 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

సకలజగత్తుకూ ఆనందాన్నిచ్చేవారు, భక్తుల కోరికలను తీర్చడానికి తత్పరులు, చరణాలను ఆశ్రయించిన వారి త్రితాపాలను హరించేగురువరా! మీ పాదాలకు వందనములు.1. శరణు జొచ్చినవారిని రక్షించే పరమ ఉదారా! శరణాగత భక్తోద్ధారా! మీరు లోకాన్ని ఉద్ధరించడానికి అవతరించారు.2. జయజయద్వైతదళనా! జయజయ భక్తమనమోహనా! జయజయ భవాపహరణా! జయకరుణాఘనా! గురుదేవా!3. ఎంతటి భాగ్యఫలమో మీ చరణాలను కళ్లతో చూశాము. మీ సమాగమ సుఖంలోని ఆనందాన్ని అనుభవించాము. గతించి పోయిన ఆ సమయం మళ్లీ రాదు.4. బ్రహ్మయొక్క మూసలో శుద్ధ ఆత్మ స్వరూపరసాన్ని పోస్తే వచ్చిన అందమైన ఆకార మూర్తియే సత్పురుష శ్రేష్ఠులైన సాయి.5. సాయియే ఆత్మారాముడు. సాయియే పూర్ణానందధాముడు. వారు స్వయం ఏ కోరికలూ లేనివారు. భక్తులను నిష్కాములుగా చేస్తారు.6. సర్వధర్మాలను రక్షించేవారు, బ్రహ్మక్షాత్ర తేజస్సుతో మృత్యువును కూడా భక్షించే వారి సుగుణాలను వర్ణిస్తాను.7. జననమరణాలకు సంబంధించిన బంధనాలను త్రెంచేసే వారికి జడుణ్ణి అంధుణ్ణి అయిన నేను సాష్టాంగ వందనం చేస్తున్నాను.8. గతాధ్యాయంలో సాయినాథుని చావడి ఊరేగింపును ఉత్సాహంగా వర్ణించాను. ఈ అధ్యాయంలో అఖండ సుఖాన్నిచ్చే వంట పాత్రను గురించి వినండి .9. పసిబిడ్డలకు తినడం మాత్రమే తెలుసు. కాని ఏమి తినాలో వారికి తెలియదు. పాలు పట్టాలా లేక అన్నం

పెట్టాలా అన్న చింత తల్లికే.10.అట్లే మా సాయిమాత నా చేత కలం పట్టించి ఈ ప్రబంధాన్ని తమ భక్తులపైని ప్రేమతో వారి కోసం వ్రాయిస్తున్నారు.11.ప్రతి యుగంలోను మోక్ష ప్రాప్తికి మానవులు చేయవలసిన ప్రమాణసిద్ధమైన ధర్మాలను,సాధనలను శాస్త్రాలలో చెప్పారు. అవి కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపరయుగంలో యజ్ఞం, కలిగయుగంలో దానం.12.దానధర్మాలను ఎల్లప్పుడూ చేస్తూ ఉండవలసినదే. అయినా ఆకలిని తీర్చటం పరమ ధర్మం. నిత్యం నియమంగా అన్నదానం చేయటం కర్మలలో ముఖ్య కర్మ.13.మధ్యాహ్నం ఘన్నెండయితే చాలు. అన్నం తినకపోతే ప్రాణం ఆందోళన పడిపోతుంది. మనకు వలెనె ఇతరులు కూడా అని తెలుసుకునే వారు గొప్పవారు. 14.శాస్త్రప్రమాణంగా ఆచరంచే ధర్మాలలో అన్నదానం అగ్రగణ్యమైనది. దానికంటె శ్రేష్ఠమైనది మరొకటి లేదు.15.అన్నం పరబ్రహ్మస్వరూపం. అన్నంలో నుండే ప్రాణులు ఉత్పన్నమౌతాయి. జీవులను జీవింప చేసే సాధనం అన్నమే. చివరకు జీవులు అన్నంలోనే కలిసిపోతారు. 16. సమయాసమయాలలో ఎప్పుడైనా సరే వచ్చిన అతిథులను గృహస్థులు అన్నదానంతో సంతుష్టి పరచాలి.అన్నం పెట్టకుండా అతిథులను తిప్పి పంపివేస్తే దుర్గతిని ఆహ్వానించుకున్నట్లే.17.వస్త్రాది వస్తువుల దానంలో యోగ్యతను చూడవచ్చు. అన్నదానంలో పాత్రతను చూడనవసరం లేదు.ఎవరు ఎప్పుడు గుమ్మం వద్దకు వచ్చినా సరే వారికి అన్నం పెట్టకుండా అనాదరం చేయటం మంచిది కాదు. 18.వేదాలలో అన్నదాన మహత్వాన్ని చెప్పారు.అందుకే బాబా కూడా లౌకికరీతిని ఆచరిస్తూ అన్న సంతర్పణ చేసేవారు.19.చంద్రుడులేని తారలవలె, పతకంలేని హారంవలె,ధనందానం లేదా ఇతర దానాలు ఎన్ని చేసినా, అన్నదానం లేకుండా అవి సంపూర్ణం కావు.20.షడ్ రసాలలో మధురం శ్రేష్ఠమైనట్లు పుణ్యాలలో పుణ్యం అన్నదానం. కలశంలేని శిఖరం, తామరలులేని సరమువలె శోభించవు.21. ప్రేమలేని భజనవలె, కుంకుమలేని సువాసిని

వలె,సుస్వరం లేకుండా పాడాలనే వ్యర్థ ప్రయత్నం వలె, ఉప్పులేని మజ్జిగవలె బాగుగా ఉండవు.22.రోగులకు శక్తి హీనులకు గ్రుడ్డి కుంటి చెవిటి వారికి దీనులకు ముందుగా అన్నం పెట్టాలి.వారి తర్వాతనే ఆప్తులకు బంధుమిత్రులకు పెట్టాలి.23.ఇప్పుడు జిజ్ఞాసుల ప్రీతి కోసం మరియు శ్రోతలకు తెలియజేయటానికి బాబా యొక్క వంట పాత్ర గురించి చెప్పటానికి ప్రయత్నిస్తాను.24.మసీదు ప్రాంగణంలో బాబా ఒక పెద్ద పొయ్యిని పెట్టేవారు. దానిపై చాలా పెద్దదైన పాత్రను పెట్టి దానిలో సరిపడా నీరుపోసేవారు.25.ఒకప్పుడు తీయటి పరమాన్నం మరొకప్పుడు మాంసంతో పులావు వండేవారు. ఒకప్పుడు గోధుమపిండితో ఉండలుచేసి ఉడుకుతున్నప్పుడు పప్పు పులుసులో వేసేవారు. 26.మరొకప్పుడు ఆ పిండిని పలచగా ఒత్తి సన్నని ముక్కలుగా కోసి వానిని ఉడుకుతున్న పప్పులో మెల్లగా వేసేవారు. 27.మసాలాను రాతిబండ మీద బాగా నూరేవారు. అన్నింటినీ సరియైన పాళ్లలో బాబా స్వయంగా వేసేవారు. తమ చేతులతో పెసర పప్పువడలను చేసి మెల్లగా గిన్నెలోవేసేవారు.28.స్వర్గాది భువనాలను ఆశించి పశువులను హింసించి యజ్ఞ క్రతువులలో బ్రాహ్మణులు కూడా పురోడాశాన్ని సేవిస్తారు. ఈ హింసను శాస్త్రాలు సమ్మతించినట్లుగా చెప్పుతారు.29.అట్లే బాబా కూడా ముల్లాను ఆజ్ఞాపించి అతనితో శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణ చేయించి విధి విధానాలతో మేకను కోయించేవారు.30.ఒకప్పుడు పెద్ద తపేలాలో మరొకప్పుడు చిన్న తపేలాలో అన్నం వండి అన్నార్తులకు భోజనం పెట్టేవారు.31.యాభైమందికి అన్నం సరిపోయే తపేలా గిన్నె చిన్నది. వందమందికి పైగా అన్నం వండే పాత్ర పెద్దది.32.బాబా స్వయంగా వర్తకుల వద్దకు వెళ్లి సరుకులు కొనేవారు. అరువు అనే మాట లేదు. వెంటనే చేతిలో డబ్బులు పెట్టే వారు.33.ఉప్పుకారం మిరియాలు జీలకఱ్ఱ కాయగూరలు ఆకుకూరలు కొబ్బరికాయవగైరా వస్తువులన్నిటినీ బాగాచూచి బేరంచేసి స్వయం తెచ్చే వారు.34.మసీదులో కూర్చుని

గోధుమలను, పప్పును, జొన్నలను బాబా స్వయంగా విసిరేవారు. 35. వంటకొఱకు చేయవలసిన ముఖ్యమైన పనినంతా బాబా విశ్రాంతి అనేది లేకుండా స్వయంగా చేసేవారు. మసాలాలు నూరేపని కూడా తామే మనస్ఫూర్తిగా చేసేవారు. 36. పొయ్యిలోని మంట సరిగ్గా ఉండటానికి కట్టెలను మాటిమాటికీ క్రిందకు పైకి జరుపుతుండేవారు. 37. పప్పు నానపోసి స్వయంగా బండపై నూరేవారు. ఇంగువ జీలకఱ్ఱు కొత్తిమీర అవి వేసి వంట కాలను ఘుమఘుమలాడేలా చేసేవారు. 38. పిండిని తడిపి దానిని మూరేడు పొడవు ముద్దలుగా చేసి వానిని వెడల్పుగా ఒత్తి చపాతీలను చేసేవారు. 39. జొన్నపిండిలో సరిపడా నీరుపోసి పాత్రలో కాచి మజ్జిగను కలిపి అంబలిని కూడా చేసేవారు. 40. ఈ అంబలిని కూడా వారు ఎంతో ప్రేమతో ఇతర వంటకాలతో పాటు స్వయంగా అందరికీ వడ్డించేవారు. 41. వంట పూర్తిగా తయారయ్యాక పాత్రను పొయ్యి మీదనుండి దింపించి తీసుకుని వెళ్లి మసీదులో ఉంచేవారు. 42. మౌల్వీతో విధి పూర్వకంగా ఫాతిహా చేయించేవారు. ఆ నైవేద్య ప్రసాదాన్ని మొదట మహాల్సాపతికి తాత్యాకు పంపేవారు. 43. మిగతా నైవేద్యాన్నంతా బాబా స్వయంగా తమ చేతులతో వడ్డించేవారు. పేదవారు దుర్బలులు సంతోషంగా సంతృప్తిగా తినేవారు. 44. ఆ భోజనంకోసం వచ్చినవారు సంతోషంగా సంతృప్తిగా తినేవారు. అయినా బాబా 'తినండి, తినండి' అని ఎంతో ప్రేమతో బలవంతంగా పెట్టేవారు. 45. బాబా స్వయంగా వడ్డించగా తృప్తికరంగా భోజనంచేసినవారు ఎంత భాగ్యవంతులు! ఎంత ధన్యులు! 46. బాబా మాంసంతో వండిన అన్నాన్ని ప్రసాదమని భక్తులందరికీ భేదంలేకుండా వడ్డించేవారా అని ఇక్కడ సందేహం సహజంగా కలుగుతుంది. 47. ఈ సందేహాన్ని తీర్చడం కష్టమేమీ కాదు. ఎప్పుడూ మాంసం తినేవారికే ఆ అన్నాన్ని వడ్డించేవారు. 48. జీవితంలో ఎన్నడూ మాంసాన్ని ఎరుగనివారిని మాంసాన్ని అసలు ఎప్పుడూ తాకనిచ్చేవారు కాదు. ఆ ప్రసాదాన్ని సేవించాలని

కోరుకునేవారికే పెట్టేవారు. 49. గురువు స్వయంగా ప్రసాదాన్ని ఇచ్చినప్పుడు తినవచ్చా తినకూడదా అన్న ఆలోచన కలిగితే ఆ శిష్యుడు ఆత్మఘాతకుడై అధఃపతనానికి పోతాడు. 50. ఈ తత్త్వం తమ భక్తులకు ఎంత వరకు అవగాహన అయిందో అని తెలుసుకోవటానికి బాబా వినోదాలతో తమాషాలను చేసి చూపేవారు. 51. వ్రాస్తూవ్రాస్తూ ఉంటే చిన్న విషయం గుర్తుకు వచ్చింది. తమ శ్రేయస్సు కొఱకు శ్రోతలు సావధానంగా వినండి. 52. ఒకసారి ఏకాదశి రోజున బాబా దాదాకేల్కరుతో, 'నాకోసం కొల్హాలా నుండి మాంసాన్ని తెచ్చి పెడతావా' అని అడిగారు. 53. దాని కొఱకు సాయిబాబా రూపాయలను తీసి లెక్కపెట్టి దాదాకు ఇచ్చి 'వెళ్లు నువ్వే స్వయంగా వెళ్లి తేవాలి' అని ఆజ్ఞాపించారు. 54. అతని పేరు గణేశ్‌దామోదరు. ఇంటిపేరు కేల్కరు. వయసులో పెద్దవాడని అందఱూ అతనిని దాదా అనే పిలిచేవారు. 55. ఇతడు హరివినాయకసాఠెకు మామ. ఇతనికి సాయిపాదాలయందు చాలా ప్రేమ. బ్రహ్మ కర్మల యందు గౌరవమున్న బ్రాహ్మణుడు. ఆచారాలను శ్రద్ధగా పాటించేవాడు. 56. గురుసేవను అహర్నిశలూ చేసినా తృప్తి చెందనట్టివాడు. ఇటువంటి వానికి విచిత్రంగా ఇలాంటి ఆజ్ఞ. ఇది అతనికి ఎలా అనిపించిందో తెలియదు. 57. దృఢమైన శరీరం కలిగి అభ్యాసం ద్వారా మనసు నిశ్చలంగా మారిన వారి బుద్ధి కూడా గురుపాదాల యందు స్థిరంగా ఉంటుంది. 58. కేవలం ధనధాన్యాలు, వస్త్రాలు వగైరా గురువుకు అర్పించటం గురుదక్షిణ కాదు. గురువుగారి ఆజ్ఞను పాటించి వారిని ప్రసన్నులను చేయటమే అసలైన దక్షిణ. 59. కాయా వాచా మనసా అన్నిటినీ గురువుకు అంకితం చేసి గురుకృపను పొందినవారిదే నిజమైన శ్రద్ధ. 60. బాబా ఆజ్ఞను శిరసా వహించి దాదా వెంటనే బట్టలను తొడుక్కుని ఆ ఊరికి బయలుదేరాడు. అప్పుడు బాబా అతనిని వెనుకకు పిలిచారు. 61. 'దానిని కొని తీసుకుని రావటానికి ఎవరినైనా పంపరాదూ! పోవడం రావడం వృథా శ్రమ నీకెందుకు?' అని

అన్నారు.62.అప్పుడు మాంసాన్ని తేవటానికి దాదా నౌకరు పాండును పంపాడు. ఇంతలో బాబా దాదాతో అప్పుడు ఏమన్నారంటే 63.పాండు బయలుదేరిపోతుండగా బాబా దాదాతో 'ఇవాళ అవసరంలేదు, అతనిని వెనుకకు పిలువు' అని చెప్పారు.64.ఒక్కసారి బాబాకు వంట చేయాలని బుద్ధి పుట్టింది. పాయ్యి మీద డేగిసాను ఉంచి దానిలో మాంసాన్ని వేశారు.65.బియ్యాన్ని కడిగి అందులో పోశారు.సరిపడా నీరుపోసి పాయ్యిలో కట్టెలుమంట పెట్టి ఊదుతూ కూర్చున్నారు.66.ఊరివారంతా వారికి అంకితమైన వారే. ఎవరైనా కూర్చుని ఆనందంగా ఊదుతారు. కాని బాబా ఆజ్ఞ లేకుండా ఎవరికీ అంత ధైర్యం లేదు.67.బాబా ఆజ్ఞాపిస్తే వారిభక్తులు పరమోత్సాహంగా అన్నం కూడా వండి పట్టుకుని తెస్తారు. కాని బాబాకు అది ఇష్టం లేదు.68.అంటే ఇది సరియైన మాట కాదు. స్వయం వంట చేయటం వారి సంకల్పమైనప్పుడు వారు అన్నదానానికి ఇతరులను ఎందుకు కష్టపెడతారు?69. తమ పొట్ట నింపుకోవటానికి, వారు స్వయం ఇంటింటికీ తిరిగి భిక్షచేసి రొట్టెముక్కలను అడుక్కునేవారు.70. కాని అన్నదానం చేయటానికి స్వయం శ్రమపడితేనే తృప్తి. అందువలన వారు ఎవరిపైనా ఆధారపడేవారు కాదు.71.వందమందికి సరిపడేలా పిండి బియ్యం పప్పు వగైరా వస్తువులను చక్కగా చూచి బాబా డబ్బు చెల్లించి స్వయం తెచ్చేవారు.72.చేత చేటను పుచ్చుకుని స్వయం వర్తకుల అంగళ్లకు వెళ్లేవారు. వ్యవహారంలో ఎలా దక్షతతో ఉండాలో వారిని చూచి నేర్చుకోవాలి.73.వస్తువులను చేతిలోనికి తీసుకుని చక్కగా బేరమాడేవారు. వారిని ఎవరూ మోసపుచ్చలేక పోయేవారు. పైగా ఇతరుల గర్వం కరిగిపోయేది.74.ఒక్కపైసా అయినా వ్యర్థంకాకుండా చక్కగా ధరకట్టి లెక్క చేసినట్లు నటించినా అయిదు అడిగితే పది వెంటనే ఇచ్చేసేవారు.75.స్వయంగా పనిచేయటం వారికి ఎంతో ఉత్సాహం. ఇతరులు చేస్తే వారికి నచ్చేది కాదు. ఎప్పుడూ ఎవరిపైనా ఆశ పెట్టుకునేవారు కాదు. వారివల్ల ఎవరికీ ఏ కష్టమూ

ఉండేది కాదు.76.ఎల్లప్పుడూ ఈ స్వభావంతోనే ఉండేవారు. అందువలననే వంట చేయటంలో ఎవరి సహాయాన్ని అపేక్షించేవారు కాదు.77.వంట మాత్రమేనా! ధుని కొఱకు కట్టెలను ఉంచే గది యొక్క ముందు భాగం మూడువంతులగోడ, బాబా తమ స్వహస్తాలతో నిర్మించినదే.78.పని వాడు మహాదు మట్టిని బాగాకలిపి ఇస్తే బాబా తమచేతితో తాపీని పట్టుకుని ఇటుకలను వరుసపై వరుస పేర్చుతూ గోడకట్టేవారు.79.వారు చేయని పని ఏముంది? మసీదును స్వయంగా అలికేవారు. చేత్తో తమ కఫనీని లంగోటిని కుట్టుకునేవారు.ఎవరిపైనా ఆశ పెట్టుకునేవారు కాదు.80.తపేలా గిన్నెలోనుండి ఆవిరి భయంకరంగా పైకి పొంగుతుంటే బాబా చేతిమీది చొక్కాను పైకి జరుపుకొని చక్కగా క్రిందాపైనా కలిపేవారు.81.తపేలాలో కుతకుతలాడుతూ ఉడుకుతున్న సమయాన కలపవలసినప్పుడు బాబా అమోఘమైన లీలను కనబరచేవారు.82.రక్తమాంసాల వారి చేతిని కుతకుత ఉడుకుతున్న తపేలాలో ఉంచినా వారి ముఖంలో భయంగాని లేక వారి చేతిపై కాలిన గుర్తుగాని కనిపించేవి కావు.83.భక్తుల శిరసుపై పడగానే త్రితాపాలను తొలగించే వారి హస్తాన్ని అగ్ని ఎలా బాధపెట్టగలదు? అగ్నికి వారి మహిమ తెలియదా! 84.బాబా నానపోసిన పప్పును రాతిబండపైన పోసుకుని చక్కగా ఏరి స్వయంగా సన్నికల్లుతో నూరి తమచేత్తో పెసర వడలను చేసేవారు.85.తరువాత వానిని మెల్లగా పాత్రలో వేసి అడుగు మాడకుండా కలిపేవారు. తయారయ్యాక పాత్రను క్రిందకు దించి ప్రసాదాన్ని అందరికీ పంచేవారు.86.అందరికీనా అని శ్రోతలు అంటారేమో. సాయిబాబా యవనులు కదా మఱి ఇటువంటి అధర్మాచరణను ఎలాచేసేవారు?87.ఈ సందేహానికి సమాధానం ఒక్కటే. సాయిబాబా ధర్మం అధర్మం గురించి ఎప్పుడూ ఎరుకలో ఉండేవారు.88.తపేలాలో వండిన పదార్థాలను అందఱూ తినాలి అని బాబా ఎవరినీ ఎప్పుడూ బలవంత పెట్టేవారు కాదు.89.కాని ఆ ప్రసాదాన్ని తినాలన్న ఇచ్ఛ కలిగిన వారి

కోరికను తీర్చేవారు. కాని ఎప్పుడూ ఎవరినీ మోసగించేవారు కాదు.90.వారి జాతి అసలు ఎవరికి తెలుసు కనుక? మసీదులో ఉంటారు కనుక ముసల్మాను అని అంటారు కాని వారి పద్ధతులను ఆచరణను చూస్తే వారి జాతి తెలియదు. 91.భక్తులు వారిని దైవమని అంటారు. వారి పాద ధూళిలో పొర్లుతారు.అటువంటి వారి జాతిని గూర్చి ఆలోచించేవారి పరమార్థప్రాప్తి వ్యర్థం.92.ఇహలోక పరలోక విషయాలయందు విరక్తిని, వివేకవైరాగ్యాల సంపత్తిని కలిగినట్టి వారి జాతిని చూచేవారి పరమార్థం వ్యర్థం.93. ధర్మాధర్మాలకు అతీతమైన శుద్ధ ఆనందస్థితిలో ఉన్నట్టివారి జాతిని చూచేవారి పరమార్థ ప్రాప్తి వ్యర్థం.94.ఇటువంటి సాయిబాబా చరిత్రను నా ఆనందానికి గానం చేస్తున్నాను. శ్రవణం చేయాలన్న కోరిక ఎవరికైనా ఉంటే అది నెరవేరుతుంది.95.ఇక వెనుక ఉండిపోయిన కథానుసంధానాన్ని తిరిగి చూడండి.బాబా దాదాతో ఏమన్నారో వినండి.96.'ఖారాపులావ్ చేశాను. ఎలా ఉందో చూస్తావా అని అడిగారు.దాదా లాంఛనంగా 'ఆహా! చాలా బాగుంది'అని అన్నాడు.97.దాదా పూర్వకాలపు భక్తశ్రేష్ఠుడు. స్నానసంధ్యాదుల యందు నియమనిష్ఠలు కలవాడు. మంచిచెడులను ఎరిగిన వాడు. అతనికి బాబా మాటనచ్చలేదు.98.అప్పుడు బాబా 'ఎన్నడూ కళ్లతో చూడలేదు, జిహ్వా తో రుచి చూడలేదు, మరిబాగుందని ఎలా చెప్పావు?'అని దాదాతో అన్నారు.99.పాత్రపైని మూతతీసి లోపల చేత్తో తీసి చూడు అని అంటూ బాబా అతని చేతిని పట్టుకుని డేగిసలోపలికి తోశారు.100.'ఇక చేయితీసి గరిటతో పళ్లెంలోకి తీయి. మడికట్టుకున్నానని ఊరికే బడాయిపోకు.' అని అన్నారు.101సత్పురుషులు శిష్యులకు అనుచితమైన దానిని చేయమని చెప్పుతారు అని అనుకోవడం పొరపాటు.సత్పురుషులు అపారమైన దయగలిగి ఉంటారు.వారి మార్గం వారికే తెలుసు. 102.నిజమైన ప్రేమతరంగాలు లేచినప్పుడు తల్లి బిడ్డను గిల్లి బిడ్డ ఏడుస్తుంటే తన గుండెలకు హత్తుకుంటుంది.

103.తినకూడని వానిని తినాలని మనసు పడేవారి వాసనలను అణచివేసి, మనసును నిగ్రహించుకునేవారిని బాబా ఉత్సాహపరచేవారు.104.గురు ఆజ్ఞాపాలనా మీమాంస ఒక్కోసారి ఎంతటి కఠిన పరీక్షకు దారితీసేదంటే జీవితంలో ఎన్నడూ మాంసాన్ని తాకని భక్తుని నిశ్చయం ఊగిసలాడింది.105.వాస్తవానికి బాబా స్వయంగా ఎప్పుడూ ఏ భక్తుని అయినా తప్పుదారిలో ప్రవేశపెట్టేవారు కాదు.106.క్రీ.శ.1910వ సంవత్సరానికి ముందు బాబా ఎంతో ఉత్సాహంగా తరచూ వంటలు వండేవారు.107. తరువాత ముంబై పట్టణంలో అక్కడక్కడా దాసగణు సంకీర్తనల ద్వారా సాయి మహాత్మ్యం ప్రజల మనసులలో చోటు చేసుకుంది.108.అప్పటినుండి ఆబాలవృద్ధులు బాబా మహిమను తెలుసుకుని అసంఖ్యాకంగా జనులు శిరిడీ రాసాగారు.109.బాబాకు పంచోపచార పూజలు, అనేక రకాల నైవేద్యాలు, మధ్యాహ్నం సాయంకాలం భోజనం ఫలహారాలు మొదలయ్యాయి.110.అన్నం, పప్పు, పూరి, హల్వా, చపాతీలు,పచ్చళ్ళు,వడపప్పు వగైరా అనేకరకాల వంటకాలు, పంచామృతం క్షీరాన్నం అవీ పుష్కలంగా వచ్చేవి. 111.సాయిబాబా దర్శనానికి యాత్రికులు అపరిమితంగా పరుగెత్తుకుంటూ వచ్చేవారు. సాయిబాబాకు నైవేద్యాన్ని సమర్పించేవారు.దానితో ఆకలిగొన్న వారు సంతృప్తి చెందేవారు.112.బాబాకు ఛత్ర చామరాలతో రాజోపచారాలు జరిగేవి. తాళాలు తప్పెట్లు ఢోలు మొదలగు వాద్యాల ఘోషతో భజనలు చేసేవారూ పెరిగారు. 113.బాబా మహిమ అంతటా వ్యాపించింది. భక్తులు బాబాను స్తోత్రాలతో స్తుతించేవారు. యాత్రికులకు శిరిడీ పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రమయింది.114.అందువలన బాబా వంటచేయడం ఆగిపోయింది. నైవేద్యాలు చాలా ఎక్కువగా వచ్చేవి. ఫకీరులు బిక్షగాళ్లు తిన్నా ఇంకా చాలా అన్నం మిగిలిపోయేది.115.ఇప్పుడు శ్రోతలకు ఆనందాన్ని కలిగించే మరొక కథను చెప్తాను.ఆరాధ్య దైవాన్ని అనాదరం చేస్తే బాబా సహించేవారు కాదు.116.ఏవేవో

అనుమానాలతో ఒకరు బాబాను బ్రాహ్మణుడని అంటే మరొకరు ముసల్మాను అని అంటారు. కాని వారు ఏ జాతికీ చెందరు.117.వారు ఎక్కడివారు? ఏజాతిలో ఎప్పుడు జన్మించారు? వారి తల్లి తండ్రి ఎవరు అన్న విషయాలు తెలియనప్పుడు, వారు బ్రాహ్మణులా ముసల్మానులా?118.వారు ముసల్మాను అయితే మసీదులో అగ్ని దేవతను ఎందుకు ఆరాధిస్తారు? అక్కడ తులసీ బృందావనం ఉంటుందా? ఘంటానాదాన్ని సహిస్తారా? 119. మసీదులో శంఖారావం తాళాల తప్పెట్ల చప్పుళ్లను మృదంగం మొదలగు వాద్యాలతో కథా సంకీర్తనాదులను హరినామ గర్జనలను వేయనిచ్చేవారా?120.ముసల్మాను అయితే తాము స్వయం మసీదులో కూర్చుని చందన చర్చనలను వేయనిస్తారా? అక్కడ సహపంక్తిలో కూర్చుని భోజనం చేస్తారా?121.ముసల్మాను అయితే మరి వారి చెవులు కుట్టి ఉండేవా? తమ స్వంత డబ్బు ఖర్చుపెట్టి దేవాలయాల జీర్ణోద్ధరణను చేయిస్తారా?122.స్నానం తర్వాత పీతాంబర వస్త్రాన్ని ధరిస్తారా? ఎవరైనా సరే ఆరాధించే దైవాన్ని అనాదరం చేస్తే బాబా క్షణమైనా సహించేవారు కాదు.123. ఈ విషయంలోని ఒక ఉపదేశ కథ, వ్రాస్తూ వ్రాస్తూ ఉంటే గుర్తుకు వచ్చింది. అతి వినయంగా మనవి చేస్తాను. ఏకాగ్రమనసులతో వినండి .124.ఒకసారి బాబా లెండీ నుండి తిరిగి వచ్చి మసీదులో కూర్చుని ఉండగా వారి దర్శనానికి భక్తులు వచ్చారు.125.వారిలో బాబాకు అత్యంత ప్రియుడైన భక్తుడు నానా చందోర్కరు. బినీవాలాతో ఎంతో ఆతురతగా బాబా దర్శనానికి వచ్చాడు.126.ఆ ఉభయులూ సాయినాథునికి నమస్కరించి వారి సముఖంలో కూర్చున్నారు. క్షేమ సమాచారాలను ముచ్చటించుకుంటుండగా బాబాకు అకస్మాత్తుగా కోపం వచ్చింది.127.'నానా! నీవు ఇది ఎలా మరచిపోయావు? నా సాంగత్యంలో ఎన్నోరోజులుండి నీవు నేర్చుకున్నది ఇదేనా?128.నీవు నా సాంగత్యంలో ఉన్నదాని ఫలితం చివరకు ఇదేనా? నీ మతి ఎందుకిలా భ్రమించింది? నాకంతా పూర్తిగా చెప్పు' అని

అన్నారు.129.ఆ మాటవిని నానా అధోవదనుడై,బాబా కోపానికి కారణమేమిటా అని ఆలోచించాడు. ఏదీ గుర్తుకు రాలేదు. మనసు వికలమైంది.130.ఎక్కడ పొరపాటు జరిగిందో తెలియలేదు. బాబా కోపానికి కారణమేమీ తోచలేదు. ఏదో అపరాధం జరగకపోతే బాబా ఎవరినీ బాధ పెట్టరు.131.అందువలన బాబా పాదాలను పట్టుకుని ఆసేకరకాల మొరపెట్టుకున్నాడు. చివరకు దీనంగా ఎందుకు కోపం వచ్చినదో చెప్పమని ప్రార్థించాడు.132.అప్పుడు బాబా నానాతో,'ఎన్నో ఏళ్లగా నా సాంగత్యంలో ఉంటున్నా నీ మతికి ఏమయింది? అని అడిగారు.133.కోపర్‌గాంకి ఎప్పుడు వచ్చావు? దారిలో ఏం జరిగింది? మధ్యలో ఎక్కడా దిగలేదా? టాంగా నేరుగానే వచ్చేసిందా?134.ఏదో సంభవించినట్లుంది. చిన్నదైనా పెద్దదైనా జరిగినదంతా చెప్పు. ఎక్కడ ఏంజరిగింది?అని అడిగారు.135.ఆ మాట విని నానాకు అర్థమైంది. వెంటనే తలవంచుకున్నాడు. చెప్పటానికి సిగ్గు పడిపోయాడు.అయినా చెప్పాడు.136.బాబా వద్ద దాపరికం వీలు కాదు. కనుక జరిగినదాన్నంతా చెప్పటానికి నిశ్చయించుకున్నాడు.137.సాయిబాబాతో అసత్యాన్ని పలుకలేము.అసత్యంతో సాయి కృపను పొందలేము. అసత్యం అధోగతికి దారి. అసత్యంవలన చివరకు దుర్గతే.138.గురువును వంచించటం మహాపాపం.ఆ పాపానికి నిష్కృతే లేదు అని తలచి నానా జరిగిన విషయాన్నంతా బాబాకు తెలియ చేశాడు.139.మొదట నేరుగా శిరిడీ వరకు టాంగా మాట్లాడాను. కనుక గోదావరి తీరాన ఉన్న దత్త భగవానుని దర్శనం బినీవాలాకు లభించలేదు.140.బినీవాలా దత్త భక్తుడు. దారిలో దత్తమందిరము ఉన్నదని తెలిసి దత్తదేవుని దర్శనానికి అక్కడ దిగాలని అతనికి అనిపించింది. 141.కాని ఇక్కడకు త్వరగా రావాలని, నేను అతనితో ఇప్పుడు వద్దు శిరిడీ నుండి తిరిగి వచ్చేటప్పుడు దర్శనం చేసుకుందామని చెప్పాను.142.శిరిడీ రావటం ఆలస్యమౌతుందని నేను త్వరపడి దత్తదేవుని దర్శించు కోలేదు.

143.తరువాత గోదావరిలో స్నానం చేస్తుంటే కాలిలో పెద్ద ముల్లు గ్రుచ్చుకుని దారిలో చాలా బాధ కలిగింది. కష్టంతో దానిని లాగేశాను. అని చెప్పాడు.144.అప్పుడు బాబా 'ఇలా త్వరపడటం మంచిది కాదు. దర్శనం చేసుకోకుండా దత్తదేవుని అనాదరం చేసినా, నయమే. నీవు కేవలం వట్టి ముల్లు గ్రుచ్చుకుని బయట పడ్డావు. 145.దత్తభగవానుని వంటి ఆరాధ్యదైవం దారిలో ప్రత్యక్షంగా ఉండగా, ఆ దేవుణ్ణి దర్శించుకోనివాడు అభాగ్యుడు. అటువంటి వాడు నా వద్దఏం పొందగలడు?అని అన్నారు.146.ఇప్పుడు వంట విషయం – మసీదులో సాయితో పాటు పావనమైన మధ్యాహ్న భోజనం మరియు సాయియొక్క భక్త వాత్సల్యం.147. ప్రతిరోజూ మధ్యాహ్న పూజ ముగిశాక ఆరతి జరిగిన తరువాత,భక్తులు తిరిగి వెళ్లేటప్పుడు వారందరికీ బాబా విభూతినిచ్చేవారు.148.మసీదు గోడ చివర బాబా వచ్చి నిలచి ఉంటే ప్రాంగణంలో కూర్చున్న భక్తులు ఒక్కొక్కరు వచ్చి వారి పాదాలకు వందనం చేసేవారు. 149.వారి చరణాలపై శిరసునుంచి వారి ఎదుట నిలబడగా వారు ఒక్కొక్కరి నొసటన విభూతి పెట్టేవారు. 150.తరువాత 'ఇక మీరందఱూ భోజనానికి మీ ఇళ్ళకు వెళ్ళండి అని బాబా చెప్పగానే వారి ఆజ్ఞను శిరసావహించి భక్తులు వెళ్లిపోయేవారు.151.బాబా వెనుకకు మరలగానే అలవాటుగా తెరను లాగేవారు. గణగణమని పళ్లాలు గిన్నెల చప్పుళ్లతో ప్రసాదవితరణ వైభవంగా జరిగేది.152.సాయి హస్త స్పర్శతో పవిత్రమైన నైవేద్యశేషాన్ని తీసుకుని వెళ్లాలని అనేక మంది వారి పళ్లాముల కోసం ఎదురు చూస్తూ ప్రాంగణంలో కూర్చునేవారు.153.ఇక్కడ నింబారు సమీపంలో గోడకు వీపు పెట్టి బాబా కూర్చునేవారు. వారికి ఇరువైపులా వరుసగా పంక్తులు తీరగా అందరికీ ఎంతో ఆనందంగా ఉండేది.154.తమతమ నైవేద్యాలను సాయిసమర్థుని ముందు ఉంచగా వారు తమ చేతితో దాన్నంతటినీ ఒక పళ్లెంలో వేసేవారు.155.బాబా చేతిస్పర్శను పొందిన శీతప్రసాదప్రాప్తికి అత్యంత భాగ్యము

ఉండాలి.ఆ ప్రసాదాన్ని సేవించిన వారు లోపలా బయటా పునీతులై తమ జీవితాలను సఫలం చేసుకుంటారు. 156.వడలు,అరిసెలు,హల్వా,పూరీలు,పేణీలు వగైరా పిండి వంటలూ,అనేకరకాల కూరలు, వడపప్పు పాయసం మొదలగు వానినన్నింటినీ బాబా ఒక్కటిగా కలిపేవారు.157.ఆ అన్నాన్ని బాబా ఈశ్వరార్పణ చేసేవారు. తరువాత శ్యామా మరియు నానా నిమోంకరులతో పళ్లాములనిండా వడ్డన చేయించేవారు.158. ఆ పైన బాబా ఒక్కొక్కరిని పిలిచి ప్రేమగా తమవద్ద కూర్చుండబెట్టుకుని పరమానందంతో గొంతువరకూ తినేలా చేసేవారు. 159.ఘుమఘుమలాడే మంచి నెయ్యి,రొట్టెలు,అన్నం,పప్పు అన్నిటినీ బాగా కలిపిన మధురమిశ్రమాన్ని అందరికీ వడ్డించేవారు.160.ప్రేమమయమైన ఆ మిశ్రమాన్ని సేవిస్తే మధురమైన బ్రహ్మానందం కలిగేది. భోజనం చేసిన వారు ప్లేట్లను చేతినీ నాలుకతో శుభ్రం చేసుకుని సంతృప్తిగా వెళ్లేవారు.161.ఒకప్పుడు మండిగలు బొబ్బట్లు,ఒకప్పుడు చక్కెర పాకంలో వేసిన పూరీలు,ఒకప్పుడు బాసుంది లేదా రుచికరమైన రవ్వకేసరి, బెల్లమప్పాలు.162.ఒకప్పుడు తెల్లని సువాసన గల అన్నం, పప్పు పైన ఘుమఘుమలాడే వెన్న కాచిన నేయి, చుట్నీ కూరలు.163.రకరకాల వేపుడుకూరలు, అప్పడాలు, ఊరగాయ పచ్చళ్లు పెరుగుపచ్చడి కొంచెం పుల్లటి పెరుగు, పంచామృతం ఉండేవి.అటువంటి దివ్యామృతాన్ని సేవించినవారు ధన్యులు.164.సాయినాథులు భోక్త అయినప్పుడు వారు స్వయంగా ప్రసాదించిన ఆ భోజనం మాట చెప్పాలా?అక్కడ భక్తులు కంఠం వరకు భోజనం చేసి తృప్తిగా త్రేన్చేవారు. 165.ముద్దముద్దకూ ఎంతో హాయి. తుష్టి గా పుష్టిగా ఆకలి తీరటం. ప్రేమతో నిండిన ఆ మధురమైన భోజనం పరమపావనం.166.ముద్దముద్దకూ సాయినామాన్ని స్మరిస్తూ ఆ దివ్యాన్నాన్ని భోజనంచేస్తుంటే మరల మరల వడ్డించినా, పాత్రలు, పళ్లాలు ఖాళీ అయేవికావు.167.ఎవరికి ఏ ఏ పక్వాన్నంనందు ఆసక్తి ఉంటే ఆయా

వంటకాలను ప్రేమగా వడ్డించేవారు. మామిడిపళ్లరసం ఇష్టమున్న వారికి ఆరసాన్ని ఎంతో ప్రీతిగా ఇచ్చేవారు.168. ఈ భోజనాన్ని వడ్డించమని బాబా నానాసాహేబు నిమోంకరుకు గాని లేదా మాధవరావు దేశపాండేకు గాని ప్రతిరోజూ ఆజ్ఞాపించేవారు.169. నిత్యం నియమంగా నైవేద్యాలను వడ్డించటం వారి పని. వారు ఆ పనిని పరమ ప్రేమతో శ్రమపడి చేసేవారు.170. మల్లెమొగ్గలవంటి మంచి సన్నబియ్యపు అన్నం పైన పసుపు పచ్చని కందిపప్పు. ఆ పైన గరిటతో అందరికీ ఘుమఘుమలాడే నెయ్యి వడ్డించేవారు.171. వడ్డిస్తుంటే సువాసనలు గుబాళించేవి. అలా ఆనందంగా పచ్చళ్లతో సహా వడ్డిస్తుంటే అక్కడ అపక్వమని అరుచికరమని అనిపించక యథేచ్ఛగా భోజనంచేసేవారు.172. ఆత్మానందమనే సేమియా, భక్తిప్రేమలనే వడియాలు వగైరాలను సేవించటానికి తప్ప, శాంతి సుఖం అనుభవించని వారు ఎవరు భోజనానికి రాగలరు?173. హరిరన్నం హరిర్ భోక్తా. హరియే అన్నం, హరియే రసాన్ని ఆస్వాదించేవాడు. అటువంటి అన్నాన్ని ఇచ్చేదాతలు వడ్డించేవారు సేవించేవారు ధన్యులు.174. ఈ మధురరసానికంతటికి మూలం గురుచరణాలలో ప్రబలమైన నిష్ఠ. మధురమైనవి చక్కెర బెల్లం కావు. అనలైన మాధుర్యం శ్రీవారి చరణాలలో ఉన్న శ్రద్ధ.175. ఇలా నిత్యశ్రీ నిత్యమంగళకరంగా క్షీరాన్నం హల్వా మిశ్రమం ఉండగా పళ్లాలముందు కూర్చోగానే అక్కడ నోట వద్దు అన్న మాటరాదు.176. నానారకాల వంటకాలను సేవించి కడుపు నిండి పోగా చివర పెరుగు అన్నం లేకపోతే తృప్తిఉండదు. పెరుగులేకపోతే మజ్జిగనైనా కోరుకుంటారు.177. ఒకసారి తెల్లని మజ్జిగను గురుమహారాజు స్వహస్తాలతో గ్లాసులోనింపి త్రాగమని ప్రేమతో నాకు ఇవ్వగా నేను గ్లాసును పెదవులవద్ద పెట్టుకున్నాను.178. స్వచ్ఛమైన తెల్లని మజ్జిగను కళ్లతో చూడగానే సుఖం సంతృప్తి కలిగాయి. నోటికి అందాక మరీ

ఆనందం కలిగింది. 179. అసలే కడుపు పక్వాన్నాలతో నిండి పోయింది. అందుల "కి ఈ మజ్జిగ ఎలా ప్రవేశించగలదు అని సందేహిస్తూ ఒక గుటక త్రాగగా బాగా రుచికరంగా అనిపించింది. 180. అలా సంకోచిస్తున్న నన్ను చూచి బాబా ఎంతో వాత్సల్యంగా 'అంతా త్రాగేసేయి' అని అన్నారు. అలాంటి అవకాశం మరల రాదు అని వారు తలచినట్లుగా ఉంది. 181. తరువాత అదే అనుభవమయింది. ఆ పిమ్మట రెండుమాసాలు గడిచేసరికి నిజంగానే బాబా తమ అవతారాన్ని చాలించి నిర్వాణాన్ని పొందారు. 182. ఇప్పుడు మజ్జిగతో దప్పికను తీర్చుకోవాలంటే సాయి కథామృతపానం తప్ప మరో మార్గం లేదు. మనకు ఇక ఇదే ఆధారం. 183. హేమాడు సాయినాథునకు శరణుజొచ్చి, సాయి స్మరణకు తెచ్చిన తరువాతి కథను మనవి చేస్తాడు. శ్రోతలు శ్రద్ధ వహించాలి. 184. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో వంట పాత్ర వర్ణనమను ముప్పది ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత - 39 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

శిరిడి క్షేత్రం ధన్యం. పుణ్యపావనులైన శ్రీసాయి, తమ నిర్వాణపర్యంతం నివసించిన ద్వారకామాయి భువనం ధన్యం. 1.శిరిడీ జనులు ధన్యులు.బాబా ఎంతో దూరంనుండి ఏదో నెపంతో శిరిడీకి వచ్చి వారిని ఋణగ్రస్తులను చేశారు.2.మొదట శిరిడీ గ్రామం చాలా చిన్నది.కాని సాయిబాబా అక్కడ నివసించటం వలన గొప్పదైంది. వారి వలననే అత్యంత పావనమైనది. వారి వలననే శిరడీ తీర్థక్షేత్రమైనది.3. శిరిడీలోని స్త్రీలు కూడా ధన్యులు. అనన్యమైన వారి భక్తిశ్రద్ధలు ధన్యం. వారు స్నానంచేస్తూ, ధాన్యం దంపుతూ, విసరుతూ అసామాన్యమైన సాయిబాబా యొక్క మహిమను గానం చేస్తారు.4.వారి ప్రేమ ధన్యం.వారు అత్యుత్తమమైన గీతాలను గానం చేస్తారు.వానిలో ఉత్కృష్టమైన వానిని వింటే మనసుకు శాంతి కలుగుతుంది.5.అందువల్ల శ్రోతల జిజ్ఞాసను తృప్తి పరచటానికి, వారి మనసులకు శాంతి కలిగించటానికి కథను సందర్భానుసారంగా చెప్తాను.6.శ్రీ సాయిబాబా నిజాం రాజ్యంలో దారి ప్రక్కన ఉన్న ఒక మామిడిచెట్టు క్రింద ప్రకటమై ధూపఖేడా గ్రామంలోని పెళ్లివారితో పాటు అకస్మాత్తుగా శిరిడీకి వచ్చారు.7.ఖేడాలోని చాందుపాటీలు అనే పుణ్యాత్మునికి ఈ సాయినిధి ముందుగా లభించింది. అతని ద్వారా ఇతరులకు వారి దర్శనం కలిగింది.8.అతని గుఱ్ఱం పోవడం,అతడు సాయిని కలుసుకోవడం, సాయి అతనితో చిలుం త్రాగించటం,అతని గుఱ్ఱాన్ని తిరిగి ఇప్పించటం.9.మరియు చాందుభాయి

భార్య యొక్క మేనల్లునికి శిరిడీలోని వధువుతో సంబంధం కుదిరి మగపెళ్లివారు, వధువు యొక్క గ్రామానికి తరలి వచ్చారు. 10. ఈ విషయం లోని మొత్తం కథను శ్రోతలకు ముందుగానే చెప్పేశాను. అయినా సందర్భానుసారం స్మరించుకోవటమేగాని మరల ఏకరువు పెట్టటం అనవసరం. 11. చాంద్ పాటిల్ కేవలం నిమిత్త మాత్రుడు. భక్తులను ఉద్ధరించాలని బాబాకు అత్యంత చింత. అందువలన సాయి ఈ అవతారాన్ని ధరించి స్వయంగా శిరిడీకి వచ్చారు. 12. జడులు మూఢులు హీనులు దీనులు మంచి సంస్కారాలు లేనివారిని వ్రతాలు తపస్సును ఎరుగని అమాయక జనులను సాయి తప్ప ఎవరు ఉద్ధరిస్తారు? 13. సాయిబాబా పదునెనిమిది సంవత్సరాల వయసునుండి ఏకాంతాన్ని అలవరచుకున్నారు. రాత్రిళ్లు ఎక్కడైనా నిర్భయంగా పడుకునేవారు. వారికి సర్వం ఈశ్వరమయం. 14. మొదట ఊరంతటికీ పెంటకుప్ప అయిన ఒక గొయ్యివద్ద రాత్రిళ్లు పడుకోవటం, పగలు నలువైపులా తిరగటం, 15. అలా అనేక సంవత్సరాలు గడిచిపోయాక ఆ గోతికి మంచి రోజులు వచ్చాయి. దాని చుట్టూ దీనదయాళువైన సాయికి విశాలమైన భవనం నిర్మించబడింది. 16. ఆ గొయ్యి మధ్యభాగం సాయి శరీరానికి విశ్రామస్థానమైంది. అక్కడే వారికి శాశ్వతంగా సమాధి నిర్మాణమైంది. 17. ప్రణతవత్సలుడైన ఆ సాయిసమర్థులు, దుస్తరమైన భవసాగరాన్ని దాటటానికి, యదార్థమైన తమ ఈ చరిత్ర అనే నౌకను భక్తుల శ్రేయస్సుకై నిర్మించారు. 18. మహాదుస్తరమైన ఈ భవసాగరాన్ని కుంటి గ్రుడ్డి వారైన భక్త పరివారం ఎలా దాటగలరని వారు బాధపడ్డారు. 19. ఈ భవాన్ని దాటటం అందరికీ ఆవశ్యకం. అయితే దానికి పరిశుద్ధాంతఃకరణం అవసరం. అంటే చిత్తశుద్ధి ముఖ్యసాధనం. భగవద్భజన దానికి మూలం. 20. శ్రవణానికి సమానమైన భక్తిలేదు. శ్రవణంతో సహజంగా గురుచరణాల యందు భక్తి కలిగి మనసు నిర్మలమౌతుంది అప్పుడు పరమార్థం ఉత్పన్నమౌతుంది. 21. అసంఖ్యాకమైన సాయికథలను గానం చేస్తూ

ఉంటే పెద్ద గ్రంథమౌతుంది. సంక్షిప్తంగా వర్ణించాలంటే, విస్తారం తప్పని సరిఅయిపోతుంది.22. శ్రోతలకు శ్రవణంలో ఉత్సుకత ఉంటేనే చెప్పేవారికి ఉత్సాహముంటుంది. ఇలా పరస్పరం మన కోరికలను తీర్చుకుని హితాన్ని సాధించుకుందాము. 23. ఇక్కడ సాయియే నావను నడిపేవారు. ఏకాగ్ర మనసుతో వినటమే వారికి చెల్లించే మూల్యం. కథా శ్రవణంలో శ్రద్ధాగౌరవాలు ఉంటే అవి వెంటనే తీరానికి చేరుస్తాయి.24. గతాధ్యాయంలో బాబా వంట యొక్క సంక్షిప్త వర్ణన, మరియు ఒకరికి దత్తదేవునిపై భక్తిని దృఢపరచటం, భక్తులకు నైవేద్య సంతర్పణను మనవి చేశాను. 25. ప్రతి అధ్యాయం చివర తరువాతి అధ్యాయంలోని విషయాలను సూచించే పద్ధతి ప్రకారం, ఈ రచన సాగిందని మీ అందరికీ తెలుసు.26. కాని గతాధ్యాయం చివర, తరువాతి అధ్యాయం గురించి చెప్పలేదు. సాయిబాబా గుర్తుచేసిన విషయాన్ని చెప్తాను.27. అని స్పష్టంగా చెప్పాను. అట్లే సాయిదయతో గుర్తు చేసిన దానిని ఇప్పుడు శ్రోతలకు మనవి చేస్తాను. 28. చిత్తచాంచల్యాన్ని అశ్రద్దను దూరం చేసి శాంతంగా వింటే మనసులకు ఆనందం కలుగుతుంది అని శ్రోతలకు విన్నవించుకుంటున్నాను.29. ఒకసారి సద్భక్తుడైన నానా చందోర్కరు మసీదులో కూర్చుని బాబా చరణాలను ఒత్తుతూ నోటిలో గీతను వల్లించుకుంటున్నాడు.30. భగవద్గీతలోని చతుర్థాధ్యాయాన్ని వల్లించుకుంటూ చేతులతో సాయిపాదాలను ఒత్తుతుండగా జరిగిన చిత్రాన్ని వినండి.31. సాయి సమర్థునికి భూత భవిష్యవర్తమానాలలో సర్వం తెలుసు. నానాకు గీతార్థాన్ని బోధించాలని వారి మనసుకు తోచింది.32. జ్ఞానం, కర్మ సన్యాసం మరియు బ్రహ్మార్పణ యోగం గురించిన అధ్యాయాలను నానా అస్పష్టంగా గొణుక్కోవటం బాబా ప్రశ్నకు కారణమైంది. 33. 'సర్వం కర్మ అఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే' అనే ముప్పదిమూడవ శ్లోకం ముగిసి 'తద్విద్ధి ప్రణిపాత' అన్న శ్లోకాన్ని చెప్పుకుంటున్నాడు.34. ముప్పై నాలుగవ శ్లోకం వద్ద అతని పఠన ఆగింది. నానాను ప్రశ్నించి అతనికి

తమ బోధ అర్థమయేలా చేయాలని బాబాకు అనిపించింది.35.'నానా! ఏమిటి నోటిలోనే గొణుక్కుంటున్నావు? మెల్లగా అనుకుంటున్నది ఏదో నాకు వినిపించేలా స్పష్టంగా చెప్పు'అని అన్నారు.36.వెంటనే నానా బాబా ఆజ్ఞానుసారం శ్లోకం యొక్క నాలుగు చరణాలనూ చెప్పాడు. బాబా ఆశ్లోకానికి అర్థ వివరణను, స్పష్టీకరణను అడిగారు.37.అప్పుడు నానా అత్యంత వినయంగా బద్దాంజలుడై మధురంగా భగవంతుని వచనాలను చెప్పాడు. 38.ఆ సాయి నానా సంవాదాన్ని అందఱికీ విశదపరచటానికి గీతలోని మూలశ్లోకాన్ని పదపదాన్ని వివరిస్తాను. 39.బాబా ప్రశ్నలోని మర్మం మరియు సత్పురుషుల మనోధర్మం తెలియ చేయటానికి, ఏ సంశయం లేకుండా అర్థమవటానికి ఇలా ఉపక్రమించాలి అని అనిపించింది.40.అసలే గీర్వాణభాష కఠినమైనది. సాయికి సులువుగా ఎలా అర్థమయింది? నిగూఢమైన వారి ప్రశ్నలు ఆశ్చర్యకరం. సత్పురుషుల జ్ఞానం అగమ్యం.41.సంస్కృత భాషను ఎప్పుడు అధ్యయనం చేశారు? ఎప్పుడు భగవద్గీతను చదివారో తెలియదు. గీతలోని అంతరార్థాలను బాగా తెలిసిన జ్ఞానిలా ప్రశ్నిస్తున్నారు.42. శ్రోతలు మూలశ్లోకాన్ని తెలుసుకోవాలని మరియు వారిని సమాధాన పరచాలని భగవంతుని వచనాలలోని ప్రతి అక్షరం తెలుపుతున్నాను. ఇవి వివరణలో సహకరిస్తాయి.43.తద్విద్ధి ప్రణి పాతేన పరిప్రశ్నేన సేవయా ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినః తత్వదర్శినఃll 44.ఇది గీతలోని మూలశ్లోకం. దీనిని అనేక టీకాకారులు భాష్యకారులు వ్యాఖ్యానించారు. వారందరిదీ ఒకటే అభిప్రాయం.45.నానా కూడా బాగా శ్రవణం చేసినవాడు. గీతాభాష్యపారంగతుడు. తనకు తెలిసినట్లుగా శ్లోకానికి అర్థం, ప్రతిపదార్థం చెప్పసాగాడు. 46.అన్వయ అర్థాన్ని మనసులో ఆలోచించుకుని నానా రసభరితంగా మధురమైన వాక్కుతో వినయంగా శ్లోకార్థాన్ని మనవి చేయసాగాడు.47'గురువు చరణాలకు సాష్టాంగప్రణామం చేసి, గురుసేవకు జీవితాన్ని అంకితం చేసి, గురువును

ఆదరంగా ప్రశ్నించేవారికి జ్ఞానులు జ్ఞానార్థాన్ని ఉపదేశిస్తారు.48.సారాంశం – కరుణామూర్తి అయిన కృష్ణపరమాత్మ అర్జునునితో ప్రేమగా గురువుకు ప్రణామం గురుసేవ ఇవి జ్ఞానసముపార్జనకు సాధనాలు. 49.అర్జునా ! ఈ మార్గంలో తత్వదర్శులైన జ్ఞానులు జ్ఞానప్రాప్తికి నీకు దారి చూపుతారని చెప్పారు. ఇది నాకు తెలిసిన శ్లోకార్థం.50.శంకరభాష్యం, ఆనందగిరి, శంకరానంద, శ్రీధర, మధుసూదన, నీలకంఠ వీరంతా భగవానుని వచనాలకు ఇదే అర్థాన్ని వ్యాఖ్యానించారు.51.సాయి సమర్థులు మొదటి రెండు చరణాల అర్థాన్ని సమ్మతించారు. కాని తరువాతి సగంశ్లోకానికి వారు ఏం అర్థం చెప్పారో వినండి.52.చకోరపక్షుల వంటి ఇతర భక్తులు కూడా సాయి ముఖచంద్రం నుండి రాలే అమృత బిందువులను సేవించాలని ఉత్సుకతతో వచ్చి కూర్చున్నారు.53.బాబా 'నానా! మూడవ చరణాన్ని మరల చక్కగా సరిగ్గా చూడు. జ్ఞానం అనే పదానికి వెనుక అవగ్రహాముంది. దానిని కలిపి అర్థం చూడు.54.నేనేదో విపరీత అర్థాన్ని చెప్పుతున్నానని, అర్థాన్ని అనర్థం చేస్తున్నానని అనుకోకు. పూర్వం చెప్పిన భాష్యం అసత్యమా మరి అని అనుకోకు. నా మాటలు నిరర్థకమని తలవకు.55.జ్ఞానులు మరియు తత్వదర్శులు జ్ఞానాన్ని ఉపదేశిస్తారు అని అన్నావు కదా,అక్కడ జ్ఞానం అని ఉన్నచోట అజ్ఞానం అన్న పదం వేస్తే యదార్థమైన అర్థం నీకు బోధ పడుతుంది.56.జ్ఞానం చెప్పబడే విషయం కాదు. దానిని ఎలా ఉపదేశించగలరు? అసాధ్యం కనుక జ్ఞానమనే శబ్దానికి విరుద్ధమైన శబ్దాన్ని ఉపయోగించి ఆ అనుభవాన్ని తెలుసుకో.57.జ్ఞానమనే పదానికి నీవు చెప్పిన అర్థం విన్నాను. ఆ పదానికి బదులు అజ్ఞానమనే పదం వేస్తే పోయేదేముంది. అజ్ఞానం వాక్కుకు సంబంధించిన విషయం. జ్ఞానం వాక్కుకు అతీతమైన విషయం.58. గర్భానికి చుట్టుకున్న మావివలె, అద్దం మీది ధూళివలె, అగ్నిని కప్పిన బూడిదవలె జ్ఞానాన్ని అజ్ఞానం కప్పి వేస్తుంది.59. అజ్ఞానంతో జ్ఞానం కప్పబడినది అని గీతలో భగవానుడు

చెప్పాడు. అందువలన అజ్ఞానాన్ని తొలగిస్తే స్వభావసిద్ధంగా ఉన్న జ్ఞానం ప్రకాశిస్తుంది.60. నాచుతో కప్పబడ్డ శుద్ధమైన నీరువలె జ్ఞానం స్వతఃసిద్ధంగా ఉంటుంది. నాచును తొలగించిన బుద్ధివుంతునికి శుభ్రమైన నీరు లభిస్తుంది.61. సూర్యచంద్రులు ఎప్పుడూ ప్రకాశవంతంగా ఉంటారు. కాని గ్రహణసమయంలో రాహు కేతులు అడ్డురావటం వలన మన దృష్టికి అవరోధం కలుగుతుంది.62. అది మన దృష్టికి కలిగే అడ్డుగాని సూర్యచంద్రులకు ఏ అడ్డూలేదు. అట్లే జ్ఞానం ఏ అడ్డు లేకుండా స్వస్థానంలో స్వతః సిద్ధంగా ఉంటుంది.63. వస్తువులను కళ్లతో చూచి తెలుసుకునే శక్తి జ్ఞానం. కాని కళ్లకు పొరలు వస్తే అది అజ్ఞానం. దానిని తొలగించటం అవసరం.64. ఆ పొరలను హస్తకౌశలంతో తొలగించి చూడగల శక్తిని ప్రకటం చేయాలి. అలా అజ్ఞానతిమిరాన్ని తొలగించాలి.65. ఈ సకల దృశ్యప్రపంచం అనిర్వచనీయమైన మాయావిజృంభితం. ఇదే అనాది, అవ్యక్తం, అవిద్య; అజ్ఞానవిలసితం కూడా ఇదే.66. ఆత్మస్వరూపజ్ఞానం అనుభవపూర్వకంగా తెలుసుకోవలసిన వస్తువు కాని అది ఉపదేశించగల విషయం కాదు. ప్రణిపాతం, పరిప్రశ్న, సేవ, ఇవే గురుకృపకు సాధనాలు.67. విశ్వం సత్యం అని అనుకోవటం గొప్ప భ్రమ. ఇదే జ్ఞానాన్ని కప్పివేసే అంధకారం. దీనిని ముందు తొలగించు కోవాలి. అప్పుడు బ్రహ్మ ప్రజ్ఞానరూపంలో ప్రకటమౌతాడు.68. ప్రపంచంలోని దుఃఖాలకు మూలకారణం అజ్ఞానం. గురుకృపాంజనం కళ్లలో పడగానే మాయావరణ తొలగిపోయి స్వాభావికమైన జ్ఞానంమిగులుతుంది.69. జ్ఞానం సాధించవలసిన సాధ్యవస్తువు కాదు. అది మొదటి నుండీ స్వయంసిద్ధంగా ఉన్నదే. ఇది ఆగమనిగమాలలో ప్రసిద్ధమైనది. అజ్ఞానం జ్ఞానానికి విరోధం.70. భగవంతుడు భక్తుడు అన్న భేదభావమే విలక్షణమైన అజ్ఞానానికి మూలం. ఆ అజ్ఞానం నిరసనమౌతే పూర్ణజ్ఞానం మిగులుతుంది.71. త్రాటిలో సర్పాన్ని చూడటం, ఇది శుద్ధ ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోలేక

పోవటం. అజ్ఞానం తొలగిపోతే తాడు అన్న జ్ఞానం మిగులుతుంది. 72. లోపల బంగారం పైన మురికి. అంటే మురికి క్రింద ధగధగ మెరుస్తున్న బంగారం ఉంది. అయితే ఆ బంగారం బయటపడటానికి అగ్ని అవసరం. 73. శరీరం పుట్టటానికి మూలకారణం మాయ. శరీరం యొక్క నడవడి ప్రారబ్ధానుసారం. సుఖదుఃఖాలన్నీ అదృష్టంపై ఆధారపడి ఉంటాయి. అందువలన శరీరాభిమానం అజ్ఞానం. 74. నిరభిమానులైన వారికి సుఖదుఃఖాల భాస ఉండదు. నేను అనే అహంకారస్ఫురణ తొలగటమే అజ్ఞాన నిరసనం. 75. స్వస్వరూపాన్ని తెలుసుకోకపోవటమే మాయకు జన్మస్థానం. గురువుయొక్క అనుగ్రహంతో మాయతొలగి ఆత్మ స్వరూప జ్ఞానం సహజంగా బయటపడుతుంది. 76. భగవద్భక్తి లేకుండా వ్యర్థమైన ఇతర సాధనలు ఎందుకు? బ్రహ్మదేవుడు కూడా మాయాధీనంలో ఉంటాడు. అతనిని కూడా మాయనుండి విడిపించేది భక్తియే. 77. బ్రహ్మలోకం ప్రాప్తించినా భక్తిలేకుండా ముక్తిలేదు. అక్కడకూడా భక్తిలేకపోతే మరల జన్మించవలసినదే. 78. అందువలన మాయను తొలగించుకోవటానికి భగవద్భజన ఒక్కటే ఉపాయం. భగవద్భక్తునికి పతన మంటూ ఉండదు. భవబంధనాలూ ఉండవు. 79. మాయ భ్రమ అని జనులంటారు. కాని అది చాలా మాయావి. జ్ఞానులమని అనుకునే వారిని కూడా క్షణక్షణం మాయలో ఇరుక్కునేలా చేస్తుంది. కాని భక్తులు దానిని చిటికెల మీద నాట్యం చేయిస్తారు. 80. జ్ఞానసంపన్నులు మోసపోయే చోట భక్తులు నిలదొక్కుకుంటారు. కారణం భక్తులు ఎల్లప్పుడూ హరిచరణాలకు శరణుజొచ్చి ఉంటారు. కాని జ్ఞానులు తాము జ్ఞానులమన్న అహంభావంతో ఉంటారు. 81. అందువలన మాయను తరించడానికి, ఒక్క సద్గురువుకు అనన్య శరణుజొచ్చి వారి చరణాలను ఆశ్రయిస్తే వెంటనే భవభయం తొలగిపోతుంది. 82. మరణం తప్పని సరిగా వచ్చితీరుతుంది. రానివ్వండి కాని, హరిని విస్మరించరాదు. వారివారి వర్ణాశ్రమాలనుసరించి ఇంద్రియాలతో పనులు

చేస్తున్నా మనసుతో హరిచరణాలను ధ్యానిస్తూ ఉండాలి.83.గుఱ్ఱాలతో కట్టబడిన రథం వలె ఈ శరీరం ఇంద్రియాలతో కట్టబడి ఉంది. మనసు అనే దృఢమైన పగ్గంతో బుద్ధి ఇంద్రియాలను నిగ్రహిస్తుంటుంది.84.సంకల్ప వికల్పాలతో నిండి ఉండే మనసు యథేచ్ఛగా పరుగు తీస్తూ స్వేచ్ఛగా విహరిస్తుంటుంది. బుద్ధి తన నిశ్చయించే శక్తితో పగ్గాన్ని అంటే మనసును నిగ్రహిస్తుంటుంది.85.బుద్ధి వంటి చతురుడైన సారథి నేతవలె రథంలో ఉండగా రథంలోని యజమానికి చింత ఎందుకు? అతడు నిశ్చింతగా వ్యవహరించవచ్చును.86.శరీరానికి సంబంధించిన కార్యాలన్నిటిని చేయించటం బుద్ధి యొక్క కర్తవ్యం. ఇది మనసుకు అలవాటు పడితే అన్ని పనులూ సవ్యంగా జరిగిపోతాయి.87.ఇంద్రియాలు శబ్ద స్పర్శ రూప రసాది విషయాల వెంటపడితే శక్తి వ్యర్థంగా క్షీణించిపోతుంది.ఇక అడుగు అడుగునా పతన భయమే.88.శబ్దస్పర్శరూపరసాది పంచవిషయాలలో ఉన్న సుఖాలన్నీ చివరకు దుఃఖాలే. అజ్ఞానం పరమదుఃఖం.89. శబ్దం అనే విషయానికి మోసపోయి లేడి చివరకు తన ప్రాణాన్ని కోల్పోతుంది. ఏనుగు స్పర్శసుఖాన్ని ఆశించి ఆ ఆకర్షణకు అంకుశపు పోట్లను సహిస్తుంది.90.దీపం యొక్క రూపానికి భ్రమిసి పురుగు శరీరాన్ని కాల్చుకుంటుంది.జిహ్వాతో రస సుఖాన్ని అనుభవించాలనుకున్న చేప వెంటనే ప్రాణం విడుస్తుంది.91.సువాసన కోసం తుమ్మెద కమలంలో ఇరుక్కుపోతుంది. ఒక్కొక్క విషయసుఖంలో ఇంత ఘోరమైన ఆపద ఉంటే ఇక అయిదూ కూడినప్పుడు ఎంత భయంకరం.92.ఇది జంతువులూ, జలచరాలూ పక్షులూ వీని దుస్థితి.ఇదంతా చూచినా జ్ఞానమున్న మానవులు కూడా విషయోన్ముఖులౌతారు.ఇంతకంటే అజ్ఞానం ఏముంటుంది?93.అజ్ఞానం నశించి విషయాల పట్ల విముఖత ఏర్పడినప్పుడు మనసుకు శాంతి సంతోషం కలుగుతాయి.జీవుడు ఆత్మ జ్ఞానస్వరూపానికి అంతర్ముఖుడైనప్పుడు అత్యంత ఆనందం కలుగుతుంది.94.కనుక

చిత్తంతో హరిని గురువును ధ్యానం చేయండి. శ్రవణాలతో చరిత్ర శ్రవణం చేయండి. మనసుతో ధ్యానానుసంధానాలు చేయండి. జిహ్వాతో నామస్మరణ చేయండి .95.పాదాలతో హరియొక్క గురువు యొక్క ప్రదేశాలకు వెళ్లండి. ముక్కుతో గురువు యొక్క నిర్మాల్యాలను వాసన చూడండి. చేతులతో వారి చరణాలకు నమస్కరించండి. కళ్లతో వారిని దర్శించుకోండి. 96.ఈ విధంగా ఇంద్రియ వృత్తులన్నీ ప్రేమగా గురువు కొరకు వినియోగించే భక్తుల స్థితి ధన్యం. భగవద్భక్తి అంటే వేరే ఏముంది?97.సారాంశం – అజ్ఞానాన్ని వ్రేళ్లతోసహా త్రవ్వేస్తే మిగిలేది సిద్ధంగా ఉన్న జ్ఞానమే అని తెలుసుకో అని శ్రీకృష్ణపరమాత్మ అర్జునునికి ఈ శ్లోకం అంతరార్థాన్ని సూచించారు'98.అసలే నానా వినయ సంపన్నుడు. మధురమైన ఈ వాఖ్యను విని బాబా పాదాలకు సాష్టాంగ ప్రణామం చేసి రెండు చేతులతో వందనం చేశాడు.99.తరువాత భక్తి శ్రద్ధలతో,'బాబా! నాకు చక్కగా శిక్షణనిచ్చి నా అజ్ఞానాన్ని పారద్రోలండి. నా దురభిమానాన్ని శిక్షించండి' అని ప్రార్థించాడు.100.సాత్వికగుణాలు పైపైకి కనిపిస్తున్నా అంతరంగంలో అనేక వికల్పాలుండి ఒక క్షణమైనా అవమానాన్ని సహించలేము. అజ్ఞానం అంటే వేరే ఏముంది?101.మనసులో కీర్తి ప్రతిష్ఠల యందు కోరిక, పైకి ధ్యానం చేస్తున్నట్లు నాటకం,కామక్రోధాలు లోపల రగులుతుంటే అంతకంటే అజ్ఞానం వేరే ఏముంటుంది?102.మనసులో చెడు కర్మల ఆలోచనలు హీనమైన ఆచారం ఉండి భ్రష్ట ఆలోచనలు ఉండి పైకి బ్రహ్మనిష్ఠనివలె ఊరేగటం.స్పష్టంగా చెప్పాలంటే ఇంతకంటే అజ్ఞానం వేరే ఏమిటి?103.బాబా! మీరు దయామయులు. మీ కృపాజలసించనంతో ఈ అజ్ఞానపు దావానలాన్ని ఆర్పివేయండి. అప్పుడే నేను ధన్యుణ్ణి అవుతాను.104.నాకు జ్ఞానవిషయాల చర్చ అవసరంలేదు. నా అజ్ఞానాన్ని తొలగించి నాపై కృపాదృష్టిని ఉంచితే చాలు. నాకు అదే సుఖ సంతుష్టి'105.కరుణాఘనులు ప్రేమమయులైన సాయిబాబా నానాను

నిమిత్తమాత్రునిగా చేసి, మీకు,మాకు,మన అందఱికీ గీతార్థప్రవచనాన్ని చేశారు.106.గీత భగవానుని వచనం. కనుక అది ప్రత్యక్షశాస్త్రం.త్రికాలాలలో కూడా ప్రమాణం.ఇది ఎప్పుడూ అవమానింపబడకూడదు.107.నిజమైన జీవన్ముక్తునికి మరియు అత్యంత విషయలోలునకు ఈ ఉభయులకూ శాస్త్రార్థాలు అవసరంలేదు. ఇవి ముముక్షువుల ప్రీతి కోసం.108.విషయసుఖాలలో బాగా చిక్కుకుని పోయాను.నేను ఎప్పుడు ముక్తిని పొందుతాను అని తలచే ముముక్షువులను తరింపచేయటానికి ఈ శాస్త్రాలు.109.ఇటువంటి భక్తుని చూసి సత్పురుషులకు కరుణ కలిగి అప్పుడు ఏదో కారణంతో భక్తులకు అర్థమయేలా బోధ చేస్తారు.110.గురువు లేదా భగవంతుడు ఎప్పుడూ భక్తుల అధీనంలో ఉంటారు. భక్తులను ఉద్ధరించాలనే సంకల్పంతో వారు కష్టాలను సహిస్తారు.111.ఇప్పుడు సాయి యొక్క మరొక చిన్న పద్దతిని చెప్తాను. వారు కొన్ని వ్యవహారాలను ఎవరికీ తెలియకుండా చేస్తారు.112.చిన్న పనైనా పెద్దదైనా నిజమైన కారణం ఎప్పుడూ తెలిసేది కాదు.కాని చెప్పకుండానే ఎప్పుడూ ఆ కార్యం మాత్రం క్రమక్రమంగా జరిగేది.113.కొన్ని పనులు సహజంగా ఉపక్రమింపబడేవి. కాని వానికి మూలకారణం గాని పేరుగాని నిర్దేశింపబడి ఉండేవి కావు. పైగా పైకి అవి సంభ్రమాన్ని కలగచేస్తాయి.114.ఉరిమే మేఘాలు వర్షిస్తాయా?చెప్పేవారు చేస్తారా? అని రూఢిలో ఉన్న ఈ నానుడిని బాబా ప్రత్యక్షంగా అనుభవంలో చూపించేవారు.115.వారు పరోపకారం కోసమే జగత్తులో అవతరించారు.సంకల్పించిన కార్యం సమాప్తి కాగానే చివరకు అవ్యక్తంలో కలిసిపోతారు.116.మనం ఎక్కడి నుండి వచ్చాం? ఎక్కడికి వెడతాం?ఎందుకొఅకు మనం సృష్టింపబడ్డాం?ఈ జన్మ యొక్క ప్రయోజనమేమిటి? అన్న ప్రశ్నలకు మూల కారణాలు మనకు తెలియవు.117. స్వచ్ఛందంగా జీవితాన్ని గడిపివేస్తాం. తరువాత మరణకాలం సమీపిస్తుంది. ఇంద్రియాలు బలహీనమైపోయినా మంచి ఆలోచనలు కలుగవు.118.తల్లి,

భార్యా బిడ్డలు, బంధువులు, ఇష్టులు, ప్రియులు, మిత్రులు, స్వజనులందరూ శరీరాన్ని త్యజించటం మన కళ్లతో చూస్తాం.అయినా మన మనసులలో మంచి ఆలోచనలు కలగవు.119.సత్పురుషులు అలా కాదు. వారు అత్యంత జాగరూకతతో ఉంటారు. వారికి తమ అంతిమ సమయం, తమ నిర్వాణం గురించి సంపూర్ణ జ్ఞానం ఉంటుంది. 120.శరీరంతో ఉన్నప్పుడు ఎంతో ప్రేమతో భక్తుల కొఱకు తమ శరీరాన్ని అరగదీస్తారు. శరీరాన్ని త్యజించిన తరువాత కూడా, తమ స్థలాన్ని భక్తుల శ్రేయస్సు కొఱకు వినియోగిస్తారు.121. తమ శరీరాన్ని త్యజించక ముందే కొందఱు తమ శరీరాన్ని విశ్రమింప చేయటానికి నిశ్చితమైన ప్రదేశంలో తమ సమాధిని నిర్మింప చేసుకుంటారు.122.సాయిబాబా అట్లే చేశారు.కాని మొదట అది ఎవరికీ తెలియలేదు. సమాధి మందిరాన్ని ముందే కట్టించుకున్నారు.వారిలీల అద్భుతం.123.బాబా తమ సమాధి మందిరాన్ని నాగపూర్ నివాసి అయిన బాపూ సాహేబు బుట్టి అనే పేరుగల గొప్ప శ్రీమంతుని ద్వారా కట్టించుకున్నారు.124.పరమ భక్తుడైన బాపూసాహేబు ఎల్లప్పుడూ సాయి చరణాలలో అనురక్తుడై ఉండేవాడు.బాబాసేవ కొఱకు తన కుటుంబ సమేతంగా వచ్చి శిరిడీలో ఉన్నాడు.125.సాయిచరణాల పైని భక్తితో శిరిడీలోనే ఉన్నాడు.తరువాత కూడా సాయికి అంకితమైపోయి, శిరిడీలోనే ఉండాలనిపించింది.126.శిరిడీలో స్థలం కొని ఒక చిన్న బంగళాను నిర్మించుకుని అక్కడ స్వతంత్రంగా నివసించాలని, అతనికి ఆలోచన కలిగింది.127.ఇక్కడ నాటిన మూల బీజం యొక్క వృక్షం ఈ నాటి సమాధిమందిరం. ఇది భక్తుల పట్ల సాయిమహారాజుకు ఉన్న ప్రేమకు స్మారకం.128. ఇది ఏ విధంగా మొదలై ఎలా ఎలా నిర్మింపబడి ఈ ఆకారాన్ని దాల్చింది అన్న విషయాలను ఆలకించండి.129. బాపూసాహేబు బుట్టి మనసులో బంగళా గురించిన ఆలోచనతో దీక్షితువి ఇంటి మేడపై నిద్రిస్తుండగా ఒక చక్కటి దృష్టాంతం

కలిగింది.130.అక్కడే ఒక పరుపుపైన మాధవరావు నిద్రిస్తుండగా అతనికి కూడా అదే దృష్టాంతం కలగటంతో ఆ ఇద్దరికీ చాలా ఆశ్చర్యం కలిగింది.131.బాపూసాహేబు స్వప్నంలో బాబా, 'నువ్వు నీ బంగళాను మందిరంతో సహా కట్టించు' అని అతనికి ఆజ్ఞాపించారు.132.ఆ దృష్టాంతం కలగగానే బాపూసాహేబు తక్షణం నిద్ర మేల్కొని ప్రక్కపైన కూర్చుని మొత్తం కలను గుర్తు తెచ్చుకోసాగాడు.133.ఇక్కడ ఇలా ఉండగా మాధవరావు ఏడవటం వినిపించింది. బుట్టీ సాహేబు గట్టిగా కేకవేసి పిలిచేసరికి అతని నిద్ర మాయమైంది.134.'నీవు ఎందుకు ఏడుస్తున్నావు?'అని మాధవరావును అడగగా, శ్రీవారి ప్రేమమయమైన పలుకులు విని నాలో ప్రేమ ఉప్పొంగింది.135. కళ్లనుండి బాష్పాలు రాలాయి. కంఠం గద్గదమైంది. ఆపుకుందామన్నా ఆగకుండా ప్రేమ కన్నీళ్ల ద్వారా బయటికి వచ్చింది.136.బాబా నా వద్దకు వచ్చి భవనం మరియు దేవాలయం నిర్మాణం కానీ నేను అందఱి అభీష్టాలను తీరుస్తాను. అని నాతో స్పష్టంగా చెప్పారు అని చెప్పాడు.137.బాపుసాహేబు తనలో ఆశ్చర్యపోయాడు. ఇద్దరికీ ఒకే దృష్టాంతం. మనసులోని సందేహం తీరింది. ఇక కార్యం మొదలు పెట్టాలని నిశ్చయించుకున్నాడు.138.బుట్టి ఆగర్భశ్రీమంతుడు. భవనం మరియు దేవాలయం కూడా నిర్మించగల సమర్థుడు. మాధవరావు కేవలం సుఖంగా బ్రతికేవాడు.ఆ ఉభయులకూ ఒకే దృష్టాంతం.139.ఇద్దఱి స్వప్నాలు ఒక్కటే.వారికి పరమానందం కలిగింది.వెంటనే బుట్టి భవనం ఇలా ఇలా నిర్మించాలని రూపురేఖలను నిశ్చయించగా, కాకా దీక్షితు దానిని ఆమోదించాడు.140.మరునాడు ఉదయం ఆ ముగ్గురూ బాబా వద్ద ఉండగా, బాబా ప్రేమగా శ్యామా ముఖాన్ని చూడసాగారు.141.శ్యామ, 'దేవా! ఏమిటి నీ ఈ లీల అర్థం కాదు. మమ్మల్ని ప్రశాంతంగా నిద్ర కూడా పోనీయవు. నిద్రలో కూడా మమ్మల్ని ఊరికే ఉండనివ్వవు'అని అన్నాడు.142.శామా మాటను విని బాబా తమ

చెవులపై చేతులుంచి, 'మేము మా స్థలంలోనే ఉంటే ఎవరో ఏదేదో అంటారు' అని అన్నారు.143.బుట్టి వగైరా నిశ్చయించిన ప్లానును బాబా ఆమోదానికి చూపించగా, బాబా వెంటనే మందిరం, భవనం నిర్మించడానికి అనుమతిని ఇచ్చారు.144.మాధవరావు నడుం బిగించాడు.నేల క్రింద భూగృహం తయారైంది. అతని చేతులతో బావి కూడా తయారైంది. ఇంతవరకు పని జరిగింది.145.లెండీకి వెళ్లేటప్పుడు లేదా అక్కడినుండి తిరిగి వచ్చేటప్పుడు కిటికీలు ద్వారాలూ బిగించేటప్పుడు బాబా ఉత్సుకతతో తిలకించేవారు.146.తమ చూపుడు వ్రేలితో చూపిస్తూ ఇక్కడ ద్వారం, ఇక్కడ కిటికి, ఇక్కడ తూర్పు దిక్కున గ్యాలరి ఉంటే చక్కగా అందంగా ఉంటుంది అని చెప్పేవారు.147.తరువాత కార్యకారణనిమిత్తంగా మిగతా పని బాపూసాహేబుజోగ్ ద్వారా జరగవలసి ఉండటం వలన పనిని అతనికి అప్పచెప్పారు.148.అలా పని జరుగుతున్నప్పుడు ఈ భవనంలోనే ఒక గర్భగుడిని నిర్మిస్తే మురళీధరుణ్ణి స్థాపించవచ్చు అని బుట్టి మనసుకు స్ఫురించింది.149. అతనికి సంకల్పం కలిగింది కాని బాబా అభీష్టాన్ని తెలుసుకోకుండా, గురువర్యుని ఆజ్ఞలేకుండా బుట్టీ ఏకార్యాన్నీ ఆరంభించడు.150.ఇది అతని నిత్య నియమం. బాబా ఆజ్ఞ చాల ముఖ్యం. వారి అనుమతి లేకుండా ఒక్క పనైనా ఆరంభింపబడదు.151.మధ్య మరో హాలు ఎందుకు? దాని అవసరమేముంది? రెండువైపులా గోడలు లేపి మురళీధరుని స్థాపన చేయవచ్చు. 152.హాలును దేవాలయంగా రూపొందించాలని బాపూసాహేబు కోరిక. కాని బాబా అనుమతిని ఇస్తేనే నిస్సంశయంగా అలా చేయొచ్చు.153.అని ఆలోచించి మాధవరావుతో, 'నీవు బాబా అభిప్రాయాన్ని తెలుసుకుంటే, వారికి నచ్చిన విధంగానే చేద్దాం' అని చెప్పాడు.154.బాబా వాహ్యాళికివెడుతూ భవనానికి సమీపంగా వచ్చి నిలచినప్పుడు శ్యామ్‌రావ్ ఏమని అడిగాడు అంటే,155.'దేవా! హాలులో రెండు గోడలు లేపి అక్కడ ప్రీతితో మురళీధరుడైన కృష్ణమూర్తిని

స్థాపిద్దామని బాపుసాహేబు అంటున్నాడు.156.మధ్య భాగంలో నలుచదరంగా అరుగును నిర్మించి అక్కడ ఒక సింహాసనాన్ని అమర్చి దానిపైన మురళీధరుడు విరాజమానుడైతే శోభాయమానంగా ఉంటుంది.157.అని బాపుసాహేబు ఆలోచన.మరి మీ అనుమతి అవసరం. ఆవిధంగా దేవాలయం భవనం రెండూ వెంటనే ఒకేసారి తయారౌతాయి''.158.శ్యామా మాటలను విని బాబా సంతోషంగా సరే అన్నారు.'దేవాలయం పూర్తయాక మనమే ఇక్కడ ఉండటానికి వస్తాం.'159.బాబా బంగళావైపు దృష్టి సారించి,'బంగళా పూర్తి అయాక మనకోసమే ఉంచుకుందాం.160.మనమందరమూ ఇక్కడే మాట్లాడుకుందాం. పరస్పరం ప్రేమగా కౌగలించుకుని ఆడుకుందాం. సుఖంగా ఆనందాన్ని అనుభవిద్దాం' అని చెప్పారు.161.అప్పుడు మాధవరావు శ్రీసాయితో,'మీ అనుమతి నిశ్చయమైతే దేవా! పునాదికి ముహూర్తం పెట్టనా?162. దేవా! ఈ సమయం మంచిదేనా?కొబ్బరికాయను తెచ్చి కొట్టనా' అని అడిగాడు. 'కొట్టు కొట్టు' అని బాబా చెప్పగానే వెంటనే కొబ్బరికాయను తెచ్చి కొట్టాడు. 163.ఆ తరువాత గర్భగుడి, మురళీధరునికి నలుచదరం అరుగు తయారయ్యాయి. విగ్రహాన్ని తయారు చేయటానికి ఒక శిల్పికి పని అప్పచెప్పారు కూడా.164. కాని తరువాత బాబాకు అంతిమ సమయం ఆసన్నమవగా చాలా బాధ కలిగింది.భక్తులు లోలోపల కుమిలిపోయారు.165.బాపూసాహేబు మనసులో దుఃఖించసాగాడు. ఇక ముందు ఈ భవనం ఏమౌతుందో, దీనికి ఏ స్థితి పట్టనుందో ఏం తెలియటం లేదని అతనికి చింత పట్టుకుంది.166.లక్షరూపాయలు ఖర్చు అయ్యాయి. చివరకు ఏమౌతుందో, మందిరంలో బాబా పాదాలు మోపుతారా?167.బాబా శరీరాన్ని త్యజిస్తే ఇక ఈ భవనమెందుకు మందిరం ఎందుకు? మురళీధరుడెందుకు? అని బుట్టీకి దుఃఖం.168.కాని తరువాత

కర్మ ధర్మ సంయోగం వలన, భవనం యొక్క భాగ్యం వలన బాబా స్వయంగా చెప్పినట్లుగా అందఱి కోరిక తీరింది.169.తమ అంతిమసమయంలో 'నన్ను వాడాలో ఉంచండి' అని పలికిన బాబా నోటినుండి వెడలిన వచనంతో అందఱి మనసులు తేలిక పడ్డాయి.170.అటు తరువాత సాయిబాబా యొక్క పవిత్ర శరీరం గర్భగుడిలో స్థాపింపబడింది. ఆ భవనం సమాధిమందిరమైంది. సాయి యొక్క చరిత్ర అగాధం.171. బుట్టీ యొక్క భాగ్యం ధన్యం. స్వశక్తితో నిర్మించిన అతని భవనంలో పావననామాన్ని కలిగిన శ్రీసాయిబాబా శరీరం విశ్రమించటం అతని మహా భాగ్యం.172.పావనమైన ఇటువంటి కథను విని శ్రోతలు సుఖాలను పొందుతారు. హేమాడు సాయినాథునికి శరణుజొచ్చి, ఒక్క క్షణమైనా వారి చరణాలను విడువడు.173.ఇష్టమైన అయిష్టమైన అనుభవాలు సంభవిస్తుంటాయి. సాయిసమర్థుల ఉపదేశాల ననుసరించి ప్రవర్తిస్తూ వారిని సంతుష్ట పరిచితే శుభాలు నిశ్చయంగా కలుగుతాయి.174.కథ,వక్త,కథనం సాయిసమర్థులే అయినప్పుడు, హేమాడు ఎవరు? ఊరికే పేరుకు మాత్రమే.175.తరువాత ఎలా ప్రేరణ కలిగితే అలా కథ వినిపించబడుతుంది.ఆ సమయానికి రచింపబడేదాని గురించిన ఆలోచన ఇవాళ ఎందుకు?176.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో గీతావిశిష్ట శ్లోకార్థ నివేదనం మరియు సమాధిమందిర నిర్మాణమను ముప్పది తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత - 40 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

శ్రీసాయి సమర్థులు ధన్యులు. వారు భక్తులకు ఈ గ్రంథ రూపంలో స్వార్థాన్ని పరమార్థాన్ని బోధించి, వారిని కృతార్థులను చేసి తమ కార్యాన్ని సాధించుకున్నారు.1.వారు శిరసుపై చేయి వేసి తక్షణం శక్తిపాతం చేస్తారు. తద్వారా అలభ్యమైన ఆత్మవస్తువును ప్రాప్తింపచేసి భేదభావాన్ని తొలగిస్తారు.2.నీ నా అనే భేదబుద్ధి లేకుండా, వారికి అనన్య శరణుజొచ్చి సాష్టాంగ నమస్కారం చేస్తే వారు తమ హృదయానికి హత్తుకుని ఆలింగనం చేసుకుంటారు.3.నది సముద్రం పేరుకు వేరువేరుగా ఉన్నా అవి ఒక్కటే రూపాన్ని కలిగి ఉంటాయి. వర్షాకాలంలో రెండూ కలిసిపోతే ఇక వాని భిన్నత్వం మిగలదు.4.అట్లే భక్తిభావంతో సద్గురు సాయినాథునికి అనన్యశరణు జొచ్చితే వారు భక్తుల భక్తిని గమనించి తమ శక్తిని ప్రసాదిస్తారు.5.జయజయదీన దయాళూ! భక్తులను ఉద్ధరించే పరమ ప్రేమమయా! మీరు అఖిల బ్రహ్మాండాన్ని వ్యాపించి ఉన్నా విశేషంగా శిరిడీలో ఉంటున్నారు.6.నేలపై తిరగలిని ఉంచి,కాళ్లు చాపుకుని తిరగలి పిడిని గట్టిగా బిగించి, ధాన్యం గింజలను విసురుతున్న సత్పురుషుని చూచి నా మనసు ఆశ్చర్యానికి లోనైంది.7.అదే ఈ గ్రంథానికి మూలకారణం. పాతకాలను దహించివేసే వారి లీలలను వర్ణించాలని నాకు ప్రబలమైన సంకల్పం కలిగింది.8.నారాయణుడు స్వయంగా ప్రసన్నమౌతాడు. ఎందుకంటే నారాయణునికి తనమీది కంటే భక్తునిపై ప్రేమ. కనుక తన భక్తుని ఎవరైనా కీర్తించటం లేదా, అతని గుణాలను

వర్ణించటం ఇష్టం.9.ఈ మాట నిరాధారమని సజ్జనులైన శ్రోతలకు సందేహం కలుగవచ్చు. అలా అనుమానం కలిగితే భవిష్యోత్తర పురాణంలో త్రిపురారి చెప్పినదానిని గమనించండి.10.ఇదంతా సాయి యొక్క ప్రేరణే అయినా లౌకిక రీతిని పాటించటానికి భక్తుల శ్రేయస్సు కొఱకు ఈ రచనను ఆమోదించారు.11.అప్పటి నుండి శ్రీసాయిలీల మాస పత్రికలో నెలనెలా సాయిసమర్థుని కథలను శ్రోతలు చాలా ప్రేమతో పఠించారు.12. ఈ కథలను ఆమోదించేవారు సాయియే. వారే నా బుద్ధిదాత. మూల చైతన్యాన్ని ప్రేరేపించేది వారే. వారి కథలను వారే చెప్తారు. 13.ఈ హేమాడు తన బుద్ధితో వ్రాస్తున్నాడని పొరపాటుగానైనా తలవవద్దని, గుణదోషాలు నా కంటగట్టవద్దని శ్రోతలకు విన్నవించుకుంటున్నాను.14.మంచి గుణాలు ఉన్నా సాయివే. దోషాలు కనిపించినా వారివే.నేను సాయి చేతిలోని సూత్రం ఆడించినట్లు ఆడే బొమ్మను మాత్రమే.15.సూత్రధారి తన చేతిలోని సూత్రంతో, అనేకరకాల చిత్రవిచిత్రమైన రంగురంగుల దృశ్యాలను కథకు అనుగుణంగా ఆడిస్తారు.16. ఇక ఈ ప్రస్తావన చాలిస్తాను. క్రొత్త కథావిశేషమేమిటా అని శ్రోతలు ఉత్సుకతతో ఉన్నారు కదూ! ఇప్పుడు గురువు మరియు వారి భక్తుల మహిమను గానం చేస్తాను.17.గతాధ్యాయాన్ని ముగించేటప్పుడు తరువాతి అధ్యాయంలో స్మరణకు వచ్చిన దానిని చెప్తానని అన్నాను.అట్లే ఇప్పుడు స్ఫురించినదానిని వినండి.18.మధురమైన ఈ కథను శ్రోతలు శ్రద్ధగా ఆలకించాలి. భక్తులు ప్రేమగా భోజనం పెడితే సాయికి సంతోషం.19.కన్నతల్లికి పసిబిడ్డలపై ప్రేమ.అట్లే భక్తులకు సాయి ప్రత్యక్ష కన్నతల్లి.వారు ఎక్కడున్నా సరే పరుగున వస్తారు. వారి ఋణాన్ని ఎవరు తీర్చుకోగలరు?20.శరీరంతో శిరిడీలో వ్యవహరిస్తున్నా వారు త్రిలోకాలలో సంచరిస్తుంటారు. ఈ విషయంలోని మధుర వృత్తాంతాన్ని ప్రశాంతంగా వినండి. 21.సాయిపాదాలయందు నిష్ఠగల భక్తశ్రేష్ఠుడు బాలా సాహేబు దేవు.

అతని తల్లి అందరికి శుభం కలగాలని నిష్ఠగా వ్రతాలను ఆచరించేది. 22. ఆమె అనేక వ్రతాలను ఆచరించింది. కాని వ్రత సమాప్తికి ఉద్యాపన మిగిలిపోయింది. 23. వ్రతాలన్నీ ముగిశాక ఉద్యాపన చేయాలి, లేకపోతే అసంపూర్తిగా చేసిన వ్రతానికి పుణ్యం కలగదు. 24. వ్రతాలు పాతిక ముప్పై ఉంటాయి. వీని ఉద్యాపనకు దేవు వంద్రెండు వందల బ్రాహ్మణులను భోజనానికి ఆహ్వానించాడు. 25. ఉద్యాపనకు ఒక తిథిని నిర్ణయించుకుని, ఈ ఉద్యాపనకు రమ్మని బాబాను ప్రార్థించమని జోగ్‌కు ఉత్తరం వ్రాశాడు. 26. మీరు రాకపోతే ఈ ఉద్యాపన పూర్తికాదు, ఈ నా ప్రార్థనను మన్నిస్తే ఈ దీనుడు కృతజ్ఞుడై ఉంటాడు. 27. నేను ప్రభుత్వోద్యోగిని. పొట్టకోసం నౌకరి చేసుకుంటూ పరమార్థాన్ని కూడా సాధించు కోవాలని నా తపన. మీకు ఇదంతా తెలుసు. 28. డహాణు నుండి అక్కడికి అంతదూరానికి స్వయంగా రాలేని నిస్సహాయుణ్ణి. కనుక మీరు నాఈ ఆహ్వానాన్ని స్వీకరిస్తారని నా నమ్మకం. 29. బాపూసాహేబు జోగ్ ఆ ఉత్తరాన్ని మొత్తం బాబాకు చదివి వినిపించాడు. ఆ కార్యాన్ని చక్కగా దేవు పూర్తి చేసేలా చూడండి అని జోగ్ ప్రార్థించాడు. 30. నిర్మలమైన మనసుతో పంపిన ఆ ఆహ్వానాన్ని బాబా పూర్తిగా విన్నారు. 'నా స్మరణ చేసేవారిని నేనెప్పుడూ గుర్తుంచుకుంటాను. 31. నాకు గుఱ్ఱం గాని రైలు బండిగాని విమానం గాని అవసరం లేదు, నన్ను ప్రేమగా పిలిస్తే చాలు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణం ప్రకటమౌతాను. 32. నీవు నేను ముగ్గురం కలిసి వస్తామని, అతనికి ఉత్తరం వ్రాయి. సంతోషిస్తాడు' అని చెప్పారు. 33. బాబా చెప్పినదంతటినీ జోగ్ దేవుకు తెలియ చేశాడు. బాబా మాటకు తిరుగు లేదని, అది అమోఘమని దేవు ఆనందించాడు. 34. బాబా తప్పక వస్తారని దేవుకు పూర్తి విశ్వాసం. అయితే అది అనుభవానికి వచ్చే ఆరోజు సువర్ణదినం. 35. బాబా ఎప్పుడూ శిరిడీ లోనే ఉంటారు. మూడు గ్రామాలకు మాత్రమే ఎప్పుడో అరుదుగా వెళ్లుతుంటారు. అని కూడా దేవుకు

తెలుసు. 36.వారికి బుద్ధి పుట్టినప్పుడు ఏ ఆరుమాసాలకో ఎప్పుడో, రహతా, రుయా లేక నీంగాంకు మాత్రమే వెళ్తారు. ఎప్పుడూ శిరిడీలోనే ఉంటారు.37.ఈ మూడు గ్రామాలు దాటి ఎవరివద్దకూ ఎప్పుడూ వెళ్లరు. డహాణులో ఇంత దూరాన ఉన్న నా వద్దకు ఎలా వస్తారు?38.బాబా పూర్ణలీలావతారి. ఇచ్ఛామాత్రంతో స్వచ్ఛందంగా వెళ్ళగలరు. వారి రాకపోకలు లోకాచారం కొరకు అంతే.వారు అంతటా పరిపూర్ణంగా వ్యాపించి ఉన్నారు. 39.వారు అక్కడి నుండి ఇక్కడికి రావటం ఇక్కడినుండి అక్కడికి వెళ్ళటం రెండూ ఆకాశానికి కూడా తెలియదు. ఎందుకంటే వారు సంపూర్ణంగా అంతటా లోపలా బయటా వ్యాపించి ఉన్నారు.40. బాబా యొక్క కదలికలు అగోచరం. స్థిరచరాలలో నిండియున్నవారికి రాకపోకలు ఎక్కడివి? స్వచ్ఛందంగా వారు ఎక్కడైనా ప్రకటమౌతారు. 41.ఉద్యాపనకు సుమారు ఒక నెలముందు ఒక సన్యాసి డహాణు రైల్వే స్టేషను మాస్టరు వద్దకు తన పని మీద వచ్చాడు.42.అతడు గోశాల ప్రచారకుడు. గోవుల సంస్థలో స్వయం సేవకుడు. ఆ సంస్థ యొక్క ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచటానికి చందాలకోసం వచ్చాడు.43.ఆతని వేషాన్ని బట్టి బెంగాలీ వ్యక్తి వలె ఉన్నాడు. స్టేషను మాస్టరు అతనితో ఊరిలోనికి వెడితే అక్కడ మీకు మంచి ఏర్పాట్లు ఉంటాయి అని చెప్పాడు.44. అక్కడున్న మామలేదారుతో మీ అభిప్రాయాన్ని చెప్పితే సేట్లు షావుకార్లు కలిసి సహాయపడతారు.45.మామలేదార్ ఒక్కణ్ణి పట్టుకుంటే చాలు. ఈ ధర్మకార్యానికి అనేక మంది చందాలు ఇచ్చి సహాయపడతారు. మీరు నిశ్చింతగా వెళ్ళండి అని ఉపాయం చెప్పాడు.46.అలా స్టేషను మాస్టరు లోపల చెప్పుతున్నప్పుడు బయట గుఱ్ఱం కాలిడెక్కల చప్పుడైంది. మామలేదారే స్వయంగా అక్కడికి వచ్చి స్టేషను లోపలికి వెళ్లాడు. 47.స్టేషను మాస్టరును కలుసుకోవటానికి గదిలోనికి ప్రవేశించాడు. సన్యాసితో ఇదిగో మామలేదారు ఇక్కడికే వచ్చాడు.48.మీరు అతడితో ఇప్పుడు ఏం చెప్పదలచుకున్నారో చెప్పండి. దైవవశాత్తు

మికు ఇక్కడే కలిశాడు.అని మాస్టరు చెప్పాడు. సన్యాసి తను వచ్చిన విషయాన్ని మామలేదారుతో మనవి చేశాడు.49.తరువాత ఆ యిద్దఱూ బయటికి వచ్చి అక్కడే ఒక పెట్టె పైన కూర్చున్నారు.సన్యాసి అతనితో 'ఈ కార్యాన్ని మీరే ఎలా అయినా సాధించాలి.50.గోరక్షణ ధర్మ కార్యం. మీరు స్వయంగా పూనుకుంటే తప్ప పరాయి మనిషినైన నాతో ఈ పని అసలు ఏమాత్రమైనా అవుతుందా?51.మీరు తాలుకాకు అధికారి. నేను బికారిని. గోవుల క్షుద్బాధను నివారించటానికి ప్రజల ఇళ్ళకు గడపగడపకూ తిరిగే వాణ్ణి. 52.మీరు సిఫారసుగా ఒక్కమాట చెప్పితే నా పని త్వరగా అవుతుంది. మీకు గోమాత ఆశీర్వాదం కీర్తి ప్రతిష్ఠలూ లభిస్తాయి' అని వేడుకున్నాడు.53.సన్యాసి ప్రార్థనలను విని మామలేదారైన దేవు అతనితో, 'ఊరిలో ప్రస్తుతం వేరే పనికోసం చందాల వసూళ్లకు పూనుకున్నాం.54.దీనులపై దయగల రావుసాహెబు నరోత్తమ సేటు తెలివిగలవాడు. ఇప్పుడే ఎంతోకష్టపడి ఒక జాబితాను తయారుచేస్తున్నాడు.55.ఇక మీ చందాలకు అవకాశం ఎక్కడుంది చెప్పండి? ఈ సమయం మీకు ఉపయోగకరం కాదు.తరువాత చూద్దాం.56. మీరు మూడునాలుగు నెలలు ఆగి ఈ ఊరికి రండి. అప్పుడు చూద్దాం.ఇప్పుడు అసలు లాభంలేదు.'అని చెప్పాడు.57.సన్యాసి అక్కడినుండి వెళ్లిపోయాడు.ఒక మాసం గడిచాక కాబోలు అతడు టాంగా బండిలో మరల డహోణుకు వచ్చాడు. 58.దేవు ఇంటి ఎదురుగా వకీలు పరాంజపే ఇల్లు.అక్కడే టాంగాను ఆపి దిగాడు. సన్యాసి బండి దిగటం దేవు చూచాడు.59.మునుపు చందాల కోసం వచ్చిన మనిషే సమయాని కంటే ముందుగానే వచ్చాడు అని అనుమానించి దేవు కొడుకుతో చెప్పాడు. 60. ఒకనెల అన్నా పూర్తికాలేదు. ఇప్పుడు ఇక్కడికి ఎందుకు వచ్చినట్లు? మునుపు చెప్పిన విషయాన్ని మరిచిపోయాడా అని నా మనసులో సంశయం.61.సన్యాసి అక్కడే బండి దిగి కొంతసేపయాక దేవు ఇంటికి వచ్చి ఏమన్నాడో

వినండి.62.అప్పుడు పది గంటల వేళ.బ్రాహ్మణులు భోజనం ఆరంభించే సమయం. దేవు ఇంట్లో హడావిడినంతా చూచిన సన్యాసి దేవుతో 'నాకు డబ్బు తొందరలేదు.63.నేను డబ్బుకోసం రాలేదు.ఈ రోజుమాకు భోజనం కావాలి' అని అన్నాడు. దేవు,'చాలా సంతోషం. ఈ ఇంటిని మీదిగా భావించి రండి అని చెప్పాడు. 64.అప్పుడు 'మా వెంట మరో ఇద్దరు అబ్బాయిలు కూడా ఉన్నారు' అని సన్యాసి చెప్పాడు. 'మరీ మంచిది' అని దేవు అతనితో,65. మీరు ఎక్కడ బస చేశారో చెప్పండి భోజనసమయమప్పుడు కబురు చేస్తాను అని దేవు అన్నాడు.66.'అదేం అవసరం లేదు. ఎప్పుడు రావాలి? మీరు ఎన్ని గంటలకు హాజరవమంటే అప్పుడు వస్తాము' అని సన్యాసి అన్నాడు.67. 'పన్నెండు గంటలకు అబ్బాయిలను వెంట బెట్టుకుని వచ్చి భోజనాన్ని స్వీకరించండి' అని దేవు అతనితో చెప్పాడు.68. సన్యాసి వెళ్ళిపోయి సరిగ్గా పన్నెండు గంటలకు తిరిగి వచ్చి ముగ్గురూ భోజనానికి కూర్చుని యథేచ్ఛగా తృప్తిగా తిన్నారు.69.వంటంతా తయారయ్యాక దేవు సన్యాసిని, వెంట వచ్చినవారిని బ్రాహ్మణుల పంక్తిలో కూర్చుండబెట్టి వారిని తృప్తి పరచాడు.70.సన్యాసి మరో ఇద్దరిని కూడా వెంటబెట్టుకుని తనంతట తానే వచ్చాడు.కాని అతడు పూర్వం చందాల కొఱకు వచ్చిన వ్యక్తి అని దేవు బుద్ధిని మాయ ఆవరించింది.71.దాంతో మనసును మోహం చుట్టుకుని పోవటం వలన ఎవరో అతిథి భోజనానికి వచ్చాడని మాత్రమే అతని బుద్ధికి తోచింది.72.ఆ విధంగా భోజనాలు ముగిశాక ఉత్తరాపోశనం,శుద్ధాచమనంచేసి, సుగంధభరితమైన శీతలోదకాన్ని త్రాగి పళ్లను సేవించి, ముఖశుద్ధి చేసుకొన్నారు.73.ఆ తరువాత శిష్టాచారం ప్రకారం గంధం పూలు తాంబూలం అత్తరు పన్నీరు బహుమానాలు వగైరాలను దేవు సంతోషంగా ఇచ్చాడు. 74.ఆ తరువాత వచ్చిన వారంతా ఇళ్ళకు వెళ్ళిపోయారు. సన్యాసి కూడా తనవారితో తన స్థలానికి వెళ్ళిపోయాడు.

75.ఆ సమయమప్పుడు ఆహ్వానించకుండానే వచ్చి భోజనం చేసిన,ఆ ఆగంతకుడు బాబా అని దేవుకు తోచలేదు.అతని మనసులో ఇంకా సందేహమే.76.పిలువకుండా వచ్చిన ముగ్గురుకి ప్రత్యక్షంగా తన సమక్షంలో వడ్డించినా దేవుమనసులో సంశయం.బాబా వచ్చినట్లుగా నిదర్శన మేమిటని జోగ్‌ను అడిగాడు.77.ఉద్యాపన పూర్తికాగానే దేవు జోగుకు ఉత్తరం వ్రాశాడు. 'బాబా వస్తానని ఖచ్చితంగా చెప్పి నన్ను మభ్యపెట్టారేమిటి? ఇక్కడికి తప్పక వస్తానని ఎందుకు చెప్పారు?78.మీరు కూడా వారి వెంట వస్తారన్న బాబా మాట అబద్దం కాదు, కాని వారు వచ్చినట్లు నాకేమీ సాక్ష్యం కనిపించలేదే ?79.ఇలా ఎందుకు జరిగింది? నన్ను ఎందుకు నిరాశ పరచారు?వారు వస్తారని ఆశగా ఎదురు చూచాను. కాని వారు వచ్చినట్లుగా నాకు ఆనుభవం కలగలేదు.80.భక్తితో వారిని ఆహ్వానిస్తే శరణుజొచ్చిన నా వద్దకు వస్తానని చెప్పారు. కాని అలా జరగలేదు. ఇదంతా నాకేం అర్థం కావటంలేదు.81.నేను స్వయంగా రావటానికి వీలుకాక ఎంతో దీనంగా ఉత్తరం వ్రాశాను. వారు వస్తారని తెలిసి నేను ధన్యుణ్ణని తలచాను.82.బాబా ఏ మిషతోనో ఏ వేషంలోనో వస్తారని తలచాను. కాని అలా ఎందుకు జరగలేదా అని చాలా ఆశ్చర్యంగా ఉంది.'83.జోగ్ ఆ వృత్తాంతాన్నంతా సాయికి విన్నవించాడు.బాబా ఆశ్చర్యచకితులై అతనితో ఏమన్నారంటే,84.'ఆ ఉత్తరాన్ని నా ముందు విప్పి చదవక ముందే దానిని వ్రాసిన వారి మనసు కనిపిస్తుంది.85.నేను వస్తానని ఖచ్చితంగా చెప్పి నమ్మించి అతనిని నిరుత్సాహ పరచానని అంటున్నాడు కదూ! నన్ను గుర్తు పట్టలేనప్పుడు మరి నన్నెందుకు పిలిచినట్లు అని అతన్ని అడుగు.86.నేను శారీరకంగా ఇక్కడనుండి కదలలేదు.కాని నేను ఉద్యాపనకు వెళ్ళి భోజనం చేసి వచ్చాను. ఇద్దరితో సహా వస్తానని చెప్పినట్లుగానే ఇద్దరిని వెంట బెట్టుకుని వెళ్ళాను.87.భోజనానికి ఇంకా వ్యవధి ఉండగా అప్పుడు నేను మెల్లగా సన్యాసి వేషంలో మొదట ఒక్కణ్ణే వెళ్ళాను. నీకు గుర్తు వచ్చిందా!88.నేను

ఆకస్మాత్తుగా రావటం చూచి డబ్బు అడుగుతానేమోనని నీ మనసులో భయం కలుగలేదూ? అప్పుడు నేను నీ సంశయాన్ని తీర్చాను. 89.కేవలం భోజనానికి వస్తాను,మరో ఇద్దరితో వస్తాను అని చెప్పి భోజన సమయానికి మరో ఇద్దరితో కూడా భోజనం చేయలేదూ?90.చూడూ! నా మాట నిలబెట్టుకోవటానికి నాప్రాణం సైతం విడిచి చచ్చిపోతాను.కాని నా నోటి మాటలు ఎన్నడూ వృథాకావు'.91.సాయినాథుల మాటలువిని జోగు ఆనందానికి అవధులు లేవు. నిజమే బాబా వచనం వృథా కాదు. ఇది అందరికీ ఎల్లప్పుడూ అనుభవమే.92.జోగ్ సంతోషంతో వృత్తాంతాన్నంతా సవిస్తరంగా పెద్ద ఉత్తరం వ్రాసి దేవుకు తెలియచేశాడు.93.ఆ ఉత్తరాన్ని చదవగానే ప్రేమోద్రేకంతో దేవు కళ్లు ఆనంద బాష్పాలతో నిండి పోయాయి. అనవసరంగా సాయిబాబాను దూషించాను ఛీ! ఛీ! నా బ్రతుకు వ్యర్థం.అని తనలో లజ్జితుడయ్యాడు.94.బాబా మహిమ ధన్యం.బాబాను తెలుసుకోగలనని దురభిమానంగా అనుకున్నాను. ఎంతసిగ్గుచేటు! కాని బాబాయే ఆ సన్యాసి అయి ఉండవచ్చు అన్న ఆలోచన నాకు ఎందుకు కలగలేదో అర్థం కావటంలేదు.95. బాబాను ఆహ్వానించకముందే సన్యాసి చందాలు వసూలు చేసే నిమిత్తం తన పని మీద వచ్చాడు.96. మూడు, నాలుగు మాసాల వ్యవధి ఇచ్చాను.తరువాత మరల రమ్మని అతనికి చెప్పాను. అతడే అకస్మాత్తుగా వచ్చి భోజనానికి వచ్చానని అంటే అతడు బాబాయే అని నేనెలా ఊహించగలను?97.భోజనానికి వచ్చినప్పుడు 'నాతో సహా మరో ఇద్దరు కూడా వస్తారు' అన్న బాబా మాట ఒక్కటి మాత్రం నేను మరచిపోయాను.98.బాబాను ఆహ్వానించిన తరువాత, సన్యాసి మొదటి సారిగా కలిసి ఉంటే, అదైనా కేవలం భోజనం కొఅకు వచ్చి ఉంటే నా కళ్ళు నన్ను మోసపుచ్చేవి కావు.99. అయినా అతడు గోరక్షణ నిమిత్తం గోగ్రాసానికి డబ్బు సేకరించాలని వచ్చాడు. ఆ తరువాతే సాయిబాబాకు ఉద్యాపన ఆహ్వానాన్ని పంపటం.100.అందుకే నన్ను

అలా మోహం ఆవరించి ఇలా జరిగింది. సన్యాసి ఇద్దటితో సహా వచ్చి భోజనం చేస్తే అతడు భోజనం కొసమే వచ్చాడని భావించాను.101.పూర్వపరిచయంలేని వాడెవరైనా అకస్మాత్తుగా భోజనసమయానికి ఇద్దరితో సహా వచ్చి ఉంటే సాయియే అని నిశ్చయంగా అనిపించేది.102.కాని ఈ సత్పురుషుల పద్ధతి ఇంతే. ఎన్నడూ సంభవించని అద్భుతమైన లీలలను చేస్తారు. వారు భక్తుల గృహాలలోని కార్యాలను, ప్రణాళికను ముందుగానే తయారుచేసి ఉంచుతారు. 103.వారికి అంకితమైన భక్తుల యొక్క శుభకార్యాలను ఇలా చక్కగా ఊహించని విధంగా జరిపిస్తారు. సత్పురుషుల చర్యలు అంతుపట్టవు.104.చింతామణి తలచినదానిని ఇస్తుంది. కల్పవృక్షం మనసు కల్పించిన దానిని ఇస్తుంది. కామధేనువు కోరుకున్న వానిని ప్రసాదిస్తుంది. గురుదేవులు అంతఃకరణానికి అతీతమైన దానిని ప్రసాదిస్తారు. 105.ఇక్కడ ఆహ్వానింపబడి బాబా సన్యాసిరూపంలో ప్రకటమయ్యారు. వారి లీలలు విచిత్రం. ఒక్కోసారి ఆహ్వానించకుండానే వస్తారు.106.ఒకప్పుడు చిత్రపటం రూపంలోనో ఒకప్పుడు పార్థివశరీరంతోనో,మరొకప్పుడు తమంతట తాము ప్రకటమౌతారు. వారి కృపకు అంతు లేదు.107.ఈ విషయంలో నా అనుభవాన్ని వింటే శ్రోతలకు ఆశ్చర్యం కలుగుతుంది. అపూర్వమూ అభినవమూ అయిన ఈ కథను వింటే సాయి లీలల ప్రభావం అర్థమౌతుంది.108.ఇది నిజమైన కథేనా లేక కల్పించబడినదా అని దీనిని ఎవరికి తోచినట్లు వారు అనుకోని మీరు మాత్రం సాదరంగా శ్రవణం చేయండి.109.సోమరితనాన్ని నిద్రను మాని సావధానులై శ్రద్ధగా కథాశ్రవణదానాన్ని నాకు ప్రదానం చేస్తే నాకు సంతృప్తి.110.చింతలను దుఃఖాలను విడచి ప్రశాంతమైన మనసులతో శ్రవణం చేస్తే అది లాభిస్తుంది.శ్రవణం తరువాత మననం,నిదిధ్యాసనం,111.ఆపైన సాక్షాత్కారం అయితే ఈ అన్నింటికీ శ్రవణమే ఆధారం. అదే అన్నింటికీ సారం. శ్రవణం ద్వారా భవాన్ని తరించటం

ఖాయం. 112. క్రీ.శ. 1917 వ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణిమ నాడు శయ్యపై నిద్రిస్తుండగా, తెల్లవారు ఝామున నాకు ఒక కల వచ్చింది. 113. సాయి యొక్క ఈ చర్యను గమనించండి. చక్కని సన్యాసి రూపంలో బాబా నాకు దర్శన మిచ్చి నన్ను మేల్కొలిపి 'నేను ఇవాళ భోజనానికి వస్తాను' అని చెప్పారు. 114. స్వప్నంలో మేలుకోవటం అదంతా కూడా స్వప్నమే. కారణం నేను మేల్కొని కలను గుర్తుకు తెచ్చుకున్నాను. 115. కళ్ళు తెరచి చూస్తే ఆ స్థలంలో సాయిలేరు. ఎవరూ లేరు. క్షణానికి ముందు అది స్వప్నమే. అసలు మెలుకువస్థితి కాదు. 116. స్వప్నంలోని విషయాన్ని కొంచెంకూడా మరచిపోకుండా అక్షరం అక్షరం గుర్తుకు తెచ్చుకున్నాను. 117. 'నేను ఇవాళ భోజనానికి వస్తాను.' అని సాయి స్పష్టంగా చెప్పిన మాటను విని నాకు చాలా ఆనందం కలిగింది. ఈ విషయాన్ని భార్యకు తెలియజేశాను. 118. మనసులో నిరంతరం సాయినే స్మరిస్తూ ధ్యానిస్తూ ఉండటం ఎప్పుడూ అలవాటు. ఏడుఏళ్ళు వారి సహవాసంలో ఉన్నా వారు భోజనానికి వస్తారని ఎప్పుడూ ఆశించలేదు. 119. ఇవాళ హోలీ పండుగ. ఒక పావుశేరు బియ్యం ఎక్కువగా వండటం గుర్తుంచుకో అని భార్యతో చెప్పాను. 120. అలా చెప్పగా ఆమె కారణాన్ని అడిగింది. ఈ రోజు పండుగ కదా! బంధువులు భోజనానికి వస్తున్నారని చెప్పాను. 121. ఆమె తీవ్రమైన జిజ్ఞాసతో ఎవరు వస్తున్నారని అడిగింది. అసలు విషయం చెప్తే నేను అపహాస్యం పాలవుతాను. 122. అని నాకు బాగా తెలుసు. అయినా అసత్యాన్ని పలుకరాదని ఆమెకు నిజాన్ని ఎంతో శ్రద్ధగా చెప్పాను. 123. ఇదంతా శ్రద్ధావిశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది. నిజమైనా అబద్ధమైనా వారివారి మనోభావాలననుసరించి ఉంటుంది. 124. ఆమెకు నమ్మకం కలగాలని ఎంత ప్రయత్నించినా ఆమెకు విశ్వాసం కలగలేదు. 'బాబా శిరిడీ నుండి ఇంతదూరం ఎందుకు వస్తారు? 125. మన హోలీ పండుగ భోజనంలో విశేషమేముంది? శిరిడీలోని మృష్టాన్న భోజనాలను వదిలి మన సాధారణ

భోజనాన్ని సేవిస్తారా?' అని ఆమె అన్నది.126.ఆ విధంగా ఆమె అనగా 'ఒక పావు ఎక్కువగా వండటానికి నీకేం శ్రమ. నీకు పావు బియ్యానికి లోటుందా?127.సాయిబాబా ప్రత్యక్షంగా అతిథిలా వస్తారని నేను నీకు చెప్పలేదు. ఎవరో ఖచ్చితంగా వస్తారని మాత్రం నా నమ్మకం.128.నీవు ఎలా అనుకున్నా సరే, నేను వారిని సాయి సమానులుగా భావిస్తాను. ప్రత్యక్షంగా సాయియేయని భావిస్తాను. నా స్వప్నం నిజమై తీరుతుంది' అని చెప్పాను. 129.అలా సంభాషించుకున్నాం. ఆ తరువాత మధ్యాహ్నసమయాన యథావిధిగా హోలి పూజ ముగిసింది. భోజనానికి విస్తర్లు వేశారు.130. పుత్రులు పౌత్రులు కూతురు అల్లుడూ బంధుమిత్రులూ మొదలైన వారు వంక్తులలో పీటలపైన కూర్చున్నారు.చక్కగా రకరకాల రంగురంగుల ముగ్గులు వేశారు.131.ఒక ముఖ్య పంక్తిలో మధ్యన సాయిబాబాకు ఒక పీట వేసి ఒక పళ్లెంలో అందఱితోపాటు వడ్డించారు.132.పళ్లెం చుట్టూ రంగురంగుల ముగ్గులు వేశారు. అందఱి దగ్గరా చెంబు పంచపాత్ర ఉద్దరిణి ఉంచారు.133.అప్పడాలు వడియాలు వడపప్పు ఊరగాయ పెరుగుపచ్చడి రకరకాల కూరలు పాయసం వగైరా చాలా తయారయ్యాయి.134.మన్నెండు కాగానే ఒక్కొక్కరు మడికట్టుకుని వచ్చి భోజనానికి పీటలపైన కూర్చున్నారు. వేరేవారెవరూ రాలేదు.135.అన్ని పళ్లాలలో నిండుగా రొట్టెలు, అన్నం, పప్పు అవీ వడ్డించారు. అక్కడ ఏ లోటూలేదు. మధ్య పళ్లెంవద్ద మాత్రం అతిథి లేకుండా స్థలం ఖాళీగా ఉంది.136.ఎవరైనా అతిథి అథవా బంధువు రావచ్చు అని ఎదురుచూశాం.అలా ఎంతసేపని ఎదురు చూస్తాం? నా మనసులో అనుమానం.137.నేను వెళ్ళి తలుపు గడియ పెట్టాను. వెంటనే అన్నపూర్ణాదేవిని వడ్డించారు.వైశ్వానరుడైన అగ్నిదేవునకు నైవేద్యం అర్పించే సమయాన,138. ప్రాణాహుతిని ఇవ్వపోతుండగా మెట్లవద్ద చప్పుడు.రావుసాహేబు ఎక్కడ అన్న మాట వినిపించే సరికి అందఱూ వారి స్థలాలలో నిశ్శబ్దంగా కూర్చుండి పోయారు. 139.ఎవరో వచ్చారని నేను

వెళ్ళి మెల్లగా తలుపు గడియ తీసేసరికి మెట్లపైన ఇద్దఱు వ్యక్తులు కనిపించారు. 140.వారిలో ఒకరు అలీమొహమ్మదు. రెండవవారు మౌలానా శిష్యుడు ఇస్మా ముజావర్. ఇద్దరూ సంతోషంగా ఉన్నారు.141.ఆకులలో అన్నీ వడ్డించి ఉండటం, అందఱూ భోజనానికి సిద్ధంగా కూర్చోవటం చూచి అలీ,'క్షమించాలి. మీకు శ్రమ కలిగించాను.142.మీరు మా కోసం భోజనం ముందునుండి లేచి వచ్చినట్లుంది. పంక్తిలో అందఱూ మీకోసం వేచి ఉన్నారు.143.ఇదిగో మీ వస్తువును తీసుకోండి. వీలైనప్పుడు నేను మరల కలుస్తాను. జరిగిన ఆశ్చర్యకరమైన సంఘటనను చెప్తాను'.144.అని చెప్పి చేతిలో ఉన్న ఒక ప్యాకెట్టును టేబులు పైన ఉంచి విప్పసాగాడు.145.పైన కప్పబడిన వార్తాపత్రికను విప్పేసరికి తక్షణం సాయి యొక్క మూర్తి కనిపించింది. 'నా మనవిని మన్నించి ఈ వస్తువును మీ వద్ద ఉంచండి.'అని అతడు అన్నాడు. 146.సాయిబాబా చిత్రాన్ని చూచి నా శరీరం రోమాంచితమైంది. గద్గద హృదయంతో వారి చరణాలయందు శిరసునుంచాను. 147.గొప్ప చమత్కారం జరిగినట్లు అనిపించింది.ఈ విచిత్రలీలను నాకు చూపించి నన్ను పవిత్రునిగా చేసినట్లు అనిపించింది.148.ఈ చిత్రాన్ని ఎక్కడినుండి తీసుకుని వచ్చావని ఉత్సుకతతో అడగగా, ఒక అంగడిలో కొన్నానని అతడు చెప్పాడు. 149.ఒక క్షణమైనా నిలబడకుండా ఆ ఇద్దఱూ 'మేమిక వెళ్తాం. మీరు సుఖంగా ప్రశాంతంగా భోజనం చేయండి. 150. ఇప్పుడు ఈ పటం గురించి చెప్పనారంభిస్తే అనవసరంగా మీ భోజనాలకు ఆలస్యమైపోతుంది. మరొకప్పుడు నేను సావకాశంగా చెబుతాను.'అని అన్నాడు. 151.అదే సమంజసమని నాకూ అనిపించింది. సమయానికి సరిగ్గా బాబా పటం వచ్చినందుకు నాకు చాలా సంతోషమూ, ఆశ్చర్యమూ కలిగాయి.ఆ ఇద్దఱికి కృతజ్ఞత చెప్పాను. 152.'ఇకమీరు వెళ్ళండి. ఈ పటం ఇక్కడికి ఇవాళే రావటానికి కారణం నేను తరువాత మనవిచేస్తాను. అని చెప్పాను. 153.వారు వెళ్ళిపోయిన తరువాత,

సాయిబాబా కొఅకు ప్రత్యేకంగా మధ్యన ఏర్పాటు చేసిన పీటపైన పటాన్ని ఉంచాను.154.అందఱికీ ఆనందం కలిగింది.సాయిలీల అమోఘం. వారు చిత్రపటం రూపంలో వచ్చి స్వప్నంలోని వారి మాట నిజమని నిరూపించారు.155.ఎవరైనా అతిథి వస్తే గనుక వచ్చిన ఆ వ్యక్తి పంక్తిలో కూర్చుంటాడు అని తలచినవారికి ఎంతటి ఆశ్చర్యం కలిగిందో.156.పటంలోని అందమైన మూర్తిని చూచి, అందఱికీ పరమానందం కలిగింది. అనుకోకుండా ఇది ఎలా సంభవించిందా అని అందరికీ ఆశ్చర్యం.157.పటాన్ని పీటపైన ఉంచి, అర్ఘ్యపాద్యాది పూజలు చేసి, భక్తిశ్రద్ధలతో నైవేద్యాన్ని సమర్పించిన తరువాత అందఱం భోజనాలను ఆరంభించాం.158.అప్పటినుండి ఇప్పటివరకు ప్రతి హోలీ పండుగనాడు శిష్టాచారం ప్రకారం ఈ పటంలోని బాబా అష్టోపచార పూజను స్వీకరిస్తారు.159.పూజాగదిలో ఇతర దేవతలతో పాటు ఈ పటం కూడా పూజింప బడుతుంది. ఈ విధంగా బాబా తమ అపూర్వ చరితాన్ని భక్తులకు అడుగడుగునా చూపిస్తుంటారు.160.తరువాత ఆ ఇద్దరు వ్యక్తులు ఇవాళో రేపో కలుస్తారు అని అనుకుంటూనే తొమ్మిది సంవత్సరాలు గడిచిపోయినా వారు కనిపించలేదు.161.చివరకు కర్మధర్మసంయోగంతో, నేను దారిన వెడుతుండగా అలీ మహమ్మదు కలిశాడు.162.వెంటనే పటాన్ని గురించి తెలుసుకోవాలని నా ఉత్సుకత' ఎందుకు ఇన్నేళ్ళూ మౌనంగా ఉండిపోయావు?163.ఈ రోజు కూడా మునుపటివలెనే కలుసుకున్నాం. అకస్మాత్తుగా ఇప్పుడు సమయం వచ్చినట్లుంది. ఆ విషయాన్నంతటినీ చెప్పు.164.నీవు కూడా సాయిబాబా భక్తుడవని నాకు తెలుసు. కాని నీకు ఆరోజే రావాలని ఎందుకనిపించింది' అని అడిగాను.165.అప్పుడు అలీ చెప్పిన వృత్తాంతాన్నంతా చెప్తాను.ఆశ్చర్యభరితమూ, అత్యద్భుతమూ అయిన సాయియొక్క లీలను వినండి.166.ఈ బాబా లీలకు అర్థమేమిటి, వారి ఉద్దేశమేమిటి, దీని ద్వారా భక్తులకు వారు

ఉపదేశించినదేమిటి? అన్నవి సాయికే తెలియాలి. 167. ఈ లీలలు శ్రేయస్సును కలిగించేవి. కనుక వారిని మనం కేవలం చెవులతో వినటం, లేదా నోటితో గానం చేయాలి. 168. తరువాతి అధ్యాయంలో మిగతా కథను వినిపిస్తాను. అమోఘమైన సాయి చరిత్రను విన్న శ్రోతలు ఆనందాన్ని పొందుతారు. 169. ద్వేషభావంలేని సాయి ఆనందఘనుణ్ణి, అనవచ్ఛిన్నుణ్ణి అహర్నిశలూ ఆరాధిస్తే మనసు వాసనా రహితమై ప్రశాంతిని పొందుతుంది. 170. చాతకపక్షి తన స్వార్థం కోసం వర్షాన్ని కోరుకుంటుంది. కాని మేఘం సకల సృష్టికోసం వర్షిస్తుంది. బాలాసాహేబు దేవు బాబాను ఆహ్వానించాడు. బాబా భక్తులను కూడా పిలిచారు. 171. శ్రోతలు కూడా భక్తుల పంక్తిలో కూర్చుని శ్రద్ధగా ఉద్యాపన కథను విని, సాయి సమాగమ సుఖాన్ని ఆనందంగా అనుభవించి తృప్తిగా త్రేన్చారు కూడా. 172. బాబా ఆహ్వానించకుండానే ఎలా వస్తారు? పార్థివ స్వరూపంలో ఎలా ప్రకటమౌతారు? తమ భక్తులు కృతజ్ఞతతో ఉండేలా ఎలా చూస్తారు? అడుగడుగునా భక్తులను ఎలా జాగృతం చేస్తారు? 173. హేమాడు సాయికి శరణుజొచ్చుతున్నాడు. తరువాతి కథా రచనను ఇదే విధంగా సాయిబాబా తాము కోరుకున్న విధంగా చేయించుకుంటారు. 174. శరణు జొచ్చిన వారిని రక్షిస్తారని సాయి ప్రతిజ్ఞ కనుక, వారు తనను తరిమివేయరని హేమాడు వారి చరణాలను ఆలింగనం చేసుకుంటున్నాడు. 175. స్వస్తి శ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో ఉద్యాపన కథా కథనమను నలుబదియవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత - 41 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

సాయి కథలలోని మహిమ ఇదే. శ్రోతలే పూర్వకథను గుర్తుంచుకుని వినటానికి సిద్ధంగా ఉన్నారు. కనుక శ్రద్ధగా శ్రవణం చేయండని శ్రోతలను ప్రోత్సాహపరచనవసరం లేదు.1.కథామృతపానానికి శ్రోతలే ఏకాగ్రమనసులతో సావధానులై ఉండగా, వారిని వినండని ప్రార్థించడం ఎందుకు?2.గురువు యొక్క మహిమను గానం చేసినా, శ్రవణం చేసినా మనసు నిర్మలమౌతుంది. గురు నామాన్ని జపిస్తూ వారిని ధ్యానిస్తే ఆనందాన్నిచ్చే మూర్తిగా ప్రకటమౌతారు.3.గతాధ్యాయంలో ఒకరి వ్రతాల ఉద్యాపన యథావిధిగా ఎలా పూర్తి అయిందో దృష్టాంతంతో సహా చెప్పబడింది.4.అలాగే సాయి యొక్క చిత్రపటం ఆకస్మికంగా సమయానికి సరిగ్గా వచ్చి కోరికను పూర్తి చేసిన కథను ఇప్పుడు వినండి.5.ఒక హోళీ పండుగనాడు సాయిబాబా నా స్వప్నంలో కనిపించి 'నేను ఈ రోజు భోజనానికి వస్తాను' అని చెప్పి నా మనసులోని కోరికను తీర్చటం,6.ఈ కథను ఇదివరకే సవిస్తరంగా చెప్పాను. అయితే ఆ బాబాపటం ఆ సమయానికి వచ్చిన చమత్కారాన్ని ఈ రోజు శ్రద్ధగా వినండి.7.ఆ కథను అలీ మహమ్మదు చెప్పగా నాకు పరమాశ్చర్యం కలిగింది. ఇదికూడా అత్యంత వినోదకారకమైన బాబాలీలయే.8.ఈ అలీయే ఆ హోళీరోజున మధ్యాహ్నం మేము సరిగ్గా భోజనానికి కూర్చున్న సమయాన బాబా పటాన్ని తెచ్చి నన్ను ఆనందింప చేశాడు.9.ఇది జరిగిన కథ. ఇప్పుడు శ్రోతలు పావనమైన సాయిచరిత్రలోని తరువాతి కథను

శ్రద్ధగా వినండి. 10. రసభరితమైన ఈ కథను వినటానికి శ్రోతలు ముందుగానే సావధానంగా ఉన్నారు. వక్త సాయి చరణాలలో లీనమై ఉన్నాడు. సాయిచరిత్ర మహిమాన్వితమైనది. 11. బాబా మూర్తీభవించిన పరోపకారం. వారు పరోపకారం కొఱకు తమ శరీరాన్ని శ్రమపెడతారు. ఎప్పుడూ నిర్వైర భావంతో సత్కర్మలనే చేస్తారు. 12. మంచిగాని చెడుగాని ఎటువంటి పరిస్థితులలోనైనా శరీరకర్మలు శరీరాన్ని విడువవు. కనుక మనోవృత్తిని ప్రేమపూర్వకంగా గురుచరణాల వైపు మరలించాలి. 13. అప్పుడు గురువు ఎలా తమ భక్తుల యోగక్షేమాలను అవిశ్రామంగా చూస్తారు అన్న విషయాన్ని గురుచరణాల యందు ప్రేమ ఉంచి గమనించండి. అత్యుత్తమమైన అనుభవాన్ని పొందండి. 14. అటువంటి ఉత్తమ స్థితి కోరితే లభించేది కాదు. గురువును కీర్తిస్తే ఆరాధిస్తే లభిస్తుంది. మహాప్రయత్నంతో లభించనిది కూడా గురుకృపాబలంతో ప్రాప్తిస్తుంది. 15. దురభిమానంతో బాబాను పరీక్షించాలని వచ్చినవారంతా కూడా అభిమానాన్ని వదిలి దర్శనానందంతో సుఖంగా వెళ్ళారు. 16. యశస్సు, శ్రీ, ఔదార్యం, జ్ఞానం, వైరాగ్యం, శాంతి ఈ షడ్గుణ ఐశ్వర్యాలు సంపూర్ణంగా ఉన్న నారాయణునివలె సాయిబాబా సంపూర్ణ భగవంతుడు. 17. మనం ఎంతటి భాగ్యవంతులం! చైతన్య ఘనులైన సాయిబాబా ఏపూజార్చనలూ, భజనలూ లేకుండానే మనకు దర్శనమిస్తున్నారు. 18. భక్తి ఉంటేనే భగవంతుడు అని అంటారు. మనకు భక్తి ఉందా? లేదు. అయినా ఈ సాయిమహారాజు దీనుల యెడ దయాస్వభావాన్ని కలిగి ఉన్నారు. 19. అలీ చెప్పిన కథనంతా శ్రోతలు వింటే సాయి యొక్క శక్తి మరియు వారి లీలామహాత్మ్యం అవగతమౌతాయి. 20. "ఒకరోజు ముంబై నగరంలో దారివెంట నడుస్తుండగా అందమైన పటాలను అమ్ముతున్న వ్యాపారిని చూచాను. 21. అవలియాలవి, మహాత్ములవి, సత్పురుషులవి అనేక రకాల అందమైన పటాలు ఉన్నాయి. అందులో ఎవరెవరివి ఉన్నాయి అని వానిని

చూడాలనిపించింది. 22. అందువలన ఒక్కొక్క పటాన్ని చూస్తుండగా అన్నింటి కంటే ఆకర్షణీయంగా ఉన్న ఈ పటం నాకు నచ్చింది. పైగా వారు నా ఆరాధ్య దైవం. 23. అసలే నాకు సాయి యందు అభిమానం. వారిపటం నా కళ్ల ఎదుట పడేసరికి తీసుకోవాలన్న కోరిక కలిగింది. వెంటనే వెలను చెల్లించాను. 24. తరువాత ఆ పటాన్ని ఇంటికి తీసుకుని వచ్చి గోడకు తగిలించాను. బాబాపై నాకు చాలా ప్రేమ. రోజూ ఆనందంగా దర్శనం చేసుకునే వాణ్ణి. 25. మీకు ఫోటోను ఇచ్చిన మూడు మాసాలకు ముందు నా ఆరోగ్యం బాగాలేక నా బావమరిది వద్ద ఉండేవాణ్ణి. 26. నూర్ మహమ్మదు పీరుభాయి నాకు బావమరిది. నా కాలు వాచిపోగా శస్త్రచికిత్స జరిగింది. 27. ఆ అనారోగ్య పరిస్థితిలో నేను మూడు నెలలు అతని వద్దే ఉన్నాను. ఆ మూడు నెలలూ నా ఇంట్లో ఎవరూ లేరు. 28. ప్రసిద్ధులైన బాబా అబ్దుల్ రహమాన్, మౌలానా సాహేబు, మహమ్మదు హుసేన్, సాయిబాబా మరియు తాజుద్దీను బాబాలు ఆ స్థలాన్ని విడవలేదు. 29. వీరందరివి మరియు ఇతరుల పటాలు కూడా నా ఇంట్లో చక్కగా గోడపైన ఉండేవి. కాల చక్రం వీరిని కూడా వదలిపెట్టలేదు. 30. నేను అక్కడ ఆ పరిస్థితిలో ఉన్నప్పుడు పటాలకు శని పట్టింది ఎందుకో? సృష్టింపబడిన ప్రతి వస్తువు నశించక తప్పదులా ఉంది. 31. అటువంటి పరిస్థితిలో సాయిబాబా మాత్రం ఆ దుస్థితిని ఎలా తప్పించుకున్నారు అన్న విషయం నా కింతవరకూ ఎవరూ చెప్పలేకపోయారు. 32. ఈ విషయం లోని పూర్తి కథను వింటే మీకు ఆశ్చర్యం కలుగుతుంది. అంతుపట్టని బాబాలీలలు, స్థిరచరాలలో వ్యాపించి ఉన్న వారి శక్తి తెలుస్తుంది. 33. బాబా అబ్దుల్‌రహమాన్ అనే సాధువు యొక్క చిన్న పటం, మహమ్మదు హుసేన్ 'థారియ' అనే వారి వద్ద ఉండేది. 34. అతడు నాకొక ప్రతిని చాలా ఏళ్ళ క్రితం ఇచ్చాడు. నేను దానిని నా బావమరిదికి ఇచ్చాను. ఎందుకంటే అతడు బాబా అబ్దుల్‌రహమాన్‌కు అంకితమైనవాడు. 35. ఎనిమిది ఏళ్లవరకు

పటం అతని బల్ల సొరుగులో ఉంది. ఒకసారి అకస్మాత్తుగా కనిపిస్తే దానిని ముంబైలోని అంగడికి తీసుకుని వెళ్ళాడు.36.అబ్దుల్ రహమాన్ నిలువెత్తు సైజులో పటాన్ని అందంగా తయారు చేయించాడు. దానిని తీసుకుని వెళ్లి వారికి బహుకరిస్తే వారు ప్రసన్నులౌతారని తలచాడు.37.అటువంటివి మరిన్ని కాపీలను తీయించి ఆప్తులకు మిత్రులకు పంచాడు. నాకు కూడా ఒక కాపీని ఇవ్వగా, నేను దానిని గోడకు తగిలించాను.38.తరువాత నూర్‌మహమ్మదు అందమైన ఆ పటాన్ని అబ్దుల్‌రహమాన్ దర్బారులో వారికి సమర్పించాలని అనుకున్నాడు.39. కాని అతని మనసును తెలుసుకుని ఆ పటాన్ని చూడగనే అబ్దుల్‌రహమాన్ అత్యంత కోపంతో అతనిని కొట్టాలని లేచాడు.40.అంతేకాదు,అతనిని అవమానపరిచి అక్కడి నుండి తరిమి వేశాడు. దానితో అతనికి చాలా దుఃఖం కలిగింది.బాగా చింత పట్టుకుంది. 41.దీనంగా ఉదాసీనతతో బాధతో ''డబ్బుకు డబ్బూ పోయింది. గురు కృపకు దూరమయ్యాను.42.గురుకృపా పాత్రుణ్ణైన నేను ఇప్పుడు గురువు కోపానికి కారణమయ్యాను అని ఆలోచించి అనుమానాలతో ఆ పటాలను నీటిలో ముంచనారంభించాడు.43.ఇక ఈ సాధువుల పటాలు ఇంట్లో ఉంచరాదు. వీని వలననే గురువు ప్రేమకు దూరమయ్యాను. అనవసరమైన ఈ పని ఎందుకు?44.ఈ పటాల కారణంగా మా గురువు నన్ను కోపగిస్తారు.నాకు హాని కూడా కలగవచ్చు. వానితో నాకు పనిలేదు.45.ప్రతిమలను పటాలను పూజించడం గురువుకు ఇష్టం లేదు. వారికి కోపాన్ని తెచ్చిన ఆ పటాలవలన నాకేం ప్రయోజనం?46.ఆ పటాలను తయారు చేయించటానికి చాలా డబ్బు ఖర్చు అయింది. అయినా ఇప్పుడు వానిని నీటిలో వదలి పెట్టడం తప్ప మరో గత్యంతరం లేదు.47.అని ఆలోచించి నా బావమరిది పటాలను ఎవరడిగినా ఇవ్వకుండా వానిని తీసుకుని నేరుగా హార్బరుకు వెళ్ళాడు. 48.నేరుగా అపోలో బందరు వద్దకు వెళ్లి ఒక నావను అద్దెకు తీసుకుని సముద్రంలో

కొంతదూరం వెళ్లి చివరకు వానిని నీటిలో వదలి వేశాడు.49.అంతటితో ఆగలేదు. బాంద్రాకు వచ్చి మరల అదే పని మొదలు పెట్టాడు. ఆప్తులను బంధువులను ప్రార్థించి పటాలను అడిగి తీసుకున్నాడు.50.అబ్దుల్‌బాబా కోపగించారు కనుక ఆ పటాలు ఎవరివద్ద ఉన్నా వానిని తిరిగి ఇవ్వాలి. ఎందుకంటే వానిని నీటిలో విసర్జించాలి అని ప్రార్థించాడు. 51.నాకు ఇచ్చిన కాపీని, మరియు మా బావ నుండి, సోదరినుండి కూడా మొత్తం ఆరు పటాలను తీసుకున్నాడు. 52.తరువాత కోపంగా ఆ కాపీలను తీసుకుని వెళ్లి బాంద్రా పట్టణం దగ్గర సముద్రం నిండుగా ఉన్న చోటికి వెళ్లాడు.53.ఒక బొస్తవానిని పిలిచి పటాలన్నింటినీ అతనికి ఇచ్చి, సముద్రజలంలో నిమజ్జనం చేయించాడు. 54.అప్పుడు నేను అతని ఇంట్లో రోగగ్రస్తుడనై ఉన్నాను. ఆ పటాలు నాకు కూడా కష్టాలు కలిగిస్తున్నాయని అతడు నాకు బోధించాడు.55.వానినన్నింటినీ సముద్రంలో వదలివేసినప్పుడే నీ కష్టాలు తొలగిపోతాయని చెప్పాడు.56.నేను నా వ్యవహారాలను చూచుకునే నా గుమాస్తాను పిలిపించి అతని చేతికి ఇంటి తాళం చెవిని ఇచ్చి, ఇంట్లో ఉన్న సత్పురుషుల పటాలన్నింటినీ తెప్పించి నా బావమరిదికి అప్పగించాను.57. బావమరిది వెంటనే తోటమాలిని పిలిచి అతని ద్వారా వానిని చింబాయి దేవాలయం వద్ద నున్న సముద్ర జలంలో పడవేయించాడు. 58.రెండు మాసాలు గడిచాక నా ఆరోగ్యం బాగుపడి నా ఇంటికి వెళ్లి అత్యంత ఆశ్చర్యపడ్డాను.59.మీకు ఇచ్చిన బాబా పటం ద్వారానికి ఎదురుగా ఉన్న గోడపై చక్కగా మునుపటివలెనే ఉండటంచూచి నేను చకితుణ్ణయ్యాను. 60.గుమస్తా అన్ని పటాలను తీసుకుని వచ్చాడు కదా! మరి ఇది మాత్రం చిత్రంగా ఇక్కడే ఎలా ఉండిపోయింది అని అనుకుని వెంటనే ఆ పటాన్ని తీసి అలమారాలో దాచి ఉంచాను.61.నా బావమరిది కళ్లలో పడితే, వెంటనే తీసుకుని వెళ్లి తన చేత్తో నీళ్లలో ముంచేసి జలసమాధి చేస్తాడు అని అనిపించింది.62.ఈ పటాన్ని నా ఇంట్లో

ఉంచరాదు. బాబమరిది చూస్తే నీటిలో ముంచివేయిస్తాడు. ఇతరులకు, భక్తులు కాని వారికి నిస్సందేహంగా ఇవ్వలేను. 63.బాగా ఆలోచించకుండా ఎవరికైనా ఇస్తే పూజోపచారాలు సరిగ్గా జరుగుతాయో లేదోనని ఎంతో కాలం మనసులో ఆందోళన. 64.ఈ పటం ఎక్కడ సురక్షితంగా ఉంటుంది? తమ ఇంట్లో ఉచితమైన స్థలంలో శ్రద్ధగా అట్టి పెట్టుకునే వారికి ఇవ్వాలి. 65.అని దీర్ఘంగా ఆలోచిస్తూ సతమతమవుతుంటే మౌలానా దర్బారుకు వెళ్లి ఇస్మాకు వృత్తాంతాన్నంతా తెలియచేయమని సాయియే, నాకు చక్కని ఆలోచనను సూచించారు. 66.నేను వెంటనే పీరు మౌలానా దర్బారుకు వెళ్ళి ముజావర్ ఇస్మాతో సాదరంగా విషయమంతటినీ ఏకాంతంలో తెలియచేశాను. 67.మీ వద్ద నిర్భయంగా ఉంచవచ్చని మేము ఉభయులం ఆరోజే నిశ్చయించుకున్నాం. 68.ఈ సాయిసమర్థుని పటం మీ వద్ద సురక్షితంగా ఉంటుందని దానిని మీ వద్దనే ఉంచాలని, స్వయంగా వచ్చి మీకు సమర్పించాలని అనుకున్నాం.69.ఆ నిశ్చయంప్రకారం పటాన్ని మీకు ఇచ్చాం. అప్పుడు మీరు భోజనానికి సిద్ధంగా ఉండటం చూచి మేము వెంటనే తిరిగి వచ్చేశాం.70.ఇంత కథను వినటానికి అప్పుడు మీకు తీరికలేదు. సావకాశంగా చెప్పవచ్చని నేను వచ్చేశాను.71.ఇవాళ రేపు అని అనుకుంటూ మొత్తం తొమ్మిది ఏళ్లు గడిచాక అకస్మాత్తుగా ఇవాళ ఇద్దరం కలుసుకున్నాం.72.గతించిన విషయాలను గుర్తుకు తెచ్చుకున్నాం. మీ వింతస్వప్నం గురించి మీరూ చెప్పారు.ఇది నా అపూర్వ కథతో సంబంధం కలిగి ఉంది. నిజంగా ఈ లీల అద్భుతమైనది కదూ.73.ఇప్పుడు శ్రోతలు మరో కథను సావధానచిత్తులై వినండి. ప్రేమికులైన భక్తులను బాబా అత్యంత ప్రేమతో ఎలా చూసేవారు? 74.పరమార్థమందు నిజమైన శ్రద్ధగలవారి యందు బాబాకు చాలా అభిమానం. అట్టివారి సకల కష్టాలను తొలగించి వారికి ఆత్మానందాన్ని ప్రసాదిస్తారు.75.ఈ విషయంలోని మధురమైన అనుభవం – బాలాసాహేబు దేవు కోరికను

తిర్చి అతని వ్రతాన్ని నెరవేర్చి అతనికి భక్తిని ప్రసాదించారు.76.పగలు ఉద్యోగం చేయకపోతే దేవుకు జీవనం గడవదు. కాని రాత్రిపూట పరమార్థసాధనకు ఇబ్బంది ఎందుకుండాలి?77.ఎంతోకాలం నుండి నిత్యం జ్ఞానేశ్వరిని పఠించాలని దేవు కోరిక. కాని ఏదో ఒక విఘ్నం వలన అతనికి అది సాధ్యం కాలేదు.78.ప్రతిరోజూ నియమంగా భగవద్గీతలోని ఒక అధ్యాయాన్ని పఠించినట్లే జ్ఞానేశ్వరిని కూడా ఏ అంతరాయంలేకుండా పఠించలేకపోయేవాడు. 79.ఇతర గ్రంథాలను నియమంగా చదువుతాడు గాని జ్ఞానేశ్వరిని పఠించాలన్న అతని కోరిక తీరలేదు.80.ఒకసారి దేవు మూడు మాసాల సెలవు తీసుకుని శిరిడీకి వెళ్లాడు. అక్కడినుండి తిరిగి పొండులోని తన ఇంటికి వచ్చి సుఖంగా విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు.81.అక్కడ ఇతర కార్యాలు జరిగాయి. నియమంగా చదివే ఇతర గ్రంథాలను పఠించాడు కాని జ్ఞానేశ్వరిని పఠించాలన్న అతని కోరిక తీరేకాలం రాలేదు.82.జ్ఞానేశ్వరిని చేతిలోకి తీసుకోగానే మనసులోని వికల్పాల వలన ఊరికే పైపైన పఠించడమే గాని హృదయంలో ప్రేమ ఉప్పొంగేది కాదు. 83.ఎంతగా తపించి పోతున్నా తన నిశ్చయం సిద్ధించడం లేదు. ప్రతిరోజూ నియమంగా అయిదు శ్లోకాలనైనా పఠించలేక పోయేవాడు.84.ప్రతిదినం అయిదు శ్లోకాలను చదవాలని నిశ్చయించుకున్నాడు. కాని అది కూడా నియమంగా చదవటం అతనికి సాధ్యం కాలేదు.85.అందువలన సాయిబాబా ప్రేమగా చదువు అని స్వయంగా ఆజ్ఞాపించినప్పుడే జ్ఞానేశ్వరిని చదవటానికి ఉపక్రమిస్తానని అనుకున్నాడు.86.అలా సాయి చరణాలయందు విశ్వాసం కలిగి సాయిబాబా ఆజ్ఞాపించినప్పుడు జ్ఞానేశ్వరిని చదువుతానని కృతనిశ్చయంతో ఉన్నాడు.87.మహోదయపర్వం రాగా దేవు తన తల్లిని సోదరిని వెంట బెట్టుకుని గురుపూజా వైభవాన్ని చూడటానికి శిరిడీ వచ్చాడు.88.'మీరు నిత్యం జ్ఞానేశ్వరిని ఎందుకు పఠించరు' అని అతనిని జోగు ప్రశ్నించాడు. అప్పుడు దేవు ఇచ్చిన జవాబును వినండి. 89.'జ్ఞానేశ్వరిని

పఠించాలని నాకు చాలా కోరిక. కాని అది సిద్ధించటం లేదు. ఇక బాబా చదువు అని ఆజ్ఞాపిస్తే అప్పుడె చదువుతాను'.90. అప్పుడు జోగు 'జ్ఞానేశ్వరి గ్రంథాన్ని తీసుకుని వచ్చి సాయిబాబా చేతిలో ఉంచితే వారు చదువు అని నీకు తిరిగి ఇస్తారు' అని ఉపాయం చెప్పాడు.91.'నాకు అటువంటి యుక్తి అవసరం లేదు.నా మనసు బాబాకు తెలుసు. నా కోరికను ఎందుకు తీర్చరు? స్పష్టంగా చదువు అని వారే చెబుతారు' అని అన్నాడు. 92.సాయిసమర్థుని దర్శనం చేసుకున్నప్పుడు దేవు వారికొక రూపాయిని సమర్పించాడు. బాబా, 'ఒక్కటే ఎందుకు ఇరవై తీసుకురా' అని అతనికి చెప్పారు.93.దేవు ఇరవై రూపాయలను తెచ్చి ఇచ్చాడు. రాత్రి బాలకరాం కలిసినప్పుడు దేవు అతనిని, 'బాబా కృపను ఎలా పొందావు' అని పూర్వపు సంఘటన గురించి ప్రశ్నించాడు. 94. రేపు ఆరతి ముగిసిన తరువాత నీకు మొత్తం చెప్పుతానని అతడు మాటివ్వగా దేవు సరే అని అన్నాడు.95.రెండవరోజు దేవు మరల మసీదుకు బాబా దర్శనానికి వెళ్లగా బాబా అతనిని ఇరవైరూపాయలను అడిగారు. దేవు సంతోషంగా ఇచ్చాడు. 96.అక్కడ చాలా జనం మూగి ఉండటం గమనించి దేవు చాటుగా ఒక ప్రక్కన ఉన్నాడు. బాబా, 'ఈ జనంలో ఇరుకు స్థలంలో అతడు ఎక్కడున్నాడు అని ప్రశ్నించారు.97.దేవు 'బాబా! ఇదిగో నేను ఇక్కడ ఉన్నాను' అని జవాబిచ్చాడు. అప్పుడు బాబా 'సరే ఏడే ఎందుకిచ్చావు' అని అడిగారు.98.దేవు 'ఇరవై ఇచ్చాను బాబా' అని చెప్పాడు. 'మరిడబ్బెవరిది' అని బాబా ప్రశ్నించగా 'మీదే బాబా' అని దేవు చెప్పాడు.మరి'నువ్వు ఎందుకు పారిపోతున్నావు? 99.'రా! ఇలాదగ్గరకురా! నా వద్ద ప్రశాంతంగా కూర్చో' అని అన్నారు. వారి ఆజ్ఞానుసారం దేవు వెళ్లి కూర్చున్నాడు.100.నిత్యనియమానుసారం హారతి అయిపోగానే భక్తులు తమ బసలకు వెళ్లిపోయారు. దేవు, బాలకరాం కలుసుకున్నారు. దేవు మరల అతనిని పూర్వపు విషయాన్ని అడిగాడు.101.అలా దేవు అతనిని

జరిగిన దానిని అడగగా అతడు అంతా చెప్పాడు.'బాబా నిన్ను ఉపాసనలో ఎలా నియమించారు?102.బ్రహ్మ చింతన ఎలా చేయాలో నీకు తెలియచేశారా? నా జిజ్ఞాసను తీర్చు' అని ప్రార్థించాడు. 103.దేవు జిజ్ఞాసను తీర్చాలని బాలకరాం జవాబు చెప్పనారంభించే సరికి బాబా దేవును పిలువనంపారు. 104.సాయి ఎంతటి కరుణామయులు. దేవును పిలుచుకుని రమ్మని చంద్రుని పంపారు. క్షణమైనా ఆలస్యం చేయకుండా దేవు శ్రీసాయి వద్దకు వచ్చాడు.105. అప్పుడు సమయం సాయింత్రం నాలుగు గంటలు. మసీదు చివర గోడపైన రెండు చేతులు ఆన్చి నిలుచుని శ్రీసాయి ఎదుటే కనిపించారు.106.దేవు వెళ్లగానే వారికి వందనం చేశాడు.బాబా అతనిని, 'ఎక్కడ ఎవరితో ఏం మాట్లాడుతున్నావు' అని ప్రశ్నించారు.107.కాకా దీక్షితు మేడపైన బాలకరాం చెప్పుతుంటే మీ కీర్తిని వింటున్నాను అని దేవు జవాబిచ్చాడు.108.'ఇరువది యైదు రూపాయలను పట్టుకురా' అని బాబా దేవుకు ఆజ్ఞాపించారు. వెంటనే దేవు రూపాయలను తెచ్చి బాబాకు సమర్పించాడు. 109.'ఎన్ని తెచ్చావు' అని బాబా ప్రశ్నించగా 'ఇరువది యైదు' అని దేవు చెప్పాడు. 'సరే రా! వచ్చి కూర్చో' అని బాబా అంటే దేవు బాబా వెంట మసీదులోనికి వెళ్ళాడు.110. బాబా స్తంభం వద్ద కూర్చున్నారు. మసీదులో రెండవవారు ఎవరూ లేరు. అప్పుడు బాబా 'నాకు తెలియకుండా నీవు నా గుడ్డ పేలికలను దొంగిలించావు' అని అన్నారు. 111.'గుడ్డపేలిక గూర్చి నాకు తెలియదు' అని దేవు చెప్పాడు. అయితే 'ఇక్కడే ఎక్కడో ఉంటుంది చూడు' అని బాబా అతనితో అన్నారు.112.'పాత గుడ్డముక్క ఇక్కడ ఎక్కడుంది?' అని దేవు అనగా బాబా లేచి 'బాగా వెదుకు, దొంగిలించే ఈ పాడు బుద్ధి మంచిది కాదు.113.దానిని ఎవరో అల్లరి కుఱ్ఱవాడు తీసుకుని పోయి ఉంటాడు చూడు! చూడు! ఇక్కడే ఉండాలి' అని అన్నారు. దేవు మరల వెదికాడు. అయినా అది దొరకలేదు.

114.అప్పుడు బాబా కనుబొమ్మలు ముడిచి, ఇటూ అటూ చూచి దేవు వైపు దృష్టిని సారించి అతనిని గట్టిగా కోప పడ్డారు. 115.'నీవే మోసగాడివి. ఇప్పుడు నీవు తప్ప పాతగుడ్డను దొంగిలించటానికి ఎవరు వస్తారు? నీవే దొంగవని అనుకుంటున్నా.116.ఇక్కడికి రావటం ఇలా దొంగతనం చేయటానికా? నల్లటి వెంట్రుకలు తెల్లవైపోయినాయి, చెడు అలవాట్లు అసలు పోలేదు.117.నిన్ను కోస్తాను. గొడ్డలితో నరుకుతాను. చంపేస్తాను. నా చేతుల్లో నుండి ఎక్కడికి పోతావు? ఎక్కడికి పోయినా అక్కడికి కూడా వచ్చి నిన్ను చంపేస్తాను.118.ఇంటినుండి శిరిడీకి రావటం దొంగతనం చేయటానికా? ఇదిగో, నీవి తిరిగి తీసేసుకో. నా పాతగుడ్డ ముక్క తెచ్చి ఇవ్వు'. 119.అని అంటూ సాయిబాబా కోపంతో ఎట్టబారిపోయారు. తిట్లనూ శాపాలనూ కురిపించారు. తల్లినీ తండ్రినీ ఉద్దరించేలా తిట్టారు. కోపంతో అగ్గిలా మండి పడ్డారు.120.సాయినాథులు అలా కోప్పడుతుంటే దేవు ఆ లీలను ఆశ్చర్యంగా చూస్తూ ఊరికే నిలబడి పోయాడు.121.అక్కడ దేవు ఒక్కడే ఉన్నాడు. ఇప్పుడు దెబ్బలు తినేవంతు వచ్చినట్లు ఉంది. ఈ విశ్వరూప సందర్శనం ఎంత అందమైనది అని తనలో తలచి ఆనందించాడు.122.ఒంటరిగా బాబా చేతిలో చిక్కాను. సటకా తీసుకుని కొడతారేమో కూడా, వారికి తోచినట్లుగా చేయనీ అని అనుకున్నాడు. 123.కాని ఆ చింకిగుడ్డ విషయ మేమిటో దేవుకు ఏం అర్థం కాలేదు. 'పోపో ఇక్కడి నుండి వెళ్లిపో' అని బాబా అనగానే దేవు మెల్లగా మెట్ల దగ్గరకు జరిగాడు.124.నేను చింకిగుడ్డలోని అంతరార్థాన్ని తెలుసుకోగల సమర్థుణ్ణి కాను. కాని సాయి కృప కలిగినప్పుడు దానిని శ్రోతలకు మనవి చేస్తాను.125.ఒక పావుగంట గడిచాక దేవు బాబా ఎదుటికివెళ్లాడు. బాబా యొక్క తిట్లు కేకలు ఇంకా సాగుతూనే ఉన్నాయి.'పైకి ఎందుకు వచ్చావు?' అని అడిగారు. 126.'ఇక వెళ్లు వాడాకు వెళ్లు' అని చెప్పగా వారి ఆజ్ఞను శిరసా వహించి వారి చరణాలకు నమస్కరించి వాడాకు

వెళ్లాడు. 127.జరిగింది జరిగినట్లుగా విషయాన్నంతా యదార్థంగా జోగుకు, బాలకరాంకు మనవి చేశాడు. 128.అరగంట గడిచాక మళ్లీ తిట్లు శాపాలు కేకలు. తరువాత నాలుగు అయిదు గంటల సమయమప్పుడు బాబాయే భక్తులను పిలువనంపారు.129.దేవు కూడా అప్పుడు అక్కడికి వచ్చి అందరిలో కూర్చున్నాడు. ముసలాడి మనసు నొచ్చుకున్నట్లుంది అని శ్రీసాయి అన్నారు.130.'చింకి గుడ్డ కథమాటేమిటో గాని అతనిని తిట్లతో బాగా గాయపరచాను.కాని అతడు దొంగిలించాడు కదా మరి.గత్యంతరం లేక అనకుండా ఉండలేక పోయాను.131.అల్లా అంతా చూస్తాడు. అతనిని అల్లాయే బాగుచేస్తాడు' అని చెప్పి క్షమాశీలియైన శ్రీసాయి 'తమ్ముడూ! దక్షిణను ఇస్తావా'అని అడిగారు.132.'ఎంత తీసుకుని రాను' అని దేవు అడిగితే వన్నెండు తీసుకుని త్వరగా రా' అని చెప్పారు. దేవు వద్ద నోట్లు కాగితాలే కాని చిల్లర రూపాయలు దొరకలేదు.133.ఆ విషయాన్ని బాబాతో చెప్పగా,'పోనీలే నా కిప్పుడు అవసరం లేదు. ఉదయం నీవు రెండు సార్లు ఇచ్చావు కదా నాకు అది గుర్తులేదు' అని అన్నారు. 134.అయినా దేవు రూపాయలను తెచ్చి బాబాకు ఇచ్చి వారి పాదాలకు వందనం చేశాడు. అప్పుడు బాబా ఏమి అన్నారో వినండి.135. 'ఏరా! నీవు ఏంచేస్తున్నావు' అని దేవును ప్రశ్నించారు.'ఏంలేదు' అని చెప్పగా 'నియమంగా గ్రంథాన్ని పఠించు'అని దేవుకు ఆజ్ఞాపించారు.136. 'వెళ్లి వాడాలో కూర్చుని నిత్యం నియమంగా గ్రంథాన్ని పఠించు. నీవు చదువుతూ భక్తిగా అందరికీ అర్థాన్ని తెలియచేస్తూ ఉండు' అని చెప్పారు.137.'నీకు చక్కటి జరీ శాలువను ఇవ్వటానికి నేనిక్కడ కూర్చుని ఉండగా చింకి గుడ్డలను దొంగిలించటానికి ఎందుకు పోతావు? నీకీ దొంగతనపు అలవాటు ఏమిటని అడిగారు.138.గ్రంథాన్ని పఠించు అని సాయి నోటి నుండి వచ్చిన మాట దేవుకు, మనసులోని మాట అర్థమై అత్యంత ఆనందం కలిగింది.139.బాబా ఆజ్ఞానుసారం దేవు ఆ రోజునుండి నిత్యం

జ్ఞానేశ్వరిని పఠిస్తూ అర్థాన్ని తెలియ చెప్పనారంభించాడు.140.నా కోరిక ప్రకారం బాబా ఆజ్ఞ లభించింది. దానితో నా చింత వదిలింది. ప్రతిజ్ఞ నెరవేరింది.ఇకనుండి జ్ఞానేశ్వరిని చదివితే పారాయణంలో నియమం ఏర్పడుతుంది. 141.ఇప్పుడు నేను గురు ఆజ్ఞాబద్దుడను.ఇక జ్ఞానేశ్వరుడు నాకు ప్రసన్నమైనట్లే.ఇంతవరకు జరిగిపోయింది పోనీ.ఇకముందు శ్రద్ధాపూర్వకంగా పఠిస్తాను.142.నా మనసే నాకు సాక్షి. ఆ పైన సాయి ఆజ్ఞ ప్రమాణం.ఆజ్ఞా బలంతో ఇక మీద నా గ్రంథపారాయణ నిర్విఘ్నంగా జరుగుతుంది.143.బాబా! మీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. అనన్యభావంతో శరణు జొచ్చిన ఈ బిడ్డను మీ ఒడిలోనికి తీసుకుని నాతో చదివించండి.144.చింకి గుడ్డ ఏమిటో నాకు అర్థమైంది. అంటే నేను బాలకరాంను అడగటం – అది బాబాకు నచ్చలేదు. కనుకనే బాబా కోప పడ్డారు. 145.ఉపాసన గురించి, పరబ్రహ్మ చింతన గురించి నీకు బాబా ఎలా బోధించారు అని నేను బాలకరాంను అడగటం బాబాకు అసలు నచ్చలేదు.146.ఆ విషయాలన్నీ తెలియచేయటానికి నేనిక్కడ తత్పరతతో ఉండగా ఇతరులను అడగటం ఎందుకు అని వారు నన్ను బాధ పెట్టారు అని అనిపిస్తుంది.147. బాధించటం అన్నమాట కఠినంగా ఉంది. భక్తుల కోసం ప్రేమను కురిపించే బాబా, కలలో కూడా భక్తుల బాధను చూడలేరు. బాబాకు బాధించటమనే మాట వర్తించదు.148.నన్ను వారు బాధ పెట్టలేదు. నాకు నేర్పించారు. నీ మనసు లోని కోరికలను నేను స్వయంగా తీర్చాలి. కనుక ఎప్పుడూ దొంగిలించాల్సినపని లేదు.149.సాయిబాబా పైకి క్రోధం ఆవేశించినట్లు కనిపిస్తారు. లోపల ఎప్పుడూ ప్రసన్నంగా ఉంటారు. పైకి సంతాపంతో బాధ పడుతున్నట్లు కనిపించినా వారు లోపల సంతృప్తితో ఆనందంగా ఉంటారు.150.లౌకిక రీత్యా పైకి కోపాన్ని చూపించినా లోపల పరమానందంలో ఉంటారు. అటువంటి సాయిలీలా వైభవాన్ని గానం చేయటానికి ఎంతో భాగ్యము ఉండాలి.151.

తమ స్వార్థాన్ని సాధించుకోవాలని తపనపడేవారు తమ శ్రేయస్సునే అభిలషిస్తారు. కనుక తిట్లను పుష్పవృష్టిలా భావిస్తారు. 152.కర్ణకఠోరంగాను అశ్లీలంగాను ఉన్న మాటలు దేవు మనసును విచలితం చేయలేదు. ప్రేమతో నిండిన అతని మనసుకు పూవులతో కొట్టినట్లు అనిపించింది.153.ఆవు పొదుగు బాగా పాలతో నిండి ఉన్నా ఆ పాలు భాగ్యవంతులకే లభిస్తాయి. జోరీగలు పొదుగువద్దనే ఉంటాయి కాని వానికి మురికి రక్తమే ప్రాప్తి.154. కుములాలున్న సరోవరంలో కప్పలూ ఉంటాయి. కాని ఆ కుములాల మకరందాన్ని తుమ్మెదలు దోచుకుంటే దౌర్భాగ్యపు కప్పలకు బురదయే ఆహారం.తుమ్మెదల భాగ్యానికి అంతులేదు.155.అట్లే మీరు భాగ్యవంతులు. మనం పరస్పరం కలుసుకున్నాం.మీకు తోచిన వానిని అడగండి. మీ సంశయాలను తీర్చుతాను' అని సాయి చెప్పారు.156.నా మొండితనాన్ని చూడండి.బాబా స్వయంగా 'చదువు' అని చెప్పేవరకు జ్ఞానేశ్వరీగ్రంథాన్ని తెరవను అన్న నా పట్టుదలను బాబా తీర్చారు.157.అని దేవు అనుకున్నాడు. తల్లి గారాబంగా తన బిడ్డల మురిపాలను తీర్చినట్లే, ఈ కథ భక్తిని మధురానుభవాన్ని కలిగిస్తుంది.158.బాబా చదువు అని చెప్పటంతో ఆగలేదు. సంవత్సరం తిరగకుండానే కలలో దర్శనమిచ్చి నా గురించి ఏం అడిగారో వినండి.159.క్రీ.శ.**1914** వ సం॥ ఏప్రిలు రెండవ తారీఖున గురువారం తెల్లవారు తుండగా ఒకసారి స్వప్నంలో వారి అనుగ్రహాన్ని పొందాను.160.సాయి సమర్థులు స్వప్నంలోకి వచ్చి మేడపైన కూర్చుని,'గ్రంథం అర్థమౌతూ ఉందా?'అని అడిగారు.నేను 'లేదు' అని జవాబిచ్చాను. 161.'ఎప్పుడు అర్థం చేసుకుంటావు?'అని మరల అదే ప్రశ్న.నాకళ్లలో నీరు కారాయి. నేను ఏం జవాబిచ్చానంటే,162.'మీ అనుగ్రహం లేకుండా' గ్రంథపఠన కేవలం శ్రమ. అర్థం చేసుకోవటం అంతకంటే కఠినం అని నేను గట్టిగా చెప్పగలను.163.బాబా,'గ్రంథం చదివేటప్పుడు నీవు చాలా తొందరపడుతున్నావు. ఏదీ నా దగ్గర కూర్చుని చదువు

చూస్తాను' అని అన్నారు. 164.'ఏం చదవను?' అని అడిగితే ఆధ్యాత్మికతకు సంబంధించినది చదువు అని బాబా ఆజ్ఞ ఇచ్చారు. గ్రంథం తేవటానికి వెడుతుంటే వెంటనే కళ్లు తెరుచుకున్నాయి. 165. అప్పుడు దేవు మేలుకున్నాడు. మేలుకున్నాక తన కలను గుర్తుకు తెచ్చుకున్న దేవు మనసు ఎలా ఉంటుందో శ్రోతలు ఆలోచించుకోవాలి. 166. ఒక సంవత్సరం పాటు గమనిస్తూ బాలుడు ఆజ్ఞను పాలిస్తూ నిత్యం గ్రంథం పఠిస్తున్నాడా లేదా అన్న చింత ఎవరికి ఉంటుంది? 167. చెప్పినట్లే చేస్తున్నాడా లేదా ఏదైనా పొరపాటు చేస్తున్నాడా? ఎక్కడ పొరపాటు చేస్తున్నాడు? అని ఎప్పుడూ గమనించేవారు ఎవరు? 168. పాఠకులు ఎలా దక్షతతో ఉండాలి, ఎక్కడ విశేషధ్యానం కలిగి ఉండాలి అని సాయి మాత తప్ప ప్రత్యక్షంగా ఎవరు గమనిస్తారు? 169. ఇటువంటి సాయిసమర్థుని లీలలను ఇటువంటి ఆత్మానంద వైభవాన్ని భక్తులు అనేక సమయాలలో అనుభవించడం నేను ప్రత్యక్షంగా నాకళ్లతో చూచాను. 170. శ్రోతలారా! ఇప్పుడు మనం గురుచరణ కమలాలలో లీనమైపోయి తరువాతి కథా విశేషాలను మరల విందాము. 171. శ్రీసాయి సమర్థుని చరణాలను గుర్తు తెచ్చుకుని సద్భక్తితో సాష్టాంగ పడుతున్నాను. వారి శరణు వేడుతున్నాను. దాని ద్వారానే సకల భవ దుఃఖాలనుండి విమోచనం. 172. హేమాడు పంతుకు సాయియే సర్వస్వం. సాయియే స్వార్థం. నిరతిశయ సుఖాన్నిచ్చే సాయియే పరమార్థం. కృతార్థునిగా చేసేది సాయియే అని అతని నిశ్చితాభిప్రాయం. 173. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో సాయి కృపా అనుగ్రహదానమను నలుబది ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత - 42 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

సత్పురుష శ్రేష్ఠా! మీకు నమస్కారం.1.భక్తుల పాలిటి కల్పతరువైన సాయిసత్పురుషుల అవతారం. వారు దీనులకు తమ పాదాలయందు ఆశ్రయాన్నిచ్చి భవనదిని దాటే మార్గాన్ని చూపుతారు. 2.గతాధ్యాయంలో సాయి యొక్క పటం జలనిమజ్జనం నుండి ఎలా తప్పించుకుని రక్షింప బడింది అన్న విశిష్టమైన మధుర కథ చెప్పబడింది.3.బాబా ఒక భక్తుని కలలో కనిపించి జ్ఞానేశ్వరిని పఠించమని స్పష్టంగా అనుజ్ఞ ఇచ్చి అతని కోరికను తీర్చిన కథను కూడా విన్నారు.4.సారాంశం, గురుకృపాయోగం కలిగితే భవభయదుఃఖాలు తొలగిపోతాయి. ముక్తి మార్గద్వారాలు తెరచుకుని కష్టాలు సుఖాలుగా మారిపోతాయి.5.నిత్యం సద్గురు చరణాలను స్మరిస్తే విఘ్నాలను కలిగించే విఘ్నం తొలగిపోతుంది.మరణానికి కూడా మరణం వచ్చి ప్రాపంచిక దుఃఖాలను మరచిపోగలరు.6. అందువలన శ్రోతలు, తమ శ్రేయస్సు కోసం ఈ సాయి సమర్థుని చరితాన్ని శ్రవణం చేయండి. దీని వలన శీఘ్రంగా అత్యంత పావనులౌతారు.7.ఇప్పుడు ఈ అధ్యాయంలో మనం సాయి యొక్క స్వభావాన్ని అంటే వారి మనసులోని కాఠిన్యాన్ని లేదా మృదుత్వాన్ని గూర్చి వర్ణించు కుందాం.8.ఇంతవరకూ ఏకాగ్ర చిత్తంతో బాబా యొక్క లీలలను విన్నట్లే ఇప్పుడు బాబా తమ శరీరాన్ని త్యజించిన వృత్తాంతాన్ని శ్రద్ధగా వినండి.9.బాబా యొక్క సహవాస సుఖాన్ని అర్ధశతాబ్దం కంటే ఎక్కువకాలం అనుభవించి ఆనందించిన శిరిడీ ప్రజలు ధన్యులు. 10. శక.

సం॥ 1840 లో దక్షిణాయన ప్రథమ మాసంలో శుక్ల పక్షంలోని విజయదశమి రోజున (క్రీ.శ. 1918. వ.సం॥అక్టోబరు 15) బాబా శరీరాన్ని వదిలారు. 11. ముసల్మానుల మొహరం నెలలోని తొమ్మిదవ తారీఖున కత్తల్ రాత్రి రోజున సుమారు మూడవ ఝామున (మధ్యాహ్నం రెండు గంటలప్పుడు) బాబా నిర్వాణానికి సిద్ధమయ్యారు. 12. బుద్ధుని బుద్ధ జయంతి రోజున సాయి యొక్క పుణ్య తిథి. దేవతల జయంతి వలెనే సత్పురుషుల పుణ్యతిథి కూడా జరుపబడుతుంది. 13. పన్నెండున్నర గంటలు గడిచి, దశమి కాలం పూర్తిగా దాటిపోయి ఏకాదశి వచ్చింది. కనుక సాయి యొక్క నిర్వాణకాలం ఏకాదశి. 14. సూర్యోదయం నుండి తిథిని పాటిస్తే, ఆరోజు తిథి దశమి. అందువల్ల సాయిబాబా నిర్వాణం విజయదశమిగా భావించి ఆరోజు ఉత్సవం చేస్తారు. 15. మంగళవారం చాలా ప్రసిద్ధి చెందిన కత్తల్ రాత్రిరోజు అని సాయి మహారాజు తమ జ్యోతిని విశ్వజ్యోతిలో ఐక్యం చేశారు. 16. పంగదేశంలో ప్రసిద్ధమైన దుర్గా పూజా పర్వదినసమాప్తి రోజు ఉత్తరహిందూస్థానంలోని వారందఱికీ ఉత్సవదినం. 17. శక సం॥ 1838 విజయదశమి రోజునే సాయంకాలం ప్రదోషసమయాన బాబా భవిష్యాన్ని సూచించారు. 18. ఆ అపూర్వలీలను చెప్పుతాను. శ్రోతలకు ఆశ్చర్యం కలుగుతుంది. అంతుపట్టని సాయి సమర్థుని మహిమ అందరికీ అర్థమౌతుంది. 19. క్రీ.శ. 1916 వ సం॥ దసరా పండుగ రోజున సీమోల్లంఘన వేళ, సాయంకాలం ప్రజలు పూజచేసి తిరిగివచ్చాక, అద్భుతమైన లీల జరిగింది. 20. అకస్మాత్తుగా ఆకాశంలో మేఘాలు ఉరుముతుండగా మెరుపులు మెరిసినట్లు బాబా జమదగ్ని స్వరూపాన్ని ప్రత్యక్షంగా ప్రకటం చేశారు. 21. ఉన్నట్లుండి తల రుమాలును, కఫనీని లంగోటిని కూడా విప్పేసి ధునిలో వేశారు. 22. అసలే ధునిలో అగ్ని ప్రజ్వలంగా ఉంది. తోడుగా అందులో ఆహుతిని వేసేసరికి, జ్వాలలు మరింతగా పైకి లేచి భక్తులను కలవర పెట్టాయి. 23. ఇదంతా అనుకోకుండా

జరిగిపోయింది. బాబా మనసులో ఏముందో ఏమీ అర్థం కాలేదు. సీమోల్లంఘన సమయాన వారి క్రోధవృత్తి చాలా భీతిని కలిగించేలా ఉన్నది.24.అగ్ని తన తేజాన్ని వెదజల్లింది. బాబా అంతకంటె తేజోవంతంగా కనిపించారు. భక్తుల కళ్లు మూసుకుని పోగా ముఖాలను త్రిప్పేసుకున్నారు.25.సత్పురుషులు స్వహస్తంతో అర్పించినదానిని సేవించి అగ్నినారాయణుడు ప్రసన్నుడయ్యాడు. దిగంబరులైన బాబా పరశురాముని వలె ఉగ్రంగా అయ్యారు.వారిని అలా చూచినవారి కళ్లు ధన్యం.26.కోపంతో విప్పారిన బాబా కళ్లు ఎఱ్ఱబారాయి. 'నేను హిందువునా మహమ్మదీయుణ్ణా ఇప్పుడు నిర్ణయించు కోండిరా.27.హిందువునా లేక యవనుణ్ణా బాగా నిర్ధారించుకోండి. మీసందేహాలను తొలగించు కోండి' అని గట్టిగా కేకలు వేశారు.28.ఆ దృశ్యాన్ని చూచి భక్తులు వణికి పోయారు. వారికి బాబా ఎలా శాంతిస్తారు అన్న చింత పట్టుకుంది.29.మహావ్యాధిగ్రస్తుడైన బాబా యొక్క భక్త శ్రేష్ఠుడు భాగోజీ శిండే ధైర్యాన్ని పుంజుకుని బాబా సమీపానికి వెళ్లి వారికి లంగోటిని చుట్టాడు.30.బాబా! ఇవాళ దసరా పండుగ సీమోల్లంఘనం రోజున ఇదంతా ఏమిటి? అని అన్నాడు. 'నా సీమోల్లంఘనం ఇదే! అని చెప్పి బాబా టపటపమని సటకాతో కొట్టారు.31.ఈ విధంగా బాబా ధునివద్ద దిగంబర వేషంలో నిలుచున్నారు.ఆ రోజున చావడి ఊరేగింపు ఎలా జరుగుతుందా అని అందరికీ చింత.32.ఊరేగింపు తొమ్మిదికి జరగాలి కాని పదైనా బాబా శాంతించలేదు.భక్తులు ఎక్కడివారు అక్కడే రెప్పవేయకుండా చూస్తూ తటస్థంగా ఉండిపోయారు.33.అలా అలా పదకొండు అయింది. అప్పుడు బాబా కాస్త శాంతించి క్రొత్త లంగోటిని కట్టుకుని కఫనీని ధరించారు.34. చావడికి బయలుదేరటానికి గంట మ్రోగింది. ఊరికే కూర్చుని ఉన్న భక్తులు పల్లకిని పూలతో శృంగారించి బాబా ఆజ్ఞానుసారం ప్రాంగణం లోనికి తీసుకొని వచ్చారు.35.వెండిదండం, పతాకం, వింజామరలు, ఛత్ర చామరాది, రాజోపచారాలతో

అలంకారాలతో రోజు విడిచి రోజు వెడలే ఊరేగింపు బయటికి బయలుదేరింది. 36.సాయినాథ్ మహారాజ్ కి జై! అని ఒకటే కేకలు. ఆ జయజయకారాలను ఎలా వర్ణించడం? అంతటా ఆనందం నిండిపోయింది. 37.అప్పుడు బాబా తెల్లటి శుభ్రమైన రుమాలును తలకు చుట్టుకుని చిలుం పొగాకు సటకా చేతపుచ్చుకుని అదే సుముహూర్తమన్నట్లుగా బయలుదేరారు. 38.ఒకరు ఛత్రం, ఒకరు చామరం, ఒకరు అందమైన నెమలిపింఛముల వీవన, మరొకరు గరుడుని చిత్రం ఉన్న పతాకం, ఒకరు దండం పట్టుకున్నారు. 39.ఆ విధంగా బాబా సీమోల్లంఘన మిషతో భవసాగర సీమోల్లంఘనానికి దసరాయే మంచి ముహూర్తమని అందరికీ సూచించారు. 40.అటుతరువాత శిరిడీ వారికి, బాబా ఒక్కటే దసరా పండుగను చూపించి, తరువాతి దసరా సుముహూర్తాన తమ శరీరాన్ని ధరార్పణ చేశారు. 41.కేవలం సూచించటమే కాదు. స్వయంగా అనుభవించి చూపారు. తమ శరీరమనే శుద్ధవస్త్రాన్ని ఇదే దసరా రోజున యోగాగ్నికి అర్పించారు. 42.క్రీ.శ. 1918 వ సం. దసరా పండుగరోజును సుముహూర్తంగా చేసుకుని తమ ఆత్మను పరబ్రహ్మస్వరూపంలో లీనం చేశారు. 43.వ్రాస్తూ వ్రాస్తూ ఉంటే ఇటువంటిదే బాబా యొక్క మరొక అనుభవం గుర్తుకు వచ్చింది. దీనివల్ల ఇదే విజయదశమి తిథి, బాబా పుణ్య తిథి అని ముందుగానే నిశ్చయమైంది. 44.శిరిడీ పటేలు రామచంద్ర దాదా ఒకసారి చాలా జబ్బు పడ్డాడు. ఆ బాధను భరించలేక పోయాడు. 45. ఏదీ మిగలకుండా అన్ని రకాల చికిత్సలూ అయ్యాయి. అతి దుఃఖకరమైన కష్టాన్ని నిగ్రహించుకోలేక పోయాడు. జీవితంపై విరక్తి కలిగింది. పటేలు చాలా బాధపడిపోయాడు. 46.అట్టి పరిస్థితిలో ఒక అర్ధరాత్రి బాబా అతని తలవైపు ప్రకటమయ్యారు. 47.అప్పుడు పాటీలు బాబా పాదాలు పట్టుకుని నిరాశతో, 'నాకు మరణం ఎప్పుడు వస్తుంది? ఇంతమాత్రం నిశ్చయంగా చెప్పండి .48.నాకు జీవితంపై అసహ్యం కలిగింది. మృత్యువు కష్టమని

అనిపించడం లేదు. చావు ఎప్పుడు నన్ను కలుసుకుంటుందా అని ఎదురు చూస్తున్నాను.' అని అన్నాడు. 49. అప్పుడు కరుణా మూర్తి అయిన బాబా 'నీవు ఏ చింతా పెట్టుకోకు. నీ గండం గడిచింది. చావు భయం తొలగిపోయింది. వృథాగా ఎందుకురా బాధ పడతావు? 50. నీకేం భయంలేదు. నీకు మరణం తప్పింది. కాని రామచంద్రా! నాకు తాత్యాస్థితి ఆశాజనకంగా కనిపించటం లేదు. 51. శ.క. సం॥ 1840 (1918) దక్షిణాయనంలోని ఆశ్వయుజ మాసంలో శుక్లపక్షపు విజయదశమిరోజున తాత్య ముక్తిని పొందుతాడు. 52. ఈ విషయం అతనితో చెప్పవద్దు. దీనినే మనసులో పెట్టుకుని కూచుంటాడు. అహర్నిశలూ చింతలో క్షీణించిపోతాడు. మరణం ఎవరికీ ఇష్టముండదు. 53. కేవలం రెండు సంవత్సరాలే మిగిలాయి. తాత్యాకు సమయం సమీపించింది. రామచంద్రునికి దిగులు పట్టుకుంది. బాబా మాట వజ్రలేపనం వంటిది. 54. తాత్యాకు చెప్పకుండా రహస్యంగా ఉంచాడు. బాలా అనే దర్జీ చెవిన వేసి ఈ విషయం ఎవరికీ తెలియచేయవద్దు అని వేడుకున్నాడు. వారిద్దరికీ చింత పట్టుకుంది. 55. నిజంగానే రామచంద్రపాటిలు ప్రక్కపైనుండి లేచాడు. అతని జబ్బు తగ్గింది. రోజులు లెక్కపెడుతూ లెక్కపెడుతూ తెలియకుండానే కాలం గడిచిపోయింది. 56. బాబా చెప్పిన మాట లోని విశేషం. శ.క. సం॥ 1840 లోని భాద్రపదమాసం గడిచి ఆశ్వయుజం ఆరంభమైంది. తాత్యా మంచాన పడ్డాడు. 57. అక్కడ తాత్యా జ్వరంతో జబ్బు పడితే ఇక్కడ బాబాకు చలితో వణుకుపట్టుకుంది. తాత్యాకు బాబాపై నమ్మకం. బాబాను రక్షించేవాడు శ్రీహరి. 58. బాబా దర్శనానికి కూడా వెళ్లలేకుండా తాత్యా పక్క వదలకుండా ఉన్నాడు. అతడు శరీర బాధను భరించలేక పోతున్నాడు. 59. విశేషమేమిటంటే అంతటి మూతనలో ఉన్నా మనసును బాబాపై ఉంచాడు. నడువలేకుండా కదలలేకుండా ఉన్నాడు. అతని బాధ బాగా పెరిగిపోతూ ఉంది. 60. ఇక్కడ బాబా బాధతో మూలగటం రోజురోజుకూ పెరుగుతూ రెండింతలైంది. అలా

వారి బాధ ఆపలెనంతగా అయింది.61. బాబా సూచించిన రోజు సమీపించింది. బాలాకు రామచంద్ర పటేలుకు ఒళ్లు చెమటలు పట్టసాగాయి.62. బాబా చెప్పింది నిజంగానే జరిగేలా ఉంది. తాత్యాకు మంచి లక్షణాలు కనిపించటం లేదు. అతని బాధ అధికమౌతూనే ఉంది అని వారు అనుకున్నారు. 63. శుక్ల పక్ష దశమి వచ్చింది. తాత్యా నాడి కొట్టుకోవడం మెల్లగా తగ్గసాగింది. అతనికి మృత్యువు సమీపించినట్లు అనుమానించి ఆప్తులు ఇష్టులు గాబరాపడ్డారు.64. కాని విశేషం జరిగింది. తాత్యా గండం తప్పి తాత్యా కూడా బ్రతికిపోయాడు. అతనికి బదులుగా పోయినట్లు బాబాయే వెళ్లిపోయారు.65. బాబా వాణిని గమనించండి. తాత్యా పేరు చెప్పి, ఏకాస్తవేళా తప్పకుండా ఆ సమయానికి తమ ప్రయాణాన్ని సన్నాహపరుచుకున్నారు.66. భవిష్యాన్ని నిదర్శనంగా సూచించారు. అయినా అంతా జరిగిపోయే వరకూ ఎవరికీ అర్థం కాలేదు.67. తాత్యాకు బదులుగా బాబా తమ శరీరాన్ని ఇచ్చి తాత్యా మృత్యువును ఆపేశారని ప్రజలు అన్నారు. ఏమో వారిలీల వారికే అర్థమౌతుంది.68. బాబా శరీరాన్ని వదిలాక, సుప్రభాతాన అరుణోదయవేళ వారు పండరిపురం లో దాసగణుకు స్వప్న దృష్టాంతాన్ని కలిగించారు.69. 'మసీదు కూలిపోయింది. శిరిడీలోని నూనె వ్యాపారులందఱూ నన్ను బాగా కష్టపెట్టారు. నేను ఇప్పుడు అక్కడి నుండి వెళ్లిపోతున్నాను.70. అందుకే నేను ఇక్కడి వరకూ వచ్చాను. వెంటనే శిరిడీకి పద వచ్చి నన్ను బాగా పొగడ పూలతో కప్పు. ఈ నా కోరికను తీర్చు.'71. ఇంతలో శిరిడీనుండి ఉత్తరం అందగా బాబా సమాధి చెందినట్లు తెలిసింది. ఆ వార్త విని దాసగణు తక్షణం శిరిడీకి బయలుదేరాడు.72. శిష్యపరివారాన్ని వెంట పెట్టుకుని వచ్చి సమాధి ఎదుట జయజయ కారాలతో రాత్రీపగలు భజన, నామసంకీర్తన చేశాడు. 73. తను స్వయంగా హరి నామంతో అత్యంత మనోహరంగా పూలహారాన్ని గ్రుచ్చి ప్రేమతో సమాధిపై అలంకరించాడు.

అన్న సంతర్పణ కూడా చేశాడు.74.ఆ అఖండ నామఘోషతో శిరిడీ భూలోక వైకుంఠమైంది. ఆ నామం ప్రతిధ్వనిస్తూ ఆ ప్రాంతమంతా నిండిపోయేలా దాసగణు నామాన్ని కురిపించాడు.75.బాబాకు దసరా యందే ప్రీతి ఎందుకు? అంటే సంవత్సరంలోని మూడున్నరరోజుల ముహూర్తాలలో దసరాను ప్రయాణ కార్యాలలో విశేష శుభసమయంగా భావించటం అందఱికీ విశదమే.76.అయినా ఇది సమంజసం కాదు. రాకపోకలనేవి లేని వారికి మరణమెక్కడుంటుంది?అట్టి వారికి శుభ ముహూర్తం ఎందుకు?77.ధర్మాధర్మ బంధనాలు లేనివారికి, సకల బంధనాలు విడిపోయినవారికి ప్రాణం పోవటమనేదే లేనివారికి నిర్యాణమెక్కడిది.78.'బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి' అన్నట్లు బ్రహ్మ వంటి బాబాకు, రావటం పోవటం లేని సాయిమహారాజుకు మరణమెలా సంభవం? 79.అసలు పయనమనేదే లేని వారికి ఉత్తరాయణమైతే ఏం? దక్షిణాయనమైతేనేం? దీపపుజ్యోతి దీపంలోనే మిళితమయేలా వారు ప్రాణాలను పరబ్రహ్మలో విలీనం చేశారు.80.పంచభూతాల నుండి అప్పుగా తెచ్చుకున్న ఈ శరీరంతో తమ పనిని సాధించుకున్న తరువాత ఎవరివి వారికి తిరిగి ఇచ్చేయాలి కదా!81.బాబా భవిష్యత్తులో జరగవలసిన దానిని ముందుగానే సూచించారు. ఆ అమూల్యమైన సమయం గడచిపోయింది.వారి కీర్తి శాశ్వతంగా నిలిచిపోయింది.82. బాబాకు జ్వరం రావటం నెపం. వారు లౌకిక రీతిని అనుకరిస్తూ ఒకప్పుడు మూలుగుతూనో లేదా బాధ పడుతూ పైకి కనిపించినా లోపల వారు ఎప్పుడూ సావధానంగా ఉండేవారు. 83.ఆ రోజు ఉదయం సుమారు తొమ్మిది పది గంటలప్పుడు నిర్వాణ సమయం సమీపించగా బాబా తమంతట తాము లేచి నిశ్చలంగా కూర్చున్నారు.84.ఆ స్థితిలో వారిని చూచి భయంకరమైన అశుభసమయం దాటి పోయిందని అందఱికి అనిపించి ఆశా సముద్రం ఉప్పొంగింది.85.అందఱూ అలా కూర్చుని దుఃఖిస్తుండగా బాబాకు అంతిమ సమయం

సమీపించింది. అప్పుడు జరిగిన వృత్తాంతాన్ని వినండి .86.ప్రాణం వదలటానికి కాస్త ముందుగా, బాబాకు ఏమి తోచిందో తెలియదుగాని వారు తమ చేతిని కఫనీ జేబులో పెట్టారు. అది దాన ధర్మాలు చేయవలసిన సమయమని తలచి కాబోలు. 87.లక్ష్మీబాయి అనే సుగుణవతి పేరుకు తగినట్లుగా ప్రవర్తిస్తూ ఎల్లప్పుడూ సాయి చరణాలలో ప్రీతి కలిగి ఉండే ఆ స్త్రీ అప్పుడు సాయి సన్నిధిలో ఉంది.88.క్షణంలో తమ దేహావసానమని తెలుసుకుని బాబా జాగరూకతతో ఆమెకు ఆ అవసానసమయంలో ద్రవ్యదానం చేశారు.89.ఈ లక్ష్మీబాయి శిండేయే మసీదులో బాబా వద్ద నియమనిర్భంధనాలను పాటిస్తూ పనులను చక్కగా నిర్వహిస్తుండేది.90.బాబా దర్బారు ఎవరికీ ఏ అడ్డూ ఆటంకం లేకుండా ప్రతిరోజూ అందఱికీ తెరిచే ఉండటం పరిపాటి. కాని రాత్రి మాత్రం కఠిననియమం. 91.సాయంకాలం బాబా విహరించి, తిరిగి రాగానే భక్తులు ఇళ్లకు వెళ్లిపోయి మరునాడు తెల్లవారిన తర్వాతే మసీదుకు వచ్చేవారు.92.కాని భక్త మహాల్సాపతి, ధాదాకేల్కరు, లక్ష్మీబాయిల భక్తి కారణంగా వీరికి రాత్రివేళలందు నిషేధముండేది కాదు.93.ఈ లక్ష్మియే ప్రతిరోజూ ఎంతో ప్రేమగా బాబాకు భోజనవేళలో రొట్టె కూర పంపేది. ఈమె సేవను ఎంతని వర్ణించను?94.ఈ రొట్టె కథను వింటే బాబా యొక్క దయార్ద్ర హృదయం మరియు శ్వాన సూకరాలలో వారి ఆత్మైక్యభావం తెలిసి ఆశ్చర్యం కలుగుతుంది.95.ఒకసారి సాయంకాలం బాబా తమ ఛాతిని గోడకు ఆన్చి ప్రేమగా ముచ్చటిస్తుండగా అక్కడికి లక్ష్మి వచ్చింది.96.తాత్యా పాటీలు ఇంకా ఇతరులు కూడా బాబా వద్ద ఉన్నారు. లక్ష్మి వచ్చి బాబా పాదాలకు వందనం చేసింది. అప్పుడు బాబా ఆమెతో, 97 ' లక్ష్మి నాకు ఆకలి వేస్తోంది.' అని చెప్పారు. ఆమె 'బాబా! నేను ఇప్పుడే వెళ్లి రొట్టె తీసుకుని తిరిగి వస్తాను' 98 అని చెప్పి వెళ్లి వెంటనే రొట్టెను చేసి కూర పచ్చడితో సహా తీసుకుని వచ్చి ఆ అల్పాహారాన్ని బాబా ఎదుట ఉంచింది.

99.బాబా ఆ విస్తరిని తీసి కుక్క ఎదుట ఉంచారు. వెంటనే లక్ష్మి, 'బాబా! మీరిలా చేశారేమిటి?' అని ప్రశ్నించింది.100.నేను ఇంత త్వరగా వెళ్లి రొట్టె కూరను తయారుచేసి తెస్తే ఇదేం విడ్డూరం బాబా! కుక్కను బాగా సంతుష్టపరచావు.101.'నీకు ఆకలి వేస్తూ ఉంది కదా మరి, ఇదేం విచిత్రం? ఒక ముక్కైనా నోట్లో వేసుకోలేదు. అనవసరంగా నన్ను తొందరపెట్టావు'102.బాబా ఆమెతో, ' ఎందుకు వృధాగా బాధ పడతావు? ఈ కుక్క కడుపు నిండితే నేను తృప్తి చెందినట్లే అని తెలుసుకో!103.ప్రాణులన్నింటికీ ఆకలి ఒక్కటే. ఈ కుక్కకు ప్రాణం లేదూ! అది మూగ జీవియైతే నేను మాట్లాడేవాణ్ణి అంతే, ఆకలిలో భేదం ఉంటుందా?104.ఆకలితో ప్రాణం విలవిలలాడుతూ వ్యాకులపడేవారికి అన్నం దానం చేస్తే దానిని నానోటికి అందించినట్లే అని తెలుసుకో! ఈ నా వచనం సర్వత్రప్రమాణం'. అని చెప్పారు.105.ఇది వ్యావహారిక సందర్భమే అయినా అంతా పరమార్థబోధ. సాయిబాబా యొక్క ఈ ఉపదేశవచనం ప్రేమరసంతో పరిపక్వమైనది.106.వారు సులభమైన ప్రాపంచిక భాషలో చెప్పుతూ పరమార్థ రూపురేఖలను చిత్రీకరిస్తారు; ఎవరి దోషాలను చూడక ఎవరినీ దూషించక భక్తులను సంతోష పెడతారు.107.వారి ఉపదేశానుసారం అప్పటినుండి లక్ష్మి ప్రతిరోజూ రొట్టెముక్కలను పాలలో వేసి ప్రేమ పూర్వకంగా తెచ్చిపెట్టేది.108.బాబాకూడా అదే అలవాటుగా ఆమె రొట్టెను ప్రేమతో తినేవారు. ఎప్పుడన్నా ఆలస్యమైతే బాబాకు ఆ భోజనం రుచించేది కాదు.109.లక్ష్మి రొట్టె రావడం ఆలస్యమైనప్పుడు భోజనసమయం దాటిపోయినా, అందరి పళ్ళేలలో అన్నం వడ్డించి ఉన్నా, లక్ష్మి రొట్టె వచ్చేవరకు బాబా నోట్లో ముద్ద పెట్టుకునేవారు కారు. 110.పళ్లెంలోని అన్నం చల్లబడి నీరుగారి పోయినా, అంతా ఆకలితో అలమటించిపోతూ కూర్చోవటమేగాని లక్ష్మి రొట్టె రాకుండా భోజనం చేసేవారు కారు.111.తరువాత కొంతకాలం వరకు బాబా ప్రతిరోజూ

గంటలప్పుడు లక్ష్మితో సేమ్యాను తెప్పించుకుని ఆమె వద్ద కూర్చుని సేవించేవారు.112. బాబా అతి పరిమితంగా సేవించి, మిగిలిన దానిని బాబా ఉచ్ఛిష్ట ప్రసాదాన్ని ప్రీతిగా కోరుకునే రాధాకృష్ణబాయికి లక్ష్మిద్వారానే పంపించేవారు. 113. సాయి యొక్క శరీరవిసర్జనా వృత్తాంతాన్ని చెప్పుతూ సంబంధంలేని ఈ రొట్టె కథ ఎందుకు అని శ్రోతలు అనకండి. ఇది సాయి యొక్క సర్వవ్యాపకత్వాన్ని తెలియచేస్తుంది.114. సకల చరాచర దృశ్యాలకు అతీతంగా ఉన్న పరాత్పరులైన సాయి అంతటా ఎప్పుడూ నిండి ఉన్నారు. వారికి జననం లేదు. వారు అమరులు.115. ఈ తత్వాన్ని తెలియ చేయటమే ఈ కథ యొక్క ఉద్దేశం. లక్ష్మికి సంబంధించిన ఈ మధుర వృత్తాంతం సహజంగా గుర్తుకు వస్తే ఇది శ్రోతల కోసమే అని నేను భావిస్తాను.116. ఇటువంటి లక్ష్మి యొక్క సేవ బాబా ఎలా మరచిపోగలరు? వారు ఎంత బాగా గుర్తుంచుకున్నారో ఆ విషయాన్ని శ్రద్ధగా వినండి.117. తమ శరీరం చిక్కి నీరసించిపోయినా, ప్రాణం కంఠం వరకూ వచ్చినా బాబా తమ శరీర అవసానసమయంలో లక్ష్మికి స్వహస్తాలతో దానం చేశారు.118. ఒకసారి అయిదు మరోసారి నాలుగు రూపాయలను జేబులోనుండి బయటికి తీసి ఆమె చేతిలో ఉంచారు. బాబా చేసిన చివరి దానం ఇదే.119. ఇది నవవిధ భక్తికి గుర్తుగానా? లేక ఇది దుర్గానవరాత్రి పూజలయాక సీమోల్లంఘన రోజున ఇచ్చే దక్షిణా?120. లేక శ్రీమద్భాగవతంలో శ్రీకృష్ణుడు ఉద్ధవునితో చెప్పిన శిష్యుల నవలక్షణాలను బాబా గుర్తుకు తెచ్చారా?121. ఏకాదశస్కంధంలో, దశమాధ్యాయంలో, ఆరవ శ్లోకం యొక్క విశేషాన్ని గమనించండి. శిష్యులు గురువుల అనుగ్రహాన్ని సంపాదించు కోవటానికి ఎలా ప్రవర్తించాలో చెప్పబడి ఉంది. 122. పూర్వార్ధంలో అయిదును ఉత్తరార్ధంలో నాలుగు చెప్పినట్లుగా బాబా కూడా అదే క్రమంలో అదే ఉద్దేశంతో ఇచ్చినట్లుంది.123. శిష్యుడు గౌరవమర్యాదలను ఆశించనివాడు, గర్వం లేనివాడు ఏ మమకారం లేని

గురుసేవాపరుడు, నిశ్చలమైన మనసుకలవాడు, పరమార్థ జిజ్ఞాస పరుడుగా ఉండాలి.124. అసూయ వ్యర్థప్రేలాపనా లేకుండా ఉండాలి. ఇటువంటి లక్షణాలతో తమ గురువును సంతుష్టపరచాలి.125. ఇదే సాయినాథుల ఉద్దేశం. ఈ విధంగా తెలియచేశారు. కరుణామయులైన సత్పురుషులు ఎప్పుడూ, భక్తులశ్రేయస్సును మాత్రమే ఆలోచిస్తారు. 126. లక్ష్మి తినటానికి బాగా ఉన్న భాగ్యవంతురాలు. ఈ తొమ్మిది రూపాయలు ఆమెకు ఒక లెక్కా? వానిని ఆమె దిగతుడిచి పారేయగలదు. అయినా కాని ఆమెకు ఆ దానం అపూర్వమైనది.127. ఆమె పరమభాగ్యం కారణంగా, సాయి కృపాప్రసాదమైన ఇలాటి నవరత్నావళిని సాయియొక్క కరకమలం ద్వారా పొందినది.128. ఇలా ఎన్నెన్నో తొమ్మిది రూపాయిలు ఖర్చు అయి ఉంటాయి. కాని ఈ దానం అత్యంత అపూర్వం. ఆమె జీవించి ఉన్నంత వరకు ఆమెకు సాయి స్మరణ ఉంటుంది.129. సాయిబాబా తమ శరీరావసానం సమీపించినప్పుడు, లక్ష్మిని బాగా గుర్తుంచుకుని ఆమెకు నాలుగు మరియు అయిదు రూపాయలను ఇచ్చి జీవితాంతం ఆమె వారిని స్మరించుకునేలా చేశారు.130. బాబా ఎంతో సావధానంతో తమ వద్ద ఉన్న వారినందరినీ భోజనానికి పంపించి ఊరి వారిని ఒకరు ఇద్దఱిని మాత్రం కూర్చుండనిచ్చారు.131. ప్రేమికులైన కొంతమంది బాబా భక్తులు ఆ క్లిష్ట సమయంలో బాబా వద్దనుండి వెళ్లకూడదని తలచి, వారి వద్ద నుండి వెళ్లమని మొండికెత్తారు.132. కాని అంతిమ సమయంలో ఎవరి మోహంలోనూ పడే అపాయం లేకుండా బాబా వారినందఱినీ త్వరత్వరగా తరిమివేశారు. 133. తమ నిర్వాణ సమయం అతి దగ్గరలో రానున్నదని తెలుసుకుని, బాబా, బాపూసాహేబు బుట్టీని, కాకా సాహేబు దీక్షితుని, 'వాడాకు వెళ్లండి భోజనం చేసి మరల రండి' అని చెప్పారు.134. భక్తుల దుఃఖాన్ని చూచి బాబా మనసు విచలితమైంది. అందుచేత 'వెళ్లండి వెళ్లండి భోజనం చేసి రండి' అని అందఱికీ ఆజ్ఞాపించారు. 135. అహర్నిశలూ

వారి సమీపంలో ఉంటూ ఎల్లప్పుడూ వారి సాంగత్యంలో ఉండేవారు,వారి మనసు బాధపడుతున్నా బాబా ఆజ్ఞానుసారం లేచారు. 136.ఆ సమయంలో వారి సాన్నిధ్యాన్ని వదలలేరు.వారి ఆజ్ఞను ఉల్లంఘించనూ లేరు. బాబా మనసును బాధపెట్టి లేక వాడాకు భోజనానికి వెళ్లారు.137.బాబా బాధ భయంకరంగా అధికమౌతూ ఉంటే ఇక ఎక్కడి భోజనం, ఎక్కడ తినటం? ప్రాణాలు బాబా వద్ద చిక్కుకు పోయినవి.ఒక్క క్షణమైనా బాబా యొక్క విస్మరణను సహించలేకపోయారు.138.వెళ్లి భోజనానికి కూర్చున్నారు.ఇంతలో వెంటనే పిలుపు వచ్చింది. అర్ధకడుపుతోనే పరుగున వచ్చారు. కాని బాబాను కలుసుకోలేక పోయారు. 139. ఆయుర్దాయ తైలం ముగిసి పోగానే ప్రాణజ్యోతి మందగించి, బాబా శరీరం బయాజీఅప్పాకోతే ఒడిలో విశ్రమించింది.140. నేలపై పడిపోయిగాని లేదా నిదురలోగాని కాక బాబా చక్కగా గద్దెపై కూర్చుని స్వహస్తాలతో దానం ధర్మం చేసి శరీరాన్ని విసర్జించారు.141. సాయిసమర్థుని మనోగతం ఎవరికీ తెలియదు. శరీరాన్ని విడిచిన తక్షణం వారు బ్రహ్మీభూతులయ్యారు.142.మాయా శరీరాన్ని ధరించి, సత్పురుషులు సృష్టిలోకి అవతరిస్తారు.ఉద్ధరణకార్యం ముగిసినవెంటనే అవ్యక్తంలో కలిసిపోతారు. 143.నటులు నానారకాల పాత్రలను ధరించినా లోపల తమను తాము పూర్తిగా గుర్తుంచుకుంటారు. అట్లే పరిపూర్ణంగా అవతరించిన వారికి మరణం ఒక కష్టమా?144.. లోక కల్యాణానికి అవతరించిన వారి కార్యం పూర్తి కాగానే అవతారం సమాప్తి అయిపోయింది. తమ ఇచ్ఛానుసారం ఒక రూపాన్ని ధరించినవారు జనన మరణాలకు కట్టుబడి ఉంటారా?145.పరబ్రహ్మ వైభవమున్న వారికి మరణమెలా సంభవం? మమకారమనేది లేని వారిని జనన మరణాలు ఎలా బాధించగలవు?146. సాయిబాబా పనులలో నిమగ్నమైనట్లు కనిపించినా వారు ఎప్పుడూ

ఏ కర్మనూ చేయనట్లే. వారు అహంకార రహితంగా ఎప్పుడూ కర్మలలో అకర్మనే చూచెవారు. 147.'నా భుక్తం క్షీయతే కర్మ' ఆనుభవించనిదే కర్మ తొలగిపోదు. ఇది స్మృతిలో చెప్పిన కర్మలోని మర్మం.కాని బ్రహ్మను తెలుసుకున్నవారు, అంతటా అన్నింటిలోనూ బ్రహ్మనే చూచేవారు ఏ భ్రమలోనూ ఉండరు. 148. చేసిన కర్మల పరిణామమే కర్మఫలాల సముదాయం. దీనిలోని ద్వైతభేదం అంతటా ప్రసిద్ధం. మృత్యుపుచిప్పపై వెండిని చూచేలా బ్రహ్మజ్ఞానులు కర్మను కూడా బ్రహ్మగా చూస్తారు.149. బాబావంటి కరుణాళువైన జనని కాలుని నోట్లో ఎలా పడిపోయింది? చీకటి రాత్రి, పగటి దినాన్ని మ్రింగి వేసినట్లుగానే ఈ కథ జరిగింది.150. ఇప్పుడు ఈ అధ్యాయాన్ని ఇక్కడ సమాప్తి చేసి, ప్రతిమాసం లోని నియమాన్ని పాటిస్తాను. లేకపోతే ఇంకా విస్తారమైపోతే శ్రోతలువిసుగుచెందుతారు.151.మిగిలిపోయిన బాబా నిర్వాణ కథను తరువాత క్రమంగా శ్రవణం చేయగలరు. హేమాడు సాయి సమర్థుని శరణు జొచ్చి వారి కృపతో కృతార్థుడయ్యాడు. 152.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో శ్రీసాయినాథ నిర్వాణమను నలుబది రెండవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీసద్గురు సాయినాథార్పణమస్తు.శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత - 43 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

గతాధ్యాయంలో సత్పురుషులైన సాయి సమర్థుని నిర్వాణ వర్ణన జరిగింది. ఇప్పుడు అసంపూర్తిగా మిగిలి పోయిన పోయిన మిగతా విషయాలను ఇక్కడ పూర్తిచేస్తాను.1.సాయియందు అద్భుతమైన ప్రేమ ఉండాలి. దానిని వారే ఉత్పన్నం చేయగల సమర్థులు. హేమాడ్ వారి చరణాలకు అంకితమై వారి చరితాన్ని రచిస్తున్నాడు. 2.భక్తిప్రేమలను వారే ఇచ్చి, తమ చరిత్ర మహిమను తామే తెలియజేస్తారు. దానితో వారిని ఆరాధించటానికి శ్రద్ధ కలిగి ప్రపంచమందు విరక్తి జనిస్తుంది.3.అందువలన కాయా వాచా మనసా వారికి నా సహస్ర నమస్కారాలు. వారికి కేవలం అనన్యశరణుజొచ్చటమే తప్ప వారి మహిమను, మనసుతో తెలుసుకోలేం.4.పేరుకుని పోయిన పాపాల మాలిన్యాలను కడుగుకొని అంతఃకరణాన్ని నిర్మలం చేసుకోవటానికి ఇతర సాధనలు నిష్ఫలం.5.హరిభక్తుల యశస్సును స్మరించుకోవటం, మరియు వారి భజనసంకీర్తనలు తప్ప చిత్తశుద్ధికి వేరే సులభసాధన వెదికినా లభించదు.6.గత కథానుసంధానాన్ని సంక్షిప్తంగా స్మరించుకుని ఆత్మానందానికి నిలయమైన సాయికథా వ్యాఖ్యానాన్ని మరల కొనసాగిస్తాను.7.బాబా విజయదశమిరోజే ఎందుకు ప్రయాణమయ్యారు, తాత్యాబా నెపంతో భవిష్యాన్ని ముందుగానే ఎలా సూచించారు అన్న విషయాలు విపులంగా చెప్పబడ్డాయి.8.తరువాత శరీరాన్ని విడిచే సమయంలో దానధర్మాల పద్ధతి ప్రకారం బాబా లక్ష్మికి దానం చేసిన విషయాలను సమగ్రంగా వర్ణించడమైంది.9.ఇప్పుడు ఈ

అధ్యాయంలో సాయిబాబా తమ శరీరాన్ని విడిచే సమయం సమీపించినప్పుడు శ్రేయస్సుకై బ్రాహ్మణుని ద్వారా రామాయణాన్ని పారాయణ చేయించి శ్రవణం చేసిన విషయం చెప్పబడుతుంది.10. వారు తమ సమాధిస్థానాన్ని ఎన్నుకోవటం, అకస్మాత్తుగా బాబా ఇటుక పడిపోవటం మొదలగువానిని శ్రద్ధగా వినండి.11.ఒకసారి బాబా తమ ప్రాణాలను బ్రహ్మాండంలో లీనం చేసి మూడురోజులు నిశ్చలంగా కూర్చుని ఉండగా, ప్రజలు అది వారి సమాధి కాదని, మరణమని నిశ్చయించారు.12.అంతిమ సంస్కారాలకు సిద్ధపడ్డారు కూడా. అకస్మాత్తుగా బాబా శరీరంలోకి ప్రాణం రాగా ప్రజలు చకితులైన విషయాన్ని కూడా వినండి.13.ఇప్పుడు మరల సాయినిర్వాణ కథను శ్రవణం చేయటానికి శ్రోతలు ఇబ్బంది పడతారు. సాయి శరీరాన్ని విసర్జించిన వార్త వినటం ఎవరికీ ఇష్టము ఉండదు.14.కాని ఇది సాధుసత్పురుషుని నిర్వాణాన్ని గూర్చిన వర్ణన, ఇది వక్తనూ శ్రోతలనూ పావనం చేస్తుంది. ఇది చాలా విస్తరించి పోతుందని భయం. కనుక కొంచెం కొంచెంగా శ్రవణం చేసి సంతృప్తి చెందండి.15. బాబా శరీరాన్ని త్యజించి, పునర్జన్మలేని ఆత్మానందప్రాప్తిని అక్షయస్థితిని పొందారు.16.వారు శరీరమున్నప్పుడు వ్యక్తంగా ఉండి, శరీరాన్ని త్యజించాక అవ్యక్తంలో కలిసిపోయారు. ఒక శరీరంలో ఉన్న అవతారానికి స్వస్తి చెప్పి సర్వ జీవులలోనూ వ్యక్తమయ్యే స్థితిని పొందారు.17.ఒకే ప్రదేశమందు ఉండే స్థితిని వదలి సర్వవ్యాపకత్వాన్ని పొంది సంపూర్ణ సనాతనులై ఆత్మలో విలీనమయ్యారు.18.సాయిబాబా అందరికీ జీవనం.సాయి సకలజీవులకు ప్రాణం. సాయి లేకుండా గ్రామవాసులు దీనులయ్యారు. దుర్బలులై పోయారు.19.సాయి శరీరం చేతనారహితమవగానే అందఱూ ఒకేలా రోదించారు.ఆబాలవృద్ధులు చింతాక్రాంతులై జీవచ్ఛవాల వలె అయ్యారు.20.ప్రపంచంలో ఉండేవారికి జ్వరం మొదలగు లౌకిక బాధలు వారివెంటే ఉంటాయి. కాని అవి తమ పరిమితిని అతిక్రమించి యోగులను బాధ

పెట్టవు.21. సత్పురుషులు తమ తేజాన్ని ప్రజ్వలింపచేసి తమ శరీరాన్ని దహింపజేస్తారు. బాబా అదే విధంగా తమ చేతులతో చేశారు.22.జరగకూడనిది జరిగిపోయింది.సాయి మహారాజు సాయుజ్యాన్ని పొందారు. జనులు చాలా బాధపడ్డారు. మనసులో ఆవేదన పడ్డారు.23.బాబా దగ్గరనుండి వెళ్లిపోకుండా ఉంటే ఎంతబాగుండేది. అంతిమసమయంలో బాబాను చివరిసారిగా కలుసుకోలేకుండాపోయాం. వారి దగ్గరే ఉండి ఉంటే దేనికైనా ఉపయోగపడే వారం.ఆ సమయానికి బుద్ధి పనిచేయలేదు. 24.అని అనేకరకాల ఆలోచనలతో ప్రజలు తమలో దుఃఖపడ్డారు. కాని బాబా అంతఃకరణంలో ఏముందో ఎవరికి తెలుస్తుంది!25.వారికి శ్వాస పీల్చుకోవటంలో ఆయాసం లేదు. దగ్గులేదు. గొంతులో ఏ బాధాలేదు. వారి ప్రాణానికి ఏ కష్టంలేదు. ఉల్లాసంగా ప్రయాణమయ్యారు. 26.ఇప్పుడు ఇక ఎక్కడి సాయి దర్శనం?ఎక్కడి సాయి పాదసంవాహనం?ఎక్కడి సాయి పాదప్రక్షాళనం? ఎక్కడి పాదతీర్థసేవనం?27.అంతిమ సమయం సమీపించిందని గ్రహించి బాబా తమ దగ్గరున్న ప్రేమికులైన భక్తులను దూరంగా పంపివేసి వారికి అంత బాధ కలిగించారెందుకు?28.అంతిమ సమయంలో ప్రేమికులైన భక్తులంతా తమ దగ్గరుండటం చూచి బాబాకు వారిపై ప్రేమ ఉప్పొంగిందేమో!29.సాయుజ్య ధామాన్ని చేరుకోవటానికి,ముక్తికి భక్తులప్రేమ బంధనం అడ్డుతగులుతుంది. వెంటనే దానిని త్రుంచకపోతే మనసు వాసనారహితం కాదు.30.అలా జరగకుండా శరీరాన్ని వదిలితే, జీవుడు మరల పుట్టి వెంటనే క్రొత్త బంధనాలలో చిక్కుకుంటాడు.దానితో అనేకరకాల కోరికలూ ఆశలూ మొదలవుతాయి.31.వీనిని తొలగించటానికి, సాధు సత్పురుషులు ఎప్పుడూ సావధానులైఉంటారు. అట్లే బాబాకూడా లోకవ్యవహారాన్ని కాపాడటానికి నిశ్చయించుకున్నారు. 32.అంతిమ సమయంలో జాగరూకత వహించి ఏకాంతంలో ప్రశాంతంగా ఏ వికల్పాలు

లేని మనసును ధ్యేయంలో లీనంచేయాలి.33.'అంతేమతిః సాగతిః' ప్రసిద్ధమైన ఈ నుడిని అందఱూ ఎరుగుదురు. దీనిని భగవద్భక్తులు స్వయంగా ఆచరిస్తారు. ఇదిలోకాచార పద్ధతి.34.తమ అవసాన సమయానికి పదునాలుగు రోజుల ముందు బాబా వఝే అను భక్తుణ్ణి రామవిజయాన్ని పఠించటానికి నియమించారు.35.వఝే మసీదులో కూర్చుని గ్రంథ పారాయణను ఆరంభించాడు. బాబా శ్రవణం చేయసాగారు. ఎనిమిది రోజులు గడిచాయి.36.ఆపకుండా మరల పారాయణ సాగనివ్వమని బాబా ఆజ్ఞాపించారు. మూడు పగళ్లు మూడు రాత్రులూ వఝే చదువుతూనే ఉన్నాడు. 37.అలా పూర్తిగా పదకొండు రోజులు కూర్చుని చదివి నీరసించిపోయాడు. చదివి చదివి బాగా అలసిపోయాడు. ఆ విధంగా మూడు రోజులు గడిచాయి.38:తరువాత బాబా గ్రంథపారాయణను సమాప్తి చేయించారు. వఝేను అక్కడి నుండి పంపివేసి తాము ప్రశాంతంగా ఉన్నారు.39.వఝేను పంపివేయటానికి కారణం చెప్పమని అడుగుతారు. నాకు తోచిన విధంగా తెలియచేస్తాను. శ్రద్ధగా వినండి.40.శరీరావసాననసమయం సమీపించినప్పుడు, సాధు సజ్జనులు సత్పురుషులు పురాణాలను సత్గ్రంథాలను చదివించి శ్రద్ధగా వింటారు. 41.శుకాచార్యులు మహాభాగవతాన్ని ఏడు రోజులు చెప్పగా పరీక్షిత్తుమహారాజు విని సుఖంగా శరీరాన్ని వదిలాడు. 42.భగవంతుని లీలలను శ్రవణం చేస్తూ భగవంతుని రూపాన్ని కళ్లతో చూస్తూ అంతిమ కాలాన్ని గడిపినవారు తమ శ్రేయస్సును సాధించుకుంటారు.43.ఇది లోకాచారపద్ధతి. దీనిని సత్పురుషులు ఎప్పుడూ స్వయంగా ఆచరిస్తారు.వారు ప్రజలకు మార్గదర్శకులుగా అవతరిస్తారు. కనుక వారు ప్రజల మార్గాన్ని వ్యతిరేకించరు.44.భౌతిక శరీరంపైన ఏ ఆసక్తిలేని వారికి శరీరావసానం శోకావేశాన్ని కలిగించదు. ఇది వారికి సహజం.45.బ్రహ్మానందంలో సుఖంగా ఉన్నవారికి మాయామోహాలు ఉంటాయా అని ఇక్కడ శ్రోతలకు సంశయం కలగవచ్చు.46.అల్లామాలిక్

అనుసంధానంలో ఆత్మస్వరూపంలో సావధానులై ఉన్నవారికి భక్తులు తమ వద్ద ఉండటం ప్రతిబంధకమెలా అయింది. 47.బాబాకు ప్రపంచ వ్యవహారాలు తీరిపోయాయి. పరమార్థం కూడా ఆగిపోయింది.ద్వంద్వ భావాలు నిర్మూలనమయ్యాయి. వారు ఆత్మస్వరూపంలో లీనమైపోయారు.48.ఇదంతా అక్షరం అక్షరం సత్యం. ఇందులో అణుమాత్రం అసత్యంలేదు.కాని లోకసంరక్షణ కోసం సత్పురుషులు తమ అవతారకార్యాలను చేసి కృతకృత్యులౌతారు.49.సాధువులు కామక్రోధాది షడ్వికారాలు లేనివారు. ఎల్లప్పుడూ అవ్యక్త స్థితియందు ఉంటారు. భక్తులను ఉద్ధరించటానికి ప్రకటమౌతారు.అట్టివారికి మరణమెక్కడిది?50.శరీరం మరియు ఇంద్రియాల సంయోగం జననం.శరీరంతో ఇంద్రియాల వియోగం మరణం.ఈ బంధనం ముడిపడటాన్ని విడిపోవటాన్ని జననమరణాలని అంటారు.51.జననం వెనుకే మరణం అంటిపెట్టుకుని ఉంటుంది. అవి ఒకటి నుండి మరొకటి విడిగా ఉండవు. జీవుని స్వాభావిక లక్షణం మరణం, జీవుని జీవనం అస్వాభావిక లక్షణం. 52.మరణాన్ని చంపి బ్రతికి ఉండేవారు, కాలుని తలను కాళ్లతో అణచివేసి స్వేచ్ఛగా అవతరించేవారు తమ ఆయుర్దాయాన్ని ఖాతరు చేస్తారా?53.భక్తులను ఉద్ధరించే సంకల్పంతో భూమిపై అనేక అవతారాలను ధరించేవారు జనన మరణాలలో బంధింపబడతారా?ఈ రెండూ మిథ్యాకల్పనలే.54. శరీరం నేలపై పడిపోకముందే దానిని కాల్చి బూడిదగా చేసినవారికి మరణభయం ఎందుకు ఉంటుంది? వారికి మృత్యువు బూడిద సమానం.55.మరణం శరీరం యొక్క సహజ ప్రకృతి. మరణం శరీరం యొక్క సుఖస్థితి. జీవితం శరీరం యొక్క వికృతి అని జ్ఞానులు భావిస్తారు. 56.సాయిసమర్థులు ఆనందఘనులు. వారు శరీరం యొక్క జననాన్ని ఎఱుగరు.శరీరం అస్తిత్వం యొక్క స్ఫురణ వారికి లేదు. అటువంటి వారి శరీరానికి మరణమెక్కడిది?57.సాయిబాబా పూర్ణపరబ్రహ్మ.

వారికి జనన మరణాలెక్కడివి? 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అని తెలుసుకున్న వారికి శరీరంతో తాదాత్మ్యం ఎందుకుంటుంది? 58. ప్రాణ ధారణ, ప్రాణ విసర్జన, అదృశ్య పరిభ్రమణ వగైరాలు వారి స్వచ్ఛంద యోగక్రీడలు భక్తులను ఉద్ధరించటానికే. 59. సూర్యునికి గ్రహణం పట్టిందని, సూర్యుడు పూర్తిగా అదృశ్యమయ్యాడని అంటారు. ఇది కేవలం దృష్టి దోషగుణం. సత్పురుషుల మరణం కూడా అటువంటిదే. 60. వారికి శరీరం కేవలం ఉపాధి. ఇక దానికి ఆధివ్యాధులు ఎక్కడివి? ప్రారబ్ధానుబంధంతో ఏవైనా ఉన్నా వానిని వారు పట్టించుకోరు. 61. భక్తుల యొక్క పూర్వార్జిత పుణ్యసంచయం వలన అవతరించి, భక్తుల భక్తి అవ్యక్తరూపంలో నిండిపోగా, బాబా భక్తులను రక్షించటానికి ప్రకటమై, శిరిడీలో కనిపించారు. 62. భక్తుల కొఱకు వచ్చిన పని పూర్తయిందని శరీరాన్ని వదలివేశారు అని అంటారు. ఈ మాటను ఎవరు విశ్వసిస్తారు? యోగికి అసలు జననమరణాలు ఉంటాయా? 63. సాయిసమర్థులు తమ ఇచ్ఛానుసారం శరీరాన్ని యోగాగ్నిలో దహింపచేసి, తాము అవ్యక్తంలో లీనమైపోయినా భక్తుల హృదయాలలో ఉన్నారు. 64. ఎవరి నామాన్ని కేవలం స్మరించినంత మాత్రాన జననమరణాలు వదిలిపోతాయో అట్టివారికి మరణావస్థ ఎక్కడిది? వారు శరీరాన్ని వదలి పూర్వపు అవ్యక్తస్థితిని పొందారు. 65. జడస్థితిని దాటి బాబా అవ్యక్తంలో లీనమయ్యారు. అక్కడ కూడా ఆత్మస్వరూపంలో ఉంటూ భక్తులను సదా జాగ్రతం చేస్తుంటారు. 66. చైతన్యంతో నిండి భక్తుల హృదయాలలో దృఢంగా నిలచినవారు, మరణించారని అందామా? అంటే మనసు దీనిని ఒప్పుకోదు. 67. అందువలన అనాద్యనంతుడైన ఈ సాయి, విశ్వప్రళయం వరకూ అనవరతం ఉంటారు. జనన మరణాలనే అపాయాలలో ఎప్పుడూ పడరు. 68. జ్ఞానేశ్వర మహారాజు వెళ్లిపోయారా? మూడువందల ఏళ్లయాక మరల దర్శనమిచ్చారు. ఏకనాథ మహారాజు వారిని కలిసి వచ్చి జగానికి ఎంతో ఉపకారం చేశారు. 69. దయామయులైన

ఏకనాథు పైఠనులో జ్యోతిలా వెలసినట్లు,తుకారాం మహారాజు దేహులో, నరసింహసరస్వతి ఆళందిలో, 70.సమర్థరామదాసు వర్లిలో, అక్కల్‌కోటమహారాజు అక్కల్‌కోటలో, మాణిక్‌ప్రభు హుమ్నాబాదులో వలె శిరిడీలో సాయి అల్లే వెలిశారు 71. వారివారి మనోభావాలననుసరించి, ఈనాటికీ అనుభవాలు కలుగుతుంటాయి. ఇట్టి సిద్ధి ప్రభావమున్న వారికి మరణమెలా సంభవం? 72.భక్తుల సేవాకార్యానికై, శరీరాన్ని శిరిడీలో ఉంచి చరచరాలలో ఉన్న ఆత్మలో నిండి ఉన్న లీలావతారి సాయిసమర్థులు.73.సాయిసమర్థులు బ్రహ్మీభూతులయ్యారు కదా. ఇప్పుడు ఇక శిరిడీలో ఏముంది అన్న అనుమానం మనసులో పెట్టుకోకండి. శ్రీ సాయి మరణానికి అతీతులు.74.అసలు సత్పురుషులు అయోనిసంభవులు.వారు మూర్తీభవించిన బ్రహ్మస్వరూపులు.ఆ పుణ్యాత్ములు పరోపకారార్థం అవతరించి ప్రకటమౌతారు.75. జనన మరణాలు అవతార పురుషులకు ఎప్పుడూ ఉండవు. వారి అవతారకార్యం సమాప్తికాగానే ఆత్మలో కలిసిపోయి అవ్యక్తంలో లీనమైపోతారు.76.బాబా మొత్తం మూడున్నర మూరల శరీరంలోనే పరిమితమై ఉన్నారా? వారు ఫలానా విశేషమైన రంగు రూపాలు కలవారని చెప్పటం భావ్యం కాదు.77.అణిమ గరిమాది అష్టసిద్ధులూ ఉన్నవారి ఐశ్వర్యం ప్రజల రాకపోకల వలన పెరగదు తరగదు.వారి ఐశ్వర్యం ఎప్పుడూ సమృద్ధిగా శాశ్వతంగా ఉంటుంది. అలా వారు ప్రఖ్యాతి చెందారు.78. ఇటువంటి మహానుభావుని అవతారం లోక కల్యాణం కారణంగానే. సృష్టికి స్థితిలయలు ఉంటాయి. సత్పురుషులు ప్రజల ఉద్ధరణకు తత్పరులై ఉంటారు.79.వారికి జననమరణాలు వట్టి భ్రాంతి. ఆత్మైకత్వజ్ఞానం అవినాశ్థితి వారికి స్వప్నంలో సుఖాన్ని సంపత్తిని అనుభవించినట్లు, వారి పరిస్థితి అటువంటిది.80.జ్ఞాననిధియై ఆత్మాను సంధానంలో ఎల్లప్పుడూ ఉండేవారికి శరీరాన్ని పోషించటం లేదా శరీర పతనం రెండూ సమానమే.81.బాబా శరీరం పడిపోగానే దుఃఖపర్వతం అందఱినీ కూల్చివేసింది. శిరిడీ

అంతా హాహాకారాలు. అంతటా ఒకటే కేకలు.82.బాబా నిర్వాణవార్త బాణంలా గ్రుచ్చుకుని, రోజూ జరిగే పనులు ఆగిపోయాయి. జనులు కలవరంతో చెల్లాచెదురైపోయారు.83.అమంగళకరమైన ఆ వార్త వ్యాపించగానే అది అందరికీ పిడుగుపాటులా అనిపించింది. వివేకవంతులు మౌనంగా కూర్చున్నారు. ఇతరులు గట్టిగా రోదించసాగారు. 84.అత్యంత ప్రేమావేశంతో కంఠం గద్గదమై కళ్ల నుండి దుఃఖాశ్రువులు స్రవించగా శివశివా హరహరా అంటూ అరిచారు.85.ప్రతి ఇంట్లోనూ ఈ గొడవే గుండెదడదడలాడగా ప్రజలు ఆందోళనగా పరుగెత్తసాగారు. 86. సాయిమహారాజు శరీరావసానం గ్రామస్థులకు పూర్తిగా ప్రాణాంతకమైంది. దేవా! హృదయవిదారకమైన ఈ సంఘటన మహాదారుణంగా ఉంది అని అనసాగారు.87.మసీదుకు పరుగు తీశారు. మసీదు మండపం బాగా నిండిపోయింది. అక్కడి పరిస్థితి గుండెను బ్రద్దలు చేసేలా ఉంది. దుఃఖంతో ఎవరికీ గొంతుక పెగలటం లేదు.88.శిరిడీ యొక్క వైభవం పోయింది. ఆ సుఖం ఆ భాగ్యం అంతా హరించుకుని పోయింది.అందరికళ్లూ అశ్రువులతో నిండి పోయాయి. అందరి ధైర్యం సడలిపోయింది.89.సప్తపురాలలో ఒకటిగా గణించబడి బాబాచే ద్వారకామాయి అని నిశ్చయించబడిన ఆ మసీదు మహిమ ఎంత గొప్పది?90.నిర్వాణం గాని నిధనంగాని లేదా నిర్వాణం గాని ద్వారకామాయి సాయుజ్యముక్తికి స్థానం.ఎల్లప్పుడూ పరమేశ్వరుని ధ్యానంలో ఉండేవారికి అక్కడ స్థానం లభిస్తుంది.91.గురువర్యులైన ఈ సాయిమహారాజు భక్తులకు దయగల తల్లి తండ్రి మరియు విశ్రామ ధామం.వారు అనుదినమూ గుర్తుంటారు.92. అటువంటి బాబాలేక శిరిడీ దశదిశలూ శూన్యమై ఉదాసీనమయ్యాయి.ప్రాణం పోయిన తరువాత శరీరానికి పట్టే ప్రేతకళ శిరిడీకి వచ్చింది.93.చెరువులోని నీరు ఇంకిపోతే తపించిపోయే చేపలవలె శిరిడీ జనులు కళావిహీనులై బాధతో విలవిలలాడారు.94.అప్పుడు మసీదు పరిసర ప్రాంతమంతా కమలాలులేని

సరోవరంలా, సంతానంలేని శూన్యగృహంలా, దీపంలేని మందిరంలా, 95.యజమానిలేని ఇల్లులా, రాజులేని నగరంలా, ద్రవ్యంలేని భోషాణంలా బాబాలేని శిరిడీ అరణ్యంలా అయి పోయింది.96.బాబా ప్రేమ పసిబిడ్డకు తల్లివంటిది. చాతక పక్షికి మేఘోదకం వంటిది. శిరిడీ ప్రజలకు మరియు భక్తులకందరికీ కూడా అటువంటిదే వారిప్రేమ.97.బాబా లేక శిరిడీ హీనంగా దీనంగా కళావిహీనంగా మృతప్రాయమైంది. నీరులేని చేపలవలె బాబా లేక జనులు తపించిపోయారు.98.భర్త విడిచిన భార్యవలె, తల్లికి దూరమైన పాలుత్రాగే పసిబిడ్డవలె,ఆవు నుండి విడిపోయిన దూడ వలె అయింది, అక్కడి పెద్దవారి చిన్నవారి పరిస్థితి. 99.ఆ దుఃఖావస్తను భరించలేక శిరిడీ జనులు అస్తవ్యస్తంగా నలుదిక్కులా పరుగెత్తసాగారు.100.సాయి కారణంగానే శిరిడీ పవిత్ర పుణ్యక్షేత్రమైంది.సాయి వలననే శిరిడీకి ఒక చరిత్ర. సాయియే అందరికీ ఆశ్రయస్థానం. 101.అందువలన కొందరు ఏడవసాగారు. మరికొందరు నేలపైన పొర్లసాగారు కొందరు తెలివితప్పి పడిపోయారు. ప్రజలు అలా దుఃఖితులయ్యారు.102.వారి కళ్లనుండి దుఃఖాశ్రువులు స్రవించసాగాయి. స్త్రీలు పురుషులు అన్నపానాలు మాని అత్యంత దుఃఖంతో దీనవదనులయ్యారు.103.బాబాయొక్క ఆ పరిస్థితిని చూచి గ్రామంలోని ఆబాల వృద్ధులు భక్తులూ అందరూ చాలా బాధపడ్డారు.104.ప్రతిరోజూ రసభరితమైన మధురకథలను వింటూ అమితానందాన్ని అనుభవిస్తూ ఉండే చోటు. భక్తులు ప్రవేశించటానికి వీలులేకుండా నిండుగా ఉండే మసీదు అప్పుడు కళావిహీనమై కనిపించసాగింది.105.శిరిడీ నిత్యశ్రీ నిత్యమంగళంగా ఉండటానికి మూలకారణం బాబాయే. అందువల్ల గ్రామస్థులు దుఃఖించసాగారు.106.ఆనందానికి మూలమై, ఆనందవిగ్రహమైన సాయీ! మీరు భక్తులను ఉద్ధరించటానికి శరీరాన్ని ధరించి ఆ కార్యాన్ని సాధించగానే శిరిడీ గ్రామంలో విదేహముక్తిని పొందారు.107.మీరు

ఎప్పుడూ దయతో అలసట లేకుండా బుద్ధి భ్రంశమైన మాకు అహర్నిశలూ హితోపదేశం చేసేవారు.108.బోర్లించిన కుండపైన పోసిన నీరు వలె ఆ ఉపదేశాలు పైపైనే కొట్టుకుని పోయాయి.కాని ఒక్క బొట్టు అయినా మా ఒంట పట్టలేదు.109.'మీరు ఎవరినైనా ఊరికే దూషించినా, నాకు వెంటనే బాధ కలుగుతుంది' అని మీరు పదే పదే చెప్పినా మేము వినలేదు.110.ఇటువంటి అపరాధాలను ఎన్నో చేశాం.మీ హితోపదేశాలను వినక ఆజ్ఞా భంగం చేసిన పాపానికి ఈ విధంగా శిక్ష విధించారా?111.బాబా! ఆ మా పాపాలన్నింటినీ ఈ విధంగా తూచారా?ఇప్పుడు పశ్చాత్తాపపడితే ఏం ప్రయోజనం? అనుభవించవలసిన వానిని అనుభవించక తప్పదు కదా. 112.బాబా! మాపై విసుగుపుట్టి మా కనుమరుగై తెరవెనుకకు వెళ్ళిపోయారా?అకస్మాత్తుగా మాపై కాలుడు ఎంతటి దెబ్బ కొట్టాడు?113.మీ కంఠం ఎండుకునిపోయేలా మాకు నచ్చచెప్పినా వినిపించు కోని మా ఉదాసీనతను గని మీకు మాపై విసుగు జనించినట్లుంది.114.అందువలన మాపై అలిగి పూర్వపు ప్రేమనంతా మరచిపోయారా? లేదా మాతోటి ఋణాను బంధం ఇవ్వాళ్టితో తీరిపోయిందా? మీ వాత్సల్యపు స్తన్యధార ఎండిపోయిందా? 115. మీరు ఇంత త్వరగా వెళ్లిపోతారని ముందుగా తెలిసి ఉంటే ఎంతో బాగుండేది. జనులు ముందుగానే జాగ్రత్త పడేవారు. 116.వేమనంతా సోమరిగా ఉండి నిశ్చింతగా నిద్రపోయాం,చివరకు మోసపోయాం,ఉన్నాలేనట్లే అయిపోయాం.117.మేము గురుద్రోహులమయ్యాం. ఆ సమయంలో ఏం చేయలేదు. ప్రశాంతంగా కూర్చో గలిగినా బాగుండేది.అదికూడా మావల్ల సాధ్యం కాలేదు.118.ఎంతెంతో దూరంనుండి శిరిడీకి వచ్చి అక్కడ పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటాం. తీర్థక్షేత్రానికి వచ్చామన్న మాటనంతా మరచిపోయి అక్కడ కూడా యథేచ్ఛగా ప్రవర్తిస్తుంటాం.119. భక్తులు అనేక రకాలుగా ఉంటారు.జ్ఞానులు,అభిమానులు,భావార్థులు

తార్కికులు. బాబా వారినందరినీ ఆత్మస్వరూపులవలె చూచేవారు. ఎక్కువ తక్కువ అన్నభేదభావం వారు ఎఱుగరు. 120. వారి దృష్టిలో జగత్తు అంతటా భగవంతుడే తప్ప ఇతర వస్తువు లేదు. ఆ జ్ఞానదృష్టి వలన తమను వేరుగా తలచుకునేవారు కాదు. 121. భక్తుడు స్వయం ఈశ్వరుడు. అల్లే గురువు కూడా వేరు కారు. గురుశిష్యులు ఉభయులూ తమ ఆత్మస్వరూపాన్ని విస్మరించటం వలన వారిలో ఈ భేదభావం. 122. వాస్తవానికి మనం ఈశ్వరులమే. కాని పరమార్థ స్వరూపం యొక్క విస్మరణయే భేదభావానికి ముఖ్య లక్షణం. ఇదే మరి అధఃపతనం. 123. భిక్ష కోసం ఇంటింటికీ వెళ్లినట్లు సార్వభౌమునికి స్వప్నం వచ్చింది. కాని మేలుకున్న తరువాత తన పూర్వస్థితిని తెలుసు కున్నాడు. 124. జాగ్రదావస్థలో పనులలో ప్రవృత్తులై ఉండి స్వప్నావస్థలో పనులనుండి విరమించటం. నిజమైన జాగృతి ఆత్మానుభూతి అంటే సంపూర్ణ అద్వైతంలో లీనమైపోవటం. 125. సాయిబాబాకు తమను ఆశ్రయించిన జ్ఞానులు అజ్ఞానులు అందరియందూ అత్యంతప్రేమ. భక్తులను ఆప్తులనుగా తమ ప్రాణం కంటె మిన్నగా ఏ భేదభావం లేకుండా చూచేవారు. 126. వారు మానవరూపంలోనున్న దేవుడే యని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాం. అయినా వారి వాత్సల్యం భక్తులను వివశులను చేసింది. 127. వారు ఒకరికి ధనసంపత్తిని ఇచ్చారు. మరొకరికి సంసార సుఖాన్ని సంతానాన్ని ఇచ్చారు. దానితో ప్రజలు సంసారమోహంలో పడి జ్ఞానప్రాప్తికి దూరమయ్యారు. 128. బాబా ఎవరితోనైనా ఒకసారి చనువుగా నవ్వితే, తమయందే బాబాకు ఎక్కువ ప్రేమయని ఇతరులపైన లేదని తలచి గర్వపడేవారు. 129. బాబా ఎవరినైనా కోప్పడితే, బాబాకు వారిపై మక్కువలేదు, మాపైన వారికి చాలా గౌరవం. ఇతరులను అలా గౌరవించరు అని అనుకునేవారు. 130. బాబాకు అటువంటి భావం కలలోకూడా లేకపోయినా మనం ఆవిధంగా తలచుకొని మన కర్తవ్యాన్ని మరచిపోయి వృథాగా పరమార్థాన్ని పోగొట్టుకున్నాం. 131. మన భాగ్యం కొద్దీ సాక్షాత్తు

పరబ్రహ్మ సగుణరూపంలో ప్రక్కనే ఉండగా, వాస్తవమైన కార్యాన్ని మరచి వినోదాల కోసం మనసుపడ్డాం.132.వెళ్లి బాబాదర్శనం చేసుకుని పూలు పళ్లు అవి సమర్పించి వారు దక్షిణను అడగగానే బెదిరిపోయి ఇక అక్కడ ఉండేవారం కాము.133.మాకు హితోపదేశాలను చేస్తుండగా మాఅల్పబుద్ధిని గని, మనసు బాధపడి బాబా తమ ధామానికి వెళ్లిపోయినట్లుంది.134.ఇప్పుడు ఇక ఆత్మానందాన్ని కలిగించే వారి రూపాన్ని మరల ఈ కళ్లు ఎలా చూడగలవు? జన్మజన్మాలకు లభించకుండా అదృశ్యమైన ఆ ఆనందమూర్తిని పోగొట్టు కున్నాం.135.ఎంత దారుణ కర్మ. మనకు చేరువగా ఉన్న సాయిసఖులు అంతరించారు. అటువంటి స్వార్థం లేనివారు దయార్ద్ర హృదయులు మనకు ఇప్పుడు పరులయ్యారు.136.'ఎవరినైనా సరే మోసగించటం మంచిది కాదు.దానివల్ల నాకు దుఃఖం కలుగుతుంది'అన్న బాబా వచనాలను పాటించక, ఇష్టం వచ్చినట్లు పోల్లాడుకున్నాం. 137.ప్రజలు భక్తులు బాబాను బాధపెట్టగా మనం వారిని కోల్పోయాం. సాయినాథుని ఉపదేశాలను తలచుకుంటూ ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాం.138.ఎనిమిది సంవత్సరాల బాలునిగా నేను మరల జనులలో ప్రకటమౌతానని సాయిమహారాజు భక్తులతో చెప్పారు.139.ఇవి సత్పురుషుల వచనాలు. ఇవి వ్యర్థమని ఎవరూ భావించరాదు. విష్ణుమూర్తి కృష్ణావతారంలో ఇలాగే చేశారు.140.ఎనిమిది ఏళ్ల వయసులో తేజస్సుతో అందమైన కృష్ణమూర్తి చతుర్భుజాలతో,చేతులలో ఆయుధాలను ధరించి,బంధిఖానాలోని దేవకీదేవి ఎదుట ప్రకటమయ్యారు. 141.అయితే అక్కడ భూభారాన్ని హరించటానికి, ఇక్కడ దీనభక్తోద్ధరణ కొఱకు. ఇందులో ఇక సందేహమెందుకు? సత్పురుషుల లీలలు ఊహకందనివి.142.ఇది ఒక జన్మబంధమా? డెబ్భైరెండు జన్మల ఋణాను బంధం.బాబాకు భక్తులకూ ఉన్న అపూర్వ సంబంధం.ఈ విషయాన్ని బాబా ఏదో సందర్భంలో చెప్పారు. 143.ఇటువంటి

ప్రేమపాశంతో బంధించి, సాయిమహారాజు ఏదో ప్రయాణానికి వెళ్లినట్లు అనిపించినా మరల వస్తారని భక్తులకు పూర్తి విశ్వాసం.144.బాబా అనేక మందికి సాక్షాత్కారాన్ని, ఎంతో మందికి దృష్టాంతాలను కలిగించారు. ఎందఱికో ఎన్నో చమత్కారాలను రహస్యంగా చూపించారు.145.భక్తి భావం లేనివారికి వారు గుప్తంగా ఉంటారు. భక్తులకు భావికులకు స్పష్టంగా కనిపిస్తారు.వారివారి చిత్తవృత్తినిబట్టి అనుభూతి తప్పక కలుగుతుంది.146. సాయిబాబా చావడిలో గుప్తరూపంలో,మసీదులో బ్రహ్మరూపంలో, సమాధిమందిరంలో సమాధి అవస్థలో ఆనందరూపంలో సర్వత్రా ఉన్నారు.147.అందువలన సాయిసమర్థుల సన్నిధికి ఏ భంగం వాటిల్లలేదని వారు అనవరతం అక్షయంగా ఉన్నారని ఇప్పుడు భక్తులు తమ హృదయాలలో భక్తిగా విశ్వసించాలి.148. భగవంతుడు తమ ధామానికి వెళ్లిపోతాడు కాని సత్పురుషులు తమ స్థలంలోనే బ్రహ్మ స్థితిలో ఉంటారు.వారికి రాకపోకలు ఉండవు.వారు ఆనందంలో విలీనమై ఉంటారు.149.అందువల్ల చిన్నా పెద్దా అందఱికీ వినయపూర్వకంగా నమస్కరించి శ్రద్ధగా ఆలకించండని మనవి చేస్తున్నాను.150. భక్తులకు అత్యుత్తమమైన కీర్తి ప్రతిష్ఠలు కలవారి సాంగత్యం లభించుగాక, గురుచరణాలలో నిష్కామమైన ప్రీతికలిగి, గురువుయొక్క గుణాలను వర్ణించే ఆసక్తి కలిగి నిర్మలమైన భక్తి ప్రకటమగుగాక.151.మరియు ఎడతెగని ప్రేమ కలుగుగాక. గురుచరణాలలో ముడిపడ్డ స్నేహబంధం తెగి విడిపోకుండుగాక. భక్తులు అహోరాత్రులు గురుచరణాలలో సుఖ సంపన్నులై ఉందురుగాక. 152.సాయిబాబా శరీరాన్ని ఏ విధంగా తగినరీతిలో ఉంచాలి అని భక్తులు గ్రామస్థులు ఆలోచించసాగారు. 153.శ్రీమంతుడైన బుట్టీ గొప్ప భక్తుడు. అతడు భవిష్యత్తులో స్మారకంగా ఉంటుందా అన్నట్లుగా విశాలంగా ఉండే అందమైన భవనాన్ని నిర్మించి ఉంచాడు.154.తరువాత బాబాశరీరాన్ని ఎక్కడ ఉంచాలి అన్న విషయంపై ముప్పైఆరు గంటలు ఆలోచించారు.

అయినా జరగవలసింది జరిగింది.155.ఈ శరీరాన్ని ఇక హిందువులు తాకరాదు. ముసల్మానుల శ్మశానానికి ఊరేగింపుతో తీసుకుని వెళ్లాలి అని కొందరు అన్నారు. 156.ఆరు బయట ఖాళీ స్థలంలో ఉంచి అక్కడ అందమైన దర్గా కట్టించి అందులో ఉంచాలి అని మరికొందరు అన్నారు. 157. ఖుశాల్‌చందు మరియు అమీర్‌శక్కర్ ఉద్దేశం కూడా అదే, కాని 'ఈ శరీరాన్ని భవనంలో ఉంచండి' అని బాబా చెప్పారు. 158.రామచంద్ర పాటిల్ కార్యదక్షత కలవాడు. గట్టి నిర్ణయాన్ని తీసుకోగల ఒక గ్రామాధికారి కూడా, పైగా బాబా సేవకుడు. అతడు గ్రామస్థులతో.159.'మీ అభిప్రాయాలు మాకు సమ్మతం కాదు. బాబా శరీరాన్ని వాడాలో తప్ప బయట ఎక్కడా కాసేపైనా ఉంచడానికి వీల్లేదు' అని చెప్పాడు. 160.హిందువులూ మరియు ముసల్మానులు తమ తమ మతానుసారం ఆలోచించసాగారు.ఏది తగినది ఏది కాదు అన్న చర్చ రాత్రంతా సాగింది.161.ఇక్కడ తెల్లవారు ఝామున లక్ష్మణమామ తన ఇంట్లో గాఢనిద్రలో ఉండగా బాబా అతని చేయిపట్టుకుని 'లేచి త్వరగా పద.162.ఇవాళ బాపూసాహేబు రాడు. నేను మరణించానని అతని అభిప్రాయం.నీవైనా వచ్చి పూజతోపాటు కాకడ హారతిని ఇవ్వు'అని అన్నారు.163.లక్ష్మణమామ వెంటనే లేచి నిత్యక్రమానుసారం పూజాసామాగ్రిని వెంట తీసుకువచ్చి ఆ సమయానికిపూజకు సిద్ధమయ్యాడు.164.ఇతడు శిరిడీ గ్రామంలోని పురోహితుడు, మాధవరావు యొక్క మేనమామ. నిత్యం ప్రాతఃకాల సమయంలో బాబా పూజచేసేవాడు.165.మామ గొప్ప కర్మఠుడైన బ్రాహ్మణుడు.రోజూ ఉదయం స్నానం చేసి ఉతికిన బట్టలను ధరించి వెళ్లి బాబా దర్శనం చేసుకునే వాడు.166.బాబాకు పాదప్రక్షాళన చేసి గంధాక్షతలను అద్ది తులసీదళాలతో పత్రి పుష్పాలతో, ధూపదీప నైవేద్యాలతో పూజించి, నీరాజనమిచ్చి దక్షిణను ఇచ్చేవాడు.167.తరువాత ప్రార్థనా పూర్వకంగా సాష్టాంగ నమస్కారం చేసి బాబా ఆశీస్సులు తీసుకుని అందఱికి

గంధం బొట్టు పెట్టి ప్రసాదాన్ని ఇచ్చి వెళ్ళేవాడు.168.ఆ తరువాత విఘ్నేశ్వరుని శనిదేవుని పరమేశ్వరుని అంజనీనందనుడైన మారుతిని పూజ చేసేవాడు.169.ఈ విధంగా లక్ష్మణమామ గ్రామదేవతల నందరినీ నిత్యం పూజించేవాడు.అట్లే భక్తిగా బాబా శరీరానికి సకలోపచారాలతో పూజ చేశాడు.170.మామ అసలే చాలా నిష్ఠాపరుడు.పైగా సాక్షాత్తు బాబా దృష్టాంతం.కాకడహారతి పళ్లెమును చేత్తో పట్టుకుని వచ్చి సాష్టాంగ ప్రణామం చేశాడు.171.బాబా ముఖంపైని వస్త్రాన్ని తొలగించి ప్రేమగా అవలోకించి యథావిధిగా శుద్ధాచమనంతో వారి కరచరణాలను ప్రక్షాళన చేశాడు.172.మౌల్వి మొదలగు మహ్మదీయులు బాబాను తాకనివ్వక అడ్డుపెట్టినా మామవారిని లెక్క చేయకుండా బాబాకు గంధం రాసి పూజనంతా చేశాడు.173.ఆ శరీరాన్ని శవం అని అన్నా అది సాయిసమర్థులది.తన ఆరాధ్య దైవానిది. అది హిందువుదా మహమ్మదీయునిదా అన్న ఆలోచన మామకు కలలోకూడా లేదు.174. సజీవంగా ఉండగా బాబా పూజ్య శరీరానికి ఎంత ఘనంగా పూజ జరిగేది. ఇప్పుడు ఆ శరీరానికి ఆ ఔపచారిక పూజ, ఆ వైభవం లేదు.175.వారిని ఆ పరిస్థితిలో చూచి అసలే దుఃఖంతో బాధపడుతున్న మామ వారి పునర్దర్శనం దుర్లభమని వారి చివరి పూజకై వచ్చాడు.176.అతని కళ్లు అశ్రువులతో నిండిపోయాయి.బాబా స్థితిని చూడలేక పోయాడు. కాళ్లూ చేతులూ వణక సాగాయి. మనసు బాధతో మూగపోయింది.177. మూసుకుని ఉన్న సాయిబాబా చేతిని తెరచి అందులో తాంబూలాన్ని దక్షిణను ఉంచి, వారి శరీరాన్ని మునుపటి వలనే కప్పి మామా బయలుదేరి వెళ్లిపోయాడు.178.తరువాత మధ్యాహ్న హారతిని మసీదులో ప్రతిరోజూ జరిగేలా బాపూసాహేబు జోగు ఇతరులతో కలిసి చేశాడు.179.అత్యంత ప్రశస్తమైన స్థలంలో బాబా శరీరానికి ఏ విధంగా సంస్కారం జరిగింది అన్న మిగతా వృత్తాంతాన్ని తరువాతి అధ్యాయంలో చెప్పబడుతుంది. 180. బాబాకు

అత్యంత ప్రీతిపాత్రమైనది అనేక సంవత్సరాలనుండి వారివద్ద ఉన్న ఇటుక విరిగి పోగా, దానిని వారు అశుభంగా భావించటం, తమ అంతిమ సమయాన్ని సూచించటం జరిగింది. 181. ఇప్పుడు జరిగినట్లుగా ముప్పైరెండు సంవత్సరాల క్రితం బాబా తమ ప్రాణాలను బ్రహ్మాండంలో లీనం చేసినప్పుడు జరిగిఉంటే, వారి శరీరానికి ఎటువంటి కఠిన పరిస్థితి ఏర్పడిఉండేది! 182. భక్త మహల్సాపతి ఏ విధంగా అహోరాత్రులు బాబాను రక్షించాడు. అందఱూ బాబా పైని ఆశ వదులుకోగా వారు ఎలా అకస్మాత్తుగా లేచారు. 183. జీవితాంతం బ్రహ్మచర్యాన్ని ఆచరించిన యోగాచార్యులు, జ్ఞానులలో జ్ఞానవర్యులైన సాయి యొక్క ఐశ్వర్యాన్ని ఎలా వర్ణించను? 184. ఇంతటి మహిమగల సాయికి సద్భావంతో ప్రణామం చేద్దాం. దీనుడైన హేమాడు వారిని అనన్య శరణు వేడుచున్నాడు. 185. స్వస్తి శ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన, శ్రీసాయి సమర్థ సచ్చరితంలో శ్రీసాయినాథ నిర్వాణమను నలుబది మూడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత - 44 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఓం నమో శ్రీసాయీ చిద్ఘనా! మీరు సకలసుఖాలకు నిలయం. సకలసంపదలకు నిధి. మీ కృపతో దైన్యం నశిస్తుంది. 1. మీ పాదాలకు సునాయాసంగా వందనం చేసినవారి సమస్త పాపాలు క్షాళనమౌతాయి. ఇక భక్తిగా మీ పూజలు భజనలు చేసినవారు ఎంతో ధన్యులు. 2. సాయి యొక్క మందహాస వదనాన్ని చూస్తే ప్రపంచ దుఃఖాలన్నిటినీ మరచిపోయి ఆకలి దప్పులు ఉడిగి పోతాయి. వారిది అటువంటి అలౌకిక దర్శనం. 3. వారు సదా అల్లామాలిక్ అన్న ధ్యానంలో ఉండేవారు. వారి మనసు ఏ కోరికలూ లేకుండా నిరభిమానంగా, లోభం లేకుండా వాసనారహితంగా ఉండేది. వారి మహిమను ఎంతని వర్ణించను? 4. అపకారం చేసేవారికి కూడా ఉపకారం చేసే వారి శాంత స్వభావాన్ని ఒక్కక్షణమైనా ఎవరూ మరవలేరు. వారిని అంతరంగంలో ప్రతిష్ఠించుకోండి. 5. రాముడు కృష్ణుడు కమలాలవంటి కనులు కలిగినవారు. సత్పురుషులు ఒకటే కన్ను లేదా కన్నులు లేనివారు. దేవునిరూపం అందంగా ఉంటుంది. అయితే సత్పురుషులు ఎప్పుడూ ఆనందస్వరూపులుగా ఉంటారు. 6. భగవంతుని నేత్రాలు చెవులవరకూ ఉంటాయి. సత్పురుషుల దృష్టికి అంతం అంటూలేదు. 'యే యథామాం' 'నన్ను ఎవరుఎలా భజిస్తే, అలా వారికి ఫలితమిస్తానని దేవుడంటాడు. కాని సత్పురుషులు నిందించేవారి యందు కూడా దయకలిగి ఉంటారు. 7. రాముడు కృష్ణుడు మరియు సాయి, ఈ ముగ్గురిలో భేదం లేదు. పేరుకు ముగ్గురైనా

వారు ఒక్కరే. 8.అట్టివారికి నిజంగా మరణమన్నమాట మిథ్య. కాలునిపై కూడా శక్తి గల వారిని కాలం ఎలా బాధ పెట్టగలదు? 9.ప్రారబ్ధ సంచిత క్రియమాణ కర్మలు మనకు తెలియవు. సాయి గురుమహారాజు కరుణాళువని తెలుసుకుని వారిని కరుణించమని ప్రార్థిస్తాను.10.అనేక వాసనల అలల తాకిడికి మనసుకు విశ్రాంతి లేదు.సాయీ! నీ దయలేనిదే ఈ జీవికి ధైర్యం కలుగదు.11.గతాధ్యాయారంభంలో, మాట ఇచ్చిన ప్రకారం వివరించటం కుదరలేదు. ఇప్పుడు మొదటి నుండి చివరివరకు వినండి.12.అంతిమసమయం సమీపించిందని తెలుసుకుని సాయిబాబా శ్రద్ధగా బ్రాహ్మణుని ద్వారా పదునాలుగు రోజులు అహర్నిశలూ రామాయణ శ్రవణం చేశారు.13.ఇలా రెండు సప్తాహాలు రామాయణ శ్రవణం చేసి విజయదశమిరోజున బాబా శరీరాన్ని విడిచిపెట్టారు.14.వారు ప్రాణాలు వదిలిన తరువాత లక్ష్మణమామ పూజ చేశాడని,జోగు హారతిని ఇచ్చాడని గతాధ్యాయంలో చెప్పబడింది. 15.తరువాత ముప్పై ఆరుగంటలు హిందువులు మహమ్మదీయులు బాబా శరీరానికి అంతిమ సంస్కారాన్ని ఏ విధంగా చేయాలి అని ఆలోచించారు.16.బాబా తమ సమాధి స్థలాన్ని ముందుగానే నిర్ణయించటం, అకస్మాత్తుగా ఇటుక పడిపోవటం మరియు ఒకసారి బాబా ప్రాణాలను మూడురోజులు బ్రహ్మాండంలో లీనం చేయటం జరిగింది.17.అది వారి సమాధియా లేక శరీరాన్ని త్యజించటమా అన్నది ఎవరికీ అర్థం కాలేదు. సాయి యొక్క శ్వాసోచ్ఛ్వాసలు ఆగిపోగా వారు మరల లేవటం అశక్యమని అందఱికీ అనిపించింది.18.మూడురోజులు గడిచాక బాబా ప్రాణాలు విడిచారని నిశ్చయించుకున్నారు.ఇక వారి ఉత్తర క్రియలు ఏ విధంగా చేయాలన్న విషయం అందఱికీ కలిగింది.19.ఆ సందర్భంలో తమ అంతరంగంలో సావధానంగా ఉన్న బాబా అకస్మాత్తుగా శరీరంలోనికి ప్రవేశించి భక్తుల చింతను తొలగించారు.20.ఈ కథనంతా శ్రోతలు భక్తిభావంతో వినండి. శ్రవణంతో మనసుకు ఆనందం

కలుగుతుంది. కంఠం గద్గదమౌతుంది. 21. ఇది కథ కాదు. ఒక పేటిక. దీనిలో అమూల్యమైన సాయి రత్నాలున్నాయి. ప్రేమపూర్వకంగా తెరచి చూస్తే దర్శన భాగ్యంలోని సుఖం అనుభవమౌతుంది. 22. ఈ అధ్యాయాలన్నింటిలోనూ సాయినాథులు నిండుగా కనిపిస్తారు. వీనిని శ్రవణం చేస్తే మీ మనోభీష్టం సిద్ధిస్తుంది. వీనిని స్మరిస్తే సాయి అండ లభిస్తుంది. 23. ఇది పరమ ఉదార ఆచరణగల సాయి యొక్క చరితం. దీనిని ఏకాగ్రచిత్తంతో ప్రేమగా శ్రవణం చేయటానికి సిద్ధమవండి. 24. ఈ పావన చరితాన్ని ఎంత విన్నా భక్తుల మనసులకు తృప్తి ఉండదు. ప్రపంచబాధల నుండి విశ్రామం, పూర్ణపరమానందం కలుగుతాయి. 25. ప్రసన్నమైన మనసుకు ఆత్మానందం ప్రాప్తిస్తుంది. సాయి యొక్క ఈ కథలు సకల సుఖాలలో అతి నిర్మలమైన సుఖాన్ని కలుగచేస్తాయి. 26. ఎంత విన్నా ఇవి నిత్యనూతనంగా ఉంటాయి. ఇదే రమణీయతాలక్షణం. అందువలన పావనమైన ఈ సత్పురుషుని కథను ఏకాగ్రమనసుతో వినండి. 27. బాబా శరీరానికి అంతిమ సంస్కారం ఎక్కడ ఎలా చేయాలి అన్న వాదోపవాదాలతో అందఱూ అలసిపోయారు. చివరకు జరిగినదానిని వినండి. 28. బుట్టి యొక్క భవనంలోని హాలు మధ్యభాగంలో, మురళీధరుని స్థాపనకై కేటాయించిన చోటులో బాబాను స్థాపించటానికి నిశ్చయమయింది. 29. మొదట పునాది త్రవ్వుతున్నప్పుడు బాబా లెండీకి వెళ్లుతూ మాధవరావు విన్నపాన్ని తమ తలను ఆడించి సమ్మతించారు. 30. మురళీధరునిస్థాపన కోసం పునాది త్రవ్వుతుండగా మాధవరావు బాబా చేతికి కొబ్బరికాయను ఇచ్చి 'బాబా! దయతో అవలోకించండి' అని ప్రార్థించాడు. 31. ఆ శుభ సమయాన్ని గమనించి బాబా, 'ఈ కొబ్బరికాయను కొట్టు. మనమంతా బాల గోపాలురం. ఇక్కడ కాలం గడుపుదాం. 32. ఇక్కడే కూర్చుని సుఖదుఃఖాలను ముచ్చటించుకుందాం. పిల్లలకు ఇక్కడే మనశ్శాంతి లభిస్తుంది' అని అన్నారు. 33. బాబా ఊరికినే అలా అన్నారని మొదట అందరికీ అనిపించింది కాని వారి వచనం

అనుభవానికి వచ్చిన తరువాత ఆ మాట అర్థమైంది.34.బాబా శరీరాన్ని వదిలివేయడంతో మురళీధరుని స్థాపన ఆగిపోయింది. దానితో సాయిఅనే నిధిని రక్షించుకోవటానికి అదే ఉత్తమ స్థానమని అనిపించింది.35.'ఈ శరీరాన్ని వాడాలో ఉంచండి' అన్న బాబా చివరి మాట ప్రకారం అదే నిశ్చయమైంది. ఆ విధంగా బాబాయే మురళీధరుడయ్యారు.36.శ్రీమంతుడైన బుట్టి మొదలగు భక్తులు, హిందువులూ, మహమ్మదీయులూ అందఱూ ఇదే విషయానికి సమ్మతించినందున బుట్టి భవనం సత్కార్యానికి ఉపయోగపడింది.37.ఎంతోధనం వెచ్చించి కట్టిన ఆ భవనం ఉండికూడా బాబా శరీరాన్ని మరెక్కడో ఉంచితే ఆ భవనం శూన్యంగా అత్యంత భయంకరంగా భాసిల్లేది. 38.ఇప్పుడు అక్కడ జరిగే భజనలు పూజలు కథాకీర్తనలు పురాణశ్రవణం,అతిథి అభ్యాగతులకు అన్నదానం మొదలగునవి జరగటానికి కారణం శ్రీసాయి.39.ఇప్పుడు అక్కడ అన్నసంతర్పణలకు లఘురుద్ర మహారుద్రావర్తనకు దేశదేశాలనుండి, భక్తులు రావటానికి, అన్నిటికీ కారణం శ్రీసాయి.40.ఇటువంటి సత్పురుషుల వచనంలోని అక్షరం అక్షరం చెవులలో భద్రపరుచుకోవాలి. కాని ఏదో చెప్పి ఉండవచ్చు అని అగౌరవంతో అలక్ష్యం చేయకండి.41.మొదట వారి వచనాలు అస్పష్టంగానో లేక ఎంతో సందిగ్ధంగానో ఉన్నా, అవి సమయం గడిచాక సరిగ్గా అర్థమౌతాయి.42.బాబా శరీరాన్ని వదిలేముందు, శిరిడీలోని మసీదులో భవిష్యత్తులో జరగబోయే దానికి సంబంధించిన అపశకునాలు జరిగాయి.43.ఇప్పుడు వానిలోని ఒక్కటే విషయాన్ని శ్రోతలకు మనవి చేస్తాను.అన్నిటినీ చెప్పాలంటే గ్రంథం పెద్దదైపోతుంది.44.బాబా వద్ద చాలా సంవత్సరాలనుండి ఒక పాత ఇటుక ఉండేది. వారు దానిపై చేతిని ఆన్చి ఆసనం వేసుకుని కూర్చునేవారు.45. రోజూ రాత్రి అయాక మసీదులో బాబా ఏకాంతంగా ఆ ఇటుక ఆధారంగా ఆసనం వేసుకుని ఏకాగ్ర మనసుతో కూర్చునేవారు.46.అలా అనేక

సంవత్సరాలు ఏ ఆటంకం లేకుండా గడిచాయి. కాని జరుగనున్నది అనుకోకుండా జరిగిపోతుంది.47.బాబా మసీదులో లేప్పుడు, ఒక కుష్ఠువాడు మసీదును శుభ్రపరచటానికి చిమ్ముతున్నాడు. ఇటుకక్రింద చెత్తను తుడవటానికి ఇటుకను కాస్త లేవనెత్తాడు.48.అంతే.దానికి విరిగిపోయే వేళ వచ్చింది.ఆ పిల్లవాని చేతిలోనుండి జారి దభేలున క్రింద పడి వెంటనే రెండు ముక్కలయింది.49.ఈ విషయాన్ని విని బాబా 'ఇటుక కాదు నా కర్మే బ్రద్దలయింది' అని ఎంతో కలవరపడ్డాడు. వారి కళ్లనుండి దుఃఖాశ్రువులు రాలాయి.50.రోజూ వారు యోగాసనానికి వాడుకునే ఇటుక విరిగిపోగా వారి హృదయానికి బాధ కలిగి కంఠం గద్గదమైంది.51.చాలా కాలం నాటి ఇటుక, వారి ఆసనానికి మూలాధారమైనది, అకస్మాత్తుగా విరిగిపోవటంతో వారికి మసీదు శూన్యంగా అనిపించింది.52.అది ఇటుకే అయినా బాబాకు ప్రాణ సమానంగా అది అత్యంత ప్రియమైనది. అందువలన దాని స్థితిని చూచి వారు చాలా బాధపడ్డారు. 53.ఆ ఇటుకపైన మోచేతిని ఆన్చి బాబా గంటలుగంటలు ఆసనంలో యోగతత్పురులై కూర్చునేవారు. దానిపై వారికి చాలా ప్రేమ.54.'దాని సహవాసంలో ఆత్మచింతన చేసేవాణ్ణి, అది నా ప్రాణం నాకు తోడుగా ఉన్నది.విరిగిపోయింది. అదిలేక నేనుకూడా ఉండను.55.ఆ ఇటుక నా జన్మకు తోడుగా ఉన్నది. అది ఈ రోజు నన్ను వదిలిపోయింది'.అని దాని గుణాలను తలచుకుని బాబా బాధ పడ్డారు.56.ఇక్కడ సహజంగా సందేహం కలుగుతుంది.ఇటుక క్షణభంగురమైనది కదా మరి దానికోసం ఎందుకు శోకించటం. లోకులు ఏమనుకుంటారు?57.అని మొదట ఎవరికైనా సరే సంశయం కలుగుతుంది. సాయిచరణాలకు నమస్కరించి నేను దానికి సమాధానం చెప్పటానికి ప్రయత్నిస్తాను.58.సత్పురుషులు జగత్తును ఉద్ధరించటానికి మరియు దీనులను పామరులను తరింపచేయటానికే అవతరిస్తారు కాని వారికి వేరే ఏ అవసరం లేదు.59.నవ్వటం, ఏడవటం,

ఆడటం మొదలగు లౌకిక ఆచరణలు నటనలే అని ఇందులోని సారం. శ్రేష్ఠులు ఆచరించినట్లుగానే లోకులు వ్యవహరిస్తారు.60.సత్పురుషులు పూర్ణజ్ఞానులైనా సకల కోరికలు తీరిపోయిన వారైనా లోకులను తరింప చేయటానికి కర్మాచరణలో ఉద్యుక్తులై ఉంటారు.61.సాయిబాబా శరీరాన్ని వదలడానికి ముప్పైరెండు సంవత్సరాలకు పూర్వమే వారి సమాధి అయిపోయి ఉండేది.కాని మహాల్సాపతి యొక్క బుద్ధిచాతుర్యం వలన ఆ దురదృష్ట సంఘటన ఆగింది.62.ఆ దుర్ఘటన ఆగిపోకుండా ఉంటే అందఱికీ సాయి యొక్క సందర్శనయోగం ఎలా కలిగేది?నలభై మూడు సంవత్సరాల క్రిందటే బాబాతో వియోగం ఏర్పడే దురదృష్టం పట్టి ఉండేది.63.మార్గశీర్ష శుద్ధపౌర్ణమినాడు బాబా ఆయాసంతో అస్వస్థులయ్యారు. శరీరధర్మాన్ని సహించటానికి ప్రాణాలను బ్రహ్మాండంలో చేర్చారు. 64.'ఇప్పుడు మేము మూడురోజులు ప్రాణాలను బ్రహ్మసహస్రారంలో నిలిపి ఉంచుతాం.మమ్మల్ని మేలు కొలుపవద్దు' అని బాబా చెప్పారు.65.మసీదులోని సభామండపంలో ఒక మూలనున్న స్థలాన్ని వ్రేలితో చూపించి 'అక్కడ నా సమాధి కోసం త్రవ్వి ఆస్థలంలో నన్ను ఉంచండి' అని చెప్పారు.66.మహాల్సాపతితో 'మూడు రోజులవరకూ నన్ను వదలకుండా జాగ్రత్తగా చూడు' అని స్పష్టంగా చెప్పారు.67.'నా సమాధిపైన గుర్తుగా రెండు పళాకాలను ఉంచండి' అని చెప్పుతూ చెప్పుతూ బాబా తమ ప్రాణాలను సహస్రారంలో నిలిపారు.68.అకస్మాత్తుగా తల తిరిగిపడినట్లు నిశ్చేష్టగా పడిపోతే వారు క్రిందపడకుండా మహాల్సాపతి తన ఒడిలో పడుకోబెట్టుకున్నాడు. అందఱూ బాబాపై ఆశను వదులుకున్నారు.69.రాత్రి పదిగంటల సమయమప్పుడు ఆ విధంగా జరిగితే.అకస్మాత్తుగా ఇలా జరిగిందేమిటా అని ఎవరికీ నోట మాట రాలేదు.70.బాబాయొక్క శ్వాస గాని నాడిగాని ఆడటం లేదు. బాబా ప్రాణాలు వదలివేసినట్లే అనిపించింది. జనులకు ఆ పరిస్థితి భయంకరంగా ఉంది. కాని

సాయి మాత్రం సుఖంగా ఉన్నారు.71.తరువాత మహల్సాపతి అతి జాగరూకతతో అహర్నిశలూ సావధానంగా సాయిని జపిస్తూ అక్కడే మెలుకువగా కూర్చున్నాడు.72.సమాధిని త్రవ్వటానికి సాయి స్వయంగా ఆజ్ఞాపించినా అలా చేయటానికి ఎవరికీ ధైర్యం చాలలేదు.73.బాబా సమాధిస్థితిలో ఉండటం చూచి, గ్రామప్రజలందరూ అక్కడ చేరి ఆశ్చర్యంగా చూడసాగారు. మహల్సాపతి మాత్రం బాబా తలను ఒడినుండి క్రిందకు దింపలేదు. 74.ప్రాణాలు పోయాయని తెలుసుకుని, ఒక్కసారిగా భక్తుల గుండెలు అవిసిపోతాయని 'మూడు రోజులు ఉంచండి' అని బాబా లోకులను మభ్యపెట్టారు అని భక్తులు అనుకున్నారు.75.బాబా శ్వాసోచ్ఛ్వాసలు ఆగిపోయాయి. వారి ఇంద్రియాలన్నీ చలనరహితమయ్యాయి. ఏదీ కదలే సూచనే లేదు. శరీరంలోని వేడి కూడా మందగించింది,76.బాహ్యావ్యవహారాల స్పృహ అసలు లేదు. వాక్కు దృఢమౌనం వహించినట్లుంది. మరల ఎలా స్పృహకు వస్తారు అని అందరికి చింత పట్టుకుంది.77.రెండు రోజులు గడిచిపోయినా బాబాకు స్పృహ రాలేదు. మౌల్వి ముల్లా ఫకీరులు వచ్చి ఇక మీదట ఏం చేయాలని ఆలోచించ సాగారు.78.అప్పా కులకర్ణి, కాశీరాం వచ్చి బాగా ఆలోచించి, బాబా తమ ధామానికి చేరుకున్నారు. కనుక వారి శరీరానికి విశ్రాంతినివ్వాలి అని నిశ్చయించారు.79.అయితే ఇంత తొందర పనికిరాదు.కొంతసేపు ఆగటం మంచిది. బాబా ఇతరుల వలె కాదు. వారి మాట తిరుగులేనిది అని కొందరు అన్నారు.80.వెంటనే మిగతా వారు శరీరం చల్లబడిపోయింది, ఇక ఎక్కడి నుండి చైతన్యం వస్తుంది? అంతా ఎంత తెలివి లేనివారు అని అన్నారు.81 వారిని సరియైన వేళలో సమాధిచేయటానికి. వారు చూపించిన స్థలంలో త్రవ్వండి. భక్తులనందరినీ పిలవండి. అన్నీ సిద్ధపరచండి.82.అని అలా చర్చించుకుంటూనే మూడు రోజులు గడిచాయి. తరువాత తెల్లవారుఝామున మూడు గంటలప్పుడు బాబాలో చైతన్యం

కలిగింది. 83.మెల్లమెల్లగా బాబాకు స్పృహవచ్చింది. శరీరం కదిలింది. శ్వాసోచ్ఛ్వాసలు మొదలయ్యాయి. పొట్టకూడా కదలసాగింది.84. బాబా వదనం ప్రసన్నంగా కనిపించింది.వారి కళ్లు తెరుచుకున్నాయి.చేష్టారహితంగా ఉన్న శరీరంలో మేలుకున్న లక్షణాలు కనిపించాయి.85. బహుశా శరీరాన్ని మరచిపోయారేమో,అది మరల గుర్తుకు వచ్చిందేమో, పోయిన ద్రవ్యం మరల లభించినట్లుగా,భోషాణం తెరచుకున్నట్లుగా అయింది.86.సాయిబాబాకు స్పృహ రాగానే అందఱూ ప్రసన్నవదనులయ్యారు. భగవంతుని దయవల్ల విఘ్నం తొలగింది.అయినా అందఱూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.87.మహల్సాపతి బాబాముఖాన్ని సంతోషంగా చూచాడు.సాయిబాబా కూడా మెల్లగా తలను ఆడించారు.మౌల్వీలు ఫకీరుల ముఖాలు పాలిపోయాయి.భయంకరమైన సంఘటన తొలగిపోయింది.88.మౌల్వీ యొక్క బలవంతానికి మహల్సాపతి బాబా ఆజ్ఞను పాలించకుండా,తన నిశ్చయాన్ని ఏకాస్త సడలించి ఉన్నా కఠిన పరిస్థితి ఏర్పడేది.89.నలభై మూడు సంవత్సరాల క్రితమే బాబా సమాధి అయిపోయి ఉండేది. అప్పుడు ఆనందప్రదమైన వారి మాటలు, వారి మనోహరమైన దర్శనం ఎలా ప్రాప్తించేవి?90.సాయిబాబా లోకోపకారం కొఱకు సమాధిని వదిలి ప్రాణాలతో లేవగా భక్తులు సంతుష్టులయ్యారు.91.భక్తుల కార్యార్థం కృషి చేసి పరమానందంలో లీనమైన వారిని ఎలా మేలుకొలుపగలరు?వారి లీల అంతు పట్టనిది.92.తరువాత బాబా మేలుకున్నట్లు తెలుసుకుని భక్తులు సంతోషంతో వారి దర్శనానికి పరుగు తీశారు. బాబా మరల లేవటం అందరికీ సుఖకారణమైంది.93. ఇక పూర్వ కథానుసంధానం ఇంతవరకు బాబాశరీరాన్ని వదిలిన విషయం, గుర్తు ఉన్నంతవరకు పూర్తిగా చెప్పటం జరిగింది.94.శ్రోతలు ఒక క్షణం ఆలోచించండి. ఎందుకు సంతోషించాలి? ఎందుకు శోకించాలి? ఇవి రెండూ అవివేకమేకదా!95.మన సాయిబాబా మూడున్నరమూరల స్థూల శరీరమా? స్థూల

ఇంద్రియాల గూడు మాత్రమేనా? ఆ భ్రమనంతా తొలగించుకొండి.96.సాయి అంటే శరీరమెనని అనుకుంటె? ఆ విదేహునికి ఏ పేరూ లేదు. ఏ రూపం కూడా లేదు. శ్రీసాయి రూపానికి అతీతులు.97.శరీరం నశ్వరం. కాని ఆత్మ నాశరహితం, స్వతంత్రం. శరీరం పంచభూతాలతో కూడినది. కాని ఆత్మవస్తువు అనాది అనంతం. 98.శరీరంలోని శుద్ధసత్వం, జడమైన ఇంద్రియాలను నడిపించే బ్రహ్మచైతన్యమైన ఆత్మవస్తువు పేరు సాయి. 99.ఆ ఆత్మ ఇంద్రియాతీతమైనది. ఇంద్రియాలు జడం. ఆత్మను తెలుసుకోలేవు. ఆత్మే ఇంద్రియాల కార్య ప్రవృత్తికికారణం. ప్రాణాలను నడిపించేది ఆత్మే.100.ఆ ఆత్మశక్తి పేరు సాయి. ఆ చైతన్యశక్తి లేని చోటు లేదు. అది లేని దశదిశలూ కూడా శూన్యం. అది చరాచరాలన్నింటిలో నిండి ఉంది.101.ఆ శక్తియే సాయిరూపంలో అవతరించింది. ముందు అవ్యక్తంగా ఉండి నామరూపాలతో వ్యక్తమైంది. అవతారకార్యం సమాప్తికాగానే మరల అవ్యక్తంలో కలిసిపోయింది.102.అవతారకార్యం ముగిశాక, శరీరాన్ని వదిలి నిర్వికల్పభువనంలో ప్రవేశించినట్లుగా సాయిబాబా చర్యకూడా జరిగింది.103.శ్రీ నృసింహసరస్వతీస్వామి గుప్తమైపోవాలని తలచినప్పుడు గాణగాపురంలో పర్వతయాత్రకు వెడతానని ఎకాయకి బయలుదేరారు.104.భక్తులు వారిని అడ్డగించగా,'నేను లోకాచారంగా వెళ్లుతున్నాను. కాని నేను గాణగాపురాన్ని విడువను.105.ప్రాతఃకాలం కృష్ణాతీరంలో స్నానం చేసి, బిందు క్షేత్రంలో అనుష్ఠానం చేసి, మఠంలో పాదుకల పూజ చేయించుకుంటూ నిరంతరం ఇక్కడే నివసిస్తాను.'అని వారిని శాంతపరచారు. 106. అల్లే సాయిబాబా కూడా కేవలం లోకాచారం కోసం వెళ్లారు. సరిగ్గా గమనిస్తే స్థిరచరాలన్నింటిలోనూ శ్రీసాయి ఉన్నారు.107.వారి వారి భక్తిని బట్టి భక్తులకు అనుభవాలు కలుగుతుంటాయి. శ్రీసాయి మరణాతీతులు. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు.108.సాయి స్థిరచరాలలో

నిరంతరం నిండి ఉన్నారు. సాయి అందరిలోనూ లోపలా బయటా ఉన్నారు.సాయి మీలోనూ మాలోనూ నిరంతరమూ ఉన్నారు.109.దీనదయాళువైన సాయిసమర్థులు భక్తులను పాలిస్తారు. వారు పరమప్రేమను ఆశిస్తారు. వారు అందఱినీ అత్యంత స్నేహభావంతో ఆదరిస్తారు.110.వారు ఇక చర్మ చక్షువులకు కనిపించక పోయినా వారు సర్వత్ర ఉన్నారు.వారు సూక్ష్మరూపంలో దాగి ఉన్నా మనలను మంత్రముగ్ధులను చేస్తారు.111.వారి ప్రస్థానం కేవలం బూటకం. మనలను మభ్యపెట్టటానికి ఆడిన నాటకం. వారు ఎన్నెన్నో పాత్రలను నటించగల నటులు. నశ్వరమైన శరీరాన్ని వదలి అవినాశి అయ్యారు.112.వారి హృదయంలో ఉన్న ప్రేమను పదిలపరచుకుని వారిని అవగాహన చేసుకుని చివరకు కార్యాన్ని సాధించుదాం.113.వారిని మనః పూర్వకంగా ఆరాధిస్తూ, భక్తి భావంతో స్మరించే భక్తులందరికీ వారి సర్వవ్యాపకత్వం అనుభవంలో కనిపిస్తుంది.114. చిత్స్వరూపమైన వారికి సృష్టిస్థితిలయల భయం లేదు. వారు ఎల్లప్పుడూ చిన్మయులు. వికారాలకు వారి వద్ద చోటు లేదు.115. ఆభరణాలుగా మారక ముందు ఉన్న బంగారం, ఆభరణాలుగా మారిన తరువాత కూడా ఆ బంగారం బంగారంగానే ఉంటుంది. అది తన అస్తిత్వాన్ని త్యజించదు.116.అనేక రకాల నగలు నశించిపోయే రూపాంతరాలు. వాని నామరూపాలు పోతే మిగిలేది ఏ ఆకారవికారాలు లేని బంగారం.117.హేమాడు పంతు ఈ బంగారంలో సంపూర్ణంగా లీనమైపోయి, సుగుణాలుగల సాయిచరణాలకంకితమై ప్రళయాంతం వరకు వసించుగాక.118.తరువాత బాబాయొక్క పదమూడవ దినం జరిపారు. భక్తరత్నమైన బాలాసాహేబు భాటే మరియు గ్రామంలోని బ్రాహ్మణులను సమకూర్చుకుని ఉత్తరక్రియావిధిని ప్రారంభించాడు.119.బాలాసాహేబు సచేల స్నానం చేసి తన చేతిమీదుగా తిలాంజలి, తిల తర్పణం, పిండప్రదానం, చేశాడు.120.సపిండీకరణం మొదలైన ఉత్తరక్రియలు ఆయావేళలందు శాస్త్రోక్తంగా

జరిగాయి. న్యాయప్రమాణంగా ధర్మబద్ధంగా మాసికాలన్నీ కూడా జరిగాయి.121. భక్త శ్రేష్ఠులైన ఉపాసనీబాబా జోగుతో వెళ్లి భాగీరథీనదీ పవిత్రస్థానంలో హోమాలు చేశాడు.122.బ్రాహ్మణులకు భోజనం, అన్నసంతర్పణ, దక్షిణప్రదానాలు విధివిధానంగా చేసి మరలివచ్చారు.123.ఇప్పుడు బాబా ప్రత్యక్షంగా లేకపోయినా, వారితో సంభాషణ లేకపోయినా, మసీదును చూడగానే గతించిన ఆనందాలు గుర్తుకు వస్తాయి.124.బాబా రోజూ కూర్చునే వద్దతిలో వారిని చూచిన ఆనందానుభూతిని పొందటానికి మసీదులో వారి తైలవర్ణ చిత్రపటాన్ని ప్రీతిగా స్థాపించారు. 125.సాయిబాబా శరీరం కనిపించకపోయినా ఈ పటాన్ని చూస్తే బాబా యొక్క భక్తులకు వారు మరల మరల వచ్చినట్లుగా అనిపిస్తుంది.126.అందమైన ఈ చిత్రాన్ని శ్యామరావు జయకరు గీశాడు. మనోహరమైన ఈ పటం బాబాను ఎప్పుడూ స్మరణకు తెస్తుంది.127.జయకరు ప్రసిద్ధ చిత్రకారుడే కాదు.గొప్ప బాబా భక్తుడు కూడా.బాబా ఆజ్ఞానుసారం శ్రద్ధగా నడుచుకునే వాడు.128.ఇతని ద్వారా బాబా పటాలను గీయించి ధ్యానధారణల నిమిత్తం భక్తులు తమ ఇళ్లలో స్థాపించుకున్నారు.129.సత్పురుషులకు మరణమనేది ఎప్పుడూ లేదు. పూర్వం ఈ విషయాన్ని అనేకసార్లు వివరించడం జరిగింది. ఇది మీకు గుర్తు ఉండాలి.మరల స్పష్టపరచటం అనవసరం.130.ఇప్పుడు బాబా దేహధారులు కారు.అయినా వారిని స్మరించేవారికి ఇప్పుడు కూడా మునుపటి వలెనే శుభాలను కలుగ చేస్తారు.131.బాబా ఎవరికో ఏదో చెప్పారు కాని వారు శరీరాన్ని విడిచి వెళ్లిపోయారు కనుక వారు చెప్పినది అనుభవంలోకి రాలేదని అనుకోకండి.132. బాబా మాట బ్రహ్మలిఖితం. దృఢమైన విశ్వాసంతో మీ అనుభవాన్ని తెలుసుకోండి. వెంటనే అనుభవం కాకపోయినా కొంతకాలానికి తప్పక అనుభవమై తీరుతుంది.133.జోగ్ పేరు వచ్చేసరికి కథలో మరో ఉపకథ గుర్తుకు వచ్చింది. అతని అపూర్వ కథను వింటే

సాయి యొక్క ప్రేమతత్వం తెలుస్తుంది.134.ఇది చిన్న సంభాషణే అయినా గురుభక్తులకు అత్యంత బ ోధప్రదమైనది. వైరాగ్యాన్ని పొందిన వారు భాగ్యవంతులు. ప్రాపంచిక విషయాలలో బంధింప బడినవారు అభాగ్యులు.135.ఒకసారి జోగ్ బాబాను 'నాస్థితి ఇంకా ఇదేనా.నా కర్మగతి విచిత్రం. నేను ఎప్పుడు మంచిస్థితిని పొందుతాను?136.అనేక సంవత్సరాలనుండి నేను మీకు అనన్యసేవ చేస్తున్నాను కదా మరి దేవా! ఈ చంచలమనసుకు ఇంకా శాంతి లేదు ఎందుకు? 137.నేనెంతటి దౌర్భాగ్యుణ్ణి? సత్పురుషుల సాంగత్యంలో లభించింది ఇదేనా? సత్సంగం యొక్క ఫలితం ఈ శరీరానికి ఎప్పుడు ప్రాప్తిస్తుంది'అని ప్రశ్నించాడు.138.భక్తుని ఆ మొఱవిని సాయిసమర్థులు పరమప్రీతితో జోగుకు ఏమని ప్రత్యుత్తర మిచ్చారో సస్పష్టచిత్తులై ఆలకించండి .139.'నీ దుష్కర్మలు నశించి నీ పుణ్యపాపాలు బూడిదై పోయినప్పుడు, నీ భుజానికి జోలిని చూచినప్పుడు నీవు భాగ్యశాలివని అంగీకరిస్తాను.140.నీ ఉపాధి తొలగినప్పుడు, నీవు భగవద్భక్తిలో మునిగిపోయినప్పుడు,ఆశాపాశబంధం విడిపోయినప్పుడు నిన్ను నేను భాగ్యవంతుడవని తలుస్తాను.141.విషయసుఖాలలోని ఆసక్తిని త్యజించి, నేను నీవనే భేదభావం అయుక్తమని తలచి, జిహ్వాను ఉపస్థను అదుపులో ఉంచుకున్నప్పుడు నీవు భాగ్యశాలివని నేను అంగీకరిస్తాను.142.కొంతకాలానికి బాబా వచనం సత్యమైంది. సద్గురుకృప వలన బాబా చెప్పిన విధంగానే జోగుకు వైరాగ్యం కలిగింది.143.అతనికి పుత్రసంతతి బంధం లేదు. భార్య సద్గతిని పొందింది.మరణించడానికి ముందే జోగు సన్యసించాడు.దానితో వైరాగ్యం సహజమే కదా' 144.సాయి వచనం సత్యమై జోగు భాగ్యవంతుడయ్యాడు. చివరకు సన్యాససంపన్నుడై బ్రహ్మలో విలీనుడయ్యాడు.145.సాయిబాబా చెప్పిన విధంగానే అతని స్థితి పరిణమించి సాయి యొక్క వచనం సత్యమైంది.జోగు నిజంగా భాగ్యశాలి.146.భక్తుల శ్రేయస్సు కొఱకు తపించిపోయే దీనదయాళువైన సాయి శిరిడీలో త్రికాలాలలో

బొధామ్యతాన్ని కురిపించేవారు.దానిని వినండి.147.'నా యందు అత్యంత ప్రితిగలవారిపై నా దృష్టి ఎల్లప్పుడూ ఉంటుంది. వారికి నేను లేని ప్రపంచం శూన్యం. వారి నోట నా మాటే ఉంటుంది.148.వారు నిరంతరం నా ధ్యానమే చేస్తారు. జిహ్వాతో నా నామాన్నే జపిస్తారు. వస్తున్నా పోతున్నా ఏం చేస్తున్నా నా చరిత్రనే గానం చేస్తారు. 149.ఈ విధంగా చిత్తం నా ఆకారాన్ని పొందినప్పుడు మంచి చెడు కర్మలయందు నిష్కృతి కలుగుతుంది. నా సేవ యందు ఇంతటి ఆదరం ఉన్న చోట నేను ఎల్లప్పుడూ తిష్ఠ వేసుకుని అక్కడే ఉంటాను. 150.నాకు అనన్య శరణుజొచ్చి అనవరతం నా స్మరణ చేసేవారికి నేను ఋణపడి ఉంటూ వారిని ఉద్ధరించి నా ఋణం తీర్చుకుంటాను.151.ముందుగా నాకు అర్పించక ఏం తినకుండా రసాస్వాదన చేయకుండా, ఎప్పుడూ నా నిది ధ్యాసనలో ఉండేవారి అధీనంలో నేను ఉంటాను.152.ఆకలిదప్పులు కూడా నేనే అయి నా సమానులు మరెవరు లేరని తలచే వారినే నేను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటాను. వారి అధీనంలో ఉండి ప్రవర్తిస్తాను.153.తల్లి తండ్రి బంధువులు ఆప్తులు ఇష్టులు భార్యాబిడ్డలు వీరి మోహం నుండి బయటపడినవారే నా చరణాలయందు భక్తి కలిగి ఉంటారు.154.వర్షాకాలంలో అనేక నదులు సముద్రంలో కలిసిపోయి తమ అస్తిత్వాన్ని మరచిపోతాయి. అవి మహాసాగరమై పోతాయి.155.నదుల రూపాలు వాని పేర్లు పోయి వాని నీరు కూడా సాగరంలో కలిసిపోయి సరితా సాగరాలు లగ్నమైనట్లు ఏకమైపోగా ద్వైతం పోతుంది.156. ఇటువంటి ఏకత్వాన్ని పొందిన భక్తుల మనసులు నామరూపాలను మరచిపోయి వారు నన్ను ఆత్మస్వరూపంగా చూస్తారు. వారికి నాకంటే వేరే చోటేలేదు.157.నేను పరమవేదిని కాను,వట్టి రాయిని అని తెలపటానికి పుస్తక పండితులు ఇనుప ముక్కను తెచ్చి నాపై ప్రయోగించారు.158. అలా ఇనుప కమ్మితో నన్ను కొట్టగా అది సువర్ణమై పోయింది. దానితో నేను రాయిని కానని వారికి విచిత్రమైన

అనుభవం కలిగింది. 159.అణుప్రమాణమైనా గర్వం లేకుండా మి హృదయంలో ఉన్న నన్ను శరణుజొచ్చితె, వెంటనే అజ్ఞానం నశించిపోయి శ్రవణం చేయవలసిన అవసరం ముగిసిపోతుంది.160.అజ్ఞానం,శరీరమే నేను అనే బుద్ధిని కలుగచేస్తుంది. ఈ బుద్ధి కారణంగానే ఆధివ్యాధులు కలుగుతాయి. ఈ బుద్ధే ఆత్మప్రాప్తికి ప్రతిబంధకమై మనుషులను విధినిషేధాల వద్దకు నెట్టుతుంది.161.నేను ఇప్పుడు ఎక్కడ ఉన్నాను, నన్ను ఎలా కలుసుకోగలరని మీరు అనుకుంటారు కదూ! నేను మీ హృదయాలలోనే తిష్టవేసుకుని ఉన్నాను. ఏ క్ష్టం లేకుండా మీ సమీపంలోనే లభిస్తాను. 162.హృదయంలో ఎవరున్నారు? వారు ఎలా ఎటువంటి లక్షణాలతో ఉంటారు? వారిని తెలుసు కోవటానికి గుర్తులు ఏవి అని మీరు అడుగుతారు.163.హృదయంలో ఉన్న వారు ఎవరు? వారిని ఎలా శరణు వేడాలి అన్న విషయానికి స్పష్టమైన వివరణను శ్రద్ధగా వినండి .164. సృష్టిలో అనేకరకాల పేర్లు రూపాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వానిని గణించడం సాధ్యం కాదు. ఈ నామరూపాలన్నీ మాయయొక్క స్వరూపం. 165.అల్లే సత్త్వ రజ తమస్సు అనే త్రిగుణాలకు అవతల సత్ తత్వం యొక్క స్మరణ. అదే హృదయంలో ఉన్న రూపమని తెలుసుకోండి.166.నామరూపాలు లేకుండా మిగిలిన నీవు హృదయంలో ఉన్నవాని లక్షణమని తెలుసుకుని వారి శరణువేడాలి.167.హృదయంలో ఉన్నది నేనే అని గ్రహించినప్పుడు అన్ని ప్రాణులలోను నేనే విస్తరించి ఉన్నాను అని, నేను లేని చోటేలేదని అర్థమౌతుంది.168.ఈ దృష్టితో అభ్యాసం చేయగా చేయగా నా సర్వవ్యాపకత్వం అనుభవంలోనికి వస్తుంది. అప్పుడు మీరు నాతో సామరస్యాన్ని పొంది సంపూర్ణ అనన్యత్వాన్ని అనుభవిస్తారు. 169.ధ్యానం చైతన్యంలో లగ్నమై అంతఃకరణం పరిశుద్ధమౌతుంది. గంగాజలాన్ని తాకకుండానే గంగా స్నానమౌతుంది.170. ప్రకృతి సిద్ధంగా జరిగిపోయే కర్మలయందు అభిమానం ఉండటంవలన బంధనం ఏర్పడుతుంది

కనుక జ్ఞానులు వానికై ప్రాకులాడక ఎల్లప్పుడూ అంతరంగంలో జాగరూకులై ఉంటారు. 171.స్వస్వరూపంలో ధ్యానమగ్నులై అక్కడినుండి అణువంతైనా కదలకుండా ఉంటారు. వారికి సమాధిలో ఉండటం, లేదా సమాధినుండి లేవటం అనే రెంటితోనూ ప్రయోజనంలేదు.172.అందువల్ల శ్రోతలచరణాలకు శిరసువంచి అత్యంత ప్రేమగా విన్నవించడం, దేవుడు, సత్పురుషులు, భక్తులు వీరందఱి యందు భక్తి గౌరవాలను కలిగి ఉండండి అని.173.ఎవరైనా సరే, ఎవరిని గురించి అయినా నిందచేస్తే వారు నన్నే దూషించినట్లు, నా హృదయాన్నే గాయపరచినట్లు అని తెలుసుకోండి.' అని బాబా తరచు చెప్పేవారు.174.చెడుమాటలతో ఎవరినైనా బాధపెడితే నన్ను బాధ పెట్టినట్లే. కాని ధైర్యంతో బాధను సహిస్తే నన్ను ఎల్లప్పుడూ సంతోషపరచినట్లు.175.ఈ విధంగా సాయిబాబా సర్వత్ర సర్వప్రాణులలోను లోపలా బయటా నిండి ఉన్నారు. వారికి ప్రేమ ఒక్కటి తప్ప ఏదీ ఇష్టంలేదు. 176.పరమ మంగళకరమైన పరమామృతం వారి నోటి నుండి ఎప్పుడూ స్రవిస్తూ ఉంటుంది. భక్తుల పట్ల వారికి అత్యంత ప్రేమ. ఇది ఏ భాగ్యవంతునికి తెలియదు?177.వారితో సహపంక్తి భోజనలాభాన్ని పొంది వారితో నవ్వుతూ ఆడుతూ వ్యవహరించిన వారికి,వారికోసం తపించిన వారి మనసుకు ఏమనిపించి ఉంటుంది. 178.ఇటువంటి శిష్టాచారభోజనసమయాన నేను కూడా వారి ఉచ్ఛిష్టభోజనానికి అధికారిని ఆ ఒక్కొక్క కణాన్ని సేకరించి ఉంచాను. వానిని ఆనందంగా పంచిపెడతాను.179. ఇంతవరకు జరిగిన కథల కర్తృత్వాన్ని హేమాడ్‌పంతుకు ఆపాదించడమా? కథ యొక్క వక్త సాయిసమర్థులు. వ్రాసేవారు వ్రాయించేవారు కూడా వారే. 180.ఈ సాయిసమర్థుని కథను ఎంత వర్ణించినా నా మనసుకు తృప్తి లేదు. ఎప్పుడూ నాకు అదే ధ్యాస. అంతేగాక శ్రవణం చేసిన శ్రోతలకు కూడా ఆనందం.181. సాయి కీర్తిని గానం చేసిన వారు, సద్భావంతో ఆలకించిన వారు ఉభయులూ

సాయిస్వరూపులౌతారు. మీరు దీనిని దృఢంగా తెలుసుకొండి. 182. ఇప్పుడు హేమాడ్ ఈ అధ్యాయాన్ని పూర్తి చేసి సాయికి సమర్పించి ప్రేమతో వారి చరణాలను పట్టుకుని తరువాతి కథను చెప్పుతాడు. 183. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో శ్రీసాయినాథ నిర్వాణమను నలుబది నాలుగవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 45 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

తిరగలిలో సహజంగా విసురుతూ తమ సచ్చరిత రచనను స్ఫురింప చేసి భక్తులను సన్మార్గంలో పెట్టే వారి కౌశలం ఎంత అలౌకికమైనది. 1. పరమపురుషార్థమైన మోక్షం కంటె గురుచరణాలు సమర్థవంతమైనవి. ఇటువంటి గురువు యొక్క చరణతీర్థాన్ని సేవిస్తే మోక్షం తెలియకుండానే ఇంట్లోకి ప్రవేశిస్తుంది. 2. గురువు కరుణిస్తేనే ఈ ప్రపంచం సుఖమయమౌతుంది. జరగవని తలచినవి జరుగుతాయి. గురువు అర క్షణంలో ఒడ్డుకు చేరుస్తారు. 3. గ్రంథం ఇంతగా వ్రాయబడింది కాని, కథ సంక్షిప్తంగానే చెప్పబడింది. సాయి యొక్క అమోఘమైన కీర్తిని నేనెంతని వర్ణించను? 4. ఎవరి దర్శనంతో నిత్యతృప్తి, ఎవరి సహవాసంతో ఆనంద భుక్తి ఎవరివలన భవభయ విముక్తి కలుగుతాయో ఆ సాయిమూర్తిని పోగొట్టుకున్నాం. 5. ఎవరివలన పరమార్థ ప్రవృత్తి, ఎవరివలన మాయామోహ నివృత్తి, ఎవరివలన అత్యంత క్షేమం కలుగుతాయో ఆ సాయిమూర్తిని పోగొట్టుకున్నాం. 6. ఎవరివలన భవభయభీతి ఉండదో, ఎవరివలన న్యాయం నీతి జాగ్రతమౌతాయో, ఎవరివలన కష్టాలలో మనసుకు ధైర్యం కలుగుతుందో ఆ సాయిమూర్తిని పోగొట్టుకున్నాం. 7. మనం ధ్యానించుకోవటానికి సాయిబాబా తమ రూపాన్ని మన మనసులలో స్థాపించి, తమ అవతారాన్ని చాలించి తమ ధామానికి వెళ్లిపోయారు. వారి ఈ యోగస్థితి అంతుపట్టనిది. 8. అవతార కార్యం సంపూర్ణం కాగానే వారి పార్థివశరీరం కనిపించకుండా పోయింది. అయినా ఈ గ్రంథం ఆ వాఙ్ఞయ

మూర్తిని అనుక్షణమూ గుర్తుకు తెస్తుంది.9. అంతేకాక వారి చరితాన్ని పఠించినా విన్నా మనసుకు లభించే ఏకాగ్రతను దానివలన కలిగే అపూర్వతను, వర్ణనాతీతమైన శాంతిని ఎలా వర్ణించను? 10. శ్రోతలైన మీరందఱూ జ్ఞానులు. నేను మీముందు అల్పజ్ఞుణ్ణి. అయినా సాయియొక్క ఈ వాగ్యజ్ఞాన్ని మీరు కృతజ్ఞతాభావంతో ఆదరించండి. 11.కల్యాణ ప్రదమైన ఈ వాగ్యజ్ఞాన్ని నా వంటి అజ్ఞాని ద్వారా సాయి పూర్తిగా సాధించుకున్నారని సర్వజ్ఞులైన శ్రోతలు ఎఱుగుదురు.12.సాయి చరణాలకు వందనంచేసి ఏకాగ్రమనసుతో మహామంగళకరము, పరమ పావనమైన ఈ చరితాన్ని శ్రవణంచేసే భక్తుల మరియు 13.తమ శ్రేయస్సును సాధించుకోవటానికి అనన్యమనసుతో భక్తిగా ఈ కథామృతాన్ని సేవించే.14.భక్తుల స్వార్థపరమైన కోరికలనే కాక పరమార్థ అవసరాలను కూడా సాయి తీరుస్తారు. వారి సేవ ఎప్పుడూ వృథాకాదు. చివరకు అది వారిని కృతార్థులను చేస్తుంది.15.ఈ గ్రంథంలోని నలుబది నాలుగవ అధ్యాయం చివర సాయి నిర్వాణాన్ని గురించి విన్నారు కదా. అయినా ఈ గ్రంథం ఇంకా ముందుకు సాగుతూ ఉంది.మరి ఇదేం చమత్కారమో అర్థం కావటంలేదు.16. గతాధ్యాయంలో యథాక్రమంగా సాయిబాబా నిర్వాణాన్ని పూర్తిగా వర్ణించినా సాలెపురుగు వలె సాయిలీలలకు క్షణమైనా విశ్రాంతి లేదు.17.వాస్తవానికి ఇందులో ఏమీ ఆశ్చర్యంలేదు. సాయి జననమరణాలకు అతీతులు. వారి నిర్యాణం కేవలం శరీరానికే. అందుచేత మునుపటి వలె అవ్యక్తంలో ఉన్నారు. 18.శరీరం పోయింది. దాంతో ఆకారం పోయింది.కాని వారు ఎప్పటివలె అవ్యక్తంలో ఉన్నారు. శరీరాన్ని వదలిన తరువాత కూడా వారి లీలలు అందఱికీ విదితమే.19.అసంఖ్యాకంగా ఉన్న లీలలను వర్ణించాలంటే గ్రంథం పెద్దదైపోతుంది. అందువలన శ్రోతలకు వానిలోని సారాన్ని మనవిచేస్తాను.20.మనం భాగ్యవంతులం, ధన్యులం. సాయిబాబా అవతరించిన కాలంలో వారి సాన్నిధ్యం సహజసిద్ధంగా లభించింది.21.అయినా మన చిత్త వృత్తి

ప్రపంచంనుండి నివృత్తి కాకపోతె, భగవంతునిపై ప్రితి కలగకపోతె ఇంతకంటె దుర్గతి ఏముంటుంది? 22. సర్వేంద్రియాలకు సాయిపైని భక్తి ఉండటమే నిజమైన ఆరాధన. లేకపోతే కళ్లతో సాయిని చూస్తున్నా మాట్లాడాలని తలచినా నోరుపెగలదు. 23. చెవులు సాయి కీర్తనలను వింటుండగా జిహ్వా మధురమైన మామిడి పళ్లరసంలో మగ్నమైతే ఎలా? చేతులు సాయిపాదాలను స్పర్శిస్తుండగా మృదువైన పరుపు సుఖం గుర్తుకు వస్తే ఎలా? 24. క్షణమైనా సాయినుండి విడిగా ఉండగలవాడు అసలు సాయి భక్తుడా? ప్రపంచమందు విరక్తి కలగని వారికి భగవంతుని చరణాలయందు ఆసక్తి ఎలా ఉంటుంది? 25. ఒక్క భర్త తప్ప మరెవరైనా మార్గంలో కనిపిస్తే వారిని మామగారని మరిది అని లేక అన్నఅని తలచి వారికి గౌరవంగా వందనం చేస్తుంది. 26. అట్టి పతివ్రతా స్త్రీ మనసు ఎప్పుడూ నిశ్చలంగా ఉంటుంది. ఆమె తన ఇల్లు ఎప్పుడూ విడిచిపెట్టదు. ఆమెకు తన భర్తపైనే అమితప్రేమ. ఆమెకు జీవితాంతం ఆధారం అతడొక్కడే కదా. 27. పతివ్రతాసాధ్వీసతి అన్యులను భర్తగా తలచి దర్శించుకోవాలని ఎన్నడూ మనసులోనైనా తలవదు. 28. ఆమెకు తన భర్తయే సర్వస్వం. ఇతరులెవరైనా సరే అతని సమానులు కాలేరు. అతని యందే ఆమెకు అనన్యమైన ప్రేమ ఉంటుంది. ఇదే విధంగా శిష్యుడు కూడా గురుచరణాల యందు భక్తి కలిగి ఉండాలి. 29. పతివ్రత యొక్క పతి ప్రేమ గురుప్రేమకు ఉపమానంగా చెబుతారు కాని, గురువుయొక్క ప్రేమకు పరిమితి అంటూ లేదు. ఆ ప్రేమలోని మహిమను ఉత్తమశిష్యుడే తెలుసుకుంటాడు. 30. ప్రపంచంలోనే ఏ సహాయం చేయలేనివారు ఇక పరమార్థంలో ఏం సహాయం చేయగలరు? వియ్యంకుని పైగాని, అల్లునిపైగాని, లేదా భార్యపై గాని, ఎవరిపైనా నమ్మకం పెట్టుకోకండి. 31. తల్లి తండ్రి మమకారాన్ని చూపుతారు. పుత్రుడు తన ఆస్తిపైన దృష్టి ఉంచుతాడు. భార్య తన పసుపుకుంకాల కోసం ఏడుస్తుంది. పరమార్థంలో సహాయం చేసే వారు ఎవ్వరూ లేరు. 32. పరమార్థం

సంపాదించుకోవటంలో సహాయపడే వారు ఎవరు అని నిదానంగా ఆలోచిస్తే చివరకు మనమే మిగులుతాం. 33. నిత్యా నిత్య వివేకంతో ఐహిక ఆముష్మిక సుఖాల ఫలభోగాలను త్యజించి శమదమాది షట్‌సంపత్తిని సంపాదించి మోక్షాన్ని సాధించేవారు ధన్యులు. 34. ఎవరియందు ఏ ఆశా లేకుండా ఆత్మయందు దృఢమైన విశ్వాసముంచి, తమ ప్రయత్నాన్ని స్వయంగా చేసుకునేవారికే పరమార్థం సిద్ధిస్తుంది. 35. బ్రహ్మనిత్యం జగత్తుఅనిత్యం. ఒక్క గురువే నిజమైన బ్రహ్మ. అనిత్యాన్ని, అశాశ్వతమైనదానిని విడచి, ఒక్క గురువునే ధ్యానించాలి. ఇది భావనాసాతత్య సాధన. 36. అనిత్యమూ అశాశ్వతమూ అయినవానిని విడిచిపెట్టితేవైరాగ్యం జనిస్తుంది. సద్గురువు బ్రహ్మచైతన్య ఘనుడు. సకల ప్రాణులలో భగవంతుడే ఉన్నాడన్న భావం కలగటం. దీనినే అభేద ఉపాసన అని అంటారు. 37. కంసుడు, రావణుడు, కీటకం వలె, ఎల్లప్పుడూ ప్రేమతో గాని లేదా భయంతో గాని దేనినైనా ధ్యానం చేస్తే, ధ్యానం చేసేవారు ధ్యేయమైపోతారు. 38. అయితే ధ్యానం అనన్యంగా ఉండాలి. ధ్యానానికి సమానమైన సాధన మరొకటి లేదు. ధ్యానాన్ని అభ్యాసం చేసేవారు తమను తాము తప్పక తరింప చేసుకుంటారు. 39. తాను జీవుడు అన్న భావాన్ని పూర్తిగా విస్మరించి ప్రపంచధ్యాసే లేకుండా, ఆత్మానుసంధాన సుఖంలో ఉండేవారికి ఎక్కడి జననం ఎక్కడి మరణం. 40. గురువు యొక్క నామాన్ని జపించటం వలన పరమానందం జనిస్తుంది. సర్వప్రాణులలో భగవంతుని దర్శనం కలుగుతుంది. నామం యొక్క మహిమ ఇంతకంటే వేరే ఏం ఉంటుంది? 41. ఇటువంటి మహిమగల నామం ఉన్న వారికి నేను భక్తితో ప్రణామం చేస్తాను. కాయా వాచా మనసా నేను వారికి అనన్య శరణుజొచ్చుతున్నాను. 42. ఈ విషయాన్ని స్పష్టం చేసే ఒక కథను నేను ఇప్పుడు శ్రోతలకు చెబుతాను. మీరు మీ శ్రేయస్సుకొఅకు ఏకాగ్ర చిత్తంతో ఆలోచించండి. 43. సాయిసమర్థుని ఆజ్ఞమేరకు కీ.శే. కాకాదీక్షితు నిత్యం నియమంగా భాగవతాన్ని పఠించేవాడు

అని అందఱికీ తెలిసినదే.44.ఒకరోజు దీక్షితు ముంబైలో చౌపాటిలోని కాకామహాజని ఇంటిలో భోజనంచేసి గ్రంథాన్ని పఠించసాగాడు.45.అద్వితీయమైన ఏకాదశ స్కంధంలో, రసభరితమైన రెండవ అధ్యాయాన్ని వింటున్న శ్రోతల మనసులు సుఖశాంతులతో నిండిపోయాయి. 46.బాబా భక్తుడైన మాధవరావు అతనితో సహా కాకా మహాజని ఏకాగ్రచిత్తంతో భాగవతాన్ని వినటానికి కూర్చున్నారు.47. భాగ్యం కొద్దీ కథ కూడా చాలా మధురమైనది. శ్రోతల కోరికలను తీర్చి భగవద్భక్తి యందు ప్రీతిని కలిగించే మంచి సందర్భం. 48.కవి, హరి, అంతరిక్షమొదలైన తొమ్మిది మంది ఋషభకులదీపకులు చెప్పిన జ్ఞానబోధప్రదానమూ ఆనందదాయకమూ అయిన మధురకథ.49. ఆ తొమ్మిది మంది భగవత్స్వరూపులు అమితమైన క్షమాశాంతి కలవారు. భాగవతధర్మమహిమను వారు వర్ణించగా జనక మహారాజు ఆశ్చర్యపోయాడు.50.అత్యంత సుఖమైనది ఏది? హరియొక్క పరమభక్తి ఎటువంటిది?. హరిమాయను దాటే సుగమోపాయం ఏది? అంటే శ్రేయస్సును కలిగించే ఉత్తమమైన గురుచరణాలు.51.కర్మ అకర్మ మరియు వికర్మ ఈ అన్నిటి మర్మం ఒక్కటే.గురువే పరమాత్మరూపం, గురువు యందు భక్తి భాగవత ధర్మం. 52. హరిచరిత్రను వారి అవతారాలవిశిష్టతను ద్రుమిలనాథుడు వర్ణించాడు. మరియు పురుషావతార లక్షణాలను చెప్పి నారాయణుని రూపాన్ని వర్ణించాడు.53.చమస్ జనకమహారాజుకు భక్తిలేనివారికి పట్టే దుర్గతిని తెలిపి, వేదవిహిత కర్మలను వదిలినవారందఱూ నాశనమౌతారని చెప్పాడు.54.హరి సర్వప్రాణులలోనూ ఉన్నాడు కనుక ఎవరినీ ద్వేషించరాదు. ప్రతి ప్రాణియందూ పరమేశ్వరుని చూడాలి. దేవుడులేని చోటు అంటూ లేదు.55.చివర తొమ్మిదవ వాడు కరభాజనుడు కృత త్రేతాది యుగాలలో ఏయే దేవతల మూర్తులను ఎలా పూజించాలి ఎలా ధ్యానించాలి అని వివరించాడు.56.కలియుగంలో ఒకటే సాధన హరియొక్క గురువుయొక్క చరణస్మరణ. దానితోనే

భవభయహరణం.శరణాగతులకు ఇది ఒక్కటే శరణం.57. ఈ విధంగా గ్రంథ పఠనానంతరం, కాకాసాహేబు. 'ఈ నవనాథుల చర్యలు వారి మనోవృత్తి అంతుపట్టనివి కదా' అని అన్నాడు.58.మాధవరావుతో ప్రేమగా 'ఈ భక్తి ఎంత కఠినమైనది. మనవంటి మూఢులకు అంతటిశక్తి ఎక్కడిది? జన్మజన్మలకూ ఇది సాధ్యం కాదు. 59.గొప్ప దిట్టలైన ఆ నవనాథులు ఎక్కడ, మొదటినుండి పాపులమైన మనం ఎక్కడ? ఈ భక్తి అంత సులభ సాధ్యమా? సచ్చిద్రూపులైన వారు ధన్యులు.60.మనకు ఈ భక్తి లభిస్తుందా? మనకిక తరుణోపాయం ఏది?నేను హతాశుణ్ణయి పోయాను. ఈ జన్మ వ్యర్థమైపోయింది' అని అన్నాడు.61. కాకాసాహేబు ప్రేమమయుడైన భక్తుడు.అతని మనసు స్థిరంగా ఉండక చంచలమై ఎందుకు తపనపడుతున్నాడు అని శ్యామా మనసులో బాధ. 62.శ్యామా అంటే మాధవరావుకు కాకాసాహేబు పై అభిమానం.అతనికి కాకాయొక్క దైన్యం అసలు నచ్చలేదు. 63.'సాయిబాబా వంటి ఆభరణాన్ని పొందిన భాగ్యం ఉండీ ఇంతటి దైన్యం ఎందుకు? అతడు జీవించటం వ్యర్థం.64.సాయి చరణాలలో దృఢమైన విశ్వాసం ఉంటే మనసులో ఇంతటి తపన ఎందుకు? నవనాథుల భక్తి ప్రబలమైనదే కావచ్చు. కాని మన భక్తిలో ప్రేమ లేదూ?65. టీకాసహితంగా ఏకనాథ భాగవతంలోని ఏకాదశ స్కంధం మరియు భావార్థ రామాయణాన్ని మీరు రోజూ పఠించాలని బాబా ఆజ్ఞ కదా!66.దానిని బట్టి హరినామ స్మరణ గురుస్మరణ సాధన అని బాబా ఆజ్ఞ ప్రమాణం కాదా? దీనితో మనం భవాన్ని తరించగలం. మీకు ఎందుకు చింత' అని అన్నాడు. 67.కాని ఆ నవయోగుల చరిత్ర,వారి అసిధారావ్రతం ఏ కొంచెమైనా మనకు సాధ్యమా అని కాకా ఎప్పుడూ ఆలోచిస్తుండేవాడు.68.నవయోగుల భక్తియే శ్రేష్ఠమైనది. అది ఏ సాధనతో లభిస్తుంది?ఆ భక్తి ద్వారానే భగవంతుని సాన్నిధ్యం అని మనసులో వేదన పట్టుకుంది.69.కూర్చున్నా పడుకున్నా అదే ఆలోచనలతో

బాధపడ్తుండగా ఆ మరునాడు జరిగిన చమత్కారాన్ని శ్రోతలు సవిస్తరంగా వినండి.70.ఆశ్చర్యకరమైన అనుభవాన్ని గమనించండి. ప్రాతఃకాలమే ఆనందరావు పాఖాడె మాధవరావును వెదుకుతూ వచ్చాడు.71.అది కూడా ఉదయాన సరిగ్గా భాగవత పఠనసమయానికి వచ్చి మాధవరావు వద్ద కూర్చుని తన స్వప్నవిశేషాన్ని చెప్పసాగాడు.72.అలా అక్కడ వారిద్దరూ గుసగుసలాడుకోవటం ఇక్కడ గ్రంథాన్ని పఠిస్తున్న వక్తకూ శ్రోతలకూ మనసులలో నిలకడ లేకుండా పోయింది.73.ఆనందరావు అసలే చంచలమైన మనసుకలవాడు. మాధవరావుతో తన స్వప్నాన్ని చెబుతుండగా ఆ ఇద్దరూ మెల్లగా మాట్లాడుకోసాగారు.దానితో గ్రంథ పఠన ఒక్కక్షణం ఆగిపోయింది.74.అప్పుడు కాకాసాహేబు, 'మీరిద్దరూ ఆనందంగా ఉన్నారు ఏమిటి విశేషం? అదేమిటో మాకు కూడా చెప్పండి' అని అన్నాడు. 75.అందుకు మాధవరావు నిన్ననే కదా నీకు సంశయం కలిగింది. దానికి సమాధానం వెంటనే దొరికింది. తరింప చేసే భక్తి యొక్క లక్షణాన్ని వినండి.76.బాబా ఆనందరావుకు కలలో ఎలా దర్శనమిచ్చారో వినండి.మీ సందేహం తొలగిపోతుంది. గురువుపాదాలకు వందనం చేసే భక్తి ఉంటే చాలు అని అర్థమౌతుంది అని చెప్పాడు. 77.ఆ స్వప్నవృత్తాంతాన్ని వినటానికి అందఱికీ కుతూహలం కలిగింది. ముఖ్యంగా కాకాసాహేబుకు జిజ్ఞాస. మొదట సంశయం కలిగింది అతనికేగా.78.అందఱి ఆతురతను గని ఆనందరావు కలను శ్రద్ధగా చెప్పసాగాడు. అక్కడి వారంతా కూడా వింతగా వినసాగారు.79.నేను ఒక సముద్రంలో నీటిలో నడుంవరకూ నిలబడి ఉన్నాను.అక్కడ అకస్మాత్తుగా శ్రీసాయిసమర్థులు నా దృష్టికి కనిపించారు.80.వారు రత్నఖచితసింహాసనంపై విరాజమానులై ఉన్నారు.వారి చరణాలు నీటిలోపలే ఉన్నాయి.అటువంటి దృశ్యాన్ని చూచాను.81.మనోహరమైన వారి రూపాన్ని చూచి నాకు అత్యంత సంతోషం క లిగింది.అది కల అన్న భావనే లేదు.వారి దర్శనంతో మనసుకు ఆనందం

కలిగింది.82.ఎంతటి విశిష్టమైన యోగం.అక్కడే నిలబడి ఉన్న మాధవరావు భక్త్యావేశంతో' ఆనందరావూ! బాబా పాదాలపై పడు.'అని చెప్పాడు.83.అలా చేయాలని నాకూ చాలా కోరికగానే ఉందికాని బాబా పాదాలు నీటిలో ఉన్నాయి.అవి నా చేతికి ఎలా అందుతాయి?84.నీటిలోని ఆ పాదాలపై శిరసును ఎలా వంచను? ఇప్పుడు నేనేం చేయాలో నాకేం అర్థం కావటంలేదు అని అన్నాను.85.అప్పుడు మాధవరావు బాబాతో ఏమన్నాడో వినండి. 'దేవా! నీటిలో ఉన్న మీ పాదాలను పైకి తీయండి' అని, 86.అలా అనగానే వెంటనే బాబా తమ పాదాలను బయటికి తీశారు.అప్పుడు ఆనందరావు ఆలస్యం చేయకుండా బాబా పాదాలను పట్టుకుని వందనం చేశాడు. 87.బాబా పాదాలను అతడు అలా గట్టిగా పట్టుకుని ఉన్నప్పుడు వారు 'నీవు భయపడవలసిన అవసరం లేదు.నీకు శుభం కలుగుతుంది అని ఆశీర్వదించారు.88.''జరీ అంచు ధోవతిని మా శ్యామాకు ఇవ్వు. అది నీకు శుభదాయకం' అని కూడా చెప్పారు. 89. వారి ఆజ్ఞను శిరసావహించి జరీ అంచు ధోవతిని తెచ్చాను. కాకాసాహేబ్! మీ చేతులతో దీనిని మాధవరావుకు ఇచ్చి అతడు స్వీకరించేలా చేయండి.90.నా ఈ విన్నపాన్ని మన్నించండి. మాధవరావు దీనిని కట్టుకునేలా చేయండి. నాకు సంతోషం కలుగుతుంది. నేను మీకు చాలా కృతజ్ఞుణ్ణి అవుతానని అన్నాడు. 91.అతని మాటలను మాధవరావు స్వయంగా విన్నాడు కాని కాకాసాహేబు ఇచ్చిన ధోవతిని అతడు స్వీకరించలేదు. 92.అతడు తన మనసులో 'ఇది స్వప్నమే. నాకు సూచనగా ఏదైనా దృష్టాంతం కలిగితే తప్ప నేను ఈ వస్త్రాన్ని తీసుకోను' అని అనుకున్నాడు.93.అప్పుడు కాకాసాహేబు 'బాబా అభిప్రాయాన్ని తెలుసుకుందాం. తీసుకోవటం మంచిదా కాదా అని చీటీల ద్వారా తెలుసుకుందాం.94.బాబా ఇచ్చిన చీటీ ప్రకారం వారి ఆజ్ఞను స్వీకరించుదాం అని బాగా నిశ్చయించుకుని చీటీలలో వ్రాసి బాబా పాదాల వద్ద ఉంచాడు.95.కాకాసాహేబు తన భారాన్నంతా

సాయిపైనే ఉంచేవాడు. బాబా అభిప్రాయాన్ని ముందుగా తీసుకున్న తరువాతే ఏపనైనా చేసేవాడు.96.ఆవిధంగా బాబా శరీరంతో ఉన్నప్పుడు చేసేవాడు.వారి తరువాత కూడా చీటీలు వేసి బాబా ఆజ్ఞను తీసుకునేవాడు.ఆ ఆజ్ఞను తప్పక పాలించేవాడు.97.పని చిన్నదైనా పెద్దదైనా చీటీలద్వారా బాబా ఆజ్ఞను తీసుకోకుండా ప్రాణం పోయినా ఏపనీ చేసేవాడు కాదు. బాబా ఆజ్ఞయే ప్రమాణం.98.ఒకసారి బాబా చరణాలకు అంకితం చేసిన శరీరం మనది కాదు. దాని వ్యవహారంపైన మనకు అధికారం ఎక్కడిది?99.అన్న ఈ దృఢభావంతో లక్షలరూపాయల సంపాదనను కాలద్రోసుకున్నాడు కాని తన నిశ్చయాన్ని మరణం వరకూ పాటించాడు.100.'నీ భక్తి ఫలిస్తుంది. నీ కోసం నేను విమానం పంపి దానిలో నిన్ను కూర్చుండబెట్టి, తీసుకుని వెడతాను.నీవు నిశ్చింతగా ఉండు'101.అన్న బాబా యొక్క అనుగ్రహావచనం అక్షరం అక్షరం అనుభవమైంది.కాకా నిర్యాణం గురించి 'సాయిలీలా' పాఠకులకు తెలుసు. 102.ఆ విషయం గుర్తుకు వస్తే, విమాన ప్రయాణమంటే ఇంతకంటె వేరే ఏముంటుంది అని అనిపిస్తుంది. ఆనందంగా గురువునామాన్ని స్మరిస్తుండగా ఎటువంటి అనాయాస మరణం!103.కాకాదీక్షితు తన నిశ్చయంలో దృఢంగా ఉండేవాడు.అతని మనసు ఎప్పుడూ సాయిచరణాలలో ఉండేది.దానినే ఇష్టులకు మిత్రులకు కూడా నేర్పించి గురుచరణాలలో విలీనమై పోయాడు.104.ఇప్పుడు పూర్వకథానుసంధానం. ఆనందరావు మాధవరావు ఇద్దరూ కాకాపైని ప్రీతితో చీటిల ఉపాయాన్ని ఒప్పుకున్నారు. వెంటనే చీటీలను వ్రాయించారు.105.ఒక చీటీలో 'ధోవతిని తీసుకో' అని రెండవ దానిలో 'తీసుకోవద్దు' అని వ్రాసి, సాయియొక్క చిత్రపటం క్రింద వారి పాదాల వద్ద ఉంచారు.106.అక్కడ ఉన్న బాలునితో ఒక చీటీని తీయించగా దానిలో ధోవతిని స్వీకరించమని ఆజ్ఞ అయింది. 107.మాధవరావుకు బాబా స్వప్నంలో చెప్పినట్లుగానే చీటిలో కూడా ఉండటం అందరికీ ఆనందాన్ని కలిగించింది.

జరీ అంచు ధోవతిని శామా చేతులలో ఉంచారు.108.ఆనందరావు కల, కాకా చీటీ రెండూ కలవగానే ఆ ఇద్దటికీ సంతోషం పరమానందం కలిగాయి.109.మాధవరావు తనలో ఆనందించాడు. ఆనందరావు సంతోషపడ్డాడు. సాయిభక్తి పరిపుష్టికాగా కాకా సంశయం తొలగింది.110.ఈ కథాసారాన్ని ఎవరికి వారు ఆలోచించాలి.గురువు చరణాలయందు శిరసునుంచి, గురువునోటినుండి వెడలిన వచనాలయందు ధ్యానముంచాలి.111.మన భూమిక,మనస్థితిగతులు, మనచిత్తవృత్తి మనకంటె మన గురువుకే బాగా తెలుస్తుంది. మనలను ఉద్ధరించే బాధ్యత వారిదే. 112.రోగానికి తగినవిధంగా ఔషధం అనుపానంవలె సద్గురువు భవరోగ నివారణానికి శిష్యులకు నియమాలను విధిస్తారు.113.వారు స్వయం ఆచరించేదానిని మనం అనుసరించకూడదు. గురువు నోటి నుండి మీ కొఱకు వెడలిన వచనాలను ఆచరించాలి.114.ఆ మాటలపైనే మనసునుంచి నిత్యం వానినే మననం చేయాలి. అవే మీ ఉద్ధరణకు ఉపయోగపడతాయని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.115.గురువుచెప్పిన పురాణంగాని గ్రంథంలోని విషయం గాని వారివచనాలను స్పష్టం చేయటంకోసమే వారి ముఖ్యోపదేశాన్ని ధ్యానంలో ఉంచుకోవాలి. అవే మనకు వేద జ్ఞానం.116.ఏ సత్పురుషుని వచనాలనైనా అవమానించకూడదు.కన్నతల్లిలా అన్యు లెవరు చూస్తారు?117.తల్లికి తన బిడ్డల యందు నిజమైన వాత్సల్యం ఉంటుంది. బిడ్డలు కోరినదానిని తీరుస్తుంది.ఆ తల్లి సుఖం బిడ్డలకు తెలియదు. 118.సాధువులు సృష్టిలో లెక్కలేనంత మంది, కాని 'మన తండ్రి మన తండ్రే' అని సాయి నోటి నుండి వెలువడిన కరుణావచనాన్ని మీ హృదయ ఫలకంపై చిత్రించుకోండి119.సాయినోటి నుండి వెలువడిన వచనాల యందే ధ్యానం ఉంచండి. ఆ దయామయులే చివరకు మన తాపత్రయాలను శమింప చేస్తారు.120.వారి కళ వారికే తెలుసు. వారి ఆ కళా కౌశలాన్ని మనం కళ్లతో చూడాలి అంతే. సహజంగా అవలీలగా సంభవించే

వారిలీల ఎంత అద్భుతం. 121.ఎవరు ఏది చెప్పినా ఆ మాటలన్నిటినీ వినండి. మీ ధ్యానాన్ని మీ ధ్యేయాన్ని వదలకండి. మీగురువుయొక్క వచనాలను మరచిపోకండి.122.ఇదే పరమశుభప్రదమూ, ఇందులోనే భవభయహరణమూ, ఇందులోనే గ్రంథాలు పురాణాలు జపతప అనుష్ఠానాలు ఉన్నాయి.123.సారాంశం – గురువును ప్రేమించండి. వారికి అనన్యభావంతో నమస్కరించండి. సూర్యుని ఎదుట అంధకారం ఎక్కడ ఉంటుంది? అట్లే గురువువద్ద భవసాగరం ఉండదు.124.సృష్టిలో దగ్గరలోగాని, దూరంలోగాని సప్తసముద్రాలకు అవతల ఉన్నా ఎక్కడ ఉన్నాసరే, గురువు శిష్యులయందు అత్యంతప్రేమ కలిగి ఉంటారు.125.ఇలా వ్రాస్తూ వ్రాస్తూ ఉంటే ఒక కథ గుర్తుకువచ్చింది. ఒకరినిచూచి మరొకరు అనుకరిస్తే ఆపదలు ఎలా సంభవిస్తాయి అని,126.ఒకసారి బాబా మసీదులో మహాల్సాపతితో ఉండగా వారికి అకస్మాత్తుగా పూర్వం చెక్క పలకపై శయనించిన విషయం గుర్తుకు వచ్చింది. 127.ఆ చెక్క సుమారు ఒక అడుగు వెడల్పు మాత్రమే. దానిపై పడుకోవటానికి దానికి రెండు వైపులా పాత గుడ్డపీలికలను కట్టి మసీదుదూలానికి అడ్డంగా వ్రేలాడ గట్టేవారు.128.చీకటిలో పడుకోకూడదని బాబా తల వద్దా కాళ్లవద్దా దీపాలను ఉంచి అవి రాత్రంతా వెలుగుతుండగా ఆ చెక్కపైన శయనించేవారు.129.ఈ చెక్కపలక వృత్తాంతాన్ని అంతా ఇదివరకే ఒక అధ్యాయంలో వర్ణించాను. ఇప్పుడు దాని మహాత్మ్యాన్ని వినండి .130.ఒకసారి బాబా ఈ చెక్కపలక గొప్పదనాన్ని వర్ణించగా, కాకాసాహేబు దీక్షితుకు కలిగిన ఆ ఆలోచనను వినండి.131.అతడు బాబాతో 'మీకు ఆ చెక్కపలకపై శయనించాలని కోరికగా ఉంటే, ప్రేమగా ఒక చెక్కపలకను వ్రేలాడ కట్టిస్తాను. మీరు సుఖంగా పడుకోవచ్చు' అని అన్నాడు.132.బాబా అతనితో 'మహాల్సాపతిని క్రింద వదలి నేను పైన ఒక్కణ్ణి ఎలా పడుకోగలను? నేను క్రింద బాగానే ఉన్నాను' అని జవాబిచ్చారు.133.అప్పుడు కాకా ప్రేమగా 'మరొక

చెక్కపలక కట్టిస్తాను. మీరు ఒకదానిపైన మహాల్సాపతి రెండవదానిపైన శయనించండి' అని చెప్పాడు.134. ఆ మాటకు బాబా 'అతడు చెక్కపై ఎలా పడుకోగలడు? శరీరంలో సుగుణ సంపద ఉన్నవాడే చెక్కపైన పడుకోగలడు.135. చెక్కపలకపైన పడుకోవటం సులభం కాదు. నేను తప్ప ఎవరు దానిపైన శయనించగలరు? నిద్రను వదలి కళ్లుతెరుచుకుని ఉండగలవారే దానిపై శయనించగలరు.136.నేను నిద్రించేటప్పుడు నా సన్నిధిలో నా గుండెపైన చేయివేసి కూర్చుండమని అతనికి చెప్పాను.137.ఆ పని కూడా చేత కాలేదు. కూర్చున్న చోటే కునుకు తీస్తాడు. అతనికి ఈ చెక్క ఏం పనికి రాదు. ఈ చెక్కపలక నాకు మాత్రమే పడక.138.నా హృదయంలో నామస్మరణ జరుగుతుంటుంది. అక్కడ చేతిని ఉంచి చూడు. నేను నిద్రిస్తే నన్ను మేలుకొలుపు అని అతనిని ఆజ్ఞాపించగా, 139.అతనికే నిద్రవచ్చి అతని చేయి బరువెక్కి రాయిలా అవుతుంది.నేను భగత్ అని అనగానే అతని నిద్రఎగిరిపోయి ఆందోళన పడతాడు.140.నేలపైన సరిగ్గా కూర్చోలేనివాడు, ఆసనంపై స్థిరంగా ఉండలేనివాడు, నిద్రాతమకింకరుడైన ఆ నరుడు పైన ఎలా పడుకోగలడు?' అని అన్నారు.141.అలా బాబా భక్తులపైని ప్రేమతో సందర్భానుసారం 'మనశక్తి కొలది మనం చేస్తూ ఇతరులను వారివారి ఇష్టానుసారం చేయనివ్వండి' అని చెప్పేవారు.142.సాయినాథుని లీల అగాధం. కనుక హేమాడు వారి చరణాలను ఆశ్రయించగా, బాబా కూడా అతనిని తమ కృపతో ఆశీస్సులతో ఎప్పుడూ తమ స్మరణలో ఉంచారు.143.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో శ్రీగురుచరణ మహిమ అను నలుబది అయిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 46 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

శ్రీసాయినాథా! మీ చరణాలు ధన్యం. శ్రీ సాయీ! మీ స్మరణ ధన్యం. శ్రీసాయీ కుమ్మబంధనాల నుండి విముక్తిని ప్రసాదించే మీ దర్శనం ధన్యం.1.ఇప్పుడు మీరు అదృశ్యంగా ఉన్నా భక్తి భావమున్న వారికి సమాధిలో జాగ్రతంగా ఉన్న మీ జ్యోతి స్వరూపం వెంటనే అనుభవమౌతుంది.2. మీరు మీ భక్తులను దేశ విదేశాలలో ఉన్నా, కనిపించని సూక్ష్మమైన దారంతో లాక్కుని వస్తారు.3.వారిని మీ పాదాలవద్ద ఉంచి, తల్లి తన బిడ్డలను చూచేలా మీరు ప్రేమగా దగ్గరకు తీసుకుని సునాయాసంగా పోషిస్తారు.4.మీరు అలా సూత్రాలను నడిపిస్తుంటారు కాని మీరు ఎక్కడ ఉన్నదీ ఎవరికీ తెలియదు. కాని మీరు భక్తుల వెనుకే ఉన్నట్లు వారికి అనుభవమౌతుంది.5.జ్ఞానులు, పండితులు, చతురులు, అహంభావం వలన ప్రపంచమనే సుడిగుండంలో చిక్కుకుంటారు కాని, అమాయకులను అజ్ఞానులను ఏమీ తెలియని వారిని మీ శక్తితో ఆడిస్తారు.6.లోపలనుండి అనేక లీలలను చేస్తూ పైకి ఏమీ అంటనట్లు కనిపిస్తారు. అంతా చేస్తూ, నేనేమీ చేయను,నేను కర్తను కాను అని చెప్పుకుంటారు.మీ చరితం ఎవరికీ అర్థం కాదు.7.అందువలన శరీరాన్ని,వాక్కును, మనసును మీ పాదాలకు అర్పించి, నోటితో నిరంతరం మీ నామస్మరణచేస్తే పాపప్రక్షాళనమౌతుంది.8.కోరికలుగలవారి కోరికలను తీర్చి ఏ కోరికలు లేనివారికి ఆత్మానందాన్ని ప్రసాదిస్తుంది. ఇటువంటి మీ మధురనామం సద్భక్తులకు సుగమోపాయం.

9.దానిద్వారా పాపాలు నశించిపోయి రాజస్తతమోగుణాలు నిశ్శేషంగా తొలగిపోయి క్రమేణా సత్త్వగుణం అభివృద్ధి చెందటంతో ధర్మసంచయం కలుగుతుంది.10.ధర్మవృత్తి జాగృతం కాగానే దాని వెంట వైరాగ్యం పరుగెత్తుకుంటూ వస్తుంది.విషయసుఖాల వాంఛ నశించి పోతుంది.ఆత్మజ్ఞానం వెంటనే ప్రకటమౌతుంది. 11. నిత్యానిత్య వివేక జ్ఞానం కలగగానే ఆత్మస్వరూపంతో అనుసంధానం కుదురుతుంది. అదే గురుచరణాలలో స్థిరపడటం. దీనిపేరు సంపూర్ణ గుర్వర్పణ.12.మనసు సాయి పాదాలకు అంకితమైంది అని అనటానికి ఒకటే గుర్తు. సాధకుని మనసు శాంతినే కాంక్షిస్తుంది.అతని భక్తి పూర్తిగా వికసిస్తుంది.13.ప్రేమపూర్వకమైన గురుభక్తికి ధర్మం అని పేరు. అంతటా నేనే ఉన్నాను అన్నది జ్ఞానసారం. విషయసుఖాలలో ఆసక్తిలేకపోవటం పరమ వైరాగ్యం. దానితో ప్రపంచం నుండి మనసు విరమిస్తుంది.14.ఇటువంటి భక్తి యొక్క మహిమ ధన్యం. ఏకాగ్రమనసుతో ఈ అనన్యభక్తిని సాధించినవారి అధీనంలో శాంతి విరక్తి కీర్తి ఈ మూడు ఎప్పుడూ ఉంటాయి.15.ఇటువంటి గురుభక్తి ఉన్నవారికి ఏమిలోటు ఉంటుంది?మనసులో దేనిని కోరినా అవి అప్రయాసంగా లభిస్తాయి. 16.ఇటువంటి భక్తి ఉన్న చోటబ్రహ్మస్థితి దాసివలె ఉంటుంది. అక్కడ మోక్షాన్ని ఎవరూ ఖాతరు చేయరు.అట్టివారి పాదాలవద్దకు పుణ్యతీర్థాలు చేరుతాయి.17.గతాధ్యాయంలో దీక్షితు భాగవతాన్ని పఠించటం, నవయోగుల యొక్క భక్తి వర్ణన, సాయి యొక్క పాద దర్శనం.18.సాయి భక్తుడైన ఆనందరావుపాఖాడె తన స్వప్న వృత్తాంతాన్ని చెప్పటం, మరియు సాయియొక్క భక్తి వైభవాన్ని గురించి చెప్పబడింది.19.బాబా తమ దరికి చేర్చుకున్న వారు తమ ఇంటిలో ఉన్నా లేదా ఎక్కడో ద్వీపాంతరంలో ఉన్నా శ్రీసాయి ఎల్లవేళలా వారివద్దే తప్పకుండా ఉంటారు.20.భక్తులు ఎక్కడెక్కడికి వెళ్లినా అక్కడక్కడికి ఏ ప్రదేశమైనా బాబా ముందుగానే వెళ్లి నిలుచుని అకస్మాత్తుగా వారికి దర్శనమిస్తారు.21.ఈ

విషయంలో ఒక అభినవ కథను శ్రోతలైన మీకు చెప్పుతాను. దీనిని వింటే ఆశ్చర్యం ఆనందం కలుగుతాయి.22. ఇక్కడ సాయి నోటినుండి వచ్చిన అక్షరాలను శ్రవణాల ద్వారా భక్తిగా సేవిస్తే సమాధిసుఖం కూడా మెుతిరిగిపోతుంది. భక్తులు ఆత్మానందంలో మునిగిపోతారు.23. అడుగడుగునా చమత్కార పూరితమైన ఇటువంటి మధురమైన కథను వింటే శ్రోతలు తమను తాము మరచిపోతారు. వారి హృదయాలు ద్రవించిపోతాయి. 24.కాకాసాహేబు దీక్షితుని జ్యేష్ఠకుమారుడైన బాబుకు నాగపూర్‌లో వడుగు చేయాలని నిశ్చయమైంది. 25.నానాసాహేబు చందోర్కరుని జ్యేష్ఠ పుత్రునికి కూడా వివాహం చేయాలని అనుకోగా దాని కొఅకు గ్వాలియరు పట్టణానికి వెళ్లవలసిన అవసరం ఏర్పడింది.26.వడుగు కార్యం పూర్తయాక గ్వాలియరుకు వివాహానికి రావటానికి కాకాకు అవరోధం కాకూడదని నానా ఆలోచన.27.నాగపూర్ నుండి గ్వాలియరుకు కాకాసాహేబు సావకాశంగా రావటానికి ఆ ఇద్దరికీ వీలుగా ముహూర్తాలను నిర్ణయించాడు.28.తరువాత సాయిబాబా దర్శనానికి, మరియు వివాహానికి ఆహ్వానించటానికి కూడా భక్త శ్రేష్ఠుడైన నానాసాహేబు ఎంతో ఉత్సాహంతో శిరిడీకి వచ్చాడు.29.కాకాసాహేబు అక్కడే ఉన్నాడు. నానా మసీదుకు వెళ్లి చేతులు జోడించుకుని బాబాను వివాహానికి రమ్మని ఆహ్వానించాడు.30.అప్పుడు బాబా, 'సరే శ్యామాను వెంటబెట్టుకుని వెళ్లు' అని చెప్పారు. కాకాసాహేబు కూడా బాబాను వడుగుకు రమ్మని ఆహ్వానించాడు. 31.అతనితో కూడా బాబా అట్లే,'శ్యామాను వెంట బెట్టుకుని వెళ్లు'అని చెప్పారు.కాకా సాహేబు బాబా స్వయంగా రావాలని వారిని బలవంతపెట్టాడు.32.అందుకు బాబా వెంటనే 'కాశీ ప్రయాగ యాత్రలు త్వరగా చేసి శ్యామా కంటే ముందుగా వస్తాను. రావటానికి నాకేం ఆలస్యం' అని జవాబిచ్చారు.33.ఈ మాటలను శ్రోతలు గుర్తుంచుకోండి. వాని అర్థాన్ని సాయి యొక్క సర్వవ్యాపకత్వాన్ని అనుభవ పూర్వకంగా

తెలుసుకోండి.34.భోజనమయాక, మాధవరావు ఒకసారి గ్వాలియరు వరకూ బయలుదేరితే ఇక కాశి ఎంత దూరంలో ఉంటుంది అని ఆలోచించాడు.35.దారిఖర్చుకు నందరాము వద్ద వంద రూపాయలను అప్పుతీసుకుని బాబా అనుమతిని తీసుకోడానికి వెళ్లాడు. ఎంతో ఆదరపూర్వకంగా,36.'ఇప్పుడు వడుగు,వివాహం కారణంగా గ్వాలియరు వరకు వెళ్లుతున్నాను కదా, కాశీగయా యాత్రలు కూడా వెళ్లటం మంచిదని నేనుకుంటున్నాను.37.దేవా! మీ చరణాలకు నమస్కరించి వేడుకుంటున్నాను. మరి కాశీగయా వెళ్లిరానా?'అని అడిగాడు. బాబా మాధవరావుకు సంతోషంగా వెళ్ళటానికి ఆజ్ఞ ఇచ్చారు.38.బాబా మరల అతనితో,'నీవు అడుగుతున్న దానిలో అనుచితం ఎక్కడుంది? ఎందుకు అడుగుతున్నావు? ఏ కష్టం లేకుండా సహజంగా సంభవించే దానిని తప్పకుండా సాధించుకోవాలి' అని చెప్పారు.39.అలా బాబా అతనికి అనుమతిని ఇచ్చారు.మాధవరావు బండి చేసుకుని కోపర్‌గాం మార్గాన పడ్డాడు.అప్పుడు అప్పా కోతే కలిశాడు.40.అప్పా మనవరాలిని తీసుకుని రావటానికి చాంద్‌వాడాకు వెళ్లుతున్నాడు.కాశీ యాత్రను గురించి విని టాంగాలోనుండి దూకాడు. 41.కాశీప్రయాణానికి అతనివద్ద డబ్బులేదు. అయినప్పటికీ మాధవరావువంటి తోడును వదులు కోలేకపోయాడు.42.మాధవరావు ధైర్యం చెప్పాడు. ఇక అప్పాకు ఆలోచించవలసింది ఏముంది.ఆ అవకాశాన్ని తీసుకుని ఆనందంగా బండిలో కూర్చున్నాడు.43.అప్పాకోతే పాటిలు ధనవంతుడు. కాని అప్పుడు చేతిలో డబ్బు లేనందువలన కాశీ ప్రయాణం ఆగిపోతుందేమోనని అతనికి పెద్ద చింత.44.చేజిక్కిన మంచి అవకాశాన్ని వదులు కోకుండా పుణ్యం సంపాదించుకోవాలి. పైగా మాధవరావు వంటి తోడు ఉన్నప్పుడు తన కోరికను తీర్చుకోవాలి అని అప్పా ఉద్దేశం.45.అతని బాధను గ్రహించి మాధవరావు అతనికి ధైర్యం చెప్పి అతనిని వెంట పెట్టుకుని వెళ్లి కాశీయాత్రను చేయించాడు.46.తరువాత వారిద్దరూ ఉపనయన

శుభకార్యానికి నాగపూర్‌కి వెళ్లారు. కాకాసాహేబు మాధవరావుకు దారిఖర్చుకు రెండువందల రూపాయలను ఇచ్చాడు.47.అక్కడినుండి వివాహ సమారంభానికి గ్వాలియరు వెళ్ళారు. నానాసాహేబు మాధవరావుకు వందరూపాయలను ఇచ్చాడు.48.నానా వియ్యంకుడు శ్రీమంత్ జఠారు కూడా వందరూపాయలను ఇచ్చాడు. ఈ విధంగా గురుబంధువును నానా సత్కారపూర్వకంగా గౌరవించాడు. 49.కాశీలోని మంగళఘాటువద్ద బంగారు రేకులతో పొదిగిన సుందరమైన లక్ష్మీనారాయణ మందిరానికి జఠారు యజమాని.50.అయోధ్యలో కూడా జఠారు యొక్క శ్రీరామ మందిరం ఉంది. ఈ రెండు క్షేత్రాలలోను అప్పాకు మాధవరావుకు గౌరవాదరాలు చేయవలసిన పనిని అతడు గుమాస్తాకు అప్పగించాడు. 51.మాధవరావు, అప్పా గ్వాలియరు నుండి మధురకు వెళ్ళారు. వారితో వఝే, బినివాలే, పెండార్‌కర్ కూడా వెళ్లి ఆ ముగ్గురూ తిరిగి వచ్చేశారు.52.అక్కడి నుండి అప్పాకోతే, మాధవరావు ప్రయాగకు వెళ్లి శ్రీరామనవమి ఉత్సవానికి అయోధ్యకు చేరుకున్నారు.53.అక్కడ ఇరవై ఒక్క రోజులు ఉన్నారు. రెండు నెలలు కాశీలో గడిపారు. చంద్రగ్రహణం సూర్యగ్రహణం గడిచాక ఇద్దరూ గయకు బయల్దేరారు.54. వారు రైలు బండిలో ఉండగా గయలో ప్లేగు వ్యాపించి ఉన్నదని,సందులలో గొందులలో ఉన్న జనం అదే చింతలో ఉన్నారని అక్కడి పరిస్థితిని విన్నారు.55.రైలు గయస్టేషనులో ఆగేసరికి రాత్రి అయినందువలన ఇద్దఱూ అక్కడే ధర్మశాలలో విశ్రమించారు.56.తెల్లవారగానే పిండ ప్రదానం చేయించే బ్రాహ్మణుడు వచ్చి 'యాత్రికులంతా వెళ్లిపోతూ ఉన్నారు. త్వరగా పదండి' అని చెప్పాడు.57.మాధవరావుకు దిగులు. సరే వస్తాం. కాని ప్లేగు మీ బస్తీలో కూడా ఉందా అని మెల్లగా అతనిని అడిగాడు.58.'అక్కడ అలాంటిదేమీ లేదు.మీరు అక్కడికి వచ్చి చూడండి.మీరు నిశ్చింతగా నా వెంట రండి' అని చెప్పాడు.59.ఇద్దరూ అతని వద్దకు వెళ్లి విశాలమైన అతని

ఇంటిని చూచి సంతోషించారు. 60.వారి ఆనందానికి మరో కారణం వారు కూర్చోగానే ఎదుట బాబా యొక్క పటాన్ని చూచారు.మాధవరావు హృదయం ద్రవించి గద్గదుడయ్యాడు.61.గయవంటి దూర ప్రదేశంలో సాయి యొక్క పటం కళ్లకు కనిపిస్తుందని అతడు అసలు అనుకోనేలేదు.ఇద్దఱూ ఆశ్చర్యపోయారు.62.మాధవరావు బాగా కరిగిపోయాడు. కళ్లలోనుండి ఆనందాశ్రువులు దొర్లాయి. మీరు ఎందుకు ఏడుస్తున్నారు అని బ్రాహ్మణుడు ప్రశ్నించాడు.63. ఏ కారణం లేకుండా మాధవరావు ఏడుస్తుంటే బ్రాహ్మణునికి సందేహం కలిగింది.అతని మనసు వికలమైంది.64.గయలో ప్లేగు ఉంది. యాత్ర చక్కగా జరుగుతుందా అని మాధవరావు చింతిస్తూ ఉన్నాడని అతడు బాధపడ్డాడు.65.'ఇక్కడ ప్లేగు లేదని మీకు ముందుగానే చెప్పాను కదా. అయినా మీరు దుఃఖపడటం మాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.66.మా మీద విశ్వాసం లేకపోతే వీరందఱినీ అడగండి.ఇక్కడ మీకు వెంట్రుకవాసి అంత కూడా భయం లేదు.ఎందుకు కళ్లవెంట నీరు కారుస్తున్నారు?' అని అన్నాడు.67.ప్లేగు భయంతో యాత్రికుని ధైర్యం సడలిపోయి ఊరికే నిష్కారణంగా ఏడుస్తున్నాడు. 68.అని తలచి బ్రాహ్మణుడు వారికి నచ్చచెప్పి పోయాడు. కాని మాధవరావు మనసులో 'మా సాయితల్లి నాకంటె ముందుగా వచ్చి నా ఎదుట ఎలా ఉంది?69.కాశీ ప్రయాగయాత్ర ముగించుకుని శ్యామా కంటె ముందుగా వస్తానని బాబా, మునుపు చెప్పిన వచనం ప్రత్యక్షంగా అనుభవమైంది.70.ఇంట్లోకి అడుగుపెట్టగానే కళ్ల ఎదుట బాబాపటం కనిపించగా అనుకోకుండా సంభవించినది అతనికి అత్యంత చమత్కారమని అనిపించింది. 71.ప్రేమతో కంఠం గద్గదమైంది. కళ్లు ఆనందాశ్రువులతో నిండాయి. శరీరమంతా రోమాంచితమై చెమటపట్టింది.72.మాధవరావుయొక్క ఈ స్థితిని చూచి అతడు ప్లేగు ఉందని భయపడ్డాడు,అందువలననే ఏడుస్తున్నాడు అని బ్రాహ్మణుడు మరో విధంగా తలచాడు.73.తరువాత శ్యామాయే

జిజ్ఞాసతో బ్రాహ్మణుని, ఈ పటం నీకు ఎలా లభించింది, మొత్తం చెప్పు అని అడిగాడు.74.పన్నెండు సంవత్సరాల క్రితం జరిగిన విశేషాన్నంతా బ్రాహ్మణుడు మాధవరావుకు చెప్పసాగాడు. దానిని వినండి.75.ఆ బ్రాహ్మణునికి ఒక వంద కాదు రెండు మూడు వందల మంది జీతం పుచ్చుకునే నౌకర్లు ఉన్నారు. మన్‌మాడ్ మరియు పుణతంబేలో ఉన్నారు. యాత్రికులకు సదుపాయాన్ని కలిగించటం అతని నిత్యవృత్తి.76.అతని వ్యవహారం అలా జరుగుతుండగా అతడు శిరిడీకి వెళ్లాడు.77. సాయిసమర్థులు గొప్పసత్పురుషులు అని విని వారిదర్శనంతో పునీతుడవ్వాలని అతని ఉద్దేశ్యం. 78.సాయిబాబా దర్శనం చేసుకుని వారి పాదాలకు వందనం చేశాక వారి పటాన్ని సంపాదించాలని అతనికి కోరిక కలిగింది. 79. మాధవరావు వద్ద బాబాపటం ఒకటి గోడకు తగిలించి ఉంటే దానిని బ్రాహ్మణుడు కోరాడు. మాధవరావు బాబా అనుమతితో దానిని అతనికి ఇచ్చాడు.80.ఆ బాబాపటమే ఇది అని, ఆ బ్రాహ్మణుడు ఇతడే అని మాధవరావుకు గుర్తుకు వచ్చింది. బాబా నన్ను ఇక్కడికే ఎలా పంపించారు? ఇంతకాలానికి ఈ కలయికను ఎలా సంభవింపచేశారు? 81.వాస్తవానికి పన్నెండు సంవత్సరాల క్రితం జరిగినదానిని ఎవరైనా ఎందుకు గుర్తుంచుకుంటారు? ఇది మనసుకు ఎప్పుడూ గుర్తుకురాలేదు.82.బాబాయొక్క అగాధలీల.శామాను అక్కడికే పంపించి, అక్కడే తమ దర్శనాన్ని కలిగించారు. బ్రాహ్మణుడు కూడా అత్యంత సంతుష్టుడయ్యాడు.83.తన దగ్గరున్న ఈ పటాన్నే సాయిబాబా ఆజ్ఞను తీసుకుని తాను ఇతనికి ఇచ్చానని శామాకు గుర్తువచ్చింది.84.శిరిడీకి వెళ్లినప్పుడు మునుపు ఇతనివద్దే బస చేసాను. ఇతడే బాబాదర్శనాన్ని చేయించాడు అని బ్రాహ్మణునికి గుర్తుకు వచ్చింది.85.ఒకరికి ఒకరు చేసుకొన్న ఉపకారాలను తలచుకుని చాలా సంతోషించారు. బ్రాహ్మణుడు శ్యామాకు గయలో మంచి సదుపాయాలను చేశాడు. 86.అతడికి ఎంతటి ఐశ్వర్యమంటే ఏనుగులు అతని ఇంటిముందు ఉండేవి. తాను

పల్లకిలో కూర్చుని శ్యామాను ఏనుగుపై కూర్చుండ బెట్టాడు.87.పూజా సామాగ్రిని వెంటతీసుకుని విష్ణుపాదాల వద్దకు వెళ్లి దేవునికి అభిషేకం చేయించి యథావిధిగా పిండప్రదానం కూడా చేయించాడు.88.అటు తరువాత బ్రాహ్మణ సంతర్పణనైవేద్య సమర్పణ పూర్వకంగా భోజనంతో యాత్ర సంపూర్ణమైంది, ఇదంతా బాబా ఆనందంగా చేయించారు. 89.బాబాయొక్క నోటినుండి వెలువడిన మాటలు అర్థభరితం మరియు అవి అక్షరం అక్షరం అనుభవంలోకి వస్తాయని ఈ కథాసారాంశం.బాబాకు భక్తులపైన అపారమైన ప్రేమ కూడా.90.బాబా ప్రేమ భక్తులపైన మాత్రమేనా? ఇతర ప్రాణులను కూడా వారు సమానంగా చూస్తారు. అన్ని ప్రాణులతో కూడా వారికి తాదాత్మ్యం.వారికి ప్రాణులపై చాలా ప్రేమ.91.లెండీ నుండి మసీదుకు వచ్చేటప్పుడు, మామూలుగా దారిన నడుస్తుండగా ఎప్పుడైనా మేకలమంద కలిస్తే బాబాకు పరమానందం.92. అప్పుడు ఆ మొత్తం మంద వైపు తమ అమృతదృష్టిని ప్రసరింపచేసి వానిలో నుండి ఒకటోరెండో మేకలను ఏరుకుని తీసుకునేవారు.93.వారి యజమాని అడిగినంత డబ్బును వెంటనే ఇచ్చి మేకలను కొండాజీ వద్ద ఉంచేవారు. అది వారి పద్ధతి.94.ఒకరోజు వారు రెండు మేకలను ముప్పైరెండు రూపాయల వెల చెల్లించి కొనుక్కుని వచ్చారు. అది అందఱికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. 95.ఆ రెండు మేకలపైనా దృష్టి పడగానే వెంటనే వారి మనసులో ప్రీతి ఉత్పన్నమైంది. వాని వద్దకు వెళ్లి వాని వెన్నుతట్టారు.96.వాని పశుజన్మను చూచి సాయిసమర్థునికి జాలి కలిగింది. వాని పరిస్థితిని చూచి వారి మనసు కరిగి ప్రేమ ఉప్పొంగింది.97.వానిని దగ్గరకు తీసుకుని, బాబా వానిని ప్రేమతో నిమిరారు.బాబాయొక్క వింత చర్యను గని భక్తులు ఆశ్చర్యపోయారు.98.వాని పూర్వజన్మలోని పరమలోభం సాయిబాబాకు గుర్తుకు వచ్చి వానిపై ప్రేమ కలిగింది. వాని పశుజన్మనుగని వారు కరుణతో కరిగిపోయారు.99.వాని ఖరీదు రెండు రూపాయలు. లేదా

మూడో లేక నాలుగో, బాబా పదహారు రూపాయలను ఇవ్వగా చూచి తాత్యా చకితుడయ్యాడు.100.వ్యాపారి అడిగినంత డబ్బు ఇచ్చి మేకలను ఖరీదుచేయటాన్ని ప్రత్యక్షంగా చూచి తాత్యాతోపాటు మాధవరావు బాబా చర్యను దుయ్యబట్టారు.101.రెండు రూపాయల వస్తువుకు పదహారు ఎందుకు ఇచ్చినట్లు? బాబాకు డబ్బు విలువ తెలియదా? అందుకే యథేచ్ఛగా ఏదో చేస్తుంటారా అంటే ఇది కూడా సరియైన మాటకాదు.102.బాబా ఎందుకిలా చేశారు అని ఇద్దఱూ చిరచిరలాడారు. బాబా ఎందుకు ఇటువంటి వ్యాపారం చేశారు,ఇదేం వ్యాపారం చేసే పద్ధతి అని ఇద్దఱూ బాబాను దూషించారు.103.అసలు బాబా ఎలా మోసపోయారు? ఆ వింత చూడటానికి అందఱూ అక్కడ పోగయ్యారు. ఏ మాత్రం నష్టం కలగనట్లు బాబా తమలో నిశ్చింతగా ఉన్నారు.104.ఇద్దఱూ అలా కోపగిస్తూ దూషించినా బాబా కించిత్తైనా చలించలేదు. సంతోషంగా ప్రశాంతంగా ఉన్నారు.105.తరువాత తాత్యా శామా వినయంగా, ఆదరపూర్వకంగా, ముప్పైరెండు రూపాయలు వృధాగా పోయాయికదా ఇదేం ఉదారబుద్ధి అని అడిగారు. 106.కేవలం డబ్బును గురించిన ప్రశ్నను విని సాయి నవ్వుముఖంతో,పిచ్చి జనులారా! నేను మిమ్మల్ని ఎలా సమాధానపరచను అని తమలో అనుకున్నారు.107.వారి శాంతి విలక్షణమైనది.వారి స్థైర్యం అణుప్రమాణమైన చలించలేదు. ఇదే పరమశాంతికి లక్షణం.అని జనులందఱూ ఆశ్చర్యపడ్డారు.108.క్రోధమనేది లేకుండా పరమ శాంతిని అనుభవించేవారిని, సర్వప్రాణులలోనూ భగవంతుని చూచేవారిని అవివేకం ఎలా తాకగలదు?109.వివేక దృష్టిగల సమర్థులు క్రోధాన్ని తమ ఎదుటకు రానీయరు. అనుకోకుండా అలాంటి సందర్భం వస్తే వారి శాంతి భోషాణం తెరుచుకుంటుంది.110.నిరంతరం అల్లామాలిక్ అని ధ్యానం చేసేవారి మహిమను నేను ఎంతని వర్ణించను? వారి చరిత్ర అగాధం మరియు గహనము, అతిపావనము, శుభప్రదము.111.జ్ఞానస్వరూపం, వైరాగ్యనిధి, శాంతి

సాగరము పరిపూర్ణ కరుణా బుద్ధిగల సాయి ఏమన్నారో వినండి.112.ఆ ఇద్దఱి ఆగ్రహాన్ని గని బాబా వారితో ''నేను ఉండటానికి ఇల్లు వాకిలి లేని వాణ్ణి. నేను ఎందుకోసం డబ్బు పోగుచేసుకోవాలి?113.ముందు అంగడికి వెళ్లి ఒక సేరు పప్పు కొనుక్కుని రండి. వానికి తృప్తిగా మేతపెట్టి వానిని మరల గొల్లవానికి ఇచ్చివేయండి' అని చెప్పారు. 114. వారి ఆజ్ఞానుసారం వెంటనే పప్పును తెచ్చి మేకలకు మేత పెట్టారు. ఇక ఆలస్యం చేయకుండా వానిని మరల మందలోకి పంపించివేశారు.115.సాయిబాబా మూర్తీభవించిన పరోపకారానికి ప్రత్యక్ష అవతారం. వారికి తాత్యా శ్యామా లేదా ఇతరులు సలహాలను సూచించేవారా?116.మేకలు ఎంతో సంతోషంగా పప్పుతిని తృప్తి చెందినట్లు గమనించి బాబా వానిని వాని యజమానికి ఇచ్చి వేయండి. మందలో విశ్రమిస్తాయి' అని చెప్పారు. 117.ఆ విధంగా రూపాయలకు రూపాయలు పోయినవి. మేకలుకూడా ఉచితంగా పోయాయి. తరువాత మేకల గతజన్మ గురించి బాబా వింతగా చెప్పారు.118.తాత్యా వలెనే శ్యామా కూడా.ఆ ఇద్దఱిపైనా బాబాకు ప్రేమ. వారి కోపాన్ని శాంతపరచటానికి బాబా చక్కటి కథను చెప్పారు.119.సాయి తమంతట తాము స్వయంగా మేకల పూర్వజన్మ కథను ఆ ఇద్దఱికి చెప్పారు. శ్రోతలు కూడా దానిని శ్రవణం చేయండి.120.పూర్వజన్మలో ఈ ప్రాణులు భాగ్యం కొద్దీ మానవులు. నాకు దగ్గరే ఉండేవారు. వారికి కూడా కర్మప్రభావఫలితం తప్పలేదు.121.ఇప్పుడు మీకు ఇవి మేకలుగా కనిపిస్తున్నాయి కదా! పూర్వజన్మలో ఈ మేకలు సోదరులు.పరస్పరం కొట్టుకుని పరిణామంగా ఈ రూపాన్ని పొందారు.122. మొదట్లో అన్నదమ్ములలో ప్రేమ ఉండేది.ఒక కంచంలో తిని ఒక మంచంపై పడుకునేవారు.రోజూ ఒకరి యోగక్షేమాలను ఒకరు ఆలోచించేవారు.ఆ ఉభయులలో ఐక్యత బాగా ఉండేది. 123.ఆ ఇద్దఱూ సహోదరులే అయినా దుర్భరమైన కర్మధర్మసంయోగం వలన, భయంకరమైన ద్రవ్యలోభం

కారణంగా వారిలో శత్రుత్వం ప్రబలింది.124. పెద్దవాడు మహా సోమరి. చిన్నవాడు అహర్నిశలూ శ్రమించి ధనాన్ని కూడబెట్టుకున్నాడు. అందువలన పెద్దవానికి అసూయ కలిగింది.125.కంటుకంలా ఉన్న తమ్ముని తొలగించితే తనకు ద్రవ్యానికి లోటుండదు అని పెద్దవాడు ధనలోభంతో చెడుగా ఆలోచించసాగాడు.126.ధనంమీది మోహం దృష్టికి ప్రతిబంధకమైంది. కళ్లు ఉండీ అతడు అంధుడయ్యాడు. బందుత్వాన్ని సోదరప్రేమను మరచిపోయి, తమ్ముని హతమార్చటానికి సన్నద్ధుడయ్యాడు.127. ప్రారబ్ధ కర్మభోగం పరమకఠినమైనది. నిష్కారణంగా శత్రుత్వం ఉత్పన్నమైంది. రహస్యంగా ఉన్న కపటం బయట పడింది. లోభం నిగ్రహించుకోలేనంతగా పెరిగింది.128.వారి ఆయువు తీరిపోయింది. సోదరప్రేమను పూర్తిగా మరచిపోయారు. దురభిమానం ఎంతో పెరిగి పోయింది శత్రువులవలె ఒకరితో ఒకరు పోట్లాడుకున్నారు.129. ఒకడు సోదరుని కళ్ళతో తలపైన కొట్టి క్రింద పడవేశాడు. రెండవవాడు గొడ్డలితో కొట్టి తన సోదరుని చంపేశాడు.130.ఆ ఇద్దరూ రక్తం కారుస్తూ ఛిన్నాభిన్నంగా మూర్ఛపడిపోయారు. కాసేపటికంతా ప్రాణాలను కోలుపోయి ఇద్దఱూ చనిపోయారు.131.జీవితాలు అలా అంతం కాగా వారు ఈ యోనిలో ప్రవేశించారు.వారిని చూడగానే వారి ఈ వృత్తాంతమంతా నాకు గుర్తుకు వచ్చింది. 132.చేసిన కర్మను అనుభవించటానికి మేకల జన్మకు వచ్చారు. అకస్మాత్తుగా వారిని మందలో చూచి నాకు వారిపై ప్రేమ కలిగింది.133.అందువలన స్వంతడబ్బు ఖర్చుపెట్టి హానికి విశ్రామాన్ని కలిగించాలని అనిపించింది. కాని మీ కారణంగా వాని కర్మ వానికి అడ్డుతగిలింది.134.మేకల మీద దయ ఉన్నా మీ బలవంతం వలన చివరకు నేను వానిని గొల్లవానికి తిరిగి ఇచ్చి వేయటానికి ఒప్పుకున్నాను అని చెప్పారు.135.ఇక్కడితో కథ ముగిసింది. శ్రోతలు నన్ను క్షమించాలి. తరువాతి అధ్యాయాన్ని వింటే మనసుకు సంతోషం కలుగుతుంది.136.అది కూడా సాయి నోటి నుండి స్రవించిన

అమృతం.పరమ ప్రేమ భరితం అని హేమాడుపంతు సాయి చరణాలయంధు వినమ్రుడై శ్రోతలకు మనవి చేస్తున్నాడు.137.స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో కాశీగయాగమనం అజా జన్మ కథనమను నలుబది ఆరవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 47 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

పరమానందాన్ని ఉత్పన్నం చేసే సాయి యొక్క శ్రీముఖాన్ని ఒక్క క్షణం చూస్తే చాలు. అది అనంత జన్మల దుఃఖాన్ని నశింప చేస్తుంది. అట్టి వారి వదనం ధన్యం. 1. వారి కృపావలోకనంతో భక్తులకు వెంటనే కర్మబంధ విమోచనం కలిగి క్షణం పట్టకుండా ఆత్మానందం సమృద్ధిగా లభిస్తుంది. 2. వారి కృపాదృష్టితో కర్మాకర్మల చిక్కు విడిపోతుంది. ఆ కృపా భాస్కరుని ప్రకాశంలో భవమనే మిణుగురు పురుగు నిస్తేజమౌతుంది. 3. జగాల పాపాలను ప్రక్షాళనం చేయటం వలన గంగ మలినమౌతుంది. తన ఆ మాలిన్యాన్ని తొలగించు కోవటానికి సత్పురుషుల చరణ రజాన్ని కోరుకుంటుంది. 4. ఎప్పుడు సత్పురుషులు నా వద్దకు స్నానానికి వస్తారు, వారి చరణ స్పర్శ ఎప్పుడు లభిస్తుంది అని అనుకుంటుంది. వారు తప్ప ఆ పాపాలకు నిష్కృతి లేదు అని ఆమెకు నిశ్చయంగా తెలుసు. 5. ఇటువంటి సాధువులకు మకుటమణి అయిన సాయిసమర్థుల వాణి ఇది అని తెలుసుకుని భక్తులు, సజ్జనులు ఈ పావన చరితాన్ని అత్యంత ఆదరంగా ఆలకించండి. 6. ఈ కథ విశేషమైన మహిమ గలది. జ్ఞానులైనా, అజ్ఞానులైనా ఈ పరమ పావన కథను వింటే శ్రోతల కర్మ బంధనం విడిపోతుంది. 7. నయనాలకు దృష్టి సాయి, శ్రవణానికి శ్రవణం సాయి. వారే నా హృదయంలో ప్రవేశించి ఈ వృత్తాంతాన్ని చెప్పారు. 8. సాయి స్వయం మహానుభావులు. విశిష్టమైన ఈ కథను వింటే శ్రోతలు శరీరభావాన్ని మరచిపోతారు. వారిలో అష్ట ప్రేమభావాలు

పెల్లుబుకుతాయి.9.సాయి నొటి నుండి వచ్చిన ఈ కథలోని ఉద్దేశాన్ని శ్రద్ధగా తెలుసుకుని తాత్పర్యమందు దృష్టి ఉంచితే శ్రోతలు కృతకృత్యులౌతారు.10.కనుక శ్రోతలు నా మనవిని వినండి.నేను ఈ కథను చెప్పే వాడినే అయినా ఇందులోని సారాన్ని తెలుసుకోలేక పోతే నేను కూడా మీవలెనే రిక్త మనస్కుణ్ణి.11.భక్తులపైని బాబా యొక్క ప్రేమను స్మరించుకుంటే మనసు తన మనోధర్మాన్ని మరచిపోతుంది. ప్రపంచ బాధలనుండి ఉపశమనం కలుగుతుంది. ఇంతకంటె పరమ లాభం మరేమిటి?12.పూర్వకథాను సంధానం. శ్రోతలు కథను శ్రద్ధగా సావధానంగా వింటే మనసుకు సంతృప్తి కలుగుతుంది.13.గతాధ్యాయం చివర శ్రోతలు మేకల కథను, బాబాకు మేకల పైని ప్రీతిని, వాని గత జన్మ గురించిన స్మృతిని విన్నారు కదూ!14. అటువంటిదే ఈ కథ కూడా.పరాకాష్ఠ నందుకున్న ద్రవ్యలోభం ఎలా అధఃపతనానికి దారి తీస్తుందో శ్రద్ధగా వినండి.15.సాయియే సంపూర్ణ కరుణాకటాక్షంతో ఒకటి తరువాత మరొక కథను సూచించారు. శ్రవణంలో ఏ విఘ్నాన్ని రానీయకుండా సుఖ సంతోషాలను పెంపొందిస్తారు. 16.కథ, కథను చెప్పేవారు, నోరు అన్నీ స్వయం సాయిసమర్థులే అయినప్పుడు ఇక హేమాడు ఎవరు? అతడు అసలు ఎందుకు? ఊరికే పేరుకే.17.సాయి కథా సాగర తీరాన కూర్చుండగా మనకు కథలకు కరువా?కల్పతరువు క్రింద కోరిక కలిగితే అది సిద్ధిస్తుంది.18.దినకరుని ఇంట దీపం కోసం ఎవరు చింతిస్తారు? నిరంతరం అమృతపానం చేసేవారికి విషం గుర్తుకు వస్తుందా?19.మనకు సాయి వంటి దైవం ఎల్లప్పుడూ వెంటఉండగా కథామృతానికి ఏం కరువు? యథేచ్ఛగా ఆ సంతోషాన్ని అనుభవించండి.20.కర్మ సూత్ర సిద్ధాంతం చాలా కఠినమైనది.అది ఎవరికీ అర్థం కాదు. మహామహా జ్ఞానులను కూడా మోసగిస్తుంది. కాని ఏమీ తెలియని అమాయక భక్తులను తరింప చేస్తుంది.21.అట్లే పరమేశ్వరుని నియమం దుర్గమం.దానిని ఎవరు అతిక్రమించగలరు?

కనుక, లౌకిక ధర్మానుసారం ఆయా కర్మలను ఎప్పుడూ చేస్తూ ఉండాలి.22.లేకపోతే, అత్యంత అధర్మం. మరణం తరువాత వారివారి కర్మలననుసరించి తదనురూపంగా జన్మలను పొందుతారు.23.'యథా కర్మ యథా శ్రుత' 'శుక్రబీజ సమన్విత' వారివారి కర్మానుసారం, జ్ఞానానుసారం కొందఱు శుక్రబీజాలతో కలిసి యోని ద్వారా ప్రవేశిస్తారు. కొందఱు స్థావరాలుగా జన్మిస్తారు.24.'యథా ప్రజ్ఞంహి సంభవః' వారివారి బుద్ధిని అనుసరించి జన్మ. ఈ శ్రుతి వచనానికి అర్థం ఎవరికి తెలియదు? జన్మను పొందాలని అనుకుంటే దానిని నచ్చిన విధంగా పొందాలి.25.శరీరాన్ని మరల పొందాలని కోరుకునే మూఢులు అజ్ఞానులు తాము ఆర్జించుకున్న దాననుసరించే తమకు శరీరాలు ప్రాప్తిస్తాయని తెలుసుకోవాలి.26.అందువలన శరీరం నేలరాలి పోకముందే మానవ జన్మ యొక్క అమూల్య అవకాశాన్ని,ఆత్మజ్ఞాన ప్రాప్తి వరకు జార విడచుకోని వారే జ్ఞానులు.27.వారే ప్రపంచబంధనాల నుండి ముక్తులౌతారు. ఇతరులు ప్రపంచ చక్రంలో పడతారు. ఎప్పుడూ శరీరబంధనం నుండి విడిపోరు. వారికి జన్మజన్మల యాతన తప్పదు. 28.ఇప్పుడు ఈ కథలోని విశేషం – 'నేను శరీరాన్ని' అన్న ధ్యాస, చెడు ఆలోచన తొలగిపోయి సాత్విక అష్టభావాలు ఉప్పొంగుతాయి.29.తమవద్ద ఎంతో ధనమున్నా అత్యంత లోభ స్వభావం గలవారి జీవనం వ్యర్థం.అట్టివారు జీవితాంతం వ్యర్థమైన శ్రమను అనుభవిస్తారు.30.పైగా మనసులో శత్రుత్వభావం ఉండటం ఎన్నడూ మంచిదికాదు.ఆ భావం రాకుండా మనసును నిగ్రహించుకోవాలి లేదా అది జీవితాన్ని నాశనం చేస్తుంది 31. పరస్పర వైరం యొక్క పరిణామం ఉత్తమమైన జన్మ నుండి అధమమైన జన్మకు వెళ్లటం. ఋణం శత్రుత్వం హత్య వీని ధర్మం ఇవి తీరేవరకు జన్మ పరంపర తప్పదు.32.ఈ విషయంలో సాయి నోటి నుండి వెలువడిన పరమ పావనమైన అమృత వాణిని శ్రోతలకు చెప్తాను. సావధానంగా వినండి.33.సాయిమాత చెప్పిన ఈ కథను

నేను విన్నది విన్నట్లు నాకు గుర్తు ఉన్నంతవరకు చెప్తాను.34.సాయి స్వయం చరిత్ర కారులు. తామే కథను సవిస్తరంగా వ్రాసుకుంటారు. హేమాడు కేవలం నిమిత్తమాత్రుడు. అతనిని నడిపించే సూత్రధారి సాయియే.35.'ఒక రోజు ఉదయం ఎనిమిది గంటల సమయాన నేను ఫలహారాన్ని సేవించి రోజూ లాగే బయట తిరగటానికి వెళ్లాను.36.దారిన నడుస్తూ నడుస్తూ అలసిపోయి ఒక నదీతీరానికి చేరుకున్నాను. కాళ్లు కడుక్కుని స్నానం చేశాను. మనసుకు చాలా సంతోషం కలిగింది.37.ఆ నది ఎంత? ఈ రహతా నది అంతే. రెండు తీరాలను తాకుతూ నీరు నిండుగా ఉంది.ఒడ్డున ఒకరకం గడ్డి చెట్లు ఉన్నాయి.38.అక్కడ కాలిబాట ఉంది, బండి వెళ్లే దారి కూడా స్పష్టంగా కనిపిస్తూ ఉంది. నదీ తీరాన వృక్షాలు దట్టంగా ఉండటం వలన వాని నీడ కూడా బాగా ఉంది.39.చల్లని గాలి మెల్లమెల్లగా వీస్తూ ఉంటే మనసుకు చాలా ఆనందంగా ఉంది. చెట్లు గుంపుగా ఉన్న చోటును చూచి వాని నీడలో స్వేచ్ఛగా కూర్చున్నాను. 40.చిలుం గొట్టం నింపాలని దానికోసం బట్టను తడపటానికి వెళ్లగా అక్కడ బెకబెక మని చప్పుడు వినిపించింది. ఆ శబ్దం కప్పదే అయి ఉండవచ్చు అని నాకు అనిపించింది.41.నీరు ఉన్న చోట కప్పలు ఉండటం సహజం. ఇందులో విశేషం ఏముంది? బట్టను తడుపుకుని నేను తిరిగివచ్చి చెకుముకు రాయిని చేతిలోకి తీసుకున్నాను.42.రాతి నుండి నిప్పురవ్వ వచ్చి చిలుం వెలిగి తయారైంది.అకస్మాత్తుగా ఒక బాటసారి వచ్చి వందనం చేసి నా దగ్గర కూర్చున్నాడు.43.నా వద్దనుండి వినయంగా చిలుం చేతిలోనికి తీసుకుని చాలా దూరం వచ్చారు అని సగౌరవంగా పలకరించాడు.44.మసీదు ఇక్కడి నుండి చాలా దూరం. మీరు అక్కడికి వెళ్లే సరికి ఎండ ఎక్కిపోతుంది. ఈ వేనకే మా ఇల్లు. చిలుం త్రాగి ఇంటికి వెడదాం.45.అక్కడ కొంచెం రొట్టె అదీ తిని కాసేపు విశ్రమించి ఎండ బాగా తగ్గి పోయాక సంతోషంగా తిరిగి వెళ్లవచ్చు.46.నేను కూడా మీ వెంట వస్తాను.

అని చెప్పి బాటసారి చిలుం వెలిగించి పిల్చటానికి గౌరవంగా నాకు ఇచ్చాడు.47.అక్కడ ఆ కప్ప ఆర్త స్వరంతో బిగ్గరగా ఏడవసాగింది.ఆ కేకలు ఏమిటి అని బాటసారి నన్ను అడిగాడు.48.అప్పుడు నేను అతనితో నదీ తీరాన ఒక కప్ప కష్టంలో చిక్కుకుంది.దాని కర్మ దాని వెంట పడింది.నీకు ఆ కథ చెప్తాను విను.49.పూర్వ జన్మలో చేసుకున్న దానిని ఈ జన్మలో అనుభవించాలి.కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. ఇప్పుడు ఏడిస్తే ఏం లాభం? అని అన్నాను. 50.నా మాటలనువిని చిలుం నా చేతి కిచ్చి నేను వెళ్లి చూచి వస్తాను అని బాటసారి అక్కడినుండి బయలుదేఱాడు.51.నిజంగా, అది కప్పయేనా లేక వేరే జీవియా? అయితే దానికి ఏం దుఃఖమో అన్న నా సందేహాన్ని తీర్చుకుంటాను.52.అతని కుతూహలాన్ని గమనించి నేను, 'వెళ్లి చూడు ఒక పెద్ద పాము నోట్లో కప్పపడి ఏడుస్తూ ఉంది. 53.ఆ రెండూ దుష్టులు.వాని కృత్యాలు ఘోరమైనవి.పూర్వజన్మల భయంకరమైన పాప కర్మల ఫలితాన్ని అనుభవించటానికి ఈ శరీరాలను పొందాయి' అని చెప్పాను.54.అలా మాట్లాడుతూ ఉండగా బాటసారి ఆ స్థలానికివెళ్లి ప్రత్యక్షంగా చూచి వచ్చిన విషయాన్ని చెప్పాడు.55.కాల సర్పంలాంటి పెద్ద పాము నోరు చాలా పెద్దదిగా ఉంది. కప్ప కూడా భయంకరంగా ఉంది కాని అది పాముకు ఫలహారం.56.అది పాము నోటిలో ఆహుతి అయిపోతుంది. అరగంటో గంటో అంతే. క్షణంలో దానికి నిశ్చింత కలుగుతుంది. కర్మగతి ఎంత విచిత్రం అని అన్నాడు.57.అప్పుడు నేను అతనితో అలా ఏం జరగదు. దాని బాబును నేను లేనూ? నేను మరి ఇక్కడ ఎందుకు ఉన్నాను?58. నా స్థలాన్ని వదిలి ఇక్కడికి వచ్చి కూర్చున్నాను. మరి ఆ కప్పను తిననిస్తానా? చూడు, దానిని నేనెలా విడిపిస్తానో.59. ఇప్పుడు ఈ దెబ్బలాట నుంచి విడిపించి మనం ఇంటికి పోదాం, పదపద ఒకసారి చిలుం నింపు. ఇక ఆ పాము ఏం చేస్తుందో చూస్తాను అని చెప్పాను.60.బాటసారి వెంటనే చిలుం తయారు చేసి

తను స్వయం గట్టిగా పీల్చి నాకు అందించాడు. నేను దానిని పీల్చటానికి చేతికి అందుకున్నాను.61.నేను రెండు పీల్పులు పీల్చాను.బాటసారిని వెంటబెట్టుకుని చెట్లమధ్యనుండి ఆ ప్రత్యేక స్థలానికి చేరుకున్నాను.62.మరల ఆ పామును చూచి బాటసారి భయపడిపోయి ఎంతటి భయంకరమైన ప్రాణి అని భయంతో నన్ను వారించాడు.63.మీరు ముందుకు వెళ్లకండి. ఆ పాము మీ దగ్గరకు రాగలదు.ఈ చోటు చాలా ఇరుకుగా ఉంది. ఇక్కడి నుండి పరుగెత్తాలన్నా వీలు కాదు, కనుక మీరు అటు వెళ్లవద్దు అని అన్నాడు.64.ఆ దృశ్యాన్ని చూచి బాటసారికి ప్రాణభయం పట్టుకుంది. తరువాత నేను తెలియచేసిన ఆ రెండింటి శత్రుత్వ భావానికి సంబంధించిన కథను వినండి .65.ఒరే బాబూ! వీరభద్రప్పా! ఈ బసవప్ప నీకు ఇప్పటికీ శత్రువేనా? కప్ప రూపం వచ్చినా పశ్చాత్తాపం పొందలేదా?66.నీవు కూడా సర్పయోనికి వచ్చావు కదా. అయినా ఇంకా శత్రుత్వంతో ఉన్నావు. ఇకనైనా సిగ్గుపడు. శత్రుత్వాన్ని మాని నిశ్చింతగా ఉండు. 67.నా నోటి నుండి ఆ మాటలు రాగానే పాము కప్పను వదిలి వేగంగా పారిపోయి వెంటనే నీటిలోకి దూరి అదృశ్యమైంది.68. కప్ప మృత్యు ముఖం నుండి బయటపడి ఎగిరిదూకి చెట్లలోనికి పోయి దాక్కుంది. బాటసారి ఆశ్చర్యపోయాడు.69. మీ మాటలకు పాము కప్పను ఎలా వదలి పారిపోయింది? పాము ఎలా అదృశ్యమైంది? ఇదేమిటో నాకు అర్థం కాలేదు అని అతడు అన్నాడు.70.వీరిలో వీరభద్రప్ప ఎవరు? బసవప్ప ఎవరు? వీరి శత్రుత్వానికి కారణమేమిటో నాకు చెప్పండి అని అడిగాడు.71.సరే ముందు చెట్ల క్రిందకు పోయి చిలుం పీల్చుకున్న తరువాతనే నీ కుతూహలాన్ని తీర్చి నేను నా స్థలానికి వెళ్లిపోతానని చెప్పాను.72.ఇద్దరమూ చెట్లక్రిందకు వచ్చాం. బాగా నీడగా ఉంది. చల్లటిగాలి వీచసాగింది.మరల చిలుం వెలిగించాం.73.ముందు బాటసారి పీల్చి తరువాత నా చేతికి ఇచ్చాడు.నేను దానిని పీల్చుతూ పీల్చుతూ అతనికి కథను చెప్పాను.74.నేనున్న

స్థలం నుండి కోసు, రెండు కోసులు లేదా మూడుకోసుల దూరంలో, చాలా మహిమగల పురాతనమైన ఒక పవిత్ర స్థానం ఉండేది. 75.అక్కడ ఏనాటి కాలానిదో శిథిలమై పోయిన ఒక శివాలయం ఉంది. దానిని పునరుద్ధరణ చేయాలని అందరికీ అనిపించింది.76.అందుకోసం విరాళాల రూపంలో చాలా ధనాన్ని పోగు చేశారు. గుడి యొక్క రూపురేఖలను, పూజార్చనల వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు.77.ఒక గొప్ప ధనవంతుని నిర్వాహకునిగా నియమించి అన్ని నిర్ణయాలను అతడే తీసుకోవాలని చెప్పి అతని చేతికి డబ్బిచ్చారు.78.అతడు తన విరాళాన్ని కూడా జతపరచి ఆ ధనాన్ని వేరుగా ఉంచి చక్కగా జమా ఖర్చుల లెక్క వ్రాసి ఆ కార్యాన్ని శ్రద్ధగా చేస్తాడని ఆశించారు. 79.కాని అతడు చాలా పిసినారి. తన డబ్బు నష్టం కాకుండా పనిని చేయించడం వలన గుడి పని పూర్తికాలేదు.80.పోగు చేసిన డబ్బంతా అయిపోయింది. కాని పని సగమే అయింది. అయినా అతడు తన స్వంత డబ్బు ఒక్క పైసా అయినా ఖర్చు పెట్టలేదు.81.గొప్ప షావుకారు అయినప్పటికీ అతడు లోభత్వానికి పూర్ణావతారం. అతడు తియ్యగా మాట్లాడేవాడు కాని ఆ మాటలు కార్యరూపం దాల్చలేదు.82. తరువాత అతని వద్ద డబ్బు పోగుచేసి ఉంచిన వారంతా సమావేశమయ్యారు.'నీకు ఇంతటి ఐశ్వర్యముంది గాని ఏం ప్రయోజనం?83.నీవు సహాయం చేయకపోతే ఈ మహాదేవుని మందిరం ఎలా పునరుద్ధరింప బడుతుంది? ఆలోచించు.84.మేము మరల ప్రజల వద్ద విరాళాలు వసూలు చేసి ఆ డబ్బు కూడా నీకు పంపుతాము. ఏ విధంగానైనా ఈ కార్యాన్ని పూర్తి చేయి అని చెప్పారు.85.అట్లే మరల డబ్బు పోగుచేసి అతని చేతికి చక్కగా అందించారు. అయినా దాంతో పని కాలేదు. ధనికుడు నిశ్చింతగా కూర్చున్నాడు. 86.కొన్నిరోజులు గడిచాక దేవునికి ఏదైనా చేయాలని అనిపించింది. అప్పుడు ఆ ధనికుని భార్యకు స్వప్న దృష్టాంతం కలిగింది.87.'నీ వైవా మేలుకో! దేవాలయానికి గోపురాన్ని కట్టించు. నీవు ఖర్చు పెట్టిన దానికి

మారింతలు నీకు నీలకంఠుడు ఇస్తాడు' అని.88.మరునాడు ఆ దృష్టాంతాన్నంతటినీ ఆమె భర్త చెవిన వేసింది. అతనికి ఒక్క గవ్వైనా ఖర్చు పెట్టాలంటే ప్రాణాంతకం. అందువల్ల ఆ మాటలు అతనికి కోపోద్రేకాన్ని కలుగ చేశాయి. 89. అహర్నిశలూ ధనం పోగు చేయటమే తప్ప రెండవ విషయం లేనివానికి ఈ స్వప్న దృష్టాంతం అంటే ధనవ్యయం ఎలా నచ్చుతుంది?90.అతడు భార్యతో నేను 'ఈ దృష్టాంతాన్ని నమ్మను. నాకు ఇలాంటి వాటిల్లో అసలు విశ్వాసం లేదు' అని ఆమెను హేళన చేశాడు.91.వారివారి చిత్తవృత్తిని అనుసరించి జగత్తు వారికి కనిపిస్తుంది.తమది మొండి స్వభావం కావటం వలన ఇతరులు కూడా వారికి అలాగే కనిపిస్తారు.92.నా డబ్బే తీసుకోవాలని దేవునికి ఉంటే నేను నీకంటే దూరంగా ఉన్నానా?ఆ కల నీకే ఎందుకు రావాలి?93.ఆ దృష్టాంతం నీకు మాత్రమే ఎందుకు కలగాలి? దేవుడు నాకు ఎందుకు చెప్పలేదు? దీని భావం నాకేమీ అర్థం కావడం లేదు.కనుక నాకు నమ్మకం కుదరడం లేదు.94.కల అబద్ధమైనా అయి ఉండాలి, లేదా భార్యాభర్తల మధ్య తగువులాట పెట్టాలని ఆ ఈశ్వరుడు పన్నిన పన్నాగం అని నాకు అనిపిస్తూ ఉంది.95.ఆలయం యొక్క జీర్ణోద్ధరణ కార్యంలో నా సహకారం తక్కువగా ఉందా? నేను నెలనెలా నింపి పెట్టిన సంచులు ఖాళీ అవుతున్నాయి.96.డబ్బంతా ప్రజలు తెచ్చి ఇస్తున్నట్లు పైకి కనిపిస్తుంది.కాని జమా ఖర్చుల వ్యాపార పద్ధతి నాకు చాలా నష్టం.97.ప్రజలకు ఇది తెలియదు. నీకు ఎలా తెలియచేయాలి? నీకు కలిగిన దృష్టాంతం యదార్థమని అనుకోవడానికి లేదు.98.నిజమని అనుకుంటే, మోసపోతాం. నిద్రాభంగమైనప్పుడు ఏవో కలలు కలుగుతాయి వానిని ఎవరైనా యదార్థమని అనుకుంటారా'అని ధనికుడు సిద్ధాంతాన్ని నిర్ణయించాడు.99.అతని మాటలను విని అతని భార్య భర్తకు ఏ జవాబు చెప్పక ఊరుకుండి పోయింది. ప్రజలు శక్తికొలది డబ్బు సేకరించి సంతోషంగా తెచ్చి ఇచ్చేవారు.100.ప్రేమ లేకుండా బలవంతంగానో లేదా

బాధపడుతూనో ఇస్తే దేవునికి ఇష్టం ఉండదు. ప్రేమతో ఏ కొంచెం ఇచ్చినా అది చాలా విలువైనది.101.డబ్బు పోగైనప్పుడు దేవాలయం పని జరగడం, డబ్బు లేనప్పుడు పని కూడా ఆగిపోవటం, అలా ఆ పని ఆలస్యం కాసాగింది. 102.కాని లోభి అయిన ధనికుడు తన సంచి లోనుండి ఒక్క పైసా అయినా తీయడు.అతని భార్యకు మరల కలిగిన దృష్టాంతాన్ని వినండి .103.దేవాలయానికి డబ్బును ఇవ్వమని నీ భర్తను బలవంత పెట్టకు. నీ శ్రద్ధాభక్తులు భగవంతునికి చాలు.నీకు ఇష్టమైనంత ఇవ్వు.104.హృదయ పూర్వకంగా ఇచ్చిన ఒక్కపైసా అయినా సరే. అది లక్షలవిలువ చేస్తుంది. కనుక భర్తను సంప్రదించి దేవునికి ఇవ్వు.105.అనుసరంగా బాధ పడకు. నీ మనసుకు తోచినంత ఇవ్వు. కొంచెమైనా సరే, నీ స్వంతమైన దానిని అర్పించు.106.ఇక్కడ కేవలం భక్తి ప్రధానం. నీకు భక్తి ఉన్నదని తెలిసి ఏమైనా ఇవ్వమని దేవుడు నిన్ను మరల మరల అడుగుతున్నాడు.107.నీకు ఉన్న ధనం కొంచెమైనా సరే ఇచ్చి నీవు నిశ్చింతగా ఉండు. భక్తి భావం లేకుండా ఇవ్వడం మంచిది కాదు. అది భగవంతునికి అసలు ఇష్టముండదు. 108.శ్రద్ధ లేకుండా చేసే దానం మట్టితో సమానం. చివరకు అది నిష్ఫలం. ఇది త్వరలోనే అనుభవమౌతుంది.109.ఈ దృష్టాంతాన్ని విని ఆమె తన తండ్రి ఇచ్చిన నగలను దేవునికి అర్పించాలని నిశ్చయించుకుంది.110.తరువాత తన నిశ్చియాన్ని భర్తకు తెలియచేసింది.అది విని భర్త తనలో క్రుద్ధుడయ్యాడు. 111.లోభమున్న చోట ఆలోచన ఎక్కడిది? అక్కడ దేవుడు, ధర్మం, ఆచారం అవీ ఉండవు.ఏమిటి ఈమె తెలివిలేని ఆలోచన.ఈమె మతి భ్రమించింది.112.ఈమె నగలన్నిటికీ ఒక వేయి రూపాయలకు విలువ కట్టి ఈమె పేరిట దేవునికి భూమి అర్పించాలి అని అనుకున్నాడు.113.ఆమె నగలను తనే కొనుక్కున్నట్లు ఆ డబ్బుకు బదులుగా ఎవరిదో తన వద్ద తాకట్టుగా ఉన్న బంజరు భూమిని భార్యకు ఇచ్చాడు.114.ఆ భూమి సాగులేనిది.

వర్షాకాలంలో కూడా అందులో ఏమీ పండదు. అలాంటి భూమిని ఈశ్వరునికి అర్పించు అని అన్నాడు. 115. వేయి రూపాయల భూమిని దేవునికి దానం చేస్తే దృష్టాంతంలో చెప్పినట్లుగా దేవుడు ప్రసన్నుడౌతాడు. నీవు ఋణం నుండి విముక్తురాలవౌతావు' అని చెప్పాడు. 116. భర్త మాటలను విని లోభి భార్య ఆ భూమిని పరమేశ్వరుని ప్రీత్యర్థం భక్తిగా అర్పించింది. 117. నిజానికి ఆ భూమి ఆ ధనికుని వద్ద రెండు వందల రూపాయలకు తాకట్టు పెట్టిన దుబకి అను ఒక స్త్రీకి చెందినది. 118. దుబకి ఒక అనాథ స్త్రీ. ఆమెయే భూమి యజమానురాలు. డబ్బుకు ఇక్కట్టు కలిగినప్పుడు ఆమె తన భూమిని తాకట్టు పెట్టింది. 119. ధనికుడు మహా లోభి. శంకరుని మోసగించటానికి కూడా భయపడలేదు. తన భార్య యొక్క స్త్రీ ధనాన్ని చూపించాడు. కపటంతో లాభాలు పొందటం సుఖమని అనుకున్నాడు. 120. ఈ విషయలాలస చాలా చెడ్డది. విషయ సుఖాల యందు ఆసక్తి కలవారిని నాశనం చేస్తుంది. జీవితం మీద ఆశ ఉంటే ఈ విషయపాశంలో చిక్కుకోకండి. 121. శ్రవణలాలసతో జింక చచ్చిపోతుంది. అందమైన మణిని ధరించి సర్పం, వెలుగును చూడాలనే కోరికతో కీటకం చచ్చిపోతాయి. ఇలా విషయాల యందు ఆసక్తి హానికరం. 122. విషయ సుఖాలను అనుభవించడానికి ధనం అవసరం. దానికోసం గట్టి ప్రయత్నం చేస్తే విషయతృష్ణ దారుణంగా అధికమౌతుంది. దానిని తొలగించుకోవటం అశక్యం. 123. నిస్సందేహంగా భూమి అస్సలు పనికి రానిది. ఎంత శ్రమపడినా ఒక కణమైనా ఫలించని దానిని కృష్ణార్పణమని అనుకుంటే అటువంటి దానం వలన ఏం పుణ్యం? 124. కించిత్తైనా సంకల్పం లేకుండా కృష్ణార్పణమని చేసిన దానం ఇష్టం లేకుండా చేసినట్లే. చివర దుఃఖాన్ని కలిగించే దానంతో పాపాన్ని మూటకట్టుకోవటమే. 125. ఇక్కడ దేవాలయంలోని పూజారి పేదబ్రాహ్మణుడు మాత్రం దేవునికి భూమి లభించిందని చాలా సంతోషించాడు. 126. కొంతకాలానికి విపరీతం జరిగింది. కృత్తికా

నక్షత్ర ప్రభావంతో వర్షం అపారంగా కురిసింది. భయంకరమైన తుఫాను చెలరేగింది.127.అకస్మాత్తుగా పిడుగు పడింది. ధనికుని భవనమంతా కూలిపోయింది. దేవునికి ఇచ్చిన భూమిమాత్రం సురక్షితంగా ఉంది. మిగతాదంతా దగ్ధమై పోయింది. 128.ధనికుడు కూడా నాశనమయ్యాడు. తన భార్యతో సహా అతడు కూడా మరణించాడు. దుబకి కూడా ప్రాణాలను కోల్పోయింది. అలా ఆ ముగ్గురూ అంతమయ్యారు.129.తరువాత ఆ ధనికుడు మధురానగరంలో ఒక పేద బ్రాహ్మణుని ఇంట్లో పుట్టాడు. భక్తురాలైన అతని భార్య శివాలయం పూజారి ఇంట్లో జన్మించింది. 130. ఈమెకు గౌరి అని పేరు పెట్టారు. దుబకి కూడా మరోవిధంగా శంకరుని యొక్క గురవ కుటుంబంలో మగబిడ్డగా జన్మించింది.131.బారసాల చేసి ఆ బిడ్డకు చెన్నబసవప్ప అని పేరు పెట్టారు. ఇలా ముగ్గురి స్థితి గతులలో అంతరం ఏర్పడింది. వారి కర్మ ఫలోన్ముఖమైంది.132.పునర్జన్మలో ధనికునికి వీరభద్రప్ప అని పేరు పెట్టారు. ఇదే ప్రారబ్ధ కర్మ యొక్క మర్మం.ఈ కర్మ అనుభవిస్తేనే అంతమౌతుంది.133.శంకరుని పూజారికి నేనంటే చాలా ఇష్టం. రోజూ మా ఇంటికి వచ్చి, నాతో బాటు చిలుం పీల్చేవాడు.134.మేము రాత్రంతా ఆనందంగా కబుర్లు చెప్పుకునే వారం.గౌరి పెద్దదై పెళ్ళికి ఎదిగింది.ఆమెను కూడా వెంట బెట్టుకుని తీసుకుని వచ్చేవాడు. 135.ఆమె కూడా నన్ను అభిమానించేది.ఒకరోజు పూజారి'ఈ అమ్మాయికి అన్ని చోట్లా సంబంధాలు వెదికాను,ఎక్కడా కుదరటం లేదు.136.బాబా! సంబంధాలు చూచి నేను అలసిపోయాను. నా ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయి అని అంటే, ఎందుకు చింతిస్తావు?ఆమె వరుడు దారిలో ఉన్నాడు అని నేనన్నాను137.మీ అమ్మాయి భాగ్యశాలి.గొప్ప ధనవంతురాలవుతుంది.ఆమెనే వెదుక్కుంటూ వరుడు స్వయం నడుచుకుంటూ వస్తున్నాడు. 138.త్వరలోనే నీ ఇంటికి వచ్చి నీ కోరికను తీర్చుతాడు. నీ మాట ప్రకారం గౌరిని వివాహం

చేసుకుంటాడు అని నేను చెప్పాను.139. ఇక్కడ వీర భద్రుడు పేద కుటుంబంలో ఉన్నందు వలన, తల్లి తండ్రులకు ధైర్యం చెప్పి ఆ ఇంటిని వదలి బయలు దేరాడు.140.ఊరూరు భిక్షాటన చేస్తూ ఒక్కోచోట కూలి పని చేస్తూ ఎక్కడ ఏది లభిస్తే దానినే తింటూ సంతోషంగా తిరగసాగాడు.141.అలా తిరుగుతూ తిరుగుతూ దైవ వశాత్తు పూజారి ఇంటికి వచ్చి చేరాడు. అల్లామియా యొక్క అఘటిత లీల. అతడు అందఱికీ ప్రీతి పాత్రుడయ్యాడు. 142.అలా ఉంటూ వారి అభిమానాన్ని సంపాదించాడు. అతనికి గౌరిని ఇవ్వాలని పూజారికి అనిపించింది. ఆ ఇద్దరి గోత్రాలు నాడి,గణ,యోగాలు కలిశాయి. పూజారికి ఆనందం కలిగింది.143.ఒకరోజు వీరభద్రుని వెంటబెట్టుకుని పూజారి వచ్చాడు. అప్పుడు ఆ ఇద్దరినీ చూడగానే అకస్మాత్తుగా నాకో ఆలోచన స్ఫురించింది. 144. ఆ ఆలోచన మాటలుగా అయ్యాయి. ప్రస్తుతం వివాహ ముహూర్తం ఉంటే ఇతనికి గౌరిని ఇచ్చి నీ బాధ్యతను తీర్చుకో అని చెప్పాను.145.తన భార్య అనుమతిని తీసుకుని, పూజారి వీరభద్రుని వరునిగా నిశ్చయించాడు. వివాహ ముహూర్తాన్ని చూచి యథోచితంగా వివాహాన్ని జరిపించాడు.146. ఆ కార్యక్రమమంతా ముగిసిన తరువాత,ఆ కుటుంబం సంసారంలో కృతార్థులవటానికి ఆశీస్సుల కోసం నా దర్శనానికి వచ్చారు.147.నేను వారిని సంతోషంగా ఆశీర్వదించాను. సుఖంగా భోజనం లభిస్తుండగా సుఖమయ జీవనంతో వీరభద్రుడు ఆనందంగా ఉన్నాడు. 148.అతడు కూడా నన్ను అభిమానించసాగాడు. అతని సంసారం త్వరలోనే బాగా స్థిరపడింది. కాని డబ్బు కొరతకు చికాకు పడని భాగ్యవంతుడుంటాడా?149.ఈ డబ్బువలన చాలా చిక్కు. గొప్పగొప్పవారికి కూడా దీనివలన కష్టం. వీరభద్రునికి కూడా అప్పుడప్పుడు డబ్బులోటు ఎదురయింది.ద్రవ్యం యొక్క లీల ఇలాగే ఉంటుంది. 150. వీరభద్రుడు నాతో,'బాబా! ఈ వివాహబంధం చాలా కష్టమైనది. డబ్బులు లేక నేను

ఏసుగెత్తి పొతున్నాను. ఈ ప్రపంచంలో సుఖంగా బ్రతకడానికి మీరు ఏదైనా ఉపాయం చెప్పండి.151. మీ పాదాలకు సాష్టాంగవందనం చేస్తాను. ఇక ఈ మోసం మంచిదికాదు. ఈ పెళ్లికి మీరే కారణం కనుక నా కష్టాలను తీర్చండి'. 152.నేను కూడా అతనికి బాగా బోధించాను. ప్రేమతో ఆశీర్వదించాను. 'అల్లామాలిక్' వారికి అంతా తెలుసు. వారే కష్టాలను తొలగించాలి అని.153. వీరభద్రుని మనసును తెలుసుకుని అతని కోరికను తీర్చాలని 'నీవు ఏ మాత్రం చింతించకు అని అతనికి ధైర్యం చెప్పాను.154. త్వరలో నీ భాగ్యం పండుతుంది. అనవసరంగా తపన పడకు. మంచికాలం వస్తుంది. ద్రవ్యం నీ చేతి నిండా ఉంటుంది' అని చెప్పాను.155. అతడు 'డబ్బు నన్ను హేళన చేస్తూ ఉంది. భార్య అవి ఇవి అడగటం మానదు. ఈ అవమానం ఇక చాలు చాలు. వివాహపు పెద్దరికం నాకు వద్దు' అని అన్నాడు.156. ఆ తరువాత వింత జరిగింది. గౌరి యొక్క గ్రహబలం చూడండి. దైవలీల అర్థం కాదు. తాకట్టు పెట్టిన బంజరు భూమిధర పెరిగింది.157. దానిని ఖరీదు చేసేవాడు వచ్చి లక్షరూపాయలను ఇవ్వటానికి సిద్ధపడ్డాడు. సగం డబ్బు అప్పుడే ఇచ్చేశారు. మిగతా డబ్బును వాయిదా పద్ధతిలో ఇచ్చేలా నిశ్చయమైంది. 158. ప్రతి సంవత్సరం వడ్డీతో సహా రెండువేలు. అలా ఇరవై యైదు సంవత్సరాలలో గౌరి యొక్క మిగతా డబ్బునంతా ఇచ్చేలా ఒప్పుకున్నారు.159. ఆ నిర్ణయం అందరికీ నచ్చింది కాని ధర్మకర్త చెన్నబసప్ప లేచి, శంకరునికి అర్పించిన ధనానికి మొదటి యజమాని ధర్మకర్త అయిన తను.160. కనుక ప్రతిసంవత్సరం లభించే వడ్డీలో సగం తనకు వాటాగా ఇవ్వాలి. లేదా తనకు ఇది సమ్మతం కాదు అని చెప్పాడు.161. అతనికి అసలు ఏమీ ఇవ్వకూడదని వీరభద్రప్ప, అందుకు అసలు ఒప్పుకోనని చెన్నబసప్ప. అలా ఇద్దరూ వాదులాడుకున్నారు. ఇద్దరూ నా వద్దకు వచ్చారు. 162. ఆ భూమికి పూర్తి యజమాని శంకరుడు. భూమి ఎవరికీ ఏ విధంగానూ పనికి రాదు. కనుక అనవసరంగా

లోభంతో ఆశపడకండి అని ఇద్దఱికీ చెప్పాను.163.ఇది శంకరునికి అర్పించిన భూమి యొక్క ధనం. ఈ ధనాన్ని గౌరి తప్ప ఎవరు ఆశించినా వారి నోటమట్టే.164.దేవుని అనుమతి లేకుండా ఈ ధనాన్ని ఎవరైనా ముట్టుకుంటే భగవంతుని ఆగ్రహానికి గురి అవుతారు.ఎందుకంటే ఇది మొత్తం దేవుని ఆస్తి కనుక.165.భూమిపైన పూజారికి అధికారం ఉంది. కనుక అతని వారసురాలిగా గౌరికి హక్కు ఉంది. అంతేకాని ఇతరులకు ఏం హక్కు ఉంటుంది? అది గౌరి యొక్క స్వంత ధనం.166.అది గౌరి యొక్క ధనం కనుక ఆమె అనుమతిని తీసుకుని ప్రవర్తిస్తే మీ బాధ్యతను నిర్వహించిన వారవుతారు అని నేను ఆ ఇద్దరికీ చెప్పాను.167.ఆమె ఇష్టానికి విరుద్ధంగా చేస్తే దేవుడు సమ్మతించడు. స్వతంత్రంగా వ్యవహరించటానికి వీరభద్రప్పకు అసలు అధికారం లేదు. 168.అని నేను నా అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియ చేయగా, వీరభద్రునికి నాపై కోపం వచ్చి తిట్ల వర్షాన్ని కురిపించాడు. 169.నా భార్యను యజమానురాలిగా చేసి ధనమంతా కాజేసి నీ పని సాధించుకోవాలనుకుంటున్నావు కదూ బాబా! అని అన్నాడు.170.అతని మాటలను విని నేను అక్కడే స్తబ్ధుణ్ణయ్యాను. అల్లామియా లీల అగాధం.వ్యర్థంగా ఎందుకు దుఃఖ పడటం.171.వీరభద్రప్ప నన్ను అలా తిట్టి ఇంట్లో భార్యపై కూడా విరుచుకుపడ్డాడు.ఆమె మధ్యాహ్నం నా వద్దకు వచ్చి మొఱ పెట్టుకుంది.172.'బాబా! ఎవరివో మాటలను పట్టించుకుని నన్ను మీ కృపకు దూరం చేయకండి.మీ ప్రేమ నాపై ఎప్పుడూ ఉండాలి అని నేను యాచిస్తున్నాను.173.ఆమె మాటలను విని,నేను ఆమెతో 'నిన్ను దయతో సప్త సముద్రాలు దాటిస్తాను. నీవేం దుఃఖ పడకు' అని ఆమెకు పూర్తి ధైర్యాన్నిచ్చాను.174.ఆ రాత్రే గౌరి నిద్రలో ఉండగా ఆమెకు దృష్టాంతం కలిగింది. శంకరుడు స్వప్నంలో కనిపించి ఆమెతో ఏం చెప్పాడో వినండి .175.'చూడు! ఈ ధనమంతా నీదే.ఎవరికీ ఏమీ

ఖవ్వవద్దు. దాన్ని ఎలా నిర్వహించాలో ఆ ఏర్పాటును చెప్పుతాను. అట్లే చేయి.176.దేవాలయం కొసం చెన్నబసప్ప చెప్పిన విధంగా ధనాన్ని ఉపయోగించు.నాకు అతనిపై విశ్వాసముంది.నీవు ఈ నియమాన్ని పాటించు.177.ఇతర కార్యాలకు డబ్బు ఖర్చు పెట్టవలసి వచ్చినప్పుడు ఆ ధనం అలా దుర్వినియోగం కాకూడదు. కనుక మసీదులోని బాబాను సంప్రదించకుండా ఎటువంటి ఏర్పాటును చేయరాదు.178.ఆ స్వప్న దృష్టాంతాన్నంతా గౌరి నాతో చెప్పింది. నేను కూడా ఆమెకు ఆ దృష్టాంతంలో చెప్పినట్లుగా పాటించమని ఉచితమైన సలహా ఇచ్చాను. 179. అసలు డబ్బునీది. నీవే తీసుకో. చెన్న బసప్పకు వడ్డీలో సగం భాగం ఇవ్వు. ఎప్పుడూ ఇలాగే చేస్తూ ఉండు. ఖందులో వీరభద్రునికి ఏ సంబంధమూ లేదు.180.మేము అలా మాట్లాడుకుంటూ ఉండగా, ఆ ఇద్దలూ పోట్లాడు కుంటూ వచ్చారు. వారిని శాంత పరచటానికి నేను చాలా ప్రయత్నించాను.181.గౌరికి కలిగిన శంకరుని వృష్టాంతాన్నంతా వారికి చెప్పాను. అది విని వీరభద్రుడు ఉన్మత్తుడయ్యాడు.182.తిట్ల వర్షాన్ని కురిపించాడు. తనకు కష్టం వచ్చినట్లు చెన్నబసప్పను అమర్యాద కరమైన మాటలను అన్నాడు. దాంతో అతడు గాబరాపడి పోయాడు.183.వీరభద్రుడు అట్లే పిచ్చివానిలా తిడుతూ నీవు ఎక్కడ దొరికినా చంపేస్తాను అని నోటితో గట్టిగా తిట్టాడు.184.చెన్నబసప్పను చూచి వీరభద్రప్ప రెచ్చిపోయి నిన్ను ముక్కలు చేస్తాను. నిన్ను మొత్తం మింగేస్తాను.185.చెన్నబసప్ప భయపడిపోయి నా పాదాలను గట్టిగా పట్టుకుని, 'ఈ కష్టం నుండి నన్ను విడిపించండి' అని వేడుకున్నాడు. నేను అతనికి అభయమిచ్చాను. 186.దీనుడైన చెన్నబసప్పకు ధైర్యాన్నిచ్చి నేను నిన్ను వీరభద్రుని చేతిలో చావనివ్వను అని చెప్పాను.187. అటుతరువాత వాతం ప్రకోపించి వీరభద్రుడు మరణించి సర్పమై జన్మించి వేరే శరీరాన్ని పొందాడు.188.చెన్నబసప్పకు దిగులు పట్టుకుంది. ఆ దిగులుతోనే అతడు చనిపోయి కప్ప యోనిలో

పుట్టాడు.ఇది అతని చరిత్ర.189. పూర్వజన్మలోని శత్రుత్వం కారణంగా వీరభద్రుడు పాముగా జన్మించి కప్పగా జన్మించిన బసప్పవెంటబడి, చివరకు అతన్ని పట్టుకున్నాడు.190.పాముగా పుట్టిన వీరభద్రుని నోటపడి కప్ప రూపంలో ఉన్న బసప్ప దీనంగా అరుస్తుంటే ఆ దీనాలాపాన్ని విని నా మనసు కరిగిపోయింది.191.పూర్వం నేను ఇచ్చిన మాట గుర్తుకు వచ్చి, పాము నోటి నుండి చెన్నబసప్పను విడిపించి,నా మాటను నిలబెట్టుకున్నాను.192.అల్లా తన భక్తుల కోసం వారి కష్ట సమయాలలో పరుగెత్తుకుని వస్తాడు.అతడే నన్ను ఇక్కడకు పంపి,భక్తుని రక్షించాడు.193.ఇప్పుడు ఇది ప్రత్యక్షంగా అనుభవమైంది. వీరభద్రుని తరిమి వేసి చెన్నబసప్పను కష్టం నుండి రక్షించాడు. ఇదంతా దేవుని లీల.194.సరే. ఇప్పుడు చిలుం నింపు. త్రాగేసి నా చోటికి వెళ్లిపోతాను. నీవుకూడా మీ ఊరికి వెళ్లు.నన్ను గుర్తుంచుకో.195.అని చెప్పి చిలుం త్రాగాను.సత్సంగం యొక్క సుఖం లభించింది.ఆ విధంగా తిరిగి తిరిగి మెనుకకు మరలివచ్చాను. మనసులో అత్యంత ఆనందాన్ని పొందాను' అని చెప్పారు.196. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్‌పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో శ్రీసాయిముఖశ్రుత కథాకథనమను నలుబది ఏడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 48 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః;
శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఈ అధ్యాయాన్ని ఆరంభిస్తుండగా, శ్రవణంలో అత్యంత శ్రద్ధ ఉన్న శ్రోతలు, శ్రీసాయి గురువా లేక సద్గురువా అని ప్రశ్నించారు.1.వారిని సంతృప్తి పరచటానికి సద్గురువు యొక్క లక్షణాలను సంక్షిప్తంగా చెప్తుతాను. దానితో సాయి సమర్థునిలో ఉన్న సద్గురువు యొక్క గుణాలను గుర్తించ వచ్చు.2. వేదాలను అధ్యయనం చేసే వారిని,షట్‌శాస్త్రాల జ్ఞానమున్న వారిని, వేదాంత నిరూపణను చేసేవారిని జ్ఞానులు, సద్గురువులని అనరు.3. ప్రాణవాయువును బిగబట్టి శ్వాసను నిగ్రహించి లేదా తప్తముద్రలను ధరించే వారిని, బ్రహ్మను వ్యాఖ్యానించి శ్రోతల మనసులను రంజింపచేసే వారిని జ్ఞానులు సద్గురువులు అని అనరు.4.శాస్త్రోక్తంగా శిష్యులకు మంత్రాలను ఉపదేశించి వానిని జపించమని ఆజ్ఞాపిస్తారు.కాని అవి ఎప్పుడు సిద్ధిస్తాయి అన్న నమ్మకం ఎవరికీ ఉండదు.5.పరమాత్మతత్వాన్ని అత్యంత రసవత్తరంగా చక్కటి మాటలతో ఆకర్షణీయంగా చెప్పినా స్వానుభవం లేనట్టివారి జ్ఞానం మాటల గారడి,కేవలం శుష్కమైనది.6.వేదాంత నిరూపణను శ్రద్ధగా విన్న క్షణంలో ఇహపర సుఖ భోగాల యందు విరక్తి కలుగుతుంది.కాని అనుభవ జ్ఞానం కలగదు. పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందినవారే ఆ అనుభవాన్ని తెలియచేయగలరు.7.సంపూర్ణమైన శాస్త్రజ్ఞానం ఉండి,అపరోక్ష జ్ఞానాన్ని ప్రసాదించగల సంపూర్ణ అనుభవమున్న వారికే శిష్యులకు బోధించే అధికారం ఉంది. అట్టి వారినే సద్గురువులు అని చెప్పాలి.8.ఆత్మానుభవం

లేనివారు శిష్యులకు ఏమివ్వగలరు? అపరోక్షానుభూతి అసలు లేనివారిని సద్గురువులని ఎప్పుడూ అనరాదు.9.శిష్యులతో సేవ చేయించుకోవాలని కలలోనైనా తలచనివారు, తమ శరీరాన్ని శిష్యుల కొఱకు వినియోగించాలని కోరుకునేవారు సద్గురువులని తెలుసుకోవాలి.10.శిష్యుడు ఎందుకూ పనికిరాని వాడు, గురువు శ్రేష్ములలో శ్రేష్ముడు అన్న అహంభావం లేకుండా మంచిని కలిగించేవారు సద్గురువు.11.శిష్యుడు పూర్ణబ్రహ్మ స్వరూపమని భావించి అతనిని పుత్రప్రేమతో చూస్తూ తన పోషణకై అతని వద్ద నుండి ఏదీ ఆశించని సద్గురువు జగత్తులో పరమ శ్రేష్ముడు.12.పరమ శాంతికి స్థానమై విద్యా దర్పం లేకుండా చిన్నవారిని పెద్దవారిని సమానంగా చూచే స్థలం సద్గురువు స్థానమని గ్రహించాలి.13.ఇటువంటి సర్వ సాధారణమైన సద్గురువు యొక్క లక్షణాలను సంకలనం చేసి నేను శ్రోతలకు సంక్షిప్తంగా మనవి చేశాను.14.సాయిబాబా సందర్శనంతో సంతృప్తులైన భాగ్యవంతులకు సద్గురువుల లక్షణాలను నేను ఇంతకంటే ఎక్కువగా ఏం వర్ణించగలను?15.అనేక జన్మల అతిశయ పుణ్యసంచయం కారణంగానే మనకు సాయి సద్గురువు చరణాలు లభించాయి.16.సాయిబాబా చిన్న వయసునుండీ దేనినీ తీసుకునే వారు కాదు. వారికి ఇల్లు వాకిలి వంటి ఏ ఆధారమూ లేదు. చిలుం పొగాకు మాత్రమే వారి వద్ద ఉండేవి. వారి మనో నిగ్రహం గొప్పది.17. పదునెనిమిది సం॥ ల వయసు నుండి వారు మనసును సంపూర్ణంగా జయించి, ఎప్పుడూ నిర్భయంగా ఏకాంతంగా, ఆత్మస్వరూపంలో లీనమై ఉండేవారు.18.భక్తుల యొక్క నిర్మలమైన ప్రేమను గని తాను భక్త పరాధీనుణ్ణి అన్న విషయం భక్తులకు బాగా తెలియ చేయటానికి,వారు భక్తి ప్రేమలున్న చోట ఉంటారు.19.జయ పరబ్రహ్మ సనాతనా! జయ దీనోద్ధారా! ప్రసన్న వదనా! జయ చైతన్య ఘనా! భక్తాధీనా! భక్తులకు తమ దర్శనాన్ని ప్రసాదించండి. 20.జయజయ ద్వంద్వాతీతా! జయజయ అవ్యక్త వ్యక్తా! సర్వసాక్షీ!

సర్వాతతా! భక్త లనివారు నిమ్ము తెలుసుక లేరు. 21. జయజయ భవసంతాపహరణా! జయజయ భవగజ విదారణా! జయజయ ఆశ్రితప్రేమపూర్ణా! కష్టాలను తొలగించే సద్గురు దేవా! 22. మీరు అవ్యక్తంలో లీనమై నిరాకారులయ్యారు. శరీరాన్ని త్యజించిన తరువాత కూడా భక్తుల శ్రేయస్సు కొఅకు చేసే మీ కార్యాలు ఆగిపోలేదు. 23. మీరు శరీరంతో ఉన్నప్పుడు చేసిన మీ లీలల అనుభవాలను మీ యందు విశ్వాసం గల భక్తులు, మీరు అవ్యక్తంలో కలిసిపోయిన తరువాత ఈ నాటికి కూడా పొందుతున్నారు. 24. నా వంటి పామరుణ్ణి నిమిత్త మాత్రునిగా చేసి, అజ్ఞానాంధకారాన్ని తొలగించి భక్తులను తరింప చేయటానికి సమర్థవంతమైన తమ చరిత్ర తరణిని తయారు చేయించారు. 25. పరమేశ్వరుని అస్తిత్వమందు విశ్వాసం, మరియు పరమేశ్వరుని యందు భక్తి శ్రద్ధలు ఇవే భక్తుని హృదయంలో ప్రమిదలు. వానిలో ప్రేమయనే చమురు పోసి వత్తిని వెలిగిస్తే జ్ఞాన జ్యోతి ప్రకటమౌతుంది. 26. ప్రేమ లేని జ్ఞానం శుష్కం. దాని వలన ఎవరికైనా ఏం ప్రయోజనం? ప్రేమ లేనిదే శాంతి ఉండదు. ప్రేమ ఒకే చోట అవిచ్ఛిన్నంగా ఉండాలి. 27. ప్రేమ యొక్క మహిమను నేనెంతని వర్ణించను? ప్రేమ ముందు అన్నీ తుచ్ఛమే. గాఢమైన ప్రేమ లేకపోతే శ్రవణం పఠనం నిష్ఫలం. 28. ప్రేమలో భక్తి ఉంటుంది. విరక్తి శాంతి కూడా అక్కడే ఉంటాయి. వాని వెనుకే ముక్తి తన సంపత్తి సహితంగా తిష్ఠ వేసుకుని ఉంటుంది. 29. భావం లేకుండా ప్రేమ ఉత్పన్నం కాదు. భావమున్న చోట దేవుడున్నాడని తెలుసుకోండి. భావమున్న చోట ప్రేమ పూర్ణంగా ఉంటుంది. భవాన్ని తరించటానికి భావమే ప్రధానం. 30. గంగోదక సమాన పవిత్రమూ, పరమ మధురమైనది శ్రీసాయి చరిత్ర. దీనిని సాయియే పద్యాలతో అలంకరింపచేశారు. హేమాడు నిమిత్తమాత్రుడు. 31. ఈ సాయిసచ్చరితను శ్రవణం చేసే శ్రోతలు, వక్త ఎప్పుడూ పవిత్రులు. వారి పాప పుణ్యాలు నశించిపోయి వారికి ముక్తి లభిస్తుంది. 32. దీనిని వినే చెవులు భాగ్యవంతములు.

వక్త యొక్క నోరు భాగ్యవంతము. భక్తులకు అతి పవిత్రమైన ఈ శ్రీసాయి సచ్చరిత ధన్యం.33.ఈ చరితాన్ని చిత్తశుద్ధితో భక్తిభావంతో ఆలకించిన వారి సకల కోరికలూ ఎల్లప్పుడూ తీరుతాయి.34.పరమ శ్రద్ధతో భక్తిగా ఈ సచ్చరితాన్ని వింటే వెంటనే అనాయాసంగా సాయి చరణాలయందు భక్తి లభిస్తుంది.35.భక్తి భావంతో సాయి చరణాలను సేవిస్తూ వారిని నిరతం స్మరిస్తూ ఉంటే ఇంద్రియాలు యథేచ్ఛగా విహరించవు. అవలీలగా భవాన్ని దాటడం నిశ్చయం.36.చాతక పక్షులవంటి భక్తులకు ఇది జీవనం.ఇటువంటి ఈ సాయి సచ్చరితను శ్రవణం తరువాత మననం కూడా చేసి శ్రోతలు శ్రీసాయి అనుగ్రహాన్ని పొందండి.37.సర్వావస్థలలోనూ సావధానంగా శ్రవణం చేసే శ్రోతల కర్మ బంధనాలు విడిపోతాయి.వారు సహజంగా భవాన్ని తరిస్తారు.38.కథ ఎప్పుడు ఆరంభమౌతుంది అని శ్రోతలు తమలో అనుకుంటున్నారు.కనుక ప్రస్తావనను ఆరంభించి వారి ఆతురతను తొలగిస్తాను. 39.గతాధ్యాయంలో శత్రుత్వం హత్య ఋణం తీర్చుకోవటానికి, కర్మను అనుభవించటానికి పునర్జన్మ కలుగుతుందని చెప్పబడింది.40.మానవులకు పూర్వజన్మల గురించి గుర్తుండదు.కాని సత్పురుషులు దేనినీ మరిచిపోరు.తమ భక్తులు ఎక్కడ జన్మించినా వారిని కష్టాల నుండి రక్షిస్తారు.41.ఇప్పుడు అటువంటిదే మరొక కథ.నుంచుని ఉన్నా కూర్చుని ఉన్నా, ఏదైనా ఇచ్చేటప్పుడు, లేదా పుచ్చుకునేటప్పుడు సత్పురుషుని చరణాలయందు విశ్వాసముంచితే భక్తులు సఫలీకృతులౌతారు.42.కార్యారంభ మందు ముందుగా హరిని మరియు గురుని చరణాలను స్మరించి శ్రద్ధగా పని చేస్తే చాలు. ఆ పనిని సత్పురుషులు చేయిస్తూ భక్తుల చింతలను తొలగిస్తారు.43.నేను పనిని మాత్రమే చేసేవాణ్ణి. ఫలితాన్ని ఇచ్చేవారు హరి మరియు గురువు అన్న దృఢ విశ్వాసమున్న వారి లక్ష్యం నెరవేరుతుంది.44.సత్పురుషులు ముందు ఉగ్రంగా కఠోరంగా కనిపిస్తారు. కాని వారిలో ఏ ప్రత్యుపకారాన్ని ఆశించని

ప్రితి ఉంటుంది. కాస్త ధైర్యంగా ఉంటే చాలు. చివరకు వారు శుభాలను కలుగ చేస్తారు. 45. సత్సంగమనే నీడ పడితే చాలు. శాపతాపాలు మమకారాలు అక్కడికక్కడే మాయమైపోతాయి. అందువలన సత్పురుషుల చరణాలను ఆశ్రయించండి. 46. నిరహంభావంతో మరియు సవినయంగా సత్పురుషులకు శరణాగతులై తమ మనసులోని కోరికను వేడుకుంటే వారు చిత్త శాంతిని ప్రసాదిస్తారు. 47. మిడిమిడి జ్ఞానంతోను గర్వంతోను సత్పురుషుల వచనాలను సంశయించేవారికి మొదటికే హాని కలుగుతుంది. కాని వారి యందు విశ్వాసం ఉంచిన వారికి శుభం కలుగుతుంది. 48. పరిశుద్ధ మనసుతోనో లేక కపట బుద్ధితోనైనా సరే అసలైన సత్పురుషుల చరణాలను ఆశ్రయిస్తే ప్రపంచ బంధనాలనుండి విముక్తులౌతారు. వారి మహిమ అగాధం. 49. ఈ విషయంలో జ్ఞానోపదేశాన్ని చేసే కథను సావధానంగా శ్రవణం చేస్తే శ్రోతలకు ఆనందం కలుగుతుంది. అట్లే వక్తకు కూడా ఉత్సాహం పెరుగుతుంది. 50. అక్కల్‌కోట నివాసి సపట్‌ణేకరు అను పేరుగల వకీలు అనుభవాన్ని వింటే మనసు ప్రసన్నమౌతుంది. 51. అతడు వకీలు పరీక్షకు అహర్నిశలూ అధ్యయనం చేస్తుండగా శేవడె అను ఒక విద్యార్థితో కలిసి తమ పరీక్ష విషయాలను ఇద్దఱూ ముచ్చటించుకున్నారు. 52. వారితో చదివే ఇతర విద్యార్థులు కూడా వచ్చి గదిలో వారితో కలిసి కూర్చున్నారు. ఎవరెవరు ఎంత బాగా పరీక్షకు చదివారు అని ఒకరిని ఒకరు ప్రశ్నించుకుంటూ పరీక్షించుకోసాగారు. 53. ఎవరు సరిగ్గా జవాబు చెప్పగలరు, ఎవరు చెప్పలేరు అని తమ సంశయాలను తీర్చుకోవటానికి తమ తమ మనో నిబ్బరాలను పరీక్షించుకోసాగారు. 54. ప్రశ్నలకు శేవడే సరిగ్గా సమాధానమివ్వలేదు. అప్పుడు విద్యార్థులందరూ, ఇతడు సరిగ్గా చదవలేదు, ఇక పరీక్ష ఎలా ఉత్తీర్ణుడౌతాడు అని అన్నారు. 55. అలా వారు హేళన చేశారు గాని తాను పూర్తిగా అధ్యయనం చేసినా చేయకున్నా తప్పక ఉత్తీర్ణుడ నౌతానని శెవడెకు పూర్తి

మ్మకం.56.నేను బాగా చదవకున్నా నన్ను పాసు చేయించడానికి మా సాయిబాబా ఉన్నారు.నాకెందుకు దిగులు? 57.అని అతడు అన్న మాటలు సపట్‌ణేకరుకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. శేవడేను ఒక ప్రక్కకు పిలిచి. 58.'ఇంత గొప్పగా వర్ణించిన ఈ సాయిబాబా ఎవరు? నీకు ఇంతటి విశ్వాసంగల ఆ బాబాఎక్కడ ఉంటారు? అని అడిగాడు. 59.ప్రత్యుత్తరంగా శేవడే సాయిబాబా యొక్క మహిమను, వారిపై అతనికి ఉన్న దృఢవిశ్వాసాన్ని గురించి ఎంతో భక్తిగా చెప్పాడు.60.'సుప్రసిద్ధమైన అహమ్మదు నగర్ జిల్లాలోశిరిడీ అనే గ్రామంలోని మసీదులో ఒక ఫకీరు ఉన్నారు.వారు బాగా పేరు పొందిన సత్పురుషులు.61.సాధువులు అక్కడక్కడా ఉంటారు. కాని వారిని కలుసుకునే యోగం, ఆ భాగ్యం అమోఘమైన పుణ్యముంటే తప్ప మన ప్రయత్నంతో లభించదు.62.నాకు వారి యందు సంపూర్ణ విశ్వాసం. వారు తలచుకున్నదే జరుగుతుంది.వారు నోటితో ఏది పలికితే అది అవుతుంది. వారి మాట కల్పాంతంలోనైనా పొల్లుపోదు.63.ఈ సంవత్సరం ఎంత ప్రయాస పడినా నేను పరీక్ష పాసుకాను. వచ్చే సంవత్సరం ఏ శ్రమా లేకుండా ఉత్తీర్ణుడనౌతాను. ఇది ముమ్మాటికీ నిజం. 64.నాకు వారి హామీ ఉంది. వారి యందు నాకు పూర్తి భరోసా.వారి మాటలు మరోలా జరగవు అని గట్టి నమ్మకంతో ఉన్నాను.65.ఇందులో ఆశ్చర్యం ఏం లేదు. నేను దీని తర్వాత పరీక్ష కూడా పాసు అవుతాను.' అని చెప్పగా అతని మాటలు సపట్‌ణేకరుకు హాస్యాస్పదంగాను, ఒట్టి పొల్లు మాటలుగాను అనిపించాయి.66.అనుమానాలతో నిండి ఉన్న అతని మనసుకు ఆ మాటలు ఎలా నచ్చుతాయి? శేవడే అక్కడి నుండి వెళ్లిపోయాడు. తరువాత ఏం జరిగిందో వినండి.67.కొంతకాలం తరువాత శేవడే మాటలు వాస్తవమని సపట్‌ణేకరుకు అనుభవమైంది. శేవడే రెండు పరీక్షలూ పాసు కావటం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.68.పదేళ్ల తరువాత సపట్‌ణేకరును అకస్మాత్తుగా దౌర్భాగ్యం ఆవరించింది.దాంతో

దుఃఖంతో ఉదాసీనుడయ్యాడు.69. క్రీ.శ 1913 వ సం॥లో అతని ఏకైక పుత్రుడు గొంతులో జబ్బు చేసి మరణించాడు. దాంతో అతనికి ప్రపంచమందు బాగా విరక్తి కలిగింది.70.పండరీపురం, గాణగాపురం మొదలైన తీర్థక్షేత్రాలన్నీ దర్శించాడు కాని అతని మనసుకు సుఖశాంతులు లభించలేదు. తరువాత వేదాంతాన్ని పఠించాడు. 71.అలా కొంతకాలం గడిచాక మనసుకు ఎలా శాంతి కలుగుతుంది అని ఎదురు చూస్తుండగా అతనికి శేవడే మాటలు గుర్తుకు వచ్చాయి.72.శేవడే యొక్క గట్టి పట్టుదల, సాయి చరణాల యందు అతనికి గల దృఢ విశ్వాసం స్మరణకు వచ్చి తాను కూడా శ్రీవారి దర్శనానికి వెళ్లాలని అనుకున్నాడు.73. క్రీ.శ. 1913వ సం॥లో సాయిని సందర్శించుకునే ఉద్దేశంతో తన తమ్ముని తోడు తీసుకుని శిరిడీకి బయలు దేరాడు.74.అతనికి శేవడే గుర్తుకు రావటం కేవలం మిష. అతనిని సాయియే తమ పాదాభివందనానికి పిలిపించుకున్నారు. దీనిని శ్రద్ధగా వినండి.75.సపట్‌ణేకరు తన తమ్ముడైన పండితరావును వెంటబెట్టుకుని కుటుంబ సమేతంగా సాయి సత్పురుషుని దర్శనానికి శిరిడీ బయలుదేరాడు.76.అక్కడికి చేరుకోగానే ఇద్దఱూ శ్రీవారి దర్శనానికి వెళ్లారు. దూరం నుండి బాబాను దర్శించగానే అతని మనసుకు చాలా ఆనందం కలిగింది.77.దూరం నుండే వారి కళ్లు కలుసుకోగానే వెంటనే వారి సమీపానికి వెళ్లి ఇద్దఱూ రెండు చేతులూ జోడించుకుని బాబా ఎదుట నిలుచున్నారు.78.ఇద్దఱూ కూడా అత్యంత వినయంగా బాబాకు సాష్టాంగ నమస్కారం చేసి నిర్మల భక్తితో సాయి చరణాలకు ప్రేమగా శ్రీఫలాన్ని సమర్పించారు.79. సపట్‌ణేకరు సాయి సమర్థుని చరణాలయందు శ్రీఫలాన్ని అర్పించగా బాబా 'చల్ హట్' అని ధిక్కరిస్తూ అతనిని పోపొమ్మని అన్నారు.80.సపట్‌ణేకరు బాధ పడ్డాడు. బాబా ఎందుకు కోపగించారు బాబాతో బాగా పరిచయమున్న వారి ద్వారా బాబా ఉద్దేశాన్ని తెలుసుకోవాలని తలచాడు.81.బాబా దర్శనంతో ఆనందించవలసిన వాడు బాబా

మాటకు అత్యంత దుఃఖితుడై వెనుకకు జరిగి అధోవదనుడై చింతిస్తూ కూర్చున్నాడు.82.ఇప్పుడు ఎవరి వద్దకు వెళ్లాలి? బాబా మాటలలోని వారి ఉద్దేశాన్ని ఏ భక్తుని అడగాలి అని అనుకున్నాడు.83.అతని బాధను గమనించి ఒకరు అతనిని సమాధాన పరచటానికి అతనికి బాలాశింపి పేరు చెప్పారు. సపట్‌ణేకరు బాలా అను దర్జీ ఉన్న చోటును వెతుక్కున్నాడు.84.అతనితో సపట్‌ణేకరు తన వృత్తాంతాన్నంతా చెప్పాడు.బాబా చాలా కోపంగా నన్ను తరిమి వేశారు.85.నీవైనా నా వెంట వచ్చి బాబా దర్శనాన్ని ప్రశాంతంగా చేసుకునేలా,వారు మాపై కోపగించకుండా కృపాదృష్టితో చూచేలా చేయి అని.86.అందుకు బాలా సరేనని ఒప్పుకోగా సపట్‌ణేకరుకు నిశ్చింత కలిగింది.బాబా పటాన్ని కొని తెచ్చి బాబా దర్శనానికి వెళ్లాడు.87.బాలా అతని వెంట వెళ్లాడు.బాలా బాబా పటాన్ని అందుకుని బాబా చేతికి ఇచ్చి వారిని ప్రార్థించాడు.88.'దేవా! ఇది ఎవరి పటం? అని అడిగాడు.దానిని చూచి బాబా సపట్‌ణేకరు వైపు చేయి చూపిస్తూ 'ఈ ఫోటో ఇతని స్నేహితునిది'89.అని చెప్పి నవ్వారు.భక్తులు కూడా నవ్వారు.'బాబా! దీని అర్థం ఏమిటి?' అని బాలా బాబాను ప్రశ్నించాడు.90. సపట్‌ణేకరుతో త్వరగా వెళ్లి దర్శనం చేసుకో అని చెప్పాడు. అట్లే బాబాకు నమస్కారం చేయగా మరలా 'చల్ హట్' 'పో' వెళ్లిపో' అన్న మాటలు వినిపించాయి.91.మునపటి వలె వెళ్లిపో అని మరల అదే మాట, ఇప్పుడు ఏదారి అని సపట్‌ణేకరుకు సమస్య.92.తరువాత ఇద్దఱు సోదరులూ చేతులు జోడించుకుని బాబా ఎదుట నిలబడి ఉండగా, చివరకు బాబా 'వెంటనే ఇక్కడి నుండి బయలుదేరండి' అని వారికి ఆజ్ఞాపించారు.93.'సాయి సమర్థా! మీ ఆజ్ఞను ఎవరూ జవదాటలేరు.పామరులం మేమెంతటి వారం? ఇప్పుడే ఈ క్షణమే వెళ్లిపోతాం.94.మీరు మహా ఉదారులని విని మీ దర్శనానికి వస్తే, 'చల్‌హట్' అని మమ్మల్ని సత్కరించారు.ఇదేం చమత్కారమో ఏం అర్థం కాలేదు.95.అయినా

మి కృపాదృష్టిని మాపై ఉంచండి. త్వరలో మరల మీదర్శనం కలిగేలా మమ్ము ఆశీర్వదించండి' అని వారి అభయాన్ని వేడుకున్నారు.96. బాబా మనసును తెలుసుకునే జ్ఞానులు ఎవరుంటారు? సపట్‌ణేకరు బాబా ఆజ్ఞను శిరసావహించి స్వస్థలానికి తిరిగి వెళ్లిపోయాడు.97. అతనికి బాబా ప్రథమ దర్శనం అలా జరిగింది. అందువలన ఆ సోదరులిద్దఱూ చాలా ఆందోళన చెందారు. ఇక ఏం ఆలస్యం చేయకుండా తమ ఊరికి వెళ్లిపోయారు.98. ఆ తరువాత మరో సంవత్సరం గడిచి పోయినా సపట్‌ణేకరు మనసు స్థిరపడలేదు. మరల గాణుగాపురం వెళ్లాడు. మనసులో మరింత కలవరం చెలరేగింది.99. తరువాత అతడు విశ్రాంతి కోసం మాడేగాంకు వెళ్ళాడు. చివరకు కాశీ క్షేత్రానికి వెళ్లాలని తలచాడు.100. కాశీకి బయలు దేరటానికి ఇంకా రెండు రోజులు ఉండగా అతని భార్యకు దృష్టాంతం కలిగి కాశీ ప్రయాణం ఆగిపోయింది.101. చమత్కారమైన ఆ దృష్టాంతం ఎటువంటి విశేషమైనదో చెప్పుతాను. సాయి యొక్క ఆ లీలను వినటానికి శ్రోతలు సిద్ధమవండి.102. ఆ స్త్రీ పక్క మీద నిద్రలో ఉండగా కళ్ల ఎదుట స్వప్నం. ఆమె కుండను తీసుకుని లక్ష్మీబాయి బావికి వెళ్లింది.103. అక్కడ ఒక వేప చెట్టు క్రింద తలకు రుమాలు చుట్టుకుని ఉన్న ఒక ఫకీరు అప్పుడు ఆమె వద్దకు వచ్చాడు.104. అమ్మాయీ! అనవసరంగా ఎందుకు శ్రమపడతావు? నీ కుండను మంచినీటితో నింపి ఇస్తాను అని మంజుల స్వరంతో పలికాడు.105. 'నేను భయంతో ఖాళీ కుండను తీసుకుని ఇంటి దారి పట్టాను. ఆ ఫకీరు నా వెంటే నా వెనుక వస్తున్నాడు.106. ఇటువంటి కలను చూచి మేలుకున్నాను. నా కళ్లు తెరుచుకున్నాయి'. భార్య యొక్క స్వప్న వృత్తాంతాన్ని విని సపట్‌ణేకరు శిరిడీ వెళ్లాలని నిశ్చయించుకున్నాడు.107. భార్యాభర్తలిద్దరూ వెంటనే బయలుదేరి మరునాడు శిరిడీ గ్రామం చేరుకుని మసీదుకు వెళ్లారు. అప్పుడు బాబా లెండీకి వెళ్లి ఉన్నారు.108. వారు తిరిగి వచ్చే వరకు వారి కోసం ఎదురు

చూస్తూ ఆ ఇద్దఱూ అక్కడే కూర్చున్నారు. ఇంతలో బాబా వచ్చారు.109.తాను కలలో చూచిన మూర్తినే మరల అక్కడ ఆపాదమస్తకం చూచి ఆమె చకితురాలై కళ్లార్పకుండా చూడసాగింది. 110.బాబా యొక్క పాదప్రక్షాళనం కాగానే ఆమె వారి వద్దకు వెళ్లి వారికి పాదాభి వందనం చేసి వారిని చూస్తూ కూర్చుంది.111.ఆమె వినయానికి సాయినాథునికి సంతోషం కలిగింది.ఆ స్త్రీ బాధను నివారించే కథను మెల్లగా ప్రారంభించారు.112.అప్పుడు ఎప్పటివలెనే బాబా తమ బాధను అక్కడ ఉన్న మూడో వ్యక్తితో ప్రేమగా చెప్పసాగారు.113.వాస్తవానికి అది ఆమె కథ. ఆమెకు చెప్ప వలసిన కథ.ఆమె సమక్షంలో బాబా ఎవరో మూడో వ్యక్తికి చెప్పగా ఆమె అత్యంత శ్రద్ధగా విన్నది.114.చాలా రోజులుగా నా చేతులు కడుపు నడుము నొప్పి పెడుతున్నాయి. మందులు వాడివాడి విసుగెత్తి పోయాను. కాని బాధ తొలగటం లేదు.115.ఔషధాలు తినితిని విసిగిపోయాను. కాని ఏం గుణం కనిపించలేదు.కాని ఇప్పుడు అకస్మాత్తుగా తగ్గిపోయాయని ఆశ్చర్యంగా ఉంది.116.అని బాబా ఆమె పేరు చెప్పకుండా ఆమెకు సంబంధించిన కథనంతా ఏకరువు పెట్టారు.117.ఒకటి రెండు నెలలకు బాబా తమవిగా వర్ణించిన ఆమె బాధలు తొలగిపోయాయి. వారి వచనం అనుభవ పూర్వకంగా అర్థమైంది.118.భార్య కోరిక తీరి పోయాక సపట్నీకరు బాబా దర్శనానికి వచ్చాడు.బాబా మునుపటి వలెనే మరల చల్‌హాట్ అని అతనిని సంబోధించారు. 119.'నా పారపాటు ఏమిటో నాకు అర్థం కావటం లేదు.మరి బాబా నన్ను ఎందుకిలా తిరస్కరిస్తున్నారు?నేను నమస్కరించినప్పుడల్లా వారి జవాబు ఒక్కటే.120.నా పూర్వార్జితం ఏమిటి?నాపైనే ఎందుకు కోపం కలుగుతుంది?నేను చూస్తుండగా ఇతరులతో ఎంత ప్రేమగా వ్యవహరిస్తారు?121.ఉదయం సాయంకాలం బాబా వద్ద అందఱూ ఆనందంగా రోజూ దీపావళిని అనుభవిస్తుంటే నా నొసట నేనా చల్‌హాట్?122. నా కర్మ ఏమిటో

నా ద్వారా అధర్మాచరణ సంభవించి నెను అనెక పాపాలకు ఆశ్రయమయ్యాను కాబొలు. అందువలననే బాబా అనుగ్రహం లేకపోవటం. 123. నేను మొదట బాబా విషయంలో సంశయించి కుతర్కాలు చేశాను. అందుకే బాబాయే నన్ను ఈ విధంగా తమ వద్దకు లాక్కుంటున్నట్లు అనిపిస్తూ ఉంది. 124. అని తలచి బాబా అనుగ్రహం కలిగే వరకు శిరిడీ లోనే బాబా వద్ద స్థిరమైన మనసుతో ఉండాలని నిర్ధారణ చేసుకున్నాడు. 125. తాపత్రయాలతో తపించిపోయి, సాయి దర్శనానికి ఆరాటపడుతూ వెళ్లి, మనసుకు శాంతి లభించకుండా నిరాశతో తిరిగి వెళ్లిపోయే వారు ఎవరుంటారు? 126. సపట్‌ణేకరు ఆ రోజు చాలా బాధ పడ్డాడు. అతనికి అన్న పానీయాలు రుచించలేదు. ఎక్కడికీ కదల బుద్ధి కాలేదు. నిద్ర లేకుండా ప్రక్కమీద పడి ఉన్నాడు. 127. బాబా వద్ద ఎవరూ లేకుండా వారు ఒక్కరే ఆసనం పై ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకుని వారి చరణాలను పట్టుకోవాలి. 128. అని సపట్‌ణేకరు నిశ్చయించుకున్నాడు. దాని ఫలితంగా గద్గద హృదయంతో బాబా చరణాలను పట్టుకున్నాడు. 129. బాబా పాదాలపై తలను వంచగా బాబా తమ చేతిని అతని తలపై ఉంచారు. అతడు బాబా పాదాలను పట్టుతుండగా గొఱ్ఱెల కాపరి అయిన ఒక స్త్రీ వచ్చింది. 130. ఆమె అక్కడికి రాగానే బాబా నడుము మర్దన చేస్తూ కూర్చుంది. బాబా రోజూ మాట్లాడే విధంగా ఆమెతో ముచ్చటించ సాగారు. 131. ఆ చమత్కార వృత్తాంతాన్ని సపట్‌ణేకరు శ్రద్ధగా విన్నాడు. అది అక్షరం అక్షరం మొత్తం అతని విషయమే. 132. ఆ స్త్రీ ఊ కొడుతూ వింటూ ఉన్నా సపట్‌ణేకరు తన విషయాన్నే వింటూ కూర్చున్నాడు. దాంతో అతడు ఆశ్చర్యచకితుడయ్యాడు. 133. ఆ విషయం ఒక వర్తకునికి సంబంధించినదే అయినా అది వాస్తవానికి తన విషయమే. అందులో చనిపోయిన అతని కుమారుని మరణాన్ని గురించిన వార్త. 134. అత్యంత పరిచితులు ఆప్తులు పుట్టింది మొదలు చనిపోయేవరకు మొత్తం కథను చెప్పిన విధంగా

చెప్పారు.135.బాబా ఆ స్త్రీతో ఆమెకు అసలు ఏమీ సంబంధం లేని ఒక తండ్రి కొడుకుల గురించిన కథను చెప్పసాగారు. విషయమంతా ఆ ఇద్దఱిదే .136.సాయి నోటి నుండి తన స్వంత కథను విన్న సపట్‌ణేకరుకు పరమాశ్చర్యం కలిగింది.సాయి చరణాల యందు అతని పూజ్య భావం స్థిరపడింది.137.బాబాకు ఇదంతా కరతలామలకంలా ఎలా తెలిసింది అని అతనికి చాలా విచిత్రంగా అనిపించింది. 138.సాయి స్వయం పరబ్రహ్మ స్వరూపం. విశ్వమంతా వారి కుటుంబం.అంతేకాదు. విశ్వమంతా వారి స్వరూపమే.అదే వారి గుర్తు.139.అంతటా వ్యాపించి ఉన్న ఏకాత్మత సాయి యొక్క అవతారం.జగత్తంతా వారు విస్తరించి ఉండగా వారికి తన పర భేదం ఎందుకుంటుంది?140.పరమ పురుషునిలో ఐక్యమైన వారికి ద్వైతం ఎలా ఉంటుంది?ఆకాశానికి ఏ లేపనం అంటుకోనట్లుగా ద్రష్ట,దర్శనం,దృశ్యంగా కనిపించే త్రిపుటి వారికి లేదు. 141.బాబా నిజంగా గొప్ప అంతర్ జ్ఞాని అని సపట్‌ణేకరు మనసులో తలచినప్పుడు అతనితో బాబా ఏం అన్నారో సజ్జనులైన శ్రోతలు ఆలకించండి .142.బాబా సపట్‌ణేకరుని చేత్తో చూపిస్తూ ఆశ్చర్యంగా 'నేను ఇతని పుత్రుని చంపానని నాపై నేరాన్ని ఆరోపిస్తున్నాడు.143. నేను లోకుల బిడ్డలను చంపుతానా? ఇతడు మసీదుకు వచ్చి ఎందుకు ఏడుస్తున్నాడు. సరే, ఇప్పుడు అతని పుత్రుని మరల తీసుకుని వస్తాను.144.చనిపోయిన పుత్రున్ని రామదాను మరల ఆ తల్లికి ఇచ్చినట్లుగా, ఇతని పుత్రున్ని మరల ఇతని భార్య గర్భంలోకి తీసుకుని వస్తాను.'145.ఆ మాటవిని సపట్‌ణేకరు బాబా వైపు చూస్తూ కూర్చున్నాడు. బాబా అతని శిరసుపైన తమ అభయ హస్తా న్నుంచి అతనికి ధైర్యాన్నిచ్చారు.146.ఈ పాదాలు చాలా పురాతన మయినవి.నీ చింత ఇక తొలగిపోతుంది.నా యందు పూర్తి విశ్వాసాన్ని ఉంచు.నీవు త్వరలో కృతార్థుడవౌతావు అని చెప్పారు.147.సపట్‌ణేకరు బాబా పాదాలను పట్టుకుండగా వారి మధురవచనాలను

విని కళ్ళు చెమర్చగా,పాదాభివందనం చేశాడు.148.అతనికి అష్టభావాలు ఉప్పొంగాయి. కళ్లనుండి కారిన ఆనందాశ్రువులతో బాబా పాదాలను ప్రేమగా ప్రక్షాళనం చేశాడు.149.బాబా మరల అతని శిరసుపై తమ చేతిని ఉంచి సుఖంగా కూర్చో' అని చెప్పారు. అప్పుడు సపట్‌ణేకరు సంతోషంగా బసకు వెళ్లాడు.150.నైవేద్యాన్ని తయారు చేయించి తన భార్య చేతికిచ్చి పూజ మరియు హారతి అయిన పిదప నైవేద్య పళ్లెమును బాబా ముందు ఉంచాడు.151.పళ్లెం చుట్టూ నీటిని సంప్రోక్షించి విధిగా కళ్లకు అద్దుకుని, ప్రాణాపాన వ్యానాది పంచప్రాణాలకు అర్పించి, తరువాత నైవేద్యాన్ని బాబాకు సమర్పించాడు.152.నిత్య క్రమాన్ని అనుసరించి బాబా తమ చేతులతో నైవేద్యాన్ని తాకి స్వీకరించగా సపట్‌ణేకరుకు ఆనందం కలిగింది.153.అప్పుడు అక్కడ ఉన్న ఇతర భక్తులు బాబా పాదాలపై పడుతుండగా, వారితోపాటు సపట్‌ణేకరు కూడా మరల బాబాకు నమస్కరించాడు.154.ఆ గుంపులో ఒకరి తలలు మరొకరి తలలతో ఢీ కొంటున్నాయి.అప్పుడు బాబా మెల్లగా సపట్‌ణేకరుతో,155'అరె! మాటి మాటికి ఎందుకు నమస్కారంపై నమస్కారం.గౌరవాదరాలతో ఒక్కసారి చేస్తే చాలు' అని చెప్పారు.156.ఆ రాత్రి చావడి ఉత్సవం.సపట్‌ణేకరు ఎంతో ఉత్సాహంగా చేత దండాన్ని పట్టుకుని ఆనంద పరవశంతో బాబా పల్లకి ముందు బయలుదేరాడు.157.ఈ చావడి ఊరేగింపు గురించి శ్రోతలకు ఇదివరకే తెలుసు.కనుక మరల చెప్పటం వలన గ్రంథం విస్తారమౌతుందని వదలి వేస్తున్నాను.158.ఆ రాత్రి బాబా అగాధలీల.సపట్‌ణేకరుకు సాయిబాబాను చూస్తుంటే పాండురంగని చూస్తున్నట్లే అనిపించింది.159. తరువాత అతడు తన తిరుగు ప్రయాణానికి బాబా ఆజ్ఞను కోరగా వారు భోజనం చేసి వెళ్లమని అనుమతినిచ్చారు. బాబా ఆజ్ఞను కించిత్తైనా జవదాటకుండా బయలుదేరే ముందు బాబా దర్శనానికి వెళ్ళాడు.160.ఇంతలో అతని మనసులో అకస్మాత్తుగా ఆలోచనలు లేచాయి. ఇప్పుడు

బాబా దక్షిణను అడిగితే నేను ఎలా ఇవ్వగలను?161. దగ్గరున్న డబ్బు అంతా ఖర్చు అయిపోయింది. బండి బాడుగకు సరిపడ మాత్రమే మిగిలి ఉంది.'దక్షిణను ఇవ్వు' అని బాబా అడిగితే ఏం జవాబు ఇవ్వాలో మనసులో నిశ్చయించుకున్నాడు.162.బాబా అడగకముందే వారి చేతిలో ఒక రూపాయిని ఉంచాలి. బాబా మరల అడిగినప్పుడు మరొకరూపాయి నివ్వాలి.ఆ తరువాత లేదని చెప్పాలి.163.రైలు బండి ఖర్చుకు మాత్రమే దగ్గర ఉంచుకున్నానని బాబాతో స్పష్టంగా చెప్పాలి అని నిర్ణయి ంచుకుని బాబా వద్దకు వెళ్లాడు.164.తాను ముందుగా నిశ్చయించుకున్నట్లే బాబా చేతిలో ఒక రూపాయిని ఉంచగా బాబా మరల ఒక్క రూపాయినే అడిగారు.దానిని ఇచ్చిన తరువాత స్పష్టంగా,165 'ఈ కొబ్బరికాయను తీసుకుని నీ భార్య ఒడిలో వేయి.నీ మనసులోని బాధను వదలి సుఖంగా వెళ్లు' అని చెప్పారు.166.తరువాత పన్నెండు నెలలు గడిచాక, సపట్‌ణేకరుకు పుత్రుడు కలిగాడు.ఎనిమిది నెలల బిడ్డను తీసుకుని ఆ దంపతులు మరల దర్శనానికి వచ్చారు.167.పుత్రుని బాబా చరణాల వద్ద ఉంచారు. సత్పురుషుల చర్య ఎంత వింత? ఆ ఇద్దఱూ చేతులు జోడించి ఏం మనవి చేశారో వినండి.168.'సాయినాథా!ఈ ఉపకారానికి ఎలా ఋణం తీర్చుకోవాలో మాకు అర్థం కావటంలేదు. మీ చరణాల యందు శిరసునుంచు తున్నాం.169.మేము హీనులం, దీనులం, పామరులం.ఈ అనాథుల పైన మీ కృప చూపండి.ఇకనుండి మీ చరణాల వద్ద మాకు నిరంతరం ఆశ్రయం కలగనీయండి.170.జాగ్రదావస్థలోనూ స్వప్నావస్థలోనూ అహర్నిశలూ విశ్రామం లేకుండా అనేక రకాల ఆలోచనలు లేస్తుంటాయి.అయినా మేము మీ ఆరాధనలో ఉండేలా అనుగ్రహించండి'.171.మురళీధరు అనే అబ్బాయి తరువాత భాస్కరు దినకరు అనేగి మరో ఇద్దఱు బాలురు కలగగా సపట్‌ణేకరు సంతుష్టుడయ్యాడు.172. బార్యాబిడ్డలను వెంట బెట్టుకుని సపట్‌ణేకరు సాయి దయామయునికి ఆనందంగా వందనం చేశాడు.తన చంచల

మనసును స్థిరపరచుకుని కృతకృత్యుడై వెళ్లిపోయాడు.173.కథను సంక్షిప్తంగా చెప్పాలని మొదట తలచాను కాని, చెప్పించే వారు సాయినాథులు కనుక ఈ గ్రంథం పెద్దదైంది.174.హేమాడు సాయినాథునికి శరణుజొచ్చి, తరువాతి కథానుసంధానం మరియు తాత్పర్యం శ్రోతలకు తెలియ చేస్తాడు.175.ఆ కథ ఇంతకంటే అతి మధురమైనది. చమత్కారాల యందు ప్రీతిగల ఒక భక్తుని కోరికను బాబా అమోఘంగా తీర్చారు.176.సాయిబాబా సుగుణాలను ప్రజలు వర్ణిస్తుంటే, దోషాలనే చూచేవారు వారిలో అవగుణాలను చూస్తారు. స్వార్థంలో గాని పరమార్థంలో గాని ఏ శ్రద్ధా లేక దోషాలను మాత్రమే చూడటం వారి ఉద్దేశం.177.సాయిబాబా సత్పురుషులైతే, వారు తమ మహిమ యొక్క అనుభవాన్ని కలిగించాలి.నాకు ఏ అనుభవమూ కలగకపోతే నేను వారిని అసలు నమ్మను.178.అని కేవలం బాబాను పరీక్షించాలనే ఉద్దేశంతో వెళ్లిన వారి కోరిక కూడా తీరింది. ఇదే కథను శ్రోతలు తరువాతి అధ్యాయంలో శ్రవణం చేయండి.179.స్వస్తి శ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో సాశంక భక్తానుగ్రహకరణమను నలుబది ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 49 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాభ్యోనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

సద్గురు స్తవనాన్ని సాంగోపాంగంగా చేయలేక వేదాలు పురాణాలు అలసిపోయాయి. అటువంటప్పుడు నేను ఏమీ తెలియని అజ్ఞానిని. కనుక ఊరక ఉండటం ఉత్తమం.1. వాస్తవానికి మౌనం వహించటమే నిజమైన స్తవనం.కాని సాయి యొక్క ఒక్కొసుగుణం మౌనాన్ని మరిపింపచేస్తుంది. 2. అగాధమైన సాయిలీల ధన్యం. దానిని చూచిన నేను ఊరుకుండలేను. పక్వాన్నాల రుచి జిహ్వాకు తగలగానే మనసుకు శ్రోతలు గుర్తుకు వచ్చారు.3. వారిని కూడా నా పంక్తిలో చేర్చుకోవటం వలన మాధుర్య రుచి మరింతగా ద్విగుణీ కృతమౌతుంది అని అనిపించింది. అందువలననే ఈ భోజనం చక్కగా తయారైంది.4. భక్ష్యాలు బాగా రుచికరంగా ఉన్నప్పటికీ సజ్జనులు స్నేహితులు పంక్తిలో లేకుండా ఒంటరిగా ఉంటే వాని మాధుర్యం చప్పబడిపోతుంది.5.సాయి సకల అవాప్తకాముడు. సాయి సకల సంతలలాముడు.సాయి భక్తులకు విశ్రామధామం. వారు దుర్భరమైన భవచక్ర భ్రమణాన్ని నివారించేవారు.6.భాషకు అందని వారిలీలలను నా వాక్కుతో వర్ణించలేను.తర్కబుద్ధికి అందని వారి అతర్క్య కళ నాకు ఎలా అర్థమౌతుంది?.7. కల్యాణానికి కల్యాణ ప్రదమైన సాయి, ఈ గ్రంథాన్ని పూర్తి చేయటానికి కృపతో తమ కథలను గుర్తు చేస్తారు.8. అగాధమైన వారి మహిమలను వర్ణించను ఎవరు సమర్థులు? పరా వాక్కే వెనుకకు తిరిగిపోయి నప్పుడు ఇక పశ్యంతి

మధ్యమల మాట ఎవరు చెప్పగలరు? 9. ఆ మూడూ నొరు తెరవక పోతే నాలుగవదైన వైఖరి ఏం చేయగలదు? ఈ విషయం నాకు బాగా తెలిసినా, నా మనసు ఊరుకోవటం లేదు.10. సద్గురు చరణాలలో తల్లీనులు కాకపోతే ఆత్మ యొక్క యదార్థ స్వరూపం చేజిక్కదు. సత్పురుషులు సాక్షాత్తు శ్రీహరి స్వరూపులు. వారి అనుగ్రహం కోసం ప్రార్థించాలి. 11.గురుచరణాల యందు ప్రేమ– దీనినే మనం సంపాదించుకోవాలి. సత్పురుషుల యొక్క సాంగత్యంలోని మాధుర్యం మరియు ప్రేమ మనకు లభ్యమగుగాక.12.శరీరాభిమానం పూర్తిగా ఉన్న వారికి భక్తులు అన్న పేరు తగదు.సంపూర్ణ నిరభిమానులలోనే నిజమైన భక్తి ఉంటుంది. 13. జ్ఞానిని అన్న గర్వం, శ్రేష్ఠుణ్ణి అన్న అభిమానంతో కేవలం దంభానికి నిలయమైన వారికి ఎక్కడి ప్రతిష్ఠ?14.తమ గురువు యొక్క కీర్తిని భక్తితో గానం చేయనివారు అభాగ్యులు. చెవుడు లేకున్నా విననివారు మూర్తీభవించిన మందమతులు.15.తీర్థవ్రతాలు, యజ్ఞాలు దానాల కంటే తపస్సు చేయటం శ్రేష్ఠం. తపస్సు కంటే అధికం హరిభజన.తమ గురువును ధ్యానించటం అన్నింటికంటే శ్రేష్ఠం.16. సాయి భక్తులకు సాయియే ధ్యాన ధారణలు.సాయియే వారి దేవదేవతార్చనలు. సాయియే వారి గుప్త నిధి.ఆ నిధిని కృపణత్వం లేకుండా రక్షించుకోవాలి.17.నాకు ఒకప్పుడు బద్ధకం కలగవచ్చు.కాని అంతర్యామి అయిన సాయికి అలసట లేదు.నేను కథలను మరచిపోతే వారు నాకు సమయానికి సరిగ్గా గుర్తు చేస్తారు.18. ప్రశాంతంగా ఒక క్షణం కూర్చుందామనుకుంటాను.కాని నా కోరిక సాగదు.అకస్మాత్తుగా బాబా కథను స్ఫురింప చేస్తే, నేను వెంటనే కలం చేతికి అందుకోవలసిందే.19.ఇటువంటి అమోఘమైన కథలను భక్తులకు వినిపించటానికి మరియు నా శ్రేయస్సుకోసం ఈ సచ్చరిత రచనకు నన్ను ప్రేరేపించారు.20.సత్పురుషులు తమ కథను తామే రచిస్తారు.వారి

స్ఫూర్తిలేకపోతే రచన రసవత్తరంగా కాక అంతా చప్పగా ఉంటుంది.21. అలా సాయి దయామయులు నా మనసులో ప్రవేశించి తమ గ్రంథాన్ని రచింప చేసి నా మనోభీష్టాన్ని తీర్చారు.22. నోటితో శ్రీసాయి నామాన్ని జపిస్తూ మనసుతో వారి వచనాలను చింతన చేస్తూ హృదయంలో వారి రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే నాకు సంపూర్ణమైన శాంతి లభిస్తుంది.23.నోటితో సాయి నామం, అంతరంగంలో సాయిపై ప్రేమ ఉండి, శ్రీసాయి ప్రీత్యర్థం కర్మను చేసేవారికి, సాయిబాబా చాలా ఋణపడి ఉంటారు.24. ప్రపంచ బంధనాలను విడిపించుకోవటానికి సాయి ఆరాధన కంటె మరో సాధనలేదు. పరమ పావనమైన సాయి కథను సదా శ్రవణం చేయడం సుఖదాయకం.25. పాదాలతో సాయికి ప్రదక్షిణం. కళ్లతో సాయి యొక్క దర్శనం. శ్రవణాలతో సచ్చరిత శ్రవణం చేయండి సర్వాంగాలతో సాయిని ప్రేమగా ఆలింగనం చేసుకోండి. 26. అష్టాంగాలతో సాయికి సాష్టాంగ పడండి. శిరసును వారి చరణాలయందు ఉంచండి. జిహ్వాతో వారి నామస్మరణను చేయండి. నాసికతో వారి నిర్మాల్యాలను వాసన చూడండి .27. ఇప్పుడు పూర్వకథాను సంధానం. గతాధ్యాయంలో చమత్కారాల యందు ప్రీతిగల ఒక భక్తుని కథను చెప్తానని శ్రోతలకు మాట ఇచ్చాను. 28.స్వార్థాన్ని సాధించుకోవాలన్న కోరిక లేదా పరమార్థ పరాయణతగాని లేకపోతే సత్పురుషుల మహిమ తెలియదు. ఎవరైనా సాధువుల గొప్పతనాన్ని వర్ణిస్తే విశ్వసించరు.29. స్నేహితులు సాయిబాబా మహిమను వర్ణించగా విని విశ్వాసం లేకుండా దోషాలను మాత్రమే చూచేవారు స్వయంగా అనుభవిస్తే తప్ప సృష్టిలో దేనినీ నమ్మరు.30.హరి కనోబా అనే వ్యక్తి ముంబై నుండి స్నేహితుని వెంట సాయిబాబాను పరీక్షించాలని బయలుదేరాడు. 31. అందఱి హృదయాలలోనూ విరాజమానులై ఉన్న సాయి యొక్క

కళాకౌశలాన్ని చక్కగా ఎవరు తెలుసుకోగలరు?32. హరిభావూ శిరిడీకి బయలు దేరిన కారణం సాయి సమర్థులకు తెలుసు. అతడు కేవలం చమత్కారాన్ని చూడాలని వచ్చినవాడు. అతని ఖ్యాతి అంతే .33. కనుక బాబా అతనికి అట్లే ఒక వింతను చూపించి అతనికి తమ యందు విశ్వాసాన్ని కలగజేసి అతని శ్రమను సార్థకం చేశారు.నిజంగా సత్పురుషులు ఉపాయంతో కార్యాన్ని సాధిస్తారు.34. హరిభావూ స్నేహితునితో కోపర్‌గాంలో టాంగా బండిలో కూర్చున్నాడు. గోదావరిలో స్నానం చేసిన వెంటనే శిరిడీకి బయలుదేరాడు.35.కోపర్‌గాం నుండి శిరిడీ చేరుకోగానే కాళ్లు చేతులూ కడుగుకుని,హరిభావు సాయి సత్పురుషుని దర్శించుకోవాలని బయలు దేరాడు.36. అతడు తలకు జరీ తలపాగా కట్టుకుని కాళ్లకు క్రొత్త చెప్పులను తొడుగుకుని సాయిబాబాను చూడాలని చాలా ఉత్సుకతతో వచ్చాడు.37. మసీదు వద్దకు వచ్చి దూరం నుండే సాయిబాబాను చూచి, వారి సమీపానికి వెళ్లి వారికి సాష్టాంగ ప్రణామం చేయాలని అతనికి అనిపించింది.38.కాని చెప్పుల వలన ఇబ్బంది.వానిని భద్రంగా పెట్టటానికి అక్కడ స్థలం లేదు.అయినా అక్కడే ఒక మూల జాగ్రత్తగా భద్రపరచాడు.39. తరువాత దర్శనానికి పైకి వెళ్లి భక్తిగా సాయి చరణాలకు నమస్కరించి విభూతి ప్రసాదాన్ని తీసుకుని తిరిగి బసకు బయలుదేరాడు.40.కాళ్లకు చెప్పులు తొడుగుకోవాలని చూస్తే ఎంత వెతికినా అవి కనిపించలేదు. వానిపై ఆశను పూర్తిగా వదలుకుని దుఃఖంతో చెప్పులు లేకుండా తిరిగి వచ్చాడు.41. అక్కడ చాలామంది భక్తులు వస్తూ పోతూ ఉంటే ఎవరిని అడగాలో ఏం తోచలేదు.42.ఇలా అతని మనసు వికలమై పోయింది. అతని కళ్ల ఎదుట చెప్పులు. మనసులో చెప్పుల ఆలోచనే.అతని ధ్యానం చెప్పుల మీదే.43.అవి ఎంతగానో నచ్చితే ఇష్టపడి కొనుక్కున్నాడు. ఆ చెప్పులు

పోయాయి. అంటే ఎవరో దొంగలు దొంగిలించి ఉంటారని అతనికి నిశ్చయమైపోయింది.44.తరువాత స్నానం చేసి పూజ నైవేద్యం అవీ అయ్యాక, పంక్తిలో కూర్చుని భోజనం చేశాడు కాని అతని మనసుకు శాంతి లేదు.45. ఆ సభా మండపం సాయిబాబా ఉండే స్థానం. అక్కడినుండి వారి దృష్టిని తప్పించుకుని ఎవరైనా చెప్పులను తీసుకుని వెళ్లిపోవటం ఏమైనా చిన్న విషయమా?46. అతనికి ఆందోళన. అన్నపానీయాల మీద మనసులేదు. భక్తులందఱితో పాటు అతడు చేతులు కడుక్కోవటానికి వచ్చాడు.47. ఇంతలో ఒక మరాఠా కుఱ్ఱవాడు హరిభావూ పోగొట్టుకున్న చెప్పులను ఒక కఱ్ఱకు తొడిగి జెండాలా పట్టుకుని అకస్మాత్తుగా అక్కడికి వచ్చాడు.48. భక్తులు భోజనం చేసి చేతులు కడుక్కుంటున్నారు. బాబా ఈ కఱ్ఱను నా చేతికి ఇచ్చి పంపారు అంటూ కుఱ్ఱవాడు వెతుక్కుంటూ వచ్చాడు.49. 'హరికా బేటా జరీకా ఫేటా' అని అరుచుకుంటూ వెళ్లు. బాబూ! ఇవి నా చెప్పులు అని ఆతురతతో అడిగినవారికి వీనిని ఇచ్చేయి.50. కాని హరికా బేటా ఎవరో చూసి, అతని వద్ద జరీ తలపాగా ఉందా అని ముందు నిశ్చయంగా తెలుసుకున్నాకే ఇవ్వు. ఏం గొడవ చేయకు అని చెప్పారు.51. ఆ మాటలు చెవులలో పడగానే హరిభావూ పరిగెత్తుకుని వెళ్లి కళ్లతో చూచి, తన చెప్పులను గుర్తు పట్టి ఆశ్చర్యపోయాడు. 52. కళ్లనుండి ఆనందాశ్రువులు దొరలాయి. శరీరం పులకరించింది. పోయిన చెప్పులు కనిపించగా అత్యంత చకితుడయ్యాడు.53. ఆ అబ్బాయిని ఇక్కడకు రా అని పిలిచి ఆ చెప్పులను నా వద్దకు పట్టుకునిరా, ఏదీ నన్ను చూడనివ్వు అని వానిని చూచి ఇవి నీకు ఎక్కడ దొరికాయి? సరిగ్గా చెప్పు అని అడిగాడు.54. ఆ అబ్బాయి నాకేం తెలియదు. నేను బాబా ఆజ్ఞను పాటించాలి. హరికాబేటా ఎవరో వారు నాకు జరీ తలపాగా చూపించాలి.55. వారికే ఈ చెప్పులను ఇస్తాను.

నాకు వేరే గుర్తులు తెలియవు. బాబా చెప్పిన గుర్తులు తెలిసినవారె ఈ చెప్పులను తీసుకుంటారు అని అనగా, 56. హరిభావు 'ఒరె బాబూ! ఇవి నా చెప్పులేరా' అని అంటే ఆ అబ్బాయి ఇవ్వలేదు. అప్పుడు అతడు బాబా చెప్పిన గుర్తులను కుఱ్ఱవాడికి చెప్పి,57.'ఒరే బాబూ! నేనేరా హరిని. కాన్హోబా కొడుకును. బాబామాట నిజంగా నాకే వర్తిస్తుంది. 58. ఇదిగో! ఈ జరీ తలపాగా చూడు. నీ సందేహం తొలగి పోతుంది. చెప్పులు నావేనని నిశ్చయమౌతుంది. వీనిని ఇతరులెవరూ కోరరు' అన్నాడు.59. ఆ అబ్బాయికి అంతా అర్థమైన తరువాత ఆ చెప్పులను హరిభావుకు ఇచ్చేశాడు.ఆ విధంగా హరిభావూ యొక్క కోరిక తీరి,సాయి సత్పురుషులని అనుభవమైంది. 60. నాకు జరీ తలపాగా ఉందనిచెప్పటం గొప్ప విశేషమేమీ కాదు. అది నా తలపై అందరికీ కనిపిస్తూ ఉంది.61.కాని నేను బయటి ఊరివాణ్ణి.శిరిడీకి రావటం ఇదే మొదటిసారి కదా! మరి సాయిబాబాకు నా పేరు హరి అని ఎలా తెలిసింది?62. మా తండ్రి కాన్హోబాను ఎవరూ చూడలేదే. మరి 'కా' అనే అక్షరంతో అతని పేరును బాబా సూచించటం చాలా ఆశ్చర్యంగా ఉంది.63.నా స్నేహితుడు సాయి సత్పురుషుని మహిమను చెప్పగా నేను అతని మాటలను అవహేళన చేశాను.ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాను. 64.ఇప్పుడు అనుభవమయాక సాయిబాబా ప్రభావం తెలిసింది.నా సంశయాలు తొలగిపోయాయి.శ్రీసాయి మహాత్ములు.65.మనసులో ఎలాంటి భావముంటే అనుభవం కూడా అట్లే అవుతుంది.హరిభావుకు అట్లే అయింది. సత్పురుషుని పరీక్షించాలనే తప్ప పరమార్థం సంపాదించుకోవాలన్న కోరిక అతనికి లేదు. 66.సాయి సమర్థులు మహాత్ములని స్నేహితులు బంధువులు తమ అనుభవాలను చెప్పగా, ఆ విశేషాలను తాను స్వయంగా చూడాలని అనుకోవటం అతడు శిరిడీకి రావటానికి కారణం.67.

సత్పురుషుల చరణాలలో ప్రాణాలు అర్పించుదాం. దానివల్ల భగవంతుని ఆచూకి తెలుస్తుంది అని అతని మనసులో కించిత్తైనా కోరికలేదు.68. సత్పురుషుని సన్నిధికి వెళ్లి చమత్కారాన్ని చూడాలని కోరుకున్నాడు. పోయిన క్రొత్త చెప్పుల జత తిరిగి ఇంటికి చేరింది.69. లేకపోతే అల్ప వస్తువైన ఒక చెప్పుల జత పోయినంత మాత్రాన గొప్పగా ఏం కోల్పోయినట్లు? వాని కోసం మనసులోని కలవరం అవి లభించేవరకు తగ్గలేదు70. సత్పురుషుల అనుగ్రహాన్ని పొందటానికి రెండు మార్గాలు. ఒకటి భక్తి రెండవది జ్ఞానం. జ్ఞాన మార్గం చాలా కఠినమైనది. శ్రమతో కూడినది. భక్తి యొక్క సాధన సులువైనది.71. ఇటువంటి సులభసాధనమైన భక్తిని అందఱూ ఎందుకు అవలంబించరు? అంటే మహా భాగ్యముంటేనే భక్తి ప్రాప్తిస్తుంది.72. కోటి జన్మల పుణ్యముంటేనే, సాధువులతో కలయిక, సత్పురుషులతో సమాగమ సుఖం లభిస్తుంది. దానితోనే భక్తి వికసిస్తుంది. 73. మనమందరం ప్రవృత్తి తత్పరులం. అంటే ప్రపంచ విషయాలలోనే ఆసక్తి కలవారం. నివృత్తిని ఎఱుగం. ఇటువంటి మనోవృత్తి ఉంటే దానిని భక్తి అని ఎలా అనగలం?74. మనభక్తి ఎలా ఎలా అభివృద్ధి చెందుతుంటే మన ప్రాప్తి కూడా అలా అలా అధికమౌతుంది. ఇది ఎప్పటికైనా నిశ్చయంగా జరిగి తీరుతుంది. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు.75. మనం అహర్నిశలూ విషయభోగాల కొఱకే సాయి వద్ద గుమికూడాం, కనుక మనకు లభించేవి కూడా మరి అవే. పరమార్థాన్ని కోరుకునేవారికి పరమార్థం లభిస్తుంది. 76. ఇప్పుడు సోమదేవ స్వామి ఆనే పేరుగల మరొక వ్యక్తి గురించి. ఇతడు సాయిబాబాను ప్రత్యక్షంగా పరీక్షించాలని శిరిడీ వెళ్లాడు.77. క్రీ.శ. 1906 వ సం.లో ఇతడు ఉత్తర కాశీలో ధర్మశాలలో ఉండగా భాయీ అనే గృహస్థుని కలిశాడు.78. ఈ భాయీ ప్రసిద్ధి చెందిన కీ.శే. కాకాసాహెబు దీక్షితు యొక్క

సోదరుడు.అతడు బదరి కేదార్ యాత్ర చేస్తుండగా మార్గంలో ఈ స్వామిని కలిశాడు.79.బదరి కేదారాల మార్గాన్ని వదిలి బాయీ క్రిందకు దిగాడు.దారిలో అక్కడక్కడా విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన స్థలంలో బస చేసిన ప్రయాణికులు కనిపించారు. 80.ఈ స్వామి వారిలో ఒకరు.ఇతడే తరువాత హరిద్వార స్వామి అని ప్రసిద్ధుడయ్యాడు.ఇతడు బాబా ప్రభావానికి లోనయ్యాడు.81.అతనిదే ఈ కథ. ఇది బోధ ప్రదమై బాబా స్వరూపాన్ని విశద పరచి శ్రోతలకు ఆనందాన్ని కలిగిస్తుంది.82. భాయీ ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవటానికి వెళ్ళగా దారిలో స్వామిజీ కలిశాడు.వారు అలా సహజంగా ముచ్చటించుకుంటుండగా వారికి ఒకరియందొకరికి అభిమానం కలిగింది.83.గంగోత్రికి క్రింద భాగాన డెహరాడూన్ నుండి డెబ్భై కోసుల దూరంలోనున్న ఉత్తర కాశిలో స్వామి ఉండగా,అక్కడ వీరిద్దఱికి పరిచయం కలిగింది.84.ఉదయాన స్వామి చెంబు పుచ్చుకుని బహిః ప్రదేశానికి వెళ్లాడు.భాయీజి కూడా అదే పని మీద అదే చోటికి వెళ్ళాడు.85.ఆ ఇద్దఱూ మొదట ఒకరిని ఒకరు చూచుకున్నారు.తరువాత దారిలో పరస్పరం కలుసుకున్నారు.ఒకరిని ఒకరు కుశల సమాచారాలను సుఖసంతోషాలతో ముచ్చటించుకున్నారు.86.అలా వారు వాగ్వాడుకుంటుండగా వారిలో ప్రేమ కలిగింది.వారివారి నివాస స్థలాలను అడిగి తెలుసుకున్నారు.87.'మీరు హరిద్వార్‌లో ఉంటారు. మేము నాగపూర్‌లో ఉంటాం. ఆవైపుకు ఎప్పుడైనా రావటం జరిగితే మీ దర్శనాన్ని కలిగించండి.88. అటువైపు యాత్రకు వచ్చినప్పుడు మా గృహాన్ని పావనం చేయండి. మీదర్శనాన్ని మరల కలిగించి మా అల్ప సేవను స్వీకరించాలి. 89.మీరు మమ్మల్ని గుర్తుంచుకోవాలి.మీ చరణ స్పర్శ మా ఇంటికి కలగాలి.ఇదే నా విన్నపం.నారాయణుడు నా ఈ కోరికను

తీర్చుగాక' అని భాయీ అన్నాడు.90. క్రీ.శ.1906 వ సం॥లో ఉత్తర కాశీ క్రింద ఆ ఇద్దఱూ కలుసుకుని ఆ విధంగా మాట్లాడుకున్నారు.91. పరస్పరం తమ చిరునామాలను అడిగితీసుకుని, బయలుప్రదేశం సమీపించడం వలన ఒకరిని ఒకరు వదలి వెళ్లిపోయారు.92.అయిదు సంవత్సరాల తరువాత సాయితో సమాగమసమయం ఆసన్నమై స్వామికి భాయీని కలుసుకోవలెనని చాలా ఆతురత కలిగింది.93. క్రీ.శ.1911వ సం॥లో స్వామీజీ నాగ్‌పూర్ వచ్చారు.అక్కడ శ్రీసాయినాథుని పవిత్ర చరిత్రను విని ఆనందించారు.94.శిరిడీలో స్వామికి అన్ని సదుపాయాలు సుఖంగా జరగాలని భాయీ సిఫారసు పత్రం ఇచ్చాడు. అలా అన్ని ఏర్పాట్లను చేసుకుని స్వామి నాగపూర్‌ను విడిచారు.95.మన్మాడులో దిగగానే అక్కడ కోపర్‌గాంకు బండి సిద్ధంగా ఉంది.అక్కడి నుండి టాంగాలో సాయిదర్శనానికి ఆనందంగా బయలుదేరారు.96.ఎక్కడికి వెళ్లినా సాధువుల ప్రవర్తనా, వారి నడవడి ఒక్కొక్కరిది ఒక్కోరకంగా ఉంటుంది.అందఱి ప్రవర్తన సమానంగా ఎక్కడా ఉండదు.97. ఒక సాధువు ఆచరణ మరొక సాధువుకు ప్రమాణం కాదు.కనుక సాధువుల అర్హతలను తెలుసుకోవటానికి ఇది సాధన కాదు.98.సత్పురుషుని దర్శనానికి వెళ్లే వారికి వారి గురించిన ఆలోచన ఎందుకు? వారి ప్రవర్తనను పరీక్షించాలను కుంటే తమ శ్రేయస్సును కోల్పోవటమే.99.స్వామీజి మనసులో అనేక రకాల తర్కాలు కుతర్కాలు లేచాయి.దూరం నుండి శిరిడీలోని పతాకం కనిపించగా స్వామికి సందేహం కలిగింది.100.స్వామితో పాటు ఉన్నవారు మసీదుపైన కలశం వద్ద, పతాకం కనిపించగానే దూరం నుండి భక్తిగా వందనం చేశారు.101.సాయి దర్శనం త్వరలో కలుగుతుందని మనసు ఉబలాట పడుతుంది కాని కనిపించిన పతాకం యొక్క అవమానాన్ని సహించలేరు.102. పతాకం

కనిపించగానే ప్రేమ పెల్లుబుకుతుంది.ఇది అందరికి అనుభవం.ఇది భక్తి ప్రేమలకు లక్షణం.ఇది విలక్షణమైనది కాదు. 103. కాని పతాకాన్ని దూరం నుండి చూచి స్వామి యొక్క కుత్సితమనసులో ఆలోచనలపైన ఆలోచనలు లేచాయి.అది విచిత్రమైన మనసు.104.పతాకాలపైన ప్రేమ ఇది సాధువుల లక్షణమా? దేవాలయాలపైన పతాకాలను పెట్టటం సాధువులకు హీనత్వం.105.సాధువులు ఇలా గౌరవమర్యాదలను కోరుకోవటం ఇది కేవలం వారి లోకేషణ. ఇటువంటి సాధులక్షణాలు మనసుకు నచ్చవు. ఇది సాధువులకు లోపం.106.సారాంశం – స్వామి తన మనసుకు తోచిన విధంగా సాయి యొక్క యోగ్యతను నిర్ణయించుకున్నాడు.ఇక ఈ సాయి అనుగ్రహం నాకు అవసరం లేదు అని మనసున నిశ్చయించుకున్నాడు. 107.వ్యర్థంగా ఇక్కడి వరకు వచ్చాను అని తలచాడు. అతనికి చాలా అగౌరవం అని అనిపించింది. తక్షణం అక్కడి నుండి తిరిగి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు.108.సాధువులకు అసలు గౌరవాదరాలు ఎందుకు?పతాకాన్ని చూస్తుంటే వారి దురభిమానం లోకేషణ తప్ప వేరే ఏం కనిపించటం లేదు. 109.పతాకాన్ని కట్టించుకుని తమ గొప్పతనాన్ని చాటుకోవడం, ఇది అతని సాధు లక్షణానికి విరుద్ధం. ఇటువంటి సాధువు దర్శనానికి నేనెందుకు వెళ్లాలి?110. ఇటువంటి వారి దర్శనం చేసుకుంటే మాత్రం మనసు శాంతిస్తుందా? పతాకం ద్వారా తమ దర్పాన్ని ప్రదర్శించుకోవటమే ఇది. ఇందులో మనసుకు శాంతి లేదు.111.వచ్చిన దారినే తిరిగి వెళ్లిపోవాలి. అతని వద్దకు వెళ్లాలను కోవటం సరియైన ఆలోచన కాదని అనిపించింది.నిజంగా నేను అప్రదిష్టపాలయ్యాను అని అనుకున్నాడు.112. అతని వెంట ఉన్నవారు అతనితో స్వామీ! ఇంతదూరం ఎందుకు వచ్చినట్లు? పతాకాన్ని చూచినంత మాత్రాన

మి మనసు ఇంతలా ఎందుకు వికలమైపోయింది? 113. మనం ఇప్పుడు వారి సమిపానికి వచ్చేశాం. అక్కడి రథం పల్లకి గుఱ్ఱం వగైరా సరంజామానంతా చూస్తే మీ మనసు ఇంకా ఎంత తపన పడుతుందో అని అన్నారు.114.ఆ మాటలు విని స్వామికి మరింతగా కోపం వచ్చింది.పల్లకి, గుఱ్ఱం, నగారా వగైరాలున్న ఇటువంటి గొప్ప సాధువులను నేను ఎంతమందిని చూడలేదు! 115.అని అనుకుని సోమదేవస్వామి ఇక శిరిడీకి వెళ్లే మాటేలేదు.నదికి వెళ్లేదారి పట్టాలి అని అనుకుంటూ స్వామి వెనుకకు బయలుదేరాడు.116. కాని అతని వెంట ఉన్నవారు 'ఇంత వరకు వచ్చిన మీరు వెనుకకు మరలవద్దు.117.ఇక్కడి వరకు వచ్చినట్లే ముందుకు సాగండి' అని బలవంత పెట్టారు. కుతర్కాలను చేయకండి.మసీదుపైన ఎగిరే పతాకాలకూ ఆ సాధువుకూ ఏం సంబంధం లేదు. 118.ఈ సాధువుకు పతాకాలు ఆదర సత్కారాలు అవసరం లేదు.వారికి లోకేషణ లేదు. ఆర్భాటాలు, అలంకారాలు గ్రామస్తులకు ప్రీతి.ఇది వారి భక్తికి ప్రమాణం. 119.మీరు ఆ పతాకాన్ని చూడకండి. వెళ్లి వారిని కేవలం దర్శనం చేసుకొండి.అక్కడ క్షణమైనా ఉండకుండా తిరిగి వెళ్లిపొండి' అని చెప్పారు. 120.ఇంతలో శిరిడీ దగ్గరకు వచ్చింది.వారు చెప్పిన మంచి సలహా విని స్వామి, అక్కడికి వెళ్ళి మనసులోని ఈ కలవరాన్ని పోగొట్టుకోవాలి.తరువాత పశ్చాత్తాప పడకూడదు అని అనుకున్నాడు.121.శ్రీ సాయి సమర్థుని దర్శనం చేసుకుని స్వామి కరిగిపోయాడు. ప్రేమతో వారి కళ్లు నిండి పోయాయి. కంఠంగద్గద మయింది.122. మనసు ప్రసన్నమయింది. కళ్ళకు ఆనందం కలిగింది. ఎప్పుడెప్పుడు వారి చరణ ధూళిలో పునీతుణ్ణవుతానా అని అనిపించింది. 123. కన్నార్పకుండా వారి రూపాన్ని చూస్తుంటే మనసు ఏకాగ్రమైంది. ప్రేమతో కట్టుబడి అట్లే చూస్తూనే ఉండిపోయాడు.124. అతని మనసులోని

కుతర్కాలు పోయాయి. చిత్తం దర్శనానందంతో కరిగి పోయింది.సాయి సగుణరూపం కళ్లలో నిలిచిపోయింది. దాంతో స్వామి తల్లీనుడయ్యాడు.125. సాయి మహాత్ముని కళ్లతో సందర్శించిన సోమదేవ స్వామికి పరమాహ్లాదం కలిగింది. అతని ఆత్మకు విశ్రాంతి లభించింది. ఇక్కడే ఉండిపోదునా అని అతనికి అనిపించింది.126.దర్శనమాత్రంతో వికల్పాలు సంశయాలు మాయమయ్యాయి.బుద్ధి మౌనం వహించింది. ద్వైతభావం పోయి అంతటా ఏకాత్మభావం కలిగింది. 127. వాక్కు నిశబ్దంగా మౌనం వహించింది.కళ్లు రెప్పలు వేయటం ఆగిపోయింది. లోపల బయటా సర్వత్రా ఉన్న చైతన్యాన్ని గ్రహించి మనసు శాంతించింది. 128.మొదట పతాకాన్ని చూచి వెనుకకు మరలాడు.కాని తరువాత ప్రేమోద్రేకంతో కరిగిపోయాడు.స్వామిలో సాత్విక అష్టభావాలు ఉప్పొంగాయి.బాబా పైని అతని ప్రేమ అతన్ని చుట్టేసింది .129.మనసు సంపూర్ణంగా తల్లీనత చెందిన చోటే మన నిజమైన స్థానమని తమ గురువు చెప్పిన మాట గుర్తుకు వచ్చింది.అతనిలో ప్రేమ ఉప్పొంగింది. 130.స్వామి మెల్లమెల్లగా బాబా ముందుకు వెళ్ళాడు. సాయి మహారాజు బాగా కోపంగా తిట్ల వర్షాన్ని కురిపించారు.దాంతో స్వామికి సాయిపై ప్రేమ పెరిగి రెండింతలైంది.131. సాయి సమర్థుని చర్య విశిష్టం. వారి లీల విలక్షణం. వారు సంపూర్ణ నరసింహావతారాన్ని ఆరోపించుకున్నారు.132.'మా వైభవం మా వద్దే ఉండనీ. ఫో! ఇంటికి వెళ్లిపో! ఖబర్‌దార్! మరల ఈ మసీదుకు వచ్చావంటే,133. మసీదుపైన పతాకాలను కట్టుకునే వారిని ఎందుకు దర్శించుకోవాలి? ఇది సత్పురుషుల లక్షణమా? ఇక్కడ ఒక క్షణమైనా ఉండవద్దు' అని అన్నారు. 134.తరువాత స్వామి సందేహంతో సభామండపంలోనికి ప్రవేశించాడు. బాబాను దూరంనుండి చూచిన స్వామి ఊరికే ఉండలేక పోయాడు.135. తాను అన్న మాటలు అక్షరం

అక్షరం చెవులలో ప్రతిధ్వనించగా ఈ మహారాజు అంతరజ్ఞాని అని అనుకుని స్వామి అక్కడ కక్కడ లజ్జితుడయ్యాడు.136.నేను ఎంత బుద్ధిలేని వాణ్ణి. వీరు ఎంతటి జ్ఞానులు. ఎంతటి నిర్మలాంతఃకరణం కలవారు. నేను ఎంత విరుద్ధంగా ఆలోచించాను అని అనుకున్నాడు.137. సాయిబాబా ఒకరిని దగ్గరకు తీసుకుంటూ మరొకరితో కరచాలన చేస్తూ ఇంకొందరికి ధైర్యం చెబుతూ కొందరిని ప్రేమగా అవలోకిస్తున్నారు.138. కొందరిని నవ్వుతూ పలకరిస్తూ కొందరి బాధను ఓదార్చుతూ మరికొందరికి విభూతి ప్రసాదాన్ని ఇస్తూ అందఱినీ సంతృప్తి పరుస్తున్నారు. 139.ఇలా అందఱినీ చక్కగా పలకరిస్తున్న బాబాకు నాపై మాత్రం కోపమెందుకు?ఇది నేను అన్న మాటల ప్రభావమేనని అనిపిస్తూ ఉంది.ఇది వారి కోపం కాదు.ఆనందాన్ని కలిగించే వారి బోధ. 140.తరువాత స్వామి సాయిబాబా వద్ద ఉన్నాడు.వారి కృపతో నిర్మలుడై వారి చరణాలలో శాశ్వతంగా స్థిరపడ్డాడు. 141.సాయి భక్తి ప్రభావం లోని శక్తి, మద మాత్సర్యాలను దుర్వాసనలను తొలగించు గాక! ఐశ్వర్యాన్ని ధైర్యాన్ని శాంతిని కలిగించు గాక! భక్తులను కృతకృత్యులను చేయుగాక!142.ఈ చరాచర సృష్టి యక్షులతోను గంధర్వులతోను సురాసురులతోను నిండి ఉంది. విశ్వంభరుడు ఈ విశ్వమంతటా వ్యాపించి ఉన్నాడు.143.అయినప్పటికీ అతడు ఎల్లప్పుడూ నిరాకారంగా ఉంటే ఒక ఆకారాన్ని గ్రహించకపోతే, ఆకారంలో ఉన్న మన మానవులకు అది ఏ మాత్రం ఉపయోగపడేది కాదు.144.అంటే దీని అర్థం సాయిబాబా లీలా విగ్రహ రూపాన్ని ధరించి ప్రజల వ్యవస్థను సరిదిద్దకపోతే, దుష్టులను దుర్జనులను అదుపులో పెట్టకపోతే, వారి అనుగ్రహం భక్తులకు ఎలా కలిగి ఉండేది?145.ఈ అధ్యాయం ముగింపుకు వచ్చింది. ఇప్పుడు నాకొక వృత్తాంతం గుర్తుకువచ్చింది.ఇది

సాయి యొక్క సదుపదేశానికి ఉదాహరణ. విశ్వసించిన వారికి ఇది శ్రేయస్కరం. 146. విషయం చాలా చిన్నదే. అయినా అది దీనిని గుర్తుంచుకుంటే శుభం కలుగుతుంది. అందువలన ఒక క్షణం మీ మనసులను నా వైపు మళ్లించండి అని శ్రోతలకు మనవి చేస్తున్నాను. 147. ఒకసారి భక్త మహాల్సాపతి నానాసాహేబుతో పాటు మసీదులో కూర్చుని ఉండగా జరిగిన చమత్కారాన్ని వినండి. 148. ఎవరో శ్రీమంతుడైన ఒక గృహస్థుడు వైజాపుర నివాసి, సాయిసమర్థుని దర్శనాభిలాషతో కుటుంబ సమేతంగా అక్కడికి వచ్చాడు. 149. అతనితో వచ్చిన గోషాలో ఉన్న స్త్రీలను చూచి నానా తనలో సంకోచించాడు. వారికి ఇబ్బంది కలగకుండా తాను స్వయం అక్కడి నుండి లేచి పోవాలని తలచాడు. 150. అందువలన నానా లేవబోతుండగా బాబా అతనిని వారిస్తూ 'వచ్చేవారు పైకి వస్తారు. నీవు నిశ్చింతగా కూర్చో' అని చెప్పారు. 151. వారు కూడా దర్శనానికి వచ్చారు. మీరు నిరభ్యంతరంగా రండి అని ఎవరో గృహస్థునికి సూచించారు. వారు వచ్చి సాయికి వందనం చేశారు. 152. వారిలో ఒక స్త్రీ తన మేలి ముసుగును ప్రక్కకు తొలగించి, వంగి బాబా పాదాలకు వందనం చేస్తుండగా, ఆమె యొక్క అద్భుత సౌందర్యాన్ని చూచి నానా సాహేబు మోహితుడయ్యాడు. 153. అందఱి ఎదుట చూడటం అసభ్యం. చూడకుండా మనసు ఆగటం లేదు. మనసును నిగ్రహించుకోలేక పోయాడు. ఏం చేయలో అతనికి తెలీలేదు? 154. బాబా సమక్షంలో చాలా సిగ్గు పడిపోయాడు. అందువలన ముఖాన్ని పైకి ఎత్తలేక పోయాడు. అతని దృష్టి చంచల మవసాగింది. నానా అటువంటి క్లిష్ట పరిస్థితిలో చిక్కుకు పోయాడు. 155. నానా యొక్క ఈ అంతరంగ స్థితిని సర్వాంతర్యామి అయిన సాయిబాబా గ్రహించారు. ఇతరులకు అది ఎలా అనుభవమవుతుంది. వారు పదాల అర్థాల కోసం శ్రమిస్తారు. 156. నానా

యొక్క చంచలమైన మనోవృత్తిని తెలుసుకుని అతని మనసును స్థిరపరచటానికి బాబా ఏం ఉపదేశం ఇచ్చారో వినండి.157. 'నానా! ఎందుకు మనసులో ఆందోళన పడుతున్నావు? ఇంద్రియాలు వాని వాని ధర్మాలను ఆచరిస్తుండగా వాటిని ఎవరూ అడ్డుపెట్టరాదు. కారణం అందులో ఏం హాని లేదు.158. బ్రహ్మదేవుడు రచించిన సృష్టిలోని అతని కళాకౌశలాన్ని మనం గ్రహించకపోతే సృష్టిలోని రసికత వ్యర్థమై పోతుంది. అంతా క్రమక్రమంగా సరి అవుతుంది.159.ముందు ద్వారం తెరచి ఉండగా వెనుక ద్వారం వద్దకు వెళ్లటం ఎందుకు? మనసు నిర్మలంగా ఉంటే ఎటువంటి కష్టాలు ఉండవు. 160.మనసులో దురాలోచనలు లేనప్పుడు దాపరిక మెందుకు? కన్ను చూచే పనిని చేస్తుంది. ఇక్కడ సంకోచ మెందుకు?' అని చెప్పారు.161. అప్పుడు అక్కడ మాధవరావు కూడా ఉన్నాడు. అతనిది అసలే పరిశోధించే స్వభావం. తన జిజ్ఞాసను తీర్చుకోవటానికి బాబా మాటల యొక్క భావాన్ని నానాను అడిగాడు. 162. నానా మాధవరావుతో ఇప్పుడు ఊరుకో,బసకు వెళ్ళేటప్పుడు దారిలో బాబా మాటలకు అర్థం చెబుతానని చెప్పాడు.163.క్షేమకుశల వార్తలన్నీ ముగిశాక సాయి సమర్థునికి పాదాభివందనం చేసి నానా తన బసకు బయలుదేరాడు. అతని వెంట మాధవరావు వెళ్లాడు.164.అతడు వెంటనే నానాను 'నానా అంతా క్రమ క్రమంగా సరి అవుతుంది అన్న బాబా మాటలకు అర్థం స్పష్టంగా తెలియ చేయి అని అడిగాడు. 165. అతనికి జవాబు చెప్పటానికి నానాకు మనసు అంగీకరించలేదు.అందుచేత ఆ విషయాన్ని మరిపించాలని ప్రయత్నించాడు.దాంతో మాధవరావు అనుమానం మరింత పెరిగింది.అతని మనసుకు ఊరట కలగ లేదు.166.అప్పుడు నానా జరిగిన విషయాన్నంతా మనసు విప్పిచెప్పి మాధవరావు సందేహాన్ని తీర్చి ఆ

సమస్యను పరిష్కరించాడు.167.బాబా ఎంత సమర్థులు. వారు అంతఃకరణసాక్షి. కనుక ఎవరి దృష్టి ఎటు మళ్లినా వారికి అంతా ప్రత్యక్షం.168.ఇటువంటి వింతైన విషయం వింటే శ్రోతలకు ఆశ్చర్యం కలుగుతుంది. ఇందులోని గర్భితమైన అర్థాన్ని గమనిస్తే అత్యంత అమూల్యమైన స్థైర్యం శాంతి లభిస్తాయి. 169.మనసు అసలే చంచల స్వభావం కలది. దీనిని స్వేచ్ఛగా విహరించ నీయరాదు. ఇంద్రియాలు కలవరపెట్టినా శరీరం ఉద్రేక పడకూడదు. 170.ఇంద్రియాలపై నమ్మకం, విషయ సుఖభోగాలను అనుభవించాలనే లాలస ఉండకూడదు. మెల్లమెల్లగా అభ్యాసం చేస్తే మనో చాంచల్యం శాంతిస్తుంది. 171. బానిసవలె ఇంద్రియాలకు అధీనమైపోరాదు.అవి కూడా ఎప్పుడూ అణగి ఉండవు. సందర్భానుసారంగా వానిని జాగ్రత్తగా నిగ్రహించాలి. 172. రూపం దృష్టి యొక్క విషయం. వస్తువు యొక్క సౌందర్యాన్ని నిర్భయంగా చూడవచ్చు.అక్కడ సిగ్గు పడాల్సిన అవసరమేముంది? దుర్బుద్ధికి చోటివ్వకూడదు.173. మనసును వాసనా రహితంగా చేసుకుని, పరమేశ్వరుని సృష్టిని అవలోకించండి. ఇంద్రియాలు సహజంగా నిగ్రహింప బడతాయి.విషయ భోగాల విస్మరణ కలుగుతుంది.174. రథాన్ని కోరుకున్న చోటుకు తీసుకుని వెళ్ళటానికి సారథి మూలకారకుడైనట్లే, బుద్ధి ఇంద్రియాలను వాని ఆకర్ష ణల నుండి దక్షతతో రక్షిస్తుంది.175.సారథి రథాన్ని అదుపులో ఉంచినట్లే బుద్ధి ఇంద్రియ దమనం చేసి శరీరం యొక్క స్వేచ్ఛా విహారాన్ని మనసు యొక్క చంచలత్వాన్ని అదుపులో ఉంచుతుంది.176. శరీరం, ఇంద్రియాలు, మనసుతో కూడుకున్నట్టి జీవుని భోక్తృత్వం ముగిసిపోగానే పరమేశ్వర ప్రాప్తి బుద్ధి యొక్క సామర్థ్యం వలననే.177. కళ్లు మొదలగు ఇంద్రియాలు గుఱ్ఱాలు. రూపరసాది విషయాలు నరకానికి తీసుకుని వెళ్లే మార్గాలు.178.విషయ సుఖాభిలాష ఏ కొంచెమైనా ఉన్నా అది పారమార్థిక

సుఖాన్ని నాశనం చేస్తుంది. అందుచేత వానిని నిశ్శేషంగా త్యజించండి. అప్పుడే మీకు మోక్షప్రాప్తి.179. బాహ్యేంద్రియాలను అదుపులో ఉంచుకుని మనసులో విషయాసక్తి ఉంటే జనన మరణాలు అంతం కావు. విషయాలు అత్యంత ఘాతుకాలు.180.వివేకి అయిన సారథి ఉంటే పగ్గాలను తెలివిగా చేత్తో పట్టుకుంటాడు. అప్పుడు ఇంద్రియాలనే గుఱ్ఱాలు కలలో కూడా చెడు దారిలో పోవు.181.ఇలా మనసును శాంతింప చేసే నిగ్రహవంతుడు, దక్షుడు, కుశలుడు, చతురుడు అయినటువంటి సారథి భాగ్యవశాత్తు లభిస్తే ఇక విష్ణు ప్రాప్తికి ఎంతో దూరం ఉండదు.182.అదే పరబ్రహ్మపదం. ఆబ్రహ్మకే మరోపేరు 'వాసుదేవ.' అదే సర్వోత్కృష్టమైన పరమ పదం. పరాత్పరుని పరం ధామం.183.ఈ అధ్యాయం ముగిసింది. తరువాతి అధ్యాయం ఇంతకంటె మధురమైనది.సద్భక్తుల మనసులను రంజింపచేస్తుంది.క్రమంగా శ్రవణం చేయండి.184.జగచ్చాలకుడు బుద్ధి ప్రేరకుడైన సద్గురు చరణాల యందు హేమాడు కృతజ్ఞతా పూర్వకంగా మస్తకాన్ని సమర్పిస్తున్నాడు.185. స్వస్తి శ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో సాధుపరీక్ష మనో నిగ్రహమను నలుబది తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు.శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 50 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

నాకు ఈ మానవజన్మనిచ్చిన తల్లిదండ్రుల ఉపకారానికి అంతులేదు. వారు నాకు మానవదేహాన్నిచ్చారు. నేను వారికి క్రిమిలా జన్మించలేదు.1. గ్రుడ్డివానిగానో మూగవాని గానో చెవిటి వానిగానో కుంటివానిగానో పుట్టలేదు. తల్లి గర్భాన్ని బాధించలేదు. మంచి శరీరంతో సవ్యంగా పుట్టాను.2. దైవవశాత్తు పరమేశ్వరుని అనుగ్రహం వలన పాదాభివందనం చేయించుకొనే ఉత్తమ బ్రాహ్మణ వర్ణంలో జన్మించి నేను భాగ్యశాలినయ్యాను.3. జన్మజన్మలకూ కోటానుకోట్ల తల్లిదండ్రులు లభిస్తారు. కాని ఈ జనన మరణాలను తప్పించే వారు లభించరు.4. జన్మ నిచ్చిన వారు తండ్రి. రెండవ తండ్రి ఉపనయనం చేసేవారు. మూడవవారు అన్నప్రదానంతో పోషించే వారు. నాల్గవవారు భవభయాన్ని తొలగించేవారు.5. ప్రపంచంలో వీరంతా సమానం. కాని కరుణాళుమైన సద్గురువు వంటి నిజమైన తండ్రి వేరే ఎవరూ ఉండరు. విశేషమైన వారి చాతుర్యాన్ని వినండి .6. తల్లిగర్భంలో వీర్యాన్ని నిక్షేపించి యోనిద్వారా జన్మను ప్రసాదించినవారు కేవలం లౌకిక తండ్రి. సద్గురువు అలౌకికమైన తండ్రి .7. వారు వీర్యాన్ని ఒక్క కణమైనా వెచ్చించకుండా నీచమైన యోనిలేకుండా పుత్రునికి జన్మనిచ్చి పూర్తి అనుగ్రహాన్ని కలుగచేస్తారు.8. జనన మరణాలను తొలగించేవారు, కరుణాఘనులు, జ్ఞానప్రకాశకులు, వేదాలలో గుహ్యంగా ఉన్న సత్యాన్ని జ్ఞానాన్ని ప్రతిపాదించేవారు,

సర్వవ్యాపకులైన గురువర్యులకు నమస్కారం!.9.ప్రపంచంలోని అంధకారాన్ని తొలగించే భాస్కరా! ఆత్మసాక్షాత్కారాన్ని ప్రసాదించే సత్పురుషశేఖరా! భక్త చిత్తచకోరచంద్రా! కల్పతరువరా! గురువరా! మీకు నమస్కారం!. 10.గురుమహారాజు యొక్క మహిమ అగాధం.వారిని వర్ణిస్తే వాక్కు యొక్క అహంభావం కరిగిపోతుంది.వారి చరణాలయందు శిరసుంచి మూగవానిలా ఊరికే ఉండటం మంచిది.11.పూర్వ జన్మలో అఖండతపస్సు చేసి ఉండకపోతే, తాపత్రయాలను నశింపచేసే సత్పురుషుని దర్శనం ఎవరికీ సంభవం కాదు. 12.తమ శ్రేయస్సు కోసం పరమార్థాన్ని మోక్షాన్ని సాధించాలని తలచేవారు సత్పురుషులకు అంకితమైపోతే వారికి ఎటువంటి లోటూ ఉండదు.13. సత్సంగం ధన్యం,దాని మహిమను నేనెంతని వర్ణించను? అది సద్భక్తులకు వివేకాన్ని, విరక్తిని, పరమశాంతిని కలిగిస్తుంది.14.సాయి కేవలం చైతన్యమూర్తి. వారు అవ్యక్తంనుండి వ్యక్తంలోకి వచ్చారు.వారి విషయాతీతస్థితిని ఎవరు నిశ్చయంగా వర్ణించగలరు? 15.భావార్థులైన భక్తులకు,ప్రేమికులైన శ్రోతలకు కరుణామయులైన వారు,ప్రేమతో తమ చరితాన్ని తామే స్వయంగా రసవత్తరంగా తెలియచేశారు.ఇది భక్తులకు మందిరం.16.వారి హస్తం శిరసుపై పడగానేఅహంభావం తునాతునకలైపోయి సోహం భావం మొదలైన దృశ్య జగత్తు అంతా ఆనంద భరితంగా భాసిస్తుంది.17.అటువంటి వారి కీర్తిని వర్ణించడానికి పామరుణ్ణి నాకు శక్తి ఎక్కడిది?కరుణాళువైన వారే భక్తులపైని ప్రేమతో తమ చరితాన్ని తామే ప్రకటం చేశారు.18.ఆ సాయి సమర్థుల చరణాలకు సాష్టాంగ వందనం.సాధుసత్పురుషులకు పాదాభివందనం. శ్రోతలకు అభివందనం. అందఱికీ ప్రేమాలింగనం. 19. సాయిబాబా సహజంగా మాట్లాడుతూ ముచ్చటలను చెప్పేవారు.వానిలో నీతి నిండి ఉండేది.

నిత్యశాంతిని అలంకార భూషణంగా కలిగి ఉన్న వారిని మహానుభావులు ధ్యానిస్తారు.20. సాయిని సూర్యునితో పోల్చటం తగదు. కారణం సూర్యుడు అస్తమిస్తాడు. చంద్రునితో పోల్చాలంటే చంద్రుడు రోజురోజుకూ క్షీణిస్తూ ఉంటాడు.సాయి ఎల్లప్పుడూ సంపూర్ణంగా ఉంటారు.21. హేమాడు వారి చరణాలకు నమస్కరించి ఈ కథను శ్రద్ధగా ప్రేమగా సావధానచిత్తంతో వినండి అని శ్రోతలకు వినయంగా విన్నవిస్తున్నాడు. 22. నేలను చక్కగా దున్ని విత్తనాలు నాటినా మేఘాలు కరుణించి వర్షించకపోతే పంట పండుతుందా? 23. సత్పురుషుల చరితం చెవులలో పడగానే పాతకాలు నశించిపోతాయి.పైగా కథా శ్రవణంతో పుణ్యం అంకురిస్తుంది.అందువల్ల ఈ పండుగ యొక్క లాభాన్ని పొందండి .24.సాలోక్య సామీప్యాది నాలుగు ముక్తుల యందు ఆసక్తి మనకు అనవసరం.సాయిబాబా యందు నిశ్చలమైన భక్తి కుదిరితే చాలు.అదే మనకు పరమ ప్రాప్తి.25. ఘనం అసలు బద్ధులమే కాము. మనకు ముక్తితో ఏం సంబంధం? సత్పురుషుల యందు మనకు భక్తి జాగ్రతమౌతే చాలు.దానివలననే చిత్తశుద్ధి కలుగుతుంది.26. నీ నా అన్న భేదబుద్ధిలేని ఆత్మ యొక్క సహజ స్థితిని మరియు అభేదభక్తిని మనం సాయివద్దనుండి కోరుకుందాం.27. ఇప్పుడు శ్రోతలకు ఇదే నా మనవి.ఈ గ్రంథాన్ని పఠించేటప్పుడు వాచ్యం వాచనం వాచక వ్యక్తి ఈ మూడూ ఏకాత్మస్థితియందు ఉండేలా చూడండి.28. ఈ హేమాడుపంతును వదలి పెట్టండి.ఇతడు ఈ సచ్చరితకు కర్తకాడు. కేవలం భక్తుల శ్రేయస్సు కొఅకు కారణభూతుడైన ఒక నిమిత్తమాత్రుడు.29.దైవవశాత్తు లభించిన ముత్యపు చిప్పను వదిలివేస్తే దానిలోని ముత్యాలు చేయి జారిపోతాయి. అశ్వత్థ వృక్షం యొక్క ఉత్పత్తి గూర్చిన విషయం మనకెందుకు? తమ శ్రేయస్సును కోరుకునే వారికి ఉదాసీనత పనికిరాదు.30. ఈ కథలను తెలియచేసేవారు

సాయిబాబా తప్ప వేరే ఎవరూ కారు. వారే శ్రావ్యం శ్రవణం మరియు శ్రోత. ఈ ఏకాత్మతను మరచిపోరాదు. 31. లేకపోతే అది పతన కాదు. శ్రవణంలో చెవులు శ్రద్ధగాలేకపోతే మనసు ఏకాగ్రంగా లేకపోతే అక్కడ శబ్దాల అర్థాలను ఎవరు గమనిస్తారు. 32. నిరభిమానంగా శ్రవణం చేయాలి. శ్రోతలను కూడా సాయిగానే భావించాలి. అప్పుడే ఆ శ్రవణానికి సార్థకత. అలా ఎప్పుడూ అద్వైతభావంతో ఉండాలి. 33. అప్పుడే సకల ఇంద్రియ ప్రవృత్తి నిశ్చియంగా సాయిరూపమవుతుంది. ఈ విధంగా నీరులోని నీటి తరంగాల వలె మనోవృత్తి సాయిలో విలీనమవుతుంది. 34. అప్పుడే గ్రంథంలో జ్ఞానులకు పరమార్థ బోధ. వినోద ప్రియులకు వినోదం. కవితా కోవిదులకు రసాస్వాదం. అంతటా ఆనందం లభిస్తుంది. 35. ఇంతకు ముందు ఈ సచ్చరితలోని ముప్పైతొమ్మిదవ అధ్యాయంలో ఉత్తముడైన ఒక భక్తునికి సాయిసమర్థులు ఉపదేశం చేశారు. 36. ఆ భక్తుడు సాయిబాబా వద్ద ఉన్న సమయాన భగవద్గీతలోని నాలుగవ అధ్యాయాన్ని మొదటి నుండి వల్లిస్తూ ఉన్నాడు. 37. ఒకవైపు బాబా చరణసేవ చేస్తూ మరోవైపు మెల్లగా గీతా శ్లోకాలను చెప్పుకుంటున్నాడు. ముప్పై మూడవ శ్లోకం ముగిసి ముప్పై నాలుగవ శ్లోకాన్ని మొదలు పెట్టాడు. 38. ఏకాగ్రమనసులో తన్మయత్వంతో తనలో తాను చెప్పుకుంటున్నాడు. కాని జనులకు అది అర్థం కాకపోతే ఏమౌతుంది? 39. అతడు అలా ముప్పై నాలుగవ శ్లోకాన్ని చెప్పుతుండగా ఉత్తముడైన ఆ భక్తుని అనుగ్రహించి, అతనిని సన్మార్గంలో ప్రవేశ పెట్టాలని సాయినాథునికి అనిపించింది. 40. ఆ భక్తుని పేరు నానా, బాబా అతనితో, 'నానా ఏమిటిరా మనసులో ఏదో గొణుక్కుంటున్నావు? స్పష్టంగా నోటితో ఎందుకు చెప్పవు? 41. నేను ఎప్పటి నుండో చూస్తున్నాను. నోటితో ఏదో వల్లిస్తున్నావు కాని మాటలు స్పష్టంగా వినిపించటం లేదు. ఏమిటి అంతటి

రహస్యం?'అని అడిగారు.42.'గీతను చదువుతున్నాను ఇతరులకు ఇబ్బంది కాకూడదని మెల్లగా చెప్పుకుంటున్నా'నని నానా స్పష్టంగా చెప్పాడు.43.'సరే అది ఇతరుల విషయం. నా కోసం స్పష్టంగా చెప్పు. అసలు నీకైనా అది అర్థమైందా'అని శ్రీవారు అన్నారు.44. అప్పుడు నానా ప్రణామం చేసి 'తద్విద్ధి ప్రణిపాతేన' అన్న శ్లోకాన్ని గట్టిగా వినిపించాడు.దానిని విని బాబా సంతుష్టులయ్యారు.45. తరువాత ఆ శ్లోకానికి అర్థం చెప్పమని అడగగా పూర్వం ఆచార్యులు వ్యాఖ్యానించిన అర్థాన్ని నానా చక్కగా చెప్పాడు. బాబా తల ఊపారు.46. మరల నానాను 'ఉపదేక్ష్యంతి తే జ్ఞానం' అన్న తృతీయ చరణాన్ని బాగా మననం చేసి చూడు. 47. అందులోని 'తే' అక్షరం తరువాత 'అ' కారం అర్థాన్ని తెలిపే అవగ్రహ గుర్తును ఉంచడం వలన అజ్ఞాన పదంతో విరుద్ధ అర్థం వస్తుందా చూడు.48. శంకరానందులు, జ్ఞానేశ్వర్, ఆనందగిరి మరియు శ్రీధరస్వామి మధుసూదనాది భాష్యకారులు, జ్ఞాన పరంగా చెప్పిన అర్థం.49.అందఱూ గౌరవించినది నాకూ కూడా తెలుసు. కాని అవగ్రహాన్ని ఉంచడం వలన వచ్చే విశేషార్థాన్ని తెలిసికూడా వ్యర్థంగా కోల్పోవటం ఎందుకు?50.అని చెప్పి సాయి కరుణామయులు చాతక పక్షుల వంటి భక్తుల కోసం కురిపించిన బోధామృతాన్ని ఇదివరకే వర్ణించడమైంది.51.కాని సాయిలీల మాసపత్రిక పాఠకులకు ఈ అర్థం సమంజసంగా లేదు. కొందఱికి సందేహం కలిగించింది. ఇది ఆశ్చర్య కారకం అయింది.52. వారికి సమాధానం కలగటానికి, అజ్ఞానమనే పదాన్ని ప్రతిపాదించటాన్ని సమర్థించటానికి మరొకమారు చిన్న ప్రయత్నం చేస్తాను.53.బాబాకు సంస్కృతభాషా జ్ఞానం ఎక్కడిది అని ఎవరికైనా అనుమానం కలగవచ్చు. కాని సత్పురుషులు ఎఱుగని దేదీ లేదు. అయితే సందేహానికి కారణం వేరే ఏదో అయి ఉంటుంది.54.'ఏకేన జ్ఞాతేన సర్వంహి విజ్ఞాతం

భవతి' ఇది ప్రమాణం. ఒక్క ఆత్మను తెలుసుకుంటే సర్వాన్ని తెలుసుకోవచ్చు.ఈ శ్రుతి వచనాన్ని ఎవరు అంగీకరించరు? సాయిబాబా ఆ అపరోక్ష జ్ఞానం కలవారు.55.విశ్వాన్నంతా కరతలామలకంలా చూడ గలవారికి, ఎవరి ప్రభావంతో సూర్యుడు ప్రకాశిస్తున్నాడో అటువంటి సత్పురుషులకు తెలియనిది ఏముంది? 56.అటువంటి ఒక్క జ్ఞానం ఉన్న వారికి అజ్ఞాన మెక్కడిది? వారికి అన్ని విద్యలు అవగతం. ఇక సంస్కృత భాష ఏమంత గొప్ప విద్య అని.57.శ్రీసాయి లీలా మాసపత్రిక పాఠకులు కొందఱు నానాసాహెబు వాదం విశ్వసించ తగినది కాదు అనవసరమైనది. అజ్ఞానాన్ని తెలిపే అవగ్రహ గుర్తు అతని స్వంత కల్పితంతో లేవదీసినది అని అంటారు.58.నానాయే ఈ నాటకాన్నంతా సృష్టించాడు.తనకి జ్ఞానాన్ని గొప్పగా చాటుకోవటానికి ఈ అజ్ఞాన కాండాన్ని వితండవాదాన్ని వ్యర్థంగా లేవదీశాడు.59. అవగ్రహమనే గుర్తుతో జ్ఞానమన్న పదం వద్ద అజ్ఞానం అన్న పదాన్ని వేసి గీతకు విపరీత అర్థాన్ని కల్పిస్తున్నాడు అని అంటారు. 60.వాస్తవానికి చాలా జాగ్రత్తగా ఆలోచిస్తే సాయిలీలా మాస పత్రికలో ముప్పై తొమ్మిదవ అధ్యాయం గురించి ఎటువంటి విపరీతార్థమూ అసంబద్ధమూ చెప్పబడలేదు.61.ఎవరు ఎలా అనుకున్నా నానామాట ప్రామాణికంగాని అప్రమాణికంగాని, అతడు చెప్పినది అర్థంలేనిదని వ్యర్థమైనదని అనరాదు.62. నానాపైన ఏ ద్వేషం లేకుండా, ఏ వికారాలు లేకుండా పాఠకులు తమ దృష్టి దోషాన్ని తొలగించు కుంటే అంతా ఏ దోషం లేకుండా సవ్యంగా కనిపిస్తుంది.63.ఉత్తమోత్తమమైన శ్రీసాయిలీలా పత్రికలో ముప్పైతొమ్మిదవ అధ్యాయాన్ని చదవకుండా ఈ యాభైయవ అధ్యాయాన్ని అర్థం చేసుకోవటం సుగమం కాదు.64.శ్రీకృష్ణుని నోటి నుండి వెలువడిన భగవద్గీతలో జ్ఞానయజ్ఞమనే చతుర్థాధ్యాయంలోని ముప్పై నాలుగవ శ్లోకంలో

అజ్ఞానమను విషయంపై ఈ ప్రవచనం జరిగింది.65.'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ఉపదేక్ష్యంతి తేజ్ఞానం జ్ఞానినః తత్వదర్శినః' 66. ఇది గీతలోని మూలశ్లోకం. ఇందులోని మూడవ చరణాన్ని గమనించండి. జ్ఞాన మన్న పదానికి ముందు ఒక అవగ్రహాన్ని వేస్తే అజ్ఞాన పదాన్ని సూచిస్తుంది.67. అవగ్రహ పదాన్ని ఊహించక పోతే అది నిస్సందేహంగా జ్ఞానమన్న పదమే.దానికి విరుద్ధంగా ఎవరూ అడ్డు చెప్పరు. ఆ అర్థం సర్వత్ర గ్రాహ్యమే. 68.'జ్ఞానాదేవతు కైవల్యం'జ్ఞానం వలననే మోక్షప్రాప్తి అన్న శ్రుతివచనాన్ని అందఱూ అంగీకరిస్తారు.అయినా తత్త్వజ్ఞులు జ్ఞానాన్నే ఉపదేశించాలనే బంధనం లేదు.69. నేను ఆత్మను, కేవలం సాక్షిని, శుద్ధబుద్ధముక్తుణ్ణి, సర్వమూ తెలుసుకునే వాణ్ణి,సర్వప్రాణులలోని ఉజ్జ్వలమైన శుద్ధచైతన్యాన్ని నేనే, ఎప్పుడూ చెరగని అద్వైత ఆనందంతో సంపూర్ణంగా ఉన్నాను.70. కాని నేను అజ్ఞానం కాను అజ్ఞానంతో చేసే పనిని కూడా కాను.'అయమాత్మా బ్రహ్మ' నేను ఆత్మను.'ప్రజ్ఞానం ఆనందం''జ్ఞానమే ఆనందం అన్న ఆనిధిని నేనే'.71. అహంబ్రహ్మాస్మి అన్న ఈ మహావాక్యాన్ని నిత్యం స్మరణ యందు ఉంచటం ఇదే శుద్ధవిద్య. నేను పాపిని, అభాగ్యుణ్ణి, దురదృష్టవంతుణ్ణి అనుకోవటం అవిద్య అంటే అజ్ఞానం.72. విద్య అవిద్య ఈ రెండూ మాయ యొక్క పురాతన శక్తులు. మొదటిదైన అజ్ఞానం వలన బంధనం ఏర్పడితే రెండవదైన జ్ఞానం వలన బంధ విముక్తి.ఇవి జీవునికి అనాది నుండి ఉన్నవి.73. నామరూపాలతో ఉన్న ఈ దృశ్య జగత్తంతా మాయా సంభ్రమం.ఈ మాయను నిర్వచించటం పరమ కష్టం. దీనిని దాటటం మరీ కఠినం. 74. ఏ చోటునుండి కల్పనలు స్ఫురిస్తాయో అదే మాయ యొక్క నివాసస్థానం. బంధనం మరియు ముక్తీ ఈ రెండు స్థితులూ కల్పనలో నుండే ఉత్పన్నమౌతాయి.75.'జ్ఞానాదేవతుకైవల్యం' అన్న శ్రుతి సిద్ధాంతం

అత్యంత సత్యం. కాని పాపకర్మలు నశించిపోనంత వరకు జ్ఞానోదయం కాదు.76.శుద్ధ జ్ఞానం ఉన్న వారికి సంకల్ప వికల్పాలు ఉండవు. వారికి మాయా బంధనముండదు.వారి వద్ద వికారాలకు స్థానముండదు.77. శుకమహర్షి వంటి పరమ జ్ఞానికి కూడా సంశయాల వల్ల నష్టం కలిగింది. ఈ అనుమానాల కారణంగానే అజ్ఞానం ప్రకటమౌతుంది.దీనిని గురువు తప్ప ఎవరూ తొలగించ లేరు.78. జ్ఞానులకు సందేహాలు కలిగితే వారిని కూడా అభిమానం ఆవరిస్తుంది 'పాలతో నిండి ఉన్న పాత్రలో పులుపు చుక్క పడితే పాలన్నీ విరిగి పాడైపోతాయి' 79.అందువలన ముందు అజ్ఞానాన్ని తెలుసుకోవాలి.అజ్ఞానం తొలగిపోతే చిత్తశుద్ధి కలిగి నిరవధిక జ్ఞానంతో వెంటనే అభేద సమాధి కలుగుతుంది.80.ద్రవ్యాన్ని, వైభవాన్ని ధ్యానించే వారికి, విషయ సుఖాలలో తృప్తి చెందని వారికి, ఎప్పుడూ భార్యా బిడ్డల గురించే ఆలోచించే వారికి, జ్ఞానం అజ్ఞానమే.81. ఈ విధంగా ధనమందు భార్యాబిడ్డల యందు మోహం కలవారు, జ్ఞానులైనా తమ మంచిని తెలుసుకోలేరు. కనుక భక్తి కలగనంత వరకు వారి జ్ఞానం అజ్ఞానావృతమై ఉంటుంది.82. జీవసముదాయమంతా అజ్ఞానంతో ఉంది. ఈ అజ్ఞానం నుండి ముక్తి పొంది జ్ఞానులై జ్ఞానాతీతస్థితిని పొందటం, అదే నిశ్చయంగా బ్రహ్మరూపాన్ని పొందటం. 83. అజ్ఞానం తొలగిపోతే జ్ఞానం ప్రకటమౌతుంది.క్షమాశీలురే, జ్ఞానులు శరీరాభిమానం తొలగిపోనంత వరకు మాయాధీనంలో ఉన్నట్లే.84.రామకృష్ణాది అవతారపురుషులకు సనత్ సనకాది శ్రేష్ఠులకు, మాయ వారి ఆజ్ఞానుసారం ప్రవర్తించే దాసి. కాని అది ఇతరులను భ్రమింప చేస్తుంది.85.ఆత్మ సర్వప్రాణుల హృదయాలలో ఉన్నా ఎవరూ తమ ఆత్మ స్వరూప స్థితిని తెలుసుకోలేరు. మాయ యొక్క శక్తి అతర్క్యం. దీని ఆవరణ శక్తి అగాధం.86.'నేనే కర్తను నేనే భోక్తను' అన్న అహంభావాన్ని విడువకుండా

హృదయంలోని పరమాత్మను శరణు వేడకుండా ముక్తి లభించదు.87.నిత్యానిత్య వస్తు వివేకంతో శ్రవణమనన నిదిధ్యాసనం చేయాలి. శమదమాది షట్ సంపత్తిని సంపాదించుకోవాలి. అప్పుడే అజ్ఞానం నశిస్తుంది.88. జగత్తు నాకంటే వేరు. నేను పరిమితుణ్ణి, పరిచ్ఛిన్నుణ్ణి. నేను ఈ శరీరాన్ని మాత్రమే అన్న భావన శుద్ధ అజ్ఞానం. 89.జ్ఞానాన్ని ప్రతిపాదించే వేద శాస్త్రాలలో పరమదయామయులైన భాష్యకారులు అనుబంధ చతుష్టయాన్ని విస్తార పూర్వకంగా వర్ణించారు.90. అధికారి, విషయం, సంబంధం అనేవి మూడు, నాలుగవ అనుబంధం ప్రయోజనం.ప్రయోజనం యొక్క వివరణతో అజ్ఞానం నశించే మార్గం అప్పుడు బోధపడుతుంది. 91.జీవబ్రహ్మలు ఐక్యమవటమే- ఇదే వేదాంతంలోని ముఖ్య విషయం. ఆ ఐక్య ప్రమేయాంతర్గతంలో ఉన్న అజ్ఞానాన్ని నశింపచేయటం ప్రయోజనం.92.ఆ మూల అజ్ఞాన నివృత్తియే ఆత్మానంద ప్రాప్తి. కనుక యుక్తి ప్రయుక్తులతో అజ్ఞానాన్ని నశింప జేయటం ఆవశ్యకం.93. జీవబ్రహ్మల యందు ద్వైతభావం తొలగక పోతే జ్ఞానులు కారు. శరీరాభిమానం ఉన్నవారి జ్ఞానం సంపూర్ణ అజ్ఞానం. 94. అనుచితమైన కర్మలను ఆచరిస్తూ జ్ఞానులమని చెప్పుకునే వారి జాగృత జ్ఞానం తగల బడినట్లే. వారు నిద్రిస్తున్న కుంభకర్ణులు.95. వేద శాస్త్రాలలో చెప్పినట్లు గాక విపరీతంగా ఆచరిస్తూ, వర్ణాశ్రమ ధర్మాలను పాటించని వారి చిత్తశుద్ధికి సాధనం వారి అజ్ఞానాన్ని నశింప చేయటం ఒక్కటే.96. సత్త్వరజస్తమాది మూడు రకాల గుణాలు,శబ్ద స్పర్శ రూప రసాది విషయాలు,అనేక రకాల వికారాలు,జిహ్వా మరియు ఉపస్థ ఆది ఇంద్రియాలు,వీని ద్వారా బ్రహ్మాది దేవతలందఱూ కూడా మోసగింపబడ్డారు97. జగత్తులో ప్రాణులన్నీ అనాదినుండీ అజ్ఞానంతోనూ మాయతోను కప్పబడి ఉన్నాయి.రాగద్వేషాది వికారాలతో మోహింపబడి

ఇవన్నీ అజ్ఞానంతో ఆవృతమై ఉన్నాయి.98. జీవుడు అజ్ఞానం వలన బద్ధుడై నాడు. అతని శుద్ధ ఆత్మస్వరూపం ప్రకటమవటానికి అజ్ఞానం, కోరికలు మరియు కర్మబంధనాలు అన్నీ విడిపోవాలి.99.ఆవు పొదుగు పాలతో బాగా నిండుగా ఉంటుంది. అక్కడే పొదుగును గట్టిగా పట్టుకుని జోరీగ ఉంటుంది. కాని దానికి రక్తం ప్రీతి.దానికి పాల అవసరం ఏముంటుంది?100.అట్లే కప్పకు మరియు తుమ్మెదకు అందమైన తామరపువ్వు నివాస స్థానం. అయితే పూవు పరాగంలో భ్రమరం విహరిస్తే అక్కడే ఉన్న కప్ప బురదను సేవిస్తుంది. 101. జ్ఞాన నిధి ఎదురుగా కనిపించినా మూర్ఖుడు అజ్ఞానం వైపే ఆకర్షింపబడతాడు.మూఢునికి అజ్ఞానమే జ్ఞానమని అనిపిస్తుంది. జ్ఞానం గురించిన పాఠాలు వానికి ఏం ఉపయోగపడతాయి?.102. అజ్ఞానం నిర్మూలనమౌతే బ్రహ్మజ్ఞానం స్వయంగా ప్రకటమౌతుంది.అందుచేత ముందు అజ్ఞాన ప్రతిపాదన ఆవశ్యకం అని తెలుసుకోవాలి.103. బ్రహ్మజ్ఞాన సమానం పవిత్రమైనది త్రిజగాలలో వేరే ఏదీలేదు.దాని గురించిన బోధ అత్యంత మహత్వం గలది. అది లేని జీవనం వ్యర్థం.104.బుద్ధి మొదలైన ఇంద్రియాల చేష్టలకు బ్రహ్మ ఒక విషయమైతే ఒక్క ఇంద్రియమైనా బ్రహ్మను చూపించి ఉండేది. 105.బుద్ధి గ్రాహ్యం అతీంద్రియం. బ్రహ్మతత్వాన్ని బుద్ధి ద్వారా గ్రహించవచ్చు. కాని అది ఇంద్రియాలకు అతీతమైనది అని స్మృతి గర్జించినా ఇది శ్రుతి సమ్మతం కాదు.106.బుద్ధి మొదలగు ఇంద్రియాల అస్తిత్వం లేనప్పుడు విషయాన్ని గ్రహించే ఉపకరణాలు ఉండవు.అప్పుడు బ్రహ్మయొక్క అస్తిత్వాన్ని అంగీకరించడానికి అవకాశం ఉండదు.107. ఇంద్రియాలకు గోచరించేవి మాత్రమే ఉన్నాయి కాని ఇతర వస్తువు లేదు అని అంతటా ప్రసిద్ధి.అప్పుడు బ్రహ్మ అస్తిత్వం ఎక్కడా లేనట్టే అర్థం.108.అంటే బ్రహ్మ ఎప్పుడూ ఉండడు అని దీని

అర్థం. ఈ అర్థం వల్ల అనర్థం అవుతుంది. సూక్ష్మమైన తారతమ్య దృష్టితో గ్రహించిన పారంపారిక అర్థం బట్టి బుద్ధి ఎల్లప్పుడూ ఉండే సద్వస్తువు.109. బుద్ధికూడా లయమై పోయినప్పుడు అక్కడే అది సద్ వస్తువుగా అనుభవ రూపంలో ఉంటుంది. నిస్సందేహంగా ఆత్మ విశ్వానికి మూలం. అందువల్ల ఏవి నశించి లయమైపోయినా, ఆత్మ యొక్క అస్తిత్వం ఎప్పుడూ ఉంటుంది.110. రాయితో కుండను పగులకొట్టితే దాని ఆకారం పోయి కుండ పెంకులు మిగిలి కుండ అస్తిత్వాన్ని తెలుపుతాయి.111. కుండకు ఆకారం తెచ్చిన కార్యం ధ్వంసం అయినా, కుండ యొక్క అస్తిత్వం నశించిపోదు. కుండ పెంకులు కుండ అస్తిత్వానికి సాక్ష్యం. కార్యం యొక్క అస్తిత్వపు అంశ దానిలోనే మిగిలి ఉంటుంది.112. ఏకార్యం యొక్క సమాప్తి అయినా దాని పర్యవసానం ఎప్పుడూ శూన్యం కాదు. ఏ వస్తువు లయమైనా దాని అస్తిత్వం సూక్ష్మరూపంలో ఉంటుంది. దీనికి ప్రమాణం సద్బుద్ధి.113. సర్వతీర్థాలు, వ్రతాలు పావనమైనవే అయినా పావనం కంటె పావనం బ్రహ్మ జ్ఞానం. ఆ బ్రహ్మ జ్ఞానం లేకుండా పూజలు భజనలు నిరర్థకాలు.114. అజ్ఞానం వలన చిత్తం మలినమౌతుంది. ఆ చిత్తం యొక్క మలక్షాళనం పరమేశ్వరుని భక్తితో తప్ప జరగదు. భక్తి లేకుండా జ్ఞానం ఉత్పన్నం కాదు.115. అందువలన ముందుగా అజ్ఞానాన్ని తెలుసుకోవాలి. దాని స్వభావాన్ని దాని గురించిన వర్ణనను స్పష్టంగా తెలుసుకుంటే దాని బంధనం నిరసనమౌతుంది. దీనికి భక్తియే సాధనం.116. ఎదురు కాళ్లతో పుట్టినవారి కళ్లలో అంజనం వేస్తే భూమిలో నిక్షిప్తమై ఉన్న ధనం కనిపిస్తుంది. అట్లే భక్తిని అవలంభిస్తే అజ్ఞానం తొలగిపోయి జ్ఞానోదయం అవుతుంది.117. జ్ఞానమంటేనే ఆత్మస్వరూప ప్రాప్తి. అజ్ఞాన నివృత్తి దానికి మూలం. పరమేశ్వరుని భక్తి లేకుండా మాయా శక్తిని ఎదుర్కోవటం, అశక్యం.118. జ్ఞానం అజ్ఞానం

రెండూ కలిసే ఉంటాయి. వాని నుండి అజ్ఞానాన్ని జాగ్రత్తగా వేరు పరచాలి, ఎసరులో పోసి వండటానికి రాళ్లను ఏరేసి బియ్యాన్ని తీసుకునే విధంగా.119. అంతటా అన్ని ప్రాణులలోనూ భగవంతుడే ఉన్నాడన్న భావంతో జ్ఞానయజ్ఞాలు వగైరా ఉపాసనలను చేసి సర్వవ్యాపి అయిన శ్రీకృష్ణుని చూసే వారు జ్ఞానం కొలకు అజ్ఞానాన్ని దహించివేస్తారు.120. ఇప్పుడు జ్ఞానయజ్ఞ స్వరూపాన్ని గమనించండి. పంచమహా భూతాలు యజ్ఞ మండపం. 'అహంబ్రహ్మాస్మి' ఇందులోని స్తంభం. జీవేశ్వర భేదం ఇక్కడి పశువు.121. పంచేంద్రియాలు, పంచ ప్రాణాలు ఇవే యజ్ఞసామాగ్రి. మనసు బుద్ధి అనే గుండంలో జ్ఞానాగ్ని రగుల్కొల్ప బడుతుంది.122. యజ్ఞ కర్త యజమాని అయిన జీవుడు అజ్ఞానమనే నేతిని ఆహుతి చేస్తాడు. దానితో ఆత్మానంద రసంలో మునిగిన ఆ జీవునికి అవభృత స్నానం జరుగుతుంది.123. తాత్పర్యం, అజ్ఞానమనే నేతిని వ్రేల్చకుండా జ్ఞానాగ్ని ప్రకటం కాదు. జ్ఞానాగ్ని జీవేశ్వరభేదాన్ని కాల్చి అభేద జ్ఞానాన్ని ప్రకటం చేస్తుంది.124. నిర్మలమైన అద్దం దుమ్ముతో కమ్ముకున్నట్లు, అగ్ని ప్రకాశం పొగతో కప్ప బడినట్లు, కామక్రోధాలతో ఆవరింపబడిన జ్ఞానం అజ్ఞానం మరుగున పడి ఉంటుంది.125. చంద్రబింబాన్ని రాహువు మ్రింగినట్లు, నీటిని నాచు ఆవరించినట్లు స్వయం ప్రకాశమైన జ్ఞానాన్ని మాయ కప్పివేస్తుంది.126. గొప్ప గొప్ప జ్ఞానుల మతి భ్రష్టుపట్టి వారు అధోగతి పాలవుతారు. ఉపాయం తెలిసినా వారు రక్షింపబడరు. యథేచ్ఛగా ప్రవర్తిస్తారు.127. కళ్లుండీ గ్రుడ్డివారౌతారు. ప్రజల సాంగత్యాన్ని వదులుకుని నిస్సంగులౌతారు. వారు కూడా బలవంతంగా దుష్ట సాంగత్యం వలన మోసపోతారు. యథేచ్ఛగా ఆచరిస్తారు.128. వాన ప్రస్థాశ్రమానికి వచ్చి, తిరిగి గృహస్థాశ్రమానికి వెళ్లుతారు. చేయరాని పొరపాట్లను చేస్తారు. మునుపు అసహ్యించుకున్న వస్తువును మరల ప్రీతిగా స్వీకరిస్తారు.

129. ప్రయత్నంతో పాపాలను తొలగించుకున్న వారు కూడా దురదృష్టం కొద్ది మరల పాపాలలో పడిపోతారు. ఇటువంటి స్థితిని ఏమనాలి? ఇటువంటి జ్ఞానుల జాతిని ఏమని పేర్కొనాలి! 130. గొప్ప జ్ఞానియై ఉండి పాపపు నీడనైనా కోరని వాడు, మంచి చెడు పనుల యొక్క విచక్షణా జ్ఞానం లేక, దీపానికి ఎఱయై పోయే పురుగువలె వ్యామోహంలో పడతాడు. 131. పాపం చేయటం అజ్ఞానమని పూర్తిగా తెలిసికూడా వాసనల కారణంగా కోరికల ఒత్తిడి వల్ల దానిని లక్ష్య పెట్టడు. 132. జరుగుతున్న ఈ పనులన్నీ కేవలం కోరికల చేష్టల వలననే. కోరిక సర్వానర్థాలకు హేతువు. అదే క్రోధంగా పరిణమిస్తుంది. 133. కోరికకు అవరోధం కలిగితే, అదే కోరిక క్రోధమౌతుంది. ఈ కామ ప్రవృత్తి అడుగడుగునా మోక్షానికి అడ్డుపడుతుంది. ఈ వృత్తియే జ్ఞానానికి ప్రతిబంధకం. 134. కామక్రోధాల బాధలు జీవులను అంటి పెట్టుకుని ఉంటాయి. ఇవి బ్రహ్మస్వరూపానికి సమీపంలో జ్ఞానపంక్తిలో ఉంటాయి. 135. ఇవి నీరులేకుండానే ముంచేస్తాయి. అగ్ని లేకుండానే దహించి వేస్తాయి. ఏ అస్త్రశస్త్రాలు లేకుండానే సంహరిస్తాయి. త్రాడు లేకుండా బంధిస్తాయి. 136. వీని ముందు జ్ఞానులు కూడా నిలవలేరు. జ్ఞానులను చిత్తుగా పరాజితులను చేస్తాయి. వీనికి మహా ప్రళయాన్ని సృష్టించే సామర్థ్యం ఉంది. తెలియకుండానే ప్రాణులను మ్రింగేస్తాయి. 137. చందన వృక్షం యొక్క మూలానికి కాల సర్పం చుట్టుకుని ఉండేలా కామ క్రోధాలు జ్ఞాన గర్భాన్ని చుట్టుకుని ఉంటాయి. 138. ఇంద్రియాలు, మనసు, బుద్ధి ఇవి కోరికలకు ఆయతనాలు. ఈ కోరికల కారణంగా జీవుల జ్ఞానం మూతపడటం వలన, ఇవి జీవులను మోహంలో పడవేస్తాయి. 139. చందనం చెక్క మీకు కావాలంటే సర్పాన్ని చంపేయాలి. అట్లే జ్ఞాననిధిని సంపాదించుకోవాలంటే కామ క్రోధాల ఆవరణను తొలగించాలి. 140. సర్పాన్ని

సంహరించకుండా ఎవరికైనా చందనం చెక్క లభిస్తుందా? కృష్ణ సర్పాన్ని చంపకుండా పూడ్చిపెట్టిన ధన నిధి పాత్ర లభిస్తుందా?141. అట్లే పరతత్త్వమైన ఆత్మజ్ఞాన ప్రాప్తికి మాయ యొక్క ముసుగును తొలగించాలి.ఇది ఒక్కటే సాధనం.142 కనుక ముందు ఇంద్రియాలను నిగ్రహించుకుంటే కామక్రోధాలు అణగిపోతాయి. జీవుడు కామక్రోధాల అధీనంలో ఉంటాడు. అజ్ఞానం జ్ఞానానికి ఆవరణగా ఉంటుంది 143.శరీరం కంటే ఇంద్రియాలు సూక్ష్మం. వాని కంటే మనసు సూక్ష్మం. మనసుకంటే బుద్ధి సూక్ష్మతమం. బుద్ధి కంటెను సూక్ష్మం పరమాత్మ.144. ప్రపంచ ధర్మాలన్నిటికీ అతీతంగా ఉన్న పరాత్పరుడు పరమ సత్యం,అత్యంత హితకారి అయిన ఆ పరమాత్మయే అమృత మయమైన సత్స్వరూపం.145. శుద్ధ బుద్ధ నిత్య ముక్త అభేదస్థితిలో ఉండే తత్త్వం. అదే పరమానందంలో ఉత్పన్నమైన చైతన్యం. 146. పంచీకరణమని దేనినంటారో అదే మాయారూప దర్శనం. దానిని తెలుసుకోవటానికి అధ్యారోప అపవాదాలు ఇవి ఒక్కటే సాధనం. 147.అపంచీకృత పంచమహా భూతాలను పంచతన్మాత్రలని అంటారు. పంచప్రాణాలు, ఇంద్రియాలు, మనసు, బుద్ధి, వీనితో ఆత్మ యొక్క సూక్ష్మ శరీరాన్ని తయారు చేయటం వీనిపని. 148.పంచీకృత పంచభూతాల నుండి విరాట్ పురుషుడు ఉదయిస్తాడు. ఆత్మ యొక్క స్థూల శరీరాన్ని విరాట్ అని జ్ఞానులు అంటారు.149.స్థూల సూక్ష్మ శరీరాలకు కారణం కేవలం ఆత్మ స్వరూప జ్ఞానం లేక పోవటం.అదే భాసించే అవ్యక్త శరీర ం అంటే ఆత్మయొక్క కారణ శరీరం.150. చైతన్యం యొక్క ప్రతిబింబమైన ఈ ప్రసిద్ధ కారణ శరీరానికి కేవలం అజ్ఞానమే కారణం. దీనికి అవ్యక్తమని అవ్యాకృతమని పేర్లు. 151.ఆత్మజ్ఞానం లేకపోవటమే దీనికి కారణం.ఇది అవయవాలతోనూ ఉండదు.అవయవాలు లేకనూ

ఉండదు.రెండు విధాలా ఉండదు.ఈ శరీరం నశించటం కేవలం బ్రహ్మాత్మైకత్వ జ్ఞాన ప్రాప్తితోనే.152.ఆత్మ స్వరూపంలో స్థిరపడటమే మోక్షమని పేరు. ఇంత కంటె మోక్షం వేరే ఏమీ లేదు.తన ఆత్మ స్వరూపంలో ఉండటమే మోక్షం.153. కేవలం బ్రహ్మాత్మైకత్వ జ్ఞానం కలిగితే చాలు.అజ్ఞానం తొలగిపోతుంది.అందువలన అజ్ఞానాన్ని తెలుసుకోవటానికి అజ్ఞాన నిరూపణ ఆవశ్యకం.154. అజ్ఞానం వలన అది అనేక భాగాలుగా విభజింపబడింది. అలా బ్రహ్మకు బహుత్వం వచ్చింది. దానికి సత్ అని పేరు పెట్టారు.ఇలా అది మాటలకు అందే విషయమైంది.155.ఆదిలో ఇంద్రియాలకు అతీతమే అయినా వాక్కుద్వారా బుద్ధితో గ్రహించేదిగా అయింది.అప్పుడే అది మనసులో ప్రవేశించి ఓంకారమనే ఆకారాన్ని పొందినది.156.ఈ ఓంకార బ్రహ్మను ధ్యానం చేస్తూ,దీంతో పాటు పరమేశ్వరుని స్మరణ చేస్తూ శరీరాన్ని వదలి పెట్టేవారి జన్మ సార్థకమౌతుంది. 157.ఈ శబ్ద బ్రహ్మనుండి అవ్యక్తం యొక్క ప్రాదుర్భావం.అవ్యక్తం నుండి మహత్తత్త్వం,మహత్తత్త్వం నుండి అహంభావం ఉత్పన్నమైయాయి.158.అహం నుండి పంచతన్మాత్రలు, వాని నుండి పంచమహా భూతాలు, పంచమహాభూతాల నుండి జగత్తు జన్మించాయి.159.ఇదే అవిద్యా మాయారూప దర్శనం. ఇవే ఈ జగత్తు యొక్క రూపం లక్షణాలు.ఈ అజ్ఞానాన్ని తొలగించటానికి అజ్ఞాన వివేచన వివరణ ఆవశ్యకం.160.అత్యంత పరిశుద్ధమూ నిర్మలమూ కేవలం చిన్మాత్ర స్వరూపమూ అయిన దానిని దానికంటె వేరే అయిన శబలను రెంటినీ కలపటం సాధ్యం కాదు.161.లక్ష్య బ్రహ్మ స్వతంత్రమైనదని తెలుసుకోవాలి మాటలతో వర్ణించే బ్రహ్మ కంటెను అత్యంత విశిష్టమైనది.అందువలన అజ్ఞాన పొరలను ఉపదేశ బలంతో తొలగించాలి.162.నిద్రలో కలవస్తే కళ్లు లేకుండానే మనసు త్రిభువనాలన్నిటినీ చూస్తుంది.దీని కంతటికీ

కారణం అజ్ఞానమే.163. వాస్తవానికి ఒక వస్తువును చూడబోతే అది మరో వస్తువులా కనిపిస్తుంది. త్రాడు సర్పంలా భాసిస్తుంది. ముత్యపు చిప్పలో వెండి కనిపిస్తుంది.164. కేవలం అవి సూర్యుని కిరణాలే అయినా వానిని ప్రజలు ఎండమావులని అంటారు. ఇదంతా మాయ యొక్క లీల మాత్రమే.ఈ మాయముందు జ్ఞానులు కూడా ఓడిపోతారు.165. మండుతున్న కళ్ళను చేతబట్టుకుని ఎవరైనా గిరగిరా త్రిప్పితే అది అగ్ని కంకణంలా కనిపిస్తుంది.ఇదే మాయ యొక్క విశిష్టత.166. చూడటానికి అది అగ్ని నిజమే.కాని అక్కడ గుండ్రంగా అగ్ని చక్రం ఏర్పడటానికి ఆస్కారం లేదు. అట్లే ఈ మాయా మోహాలు,లేని ప్రపంచాన్ని సృష్టిస్తాయి.167.ఈ విధంగా నిశ్చయబుద్ధి కలిగి భ్రమ తొలగిపోతే ప్రపంచం కూడా చప్పబడుతుంది. నేను ఈ శరీరాన్ని,ఇది నా ఇల్లు, నా భార్య అన్న వన్నీ వ్యర్థ శ్రమ అని తెలుస్తుంది.168. భార్యాబిడ్డలు పశువులు మొదలగువానిపై మోహపాశం బాగా పెనవేసుకోవటం వలన జ్ఞానులమని పండితులమని చెప్పుకునే వారు కించిత్తైనా ఆనందాన్ని పొందరు.169. మేము శాస్త్రాలలో ప్రవీణులం, ప్రజ్ఞావంతులం, మాకు సమానం వేరే ఎవరూ లేరు అన్న అభిమానం అశాంతికి కారకం.170. ఇదే మాయ అజ్ఞానం అవిద్య లేదా ప్రధాన ప్రకృతి అంటారు. జ్ఞానులు దీనినే ముందు తొలగిస్తారు. అప్పుడే జ్ఞానప్రాప్తి.171.జ్ఞానం స్వయం ప్రకాశకం.దీనిని ఉపదేశించ నవసరం లేదు. అజ్ఞానం తొలగిపోతే జ్ఞానం తనంతట తానే ప్రకటమౌతుంది. 172.తేజోపుంజమైన రత్నం అనేక సంవత్సరాలు మట్టిలో పూడుకుపోయి ఉంటే, దానిని మరచి పోతారు.173. కర్మధర్మ సంయోగం వలన అది ఎంతో కాలానికి లభించగా రాళ్లల్లో మట్టిలో పడి ఉండటం వలన దాని తేజస్సు అంతా పోతుంది.174.తరువాత బాగా శుభ్రం చేస్తే దాని పైని మట్టిపోయి పూర్వపు తేజస్సును

పొందుతుంది. జ్ఞానం విషయంలో కూడా అంతే.175.మట్టి మురికి అనే అజ్ఞానంతో జ్ఞానం కప్పబడి ఉంది.మట్టిని తొలగిస్తే రత్నం తన సహజమైన ప్రకాశాన్ని పొందుతుంది.176.నిత్యానిత్య వస్తు వివేకం పాప కర్మలను నశింపచేసి అదే సత్త్వ శుద్ధిని ప్రదానం చేస్తుంది.అదే జ్ఞానాన్ని కూడా కలిగిస్తుంది. 177.ఈ జగత్తు మాయాబజారు. ఇక్కడ నిజమైనవి, నకిలీవి వస్తువులు అపారంగా ఉంటాయి. నకిలీ వస్తువులను నిజమైన వానివిగా తలచి తీసుకునే గ్రాహకులే ఇక్కడ చాలా మంది.178.మరి నకిలీ వానిని పసికట్టి వేరుచేయటమెలా? మంచి మంచి దిట్టమైన వారి బుద్ధి కూడా అలసిపోయింది.ఏ గుణాల కారణంగా ఇలా మోసగింపబడుతున్నామో తెలుసుకోవాలి.179.అందువలన వస్తువును పరికించగలవారు తోడుండాలి. వారు చూచీ చూడగానే నకిలీ వస్తువు నిజమైన వస్తువుగా ఎందుకు కనిపిస్తుంది అన్న విషయాన్ని తెలియచేస్తారు. దాంతో చివరకు అజ్ఞానం తొలగిపోతుంది.180.అజ్ఞానంపోతే జ్ఞానం ఉంటుంది. జ్ఞానోదయంతో మాయ సహజంగా తొలగిపోతుంది. ఇక మిగిలినదే సద్వస్తువని తెలుసుకోవాలి.దీనికి ప్రత్యక్షప్రమాణం అవసరం లేదు. 181.బుద్ధి చాలా తేజోవంతమైనదే అయినా కల్పనలు అనే అంధకారంతో కప్పబడి ఉంటుంది. ఈ అంధకారం ఉపదేశంతో పారిపోతుంది. అప్పుడు మిగిలి ఉన్నదంతా జ్ఞానమే.182.దారిలో ఒక మాల పడి ఉంది. వాస్తవానికి అది మాలే.అయినా మసకచీకటిలో చూస్తే అది పాములా భాసిస్తుంది. దీనికి కారణం అజ్ఞానపు పొర. 183.జేబులో నుండి టార్చిలైటు తీసి వెలిగించి చూడగా అజ్ఞానం లోపించి నిజమైన స్వరూపం ప్రకటమై పాము అనే భాస దానంతట అదే మాయమైంది.184.అందువలన అజ్ఞానం వలన కలిగే అపాయాన్ని ఉపదేశమనే ఉపాయంతో తొలగించుకోవాలి.దాని కొఅకు జ్ఞానులు తమ శరీరాన్ని అరగదీసి అసలు

అజ్ఞానమంటె ఏమిట ' ఉపదెశిస్తారు.185. ప్రస్తుత ప్రపంచంల ' ఉండి ఆయా సందర్భాలల ' అనుభవించె మంచి చెడులు, పూర్వపు అజ్ఞానంతో చేసిన కార్యాల ఫలితాలు అని ముందుగా తెలుసుకోవాలి.186. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ. జ్ఞానమే సత్యం బ్రహ్మ అనేది శాశ్వతం. అజ్ఞానం మాయ అంతా భ్రమ. ఈ భ్రమ తొలగినప్పుడే జ్ఞానం గురించిన సంభ్రమం తొలగిపోతుంది.187.శరీరాభిమానం పోకపోతే వారిని జ్ఞానులని ఎవరు అంటారు? అభిమానం ఉన్నవారు మూర్తీభవించిన అజ్ఞానమే.188. ఏది మాయతో కూడుకున్నదని అనబడుతుందో మనసును మోహింపచేసే ఈ జగత్తు దేనిలో మగ్నమై ఉందో దానికి ఆధారం అజ్ఞానం. 189. అజ్ఞానం నుంచి ఉద్భవించినది కనుక దీని వైభవమంతా అజ్ఞానం నుండి పుట్టినదే. ఏకత్వంలో అనేకత్వ భావం ఉండటానికి కారణం అజ్ఞానమే.190. మసక చీకటిలో దారిలో పడి ఉన్న త్రాడు పాములా భాసించగా చాలా భయం కలుగుతుంది.191. సర్పాభాస కేవలం అజ్ఞానం వలనే. ఆ అజ్ఞానం జ్ఞానాన్ని కప్పేసింది.ఈ అజ్ఞానం తొలగకపోతే మనసు నిర్భయం కాదు.192.ఒకరి కళ్ళకు పూలమాలలా, మరొకరికి కట్టలా కనిపించినా అదంతా భ్రమే. మిథ్యా జ్ఞానం వలన కలిగే భ్రాంతి.193. వేదాలలోని వచనాలననుసరించి ఆస్తిక్య బుద్ధి కలిగి శ్రద్ధగా ప్రవర్తించేవారే బ్రహ్మ జ్ఞానానికి అర్హులు. నాస్తికులు జన్మజన్మలకు అధికారులు కాలేరు.194.ఈ విశ్వం విపరీత దృష్టితో చూచే వారి భ్రమ కారణంగా నామరూపాలతో కనిపిస్తుంది. వారికి జనన మరణాల క్రమం తప్పదు. అజ్ఞానులకు బ్రహ్మతత్త్వం అంతుపట్టనిది. కాని అది అధికారులకు సుగమంగా బోధ పడుతుంది.195. ఇక్కడ వేదపాండిత్యం లేదా ప్రవచనాలు పనికిరావు. గ్రంథావలోకనం, గ్రంథశ్రవణం లేదా గ్రంథాలను బాగా అధ్యయనం చేసిన మేధస్సు

గాని పనికిరావు. 196.పదజాలంతో శబ్దజ్ఞానం కలుగుతుంది.వానితో ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది? బుద్ధి ఎంతో వివేకం కలది అయినా ఆత్మవస్తువు దాని అందుబాటులో ఎప్పుడూ ఉండదు.197. శ్రుతులు ఆత్మజ్ఞానం కోసం గొప్పగా ప్రయత్నించాయి కాని దాని ఆచూకి లభించక వెనుతిరిగాయి.ఇటువంటిది ఆత్మ వస్తువు యొక్క వైభవం.అది బుద్ధికి అంతుపట్టనిది.198. షడ్ దర్శనాలు అలసిపోయాయి.అవి వాదించటం లోనే ఉండిపోయాయి. ఆత్మవస్తువు మాత్రం ఎక్కడ ఉన్నది అక్కడే ఉంది. దానిని పదజాలం ఎప్పుడూ అర్థం చేసుకోలేదు.199.గొప్ప గొప్ప శాస్త్ర పండితులు, ఆత్మ వస్తువు అనే భాస్కరుని ముందు మిణుగురు పురుగులు. ఒకసారి ఆత్మ వస్తువు ప్రాప్తించిందా సమస్త పదజాలమంతా మాయమై పోతుంది. 200. ప్రపంచంలో చీకటి రాత్రిని గమనించండి.ఆ సమయంలో కార్యకలాపాలు దీపపు వెలుతురులో జరుగుతాయి. కాని తెల్లవారి సూర్యోదయమవగానే జనులు దీపాలను లెక్కచేయరు.201.ఆత్మ వస్తువు వాక్కుకు సంబంధించిన విషయం కాదు. మరి అది ఉపదేశ్యమెలా కాగలదు? అందువలన అజ్ఞానాన్ని తొలగించటమే వక్త యొక్క ధ్యేయమై ఉండాలి.202. ఆత్మ ఉన్నది అన్న అస్తిత్వ బుద్ధితో ఉపాసన చేస్తే, ఆత్మ ప్రసన్నమై ఉపాసకులకు లభ్యమై తన తత్వాన్ని ప్రకాశింప చేస్తుంది.203. ఆత్మ స్థానంలో పరమాత్మను ధ్యానం చేయాలి.ఆ రెండింటిలోనూ అభేదాను సంధానం చేస్తూ ఉపాసన చేస్తే ఉపాసకులకు ఆత్మ స్వయం ప్రసన్నమౌతుంది. 204.మరో సాధన లేదు. సాధకుని ఆత్మ నిష్ఠను గని ఆత్మ తనంతట తాను సాధకుని కరుణిస్తుంది. 205. గ్రంథంలోని విషయం సమాప్తి కాగా శ్రోతలు శ్రవణంలో శ్రమ పడినందులకు వక్త వారిని క్షమాపణ వేడుకుంటాడు. ఈ ఆచారపద్ధతి అంతటా ఉంది.206. కాని ఈ సచ్చరిత విషయంలో అది

వర్తించదు. కారణం దీని రచనా కర్తృత్వం నా తలపై లేదు. నా చేతికి కలం ఇచ్చి సాయియే తమ కథను స్వయంగా వ్రాయిస్తున్నారు.207. కనుక నేను గ్రంథకర్తను కాను. ఇక్కడ నా కొఅకు ఎవరూ శ్రమ పడకండి. శ్రోతలారా! క్షమించండి అని అంటే కర్తృత్వం నాపై పడుతుంది.208. నాకు పొగడ్త అనే భూషణం అవసరం లేదు. దూషణ నాకు అంటదు. సాయి స్వయం కర్త. కనుక వారి అనుగ్రహంతో విషయం సంపూర్ణమైంది.209. వారి అనుమతిని తీసుకుని అజ్ఞాన వివేచనను వారు ఎలా ఎలా సెలవిస్తే అలా అలా వ్రాశాను. శ్రవణం చేయండి .210. తమ వైభవాన్ని తమ ప్రతాపాన్ని తమ మహిమను ప్రకటం చేయటానికి సాయి సద్గురువు స్వయంగా నా మనసులో ప్రవేశించి విషయం యొక్క అర్థాన్ని వివరించారు.211. ఈ గ్రంథాన్ని దూషించిన వారు, దీనిని భూషణంగా భావించినవారు ఇరువురు పూర్తిగా నారాయణ స్వరూపులవలె వంద్యులు.212. భక్తుల పరమ శ్రేయస్సు కొఅకు శ్రీసాయి తమ చరితాన్ని స్వయంగా తయారు చేసి హేమాడు చేతిని పట్టుకుని వ్రాయించారు. 213. కేవలం ప్రజలను అనుగ్రహించటానికి, కుతర్కాలను దురాగ్రహాన్ని ఖండించటానికి మరియు లోకాన్ని సంరక్షించటానికి సాయిబాబా శరీరాన్ని గ్రహించారు.214. హేమాడు వారి చరణాలకు అనన్య భక్తి భావంతో సాష్టాంగ ప్రణామం చేస్తున్నాడు. మరియు రసవత్తరమైన తరువాతి కథను శ్రవణం చేయండి అని శ్రోతలకు సవినయంగా మనవి చేస్తున్నాడు.215. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో అజ్ఞాన నిరసనమను యాబదియవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 51 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

భక్తులకు ఆశ్రయమైన సాయీ! మీకు జయము. జయము. గీతార్థాన్ని వ్యాఖ్యానించిన గురువరా! సకల సిద్ధులను ప్రసాదించే ప్రభూ! నన్ను కరుణించండి.1.వేడిని తగ్గించటానికి మలయ గిరిపై చందన వృక్షాలు పెరుగుతాయి. అట్లే ప్రపంచంలోని ప్రజలను సుఖపెట్టడానికి మేఘాలు భూమిపై వర్షిస్తాయి.2. దేవతలను పూజించటానికి వసంత ఋతువులో పూలు పూస్తాయి. అట్లే శ్రోతలను సంతోష పరచటానికి ఈ సాయికథా పరంపరలు ఉదయించాయి.3.ఈ సాయి చరిత్రను వింటే శ్రోతలు వక్త ఉభయులూ పవిత్రులౌతారు. విన్న వారి చెవులు చెప్పిన వారి నోళ్లూ పవిత్రమౌతాయి.4.గతాధ్యాయంలో అజ్ఞాన నిరసనమౌతే జ్ఞానం ఎలా ప్రకటమౌతుంది అన్న విషయం మరియు 'తద్విద్ధి ప్రణిపాతేన' అన్న శ్లోకానికి అర్థం వ్యాఖ్యానించడం జరిగింది.5. భగవద్గీత పరిసమాప్తిలో పదునెనిమిదవ అధ్యాయాంత మందు డెబ్భై రెండవ శ్లోకం చివర శ్రీకృష్ణుడు అర్జునుని అడిగాడు.6. 'ఇప్పటి వరకు ప్రవచనం విన్నావు కదా! మరి దాంతో నీకు మోహం తొలగిపోయిందా' అని ఇదే ప్రశ్నను స్పష్టంగా అడిగాడు. కాని జ్ఞానం కలిగిందా అని అడగలేదు.7.అట్లే అర్జునుడు కూడా 'నా మోహం తొలగి పోయిందని జవాబు ఇచ్చాడే కాని జ్ఞానం కలిగింది' అని చెప్పలేదు. మోహం విచ్చిత్తి అయిందని చెప్పాడు.8.మోహం అంటే కేవలం అజ్ఞానం.

రెండింటి అర్థం ఒక్కటే అని గీతార్థాన్ని ఎఱిగిన వారికి తెలుసు.9.'యత్సాయోక్తం వచస్తేన మోహోయం విగతో' పదునొకండవ అధ్యాయా రంభంలో అర్జునుడు శ్రీకృష్ణునితో ఇదే అన్నాడు.10.ప్రస్తుతం ఈ నూతన అధ్యాయంలో కాకా సాహేబు దీక్షితును బాబా మొదట శిరిడీలో ఎలా స్థిరపరచారు అన్న విశేషమైన విషయాన్ని గూర్చి వివరిస్తాను.11.అతనికి శిరడీతో గల ఋణానుబంధం,అతనికి సాయిబాబాతో గల దృఢమైన సంబంధం ఏర్పడటానికి మూలకారణాన్నంతా మొదటి నుండి వినండి.12.అతని విస్తార కథ చిన్నాపెద్దా అందఱికీ తెలిసినదే. కాని అతడు మొదట శిరిడీకి ఎలా వచ్చాడు అని అందరికీ తెలియదు. 13. పూర్వపుణ్యం కారణంగా పరమేశ్వరుని కృపాదృష్టి లభిస్తుంది.దాని వలననే తరువాత సద్గురువుతో కలయిక ఏర్పడి శిష్యునికి ఆనందం సమృద్ధిగా లభిస్తుంది.14.ఈ విషయాన్ని గూర్చి ఈ అధ్యాయంలో శ్రోతల హృదయాలకు ఆనందాన్ని కలిగించే కథా త్రయాన్ని ముగ్గురు భక్తుల మహాభాగ్యాన్ని వర్ణిస్తాను. 15. పరమార్థ ప్రాప్తి కోసం కోటాను కోటి ఇతర ఉపాయాలెన్నో ఉన్నా, సద్గురు కృపాదృష్టి లేకపోతే పరమార్థం ప్రాప్తించదు.16.ఈ విషయంలోని మధురమైన కథను వింటే శ్రోతల కోరిక తీరి వారికి తమ శ్రేయస్సును సంపాదించు కోవాలన్న శ్రద్ధ కలుగుతుంది.17.గురుభక్తులను సమాధాన పరచే పరమపావనమైన ఈ అధ్యాయాన్ని శ్రోతలు తమ మంచి కోసం సావధాన చిత్తంతో శ్రవణం చేయండి.18. హరిసీతారాందీక్షితు కాకాసాహేబు అన్న పేరుతో ప్రసిద్ధుడు.బాబా భక్తులందఱూ అతనిని ప్రేమతో సగౌరవంగా స్మరిస్తారు. 19. అతని గత చరిత్రను వినాలన్న ఉత్సుకతగల భావికులైన భక్తులకు రసికులకు ఆనందదాయకమైన అతని కథను సగౌరవంగా చెప్తాను.20.క్రీ.శ.1909 వ సం॥ వరకు కాకా సాహేబుకు సాయిబాబా అన్న పేరే

తెలియదు. తరువాత అతడె సాయి యొక్క పరమ భక్తునిగా ప్రసిద్ధి చెందాడు.21. విశ్వవిద్యాలయంలొని విద్య పూర్తి అయిన తరువాత ఎన్నో సంవత్సరాలు గడిచాక ఒకసారి నానాసాహేబు చందోర్కరు లోనావలాకు వచ్చాడు.22. నానాకు దీక్షితు పాత స్నేహితుడు. చాలా సంవత్సరాల తరువాత వారిద్దఱూ కలుసుకుని, పరస్పర సుఖదుఃఖ విషయాలను ముచ్చటించుకున్నారు.23. లండను నగరంలో రైలుబండి ఎక్కుతున్నప్పుడు దీక్షితుని కాలుజారగా,ఆ కాలికి తగిలిన గాయం బాధ శత విధాల చికిత్సలు చేసినా తగ్గలేదు.24.బాధ గురించిన వృత్తాంతాన్నంతా సంభాషించుకుంటుండగా, అక్కడ సహజంగా శ్రీసాయిబాబా మహిమ నానాకు గుర్తుకు వచ్చింది.25. ఈ కాలి కుంటితనం పూర్తిగా పోవాలని ఉందా? ఉంటే మా గురువుగారి దర్శనానికి రండి అని నానా కాకాసాహేబుతో చెప్పాడు.26.పైగా నానా ఆశ్చర్యకరమైన సాయి యొక్క వృత్తాంతాన్ని, ఆ సత్పురుష శిరోమణి గురించిన మహిమను, ఎంతో సంతోషంగా దీక్షితునకు తెలియ చేశాడు. 27. నా మనుషులు ఎంత దూరంలో ఉన్నా సప్త సముద్రాల అవతల ఉన్నా సరే దారం కట్టి పిచ్చుకని లాక్కుని వచ్చినట్లు వెంటనే లాక్కుని వస్తాను.28. అని బాబా నిత్యం చెప్పే వచనం. మనం వారి మనుష్యులం కాకపోతే వారివైపు ఆకర్షింప బడం అని నానా చెప్పాడు.29. మీరు వారి మనిషి కాకపోతే మీకు వారి దర్శనం కాదు. ఇదే బాబా యొక్క గుర్తు. కనుక మీ అంతట మీరు అక్కడికి వెళ్లలేరు.30.సాయి గురించిన వర్ణన విని దీక్షితు మనసుకు సంతోషం కలిగి నేను వచ్చి బాబాను దర్శనం చేసుకుంటానని నానాతో చెప్పాడు.31. ఈనా కాలిగురించిన మాటెందుకు? శరీరం నశ్వరం. కనుక ఈ కాలి బాధ ఎంత కాలమైనా ఉండని, దాని గురించి నాకేం చింత లేదు.32. నిరతిశయ సుఖం సంపాదించుకోవటానికి నేను తప్పక మీ గురుదర్శనానికి వెళ్ళుతాను.నాకు

అల్ప సుఖాలపై కొరిక లేదు.నేను వానిని కొరను.33. బ్రహ్మ కంటె వేరే సుఖం లేదు.అదొక్కటే అమూల్యమైన సుఖం. ఆ సుఖం కొఱకు నేను మీ గురువుకు దాసుణ్ణవుతాను.34. ఈ కాలికుంటి తనం ఇలాగే ఉండిపోనీ! నాకు దీని చింత ఏం లేదు.కాని నా కుంటి మనసును బాగు చేయండని ప్రార్థిస్తాను.35. ఏవేవో సాధనలు చేసి చాలా శ్రమ పడ్డాను.కాని మనసు స్థిరపడలేదు. స్వాధీనంలో ఉంచుకోవాలని ఎంత ప్రయత్నించినా నాకు తెలియకుండానే అది జారిపోతోంది.36. మనసును నిగ్రహించాలని ఎంత జాగ్రత్తపడినా మనసు ఆశ్చర్యంగా దృష్టికి అందకుండా తప్పించుకుని తిరుగుతుంది.37.నానా! నేను మీ గురువు దర్శనానికి వచ్చి నామనో వైకల్యాన్ని తొలగించమని వారిని ప్రార్థిస్తాను.38.'నశ్వరమైన శరీర సుఖాలపై విరక్తి కలిగి పరమాత్మ సుఖంపై ప్రీతికల భక్తులు పరమార్థాన్ని సంపాదించుకోవటం సాయికి పరమ సంతోషం'.39.శాసనసభా ఎన్నికల విషయాలనే చర్చించుకుంటూ అంతటా ఆ విషయాన్నే ముచ్చటించుకుంటూ జనులందఱూ ఆ పనులలోనే నిమగ్నులయ్యారు.40.కాకా సాహేబు కూడా తనకోసం ప్రజల అభిమతాన్ని సంపాదించుకోవటానికి స్నేహితుల వద్దకు అనుకోకుండా అహమ్మదునగరుకు వెళ్ళాడు.41.కాకాసాహేబు మిరికరు అక్కడి సర్దారు.అతడు దీక్షితుకు చాలా సన్నిహితుడవటం వలన దీక్షితు అతని వద్ద బస చేశాడు.42.అప్పుడు అహమ్మదునగర్‌లో అశ్వప్రదర్శన ఉన్నందువలన దాని కోసం అనేక రకాల మనుష్యులు అక్కడ పోగయ్యారు.43. బాలాసాహేబు మిరికరు కోపర్‌గాం మామలేదారు. అహమ్మదునగర్‌లోని అశ్వ ప్రదర్శనానికి హాజరయ్యాడు.44.దీక్షితు అక్కడికి వచ్చిన పని అయిపోయింది.శిరిడీకి ఎలా వెళ్ళాలి? అక్కడకు ఎవరు తీసుకుని వెళ్లగలరు అని.45. అతనికి శిరిడీ ధ్యాస పట్టుకుంది.బాబాతో దర్శన యోగం కలగాలి అని దీక్షితుకు

అదొక్కటే ఆలోచన. 46. ఎవరు నా వెంట వచ్చి నన్ను బాబా సన్నిధికి తీసుకుని వెళ్ళి వారి పాదాలపై పడవేస్తారు అని దీక్షితుకు చాలా చింత.47.ఎన్నికల పని ముగిసిపోగానే ఇక శిరిడీకి ఎలా వెళ్లాలని దీక్షితుకు చింత పట్టుకుంది.మిరికరుకు ఆ విషయాన్ని మనవి చేశాడు.48. కాకా సాహేబు మిరికరు, అతని కుమారుడు బాలాసాహేబు ఇద్దఱూ తమలో దీక్షితు వెంట ఎవరు వెళ్లాలి అని ఆలోచించారు.49.ఆ ఇద్దరిలో దీక్షితుకు తోడుగా ఒకరు వెళ్లితే చాలు కాని ఎవరు వెళ్లాలి అని నిశ్చయించటానికి ఆలోచించసాగారు.50.మానవుని ఆలోచన ఒకటైతే పరమేశ్వరుని సంకల్పం మరొకటి.దీక్షితుని శిరిడీ ప్రయాణానికి అనుకోని ఘటన సంభవించింది.51. ఇక్కడ దీక్షితు తపిస్తూ ఉండగా అక్కడ భక్తుని ప్రబలమైన కోరికను తీర్చటానికి సాయిసమర్థులు ఎలా కరిగిపోయారో చూడండి.52.దీక్షితు చింతిస్తూ బాధతో కూర్చుని ఉండగా మాధవరావు అహమ్మదు నగరుకు వచ్చాడు. అందఱికీ ఆశ్చర్యం కలిగింది.53. మాధవరావు అత్తగారి ఆరోగ్యం బాగలేదు, వెంటనే భార్యతో సహా రమ్మని నగరు నుండి అతని మామ టెలిగ్రాం ఇచ్చాడు. 54.ఆ తంతి వార్త అందగానే అతడు తయారై బాబా అనుమతిని తీసుకుని, భార్యతో సహా ఆ ఇద్దఱూ చితళీకి వెళ్లారు.55. మూడు గంటలకు వెళ్లే రైలు బండిలో ఇద్దఱూ అహమ్మదు నగరుకు వెళ్లి టాంగా బండిలో ఇంటి గుమ్మం వద్ద దిగారు.56.ఇంతలో నానాసాహేబుపన్నే, అప్పాసాహేబుగద్రే అశ్వప్రదర్శన సందర్భంలో ఆ దారిన వెళుతూ అక్కడికి వచ్చారు.57.అనుకోకుండా మాధవరావు టాంగా బండి నుండి దిగటం చూచి వారికి అత్యంత ఆశ్చర్యానందాలు కలిగాయి.58.భాగ్యవశాత్తు శిరిడీలోని మాధవరావు ఇక్కడికి వచ్చాడు. దీక్షితుని శిరిడీ తీసుకుని వెళ్ళటానికి ఇంతకంటె మంచితోడు ఎవరు అని అన్నారు.

59.మాధవరావును పిలిచి మిరికరు ఇంటికి కాకాసాహేబు దీక్షితు వచ్చాడు. నీవు అక్కడికి వెళ్లు.బాబా లీలను చూడు.60. దీక్షితు మాకు మంచి స్నేహితుడు.నీవు వెళ్లితే మీ ఇద్దఱికీ పరిచయమౌతుంది.దీక్షితు శిరిడీ వెళ్లాలని అత్యంత కుతూహలంగా ఉన్నాడు.నీవు రావటం అతనికి ఎంతో ఆనందం.61. అని అతనితో చెప్పి ఈ విషయాన్ని దీక్షితుకు తెలియ చేశారు. దానితో దీక్షితు చింత దూరమై అతనికి సంతోషం కలిగింది.62.మామగారి ఇంటికి వెళ్లి చూడగా అత్తగారి ఆరోగ్యం బాగానే ఉంది.మాధవరావు కాసేపు విశ్రమించగా మిరికరు వద్దనుండి పిలుపు వచ్చింది.63.ఆ ఆహ్వానాన్ని అందుకుని మాధవరావు సాయంకాలం పూట దీక్షితుని కలుసుకోవటానికి బయల్దేరి వెళ్ళాడు.64. అదే మొదటిసారి అతడు దీక్షితుని చూడటం. బాలా సాహేబు ఒకరిని ఒకరికి పరిచయం చేశాడు.ఆ రాత్రి ఇద్దఱూ పదిగంటల బండిలో వెళ్లటానికి ప్రయాణం నిశ్చయమైంది.65.ఆ విధంగా నిర్ధారణ అయాక,ఆ తరువాత వింతను చూడండి.బాలా సాహేబు బాబా యొక్క ఫోటో పైనున్న తెరను తొలగించాడు.66.అది బాబా ఫోటో. బాబా భక్తుడైన మేఘా బాబాను త్రినేత్రుడైన శంకరునిగా భావించి పరమప్రేమతో పూజించేవాడు.67.ఆ పటంపైని గాజు పలక విరిగిపోవటం వలన దానిని బాగు చేయించటానికి శిరిడీ నుండి బాలా సాహేబు తన వెంట నగరుకు తెచ్చాడు. 68. బాగు పరచాక ఆ ఫోటో దీక్షితుని కోసం ఎదురు చూస్తున్నట్లుగా మిరికరు ఇంట్లోని హాలులో బట్టతో కప్పబడి ఉంది.69.అశ్వ ప్రదర్శన సమాప్తి అయ్యాక బాలా సాహేబు తిరిగి వెళ్లటానికి ఇంకా వ్యవధి ఉండటం వలన ఆ ఫోటోను శిరిడీకి తీసుకుని వెళ్లే బాధ్యతను మాధవరావుకు అప్పచెప్పాడు.70.బాబా ఫోటోపైని తెరను తొలగించి మాధవరావుకు ఇచ్చి దీన్ని తీసుకొని సుఖంగా శిరిడీ వెళ్లమని అతనికి చెప్పాడు.71. సర్వాంగ

మనోహరంగా ఉన్న ఆ పటంపై ప్రథమ దృష్టిపడగానే దీక్షితు నమస్కరించి ఆనందంగా అవలోకించాడు. 72. అకస్మాత్తుగా ఆ విచిత్ర ఘటన ద్వారా దర్శనమిచ్చిన సాయిసమర్థుని చూచి దీక్షితుని కళ్లు చెమర్చాయి. 73. ఎవరి దర్శనాన్ని కోరుకుంటున్నాడో వారి పటం వారి మూర్తిలా దారిలోనే కనిపించటం అతనికి అత్యంత ఆహ్లాదం కలిగింది. 74. ఆ పటం శిరిడీ నుండి మిరికరు ఇంటికి రావటం, ఆ సమయంలోనే దీక్షితు అక్కడ ఉండటం విచిత్రమైన ఘటన. 75. దీక్షితు మనసులోని కోరికను తీర్చటానికి సాయి సమర్థులు మిరికరు ఇంటికి ఆమిషతో వచ్చినట్లు అనిపించింది. 76. లోనావలలో నానా కలిసి మాట్లాడటం అక్కడే బాబా యొక్క గురుత్వాకర్షణ, బాబాను కలుసుకోవటానికి అంకురార్పణ జరిగింది. 77. లేకపోతే శిరిడీలోని బాబా పటం అప్పుడే అక్కడికి ఎందుకు రావాలి? అంతకాలం ఎందుకు వస్త్రంతో కప్పబడి ఉండాలి? 78. అనుకున్న ప్రకారం మాధవరావు మరియు దీక్షితు బాబా పటాన్ని వెంట పెట్టుకుని ఆనందంగా బయలుదేరారు. 79. ఆ రాత్రి భోజనమయాక ఇద్దఱూ స్టేషనుకు వెళ్లి రెండవ తరగతి టికట్టును తీసుకున్నారు. 80. పది గంటలయేసరికి రైలుబండి చప్పుడు వినిపించింది. రెండవ తరగతి బోగీలో జనం నిండి పోయి ఉండటం చూచారు. 81. అలా తటస్థపడిన ఆ పరిస్థితికి ఇద్దఱికీ బాగా చింత పట్టుకుంది. బండి కదలటానికి కాస్త సమయమే ఉంది. ఇప్పుడు ఏం చేయాలి? 82. జనం ఎక్కువ ఉండటం వలన వెనుకకు వెళ్లిపోయి మరునాడు శిరిడీకి వెళ్లాలని ఇద్దఱూ నిశ్చయించుకున్నారు. 83. ఇంతలో అకస్మాత్తుగా బండిలో దీక్షితుకు పరిచయమున్న గార్డు కనిపించాడు. అతడు వారికి చక్కగా ఫస్టుక్లాసులో కూర్చునే ఏర్పాటు చేశాడు. 84. తరువాత బండిలో కూర్చుని బాబా యొక్క కథామృతాన్ని మాధవరావు ప్రేమావేశంతో

చెప్పుతుంటే దీక్షితు ఆనందంగా ఆలకించసాగాడు.85.ఆ విధంగా సమయం సుఖంగా త్వరగా గడిచిపోయింది.బండి కోపర్‌గాం చేరగానే ఇద్దఱూ బండి దిగారు.86.అక్కడ అనుకోకుండా స్టేషనులో నానాసాహేబు చందోర్కరును చూచి దీక్షితుకు చాలా సంతోషం కలిగింది ఇద్దరూ అలా కలుసుకున్నారు. 87. నానా కూడా బాబాదర్శనానికి శిరిడీ బయల్దేరాడు.ఆశించకుండానే సంభవించిన యోగానికి ముగ్గురూ ఆశ్చర్యపోయారు.88.తరువాత ముగ్గురూ టాంగా కట్టించుకుని ముచ్చటించుకుంటూ అక్కడనుండి బయల్దేరారు.దారిలో గోదావరిలో స్నానంచేసి పవిత్ర శిరిడీ క్షేత్రానికి చేరుకున్నారు.89.సాయిబాబా దర్శనంతో దీక్షితుని మనసు ద్రవించింది. కళ్లు అశ్రువులతో నిండాయి.ఆనందం ఉప్పొంగింది.90. 'నేను కూడా నీ కోసం ఎదురు చూచి నిన్ను కలుసుకోవటానికి శ్యామాను నగరుకు పంపాను' అని సాయిబాబా అతనితో స్పష్టంగా చెప్పారు.91.దీక్షితుకు శరీరం పులకించింది.అశ్రువులతో కంఠం గద్గదమైంది. శరీరమంతా చెమటలు పట్టి కంపించింది. చిత్తవృత్తి ఆనందమయమైంది.92.శరీరం వణకసాగింది.కళ్లు అర్ధోన్మీలిత మయ్యాయి.93.అపరిమితానందంతో ఈ రోజు నా దృష్టి సఫలమైందని సాయి చరణాలను ఆలింగనం చేసుకున్నాడు. మనసుకు ధన్యత అనిపించింది. అతనికి ఎనలేని ఆనందం కలిగింది.94.అలా తన శరీరాన్ని సాయి సేవకు అర్పించాడు. అతనికి సాయి చరణాలలో నిష్ఠ కుదిరింది.సాయి అనుగ్రహాన్ని పూర్తిగా సంపాదించాడు.95. సాయిబాబా సేవ చక్కగా చేయటానికి శిరిడీలో ఒక గృహాన్ని నిర్మించి అనేక సంవత్సరాలు అక్కడే ఉన్నాడు.సాయి మహిమను బాగా విస్తరింప చేశాడు.96.సారాంశం, సాయిబాబా తమను సేవిం చే భక్తులను నిష్కామములనుగా చేస్తారు.వారు భక్తులకు విశ్రామధామం.భక్తులకు పరమ సుఖాన్ని

ప్రసాదిస్తారు.97.చంద్రునికి అనేక చకోరాలు.కాని చకోరాలకు నక్షత్రనాథుడు చంద్రుడు ఒక్కడే. అట్లే తల్లికి అనేక మంది బిడ్డలున్నా బిడ్డ లందరికీ తల్లి ఒక్కతే.98.సూర్యునికి కమలాలు అనేకం కాని కమలాలకు సూర్యుడు ఒక్కడే. గురువుకు భక్తులు అసంఖ్యాకం. కాని భక్తులకు తండ్రి అయిన గురువర్యులు సాయి ఒక్కరే.99. మేఘం కోసం ఆతురపడే చాతక పక్షులు అనేకం.కాని చాతక పక్షులకు మేఘం ఒక్కటే. అట్లే బాబాకు అనేక మంది భక్తులు.కాని భక్తులకు తల్లి తండ్రి సాయి ఒక్కరే.100. భక్తితో వారి శరణు జొచ్చిన వారి గౌరవాన్ని కాపాడటం, ప్రేమతో వారి కార్యాన్ని సఫలం చేయటం, ఇవాళ మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం.101.ప్రపంచంలో ప్రాణంతో ఉన్న జీవులను మరణం అంతం చేస్తుంది.'నేను నిన్ను విమానంలో తీసుకుని వెళ్తుతాను'అని సాయిబాబా దీక్షితుకు అభయ మిచ్చారు.102.వారు చెప్పిన ప్రకారం, దీక్షితు తన నోటితో సాయి యొక్క గుణగణాలను గానం చేస్తూ ఉండగా అతనికి మరణం సంభవించింది. నేను ప్రత్యక్షంగా నా కళ్లతో చూచాను.103.మేము రైలుబండిలో ఒక బల్లమీద కూర్చుని పరస్పరం సాయి సమర్థుని గూర్చిన విషయాలలో మగ్నమై ఉండగా అతడు అకస్మాత్తుగా విమానాన్ని ఎక్కినట్లు అనిపించింది.104.దీక్షితు ఆ సమయాన్ని ఉపయోగించుకుని అకస్మాత్తుగా తన మెడను నా భుజంపై ఆన్చి సుఖాన్ని శాశ్వతానందాన్ని పొందాడు.105.అతని శరీరం అటూ ఇటూ పొరలలేదు. కంఠంలో గురక శబ్దం లేదు.ఏ బాధా లేదు.అందఱూ చూస్తుండగా మాట్లాడుతూ ఉన్న అతని శరీరం చలనరహితమైంది.106.అలా దీక్షితు తన మానవ శరీరాన్ని వదలి ప్రాణ జ్యోతిని ఆత్మలో విలీనం చేశాడు. విమాన మార్గాన ఆత్మ స్వరూపంలో కలిసిపోయాడు. అతని జ్యోతి విశ్వజ్యోతిలో విలీనమై పోయింది.107. సాయి చరణాలలో

ధ్యానమగ్నుడవగా అతని శరీరాభిమానం పూర్తిగా నశించి మనోవృత్తి సంపూర్ణంగా శాంతించింది. శరీరాన్ని పూర్తిగా కృష్ణార్పణ చేశాడు.108. క్రీ.శ. 1926 వ సం॥ జ్యేష్ఠ బహుళ ఏకాదశి రోజున దీక్షితు కర్మభూమిని వదిలి బ్రహ్మ పదాన్ని పొందాడు.109. ఇది అతని శరీరావసానమని అనుకున్నా అతనికి విమానం వచ్చిందని అనుకున్నా, అతడు సాయి చరణాలలో లీనమైనట్లు.ఎవరైనా దీనిని అంగీకరించాల్సినదే.110. ఇటువంటి ఉపకారానికి ఋణం తీర్చుకోవచ్చు అని అనుకునే వారు భక్తి విశ్వాసాలు అసలు లేనివారు.ఎందుకంటే ప్రపంచంలో కనిపించే వస్తువులను ఇచ్చి గురువు ఋణాన్ని తీర్చుకోవటం స్వప్నంలో కూడా సంభవం కాదు. 111. చింతామణిని ఇవ్వాలను కుంటే అది రోజూ చింతను పెంచుతుంది. అటువంటి వస్తువును ఇచ్చి ఆలోచనకు అందని ఆత్మ వస్తువును చూపించే గురు ఋణాన్ని తీర్చుకోవాలను కోవటం అవివేకం.112.నిర్వికల్ప వస్తువును ప్రసాదించే గురువుకు కల్పతరువును ఇచ్చి ఋణం తీర్చుకోవడం సాధ్యమా?113.పోనీ ఈ అన్నింటి కంటె గురువుకు పరశువేదిని ఇవ్వ తలచితే పరశువేది ఇనుమును కేవలం బంగారంగా మాత్రం చేస్తుంది.కానీ గురువు బ్రహ్మరసాన్ని ఆస్వాదింప చేస్తారు.114.ఏ కోరికలు లేని గురువుకు కామధేనువును ఇచ్చి వారి ఋణాన్ని తీర్చుకోవాలంటే తీరుతుందా? అది కోరికలను ఇంకా పెంచుతుంది. కోరికలు లేని గురువు ఏ కష్టమూ లేని స్థితిని ప్రసాదిస్తారు.115. మాయాతీతమైన పరతత్వాన్ని ప్రసాదించే గురువుకు మాయా ప్రదర్శన మైన విశ్వంలోని సంపత్తినంతా ఇచ్చి గురువు ఋణాన్ని తీర్చుకోవాలను కుంటే అది తీరిపోతుందా?116.శరీరాన్ని గురువుకు దిగదిడుపు తీయాలనుకుంటే శరీరం నశ్వరమైనది కదా! ప్రాణాలను గురువుకు నివాళిగా అర్పించాలనుకున్నా అది మిథ్యే.117.సద్గురువు

శాశ్వతమైన సత్యవస్తువును ప్రసాదించే దాత.వారికి మిథ్యా వస్తువులను అర్పిస్తే ఋణం తీరటం అసంభవం.118.అందువలన అనన్య శ్రద్ధా పూర్వకంగా సాష్టాంగ దండ ప్రణామాలను అర్పించి వారి ఉపకారాలను స్మరించుకుంటూ సద్గురు చరణాలకు శిరసుతో వందనం చేయండి.119. గురువు యొక్క ఉపకారాన్ని ఎల్లప్పుడూ స్మృతిలో ఉంచుకోవటమే శిష్యునికి అలంకారం. అంతేగాని వారి ఉపకారాన్నుండి ఋణముక్తు లవాలని తలచే శిష్యులు ఆత్మానంద సుఖాన్ని పోగొట్టుకుంటారు.120.ఇంతవరకు కథను శ్రవణం చేసిన శ్రోతల తృష్ణ పెరిగింది.వారి కుతూహలాన్ని గమనించి వారి జిజ్ఞాసను తీర్చే ఒక చిన్న కథను మనవిచేస్తాను.121.సామాన్య సంసారుల వలె సాధువులు కూడా బంధువుల యెడ ప్రేమను చూపుతారు లేదా లౌకికి వ్యవహారాలలో తాము ఎంత దక్షతగా ప్రవర్తిస్తారో ఆ మర్మాన్ని తెలియచేస్తారు.122.భక్తులను ఉద్ధరించడానికి సాయి ఆయా పాత్రలను స్వయం నటిస్తూ పరమార్థాన్ని బోధిస్తారు.123. ఈ విషయాన్ని తెలిపే ఒక చిన్న కథను శ్రోతలు శ్రద్ధగా వినండి.ఎవరూ ఏమీ చెప్పకుండానే సత్పురుషులు ఇతర సాధువులను ఎలా గుర్తు పడతారు అన్న విషయం తెలుస్తుంది.124.ఒకసారి గోదావరీ నదీ తీరాన ఉన్న రాజమహేంద్ర పట్టణానికి శ్రీవాసుదేవానంద స్వాములవారు విచ్చేశారు వారి ఉపనామం 'సరస్వతి'.125.వారు గొప్ప అంతర్జ్ఞాని. కర్మ మార్గాన్ని నిష్ఠగా అవలంబించినవారు. వారి కీర్తి గంగ భూతలంపై ప్రతిధ్వనిస్తుంది. 126. వారి కీర్తిని ఆనోటా ఆనోటా చెప్పుకోగా విన్న నాందేడు పట్టణంలోని పుండలీకరావు మొదలగు భక్తులు స్వామి దర్శనానికి వెళ్లాలని గట్టిగా నిశ్చయించుకున్నారు.127. వారు బయలుదేరి రాజమహేంద్ర పట్టణం చేరుకున్నారు. ఉదయం గోదావరీ తీరానికి స్వామి ధర్శనానికి వచ్చారు.128.ప్రభాత సమయాన

నాందేడ్‌కరు ఇతర భక్తులు నోటితో స్తోత్రాలను పఠిస్తూ గోదావరి స్నానానికి బయల్దేరారు.129.అక్కడే ఉన్న స్వామిని చూచి భక్తులు వారికి భక్తిగా సాష్టాంగ నమస్కారం చేశారు.సహజంగా కుశల ప్రశ్నలూ అవీ అయ్యాక మాటలలో శిరిడీ విషయం వచ్చింది.130.సాయినామం చెవులలో పడగానే స్వామి తమ చేతులు జోడించి ప్రణామం చేసి వారు మాకు సోదరులు.నిష్కాములు.వారి యందు మాకు అపారమైన ప్రేమ అని చెప్పారు. 131.అక్కడ ఉన్న ఒక శ్రీఫలాన్ని స్వామి పుండలీక రావు చేతికి ఇచ్చి 'శిరిడీకి వెళ్లినప్పుడు దీనిని మా సోదరుని పాదాలకు వందనం చేసి అర్పించు.132. ఈ దీనునిపై అనుగ్రహముండాలని, వీనిని మరచి పోవద్దని నాకు వారిపై ఎల్లప్పుడూ ప్రేమ పెరుగుతూ ఉండాలని చెప్పు.133.వారికి నా నమస్కారమని చెప్పు. మీరు మరల శిరిడీ వెళ్లినప్పుడు నాసోదరునికి ఈ శ్రీఫలాన్ని నా నమస్కారాలతో అర్పించండి134. మేము స్వాములం. మేము ఎవరికీ వందనం చేయరాదని మా నియమం. అయినా ఈ సందర్భంలో అది శుభప్రదమని ఆ నియమాన్ని ఉల్లంఘిస్తున్నాను.135. అందువలన సాయిబాబా దర్శనానికి వెళ్లినప్పుడు ఈ శ్రీఫలాన్ని సాయి చరణాల యందు మరచిపోకుండా అర్పించండి' అని చెప్పారు.136. వారి మాటలను విని పుండలీకరావు వారి పాదాలకు వందనం చేసి వారి ఆజ్ఞానుసారమే ఆచరిస్తానని చెప్పాడు.137. స్వామి ఆజ్ఞను శిరసావహించి తాను ధన్యుణ్ణని తలచి స్వామికి శరణువేడి పుండలీకరావు అక్కడినుండి వెళ్లిపోయాడు. 138.స్వామి సాయిబాబాను సోదరుడు అని అనటం పొరపాటా? యావజ్జీవ మగ్ని హోత్రం జుహూయాత్ అన్న శ్రుతి వచనానికి అనుగుణంగా సాయిబాబా ప్రవర్తించారు.139.బాబా ఎదుట అహోరాత్రులూ అగ్ని ప్రజ్వరిల్లుతుంటుంది. అది వారి వ్రతం. ప్రజలు దానిని ధుని అని అంటారు.140. భక్తుల బాగు కోసం

వారి చిత్త శుద్ధి కొఅకు బ్రహ్మ ప్రాప్తి కొఅకు అగ్ని హోత్రాది కర్మలను ఇతర సాధనలను బాబా ఆచరించేవారు. 141. శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి కూడా యతి. వారూ అగ్నిహోత్ర వ్రతాన్ని ఆచరించేవారు. అందువలన వారు బాబాను సోదరుడని అనటం అర్థంలేని మాట కాదు. 142. తరువాత నెల తిరగకుండానే పుండలీకరావు నలుగురు మిత్రులను వెంటబెట్టుకుని సాయిబాబా దర్శనానికి బయలుదేరే యోగం వచ్చింది. 143. సామానులను పళ్లు ఫలహారాలను మరియు మరచిపోకుండా స్వామి ఇచ్చిన కొబ్బరికాయను తీసుకుని అందఱు సాయిదర్శనానికి ఆనందంగా బయలుదేరారు. 144. మన్‌మాడ్‌లో దిగారు. కోపర్‌గాం బండికి వ్యవధి ఉండటం వలన బాగా దప్పిక కలిగితే ఒక కాలువ దగ్గరకి వెళ్లారు. 145. పరగడపున వట్టినీరు త్రాగటం ఆరోగ్యానికి హానికరమని, ఫలహారానికి తెచ్చుకున్న అటుకుల పొట్లాన్ని బయటకు తీశారు. 146. వానిని నోట్లో వేసుకోగా ఆ అటుకులు చాలా కారంగా ఉన్నాయి. కొబ్బరి లేకుండా వానిని తినలేరు గనుక వారి శ్రమ వ్యర్థమనిపించింది. 147. అప్పుడు ఒకడు కొబ్బరికాయను కొట్టి అటుకులలో కలిపి వాని రుచిని చూడండి అని ఉపాయాన్ని చెప్పాడు. 148. 'కొబ్బరికాయ' అని అనగానే అది వెంటనే సిద్ధమైంది. ఇక పగల కొట్టడం ఎంతసేపు? కొబ్బరిముక్కలను కలుపుకుని తింటే అటుకులు రుచికరంగా ఉన్నాయి. వానిని తిని నీరు త్రాగారు. 149. కొట్టిన ఆ కొబ్బరికాయ ఎవరిది అని ఎవరూ చూచుకోలేదు. ఆకలి బాధలో ఉండి ఆ విషయాన్ని అంతా మరచిపోయారు. 150. తరువాత కోపర్‌గాంకు వెళ్లే రైలుబండిలో కూర్చున్న పుండలీకరావుకు దారిలో కొబ్బరికాయ గుర్తుకు వచ్చింది. 151. శిరిడీ దగ్గరకు చేరుకునే సరికి అతనిలో కలవరం బయలుదేరింది. వాసుదేవానంద సరస్వతిస్వామి వారి శ్రీఫలం పారపాటుగా

అటుకులలో కలిసిపోయిందని, 152.అదే కొబ్బరికాయ పగిలింది అని గ్రహించి పుండలికరావు చాలా భయపడ్డాడు. శరీరమంతా వణికిపోయింది. సత్పురుషుని పట్ల అపరాధం జరిగింది.153. అతనికి చాలా బాధ కలిగింది.ఎంత పాపాన్ని మూట కట్టుకున్నాను, స్వామి శాపానికి గురి అయ్యాను. అక్కడ వారి వద్ద నా ప్రేలాపనంతా వ్యర్థమైంది.154. శ్రీఫలానికి పట్టిన గతిని గని పుండలీకరావు చాలా కలవరపడ్డాడు. ఆశ్చర్యంతో అతని మనసు మూగపోయింది.155. ఇప్పుడు బాబాకు ఏం ఇవ్వాలి? వారితో ఏ విధంగా చెప్పాలి? వారికి నా మొహం ఎలా చూపించను? వారికి ఇవ్వవలసిన శ్రీఫలాన్ని కోల్పోయాను కదా? 156. సాయి చరణాలకు అర్పించ వలసిన శ్రీఫలం ఫలాహారమై పోయింది. సత్పురుషునికి అగౌరవం జరిగింది అని పుండలీకరావు తనలో దుఃఖ పడ్డాడు.157.బాబా కొబ్బరికాయను అడిగితే మన్‌మాడ్‌లో దానిని ఫలహారం చేసేశామని, ఇప్పుడు ఆ కొబ్బరికాయ లేదని చెప్పలేక అందఱూ సిగ్గుతో తలలు దించుకోవాలి అని అందఱి మనసులలోనూ బాధ ఉంది.158. కొబ్బరికాయ తమ వద్ద లేదని నిజాన్ని చెప్పటానికి సిగ్గు. సాయిమహారాజు సర్వ సాక్షి. కనుక వారితో అబద్ధం చెప్పితే పని జరగదు.159.సాయి దర్శనంతో భక్తులు సంతోషించారు. వారి కళ్ళు ఆనందాశ్రువులతో నిండి పోయి వారి మనసులు ప్రసన్నమైనాయి.160. మనం ఎప్పుడూ తీగెలు లేకుండానే వార్తలను పంపుతుంటాము. విజ్ఞానపరంగా ఎంతగానో పురోగమనాన్ని సాధించామని చాలా గొప్పగా గర్వపడతాం.161.వాని కొఱకు ఎంతో ధనం వ్యయంచేసి అక్కడక్కడా స్టేషన్లను నిర్మించాలి.కాని సాధు సత్పురుషులకు ఏ సాధనలు అవసరం లేదు.మనసుతోనే వార్తలను పంపుతారు.162.స్వామి పుండలీకరావుకు కొబ్బరికాయను ఇచ్చిన వార్తా విషయం

సాయినాథునకు ఏ తంతులూ లేకుండానే అందినది.163. పుండలీకరావు సాయిబాబా దర్శనం చేసుకున్నప్పుడు వారు తమంతట తాము 'మా సోదరుని వద్దనుండి తెచ్చిన నా వస్తువును ఇవ్వు' అని అడిగారు.164.అప్పుడు పుండలీక రావు బాబా పాదాలను పట్టుకొని ఆవేదనతో, నేనేమని చెప్పను! క్షమించమని మిమ్మల్ని ప్రార్థించడం తప్ప నాకు వేరే మార్గం లేదు.165. నేను కొబ్బరికాయను గుర్తు పెట్టుకుని మరీ తెచ్చాను కాని ఆకలిని తీర్చుకోవటానికి కాలువ దగ్గరకు వెళ్లినప్పుడు అందరం దాని గురించి మరచిపోయాం.166. అక్కడ దానినే పగలగొట్టి అటుకులలో కలిపి అందరం ఫలహారం చేశాం. కనుక మీకు మరొక కాయను తెచ్చి ఇస్తాను. దయతో స్వీకరించండి'.167.అని అతను లేవబోగా సాయిమహారాజు అతని చేతిని పట్టుకుని వద్దని వారించారు.168. పొరపాటుగా విశ్వాసఘాతుకం జరిగింది. మీరు దయామయులు. నన్ను క్షమించి మీ అక్కున చేర్చుకొండి. నేను మహా అపరాధిని.169.సజ్జనులు సాధువు అయిన స్వామి వచనాన్ని పాటించకుండా మీకు అర్పించవలసిన శ్రీఫలాన్ని నేను తిన్నాను.170. ఇది సాధువుల మాట జవదాటటం. నేను ఎంతటి మహాపరాధిని? నా ఈ పాపానికి అసలు నిష్కృతి అంటూ ఉందా?నేను ఎంతటి సిగ్గుమాలిన వాణ్ణయ్యాను?171.ఆ మాటలువిని బాబా నవ్వుతూ 'బాధ్యతగా దగ్గరుంచుకోలేని వాడివి అసలు ఆ కొబ్బరికాయను ఎందుకు తీసుకున్నావు?172.నీవు నా వస్తువును నాకు తెచ్చి ఇస్తావని నా సోదరుడు నీ మాటమీద ఎంతో విశ్వాసాన్ని ఉంచాడు.173.దాని పరిణామం ఇదేనా? నీవు పని చేసే పద్ధతి ఇదేనా? నా సోదరుని కోరిక తీరలేదు కదా?174.ఆ శ్రీఫలానికి బదులుగా ఎన్ని తెచ్చి ఇచ్చినా దానికి సమానం కావు. జరగవలసింది జరిగింది.ఇప్పుడు వ్యర్థంగా ఎందుకు దుఃఖిస్తున్నావు?175.స్వామి నీకు

కొబ్బరికాయనివ్వడం కేవలం నా సంకల్పం.నా కోరిక ప్రకారమే ఆ కాయ పగిలింది. కర్తృత్వాన్ని అనవసరంగా నీపైన ఎందుకు వేసుకుంటావు?176.నేను అపరాధిని అని అహంకార బుద్ధితో అనుకుంటున్నావు. నేను కర్తను కాను అన్న నిరహంభావాన్ని అలవరచుకుంటే ఏ బాధా ఉండదు.177. పుణ్యకార్యాలు మాత్రం నేను చేశానని అనుకున్నప్పుడు పాపకర్మలను కూడా నేనే చేశానని ఎందుకు అనుకోరు? రెండు కర్మల ఫలితమూ ఒక్కటే. అందువలన నీవు నిరభిమానంగా ప్రవర్తించు.178. నీవు నన్ను కలుసుకోవాలన్న నా సంకల్పం వలననే ఆ కొబ్బరికాయ నీ దోసిలిలో పడింది. ఈ మాట ముమ్మాటికీ నిజం179. మీరు నా బిడ్డలు. మీ నోట్లో పడ్డా ఆ కాయను మీరు నాకు అర్పించినట్లే. అది నాకు నిశ్చయంగా అందినట్లే అని తెలుసుకో. 180. ఆ విధంగా బాబా తమ వచనాలతో సమాధాన పరచగా పుండలీకరావు బాధ మెల్లమెల్లగా తగ్గి అతని మనసు కుదుట పడింది.181. కొబ్బరికాయ పోవటం అనే మిషతో చేసిన బాబా యొక్క బోధ అతని మనసుకు ఉపశమనం కలిగించింది.అహంభావంతో సతమతమవుతున్న వారి అహంకారం తొలగిపోయి వారు నిర్దోషులయ్యారు.182. ఇదే ఈ కథాసారం. మనోవృత్తిలో అహంభావం తగ్గుతున్న కొద్దీ పరమార్థంలో అధికారాన్ని సంపాదించి భవాన్ని సులువుగా దాటగలరు.183. ఇప్పుడు అపూర్వము మధురము అయిన మూడవ భక్తుని అనుభవాన్ని వింటే బాబా యొక్క అసమాన వైభవం, వారి సామర్థ్యం తెలుస్తాయి. 184. ఉత్తరభాగంలోని బాంద్రా తాలుకాలో బాంద్రా పట్టణం ప్రక్కన శాంతాక్రూజ్ అనే పట్టణంలో హరిభక్తులైన ధురంధర కుటుంబం ఉండేది.185. ఆ సోదరులందరికి సాధువుల యెడ భక్తి. వారికి శ్రీరాముని యందు దృఢమైన భక్తి విశ్వాసాలు.రామనామ మందు వారికి అనన్యమైన శ్రద్ధా ఉండేవి.

ఇతరుల విషయాలలో జోక్యం కలిగించుకోవటం వారికి ఇష్టముండేది కాదు.186.వారి జీవనం సాధారణంగా ఉండేది.వారి పిల్లలు మంచి ప్రవర్తన కలిగి ఉండేవారు. వారి స్త్రీలు కూడా మంచి ఆచరణ కలిగి ఉండేవారు. అందువలన చక్రపాణి వారికి ఋణపడి ఉన్నాడు.187. వారిలో ఒకరు బాలారాం. అతడు విఠలభక్తుడు. పుణ్యకార్యాలు చేయటంలో ప్రసిద్ధుడు. అందరికీ ప్రీతిపాత్రుడు. అతనికి రాజదర్బారులో మంచిపేరు. 188. 1878వ సం॥లో ఫిబ్రవరి 19వ తారీఖున ఒక రామభక్తుని ఇంట ఈ రత్నం భూతలంపైకి వచ్చింది .189. పాఠారె ప్రభు జాతికి చెందిన ఈ భూషణం, ముంబైలో ఒక ప్రసిద్ధ గౌరవనీయ మైన కుటుంబంలో జన్మించాడు.190.ఇతడు పాశ్చాత్య విద్యాపారంగతుడు, న్యాయవాది వృత్తిని చేపట్టిన వాడు. తత్త్వ జ్ఞానంలో నిష్ణాతుడు.విద్వాంసుడని అంతటా ప్రసిద్ధి చెందినవాడు.191. ఇతనికి పాండురంగని యందు అత్యంత ప్రేమ. పరమార్థంలో పరమశ్రద్ధ. ఇతని తండ్రి యొక్క ఆరాధ్య దైవం శ్రీరాముడు. కొడుకుకు విఠలునిపై భక్తి.192. సోదరులందరూ డిగ్రీలున్నవారు. వారి వ్యవహారం ఎప్పుడూ ధర్మబద్ధంగా ఉండేది. అయినప్పటికీ బాలారామునిపై వారసత్వంగా అపూర్వమైన మంచి సంస్కార ప్రభావం పడింది.193.ఆకర్షణీయమైన అతని ప్రవర్తన, నిర్మలమైన విచార సరళి, కుశాగ్రబుద్ధి, సత్ప్రవర్తన ఈ గుణాలు అనుకరణీయాలు.194. ఇతడు సమాజసేవ బాగా చేశాడు. తమ సమాజాన్ని గురించి స్వయం వ్రాశాడు. తను స్వీకరించిన బాధ్యతలన్నీ ముగిసిన తరువాత పరమార్థాన్ని సంపాదించు కోవాలని బయలుదేరాడు. 195. పరమార్థంలో కూడా మంచి పురోగతిని సాధించాడు.భగవద్గీత జ్ఞానేశ్వరి గ్రంథాలను పఠించి వానిలో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. ఆధ్యాత్మిక విషయాలలో దిట్ట అని పేరు పొందాడు.196. క్రీ.శ.1925 వ సం॥లో చిన్న వయసులోనే సాయి

యొక్క ఈ పరమభక్తుడు బ్రహ్మీభూతుడయ్యాడు. అతని గురించిన చిన్న కథను వినండి.197. క్రీ.శ.1925వ సం॥లో జూన్ నెల 9వతారీఖున ఇతడు ఇహలోక యాత్రను ముగించి విఠలునిలో లీనమయ్యాడు.198. క్రీ.శ.1912 వ సం॥ ఏప్రిలు నెలలో ఒక మంచి రోజున ధురంధర్ సోదరునికి సాయి సత్పురుషుని దర్బారుకు వెళ్లే యోగం వచ్చింది.199.దీని కంటె ఆరునెలలు ముందు జ్యేష్ఠ సోదరుడైన బాబుల్‌జి శిరిడీ వెళ్లి వామనరావు వెంట సాయిబాబా దర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వచ్చాడు.200. అతడు పొందిన మధురాను భవాన్ని మరియు అపూర్వమైన సాయిబాబా యొక్క దర్శనలాభాన్ని తాము కూడా పొందాలని బాలారాం మొదలగు వారు శిరిడీ వెళ్ళారు.201.వీరు శిరిడీకి రాకముందే, 'ఇవాళ ఇక్కడికి నా దర్బారు జనులు అనేకులు వస్తున్నారు' అని బాబా అందఱితోవైపు చూస్తూ అన్నారు.202. ప్రేమతో నిండిన ఆ మాటలను ఎవరో చెప్పగా విని తాను శిరిడీ వస్తున్నట్లు ఎవరికీ కబురు చేయలేదే, మరి ఈ విషయం బాబాకు ఎలా తెలిసింది అని ధురంధరు సోదరునికి చాలా ఆశ్చర్యం కలిగింది.203. కళ్ళ ఎదుట సాయిని చూడగానే పరుగున పోయి వారి చరణాలను ఆలింగనం చేసుకున్నాడు. మెల్ల మెల్లగా ముచ్చటించు కుంటుంటే అందఱికీ ఆనందం కలిగింది.204.ధురందర, సోదర బృందం రావటం చూచి బాబా, 'ఈ దర్బారు మనుష్యులు వస్తారని చెప్పానుకదూ, వీరే అని చెప్పారు.205.తరువాత బాబా చెప్పిన మాటలలో ఒక్కో పదాన్ని వినండి. పూర్వం నుండి నీకు నాకు పరిచయం. మునది అరవై తరాల అనుబంధం' అని బాబా చెప్పారు.206. బాలారాం మొదలగు దురంధరు సోదరు లందరూ వినయంగా చేతులు జోడించుకుని బాబా శ్రీచరణాలను అవలోకిస్తూ వారి ఎదుట నిలుచున్నారు.207.శ్రీసాయి దర్శనంతో వారందఱి

మనసులు ప్రేమతో ఉత్సాహంతో నిండిపోయాయి.వారి కళ్లు ఆనందబాష్పాలతో నిండాయి. వారి జన్మ సార్థకమనిపించింది.208. కంఠం గద్గద మయింది.శరీరమంతా రోమాంచిత మయింది.అష్టభావాలు ఉప్పొంగాయి.209. బాలారాం పరిస్థితిని చూచి సాయినాథునికి సంతోషం కలిగింది. ఎంతో ప్రేమతో వారందఱికీ ఉపదేశ వచనాలను చెప్పారు.210. శుక్లపక్షంలోని చంద్రుని కళలు రోజురోజుకు పెరిగేలా నన్ను రోజురోజుకూ అధికంగా ఆరాధించేవారు మరియు మనోవృత్తిని, కామక్రోధాది వికారాలను నాకోసం అర్పించిన వారు ధన్యులు.211.దృఢవిశ్వాసంతో తమ గురువులను ఆరాధించే వారికి పరమేశ్వరుడు ఋణపడి ఉంటాడు. అట్టి వారిని ఎవరూ చెడు బుద్ధితో చూడరు.212.అర ఘడియ అయినా వ్యర్థం చేయక హరి యొక్క, గురువు యొక్క భజనలో శ్రద్ధకలిగి ఉన్న వారికి గురువు శాశ్వతమైన సుఖాన్ని ప్రసాదించి భవసాగరాన్ని దాటిస్తారు'.213. ఇటువంటి బాబా వచనాలను విని ఆనందంతో అందరి కళ్లల్లో నీళ్లు నిండాయి. మనసులు ప్రసన్నమయ్యాయి. అంతః కరణం గద్గదమైంది.214. అందఱూ వందనం చేసి సాయి వచనాల పూలమాలను తమ మెడలో వేసుకున్నారు. దానితో భక్తి ఉప్పొంగి ఆనందం కలిగింది.215. తరువాత అందఱూ బసకు వెళ్లి భోజనా నంతరం కాసేపు విశ్రమించి మరల సాయంత్రం బాబా వద్దకు వెళ్లి వారికి సాష్టాంగ ప్రణామం చేశారు.216.బాలారాం వినయశీలి.బాబా పాదాలను ఒత్త సాగాడు.బాబా చిలుం గొట్టాన్ని అతని ముందుకు జరిపి పీల్చమని సైగ చేశారు.217.అతనికి అది అలవాటు లేక పోయినా బాబా ప్రసాదమని భావించి కష్టంగా పీల్చి దానిని బాబా చేతికి ఇచ్చి భక్తిగా వారికి అభివందనం చేశాడు.218.బాలారాం భాగ్యం, అప్పటినుండి అతని ఉబ్బసపు జబ్బు పూర్తిగా నయమయింది.219.ఆ ఉబ్బసపు జబ్బు అతనికి ఒకటి రెండు రోజులది

కాదు. పూర్తిగా ఆరు సంవత్సరాల నాటిది. చిలుం ప్రభావం చెవిలో మంత్రం ఊదినట్లుగా అనిపించింది. 220. చిలుమును ఒక్కసారి పీల్చి సవినయంగా నమస్కరించి తిరిగి ఇచ్చేశాడు. అప్పటినుండి అతని ఉబ్బసపు జబ్బు పోయింది. మరల ఎప్పుడూ రాలేదు.221. మధ్యలో ఒక్కరోజు మాత్రం బాలారాంకు దగ్గువచ్చింది. అందఱికీ చాలా ఆశ్చర్యం కలిగింది. కారణం ఎవరికీ అర్థం కాలేదు.222.తరువాత విషయాన్ని కనుక్కోగా ఆరోజే బాబా తమ శరీరాన్ని వదలి వేసినట్లు తెలిసింది.ఆ భక్తునికి బాబా అలా సూచించారు. 223.బాలారాంకు దగ్గువచ్చిన రోజే బాబా తమ శరీరాన్ని త్యజించారు. దీనితో అతనికి తమ నిధనాన్ని సూచించారు.224. అప్పటి నుండి అతనికి మరణం వరకు మరల ఎప్పుడూ దగ్గు రాలేదు. ఈ చిలుము అనుభవాన్ని ఎవరైనా ఎలా మరచి పోగలరు?225.ఆ రోజు గురువారం. పైగా చావడి ఊరేగింపు. ధురంధర్ బృందానికి ఇనుమడించిన ఆనందం లభించి ఆ రోజు స్మరణీయకంగా మిగిలింది.226. ఎనిమిది నుండి తొమ్మిది వరకు బాబా ఎదుట ప్రాంగణంలో తాళాలు తప్పెట్లు మృదంగ వాదనలతో భజన జరిగింది. 227.భక్తులు అభంగాలు పాడుతుంటే మరో వైపు పల్లకిని అలంకరిస్తుండేవారు. పల్లకి తయారయాక బాబా చావడికి బయలు దేరేవారు.228. ఇదివరలో ముప్పది ఏడవ అధ్యాయంలో చావడి ఊరేగింపును విస్తారంగా వర్ణించాను.ఇక్కడ చెప్పటం పునరుక్తి ఔతుంది.229.బాబా ఒక రాత్రి మసీదులో రెండవ రాత్రి చావడిలో గడిపే వారు. వారి ఆ నియమం ఆగకుండా వారు శరీరాన్ని విడిచే వరకూ సాగింది.230.ఆ చావడి వైభవాన్ని చూడాలని బాలారాంకు కుతూహలం.అందువలన చావడి ఊరేగింపు సమయానికి సరిగ్గా ధురంధర్ బృందం అక్కడికి వచ్చారు.231.శిరిడీ గ్రామ వాసులు స్త్రీలు పురుషులు బాబాను వెంట బెట్టుకుని ఎంతో

ఉత్సాహంగా జయజయకారాలు చేస్తూ చావడికి బయలు దేరారు.232. శ్యామసుందర్ అని అందమైన పేరుగల బాబా గుఱ్ఱం, వీపు మీద జరీ వస్త్రాన్ని ధరించి చక్కటి అలంకారాలతో థై థై అని నాట్యం చేస్తున్నట్లుగా ముందు నడిచింది. 233. సన్నాయి డోలు మొదలగు వాద్యాలు మ్రోగుతుండగా అలంకరించిన శ్యామకర్ణతో బాబా పల్లకీ వెంట ఊరేగారు. భక్తులు ఛత్రాన్ని పట్టుకున్నారు.234. పతాకాన్ని చేత పట్టుకుని, ఛత్రాన్ని శ్రీసాయి శిరసుపై పట్టుకుని వింజామరలను వీస్తూ నలువైపులా దివిటీలను పట్టుకుని నడిచారు. 235.తాళాలు మృదంగం మొదలగు వాద్యాలను వాయిస్తూ చక్కగా భజన చేస్తూ, బాబాకు ఇరువైపులా నడిచారు. 236.ఇటువంటి రమ్యమైన ఊరేగింపు చావడి సమీపానికి రాగానే బాబా ఆగి ఉత్తరాభిముఖంగా నిలచి విధి పూర్వకంగా చేతులతో ఏవో సూచనలను చేశారు.237.బాబా భక్తుడు మహల్సాపతి బాబాకు ఎడమవైపున బాబా పైని ఉత్తరీయాన్ని పట్టుకున్నాడు.బాబాకు కుడివైపున తాత్యాపాటిలు లాంతరు పట్టుకుని నడిచాడు. 238. బాబాముఖం అసలే సువర్ణవర్ణం. పైగా దీపాల ప్రకాశంతో రాగి కలిసిన బంగారంలా అరుణారుణ ప్రభలతో శోభిస్తుంది.239. ఆ సమయంలోని వారి పవిత్ర దర్శనం మహాభాగ్యం. బాబా ఏకాగ్ర మనసుతో నిలుచుని ఉత్తరాభిముఖంగా కుడిచేతిని క్రిందకూ పైకి ఊపినప్పుడు ఎవరినో పిలుస్తున్నట్లుగా అనిపించింది.240.అక్కడి నుండి చావడికి బాబాను తీసుకుని వెళ్లి గౌరవ పూర్వకంగా కూర్చోబెట్టి వస్త్రాలను దివ్యాలంకారాలను అర్పించారు. వారి శరీరానికి చందనం పూశారు.241. ఒకప్పుడు తురాయితో తలపాగాను మరొకప్పుడు బంగారు కిరీటాన్ని లేదా ముదురు రంగు తలపాగాను వారి తలపై ఉంచారు. అందమైన జరీ కోటును తొడిగారు.242. అందమైన రత్నాలు ముత్యాలమాలలను ప్రేమగా

వారి మెడలో వేశారు. ఒకరు వారి నొసటన పరిమళ కస్తూరి తిలకాన్ని దిద్దారు.243. ఒకరు వారి చరణాలను ప్రక్షాళనం చేసి అర్ఘ్యపాద్యాదిపూజలు చేశారు. మరొకరు కుంకుమ పూవు కలిసిన చందన్నాన్ని అద్దారు. ఒకరు వారి నోటికి తాంబూలాన్ని అందించారు.244. బాబాకు పంచారతిని కర్పూర నీరాజనాన్ని ఇచ్చినప్పుడు వారి దివ్య తేజస్సు యొక్క శోభ అనుపమానంగా కనిపించింది.245.పాండురంగ మూర్తి ముఖం, దివ్య తేజస్సుతో శోభాయమానంగా వెలిగిపోయేలా సాయిబాబా ముఖం కూడా తేజోవంతంగా ప్రకాశించటం చూచి ధురంధర్ ఆశ్చర్యపోయాడు. 246. ఆకాశంలో మెరిసే మెరుపును భూమిపై నుండి చూడలేనట్లే సాయి నొసటన తేజస్సు చూడలేక కళ్లు మెరిశాయి.247.ఆ మరునాడు తెల్లవారు ఝామున జరిగే కాకడ ఆరతికి ధురంధర ప్రభృతులు వచ్చారు. అప్పుడు కూడా బాబా ముఖంలో అదే తేజస్సును అవలోకించారు. 248.అప్పటి నుండి బాలారాంకు సాయి చరణాలయందు కుదిరిన దృఢమైన నిష్ఠ మరణించేవరకూ ఏ కొంచమైనా చలించలేదు.249. హేమాడు సాయి చరణాలకు శరణు జొచ్చి తరువాతి అధ్యాయంలో ఈ గ్రంథాన్ని సంపూర్ణంచేసి సింహావలోకనం చేస్తాడు. చివరిసారిగా నా యందు శ్రద్ధ చూపించండి. 250. స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమూ, భక్త హేమాడ్ పంత్ విరచితమూ అయిన శ్రీసాయి సమర్థ సచ్చరితంలో భక్తత్రయవృత్త కథనమను ఏబది ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



శ్రీ సాయి సచ్చరిత 52 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాభ్యోనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

ఇప్పుడు ఈ గ్రంథాన్ని సింహావలోకనం చేసి, తరువాత, అధ్యాయాల సారాంశమైన అవతరణికతో ఈ గ్రంథాన్ని సంపూర్ణం చేస్తాను.1.సాయిబాబా శరీరంతో ఉండగా ఆయా సమయాలలో భక్తులకు కలిగించిన అనుభవాలను గుర్తుంచుకోవటానికి ఈగ్రంథాన్ని వ్రాయించి శ్రీసాయిలీలా మాసపత్రికలో ప్రచురింప చేశారు.2. పరమ పవిత్రమైన సాయిలీలా పత్రికలో ఇహపరాలను గురించి ప్రబోధించే మన సద్గురువు చరిత్రను కథలా పఠించండి.3. సాయిబాబా లీలలు అసంఖ్యాకంగా సేకరించబడి ఉన్నాయి. శాస్త్రజ్ఞానంగాని పాండిత్య జ్ఞానం గాని లేని హేమాడు పంతు చేతిని పట్టుకుని సాయిబాబా తమ సచ్చరితను వ్రాయించారు.4. కొందఱు గురువులు తమ ఖ్యాతిని తమనోటితో శిష్యులకు వినిపిస్తారు. అది వారి తదనంతరం గ్రంథ రచనకు స్ఫూర్తి కలిగిస్తుంది.5.సాయిబాబా అనేకరకాల గొప్ప గొప్ప వృత్తాంతాలను చెప్పుతున్నప్పుడు శ్రోతలు ఆకలిదప్పులను మరచి అత్యంత తల్లీనులై వినేవారు.6. సాయి యొక్క దివ్య రూపాన్ని చూచినవారి త్రివిధ తాపాలు నశించిపోయాయి. అటువంటి వారి శక్తి ప్రభావాన్ని ఆద్యంతం పూర్తిగా వర్ణించటం సాధ్యమా?7. ఉదారమైన స్వభావంకల సాయి తమను ఆరాధించిన భక్తులను ఉద్ధరించటానికి, తమ వైభవాన్ని తెలిపే చరిత్రను వ్రాయించి ఉంచారు.8.పవిత్ర గోదావరిలో స్నానం చేసిన

తరువాత సాయి సమాధిని దర్శించి, ఈ సాయి సచ్చరితను పఠించండి.మీ త్రివిధ తాపాలు నశిస్తాయి. 9. సాయిబాబా లీలలను మామూలుగా ముచ్చటించుకున్నా సరే, మనకు తెలయకుండానే పరమార్థం అబ్బుతుంది. భక్తిగా ఈ గ్రంథాన్ని పఠిస్తే కోటి పాపాలు నశిస్తాయి.10.జనన మరణాల రాకపోకలను వదలించుకోవాలని కోరుకునే వారు, గురు చరణాలయందు మరియు అఖండ గురునామస్మరణ యందు భక్తి కలిగి ఉండాలి.11.మిథ్యా జ్ఞానానికి కారణం,ఆత్మస్వరూపాన్ని గ్రహించలేక పోవటం, అదే జననమరణాలకు సర్వ అనర్థాలకు కారణం.12.మోహం అంటే మిథ్యాజ్ఞానం.ఆత్మలేని జడ వస్తువు యందు, ఆత్మాభిమానం ఉండటాన్నే విద్వజ్జనులు మృత్యువు అని అంటారు.13.సాయికథా సాగరాన్ని మథనం చేసి, మధురమూ నిత్య నూతనమూ అయిన సాయి కథలను శ్రవణం చేసే శ్రోతలకు అధఃపతనం తప్పుతుంది.14.సాయి యొక్క సగుణసాకార స్థూల రూపాన్ని ఎల్లప్పుడూ ధ్యానం చేస్తే వారి సగుణ రూపం లోపించి సూక్ష్మతమమైన ఆత్మ స్వరూపం ప్రకటమౌతుంది.15.సగుణ సాకార రూపాన్ని ముందుగా ఆరాధించకపోతే,ఆత్మ యొక్క జ్యోతి తెలియదు. నిర్గుణ పరబ్రహ్మతత్త్వం పూర్తిగా అవగాహన కాదు. 16. బాబా భావికులైన భక్తులను తమ పాదాల వద్దకు రప్పించి,వారికి తెలియకుండానే శరీరమున్నా శరీర భాసలేని పరమార్థ మార్గంలో ప్రవేశ పెట్టారు.17.సాగరాన్ని ఆలింగనం చేసుకున్న నది తాను నది అన్న విషయం మరచిపోయినట్లు బాబా తమను ఆశ్రయించిన భక్తుల ద్వైతాన్ని తొలగించేవారు.18.రెండు దీపాలు ఒకదాని నొకటి ఆలింగనం చేసుకున్న క్షణాన ద్వైత స్థితిపోయి అవి ఒక్కటైపోయి ఒకే దీపంగా వెలుగుతాయి. 19. తన నివాసనను విడిచి కర్పూరం, ప్రకాశాన్ని విడిచి సూర్యుడు, కాంతిని

విడిచి సువర్ణం వేరుగా ఉండగలవా? 20. నది సాగరంలో కలిసి పోగానే అది సాగరం అయిపోతుంది, అట్లే ఉప్పు సాగరంలో పడిన వెంటనే సాగరమై పోతుంది. 21. అదే విధంగా సాయి చరణాలను ఆశ్రయించిన భక్తుల ద్వైతభావం తొలగిపోతుంది. తమ అహంభావాన్ని త్యజించిన వారు సద్గురువులో ఐక్యమైపోతారు. 22. జాగ్రతి స్వప్నం లేక సుషుప్తి మూడింటిలో ఏ స్థితిలోనైనా మనో వృత్తి సాయిమయమౌతే చాలు. అదే ప్రపంచం నుండి విరమించినట్లు. 23. ఇప్పుడు సాయి పాదాలకు ప్రణామం చేసి నా మనసు మిమ్మల్ని తప్ప దేనినీ కోరకుండుగాక! అని వేడుకుంటున్నాను. 24. బ్రహ్మాది స్తంభ పర్యంతం ఘటాలలో మఠాలలో ఆకాశంవలె సర్వప్రాణులలో ఏ కొంత భేద భావము లేకుండా, పరిపూర్ణంగా నిండి ఉండి, 25. భక్తులనందరినీ సమానంగా చూస్తూ ప్రియా ప్రియాలను మానావమానాలను ఎరుగనటువంటివారు, విషమతాభావం అసలులేనటువంటి. 26. సాయిసమర్థునికి శరణు వేడుచున్నాను. స్మరించే వారి సకల కోరికలను తీర్చే సాయి చరణాలపై శిరసు నుంచి కృతార్థుణ్ణి ఔతాను. 27. ఇక సజ్జనులు భక్తశ్రేష్ఠులు అయిన శ్రోతలందరికి నా ప్రణామాలు. గొప్ప స్నేహితులైన మీరు, నా మనవిని వినండి. 28. ఇంతవరకు నెలనెలా కొంత సమయాన్ని వినియోగించి ఏ సాయి కథలను విన్నారో వానిని ఒక్క క్షణమైనా మరిచిపోకండి. 29. మీరు సాయి కథలను ప్రేమ పూర్వకంగా వింటే వక్తయైన నాకు సాయిబాబా సంతోషాన్ని కలిగిస్తారు. 30. శ్రోతలకు శ్రద్ధ లేకపోతే వక్తకు సంతోషం కలగదు. ఉభయులకూ ప్రసన్నత లేకుండా చేసే శ్రవణం వృథా శ్రమ. 31. భవసాగరాన్ని దాటటం పరమ కఠినం. దీనిలో మోహపు అలలు ఎల్లప్పుడూ ఉప్పొంగుతూ చెడు విచారాలనే తీరాన్ని ఢీకొంటాయి. ధైర్యమనే వృక్షాలు పడిపోతాయి. 32. అహంకారమనే గాలివీచడం వలన సాగరమంతా

అల్లకల్లోలమౌతుంది. దీనిలో, క్రోధ ద్వేషాదులనే పెద్దపెద్ద మొసళ్లు నిర్భయంగా చోటు చేసుకుంటాయి. 33. మరియు 'నేను నాది' అన్న ఈ మొసళ్లు, వాసనలు వికల్పాలు అనే అనేక సుడిగుండాలు, నింద అసూయ తిరస్కారం మొదలైన అసంఖ్యాక జలచరాలు సంచరిస్తుంటాయి. 34. ఇది ఇంతటి భయంకరమైన సాగరమైనప్పటికీ అగస్త్యుని రూపంలో గురువు దీనిని ఔపోశనం పట్టుతారు. వారి చరణ ధూళికి దాసులైన వారికి లవలేశమైనా దీని భయం ఉండదు. 35. అందువలన సద్గురు సాయిసమర్థులు భవసాగరాన్ని దాటించే నౌక అయి వారిని ఆశ్రయించిన వారి నందఱినీ వారు అవతలి తీరానికి చేర్చుతారు. 36. మహా దుస్తరమైన ఈ భవసాగరాన్ని దాటటానికి సాయి చరణాలను నావగా చేసుకుంటే నిర్భయంగా అవతలి తీరానికి చేర్చుతారు. నిష్ఠలోని విశిష్టత ఇటువంటిది. 37. ఇటువంటి ఈ వ్రతాన్ని ఆచరిస్తే ప్రపంచ దుఃఖాల లోని తీవ్రత తెలియదు. దీనికంటె లాభకరమైనది వేరే ఏదీలేదు. ఇదే శక్తి మనకు చక్కగా ఉపయోగ పడుతుంది. 38. సాయి చరణాలలో అత్యంత భక్తి, కళ్ళల్లో సాయిమూర్తిని నింపుకుని సర్వప్రాణులలోనూ సాయినే చూడగలిగేస్థితి భక్తులకు కలుగుగాక. 39. పూర్వజన్మలో స్వేచ్ఛగా విహరించి పతనాన్ని పొందాము. ఇప్పుడైనా సద్గతిని పొందటానికి, విషయ భోగాలను త్యజించటానికి శక్తి లభించుగాక. 40. సాయి సమర్థులు ఎప్పుడూ వెన్నంటి ఉంటే ఎవరూ ఏం చేయలేరు అన్న దృఢ విశ్వాసంతో నిర్భయంగా ఉండే భక్తులు ధన్యులు. 41. ఇప్పుడు బాబా చరణాలను పట్టుకుని సకల భక్త జనుల కొరకు వారిని ప్రార్థించాలని అనిపిస్తూ ఉంది. 42. ఈ గ్రంథం అందఱి గృహాలలో ఉండాలి. కారణం దీనిని నిత్యం నియమంగా భక్తితో పారాయణ చేసే వారి కష్టాలు నివారింప బడతాయి. 43. శుచిర్భూతులై భక్తిశ్రద్ధలతో ఈ గ్రంథాన్ని ఏడు రోజులలో

పఠించినవారి అరిష్టాలు తొలగిపోతాయి.44.ఇది ఆధ్యాత్మిక దారంతో అల్ల బడినది. శ్రీకృష్ణుడు మరియు బ్రహ్మ యొక్క కథలతో నిండి ఉంది. బ్రహ్మైక్య రస పూరితమైనది. దీనిలో అద్వైతం గురించి అపూర్వంగా వివరించ బడింది.45.ఏకనాథమహారాజు యొక్క కావ్యమనే నందన వనంలో ముప్పై రెండు భాగాలుగా ఉన్న బృందావనంలో మనోహరమూ మధురమూ అయిన పాయసంలో జ్ఞానులు అజ్ఞానులు రమిస్తారు. 46. ఈ సచ్చరితను నియమంగా పారాయణ చేసినా లేదా శ్రద్ధగా శ్రవణం చేసినా సాయిసమర్థులు వారి కష్టాలను వెంటనే తొలగిస్తారు.47.ధనం కోరుకునే వారికి ధనం లభిస్తుంది. మంచి వ్యవహారంలో సంపూర్ణ యశస్సు కలుగుతుంది. శ్రద్ధ నిష్ఠానుసారం ఫలితం లభిస్తుంది. భక్తి భావం లేకపోతే ఏ అనుభవమూ కలగదు.48. ఈ గ్రంథాన్ని గౌరవంగా పఠిస్తే సాయి ప్రసన్నులై అజ్ఞాన దారిద్ర్యాన్ని నశింపచేసి జ్ఞాన సంపదను ప్రసాదిస్తారు.49.ఈ గ్రంథ రచన సాయి యొక్క సూచన. అట్లే వారి మనసులో గుప్తంగా ఉన్నవారి సంకల్పం. సాయి చరణాల యందు అనురక్తులై ఉండే భక్తుల జీవితం ధన్యం.50. ప్రశాంతమైన మనసుతో నియమ నిష్ఠలతో ఈ సచ్చరితలోని ఒక అధ్యాయమైనా పఠిస్తే చాలు. అది అమిత సుఖదాయకం.51.తమ మంచిని కోరుకునే వారు ఈ గ్రంథాన్ని పఠించాలి. వారు సాయి యొక్క ఉపకారాన్ని జన్మ జన్మలకు ఆనందంగా గుర్తుంచు కుంటారు.52.గురుపౌర్ణిమ,గోకులాష్టమి, సాయి యొక్క మహా సమాధి, రామనవమి, సాయి యొక్క ఈ ఉత్సవ దినాలలో తప్పకుండా తమతమ గృహాలలో దీనిని పఠించాలి.53.మనసులోని విషయాసక్తిని అనుసరించి జన్మ ప్రాప్తిస్తుంది. అంతిమ సమయంలో మనసు ఎలా ఉంటే వారి గతి కూడా అట్లే ఉంటుంది అని శాస్త్రం.54.శ్రీసాయి భక్తులకు ఆధారం. వారు లేకుండా

విఘ్నాలు నశించవు. తల్లి బిడ్డల కోసం తహతహలాడుతుంది. ఇందులో విశేష మేముంది?55. ఇంతకంటె ఎక్కువగా ఏం చెప్పను? మాటలు రాక ఆగిపోయినప్పుడు మౌనంగా ఉండటమే మంచిదనిపిస్తుంది. ఇదే యోగ్యమైన స్తుతి.56. అయినా తీవ్రమైన మోక్షేచ్ఛతో నిత్యం శుభకర్మలను చేస్తూ శ్రవణాది నవవిధ భక్తితో భగవంతుని సేవిస్తే అంతఃకరణం పరిశుద్ధమౌతుంది.57. ఇది సద్గురువు అనుగ్రహం లేకపోతే జరగదు. సద్గురువు లేకుండా పరతత్త్వ జ్ఞానం లభించదు. బ్రహ్మైవాహం నేను స్వయం బ్రహ్మను అన్న స్మరణ ఎల్లప్పుడూ ఉండదు. మరియు గురువు యందు నిష్ఠ ఉండదు.58. గురుశిష్యుల సంబంధం తండ్రి కొడుకుల సంబంధం వంటిది. గురువును తండ్రితో పోల్చటం నామమాత్రానికే. తండ్రి ప్రపంచంలోని సుఖాలను అనుభవించే యోగ్యతను ఇస్తాడు. కాని గురువు పరలోకసుఖాలను కూడా ప్రసాదిస్తారు.59. తండ్రి అశాశ్వతమైన క్షణికమైన ఐశ్వర్యాన్ని ఇస్తాడు. గురువు శాశ్వతమైన అక్షయ సుఖాన్ని అనుభవింపచేసి, అపరోక్ష జ్ఞానాన్ని అందచేస్తారు.60. తల్లి నవమాసాలు మోసి జన్మనిచ్చి బయట పడేస్తుంది. దీనికి విరుద్ధంగా గురుమాత బయట ప్రపంచం నుండి లోపల పడవేస్తుంది.61. అంతిమ సమయంలో గురుగురు అని స్మరిస్తే, శిష్యుడు తప్పకుండా సాయుజ్యాన్ని పొందుతాడు. కాని గురువు స్వయంగా శిష్యుని కొడితే శిష్యుడు పూర్తిగా బ్రహ్మలో విలీనమౌతాడు.62. గురువు యొక్క చేతి దెబ్బ జనన మరణాలను నశింప చేస్తుంది. గురువు ఎవరి శరీరాన్ని అంతం చేస్తారో అట్టి వాని కంటే భాగ్యవంతుడు ఎవరు ఉంటారు?63. గద ఖడ్గము గొడ్డలి శూలము మొదలగు శస్త్రాలను గురువు తమ చేతిలో తీసుకోవాలి. వాని దెబ్బ పడటంతో శిష్యునికి నిజమైన జాగృతి కలిగి సద్గురువు యొక్క మూర్తి కనిపిస్తుంది.64. ఎంతగా కాపాడు కున్నా శరీరం ఎప్పుడైనా పడిపోవాల్సిందే

కదా. మరి అది గురువు చెతితో పడిపోతె ఇక పునర్జన్మ ఉండదు.65. సద్గురూ! నన్ను బాగా కొట్టు. నేను చచ్చేవరకు కొట్టు.నా అహంకారాన్ని సమూలంగా నిర్మూలించు.పునర్జన్మ లేకుండా మంచి గట్టి దెబ్బనే ప్రసాదించు.66.నా కర్మలను అకర్మలను దహించి వేయి. నా ధర్మాధర్మాలను నివారించు.దాని వల్ల నాకు పరమ సుఖం కలుగుతుంది. మోహం కారణంగా ఉద్భవించే భ్రమను నశింపచేయి.67.నా సంకల్ప వికల్పాలను నిలిపివేసి నాకు నిర్వికల్ప స్థితిని ప్రసాదించు. నాకు పుణ్యమూ వద్దు పాపమూ వద్దు. ఈ జన్మ కోసం వ్యర్థమైన శ్రమా వద్దు.68.నేను మీ శరణు కోరి వస్తే మీరు క్రిందా పైనా ఆకాశంలో పాతాళంలో తూర్పుపడమర అన్ని దిక్కులలోనూ ఉన్నారు.69.మీరు అన్ని ప్రదేశాలలోనూ ఉన్నారు.నాలోకూడా ఉన్నారు. నేను నువ్వు అన్న భేదభావ కల్పన నాకు కష్టంగా ఉంది.70.అందువలన హేమాడు సద్గురు చరణాలను దృఢంగా పట్టుకుని వారికి అనన్య శరణు జొచ్చి పునర్జన్మను పోగొట్టుకుని తనను ఉద్ధరించుకుంటాడు.71.అసంఖ్యాక భక్తులను ఉద్ధరించటానికి సాయిబాబా హేమాడు పంతును నిమిత్త మాత్రునిగా చేసి,తమ ఈ చరితాన్ని నిర్మాణం చేశారు. ఇది అపూర్వమైన విషయం కాదూ!72.ఈ శ్రీసాయి సమర్థ చరితం నాచే రచియింపబడటం ఆశ్చర్యం. సాయిబాబా కృపలేకుండా పామరుణ్ణైన నాకు ఇది అసాధ్యం.73. నాకు సాయితో అనేక సంవత్సరాలు సహవాసం లేదు. సత్పురుషులను అవగాహన చేసుకునే శక్తిలేదు. అవిశ్వాస పూర్వకంగా చూడటమేగాని విచక్షణా దృష్టిలేదు.74.అనన్య భావంతో ఎప్పుడూ ఆరాధించ లేదు. కొంతసేపైనా భజనలో పాల్గొనలేదు.ఇటువంటి నాతో తమ చరితాన్ని వ్రాయించి ప్రజలకు చూపించారు.75.తమ మాటను నిలబెట్టుకోవటానికి ఈ గ్రంథ రచనను నాకు స్ఫురింప చేసి, సాయిబాబా

తమ ఈ కార్యాన్ని తామే పూర్తిగా చేసుకున్నారు.ఈ హేమాడు ఊరికే పేరుకు మాత్రమే.76.దోమ పర్వాతాన్ని లేవనెత్తగలదా? పిచ్చుక సాగరాన్ని ఖాళీ చేయటం శక్యమా? కాని సద్గురువు వెన్నంటి ఉంటే, అద్భుతమైన కార్యాలను సంభవింప చేస్తారు.77.శ్రోతలారా! ఇప్పుడు మీకు అభివందనం చేస్తాను. ఈ గ్రంథం సంపూర్ణమైంది.సాయి యొక్క ఈ గ్రంథం సాయికి అంకితం చేస్తున్నాను.78.చిన్నా పెద్దా శ్రోతలందఱికి సాదరంగా నా సాష్టాంగ నమస్కారం.మీరు తోడుగా ఉండటం వలన కథా పరంపరలతో ఉన్న ఈ సాయి సచ్చరితను సమాప్తి చేశాను.79. సమాప్తి చేయటానికి ఇక్కడ నేనెవరిని? ఇలా అనుకోవటం వ్యర్థమైన అహంకారం. సాయియే సూత్రధారులైనప్పుడు ఇలా అనుకోవటానికి నేనెవరిని?80. దుఃఖానికి మూల కారణమైన ఈ అభిమానాన్ని త్యజించి గురువు యొక్క గుణాలను పదే పదే గానం చేస్తాను. అంతఃకరణానికి బోధ ప్రదమైన ఈ వాగ్ యజ్ఞాన్ని సమాప్తి చేస్తాను.81.ఇక్కడితో ఈ గ్రంథం పూర్తి అయి సాయి కార్యం పూర్తి అయింది.నా మనోభీష్టం కూడా పూర్తిఅయి నేను కృతార్థుణ్ణయ్యాను.82. ఈ గ్రంథాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేస్తే మనసులోని కోరిక తీరుతుంది. సద్గురు చరణాలను హృదయంలో ప్రతిష్ఠించు కుంటే భవసాగరం నుండి తరింపబడతారు.83.రోగులు ఆరోగ్యవంతులౌతారు. దరిద్రులు ధనవంతులౌతారు. సంకల్ప వికల్పాలు పోయి మనసు స్థిరపడుతుంది. దీనులకు ఔదార్యం లభిస్తుంది.84.ఈ గ్రంథాన్ని మరల మరల పారాయణ చేస్తే పిశాచాల బాధ అపస్మారం తొలగిపోతాయి. కుంటి మగిూగ చెవిటి వారికి కూడా ఈ శ్రవణం సుఖం కలిగిస్తుంది.85. అపారశక్తి వంతుడైన పరమేశ్వరుని మరచిపోయి అజ్ఞానం వలన మోహంలో చిక్కుకున్న మానవులు ఉద్ధరింపబడతారు.86.మానవులై పుట్టి

అసురులవలె, ప్రపంచాన్ని సుఖాలకు నిలయమని భావిస్తూ శరీరాలను వ్యర్థ పరుచుకునే వారు కూడా ఉద్ధరింప బడతారు.87.సాయినాథుల లీల అగాధం. వారు ఈ హేమాడు పంతుకు తమ చరణాలలో శాశ్వతమైన ఆశ్రయాన్నిచ్చి అతనిని తమ సేవకు వినియోగించుకుని ఈ సేవను చేయించుకున్నారు.88. చివరికి జగత్తును నడిపించేవారు, బుద్ధిని ప్రేరేపించేవారు అయిన సద్గురు చరణాలయందు అమితమైన భక్తితో కలాన్ని మస్తకాన్ని అర్పిస్తున్నాను.89.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.





శ్రీ సాయి సచ్చరిత 53 వ అధ్యాయం

శ్రీగణేశాయనమః; శ్రీసరస్వత్యైనమః ; శ్రీగురుభ్యోనమః ; శ్రీ కులదేవతాయైనమః; శ్రీ సీతారామచంద్రాభ్యాంనమః; శ్రీ సద్గురు సాయినాథాయనమః.

శ్రీసాయి సాక్షాత్తు ప్రత్యక్ష బ్రహ్మ; సత్పురుష సామ్రాట్టు చక్రవర్తి. వారు సమర్థ సద్గురువు అని దిగంతాల వరకు వారి కీర్తి వ్యాపించింది.వారు బుద్ధికి స్ఫూర్తిని ప్రసాదిస్తారు.1.ఎందుకంటే వారు జననమరణాలను ప్రపంచ భయాలను తొలగిస్తారు.అనన్యభావంతో వారి శరణు జొచ్చి వారి పుణ్య చరణాలకు వందనం చేస్తాను.2. గతాధ్యాయంలో మొదట సింహావలోకనం చేసి తరువాత అవతరణికను పొందు పరచి గ్రంథాన్ని సమాప్తి చేస్తానని.3.హేమాడుపంతు చెప్పారు. కాని అలా జరగలేదు.గ్రంథం యొక్క సారాంశమైన అవతరణికను వారు వ్రాశారో లేక మరపు కారణంగా వదిలి వేశారో తెలియదు.4. గ్రంథరచనను ప్రారంభించిన వారే అవతరణికను చివర వ్రాసి గ్రంథాన్ని పూర్తి చేయటం అంతటా నియమం. 5. కాని నియమంలో మినహాయింపులు ఉంటాయి.అదే విధంగా ఇక్కడ కూడా కనిపిస్తూ ఉంది.మన కోరిక ప్రకారం ఏదీ జరగదు. బాబా సంకల్పం బలీయమైనది.6.అందఱినీ దుఃఖంలో ముంచి హేమాడుపంతు అకస్మాత్తుగా దివంగతులయ్యారు.అవతరణిక విషయం తెలియలేదు.ఎవరికీ ఏం తోచలేదు.7. అణ్ణాసాహేబు సేకరించి ఉంచిన వారి రచనలను వారి కుమారుడు గజానన్ వెదకి కొన్ని అవసరమైన కాగితాలను ఇచ్చాడు. 8. అణ్ణాసాహేబు చాలా పొదుపరి. చిన్న చిన్న చిత్తు కాగితాలను కూడా వృథా చేసేవారు కాదు. ఏపనినైనా చక్కగా చాతుర్యంతో చేసేస్వభావం వారిది.9.చిన్న చిన్న

కాగితం ముక్కలపైన వ్రాసిన అధ్యాయాలను అలాగే ముద్రణకు ఇచ్చేవారు. అనవసరమైన ఖర్చువారికి నచ్చేది కాదు.వారి సాటి ఎవరూ రారు. 10. జీవంలేని చిన్న కాగితం ముక్కలపై వారికి దయ కలిగి వీనిని సత్పురుషులైన శ్రీసాయి సేవలో ఉపయోగించకపోతే ఇవి ఎలా ఉద్ధరింపబడతాయి? 11.అని హేమాడుపంతుకు అనిపించి కాగితపు ముక్కలను పోగుచేసుకుని వాని ద్వారా ఈ సేవను చేయించి ఉండవచ్చు. ఇది వారి ఉదాత్తమైన ఉద్దేశం కావచ్చు. 12. చివరి అధ్యాయం కూడా అట్లే కాగితం ముక్కలపై వ్రాసి ఉండవచ్చు.కాని ఎంత ప్రయత్నించినా అవతరణిక లభించలేదు. 13.విషయాన్ని గజాననరావు మొదలగు వారితోను మరియు బాబా సాహేబు తర్ఖడ్‌తో కూడా చెప్పడం జరిగింది.వారందఱూ అవతరణిక ఉండవలసిందేనని తమ ఉద్దేశాన్ని తెలిపారు.14.దీనిని వ్రాయటానికి బాబా సాహేబు ఒక సమయాన్ని నిర్ణయించి 'శ్రీసాయిలీల' లో ప్రచురించారు.కాని ఆ గడువుముగిసి పోయినా అవతరణిక అవతరించలేదు.15.హేమాడు అంటే గోవిందరావు సద్గురుబాలకు గని. వారి నోటికి వేదాంతం కంఠోపాఠం. ఈ గ్రంథంలో ప్రాసాదిక వాణి ప్రకటమైంది.గురువు యొక్క అనుగ్రహచర్య అద్భుతం. 16. సాయి సద్గురువు యొక్క భక్తులు అసంఖ్యాకం. వారిలో హేమాడుపంతు కవిరత్నం.వారికి సాటియైన ప్రజ్ఞావంతుడు, మహా పురుషుడే దీనిని రచించగలడు.17.అవతరణిక ఎక్కడనుండీ అవతరించలేదు.నా మనసుకు చింత పట్టుకుంది.దత్త గురువు స్వరూపులైన సాయినాథుని ప్రార్థించి వారి అనుగ్రహాన్ని వేడుకున్నాను.18.నేను పామరుణ్ణి,మందబుద్ధిని,విద్యాగంధం లేనివాణ్ణి. కవిత్వాన్ని అసలే ఎఱుగని వాణ్ణి. ఛందో బద్ధమైన రచనను ఎలా చేయగలను?19.నాకు ఒకే ఆధారం శ్రీదత్తగురువు. వారి అనుగ్రహముంటే చాలు. వారు దోమచే మేరుపర్వతాన్ని లేవనెత్తించగలరు.వారి శక్తి అమోఘం.20.శివస్వరూపులైన సాయి నారాయణుని మరల ప్రార్థించాను. నాపై దయ

చూపించి అవతరణికా రచనకు సత్వరంగా నా బుద్ధిని ప్రేరేపించమని. 21.నాకు కవిత్వం రచించే శక్తిలేదు.నేను మందబుద్ధినని గురువర్యులకు తెలుసు. వారి పాదాలకు వందనం చేసి అవతరణికను ప్రారంభిస్తాను. 22. శ్రీసాయి సచ్చరితలోని గ్రంథ భాగమైన ఈ అవతరణికను గణపతి రూపమైన సాయియే పూర్తి చేస్తారు. వారి వైభవం అద్భుతం అసమానం. నేను నిమిత్తమాత్రుణ్ణి మాత్రమే. 23.ప్రథమాధ్యాయంలో, మంగళాచరణం, మరియు విఘ్నాలను తొలగించేవాడు, పార్వతీ పరమేశ్వరులకు కంఠ భూషణమైన శ్రీగజవదనునికి నమస్కారం చేశారు. 24.అభినవ వాగ్విలాసిని, చాతుర్యకలా కామిని, విశ్వమోహిని ఇష్టార్థదాయిని అయిన శారదకు వందనం చేశారు. 25.కులగురువులకు, ఆప్తులకు, ఇష్టులకు, పరమేశ్వరుని సగుణావతారమైన సాధు సజ్జనులకు మరియు శరణాగతులకు కైవల్యనిధానమైన సద్గురు సాయి భగవానునికి నమస్కారం చేశారు. 26. గోధుమలను విసిరిన కథను చెప్పి కలరాజాడ్యాన్ని పూర్తిగా నశింప చేసిన విషయాన్ని విశదీకరించి సాయి సామర్థ్యాన్ని వర్ణించారు. 27.రెండవ అధ్యాయంలో ఈ గ్రంథ ప్రయోజనాన్ని, దాభోల్కరునికి బాబా యొక్క ప్రథమ దర్శనం మరియు అతనికి హేమాడ్ పంత్ అన్న నామకరణం. గురువు యొక్క ఆవశ్యకత లేదు అన్న వాదవివాద ఖండనం. 28. మూడవ అధ్యాయంలో ఈ గ్రంథరచనకు సాయి నోటి నుండి అనుమతి వచ్చిన విధానం,రోహిల్లా యొక్క సంపూర్ణ వృత్తాంతం. 29. నాలుగవ అధ్యాయంలో జగత్తును నడిపించే పరబ్రహ్మకు ఆభరణాలైన సత్పురుషులు ఏకారణంగా భూమిపై అవతరిస్తారు అన్న విషయం యొక్క విస్తార వివరణ, 30.అత్రి అనసూయల పుత్రుడైన దత్త భగవానుని అవతారం,సాక్షాత్తు ప్రత్యక్ష కల్పతరువు వంటి సాయిబాబా ప్రథమంగా శిరిడీ క్షేత్రానికి వచ్చిన కథా వర్ణన. 31.అయిదవ అధ్యాయంలో సాయి శిరిడీ క్షేత్రంలో గుప్తమై, శ్రీమంతుడైన చాందు పటేలు వెంట

మరల ప్రకటమై, అందఱిని ఆశ్చర్య పరచటం, 32. గంగఘరు వగైరా సాధువులతో కలిసి ఉండటం. దూరం నుండి స్వయంగా నీటిని తమ తలపై మోసుకుని వచ్చి ఉద్యానవనాన్ని పెంచటం గురించిన వర్ణన. 33. ఆరవ అధ్యాయంలో శ్రీరామనవమి మహోత్సవంలో సంకీర్తన చేసిన బాలబువా విషయం మరియు మసీదు మాయి పునరుద్ధరణ గురించిన విస్తారవర్ణన. 34. ఏడవ అధ్యాయంలో బాబా యొక్క సమాధి, ధౌతిపోతి ఖండయోగం వగైరా యోగప్రక్రియల గూర్చి మరియు బాబా హిందువా లేక మహమ్మదీయుని వేషమా అన్న అగాధమైన సత్పురుషుల అంతరంగం గురించి, 35. బాబా యొక్క దుస్తులు, వారి చిలుము, వారి ధుని, వారి జాతి, వారి ప్రవర్తన, వారు కోగులకు చికిత్స చేయటం, మసీదులో దీపాలను వెలిగించటం, వారి చేయికాలటం, దానికి సేవ మొదలగు ఆశ్చర్యకరమైన విషయాలు. 36. భాగోజిశిండే యొక్క మహావ్యాధి, ఖాపర్డె పుత్రుని గ్రంథి జ్వరానికి ఔషధాన్నివ్వటం. నానాసాహెబు చందోర్కరు పండరీ పురానికి బయలుదేరటం వగైరా విషయాలను బుద్ధిమంతుడైన కవి చెప్పారు. 37. ఎనిమిదవ అధ్యాయంలో అపూర్వమైన నరజన్మ మహిమ, సాయి యొక్క భిక్షావృత్తి వర్ణన, సాయి సత్పురుషునికి బాయజాబాయి చేసిన సేవ. బాబా యొక్క భోజన పద్ధతి. 38. బాబా, తాత్యా, మహాల్సాపతి ముగ్గురూ రాత్రి మసీదులో శయనించే విధానం, తాత్యా మహాల్సాపతులపై బాబాకు ఉన్న సమానమైన ప్రీతి. 39. రహాతా గ్రామంలో ఖుశాల్‌చందుకు, శాంతికి జ్ఞానానికి నిధియైన బాబాకు ఉభయులకు గల పరస్పర ప్రేమ సంబంధం గురించిన నిరూపణ. 40. తొమ్మిదవ అధ్యాయంలో తాత్యాసాహెబు నూల్కరు, భక్తశ్రేష్ఠుడైన తాత్యాపాటిల్ మరియు ఒక గొప్ప ఆంగ్లేయ గృహస్థుడు, బాబా ఆజ్ఞను ఉల్లంఘించి దాని పరిణామాన్ని అనుభవించటం. 41. బాబా భక్తులతో పంచమహా యజ్ఞాలను చేయించటం, భిక్షాన్నాన్ని సేవించటం, భిక్ష చేయటానికి అధికారం కలవారి

లక్షణాల వివరణ. 42. ప్రార్థనా సమాజంలోని బాబాసాహెబు తర్ఖడ్ సాయి భక్తుడవటం, అతని నిష్ఠ, ఉత్కృష్టమైన అతని కథా వర్ణన. 43. పదియవ అధ్యాయంలో నాలుగు మూరల పొడవు, బెత్తెడు వెడల్పుగల చెక్క పలకను చూరుకు అడ్డంగా వ్రేలాడగట్టి, దానిపై యోగీశ్వరులైన సాయి బాబా శయనించటం, 44. వారు శిరిడీలో ఎప్పుడు అడుగు పెట్టారు? అక్కడ ఎన్ని సం॥లు ఉన్నారు? తమ శరీరాన్ని ఎప్పుడు త్యజించారు? 45. అన్న విషయాలను హృదయాంగమంగా వర్ణించడం, ఏ కోరికలూ లేక మనసు ప్రశాంతంగా ఉన్నా పైకి పైశాచిక వృత్తిని కనబరుస్తూ ప్రజల శ్రేయస్సునే, ఆలోచించే గురుదేవుని సుస్థిరమైన మనోవృత్తి గురించి. 46. వేదశాస్త్రాలలో తెలియచేసిన ధర్మ లక్షణాలను, లోక వ్యవహారాన్ని, పరమార్థాన్ని, బోధించటంలో మరియు భక్తుల మనసులను భక్తులు కానివారి మనసులను పరీక్షించటంలో సాయి సద్గురువు యొక్క విశిష్ట చాతుర్యం. 47. మరియు బాబా యొక్క ఆసనం, బాబా జ్ఞానం, బాబా ధ్యానం, బాబా స్థానం, వారి మహిమ వారి సామర్థ్యం గురించిన వర్ణన. 48. పదునొకొండవ అధ్యాయంలో బాబా యొక్క సచ్చిదానందస్వరూప స్థితి. అంతటా వ్యాపించిన వారి ప్రఖ్యాతి, డాక్టరు పండిత్ యొక్క ప్రేమ, భక్తి, సిద్దిక్ ఫాల్కె యొక్క పూజ్య భావం. 49. బాబా మేఘాలను, సుడిగాలిని అదుపులో ఉంచటం, భక్తులను అగ్నిజ్వాలల నుండి సంరక్షించటం గురించి రస భరితవర్ణన. 50. పన్నెండవ అధ్యాయంలో కాకా మహాజని, ధుమాల్, నిమోంకరు ఒక మామ్‌లేదారు, ఒక డాక్టరు గురించిన వేరువేరు విషయాల మధురవర్ణన. 51. నాసిక్‌లోని అగ్నిహోత్రి, ఘోలప్ స్వామి యొక్క శిష్యుడైన ముళె శాస్త్రి యొక్క సంశయం. అతనికి సాయి దర్శనంలో కలిగిన విశేషమైన అనుభవం యొక్క వర్ణన. 52. పదమూడవ అధ్యాయంలో నల్లకుక్కకు పెరుగన్నం పెట్టటంతో బాలా శింపి యొక్క చలిజ్వరం పోవటం, బాపూ సాహేబు బుట్టి యొక్క కలరా వ్యాధి అక్రోట్ పిస్తాల సేవనంతో

నశించటం. 53. ఆళంది స్వామి యొక్క చెవి నొప్పిని బాబా ఆశీస్సులతో పోగొట్టటం, కాకా మహాజని విరేచనాల బాధ వేరుశనగ పప్పులతో తొలగటం. 54. హోర్ట్సా లోని దత్తో పంతు కడుపు శూలవ్యాధితో బాధపడుతుంటే జనులందఱూ చూస్తుండగా బాబా అతని జబ్బును ఆశీర్వచనాలతో నయం చేయటం. 55. భీమాజి పటేలును క్షయరోగం పట్టుకుంటే బాబా దానిని విభూతితో తరిమి వేయటం, ఈ విషయాల వర్ణన. 56. పదునాల్గవ అధ్యాయంలో నాందేడులో బాగా ప్రసిద్ధి చెందిన వ్యాపారి, రతన్‌జీ పార్సీసేటు, దుఃఖిస్తుంటే బాబా అతనికి పుత్ర సంతానాన్ని ప్రసాదించి, అంతులేని ఆనందాన్ని ఇవ్వటం, 57. మరియు నాందేడు పట్టణంలో హమాలీపని చేస్తూ గుట్టుగా జీవిస్తున్న మౌల్వీసాహేబు అనువారు సాధువులని సాయిబాబా సూచన వలన తెలుసుకునే అద్భుతమైన కథా వర్ణన. 58. పదునైదవ అధ్యాయంలో సాయిబాబా దాసగణుకు నారదీయ కీర్తన పద్ధతిని వివరించటం; చోళ్కరుకు చక్కిరవేసిన టీని త్రాగించి, అతని వ్రతాన్ని సమాప్తి చేయటం. 59. బల్లి కిచకిచమని చప్పుడు చేయగా బాబా కథను చెప్పటం, ఔరంగాబాదు నుండి బల్లి వచ్చి మసీదులోని బల్లిని కలుసుకున్న కథా వర్ణన. 60. పదునారవ అధ్యాయంలో సంపద సంతానం అన్నీ ఉన్న ఒక గృహస్థుడు సాయిబాబా యొక్క యశోదుంధుభిని విని, బ్రహ్మజ్ఞాన ప్రాప్తి కొఱకు శిరిడీకి వచ్చాడు. 61. బ్రహ్మజ్ఞానాన్ని అభిలషించేవారికి ముందు ప్రపంచంపై మోహం, ధనాసక్తి లోభం తొలగిపోవాలి. 62. జేబులో రూపాయలనోట్లు ఉన్నా బాబా కొఱకు అదీ కాసేపటి కోసం, అయిదురూపాయలను అప్పుగా ఇవ్వని వాడికి, బ్రహ్మ ఏవిధంగా లభిస్తాడు. 63. సుందరమైన సాయిబాబా బోధనా పద్ధతి, హేమాడు పంతు ప్రాసాదిక వాణి రెండూ పాలూ పంచదార కలిసినట్లుగా మనోహరమైన కథా వివరణ. 64. పదునేడవ అధ్యాయంలో, పూర్వ కథాను సంధానం – బ్రహ్మజ్ఞానాన్ని గురించి విస్తారంగా చెప్పటం. ధనలోభం

యొక్క నిర్మూలనం గురించిన మధుర వర్ణన. 65.పదునెనిమిదవ అధ్యాయంలో,సాఠె యొక్క గురుచరిత్ర కథ, రాధాబాయికి ఉపదేశం గురించి చెప్పిన విషయం, హేమాడు పంతును అనుగ్రహించిన కథా వర్ణన. 66.పంతొమ్మిదవ అధ్యాయంలో, హేమాడుపంతు యొక్క అనుగ్రహ కథా విస్తరణ, సాయి యొక్క జ్ఞానబోధను దీర్ఘంగా ఆలోచించటం గురించిన వివరణ. 67.ఇరువదవ అధ్యాయంలో ఈశావాస్య భావార్థ బోధిని అన్న గ్రంథ రచనాన్ని దాసగణు ప్రారంభించాడు.దానిలో అతనికి సంశయాలు కలగగా, అతడు బాబాను ప్రశ్నించాడు. 68. వారు కాకా యొక్క పనిపిల్ల సందేహాన్ని తీరుస్తుందని చెప్పారు.అలా అసాధారణమైన సద్గురు మహిమ యొక్క మధుర వర్ణన. 69. ఇరువది ఒకటవ అధ్యాయంలో సుగుణవంతుడైన ఒక ఉపజిల్లా అధికారిని,విచక్షణాజ్ఞానమున్న పాటంకరుని,విలక్షణమైన మరొక వకీలును ఈ ముగ్గురిని సాయిబాబా అనుగ్రహించిన వివరణ.70.ఇరువది రెండవ అధ్యాయంలో మసీదుమాత భవాన్ని తరింపచేస్తుందని, ద్వారావతి అన్నా, ద్వారక అన్నా ఆ మసీదే అని బాబా ప్రజలందఱకూ చెప్పారు. కాని వారి భావార్థాన్ని ఎవరూ తెలుసు కోలేదు.71.బాబా మసీదుమాత యొక్క గుణాలను వర్ణించారు.మిరికరును, బుట్టిని పాము కాటు నుండి రక్షించారు, అమీరు శక్కరు యొక్క వాతరోగాన్ని పోగొట్టారు.అతని పాము భయాన్ని తొలగించారు. 72. అట్లే హేమాడుపంతును మరియు ఇతరులను పాముకాటునుండి కాపాడివారిని తేలు కుట్టటం నుండి, భయంకరమైన అపమృత్యువు నుండి రక్షించిన వృత్తాంతాలు.73.ఇరువది మూడవ అధ్యాయంలో, బాబా యోగాభ్యాసి యొక్క సందేహాన్ని తీర్చటం, మరియు, మాధవరావు యొక్క పాముకాటు బాధను తొలగించటం, ధుని కొఱకు ఇంధనాన్ని సేకరించటం, మేకను వధించే విషయాన్ని గూర్చిన రమ్యమైన వర్ణన.74.బడేబాబా యొక్క బడాయి, అతని అసంతృప్తి స్వభావం,ఎంత

ఇచ్చివా ఇంకా కావాలనే అతని ఆశ. అతనికి గురువు ఆజ్ఞను పాటించే నిష్ఠ లేకపోవటం, 75. గురువు ఆజ్ఞను పాటించడంలో పరమ నిష్ఠగల భక్తశ్రేష్ఠుడు కాకా సాహేబు దీక్షితును పరీక్షించిన సద్గురువు యొక్కవిశిష్టమైన లీలను ఉత్కృష్టంగా వివరించారు. 76. ఇరువది నాలుగవ అధ్యాయంలో, శనగల మిషతో, హేమాడుపంతుకు సద్గురుని స్మరించనిదే విషయ సుఖాలను అనుభవించరాదు అని బోధించారు. 77. అణ్ణా బాబరే మరియు మౌసిబాయి ఈ ఇద్దరిలో సాయి కలహాన్ని రేపటం, ఆ పరిహాసంలోని వినోదాన్ని కవివర్యులు విశిష్టరీతిలో గానం చేశారు. 78. ఇరువది ఐదవ అధ్యాయంలో అహమ్మదు నగరు నివాసి దాము అణ్ణా కాసార్ దూది మరియు బియ్యంతో గొప్ప వ్యాపారం చేయాలని ఉబలాట పడతాడు. 79. ఆ వ్యాపారం నష్ట కారకమని బాబా తెలియ చేయటం మఱియు మామిడి పళ్ళను సేవిస్తే సంతాన ప్రాప్తి అని జ్ఞాన భాస్కరులైన సాయిబాబా అతనికి చెప్పారు. 80. ఇరువది ఆరవ అధ్యాయంలో ఒక సాధువు అనుగ్రహాన్ని పొందిన వంతు అన్న ఒక భక్తునికి బాబా ఆ విషయాన్ని గుర్తుచేసి, అతనికి ఆనందాన్ని కలగ చేయటం, 81. హరిశ్చంద్ర పితళే పుత్రుడు అపస్మార జబ్బు బాబా కృపావలోకనంతో తొలగి పోవటం, 82. మరియు పితళేకు బాబా మూడు రూపాయలను ఇచ్చి నీకు ఇదివరలో రెండు ఇచ్చాను, వీనిని పూజించు అని చెప్పిన కథ. 83. ఇరువది ఏడవ అధ్యాయంలో కాకా మహాజని బాబా చేతికి ఏకనాథ భాగవత గ్రంథాన్ని ఇచ్చి వారి ప్రసాదంగా మరల దానిని తీసుకోవాలని మనసుపడగా బాబా దానిని మాధవరావుకు ఇవ్వటం, 84. ఒక రామదాసు పుస్తకాలలో విష్ణు సహస్ర నామం పుస్తకం ఉండగా, బాబా దానిని రామదాసుకు తెలియకుండా తీసి దానిని కూడా మాధవరావుకు ఇస్తారు. 85. మాధవరావుకు విష్ణుసహస్రనామం పుస్తకం ఇచ్చి సాయి దయాఘనులు అతనిని అనుగ్రహించిన కథా వర్ణన. 86. ఇరువది ఎనిమిదవ అధ్యాయంలో శాంతాక్రూజ్‌లోని

భక్తుడు లక్ష్మీచందు మున్షి, బర్హానుపురంలోని చిడీబాయి, బ్రాహ్మణుడు పుణ్యాత్ముడు అయిన మేఘా సాయి బాబా చరణాలను ఆశ్రయించటం. 87.వారందఱికీ స్వప్నదృష్టాంతాలను ఇచ్చి,వారు మేలుకొన్న తరువాతవారికి అనుభవాలను కలగ చేసిన సద్గురుమాత యొక్క అంతు పట్టని విధానాన్ని తెలియ చేశారు. 88. ఇరువది తొమ్మిదవ అధ్యాయంలో, భోలా శంకరులైన సాయిబాబా యొక్క దానాన్ని,ఔదార్యాన్ని,వైభవాన్ని చూడాలన్న కుతూహలంతో మద్రాసు భజన మండలి శిరిడీ క్షేత్రానికి రావటం, 89.రఘునాథరావు టెండూల్కరు యొక్కపుత్రుడు పరీక్ష ఉత్తీర్ణుడైన విధానం మరియు టెండూల్కరు యొక్క పెన్షను చింతను దూరం చేసిన సాయి యొక్క లీలలు.90. మరియు సాయి చరణాలయందు అమితమైన ప్రేమ గల డాక్టరు క్యాప్టెను హాటేకు, తెల్లవారు ఝామున సాయి స్వప్నంలో దర్శనమిచ్చిన కథా వర్ణన.91. ముప్పదియవ అధ్యాయంలో సప్తశృంగీ దేవీ ఉపాసకుడు కాకాజి వైద్యకు, సత్పురుష శ్రేష్ఠులైన సాయిబాబాను చూడమని దేవి ఒక దృష్టాంతాన్ని ఇవ్వటం.92. ఆ దేవికి మ్రొక్కును తీర్చుకోవటానికి ముప్పైఏళ్ల తరువాత శామారావు అక్కడికి వెళ్లటం, 93. రహతాసేటు, ఖుశాల్‌చందు పంజాబీ బ్రాహ్మణుడు రాంలాల్ వీరిద్దరికీ శిరిడీకి బయలుదేరమని సాయి స్వప్నంలో చెప్పిన వివరణ. 94.ముప్పది ఒకటవ అధ్యాయంలో, మానస సరోవరానికి బయలు దేరిన, మద్రాసు వాసి విజయానందు అనే సన్యాసిని హృషీకేశులైన సాయిబాబా తమ పాదాల చెంతనే ఉంచేశారు.95. మరియు సాయిపాదకమలాలను అంటి పెట్టు కున్న భ్రమరం మాన్‌కరు అను భక్తుని మరియు హింసాత్మకమైన క్రూరవ్యాఘ్రాన్ని కూడా ఉద్దరించిన అందమైన కథలు.96.ముప్పది రెండవ అధ్యాయంలో 'భగవంతుని అన్వేషించాలని మేం నలుగురం అరణ్యంలో తిరుగుతున్నాం. నేను,నా అహంభావాన్ని అభిమానాన్ని వదిలి పెట్టగానే, గురువుగారు నాకు దర్శనమిచ్చారు' అని బాబా చెప్పిన

కథ,97.గోఖలెబాయి ఉపవాస వ్రతాన్ని పూనుకున్న కథ మరియు మరోకథను సాయిబాబా స్వయంగా తమనోటితో చెప్పిన విశేషాన్ని హేమాడు గానం చేశారు.98.ముప్పది మూడవ అధ్యాయంలో,నారాయణ జాని మిత్రునికి అకస్మాత్తుగా తేలుకుట్టటం,ఒక భక్తుని కుమార్తె జ్వరంతో బాధపడటం,99. నానా చందోర్కరు కుమార్తె ప్రసవ వేదనతో ఆందోళన పడటం,అప్పుడు ఎవరికీ ఏ ఉపాయమూ తోచక బాధపడటం,100.భక్తుడు కులకర్ణి, భజనచేసే బాలబువా వీరందరికీ విభూతి ప్రభావం తెలవటం.101.అమిత శ్రద్ధగల అత్యంత భావికుడైన హరిభావు కర్ణిక్ ఇచ్చిన దక్షిణను గురించిన బోధప్రదమైన కథ.102.ముప్పదినాలుగవ అధ్యాయంలో మాలెగాంలోని ఒక డాక్టరు యొక్క సోదరుని కుమారుడు ఎముకలలో వ్రణంతోను, భక్తశ్రేష్ముడైన డాక్టరు పిల్లే నారుకురుపుతోను బాధ పడటం,103. శిరిడీ వాసి బాపాజి భార్య గ్రంథి జ్వరంతోను,ఒక ఇరాని చిన్న పిల్లవాడు ఘోరమైన మూర్ఛ జబ్బుతో బాధపడటం,104. హోర్న్యా గృహస్థుడు మూత్ర పిండాలలోని రాళ్లవలన, ముంబైలోని ఒక కాయస్థ ప్రభు యొక్క భార్య ప్రసూతి రోగంతో బాధపడటం,105. వీరందరి వ్యాధులను కేవలం విభూతి స్పర్శతో వెంటనే నివారించిన రసవత్తర వర్ణన.106.ముప్పది అయిదవ అధ్యాయంలో మహాజని మిత్రుడు, నిర్గుణోపాసకుడు బాబా దర్శన మాత్రంతో విగ్రహారాధకుడవటం,107.ముంబైలోని ఒక సాలిసిటరు ధరంసిజేఠాబాయి ఠక్కరుకు, సాయి గురువర్యులు గింజలున్న ద్రాక్షపళ్ళను వెంటనే గింజలు లేని వానివిగా చేసి ఇవ్వటం,108 బాంద్రా లోని ఒక కాయస్థ వ్యక్తికి సుఖంగా నిద్రపట్టక పోతే ఇతనికి మరియు నెవాసులోని బాలా పాటీలుకు విభూతి యొక్క అనుభవాలను కలగ చేయటం.109.ముప్పది ఆరవ అధ్యాయంలో గోవా నివాసులైన గృహస్థులు, ఒకరు ఉద్యోగం కొఱకు మరొకరు అపహరింపబడిన ధనం లభించాలని వేరు వేరుగా మ్రొక్కుకుంటారు.110. ఆ ఇద్దఱూ

మొక్కలను మరిచిపోతే త్రికాలజ్ఞులు, బ్రహ్మాండమంతా వ్యాపించి ఉన్న సాయి సమర్థులు వారికి మొక్కులను గుర్తు చేస్తారు. అటువంటి వారి కీర్తిని ఎవరు వర్ణించగలరు?. 111. ఔరంగాబాదు నివాసి సఖారాం పత్ని పుత్రసంతానం కోసం సాయిపాదాల వద్దకు పరుగెత్తగా ఆమెకు శ్రీఫలాన్ని ఇచ్చి ఆమె కోరికను తీర్చిన కథా వర్ణన. 112. ముప్పదిఏడవ అధ్యాయంలో, ఎక్కడ చూడాలన్నా లభించని విశిష్టమైన చావడి ఉత్సవ వైభవాన్ని హేమాడుపంతు కళ్లతో చూచి రసవత్తరంగా వర్ణించారు. 113. ముప్పది ఎనిమిదవ అధ్యాయంలో, సాయిబాబా వంట పాత్రలో రకరకాల పదార్థాలతో అనేక పక్వాన్నాలను వండి అందఱికీ ప్రసాద భోజనాన్ని పెట్టే మనోహర దృశ్యవర్ణన. 114. ముప్పది తొమ్మిదవ అధ్యాయంలో తద్విద్ధి ప్రణిపాతేన అన్న గీతా శ్లోకానికి అర్థం బాబా నానా చందోర్కరుకు వివరంగా చెప్పి అతని సంస్కృత భాషాభిమానాన్ని తొలగించటం, 115. సత్పురుష సామ్రాట్టు అయిన సాయి, బాపూసాహేబు బుట్టీకి మందిర నిర్మాణానికి అజ్ఞాపించి దృష్టాంతాన్ని ఇచ్చిన వృత్తాంతం. 116. నలుబదియవ అధ్యాయంలో, దేవు తన తల్లి చేసిన వ్రతాల ఉద్యాపనకు బ్రాహ్మణులకు సంతర్పణ ఏర్పాటు చేసి, ఉత్తరం ద్వారా బాబాను ఆహ్వానించటం, 117. సన్యాసి రూపంలో మరో ఇద్దఱితో వెళ్లి బ్రాహ్మణులతో పాటు భోజనం చేసిన గురువర్యుల లీల. 118. హేమాడుపంతుకు భోజనానికి వస్తానని దృష్టాంతాన్ని ఇచ్చి ఫోటోరూపంలో భోజనానికి వెళ్లిన విషయం యొక్క చక్కటి వర్ణన. 119. నలుబది ఒకటవ అధ్యాయంలో, బాబా పటం తన ఇంటికి వచ్చిన విషయంలో అంతుపట్టని సద్గురువు యొక్క మహిమను కవి, భక్తులకు విస్తారంగా, రమణీయంగా తెలియచేశారు. 120. బాబా రుద్రావతారం లా దేవుపై ఎట్టని అగ్నివలె మండి పడుతూ కోపంతో తిట్లను కురిపించారు. 121. దేవుతో శ్రీసాయి నారాయణులు జ్ఞానేశ్వరిని నిత్యం నియమంగా

పఠించు అని చెప్పటమే కాక, పఠించే విధానాన్ని స్వప్నంలో తెలియ చేసిన విషయాన్ని హేమాడు వివరించారు. 122.నలుబది రెండవ అధ్యాయంలో భక్తుడు దాత్యా,బాబాకు తిపుండ్రలేపనం చేయటం,సాయిబాబా తమ శరీరాన్ని త్యజించటాన్ని గూర్చిన సూచన, రామచంద్ర మరియు తాత్యాపాటిలు మరణాలను తప్పించటం,123.సాయి సద్గురుని నిర్వాణవార్త శ్రోతలను కలవర పెట్టటం, హేమాడు పంతుకు ఆందోళన కలిగించిన పవిత్ర కథ.124. నలుబది మూడు,నాలుగు అధ్యాయాలలో సాయిబాబా శరీరాన్ని త్యజించారన్న విషయం గతాధ్యాయంలో అసంపూర్తిగా మిగిలి పోగా, దానినే హేమాడుపంతు ఇక్కడ సంపూర్తి చేశారు.125.నలుబది అయిదవ అధ్యాయంలో,ఒకసారి కాకాసాహేబు దీక్షితు, కాకామహాజని మరియు మాధవరావుతోపాటు ఏకనాథభాగవతాన్ని పఠిస్తుండగా దీక్షితుకు సందేహం కలిగింది.126. మాధవరావు ఆ సంశయాన్ని తీర్చగా, అది అతనికి నచ్చక పోవటం, ఆనందరావు పాఖాడె తన స్వప్నాన్ని తెలియ చేసి దీక్షితు అనుమానాన్ని తొలగించటం,127. చూరుకు వ్రేలాడ కట్టిన చెక్కపలకపై మహల్సాపతి ఎందుకు శయనించలేదు అన్న సంశయాన్ని సాయి సమర్థులు తీర్చిన కథా విశేషం. 128. నలుబది ఆరవ అధ్యాయంలో సాయిబాబా యొక్క సర్వ వ్యాపకత్వం గురించి, వారు తమ స్థలంలోనే ఉన్నా,అంతటా వర్యటించే వారి వలె జనులకు చమత్కారాన్ని చూపటం. వారు విచిత్రంగా కాశి గయలకు వెళ్లినట్లు నిదర్శనాన్ని చూపిన అద్భుత చరిత్ర,129. సాయి చెప్పగా శ్యామా వారిని గయలో పటం రూపంలో చూచాడు.130. రెండు మేకల పూర్వజన్మ వృత్తాంతాన్ని సాయి శంకరులు తమనోటితో రమ్యంగా చెప్పిన పవిత్ర కథా వర్ణన.131.నలుబది ఏడవ అధ్యాయంలో ఒక పాము మఱియు కప్పల యొక్క పూర్వజన్మల గురించి మఱియు ఒక లోభి యొక్క పూర్వజన్మ వృత్తాంతాన్ని, బ్రహ్మవిష్ణు

మహేశ్వరుల రూపమైన సాయి బాబా వర్ణించారు.132.శత్రుత్వం హత్యమరియు ఋణం వీనిని తీర్చుకోవటానికి పునర్జన్మ కలుగుతుందని సాయిబాబా సెలవిచ్చిన హృదయంగమమైన కథామృత పానం. 133.నలుబది ఎనిమిదవ అధ్యాయంతో శేవడె అను ఒక భక్త శ్రేష్ఠుని వకీలు పరీక్ష గురించి మఱియు భక్తి భావంలేని సుపట్‌ణేకరును సాయిబాబా అనుగ్రహించిన కథ. 134.నలుబది తొమ్మిదవ అధ్యాయంలో, ముంబై నివాసి హరికనో బా మరియు సోమదేవస్వామి, బాబాను పరీక్షించాలని శిరిడీవచ్చారు.135. వారు బాబా దర్శనం చేసుకున్నప్పుడు బాబా వారి మనసులోని విషయాన్ని తెలియచేయగా, వారు లజ్జితులై సాయి చరణాలకు శరణు జొచ్చి, జన్మజన్మల పాపాలను పోగొట్టుకున్నారు. 136.ఒకసారి బాబా వద్ద కూర్చుని ఉన్న నానా ఒక స్త్రీని చూచి మనోవికారానికి లోనైన వృత్తాంతం యొక్క వర్ణన. 137.యాబదియవ అధ్యాయంలో 'తద్విద్ధి ప్రణిపాతేన' గీతా శ్లోకానికి హేమాడుపంతు అర్థాన్ని విస్తారంగా వివరించారు.138.యాబది ఒకటవ అధ్యాయంలో హరిసీతారాం దీక్షితు, ధురంధర సోదరులు, బాలారాం, నాందేడువకీలు, పుండలీకరావు వీరు మొదట శిరిడీకి ఏ విధంగా వచ్చారు? 139. ఆ ఒక్కొక్కరి అద్భుత కథలను శ్రవణం చేసిన శ్రోతలు విస్మితులౌతారు వారి మనసులలో ప్రేమ సముద్రం ఉప్పొంగే వృత్తాంతం. 140.యాబది రెండవ అధ్యాయంలో, దుష్టుల దుర్మార్గాన్ని నశింపచేసి సజ్జనులను సంరక్షణ చేయవలెనని సాయిబాబాను హేమాడుపంతు ప్రార్థించటం, 141. మఱియు ఈ గ్రంథం యొక్క సింహావలోకనం సమాప్తి చేసి, సద్గురు చరణాలలో మనసును లీనం చేసి, శిరసును కలాన్ని వారికి అర్పించి కృతార్థుడవటం.142.ఈ విధంగా గోవిందరావు శ్రీసాయి సచ్చరితంలోని అధ్యాయాలను పూర్తి చేశారు. భక్తిగా వారి పాదాలకు వందనం చేసి విశ్వానికి మాత అయిన సద్గురువుకు ప్రణామం చేస్తాను.143. అధ్యాయాల సారాంశాన్ని తెలియ పరచేదాన్ని అవతరణిక అని

అంటారు.కైవల్య పురానికి చేరుకోవాలని కోరుకునే ముముక్షువులకు ఇది సన్మార్గదర్శిక.144. సుందరమైన గొప్ప శాలువకు అతికించిన పాత అంచులా ఉందని దీనిని అగౌరవ పరచినా ఈ దాసుని మనవిని చతురులైన శ్రోతలు ఒకసారి వినండి. 145.ఈగ్రంథం శాలువా కాదు సుందరమైన ఒక శిశువు. ఈ బిడ్డకు దృష్టి దోషం తగలకుండా ఈ బాబా బాలుడు,ఈ అవతరణికను నల్లటి దిష్టి చుక్కవలె పొందు పరచాడు. 146.షడ్రసాలతో తయారైన గ్రంథమనే ఆహారంలో అధ్యాయాలు రకరకాల పదార్థాలు. .ఇవి చక్కగా జీర్ణం కావటానికి మజ్జిగ వంటిది అవతరణిక. 147. ఎప్పుడూ కోరికలను తీర్చే కామధేనువువలె ఈ గ్రంథం పవిత్రమైన అధ్యాయాలనే అవయవాలతోఉన్నది. దీనికి దృష్టి దోషం తగలకుండా మెడలోవేసే దృష్టి పూసల మాల వంటిది ఈ అవతరణిక.148.ఇప్పుడు హేమాడుపంతు అనుసరించిన అధ్యాయాలలోని పద్ధతిని నా బుద్ధికి తోచిన విధంగా చెప్తాను. శ్రోతలు సాదరంగా వినండి.149. మొదట సద్గురు స్తవనం, తరువాత వేదాంత వర్ణన,సాయి యొక్క బ్రహ్మస్వరూప వర్ణన,తరువాత భక్తుల అనుభవాలను చెప్పారు.150. హేమాడుపంతు వాఙ్మయంలోను శాస్త్ర జ్ఞానంలోను బాగా ప్రావీణ్యం ఉన్నవారు.పైగా సద్గురుసాయి ప్రసన్నులై ఈ గ్రంథమనే పక్వానాన్ని తయారు చేయటానికి అతనిని ప్రతిభా సంపన్నులను చేశారు.151.ఈ గ్రంథంలోని జ్ఞాన మాధుర్యాన్ని అనుభవించిన వారికి జనన మరణాలు ఉండవు. అంతే కాదు,పరమపదమైన అక్షయమోక్ష సంపద లభిస్తుంది.152.హేమాడుపంతు యొక్క రసవత్తరమైన వాణికి సాయి అనుగ్రహ లాభం జోడై పాలు చెరుకురసం కలిసిన మధుర రసం వలె తయారైన ఈ గ్రంథం యొక్క శోభను ఎంతని వర్ణించగలం?153.గ్రంథరచయితలు అనేక మంది ఉంటారు.కాని విశ్వానికి ఆధారమైన శ్రీవిష్ణువు యొక్క అవతారమైన సద్గురువు లభించకపోతే ప్రాసాదికవాణి ప్రాప్తించదు.154. శాస్త్రాలు

బాగా అధ్యయనం చేసినా సద్గురు కృపలేకుండా ఇటువంటి గ్రంథరచన సాధ్యం కాదు. ఇది ముమ్మాటికీ నిజం.155. అను పమానమైన శ్రీసాయిసచ్చరిత యోగ్యతను ఎవరు వర్ణించ గలరు? ముముక్షువుల పరమ భాగ్యం కారణంగా హేమాడుపంతు వంటి రచయిత లభించారు.156. ఈ గ్రంథం భూమిపై ఉన్నంతవరకు హేమాడుపంతు కీర్తి భూమండలంపై ఉంటుంది. అతడు ముముక్షువుల కొఅకు గొప్ప విందును తయారు చేశాడు.157. సాయి సద్గురువు అనుగ్రహంతో ఉత్పన్నమైన ఈ గ్రంథం ధన్యం. ఇది ముముక్షువులైన జీవులకు శిరోధార్యమై వారి దైన్యమైన ఆలోచనలను తొలగిస్తుంది. 158. జన్మజన్మల పుణ్య సంగ్రహం వలన గోవిందరావుకు సాయిబాబా యొక్క మధురమైన సేవాఫలం ఈ గ్రంథరూపంలో లభించింది.159. ఈ హేమాడుపంతు నిష్ఠా పరుడైన గొప్ప భక్తులు. కవి వేదాంత మందు ఆసక్తికలవారు. అహర్నిశలూ సద్గురు సాయి చరణాలయందు అనురక్తులై ఉండేవారు.160. అత్యంత కఠినమైన వేదాంత విషయాలకు విరక్తి భక్తి జ్ఞానం జోడించి ఇటువంటి గ్రంథాన్ని గురువు కృపలేకుండా రచించటం కష్టం. 161. ఇందులోనివి అధ్యాయాలు కావు. బంగారుతో తయారు చేసిన పేటికలు. వీనిలో హేమాడుపంతు, మహా ప్రయత్నంతో అర్థభరితమైన జ్ఞానవంతమైన కథలనే అమూల్య రత్నాలను ఇమిడ్చారు. 162. అనేక రకాల సువాసనలను వెదజల్లే ఈ అధ్యాయాల సుమమాలను ముద్దుబిడ్డడైన గోవిందరావు, నిర్మలమైన భక్తి భావంతో శ్రీసాయి సద్గురు కంఠానికి అర్పించారు.163. ఈ అధ్యాయాలనే శుద్ధమైన సువర్ణకలశాలలో శ్రీసాయిసచ్చరితనే గంగోదకాన్ని నింపి ఉంచారు. రఘునాథ పుత్రుడు ముముక్షువుల దర్పాన్ని పార ద్రోలటానికి .164. ఈ గ్రంథమనే రణరంగరూపగగనంలో సూక్ష్మమైన బుద్ధి అనే ఖడ్గంతో, దంభం , దర్పం, అభిమానమనే అసురులను సంహరించి అధ్యాయాలనే కీర్తిస్తంభాలను నిలబెట్టారు.165. ఈ గ్రంథం రత్నాలతో

అమర్చబడిన పంచారతి. ఇందులోని అధ్యాయాలలో ఉన్న కథలు తెలిపే అర్థాలు,నూనెలోని వత్తుల యొక్క జ్యోతులు. శాంతి మరియు విరక్తి, సత్పురుషులలో మహారాజు అయిన సాయికి హారతిని ఇవ్వటానికి వస్తాయి.166. ఈ గ్రంథ రూపంలో ఉన్న విశ్వ మోహిని అధ్యాయాలనే తన బాహువులకు కథల అర్థాలు అనే కేయూరాలను అలంకరించుకుని, సాయి బ్రహ్మను ఆలింగనం చేసుకోవటానికి వానిని పైకి లేపి ఉంచింది.167. సాయిసచ్చరిత గ్రంథసామ్రాట్టు. అందులోని అందమైన అధ్యాయాలు చతురులైన పండితులు, శ్రద్ధను జ్ఞానాన్ని వేదాంతాన్ని మరియు ఘన వైభవాన్ని వర్ణిస్తాయి.168. సాయి సచ్చరిత పరమార్థాన్ని విక్రయించే సంత. దీనిలోని ఒక్కొక్క అధ్యాయం ఒక్కొక్క అంగడి. వీనిలో రచయిత భక్తుల అనుభవాల కథలు అనే సరుకులను ఉంచారు.169. ఈ గ్రంథం పెద్దదైన గంగానది. దీనిలోని అధ్యాయాలు చక్కగా సిద్ధపరచిన తీరఘట్టాలు. గురుకృపాసామర్థ్యం వలన ఇక్కడ ఎడతెగని కథా రసామృతప్రవాహం ఉంది.170. ఇది గ్రంథంకాదు,కల్పవృక్షం. ప్రాపంచికులకు ఇది రుచించదు. కాని భావికులకు, ముముక్షువులకు ఇది సాక్షాత్తు మోక్షద్వారం. మీరు మీమీ అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకొండి. 171. నిజమైన స్మారకమని దీనినే అనాలి. ఇది ప్రపంచంలోని అజ్ఞానాన్ని మరియు దుఃఖాన్ని హరించేది, మోహమాయలనే నరకంనుండి తప్పించేది. అక్షయమైన శాంతిని ప్రసాదించేది.172. గ్రంథ రచయిత గోవిందరావు భ్రమరమై నిత్యం సాయి సద్గురు చరణ కమలాలలో క్రొత్తక్రొత్త మకరందాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు. 173. వీరి ఇంటి పేరు దాభోల్కరు. వీరు ఆంగ్ల ప్రభుత్వంలో మంచి అధికారపదవిలోఉండేవారు. విద్య వినయం కలిగి ఆచారాలను బాగా ఎఱిగినవారు. 174. వీరి గృహిణి రఖుమాబాయి. సౌశీల్యవతి, భక్తురాలు ,పతివ్రత. సద్గుణాలకు గని, వినమ్రతతో మాట్లాడే స్త్రీ. సాయి చరణాలలో దృఢమైన విశ్వాసం గలది.175. ఈ కవియొక్క పూర్వీకులు

మొదట వెంగుర్ల సమీపంలోని దాపోలి అన్న చోట నివసించేవారు. తరువాత కేల్వే గ్రామానికి వచ్చారు. 176. (శకసం.1781) క్రీ.శ.1859వ సం॥లో మార్గశిరమాసంలో శుక్ల పంచమి రోజున రఘునాథుని భార్య లక్ష్మి గర్భాన పుణ్యరాశియైన గోవిందరావు జన్మించారు.177. గౌడ సారస్వత బ్రాహ్మణవర్గంలో భరద్వాజగోత్రంతో జన్మించి క్రీ.శ.1929 వ సం॥ 70 ఏళ్లవయసులో, ఆషాడ శుక్లనవమినాడు దివంగతులయ్యారు. 178. శక.సం.1844(క్రీ.శ.1922)చైత్రవమాసంలో ఈ గ్రంథాన్ని ఆరంభించారు.శక.సం॥ 1851 జ్యేష్ఠమాసంలో(క్రీ.శ.1929 వ సం.లో) యాబది రెండవ అధ్యాయాన్ని పూర్తి చేశారు.179. వీరికి ఒక కొడుకు అయిదుగురు కుమార్తెలు. నలుగురు వివాహితులు. పుత్రునికి కూడా వివాహమై వైద్యశాస్త్రం చదువుతున్నాడు. అవివాహిత అయిన పుత్రిక కూడా డాక్టరుకావాలని చదువుతున్నది.180. ఇప్పుడు గురు చరిత్రలో మరియు ఇతర గ్రంథాలలో సూచించిన పారాయణపద్ధతిని మరియు సప్తాహ పద్ధతిని సుగమమైన రీతిలో చెప్తాను. శ్రోతలు దయ ఉంచి శ్రద్ధగా వినండి.181.ముందుగా అంతఃకరణాన్ని పరిశుద్ధం చేసుకుని భక్తి భావంతో పారాయణ చేయాలి. ఒకటిలేక రెండు, లేదా మూడు రోజులలో పారాయణ పూర్తి చేస్తే సాయినారాయణులు సంతుష్టులౌతారు. 182. లేదా చక్కగా సప్తాహాన్ని చేయండి. మీకు పుణ్య సంపత్తి పోగవుతుంది.సాయిబాబా మీ మనసులోని కోరికను తీర్చుతారు.ప్రాపంచిక భయాలు తొలగిపోతాయి.183.గురువారం రోజు ఉదయాన నిత్యకృత్యాలను త్వరగా ముగించుకుని స్నానం చేసి ఆసనంపై కూర్చుని పారాయణను ప్రారంభించండి.184.అరటి ఆకులతోను మరియు వస్త్రాలతో అలంకరించిన ఒక పెద్ద మండపాన్ని తయారు చేసుకోండి.185.అందులో ఎత్తుగా ఒక పీటగాని బల్లగాని వేసి చుట్టూ కళ్లకు ఆకర్షణీయంగా రంగు రంగుల ముగ్గులు వేయండి.186. సాయి సద్గురుని ప్రతిమను కాని లేక

అందమైన వారి చిత్రపటాన్నిగాని ఎత్తైన ఆసనంపై ఉంచి, భక్తిభావంతో వందనం చేయండి.187. గ్రంథాన్ని పట్టువస్త్రంలో చుట్టి సద్గురు సన్నిధిలో ఉంచి గ్రంథానికి మరియు సద్గురువుకు పంచోపచార పూజ చేసి పారాయణను ప్రారంభించండి.188.పాలులేక ఫలహారాలను గాని, లేదా వేపిన ధాన్యాన్ని ఒక్కపూటే తిని ఎనిమిది రోజులు ఉపవాస వ్రతం చేయండి.189. తూర్పు వైపుకు ముఖం పెట్టి సద్గురువును మనసులో ధ్యానించి, నిశ్చలమైన మనసుతో ఆనందంగా గ్రంథపారాయణ చేయండి.190. మొదటిరోజు ఎనిమిది అధ్యాయాలు, రెండవరోజు ఎనిమిది అధ్యాయాలు, మూడవరోజున ఏడు, తరువాత ఎనిమిది, ఆరు, ఎనిమిది, ఏడు అధ్యాయాలను వరుసగా ఏడురోజులూ చదివి, ఎనిమిదవరోజున అవతరణికను చదవండి.191.ఎనిమిదవ రోజున వ్రతపారణ చేయండి. సాయి నారాయణునకు నైవేద్యాన్ని సమర్పించి, బ్రాహ్మణులకు ఆప్తులకు మిత్రులకు మంచి భోజనాన్ని మరియు యథాశక్తి దక్షిణను ఇవ్వండి. 192.ఆ రాత్రి వైదిక బ్రాహ్మణులను ఆహ్వానించి వారిచే వేదపఠనాన్ని చేయించండి. తరువాత వారికి పంచదార వేసిన మధురమైన పాలను మరియు సంభావనను ఇచ్చి వారిని సంతుష్ట పరచండి. 193. చివర సద్గురు చరణాలకు ప్రణమిల్లి వారికి ఉచితమైన దక్షిణను సమర్పించి, దానిని శిరిడీ సంస్థాన నిధి అభివృద్ధి కొఱకు పంపాలి.194.సాయి భగవానులు ప్రసన్నులై భక్తులకు వరాలను ప్రసాదిస్తారు. ప్రపంచ దుఃఖమనే సర్పాన్ని నశింపచేసి మోక్షనిధిని చూపిస్తారు.195. శ్రోతలారా! మీరు సాధువులు. మా ఆనందానికి ఆశ్రయం – మీ పాదాల వద్ద ఈ దాసుని విన్నపం. అవతరణికను మరచిపోతే మరచిపొండి కాని మూల గ్రంథం యొక్క భావంపై మీ ధ్యానాన్ని ఉంచండి.196. శ్రోతలారా! మీరు కాలుణ్ణి అంతం చేయగల సజ్జనులు. మీ చరణాల యందు శిరసునుంచి, ఈ బాబా బాలుడు, ఈ దాసుని యందు ఎల్లప్పుడూ దయ ఉంచమని ప్రార్థిస్తున్నాడు.

197. ఏవైనా లోపాలు ఉంటే వానిని నావిగా భావించి వానిని నాకు వదలి, సారాన్ని గ్రహించి మనసుకు సంతోషం కలిగేలా శ్రోతలు శ్రవణం చేయండి.198. నమో సాయి శివనందనా నమోసాయి కమలాసనా నమోసాయి మధుసూదనా పంచవదన సాయి నమో.నమోసాయి అత్రినందనా నమో సాయి పాకశాసనా నమో సాయి నిశారమణా! వహ్ని నారాయణ సాయి నమో! నమో సాయి రుక్మిణీవరా! నమో సాయి చిత్ భాస్కరా నమో సాయి జ్ఞానసాగరా! జ్ఞానేశ్వర శ్రీ సాయి నమో. ఈ అవతరణికా వాక్ పుష్పాంజలిని మరియు నమస్కారాల నామావలిని గురుచరణాలకు అర్పించి సాయిమాత ప్రసన్నులు కావాలని ప్రార్థిస్తున్నాను. ఇతి శ్రీ సాయి సద్గురు ప్రేరితం, బాబాదాసుడు బాల విరచితమైన శ్రీ సాయి సమర్థ సచ్చరితంలో అవతరణిక అను ఏబది మూడవ అధ్యాయం సంపూర్ణం.

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు. శుభం భవతు.



అధ్యాయము	ఓవి	విషయం	వివరణ
1.	3	చతుర్దశవిద్యలు	నాలుగు వేదాలు, 6వేదాంతాలు, మీమాంస, న్యాయశాస్త్రం పురాణాలు, ధర్మశాస్త్రం.
	4	చతుర్దశ భువనాలు	అధోలోకాలు7. అతల, వితల, సుతల, రసాతల, తలాతల, మహాతల పాతాళం. ఊర్ధ్వలోకాలు7 భూలోక, భువఃలోక, సువర్లోక, మహాలోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు.
	41	సప్తద్వీపాలు	జంబూద్వీపం, కుశద్వీపం, ఫక్షద్వీపం, శాల్మలద్వీపం, క్రౌంచ ద్వీపం, శాక ద్వీపం, పుష్కర ద్వీపం
	54	పంచప్రాణాలు	ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం.
2.	13	సప్తసాగరాలు	లవణసాగరం, ఇక్షుసాగరం, సురాసాగరం, సర్పసాగరం, దధిసాగరం, క్షీరసాగరం, జలసాగరం.
	22	శక.సం 1700	క్రీ.శ.1778
	23	శక.సం 1800	క్రీ.శ.1878
	40	అష్టాంగ యోగాలు	యమ, నియమ, ఆసన, ప్రాణయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ సమాధి
	96	షోడశ సంస్కారాలు	గర్భాదానం, పుంసవనం, సీమంతం, జాతకర్మ, నామకరణం, గాలము ఉపనయనంఅన్నప్రాశనం, ప్రజాపత్యం, నామకరణం, ఆగ్నేయం, సోమ్యం

అధ్యాయము	ఓవి	విషయం	వివరణ
2.	16	16 సంస్కారాలు	వైశ్వదేవము, గోదానం, సమావర్తనం, వివాహం, అంత్యకర్మ.
3.	58	పంచమహా పాతకాలు	బ్రహ్మణహత్య, మద్యపానం, సువర్ణచౌర్యం, గురుపత్నిగమనం ఈ నాలుగు పాతకాలు చేసేవారి సహవాసం.
	166	భగవంతుని పూజాస్థానాలు	ప్రతిమ, స్థండిల, అగ్ని, తేజస్సు, సూర్యమండలం, నీరు, ద్విజులు, గురువు.
4.	19	పరావశ్యంతి	శ్వాసనుండి వెలువడే మూడురకాల వాక్కులు.
		మధ్యమ వైఖరి	ఉచ్చరణ నుండి వెలువడే వాక్కులు.
	20	షడ్శాస్త్రాలు	సాంఖ్యం, యోగం, వైశేషికం, మీమాంస, వేదాంతం.
	20	షడ్దర్శనాలు	శిక్ష, ఛందస్సు, వ్యాకరణం, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం
	49	మురళీలు	దేవదాసీలు
	75	వార్కరి	ఏడాదికి రెండుసార్లు పాదచారిగా పండరికి వెళ్లే యాత్రికులు.
6.	7	అష్టభావాలు	స్తంభము, స్వేదము, రోమాంచము, స్వరభంగము, వైస్వర్యము, అశ్రుపాతము, కంపము, వైవర్ణము.
	59	శక.సం.1833	క్రీ.శ.1911.
8	11	నందాదీపం	అఖండదీపం.
9	43	చాంద్రాయణవ్రతం	పౌర్ణమినాడు 15 ముద్దల అన్నం తిని ప్రతిరోజూ ఒకొక్క

అధ్యాయము	ఓవి	విషయం	వివరణ
9.	43	చాంద్రాయనవ్రతం	ముద్దను తగ్గించి తింటూ అమావాస్యనాడు ఏంతినరు. మరల పాడ్యమి నుండి ఒకొక్క ముద్దను పెంచుకుంటూ పౌర్ణమినాడు 15 ముద్దల అన్నం తినటం.
	52	పంచ మహాయజ్ఞాలు	బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పిత్ర్యయజ్ఞం, భూతయజ్ఞం, అతిథియజ్ఞం.
10	21	అష్టసిద్ధులు	అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం ఈశిత్వం, వశిత్వం.
		నవనిధులు	కుబేరుని సంపద పద్మము, మహాపద్మము, శంఖము మకరము, కచ్ఛపము, ముకుందము, నందము, నీలము, ఖర్వము.
13	13	అష్టోపచారాలు	గంధం, పుష్పం ధూపం, దీపం, నైవేద్యం, అక్షతలు, హారతి, దక్షిణ.
13	13	షోడోపచారాలు	ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, అభిషేకం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, దక్షిణ, మంత్ర పుష్పంతో నమస్కారం.
14	20	నాలుగు ముక్తులు	సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం.

అధ్యాయము	ఓవి	విషయం	వివరణ
15		త్రిలోకాలు	స్వర్గలోకం, మర్త్యలోకం, పాతాళ లోకం.
16	3	షడ్రిపువులు/ షడ్వికారాలు	కామ, క్రోధ, లోభ, మోహ, మధ, మాత్సర్యాలు.
16	4	నాలుగు వేదాలు	ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము.
		అష్టాదశపురాణాలు	భాగవతం, భవిష్య, మత్స్య, మార్కండేయ, బ్రహ్మ, బ్రహ్మ వైవర్త, బ్రహ్మాండ, విష్ణు, వరాహ, వామన, వాయు, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కందపురాణాలు.
	44	ఇంద్రాది దేవతలు	ఇంద్రుడు(తూర్పు), అగ్ని (ఆగ్నేయం), యముడు (దక్షిణం), నిరుతి (నైరుతి), వరుణుడు (పశ్చిమం) వాయువు(వాయవ్యం) కుబేరుడు(ఉత్తరం), ఈశానుడు (ఈశాన్యం).
		పంచకర్మేంద్రియాలు	వాక్కు, వాణి, పాద, పాయు, ఉపస్థేంద్రియాలు.
		పంచ జ్ఞానేంద్రియాలు	చర్మము, కన్ను, చెవి, నాలుక, ముక్కు.
		పంచ విషయాలు	శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలు.
	103	పరబ్రహ్మ	నిర్గుణ నిరాకార బ్రహ్మ
		అపరబ్రహ్మ	సగుణ సాకార దైవం.
	104	నాలుగుమహావాక్యాలు	ప్రజ్ఞానం బ్రహ్మ (ఋగ్వేదం), తత్వమసి(సామవేదం)

అధ్యాయము	ఓవి	విషయం	వివరణ
16	104	4మహా వాక్యాలు	అహం బ్రహ్మాస్మి(యజుర్వేదం), అయామాత్మ బ్రహ్మా (అధర్వణ వేదం).
17	46	సాధనా సంపత్తి	సాధనాషట్కం, (శమదమాలు, తితీక్ష, ఉపరతి, శ్రద్ధ సమాధానం.)
	96	ఈషణ త్రయం	ధనేషణ, దారేషణ, పుత్రేషణ
22	187	త్రితాపాలు	అధి భౌతికం, అధి దైవికం, ఆధ్యాత్మికం
23	40	విరోబా	పాము కాటేస్తే విరోబా దేవాలయానికి వెళ్తారు.
26	10	గృణాతి	గ్రహణ శక్తిని ఇవ్వగల గురువు.
27	44	రామదాసి	సమర్థ రామదాసు అనుయాయులు
28	213	శివలింగం	ఈ శివలింగాన్నే గురుస్థానంలో స్థాపించారు.
29	7	తమాషా	ఇది ఒకరకమైన ప్రదర్శన
	93	పంజా	అయిదు వ్రేళ్లున్న కుడి అరచేయి. ఇది ముసల్మాను సాధువులకు ప్రతీక.
31	213	పంచభూతాలు	పృధ్వీ, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, (నేలా, గాలి, నీరు. నింగి, అగ్ని).
31	155	త్రిగుణాలు	సత్వ రజస్తమోగుణాలు
32	45	పంజరి	వనచరుడు

అధ్యాయము	ఓవి	విషయం	వివరణ
	118	గోందళి	ఒకరకమైన ఆరాధన
33	213	నవవిధభక్తి	శ్రవణం, కీర్తనం, స్మరణ, చరణసేవ, అర్చన, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదన.
35	81	కాయావేజి	అయ్యావచ్చారా!
38	21	షడ్రసాలు	మధురం, లవణం, కటువు, తిక్తము, ఆమ్లము, కషాయము.
	43	ఫాతిహా	నైవేద్యం
42	11	శక.సం1840	కీ.శ.1918.
43	90	సప్తపురాలు	అయోధ్య, మధుర, హారద్వార్, కాశి, కంచి, అవంతిక, ద్వారక.
44	10	ప్రారబ్ధకర్మ	మునుపటి జన్మలో చేసిన కర్మలు, ఈజన్మలో అనుభవించటానికి కేటాయించినవి.
		సంచితకర్మ	ఈ జన్మలో పోగుచేసుకున్న కర్మలు.
		క్రియామాణ కర్మ	ఈ జన్మలో చేసిన కర్మలు తరువాతి జన్మలోని శరీరానికి ఉంచబడినవి.

సద్గురు శ్రీ సాయినాథుని వచనాలు

1. శిరిడీలో అడుగు పెట్టినవారి అపాయాలు తొలగిపోతాయి.
2. నా సమాధి మందిర ప్రవేశంతో సర్వదుఃఖాలు హరించుకుని పోతాయి.
3. నేను శరీరాన్ని విడిచి వెళ్ళినా భక్తుల కోసం పరుగిడి వస్తాను.
4. నా సమాధి మీ కోరికలను తీరుస్తుంది; నాయందు దృఢ విశ్వాసముంచండి.
5. నేను నిత్యం జీవించే ఉంటాను; ఇది సత్యమని నిత్యం అనుభవించి తెలుసుకోండి.
6. నా శరణుజొచ్చి నిష్ఫలంగా మరలి పోయిన వారినొక్కరినైనా చూపించండి.
7. ఎవరు ఏయే విధంగా నన్ను భావించి భజిస్తే, నేను ఆయా విధంగా వారికి లభ్యమౌతాను.
8. నేను మీ భారాన్నెప్పుడూ వహిస్తాను; ఇది నా సత్యవచనం.
9. నా వద్ద అందరికీ సహాయం లభిస్తుంది; ఎవరు ఏది కోరితే అది దొరుకుతుంది.
10. కాయా వాచా మనసులతో నాకంకితమైనవారికి నేనెల్లప్పుడూ ఋణపడి ఉంటాను.
11. అనన్యభక్తితో నా చరణాలకు అంకితమైనవారు ధన్యులని అంటాను.

